వేదం - జీవన విధానం

వేదార్థ జ్ఞానదీపిక

(వ్యావహారిక భాషలో)

గ్రంథకర్త

మహామహోపాధ్యాయ, శాస్త్ర రత్నాకర, మీమాంసా సార్వభౌమ,

సాఙ్గ వేదార్థ సమ్రాట్, రాష్ట్రపతి సమ్మానిత

బ్రహ్మశ్రీ రేమెళ్ళ సూర్యప్రకాశ శాస్త్రి

వ్యావహారిక భాష

డా॥ మూర్తి రేమెళ్ళ

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2017

VEDHAM - JEEVANAVIDHANAM

(Vedartha Gnanadeepika)

by

Brahmasri Remella Suryaprakasha Shastry

Spoken Language

Dr. Murthy Remella

T.T.D. Religious Publications Series No.

© All Rights Reserved

First Edition : 2017

Copies : 1000

Published by

Sri ANIL KUMAR SINGHAL I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

D.T.P:

Publications Division,
T.T.D, Tirupati.

Printed at :

Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

ముందుమాట

తిరుమల తిరుపతి దేవస్థానములు ఆది నుండి హిందూధర్మ ప్రచారానికే కంకణం కట్టుకొని ఉంది. హిందూధర్మమనేది ఒక మతం 'కాదు', ఒక జీవన విధానం అని పెద్దలందరిచే అంగీకరించబడింది. వేదధర్మమే హిందూధర్మం. ప్రస్తుతం **'వేదం-జీవన విధానం'** అనే శీర్షికతో ఒక గొప్ప గ్రంథం పాఠకులకు అందిస్తున్నాం. ఇది 'వేదాల్లో మానవ జీవన విధానం' ఆ కాలంలో ఎలావుండేదో చక్కని తేట తెలుగులో వివరిస్తున్న గ్రంథం. 'వేదోఽఖిలో ధర్మమూలమ్' అని మనుస్మృతి. అన్ని వేదాలకు ధర్మమే మూలం. 'వేదైశ్చ సర్వై రహమేవ వేద్యమ్' అని భగవద్గీత. 'అన్ని వేదాలచేత తెలియబడేవాడను నేనే' అని శ్రీకృష్ణపరమాత్మ ఉవాచ.

నాల్గువేదాలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు ఈ నాల్గింటి యొక్క సమాహార స్వరూపమే వేదం. వేదాల్లో ఏం చెప్పబడిందో, ప్రజల దైనందిన జీవన విధానం ఎలా వుండేదో జనసామాన్యానికి తెలియజేయడానికి వారికి అర్థమయ్యే వాడుక భాషలో వ్రాయబడిన గ్రంథమే **'వేదం-జీవనవిధానం'**. ఇటువంటి ఉత్కృష్ట గ్రంథాలను ప్రచురించడంలో టి.టి.డి పుస్తక ప్రచురణల విభాగంవారు చాల కృషిచేశారు, చేస్తున్నారు, ఇంకా చేయనున్నారు కూడా.

ఇదివరకు చేసిన కృషిని స్మరిస్తే - 1975 ప్రాంతాలలోనే వాఙ్మయమహాధ్యక్ష డా॥ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారి పరిష్కరణలో వేదాల పద్యానువాదం టీకా తాత్పర్య విశేషాలతో పది సంపుటాలు వెలువడింది. శ్రీమట్టికృష్ణారెడ్డిగారి సంపాదకత్వంలో **చతుర్వేద సంహిత** ఒకే సంపుటంగా సస్వరంగా వెలువడింది. వారి సంపాదకత్వంలోనే **'సంపూర్ణ యజుర్వేదభాష్యం'** ఎనిమిది సంపుటాలుగా వచ్చింది. అలాగే **'వేదముల యథార్థ స్వరూపం'** అనే గ్రంథం వారి అధ్యయన ఫలితంగా వచ్చిన గ్రంథం. వారి పర్యవేక్షణలోనే **చతుర్వేదభాష్యం**, పలుసంపుటాలుగా వెలువడబోతున్నదని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను.

ఇవిగాక, 1990 ప్రాంతాలలో **'ఆర్షవిజ్ఞాన సర్వస్వం'** అనే పేరుతో ఆచార్య ఎస్.బి.రఘునాథచార్యగారి సంపాదకత్వంలో వేదాలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు అనే మూడు సంపుటాలు వేదవాఙ్మయ సమీక్ష చేశాయి. ఆ క్రమంలో రాయప్రోలులింగన సోమయాజిగారి **'ఉపనిషత్ చంద్రిక'** (6 సంపుటాలు) ఉపనిషత్తుల వ్యాఖ్యానంగా వెలువడింది. లోకమాన్య బాలగంగాధరతిలక్‌గారి **గీతా రహస్యం** (3 సంపుటాలు) కర్మయోగమని లోకానికి సందేశమిచ్చింది.

తితిదేవారి చేతనే స్థాపింపబడిన వేద విశ్వవిద్యాలయంలో బంకుపల్లె మల్లయ్యశాస్త్రిగారు ఋగ్వేద, సామవేద, కృష్ణయజుర్వేదాలకు తాత్పర్య వివరణతో వెలుగుచూపించారు. ఆ క్రమంలో తర్వాతి **అధర్వవేదసంహితను** శ్రీచిఱ్ఱావూరి శ్రీరామశర్మ, చిఱ్ఱావూరి శివరామకృష్ణశర్మ ప్రభృతులు సస్వరంగా తాత్పర్య విశేషాలతో, 10 సంపుటాలు టిటిడి ప్రచురించడం జరిగింది. **కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయసంహిత** ఎనిమిది సంపుటాలలో శ్రీరామవరపు కృష్ణమూర్తిశాస్త్రిగారు. సస్వరంగా తాత్పర్యవ్యాఖ్యానాలు వ్రాసి టిటిడిచే ప్రచురింపజేశారు.

ఇన్ని మూలగ్రంథాలు అచ్చయ్యాక ఇప్పుడు వేదాల్లో మానవ జీవన విధానం ఎలావుందో పరిశోధించి, తెలుగులో వివరించే గ్రంథం రావడం ముదావహమైంది. గ్రంథకర్త మహామహోపాధ్యాయ బ్రహ్మశ్రీరేమెళ్ళ సూర్యప్రకాశ శాస్త్రిగారు ఈ గ్రంథాన్ని 12 ప్రకరణాల్లో దైనందిన విషయాలతో పాటు, జ్ఞాన, విజ్ఞాన విషయాలను ఆధునిక వైజ్ఞానిక దృక్పథంతో సమన్వయించి చెప్పడం చాల సముచితంగా ఉంది. ఇటువంటి ఉత్తమగ్రంథాన్ని ప్రచురించడానికి పూనుకొన్న ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారికి, వారి ఎడిటోరియల్ సిబ్బందికి అనేక ధన్యవాదాలు సమర్పిస్తున్నాను.

పాఠకులీ గ్రంథాన్ని చదివి హిందూధర్మ వైశిష్ట్యాన్ని ఆకళింపు చేసుకొని తమ జీవన గమన ప్రసూనాన్ని మరింత వికసింపజేస్తారని ఆశిస్తున్నాను.

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు

"ధార్మిక మార్గదర్శి"

అస్మద్గురువర్యులు కీ॥శే॥ బ్రహ్మశ్రీ రేమెళ్ళసూర్యప్రకాశశాస్త్రిగారు జగద్విదితులైన విద్వాంసులు. అనేకానేక గ్రంథకర్తలు, వారు వేదములోని మానవజీవన విధానాలకు కావలసిన బహువిషయములను శ్రుతి స్మృతి పురాణ శాస్త్ర ప్రమాణోదాహరణలతో "వేదార్థ జ్ఞానదీపిక" అను గ్రంథమునందు నిరూపించియున్నారు. అందలి భాష సామాన్యులకు అందుబాటులో ఉన్నదా? అను సంశయము కలుగును. దానికి కారణము శాస్త్ర పారంగతులైన శ్రీశాస్త్రిగారి రచనలో పారిభాషిక పదాలు చాలా చోట్లయందున్నవి. అట్లే ఆ గ్రంథములు ఉపలబ్ధముగా లేవు. పునర్ముద్రణాపేక్ష గలదు.

దానిని గ్రహించి వారి కనిష్ట కుమారుడైన శ్రీ రేమెళ్ళ లక్ష్మీనరసింహమూర్తిగారు, వారి వృత్తి లౌకికమైన ఇంజనీరుగా భారత అంతరిక్ష విభాగంలో అయినను, ప్రవృత్తి శాస్త్రీయమైనందున దీనిని వాడుకభాషలో అనుకరించి బహుశ్రమకోర్చి శ్రీ ప్రకాశశాస్త్రిగారి ఈ గ్రంథమును విషయముగాని, ప్రధానమగు ఉదాహృత వచనములుగాని లోపించకుండగ జాగ్రత్తలు తీసుకొని తగు రీతిలో అతి సామాన్యులకు కూడ అందుబాటులోకి తెచ్చి, పునర్ముద్రణకు సిద్ధం చేసియున్నారు.

అత్యంత సులభ భాషలోకి వచ్చిన ఈ గ్రంథమునందలి విషయములు లోకమునకు మిక్కిలి ప్రయోజనములను కలుగచేయుటలో సంశయమునకు తావులేదు. తండ్రిగారు చేసిన ఈ ప్రయత్నము సర్వులకు అందుబాటులోకి తీసుకొని వచ్చుట ద్వారా శ్రీ నరసింహమూర్తిగారు లోకోపకారమును కల్గించుటతో బాటుగ పితృ ఋణమును కూడ తీర్చుకొనుచున్నారు. ఈ కృషిని ప్రశంస చేయుచు, సకల ఆస్తికులు దీనిని పరిశీలనముగా చూచి ఈ 'ధార్మికమార్గదర్శి'ద్వారా తమ తమ ధార్మిక జీవనమును సమృద్ధముగా జేసుకొందురు గాక అని అభిలషిస్తున్నాను.

ఇట్లు

విద్వద్విధేయుడు

చిఱ్ఱావూరి శ్రీరామశర్మ

రాజమండ్రి

ధన్యోహమ్

"బ్రహ్మ ప్రావాదిష్మ తన్నో మాహాసీత్"

భగవంతుని నిశ్వాసరూపాలు, విజ్ఞాననిధులైన వేదాలను దివ్యజ్ఞాన సంపన్నులైన మహర్షులు దర్శించి మనకు అందించారు. పరమేశ్వరుడు భరద్వాజ మహర్షికి చెప్పినట్లు వేదమే ఒక నిధి, తరగని సిరుల కొండ అని విశ్వసించే వారికి మా నాన్నగారు 'మహామహోపాధ్యాయ', 'శాస్త్ర రత్నాకర', 'మీమాంసా సార్వభౌమ', 'సాఙ్గవేదార్థసమ్రాట్', రాష్ట్రపతి సమ్మానిత (బ్రహ్మలీన) శ్రీ రేమెళ్ళ సూర్యప్రకాశ శాస్త్రిగారు వ్రాసిన రెండు భాగాల **"వేదార్థ జ్ఞాన దీపిక"** గ్రంథం ఆ వేద నిధిని తవ్వి, వేదాలు బోధించిన ధర్మాఽధర్మాలను మనకు సులభంగా అందించే చక్కటి సాధనం. నిత్యం జీవనంలో మనం ఆచరించే కర్మల వెనుక అంతర్లీనమై ఉన్న పరమార్థాన్ని వివరించడమే ఈ గ్రంథం ముఖ్యోద్దేశం. అయితే, సంస్కృతభాష, వైదిక పరిభాష పరిచయం లేని సామాన్యులకు, వ్యావహారిక తెలుగుమాత్రమే అలవాటు ఉన్న నేటి, రాబోయే తరాలకు ఆ విజ్ఞానాన్ని అందించాలన్న చిరు ప్రయత్నమే ఈ **"వేదం - జీవన విధానం"** గ్రంథం. మొదలు పెట్టిన తర్వాత తెలిసింది ఇది చిరు వ్యవహారం కాదని!

తరతరాలుగా వేదాధ్యయనాలు ఉన్న వంశంలో పుట్టడం, మా నాన్నగారి పాండితీ ప్రకర్షను, వేదార్థ విద్వన్మణిగా వారు గడించిన లోకాదరణను దగ్గరనుంచి చూడడం అనే అదృష్టాలు తప్ప, వైదిక రంగంలో లేని నేను ఈ ప్రయత్నం చెయ్యడం సాహసానికి మించిన పనే అని చెప్పాలి. ఆయన పేరుమీద వారి శిష్యబృందం ఏర్పాటు చేసిన బ్రహ్మశ్రీ రేమెళ్ళసూర్యప్రకాశ శాస్త్రి వేదశాస్త్ర ఛారిటబుల్ పరిషత్(రాజమండ్రి) రజతోత్సవానికి (హేవిళంబి శ్రావణం, ఆగష్టు 2017) పూర్తి చెయ్యాలని సంకల్పించి ప్రారంభించిన ఈ కార్యం సకాలంలో పూర్తి అయ్యేవిధంగా అనుగ్రహించిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వర స్వామివారికి ముందుగా కైమోడ్చి కృతజ్ఞతాంజలులు సమర్పించుకుంటున్నాను. వేదశాస్త్రాలలో, సంస్కృతంలో అపారమైన ప్రజ్ఞకలిగి, రాష్ట్రపతి అవార్డుతో బాటుగా అనేకసన్మానాలు పొందినా ఆజన్మాంతం నిత్యవిద్యార్థిగా వుంటూ అనేకానేక సభలలో ప్రసంగాలతో, వేదికలపై చర్చలతో, గ్రంథాలతో తెలుగువారికి వేదసారాన్నిఅందించిన మా నాన్నగారే ఈ ప్రయత్నంలో నాకు స్ఫూర్తిప్రదాత. అలాగే, వారికి ధర్మపత్నిగా సహకరిస్తూ, అపారమైన ప్రేమానురాగాలను మాపై వర్షింపజేసిన మా అమ్మగారు కీ.శే. శ్రీమతి సుబ్బలక్ష్మి గారు. జన్మనిచ్చి, విద్యాబుద్ధులు నేర్పించిన వారిరువురికి నా హృదయపూర్వక నమస్సులు.

వేద విజ్ఞానాన్ని సులభంగా తెలియజేయాలనే నా ఆశయాన్ని చెప్పి ప్రచురించాలని కోరిన వెంటనే సూత్రప్రాయంగా అంగీకరించడమే గాక, అమితమైన ప్రోత్సాహాన్నిచ్చి ప్రచురణకు స్వీకరించిన తి.తి.దే. పూర్వకార్యనిర్వహణాధికారులు శ్రీ ఎం.జి.గోపాల్ గారికి, డా. డి.సాంబశివరావు గారికి, ప్రస్తుత

కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్ కుమార్ సింఘాల్ గారికి, సమయానికి అందేలా ముద్రణాలయ అధికారులకు ఆదేశాలిచ్చి సహకారాలందించిన సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పోలా భాస్కర్ గారికి నా కృతజ్ఞతలు. పెక్కుసూచనలిచ్చి మరిన్ని మెరుగులు దిద్దిన తితిదే ప్రచురణ విభాగం ప్రత్యేకాధికారి వారికి, సంపాదక వర్గానికి, ముఖ్యంగా, ఉపసంపాదకులు డా. నొస్సం నరసింహాచార్య గారికి, వారి సిబ్బందికి, అందమైన ముఖచిత్రంతో అచ్చు వేసి ఇచ్చిన తి.తి.దే. ప్రెస్ వారికి నా కృతజ్ఞతలు.

ప్రఖ్యాత వేదశాస్త్ర, వేదార్థ సంస్కృత పండితులు శ్రీ చిర్రావూరి శ్రీరామ శర్మగారు మా నాన్నగారిపై ఉండే గురుభావనే గాక, నాపై శిష్యవాత్సల్యంతో వ్రాత ప్రతిని, కంప్యూటరు ప్రతిని చూసి, ఆమూలాగ్రం చదివి ఈ గ్రంథ పరిష్కరణలో ఎంతగానో తోడ్పడ్డారు. వారికి నా నమస్కారాలు.

వేయి పుటలకు పైన ఉన్న వ్రాతప్రతిని పూర్తిగా చదివి, తగు సూచనలిచ్చిన మా అన్నగారైన శ్రీ రేమెళ్ళ రామసూర్యనారాయణ గారికి కృతజ్ఞతలు. క్లిష్టమైన సంస్కృత పదాలతో కూడిన ఈ గ్రంథాన్ని డి.టి.పి. చేయడంలో సహకరించిన చి||బాలరాజుకు, చి||ప్రవల్లికకు ఒక ప్రకరణాన్ని సరళీకరించిన శ్రీ జి.కె.ఎల్.శాస్త్రికి నా ధన్యవాదాలు. ఈ గ్రంథాన్ని ముద్రణకు సిద్ధం చేయడంలో సంపూర్ణ సహాయ, సహకారాలందించిన నా కుటుంబ సభ్యులందరికి పేరుపేరునా ధన్యవాదాలు. పూర్తి వాడుకభాషలోకి వ్రాయాలి అన్న ఆశయ సాధనకు అమిత సహాయసహకారాలు అందించిన ఆంధ్రా యూనివర్సిటీ ప్రొ.ఎస్.అనూరాధ గారికి, కార్యాలయం పనిలో నిండా నిమగ్నమై ఉన్నారచనను కొనసాగించాలని వెన్నంటి ప్రోత్సహించిన నా సహోద్యోగ మిత్రుడు డా. కృష్ణ కిషోర్ జంధ్యాలకు ధన్యవాదాలు.

మూలగ్రంథంలోని విషయాన్ని మార్చకుండా కేవలం భాషాశైలి మాత్రం మార్చడమే అయినా, ముందుగానే మనవి చేసుకున్నట్లు నా శక్తికి మించిన కార్యక్రమం భుజాలకెత్తుకోవడంతో తెలిసీ తెలియక ఎక్కడైనా తప్పులు దొర్లి ఉండవచ్చు. ఆ తప్పులకు బాధ్యత నాది, ఒప్పులకు ఘనత మా నాన్నగారిది! ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయ సహకారాలను, సూచనలను, ఆశీస్సులను అందించిన అందరినీ ఆ శ్రీవారు చల్లగా చూడాలని, దివ్యాశీస్సులను అందించాలని వేడుకుంటూ, ఈ గ్రంథం అందించే విషయాలను అందరూ అందుకుని ఆచరించి తరించాలని, జీవన విధానంగా మలచుకోవాలని ఆకాంక్షిస్తూ సెలవు.

జూలై 2017

డా. మూర్తి రేమెళ్ళ

శాస్త్రవేత్త,

భారత అంతరిక్ష విభాగం (ISRO), బెంగళూరు

murthyremilla@yahoo.com,

ప్రవేశిక

వేదాలు, వేదాంగాలు, వేదార్థం

దివ్యజ్ఞాన సంపన్నులు, దయాళువులైన దార్శనికులు మనకు అందించిన వాఙ్మయమైన వేదాలు సర్వ విజ్ఞాన నిధియే గాక, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు మూలమైనవి, భారతీయులకు శిరోధార్యమైనవి కూడా. అధికార తారతమ్యాన్ని బట్టి భారతీయులు దైనందిన కృత్యాలను, ధర్మాలను ఆచరించాలంటే ముందుగా వాటికి ప్రమాణాలు, ధర్మాచరణతో కలిగే శ్రేయస్సుఖాలు, ఆచరించకపోతే వచ్చే అరిష్టాలు తెలియాలి. వీటన్నిటినీ తెలియ చేసేదే వేదం.

ఒక్కొక్క పాఠన పద్ధతినీ, పరిష్కృత పాఠాన్ని 'శాఖ' అంటారు. ఋక్, యజుః, సామ, అథర్వణ అనే నాలుగు శాఖలుగా వేదవ్యాసునిచే విభజించబడిన వేదాలు అపౌరుషేయాలు, అనంతాలు. ఈ నాలుగు వేదాలకు సంహిత, బ్రాహ్మణం, ఆరణ్యకం అనే మూడు భాగాలు ఉంటాయి. వేదాలు నాలుగే అయినా కృష్ణ, శుక్ల భేదంతో ఋక్సంహిత, కృష్ణయజుస్సంహిత, శుక్లయజుస్సంహిత, సామ సంహిత, అథర్వ సంహిత అని మనకు అయిదు వేద సంహితలున్నాయి. ఛందోబద్ధమైన మంత్రాలుగా ఉండే వీటిని మంత్ర భాగం అంటారు. సంకలింపబడి, ఒక క్రమంలో ఏర్పరచబడింది అని అర్థం కలిగిన 'సంహితలు', ఆ వేదంయొక్క అంతరార్థాన్ని మంత్రాల ద్వారా తెలియజేస్తాయి. మంత్రభాగ వ్యాఖ్యాన రూపాలైన బ్రాహ్మణాలు యాగాది వైదిక కర్మలను విధిస్తూ, వాటిని ఆచరించవలసిన పద్ధతుల్ని తెలుపుతాయి. బ్రాహ్మణాలకు పరిశిష్టాలైన బ్రాహ్మణాలు సంహితలోని మంత్రాలకు, బ్రాహ్మణాలలోని కర్మలకూ వెనుక ఉన్న సిద్ధాంతాన్ని, వాటి అంతరార్థాన్ని వివరిస్తాయి. పరమాత్మకు జీవాత్మకూ భేదం లేదన్న సత్యాన్ని జ్ఞానమార్గం ద్వారా తెలుసుకోవడాన్ని బోధించేవి ఉపనిషత్తులు. వేదాలకు అంతంలో (ఆరణ్యకాల చివర) ఉంటాయి కనుక వీటికి వేదాంతమని సామాన్యంగా పేరు. ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాల్లో మొదటి మూడు 'అపర' విద్యలైన వేదాలవల్ల సాధించుకోవచ్చు కానీ, పరమ పురుషార్థమైన మోక్షం మాత్రం 'పర' విద్య అనబడే ఉపనిషత్తుల ద్వారా మాత్రమే సాధ్యం.

ప్రత్యేకంగా చెప్పకపోతే, సాధారణంగా మనం వేదం, వేదాధ్యయనం అంటే సూచించబడేది వేద శాఖకు మూలము, జీవము అయిన ఆ వేద శాఖలోని సంహిత భాగమే. వేదాలు అర్థతః, శబ్దతః కూడా మహిమ కలిగినవి అవడం వల్ల, వాటిని వినడం ద్వారా కూడా ఫలం ఉన్నా వేదార్థాన్ని తెలుసుకోకుండా కేవలం వేదాలను వల్లె వేయడం వల్ల సంపూర్ణఫలం కలగదు. వాటిలో చెప్పబడిన విశేషాలు తెలియరావు.

వేదార్థాన్ని క్రమబద్ధంగా తెలుసుకోడానికి, ఆచరణలో పెట్టడానికి ఉపయోగపడేవి, అత్యంత ఆవశ్యకమైనవి షడంగాలు. **"శిక్షా వ్యాకరణం ఛన్దః నిరుక్తం జ్యోతిషం తథా కల్పశ్చేతి"** అనే ఆరూ వేదాల సమన్వయాన్ని, తత్త్వ గ్రహణాన్ని నిర్దుష్టంగా తెలుసుకోవడానికి ఋషులు అనుగ్రహించిన ఆణిముత్యాలైన షడంగాలు. వీటిని వేదాంగాలు అని అంటారు. వీటికి తోడు మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం అనే నాలుగు కూడా వేదార్థాన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడేవి. ఇంకా పూర్వ మీమాంసా దర్శనం, ఉత్తర మీమాంసా దర్శనం, న్యాయ దర్శనం, వైశేషిక దర్శనం, సాంఖ్య దర్శనం, యోగ దర్శనం అనేవి షడ్దర్శనాలు. వేదాల ఆస్తిక్యాన్ని అంగీకరించి, చాటి చెప్పే వీటినే ఆస్తిక దర్శనాలు అని కూడా అంటారు.

"శ్రూయతే ఇతి శ్రుతిః" అని వినడమనే పరంపరగా వచ్చాయి కనుక, వేదాలకు శ్రుతులు అని పేరు వచ్చింది. ఈ శ్రుతుల అర్థాన్ని తెలుసుకోడానికి పైన చెప్పబడినవన్నీ అవసరం. ఈ ప్రకారం వేదాలు నాలుగు, వేదాంగాలు ఆరు, మీమాంస, న్యాయం, పురాణం, ధర్మశాస్త్రం అనే నాలుగు కలిసి చతుర్దశ విద్యాస్థానాలు. ఆయుర్వేదం, అర్థశాస్త్రం, ధనుర్వేదం, గాంధర్వ వేదం అనే నాలుగు ఉపాంగాలు కూడా కలిస్తే అష్టాదశ విద్యలు అనబడతాయి. వేదాంగాలు, శాస్త్రాలలో కొన్ని వేదార్థాన్ని తెలుసుకోడానికి ఉపయోగిస్తే, మిగిలినవి వేదంచేత

ప్రతిపాదించబడడ్డ ధర్మాన్ని అనుష్ఠించడానికి సాహాయ్యం చేస్తాయి. అందులోను వేదార్థ నిర్ణయానికి మీమాంసా దర్శనం విశేషంగా, సంపూర్ణంగా అధ్యయనం చెయ్యాలి. ఈ వేదాలు, షడంగాలు, శాస్త్రాల వివరాలు సంక్షిప్తంగా ఇలా ఉన్నాయి.

వివిధ దేవతలను స్తుతించే ఋక్కులనే మంత్రాల సమాహారం ఋగ్వేదం. స్తోత్ర రూపంలో ఉన్న మంత్రాలకు కర్మ కాండను సూచించి, యజ్ఞం చేయడానికి వీలైన రూపాన్ని కల్పించి, పలురకాల యజ్ఞాలను కొనసాగించే పద్ధతులను వచన రూపంలో సూచించేది యజుర్వేదం. ఋగ్వేదంలోని ఋక్కులకు మనోహరమైన సంగీతంతో కూర్చబడిన మంత్రాల సమాహార రూపం సామ వేదం. అథర్వణుడు అనే పేరు గల ఋషివల్ల లోకానికి తెలియబడి ఇతర వేదాలలో పేర్కొనబడని, దేవతలకు సంబంధించిన మంత్రాల సమాహారం అథర్వ వేదం.

అక్షరశుద్ధి, కాలమానం, ఉదాత్త – అనుదాత్త – స్వరితాలనే స్థాయి వంటి స్వర నియమాలతో వర్ణాలను ఉచ్చరించడంలో ఉన్న నియమాలను తెలియచేసే శాస్త్రం శిక్షా. వేదాలకు శబ్దసాధుత్వాన్ని నిర్వచించే అంగం వ్యాకరణం. పాఠాంతరాలున్నా అధ్యయనం చేసిన వేదాల్లో తేడాలు రాకుండా ప్రమాద పడకుండా ఉపయోగపడే నియమాలను చెప్పే శాస్త్రం ఛందశ్శాస్త్రం. అర్థాలను నిర్వచించడంలో ఉపయోగపడే ముఖ్య శాస్త్రం నిరుక్తం. వేదాలు బోధించిన కర్మలను ఆచరించడానికి విహితకాలాన్ని, గ్రహాల స్థితిని, ఆ యా కాలాల పరిజ్ఞానాన్ని కలిగించే శాస్త్రం జ్యోతిషం. వేదంలో నిగూఢమైన విషయాలను వ్యక్త పరచి, అనుష్ఠించడానికి ఉపయోగిగా చెప్పేది కల్పశాస్త్రం. ఇదే వేదార్థ నిర్ణయంలో శాస్త్రాల విషయం చూస్తే, మీమాంసా శాస్త్రానిది విశేష స్థానం. ఆ యా మంత్రాల ప్రాముఖ్యం, ఉద్దేశ్యం, వాటి విశిష్టత నిర్దుష్టంగా గ్రహించే పద్ధతిని మీమాంసా శాస్త్రం తెలియచేస్తుంది. వేదాల పూర్వభాగమైన కర్మకాండను (కర్మల, యజ్ఞాల) ప్రాముఖ్యాన్ని పూర్వ మీమాంస విచారిస్తుంది. ఉపనిషదర్థ నిర్ణయంలో ఉపయోగపడి, వేదాల ఉత్తరభాగమైన జ్ఞానకాండ విషయమైన ఆత్మసాక్షాత్కార ప్రాముఖ్యాన్ని ఉత్తర మీమాంసా విచారిస్తుంది. సకల శ్రేయస్సాధకాలైన వేదాలను అర్థం చేసుకోడానికి పరమకారుణికుడైన జైమిని మహర్షి పన్నెండు అధ్యాయాల "వేదభాష్యం" అనే గ్రంథాన్ని రచించారు. ప్రతి అధ్యాయంలోను ఎన్నో పాదాలు, ఒక్కొక్క పాదానికి అధికరణలూ ఉన్నాయి. సుమారు వేయి పైగా అధికరణాలు వివిధ విషయాలను ప్రస్తావిస్తాయి. జైమిని మహర్షి తర్వాత కుమారిల భట్టు, మండన మిశ్రుడు, పార్థసారథి మొదలైన మహామహులు ఈ శాస్త్రాన్ని అభివృద్ధి చేశారు.

ఈ సృష్టికి పరమేశ్వరుడే కర్త అని తర్కం ద్వారా నిరూపించడమే ముఖ్య ఉద్దేశ్యంగా కలిగిన తర్కశాస్త్రాన్ని న్యాయశాస్త్రం అంటారు. వేదాల్లోని సూక్తులను కథలుగా, అఖ్యాయనాలుగా పెంచి అందరూ తేలికగా అర్థం చేసుకోవడానికి, అందరికీ ఆకర్షణీయంగా చెప్పేవి పురాణాలు. ఆత్మోన్నతికి, ఆత్మ సాక్షాత్కారానికి దోహదమయ్యే రీతిలో మన దైనందిన వ్యాపకాలన్నిటినీ నిర్దేశించి, పురాణాల లక్ష్యాన్ని చేరుకోడానికి మార్గంగా చెప్పబడే శాస్త్ర రత్నం ధర్మశాస్త్రం.

వేదార్థమంటే సంస్కృత శ్లోకాలకు అర్థం చెప్పడం వంటిది కాదు, కేవలం పదాలకు అర్థం చెప్పడం గాక శాస్త్ర సమన్వయంతో సాధించవలసిన ఒక గొప్ప ప్రక్రియ. ఇంతవరకు వివరించబడిన వేద, వేదాంగాలు, ఉపాంగాలు, దర్శనాల్లో కృషి చేసి పాండిత్యాన్ని సంపాదిస్తే కానీ సముద్రం వంటి ఈ ఆర్షధర్మాన్ని తెలుసుకునే వేదార్థం శక్యం కాదు. కృష్ణయజుర్వేద్వాన్ని, మీమాంసాది శాస్త్రాలను, వేదార్థానికి ఉపయోగపడే తర్కవ్యాకరణాది ప్రకరణాలను చదివి సామాన్యులకు కూడా అర్థమయ్యే విధంగా వేదార్థాన్ని బోధించే కొద్దిమందిలో బ్రహ్మశ్రీ రేమెళ్ళ సూర్యప్రకాశ శాస్త్రిగారు ఒకరు. వేదార్థ పండితులలో మూర్ధన్య స్థానాన్ని అలంకరించి ఉండిన శ్రీ రేమెళ్ళ వారు అందించిన గ్రంథరత్నమే **"వేదార్థ జ్ఞానదీపిక"**, దీనిని మరింత తెనిగించి వ్యావహారిక భాషలో వ్రాయబడిందే **"వేదం – జీవన విధానం"** అనే ఈ గ్రంథ రూపం.

(శ్రీ కంచి పరమాచార్యుల "వేదములు" (1997), తి.తి.దే. వారి "ఆర్ష విజ్ఞాన సర్వస్వము" (2015) ఆధారంగా)

సవివర విషయసూచిక

1.	**1వ ప్రకరణం – వేద మహిమ – వేద లక్షణం**	1
	• వేదమహిమ	1
	• వేద లక్షణం	2
	• వేదాలు స్వతః ప్రమాణాలు	3
	• ధర్మస్వరూప లక్షణం	4
	• వేదాలు స్వతః ప్రమాణాలు	5
	• అర్థ నిత్యత్వం సంబంధనిత్యత్వం	8
	• వాక్యాఽపౌరుషేయత్వం	8
	• గ్రంథాఽపౌరుషేయత్వం	9
	• వేదాలు అనంతం	12
	• వేదాలు భగవత్స్వరూపాలు	17
2.	**2వ ప్రకరణం – వేద మహిమ – ధర్మ లక్షణం**	20
	• వేదాలు అర్థతఃమహిమోపేతాలు	20
	• ఏది ధర్మం	20
	• ధర్మ లక్షణం	20
	• ధర్మం	21
	• ధర్మము – సమాజం	23
	• యుగభేదంచే ధర్మవ్యవస్థ	26
	• ధర్మప్రాశస్త్యం	32
3.	**3వ ప్రకరణం – భూలోక – భరత వర్ష ప్రాశస్త్యం**	35
	• భూలోకప్రాశస్త్యం	35
	• జంబూద్వీపవర్ణన	37
	• వర్షవిభాగం	39
	• పర్వతవిభాగం	39
	• మేరువర్ణనం	39
	• వేదిశబ్దార్థం	39
	• భారతవర్షప్రాశస్త్యం	41
	• భరతఖండం	42
	• శంకాసమాధానం	46
	• ఇతరఖండాలలో వైదిక కర్మల ఆచరణ	47

- కర్మలు – దేశ శ్రేయస్సు 53
- వైదికకర్మలు మూడు రకాలు 56

4. 4వ ప్రకరణం – వేదం – సృష్టిక్రమభేదం 60

- సృష్టి 65
- ముల్లోకాల సృష్టి 67
- మనుష్యుల సృష్టి 67
- దేవసృష్టిక్రమం 68
- ప్రకారాంతరసృష్టి 71
- పురుషసూక్తం 71
- సృష్టినిరూపణలో పరస్పరవిరోధాలు – పరిహారం 75

5. 5వ ప్రకరణం – సృష్టిస్థిత్యాద్యులకు ధర్మమే కారణం 79

- ధర్మం – సృష్టివిశేషం 80
- బంగారం ఎందుకు ధరించాలి? 82
- సూర్యగతి వివరణ 85
- సృష్టి విశేషప్రసంగం 85
- ధర్మం స్థితికి కారణం 90
- శంకాసమాధానాలు 94
- వేదంలో అవతారవిశేషాలు 95
- వరాహావతారం 95
- వామనావతారం 96
- అవతారనిరూపణం ద్వారా వేదాలకు అనిత్యత్వ పరిహారం 96

6. 6వ ప్రకరణం – అగ్నిచయనం 100

- ప్రథమచితి ప్రశంస 102
- ద్వితీయచితి ప్రశంస 102
- దిశ్యాఖ్య ఇష్టకల ప్రశంస 102
- తృతీయచితి ప్రశంస 102
- లోకం పృణేష్టకల ప్రశంస 103
- చతుర్థపంచమచితుల ప్రశంస 103
- చయనభేదాలు 104
- విరాట్పురుషభావన 104
- వైజ్ఞానికవిషయం 106
- భూమిరూప అగ్నికి జలకారణత్వం 107

- అగ్నిచయనం – లోకజ్ఞానవిశేషాలు 107
- శత్రుబాధ నివారించుకోడానికి చేయదగిన జపం 109
- నష్టధనప్రాప్తి కోసం జపించదగిన మంత్రం 109
- వివాదసమయంలో అనుసరించదగ్గ మధ్యేమార్గ సూచన 111
- సర్వవర్ణాల వారికి శ్రేయస్సును కోరడం 112
- వేదంలో వ్యవసాయం 116
- భూమి ఖననం 121
- బీజవాపకాలం 122
- ఓషధుల్లో రకాలు 126
- ఓషధుల మహిమ 126
- అహింసా పరమోధర్మః 131
- వేదాల్లో రాజనీతి 134
- పురోహితుని విషయం 138
- అమాత్య నియోగం 141
- రాజ్యంలో ఐకమత్యము – ఆవశ్యకత 141
- శత్రువశీకరణ – రాజనీతి 143
- యుద్ధప్రకార వర్ణన 144
- వేదం సూచించిన పన్నుల విధానం 148
- కామ్యయాగాలు 151
- చర్మవ్యాధి కలవాడు చేయదగిన యాగం 153
- దీర్ఘరోగి చేయదగిన యాగం 153
- మాత్సర్య నివారణ కోసం ఇష్టి 154
- ఆయుష్కాముడు చేయదగిన ఇష్టి 155

7. 7వ ప్రకరణం – స్మార్తయజ్ఞాలు – సంస్కారాలు 157

- సప్తహవిర్యజ్ఞాలు 157
- యజ్ఞలక్షణం 158
- యాగానికి – హోమానికి భేదం 159
- పాకయజ్ఞాలు 160
- సంస్కారకర్మ నిరూపణ 164
- సంస్కారం 164
- సంస్కారాల పరిగణనలో మతభేదాలు 165
- సంస్కారాల ప్రయోజనాలు 166

- గర్భాదానం 167
- పుంసవనం 167
- జాతకర్మ 167
- నామకరణం 167
- అన్నప్రాశన 167
- చూడాకర్మ 168
- ఉపనయనం 168
- స్నాతకం 171
- వివాహము 171
- వివాహవిధములు 177
- వివాహలక్షణాలు 177
- విభిన్న వివాహాలు – విభిన్న ప్రయోజనాలు 178
- వివాహమంత్రాల అర్థం 179
- పాణిగ్రహణం 183
- సప్తపది 186
- స్త్రీల విశిష్టత 190
- రజస్వలావ్రతం – విశేషాలు 198

8. 8వ ప్రకరణం – ఆచార ధర్మాలు 204

- ఆచారధర్మాలు 204
- ధ్యానం 205
- స్తోత్రపారాయణం 206
- ధ్యానించకపోతే వచ్చే దోషం 209
- స్తోత్రానంతర కార్యం 210
- దంతధావనం 210
- ఆయుర్వేదంలో స్నానం 212
- వస్త్రధారణ 212
- దినచర్యలో అనుసరించదగినవి 213
- దినచర్యలో వర్జింప తగినవి 213
- షట్కర్మ నిరూపణ 214
- ఉదకమహిమ 222
- నదీశబ్ద నిర్వచనం 224
- 'అప్' శబ్ద నిర్వచనం 224

- 'వార్' శబ్ద నిర్వచనం 225
- ఉదకశబ్దనిర్వచనం 225
- ధర్మశాస్త్రప్రకారం వస్త్రధారణం 228
- భస్మధారణ విధి 229
- యజ్ఞోపవీతం – మాహాత్మ్యం 230
- యజ్ఞోపవీతధారణ వల్ల ప్రయోజనం? 234
- యజ్ఞోపవీతధారణమంత్రం 234
- సంధ్యావందనం – దాని ఆవశ్యకత 234
- సంధ్యాశబ్దార్థం 235
- సంధావందనానికి సమయాలేవి? 236
- సంధ్యావందనవిధానం – సంకల్పం 238
- ఆచమనప్రకారం 240
- అంగ ప్రధానకర్మవిచారణ 241
- సంధ్యామంత్రార్థం 244
- 'ఆపో జనయథా చ నః' – మంత్రానికి భాష్యం 245
- మంత్రాచమనం 246
- అర్ఘ్య ప్రదానం 249
- సంధ్యాంగతర్పణం 250
- గాయత్రీప్రాశస్త్యం 254
- ప్రణవవిషయం 258
- జపప్రదేశవిషయం – ఆసన విషయం 259
- ఉపస్థానమంత్రార్థం 260
- ప్రాతస్సంధ్యోపాసనమంత్రార్థం 261
- మాధ్యాహ్నిక సంధ్యోపాసన మంత్రార్థహోమం 262
- హోమం 264
- వైశ్వదేవం 265
- ఆతిథ్య ప్రాశస్త్యం 266
- ఎంత అన్నం తినాలి? 274
- అన్నదానభేదాలు – ప్రయోజన భేదాలు 275
- అన్నవిజ్ఞానం 275
- భోజనసమయం 277
- భోజనపరిమాణం 277

9. 9వ ప్రకరణం - పంచ మహాయజ్ఞ ప్రాశస్త్యం
- పంచమహాయజ్ఞప్రాశస్త్యం 278
- పితృయజ్ఞం 278
- శ్రాద్ధకర్మల ఆవశ్యకత 279
- భూతయజ్ఞం 281
- మనుష్యయజ్ఞం 281
- బ్రహ్మయజ్ఞం 282
- ప్రణవ మహిమ 283
- బ్రహ్మయజ్ఞ వివరణ 284
- బ్రహ్మయజ్ఞం యజ్ఞమెలా అవుతుంది? 284

10. 10వ ప్రకరణం - అధర్మ నిరూపణ 286
- అధర్మ నిరూపణం 287
- పాపభేదముల ఫలభేదనిరూపణ 294
- ఉత్పాత వివేకము 295
- ఉత్పాతాలు ఎందుకు వస్తున్నాయి? 300

11. 11వ ప్రకరణం - శ్రీరుద్ర మహిమ 303
- రుద్ర రుద్రైకాదశిన్యాది భేదములు 314
- శివమాహాత్మ్యము 314
- పాపభేదములు - వాటి ప్రాయశ్చిత్తములు 316
- గో మాహాత్మ్యం 324
- గోవు - ఉత్పత్తి విశేషము 325
- గో సేవాఫలము 327
- గో మాహాత్మ్యము 328
- గోవులు కళ్యాణ స్వరూపములు, కళ్యాణ ప్రదాలు 330
- గో దానమహిమ 331
- కర్షణోపయోగం 333

12. 12వ ప్రకరణం **337**
- ఉపాసన - జ్ఞానము 337
- బ్రహ్మజ్ఞానం 347
- అంతరఙ్గ సాధనాలెన్ని? అవి ఏవి? 348
- షడ్విధలింగములు 354
- మననం 355
- నిది ధ్యాసనం 355

సంజ్ఞా సూచికలు (Abbreviations)

1. అ. పాదం : అనుషంగ పాదం
2. అ. చ. ప్ర : అగ్నిచయనప్రకరణం
3. అగ్ని. పు : అగ్ని పురాణం
4. ఆ. పు. : ఆదిత్య పురాణం
5. ఆ. ధ. సూ :ఆపస్తంబ ధర్మ సూత్రం
6. ఆ. శీ. : ఆరణ్య శీక్షా
7. ఆ.శ్రౌ.సూ : ఆపస్తంబ శ్రౌత సూత్రం
8. ఆ.వ :ఆనంద వల్లీ
9. ఐ.ఉ. : ఐతరేయ ఉపనిషత్
10. ఆ.కే.ప్ర : ఆరుణకేతుక ప్రకరణం
11. ఉప. : ఉపనిషత్తు
12. ఏ.కాం. : ఏకాగ్ని కాండ
13. కా. చ. ప్ర : కాఠక చయన ప్రకరణం
14. కా.నీ.సా : కామందక నీతి సారః
15. కు.భ.వ్యా. : కుల్లూక భట్ట వ్యాఖ్య
16. గ.ఉ. : గర్భోపనిషత్
17. గో.స్మృ. : గోభిల స్మృతి
18. చ.వై. శా. :చరక వైద్య శాస్త్రం
19. ఛాం.ఉ. : ఛాందోగ్య ఉపనిషత్
20. త.ఉ. : తలవకారోపనిషత్తు
21. తం.వా. :తంత్రవార్తికం
22. తం.వా.అ.వా:తంత్రవార్తికం అర్థవాదాధికరణం
23. తం.వా.టీ : తంత్రవార్తిక టీక
24. తై. సం. : తైత్తరీయ సంహిత
25. తై.ఉ. : తైత్తరీయోపనిషత్
26. తై.ఆ.ఉ :తైత్తరీయఆరణ్యక ఉపనిషత్
27. దక్ష స్మృ. : దక్ష స్మృతి
28. దే.భా. : దేవీ భాగవతం
29. నా. ఉ. : నారాయణోపనిషత్
30. నా.దా.సూ : నాసదాసీయసూత్రం
31. నా.భా. : నారాయణ భాష్యం
32. ప.మా. : పరాశరమాధవీయం
33. పా.యో.సూ : పాతంజల యోగసూత్రం
34. బ్రహ్మ పు. : బ్రహ్మ పురాణం
35. బ్రహ్మాండ పు. : బ్రహ్మాండ పురాణం
36. భ.గీ. : భగవద్గీత
37. భృ.స్మృ : భృగు స్మృతి
38. భ. పు. : భవిష్య పురాణం
39. మ.స్మృ. : మనుస్మృతి
40. మత్స్య.పు. : మత్స్య పురాణం
41. మీ.న్యా.ప్ర :మీమాంసా న్యాయ ప్రకాశిక
42. మీ.శ్లో.వా. : మీమాంసా శ్లోక వార్తికం
43. ముక్తి. ఉ : ముక్తికోపనిషత్
44. యా.స్మృ. : యాజ్ఞవల్క్య స్మృతి
45. వా.శ్రు. : వాజసనేయ శ్రుతి
46. వి. పు : విష్ణు పురాణం
47. వి. స్మృ : విష్ణు స్మృతి
48. శం.లి.స్మృ : శంకలిఖిత స్మృతి
49. శాం.భా : శాంకరభాష్యం
50. శి.వ. మ.వ్యా.:శిశుపాలవధమల్లినాథవ్యాఖ్య
51. సం.దీ. : సంస్కార దీపిక
52. సం.ర.మా. : సంస్కారరత్నమాలా
53. సు.స్మృ. : సుమన్తు స్మృతి
54. స్వా.బ్రా. : స్వాధ్యాయబ్రాహ్మణం
55. హ.వ్యా. : హరదత్త వ్యాఖ్య
56. హ.స్మృ. : హారీత స్మృతి

1వ ప్రకరణం

వేదార్థం, వేద మహిమ, వేద లక్షణం

వేదార్థం' అంటే 'వేదాల అర్థం' తెలుసుకోవడం. ఈ వేదార్థం అనేది తెలుసుకోవడానికి సులభం కానిది, తెలియజేయడం అంతకంటే సులభం కానిదీను. వేదార్థం చెప్పడానికి ప్రయత్నించడం ఒక విధంగా సాహసమే అనవచ్చు. అయినా శక్యమైనంతలో అందులో ఉండే విషయాలను అందరికీ అందుబాటులో ఉంచే ప్రయత్నం చేస్తాను.

వేదార్థమంటే ఏమి చెప్తారు అని చాలా మందికి సంశయం ఉండవచ్చును. ఎందుకంటే లోకంలో రామాయణం, భారతం, భాగవతం వంటివి చెప్పడం, వినడం ఒక పరంపరగా ఉన్నట్లుగా వేదార్థ ప్రవచనం లేదు. పురాణాలను మొదటి సర్గ, మొదటి శ్లోకంనుంచీ ప్రారంభించి చెప్పినట్లు ఒక క్రమంలో వేదంలో కూడా మొదటి భాగం, మొదటి ప్రశ్నునుంచి ప్రారంభించి ఒక్కో మంత్రం చదివి/చెప్పి, అర్థం చెప్తూ ఉంటారు అనుకుంటారు చాలా మంది. కానీ అది పద్ధతి కాదు! అలా చేస్తే వేదంలో చెప్పబడిన, మనకు అందుబాటులో లేని దర్శపూర్ణమాసాది శ్రౌతకర్మల విషయం త్వరగా అర్థం చేసుకోలేరు. అంతే కాదు, కేవలం మంత్రార్థాలనే వివరిస్తే మన కర్తవ్యాలేమిటో నిర్ణయించబడవు, బోధపడవు కూడా! అందుకే వేదంలో గల ఆనుపూర్వికి (వరుస క్రమానికి) ప్రాధాన్యమివ్వకుండా వేదాలు ముఖ్యంగా బోధించిన విషయాలేవి? అందులో మనచేత స్వీకరించబడి అనుష్ఠింపతగినవి (ఆచరించ తగినవి) ఏవి? వేదం ఏ యే విషయాలను ఎన్ని విధాలుగా చెప్పింది? అనే వాటిని వేదంలో వివిధ భాగాలనుంచి సంగ్రహించి ఒక్కో విషయం ప్రధానంగా క్రోడీకరించి చెప్పడానికి ప్రయత్నిస్తాను.

వేదం ప్రధానంగా కర్మ, బ్రహ్మ అనే రెండు విషయాలను గురించి బోధించింది. కానీ ఈ రెండింటి గురించిన ప్రసంగం కొంచెం కష్టసాధ్యంగానే ఉంటుంది. ముందుగా చెప్పినట్లు- వేదం ఏమేమి చెప్పింది? అందులో మనకు అందుబాటులో ఉండి ఈ కాలంలో ఆచరించదగినవి ఏవేవి ఉన్నాయి? అనేవి వివరించడానికి ముందు, వేదాల మహత్వం ఏమిటి, ఎందుకు వేదాలు చెప్పిన దానిని ప్రమాణంగా తీసుకోవాలి అనేవి తెలుసుకోవాలి. వేదాల్లోనే చెప్పబడిన వేదాల మాహాత్మ్యాన్ని ముందుగా తెలుసుకుంటే రాబోయే విషయాలకు అదే ఉపోద్ఘాతం అవుతుంది. ఇంకా, ఆ వేదం ప్రతిపాదించే విషయాలపట్ల నమ్మకం కలుగుతుంది.

వేద మహిమ

వేదాలు రెండు రకాలుగా చాలా మహిమ కలిగినవి. **"శబ్దతః, అర్థత శ్చ".** అంటే శబ్దపరంగా మరియు అర్థపరంగా కూడా మహిమ కలిగినవి వేదాలు. వేదాలు కాకుండా లోకంలో ఉన్న ఇతర శాస్త్రాలు, పురాణాలు, స్మృతులు మొదలైన ఆర్ష వాఙ్మయమంతా **"అర్థతః"** అంటే, అర్థాన్ని అనుసరించి మహిమ కలిగినవి. అంటే, అర్థానికే ప్రాధాన్యమిస్తూ అందులో ఉండే అర్థగాంభీర్యాన్నే గ్రహిస్తాం. కానీ వేదాలకు **"శబ్దతః"** కూడా, అంటే వాటిని కేవలం వినడం ద్వారా కూడా ప్రాధాన్యం ఉంది.

ప్రతాపరుద్రీయము' అనే అలంకార శాస్త్రగ్రంథ ప్రారంభంలో **"యద్వేదాత్ ప్రభుసమ్మితాదధిగతం శబ్దప్రధానా చ్చిరం"** అనే శ్లోకంలో వేదాలకు ఉన్న శబ్ద ప్రాధాన్యాన్ని వర్ణించారు. ఉదాత్త అనుదాత్త

స్వరయుక్తంగా చెప్పబడే వేదాలు వాటి పౌనఃపున్యాన్ని బట్టి శ్రోతలపై ప్రభావాన్ని చూపుతాయని ఈ ప్రకారం వేదాలు వినడంవల్ల కూడా మహిమోపేత మైనవని చెప్పబడింది. ఇక అర్థం విషయంలో చూద్దాం!

లోకంలో మనకు ఏ ఇతర ప్రమాణాలకూ గోచరించని అతీంద్రియాలైన (మన ఇంద్రియాల ద్వారా తెలుసుకోడానికి వీలు కాని) విషయాలను బోధించే వేదాలు మహా మహిమోపేతములు. ఈ ప్రకారం వేదాలు శబ్దంచేత, అర్థంచేత కూడా మహిమ గలవని తెలుసుకోవచ్చు. ఈ విషయాన్ని శాస్త్రకారులు వేద లక్షణంలో వివరించడమే కాకుండా సతార్కికంగా నిరూపించారు.

వేద లక్షణం

ప్రత్యక్షేణానుమిత్యావా యస్తూపాయో న బుద్ధ్యతే ఏనం విదన్తి వేదేన తస్మాద్వేదస్య వేదతా|

లోకంలో ఎవరైనా చెప్పిన ఏ విషయమైనా ప్రమాణం అని చెప్పడానికి ప్రత్యక్షం, అనుమానం మొదలైన ఆరు ప్రమాణ లక్షణాలు ఉన్నాయి. కానీ వీటిలో దేనిచేతా తెలియబడని అలౌకికమైన (ఈ లోక సంబంధం కాని), లౌకికమైన (ఈ లోక సంబంధమైన) అనే రెండు విధాల శ్రేయస్సుకి కూడా సాధనమైన 'అలౌకికమైన ఉపాయాలను' తెలియచేసే శబ్ద రాశికి 'వేదం' అని పేరు. వేరే ఏ ఇతర శాస్త్రాలు, వాఙ్మయం తెలియచేయని విషయాలను లోక శ్రేయస్సు కోసం, నిస్వార్థంగా చెప్పడమే వేదాల లక్షణం.

వేదాలు స్వతః ప్రమాణాలు

వేదాలు "స్వతః ప్రమాణాలు". అంటే వాటంతట అవే స్వయంగా ప్రమాణాలు. వేదాలు చెప్పినవే ప్రామాణ్యం. ఈ విషయం తెలుసుకుంటే వేదాలు చెప్పిన దానిని మరో ప్రశ్న లేకుండా ఎందుకు ఆచరించి తీరాలి అన్న విషయం మనకు తెలుస్తుంది. వేదాలు స్వతః ప్రమాణాలు అని నిరూపించడానికి ముందు అసలు ప్రమాణాలు ఎన్ని? వాటి లక్షణా లేమిటి అని తెలుసుకోవడం అవసరం.

(1)ప్రత్యక్షం (2)అనుమానం (3)ఉపమానం (4)శబ్దం (5)అర్థాపత్తి (6)అనుపలబ్ధి అనే ఆరు ప్రమాణాలు వేదార్థానికి చాలా ముఖ్యమైనవని మీమాంసా శాస్త్రకారులు అంగీకరించారు. క్లుప్తంగా వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

1)ప్రత్యక్షం:

సత్సంప్రయోగే పురుషస్యేన్ద్రియాణాం బుద్ధి జన్మ తత్ ప్రత్యక్షం| (జై.సూ.1-1-5)

మన కంటికి ఎదురుగా ఉండే ఘటం, పటం మొదలైన వాటితో మన ఇంద్రియాలకు సంబంధం కలిగితే వాటిని ఘటం, పటం అని గ్రహించే బుద్ధి కలగడాన్ని ప్రత్యక్షమన్నారు. అదే విధంగా చెవులకు శబ్ద విషయక జ్ఞానం, త్వగింద్రియానికి (చర్మానికి) స్పర్శ విషయక జ్ఞానం మొదలైనవన్నీ శ్రావణ ప్రత్యక్షం, త్వక్ప్రత్యక్షం అనే పేర్లతో పిలవబడతాయి.

2)అనుమానం:

అనుమానం జ్ఞాత సంబంధస్య ఏకదేశ దర్శనాత్ ఏక దేశాంతరే యా అసన్నికృష్టే బుద్ధిః| (శా.భా)

ఏవైనా రెండు పదార్థాల సంబంధం గురించి జ్ఞానం కలిగిన పురుషునికి ఆ రెండింటిలో ఒక పదార్థం కనిపిస్తే రెండో పదార్థం ప్రత్యక్షంగా కనిపించకపోయినా కానీ ఆ రెండో పదార్థానికి సంబంధించిన జ్ఞానం కలగడాన్ని 'అనుమానం' అన్నారు. ఒక వంటశాలలో ధూమానికి (పొగకి), వహ్నికి (అగ్నికి) ఉన్న సంబంధం తెలిసిన పురుషునికి ఒక పర్వతంపై పొగ కనబడితే, అగ్నిని చూడక పోయినా అక్కడ అగ్ని

ఉంటుందని ఊహ వస్తుంది. ఆ ప్రకారం అప్రత్యక్షంగా ఉన్న (కంటికి కనిపించని) అగ్ని గురించి జ్ఞానం కలగడాన్ని 'అనుమానం' అన్నారు.

3)శబ్దం:

శాస్త్రం శబ్ద విజ్ఞానాత్ అసన్నికృష్టార్థే విజ్ఞానమ్| (శా.భా)

ఇందులో 'శబ్ద' అనే శబ్దంచే శబ్దవిశేషమయిన శాస్త్రం, అనగా వేదం చెప్పబడుతోంది. అలాగే 'అర్థ' అనే శబ్దంచే ధర్మాఽధర్మాలు చెప్పబడుతున్నాయి. అంటే, వేరే ఏ ఇతర ప్రమాణాలచేత బోధించబడని ధర్మాఽధర్మాలను బోధించేది శాస్త్రం (వేదం) అని అర్థం.

4)ఉపమానం:

ఉపమానమపి సాదృశ్యమసన్నికృష్టాఽర్థే బుద్ధిముత్పాదయ తీతి| (శా.భా.)

ఒక వస్తువుని చూసేక దాని సాదృశ్యం (పోలికలు) వేరే ప్రదేశంలో ఉంటే, వేరే ప్రమాణాలచే తెలియబడని, ఇప్పుడు చూసిన మరో కొత్త విషయాన్ని గురించి కలిగించే జ్ఞానాన్ని ఉపమానం అంటారు. పోలిక అనే ఈ విషయం మనకు అందరికీ బాగా తెలిసిందే.

5)అర్థాపత్తి:

దృష్టః శ్రుతోవాఅర్థః నోపపద్యత ఇత్యర్థ కల్పనా|(శా.భా)

మనం ఏదైనా ఒక పదార్థంయొక్క వస్తు స్థితిని చూసినప్పుడో/విన్నప్పుడో, మనచే ప్రత్యక్షంగా చూడబడని/వినబడని మరో అంతరార్థ కల్పన లేనిదే ఈ చూసిన/విన్న స్థితి అర్థం కానప్పుడు దాన్ని 'అర్థాపత్తి' అంటారు. ఉదా: **"పీనో దేవదత్తః దివా న భుంక్తే"** అంటే "దేవదత్తుడు పగలు భోజనం చేయక పోయినా బలిష్ఠుడుగా కనబడుతున్నాడు" అని అర్థం. కానీ అతడు బలవంతుడుగా ఉన్నాడు అని చెప్తున్నారు కనుక, ప్రత్యేకంగా చెప్పకపోయినా రాత్రి భోజనం కల్పింపనిదే అతని బలవత్త్వం కుదరదు కనుక రాత్రి భోజనాన్ని కల్పించడాన్ని 'అర్థాపత్తి' అంటారు.

"యజేత స్వర్గకామః" అనే శ్రుతి స్వర్గాన్ని సాధించడానికి యాగం సాధనమని బోధిస్తోంది. ఇందులో యాగం మన కళ్ళ ఎదుట నశిస్తోంది (పూర్తవుతోంది) కానీ నశించిన యాగం స్వర్గ సాధనం అనడం, స్వర్గాన్ని పొందడం ఎదురుగా జరగడం లేదు, పొసగదు కూడా. కావున యాగం వలన అపూర్వం (అదృష్టం) జనిస్తుందని, దాని ద్వారా(ఆ అదృష్టం ద్వారా) స్వర్గం సాధ్యమని, ఆ క్షణం ప్రత్యక్షంగా జరగకపోయినా మొత్తం మీద 'యాగం స్వర్గ సాధనమని' కల్పించడం అర్థాపత్తి.

6)అనుపలబ్ధి:

అభావః ప్రమాణాఽభావః నాస్తి ఇత్యశ్యార్థస్యఅసన్నికృష్టార్థస్య(శా.భా.)

సద్రూపమైన (ఉన్న) వస్తువుని గోచరింపచేసే ప్రమాణాలు ఇంతవరకు చెప్పబడిన ప్రత్యక్ష, అనుమాన, ఉపమాన, శబ్ద, అర్థాపత్తులు అనే అయిదు. నాస్తి=లేదు అని తెలిపే ప్రమాణమే అనుపలబ్ధి. లేకపోవడం= అభావం. పదార్థం ఉంటే గోచరింపచేసేవి ఈ పూర్వప్రమాణాలు. ఆ పదార్థం లేదు, అనగా ఉపలబ్ధం అవడం లేదు. ఇటువంటి అసద్రూపమైన (వస్తువు లేకపోవడాన్ని) తెలిపే ప్రమాణం అనుపలబ్ధి, ఇది పూర్వోక్త ప్రమాణాలచే తెలియబడనిది. అట్టి ప్రమాణాఽభావమే అనుపలబ్ధి. భూతలమందు ఘటం

లేదు అను జ్ఞానానికి ఆలంబనమైన ప్రమాణం అనుపలబ్ధి. ఇది పూర్వం చెప్పిన ప్రమాణం పంచకంలో చేరదు కనుక ఆరవ ప్రమాణంగా గ్రహింపనగును.

శ్రీ మద్రామాయణంలో **"రామ! షడ్యుక్తయో లోకే యాభిః సర్వోనుదృశ్యతే"** అని చెప్పబడింది. ఇక్కడ 'ఉక్తయః' అంటే 'ప్రమాణాలు' అని గ్రహించాలి. ఇది నాలుగు విధాలు అని వార్తికంలో శ్రీ కుమారుల భట్టపాదులు చెప్పారు.

క్షీరేదధ్యాది యన్నాస్తి ప్రాగభావః స ఉచ్యతే| నాస్తి తా పయశో దధ్ని ప్రధ్వం సాభావ లక్షణం| గవి యోఽశ్వతాడభావస్తు సోఽన్యోన్యాభావ ఉచ్చ్యతే| శిరసోఽవయవాఃనిమ్నాః వృద్ధి కాఠిన్య వర్జితాః శపే శృంగాది రూపేణ సోఽత్యంతాభావ ఉచ్యతే|

క్షీరంలో పెరుగు లేదు (ప్రాగాభావం), పెరుగులో పయస్సు (పాలు) లేదు (అభావం), గోవుయందు అశ్వం లేదు, అశ్వమందు గోవు లేదు-గోవు అశ్వం కాదు, అశ్వం గోవు కాదు అని (అన్యోన్యాభావం). శిరస్సునందు భాగాలు కఠినంగా ఉండడం, వంగి ఉండే శృంగం వంటి భాగాలు ఉండడం చెవుల పిల్లికి ఎప్పుడూ ఉండవు కదా! (అత్యంతాఽభావం).

ఈ విధంగా వివరించబడ్డ ఆరు ప్రమాణాల లక్షణాలు అన్నీ మరొక కారణాన్ని అపేక్షించకుండా ఉత్పత్తి కాలంలోనే స్వతస్సిద్ధంగా ప్రామాణ్యం కలిగినవని మీమాంసకులు నిరూపించారు.

స్వతస్సర్వప్రమాణానాం ప్రామాణ్యమితి గమ్యతే| న హి స్వతోఽసతీ శక్తిః కర్తుమన్యేన శక్యతే| (శ్లో.వా)

ప్రతి ప్రమాణానికి ఆ యా ప్రమేయాన్ని (ప్రతిపాదించబడిన సిద్ధాంతాన్ని) బోధించే శక్తి స్వతస్సిద్ధంగా లేకపోతే వేరే దానిచే కల్పించడం సాధ్యం కాదు. అందువల్ల సర్వ ప్రమాణాలు బాధక కారణ ప్రాప్తి పర్యంతం అంటే, **'ఆ ప్రమాణానికి విరోధ ప్రమాణం దొరికే వరకూ'** అవి ప్రమాణాలే. ఈ ప్రకారం పైన పేర్కొనబడిన ప్రత్యక్షాది ప్రమాణాలన్నీ స్వతస్సిద్ధంగా ప్రమాణాలైనా ధర్మాన్ని గురించి మాత్రం వేదాలే ప్రమాణమని, వేదేతరములు ప్రమాణాలు కానేరవు అని నిర్ణయించారు.

ధర్మస్వరూప లక్షణం

"చోదనా లక్షణోఽర్థో ధర్మః" అనే జైమిని సూత్ర(1-1-2) భాష్యాలచే 'వేదం ప్రమాణంగా కలిగిందే ధర్మమని' ధర్మస్వరూపాన్ని నిర్వచించారు. **"యోధర్మః స చోదనా లక్షణః"** (శా.భా.) అనే వాక్యంతో 'ఏది ధర్మమో అది వేదం ప్రమాణంగా కలదని' ధర్మ లక్షణాన్ని కూడా చెప్పారు. ఈ సూత్రంలోనే వేదమే ప్రమాణంగా కలిగినది ధర్మం కనుక, ధర్మం గురించి వేదేతరాలు ప్రమాణం కావని, వేదం మాత్రమే ప్రమాణమని చెప్పబడుతోంది.

ఈ సందర్భంలో శబ్దవిశేష రూపమైన వేదంయొక్క ప్రామాణ్యసిద్ధి కోసం ఇంద్రియాదులకన్నా శబ్ద సామాన్యానికి వైలక్షణ్యం ఉందని **"చోదనా హి భూతం, భవన్తం, భవిష్యన్తమ్, సూక్ష్మమ్, వ్యవహితమ్ విప్ర కృష్టం ఇత్యేవం జాతీయకం అర్థం వదతి నాన్యత్ కించనేంద్రియం"** (శా.భా.) అనే భాష్యవాక్యం తెలుపుతోంది.

సామాన్య శబ్దాలు భూత-భవిష్యత్-వర్తమాన విషయాలను, తెలుసుకోదగిన దూరంలో ఉండి సూక్ష్మంగా ఉన్న విషయాలను గురించి తెలియ చెయ్యడం మనందరికీ తెలిసిందే. **"నాన్యత్ కించనేంద్రియం"** అనే భాష్యంచే ప్రత్యక్షాది ప్రమాణాలు ఇంద్రియాలతో సంబంధం కలిగిన వాటిని తప్ప మిగిలిన వాటిని తెలియజేయ లేవు. కానీ 'ఇక్కడ ఉంది', 'అక్కడ ఉండేది' మొదలైన సామాన్య శబ్దాలకే మూడు కాలాలకు సంబంధించిన విషయాన్ని తెలియజేసే సామర్థ్యం ఉన్నప్పుడు, శబ్ద విశేషాత్మకమైన, అపౌరుషేయమైన

వేదాలు మన ఇంద్రియాలకు గోచరించని ధర్మాఽధర్మాలను తెలియజేసే ప్రమాణం అవడంలో సంశయం లేదని **"చోదనా లక్షణోఽర్థో ధర్మః"** అను సూత్ర, భాష్య, వార్తికాదులు* నిరూపించాయి.

(*అతి తక్కువ పదాలతో ఒక విషయ మూలాన్ని సూచించేది సూత్రం (ఫార్ములా). సూత్రంలో ఉండే విషయాన్ని, సూత్రానికి అర్థాన్ని వివరించేది భాష్యం. ఇంకా వివరంగా సూత్రంలో 'చెప్పబడినది', 'చెప్పబడనిది', సూత్రంలో 'బాగా చెప్పబడనిది' అనే మూడింటి గురించి వివరించి చెప్పేది వార్తికం. వీటిని చెప్పిన వారిని వరుసగా- సూత్రకారులు, భాష్యకారులు, వార్తికకారులు అంటారు)

అయితే, శబ్ద సామాన్యానికి ప్రత్యక్షాది ప్రమాణాలకంటే విలక్షణమైన శక్తి ఉన్నా, పురుషులచే ఉచ్చరించ బడిన వాక్యాలు ఒక్కోసారి యథార్థాన్ని బోధిస్తున్నాయి, మరోసారి అయథార్థాన్ని (యథార్థం కానిదాన్ని) బోధిస్తున్నాయి. అది ఎలా అంటే-

నద్యాస్తీరే పంచ ఫలాని సన్తి| (శా.భా.)

అంటే 'నదీ తీరంలో అయిదు ఫలాలు ఉన్నాయి' అంటాడు ఒకడు. కానీ అక్కడికి వెళ్ళి చూస్తే లేవు. అప్పుడు వీడు చాలా మందిని వంచన(మోసం) చేశాడు అని అంటారు. ఈ వాక్యం అప్రమాణం (నమ్మదగినది కాదు) అంటారు. కానీ ఈ 'వాక్యం' అప్రమాణం కాదు. అక్కడ ఫలాలు ఉన్నప్పుడు, లేనప్పుడూ కూడా ఈ వాక్యానికి అర్థం ఒక్కటే. ఈ వాక్యంలో ఉన్న ప్రతీ పదానికి ఉన్న అర్థాన్నిబట్టి చూస్తే ఆ శబ్దం (వాక్యం) తాను చెప్పవలసిన అర్థాన్నే చెప్పింది. దాంతో ఆ వాక్య ప్రయోజనం అయిపోయింది. అయితే, అక్కడ ఫలాలు లేకుండా ఈ వాక్యాన్ని ప్రయోగించిన వక్త ఉన్నాడే, అతను వంచకుడు. అతని తాలూకు దోషం వాక్యానికి సంక్రమించింది. తద్వారా ఆ వాక్యం అప్రమాణం అన్నాం. కానీ, వేదాలు కూడా ఒక రకమైన శబ్ద రాశులే కనుక వాటికి కూడా ఒక్కోసారి యథార్థాన్ని, ఒక్కోసారి అయథార్థాన్ని(యదార్థం కాని దాన్ని) బోధించే అప్రామాణ్యం ఉంటుందని అనుకుంటారేమో అని శాస్త్రకారులే శంకించి దానికి సమాధానం చెప్పారు.

దేవదత్తస్యశ్యామత్వే యజ్ఞదత్తస్యాపి శ్యామత్వం భవితుం నార్హతి| (శా.భా)

అంటే, దేవదత్తుడు నల్లగా ఉన్నట్లయితే, యజ్ఞదత్తుడు కూడా నల్లగా ఉండాలని నియమం లేదు కదా! అంటే లౌకిక వాక్యాలు ఒక్కోసారి అప్రమాణ మైనందున వైదిక వాక్యాలు కూడా అప్రమాణాలు కావాలని నియమం లేదు. అంతే కాదు, లౌకిక వాక్యాలు పౌరుషేయం అవడం వల్ల పురుష గతమైన దోషాలు ఉండి, పైన చూసిన విధంగా ఆ దోషాలు ఆ వాక్యాలకు సంక్రమించడం జరగవచ్చును. కానీ వేదానికి అలాంటి ఉచ్చారయిత (పలికినవాడు) లేడు కనుక వేద వాక్యాలు ఎల్లవేళలా ప్రమాణాలే!

వేదాలు స్వతః ప్రమాణాలు

పురుష గతమైన వాక్యాలకు కలిగే దోషాలను మరింత వివరిస్తూ- భ్రమ ప్రమాదం, కారణదోషాజ్ఞానం, అనాప్త దోషం(ఆప్తుడు కానివాడు ప్రయోగించడం), ఒకవేళ ఆప్తుడైనా ఉపలబ్ధి యోగ్యత (పొందే/జరిగే విధానం) లేనిదానిని బోధించడం మొదలైన రూప, నిష్ఠ కారణ దోషాలచే అప్రమాణాలు అవుతున్నాయి అని చెప్పారు. ఉదాహరణకు-

దివా చంద్రః ఉదేతి, రాత్రౌ సూర్యః ఉదేతి|

అనే వాక్యాలు 'పగలు చంద్రుడు ఉదయిస్తున్నాడు, రాత్రి సూర్యుడు ఉదయిస్తున్నాడు' అని అర్థం చెప్తున్నా, చంద్రోదయం సూర్యోదయం ప్రత్యక్ష యోగ్యత కలవి కనుక, పగటి భాగాన చంద్రోదయం, రాత్రి

భాగాన సూర్యోదయం ఎప్పుడూ జరగదు కనుక పై రెండు వాక్యాలూ అప్రమాణం అవుతున్నాయి. అదే విధంగా వక్త అనాప్తుడయినప్పుడు (ఆప్తుడు కానప్పుడు) అతనిచే పలకబడ్డ వాక్యార్థం నమ్మదగిందే అయినా వాక్యం అప్రమాణ మవుతుంది. అలాగే, అతీంద్రియార్థ విషయాన్ని (ఇంద్రియాలచే తెలుసుకోడానికి శక్యంకాని విషయాన్ని) ఆప్తుడు చెప్పినా ఉపలబ్ధి యోగ్యత లేకపోవడం వల్ల అప్రమాణం అవుతోంది. అంటే పురుషునిచే పలుకబడ్డ ఆప్త, అనాప్తవాక్యాలు రెండూ వివిధ కారణాల వల్ల అప్రమాణం అవుతున్నాయి.

వేదాలు కానీ వేరే వాక్యాలు కానీ అప్రమాణాలు అనడానికి పైన చెప్పిన పురుషగత దోషాలకు మూలమైన పురుషానుప్రవేశం మూడు విధాలుగా కల్పించాలి. అవి శబ్ద-శబ్దార్థ సంబంధం ద్వారా, వాక్య-వాక్యార్థ సంబంధం ద్వారా లేదా వాక్య సముదాయాత్మకమైన గ్రంథ రచన ద్వారా జరగాలి. ఇంకా జ్ఞానాఽనుత్పాదకత్వ రూపం (ఏ విధమైన జ్ఞానమునూ కలిగించక పోవడం), సంశయాత్మకమైన జ్ఞానాన్ని కల్గించడం, ఒక వాక్యంవల్ల కలిగిన జ్ఞానానికి విరుద్ధంగా మరో వాక్యం ఉండడం అనేవి కూడా అప్రామాణ్య కారణాల్లో ముఖ్యమైనవి.

ఔత్పత్తికస్తు శబ్దస్యార్థేన సంబంధస్తస్య జ్ఞానముపదేశః అవ్యతిరేకశ్చ అర్థే అనుపలబ్ధే తత్ప్రమాణం బాదరాయణ స్యాఽనపేక్షత్వాత్| (జై.సూ.1-1)

అనే సూత్రంచే శబ్దానికి అర్థంతో గల సంబంధం స్వాభావికంగా నిత్యం. అది ఎవరి చేతా రచించబడింది కాదు. కాబట్టి శబ్దార్థ సంబంధ కర్తృత్వ రూపమైన అనగా, ఫలానా శబ్దానికి ఫలానా పురుషుడు అర్థంతో సంబంధంతో కలుగ చేశాడు అనే రూపంలో వేదానికి పురుషానుప్రవేశం లేదని నివారింపబడింది. శబ్దమంటే కేవలం వైదిక శబ్దమే కాదు. లౌకిక వైదిక సాధారణమైన శబ్దజాలం అంతా నిత్యమని మీమాంసకులు ఈ క్రింది ఉపపత్తుల ద్వారా నిరూపిస్తున్నారు.

కర్మైక తత్ర దర్శనాత్! అస్థానాత్ కరోతి శబ్దాత్| (జై. సూ)

ఒక శబ్దం పలకడానికి చేసే ఉచ్చారణ ప్రయత్నానంతరం మనం పలికే గకారాది శబ్దం ఉపలబ్ధం అవుతుంది (బయటకు వస్తుంది). కనుక శబ్దం ప్రయత్న జన్యమని, **'యజ్జన్యం తన్నశ్యం'** అనే న్యాయంచే జనించిన శబ్దానికి నశించే స్వభావం ఉండడం చేతనూ, శబ్దం ముహూర్త కాలమైనా ఉండకపోవడం చేతనూ, **"శబ్దం కురు, శబ్దం మాకార్షీః"** అనగా "శబ్దాన్ని చేయి, శబ్దాన్ని చేయకు." అనే ప్రయోగాలు లోకంలో చూడడం వల్ల ముందుగా శబ్దం కృతకమని, ఆ కారణం చేతనే అనిత్యమని ఇంకా మరికొన్ని సూత్రాలచేత శబ్దంయొక్క అనిత్యత్వాన్ని శంకించి సమాధానం చెప్పారు.

గకారౌకార విసర్జనీయాత్మకః శబ్దః గౌః| (శా.భా.)

అని మీమాంసకులు అక్షర సముదాయత్మకమైనది శబ్దమని శాబరభాష్యంలో వివరించారు. శబ్దాలు శాశ్వతాలని, అవి నష్టం కావని, నష్టమే అయితే ఎదుటి వ్యక్తి వినడం, అర్థం చేసుకోవడం అనేవి జరగవని శాస్త్రకారులు నిర్ణయించారు. శబ్దాలు నిత్యమే అయితే, శబ్దాలు ఆకాశంలో ఉంటే అన్నీ శబ్దాలూ అందరికీ వినబడాలి కదా! అలా జరగడం లేదు. అంటే, శబ్దాన్ని గ్రహించడానికి శ్రోత్రేంద్రియం(చెవి) ప్రధానమని, చక్కిలాల ఆకారంలో ఉన్న ఆకాశమే శ్రోత్రేంద్రియమని అవి ఒక్కో పురుషునిలో ఒక్కో రూపంగా ఉంటాయని, అంతే కాకుండా శబ్దాన్ని ఉచ్చరించినప్పుడు వాటిని చెవికి చేరవేసే వాయురూపమైన తరంగాలు లేకపోతే కూడా ఈ శబ్దాన్ని వినడం జరగదని అన్నారు. అంటే శబ్దం నష్టం కాలేదు. ఉచ్చరించబడ్డ శబ్దం ఆకాశంలో ఉంది. కానీ వాటిని శ్రోత్రేంద్రియానికి చేరవేసే వాయువీయ తరంగాలు లేకపోయినా, ఒకవేళ చేరవేసినా

వాటిని గ్రహించే ఆరోగ్యకరమైన శ్రోత్రేంద్రియం (చెవి) లేకపోయినా మనకు ఆ శబ్దం వినబడడం లేదు అని గ్రహించాలి.

ఈ రోజుల్లో సెల్ ఫోన్ మాట్లాడుతున్నామే అది కూడా ఇంతే. ఎన్నో శబ్ద తరంగాలు గాలిలో ఉన్నాయి కానీ, వాటిని గ్రహించే సాధనం(సెల్ ఫోన్) గ్రహించి చెవికి చేరవేస్తేనే, ఆ చెవి పని చేస్తేనే ఆ శబ్దాలని మనం వినగలుగుతున్నాం. అంతే కాదు, శబ్ద సముదాయమంతా అనిత్యమైతే, ఉచ్చరించబడ్డ శబ్దం నష్టమైతే దూరశ్రవణ యంత్రాల (రేడియో, టెలిఫోన్ వగైరా)ద్వారా శబ్దాన్ని మనం వినడం అనేదే జరగదు. కానీ ఒక చోట మాట్లాడిన శబ్దాన్ని మరో చోట మనం వింటూనే ఉన్నాం అంటే శబ్దం అనిత్యం కాదు. అందుచేత శబ్దం వినడానికి, వినకపోవడానికి పైన చెప్పబడిన కారణ సామగ్రి (వాయువీయ తరంగాలు, శ్రోత్రేంద్రియాలు) ముఖ్యమని చెప్పాలి. ఈ ప్రకారం శబ్ద నిత్యత్వాన్ని నిరూపించారు శాస్త్రకారులు.

తర్వాతి భాగంలో ఆకృత్యధికరణంచే అర్థం నిత్యమని, వాక్యాధికరణంచే వాక్య-వాక్యార్థ సంబంధంలో కూడా పురుషానుప్రవేశం లేదని, వేదాఽపౌరుషేయత్వంచే వాక్యసముదాయాత్మకమైన గ్రంథ రచనలో కూడా పురుషానుప్రవేశం సంభవించదని అందువలన శబ్దం ద్వారా గానీ, అర్థం ద్వారా గానీ, శబ్దార్థ సంబంధం ద్వారా గానీ శబ్దాలతో ఏర్పడిన వాక్య రచన ద్వారా గానీ, వాక్యాలతో ఏర్పడిన గ్రంథరచన ద్వారా గానీ ఏ విధంగానూ వేదాలలో పురుషానుప్రవేశం లేకపోవడం వల్ల వేదాలు అపౌరుషేయాలని నిర్ణయించారు.

మనచే ఉచ్చరించబడిన వాక్యం ఏ అర్థాన్నీ బోధించకపోతే **'జ్ఞానానుత్పాదకత్వరూపం'** అనే అప్రామాణ్య కారణం వస్తుంది. **"అగ్నిహోత్రం జుహుయాత్ స్వర్గకామః"** అనే విధివాక్యంచే అగ్నిహోత్రమనే కర్మ స్వర్గ రూప శ్రేయస్సుకి సాధనం అనే జ్ఞానాన్ని కలిగిస్తోంది. కనుక ఈ ప్రకారంగా **'తస్య జ్ఞానముపదేశః'** అను సూత్రావయవంచే 'జ్ఞానాన్ని అందించని వాక్యాల్ని బోధిస్తోంది' అనే రెండవ అప్రామాణ్య కారణం వేదానికి నిరాకరింపబడింది.

అదే విధంగా అగ్నిహోత్రాది కర్మలవల్ల స్వర్గ రూపమైన శ్రేయస్సు కలుగుతుందా? లేదా? అనే సంశయాన్ని కలిగించక పోవడంవల్ల 'సంశయాత్మకమైన జ్ఞానాన్ని కల్గించడం' అనే అప్రామాణ్య కారణం కూడా వేదం విషయంలో నిరాకరింపబడింది.

"అగ్నిహోత్రం జుహుయాత్" ఇత్యాది వాక్యాలవల్ల కలిగిన 'అగ్నిహోత్రాది కర్మలు స్వర్గ సాధనమనే' జ్ఞానానికి విరుద్ధమైన వాక్యాలు ఏవీ లేనందువల్ల **'అవ్యతిరేకశ్చ'** అనే సూత్రావయవంచే నాల్గవ అప్రామాణ్య కారణం కూడా వేదం విషయంలో నిరాకరింపబడింది.

ఇంతకు ముందే అనుకున్నాం, ప్రమాణాంతరాలచే తెలియబడని దానిని తిరిగి తెలియజేసేదానిని అనువాదం అంటారని. అనువాదత్వ రూపం కూడా ఒక అప్రామాణ్య కారణమే. అగ్నిహోత్రాది కర్మల్ని స్వర్గ సాధనంగా అనుష్ఠించవలసిందిగా వేదం తప్ప మరి ఏ ఇతర ప్రమాణం చేతనూ తెలియబడడం లేదు కనుక, **'అర్థే అనుపలబ్ధే తత్ప్రమాణం'** అనే సూత్రావయవంచేత వేదానికి అనువాదత్వ రూపకమైన అప్రామాణ్య కారణం నిరాకరింపబడింది.

దీనివల్ల తేలినదేమంటే, ఏదైనా వాక్యం అప్రామాణ్యం అని చెప్పడానికి ఏదో ఒక సరియైన కారణం కావాలని. ఇంతకు ముందు చెప్పినట్లుగా వేదానికి ఏ విధంగానూ అప్రామాణ్య కారణాలు సంభవించనందువల్ల వేదాలు వేరే ఇతర ప్రమాణాలను అపేక్షించకుండా స్వతఃప్రమాణాలని **'అనపేక్షత్వాత్'** అనే సూత్రావయవంచేత నిరూపించబడింది.

అర్థనిత్యత్వం - సంబంధ నిత్యత్వం

వెనుకటి భాగంలో శబ్ద నిత్యత్వం నిరూపించబడింది. నిత్యమైన శబ్దంచే ఏ అర్థం ప్రతిపాదించబడిందో అది నిత్యమే అని, శబ్ద-అర్థాల సంబంధమూ నిత్యమే అని శాస్త్రకారులు ఈ ప్రకారం నిరూపించబోతున్నారు. **"ఆకృతిస్తు క్రియార్థత్వాత్"** (జై.సూ.1-1) అని ఆకృత్యధికరణంచే లోకంలో 'గో' శబ్దంచే గోత్వం, మనుష్య శబ్దంచే మనుష్యత్వం ఈ విధంగా జాతి రూపకమైన అర్థం నిత్యమని నిర్ణయించారు. అందుచేతనే మీమాంసకులను జాతిశక్తి వాదులని వ్యవహరిస్తారు.

ఇందులో ఏ ఒకరైనా శబ్దానికి అర్థంతో సంబంధం కల్పించినవారు ఉంటే, ఆ రచయితలందరూ ఒకచోట సమావేశమై ఈ శబ్దానికి ఈ అర్థం, ఈ శబ్దానికి ఈ అర్థం అని సంఘంలో నిర్ణయం చెయ్యవలసి ఉంటుంది. కానీ లోకంలో వ్యవహారం ఆ ప్రకారంగా లేదు. లోకంలో శబ్దానికి ఏ ఒకరిచేతనో సంబంధం కల్పించబడి ఉంటే ఆ శబ్దాలకు ఫలానా వారిచేత అర్థం కల్పించబడింది అని మనం వారిని స్మరిస్తూ ఉండి ఉండాలి! కానీ మనం అలా చేయడం లేదు.

మనం అలా చేయకపోయినా, అంటే అర్థం నిర్ణయించినవారిని స్మరించకపోయినా మనకు అర్థజ్ఞానం (అర్థాన్ని తెలుసుకోవడం) ఎలా కలుగుతోంది అని విచారిస్తే, వృద్ధ వ్యవహార పరంపరతో (అలవాటుతో) అర్థజ్ఞానం కలుగుతోందని అందువల్ల శబ్దార్థ సంబంధం నిత్యమని నిరూపించారు. శబ్దార్థ సంబంధం నిత్యం అవడంవల్ల శబ్దార్థ సంబంధం ద్వారా వేదం విషయంలో పురుషానుప్రవేశం లేదని నిరూపించబడింది.

వాక్యాఽపౌరుషేయత్వం

ఇక, శబ్ద సముదాయాత్మకమైన వాక్య రచన ద్వారా వేదంలో పురుషానుప్రవేశం వారించవలసి ఉంది. దానికి ముందు వాక్యార్థానికి మూలం వాక్యమా! లేక పదాలా! లేక పదార్థాలా! లేక వేరే ఏమైనా ఉన్నాయా అని విచారించారు. ఒక్క పదం వల్లనే వాక్యార్థం సంభవించేదుంటే **"అగ్నిహోత్రం జుహుయాత్ స్వర్గకామః"** అను వాక్యంలోని 'అగ్నిహోత్రం' అనే ఒక్క పదంచే మొత్తం వాక్యార్థం తటస్థించడం లేదు. అలాగని ఇందులో ఈ మూడు పదాలే కానీ నాల్గవ పదమూ లేదు. **"గాం బధాన, గాం ముంచ"** మొదలైన వాక్యాలలో **'గామ్'** అనే శబ్దానికి అర్థమొక్కటే అయినా, వాక్య భేదంచే వాక్యార్థం వేరుగా ఉన్నందువల్ల పదార్థంవల్ల వాక్యార్థం సంభవించదని తెలుస్తోంది. కాబట్టి వాక్య, వాక్యార్థాలకు సంబంధం పురుష కల్పితం. అదే విధంగా పద సముదాయాలే వాక్య సముదాయాలుగా పురుష కృతములై చూడబడుతున్నాయి.

పద, వాక్య సముదాయాత్మకమైన వేదం కూడా పౌరుషేయమని (పురుష కృతమని) పూర్వపక్షం ప్రాప్తించగా, పదాలచే పదార్థాలు బోధించబడతాయని; పదాలు తమ తమ అర్థాలను బోధించి తమ వ్యాపారం నుండి విముక్తులవుతాయని ఆ పదార్థాలే ఆకాంక్షా సన్నిధి యోగ్యతలతో సహకరించబడినపై వాక్యార్థాన్ని అవగమింపచేస్తాయని (తెలియ చేస్తాయని), పదార్థాలే వాక్యార్థానికి మూలాలని సిద్ధాంతీకరించబడింది. ఈ ప్రకారం వాక్య, వాక్యార్థ సంబంధంలో పురుషానుప్రవేశం నిరాకరింపబడింది.

అయినా, పద సముదాయాలతో కూడిన వాక్య రచన ద్వారా పురుషానుప్రవేశం కల్పించబడుతుందేమో అని సంశయం కలగవచ్చును. కానీ వేదం విషయంలో అది కూడా పొసగదు. ఎలా అంటే లోకంలో మనకు కావలసిన తాత్పర్యాన్ని ప్రతిపాదించడానికి దానికి సంబంధించిన అర్థాలనిచ్చే పదాలను కూర్చి వాక్యాలు చేసి ప్రయోగించడం మనకు తెలుసు. మనకు కావలసిన అర్థాన్నిచ్చే పదాలను ఏరి వాక్యాలుగా ప్రయోగిస్తాం.

కానీ వేదం విషయంలో అలా లేదు. మనకు అనుభవం కానటువంటి విషయాలను, పదార్థాలను ప్రతిపాదిస్తుంది, వేదం! ఉదా॥కు

అగ్నిహోత్రం జుహుయాత్ స్వర్గకామః, దర్శపూర్ణమాసాభ్యాం స్వర్గకామో యజేత, జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత|

మొదలైన వాక్యాలు అగ్నిహోత్ర, దర్శపూర్ణమాసాది కర్మలు స్వర్గాది ఫలాలకు సాధనాలు అని చెప్తున్నాయి. ఈ ఫలానికి ఈ కర్మలు సాధనం అని చెప్పాలంటే వాటిని రచించిన రచయిత దర్శపూర్ణమాసాది కర్మలు స్వర్గ ఫలానికి సాధనాలు అని వేరే ప్రమాణాల ద్వారా తెలుసుకుని వ్రాయవలసి ఉంటుంది. కానీ ఈ విషయాలను ఎవరు తెలుసుకుని రాయగలరు? స్వర్గం మొదలైన ఫలాలు ఈ శరీరంతో అనుభవించేవి కావు. వాటిని అనుభవించడానికి వేరే ఉపాధి కావాలి. అవి లోకాంతరంలో, జన్మాంతరంలో వేరే ఉపాధి చేత అనుభవించదగిన ఫలాలు.

సృష్టి మొదలైన లగాయతు అట్టి ఫలాన్ని అనుభవించి 'ఈ కర్మవల్ల ఈ స్వర్గ రూపమైన ఫలాన్ని మేము అనుభవించాం' అని చెప్పిన వారెవరూ లేరు. ఈ స్థితిలో వీటిని ఎవరు తెలుసుకుని రచించారు అనాలి? ఇంక చివరికి ఉన్మత్త ప్రలాపమా? అని అనవచ్చును. కానీ ఉన్మత్త ప్రలాపాలే అయితే ఒకచోట ఒకసారి చెప్పిన విషయానికి, తర్వాత చెప్పే విషయానికి విరోధమైనా ఉండాలి. వేదంలో ఈ రకమైన పౌర్వాపర్య విరోధాలు (వేదంలో ఒక చోట చెప్పిన విషయం వేదంలోనే మరోచోట చెప్పబడిన విషయానికి విరుద్ధంగా, అసంబద్ధంగా ఉండడమనేది) కూడా ఎక్కడా కనబడడం లేదు. లౌకికంగా, భౌతికంగా వెంటనే అనుభవించడానికి వీల్లేని స్వర్గాది ఫల సాధనాలయిన యజ్ఞ యాగాదులను విధించడం కూడా విరుద్ధం కాదని ముందే నిరూపించి నిర్ణయం చేసారు శాస్త్రకారులు.

దీనివలన లోకంలో పదాలతో ఏర్పడ్డ వాక్యాలు పురుషులచే రచింపబడినట్లుగా వేదంలోని వాక్యాలు కూడా పదాలతో ఏర్పడ్డవే కనుక పురుషకృతమని కానీ (పురుషులే రాశారని కానీ), వాక్య-వాక్యార్థ సంబంధం పురుషకృతమని కానీ చెప్పడానికి వీలులేనందున వేదాలు **"అపౌరుషేయాలు"** అని నిర్ణయించారు.

గ్రంథాఽపౌరుషేయత్వం

వాక్యమంటే కొన్ని పదాల సముదాయం, గ్రంథమంటే కొన్ని వాక్యాల సముదాయం కదా! కనుక, శబ్ద సముదాయాత్మకమైన వాక్య రచనలో పురుష ప్రవేశం లేకపోయినా ఆ యా వాక్యాలను ఏరి అమర్చటం ద్వారా చేసే గ్రంథ రచనలో పురుషప్రవేశం సంభవించవచ్చునని, తద్వారా వేదాలు **'పౌరుషేయాలు'** అంటారేమో అని శంకించి మీమాంసా శాస్త్రకులు దానిని కూడా నిరాకరించి, నిరూపించారు.

వేదాంశ్చైకే సన్నికర్షం పురుషాఖ్యాః| (జై.సూ)

మొదలైన సూత్రాలచే వేదాలు కృతకములని, ఈ మధ్య కాలానివనీ, కఠ, కలాపాది ఋషులచే చెప్పబడి కాఠకం, కలాపం మొదలైన పేర్లతో చెప్పబడుతున్నందున ఆ ఋషులే వీటిని రచించారని, **'తేన ప్రోక్తం'** (పా.సూ.) "ఆయనచే చెప్పబడింది" అనే పాణిని సూత్ర ప్రకారం తెలియబడుతున్నందున వేదాలు ఆ పురుషులచే రచించబడిన 'పౌరుషేయాలు' అని శంకించవచ్చు. వాటికి సమాధానంగా **'ఆఖ్యాప్రవచనాత్'** మొదలైన పాణిని సూత్రాలచే ఆ యా వేదశాఖలకు ప్రవర్తకులైన ఆ యా ఋషులచే 'ప్రవచింపబడడం' వలన కాఠకం, కలాపం అనే పేర్లు ఏర్పడ్డాయే గానీ, వారు రచించించడంచేత వారి పేర్లు ఏర్పడలేదని నిర్ణయించారు.

రామాయణం, భారతం వలె వేద గ్రంథాలకు కూడా కర్త ఉండి ఉంటే వాల్మీకి వ్యాసాదుల వలె గ్రంథం మొదట్లోనే ఆ కర్తను స్మరించే వారం. కానీ అలా స్మరించడం లేదు. ఇన్ని విశేషాలతో, ఇంత విస్తారమైన గ్రంథాన్ని రాసిన ఏ రచయితా తన పేరు చెప్పుకోకుండా అజ్ఞాతంగా ఉండడు కదా! వేదాలకు కర్తను, దేశ, కాలాదులను నిర్ణయించడానికి విమర్శకులు అనేక విధాలుగా వివాద పడుతున్నారు గానీ, ఒక నిర్ణయానికి రాలేదు. వేదాలు 'అపౌరుషేయాలు' అనడానికి ఇది కూడా ఒక భూషణమే అన్నారు. అదే విధంగా మానవుడు వేదం వల్లనే ధర్మజ్ఞానం సంపాదించవలసి ఉండగా, ధర్మాన్ని ప్రతిపాదించే వేదాన్ని రచించడం సంభవించదని, ఏది తెలుసుకోవడానికి వేదమే ప్రమాణమో అది ధర్మమన్నారు కనుక వేదంవల్ల ధర్మజ్ఞానం ఆర్జించి ధర్మప్రతిపాదకాలైన వేదాలను రచించడం పొసగదు. అన్యోన్యాశ్రయ దోషం (circular error) సంభవిస్తోంది. సృష్ట్యాది నేటి వరకు వైదిక కర్మానుష్ఠానం చేసి స్వర్గాన్ని అనుభవించినట్లు కానీ, అధర్మానుష్ఠానం చేసి నరకాదులను అనుభవించినట్లు కానీ చెప్పిన సాక్షి లేదు కదా! దర్శపూర్ణ మాసాది కర్మలు స్వర్గాది శ్రేయస్సాధనమని తెలియని ఏ మానవుడు **"అగ్నిహోత్రం జుహుయాత్ స్వర్గకామః, దర్శపూర్ణ మాసాభ్యాం స్వర్గకామో యజేత"** మొదలైన సాధ్య-సాధన భావాన్ని బోధించే వాక్య రచన చేయగలడు? కనుక వేదాలు కృతకాలు కావు, పౌరుషేయాలు కూడా కావు అని నిరూపించారు.

లోక వ్యవహారంలో లౌకిక పద-వాక్య సముదాయంచే కావ్య రచన సాగిస్తున్నారు గానీ, ఎన్నడూ విని ఎరుగని నియత స్వర యుక్తాలైన పదజాలంతో ఋక్, యజుః, సామ, అధర్వణం అనే వేదాలను ఏ కవి రచించగలడు?

ఋగ్వేద ప్రారంభం ఇలా ఉంది-

అగ్నిమీళే పురోహితం యజ్ఞస్య దేవమృత్విజమ్| హోతారం రత్నధాతమమిత్యే తన్మ్రవచః కథమ్|

యజ్ఞానికి ఋత్విక్కు అని, దేవతాహ్వానానికి హేతువని, తనని సేవించు వానికి అత్యధికంగా రత్నాలు ఈయగలిగిన వాడని వేదం అగ్నిని స్తుతిస్తోంది. ఏ పురుషుడు ఏ ప్రయోజనాన్ని ఉద్దేశించి ఇలా రచించగలడు? అగ్నికి పురోహితత్వం ఈ మంత్రం తప్ప ఎవరిచేత కీర్తింపబడింది? **ఈళే** శబ్దం స్తోత్ర పరంగా ఎవరిచేత కనుగొనబడింది? అగ్నికి రత్నదాతృత్వం మొదలైన విశేషణాలు ఏ మనుష్యులచే తెలియబడతాయి? తెలియనిదే స్తుతి ఎలా సంభవిస్తుంది?

అలాగే యజుర్వేద ఆరంభ మంత్రం ఇలా ఉంది-

ఇషేర్జోత్వా వాయవః స్థోపాయవః స్థ దేవో వః సవితా ప్రార్పయతు శ్రేష్టతమాయ కర్మణ...|

"ఇషేత్వోర్జేత్వా" అనే మంత్రంలో కల్పసూత్ర ప్రకారం 'ఇషేత్వా' మంత్రం శాఖాను మార్జనంలో వినియోగం అని వాటి అర్థం. అలాగే **"వాయవస్థోపాయవస్థః"** అనే తరువాతి మంత్రంచే గోవులనుండి వత్సలను (దూడలను) విడదీస్తారు. ఈ మంత్రానికి ఈ వినియోగమని, ఇందులో బహువచనాలు వినబడినా ఏక వచనమే అర్థమని, ఒక్కొక్క వత్సను విడదీయడంలో ఒక్కోసారి ఈ మంత్రం వినియోగించబడుతుంది అని ఎవరు ఊహించగలరు?

ఇంక సామవేదాన్ని చూస్తే-

సామవేదోయదోగ్నా ఈ ప్రభృతీనాం ప్రయుజ్యతే| రూపం తత్రాపి పౌంస్నత్వాభిప్రాయోస్తి కశ్చన|

అర్థాభిదాన పరమైన ఋగక్షరాలకు వ్యాకరణాదుల్లో చెప్పబడినట్లు అకార, ఇ కార, ఓకార ప్లుతంగా (మూడు మాత్రలు గల స్వరంగా) వికృతిని, అన్నిటినీ కలిపి ఓంకారంగా ఏ బుద్ధిమంతుడు పొందించ

గలడు? **'వీతయే'** అను పదంలో 'ఈ' కారానికి విక్రతి, 'త' శబ్దంతో శబ్దంగా 'యే' శబ్దానికి రూపత్వాన్ని చెప్పడం ఎవరికి శక్యమవుతుంది?

కావున వేదం స్వతంత్రమైనదని, ఆ వేద స్వరూపం మాత్రం చేతనే తెలియబడుతోంది.

ఈ ప్రకారం ఎప్పుడు అధ్యేయులు (నేర్చుకుంటున్నవారు) గాని, అధ్యాపకులు (నేర్పుతున్నవారు) గాని, ఏదో ఒక భాగాన్ని మాత్రమే తెలుసుకునే పరిమిత పరిశోధకులు గానీ ఎవరైనా వేదాన్ని, దాని అర్థ రూపాలను గురించి ఆలోచిస్తారో అపుడు వారంతట వారికే వేదాలయొక్క 'పౌరుషేయత్వ భ్రాంతి' తనంతట తానే నివృత్తమవుతుంది. అపౌరుషేయత్వం గోచరం అవగానే పౌరుషేయత్వ భ్రాంతి తనంతట తానే నివృత్తమౌతుంది. అందుకోసం వేదమంతా విమర్శించవలసిన అవసరం కూడా లేదు. వేదాల ఆదిమ మంత్రాలను చూసినంతనే ఇటువంటి రచన పురుషులకు శక్యం కాదని, వేదాలు అపౌరుషేయాలని ఈ అపౌరుషేయవాదులయొక్క బలవంతంతో పని లేకుండా వారంతట వారే ఒప్పుకోగలరు.

సనత్కుమారాది ఋషులకు ధర్మజ్ఞానం జన్మ సిద్ధమే అని పురాణాలందు చెప్పబడుతోంది కనుక ఆ ధర్మజ్ఞానం చేతనే వేదాలు రచించబడి వేదాలు 'ఋషి కర్తృకాలు' అనే శంకను కూడా వేదమే పలు తార్కాణాలతో నివృత్తి చేసింది.

అజాస్ హవై పృశ్నీగ్ స్తపస్య మానాస్.... తదృషీణాం రుషిత్వమ్|

ఋషులు మనలాగ కల్పం మధ్యంలో జనించడం లేదు. కల్పాదియందు బ్రహ్మగారిచే సృజించబడ్డారు. కల్పాదియందు బ్రహ్మగారిచే సృజించబడినా మునులు స్వరూపం చేతనే కరుణ గలవారుగా ఉన్నప్పటికీ తిరిగి తపస్సును ఆచరించారు. ఆ తపస్సుచే సంతుష్టిని పొందిన జగత్కారణభూతమైన బ్రహ్మ స్వయంగా ఆవిర్భవించి ఆ మునుల సమీపానికి ఒక విగ్రహ రూపంతో వచ్చి శబ్ద రూపమైన వేదాన్ని వారికి సాక్షాత్కరింప చేశాడు. దానితో ఆ మునులు జ్ఞాన స్వరూపు లయ్యారు. అనగా వేదాలను సాక్షాత్కరింప చేసుకుని 'ఋషులు' అయ్యారు. వీరు 'శ్రుతి' స్థానాపన్నులు. వీరి ఉపదేశాలను ఆచరించినవారు 'మునులు'. వీరు 'స్మృతి' స్థానాపన్నులు. ఈ విధంగా ఋషులకు, మునులకు భేదం గ్రహించవచ్చును.

ఆ ప్రకారం బ్రహ్మ సాక్షాత్కారాన్ని పొందిన ఆ మునులు సర్వకామ ప్రదమైన యజ్ఞకామన గలవారై బ్రహ్మ స్వరూపమైన దేవతను ఉపాసించారు. బ్రహ్మ సాక్షాత్కారానికి పూర్వం తపస్సుని ఆచరించినవారు సాక్షాత్కారానంతరం 'బ్రహ్మ'శబ్ద వాచ్యమైన దేవతను ఉపాసించారు. ఆ దేవతానుగ్రహం వలన సర్వకామ ప్రదమైన బ్రహ్మయజ్ఞాన్ని అనుష్ఠించినవారై, దేవతలను పూజించారు. ఇక్కడ 'బ్రహ్మ' అనగా శబ్దరాశీ రూపమైన వేదం. 'స్వయంభు' అనడంతో అకర్తృకం అని తెలుసుకోనగును.

సర్వ జగత్కారణ భూతమైన, సర్వవ్యాపకుడైన పరమాత్మను సర్వదేవతలూ ఉత్తమ పురుషార్థ సిద్ధి కోసం ఉపాసించి, వారు కృతకృత్యులు అవడమే గాక మనుష్యులను కూడా అనుగ్రహించ దలచారు. వారు పరబ్రహ్మ ప్రతిపాదకమైన వేద రాశిని, ఆ శ్రుతులను తమ వారికి ఉపదేశించే జమదగ్ని మొదలుగా గల మహర్షి సంఘానికి స్వాధీనపరచారు. ఆ ప్రకారం మంత్రాలను 'దర్శించి' మనకు అందించిన వారిని 'మంత్ర ద్రష్టలు' అన్నారు.

ఆ మహర్షులు మనుష్యులకు అధ్యయన అధ్యాపనాది సంప్రదాయ రూపంగా అందచేస్తూ పరిపాలించారని శ్రుతి చెప్తోంది కనుక వేదాలు ఋషి నిర్మితాలు కావని తెలుస్తోంది. ఇంకా ఈ అపౌరుషేయత్వ నిరూపణలో కనబడే అనేక పరస్పర విరోధాలకు కూడా వేదం, శాస్త్రం పలు తార్కాణాలతో సవివరమైన పరిహారం కూడా చెప్పింది.

ఈ ప్రకారం పరమాత్మ నుండి నిశ్వాస రూపంగా వేదాలు ఆవిర్భవించాయని అనేకానేక స్మృతి పురాణ వచనాలు, శ్రీ శంకర భగవత్పాదుల వచనాలు, మీమాంసా శాస్త్ర వచనాలు మున్నగు వాటివలన తెలుస్తోంది కనుక వేదాలకు కవి పుంగవులు, ఋషులు ఎవరూ రచయితలు కారని; ఈశ్వరుడు, బ్రహ్మ మున్నగు వారు కర్తలు కారని "వేదాలు అకర్తృకాలు" అనగా అపౌరుషేయాలని, నిత్యములని తెలియబడుతోంది.

ఇంకా ఈ విషయమై వాదించే వారిని గూర్చి కల్పసూత్రాధికరణ వార్తికంలో వార్తికకారులు ఇలా అన్నారు.

ఏతద్బహిరవస్థానా ద్వేదరూపం నా దృశ్యతే ఋక్సామాది స్వరూపేతు దృష్టేభ్రాంతిర్నివర్తతే|

వేదాధ్యయనం చేయని వారికి వేద స్వరూపం పూర్తిగా తెలియనందున భ్రాంతి సంభవించ వచ్చును. కానీ ఋక్సామాది వేద స్వరూప పరిచయం కలిగితే ఆ భ్రాంతి నివారింపబడుతుంది. లోకంలో కూడా అంతే కదా! ఏదైనా ఒక శాస్త్రాన్ని విమర్శించాలంటే ముందుగా దాన్ని కూలంకషంగా చదివి, పరిశ్రమ చేసి, విచారణ చేసి విమర్శనా సిద్ధాంతాన్ని ప్రతిపాదించాలి గానీ ఏమీ తెలియని వాడు విమర్శిస్తే దానికి విలువేముంది?

వేదాలు చెప్పిన విషయాలను, వేద విహితమైన ధర్మాన్ని మనం పాటించాలి అంటే ముందుగా ఆ వేదాల గురించి, వాటి ప్రామాణ్యం గురించి సంపూర్ణమైన విశ్వాసం కలుగచేయవలసిన ఆవశ్యకత ఉండడం వల్ల వేదాల అపౌరుషేయత్వం గురించి వాటి మహిమ గురించి వేదాల స్వతఃప్రామాణ్యం గురించీ ఇంత విస్తారంగా, సప్రమాణపూర్వకంగా వివరించడం జరిగింది.

వేదాలు అనంతం

'అనంతావై వేదాః'- వేదాలు అనంతం అంటున్నాం.

భరద్వాజోఽహాత్రిభిరాయుర్భిః బ్రహ్మచర్యాముపాసతగ్ంహ జీర్ణిగ్ స్థవిరగ్ం శయానం|(కృ.య.బ్రా.)

ఇంద్ర ఉప ప్రజోవాచ-

"భరద్వాజ యత్తే చతుర్థమాయుర్దద్యామ్ కిమసేన కుర్యా|" ఇతి

"బ్రహ్మచర్యవైనేన చరేయమితి హోవాచ|"

"తగ్ంహ త్రీన్గిరి రూపానవిజ్ఞాతానివ దర్శయాం చకార| తేషాగ్ంహైకైకస్మాన్ముష్టి నాదదే|"

సహోవాచ **"భరద్వాజేత్యామన్త్ర్య వేదావా ఏతే| అనంతావైవేదాః|"**

అని సావిత్రికాఠకమనే ఒకానొక కర్మ ప్రకరణంలో చెప్పబడింది. ఇందులో భరద్వాజుడనే మహర్షి మూడు ఆయుర్దాయాలతో బ్రహ్మచర్యాన్ని స్వీకరించి వేదాధ్యయనం చేశాడు అని చెప్పబడింది. వేదంలో **"శతమానం భవతి శతాయుః"** (కృ.య.బ్రా.) అని ఉండడం వల్ల ఆయుశ్శబ్దమంటే నూరు సంవత్సరాలుగా స్వీకరించబడింది. అలాంటి మూడు వందల సంవత్సరాలు భరద్వాజుడు బ్రహ్మచర్యాన్ని వేదాధ్యయనాన్ని చేశాడని అర్థం. బ్రహ్మచారి అనగా వేదాధ్యయనం చేసేవాడు అని అర్థం. వేరే ప్రకరణంలో బ్రహ్మచారి పదానికి వేరే అర్థం ఉంది. కొన్ని నియమాలను పాటించే గృహస్థుడూ బ్రహ్మచారి శబ్దంచే చెప్పబడుతున్నాడు. అలాగే బ్రహ్మ అంటే జ్ఞానం కనుక, బ్రహ్మచారి శబ్దంచే జ్ఞాని కూడా చెప్పబడుతున్నాడు. ప్రస్తుత సందర్భంలో బ్రహ్మచారి అంటే "**బ్రహ్మణి వేదే చరతీతి బ్రహ్మచారీ**" వేదాధ్యయనం చేసేవాడు అని అర్థం.

"వేదమధీత్య స్నాయాత్" అనే సూత్రంచే వేదమంతా అధ్యయనం చేసిన తర్వాత స్నాతకం చేసుకొని వివాహం చేసుకోవాలని ఉంది కనుక వివాహానికి ముందుకాలం వేదాధ్యయన సమకాలం కనుక, అప్పుడు అతనిచే అనుష్ఠించబడింది బ్రహ్మచర్యం, అతను బ్రహ్మచారి. అయితే ప్రస్తుతంలో వేదం చదవక పోయినా, పెళ్ళికి ముందు ఉన్న వారినందరినీ బ్రహ్మచారులుగా పిలవడం మాత్రం మిగిలింది.

అలాగే, స్నాతకం మూడు విధాలని పాఠాంతరం కూడా ఉంది- (1)విద్యాస్నాతః (2)వ్రతస్నాతః (3) ఉభయస్నాతః అని. గురుకులంలో అర్థజ్ఞాన పర్యంతం వేదాధ్యయనం చేసి స్నాతకం చేసుకునేవాడు **'విద్యాస్నాతః'** అని చెప్పబడతాడు. అర్థజ్ఞాన పర్యంతం వేదాధ్యయనం చేయక బ్రహ్మచారి నియమాలని మాత్రం పాటించి స్నాతకం చేసుకునేవాడు **'వ్రతస్నాతః'**. అర్థజ్ఞాన పర్యంతం గురుకులవాసం చేసి, వేదవ్రతాలను కూడా ఆచరించి స్నాతకం చేసుకునేవాడు **'ఉభయస్నాతః'** అని చెప్పబడుతున్నాడు.

"స్నాత్వా భార్యాముపేయాత్" అనే ప్రమాణంచే స్నాతకమైన తర్వాత వివాహం చేసుకోవాలి అని చెప్పారు. ఇక్కడ, స్నానమంటే **'ఆప్లవం'**, అంటే నీటిలో మునగడం కాదు. **"స్నానోపలక్షితా ఛాత్ర నివృత్తిర్గురు వేశ్మనః"** మొ||లైన శ్లోకాలచే భట్టపాదులు శ్లోక వార్తికంలో 'స్నాతనమంటే గురుకులవాస నివృత్తి' అని అర్థాన్ని చెప్పేరు. అంటే మధుమాంసాది నియమాలకి అది ఒక అవధి అన్నారు. సరే, ఈ ప్రకారంగా స్నాతకం చేసుకుని వివాహం చేసుకోడానికి ముందున్న వటువులందరినీ బ్రహ్మచారులు అని మనం వ్యవహరిస్తున్నాం ఈ రోజుల్లో.

ప్రస్తుత విషయానికి వస్తే, భరద్వాజుడు మూడు వందల సంవత్సరాలు బ్రహ్మచర్యాన్ని అనగా వేదాధ్యయనాన్ని చేసేడని అర్థం. మళ్ళీ వెంటనే, మూడు వందల సంవత్సరాలు జీవించడమా? బ్రహ్మచర్యంతో వేదాధ్యయనం చేయడమా? అని చాలామందికి ప్రశ్న ఉదయిస్తుంది. **"శతమానం భవతి"** అనే శ్రుతి చెప్పడం వల్ల నూరు సంవత్సరాలే ఆయుర్దాయ పరిమితి అని, నూరేండ్లు దాటి జీవించడం, అలాగే నూరు సంవత్సరాలకు తక్కువ కాలంలోనే మరణించడం వంటివి వేద విరుద్ధం కాదా? అని ప్రశ్నిస్తూ ఉంటారు. కానీ **"శతమానం భవతి"** అనే శ్రుతి నూరు సంవత్సరాలకు మించి జీవించకూడదని కానీ, నూరు సంవత్సరాలకు ముందు మరణించకూడదని కానీ విధి, నిషేధాలు చెప్పడం లేదు. 'యథోక్తమైన నియమాలను పాటించిన మానవుడు' నూరు సంవత్సరాలకి తక్కువ కాకుండా జీవించ గలడని ప్రాయికమైన (సామాన్యమైన) అర్థాన్ని మాత్రమే చెప్పింది ఈ మంత్రం.

మానవులు నూరు సంవత్సరాల వరకు జీవించడం, నూరు సంవత్సరాలకు మించి జీవించడం అనేవి వారి జీవన విధానంమీద, వారి ప్రవర్తన మీద ఆధారపడి ఉంటుంది. దీనిని మరింత వివరిస్తే- వేదం నాలుగు విధాలైన మృత్యు కారణాలను వర్ణించింది.

అముమాహుః పరమ్ మృత్యం| పవమానం తు మాధ్యమం| అగ్నిరేవాఽవయో మృత్యుః|
చంద్రమాశ్చతురుచ్యతే|(ఆ.కా.1)

మృత్యువుకి ఉన్న కారణాల్లో ఆదిత్యుడు మొదటి కారణమని, జఠరాగ్ని రెండవ కారణమని, వాయువు మూడవ కారణమని, చంద్రుడు నాల్గవ కారణమని వర్ణించారు. క్రిమికీటకాదులన్నీ కేవలం మొదటి కారణం (సూర్యుడికి) లోబడి ఉంటాయని, మానవులు రెండు, మూడు కారణాలకు లోబడి ఉంటారని వేదం వివరించింది. ఓషదులకు చంద్రుడు కారణం. కేవలం మందులవలే ఉపయోగపడే ఔషదులే కాదు, వ్రీహ్యాది ధాన్యాలు కూడా ఓషదులుగానే చెప్పబడుతున్నాయి. చంద్రుడి అనుగ్రహం లేకపోతే ఆ ధ్యాన్యాదులు పండక ఆహారం లేకపోవడం కూడా మృత్యువుకి కారణమౌతుంది అన్నారు.

అనాభోగాః పరం మృత్యుం పాపాస్సంయంతి సర్వదా |అభోగాస్త్వేవ సంయంతి| యత్ర పుణ్యకృతో జనాః| తతో మధ్యమమాయంతి చతుమగ్నించ సంప్రతి|(ఆ.కా.1)

జఠరాగ్నిని సరైన స్థితిలో పెట్టుకోవడం, వాయువుకి అన్యధా సంచారం లేకుండా ప్రాణాయామాదులచే సరైన స్థితిలో పెట్టుకోవడం ఆయుర్వృద్ధికి కారణమవుతుంది. ఇలా పైన చెప్పబడిన ప్రకారం ప్రవర్తించడం/ ప్రవర్తించకపోవడం అనేది మన అధీనంలో ఉంది. యోగులు చిరకాలం జీవించడానికి పైన చెప్పిన నియమాలు ఆచరించడమే కారణాలు. అలా ప్రవర్తించక మనం అకాలంలో అభోజ్యాలైన వాటిని భక్షించి (తినరాని వాటిని, తినరాని వేళలలో తిని) జఠరాగ్నికి విశ్రాంతి లేకుండా ప్రవర్తించడం, ఉచ్చరించవలసిన అవసరం లేని శబ్దాలను ఉచ్చరించి శ్వాసలను ఖర్చు పెట్టుకోవడం మొదలైన వాటివల్ల ఆయుర్దాయం తగ్గుతుంది.

అందువల్లనే మన శాస్త్రాల్లో అభక్ష్య భక్షణ నిషేధం, భోజన కాల నియమం, మిత భోజనం, మిత భాషణం చెప్పబడ్డాయి. మనం వాటిని గమనించక, పాటించక స్వేచ్ఛగా సంచరిస్తే ఆయుర్దాయం తగ్గగలదు. అలా చేయకుండా ఈ నియమాలను పాటించినా, యోగాభ్యాసాలు చేసినా ఆయుర్వృద్ధి కలుగుతుంది. దీనికొక లౌకిక దృష్టాంతం-లోకంలో బజారులో మనం ఒక గడియారం కొనే సమయంలో ఆ గడియారం విక్రేత (అమ్మేవాడు) పది సంవత్సరాలు పని చేస్తుందని చెప్తాడు. మనం పది సంవత్సరాలు దాటినా అది పని చేస్తుంటే అతను చెప్పిన పది సంవత్సరాల కాలం అయిపోయిందని దానిని తిరిగి అతనికి ఇచ్చివేయం. అలాగని రోజుకి మూడుసార్లు ఇంట్లో వాళ్ళందరూ దాని యంత్రాలు తిప్పి 'కీ' ఇస్తే అది రెండు, మూడు రోజులకే భ్రష్టమవుతుంది. గడియారానికి చెందిన నియమాలను 'పాటించనపుడు' అది పదేళ్ళు ఎందుకు పని చేయలేదని ఆ విక్రేతను అడగడానికి వీలు పడదు. అదే విధంగా ఈ శరీరమనే గడియారాన్ని మనం శాస్త్రం చెప్పినట్లు వాడితేనే ఎక్కువ కాలం జీవించవచ్చు.

ఇక ప్రస్తుతానికి వస్తే, ఈ ప్రకారం భరద్వాజాది మహర్షులు యోగి పుంగవులు అవడంవల్ల తమ నిద్రాహార నియమాలచే, యోగాభ్యాసాది ఉపాయాలచే చిరకాలం జీవించారు అని మనం నమ్మడానికి ఎలాంటి సంశయం అక్కర్లేదు.

కావున ఈ ప్రకారం భరద్వాజుడు మూడు వందల ఏళ్ళు వేదాభ్యాసం చేసిన తర్వాత జీర్ణమైన శరీరం కలిగి, ఇక వేదాభ్యాసం చేయలేని, వయస్సుచే బాగా జీర్ణించి వృద్ధుడై శయ్యని అధిష్ఠించిన(అనగా లేవలేని స్థితికి వచ్చినట్లు గుర్తించిన) ఆ భరద్వాజుని దగ్గరకు ఇంద్రుడు వచ్చి "ఓ భరద్వాజా! నీకు నాల్గవ ఆయుర్దాయాన్ని ఇవ్వగలను. దానితో నువ్వేమి చేయగలగవు" అని అడిగాడు. "ఈ నూరేళ్ళు కూడా బ్రహ్మచర్యాన్నే ఆచరిస్తూ వేదాధ్యయనం చేయదలచుకున్నానని" భరద్వాజుడు సమాధానం ఇచ్చాడు.

పిమ్మట పరమేశ్వరుడు వేదాల పారం (అంతు) చూడడం సాధ్యం కాదని చెప్పడానికి మూడు వేదాలను మూడు పర్వతాలుగా చూపించి, ఈ మూడు వందల సంవత్సరాల నుంచి నీవు అధ్యయనం చేసిన భాగం పరిమితి ఇంత" అని ఒక్కో వేద పర్వతం నుంచి ఒక్కో పిడికెడు తీసి చూపించి "ఓ భరద్వాజా! ఇవి నీవు చదివినవి. వేదాలు అనంతం. అందువల్ల నీకు నాల్గవ ఆయుర్దాయాన్ని ఇచ్చినా వేదంయొక్క అంతం చూడడం నీకు సాధ్యం కాదు" అని చెప్పినట్లు వేదంలోనే ఉదహరించిన ఉపాఖ్యానంలో ఉంది. దీనిని బట్టి వేదాలు అనంతం అని తెలుసుకోవచ్చును.

అయితే వేదాలు అనంతాలు, అసంఖ్యాకాలు అయితే వేదాలు ఒకటే అని, తర్వాత నాలుగు గాను, ఆ తర్వాత శత సహస్రాత్మకంగా విభజించబడ్డాయని, వేదవ్యాసుడు విభజించాడని పురాణాలు చెప్తున్నది దీనికి విరుద్ధంగా ఉందనే సంశయం కలగవచ్చును.

వీటి గురించి వచనాలు ఇలా ఉన్నాయి-

ఆద్యో వేదశ్చతుష్పాద శ్శతసాహస్ర సంమితః|

వేదాలను విభజించడానికి ముందు కాలంలో వేదమొక్కటే అని దీనర్థం.

అగ్నేర్ ఋగ్వేదో వాయోర్యజుర్వేద ఆదిత్యాత్సామవేదః| (ఐ.బ్రా.5-32)

"అగ్ని వాయురవిభ్యస్తత్రయం బ్రహ్మసనాతనం"

దుదోహ యజ్ఞసిధ్యర్థమృగ్యజుస్సామలక్షణమ్| (మ.స్మృ.1- 23)

పై శ్రుతి, స్మృతులు- అగ్నినుండి ఋగ్వేదం, వాయువునుండి యజుర్వేదం, ఆదిత్యునినుండి సామవేదం ఆవిర్భవించాయని చెప్తున్నాయి. ఇదే సంకేతం వేదాలలో కూడా వినబడుతోంది.

అగ్నిమీళే పురోహితమ్ యజ్ఞస్య దేవమృత్విజమ్|

అని ఋగ్వేదం ఆరంభమందే అగ్నిని ప్రస్తావించింది. అలాగే

ఇషేత్వోర్జేత్వా వాయవస్థోపాయవస్థ|

అని యజుర్వేదం ప్రారంభంలోనే వాయువుని ప్రస్తావించింది.

అగ్న ఆయాహివీతయే|

అని సామవేదం. ఇక్కడ అగ్ని శబ్దానికి ఆదిత్యుడనే అర్థం.

దివస్పరి ప్రథమం జజ్ఞే అగ్నిరస్మద్ద్వితీయం పరిజాతవేదాః|తృతీయమప్సున్నృమణా అజాస్రమింధాన ఏనంజరతే స్వాధీః|(కృ.య.సం.4-2)

అంటే అగ్ని ద్యులోకంలో (దేవ లోకంలో) సూర్య రూపంగాను, భూలోకంలో దాహ, పాకాదులను చేసే ప్రసిద్ధ (సాధారణ) రూపంగాను, సముద్రంలో బడబాగ్ని రూపంగాను మూడు జన్మలను పొందినట్లుంది. ఇదే విధంగా **"మూర్ధానం దివో అరతిం పృథీవ్యా వైశ్వానరమృతాయ జాతమగ్నిం"** అనే మంత్రం కూడా "అగ్నీ! ద్యులోకంలో సూర్యరూపంగాను, భూలోకంలో మనుష్యులకు దాహపాకాదులను చేయు ప్రసిద్ధ వహ్ని రూపంగాను ఉన్న నిన్ను స్తుతి చేస్తున్నాం" అనడం వల్ల అగ్ని ద్యులోకంలో సూర్య రూపంగా ఉన్నట్లు వర్ణించబడింది. ఈ ప్రకారం **"ఆజ్ఞాయాహి"** అనే మంత్రంలో అగ్ని శబ్దానికి ఆదిత్యుడని అర్థం చెప్పడంవల్ల **"ఆదిత్యాత్సామవేదః"** అను శ్రుతికి విరోధం లేదని స్పష్టమైంది.

ఇంతే కాదు, వేదాలు మూడు అనే శ్రుతులు చాలా ఉన్నాయి. ఆపస్తంబ శ్రౌతసూత్ర పరిభాషా ప్రకరణంలో **"యజ్ఞం వ్యాఖ్యాస్యామః"** అని ప్రారంభించి యజ్ఞనిర్వహణలో మూడు వేదాలకు అవసరం ఉందని చెప్పబడింది. మరోచోట, **"సత్రిభిర్వేదైర్విధీయతే, ఋగ్వేద, యజుర్వేద, సామవేదైః"**(సా.భా.)లో ప్రొద్దున్న, మధ్యాహ్నం,సాయంకాలాల్లో సూర్యుడు ఋగ్వేద,యజుర్వేద,సామవేదాలతో కూడి ఉంటాయని చెప్పే ప్రసంగంలో కూడా మూడు వేదాలే చెప్పబడ్డాయి. ఆపస్తంభ శ్రౌతసూత్రంలో మూడు వేదాలచేతనే యజ్ఞం నిర్వహించబడుతుందని చెప్పబడింది. ఈ ప్రకారం వేదత్రిత్వం (వేదాలు మూడు అని) బోధింపబడింది.

వేదాలు నాలుగు అని చెప్పే ప్రమాణాలు కూడా ఉన్నాయి.

అస్యమహతో భూతస్య నిశ్వసితమే వైతత్ యదృగ్వేదో జుర్వేదస్సామవేదోఽథర్వాంగిరసః| (బృ.ఉ.4-4-10)

తత్ర అపరా ఋగ్వేదో యజుర్వేద స్సామావేదోఽథర్వవేదః| (ముం.ఉ.1-1)

ఋగ్వేదం భగవోఽధ్యేమి యజుర్వేదం సామవేద మథర్వణం చతుర్థం| (ఛాం.ఉ. 7-1-2)

ఋగ్యజుస్సామాథర్వణశ్చత్వారః|(నృ.ఉ.)

ఈ ప్రమాణాలచే వేదాలు చాతుర్విధ్యం (నాలుగు అని) తెలుస్తుంది. ఇదే విధంగా భాగవతంలో **"తేనైవాసౌ చతుర్వేదాన్ చతుర్భిర్వదనైః ప్రభుః...."**(భాగవతం 12-6) అనే గ్రంథ విశేషంచేత బ్రహ్మ నాలుగు ముఖాలతో నాలుగు వేదాలను, పుత్రులను గురించి అధ్యాపనం చేసెను. అనగా పుత్రులచే అధ్యయనం చేయించెను అని, **"వేదం చక్రే చతుర్విధం"** అని అనడంవల్ల నాలుగు విభాగాలుగా విభజించెనని స్పష్టం.

గౌతమస్య ఋషేశ్శాపాత్ జ్ఞానేత్వజ్ఞానతాం గతే.....|

అని స్కాంద పురాణంలో చెప్పబడింది. ఒకానొకప్పుడు గౌతమ ఋషి శాపంవలన సకల వేద విజ్ఞానం అంతరించి పోతుండగా, సంకుచిత బుద్ధి యుక్తులైన మనుష్యులను చూసి రుద్రాదులు శ్రీమన్నారాయణుని శరణు పొందారు. వారిని అనుగ్రహించిన శ్రీమన్నారాయణుడు సత్యవతియందు పరాశరుని వలన వేదవ్యాసునిగా జన్మించి, ఋగ్యజుస్సామ అధర్వాలను నాలుగు వేదాలుగా ముందు విభజించి తర్వాత ఒక్కో వేదాన్ని శతసహస్రాది సంఖ్యాకంగా విభజించినట్లుంది.

ముందు ఒకే వేదంగా, రాశీ భూతంగ ఉన్నది ఋగ్యజుస్సామాథర్వ భేదంతో నాలుగు వేదాలు గాను, తర్వాత విడివిడిగా ఋగ్వేదం 21 శాఖలు గాను, యజుర్వేదం 101 శాఖలు గాను, సామవేదం 1000 శాఖలు గాను, అధర్వణవేదం 9 శాఖలు గాను విభజింపబడింది.

రామ! వేదాః కతివిధాశ్శాఖా భేదాంశ్చ తద్వద ....|

"వేదాలెన్ని?వాటి శాఖలెన్ని?" చెప్పమని హనుమంతుడు రాముని ప్రశ్నించగా "ఋగ్యజుస్సామ అధర్వణాలుగా వేదం నాలుగు వేదాలుగా పరిగణించబడిందని, పిమ్మట ఋగ్వేదం 21 శాఖలుగాను, యజుర్వేదం 109 శాఖలుగాను, సామవేదం సహస్ర (1000) శాఖలుగాను, అధర్వణవేదం 50 శాఖలుగాను విభజించబడగా శత సహస్ర సంఖ్యాకాలు అయ్యాయని" చెప్పెను.

ఇందులో అధర్వణ వేదం గురించి 12 శాఖలుగా విభజించబడినట్లు స్కాందంలోను; 9 శాఖలుగా విభజింపబడినట్లు సూతసంహితలోను; 50 శాఖలుగా విభజింపబడినట్లు ముక్తికోపనిషత్తులోను ఉండడం చేత కలిగే పరస్పర విరోధం యుగాలయొక్క ఆవృత్తిలో ప్రతీ కల్పాంతర మన్వంతర భేదంచే ఒక్కొక్క విధంగా విభజింపబడ్డాయని చెప్తే తొలగిపోతుంది.

ఈ ప్రకారం ఎన్ని వేద శాఖలున్నా ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వ వేదాలలోనే ఇముడు తున్నాయి. ఇంకా అనంతాలని చెప్పినదానికి, **"శతసహస్ర సమ్మితః"** అనే వచనం కర్మధారయ సమాసం అవడంవల్ల **'ఆనంత్య'** వాచకమని చెప్పవచ్చును. ఇంకా, **"అనంతా వై వేదాః"** అనేది అనంత వేద శాఖల పరంగా చెప్పబడింది. కలియుగాన పుట్టబోవు మనవంటి వారి శక్తి సామర్థ్యాలను గుర్తించి అనేక శాఖలుగా ఉన్న వేదాన్నంతటినీ మనం అధ్యయనం చేయలేమనే అభిప్రాయంతో వేదవ్యాసుడు శత సాహస్రకమైన శాఖలుగా విభాగం చేయగా, అనంతమైన వేదాల్లో విభాగం చేయబడకుండా ఉన్నవి చాలా ఉన్నట్లు చెప్పవచ్చును.

ఇంకా **"పాదోస్య విశ్వాభూతాని"** అనే పురుషసూక్త మంత్రంతోను, భగవద్గీతలోని **"విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితో జగత్"** అనే శ్లోకం చేతను పరమేశ్వరుని గురించి, భూత భవిష్యత్ వర్తమానాలను గురించి వివిధ రకాలుగా విశ్లేషించి, జగత్తు పరమేశ్వరునికి ఒక అంశం అని చెప్పడంవల్ల ఆయన

ఆనంత్యానికి(అనంతత్వానికి) భంగం లేనట్లే, వేదవ్యాసుడు శతసహస్రాది సంఖ్యాకంగా విభజించాడన్నంత మాత్రాన వేదాల ఆనంత్యానికి కూడా విరోధం లేదని నిరూపించబడింది.

అటువంటి శత సహస్రాక శాఖలలో ప్రస్తుతం స్వల్పమైన శాఖలు మాత్రమే జీవించి ఉన్నట్లు సర్వ వేదశాఖా సమ్మేళనంలో ఒకప్పుడు తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ జగద్గురు కాంచి కామకోటి పీఠాధిపతులు శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామివారి సమక్షంలో తేలింది.

శబ్ద విస్తృతి చేతనే వేదాలు మహిమోపేతాలు గాక స్వతః ప్రామాణ్యం చేతను, అపౌరుషేయమగుట చేతను, నిత్యం అగుట చేతను కూడా మహిమోపేతాలైనవని తెలుసుకుని, ఇకపై ఆ వేదాలు ఏ విధంగా భగవత్స్వరూపం కూడా అవుతాయో తెలుసుకుందాం.

వేదాలు భగవత్స్వరూపాలు

వేదాలు భగవత్స్వరూపాలు అని రెండు రకాలుగా చెప్పవచ్చును. **'సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ'** అని పరమాత్మకు లక్షణం చెప్పేరు. సత్యం అంటే '**త్రికాలాఽబాధ్యత్వ**'మని, అంటే ఎల్లవేళలా మారకుండా ఉండేదని అర్థం. అనంతం, దేశకాలవస్తు పరిచ్ఛేద శూన్యత్వం కలది జ్ఞానం అని, జ్ఞాన స్వరూపమని గుణాలనుబట్టి జ్ఞానాన్ని వర్ణించారు. ఈ లక్షణం వేదానికి కూడా సరిపోతుంది. వేదాలు సత్యాలు. అంటే, వ్యవహారంలో ఉండే సత్యత్వాన్ని అంగీకరించారు. జ్ఞాన ప్రతిపాదక శబ్ద రాశి అయిన వేదంయొక్క అనంతత్వం ముందే నిరూపించబడింది. కనుక బ్రహ్మ లక్షణమే గౌణంగా వేదాలకు సరిపోయింది, కనుక వేదాలు భగవత్స్వరూపాలు అని చెప్పవచ్చును.

ఇంక రెండవది- భగవత్ తత్త్వాన్ని ప్రతిపాదించేవి కనుక వేదాలు భగవత్స్వరూపాలు. వేదమంతా భగవత్ స్వరూపాన్ని వర్ణించిందా? అంటే కర్మ, బ్రహ్మలను ప్రతిపాదించడమే పరమాత్మ స్వరూపాన్ని ప్రతిపాదించడ మని వివరించారు.

కాండ ద్వయోపపద్యాయ కర్మ బ్రహ్మ స్వరూపిణే| స్వర్గాపవర్గరూపాయ యజ్ఞేశాయ నమో నమః|

కర్మకాండ, జ్ఞానకాండ అని వేదాలు రెండు కాండలుగా ఉన్నాయి. కర్మకాండచే బోధించబడిన కర్మ పరమేశ్వర స్వరూపమే. అదే విధంగా జ్ఞానకాండచే బోధించబడిన తత్వం కూడా పరమాత్మ స్వరూపమే. ఈ ప్రకారం కాండ ద్వయంచే ప్రతిపాదించబడిన కర్మ, బ్రహ్మ స్వరూపమైన పరమాత్మకు నమస్కారం అని పై వచనానికి అర్థం.

"సర్వేషాం వేదవాక్యానాం అద్వైతే పరబ్రహ్మణి తాత్పర్యం" అని నిర్ణయం. కర్మద్వారా చిత్తశుద్ధి కలిగిన తర్వాత వైరాగ్యం, తదుపరి జ్ఞానం, దాని తర్వాత ఆ జ్ఞానంచే తెలుసుకోదగిన బ్రహ్మతత్వం తెలియచేయడమే వేదం ఉద్దేశం. కర్మవాదంతో ప్రారంభించినా మొత్తం వేదరాశికంతకూ పరమాత్మను తెలియ చెయ్యడమే తాత్పర్యమైనప్పుడు వేదంలో ఎక్కువ భాగం కర్మ సముదాయాన్నే ఎందుకు ప్రతిపాదిస్తోంది అని సంశయం ఉదయిస్తుంది.

లోకంలో గృహనిర్మాణ, వివాహాది శుభకార్యాలని తలబెట్టినప్పుడు ఆ యా కార్య నిర్వహణకై చేసే కారణ కలాపమందే(ఇంటిని సిద్ధం చేయడమందే, వివాహానికి సిద్ధమవడమందే) ఎక్కువ శ్రమ పడడం, అసలైన ముహూర్తాలు మాత్రం లిప్త కాలమే ఉండడం మనకు తెలిసిందే కదా!

ఇదే విషయాన్ని 'తైత్తరీయోపనిషద్భాష్యం' ఉపోద్ఘాతంలో విద్యారణ్యులవారు 'ఉపేయం కంటే ఉపాయంలోనే శ్రమ కలదని' చెప్పారు. జ్ఞానం ఉపేయం, కర్మ ఉపాయం అవడం వల్ల 82 ప్రశ్నలతో కూడిన

తైత్తరీయ యజుశ్శాఖలో 79 ప్రశ్నలచే కర్మ, కేవలం మూడు ప్రశ్నలచేత మాత్రమే జ్ఞానం ప్రతిపాదించబడుతోందని సమాధానం చెప్పారు. ఇంకా బాగా విమర్శిస్తే, ఆ మూడు ప్రశ్నలలో కూడా ఒక ప్రశ్న మాత్రమే జ్ఞానాన్ని ప్రతిపాదిస్తుండగా మిగిలిన రెండు ప్రశ్నలు ఉపాసనను ప్రతిపాదిస్తున్నాయి.

కర్మ బాహుళ్యాన్ని ఆచరిస్తే గాని (చాలా కర్మల నాచరిస్తే కానీ) చిత్తశుద్ధి రాదని,ఆ ప్రకారం చిత్తశుద్ధి సాధించి తద్వారా జ్ఞానయోగ్యతను సంపాదించడం కష్టమని, ఆ కర్మలవల్ల జనించే జ్ఞాన యోగ్యత - చిత్త సంస్కారం, 'వివిదిష'ను కలిగించడం అనే రెండు విధాలుగా ఉంటుంది అని చెప్పబడింది.

నిత్యకర్మణాం జ్ఞానయోగ్యతాపాదక మలాపకర్షణ రూపగుణాధాన లక్షణ సంస్కారనియమః తైరభ్యుదయావాప్తిశ్చ|

చిత్త సంస్కారాన్ని కలిగించడమే కర్మలయొక్క ప్రయోజనం అని బ్రహ్మవిద్యా దీపికలో చెప్పబడింది. **"తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన, తపసాఽనాశకేన"** అనే బృహదారణ్య వచనంలో యజ్ఞ శబ్దంచే నిత్యకామ్య సాధారణమైన కర్మలు చెప్పబడుతున్నాయని, ప్రత్యేకమైన కోరికలతో చేసే 'కామ్యకర్మ' విధాయకాలైన "**స్వర్గకామో యజేత", "పశుకామో యజేత"** మొదలైన వాక్యాల్లో స్వర్గం, పశువులు(సంతానం) ఫల సాధనాలుగా యాగం విధించబడినా, ఆ యాగాలు అనుషంగికంగా (ప్రధాన ఫలాలతో బాటుగా) చిత్తశుద్ధి సంపాదకీయాలు కూడా అవుతాయని, నిత్యకర్మలు కేవలం చిత్తశుద్ధి సంపాదకాలని, ఆ యాగాలే వివిదిషాది రూపమగు (పరమాత్మను తెలుసుకోవాలనే ఇచ్ఛ అనే) ఫలానికి కారణాలని, ఒకే కర్మకు రెండు విధాలైన ఫలాలు సాధించే శక్తి ఉండడం సంయోగ పృథక్త్వ న్యాయంచే సంభవిస్తుందని కొంతమంది చెప్పడంతో కర్మలకు 'వివిదిష'ను కల్గించడం అనే అపర (అదృశ్య) ప్రయోజనం చెప్పబడింది. 'వివిదిష' అంటే ఆత్మతత్వాన్ని తెలుసు కోవడానికి ఇచ్ఛ అని, వేద సాధనాలయందు అభిరుచి అని అర్థం. (నాచే రచించబడిన **"నిత్య కామ్య కర్మ మీమాంసా"** అనే గ్రంథంలో ఈ విషయం సవిస్తరంగా విచారించబడింది).

"తమేతమితి" అనే వాక్యంలోని 'యజ్ఞ'శబ్దానికి నిత్య కర్మలు అని అర్థం చెప్పవచ్చునని, వాటికే **'ధర్మేణ పాప మపనుదతీతి'** వాక్యంచే పాపాపనోదనం (పాపాలను హరించడం) ఒక ఫలం, 'వివిదిష'ను జనింపచేయడం / కల్గించడం మరొక ఫలమని 'సంయోగ పృథక్త్వ న్యాయాన్ని చెప్పవచ్చని అనేక ప్రమాణాలు, న్యాయాలు చూపి నిర్ణయించడమైనది.

ఈ విధంగా రెండు ప్రయోజనాలను చేకూర్చే జ్ఞాన యోగ్యతను కలిగించిన తర్వాత-

సగురుమేవాభిగచ్ఛేత్సమిత్పాణి శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ఆత్మావాఽరేద్రష్టవ్య శ్శ్రోతవ్యోమంత వ్యోనిధి ధ్యాసితవ్యః|

మొదలైన శ్రుతులు బోధించిన ప్రకారం సద్గురు సన్నిధి చేరువాడు వేదాంత వాక్య శ్రవణ, మననాది సాధన సామగ్రి అంతా సమకూరితే పర్యవసానంగా జ్ఞానం కలిగించేది కర్మ అని చెప్పవచ్చును. **"శ్రవణ మననాది సాధన సామాగ్రీ సంపత్తౌ జ్ఞానే ఉపకరోతి వ్యవస్థా"** అని వేద, వేదాంత వాక్యాలను వినడం, మననం చేయడం వంటి సాధన సామాగ్రిచేత జ్ఞానమనే సంపత్తి లభిస్తుందని శాస్త్రకారులు వ్యవస్థ చేశారు. ఈ విధంగా పరంపరగా కర్మకాండ, సాక్షాత్తుగా జ్ఞానకాండ బ్రహ్మ స్వరూపాన్ని బోధించడమందే తాత్పర్యం కలవి కావున వేదాలు భగవత్స్వరూపాలని చెప్పబడుతున్నాయి.

మరియు **"అనాది నిధనం బ్రహ్మ శబ్దతత్వం యదక్షరం....."** మొదలైన వచనాలన్నీ వేదాలు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరాత్మకాలుగా చెప్తున్నాయి. ఇంకా-

నూతన శివాలయాదికం కృత్వా తత్ర లింగప్రతిష్ఠాపనావసరే, ప్రత్యాహం పార్థివలింగ ప్రతిష్ఠానాపరే లింగప్రతిష్ఠానాపరే చ వినియుక్తాః జపమాత్రేణ పాపక్షయార్థాశ్చ పార్వతీపతి నమస్కారార్థామన్త్రాః ఉచ్యన్తే సర్వలిఙ్గగ్ స్థాపయతి పాణిమంత్రం పవిత్రం ఇతి చ లింగాత్|

అనే వాక్యాలవల్ల వేద వాక్యాలే ఈశ్వరుని అవయవాలైనందున వేదం ఈశ్వర స్వరూపం అని తెలుస్తుంది.

నమో హిరణ్యవర్ణాయ హిరణ్యం తద్వత్ పూర్వ సుకృతం వినా దుర్లభా వర్ణాః వేదాక్షరాణి యస్మాదుత్పద్యన్తే అభివ్యజ్యంతే స హిరణ్యవర్ణః|

మొదలైన మంత్రాలు- పూర్వ జన్మ సుకృతం లేనిదే, పూర్వ పుణ్యం లేనిదే పొందడానికి దుర్లభమైన వేదాక్షరాలకు నిలయ స్వరూపుడుగా పార్వతీపతిని కీర్తించడంతో వేదమే శివ స్వరూపమని చెప్పినట్లయింది.

అలాగే సావిత్ర కాఠకచయన ప్రకరణంలోని **'ఋచే అక్షరే పరమే వ్యోమన్'** అనే దానిలో "ఋ" అనే అక్షరంలో సర్వ వేద మంత్రాలు ఆశ్రయించి ఉన్నాయని, దానిని ఉత్పన్నం చేయడం, దాని పర్యవసానాన్ని ప్రతిపాదించడం అనే రెండు లక్షణాలు చెప్పబడ్డాయి.

"తస్మాద్యజ్ఞాత్సర్వహుతః" అనే దానిలో 'సర్వ వేదాలు' అని చెప్పడంవల్ల రెండు రకాలుగానూ వేదం యొక్క భగవత్స్వరూపం చెప్పబడింది.

ఈ ప్రకారం అపౌరుషేయాలు, స్వతః ప్రమాణాలు, అనంతాలై, ద్వాపర-కలియుగ సంధి కాలంలో వేదవ్యాస మహర్షిచే పరిమితాలైన శాఖలుగా విభజించబడి, కర్మకాండ, జ్ఞానకాండలుగా ఉన్నటువంటి వేదాలు సాక్షాత్ భగవత్ స్వరూపాలని వర్ణించబడ్డాయి.

1 వ ప్రకరణం సమాప్తం

2వ ప్రకరణం

వేద మహిమ – ధర్మ లక్షణం

వేదాలు అర్థతః మహిమోపేతాలు

వేదాలు ఏ విధంగా శబ్దతః (శబ్దరూపంగా) మహిమోపేతాలో ఇంతవరకు వివరింపబడింది. కానీ వేదాలు అర్థతః (అర్థంచేత) కూడా మహిమోపేతాలు అని పేర్కొనబడ్డాయి.ఆ విషయం ఈ ప్రకరణంలో వర్ణించబడుతోంది. ప్రమాణాంతరాలకు గోచరించని ధర్మ-బ్రహ్మములను ప్రతిపాదించేవి అవడంవల్ల మహిమోపేతాలని, పూర్వకాండలో కర్మ స్వరూపమైన ధర్మం, ఉత్తరకాండలో వేదాంతాలైన ఉపనిషత్తులచే ఆత్మతత్త్వం నిరూపింపబడుతోంది. ఆ ఆత్మతత్త్వం ధర్మాన్ని అచరించనిదే లభ్యం కాదు కనుక ముందుగా ధర్మాన్ని గురించి తెలుసుకుని నిరూపించవలసింది.

ఏది ధర్మం?

ధర్మాన్ని పలువురు పలు రకాలుగా నిర్వచిస్తున్నారు. **"నహి సత్యాత్పరోధర్మం"** సత్యం కంటే ధర్మం లేదు, సత్యమే ధర్మం అని కొందరు; **"అయమేవ హి పరమోధర్మం యద్యోగేనాత్మ దర్శనం"** అని యోగసాధనచే ఆత్మసాక్షాత్కారం చేసుకోవడమే ధర్మం అని భాగవతులు; అంతకరణవృత్తియే ధర్మమని సాంఖ్యులు అన్నారు. అదే విధంగా చిత్తంయొక్క వాసనా విశేషం ధర్మమని బౌద్ధులు, ఆత్మగుణ విశేషం ధర్మమని తార్కికులు, అపూర్వం (అదృష్టం) ధర్మమని ప్రాభాకరులు ఇలా పలువురు పలు విధాలుగా ధర్మ నిర్వచనం చేస్తున్నారు.

ధర్మలక్షణం

భట్ట మీమాంసకులు **"చోదనా లక్షణోఽర్థో ధర్మః"** అని, వేదంచే ప్రతిపాదింపబడి శ్రేయస్సాధన మైనటువంటి ఉపాయాలను ధర్మం అన్నారు. ఇక్కడ ఉదహరించిన చోదనా సూత్రాన్ని రెండు విధాలుగా వ్యాఖ్యానించారు. **"చోదనైవ ధర్మలక్షణం ప్రమాణం యస్య సః"** అంటే, ధర్మాన్ని తెలుసుకోవడానికి వేదమే ప్రమాణం, ప్రత్యాక్షాదులు ప్రమాణాలు కావు. ధర్మం వేదం చేతనే తెలుసుకోగలిగింది కానీ ప్రమాణానికి గోచరించేది కాదు అని ఒక విధంగా వ్యాఖ్యానించి **"చోదనా లక్షణమేవ ప్రమాణమేవ"** ప్రమాణమే అని వేదప్రామాణ్యాన్ని వర్ణించారు. అనగా అప్రామాణ్య కారణాలు లేనందువల్ల వేదాలు స్వతః ప్రమాణాలని ఇంతకు ముందు భాగంలో నిరూపించబడింది. ఈ ప్రకారం స్వతః ప్రమాణాలైన వేదాలచే ప్రతిపాదింపబడిన కర్మసముదాయాన్నే ధర్మం అన్నారు. శ్లోక వార్తికంలో శ్రీ కుమారిల భట్టపాదులు కూడా ఈ విధంగానే **"శ్రేయోహి పురుష ప్రీతిస్సాద్రవ్య గుణభిః...."** అని పేర్కొని వైదికమైన కర్మయే ధర్మమని నిరూపించారు.

విద్వద్భిః సేవితః సద్భిః నిత్యమద్వేషరాగిభిః హృదయేనాభ్యనుజ్ఞాతో యో ధర్మస్తం నిబోధత| (మ.స్మృ)

ధర్మాదులకు శ్రుత్యాదులే ప్రమాణం కనుక పైన చెప్పిన మనుస్మృతి కూడా "నిత్యం రాగద్వేషశూన్యులైన సత్పురుషులైన విద్వాంసులచే సేవింపబడింది. వారి మనస్సుకు సమ్మతమైనది; అనగా వేద సంస్కార సంస్కృతమైనవారి చిత్తం వేదాఽవిరుద్ధంగా (వేదం చెప్పినదానికి విరుద్ధం కాకుండా) ప్రవర్తించునని, వారు సమ్మతించినది ధర్మమని" పేర్కొంది.

గౌతముడు **"వేదోఽఖిలో ధర్మమూలం స్మృతిశీలేచ తద్విదాం"** అనే సూత్రంచే "సమస్త వేదం, తన్మూలక మైన స్మృతిసముదాయం, శ్రుతి-స్మృతి విదులయొక్క శీలం ధర్మానికి ప్రమాణమని" నిరూపించారు.

ధర్మం

న ధర్మాఽధర్మౌ చరత ఆవాం స్వ ఇతి న గంధర్వా న పితర ఇత్యాచక్షతే అయం ధర్మో అయమధర్మ ఇతి యంత్వార్యాః క్రియమాణం ప్రశంసంతి స ధర్మః యం విగర్హన్తి సోఽధర్మః| (ఆ.సూ.)

అని ఆపస్తంబ సూత్రం. ధర్మాఽధర్మాలనేవి ప్రత్యక్షంగా లోకంలో ఎక్కడా వేషం వేసుకుని తిరగడంలేదు. పోనీ దేవతలుగానీ, గంధర్వులుగానీ మన పితరులుగానీ కలలో కనిపించి చెప్పడం లేదు- "ఇది ధర్మం ఇది అధర్మం" అని. మనం ఏ కర్మను చేస్తే వేదశాస్త్రాభిజ్ఞులైన ఆర్యులైన వారు ప్రశంసిస్తారో ఆ కర్మ ధర్మమని, ఏ కర్మని వారు నిందిస్తారో అది అధర్మమని చెప్పారు. ఇతర ప్రమాణాలకు గోచరించేది కాదు, ఈ ధర్మమనే విషయం.

అలాగే శబరస్వామి కూడా "మీమాంసాదర్శనం"లో **"యోహి యాగమనుతిష్ఠతి తంధార్మిక ఇతి సమాచక్షతే లోకే"** అని "లోకంలో యాగాన్ని అనుష్ఠించే వానిని ధార్మికుడని వ్యవహరిస్తున్నారు" అని అన్నారు. కాబట్టి వేద విహితమైన (మనం అనుష్ఠించాలని వేదం చెప్పిన) కర్మ ధర్మమని, వేద గర్హితమైన (చెయ్యవద్దని వేదంచే చెప్పబడిన) కర్మ అధర్మమని తాత్పర్యం.

ఈ ధర్మం వైదిక వాఙ్మయమైన శ్రుతి స్మృత్యాదులకు మాత్రమే గోచరిస్తుందని ఎందుకు చెప్పాలి? అని కూడా శాస్త్రకారులే శంకించి, సమాధానం కూడా చెప్పారు.

ద్రవ్యక్రియాగుణాదీనాం ధర్మత్వం స్థాపయిష్యతే తేషామైంద్రియకత్వేఽపి న తాద్రూప్యేణ ధర్మతా|| శ్రేయ స్సాధన తాహ్యేషాం నిత్యం వేదాత్ప్రతీయతే| తాద్రూప్యేణ చ ధర్మత్వం తస్మాన్నేంద్రియ గోచరః| (మీ.శ్లో.వా.)

యజ్ఞానికి వినియోగించే దధి, ఆజ్యంగా ద్రవ్యాలకు, క్రియగా, ఆరుణ్యాది గుణంగా గోచరించే వాటికీ ధర్మత్వం చెప్పబడలేదు. వేదశాస్త్రాలచే చెప్పబడిన ఆ ద్రవ్యక్రియలతో కూడిన యజ్ఞం సాధించే ఫల సాధనత్వాన్ని సమకూర్చడం వల్లనే వాటికి ధర్మత్వం అని చెప్పబడింది. అందువల్ల ఆ ఫలంయొక్క ఆకారం ప్రత్యక్షాది ప్రమాణాలకు గోచరించేది కాదు. శ్రుతిస్మృత్యాది వైదిక వాఙ్మయంచే మాత్రమే గోచరించడం వాస్తవం. ఇంకా **"పుణ్యోవై పుణ్యేన కర్మణా, పాపః పాపేన"** అనే శ్రుతి, **"ఇష్టాపూర్తే స్మృతౌ ధర్మే"** అనే స్మృతి కూడా యజ్ఞాదుల్లోనే ధర్మ శబ్దాన్ని ప్రయోగిస్తున్నాయి. విశ్వామిత్ర స్మృతిచేత కూడా **"యాగదానాదికం ధర్మం"** అని "యాగం, దానం మొదలైనవి మాత్రమే ధర్మం" అని చెప్పబడుతోంది.

ఇంక, అపూర్వం (అదృష్టం) ధర్మమని అనకూడదా అనే సందేహానికి కూడా శాస్త్రకారులు సమాధానం చెప్పారు. ఆర్థరూపమైన పురుషార్థానికైనా, కామరూపమైన పురుషార్థానికైనా ఇటువంటి ధర్మమే సాధనం అని కూడా చెప్పారు. యౌవనవతి అయిన భార్య, గృహం, చందనాదులు అన్నీ ఉన్నా అనుభవించడానికి వీల్లేని స్థితిలో ఒకడుంటే ఏమనాలి? అంటే 'అదృష్టం లేదండీ' అంటారు. అంటే భోగరూపమనేది తన అధీనంలో లేదు. ఇటువంటి దృష్టమైన పురుషార్థమైన కామానికి కూడా కావలసిన అదృష్ట సహకారమే ధర్మమన్నారు.

ఇంక మోక్షరూపమైన పురుషార్థాన్ని సాధించడానికి ధర్మమే అత్యవసరం అని చెప్పనే అవసరం లేదు. ధర్మం లేనిదే మోక్షసాధన జరగనే జరగదు. ఈ ప్రకారం అర్థ, కామ, మోక్ష రూపమైన పురుషార్థాలకు మూలభూతంగా ఉండేది ధర్మమని, అలాంటి ధర్మాన్ని ప్రతిపాదించడమే వేదంలో పూర్వకాండలో ఉండే

ముఖ్యమైన విషయమని, ఉత్తరకాండలో ఉండే ముఖ్య విషయం బ్రహ్మ అని చెప్పుకున్నాం. భవిష్య పురాణంలో **"ధర్మశ్రేయస్సాముద్దిష్టం శ్రేయోఽభ్యుదయ లక్షణం"** అని "శ్రేయస్సును కల్గించే కర్మ ధర్మమని" చెప్పబడింది.

ధర్మం శనైస్సమంచినుయాద్వల్మీక మివ పుత్తికాః | పరలోక సహాయార్థం సర్వభూతాన్యపీడయన్ || ఏకః ప్రజాయతే జంతుః ఏకఏవ విలీయతే| మృతం శరీరముత్సృజ్య కాష్ఠలోష్ట సమం క్షితౌ|| విముఖా బాంధవాయాంతి ధర్మస్తమనుగచ్ఛతి| (భారతం)

అని భారతంలో చెప్పడంలో, "పరలోకానికి వెళ్ళేటప్పుడు జీవునితో ధర్మమే అనుసరిస్తుందని" చెప్పడం వల్ల ద్రవ్యక్రియాదులకు అనుగమింపడం జరగదు. అంతే కాదు, **"ధర్మం క్షరతి కీర్తనాత్"** అని కీర్తించడం వల్ల ధర్మం నశిస్తుందని చెప్పారు. అలా కీర్తనచేత నాశత్వం ద్రవ్యాదులకు సంభవించదు కనుక, అపూర్వమే (దృష్టము కానిదే) ధర్మమని చెప్పబడుతోంది.

నతు ధర్మోఽపసంహార మధర్మ ఫలసంహితమ్| తదేవ ఫలమన్వేతి ధర్మశ్చాఽధర్మనాశనః| (సుం.కాం.)

"జీవితంలో ధర్మాచరణమే ఉపసంహారంగా ఉండాలని, వచ్చిన పాపం ధర్మం ద్వారా నశిస్తుందని, శ్రుతి కూడా **"ధర్మేణ పాపమపనుదతి"** అని "ధర్మంవల్ల వచ్చిన పుణ్యవిశేషంచే అధర్మం ద్వారా వచ్చిన పాపం నశిస్తోందని" చెప్తోంది. ఇంతే కాదు **"అధర్మాత్తు మహత్పాతో భవిష్యతి హి సామ్ప్రతం"** అని "అధర్మం వల్ల వచ్చిన పాప విశేషంచేత గొప్ప ఉత్పాతాలు సంభవిస్తాయని" చెప్పబడింది.

దీనిపై ఇంకో సందేహం కలుగవచ్చును. "నశించినటువంటి కర్మ ఫలసాధనం ఎలా అవుతుంది?" అని! కర్మయే ధర్మమని చెప్తే, మనచే చెయ్యబడిన కర్మ వెంటనే నశిస్తోంది కదా, మరి నశించినటువంటి కర్మవల్ల పుణ్యంగాని స్వర్గాదులుగానీ ఎలా పుడతాయి అని మన సందేహాన్ని కూడా శాస్త్రకారులే వేసుకుని సమాధానం చెప్పారు. మనచేత చూడబడనటువంటి విహితమైన కర్మలవల్ల జనించిన పుణ్యానికీ, నిషిద్ధ కర్మలవల్ల జనించిన పాపానికీ కూడా అదృష్టమనే పేరు. దానివల్ల కలుగబోయే స్వర్గాది ఫలానికి కారణమైన విహితకర్మ అయితే పుణ్యమనే అదృష్టం జనిస్తుందని, నిషిద్ధ కర్మ అయితే పాప నామకమైన అదృష్టం జనిస్తుందని అన్నారు. ఆ పుణ్యాఽపుణ్య రూపమైన అపూర్వం ఎంతవరకు ఉంటుంది అన్నట్లయితే మనచేత ఆ కర్మఫలాన్ని అనుభవింపచేసే వరకు మన ఆత్మనిష్ఠమై ఉంటుందని శాస్త్రకారులు నిర్ణయించారు. దీనికి ఉదాహరణగా, లోకంలో ప్రమిదలోని నూనె నిలవ ఉండగా దీపాన్ని వెలిగించిన తర్వాత ఒక్కో బిందువుని వాడుకుంటూ ఆ తైలాన్ని ఏ ప్రకారంగా హరిస్తుందో, అలాగే ఆత్మనిష్ఠమైన పుణ్యాఽపుణ్యరూపమైన అపూర్వం (అదృష్టం) మనచే ఫలాన్ని అనుభవింపచేస్తూ తగ్గుతూ ఉంటుంది అని వివరించారు.

కర్మ నశించినా కర్మాచరణ సమయంలో కల్గిన అపూర్వం వెంటనే నశించదు. మనం కర్రలను కాల్చి మండించి నీటిని వేడి చేసి, ఆ కర్రలను, మంటను తీసివేసినా ఆ నీటి వేడిమి వెంటనే తగ్గదు. ఎక్కువ వేడి చేస్తే ఎక్కువ కాలం ఉండడానికి సరిపోయే వేడి పుడుతుంది. తక్కువగా కాస్తే తక్కువ కాలమే ఉండే వేడి పుడుతుంది. అదే విధంగా **"కర్మ భూయస్త్వే ఫలభూయస్త్వం"** అనే జైమిని సూత్రానుసారం మనచే అనుష్ఠించబడిన పుణ్యాఽపుణ్యకర్మల హెచ్చుతగ్గులను అనుసరించి పుణ్యాఽపుణ్యాలు కూడా ఎక్కువ, తక్కువ తేడాతో పుడతాయి. అవి మనచే ఫలాలను అనుభవింపజేస్తూ దీపం ప్రమిదలోని తైలం లాగ క్రమక్రమంగా నశిస్తాయి.

ఆ ఫలాన్ని అనుభవించే వరకు ఈ జీవుడు ఉంటాడా అంటే, "ఈ ఉపాధితో అనుభవించదగ్గ ఫలాన్ని అనుభవించి వేరొక ఉపాధితో అనుభవించదగిన ఫలాన్ని అనుభవించకుండా ఈ ఉపాధిని విడిచి పెట్టినా

జీవుడు నశించడు కనుక జన్మాంతరమందు ఆ ఫలాన్ని కూడా జీవునిచే అనుభవింపచేసే వరకూ ఆ పుణ్యాఽపుణ్యాలు నశించవు" అని శాస్త్రదీపికలో పార్థసారథి మిశ్రులే చెప్పారు.

విపాకః కర్మణాం యేషాం ప్రాగ్దేహ వినిపాతితః| ప్రాప్తస్తనీహ భుజ్యన్తే తతోఽన్యాని భవాన్తరే| (శా.దీ)

ఏ ఉపాధితో ఏ రకమైన ఫలాన్ని మనం అనుభవించవలసి ఉందో ఆ రకమైన ఉపాధి అంటే మానవజన్మో, పశుజన్మో సంభవిస్తుందని ఈ విధమైన తారతమ్యాలతో గూడిన పుణ్యాఽపుణ్యాలు ప్రారబ్ధ రూపంలోకి మారతాయని, "జ్ఞానికి" మాత్రమే అలా మారక పూర్వమే నశిస్తాయని **"జ్ఞానాగ్ని సర్వకర్మాణి భస్మసా త్కురుతేఽర్జున"** అనే గీతావచనం చెప్తోంది. కానీ ఆ జ్ఞానం అంత సులువుగా సంభవించేది కాదని గుర్తించి ఐహిక, ఆముష్మిక సాధనాలైన చిత్తశుద్ధి సంపాదనద్వారా ఉండడానికి, చిత్తశుద్ధికి అడ్డు తొలిగించే ధర్మాచరణ చేయడానికి, పాపఫలాన్ని అనుభవించకుండా ఉండడానికి, చిత్తశుద్ధికి అడ్డు కలిగించే పాప కర్మలను విడిచిపెట్టడానికి ముందుగా ధర్మమేది, అధర్మమేది అని నిర్ణయించడం చాలా అవసరం.

అయితే సాక్షాత్తు ఫలాన్ని సాధించడం అపూర్వమవుతుంది కానీ కర్మ కాదంటారేమో అని శంకించి, **"కాష్ఠైః పచతి"** (కర్రలు వండుతున్నాయి) అనే ప్రయోగంలో పాకసాధనాలు కర్రలయినా, వాటినుంచి వచ్చే జ్వాల అవాంతర వ్యాపారం అవుతున్నట్లుగా కర్మకు, ఫలానికి మధ్య అపూర్వం అనేది అవాంతర వ్యాపారమని సమాధానం చెప్పారు. అందువల్ల కర్మకు ఫలసాధనే ప్రయోజనమని, కర్మయే ధర్మమని నిర్ణయించేరు.

ధర్మం - సమాజం

ఇంతకు ముందు చెప్పినట్లు కాక, చాలామంది అనుకుంటున్నట్లుగా పరోపకారాలన్నీ ధర్మం, పరాపకారలన్నీ అధర్మం అవుతాయా అని విశ్లేషించి మార్గదర్శనం చెయ్యవలసిన అవసరం ఉంది.

ఇదం పుణ్యమిదం పాపమిత్యేతస్మిన్ పద ద్వయే| ఆచండాలం మనుష్యాణామల్పం శాస్త్ర ప్రయోజనం|

సమాజంలో ధర్మాన్ని గురించి పలువురు పలు విధాలుగా అర్థం చెప్పడం, వ్యాఖ్యానించడం జరుగుతోంది. పుణ్యపాపాలని రెండున్నాయని లోకంలో ఆబాల గోపాలం, చదువురాని వారికి కూడా తెలుసు కదా! ఇంక శాస్త్రానికి ప్రయోజనమేమిటి? అని వార్తికంలో శాస్త్రకారులు శంకించి, పుణ్యపాపాలు రెండున్నాయని అందరికీ తెలుసును కానీ, ఏ కర్మ చేస్తే పుణ్యం, ఏ కర్మ చేస్తే పాపం వస్తాయనే విషయం తెలీదు కదా! అది తెలుసుకోడానికి దానికోసం శాస్త్రం అవసరం అన్నారు. మరోపక్క **"పరోపకారః పుణ్యాయ, పాపాయ పరపీడనం"** అని వేదవ్యాస మహర్షి 'పరోపకారం పుణ్యమని, పరాపకారం పాపమని' అన్నారు కదా! అది నిజం కాదా? అంటే పరోపకారం, పరాపకారం అనేవి నిజమే కానీ, అవి వేద శాస్త్రాలకు విరుద్ధం కానివై ఉండాలని అని వివరించారు. అందుకే పరోపకారం, పరాపకారం అనే వాటి నిర్వచనం అవసరమన్నారు.

లోకంలో అందరూ అనుకున్నవిధంగా పరులకు సంతోషజనకమైనవన్నీ పరోపకారమని, పరులకు/ప్రజలకు దుఃఖజనకమైనవన్నీ పరాపకారమని చెప్తే, పరదారా గమనం మొ|| వాటివల్ల పరులకు సంతోషం కలిగేదయితే **"న పరదారాం గచ్ఛేత్"** అనే నిషేధం ఉన్నా అది పరోపకారం, తద్వారా ధర్మం అవవలసి వస్తుంది.

య ఏవమాహతస్యాపి గురుస్త్రీ గమనాదిభిః సురాపానాదిభిశ్చేతి విపక్షకైర్వ్యభిచారితా| (వార్తికం)

అలాగే, **"న సురాంపిబేత్"** అని నిషేధం ఉన్నా, సురాపానం పరులకి సంతోషం కానీ, దుఃఖం కానీ కలిగించదు కనుక అధర్మం కాకపోవలసి వస్తుంది.

"ఆసూర్య దర్శనాత్ ప్రాతః ఆతారకోదయాత్ సాయం సావిత్రీం జపేత్|"

తత్కాలజనితం దశభాశ్చ తేనాహోరాత్రకృతం సహస్రేణ వర్షజం కిల్బిషం గాయత్రీ హంతి| (గౌ.సూ)

అనే గౌతమసూత్రం ఉదయం సూర్యోదయం నుండి, సాయంత్రం నక్షత్రోదయం వరకు గాయత్రీజపం చెయ్యాలని, పదిసార్లు గాయత్రీ జపం చేస్తే ఆ కాలంలో జనించిన పాపం, నూరు సార్లు చేస్తే ఒక పగలు, రాత్రులందు చేసిన పాపం, వెయ్యిసార్లు చేస్తే ఒక సంవత్సరంలో చేసిన పాపం నశిస్తుందని చెప్పింది. కానీ ఈ జపం పరసంతోష జనకం గాని, పరదుఃఖం కానీ కాదు కనుక వేద విహితమైనా అది ధర్మం కాకపోవడం అనే ప్రమాదం సంభవిస్తుంది.

అలాగే ఇతరులకి దుఃఖం కలిగించేవన్నీ అధర్మం అంటే, రోగం తగ్గించడం కోసం రోగిచే పథ్యం చేయించి, కషాయం లాంటి చేదుమందు లిచ్చిన వైద్యుడు, పుండు తొలగించడానికి శస్త్రచికిత్స చేసిన వైద్యుడూ కూడా అధర్మం చేసిన వారు కావలసివస్తుంది.

అందువల్ల పరులకి సుఖాన్ని కలిగించేవన్నీ పుణ్యమూ కాదు, ధర్మమూ కాదు. పరులకు దుఃఖాన్ని కలిగించేవన్నీ పాపమూ కాదు, అధర్మమూ కాదు. హితాఽహితాలకి, ప్రియాఽప్రియాలకి తేడా ఉంది. ఏది కాలాంతరంలో శ్రేయస్సుని కలుగచేస్తుందో అది హితం. ఏది కాలాంతరంలో అశ్రేయస్సుని కలుగచేస్తుందో అది అహితం. తత్కాలంలో (తాత్కాలికంగా) సంతుష్టిని కలగచేసేది ప్రియం. తత్కాలంలో అసంతుష్టిని కలగచేసేది అప్రియం. వీటి మధ్య తేడా తెలుసుకోవడం అత్యంత అవసరం.

అందుకనే ఈ భేదాన్ని గ్రహించిన శాస్త్రకారులు అధ్యయన,విధి వాక్యవిచారణ సందర్భంలో ఇలా అన్నారు.

హితకారిభిరేవాసౌ జ్ఞాయమానంప్రవర్తకః| కర్తాఽవిజ్ఞాయమానోఽపి నైవ స్యాద ప్రయోజనకః| (మీ.న్యా.ర.మా)

"స్వాధ్యాయోఽధ్యేతవ్యః" అనే విధివాక్యంచే వేదాధ్యయనం చెయ్యడం ధర్మమని, వేద శాస్త్రాధ్యయనం చేసి వేదార్థజ్ఞానం సంపాదించాక ఒకనికి తెలిసింది. కానీ అప్పటికే అది తెలియకుండానే వేదాధ్యయనం చెయ్యడం జరిగింది. కానీ, అది తెలిశాక మళ్ళీ వేదాధ్యయనం చెయ్యాలని దీని అర్థమా? అని శంకించి సమాధానం చెప్పారు. తెలిసిన తర్వాత చేసిన వేదాధ్యయనానికే ఫలమైతే ఇప్పుడు ఇతను వేదార్థం తెలిసిన తర్వాత మళ్ళా గురువు వద్దకు వెళ్ళి చదువుకున్న వేదమే ఫలాన్ని ఇవ్వాలి కానీ, ఇదివరకే చదువుకున్న వేదం ఫలాన్ని ఇవ్వకపోవలసి వస్తుంది.

ఉపనయనం అయిన వటువుకి అధ్యయన ఆరంభకాలంలో విధివాక్యానికి అర్థం తెలియకపోయినా అతని తండ్రి గురువుల వద్ద తెలుసుకుని, వటువుయొక్క హితం కోరి చేయించిన వేదాధ్యయనం; రోగికి తెలియకపోయినా రోగ నిదానం తెలిసిన వైద్యుడు ఇచ్చిన మందుతో రోగి ఆరోగ్యానికి వైద్యశాస్త్రం కారణమైనట్లుగా ఉదాహరణ ఇచ్చేరు శాస్త్రకారులు.

అందువల్ల హితమైనదేది? ప్రియమైనదేది? అని మనకు బాగా తెలియాలంటే లోక సామాన్యంలో అనుకున్నట్లు పరోపకార, పరాఽపకారాలనే ధర్మాఽధర్మాలని నిర్ణయించడం తగదు. "వేద శాస్త్రాలకు విరుద్ధం కానటువంటి హితాఽహితాలను చేకూర్చే పరోపకార పరాఽపకారాలు పుణ్యపాపాలని వేదవ్యాస భగవానుని **'పరోపకారః పుణ్యాయ'** శ్లోకానికి అర్థం చెప్పాలి.

శాస్త్రం ఇంత వివరంగా చెప్పగా, "సమాజంలో చాలా మంది దేనిని అంగీకరిస్తారో అది ధర్మమని నిర్ణయించడం యుక్తమని, కాలానుగుణంగా ధర్మం మారాలని" ఆధునికుల్లో ఎక్కువమంది అనడం పరిపాటి అయింది. కానీ ధర్మమనేది సమాజంలో సామాజికులు నిర్ణయించవలసిన విషయం కాదు, అలా చెయ్యడం పద్ధతీ కాదు.

ఒకనికి 104 డిగ్రీల జ్వరం ఉండగా నూరుమందిలో ఒక్కడే వైద్యశాస్త్రం తెలిసి పథ్యం పెట్టడానికి అంగీకరించకపోయినా మిగిలినవారందరూ (99 మంది) అజ్ఞానులై పథ్యం పెట్టడానికి అంగీకరించారని పథ్యం పెడితే ఆ రోగి గతి ఏమవుతుందో, సమాజంలో ఎక్కువమంది అభిప్రాయంతో ధర్మాన్ని నిర్ణయించడం కూడా అలాగే అవుతుంది.

మరి ధర్మాన్ని కాలానుగుణ్యంగా మార్చాలి అనే వారి అభిప్రాయాన్ని కూడా పరిశీలించవలసి ఉంది. కానీ శాస్త్రాలచే ఒక విధంగా విధింపబడిన దానిని మన బుద్ధికి తోచినట్లు మరో విధంగా అనుష్ఠించడమా? లేక శాస్త్రాల్లో అనేక ప్రామాణిక వచనాలు కర్మానుష్ఠానం విషయంలో చెప్పిన భిన్నరీతుల్లో వాటి లాఘవ పక్షాన్ని మాత్రమే స్వీకరించి సంకోచింప చెయ్యడమా అని ప్రశ్నిస్తే, శాస్త్రాలలో విధింపబడిన దానిని మన బుద్ధికి తోచినట్లు కాలానుసారంగా ఆచరించడమే తగునని కొందరు ధీమంతులు అంటారు. కానీ ధర్మాఽధర్మ నిర్ణయం లౌకిక ఇంద్రియాలకి గోచరించదని, వైదిక శబ్దాలకు (వేదానికి) మాత్రమే సాధ్యమని ఇంతకు ముందే నిరూపించబడినందువల్ల, చక్షురింద్రియాదుల ప్రమాణ సహకారం లేనిదే నీలం, ఎరుపు వంటి రంగులనే బుద్ధి గ్రహించలేదని లోకంలో అందరికీ తెలిసిందే కనుక బుద్ధికి తోచినట్లు ధర్మాఽధర్మాలు నిర్ణయించడం అనే వాదం పొసగదు. వెలుతురు లేనిదే రూపజ్ఞానం కూడా తెలుసుకోలేమని, అటువంటి సాధనాలు లేకుండా కేవలం బుద్ధికి రూపజ్ఞానం కలగదని తెలుసు కనుక, ఇటువంటి చిన్న విషయాన్నే తెలుసుకోలేని మనకు ఇంక అతీంద్రియమైన ధర్మం కేవలం బుద్ధిచే గ్రహింపబడడం జరగదని వేరేగా చెప్పవలసిన పని లేదు.

ఈ విషయాన్ని మరింత వివరిస్తూ యజ్ఞదీక్షలో యజమాని పయోవ్రతాన్ని స్వీకరించేటప్పుడు వినియోగించే మంత్రాన్ని వివరిస్తున్నారు.

యేదేవా మనోజాతా మనోయుస్సుదక్షా దక్షపితారస్తేనం పాంతు తేనోనవంతు తేభ్యో నమస్తేభ్యస్స్వాహా|

"కళ్ళకు ఆదిత్యుడు, వాక్కుకి అగ్ని మొదలైనవారు అభిమాన దేవతలుగా ఛాందోగ్య శ్రుతులచే చెప్పబడుతున్న దేవతలు ఉత్పత్తి కాలంలో మనస్సుతో కలుస్తారు. అందుకే లోకంలో మనస్సు స్థిమితంగా లేనప్పుడు కళ్ళు చూసినదానిని చూసినట్లుగా, చెవులు విన్నదానిని విన్నట్లుగా చెప్పలేకపోవడం మనకు అనుభవమే.

అస్తిమిత మనస్కస్య కస్యాప్యగోచరత్వాత్| (సా.భా)

"ఆ యా విషయాలను గ్రహించడంలో 'గ్రహించే పాటవాన్ని' ఇచ్చి రక్షింతురు గాక" అని ఆ యజమాని ఈ మంత్రంద్వారా కోరుతున్నాడు. ఇందులో **పాంతు, అవంతు** అని చేసే పునరుక్తులు ఆదరంతో చేసే పునర్వచనమని వ్యాఖ్యానించారు.

ఈ శ్రుత్యర్థం లోకానికి కూడా సరిపోతుందని శ్రీ భట్టపాదులు శ్లోక వార్తికంలో వివరించారు.

యథా చ మనసస్సార్థం రూపాదౌ చక్షురాదినా ప్రవృత్తిస్సుఖదుఃఖాదౌ కేవలస్త్వేవ గమ్యతే| (శ్లో.వా)

ఎప్పుడు చక్షురింద్రియాలకు మనస్సుతో కూడా సంయోగం కలుగుతుందో అప్పుడే రూపాది విశేషాలను గ్రహించడం కుదురుతుందని, కేవలం బుద్ధికి గోచరించేవి సుఖదుఃఖాలు మాత్రమేనని, ఇంద్రియాల అవసరం లేకుండానే **"అహం సుఖీ అహం దుఃఖీ"** అనడం లోకంలో వాడుకలో ఉందని వివరించారు.

అదే తీరుగా శబ్ద ప్రమాణంచేత ధర్మాన్ని గోచరింప చేసుకోవడంలో బుద్ధియొక్క సహకారం అత్యంత అవసరం. శబ్దం లేకుండా బుద్ధికి గానీ, బుద్ధి లేకుండా కేవలం శబ్దంవల్ల గానీ ధర్మం గోచరించదు. అంటే, లౌకికమైన రూపాదుల గ్రహణంలోనే చక్షురాది ఇంద్రియాలకు వ్యవస్థ ఉండగా, అలౌకికమైన అతీంద్రీయమైన ధర్మానికి, ప్రమేయానికి అలౌకిక శబ్దరాశీభూతమైన వేదమనే శబ్దమే ప్రమాణం తప్ప మరొకటి ఏమి తెలియచేయగలదు? అంతే కాదు, లౌకికమైన శబ్ద సామాన్యమే ఇంద్రియాలకు గోచరించని భూత, భవిష్యద్వర్తమానాలను తెలియచేయ గలిగినప్పుడు అలౌకికమైన, శబ్ద రాశీభూతమై స్వతః ప్రమాణం అయిన వేదం ధర్మాన్ని తెలియచెయ్యడంలో సందేహించవలసిన అవసరం లేదు.

ఈ విషయాన్నే **"చోదనా హి భూతం, భవంతం, భవిష్యంతం సూక్ష్మం వ్యవహితం విప్రకృష్టం"** అని, "శాబర భాష్యంలో పేర్కొన్న వేద వాక్యాలచే విధింపబడింది ధర్మమని, నిషేధ వాక్యాలచే నిషేధించబడింది అధర్మమని" అంగీకరించడం తప్ప మరో గత్యంతరం లేదని శ్లోకవార్తికంలో ముందుగానే అనేక ప్రకారాలుగా ప్రదర్శించిన శ్రీ భట్టపాదులు తుదకు ఏమన్నారంటే-

విధిభ్యశ్చ విధేయానాం ధర్మత్వేన చ నిర్ణయం| నిషేధేభ్యో నిషేధ్యానామధర్మత్వేన చ నిర్ణయం|

విధివాక్యాలచే విధించబడిన సంధ్యావందన, అగ్నిహోత్రాది కర్మలు శ్రేయస్సాధన కలిగించే ధర్మంగానూ, నిషేధ వాక్యాలచే నిషేధింపబడ్డ సురాపానాదులు అనర్థ సాధనాలుగాను, అధర్మంగాను గుర్తించాలని నిర్ణయించారు. అందువల్ల సారాంశమేమనగా, కాలాన్ని అనుసరించి మన బుద్ధికి తోచినట్లు ధర్మ నిర్ణయం చేసి ఆచరించబడేది ధర్మం కాదు, వేదం చెప్పిందే ప్రమాణం.

యుగభేదంచే ధర్మవ్యవస్థ

అలా అయితే ధర్మం ఎప్పుడు ఒకే విధంగా ఉండాలి కదా! కానీ యుగభేదంచే ధర్మభేధం ఎలా చెప్పబడిందో చూద్దాం.

అన్యే కృతయుగే ధర్మం త్రేతాయాం ద్వాపరేయుగే అన్యే కలియుగే నృణాం యుగరూపానుసారతం|(మ.స్మృ.)

కృతయుగంలో ధర్మాలు వేరు, త్రేతాది యుగాల్లో ధర్మాలు వేరని చెప్తోంది. మరియు ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క మహర్షి ధర్మాలను ఉపదేశించినట్లు చెప్పబడింది.

కృతేతు మానవాం ధర్మాం త్రేతాయాం గౌతమాం స్మృతాం ద్వాపరే శంఖలిఖితాః కలౌపారాశరాః స్మృతాః|

కృతయుగంలో మనువు చెప్పిన ధర్మాలను త్రేతాయుగంలో గౌతముడు చెప్పినట్లుగాను ద్వాపర యుగంలో శంఖలిఖిత మహర్షులు చెప్పినట్లుగాను, కలియుగంలో పరాశరుడు చెప్పినట్లుగాను ఆచరించాలని మాత్రం స్మృతులందు చెప్పబడింది. అలాగే మనం కూడా ప్రస్తుత కాలాన్ని అనుసరించి ధర్మాలను మార్చాలంటారు కొంతమంది. కానీ ఆ మహర్షులు ఒకప్పుడు ధర్మమైనదాన్ని మరొకప్పుడు అధర్మమని చెప్పలేదు. దేశ కాలభేధాలను అనుసరించి "అకార్యాలు" (చేయకూడనివి) అని మాత్రమే చెప్పి వ్యవస్థ చేశారు. ఆధర్మం వేరు, అకార్యం వేరు. నిషేధ వాక్యాలచే **"తన్నకుర్యాత్"** అని "చేయకూడని వని, నిషేధింపబడినవని" అనేక రకాలుగా ఉన్నాయి.

1. **స్వరూపతః నిషేధం:** అనగా దేశకాలాలతో పనిలేకుండా సర్వకాల, సర్వదేశాలందు నిషేధింపబడినవి. **"బ్రాహ్మణో న హంతవ్యం", "న సురాంపిబేత్", "న పరదారాం గచ్ఛేత్", "న కలంజం భక్షయేత్", "న హింస్యాత్సర్వభూతాని"** మొదలైన వాక్యాలచే "బ్రాహ్మణహత్య చేయకూడదు", "సురాపానం చేయకూడదు", "పరదారా గమనం పనికిరాదు" ఇత్యాదులు ఎల్లప్పుడూ నిషేధాలే, అధర్మాలే.

2. **దేశకాలాదుల నాశ్రయించి నిషేధించబడినవి**: "యావజ్జీవం అగ్నిహోత్రం చెయ్యాలని" పురుషార్థంగా విధింపబడింది. ఇదే విధంగా **"బ్రాహ్మణాయ గాం దదాతి"** ఇత్యాది వాక్యాలచే ఆ యా దానాలు విధించ బడ్డాయి. మరో సందర్భంలో **"దీక్షితో న దదాతి, న జుహోతి"** అనే క్రతుప్రకరణ వాక్యంచే క్రతువులో అంతర్భాగంగా "దీక్షితులుగా వ్యవహరింపబడుతున్న యజమానుడు ఆ కాలంలో (క్రతు మధ్యకాలంలో) నిత్యం పురుషార్థంగా చెయ్యవలసిన అగ్నిహోత్ర, హోమ, దానాదులను చేయరాదని (అకార్యాలని) మాత్రమే నిషేధింపబడింది. కానీ ఇవి అధర్మాలని నిషేధింబడలేదు. అందువల్ల **"తత్కరణేన నానర్థః కింతు క్రతోర్వైగుణ్యం"** అని, అవి చెయ్యడం వల్ల అనర్థమేమీ కాదు కానీ, క్రతుమధ్యలో చేస్తే క్రతువుకి వైగుణ్యం (గుణ హీనత) వస్తుందని మాత్రం చెప్పబడింది. అలాగే పురుషార్థమైనా రాగతః ప్రాప్తమైన వాటిని కూడా క్రతుమధ్యలో నిషేధంగా చెప్పారు. తన భార్యతో కలవడం సాధారణంగా నిషిద్ధం కాదు కదా! కానీ ఇది రాగతః (ప్రీతివల్ల) ప్రాప్తమైనది కనుక క్రతుమధ్యలో **"న స్త్రియముపేయాత్"** అని క్రత్వర్థంగా నిషేధించ బడింది. ఇది కూడా నిషేధాన్ని అతిక్రమించినా అధర్మం కాదు కనుక ప్రత్యవాయం లేదు గానీ, క్రతువుకి వైగుణ్యం మాత్రం ఏర్పడుతుంది.

పురుషార్థంగా రాగతః ప్రాప్తమై శాస్త్రతః నిషేధింపబడిన దానికి మరో ఉదాహరణ-**"న కలంజం భక్షయేత్", "న సురాం పిబేత్"** అనేవి. రాగతః పురుషార్థమై ప్రాప్తమైన "మాంసభక్షణ" "సురాపానం" లను పురుషార్థంగానే నిషేధించింది. దీన్ని అతిక్రమిస్తే మాత్రం ప్రత్యవాయం కల్గుతుంది. అదే విధంగా భోజనం రాగతః ప్రాప్తమైనది. కానీ ఆ భోజనం సాయం, ప్రాతః కాలాలందు రెండు పర్యాయాలు మాత్రమే చేయాలని **"తస్మాద్ద్విరహ్నో మనుష్యేభ్య ఉపహ్రియతే ప్రాతశ్చ సాయంచ"**, **"సాయంప్రాతరేవ భోక్తవ్యం, నాంతరా భోజనం"** మొదలైన గౌతమ సూత్రాలు విధిస్తున్నాయి.

దీనివల్ల భోజనం అధర్మమని చెప్పడం లేదు. రాగతః ప్రాప్తమైన ఆ భోజనం నిర్ణీత సమయాన్ని దాటి చెయ్యరాదని మాత్రం చెప్పబడుతోంది. కాబట్టి అలా అతిక్రమించడం వల్ల అధర్మాచరణం వల్ల వచ్చే అనర్థం మాత్రం రాదు. ప్రత్యవాయం మాత్రం (అటువంటి అకాల బోజనం వల్ల వచ్చే అనారోగ్యం వంటిది) తటస్థించగలదు.

ఈ ప్రకారంగానే యుగభేదాన్ని అనుసరించి కొన్ని నిషేధాలు చెప్పబడ్డాయి.

దేవరాచ్చ సుతోత్పత్తిః సన్యాసం పలపైతృకం| అశ్వాలంభో గవాలంభః కలౌ పంచ విసర్జయేత్

అని మరుదులవల్ల సంతానోత్పత్తి, సన్యాసాశ్రమ స్వీకారం, మాంసంతో పితృకర్మలను ఆచరించడం, అశ్వాలంభం (అశ్వమేధం), గవాలంభం (గోమేధం) అనే అయిదు క్రతువులూ మునుపటి యుగాల్లో విహితమైనా కలియుగంలో మాత్రం నిషేధింపబడ్డాయి. దీనినిబట్టి యుగాంతరంలో ధర్మమైన ఇవన్నీ ఈ యుగంలో అధర్మంగా మారినట్లు కాదు. అప్పుడు శాస్త్ర విహితాలై చేయదగినవే అయినా ఇప్పుడు ఈ కలియుగంలో యుగభేదాన్ననుసరించి అకార్యాలు అని మాత్రం పై వచనాలవల్ల తెలుస్తోంది. దీనివల్ల తేలిన సారాంశమేమంటే, చేయదగినవిగా, శాస్త్రవిహిత ధర్మాలుగా పూర్వ యుగాల్లో పరిగణింపబడిన వాటిని యుగాంతరంలో శాస్త్రకారులు అధర్మాలని చెప్పినట్లు కాదు. 'అకార్యాలు' అని మాత్రమే చెప్పినట్లయింది.

కానీ, "ఒకప్పుడు ఆచరించదగిన ధర్మాలు మరొకప్పుడు అకార్యాలు అవుతాయా?", "ఒకే రకమైన క్రియకు ఒకే రకమైన పదార్థానికి సర్వదా ఒకే రకమైన స్వభావం ఉండటం సహజం కదా", "లోకంలో పంచదార వంటివి ఎల్లప్పుడూ మధురంగానే ఉండడం చూస్తున్నాం కదా, ఇందులో మార్పులేమిటి" అని కొందరు శంకిస్తారు.

అవస్థా భేదంచేత, అధికార భేదంచేత, దేశకాల భేదంచేత స్వభావం మారుతూ ఉంటుంది అని దీనికి సమాధానం చెప్పారు. **"స్వస్థాతురాణాం భోజనక్రియేవ"** అని "ఆరోగ్యంగా ఉన్నవారు భోజనం చేయ వలసిందే" అని భట్టపాదులు చెప్పిన దాంట్లో భోజనం చెయ్యడం అనే ఒక్క క్రియయే అవస్థాభేదం వల్ల ఆరోగ్యంగా ఉన్నప్పుడు దేహపుష్టిని, అనారోగ్య స్థితిలో ఉన్నప్పుడు మృత్యువుని ఇస్తోందని ఒక సందర్భంలో ఉదహరించారు. అలాగే **"న హింస్యాదితి"** వాక్యంచే ఏ ప్రాణినీ హింసించకూడదని నిషేధించినా **"అగ్నిష్టోమీయం పశుమాలభేత"** అనే వాక్యంచే విధింపబడిన అగ్నిష్టోమమనే క్రతువులో చేసే పశు హింసను కూడా మామూలు పశుహింసతో సమానంగా చూసి, క్రతువు చేసినవారికి కూడా మామూలు పశుహింసతో సమానమైన ప్రత్యవాయం తటస్థిస్తుందని శంకించిన వారికి భట్టపాదుల సమాధానం ఇలా ఉంది.

ఏవం యే నిపుణం ప్రాహుః తైరప్యేతత్పరీక్ష్యతామ్| సురాపానాదిభిశ్శూద్రం కిం యాతి నరకం క్రతైః| (భ.వా)

అనే వాక్యంతో బ్రాహ్మణులకి మాత్రమే మూడు విధాలైన సుర నిషేధింపబడింది. **"గౌడీ పైష్టీ చ, మాధ్వీ చ విజ్ఞేయా త్రివిధాసురా! యధైవై కథా సర్వానపేయా బ్రహ్మవాదిభిః"** అని చెప్పబడింది. శూద్రులకు నిషేధం లేదు. కాబట్టి శూద్రులు చేసిన సురాపానానికి నరకం పొందడం అనే స్థితి రాదని (నరకం పొందడని) చెప్పవలసి వస్తుందన్నారు. అంటే ఒకే సురాపాన క్రియ అధికార భేదంచే బ్రాహ్మణులకు ప్రత్యవాయ జనకం అయింది. శూద్రులకు ప్రత్యవాయ జనకం కాలేదు. అలాగే, నిషేధింపబడిన హింసకు వచ్చే ప్రత్యవాయం అగ్నిష్టోమాది క్రతువుల్లో చేసే పశుహింసకు రాదని ఆపత్తి (తర్కాన్ని) చూపించారు. ఇంక దేశ భేదానికి ఉదాహరణ చూద్దాం.

మరువాసిత్వతి సాత్మ్యం దధి పీలు శమీకరాణామ్ ఘృతదుగ్ధం హేమంతే మందాగ్ని కఫోత్తరం భవేత్ప్రాయః|

అన్న ఆయుర్వేదం వచనం ప్రకారం పెరుగు, వరగోగు (గున్నంగి అనే వన మూలిక), వెదురు మొలకలు సాధారణంగా అనారోగ్యకరాలైనా అడవిలోని వారికి ఆరోగ్యాన్నిస్తాయి, నగరవాసులకు ఇబ్బందిని కలిగిస్తాయి. పదార్థం ఒకటే అయినా దేశభేదంచేత నగరాది వాసులకు అస్వీకార్యాలు (తీసుకోకూడనివి) అయ్యాయంటే వాటి స్వభావం మారింది. నెయ్యి, పాలు అగ్నిదీప్తిని కలిగించేవైనా హేమంత రుతువులో సాధారణంగా అగ్నిమాంద్యాన్ని, శ్లేష్మాన్ని వృద్ధి చేస్తాయి. ఇది మనకు అనుభవమే కదా! అంటే కాల భేదంచేత అస్వీకార్యాలు అయ్యాయి.

ఈ ప్రకారం పైన చెప్పినవన్నీ అవస్థా భేదంచేత, అధికార భేదంచేత, దేశకాల భేదంచేత అకార్యాలయ్యాయి. ఇదే విధంగా యుగాంతరంలో విధింపబడిన ధర్మాలు వాస్తవానికి ధర్మాలే అయినా ఈ యుగంలో దేశ, కాల, ప్రకరణ భేదంతో అకార్యాలయ్యాయి. ఇందులో క్రియ, వస్తువులు ఒకటే అయినా స్వభావం మారుతూ ఉంటుందని గ్రహించాలి. అధర్మాచరణ వల్ల సంభవించే ఫలం వేరు, ఔపాధిక దేశ కాలాదులను ఆశ్రయించి చెప్పిన అకార్యకారణాల ఫలం వేరు. మనువు, గౌతముడు వారికి తోచిన ధర్మాలను ఉపదేశించ లేదు. పరాశరాదులు వారికి తోచిన విధంగా ధర్మాలని మార్చలేదు. నాలుగు యుగాల్లో సాధారణంగా చెప్పబడిన ధర్మాల్లో లాఘవ సామర్థ్యాలను విమర్శించి దేశ, కాల, అవస్థా విశేషాలను ఆలోచించి ఆ యా యుగాల్లో జనించబోయే ప్రజల శక్తి సామర్థ్యాలను గ్రహించి వేదంలో

చెప్పబడిన ఆ ధర్మాలనే యుగభేదంచే వ్యవస్థ చేశారు. మహర్షులు త్రికాలజ్ఞులు కనుక ఆ ప్రకారం వ్యవస్థ చేయగలిగారు.

మరి వారు వ్యవస్థ చేసినట్లే ప్రస్తుత కాలానుసారం మనం కూడా మరో వ్యవస్థ చెయ్యవచ్చు కదా అంటారేమోనని శంకించి, ఆ ధర్మవ్యవస్థాధికారం త్రికాలజ్ఞానం లేనిదే సంభవించదు కనుక, రేపటి రోజున ఏమవుతుందో కూడా తెలుసుకోలేని మనకు అటువంటి త్రికాలజ్ఞానం లేదు కనుక, మన ఇష్టం వచ్చినట్లు ధర్మాఽధర్మ వ్యవస్థ చేసే అధికారం కూడా మనకు లేదని సమాధానం చెప్పారు.

వేదంలో ఏ మహర్షుల పేర్లు వినబడుతున్నాయో ఆ మహర్షుల వచనాలు మాత్రమే ప్రమాణాలని గుర్తించాలని మీమాంసా తంత్రవార్తికంలో చెప్పబడింది.

వేదేనైవాభ్యనుజ్ఞాతా యేషామేవ ప్రవక్తృతా| తేషాం విపరి వర్తేషు కుర్వతాం ధర్మ సంహితాః| వచనాని ప్రమాణాని నాన్యేషామితి నిశ్చయః|

వేదంలోని "**యద్వైకించ మనురవదత్ తద్భేషజం**" అనే వాక్యం మనువు చెప్పిన దానినే భేషజం (ఔషధం) వలే స్వీకరింపదగినది అని బోధిస్తోంది. అలాగే పరాశర స్మృతికి ప్రామాణ్యం ఉందా? దానికి వ్యాఖ్యాన యోగ్యత ఉందా అని శంకించి పరాశర మాధవీయం ఉపోద్ఘాత గ్రంథంలో స్మృతులకు శాక్త్యాది గ్రంథ సారూప్యాన్ని నిరాకరించి, స్మృతుల ప్రమాణాలని నిరూపించారు.

అత్రచార్వాక వాక్యాని బౌద్ధాని పఠితాని తు| విప్రలంభక వాక్యాని తాని సర్వాణి వర్జయేత్

చార్వాక వాక్యాలు, బౌద్ధ వాక్యాలు, విప్రలంభక (వంచకుని) వాక్యాలు వదిలి పెట్టాలని చెప్పారు.

"శ్రుతౌ పరాశర పుత్రత్వముపజీవ్య వ్యాసప్రోక్తస్య"

"ఋషయోవా ఇంద్రం ప్రత్యక్షం నాపశ్యన్తం వశిష్ఠః ప్రత్యక్షమపశ్యత్"

"అత్రి రదాదౌర్వా య ప్రజాం పుత్రకామాయ"

"అథహ యాజ్ఞవల్క్యస్య ద్వే భార్యే బభూవతుః"

మొదలైన శ్రుతి వాక్యాలలో వ్యాసాది నామాలు వినబడుతున్నాయి. కనుక వారి వాక్యాలకు ప్రాముఖ్యం అంగీకరించబడింది. కావున వ్యాఖ్యానించే యోగ్యత కూడా ఉందని నిర్ణయించారు. అంటే దీని అభిప్రాయం మనువు మొదలైన వారియందు పక్షపాతం గాదు. ఈ స్మృతికర్తలంతా వారి తపోబలంచే మొత్తం వేదరాశిలో గల అతీంద్రియాలైన ధర్మాలను ఆకళింపు జేసుకుని చేసిన వ్యవస్థ ఇది. ఆ యా యుగాల్లో జన్మించే ప్రజలు వాటిని సమగ్రంగా అధ్యయనం చేసి వాటిలోని అర్థవిశేషాలను గ్రహించి ఆ పైన వాటిని వ్యవస్థ చేయలేరనే అభిప్రాయంతో స్మృతులను, వేదాలను విభాగం చేసిన వేదవ్యాసులే, వేద ధర్మాలను బోధించడానికి సుహృత్ సమ్మితాలైన పురాణ వాఙ్మయాన్ని సృష్టించి మనకు అందచేశారు.

వారు అంతటి విషయాన్ని గ్రహించగల్గిన మహర్షులు అయినా, ధర్మవ్యవస్థ చేయడానికి సమర్థులైనా పురుషులుగా జన్మించడంవల్ల సహజ సిద్ధమైన భ్రమ, ప్రమాదాది దోషాలు సంభవించడానికి అవకాశం ఉందని ఆలోచించి, అటువంటివారు చెప్పినందువల్ల వారిచే చెప్పబడిన పురాణ, స్మృత్యాదులకు ప్రమాణం, ప్రామాణ్యం అని అనకుండా వేదమూలకంగా ప్రామాణ్యమని ప్రకటించేరు. మీమాంసాశాస్త్రం స్మృతిపాదంలోని **"ధర్మస్య శబ్దమూలత్వాదశబ్దమనపేక్ష్యం స్యాత్"** (జై.సూ.) ఈ జైమిని సూత్రాన్ని వ్యాఖ్యానించే స్మృత్యధికరణంలో "ధర్మం వేదమూలకం" కనుక వేదంచే ప్రతిపాదించబడకుండా వేరొక గ్రంథంచే ప్రతిపాదింపబడింది అప్రామాణ్యమని చెప్పేరు. ఇందులో 'శబ్దం' అనే పదం వేదాన్ని సూచిస్తోంది.

స్మృత్యాదులకు కూడా ఆ వేదమే మూలం కనుక వాటిని కూడా 'సూత్ర' శబ్దంచే గ్రహించి, అటువంటి స్మృత్యాదులచే ప్రతిపాదింపబడిన ధర్మాలకు కూడా ప్రామాణ్యాన్ని అంగీకరించేరు. అంటే స్మృతికర్తలకు ధర్మనిర్ణయం చేయడంలో స్వాతంత్ర్యాన్ని అంగీకరించక, వేదాల్లో ఉన్నదానినే వారు చెప్పడంవల్ల వాటికి (స్మృతులకి) ప్రామాణ్యాన్ని అంగీకరించారు. అంటే, స్మృతి కర్తలకి ధర్మనిర్ణయంలో స్వాతంత్ర్యాన్ని అంగీకరించకుండా వేదాల్లో ఉన్నదానినే చెప్పడంవల్ల వాటికి (స్మృతులకి) ప్రామాణ్యాన్ని అంగీకరించారు.

అందుకే వేదవిరుద్ధమైన విషయాలు ఎక్కడైనా స్మృతుల్లో ప్రతిపాదింపబడినప్పుడు ఆ స్మృతులకు మూలమైన శ్రుతి దొరికేవరకూ స్మృతికి 'సామాన్యమైన' ప్రామాణ్యాన్ని అంగీకరించినా కూడా, అనుష్ఠాన రూపమైన అప్రామాణ్యాన్ని (అనుష్ఠానానికి ప్రమాణం కాదని) అంగీకరించాలని పక్షపాతం లేకుండా నిర్ణయించారు.

యావదేకం శ్రుతౌకర్మా స్మృతౌ చావత్ప్రతీయతే| తావత్తయోర్విరుద్ధత్వే శ్రౌతానుష్ఠాన మిష్యతే|

ఇదే విధంగా **"అహరహస్సంధ్యాముపాసీత", "యావజ్జీవం అగ్నిహోత్రం జుహోతి"** మొదలైన శ్రుతులు "రోజు సంధ్యావందనం చెయ్యాలి", "యావజ్జీవం అగ్నిహోత్రం చెయ్యాలి" అని చెప్పినా **"సూతకే కర్మాణాం త్యాగః సంధ్యాదీనాం విధీయతే"** అనే స్మృతులు కూడా జాతాద్యాశౌచాలందు (పురుడు పుణ్యాలందు, అశౌచాలందు) సంధ్యావందనాదులు చేయకూడదని చెప్తున్నాయి.

శ్రుతి సామాన్య శాస్త్రం, స్మృతి విశేష శాస్త్రం అయినప్పుడు మాత్రం **"సామాన్య విశేష శాస్త్రయోః విశేషస్యైవ ప్రాబల్యం"** అనే న్యాయంచే విశేషశాస్త్రం అయిన స్మృతి చెప్పిన ప్రకారమే ఆచరించాలని చెప్పారు. ఈ ప్రకారం అనేక విషయాలను పరస్పర విరోధం లేకుండా అనేక కోణాల్లోంచి విచారించి శాస్త్రకర్తలు నిర్ణయించారు. వీటిలో శ్రుతులద్వారా స్మృతికర్తలయందు ఆదరం చూపించారు.

ఇదే నిర్ణయం మరో యజ్ఞప్రకరణంలో కూడా కనిపిస్తుంది. **"ఔదుంబరీం స్పృష్ట్వా ఉద్గాయేత్"** అనే సూత్రం యజ్ఞంలో 'ఉద్గాత' అనే ఋత్విక్కు సామగానం చేసేటప్పుడు ఔదుంబరిని స్పృశిస్తూ ఉద్గానం (హెచ్చు గొంతుకతో మంత్రాలతో పిలవడం) చెయ్యాలని శ్రుతి చెప్తోంది. కానీ ఔదుంబరిని సర్వావేష్టన (మొత్తమంతా వస్త్రంచే ఆచ్ఛాదన) చెయ్యాలని స్మృతి చెప్తోంది. ఇక్కడ శ్రుతి ప్రాబల్యంచే శ్రుతి చెప్పినట్లు స్పృశించడమే యుక్తమని, ఔదుంబరిని సర్వావేష్టన చేయాలనే స్మృతిని వేదమూలకంగా ప్రమాణమని అంగీకరించినా దానికి మూలభూతమైన శ్రుతి మనకు దొరికే వరకూ స్మృతికి అననుష్ఠాపకత్వ రూప అప్రామాణ్యతను (అనుష్ఠకు ప్రమాణం కాదని) అంగీకరించి స్మృతి చెప్పిన ప్రకారం అనుష్ఠానం చేయకూడదని, శ్రుతి చెప్పినట్లే చేయాలన్నారు.

మనం ధర్మాన్ని మార్పు చేస్తే ధర్మాన్ని అధర్మంగాను, అధర్మాన్ని ధర్మంగాను మార్పుచేసి ధర్మ పరివర్తనం చేసినవాళ్ళ మవుతాం. అందుచేత శ్రుతికి, స్మృతికి అవిరుద్ధంగా ధర్మాలను వ్యవస్థ చేయడం మాత్రమే మహర్షులు చేశారు. దానిని కూడా వేదాల్లో పేర్కొనబడిన మహర్షులు మాత్రమే అతీంద్రియ ద్రష్టలైనందువల్ల రాబోయే యుగాల్లో జన్మించబోయే ప్రజల శక్తిసామర్థ్యాలను అనుసరించి ధర్మభేదాలను యుగభేదాలకు అనుగుణంగా వ్యవస్థను మాత్రమే చేశారు.

సర్వ స్మృతులకు వేదమూలకత్వాన్ని, ప్రామాణ్యాన్ని అంగీకరించినప్పుడు ఎందుకోసం కలియుగంలో పరాశర స్మృతికి ఆదరణీయత, మన్వాది స్మృతులందు అనాదరం అని శంకించి 'పరాశర మాధవీయం'లో సమాధానం చెప్పారు. పరాశర స్మృతి కలియుగంలో ప్రజల కొరకు ప్రవృత్తమైనందువల్ల (నిర్దేశించబడినందు వల్ల) అన్నారు.

అన్యే కృతయుగే ధర్మాః త్రేతాయాం ద్వాపరే యుకే| అన్యే కలియుగే నృణాం యుగరూపను సారతః|

కృతయుగానికి సంబంధించిన ధర్మాలు వేరు, త్రేతాయుగానికి సంబంధించిన ధర్మాలు వేరు, ద్వాపరయుగానికి సంబంధించిన ధర్మాలు వేరు, కలియుగానికి సంబంధించిన ధర్మాలు వేరు అని చెప్పబడింది. యుగభేదంచే ధర్మాలు భిన్నాలు అని చెప్పడంవల్ల ధర్మ స్వరూపం వేరు అని కాదు, అనుష్ఠాన ప్రకారభేదం మాత్రమేనని చెప్పబడింది. అలా కాకపోతే స్మృతులకి మూలమైన శ్రుతులు కూడా భిన్నంగా ఉండవలసి వస్తుంది. అవి అలా లేవు. అందుకే ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క ఋషి చెప్పినట్లు ఆచరించాలన్నారు.

కృతేతు మానవాః ధర్మాః త్రేతాయాం గౌతమాః స్మృతాః ద్వాపరే శంఖలిఖితాం కలౌపారాశర స్మృతాః

ఈ చెప్పబడిన అనుష్ఠాన ప్రకారభేదం కూడా కృతయుగంలో మనువు చెప్పినట్లు, త్రేతాయుగంలో గౌతములు చెప్పినట్లు, ద్వాపరంలో శంఖలిఖిత మహర్షులు చెప్పినట్లు, కలియుగంలో పరాశర స్మృతిలో పరాశరులు చెప్పినట్లు అనుష్ఠించండి అని మాత్రం చెప్పారు.

అలా ఒక్కో యుగంలో ఒక్కో విధంగా అనుష్ఠించాలని ఎందువల్ల అన్నారు అంటే, మన్వాది ధర్మాలు చతుర్యుగ సాధారణమై గ్రంథ బాహుళ్యం కలవగుటచేత, రాను రాను యుగభేదంచే ప్రజలు శక్తి హీనులవుతారని ఆ యా స్మృతి కర్తలు యుగభేదంచే చేసిన వ్యవస్థ ప్రకారం అనుష్ఠించాలన్నారు.

అధర్మప్రాపకం స్థాన విశేషం హేయతయా విభజ్యతే యథా-

త్యజేద్దేశం క్రుతయుగే త్రేతాయాం గ్రామముత్సజేత్ ద్వాపరే కులమేకం తు కర్తారం తు కలౌయుగే

అనే ప్రసంగంలో, పతితుడైన పురుషుడుండే సందర్భంలో అతడుండే దేశం మొత్తాన్ని విడిచి పెట్టాలని కృతయుగంలో మనువు చెప్పినా, త్రేతాయుగంలో అయితే ఆ పతితుడు నివసించిన గ్రామాన్ని విడిచిపెట్టాలని, ద్వాపర యుగంలో అయితే ఆ కులాన్ని విడిచి పెట్టాలని ఆ యా ఋషులు చెప్పగా కలియుగంలో మాత్రం అధర్మాన్నాచరించిన ఆ కర్తను విడిస్తే చాలునని 'పరాశర మాధవీయం' లో వ్యవస్థ చేశారు.

ఇలాగే ధర్మానుష్ఠాన ప్రకార భేదానికి కూడా ఒకటి, రెండు ఉదాహరణలు ఇచ్చారు. ఆ యా కర్మల్లో పాపాపనోదనానికి (పాప పరిహారానికి) ఆచరించాల్సిన కూష్మాండ దీక్షలు, గణదీక్షల గురించి వేదంలో ఇలా చెప్పబడింది.

యావదేనో దీక్షాముపైతి ఏతైస్సతతి జహోతి సంవత్సరం దీక్షితో భవతి| సంవత్సరాదేవాత్మానం పునీతే మాసం దీక్షితో భవతి| యో మాసస్సంవత్సరః సంవత్సరాదేవాత్మానం పునీతే ద్వాదశ రాత్రీర్దీక్షితో భవతి| ద్వాదశమాసాస్సంవత్సరః సంవత్సరాదేవాత్మానం పునీతే షడ్రాత్రీర్దీక్షితో భవతి| షడ్వా ఋతవస్సంవత్సర స్సంవత్సరా దేవాత్మానాం పునీతే తిస్రో రాత్రీ ర్దీక్షితో భవతి| త్రిపదా గాయత్రీ గాయత్రియై వాత్మానం పునీతే|

చేసిన పాపం చాలా ఉంటే సంవత్సర దీక్ష చెయ్యాలని, లేదా మాసదీక్షను లేదా ద్వాదశరాత్ర దీక్షను లేదా షడ్రాత్ర దీక్షను లేదా త్రిరాత్ర దీక్షను ఆచరించాలని వికల్పంగా వారి వారి శక్తి సామర్థ్యాల ననుసరించి చెప్పినా, శాఖాంతరీయ శ్రుతి ననుసరించి బోధాయన ధర్మసూత్రంలో ఏకరాత్ర దీక్షను కూడా చెప్పారు. పైన చెప్పిన ప్రత్యామ్నాయాల్లో ఏ పక్షాన్ని ఆశ్రయించినా మన శక్త్యనుసారం ముఖ్యపక్షాన్ని ఆశ్రయించినట్లే అవుతుందనే అభిప్రాయంలో దీక్షలను సంకోచింప చేశారు.

అదే విధంగా వివాహాంగ దీక్షల విషయంలో కూడా సంవత్సర దీక్షతో ఆరంభించి ఏకరాత్ర దీక్షా పర్యంతం వికల్పంగా అనేక పక్షాలను 'మానవ గృహ్యసూత్రం' (భారద్వాజ గృహ్య సూత్రం)లో ఉపదేశించారు. అందులో ఆపస్తంబ మహర్షి త్రిరాత్ర దీక్ష వరకే సంకోచింప చేశారు. **"త్రిరాత్ర ముభయోః అధశ్శయ్యా బ్రహ్మచర్యం క్షార, లవణ వర్జనం చ"** అని "సంవత్సరం, ద్వాదశరాత్రం, త్రిరాత్రం, ఏకరాత్రం వా" అని సంవత్సరం నుంచి ఏక రాత్ర దీక్ష వరకు వివాహ దీక్షను సంకోచింపచేశారు భరద్వాజ గృహ్యసూత్రంలో.

ఈ ప్రకారం ప్రాయశ్చిత్త భేదాలలోను, వ్రతాదులు అనుష్ఠించడంలోను దేశ, కాల, కర్త్వ వైషమ్యాలను అనుసరించి గౌరవ, లాఘవ పక్షాలలో మన శక్తిని అనుసరించిముఖ్య పక్షాన్ని ఆశ్రయించినా, లాఘవ పక్షాన్ని ఆశ్రయించినా కూడా ఫలం సిద్ధిస్తుందని వేదంలోను, ఆ యా నామాలతో పేర్కొనబడిన మహర్షులు ఆ యా స్మృతుల్లోను , సూత్ర గ్రంథాల్లోను, వ్యవస్థ చేసినట్లు ప్రకార భేదాన్ని ఆశ్రయించి ఆచరించదగిన వారమే గాని, మన బుద్ధికి తోచిన విధంగా అనుష్ఠించినది ధర్మం కానేరదని సప్రమాణంగాను, సంగ్రహంగాను నిరూపించడం అయ్యింది.

ఆ వ్యవస్థను శాస్త్రీయ దృష్టితో నిర్ణయించుకునే బాధ్యత మాత్రం మనపై ఉంది. కానీ సామాజికులు అనుకున్నట్లు పరులకు సంతోషాన్ని కల్గించే క్రియలన్నీ ధర్మాలని, పరులకి దుఃఖాన్ని కల్గించేవన్నీ అధర్మాలని, ఇవే పరోపకార, పరాఽపకారాలనే శబ్దాలచే చెప్పబడు తున్నాయని సమాజంలో ఉన్న బహుజనామోదాన్ని అనుసరించి నిర్ణయింప తగదు. ఈ ప్రకారం లౌకిక, వైదిక ఉదాహరణలతో ధర్మస్వరూప లక్షణాన్ని వివరించడమైంది.

ధర్మ ప్రాశస్త్యం

వేదాలు అర్థతః ధర్మ బ్రహ్మలను బోధించే మహిమోపేతాలని చెప్పే సందర్భంలో వేదంలో పూర్వకాండచే ప్రతిపాదింపబడింది ధర్మమని, ఈ ధర్మం అనేది 'ధర్మార్థ కామ మోక్షాలు' అనే నాలుగు పురుషార్థాల్లో మొదటిదిగా చెప్పబడింది. దీనికి కారణం ధర్మం వల్లే అర్థరూప పురుషార్థం, కామరూప పురుషార్థం, పరంపరగా మోక్షమనే పురుషార్థం సిద్ధింపవలసి ఉండడమే. అంటే ధర్మం వల్ల పుట్టిన పుణ్య విశేషం వలన గాని ధన సమృద్ధి కలవాడు, భార్యాపుత్ర రూపంలో సుఖం కలిగినవాడు కాలేడు.

ఉదాహరణకు లోకంలో వ్యవసాయమో, వ్యాపారమో, ఉద్యోగమో చేసుకునే ఇద్దరుంటే ఇద్దరూ ఒకేలా చేసినా వారిలో ఒకడు లాభాన్ని సంపాదిస్తున్నాడు, ఒకడు నష్టపోతున్నాడు అనుకుందాం. ఇలాగే ఇద్దరికీ భవనాల్లాంటి ఇళ్ళు, క్షేత్రం, మణి మాణిక్యాది ధన సంపద, సౌందర్యవతి అయిన భార్యా ఉన్నా, ఇందులో ఒకడు మాత్రమే వీటి తాలూకు సుఖాన్ని అనుభవించ గలుగుతూ ఉండి , మరొకడు ఎప్పుడూ అనారోగ్యంతో, పరధనాసక్తితో వేరే ఊళ్ళలో, వేరేవాళ్ళ ఇళ్ళలోనే కాలక్షేపం చేస్తూ స్వంతంగా ఉన్న ఐశ్వర్యాన్ని గానీ, భార్యా సుఖాన్ని గానీ అనుభవించలేక పోతూ ఉంటే లోకంలో ఏమంటాము? ఒకడు జన్మాంతర (పూర్వజన్మ) పుణ్యంతో ఐశ్వర్యవంతు డయ్యాడు. భార్యాపుత్రులతో సుఖంగా కాలం గడుపుతున్నాడని, మరొకడు తనకు గృహ క్షేత్రాదులు, సౌందర్యవతి అయిన భార్య ఉన్నా జన్మాంతరీయ పాపవశంచే సుఖాన్ని అనుభవించలేక పోతున్నాడని అనడం ప్రసిద్ధమే కదా!

అంటే దీని సారాంశమేమిటి? ధర్మం వలనే కానీ అర్థ,కామాలు కేవల పురుష ప్రయత్నంతో సంభవించేవి కావు. అర్థకామాలే ఈ రకంగా ఉంటే, ఇంక మోక్షరూప పురుషార్థ విషయంలో ఏమి చెప్పాలి?

ఎన్ని జన్మలకైనా ధర్మానుష్ఠానంచే చిత్తశుద్ధి సంపాదిస్తే గాని మోక్ష సాధనమైన వేదాంత శాస్త్రం వినడంలో ఇచ్ఛ గాని, దానిలో ఒక రుచి గాని కలగవు. వేదాంత శ్రవణ మననాదులచే గానీ ఎన్నటికీ మోక్షం

పొందలేడని **"జ్ఞానాదేవ హి కైవల్యం" "బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి" "తరతి శోకమాత్మవిత్"** మొదలైన శ్రుతులు చెప్తున్నాయి. ఇటువంటి జ్ఞానానికి పరంపరగా ధర్మమే కారణమవడం వల్ల మిగిలిన మూడు పురుషార్థాలు ధర్మంపైనే ఆధారపడి ఉన్నాయనే మాట స్పష్టం.

ఇందులో ధర్మం అర్థసాధనమైనా, ఆ అర్థాన్ని కేవలం కామ పురుషార్థం కోసం వినియోగిస్తే అధమ మార్గానికి చెందిన వారవుతారు. ధర్మంచేత చిత్తశుద్ధిని సంపాదించుకుని ధర్మం వల్లనే సంపాదించిన ధనాన్ని దైవారాధనలో వినియోగించి కామజన్యమైన విషయ సుఖాన్ని జీవన పరిధిలో మాత్రం ఉపయోగించుకుంటూ మోక్షానికి ప్రయత్నించిన వారు ఉత్తమ మార్గాన్ని అవలంబించిన వారవుతారు. కానీ అధమ మార్గానికి, ఉత్తమ మార్గానికి చెందిన ఉభయులకు కూడా ధర్మమనేది తప్పకుండా అనుష్ఠించవలసిందే అనే విషయం అనేక గ్రంథాలలో చెప్పబడుతోంది.

ధర్మం శనైస్సంచినుయాద్వల్మీకమివ పుత్తికా పరలోక సహాయార్థం సర్వభూతా న్యపీడయన్ ఏకః ప్రజాయతే జంతుః ఏక ఏవ విలీయతే మృతం శరీరముత్సృజ్య కాష్ఠలోష్ఠ సమం క్షితౌ విముఖా భాంధవా యాంతి ధర్మస్తమనుగచ్ఛతి|

తేనెటీగలు ప్రతిరోజు కొద్ది కొద్ది తేనెను సేకరించినట్లు ప్రతి మనుజుడు పరలోకంలో సహాయపడే నిమిత్తం ప్రతినిత్యం ధర్మాన్ని సంపాదించాలి. పరలోకగమన వేళలో ఉపయోగపడేది ధర్మం మాత్రమే. పుట్టేటప్పుడు ఒక్కడిగా పుడుతున్నాడు. మరణించేటప్పుడు ఒక్కడిగానే మృతి చెందుతున్నాడు. భార్యా పుత్రులంతా మృత కళేబరానికి చితి అంటించి విముఖులై ఇంటికి వెళ్తారు. ధర్మం మాత్రం జీవిని అనుసరించే ఉంటుంది. ఈ విధంగా ధర్మశాస్త్రంలోనే కాక కామశాస్త్రంలో కూడా ఇలా చెప్పబడింది.

"శాస్త్రస్య అనభి శంకృత్వాత్"

"క్వచిత్ఫల దర్శనాత్"

"తస్మాత్ ధర్మానాచరేత్"

మొదలైన వాక్యాలు "శాస్త్రమనేది శంకింప దగినది కాదు" అని, (ఇక్కడ శాస్త్రమంటే వేదం) "ఇది ఇతర ప్రమాణాల వలన తెలియబడనిదాన్ని చేస్తోంది అని, ఇంకా వేదం చెప్పిన ఐహిక ఫలాన్నే (ఈ లోకంలో) చూడడం జరుగుతోందని, దానికి ఇంకా అనేక అలౌకిక ఉపయోగాలున్నాయని చెప్తున్నాయి. కాబట్టి వేదోక్త ధర్మాన్ని ఆచరించవలసిందే కానీ పురుష బుద్ధికి తోచిన నిర్ణయానుసారం ఆచరించదగింది కాదు" అని చేస్తోంది!

అలా అని అర్థకామాలనే పురుషార్థాలను విడిచి పెట్టేయాలని శాస్త్రం చెప్పడం లేదు. **"అన్యోన్యం అనపస్పర్ధం త్రివర్గం సేవేత"** అని ఒకదాని నొకటి బాధించకుండా, వాటి మధ్య వైరుధ్యం లేకుండా ధర్మార్థకామాలనే మూడు పురుషార్థాలను సేవించవలసింది అని చెప్పింది. అంటే ధర్మానికి అవిరుద్ధంగా (విరుద్ధం కాకుండా) మిగిలిన అర్థ,కామాలను సేవించాలని తద్వారా మోక్షాన్ని పొందాలని తాత్పర్యం.

సుఖం చ వినా ధర్మాత్ తస్మాద్ధర్మపరో భవేత్| (శు.నీ. సా)

ధర్మామాచరించనిదే ఎన్నడూ సుఖాన్ని అనుభవించడం జరగదు. ఒకవేళ వేరేలా (అధర్మం ఆచరించేవారు సుఖ మనుభవిస్తున్నట్లు) కనిపించినా అది శాశ్వతం కాదు! కనుక సర్వదా ధర్మాచరణయందు ఆసక్తి కలిగి ఉండాలని దీని తాత్పర్యం.

త్రయీ ధర్మశ్చతుర్ణాం వర్ణానాం స్వధర్మస్థాపనా దౌపహారికః (అ. శా.)

వేద ప్రతిపాద్యమైన ధర్మం అన్ని వర్ణాల వారికి, అన్ని ఆశ్రమాల వారికి ఒక వ్యవస్థగా ప్రవర్తిస్తూ అత్యంతం ఉపయుక్తమౌతోంది. కనుకనే తనకు, లోకానికి కూడా ఉపకారమైన ధర్మాన్ని ఆచరించేవారిని లోకంలో సమస్త జనులూ పూజిస్తారు. కానీ ధనాఢ్యుణ్ణి కాని కాముకుని కానీ అలా పూజించరు.

దేవాశ్చ మునయో నాగా గంధర్వా గుహ్యకాస్తథా ధార్మికం పూజయన్తీహ న ధనాఢ్యం న కాముకమ్|

కేవలం మనుష్యులే కాదు దేవతలు, మునులు మొదలైన వారంతా ధార్మికుణ్ణే పూజిస్తారుట. ధార్మికుడంటే ఎవరు ?

యోహి యాగమనుతిష్ఠతి తం ధార్మిక ఇతి సమాచాక్షతే లోకే| (సా. భా)

యాగం చేసిన వానిని ధార్మికుడు అన్నారు. ఇందులో యాగం ఉపలక్షణం. అంటే విహిత కర్మను (తను చెయ్యాలి అని చెప్పబడిన కర్మను) ఆచరించేవాడు అని అర్థం. దీనికి కారణమేమిటి అంటే, ధర్మాచరణ చేసేవాడు కేవలం భూలోక వాసులకే కాక దేవలోక, పితృలోక వాసులకు కూడా ఉపయోగపడతాడు అని! అందుకే శ్రుతి అంటోంది -

తే సప్తహోతారం యజ్ఞం విధాయా యాస్యం అంగీరసం ప్రాహిణ్వన్ ఏతేనాముత్ర కల్పయేతి|

"అంగీరసుని కుమారుడైన ఆయాస్యుడు దేవలోకం నుంచి భూలోకానికి వచ్చి ఇక్కడ సప్తహోత్రమనే యజ్ఞాన్నాచరించి దేవలోకంలో ఉన్న వారందర్నీ సమృద్ధి యుక్తులుగా చేసాడుట. ఇంతే కాదు, మణిమాణిక్యాది ధనం ఉన్నవాడు ఈ లోకంలో ఉన్నవాళ్ళకు మాత్రమే ఉపకారం చేయగలడు. కానీ, యాగం చేసినవాడు లోకాంతరాలకి కూడా ఉపకరిస్తాడు. అందుకే ధనవంతుని నిర్ణయించే సందర్భంలో వేదం యాగానుష్ఠాతను ధనవంతునిగా నిర్ణయించింది.

ఏక ఏవార్థో యో యజతే స దేవానాం భోగాయ భవతి|

అనే వాక్యం, ఏ వ్యక్తి యాగానుష్ఠానం చేసి దేవతలకు సమృద్ధినిస్తాడో అతడే అర్థ సమృద్ధి గలవాడని నొక్కి చెప్తోంది.

ఇంత వరకు ధర్మాఽధర్మ లక్షణం, ధర్మ ప్రాశస్త్యం వివరింపబడ్డాయి. ఈ ప్రశంసించబడిన ధర్మాలు ఆచరించినవానికి ఇతర పురుషార్థాలకు కారణమవడమే కాక, సృష్టి స్థిత్యాదులకు కూడా ధర్మం కారణమని **"ధర్మో విశ్వస్య జగతః ప్రతిష్ఠా"** అనే శ్రుతి సామాన్యంగా బోధిస్తోంది. విశేషంగా ఆ యా ప్రకరణాల్లో ఆ యా విశేషరూపమైన ఉపాఖ్యానాలు బోధిస్తున్నాయి.

ఈ ధర్మం సృష్టి స్థిత్యాదులకు కారణమని నిరూపించడానికి ముందు ఆ ధర్మాచరణకు యోగ్యమైన ప్రదేశం తరువాతి ప్రకరణంలో నిరూపించ బడుతోంది.

2 వ ప్రకరణం సమాప్తం

3వ ప్రకరణం

భూలోక-భరత వర్ష ప్రాశస్త్యం

వేదశాస్త్ర విహితాలైన కర్మల నాచరించడానికి యోగ్యమైన ప్రదేశమేది? అని విచారిస్తే సర్వలోకాల్లో భూలోకం ప్రశస్తమైనదిగా తైత్తరీయ సంహిత దర్శపూర్ణమాస ప్రకరణంలోని ఈ శ్రుతి చెప్తోంది -

ప్రజాపతేర్విభాన్నామ లోకస్వస్తిగ్గ్ స్త్వాదధామి| (తై. సం. 1-5-5)

అన్ని లోకాలూ బ్రహ్మగారిచే సృష్టించబడినవే అయినా, భూలోకం కర్మభూమి అవడం వల్ల పుణ్యకర్మ అనుష్ఠానం చేత స్వర్గాది పుణ్య లోకాలను పొందడానికి చెప్పబడిన పుణ్య కర్మానుష్ఠానం, దాని ద్వారా చిత్తశుద్ధి, ఆ చిత్తశుద్ధి ద్వారా పరంపరగా ఉత్తమ పురుషార్థమైన మోక్షాన్ని పొందడానికి, నరకాది లోకాలని పొందడానికి కారణమైన పాపాలను పోగొట్టుకోవడానికి చెప్పబడిన ప్రాయశ్చిత్త కర్మానుష్ఠానానికి కూడా అర్హమైనది. ఊర్ధ్వలోక అధోలోకాలకు మధ్యన ఉంది ఈ భూలోకం. దేవ లోకాలు ఎంత గొప్పవైనా ఇక్క డ భూలోకంలో చేసిన పుణ్య కర్మల ఫలాన్ని అనుభవింప చేసేవే కానీ, కొత్తగా పుణ్యకర్మలను ఆచరించి పుణ్యాన్ని గాని, పాపకర్మలను ఆచరించి పాపాన్ని గాని పొందడానికి తగిన యోగ్యత లేనివి అయినందువల్ల భూలోకం గొప్పదిగా చెప్పబడుతోంది.

అందులోనూ జంబూ ద్వీపం, దానిలో భరత వర్షం భరత ఖండం పుణ్య కర్మానుష్ఠాన యోగ్యత కలవిగా పురాణ, ధర్మ శాస్త్రాల్లో ప్రశంసించ బడ్డాయి. భూభాగంలోని భరతఖండం కానిచోట ఎక్కడా శ్రుతి,స్మృతుల్లో చెప్పబడిన కర్మ విధింపబడలేదు. లోకాలు ఎన్నో ఉన్నా భూ లోకంలో తప్ప మిగిలిన లోకాల్లో కర్మ భూమి లేదు. అందుకే శ్రుతి ఇలా చెబుతోంది.

తేఽముష్మిన్ లోకే వ్యక్షుధ్యన్| తేఽబ్రువన్ అముతః ప్రదానం వా ఉపజిజీవిమేతి| (తై.బ్రా.2-2-8)

"మనుష్య లోకంలో సప్తహోత్రు యజ్ఞం చేసి ద్యులోక వాసులను సమృద్ధి గలవాళ్ళనుగా చేయుము" అని మనుష్య లోకానికి పంపారు.

తే సప్తహోతారం యజ్ఞం విధాయయాస్యం అంగీరసం ప్రాహిణ్వన్ ఏతేనాముత్ర కల్పయేతి తస్య వా ఇయం క్లుప్తిః యదిదం కించ|

య ఏవంవేద కల్పతేఽస్మై సవా అయం మనుష్యేషు యజ్ఞస్సప్తహోతా| అముత్ర సద్భ్యోదేవేభ్యో హవ్యం వహతి|

అనే మంత్ర వాక్యాలు చెప్తున్నాయి. "ఇంద్రుని సహాయంతో లోకంలో రాక్షసులను జయించిన ఆ దేవతలు స్వర్గలోకాన్ని పొందినా విశేషమైన ఆకలితో బాధ పడుతున్న వారై స్వర్గలోకం కర్మభూమి కాకపోవడంతో ఆకలిని తీర్చడానికి భోగ్యవస్తు సంపాదన లేనిదయిందని పరస్పరం విచారించారు. దీనివల్ల మనుష్య లోకంలో కర్మానుష్ఠానం చేసి మంత్ర పూర్వకంగా దేవతలను ఉద్దేశించి ఇవ్వబడిన హవిస్సుని ఆశ్రయించి జీవించదగిన వారమని నిర్ణయించుకున్నారు" అని అర్థం.

ఈ శ్రుతిలో వినిపించిన **'అముతః'** అనే శబ్దం పరోక్ష వాచకం కనుక మనకు పరోక్షంలో ఉన్న భూలోకమే శరణ్య మనుకున్నారు. కానీ మనుష్యులెవరూ వైదిక కర్మనాచరించడం లేదని వారిలో ఒకరైన అంగీర గోత్రంలో పుట్టిన ఆయాస్య నామక మునిని భూలోకానికి వెళ్ళి సప్తహోత్రనామక యజ్ఞం చేసి దేవలోక వాసులను సమృద్ధి యుక్తులుగా చేయవలసిందని భూలోకానికి పంపారుట. అందుకే ఇప్పటికి కూడా లోకంలో మనచే చూడబడే సప్తహోత్రం అనే యజ్ఞానికి ఆయాస్య మహర్షే ప్రవర్తకుడు. ఆ ప్రకారంగా

ఆయాస్య నామక ఋషిచే ప్రవర్తింప చేయబడిన సప్తహోత్ర మంత్ర సాధ్యమైన యజ్ఞం మనుష్యులమైన మనచే అనుష్ఠింపబడి స్వర్గలోక నివాసులైన దేవతలకు సమృద్ధి నివ్వగలుగుతోందని ఈ వృత్తాంతం తెలిసినవాడు యజ్ఞానుష్ఠాన సమర్థుడవుతున్నాడని పై ఉపాఖ్యానం మనకు తెలియచేస్తోంది. దీనివల్ల తేలిన సారాంశ మేమంటే భూలోకమే కర్మానుష్ఠాన యోగ్యత కలిగినదని, ఇక్కడ అనుష్ఠించబడిన కర్మలలో దేవతలను ఉద్దేశించి ఇవ్వబడిన హవిస్సును ఆశ్రయించుకునే దేవతలు జీవిస్తున్నారు అనడం వల్ల మనుష్యత్వం యొక్క గొప్పతనం కూడా చెప్పినట్లయింది.

భూలోకంలో అనుష్ఠించిన యజ్ఞమే దేవతలకు శరణ్యమని, భూలోక వాసులై అధికారులైన మనుష్యులే దేవతలయొక్క తృప్తికి కారణభూతు లయ్యారని, తద్వారా భూలోకంలో నివసించే మనుష్యులకు మాత్రమే కర్మాధికారమని తేలింది. అందుకే దేవతలు దేవత్వంనుండి మనుష్యులుగా అవతరించి మనుష్య లోకంలో నివసించాలనే ఉత్సుకతతో ఉంటారుట. సురాఽసురులకు కూడా శక్యం కాని దానిని మనుష్యుడు సాధించగలడని వారి మనోరథం.

అపి మనుష్యమాప్స్యామః దేవత్వా త్ప్రచ్యుతాః క్షితౌ| అత్ర జన్మ సహస్రాణాం సహస్రైరపి సత్తమ కదాచిల్లభతే జంతుర్మానుష్యం పుణ్య సంచయాత్| కర్మభూమిరియమ్ స్వర్గమపవర్గం చ గచ్ఛతాం| (వి.పు.)

ఈ ప్రకారం భూలోకం, మనుష్య జన్మ ప్రశస్తమని తేలిన తర్వాత ఈ భూలోకం అన్ని లోకాల నడుమ ఉందనడానికి ప్రమాణం వివరింపబడుతోంది. అలాగే మరో ప్రకరణంలో కూడా దర్శపూర్ణమాస ప్రకరణంలో ఇడానుమంత్రణంలో వాడబడే-

సామే సత్యాశీరస్య యజ్ఞస్య భూయాదరేతా మనసా తచ్ఛకేయం యజ్ఞోదివగ్ం రోహతు యజ్ఞోదివంగచ్ఛతు|

అనే మంత్రంలో కూడా దేవలోకాపేక్షతో, దేవత్వాపేక్షతో మనుష్యలోక, మనుష్యత్వ ప్రశస్తి చెప్పబడింది.

దర్శపూర్ణమాస క్రతు విశేషంలో దారువుతో చెయ్యబడిన ఒక పాత్రకు ఇడాపాత్ర అని పేరు. వస్తుతః (ఈ సందర్భంలో) ఇడా అంటే **"గౌర్వా ఇడా"** అని గో శరీరధారిణి అయిన దేవతయొక్క నామధేయం. మరియు ఔపచారికంగా పైన చెప్పబడ్డ దారుమయ ఇడాపాత్రను హవిస్సుతో నింపిన దానిని చేతపట్టుకుని యజమాని **"సామే సత్యాశీం"** అనే మంత్రంతో ఆ దేవతను ఇలా ప్రార్థిస్తున్నాడు. "ఈ యజ్ఞం వల్ల ఏ ఫలాన్ని నేను అర్థిస్తున్నానో ఆ ఫలం నాకు తప్పక సిద్ధించు గాక!" అని ప్రార్థన. కారణమేమంటే, తమ అనుగ్రహం వల్ల అనాదరణ లేని మనస్సుతో ఈ కర్మ చేయడానికి ఉద్యుక్తుణ్ణయ్యాను. నాచేత ఆచరించబడే ఈ యజ్ఞం లోకంలో నిశ్రేణి (నిచ్చెన) ద్వారా పై ప్రదేశానికి వెళ్ళినట్లు దేవలోకాన్ని అధిష్ఠించు గాక. క్రియచేత కాని, మంత్రంచేత కానీ ఏ విధమైన వైకల్యం లేకుండా ఈ యజ్ఞం దేవలోకాన్ని అధిష్ఠించు గాక! అనగా, క్రియా నిర్వహణలో గాని, మంత్ర ప్రయోగంలో గాని ఏ మాత్రం శాస్త్ర వ్యతిరేకమైనా యజ్ఞం భ్రంశ మవుతుందని అలాంటి భ్రంశమేమీ లేనిదై ద్యులోకాన్ని అధిష్ఠించు గాక! అని అర్థం.

అంతే కాదు. "కేవలం ద్యులోకాన్నధిష్ఠిస్తే చాలదు. ఏ దేవతల నుద్దేశించి యజ్ఞంలో మంత్ర పూర్వకంగా హవిస్సును సమర్పించామో ఆ దేవతలు ఏ ప్రదేశంలో నివసిస్తున్నారో ఆ ప్రదేశానికి వెళ్ళి, దేవసభలో కూర్చుని ఉన్న దేవతలు ఏ మార్గంలో భోజనశాలకు వెళ్తున్నారో ఆ మార్గంలో దేవతల భోజనశాలకు వెళ్ళి ఆ దేవతలకు ఈ హవిస్సును అందించు గాక" అని ఈ యజమాని ఇడాభిమాన దేవతని ప్రార్థిస్తున్నాడు. ఈ యజ్ఞహవిస్సుతో దేవలోకాధిపతి అయిన ఇంద్రుడు సంతుష్టుడై మళ్ళీ మరో యజ్ఞాన్ని అనుష్ఠించడానికి తగిన చక్షురాది ఇంద్రియ పాటవాన్ని, యజ్ఞం చేయడానికి కావల్సిన యజ్ఞ సాధనాన్ని,

ద్రవ్య విశేషాన్ని ఇచ్చి మళ్ళీ మళ్ళీ యజ్ఞాలను నాచే చేయించు గాక. మా శత్రువులను హింసించు గాక. మాకు ధనసమృద్ధి నిచ్చు గాక" అని ప్రార్థిస్తున్నాడు. దీనివలన భూలోకంలో ఇవ్వబడిన హవిస్సు దేవలోకంలో గలవారికి ఆహారమవడం వల్ల భూలోకం ప్రశస్తమైందని సారాంశం.

తైత్తరీయ బ్రాహ్మణంలోని నాచికేతాగ్ని చయన ప్రకరణంలో-

ఉరవో హవై నామైతే లోకాః| యేవరేణాఽదిత్యం అథహైతే వరీయాగ్ం సో లోకాః యే పరేణాఽదిత్యమ్ అన్తవన్తగ్ం హవా ఏషక్షయ్యం లోకం జయతి యోఽవరేణాదిత్యమ్| అథ హైషోనన్త మపార మపార మక్షయ్యం లోకం జయతి యః పరేణాదిత్యమ్|అనన్తగ్ం హవా అపారమక్షయ్యం లోకం జయతి| (తై.బ్రా.3-11)

అనే శ్రుతి, నాచికేతాగ్నిచయనం చేసిన వ్యక్తి లేదా నాచికేతాగ్న్యుపాసన చేసిన వ్యక్తి పొందదగిన ఆ యా లోకప్రాప్తి ఫలాన్ని చెప్పడంకోసం లోకవిభాగాన్ని చూపిస్తోంది. స్వర్గలోకాలు కొన్ని ఆదిత్యుని కంటే క్రింది భాగంలోను కొన్ని పై భాగంలోను రెండు విధాలుగా ఉన్నాయని, కానీ క్రింద గల స్వర్గ లోకాలు విస్తీర్ణమైనవైనా క్షీణించే స్వభావం కలవి కనుక అలాంటి లోకప్రాప్తి కోసం పుణ్యకర్మలు చేసినవాడు నాశయుక్తమైన లోకాలను పొందిన వాడవుతాడు. ఆదిత్యలోకంకంటే పైన గల స్వర్గలోకాలను పొందేవాడు అపారమైన ఆతాన, వితానాలచే అవసాన రహితమైన ఎన్నడూ క్షీణించనటువంటి లోకాలను పొందుతున్నాడు.

ఈ ప్రకారం పుణ్యలోకాలు విభజించబడిన తర్వాత శ్రుతి చెప్తోంది-

అనన్తగ్ం హవా అపారమక్షయ్యం లోకం జయతి యోగ్నిం నాచికేతం చినుతే| య ఉచైవమేవం వేద|

నాచికేతాగ్నిచయనం చేసిన వానితోబాటు నాచికేతాగ్న్యుపాసన చేసిన వానికి కూడా అనంతమైన, అపారమైన, క్షీణత లేని బ్రహ్మలోక ప్రాప్తి గలదు. ఆయుఃక్షయానికి కారణ భూతమైన కాల పారతంత్ర్యం, పరాధీనత బ్రహ్మ లోకాన్ని పొందిన వానికి లేదని ఉదాహరణలతో నిరూపించబడుతోంది.

అథో యథారథే తిష్ఠన్సక్షసే పర్యావర్తమానే ప్రత్యపేక్షతే ఏవమహోరాత్రే ప్రత్యపేక్షతే| నాస్యాహోరాత్రే లోకమాప్నుతః| (ఉప.)

లోకంలో రథాన్ని ఎక్కినవాడు తన ప్రక్కనే ఉండి మళ్ళీ మళ్ళీ తిరుగుతున్న రథచక్రాలు తనకింద ఉండటం చూసి వాటిని చాలా నీచంగా చూస్తాడు. లోకంలో దీపం పురుగులు అప్పటికప్పుడు పుట్టి నశిస్తూ ఉంటాయి.వాటిని కూడా అల్పమైన వాటిగా చూస్తాడు. బ్రహ్మలోకంలో ఉన్నవారికి మన స్థితి చూస్తే కూడా అలాగే కనబడుతుంది. మనకు ఇక్కడ అనుభవంలో ఉన్న అరవై ఘడియల అహోరాత్రులు అత్యల్పమవడం వల్ల, ఇవి అక్కడ (దేవలోకాల్లో) ప్రసరించవు. వారికి ఒక్కో కల్పం ఒక అహస్సు (ఒక పగలు). కానీ బ్రహ్మ లోకానికి వెళ్ళిన వానికి ఇతర లోకాలలో వలె ఆయుస్సు క్షీణించదు.

దీనివల్ల భూలోకం కంటే పైన చాలా లోకాలున్నాయని తెలిసింది. ఈ విషయం పురాణాలలో కూడా వర్ణింపబడింది. మనం శ్రుత్యర్థాన్ని గురించి మాట్లాడుకొనేటప్పుడు పురాణ ప్రసక్తి ఎందుకని అనుకో కూడదు. **"ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్"** అనే వచనం ఇతిహాస పురాణాలతో వేదార్థాన్ని స్పష్టంగా అవగాహన చేసుకోవాలని చెప్తోంది. భూలోకం ఈ బ్రహ్మాండానికి నడుమన ఉందని పురాణాల్లో లోక విభాగం ఇలా ఉంది. భూలోక విస్తారాన్ని వివరించవలసిందిగా మునులు వ్యాసమహర్షిని ప్రశ్నించగా వ్యాసుడిలా పలికారు.

రవి చంద్రమసోర్యావన్మయూఖైరివ భాస్వతే.....|

అనే అగ్ని పురాణ భాగం సూర్యచంద్రుల కిరణ ప్రసారమున్నంత వరకు సముద్ర శైలాలతో కూడి ఉన్న ప్రదేశం పృథ్వి అని చెప్తోంది. భూమి ఎంత విస్తారముందో దానిపై అంతరిక్ష లోకం కూడా అంత విస్తారం ఉందని, భూమికి లక్ష యోజనాల దూరంలో సౌర మండలం, దానికి లక్ష యోజనాల దూరంలో చంద్ర మండలం, దానికి లక్ష యోజనాలపైన నక్షత్ర మండలం, దానికి రెండు లక్షల యోజనాల దూరంలో బుధుడు, అంతే దూరంలో శుక్రుడు, అంతే దూరంలో అంగారకుడు ఉంటారని, అంగారకుడి నుంచి రెండు లక్షల యోజనాలలో బృహస్పతి మండలం, అక్కడకు రెండు లక్షల యోజనాలలో శని మండలం, అక్కడి నుండి లక్షల యోజనాల దూరంలో ధ్రువ మండలం ఉంటాయని యజ్ఞఫల రూపమైన స్థానం ఇదే అని చెప్పబడింది. ఇందులోనే యజ్ఞం ప్రతిష్ఠితమైందని కూడా చెప్పబడింది.

ధ్రువాదూర్ధ్వం మహర్లోకః యత్ర తే కల్పవాసినః ఏక యోజన కోటీ తు మహర్లోకో విధీయతే... మునిసేవితం|

ధ్రువలోకం పైన కోటి యోజనాలలో మహర్లోక ముంది. దానిపై రెండు కోట్ల యోజనాలలో జనోలోక ముంది. జనోలోకం పైన ఎనిమిది కోట్ల యోజనాలలో తపోలోకం ఉంది. తపోలోకం పైన ఆరు యోజనాల దూరంలో సత్యలోకం ఉంది. అది 'ఆపునర్మారకం'. అనగా, తిరిగి మరణధర్మం లేని పుణ్యలోకం, అనగా బ్రహ్మ లోకం. సూర్యుడికి ధ్రువునకు ఉన్న మధ్యభాగంలో చతుర్దశ లక్ష యోజనాల పరిమాణమైన స్వర్గలోకం. ఇదే **"స్వర్గకామో యజేత"** అనే శ్రుతిచే విధింపబడిన యాగానికి గమ్యమైన ఫలరూపమైన లోకం. ఇదే విధంగా భూలోకానికి క్రింద కూడా పాతాళాది లోకాలు ఉన్నాయి.

ధ్రువ సూర్యాన్తరమ్ యత్తు నియుతాని చతుర్దశ| స్వర్లోకస్సోపి కథితో లోక సంస్థాన చింతకైః| ఏతే సప్త మహాలోకాః మయా వః కథితాద్విజాః|
"పాతాళాని చ సప్తైవ బ్రహ్మాండస్యైవ విస్తరః"

దీనివల్ల భూలోకం బ్రహ్మాండం మొత్తానికి నడుమన ఉందని తెలిసింది. ఈ భూలోకం మత్స్యపురాణంలో ఇలా వర్ణించబడింది.

భగవస్ శ్రోతుమిచ్ఛామి విస్తారాన్మండలం భువః విస్తారతః కియత్ప్రోక్తం కతి ద్వీపాస్ససాగరాః| కథం మేరు స్థితస్తత్ర ఏతన్మేబ్రూహి కేశవ|

మత్స్య ఉవాచః -

శృణు సర్వం ప్రవక్ష్యామి విస్తారాన్మండలం భువః సప్తద్వీపాస్ సముద్రాంశ్చా యథాతత్యేన తే మనో| పంచాశత్ కోటి విస్తారం యోజనానాం ధరాతలం తచ్చసప్త సముద్రైశ్చ సప్త ద్వీపైస్సమాన్వితం లవణేక్షు సూరా సర్పిర్దధిక్షీర జలార్ణవైః జంబూప్లక్షశ్శాలిశ్చ కుశః క్రౌంచస్తు పంచమః|

శాకపుష్కర నామానౌ ద్విగుణైః పరివేష్టితౌ| (మ.స్మృ)

భూమండల విస్తారమెంత? ద్వీపాలెన్ని? సముద్రాలెన్ని? మేరువు దాంట్లో ఎలా ఉంది? అని మత్స్య స్వరూప పరమాత్మను మనువు అడిగాడు. దానికి సమాధానంగా- ధరాతలం యాభై(50) కోట్ల యోజనాల విస్తారం కలది అని, అది (1)జంబూ (2)ప్లక్ష (3)శాల్మలి (4)కుశ (5)క్రౌంచ (6)శాక (7)పుష్కర అనే సప్త ద్వీపాలతోను, (1)లవణ (2)ఇక్షు (3)సురా (4)సర్పి (ఘృత) (5)దధి (6)క్షీర (7)శుద్ధోదక (జల) అనే ఏడు సముద్రాలతోను కూడి ఉంది అని చెప్పబడింది. అంటే మొత్తం భూమండలం సప్త ద్వీపాలతోనూ, సప్త సముద్రాలతోనూ వ్యాపించి ఉంది. భూమండలంలో చాలా ద్వీపాలున్నా అన్నీ చెప్పడం శక్యం గాక ముఖ్యమైన సప్త ద్వీపాలు మాత్రం చంద్రాదిత్య మండలాలతో సహా చెప్పబడడటం ఇక్కడ గమనించవలసిన విశేషం. మొత్తం భూమి సప్త ద్వీపాలతో కూడి ఉన్నట్లు ప్రతీ వ్రతానికి ఆదిలో

కలశారాధన సమయంలో వినియోగింపబడే **"కుక్షౌతు సాగరాస్సర్వే సప్తద్వీపా వసుంధరా"** అనే మంత్రంలో స్పష్టంగా ప్రతిపాదించ బడుతూనే ఉంది కదా! ఈ ప్రకారం మొత్తం భూగోళాన్ని గురించి చెప్పి జంబూ ద్వీపాన్ని గురించి ఇంకా ఇలా చెప్పబడుతోంది.

జంబూద్వీప వర్ణన

జంబూద్వీపాన్ని సప్తవర్ష విభాగంగా మత్స్య పురాణం, నవవర్ష విభాగంగా భాగవతం చెప్తున్నాయి.

"సప్త వర్షం ప్రవక్ష్యామి జంబూద్వీపం యథావిధం | విస్తారం మండలం యచ్చ యోజనైస్తన్నిబోధతః ||

వర్ష విభాగం

1) భారత (2) కింపురుష (3) హరి(4) ఇలావృత (5) రమ్యక (6) హైరణ్యక (7) కురు (8) భద్రాశ్వ (9) కేతుమాల అనే తొమ్మిది వర్షాలుగాను, ఇలావృత, భారత, కేతుమాల, భద్రాశ్వ వర్షాలు అనే దేశ చతుష్టయ విభాగంగాను ఉన్నట్లు, ఈ నాలుగు దేశాల మధ్య మహామేరువు ఉన్నట్లు, మేరువుని ఆనుకుని ఇలావృత వర్షముందని చెప్తూ పర్వత విభాగం కూడా వర్ణించబడింది.

పర్వత విభాగం

హిమప్రాయశ్చ హిమవాన్ హేమకూటశ్చ హేమవాన్ | పర్వతస్సుముఖశ్చాపి నిషధదః పర్వతో మహాన్ | ప్రాగాయతా మహాపార్శ్వాష్టడిమే వర్షపర్వతాః|

హిమాలయం, హేమకూటం, సుముఖం, నిషధం వంటి వాటితో మేరుపర్వతం గాక ఆరు వర్ష పర్వతాలున్నట్లుగా వర్ణింపబడింది.

మేరు వర్ణనం

ఈ పర్వతాల మధ్యదేశ విభాగంలో కేంద్రస్థానీయమైన మహామేరువు ఉల్బామయంగాను (ఉల్బమనగా అప్పుడే పుట్టిన శిశువుపై ఆవరించిన ఉల్లిపొరలాంటి మావి), ఏతన్మయంగాను (మధ్యలో ఉన్నదని భావం), సువర్ణమయంగాను, రకరకాల వర్ణాలు కలదిగాను వర్ణింపబడింది.

చాతుర్వర్ణస్య సౌవర్ణో మేరుశ్చోల్బమయః స్మృతః|

అంటే మహామేరువుకు తూర్పున శ్వేతవర్ణం, దక్షిణాన పీతవర్ణం, పడమరన కృష్ణవర్ణం, ఉత్తరాన రక్తవర్ణం కలిగి వరుసగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాల విరాట్పురుషునిగా ప్రజాపతి శబ్దవాచ్యుడైన హిరణ్యగర్భుడని చెప్పబడింది.

ఈ ప్రకారం మహామేరువు చాతుర్వర్ణ్య వ్యవస్థతో కూడిన విరాట్పురుషునికి అవతార స్థానమై బ్రహ్మకు నాభిస్థానమైనదిగా వర్ణింపబడింది. మత్స్య పురాణం 112వ అధ్యాయంలో కూడా భూగోళ వర్ణనం, ఇంకా పర్వత వర్ణన కూడా ఉంది.

వేది శబ్దార్థం

తేషామంతే చ విష్కంభః నవ సాహస్రా ఉచ్యతే| మధ్యే ఇళావృతమ్ నామ మహామేరోస్సమంతతః| మధ్యే తస్య మహామేరుర్విధామ ఇవ సావకః| వేద్యర్థం దక్షిణే మేరురుత్తరార్థస్తథోత్తరః|

పర్వతాలమధ్య మహామేరువు ధూమం లేని అగ్నివలె ప్రకాశిస్తోందట. ఈ మహామేరువుకు నాలుగు మూలల్లో గల పర్వతాలు దాని వేదికకు అవధిని తెలియజేసే తెలుపు గుంజల వంటివి. నడుమన ఉన్న

మహామేరువు అగ్నిస్థానమని ఇదే దేవయజ్ఞ వేదిక అని; ఇందులో దక్షిణార్థం, ఉత్తరార్థం అని రెండు భాగాలున్నాయని వర్ణింపబడింది. కర్మభూమిగా భూలోకాన్ని వర్ణించే సందర్భంలో మహామేరువు వేదిశబ్ద వాచ్యమని వర్ణించబడినదానికి శ్రుతియే మూలమని చెప్పడానికి, మొత్తం పృథ్వీలో సర్వోత్కృష్టమైన వేదియని కూడా వేదంలో కూడా చెప్పబడింది.

పృచ్ఛామిత్వాపరమంతం పృథివ్యాః పృచ్ఛామిత్వాభువనస్య నాభిం| (శ్రుతి)

వేదిమాహుః పరమంతం పృథ్వీవ్యా యజ్ఞమాహుః భువనస్య నాభిం| (శ్రుతి)

పృథివీమధ్యే యా వేది శబ్దవాచ్యా శైవ పరోత్కృష్టా,యజ్ఞ ఏవ సర్వస్య భువనస్య కారణ మిత్తుత్తరం| (భాష్యం)

"యజ్ఞో దేవేభ్యో నిలాయత విష్ణూరూపం కృత్వా సపృథివీ ప్రావిసత్తం దేవాహస్తాన్త్సగ్ం| రభ్యైచ్ఛన్త మింద్ర ఉపర్యుపర్యత్ర క్రామత్సోబ్రవీత్ కోమాయముపర్యుపార్యత్ర క్రమీదితి| (తై. సం.6-2-4)

మొదలైన అనేక శ్రుతులు పుణ్యాచరణకు ఈ భూలోకం కర్మభూమి అని వర్ణిస్తున్నాయి.

ఇలాగే మరో శ్రుతి కూడా యజ్ఞం గురించి, యజ్ఞ దీక్షల గురించి వర్ణించింది. ఒకానొకపుడు స్వర్గలోకంలో ఉండే యజ్ఞపురుషుడు సంపూర్ణ విశ్వరూపం ధరించి భూమిలో ప్రవేశించాడు. ఆ సమయంలో దేవత లందరూ వెంబడించి పట్టుకోవడానికి ప్రయత్నించగా ఇంద్రుడు యజ్ఞపురుషుని కంటే ముందుకు వెళ్ళి దారికి అడ్డుగా నిలవగా "నువ్వెవరు?" అని యజ్ఞపురుషుడు ప్రశ్నించాడు. అంతట ఇంద్రుడు "ఎవరూ వెళ్లడానికి శక్యంగాని ప్రదేశానికి వెళ్ళి అక్కడున్న విరోధిని కొట్టగల సమర్థత గలవాడనని" చెప్పగా, "అలాంటి దుర్గంలో గల విరోధిని నేను బయటకు తీసుకురాగలనని" ప్రతిజ్ఞ చేసి ఇంద్రుని ఎదుట తన గొప్పతనాన్ని చెప్పాడు. "ఓ ఇంద్రా! ఒకప్పుడు రాక్షసుల ప్రాబల్యం చూసి నా అంగ భూతమైన (యజ్ఞాంగ భూతమైన) దీక్షాద్యభిమాన దేవతలందరూ నన్ను విడిచిపెట్టి స్వర్గలోకంనుండి భూలోకంలో ప్రవేశించారు" అని తిరిగి చెప్పాడు.

వరాహోయం వామమోషస్సప్తానాం గిరీణాం పరస్తాత్ విత్తం వేద్యమసురాణాం విభక్తి|

అనే శ్రుతి యజ్ఞానికి నాలుగు దీక్షలు, మూడు ఉపశత్తులు, ఒక సుత్యాహస్సు ఉంటాయి అని చెప్తోంది. "స్వర్గంనుంచి వచ్చిన యజ్ఞాంగ దీక్షోపసత్తులు ఏడూ ఏడు పర్వతాలుగా అయ్యాయి. ప్రధానంగా యజ్ఞం అని చెప్పబడే సుత్యాహస్సుయొక్క అభిమాన దేవత సౌమిక గ్రహ చమసాది (సోమయాగంలోని పాత్రల) రూపమైన విత్తాన్ని అపహరించి స్వయంగా వరాహ స్వరూపాన్ని ధరించి పై ఏడు పర్వతాల పృష్ఠభాగంలో ఉంది. దాన్ని అసురవిత్తంగా రక్షిస్తూ ఉన్నారు. దుర్గాలలో ఉన్నవానిని తాడన చెయ్యగలనని చెప్పావు కనుక ఓ ఇంద్రా! ఆ పర్వతాల వెనుక ఉన్న వరాహ స్వరూపాన్ని తాడన చెయ్యమని చెప్పగా ఇంద్రుడు దర్భ సముదాయంతో ఏడు పర్వతాలను భేదించి వరాహాన్ని తాడన చేశాడు. ఆ తర్వాత ఇంద్రుడు "దుర్గాలలో ఉన్న విరోధిని తీసుకురాగలనని చెప్పావు కనుక, అలాంటి శక్తి ఉంటే రాక్షసుల విత్త స్వరూపంగా వ్యవహరింపబడుతున్న యజ్ఞమనే వరాహాన్ని తీసుకురమ్మ"నగా ఆ యజ్ఞ పురుషుడు సౌమిక గ్రహచమసాది రూపమైన యజ్ఞాన్ని తీసుకువచ్చి దేవతలకు ఇచ్చాడు.

విత్తం వేద్యమవిందమంత తదేకం వేదైక వేదిత్వం|

అనే శ్రుతి వేది శబ్దాన్ని నిర్వచిస్తోంది. రాక్షసుల స్వాధీనంలో ఉన్న విత్తం దేవతలచే పొందదగినది అవడంవల్ల వారు ధరించిన మేరుపర్వత భాగానికి వేదిత్వమని వ్యవహారం.

ఈ ప్రకారం వర్ణింపబడడంవల్ల **"వేదిమాహుః పరమంతం పృథివ్యాః"** అనే శ్రుతిలో మొత్తం పృథివిలో సర్వోత్కృష్టమైన వేదియని వర్ణించిన భాగం ఇదే అయి ఉండవచ్చని, సర్వ ప్రపంచోత్పత్తికి కారణమైనది యజ్ఞం అనడం వల్ల, అలాంటి యజ్ఞాన్ని ఇక్కడ అనుష్ఠించినట్లు ఉండడంవల్ల ఇదే నాభిశబ్ద వాచ్యమని సర్వవ్యాపకుడైన పరమాత్మకు ఈ మేరువునే నాభిగా వర్ణించింది. సృష్టిలో ఆదిగా హిరణ్యగర్భుడు సృజించబడినట్లు **"హిరణ్యగర్భస్సమవర్తతాగ్రే"** అనే శ్రుతిలో వర్ణించినట్లే ఇక్కడ పరమాత్మయొక్క నాభి నుంచి 'ప్రజాపతి' అని పిలవబడే సమష్టి బ్రహ్మాండాభిమాని సృజింపబడింది. ఈ ప్రకారం శ్రుతి, పురాణాదుల్లో 'వేది', 'యజ్ఞం' అనే శబ్దాలచే ప్రశంసించబడ్డ మేరుపర్వతం జంబూద్వీపంలో ఉండడంచేత ఈ భూమి జంబూ ద్వీపంలో ఉండడం చేత, ఇదే కర్మభూమి అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఈ ప్రకారం జంబూద్వీపం కర్మభూమిగా ధర్మశాస్త్ర పురాణాల్లో ప్రశంసించబడింది.

మామూలు మాటల్లో చెప్పాలంటే భూలోకం ఒక పాకశాల (వంటశాల) అని, ఇక్కడి వారి యజ్ఞాది కర్మలచే లభించే వైదికమైన హవిస్సును ఆశ్రయించుకుని దేవతలు జీవిస్తారని, దేవలోకం కేవలం భోజనశాల మాత్రమేనని అర్థం చేసుకోవాలి.

భారత వర్ష ప్రాశస్త్యం

వైదిక కర్మలకు అర్హమవడం వల్ల భారతవర్షం చాలా ప్రశస్తమైనది.

తేషు హైమవతం వర్షం భారతం నామ విశ్రుతం| (మత్స్య.పు.112)

యదిదం భారతం వర్షం యస్మిన్ స్వాయంభూవాదయః.....|

అయంతు నవమస్తేషాం ద్వీపస్సాగర సంవృతః| (బ్రహ్మాండ పు.1-12 -16)

సూతుడు ఋషులకు ఈ ప్రకారం వివరిస్తున్నారు: స్వర్గపాతాళాది లోకాలకు, సప్త ఊర్ధ్వ లోకాలకు నడుమన ఉన్న భూలోకంలో భారతవర్షం మానవులు చేసిన కర్మలకు శుభాశుభ ఫలాలను ఇవ్వడానికి కారణమైనది. దక్షిణ మహాసముద్రానికి ఉత్తరాన హిమాలయాలకు దక్షిణాన ఉన్న ఈ దేశానికి భారత వర్షమని పేరు. ఈ దేశవాసులకే తాము చేసిన కర్మల ననుసరించి స్వర్గ, మోక్షాదులు లభిస్తాయి. ఈ లోకానికే మధ్యమ లోకమని వ్యవహారం. ఈ భూమిలో కాక ఇతరత్రా ఉన్నవాళ్ళకు వైదిక స్మార్త పౌరాణిక కర్మలు విధించబడలేదు.

ఉత్తరం యత్ సముద్రస్య హిమాద్రే శ్చైవ దక్షిణం ..... దేశాదయాస్తథా| (అగ్ని పు)

భగవస్ శ్రోతుమిచ్ఛామః కర్మభూమిం మహీతలే ..... ముని సత్తమాః (బ్రహ్మాండ పు)

అనే అగ్ని పురాణ, బ్రహ్మాండ పురాణ వచనాలు కూడా భారతవర్ష ప్రాశస్త్యాన్ని వర్ణించాయి. కర్మభూమిని గురించి, దుర్లభమైన మోక్ష క్షేత్రాన్ని గురించి తెలుపవలసిందిగా మేరు పృష్టమందు ఆసీనుడై ఉన్న బ్రహ్మను మునులు ప్రార్థించారు.

"శృణుధ్వం మునయస్సర్వే....." అని బ్రహ్మగారు వివరిస్తున్నారు. భుక్తి, ముక్తి ప్రదమైన శుభమైన కర్మభూమి భారత వర్షం. కర్మ ఫలాలైన స్వర్గ నరకాదులను పొందడానికి ఈ కర్మభూమియే కారణం. ఇక్కడే బ్రాహ్మణాది వర్ణవిభాగం ఉంది. ఇక్కడి వారు స్వకీయ కర్మలను ఆచరించి తరిస్తున్నారు. ఇందులో సంశయం లేదు. ఇదే ధర్మ, అర్థ, కామ, మోక్ష పురుషార్థ చతుష్టయానికి ఆధారమైంది. ఇంద్రాదులు ఇంద్రత్వ ప్రాప్తికి పూర్వం ఇక్కడే వైదిక కర్మల నాచరించి పదవుల నధిష్ఠించారని, దేవతలకు కర్మాధికారం లేదని మీమాంసా సిద్ధాంతాన్ని అనుసరించి చెప్పవలసి ఉంది.

ఈ సిద్ధాంతాన్ని అనుసరించే తై.సం.||ప్రథమ కాండ 6వ ప్రశ్నలో **"ప్రజాపతిర్యజ్ఞానసృజత"** అనే వాక్యంలో అగ్నిహోత్ర దర్శపూర్ణ మాస కర్మలను ప్రశంసించే సందర్భంలో **"తేన ప్రజాపతిం నిరవాసాయ యత్ తేన ప్రజాపతిః పరమాం కాష్ఠమగచ్ఛత్"** అనే వాక్యం ప్రజాపతి, ఇంద్రుడు అగ్నిషోములు (ఇప్పటి దేవతలు పూర్వము మనుష్యులై) అగ్నిహోత్ర దర్శపూర్ణమాస కర్మలను అనుష్ఠించారని చెప్తోంది. ప్రజాపతిత్వ, ఇంద్రత్వ, అగ్నిష్టోమత్వ ప్రాప్తికి పూర్వం మనుష్య జన్మలో ఆ యా కర్మల నాచరించి ఆ యా పదవులను పొందారని సాయణ భాష్యంలో సాయణాచార్యులు వ్యాఖ్యానించారు. ఈ ప్రకారం ఆ దేవతలు కూడా ఈ కర్మభూమి యందు ఆచరించిన కర్మల సామర్థ్యం వల్లనే ఆ పదవులను పొందారని ఈ కర్మభూమి మహిమ చెప్పబడుతోంది. అంతే కాదు బుధులు, శాంతులు, వీతరాగులు (రాగద్వేషాది వికారాలను వదిలిపెట్టినవారు) ఇక్కడి నుండియే మోక్షం పొందారని శూరులు కూడా ఈ కర్మభూమియందు నివసించాలనే కోరికతో **"దేవత్వాత్ప్రచ్యుతాఃక్షితా"** అని దేవత్వాన్నుంచి జారి ఇక్కడకు రావాలని, ఈ కర్మభూమిని ఎప్పుడు దర్శిస్తామా అని ఉత్సుకతతో ఉంటారని చెప్పబడింది.

యదేతత్ భవతా ప్రోక్తం కర్మణాన్యత్ర పుణ్యదం పాపాయ వా సురశ్రేష్ఠ వర్జయిత్వా చ భారతం| తతః స్వర్గశ్చ మోక్షశ్చ మధ్యమంతశ్చ గమ్యతే |న ఖల్వన్యత్ర మర్త్యానాం భూమేః కర్మ విధీయతే| (వి.పు)

మునులు బ్రహ్మతో ఇలా అన్నారట- "ఓ బ్రహ్మన్! భారత వర్షాన్ని విడిచి ఇతర లోకాలలో గాని వర్షాలలో గాని మీరు చెప్పిన కర్మ ఫలప్రదం కానేరదని, కాబట్టి ఈ భూమియే ఉత్తమమైనదని, స్వర్గాదులే మధ్యమాలని నీచే చెప్పబడిన దానిని గ్రహించాం" అని కొన్ని వేల జన్మలకు గాని మనుష్యజన్మ, మనుష్యలోకం ప్రాప్తించవని విష్ణుపురాణం కూడా చెప్తోంది.

అత్ర జన్మ సహస్రాణాం సహస్రైరపి సత్తమ కదాచిల్లభతే జంతుర్మానుష్యం పుణ్య సంచయాత్| కర్మ భూమిరియం స్వర్గ మపవర్గం చ గచ్ఛతాం| (వి. పు)

భరత ఖండం

ఈ ప్రకారంగా భరత వర్షాన్ని గురించి చెప్పి ఆ పైన భరత ఖండాన్ని ఇలా వివరించారు.

కృష్ణసారైర్యవైర్దర్భైః చాతుర్వర్ణ్యాశ్రమైస్తథా సమృద్ధా ధర్మ దేశ శ్యాత్తమాశ్రయేరన్ విపశ్చితః| (ఆ.పు)

ఎక్కడ సహజంగా లేళ్ళు పుట్టి సంచరిస్తున్నాయో, ఎక్కడ యవలు, దర్భలు మొదలైనవి ఉన్నాయో, ఎక్కడ చాతుర్వర్ణ్య వ్యవస్థ ఉందో ఆ దేశమే కర్మానుష్ఠాన యోగ్యమైనదని, దానినే ఆ భరత ఖండాన్నే విద్వాంసులు ఆశ్రయిస్తారని దీని అర్థం.

ఇదే కర్మభూమి అని మన్వాది స్మృతుల్లోనూ, వేదంలోను కూడా వర్ణింపబడింది.

"కృష్ణశారస్తు చరతి మృగోయత్ర స్వభావతః|"

"సజ్ఞేయో యజ్ఞియోదేశః సః మ్లేచ్ఛదేశస్త్వతః పరం|" (మ.స్మృ)

ఇంతకు ముందు వర్ణించబడిన 'వేది' తర్వాత ఇపుడు మరో రీతిగా కర్మభూమి వేదిక చెప్పబడుతోంది. ఒకప్పుడు ఈ భూమి అంతా అసురుల స్వాధీనంలో ఉండేది. అపుడు దేవతలు ఎంత భూభాగాన్ని ఆక్రమించుకుని కూర్చుని, ఎంతకాలం ఎంత భాగాన్ని చూస్తున్నారో ఆ కూర్చున్నవారికి మాత్రం వారిచే చూడబడిన భాగం మాత్రం ఆ కూర్చున్నంత కాలం మాత్రమే వారిదిగా ఉంటూ ఉండేదిట. అప్పుడు దేవతలు ఏదో కొంతభాగం **"అస్త్వేవ"** శాశ్వతంగా మాకు చెందుగాక అని అసురులను ప్రార్థించగా వారు ఆ దేవతలను ఎంత భాగం ఇవ్వమంటారని అడిగారుట. దానికి దేవతలు-సలావృకీ మృగం (తోడేలు

వంటి ఒక మృగం) ఈ భూమిలో మూడు పర్యాయాలు ఎంత మేర తిరుగుతుందో అంత భాగం మాకివ్వండి అని. నిజమైన సలావృకీ మృగాన్ని పంపితే అది ఏదో కొంతవరకే తిరుగుతుందని సత్య సంకల్పుడైన ఇంద్రుడు సలావృకీ మృగ స్వరూపాన్ని ధరించి స్వయంగా **"ఇమాం సర్వమపి భూమిం త్రిః పర్యక్రామత్"** ఈ భూమి మొత్తాన్ని మూడు పర్యాయాలు తిరగ్గా దానిని (ఆ భూమిని) దేవతలు **"అవిన్దన్త"** పొందారుట.

ఎందువల్ల పొందారో అందువల్ల **"విద్"** ధాతువు సామర్థ్యంవల్ల ఆ భూ భాగానికి **'వేది'** అనే పేరు వ్యవహారంలోకి వచ్చింది. ఇందులో సలావృకీ మృగమంటే నిఘంటు ప్రకారం తోడేలు అయినా, **'సంవాదా త్ప్రామాణ్యం'** అని ఉంది కనుక పురాణ, ధర్మ శాస్త్రాల్లో దీనిని కృష్ణ మృగమని చెప్పడం యుక్తమని తోస్తోంది.

ఇందులో సమస్త భూమి వేదిశబ్ద వాచ్యమైనా కానీ ఆ యాగోపయుక్త దేశం వేరుగా కల్పించాలని విధిస్తోంది. అందుకే ఇంతకు ముందు 'ధార్మిక బ్రాహ్మణం'లో-

వాసవస్త్వా పరిగృహ్ణంతు గాయత్రేణ ఛందసా|

మొదలైన మంత్రాలచే స్వీకరించబడింది "వేది" అని చెప్పబడింది.

ఇందులో **'కృత్స్నాపి భూమిః వేదిరితి విశేషః'** అనే భాష్యం ద్వారా సోమయాగ ప్రకరణంలో **'కృత్స్నా'** శబ్దంచేత సర్వభూమి అని చెప్పబడినా, ఏదో ఒక చోట యాగం చేయకూడదు. ఇంత పరిమితము గల ప్రదేశంలో యాగశాలా నిర్మాణం సంభవిస్తుంది అని నిశ్చయించుకుని పదాలచే పరిగ్రహించాలని ఆ పదాల యొక్క పరిమాణ విశేషం చెప్పబడింది.

త్రిగ్ం శత్పదానిపశ్చాత్తిరాశ్చీ భవతి షట్ త్రిగ్ంశత్ప్రాచీ చతుర్విగ్ంశతిః పురస్తాత్తిరాశ్చీ దశ సంపద్యంతే|
(తై.సం.6-2-4)

అనే శ్రుతి సౌమిక వేది మొత్తం తొంబై (90) అడుగుల పరిమితంగా ఉండాలని విధించింది. దీనివల్ల విరాట్ సంపత్తి, దానివల్ల అన్న సమృద్ధి కలుగుతాయని వేద పురుషుని అభిప్రాయం. ఈ ప్రకారం పరిమితంగా నిశ్చయించబడిన ప్రదేశమే వేదిశబ్ద వాచ్యం.

వేది మాహుః పరమంతం పృథ్వివ్యా యజ్ఞ మాహుర్భువనస్య నాభిం| (తై.స.7-4)

అనే మంత్రభాష్యంలో వచ్చే 'అధిక' శబ్దానికి ఉత్కృష్టం అని అర్థం. అంటే చాలా గొప్పది.

సోమ ప్రకరణంలో కూడా-

ఏతావతీ వై పృథివీ యావతీ వేదిః| (శ్రుతి)

అనే మంత్రం కూడా దేనిని వేది అని చెప్పిందో అదే పృథివి అని చెప్తోంది కనుక వేది శబ్దంచే చెప్పబడిన భూభాగం కంటే శ్రేష్ఠమైన ప్రదేశం లేదని చెప్పడం తాత్పర్యం.

ఏతావాన్ ఖలు వై పురుషః యా వదస్య విత్తం| (శ్రుతి)

అంటే విత్త సమృద్ధి కలవాడే పురుషుడట. అనగా ధనం లేనివాడి కంటే ధన సమృద్ధి కలవాడు శ్రేష్ఠుడు అని చెప్పడం తాత్పర్యం. దీనివల్ల సారాంశ మేమంటే, మహామేరువు నడుమన ఉన్న భూలోకమంతా సామాన్యంగా వేది అని చెప్పబడుతున్నా విశేషంగా శ్రుత్యుక్త ప్రకారం పరిష్కరించబడిన ప్రదేశమే వేదిగా నిర్ణయించబడుతుంది. అయితే-

సర్వతః పరిక్రామతి సా వా ఇయగ్ం సర్వైవ వేది|

అనే శ్రుతి భూభాగమంతా వేదిగానే చెప్పి, వైదిక కర్మార్హత కలదని తెలియచేస్తుంటే భారతవర్షం, భారత ఖండం మాత్రమే అర్హత కలదని ఎందుకు చెప్పవలసి వచ్చిందని శంక కలుగుతుంది. దీనికి కూడా శాస్త్ర సమాధానం చెప్పారు.

యధా చమస మన్యాగ్ శ్చమసాగ్ శ్చమసి నో భక్షయంతి సర్వే హారియోజన మీప్సంతేః| (మీ.శా.3-5-10)

అనే దాంట్లో వినబడే చమసలు (చతురస్రమైన యజ్ఞపాత్రలు) గల రుత్విక్కులతో బాటు చమస లేని **'గ్రావస్తుత్'** అనే ఋత్విక్కులు కూడా చెప్పబడ్డారా లేదా అని సంశయించి సమాధానం చెప్పబడుతోంది. చమసులకు (చమసలు కలిగిన వారికి) వారికే కేటాయించిన ఆ యా చమసలందు మాత్రమే భక్షణ చెప్పబడి ఇప్పుడు హారియోజన పాత్రలో చమసులందరికీ సర్వ శబ్దంచే భక్షణ విధించబడడంవల్ల **'గ్రావస్తుత్'** అనే ఋత్విక్కుకు భక్షణం లేదని పూర్వపక్ష వాదుల (శంకించే, విరోధించే వారి) అభిప్రాయం కాగా,

కించన యుక్తః సర్వశబ్దః పురుషమాత్ర గామీసస్ అధికారేణ విశేషతః పునః చమసి శబ్దేన ప్రయోజనాంతర ఔపాధికేన సతా విశేష్టుం| (తం.వా.టీ)

అనే దాంట్లో సర్వశబ్దం నిరవధికంగా సర్వపురుషులను చెప్పింది. గాని **"పరామ సర్వమ్"** నిరవధిక మవడం వల్లను వ్యవహారయోగ్యత లేకపోవడం వల్లను, చమసి శబ్దం ఇదివరకే కొంతమంది పురుషులకు విశేషంగా వ్యవహరించబడినందువల్ల ఈ హారియోజన వాక్యంలో మళ్ళీ అధికారి విశేషం అవడానికి యోగ్యత లేనందువల్ల ఈ హారియోజనపాత్ర ఇంతకుముందు చెప్పిన చమసకంటే మహాభాగమైనందువల్ల ఇక్కడ వినబడిన సర్వశబ్దంచే గ్రావస్తుత్ అనే ఋత్విక్కును కూడా గ్రహించి అందరికీ హారియోజన పాత్రస్థ భాగానికి భక్షణాధికారం ఉందని నిర్ణయించారు.

దీనివల్ల తేలిందేమంటే ఇంతకుముందు లేని గ్రావస్తుత్ అనే ఋత్విక్కును కూడా గ్రహించి అతనికి కూడా భక్షణాధికారం చెప్పినా, సర్వ శబ్దం సమస్త పురుషులను చెప్పేదయినా **'పరామసర్వాణి'**కి యోగ్యత లేనందువల్ల ఋత్విఙ్మాత్ర పరంగా సంకేతం చేయక తప్పలేదు.

అదే విధంగా సూత్రభాష్యంలో పారిప్లవణాధికారణ భామతీ గ్రంథంలో -

సర్వే బ్రాహ్మణా భోజయితవ్యాః|

అనే దాంట్లో '**సర్వేబ్రాహ్మణాః**' అంటే నిమంత్రణ చేయబడిన బ్రాహ్మణులందరూ భోజయితవ్యులు (భోజనం చేయింపదగినవారు) అని మాత్రమే గాని కనబడిన సర్వ బ్రాహ్మణులు భోజయితవ్యులు అని మాత్రం కాదు అని సంకోచింప చేశారు.

పైన ఉదహరించిన రెండు అధికరణాలయొక్క న్యాయప్రకారం ఈ భూ ఖండంలో భారతదేశం, భరత ఖండమే వైదిక కర్మార్హత కల వేది (వేదిక)గా నిర్ణయించడం యుక్తమని నిరూపించడమైంది. ఈ సంకోచ నిర్ణయానికి స్మృతి ముక్తాఫలం, మనుస్మృతి, ఆదిత్య పురాణం మొదలైన ఎన్నో ప్రమాణాలున్నాయి. అంతే కాదు మళ్ళీ ఈ భరతఖండంలో ఆర్యావర్తం, బ్రహ్మావర్తం, బ్రహ్మర్షి దేశం, మధ్యదేశం మొదలైన అవాంతర విశేషాలు కూడా చెప్పబడ్డాయి శ్రుతి, స్మృతి, పురాణాల్లో.

వైదిక కర్మల నాచరించడానికి దేశంతో పాటు కాలం కూడా ముఖ్యమైంది. కాల విభాగాన్ని విచారించడంలో కన్యాకుమారి నుండి హిమవత్పర్వతాల వరకు గల భూమి 8వ ఉత్తర అక్షాంశం (8^0 North Latitude)తో ప్రారంభమై రమారమి 35వ ఉత్తర అక్షాంశం (37^0 North Latitude) వరకు దక్షిణోత్తరాలకు వ్యాపించి ఉంది. ఈ భాగాన్ని మాత్రమే కర్మార్హత కలిగిన భూమిగా గ్రహించడంవల్ల ఈ దేశంలో గల

అహోరాత్రకాల ప్రమాణం ఇతర కాలావయవ విభాగం కూడా వైదిక కర్మార్హకాలంగా సాధించుటకు ఉపయోగపడుతుంది.

ఇతర ప్రాంతాల్లో ఇలాంటి అవకాశం లేదనే భావం కలగడానికి భౌగోళిక స్థితే నిదర్శనంగా ఉంది. ఇంకా జంబూద్వీప వర్ణనలోని-

మధ్యే తస్య మహామేరుర్విధూమ ఇవ పావకః| వేద్యర్థం దక్షిణం మేరోరుత్తరార్థం తతోత్తరం| (అ.పాదం1-2-15)

అనే వచనం జంబూద్వీపం మధ్యలో మేరువు ఉందని పేర్కొంటోంది. ఇంకా, ఉత్తర భాగంలో, దక్షిణ భాగంలో ఉన్న విభాగాన్ని గురించి ఇలా ఉంది -

ధనుసంస్థేయ విజ్ఞేయే ద్వే వర్షే దక్షిణోత్తరే దీర్ఘాణి తత్ర చత్వారీ మధ్యమం తడిలావృతం అర్వాక్ చ నిశాదస్యాదధ వేద్యర్థం దక్షిణం స్మృతం పరం నీలవతో యచ్చ వేద్యర్థం చ తదుత్తరం వేదర్థే దక్షిణే త్రీణి వర్షాణి చోత్తరే తయోర్మధ్యే తు విజ్ఞేయో మేరుర్మధ్య ఇలావృతం|

ఇందులో వేది శబ్దం జంబూద్వీప భూభాగాన్ని గురించి చెప్పినట్లు తోస్తోంది. ఈ భాగం మధ్యలో మేరువు ఉందని దానికి దక్షిణ భాగంలో 3 వర్షములు ఉన్నాయని కూడా చెప్తోంది.

భారతదేశంలో ఉత్తర అక్షాంశంలో గల ప్రాంతాలు ఉత్తర అక్షాంశ (రమారమి) 7.57(కాశ్మీర్) నుండి 37 (కన్యాకుమారి) వరకు, తూర్పు రేఖాంశంలో 64° (గుజరాత్) నుండి 96° (అరుణాచల ప్రదేశ్) వరకు (7.57-35° N Latitude, 64-96° E Longitude) గల ఈ భూభాగం భారతదేశంగా ఆధునికులచే నిర్ణయించబడుతోంది. వేదోక్తమైన ప్రతి కర్మకు దేశ, కాలాల ప్రాముఖ్యం ఉంది కనుక తదనుగుణ భూమి భారతదేశమని గుర్తించడం వల్లనే భారతీయులు ఈ దేశాన్ని కర్మార్హభూమిగా ఎన్నుకున్నారు.

ఇక కాలనిర్ణయం ఇలా ఉంది. ఉత్తర అక్షాంశంలో 8వ ఉత్తర అక్షాంశం నుండి (8^0N) వెనుక భాగంలో (దక్షిణంలో) సముద్రం ఉంది. 35వ ఉత్తర అక్షాంశం (35^0N) దాటేక కాలభేదం ఉన్న మ్లేచ్ఛాది దేశాలు ఉన్నాయి. దక్షిణంలో సముద్రం, అందులో మునిగిన ద్వీపాలు ఉండడంవల్ల, అలాగే 35వ అక్షాంశం దాటిన పైన కాలవ్యత్యాసాలు ఉండడం వల్ల దేశకాలాలు రెంటినీ సమన్వయించి ఈ భరత భూమిని మాత్రమే కర్మభూమిగా గ్రహించినట్లు, ఇక్కడ కాకుండా వేరే దేశాల్లో తగిన భూమి ఉన్నా పైన చెప్పిన కారణాలచేత ఇతర దేశమందు (భూమియందు) కర్మార్హత చెప్పబడలేదని తోస్తోంది.

దక్షిణ అక్షాంశ	రేఖాంశ	ప్రదేశం
14.59	28.67 (ప.)	అట్లాంటిక్ మహాసముద్రం
33.13	81.82 (తూ.)	హిందూ మహా సముద్రం
8.78	55.49 (ప.)	దక్షిణ అమెరికా
14.23	51.92 (ప.)	బ్రెజిల్
30.56	22.93 (తూ)	దక్షిణాఫ్రికా
35.67	71.54 (ప.)	చిలీ
38.41	63.61 (ప)	అర్జెంటీనా

27.68	121.62(తూ.)	పశ్చిమ ఆస్ట్రేలియా
30.00	136.20 (తూ.)	దక్షిణ ఆస్ట్రేలియా

ఈ పైన చెప్పిన దేశాల్లో అహోరాత్ర వ్యవస్థ సమానంగా ఉండదు. ఇక్కడ మనకు ఉదయం అయితే కొన్ని దేశాల్లో ఇంకా తెల్లవారక పోవడం, మరికొన్ని దేశాల్లో మధ్యాహ్నమవడం, ఇంకా కొన్ని దేశాల్లో సాయంత్రం/ రాత్రి అవడం మనకందరకూ పరిచయమే కదా! ఇన్ని కారణాలచేత భారతదేశం కర్మలకు అర్హమైనదిగా వర్ణింపబడి, నిరూపించబడడం అయింది.

శంకా సమాధానం

అయితే భూలోకం, తత్రాపి భారత ఖండం మాత్రమే కర్మానుష్ఠాన యోగ్యమైనదని వర్ణించి, నిర్ణయించడం అనేది సంకుచిత భావం కాదా? ఆ వైదిక కర్మలతాలూకు ఫలం ఈ ఖండవాసులే అనుభవించాలా?అనే శంకకు సమాధానం. భరతఖండంలో ఆచరించిన కర్మల వల్లనే ఖండాంతరాలకి కూడా సమృద్ధి కలుగుతుందని చెప్పారు. ఈ బ్రహ్మాండమంతా విరాట్పురుషుని స్వరూపంగా చెప్పబడుతోంది. అందులో భారతదేశం మధ్యస్థమైన ఉదర భాగంగా, ఖండాంతరాలు అవయవ స్థానాలుగా చెప్పబడుతున్నాయి. లోకంలో ప్రతి వ్యక్తికి ఉదరంచే స్వీకరించబడ్డ అన్నం చేతనే ఇతర వాక్, చక్షురాది ఇంద్రియాలకు పాటవం కలుగుతోంది. ఏ ఇంద్రియం పనిచేయకపోతే ఆ ఇంద్రియానికి అన్నాన్ని మర్దన చేయం. ఉదరంచే ధరించబడిన అన్నరసం చేతనే ఇతర ఇంద్రియాలకు కూడా పుష్టి కలుగుతుండడం మనకందరకూ తెలుసు కదా! దానికి-

"మధ్యత ఏవ ప్రజానామూర్జం దధాతి"

"మధ్యత ఊర్జా భుంజతే| మధ్యతోహ్యన్న మాసితం ధినోతి||"

వాచో విసర్జన మిత్యాహ| యదాహి ప్రజా ఓషధీనామశ్నన్తి| అథ వాచమ్ విసృజంతే (తై. బ్రా.)

మొదలైన శ్రుతులన్నీ ప్రజలు ఉదర మధ్యభాగమందే అన్నాన్ని స్థాపిస్తున్నారని, ఎప్పుడు ఓషధుల సారమైన ధాన్యభూత పదార్థాలని భుజిస్తున్నారో అప్పుడు వారు మాట్లాడడానికి సమర్థు లవుతున్నారని తెలియచేస్తున్నాయి. అలాగే భోజనం ద్వారా చక్షురింద్రియం, శ్రోత్రేంద్రియం మొదలైనవి పని చేస్తున్నాయి, నడవడానికి సమర్థు లవుతున్నారు. ఇదంతా ఉదరంచే ధరించబడిన ఆహారం వల్లనే జరుగుతోందని అందరికీ అనుభవమే కదా!

ఆ ప్రకారం విరాట్పురుషునికి ఉదరస్థానమైన భరతఖండంలో అనుష్ఠించబడే వైదిక కర్మల సామర్థ్యంచే ఖండాంతరాలు కూడా పుష్టి చెందుతున్నాయనడంలో సంశయం లేదు.

త్రయ ఇమే లోకాః| ఏషాం లోకానామాప్త్యై| (తై. బ్రా.)

అనే శ్రుతి, ఖండాంతరాలకే కాదు లోకాంతరాలకి, లోకాంతర వాసులకి కూడా సమృద్ధిని ఇస్తాయని ఘోషిస్తోంది. ఇంతే కాదు, మరింత సులభగ్రాహ్యమైన ఉదాహరణగా మన గ్రామాల్లో పెద్ద కాలువల్లో గాని, పంట కాలువల్లో గాని నీరు విడుదల (సప్లై) కావాలంటే మన గ్రామాల్లో కాకుండా ఆ యా లాకుల వద్ద వదలాలని, మన ఇళ్లలోకి విద్యుత్తు కూడా సరఫరా కేంద్రం (పవర్ హౌస్) నుంచి రావలసిందే అని కూడా అందరకూ తెలిసినవే. అంటే, పవర్ హౌస్ లాంటి భరత ఖండంలో అనుష్ఠించబడ్డ వైదిక కర్మలవల్ల ఖండాంతరాలకు కూడా పుష్టి కలుగుతుంది అనడంలో సంశయం లేదని స్పష్టం.

ఇతర ఖండాలలో వైదిక కర్మల ఆచరణ

వైదిక కర్మల్ని ఖండాంతరాల్లో ఆచరించవద్దని శ్రుతి ప్రత్యేకంగా చెప్తోంది.

యాని వా ఇమాని పృథివ్యాశ్చిత్రాణి తాని నక్షత్రాణి| తస్మాదశ్లీలనామగ్గ్ శ్చిత్రే | నావస్యేన్నా యజేత| యథా పాపాహే కురుతే| తాదృగేవ తత్| (తై. బ్రా.)

భూలోకానికి సంబంధించిన వివిధాలైన గ్రామ నగరాదులు, ద్యులోకానికి సంబంధించిన వివిధాలైన అశ్విని మొదలైన నక్షత్రాలవలె ఉపకారకాలు అవడం వల్ల, ఆ గ్రామ, నగరాదులు అశ్విన్యాది నక్షత్రాలతో సమానం. దుష్ట నక్షత్రాల్లో పుణ్యకర్మానుష్ఠానం నిషేధించబడింది. అటువంటి అశ్లీల (ప్రతికూల) నక్షత్ర సదృశమైన మ్లేచ్ఛజన భూయిష్ఠ దేశంలో నివసించకూడదని, యాగాద్యనుష్ఠానం చేయకూడదని పై శ్రుతి నిషేధిస్తోంది. చాతుర్వర్ణ్య వ్యవస్థ లేని దానిని మ్లేచ్ఛ దేశంగా స్మృత్యాదులచే చెప్పబడింది. దీనివలన భరతఖండం కాని ఖండాంతరాల్లో నివసించకూడదు. భరతఖండమే వైదిక కర్మాధికార భూమిగా ప్రశంసించబడుతోంది. ప్రశస్తికి చాతుర్వర్ణ్య వ్యవస్థ ఉండడం కారణమైనందున ఇంతకుముందు మేరువును వర్ణిస్తూ-

చాతుర్వర్ణ్యస్స సౌవర్ణో మేరుశ్శోల్బమయః స్మృతః|

మొదలైన పురాణ వచనాలచే మహామేరువు, చాతుర్వర్ణ్య వ్యవస్థతో కూడి విరాట్పురుషునికి అవతారస్థానం గాను, బ్రహ్మకు నాభిస్థానంగాను వర్ణింపబడి ఉన్నందువల్ల ప్రసంగాను ప్రసంగంగా చాతుర్వర్ణ్య వ్యవస్థను గురించి చెప్పవలసిన అవసరం కలిగింది. ఈ అధునాతన కాలంలో ఖండాంతరాల్లో నివశించకూడదన్నా అక్కడ వైదిక కర్మాచరణకు అర్హత లేదన్నా చాలా మంది నన్ను ద్వేషించగలరు, అపహసించగలరు అనడంలో సందేహం లేదు. ఆ వాదంయొక్క ప్రవాహాన్ని నేను నిరోధించలేనని తెలిసినా, శాస్త్ర సిద్ధాంతాలను తెలియక కాలం మారినందున మనం కూడా దాని ననుసరించి మారాలనే వాదం ప్రబలంగా ఉందని తెలిసినా కూడా ఆ వివాదాన్ని రెచ్చగొట్టడానికి గాక, కేవలం లోకానికి శాస్త్రీయ సిద్ధాంతం తెలియడానికి ఈ వ్యవస్థలోని లౌకిక చాతుర్వర్ణ్య వ్యవస్థ వివరించబడుతోంది. ఈ వ్యవస్థ వల్ల లౌకికంగాను, శాస్త్రీయంగాను ఎవరికీ అనర్థం లేదని, మోక్షమనే పురుషార్థ సాధనలో మార్గ భేదాలచే అందరికీ అధికారం ఉందని, ఇటువంటి వ్యవస్థలవల్ల అనర్థం లేకపోవడమే గాక, లౌకిక ప్రయోజనం కూడా ఉందని, ఈ వ్యవస్థను బాగా పాటించిన సమయంలో అందరూ ఐక్యమత్యంగా ఉండే వారని కూడా సువిమర్శ చేస్తే తెలుస్తుంది. కానీ ఈ వివాదాన్ని తీసుకువచ్చింది ఆర్య సామాజిక మతం, పాశ్చాత్య పండితులు, తదనుయాయులైన భారతీయులు. అంటే, చాతుర్వర్ణ్యమనేదానికి వర్తమాన మనుష్యుల యొక్క గుణకర్మలను అనుసరించి విభాగమే కానీ జన్మతః బ్రాహ్మణత్వ, క్షత్రియత్వాది చాతుర్వర్ణ్య వ్యవస్థ లేదని అంటున్నారు.

దీనికంతకూ కారణం వేదమంటే ఏమిటి అనే విచారణలో సంప్రదాయకులకు, ఈ ఆధునికులకు భిన్న భిన్న దృక్పథాలుండడమే. శ్రీ స్వామి దయానందులు తదనుయాయులు, పాశ్చాత్యులు సంహితలకు మాత్రమే వేదశబ్ద వాక్యత్వాన్ని అంగీకరించి బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు వేదశబ్ద వాచ్యాలు కావని నిర్ణయించారు. కాని ఈ వాదం ఆర్ష సమ్మతం కాదు.

వేద స్వరూప, తత్ప్రామాణ్య, తదర్థ నిర్ణయాల్లో జైమిన్యాది మహర్షికృత శాస్త్ర సంప్రదాయవిదులైన భారతీయుల దృష్టి వేరుగా ఉంది. ఆ శాస్త్ర సాంప్రదాయం తెలియని ఆధునికుల దృష్టి వేరుగా ఉంది. ఇందులో మొదటి దాని ప్రకారం మంత్ర, బ్రాహ్మణ, సముదాయత్మకమైనది వేదం. మరియు వీరి దృష్టిలో వేదాలు

చాలా పవిత్రమైనవి. ఉపనీతులైనవారు ఏ ప్రయోజనాన్నీ అపేక్షించకుండా వేదం, తదర్థ ధారణ చేసి తీరాలని, లేకపోతే ప్రత్యవాయం సంభవిస్తుందని సుదృఢమైన విశ్వాసం. శాస్త్ర సంప్రదాయాలేమీ తెలియని విమర్శకాగ్రేసరులు మాత్రం శబ్దార్థ సంబంధం పురుష కృతమని, తద్వారా వేదాలు పౌరుషేయాలని, వేదాలు లౌకికకార్య భోధకాలని, మహర్షులు మంత్ర ద్రష్టలు కారని, వారు మంత్రకర్తలే అని వాదిస్తారు.

ఇందులో మరో తెగవారు మంత్రాలు ముందుగా రాయబడ్డాయని, బ్రాహ్మణాలు తర్వాత రాయబడ్డాయని విమర్శిస్తారు.

బ్రాహ్మణ భాగాలందు ఎందుకీ పక్షపాతబుద్ధి కలిగిందో తెలియడం లేదు. బ్రాహ్మణాలంటే మంత్రార్థాలను తెలుసుకోవడానికి మంత్ర వ్యాఖ్యాన రూపమే కదా! మంత్రాధ్యయనం పూర్తయ్యాక వ్యాకరణాది శాస్త్రాల్లో భూరి పరిశ్రమ చేస్తే దాని అర్థం అనాయాసంగా బోధపడుతుంది. బ్రాహ్మణాలతో పని లేదంటే మహర్షులు తపో విశేషాలచే స్వాధీనం చేసుకున్నా, మంత్ర భాగాలకి శాస్త్ర బలంతో వాటి అర్థావధారణ చేసినా ఈ మంత్రాలకు విశిష్ట ప్రయోజనమేముంది? అనే శంకకు సమాధానాలు కావలసి వస్తాయి.

కర్మల్లో మంత్రాలకు విశిష్టమైన వినియోగాన్ని బోధించేవి బ్రాహ్మణాలు. మంత్రాల ననుసరించి బ్రాహ్మణాలు, బ్రాహ్మణాల ననుసరించి మంత్రాలు అవినాభావంగా ఉంటున్నాయి. మంత్ర బ్రాహ్మణ పాఠాలలో ఏవి ప్రబలమైనవి అనే విచారణలో 'కర్మానుష్ఠాన కాలంలో వినియోగింపబడడంచే మంత్రాలు అంతరంగాలని, బ్రాహ్మణ వ్యాక్యాలు ఆ యా కర్మలను విధించి చరితార్థ మవడంవల్ల బహిరంగాలని, ఈ అంతరంగ బహిరంగాలలో **"అంతరంగస్య ప్రాబల్యం"** అనీ మీమాంసకులు వ్యవస్థ చేశారు. అందుకే, బ్రాహ్మణ వినియోగాన్ననుసరించి మంత్రగత పదాలకు అర్థం చెప్పవలసిందిగా మీ.శా.3-3వ పాదంలో ఐంద్ర్యధికరణంలో నిర్ణయించారు. ఇక్కడ మంత్ర, బ్రాహ్మణ పాఠాలకే అంతరంగ బహిరంగ భావం గాని, మంత్ర బ్రాహ్మణాలకు కాదని గమనించాలి.

మంత్రాలు లేకుండా బ్రాహ్మణాలకు, బ్రాహ్మణాలు లేకుండా మంత్రాలకు స్వరూప లాభమే కుదరదు. ఈ రెండు భాగాలు ఒకే సూత్రంలో శ్రౌత స్మార్త కర్మల్ని ఉద్ధరిస్తున్నాయి. ఈ కర్మానుష్ఠానం కోసం మానవులు, మానవులకోసం కర్మలు విధింపబడ్డాయి. ఇటువంటి కర్మలను చెప్పే బ్రహ్మను ప్రతిపాదించే వేదవాక్య విచారణ ద్వారా వేదవాక్యార్థ నిర్ణయం కొరకే పూర్వోత్తర మీమాంసా శాస్త్రాలు ప్రవృత్తమయ్యాయి. మహర్షి జైమిని, వ్యాసాద్యాచార్యులచే ప్రవర్తించబడిన సూత్రాలన్నీ వేదవాక్య గర్భితాలే అని గుర్తించాలి. పూర్వమీమాంస సాధారణంగా విధివాక్య, అర్థవాద వాక్యాలను ఉదహరిస్తుంది.

కర్మ చోదనా బ్రాహ్మణాని బ్రాహ్మణ శేషేనార్థవాదః| (శ్రౌ.ప.సూ)

అనే వాక్యం విధి వాక్యాలు, అర్థవాద వాక్యాలు బ్రాహ్మణాలే అని పేర్కొంటోంది. బ్రాహ్మణ గ్రంథం వేదం కాకపోతే ఈ రెండూ ఎందుకీ విచారణలో ప్రవర్తించాయి అని కూడా మనం ఆలోచించవలసి ఉంది.

అంతే కాదు, మంత్రార్థ నిర్ణయంలో ప్రశస్తమైన, బాధా రహితమైన సామాగ్రి ఆపేక్షించబడుతోంది. అందులో ఆరంభంగా పద-పదార్థ జ్ఞానము, శిక్షా, వ్యాకరణాది షడంగ శాస్త్రాలను వినియోగించినా సంశయ స్థలాల్లో ఆ సంశయ నివృత్తి ద్వారా విశిష్ట వాక్యార్థ నిర్ణయం మీమాంసా శాస్త్రం చేస్తుంది. ఇందులో **"సందిగ్ధే తు వాక్యశేషాత్"** (జై.సూ.) అనే వాక్య శేషాధికరణాలచే అర్థ నిర్ణయం చేయవలసి వస్తుంది. వీటిని విడిచి స్వాతంత్ర్యంగా వేద వాక్యాలకు అర్థం చెప్పబూనడం అత్యంత సాహసోపేతం అనక తప్పదు.

కొంతమంది వేదాల్లో నిరర్థక శబ్దాలున్నాయని నిస్సంకోచంగా ప్రకటిస్తూ, ప్రవర్తిస్తున్నారు. ఇలా ప్రవర్తించడం స్థాణ్వంధన్యాయంగా ఉంది.

నాయం స్థాణోరపరాధః అంధః స్థాతమం నా పశ్యతి చేత్|

అంటే అంధుడు స్థాణువుని (శిలని) చూడకపోవడం స్థాణువు యొక్క అపరాధం అన్నట్లుంది. ఇటువంటి సందర్భంలో అర్థ నిర్ణయంకోసం మీమాంసా శాస్త్రం అధ్యాయం 4వ పాదంలో-

తత్ సిద్ధిపేటిక – తత్సిద్ధి, జాతి, సారూప్య, ప్రశంసా, లింగ, భూమభిః షడ్భిః సర్వత్ర శబ్దానాం గౌణీ వృత్తిః ప్రకల్పితా|

అని చెప్పి, **యజమానః ప్రస్తర ఆదిత్యోయూపః|**

మొ||చోట్ల పై ఆరింటి చేత యజమాన, ఆదిత్య వంటి కొన్ని శబ్దాలకు గౌణీ వృత్తిని అంగీకరించి అర్థం చెప్పాలని నిర్ణయించారు. అంటే సారాంశం- ఎక్కడ ముఖ్యార్థం, ఎక్కడ గౌణార్థం అని నిర్ణయం చేసే ముందు మంత్రార్థ విషయంలో వెనుక చెప్పిన శిక్షావ్యాకరణాది శాస్త్రాలు, పూర్వోత్తర మీమాంసలు వంటి వాటి సహాయం కోసం ప్రయత్నించడం అవసరం, స్వతంత్ర్యంగా అర్థం చెప్పకూడదు అని!

ఇందు నిమిత్తం మీమాంసా శాస్త్రంలో ఐంద్ర్యధికరణ, అక్తాధికరణాదులలో బ్రాహ్మణ వాక్య విచారణే జరుపబడుతుంది. ఇటువంటి అధికరణాలు ఎన్నో ఉన్నాయి. కనుకనే మంత్రాలకు బ్రాహ్మణాలకు అవినాభావ సంబంధాన్ని అంగీకరించి తీరాలి. మరొక వాదం- "వేదంలో గల శబ్దాలకు యౌగికార్థాన్నే చెప్పాలి గాని రూఢ్యర్థాన్ని స్వీకరించకూడదని, కొన్ని చోట్ల అలా చెప్పిన జైమిని, వ్యాస, విద్యారణ్యులు పొరబడ్డారని చెప్పడం". నిజంగా ఇది ఎంత సాహసమో! శాస్త్రకారులు ఎంత నిష్పక్షపాతంగా వ్యవహరించారో చూడండి. మళ్ళీ వెనక్కి మళ్ళి, చాతుర్వర్ణ్యం జన్మ సిద్ధమా లేక మనుష్యుల గుణకర్మలను గురించి కల్పితమా అని విచారించవలసి ఉంది. ఆధునికులు ఆంగ్ల భాషా శిక్షా పండితులు చాలామంది మనుష్యత్వ జాతిని మాత్రం అంగీకరిస్తూ బ్రాహ్మణత్వ క్షత్రియత్వాది జాతిభేదం మాత్రం లేదంటున్నారు.

అలా అంగీకరిస్తే (జాతులున్నాయని) పరస్పరం వీరిలో సంతాన సంబంధం లేకపోతుంది. కానీ నిజానికి వీరిలో సంబంధం ఉంటోంది కనుక భిన్నజాతి అని అంగీకరించకూడ దంటున్నారు. అది యుక్తం కాదు. అవాంతర జాతి భేదాన్నంగీకరించినా వీరి పరస్పర సంయోగంచే సంకర జాతికి చెందినవారు జనించగలరు. ఉదా-

బ్రాహ్మణ్యాం క్షత్రియాదుత్పన్నో మాహిష్యః క్షత్రియాయాం వైశ్యాదుత్పన్నా కరణీ తస్యాం కరణ్యాం మాహిశ్యాదుత్పన్నో రథకారః| (మీ.న్యా.ప్ర)

అనే మీమాంసా న్యాయ ప్రకాశ వాక్యం పురుష మేధనమనే క్రతువుల్లో వినియోగింపబడే తై.బ్రా.3-4వ ప్రశ్నలో **"బ్రహ్మణే బ్రాహ్మణామాలభతే"** అని ఉపక్రమించి **"అతిక్రుష్టాయ మాగధామ్ గీతాయ సూతం"** మొ|| అనేక వినియోగ విధులు చెప్పబడ్డాయి. వీటి భాష్యంలో-

అతి క్రుష్టాయ అతినిందిత దేవాయ మాగధం - క్షత్రియాయాం వైశ్యేన ఉత్పాదితం సూతం, బ్రాహ్మణ్యాం క్షతియేణ ఉత్పాదితం గానజీవనం|

అని పేర్కొంటూ క్షత్రియ స్త్రీయందు వైశ్యునికి ఉత్పాదితుడు మాగధుడు అని, బ్రాహ్మణ స్త్రీ యందు క్షత్రియ ఉత్పన్నుడు సూతుడని వివరించారు. ఇంతకు ముందు వివరించిన దానికి, ఈ వివరణకు పరస్పర

విరోధం శంకించ నవసరం లేదు. శబ్ద భేదమే గాని అర్థ భేదం లేదని అంగీకరించాలి. ఈ విధంగా అనేక సంకర వర్ణాలున్నాయి.

లోకంలో పశుత్వ జాతి అంతా ఒకటే అయినా అవాంతరమైన అశ్వజాతి, గర్దభజాతులను అంగీకరిస్తూనే ఉన్నారు. ఇట్లు అంగీకరించిన గర్దభ జాతికి చెంది భిన్నజాతీయమైన స్త్రీ అశ్వమందు జనించినది కంచరగాడిద అని తై.సం.7-1-1లో **"తస్మాద్గర్దభోద్విరేతాః తస్మాడ్వడబా ద్విరేతాః"** అనే శ్రుతులు బోధిస్తున్నాయి. ఈ ప్రకారం కేవలం మనుష్యుల్లోనే కాక పశువుల్లో పశువుల తాలూకు భేదం, వృక్షాల్లో వృక్షాల తాలూకు భేదం నిరూపించబడింది.

వృక్షాయుర్వేదేహి వృక్షా అపి బ్రాహ్మణ క్షత్రియ వైశ్యాది చతస్రుషు శ్రేణిషు విభాక్తాః లఘుః కోమలః అనాయాసమేవ అన్యేన వృక్షేణ సహ సుయోజ్యః లఘుః బ్రాహ్మణః, సుదృఢః సహజమేవ అన్యేన సహ అసంయోజ్యః క్షత్రియః కోమలః గురుభారః వైశ్యః దృఢో గురుభారశ్చ శూద్రః|

అని వృక్షాల్లో లఘు, కోమల, సంయోజ్య, అసంయోజ్యాలు బ్రాహ్మణాది వర్ణ చతుష్టయానికి సంబంధించినవి అని, దానికి దృష్టాంతంగా జలయాన (పడవ,ఓడ) నిర్మాణ విషయంలో భోజమతంలో క్షత్రియ కాష్ఠ ఘటితమైన (అంటే క్షత్రియ జాతికి చెందిన వృక్ష భాగాలతో చేసిన) జలయానాలు సుఖసంపత్తుల నిచ్చేవని చెప్పబడింది.

అలాగే సర్పాల విషయంలో 'భవిష్య పురాణం'లో ప్రశ్న, ప్రతివాచన రూపంగా **"సర్పాణామ్ కతిరూపాణి? కే వర్ణాః? కే చ లక్షణాః? కా జాతీస్తూ భవేత్తేషాం? తేషు యోని కులేషు వా?"** అని ఉంది. అంటే, సర్పాలకు ఎన్ని రూపాలు, ఏ వర్ణాలు, ఏమి లక్షణాలు, ఏ జాతి మొ||వి ప్రశ్నలు. వీటికి సమాధానం –

శుక్ల తు బ్రాహ్మణీ జ్ఞేయా రక్తాతు క్షత్రియా స్మృతా| వైశ్యాతు పీతికా జ్ఞేయా కృష్ణా శూద్రా తు కథ్యతే|
(భ.పు.33 అ)

శుక్లవర్ణం (తెల్లనిరంగు) కలది బ్రాహ్మణ జాతికి, అర్క వర్ణం కలది క్షత్రియ జాతికి, పచ్చటి వర్ణం కలది వైశ్యజాతికి, కృష్ణవర్ణం కలది శూద్రజాతికి సంబంధించిందని చెప్పబడింది.

దీనివల్ల తేలినదేమంటే ఈ విధంగా వృక్ష, పశు, సర్పాదులందు కూడా బ్రాహ్మణాది వర్ణవిభాగం జన్మతః ఏర్పడినట్లు తెలుస్తోంది. అందుకే శ్రీ కృష్ణ భగవానుడు భగవద్గీతలో **"చాతుర్వర్ణ్యం మయా సృష్టం"** అనే శ్లోకంచే చాతుర్వర్ణ్యం "జన్మసిద్ధమని" చెప్పారు. భగవద్గీతలోని ఈ శ్లోకానికి భాష్యంలో శంకర భగవత్పాదులు పౌర్వాపర్య సంగతిని ప్రదర్శిస్తూ ఇలా అన్నారు.

కాంక్షతః కర్మణాం సిద్ధిం యజంత ఇహదేవతాః | క్షిప్రం హి మనుష్య లోకే సిద్ధిర్భవతి కర్మజా| (భ.గీ.4-12)

మనుష్య లోకంలో కర్మలవల్ల జనించే ఫలం శీఘ్రంగా సిద్ధిస్తుంది కనుక ఈ కర్మల తాలూకు ఫల సిద్ధిని కాంక్షించేవారు ఇంద్రాది దేవతల నుద్దేశించి యాగాలు చేస్తూ ఉన్నారని, ఆ ప్రకారం వర్ణాశ్రమాధికార ప్రయుక్తమైన కర్మానుష్ఠానంచే శీఘ్ర ఫలసిద్ధి సంభవిస్తుందని వివరించారు. వర్ణవ్యవస్థ గురించి ఇంత విపులంగా చెప్పారు. ఇప్పుడు వర్ణవ్యవస్థ ఉందా? అని శంక కలుగుతుందని ఆలోచించి, దానికి సమాధానంగా-

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః| తస్య కర్తారం మాం విద్ధి అకర్తార మవ్యయం| (భ.గీ.4-13)

అనే శ్లోకంచే వర్ణవ్యవస్థను తానే సృజించినట్లు శ్రీకృష్ణభగవానులు చెప్పారు. దీనికి అర్థం- నాలుగు వర్ణాలే నా చేత (ఈశ్వరుని చేత) సృజించబడ్డాయి అని. **'బ్రాహ్మణోస్య ముఖమాసీత్'** (తై.బ్రా.) అనే శ్రుతిని

అనుసరించి గుణకర్మ విభాగం ద్వారా- సత్వ, రజః, తమో అనే మూడు గుణాలు, కలిగినవారు చేయదగిన కర్మలను ఆధారంగా చేసుకుని ఈ సృష్టి విభాగం జరిగింది. (1)సత్వ గుణ ప్రధానమైన బ్రాహ్మణునికి అంతరింద్రియ నిగ్రహం, బహిరింద్రియ నిగ్రహం, తపస్సు, శౌచం, క్షాంతి, ఋజుభావం, జ్ఞానం, విజ్ఞానం, ఆస్తికత, శమం, దమం, తపం అనే కర్మలు (2) సత్వం అప్రధానంగా కల్గి రజోగుణ ప్రధానులైన క్షత్రియులకు శౌర్యం, తేజం, మొదలగునవి (3) తమోగుణం అప్రధానంగా కల్గి, రజోగుణ ప్రధానులైన వైశ్యులకు వ్యవసాయం, గో రక్షణ (4) రజోగుణం లేని తమోగుణ ప్రధానులైన శూద్రునికి శుశ్రూష మొదలగు కర్మలు అనే వ్యవస్థతో నేను నాలుగు వర్ణాలను సృజించాను అని ఈ విధంగా చాతుర్వర్ణాలు "నాచే సృజించబడెను" అని చెప్పారు గానీ, **"మయా విభక్తం"** – నాచే విభాగించబడినవి అని చెప్పలేదు. ఇక్కడ తత్వమిది. అంతే కాదు, మనుష్య లోకంలోనే బ్రాహ్మణాది వర్ణాలు, బ్రహ్మచర్యాది ఆశ్రమాలు, అవస్థా విశేషాలు ఉన్నాయి. అట్టి వర్ణాశ్రమాదులను బట్టే ఆ యా కర్మలు చెప్పబడ్డాయి. వేరే లోకాల్లో లేవు. పరమేశ్వరుడు సృష్ట్యారంభంలో ఈ విధంగా సృజించెను అని చెప్పడం వల్ల బ్రాహ్మణాది చాతుర్వర్ణ్య విభాగం మధ్యలో ఏర్పడక, జన్మతః ఏర్పడిందనే స్పష్టమవుతోంది.

కాని ఆయనచే సృజించబడ్డ చాతుర్వర్ణ్యాల వారు అందరూ వారికి విధించబడ్డ శమ,దమాది గుణాలను ఆచరిస్తున్నారా?అని తదుపరి శంక కలుగుతుంది. కానీ జన్మ నెత్తవలసిన కర్మల్లో ప్రవృత్తి, నివృత్తులను కలిగించే పుణ్య పాపాలు వేరుగా ఉంటాయి. వాటిని అనుసరించి విహితమైన (చెప్పబడిన) పుణ్యకర్మలందు ప్రవర్తిస్తే చిత్తశుద్ధి సంపాదన ద్వారా క్రమంగా, శీఘ్రంగా ముక్తులవుతారు. లేదా నిషిద్ధ కర్మల్లో ప్రవర్తిస్తే నరకాది ప్రాప్తి, మరలా కుత్సిత జన్మ పొందుతారు.

శ్రీ భగవానుడు మనలనందరినీ చెయ్యి పట్టుకుని మంచి, చెడు చేయించడానికి బాధ్యుడు కాడు. వారి వారి కర్మానుసారం ప్రవర్తిస్తారు మానవులు. మొత్తం మీద 'చాతుర్వర్ణ్యం' అనే శ్లోకం, దాని భాష్య, వ్యాఖ్యానాదులను అనుసరించి భగవానుడు సృష్టి మొదట్లోనే ఆ యా ప్రాణుల పుణ్య పాప కర్మలను, సత్వరజస్తమో గుణాల న్యూనాధిక్యాన్ని అనుసరించి చాతుర్వర్ణ్యాల వారు జన్మించిన తర్వాత చేయదగిన కర్మల వ్యవస్థతో సృష్టించెను అనడంలో ఏమాత్రం సంశయం లేదు. ఇందులో మరో విశేషం- బ్రాహ్మణునిగా జన్మించి కూడా వారికి నిషిద్ధమైన మద్య పానాదులను చేస్తే శూద్ర బ్రాహ్మణుడని, శూద్రుడు జన్మాంతర పుణ్యంచే బ్రాహ్మణ ధర్మాలను శమ,దమాదులను శాస్త్రానికి విరుద్ధం కాకుండా ఆచరిస్తే అతడిని బ్రాహ్మణ శూద్రుడని వ్యవహరిస్తారు. కానీ బ్రాహ్మణుడు శూద్రుడు కాదు. శూద్రుడు బ్రాహ్మణుడు కాడు. కాబట్టి ఈ వర్ణాలు జన్మ సిద్ధాలని చెప్పాలి.

ఇహ రమణీయ చరణాః అభ్యాశోహయత్తే రమణీయం యోనిమాపద్యేరన్....య ఇహ కపూయ చరణాః అభ్యాశోహ యత్తే కపూయాం యోని మాపద్యేరన్ శ్వ యోనిం వా సూకర యోనిం వా చండాల యోనిం వా|

(ఛాం.ఉ.5-10-7)

పుణ్యకర్మానుష్ఠానం చేసిన ప్రాణులు ఆ యా కర్మానుసారంగా చంద్రమండలంలో అనుభవించగా మిగిలిన పుణ్యంచే వ్రీహ్యాది ధాన్యంగా మారి దాని భక్షణ చేసిన పురుషుని రేతస్సుగా పరిణమించి బ్రాహ్మణ, క్షత్రియ, స్త్రీల గర్భాలని పొందుతారని, పాప కర్మానుష్ఠానం చేసినవారు పైన చెప్పినట్లు పాపఫలాన్ని అనుభవించే లోకాల్లో పాపఫలం అనుభవించి భుక్తశేషంతో పై విధంగా రేతోరూపంగా పరిణమించి క్షుద్ర గర్భాలందు ప్రవేశించి జన్మిస్తారని స్పష్టం. మనుష్య లోకంలో జన్మ ఎత్తడానికి పూర్వస్థితి ఛాందోగ్యంలో చాలా వర్ణింపబడింది గాని, గ్రంథవిస్తరణ భీతిచే ప్రకృతానికి సంబంధించిన విషయం మాత్రం సంగ్రహంగా వివరించబడింది.

అలాగే మరో శ్రుతి కూడా ఈ విషయాన్ని మరింతగా వర్ణిస్తోంది.

బ్రహ్మవనిం త్వాక్షత్రవనిగ్ం సుప్రజా వనిం| (తై. సం.1-3-1)

అథైనాం ప్రదక్షిణం పురుషేణ పర్యూహతి|

అగ్నిష్టోమ క్రతువులో సద్యోనామక మండపంలో ఔదుంబరి అనే ఒక స్థూణను (కొమ్మను) పాతినపుడు ఈ మంత్రం వినియోగింప బడుతోంది. బ్రాహ్మణ్యాది జాతి ప్రదమైన నీకు అన్నీ వైపులా మృత్తికను ఉంచుతున్నాను అని ఔదుంబర స్థూణను ఉద్దేశించి చెప్తున్నారు. బ్రాహ్మణ్యాది జాతి ప్రదమని వ్యాఖ్యానించడంచే జాతి జన్మసిద్ధమే గాని మనం అనుకున్నట్లు పుట్టిన తర్వాత మన గుణకర్మలవల్ల విభజించబడింది కాదని స్పష్టం. ఇంకా యాజ్ఞవల్క్య స్మృతిలో గల వ్యవస్థిత వర్ణాశ్రమ ధర్మాలు **"పాలాశో దండో బ్రాహ్మణస్య"** ఇత్యాది వచనాలు వివరించడం ద్వారా వర్ణవ్యవస్థ జన్మ సిద్ధమని స్పష్టం.

ప్రజాపతి రకామయత ప్రజాయేయేతి| (తై.సం.7-1)

అనే శ్రుతిలో బ్రహ్మగారు సమస్త సృష్టిని చేయాలని సంకల్పించి **"సముఖతస్త్రివృతం నిరామిమీత....మజః ముఖలోహ్య సృజన్త"** (తై.సం.7-1) అని తన ముఖం నుండి యజ్ఞంలో వినియోగింపబడే స్తోమాలలో త్రివృత్ స్తోమాన్ని, దేవతల్లో అగ్నిని, ఛందస్సులో గాయత్రిని, సామాల్లో రథాంతర సామాన్ని, మనుష్యుల్లో బ్రాహ్మణున్ని సృష్టించెను.

ఉరసో బాహుభ్యాం .... మవిః పశూనాం తస్మాత్తే వీర్యవంతో వీర్యాధ్యసృజంత|

అని ఉరస్సు (వక్ష స్థలము)నుంచి, బాహువులనుంచి స్తోమాల్లో పంచదశ స్తోమాన్ని, దేవతల్లో ఇంద్రుణ్ణి, ఛందస్సుల్లో త్రిష్టుప్ ఛందస్సును, సామాల్లో బృహత్సామాన్ని, మనుష్యుల్లో రాజన్యుని సృష్టించెను.

మధ్యతస్సప్తదశం నిరమిమీత ..... అన్నధానాద్యసృజంత|

అని మధ్యస్తోమాల్లో సప్తదశ స్తోమాన్ని, దేవతలలో విశ్వేదేవ దేవతలను, ఛందస్సులలో జగతీ ఛందస్సును, సామాల్లో వైరూప సామాన్ని, మనుష్యుల్లో వైశ్యుని, పశువుల్లో గోవును సృష్టించెను.

పత్త ఏకవిగ్ం శం గారమమీత .... సూద్రోమనుష్యాణామశ్వః పశునాం|

అని బ్రహ్మగారు పాదాలనుంచి ఏకవింశ స్తోమాన్ని, అనుష్టుప్ ఛందస్సును, వైరాజా సామాన్ని, మనుష్యుల్లో శూద్రుణ్ణి, పశువుల్లో అశ్వాన్ని సృజించెనని ప్రతిపాదించబడింది. దీనివల్ల సృష్ట్యాది కాలంలోనే మనమంతా బ్రాహ్మణాది వర్ణవిభాగంగా సృజింపబడినట్లు స్పష్టం. ఇలా ఉండగా పురుష సూక్తంలో **"బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్"** మొదలైన వాటివల్ల కూడా వర్ణ విభాగంగానే సృష్టి జరిగినట్లు చెప్పబడింది.

వేదాన్ని ఉచ్చరించేటప్పుడు స్వరం చాలా ప్రధానమని చెప్తూ-

ఉదాత్తో బ్రహ్మజాతిస్సాదనుదాత్తో రాజ్ఞ ఉచ్యతే స్వారిలో వైశ్య జాతీస్స్యాత్ప్ర చయ శ్శూద్ర ఈరితః యజ్ఞాతి స్ఖలనం తేషాం తజ్జాతిహననం విదుః| (ఆ.శీ.)

ఉదాత్తం బ్రాహ్మణ జాతి, అనుదాత్తం క్షత్రియ జాతి, స్వరితం వైశ్యజాతి, ప్రచయం శూద్రజాతి అని, ఇందులో ఏ జాతికి సంబంధించిన స్వరం తప్పితే ఆ జాతిని సంహరించిన దోషం కలుగుతుంది చెప్తోంది. ఇలాగే వేదంలో ఉన్న ఆ యా వర్ణాలు బ్రాహ్మణ జాతి, క్షత్రియ జాతి మొదలైనవాటికి సంబంధించినవిగా చెప్పబడ్డాయి. దీనివల్ల అక్షరాల్లో కూడా బ్రాహ్మణాది విభాగం ఉన్నట్లు తెలుస్తోంది.

ఈ ప్రకారం పైన ఉదహరించిన శ్రుతులచే బ్రాహ్మణాది వర్ణాలు సృష్టిలో అనాది కాలం నుండి జన్మసిద్ధాలని అంగీకరించి ధర్మశాస్త్రంలో బ్రాహ్మణ ధర్మాలు, క్షత్రియ ధర్మాలు, వైశ్య ధర్మాలు, శూద్ర ధర్మాలని వేరు వేరుగా విధించబడ్డాయి.

ఇలా ఉండగా, బ్రాహ్మణాది వర్ణాలు జన్మసిద్ధమని అంగీకరించిన వేద శాస్త్రాలు సంకుచితార్థాన్ని చెప్పినట్లు అవుతుందని, విశాల హృదయంతో విశాలమైన అర్థాన్ని చెప్పాలని శాస్త్ర మర్యాదను ఉల్లంఘించి అనేక అపార్థాలను కల్పిస్తున్నారు కొంతమంది. పైగా, దాని ప్రయోజనం సర్వమానవ శ్రేయస్సని చెప్తున్నారు. బాగా విమర్శిస్తే వేద వాక్యాలకు సంకుచితార్థ బోధకత్వాన్ని ఆరోపించి తమది విశాలహృదయమని భావించి విశాలమైన అర్థాన్ని చెప్పడానికి ప్రయత్నించేవారే మానవులకి అశ్రేయస్సుని కలగచేసిన వారవుతారని చెప్పడంలో సంశయం లేదు. ముందుగానే చెప్పినట్లు ఇందులో వేదంలో ఉన్న విశేషాలని వివరించడం జరిగింది కానీ వీటిని ఇతర నింద కొరకు కాదు అని గ్రహించగలరు.

కర్మలు – దేశ శ్రేయస్సు

ఇలా వ్యవస్థితమైన బ్రాహ్మణాదులు విహితమైన కర్మలను ఆచరించడంవల్ల సర్వ మానవులకు శ్రేయస్సు కలుగుతుంది. వారిచే అనుష్ఠింపబడే కర్మల్లో వాడబడుచున్న మంత్రాలు, మంత్రార్థం బాగా ఆలోచించే వారికి పరోక్షం (ప్రత్యక్షంగా కనబడనిది) కాజాలదు.

యతే అగ్న ఽయా సయా రాజాసయా హరాసయా తనూర్వర్ షిష్ఠ గహ్వరేష్ఠా ఉగ్రంవచో అపావధీం త్వేషం వ అపావధీగ్ స్వాహా| (తై.సం.1-3)

మొదలైన అగ్నిష్టోమ ప్రకరణ మంత్రాలచే యజ్ఞం చేసే యజమాని హోమాలని చేయడం ద్వారా లోకంలో సర్వప్రాణులకు అన్న సమృద్ధి కలగాలని, గో హత్య, వీర హత్య మొదలగు పాపకృత్యాలను చేసే ప్రవృత్తి నశించు గాక అని ప్రార్థిస్తున్నాడు. దీనినిబట్టి బ్రాహ్మణుడు యజ్ఞం చేసినా దాని ఫలమైన అన్నపానాది సమృద్ధి జనులందరికీ అందాలని కోరుతున్నాడు గాని యజ్ఞం చేసే తనకే ఈ ఫలం అంతా అందాలని సంకుచిత భావంతో కోరడం లేదు.

అలాగే అగ్నిచయన ప్రకరణంలో –

అజక్షీరేణ అర్కపర్ణేన చ రమయా మిష్టకాయం శతరుద్రీయం జుహోతి| (ఆ.శ్రౌ.సూ)

అనే సూత్ర ప్రకారం జిల్లేడు ఆకులతో ఆ అజక్షీరాలను (మేక పాలను) శతరుద్రీయం అనగా నమకం చేత ఉపధానం చేయబడిన చితిలో చరమేష్టకమందు (చివరి ఇష్టకపై) హోమం చేయాలి. నమకంలో -

యథానస్సర్వ మిజ్జగద యక్ష్మగ్ం సుమనా అసత్ .... యథాన శ్శమసద్ద్విపదే చతుష్పదే విశ్వం పుష్టం గ్రామే అస్మిన్ననాతురం|

మొదలైన మంత్రాలెన్నో ఉన్నాయి. వాటి అర్థం- మాయొక్క చేతన, అచేనాత్మకమైన సమస్తమైన జగత్తు రోగాల వంటి ఉపద్రవాలు లేనిదై సౌమనస్యంతో కూడుకున్నదై ఉండేలా **'ద్విపదే'** అనడం వల్ల మనుష్యులందరికీ, **'చతుష్పదే'** అనడం వల్ల పశుగణానికి అంతకూ సుఖప్రదంగా, **'అస్మిన్ గ్రామే'** అనడంలో సమస్త ప్రపంచంలో **'విశ్వం పుష్టం'** అనడం వల్ల క్షేత్ర పుష్టి, ఆరోగ్య పుష్టి, ఆయుష్య పుష్టి, ధనపుష్టి మొదలైన పుష్టులతో కూడి సుఖం కలిగి అన్ని విశేషాలచే లోకానికి సుభిక్షం కలగాలని ప్రార్థిస్తున్నాడు.

ఈ ప్రకారం అనేక మంత్రాలు ఆ యా కర్మల్లో వాడబడుతూ కేవలం ఆ కర్మలనాచరించిన వారికే గాక సమస్త ప్రపంచానికి సుఖ శాంతులు చేకూరాలని కోరుతున్నట్లు విశాల హృదయంతో చెప్తున్నాయి.

సర్వేషాం వర్ణానాం స్వధర్మానుష్ఠానే పరమం అపరిమితం సుఖం| (ఆ.ధ.సూ)

ఈ ప్రకారం ఎవరికి చెప్పబడిన కర్మలను వారు ఆచరిస్తే సర్వ ప్రపంచానికి శ్రేయస్సు కలుగుతుందని చెప్పబడింది. ఉదాహరణకు లోకంలో నీటిపారుదల శాఖాధికారులు ఆ నీటినంతటినీ వారే అగస్త్య మహర్షిలా ఔపోసన పట్టడం లేదు. విద్యుత్ శాఖాధికారులు పవర్ హౌస్ లోపల పుట్టించబడే విద్యుత్తంతా వారే స్వార్థంగా వినియోగించు కోవడం లేదు. సర్వ ప్రపంచానికి దానికి సంబంధించిన నిబంధనల ప్రకారం సరఫరా (సప్లై) చేస్తున్నారు. వారు మాస వేతనాలు పొందుతూ మనకు సౌకర్యాలను కలుగజేస్తున్నారు, నీరు అందరిదీ, విద్యుత్ అందరిదీ కదా, మరి ఆ యా శాఖలు సంకుచితంగా ఏర్పడ్డాయని అనగలమా?

"సర్వేషాం వర్ణానాం" అనే వాక్యంతో ఎవరి విహితమైన కర్మలు వారు ఆచరిస్తే సుఖం చేకూరుతుందని చెప్పడమే కాక గాక **స్వధర్మే నిధనం శ్రయః పరధర్మో భయావహః|** (భ.గీ)

అని స్వధర్మాచరణయందు దేహాన్ని చాలించడం శ్రేయస్సు గానీ పరధర్మం మాత్రం భయంకరమైందని, అంటే- పర ధర్మాన్ని ఆచరించకూడదని భావం. అందుచేతనే కదా యుద్ధం చేయను అన్న అర్జునునికి "క్షత్రియుడవైన నీకు యుద్ధం ధర్మమని" **"యుద్ధం వై రాజన్యస్య యుద్ధేనై వైనగ్ం సమర్థతి" (తై. బ్రా.)** అని కృష్ణ భగవానుడు చెప్పేరు. శ్రుతి కూడా ఇలా చెప్తోంది.

యోవై స్వాం దేవతామతి యజి తే ప్రస్వాయై దేవతాయై చ్యవతేన పరాం ప్రాప్నోతి పాపీయాస్ భవతి|(తై.సం)

స్వీయ దేవతారాధనను వదిలి అన్యదేవత నారాధించే వాడు స్వీయ దేవతానుగ్రహం నుంచి జారిపోవడమే కాక, శ్రేయస్సును పొందకపోగా '**పాపీయాస్ భవతి**' అని అనడం వల్ల అతను నికృష్టమైన వాడగును, అనగా దుఃఖఫలాన్ని అనుభవిస్తాడు అని అర్థం. కాబట్టి స్వధర్మాన్నే ఆచరించాలని, అలా ఆచరిస్తే వానికే కాక సర్వ ప్రపంచానికి శ్రేయస్సు కలుగుతుందని చెప్పినట్లయింది.

జన్మాంతరీయమైన (ఇతర జన్మలకు సంబంధించిన) కర్మ ఫల శేషమే ఆ యా జన్మలకు, ఆ యా జాతి, గుణ భేదాలకు కారణమని స్పష్టంగా వేద సూత్రం చెప్తోంది.

తతః పరివృత్తే కర్మఫలశేషేణ జాతిం రూపం వర్ణం బలం మేధాం ప్రజ్ఞాం ద్రవ్యాణి ధర్మానుష్ఠానమితి ప్రతిపద్యతే తచ్చక్రవదుభయోర్లోకయో స్సుఖి ఏవ వర్తే| (ఆ.ధ.సూ)

ఐహికాముష్మికమైన సుఖాలను అనుభవించడం పూర్తయ్యాక తిరిగి ఈ లోకంలో జన్మ సంభవిస్తుంది. పూర్వం అనుభవించని కర్మఫల శేషంచేత బ్రాహ్మణత్వాది జాతిని, అందులో ఉత్తమోత్తమ కులంలో జన్మించడం, బంగారు ఛాయ కల్గిన ధగధగాయమానమైన రూపాన్ని, ఎదుటివారిని నిగ్రహించుకునే సామర్థ్యాన్ని, వేదశాస్త్రాది గ్రంథాలను గ్రహణ,ధారణ చేసే ప్రజ్ఞను, సువర్ణాది సంపత్తును, ధర్మానుష్ఠానాన్ని పొందగలడు. దీనికంతకు కారణం ఏమి అంటే, అనుభవించగా మిగిలిన కర్మఫల శేషం. తిరిగి శరీరాన్ని ధరించడం కూడా కర్మఫలమే కనుక ధర్మానుష్ఠానం సాధ్యమవుతుంది. అంటే కర్మ చేయడం, ఆ కర్మ తాలూకు ఫలాన్ననుభవించడం- కర్మఫలం కొంత మిగిలి ఉండగానే ఆ కర్మకు తగిన దేహాన్ని ధరించడం తిరిగి ఫలమనుభవిస్తూ ఉండడం ధర్మానుష్ఠానం చేయడం– అనే చక్రంలా తిరుగుతూ ఐహికాముష్మిక మైన ఫలమనుభవిస్తూ ఉండడం జరుగుతుంది.

మనచే అనుభవించబడిన కర్మలు రెండు రకాలుగా ఉంటాయి.

అనేక జన్మాంతరకృత కర్మాణి ఫలదానాయ ప్రవృత్తాని అప్రవృత్తాని చ| (ఆ.ధ.సూ)

అనే వాక్యంచే ఫలాన్ని అనుభవింప చేయడానికి ప్రవర్తించినవి, ఆరంభించినవి (అనుభవింప చేసేటట్లు చేయుట ప్రారంభించినవి, ఆరంభించనివి, కానివి అని) కర్మలు మనచే తగిన జన్మ ఆరంభకాలుగా ఉంటాయి.

జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతేఽర్జున| (భ.గీ)

జ్ఞానమనే అగ్ని సర్వ కర్మలను భస్మం చేస్తుంది. కానీ ఇందులో కూడా భేదం ఉంది. మంద, మాధ్యమ అధికారులైన బ్రహ్మవేత్తలయొక్క జ్ఞానాగ్ని ఫలాన్ని ఆశించి చేసే కర్మలను నశింప చేయలేదు. వారికి కూడా ఫలాన్ని అనుభవించడానికై జన్మాంతరంలో ఆరంభకాలు (opening balance, ఖాతా ప్రారంభ నిల్వ)గా అవుతాయని, ఉత్తమశ్రేణికి చెందిన బ్రహ్మవేత్తకు మాత్రం ఆ జన్మలో ఫలానుభవం చేతనే క్షీణించునని (ఆ కర్మల తాలూకు ఫలాన్ని అనుభవింప చేయడం అదే జన్మలో పూర్తయిపోతుందని) చెప్పబడింది. అంటే ఉత్తమశ్రేణి వారి ఫలదానానికి ఉద్దేశించిన కర్మ అగ్నిచే దగ్ధమైన బీజంలాగ జ్ఞానాగ్నిచే దగ్ధమై బీజాలు తిరిగి మొలకెత్తలేని విధంగా దగ్ధమవుతాయని ఈ క్రింది గ్రంథం స్పష్టంగా చెప్పింది.

దోషాణాం తు నిర్ఘాతో యోగ మూల ఇహ జీవితే| (ఆ. ధ. సూ)

ఈ ప్రకారం చాతుర్వర్ణ్య వ్యవస్థ గురించి శ్రుతిస్మృతుల్లో అనేక ప్రమాణాలుండగా బ్రాహ్మణత్వాది జాతి జన్మ ప్రదమని చెప్తే కొంతమంది ఆధునికులకు విపరీత ద్వేషం ఎందుకు కలిగిందని విచారిస్తే శాస్త్ర జ్ఞానం లేకపోవడమే అని చెప్పక తప్పదు. కానీ అందరూ శాస్త్రాలను చూసి, ప్రాచీన సిద్ధాంతాలను చూసి ఆచరణలో పెట్టడమంటే, వైద్య శాస్త్రాన్ని తాను చదివాక మందు తీసుకోవడం లాంటిది. కాబట్టి ప్రాచీన సంప్రదాయాన్ని ఎవరి దగ్గర తెలుసుకోవాలో వారి దగ్గర తెలుసుకుని ఆచరించాలి కానీ విడిచి పెట్టకూడదు.

చాతుర్వర్ణ్య వ్యవస్థ జన్మసిద్ధమని చెప్పినంత మాత్రాన ఎవరికీ తక్కువ తనాన్ని ఆపాదించినట్లు ఎంత మాత్రం కాదు. మన శరీరంలోని వివిధ అవయవాల్లో ఒక్కో సారి శిరస్సుకు, ఒక్కోసారి గుండెకు, మరోసారి పాదాలకు ప్రాధాన్యం ఉంటుంది. అందువల్ల ఏ అవయవాన్నీ, ఏ భాగాన్నీ అవమానం చేసినట్లు కాదు.

ఆ ప్రకారం అందరికీ మార్గ భేదంచే – వేరు వేరు మార్గాల ద్వారా మోక్షాన్ని అంగీకరించారు. ఏ జాతికి పూర్వ కర్మలు ఉన్నాయో ఆ జాతికి చెందిన వారందరూ పూజ్యులని చెప్పబడుతోంది. అందుకే వేదంలో వైశ్రవణమనే యజ్ఞంలో వైశ్రవణ బలిని ఇచ్చేటప్పుడు-

క్షత్రం క్షత్రం వైశ్రవణః | బ్రాహ్మణావయగ్ స్మః| నమస్తే అస్తు మామాహిగ్ం సీః| (తై. బ్రా)

వైశ్రవణుడనే దేవత క్షత్రియ జాతికి సంబంధించిన ప్రభువు. దీనికి బ్రాహ్మణులు యాగ కర్తలు. వాళ్ళు హవిస్సుని ఇస్తూ 'బ్రాహ్మణులమైన మేము నీకు నమస్కరిస్తున్నాం. మమ్మల్ని హింసించవద్దు' అని కోరుతున్నారు. దీనివల్ల బ్రాహ్మణులకు క్షత్రియుడైన వైశ్రవణుడు పూజ్యుడయ్యాడు. శుక్రనీతి సారంలో-

కర్మశీల గుణాః పూజ్యాః తథా జాతి కులేన హి న జాత్యా న కులేనైవ శ్రేష్టత్వం ప్రతిపద్యతే| వివాహే భోజనే చైవ జాతి కుల వివేచనం|

ఈ ప్రకారంగా పూజ్యమైన గుణకర్మలను అనుసరించి అన్ని వర్ణాలవారికి పూజ్యత చెప్పబడింది. శాస్త్రీయమైన, జన్మ సిద్ధమైన చాతుర్వర్ణ్యం విశేషాలతో మళ్ళీ చాతుర్వర్ణ్యం గురించి చెప్పబడింది.

"ఏకస్మిన్నేవ వర్ణేతు చాతుర్వర్ణ్యం గుణాత్మక" అని సర్వసిద్ధాంత సంగ్రహం. ఇటువంటి చాతుర్వర్ణ్యం జన్మసిద్ధమని చెప్పడానికి ఇష్టపడని ఆధునికులు యథేచ్ఛగా శ్రుతి శాస్త్రాల సిద్ధాంతాలతో పని లేకుండా

స్మృత్యాదులకు అర్థం చెప్తూ భగవత్ స్వరూపులైన జైమిని వ్యాసాదులను వారి సూత్ర భాష్య కర్తలను, ఆ వ్యాఖ్యాన కర్తలను, స్మృతి కర్తలైన మనువు, అత్రి, పారాశరుడు మొదలైనవారి రచనలు మన అభిప్రాయానికి వ్యతిరేకంగా ఉంటే సర్వజ్ఞులైన వారిని అందరినీ నిందించడానికి వెనుకాడడం లేదు. కాని ఇంతమంది మహర్షి పుంగవులకు భ్రాంతిని కల్పించడం కంటే మనం అశాస్త్రీయమైన మార్గాన్ని అవలంబించి పరస్పర విరుద్ధంగా సమన్వయ పరచి భ్రాంతిపడుతున్నామని మనకే భ్రాంతిని కల్పించుకోవడం సులభం. ఈ విషయాన్నే మీమాంసాశాస్త్ర వార్తికంలో చెప్తూ కుమారిల భట్టపాదులు-

భ్రాంతేరనుభవాద్వాపి పుంవాక్యాద్విప్రలంభనాత్ దృష్టానుగుణ్య సాధ్యత్వాచ్చోదనైవ లఘీయసీ| (మీ.శ్లో.వా.)

అన్నారు. అంటే వేదమూలకాలైన స్మృతులకు ప్రామాణ్యాన్ని అంగీకరించడం యుక్తమని, అలా అంగీకరించకపోతే స్మృతి కర్తలకు భ్రాంతి, వారి వారి అనుభవాలకు భ్రాంతిని కల్పించి ఆధునికులకు విపరీత సామర్థ్య కల్పన చెయ్యవలసి వస్తుంది. అంతే కాదు సృష్టి మొదటి నుంచీ స్మృతికర్త వచనాలను నమ్మి ఆచరించిన వారందరికీ భ్రాంతి కల్పించాల్సి వస్తుంది. ఇటువంటి అనేక క్లేశాలు అనుభవించడం కంటే మన్వాది స్మృతులకు వేదమూలకత్వంగా ప్రామాణ్యాన్ని అంగీకరించడం లాఘవం (సులభం) అని **'చోదనైవ లఘీయసీ'** అన్నారు.

దీనివలన తేలిన సారాంశం- **"చాతుర్వర్ణ్యం మయాసృష్టం"** అనే భగవద్గీతా వచనానికి యథేచ్ఛగా అర్థం చెప్పకూడదని శాస్త్రీయమైన సామాగ్రితో చెప్పడానికి ప్రయత్నించాలని, ఆ మార్గాన్ననుసరించి, వర్ణ వ్యవస్థగా ఏర్పడిన కర్మల నాచరించి తాను తరించి ఇతరులను కూడా తరింపచెయ్యాలనే పై వచనాలకు తాత్పర్యమని గ్రహించాలి. వర్ణవ్యవస్థని ఇంతగా నిరూపించడానికి కారణం పరస్పరం భేదాభిప్రాయాలను కలిగించడానికో, కులమత ద్వేషాలను రెచ్చగొట్టడానికో అని భావించరాదు. పరస్పర ఉపకార్య ఉపకారక భావంతో నలుగురూ జ్యేష్ఠ మధ్యముల భావంతో మెలిగినట్లు సోదరన్యాయంగా ఉండి ఎవరి ధర్మాలను వారు నిర్వహిస్తూ దేశక్షేమానికి తోడ్పడాలన్న వేదశాస్త్రాల అంతరార్థాన్ని వివరించడమే ప్రధానోద్దేశం.

ఇటువంటి చాతుర్వర్ణ్య వ్యవస్థతో కూడిన 'వేది' శబ్దంతో చెప్పబడిన భారత వర్షంలోని భరతఖండమే ఇంతకు పూర్వం నిరూపించబడిన వేద విహితమైన శ్రేయస్సాధనతాకమైన కర్మ సముదాయం అనే ధర్మం ఆచరించడానికి యోగ్యమైన భూమి అని సప్రమాణంగా నిరూపించడమైంది.

వైదిక కర్మలు మూడు విధాలు

కర్మలు నిత్యాలు, నైమిత్తికాలు, కామ్యాలు అని మూడు విధాలు.

ఏవి ప్రతి నిత్యం మనచేత అనుష్ఠింపదగినటువంటివో, ఏవి చేయకపోతే ప్రత్యవాయం వస్తుందో అవి నిత్యకర్మలు. నిత్యమని అంటే అనుష్ఠించదగినవి అనే దానికి ఇంకా వివరాలేమిటి అంటే- **"యావజ్జీవం అగ్నిహోత్రం హోతి", "యావజ్జీవం దర్శపూర్ణ మాసాభ్యాం యజేత", "అహరహ స్సంధ్యాముపాసీత"** మొ||న వాక్యాలచే విధింపబడి యావజ్జీవం చేయవలసిన (చేయకపోతే ప్రత్యవాయం కనుక, చేసి తీరవలసిన) కర్మలని నిత్యకర్మలుగా పేర్కొన్నారు. సంధ్యావందనాది నిత్యకర్మలు చేయకపోతే పాపాలు వస్తాయి. చేస్తే అనిష్ట పరిహారం, ఇష్ట ప్రాప్తి కూడాను. అనిష్ట పరిహారం మాత్రమేననే వారు ఒక తెగకి సంబంధించినవారు కూడా ఉన్నారు. మతాంతరాలు, శాస్త్రాలలో మతభేదాలు వీటికి కారణం. రోజూ చేసి తీరాలనే విషయం మాత్రం అందరూ ఒప్పుకొనేదే!

"రాహుపరాగే స్నాయత్" వంటి వాక్యాలచే గ్రహణం పట్టినపుడు విధింపబడిన స్నానం చేయడమనే కర్మ వంటివి నైమిత్తిక కర్మలు. మరో విశేషణం కూడా చేర్చి, **'నియత్త నిమిత్తత్వే సతి అకరణే ప్రత్యవాయ**

జనకత్వం" అని, చేయకపోతే ప్రత్యవాయం రావడం అనేది నిత్యకర్మలకు వలె ఉన్నా ఆ సందర్భాలలో ప్రత్యేకంగా చెప్పబడిన కర్మలు నైమిత్తిక కర్మలు అన్నారు.

"దర్శపూర్ణ మాసాభ్యాం స్వర్గకామో యజేత|"

"జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత|"

మొదలైన వాక్యాలచే స్వర్గం కావాలని గాని, పుత్రుడు కావాలని గాని, వర్షం కావాలని గాని యుద్ధంలో జయం కావాలని గాని ఫలకామనచే (ఒక కోరికతో) చేయబడే కర్మకు కామ్యకర్మ అని పేరు. ఈ కామ్యకర్మల్ని యథాతథంగా అనుష్ఠిస్తే చెప్పబడిన ఫలం సంభవిస్తుంది. కానీ ఈ కామ్యకర్మల్ని అనుష్ఠించకపోయినా ఏ విధమైన ప్రత్యవాయమూ లేదు. చిత్తశుద్ధియే ప్రధానంగా గలవి నిత్యకర్మలు కాగా, అనుష్ఠిస్తే ప్రధానమైన కామిత ఫలసిద్ధితో బాటు ఆనుషంగికంగా (జతగా వచ్చి) చిత్తశుద్ధి కూడా ఇచ్చేవి కామ్యకర్మలని శాస్త్రకారుల సిద్ధాంతం. ఇది అనేక ప్రమాణ గ్రంథాల్లో చెప్పబడింది. ఈ మూడు రకాల కర్మల్లో నిత్య, నైమిత్తికాలు మాత్రం తప్పక అనుష్ఠించవలసినవి, ఉత్తమమైనవిగా చెప్పింది వేదం. కర్మలలో యజ్ఞమనే దాన్ని శ్రేష్ఠతమైన కర్మగా "**యజ్ఞోహి శ్రేష్ఠతమం కర్మ"** అను శ్రుతి చెప్తోంది. అయినా నిత్య, కామ్య వివేకం లేకుండా అధికార భేదాన్ని గుర్తించకుండా మూడు రకాలైన కర్మలను అనుష్ఠించడం దోషమని చెప్పబడుతోంది. నిత్య కర్మల వలన మనం బంధంలో పడం అని, కామ్యకర్మల వలననే మనకు బంధం తటస్థిస్తుంది అన్నారు.

కర్మావలంబనేనైవ కేచిజ్జీవంతి మానవాః జ్ఞానావలంబనేనైవ కేచిదన్యే విమోచితాః|

కర్మ, కర్మ అని కర్మకు ఎక్కువ ప్రాధాన్యాన్నిచ్చే కర్మ వాదులైన కొందరు ఈ కర్మలను మాత్రమే ఆధారంగా చేసుకొని జీవిస్తూ, నిత్య, నైమిత్తిక కామ్యకర్మలను చేస్తే ఆ కామ్య కర్మల వల్ల జనించిన ఫలాన్ని అనుభవించి, ఆ అనుభవ వాసన ద్వారా ఆ కాలంలో కాకపోయినా మరుసటి క్షణంలో, సందర్భంలో మళ్ళీ దానియందు రాగం పుడుతుంది. రాగం పుడితే మళ్ళీ ఆ కర్మలను చేయాలనే ప్రవృత్తి. ఆ ప్రవృత్తి వల్ల కర్మానుష్ఠానం. మళ్ళీ ఆ అనుష్ఠానం వల్ల జనించిన ఫలం. ఆ ఫలానికి అనుభవం. ఫలానుభవం వల్ల మళ్ళీ రాగం. ఈ ప్రకారం ఈ కర్మలయందే తిరుగుతూ ఉంటారుట. ఇప్పుడీనాడు మనం క్షీరాన్నం (పరమాన్నం) పుచ్చుకుంటే కంఠగతమైంది (పీకల వరకు వచ్చింది) అప్పుడు మాత్రం మళ్ళీ అక్కర్లేదనే అంటాం. కానీ ఒకసారి దీని రుచి తెలిసాక మళ్ళీ మర్నాడు వండించడానికి ప్రయత్నం చేస్తాం. అంతే గానీ ఒక సారి తినేస్తే పోదట అది! అనుభవిస్తే నశించేది కూడా కాదన్నారు.

నజాతు కామః కామానా ముపభోగేన శామ్యతి| (భ.గీ)

కోరికలు అనుభవిస్తే నశించవట. అనుభవించకుండానే వాటిని నశింపచేయడానికి ప్రయత్నించాలిట. ఆ కోరికలనేవి పుట్టకుండానే ప్రయత్నం చేయటం న్యాయం గాని, ఆ కోరిక అనుభవిస్తే నశిస్తుందనుకోవడం తెలివి తక్కువట! అందుచేత కామ్యకర్మలను కూడా చేసినటువంటి వారి స్థితిని వర్ణిస్తూ కర్మ, కర్మ అనేవారు ఇలానే తిరుగుతూ ఉంటారు చక్రంలాగా అన్నారు.

కాని పూర్తిగా కర్మలను త్యాగం చేస్తే అంతకు ముందు ఆర్జించిన ప్రత్యవాయం నశించదు. నిత్య నైమిత్తికాలను అనుష్ఠించనందువల్ల కొత్తగా ప్రత్యవాయం కూడా తటస్థిస్తుంది. ప్రత్యవాయం నశించి చిత్తశుద్ధి కలగనందువల్ల జ్ఞానం సిద్ధించదు. కాబట్టి పరంపరగా జ్ఞానసిద్ధి కలగడం కోసం కామ్యకర్మల్ని వదిలిపెడుతూ నిత్యనైమిత్తికాలను అనుష్ఠించవచ్చు.

"జ్ఞానాదేవ హి కైవల్యం|" అనేదానికి భాష్యం **"బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి|"**

మొదలైన శ్రుతులు జ్ఞానం వల్లనే మోక్షం సంభవించవలసి ఉందని చెప్పాయి. జ్ఞానం సాక్షాత్ మోక్ష సాధనం అంటారు కనుక ఇప్పట్నించీ మనమందరం "జ్ఞానం" "జ్ఞానం" అనే రెండు అక్షరాలను జపం చేసి ఉపాసన చెయ్యడంవల్ల జ్ఞానం సిద్ధించదు. కనుక, జ్ఞానం అధిగమించడానికి మనకి అధికారం ఉందా? లేదా అని ముందుగా ఆలోచించు కోవాలి. అటువంటి అధికారాన్ని సంపాదింప చేసేవే కర్మలు.

కర్మానుష్ఠానం జ్ఞానానికి ప్రతిబంధకమని జ్ఞానసాధనలో అడ్డు తగిలేదని భావించకూడదు. అలా అని, జ్ఞానం అన్నారు కదా అని అధికారం చూసుకోకుండా అంతవరకూ సంధ్యావందనం చేసే వాళ్ళు ఉంటే అది కూడా మానేస్తే అటు నిత్యకర్మల్ని అనుష్ఠానం చేయక, ఇది వరకు మనచే సంపాదించబడిన ప్రత్యవాయాన్నీ పోగొట్టుకోక ఇటు జ్ఞానాన్నీ అందుకోలేక పోతారని **"యత్సారభూతం తదుపాసితవ్యం"** అన్నారు. అసలు కర్మలు చేయడం ఎందుకు అంటే, కర్మలు చేయడం కర్మలను మాన్పించడానికే అన్నారు. ఔషధ సేవ ఎందుకు అంటే, ఔషధాన్ని మానేయడానికే. వైద్యుడంటాడు కదా, నువ్వు నలభై రోజులు ఔషధం సేవించవయ్యా నీ శరీరం ఉక్కు లాగా అయిపోతుంది ఇంక ఔషధం తీసుకునే అవసరం రాదు అని. ఒక మండలం సేవిస్తే ఈ ఔషధ సేవ ఔషధాన్ని మాన్పించడానికే కారణమౌతోంది.

అదే తీరుగా నిత్యమైన కర్మానుష్ఠానం చేత ఇదివరకు సంచిత మైనటువంటి ప్రత్యవాయం నశిస్తే ఇతని చిత్తం నిర్మలమైతే దాని ద్వారా ఐహికాముష్మిక ఫలములందు వైరాగ్యం, ఆ వైరాగ్యం కలిగితే వేదాంత శ్రవణాదులందు అమితమైన ఇచ్ఛ కలుగుతుందని చెప్పబడుతోంది.

తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపసా నాశకేన|

యజ్ఞ, యాగాదులకు వివిదిష ప్రయోజనమని, వివిదిష అంటే వేదాంతమందు రుచి కల్పించడమని వివరించారు. అటువంటి వైరాగ్య సంపాదన ద్వారా జ్ఞాన సంపాదన, ఆ జ్ఞానం ద్వారా మోక్ష సంపాదన అవుతుందన్నారు. అందుచేత అటువంటి స్థితి చేరిన వానికి కర్మ అక్కర్లేదు. నిత్యం చేసే కర్మలు అటువంటి స్థితిని సంపాదింపచేసి ఇతనికి ఇక కర్మలు చేయనక్కరలేనటువంటి స్థితిని తీసుకుని వస్తాయి. ఈ ప్రకారం కర్మలు చేయడం కర్మలను మానిపించడానికే అన్నారు.

జ్ఞాన సిద్ధి కలిగాక కర్మలు వాటంతట అవే **"ఉర్వారుకమివ బంధనాత్"** అనే శ్రుతి ప్రకారం, పక్వమైన దోసకాయ తీగనుంచి దానంతట అదే విడబడినట్లు, కర్మలు జ్ఞానిని విడిచి పెడతాయని అన్నారు. అలా అని విహితమైన నిత్యకర్మలను వదిలేసి సంచరించవద్దు అన్నారు. అయితే, కర్మనాశ్రయించినా దోషం చెప్పి, జ్ఞానాన్నాశ్రయించినా దోషం చెప్తే ఎలాగ? అంటే - **"నిత్యకర్మణః అపరిత్యాగేనైవ జ్ఞానం సంపాదితుం అవశ్యం యతేరన్"** అని నిత్యకర్మలు విడిచిపెట్టకుండా జ్ఞానాన్ని ఆశ్రయించడానికి ప్రయత్నించండి కామ్యకర్మలను మాత్రం చేయడానికి పూనుకోకండి అని తాత్పర్యం.

కామ్య కర్మ ఫలే దోషం విదిత్వా ప్రతిషిద్ధవత్ కామ్య కర్మ త్యజంస్తుల్యో భిక్షుణా ఫలతో భవేత్|

ముందు చెప్పినట్లుగా కామ్యకర్మల నాచరిస్తే ఫలం-ఆ ఫలం వల్ల రాగం- మళ్ళీ కర్మానుష్ఠానం వంటి చక్రంలో పడకుండా ఆ దోషాన్ని గుర్తించి కామ్యకర్మలను 'నిషిద్ధకర్మవలె' త్యజించిన వారిని సర్వకర్మ సన్యాసం చేసిన సన్యాసితో సమానంగా వ్యాసభగవానులు వర్ణించారు.

నిత్యకర్మలని ప్రశంసించడానికి చెప్పబడిన అర్థవాదలని (వేదంలోని ప్రశంసా వాక్యాలని) నిరాకరించ కూడదు. అంత మాత్రాన కామ్యకర్మలు నిషిద్ధాలు కావు. అలా అయితే అసలు కామ్య కర్మలను విధించనే విధించరు కదా!

ఈ ప్రకారం వేదవిహితమై శ్రేయస్సుని కలిగించే కర్మలు మూడు రకాలని, వాటిలో నిత్య నైమిత్తికాలకు పాపక్షయం ద్వారా చిత్తశుద్ధియే ప్రధాన ఫలమని, కామ్యకర్మలకు కామిత ఫలసిద్ధి ప్రధాన ఫలమని వానితోబాటు పాపక్షయం ఆనుషంగిక ఫలమని నిరూపించబడింది.

* 3వ ప్రకరణం సమాప్తం *

4 వ ప్రకరణం

వేదం - సృష్టిక్రమ భేదం

"ధర్మో విశ్వస్య" అనే శ్రుతి జగత్తు యొక్క సృష్టి, స్థితి మొదలైన వాటికి ధర్మం కారణమని సామాన్యంగా బోధించిందని, **"ప్రజాపతిరకామయత"** అనే శ్రుతి, మరికొన్ని శ్రుతులు కూడా ప్రజాపతి అగ్నిష్టోమాత్మక ధర్మంవల్ల ప్రజాసృష్టి చేసిన విధానం ఈ ప్రకరణంలో వివరించబడుతోంది. ఆ వివరణ కంటే ముందుగా సృష్టిక్రమ భేదం వర్ణించబడుతోంది.

ఈ సృష్టి యొక్క ప్రసంగంలో వేదంలో వివిధ స్థలాల్లో వివిధాలుగా వర్ణించబడిన అవాంతర సృష్టి, మహాసృష్టి భేదాలు కూడా ఉన్నట్లు మనం గమనించవలసి ఉంది.

నాసదాసీన్నో సదాసీత్తదానీమ్ నాసీద్రజో నోవ్యోమా పరోయత్| కిమావరీవః కుహకస్య శర్మన్| అంభః కిమాసీద్గహనం గభీరం| నమృత్యురమృతం తర్హి న| (నా.దా.సూ||తై.బ్రా.2-8-9)

పాత సృష్టి లీనమై కొత్త సృష్టి ఉత్పన్నం కానప్పుడు **'సత్, అసత్'** అనేవి రెండూ లేవు. సత్ అంటే నామరూపాలతో స్పష్టంగా తెలియబడు జగత్తు. నర విషాణాదుల వలె (మనిషి కొమ్ము వలె, కుందేటి కొమ్ము వలె) శూన్యమైనది అసత్. ఈ రెండూ (సత్, అసత్) లేవని పై శ్రుతి చెప్తోంది. మరి ఈ రెండూ లేకపోతే అప్పుడేమి ఉందని శంకించి ఒకానొక అవ్యక్తావస్థ ఉందని చెప్పారు. అంటే స్పష్టంగా జగత్తు యొక్క ప్రతీతి (ఎరుక) లేకపోవడం అనే అవ్యక్తమైన అవస్థ ఉందట.

సా అవస్థా విస్పష్ట త్వాఽభావాన్న సత్, జగదుత్పాదకత్వేన శబ్దావాన్నాప్యసత్|

అని సాయణ భాష్యం. ఆ అవస్థ స్పష్టంగా లేనందున **'సత్'** కాదు. జగదుత్పత్తికి కారణమైన **'అసత్'** కూడా కాదుట. సత్వ రజస్తమో గుణత్రయం కాని, భూత పంచకం కాని, వీటికి భిన్నమైన గిరి, నదీ, సముద్రాదికం గానీ ఏమీ లేవని **"నాసీద్రజ"** అనే శ్రుతి చెప్తోంది. అంటే, గుణత్రయ భూత, భౌతిక నిషేధం వల్ల బ్రహ్మాండం లేదని చెప్పినట్లయింది.

బ్రహ్మాండాద్బహిః మహత్వాద్యావరణాని పౌరాణికా వదన్తి| (భాష్యం)

బ్రహ్మాండానికి వెలుపల మహత్వాద్యావరణాన్ని పౌరాణికులు చెప్తున్నారు. కానీ **"కిమావరీవః కుహకస్య శర్మన్"** అనే వాక్యం అవి (సత్, అసత్) కూడా లేవని, కిమ్, కుహ, కస్య అనే 'కిమ్' శబ్ద త్రయం చేత బ్రహ్మాండం నిషేధించబడింది. బ్రహ్మాండం లేనందువల్ల ఆవరించేది లేదు, ఆవరింపబడే వస్తువూ లేదు, ఆవరించుట అనేదే లేదని చెప్పబడుతోంది. (ఆవరణ= వ్యాపించుట) అంటే, ఏ దేశంలో, ఏ భోక్త సుఖం నిమిత్తం ఈ ఆవరణ అనేది సంభవించినట్లు? అప్పుడు దేశమూ లేదు, సుఖభోక్తా లేడు. కానీ అవాంతర ప్రళయంలో (సృష్టి అంతంలో జరిగే మహాప్రళయం కాకుండా మధ్య మధ్యలో వచ్చే ప్రళయంలో) ఉదకాలు మాత్రం మిగిలి ఉంటాయని **"ఆపోవా ఇదమగ్రే సలిల మాసీత్"** అనే శ్రుతి చెప్పినట్లు, మహాప్రళయ కాలంలో కూడా అదే విధంగా ఉంటుందేమో అనే భ్రమ కలుగుతుందని, దాన్ని నివారించడానికి **"అంభః కిమాసీద్గహనం గభీరం"** అనే శ్రుతి మహాప్రళయ కాలంలో ఉదకాలయొక్క ఉనికిని కూడా నిషేధిస్తోందని ఆ సూత్ర భాష్యం వల్ల స్పష్టమవుతోంది.

మహాప్రళయ కాలంలో ప్రాణులే లేవు కనుక వారికి జీవనం లేదు, మృత్యువూ లేదు. రాత్రికి చిహ్నమైన చంద్రనక్షత్రాదులు గాని పగటికి చిహ్నమైన సూర్యుడు గాని ఎవరూ లేని అవస్థగా

వర్ణింపబడింది. కానీ సర్వోపనిషత్ప్రసిద్ధమైన (అన్ని ఉపనిషత్తులచే కొనియాడబడిన) బ్రహ్మవస్తువు మాత్రం తనని ఆశ్రయించుకున్న జగత్కారణమైన మాయతో కూడుకొని ఉండెను.

తస్మాద్యన్యాన్న పరః కించనాస|

బ్రహ్మ పదార్థంకంటే ఉత్కృష్టమైనది గాని, నికృష్టమైనది గాని ఇతర పదార్థమేమీ లేదని అర్థం.

తమ ఆసీత్తమసాగూఢ మగ్రే ప్రకేతమ్ సలిలగ్ం సర్వమా ఇదం| తుచ్ఛేనాభ్య లహితం యదాసీత్, తమస్త స్తన్మహినా జాయతైకమ్|

మాయ, శక్తి మొదలైన శబ్దాలచే చెప్పబడు జగద్వికారానికి ఉపాదాన కారణమైన (మూలమైన) అజ్ఞానం తమశ్శబ్దంచే చెప్పబడుతోంది. తమస్సు (చీకటి) ఏ ప్రకారంగా లోకంలో ఉండే పదార్థాలని ఆవరించి ఉంటుందో అదే ప్రకారంగా మూలాఽజ్ఞానం (మూల అజ్ఞానం) బ్రహ్మతత్వాన్ని ఆవరించి ఉందని, లోకంలో ఉపాదాన కారణమైన (మూలమైన) మృత్పిండంలో (మట్టి ముద్దలో) ఘటం (కుండ), బీజంలో వృక్షం గూఢంగా (అవ్యక్తంగా) ఉన్నట్లు ఆ అజ్ఞానంలో జగత్తుందని, **"యదాసీత్"** అనే శ్రుతి బోధిస్తోంది.

ఆసీదిదంతమో భూత మాప్రజ్ఞాతమలక్షణమ్| అప్రతర్క్యమవిజ్ఞేయం ప్రసుప్తమివ సర్వతః| (మ.స్మృ)

అందుచేతనే తెలుసుకోవడానికి శక్యం కాకుండా ఉందని, అనగా తెలియబడని, తెలుసుకొనుటకు అవసరం లేని, తర్కించుటకు శక్యం గాని, తెలుసుకొనుటకు వీలు పడని తమస్సు నిద్రిస్తున్నట్లు ఉండెనని చెప్తోంది. **'అసత్, 'అవ్యక్త'** శబ్దాలచే చెప్పబడేది ఇదే.

అసద్వా ఇదమగ్ర అసీత్ .....తతో వై సదజాయత| (తై.ఆ.ఉ)

అనే ఉపనిషద్వాక్యంచే కూడా ఈ విషయం బోధించబడుతోంది. అంటే నామరూపాలు లేకపోవడంచే అభివ్యక్తం కాక ఉండిపోయినటువంటి జగత్తు, బ్రహ్మనుండి నామరూపాత్మకంగా అభివ్యక్తం అయింది. ఆ ప్రకారం అభివ్యక్తం అవడమే సృష్టి ఉత్పన్నం అవడంగా ఈ శ్రుతులు బోధిస్తున్నాయి.

"సలిలగ్ం సర్వమా ఇదం" అనే శ్రుతి లోక దృష్టాంతంలో మనకి తెలిసిన వర్షోపలములు (వడగళ్ళు) సాధారణ ఉదకాలకంటే భిన్నములు కాక చివరికి (కరిగేక) ఉదకాలుగానే మిగులుతున్న విధంగా సర్వజగత్తు తమోమాత్ర రూపంగా మిగిలింది.

ఇక్కడ ఒక విషయాన్ని గ్రహించాలి. 'అసత్కార్య వాదులని', 'సత్కార్య వాదులని' రెండు తెగలవారు ఉన్నారు. ఇంతకు పూర్వం లేని కార్యం (ప్రయోజనం) కారణంలో (హేతువులో) పుడుతోందని సిద్ధాంతీకరించే 'కణ్వుడు' మొదలగువారు అసత్కార్య వాదులు. కారణమందు పూర్వం అవ్యక్తంగా ఉన్నదే కారణ వస్తుసామగ్రి కూరినప్పుడు, వాటిచేత వ్యక్తమవుతోందని సిద్ధాంతీకరించే సాంఖ్యుడు మొదలగు వారు సత్కార్య వాదులు. అంటే ఒక చెట్టు మొలకెత్తితే, అంతకుపూర్వం లేని కార్యం పుడుతోందని చెప్పేవారు అసత్కార్యవాదులు. ఆ చెట్టు ఈ రోజు మొలకెత్తినా అది బీజ రూపంలో సూక్ష్మంగా, అవ్యక్తంగా ఆ విత్తులో ముందే ఉందని, ఈరోజు దానికి కావలసిన గాలి, నేల, నీరు మొదలైన వస్తుసామగ్రి కూరడం వల్ల అది బయటకు వ్యక్తమైందని చెప్పేవారు సత్కార్యవాదులు. సత్కార్యవాదుల మతాన్నే శ్రుతి బలపరుస్తోంది.

తత్వజ్ఞానంచే నివారింపబడేది మూలాఽజ్ఞానమని అందుచే అది తుచ్ఛమైనదని, తుచ్ఛమైన అజ్ఞానంచే జగత్తంతా ఆవరింపబడి ఉందని **"తుచ్ఛేనాభ్వపిహితం యదాసీత్"** అనే శ్రుతి బోధిస్తోంది. **'నామ రూపాభ్యం వ్యాకరవాణి'** అను శ్రుత్యుక్త ప్రకారం తమస్సులో అవ్యక్తంగా ఉన్న ఈ జగత్తు పరమేశ్వరుని

సంకల్పాత్మక తపస్సుచే, నామరూపాత్మకంగా వ్యక్తమవడమే సృష్టి ఉత్పన్నమవడం అంటే, అని వ్యవహారం. అజ్ఞానంచే జగదాకారంగా భాసించినా పరమార్థ దృష్ట్యా అంతా బ్రహ్మ స్వరూపమే.

కామస్తదగ్రే సమవర్తతాధి మనసోరేతః ప్రథమం యదాసీత్| (తై. ఆ.)

సృష్టికి పూర్వం తమస్సుతో, మాయతో ఆవరింపబడిన బ్రహ్మయొక్క మనస్సుకు జగత్సృష్టి రూపమైన కార్యం (జగత్ సృష్టి) చెయ్యాలని కలిగిన సంకల్పానంతరం సృష్ట్యాదియందు ఆ కార్యమే కామరూపంగా, జగత్ సృష్టి చేయాలనే ఇచ్ఛారూపంగా ఆవిర్భవించింది. ఇదే శ్రుతి అరుణప్రశ్నయందు వినబడుతోంది.

కామస్తదగ్రే సమవర్తతాధి| మనసో రేతః ప్రథమం యదాసీత్| (అ.ప్ర)

మనస్సు సంకల్పాలకు అధిపతిగా వేరే చోట వర్ణింపబడుతోంది.

సంకల్పజూతిం దేవం విపశ్చిమ్| (తై.బ్రా.3-12-3)

లోకంలో ఫలానా పని చేయాలనే సంకల్పం, ఆ తర్వాత ఆ పనిచేయడానికి ఇచ్ఛ, పిమ్మట ఆ పని పూర్తిచేయడం ఉన్నట్లు గానే, సృష్టికి పూర్వం మాయావిశిష్ట బ్రహ్మకు లీనమైన సృష్టి యందలి ప్రాణుల కర్మపరిపాకంచే ముందుగా జగత్తును సృష్టించాలనే సంకల్పం కలగడం, పిమ్మట ఆ జగద్రూపకార్యం ఇచ్ఛారూప కారణంగా ఉద్భవించడం, ఆ పిమ్మట కార్యరూప జగత్తును సృష్టించడం అనే పని జరిగిందని అర్థం. ఈ ఇచ్ఛ సృష్టికి ఆరంభంలో కలిగినట్లుగా ఉపనిషత్తు చెప్తోంది-

సోఽకామాయత బహుస్యాం ప్రజాయేయేతి| (ఉపనిషత్)

అంటే పరమాత్మకు ఉన్నటువంటి వాస్తవిక అద్వితీయత్వానికి విరోధం లేకుండా ఆ పరమాత్మే మాయా కల్పిత జగద్రూపంగా, స్థావర జంగమాత్మకంగా ఆవిర్భవించాలనే కోరిక కలవాడు అయ్యాడని వివరించ బడింది. పరమాత్మ తన అద్వితీయత్వానికి విరోధం లేకుండా సృష్టించినట్లు ఇదే విషయం అగ్నిచయన ప్రకరణంలో కూడా చెప్పబడింది.

స ఆశిషా ద్రవిణమిచ్ఛమానసః పరమచ్ఛదోవర ఆవివేశ| (తై.సం.4-6-2)

విశ్వకర్మ అనే పేరు గల జగత్కర్త అయిన పరమేశ్వరుడు జగత్తును సృజించవలెననే కోరికతో, జగద్రూప ద్రవిణాన్ని (సంపదను) ఇవ్వాలని కోరినవాడై తన తాలూకు అద్వితీయత్వమనే పరమార్థ తత్వాన్ని మాయచే కప్పిపుచ్చిన వాడై, తనచే సృజించబడిన ప్రాణులయొక్క శరీరమందు జీవ రూపంగా ప్రవేశించాడని చెప్పబడింది. అందుకే, జీవేశ్వరులకు (జీవునికి, ఈశ్వరునికి) బింబ-ప్రతిబింబ భావం చెప్పబడింది. కర్మ ప్రకరణంలో గల శ్రుతి పరమాత్మ అద్వితీయత్వాన్ని బోధించింది కనుక-

సర్వేషాం వేద వాక్యానామ్ అద్వైతే పరబ్రహ్మణి తాత్పర్యం|

అని, పరమాత్మ అద్వితీయత్వాన్ని బోధించడమే అన్ని వేదవాక్యాలకూ తాత్పర్యం అన్న వాక్యార్థం స్పష్టమవుతోంది. దాని తరువాయిగా-

సతో బంధుమసతి నిరవిందన్ హృది ప్రతీష్యాకవయో మనీషా|

అని పరబ్రహ్మ జగత్తును సృజించవలెననే కామన కలవాడయ్యెను అని చెప్తోంది.

జాగ్రదవస్థలో (మెలకువగా ఉన్నప్పుడు) సుతరామూ (ఏ మాత్రమూ) జరగని విషయంలో పుట్టిన తృష్ణ నిద్రిస్తున్న పురుషుడియందు రకరకాల కలలుగా వచ్చి ఆ కలలోనే సుఖదుఃఖాల వరకూ వెళ్ళి అతని

మనోవ్యవహారాన్ని బంధించినట్లు, సృష్టి చేయాలనే పరమేశ్వరుని ఆ కోరిక దేవ, తిర్యక్ (పశు), మనుష్యాది సర్వ వ్యవహార బంధనానికి (సృష్టికి) కారణమైందని చెప్పారు. తమ హృదయ కమలంలో స్వబుద్ధితో విచారణ చేసిన వేదాంత పారంగతులైన విద్వాంసులు మాత్రం, మాయావిశిష్టమైన పరమేశ్వరునియందు అవ్యక్తంగా ఉన్న జగత్తుయొక్క ఉత్పత్తికి పరమేశ్వరుని కోరికయే కారణమని నిశ్చయించారు.

కామస్య సర్వవ్యవహార హేతుత్వం వాజసనేయిన స్సమామనన్తి| (విద్యారణ్య భాష్యం)

సర్వ వ్యవహారాలకు పరమేశ్వరుని సంకల్పమే కారణమని వాజసనేయులు కూడా చెప్తున్నారు.

"అథోఖల్వాహుః కామమయ ఏవాయం పురుషః" అని వ్యాస భగవానులు కూడా 'సర్వ వ్యవహారమూ కామబంధనమే' అన్నారు. అంటే ఏదైనా పని చెయ్యాలంటే ముందుగా మనం అది చెయ్యాలి అని అనుకోవాలి కదా! ఇవి మనందరికీ కూడా అనుభవంలో ఉన్నవే.

తిరశ్చీనోవితతో రశ్మిరేషామ్| అధస్విదాసీదుపరి స్విదాసీత్| వేదోదా ఆసన్మహిమాన ఆసన్ స్వధా అవస్తాత్ప్రయతిః పరస్తాత్| (తై. బ్రా.)

సూర్యకిరణంలో సమానంగా స్వయంప్రకాశమైన చైతన్య పదార్థం భూత భౌతిక రూపాలైన జగత్తులోని వస్తువులకు అన్ని వైపులా (దీర్ఘంగాను, అడ్డంగాను, అధోభాగాన, ఉపరిభాగాన కూడా) ప్రకాశిస్తుండడం వల్ల ఆ చైతన్య పదార్థం ఒకేచోట ఉందని చెప్పడానికి వీలుపడదు. ఒక కుండను తయారుచేయడానికి ఉపాదానమైన (మూల పదార్థమైన) మట్టి ఆ కుండంతా వ్యాపించి ఉన్నట్లుగానే జగత్తుకు ఉపాదానమైన చైతన్య పదార్థం ఈ జగత్తంతా వ్యాపించి ఉందని చెప్పబడుతోంది. చిదేక రసమైన వస్తువుయొక్క సద్రూపమైన సారాన్ని సర్వపదార్థాలు ధరిస్తున్నాయి. అందుకే సర్వపదార్థాలు **'అస్తి'** అనే శబ్దంచే వ్యవహరింప బడుతున్నాయి. ఇవన్నీ పర్వతాలు, నదీరూపాలుగా మహామహిమోపేతమైనవి. వీటన్నింటికీ **'స్వధా'** శబ్దంచే చెప్పబడే మాయాశబ్దం చేతను, అవిద్యా శబ్దంచేతను వ్యవహరింపబడుతున్న పారమేశ్వరీ శక్తి ప్రథమ కారణం. **'ప్రయతి'** అనే శబ్దంచే సూచించబడే శక్త్యాధార భూతమైన పరమాత్మ దీనికంతకూ ఉత్తమ కారణం. ఈ ప్రకారం శక్తి, పరమాత్మ అనే ప్రకృతి, పురుషులే జగత్తుకి కారణభూతులని శాస్త్రాలు బోధిస్తున్నాయి.

"కో అద్ధావేద క ఇహ ప్రవోచత్|"

కుత ఆజాతా కుత ఇయం విసృష్టిః అర్వాగ్దేవా అస్య విసర్జనాయ| (తై. బ్రా)

కానీ కొంతమంది శాస్త్రప్రమాణాన్ని విడిచి తమ తమ బుద్ధిబలంచే అన్యధా ఉత్ప్రేక్షిస్తూ (ఊహిస్తూ) (1)సృష్టికి పరమాణువులు మూలకారణమని కాణాద గౌతములు (2)స్వతంత్రమైన, అచేతనమైన ప్రధానం సృష్టికి మూలకారణమని కపిలాదులు (3)శూన్యం వల్ల జగదుత్పత్తి అయిందని మాధ్యమికులు (బౌద్ధులలో ఒక తెగవారు) (4)జగత్తుకు కారణం లేదని స్వభావతః ఉంటుందని లౌకాయితులు అనబడే నాస్తికులు ప్రతిపాదిస్తున్నారు. కానీ,

తే సర్వేపి భ్రాంతా ఏవేతి| (సా.భా)

వారందరూ భ్రాంతి పడుతున్నారని శ్రుతి చెప్తోంది. అయితే ఈ జగత్కారణాన్ని ఏ పురుషుడు తెలుసుకుంటున్నాడు? ఏ నిమిత్త కారణం వల్ల జగత్తు ఉత్పన్నమవుతోందో ఈ అంశం చెప్పవలసి ఉంది కానీ చెప్పడం శక్యం కాదు. ఈ అశక్తి ఎందువల్ల అంటే-దేవతలు సృష్టికి తర్వాతి వారని చెప్తోంది. దేవతలకే ఈ విధమైన గతి సంభవిస్తే మరి ఈ సృష్టి ఎవరి వల్ల సంభవించిందో చెప్పగలిగిన వారెవరని **'అద్ధా కో వేద'** అనే శ్రుతి ప్రతిపాదిస్తోంది. దేవతలు, మనుష్యులు కూడా సృష్టికి పూర్వావస్థను చూడలేదు. వారే

లేనప్పుడు వారు చెప్పడం సంభవించదు కదా! పోనీ అనుమానించడానికి శక్యమవుతుందా అంటే, హేతుదృష్టాంతాలు (వేరే సందర్భాల్లో కనబడే సమాన కారణాలు) కూడా లేనందువల్ల అదీ శక్యం కాదు. కాబట్టి, అతి గంభీరమైన ఈ పరమార్థతత్వం వేదైక సమధిగమ్యమని (వేదంద్వారా మాత్రమే తెలియ దగినదిగా) అంగీకరించక తప్పదని **"కో అద్ధావేద"** అనే శ్రుతి చెప్తోంది.

ఇయం విసృష్టిర్యత ఆబభూవ యదివా దధేయదివా న యోఽస్యాఽధ్యక్షః పరమే వ్యోమన్| సో అంగవే దదాయ దివాన వేద| (తై.బ్రా)

కంటికి కనిపించే ఈ భౌతిక దృష్టి ఏ ఉపాదాన కారణం వల్ల సంభవించిందో, ఆ కారణం ఏమైనా స్వరూపాన్ని ధరించి ఉంటుందా? లేక దానికి స్వరూపమే లేదా? ఈ జగత్తుకు అధ్యక్షుడిగా ఉన్న పరమేశ్వరుడు మాత్రమే తెలుసుకుంటున్నాడా? లేక అతనికి కూడా తెలియదా? అంటే, లౌకిక వ్యవహారదృష్ట్యా ఆ పరమేశ్వరుడు మాత్రం తెలుసుకోగలడని, పరమార్థ దృష్ట్యా సర్వమూ ఆత్మ స్వరూపమే అని చెప్పబడింది. అయితే, రెండవ పదార్థమే లేదు అన్నప్పుడు "**తత్కేన కం పశ్యేత్"** అనే శ్రుత్యుక్త ప్రకారం ఎవరు, ఎవరిని, దేనిని చూసినట్లు? అంటే, ఎవరూ ఎవరినీ చూడడం సంభవించదని అర్థం. ఇట్టి పరిస్థితుల్లో మనుష్యులకు తెలుసునని చెప్పడానికి కూడా అవకాశం లేదని **"ఇయం విసృష్టిరిః"** అనే శ్రుతి బోధిస్తోంది.

కిగ్ం స్విద్వనమ్ క ఉసవృక్ష ఆసీత్|

"యతో ద్యావా పృథివీ నిష్టతక్షుః మనీషిణో మనసా పృచ్ఛతే దుతత్ యదధ్య తిష్ఠత్ భువనాని ధారయన్|"

లోకంలో గృహాన్ని నిర్మించదలచిన వారు వనానికి వెళ్ళి అక్కడినుండి దారుమయ కాష్టాలను (కలపను) తీసుకువచ్చి నిర్మాణం చేస్తారు. ఈ ద్యావాపృథువులను (ఆకాశాన్ని,భూమిని) ఏ వనసంబంధ వృక్షాలతో నిర్మాణం చేసి ఉంటారు? ఓ బుద్ధిమంతులారా! మీ ఆచార్యునివద్దకు వెళ్ళి ఈ ప్రశ్నలను అడగండి. ఏ వస్తువు సర్వలోకాలను తనయందు ధారణ చేసుకుంటుందో ఆ వస్తువును గూర్చి కూడా ప్రశ్నించండి, అని పైన ఉదహరించిన ప్రశ్నలకు శ్రుతియే సమాధానం చెప్తోంది.

బ్రహ్మ వనం బ్రహ్మ స వృక్ష ఆసీత్, యతో ద్యావా పృథివీ నిష్టతక్షుః| మనీషిణో మనసావిబ్రవీవః బ్రహ్మాధ్యతిష్టద్భువనాని ధారయన్|

ద్యావా పృథువులను నిర్మించడానికి వనస్థానీయం, వృక్ష స్థానీయం కూడా బ్రహ్మయేనని **"బ్రహ్మవన మితి"** అనే శ్రుతి చెప్తోంది. ఆ వస్తువు సర్వశక్త్యుపేతమైనది గనుక జగన్నిర్మాణానికి ఉద్దేశించిన సామగ్రి అంతా ఆ బ్రహ్మయందే ఉంటుందని, సర్వజగద్వ్యాపకమైన బ్రహ్మ పదార్థమే సర్వభూతాలను తనయందు నియమింప చేసుకుందని శ్రుతి ప్రతిపాదిస్తోంది. ఓ బుద్ధిమంతులారా! ఆచార్యులైన నేను మనసా సర్వం నిశ్చయించి మీకు ఈ విషయం చెప్తున్నానని **"యతోద్యావా పృథివీ"** అనే శ్రుతి ప్రతిపాదిస్తోంది.

దీనివలన తేలిన సారాంశం- పూర్వసృష్టి లీనమై ఉత్తర సృష్టి ఆరంభంకాని ముందుండే అవస్థ **'సత్-అసత్'** విలక్షణంగా ఉంది. ఇంతకు ముందు వివరించినట్లు **"తమసస్తన్మహినా జాయతైకం"** అనే శ్రుతి సత్కార్య వాదాన్నే (బీజంలోనే సూక్ష్మరూపంగా విత్తు ఉన్నదనే వాదాన్నే) బలపరుస్తోంది. **"ఏకమేవాఽద్వితీయం"** మొదలైన శ్రుతులు అజ్ఞానంచే జగత్తు జగదాకారంగా భాసించినా పరమాత్మ దృష్ట్యా జగత్తు మిథ్యా భూతమని, అంతా బ్రహ్మ స్వరూపమే అని శ్రుతులు బోధిస్తున్నాయి. కానీ ఆ బ్రహ్మ పదార్థం సృష్టికి పూర్వం మాయతో కూడి ఉన్నందున జగత్తును సృజించవలెనని బ్రహ్మకు సంకల్పం కలిగింది. ఆ సంకల్పానుసారం బ్రహ్మ తన అద్వితీయత్వాన్ని వదులుకోకుండా జీవప్రపంచాన్ని సృజించెను.

ఆ సంకల్పమే దేవ, తిర్యక్, మనుష్యాది సర్వ వ్యవహారానికీ మూలహేతువు అయినందున అభిజ్ఞులైన వేదాంత పారంగతులు, విద్వాంసులు బాగా విమర్శించి నిర్ణయించారు. ఈ సందర్భంలో ముందుగా సంకల్పం, ఇచ్ఛ ఆ పైన కార్యం పూర్తి చేయడం అనే లోకానుభవం కూడా శ్రుత్యర్థ నిర్ణయాలకు తోడ్పడడం చూడవచ్చు. ఈ జగత్తనే గృహనిర్మాణంలో బ్రహ్మయే గృహస్వామి, బ్రహ్మయే వనం, బ్రహ్మయే వృక్షం, బ్రహ్మయే కలప అని **"బ్రహ్మవనం"** మొదలైన శ్రుతులు బోధించాయి. కనుక మహా ప్రళయానంతరం, ఈ సృష్టికి పూర్వం స్వయం ప్రకాశమైన చిద్రూపమైన పరబ్రహ్మ మాత్రమే మిగిలి ఉండునని, ఆయన సంకల్పానుసారమే జగత్తు వివిధంగా సృజించబడిందని, అది పూర్వసృష్టికి సంబంధించిన ప్రాణులయొక్క కర్మల ప్రేరణతో జరిగిందని **"నాసదీయ"** సూక్తం బోధిస్తోంది.

సృష్టి

ఇదం వా అగ్రేనైవ కించనాసీత్ నద్యోరాసీత్ పృథివీ| నాఽన్తరిక్షం తదసదేవ సన్మనోఽకురత స్యామితి| తదతప్యత|

ఇప్పుడు మనచే చూడబడే స్థావరజంగమాది రూపమైన భూలోకం, దేవలోకం, మొదలైన జగత్తు సృష్టికి ముందు లేదని, వాటిని ఉండేటట్లుగా తానే జగద్రూపంగా పరిణమించాలని సంకల్పించిన బ్రహ్మ ప్రాణుల యొక్క కర్మపరిపాకంతో ప్రేరేపించబడినవాడై స్రష్టవ్య (సృష్టించ వలసిన) పదార్థ విషయమై పర్యాలోచన చేశాడని చెప్పుకున్నాం. దీనినే తైత్తరీయ ఉపనిషత్తులోని **"అసద్వా ఇదమగ్ర ఆసీత్ తతో వై సదజాయత"** అను శ్రుతి కూడా బలపరుస్తోంది. అసత్ (అంటే అశాశ్వత) శబ్దంచే శశవిషాణాదులవలె (కుందేటికి కొమ్ములు వచ్చాయన్నట్లు) కేవలం శూన్యత్వం చెప్పబడం లేదు. భూమి, నీరు మొదలైన పేర్లతోనో, ఘనపదార్థంగానో ద్రవపదార్థంగానో వ్యక్తం కాకపోవడమే 'అసత్' శబ్దంచే చెప్పబడుతోంది. అటువంటి అసత్ నుంచి సత్ - భూత భౌతిక జగత్తు పుట్టి, నామరూపాలతో వ్యక్తమైందని అర్థం.

ఇక్కడ ఒక విశేషం ఉంది. తండ్రి నుంచి పుత్రుడు వేరుగా ఉన్నట్లు కాక, లోకంలో మట్టిముద్ద ఘటానికి ఉపాదాన (మూల) కారణమైనా ఆ ఘటాన్ని తయారుచేసే కులాలుడు (కుమ్మరి) వేరుగా ఉండి ఆ ఘటాన్ని తయారు చేయడానికి అతను నిమిత్తకారణమైనట్లుగా కాకుండా బ్రహ్మయే జగత్తుకు కారణద్వయస్థానం (ఉపాదాన, నిమిత్త కారణాలు రెండూ) తానే అయ్యాడు.

తదాత్మానగ్గ్ స్వయమకురుత తస్మాత్ తత్సుకృతముచ్యత| (తై.ఆ.ఉ)

అను శ్రుతి, సచ్చిదానందైక స్వరూపమైన ఆ బ్రహ్మం వేరే కర్త అపేక్ష లేకుండా, తానే కర్తయై జగదాకారంగా మార్పుచెందెనని చెప్తోంది. ఇదే విషయాన్ని వాజసనేయ శ్రుతి ఇలా చెప్తోంది.

తద్ధేదం తర్హి అవ్యాకృతమాసీత్, తన్నామరూపాభ్యామేవ వ్యాక్రియతే| (శు.య.ఉ)

కానీ, అసత్ శబ్దంచే శూన్యత్వాన్ని సూచిస్తే, ఛాందోగ్యం మొదలైన శ్రుతులకి విరోధం సంభవిస్తోంది. ఎందుకంటే, ఛాందోగ్యశ్రుతి (1)**"సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్, ఏకమేవాఽద్వితీయం"** (2)**"తద్ధైక ఆహురిద మేవాగ్ర ఆసీత్"** (3)**"కుతస్తుఖలు సోమ్యేదగ్గ్ స్యాదితి హోవాచ కథం అసతస్సజ్జాయేత" "సదేవ సోమ్యేదమగ్ర ఆసీదితి"** అని వరుసగా ఆ శ్రుతులచే (1) సృష్టికి పూర్వం ఈ జగత్తు సద్రూపంగానే ఉన్నట్లు (2) మళ్ళీ శూన్యత్వాన్ని ఉపపాదన చేసి (3) తిరిగి ఆ శూన్యత్వాన్ని నిరాకరణ కూడా చేసి చివరకు సద్రూపాన్ని సమర్థించింది. ఐతరేయ శ్రుతి కూడా ఇలా పేర్కొంది.

ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్, నాన్యత్ కించనిమిషత్| (ఐ.ఉ.)

అంటే సృష్టికి పూర్వం ఏమీ లేదనే ప్రతిపాదనకు అర్థం నామరూపాత్మకంగా జగత్తు స్పష్టంగా వ్యక్తం కావడం లేదని మాత్రమే గాని, అవ్యక్తంగా బీజరూపకంగా కూడా లేదని అర్థం కాదు. లోకంలో గాఢ నిద్రను పొందిన పురుషుడు ఆ కలలో చూసిన/చేసిన ఆ కర్మల ఫలాన్ని అనుభవించడానికి మళ్ళీ తెలివి గలవాడు అయినట్లుగా సర్వ ప్రాణులచే వారి వారి కర్మ ఫలాలను అనుభవింప చేయడానికై పరమాత్మకు ఆలోచన కలగడమే అని **"తదసదేవ సన్మనో కురుతస్యామితి" "సతపోతప్యత"** మొదలైన శ్రుతులు బోధిస్తున్నాయి. ఇక్కడ **'తపస్సు'** అంటే మామూలు వ్యవహారిక తపస్సుగా కాదు. ఆ స్రష్టవ్య తాను సృజించదలచిన వాటిగురించి చేసిన పర్యాలోచనమే ఆ తపశ్శబ్దానికి అర్థమని **"యస్సర్వజ్ఞః సర్వవిత్ యస్యజ్ఞాన మయం తపః"** మొదలైన అథర్వణ శ్రుతులు కూడా చెప్తున్నాయి. అంతే కాదు పరమాత్మ అశరీరుడు అవడం వల్ల సాధారణ కృచ్ఛ చాంద్రాయణాది (సాధారణ మనుష్యులు చేసేటటువంటి ఉపవాస వ్రతాలు వంటి) తపస్సు సంభవించదు గాని ఆయన(ఆ స్రష్ట) సర్వశక్తియుక్తుడు అవడంవల్ల పర్యాలోచన చేయడమనే తపస్సు సంభవించగలదు. ఆయనకు ఆ శక్తి ఉంది అనడానికి ప్రమాణం శ్వేతాశ్వతర ఉపనిషత్తులోని **"పరాశ్యశక్తిర్వివిధైవ శ్రూయతే, స్వాభావికీ జ్ఞానక్రియా బలాచ"** అనే శ్రుతి.

పరమాత్మ మనలాగ కాకుండా అటువంటి ఉత్కృష్టశక్తి కలవాడవడం వల్ల ఇంద్రియాల అపేక్ష లేకుండా దర్శన, శ్రవణాది సర్వవ్యవహారాన్ని నిర్వహిస్తున్నట్లుగా **"అపాణిపాదో జవనోగ్రహీతా, పశ్యత్యచక్షు స్సృణోత్యకర్ణః సతం మణిమవిందత్, సోఽనంగులివాయత్ సోఽగ్రీవః పత్యముఞ్చత్"** మొదలైన శ్రుతులు బోధిస్తున్నాయి. దీనివలన తేలిన సారాంశం- ప్రళయకాలంలో పరమాత్మలో లీనమై అవ్యక్తంగా ఉన్న జగత్తును సృష్టి ఆరంభంలో పరమాత్మతత్వం ప్రాణులయొక్క కర్మచే ప్రేరేపింబడినదై, నామరూపాత్మకంగా సద్రూపంగా ఆవిర్భవింప చేసెనని అనడం వల్ల సృష్టికి పూర్వమే జగత్తు ఉందని, కానీ అది అవ్యక్తంగా ఉందని **"ఇదం వా అగ్రే"** మొదలైన శ్రుతి భాగం స్పష్టపరిచింది.

ఇంక సృష్టి క్రమం ఎలా ఉందో నిరూపించబడుతోంది.

తదతప్యత, తస్మాత్తేపానాత్ ధూమోఽజాయత, తద్భూయోఽతప్యత, తస్మాత్తే పానాదగ్ని రజాయత తద్భూయోఽతప్యత, తస్మాత్తే పానాత్ జ్యోతిరజాయత, తద్భూయోఽతప్యత తస్మాత్తే పానాన్మరీచయోఽ జాయన్త, తద్భూయోఽతప్యత తస్మాత్తే పానాదుదారా అజాయన్త| తద్భూయోఽతప్యత| తదభ్రమివ సహమన్యత తద్వస్తి మభినత్| స సముద్రోఽభవత్| (తై.బ్రా)

జగత్తుని సృజించాలనే పరమేశ్వరుని తపస్సంకల్పంచే ముందుగా ధూమం, పిమ్మట అగ్ని, ఆ పిమ్మట జ్యోతి అంటే అగ్నినిష్ఠ ప్రకాశ, తర్వాత జ్వాల పిమ్మట సర్వతోముఖంగా ప్రసరించే ఒకానొక ప్రభ అనగా కాంతి బయలుదేరినట్లు చెప్పబడుతోంది. ఇక్కడ ఉదా- **"ధూమజ్యోతిస్సలిల మరుతాం సన్నిపాతః క్వామేఘః"** అని మేఘ సందేశ కావ్యంలో కాళిదాసు చెప్పినట్లు ఉల్బణ (స్పష్టమైన, ఉగ్రమైన) జ్వాలలు బయలుదేరి, పై ధూమాలన్నీ మేఘంగా పరిణమించి అది ఈ సృష్టికి బస్తిస్థానంగా (మూత్రాశయంగా) మారింది.

మూత్రాశయో ధనుర్వక్రో బస్తిరిత్యభిదీయతే|

ఆ మూత్రాశయం భేదించబడి దానినుంచి విడువబడిన ఉదకం సముద్రంగా మారిందట.

తస్మాత్సముద్రస్య న పిబంతి, ప్రజననమివహి మన్యన్తే (తై.బ్రా)

తస్మాత్సశోర్జాయ మానాదాపః పురస్యాద్యన్తి|

అని లోకంలో ప్రసవానికి పూర్వం ఉదకం (ఉమ్మనీరు) నిర్గతమవుతున్నట్లుగా పరమేశ్వరుని నుంచి సృష్టికి పూర్వం సముద్రోదకం నిర్గతమైంది కనుకనే సముద్రోదకాన్ని అస్పృశ్యంగా తలచి శిష్టులు ఎవరూ ఈ నాటికీ స్వీకరించరు. ఈ విషయాన్ని **"తద్వస్తి మభినత్"** అనే శ్రుతి స్పష్టపరుస్తోంది. ఈ సముద్ర సృష్టి తర్వాత దాసహోతృ మంత్రం సృజించబడిందని ఈ క్రింది విధంగా వేదభాష్యంలో వివరించారు.

హోతృ మంత్రస్య సృష్టిమాహ తద్దశహోతారామశ్రుజత ప్రజాపతిర్వై దశ హోతా| (తై.బ్రా)

ఈ మంత్రంచే ప్రతిపాదింపబడిన ప్రజాపతి **'దశహోతా'** అంటే ఈ మంత్రంచే ప్రతిపాదించబడిన రీతిలో చిత్తి మొదలైన ఆకారంగా ప్రతిపాదింపబడిన ప్రజాపతియే అని చెప్పబడుతోంది.

ముల్లోకాల సృష్టి

తద్వా ఇదమాపస్సలిలమాసీత్| సోఽరోదీత్ప్రజాపతిః| సకస్మా అజ్ఞా యద్యస్యా అప్రతిష్ఠాయా|

పరమాత్మచే సృజించబడిన జగత్తు సముద్రరూపంగా పృథివివంటి ఏ ఇతర భూతమిశ్రణం లేని ఉదకం అని చెప్పడానికి 'సలిల' శబ్దంతో బాటు దాని పర్యాయమైన 'ఆపః' అనే పదం కూడా వాడబడింది. అంటే కేవలం జలం మాత్రమే సృష్ట్యాదిలో ఉంది. ఈ విధంగా పృథివీ మిశ్రమం లేని కేవల ఉదకాన్ని చూసి దశహోతృరూపమైన ప్రజాపతి "మనం నిలబడడానికి యోగ్యం లేని, అవిద్యమాన పృథివినుంచి యే ప్రాణి జాతాన్ని సృజించుటకు శక్యం కాని నేను ఎందులకు" అని భావించి రోదనం చేసెను. ఆ రోదన లోంచి వచ్చిన నేత్రోదకమే సముద్రంలో పడి ఘనీభూతమై పృథివిగా మారింది.

యద్వ్యమృష్ట| తదంతరిక్షమభవత్| యదూర్ధ్వముదమృష్ట| సాద్యౌరభవత్| యదరోదీత్| తదనయో రోదస్త్వం| (తై.బ్రా)

ఆ పృథివి యొక్క పై భాగంలో ఉన్న హెచ్చుతగ్గులను వారించడానికి అక్కడ ఉన్న ఉదకాలను వివిధంగా మార్జన చేసుకోగా సృజించబడిన స్థానం అంతరిక్షమైంది. పిమ్మట తన హస్తాన్ని పైకి ప్రసరింపజేసి మార్జనచేయబడిన స్థానం ద్యులోకంగా ఉత్పన్నమైంది. రోదనం వల్ల ఉత్పన్న మవడంచే రోదసీ శబ్దం ద్యావాపృథివులకు పేరయ్యింది.

తస్యాం పృథివ్యా మాసుర సృష్టిం దర్శయతి|

ఆ ప్రజాపతి సృజించదలచిన ప్రాణులకు ఆధారయోగ్యమైన భూమిని పొంది, దానిపై ప్రజోత్పాదన అంటే మనుష్యులను సృజించదలచినవాడై దానికి సంబంధించిన 'తపః' పర్యాలోచన చేసి స్వయంగా, వేరే దేహంచే గర్భధారణ చేసి జఘనభాగం నుండి అసురులను సృజించెను. ఆ సృజించబడిన అసురులకు మట్టిపాత్రలో అన్నాన్ని ఉంచి ఇచ్చెను. అప్పుడు అసురులను సృజించిన శరీరాన్ని నశింపచేయగా, ఆ నశింపచేయబడిన శరీరం శరీరాకారాన్ని విడిచి అంధకారంతో గూడిన రాత్రిగ మారెను.

మనుష్యుల సృష్టి

సోఽకామయత ప్రజాయేయేతి| సతపో తప్యత|సోంతర్వానభవత్| సప్రజననాదేవ ప్రజా అసృజత| తస్మాదిమా భూయిష్ఠాః| ప్రజననాద్ధ్యేనా అసృజ్యత| తాభ్యోదారుమయే పాత్రే పయో దుహత్| యస్యతనూ రాసీత్| సాజ్యోత్స్నాఽభవత్| (తై.బ్రా)

మళ్ళీ ప్రజలను సృజించే ఇచ్ఛ కలవాడై తిరిగి పర్యాలోచనాత్మకమైన తపస్సు చేసి గర్భధారణ చేసెను. ప్రజోత్పాదనకు సమర్థమైన ద్వారం నుండి **"భూయిష్ఠాః ప్రజాః"** అని అత్యంత బహుళంగా ప్రజలు

సృష్టించబడ్డారు. ఆ ప్రజలకొరకు దారువుతో నిర్మించబడిన పాత్రలో ఆహారంగా పాలను పితికెను. ప్రజలను సృజించిన శరీరాన్ని విడిచి **'జ్యోత్స్నా'** చంద్రుని యొక్క ప్రకాశంగా మారెను.

సోఽకామయత| సోంతర్వానభవత్| స ఉపక్షాభ్యామే వర్తూన సృజత| తేభ్యో రాజతే పాత్రే ఘృతమదుహత్| యస్య సాతనూరాసీత్| తామపాహత| సోఽహోరాత్రయోస్సంధి రభవత్|

మనుష్య సృష్ట్యనంతరం వసంతాది కాలాభిమాని అయిన పురుషుని సృష్టి ప్రతిపాదింపబడుతోంది. మళ్ళీ సృజించదలచినవాడై పర్యాలోచనాత్మక తపస్సు చేసి గర్భధారణ చేసి, ఉపపక్షాలవలన (చిన్న రెక్కలు, పక్క భాగాల వలన) ఋతువులను సృజించెను. అనగా ఋతుస్వరూపమైన కాలాభిమానియగు పురుషుని సృజించెను. ఆ ఋతువులను సృజించిన ప్రజాపతియొక్క శరీరం తన శరీరాకారాన్ని విడిచి అహోరాత్రాలయొక్క సంధి రూపంగా మారెను.

దేవసృష్టి క్రమం

సోఽకామయత ప్రజాయేయేతి ... స్యోన్తర్వానభవత్| సముఖాద్దేవా నసృజత .... తదహరభవత్| (తై. బ్రా.)

తిరిగి ప్రజాపతి దేవతలను సృజించదలచినవాడై పర్యాలోచన రూపమైన తపస్సు చేసి గర్భధారణ చేసి ముఖంనుండి దేవతలను సృజించెను. తర్వాత ఆ దేవతలను సృజించిన శరీరం అహస్సుగా మారిందని **"ఏ తేవై ప్రజాపతేర్దేహః య ఏవం వేద దుహ ఏవ ప్రజాః"** అనే మంత్రం అన్న, పయో(పాలు), ఘృత(నెయ్యి), సోమముల యొక్క వేదనాన్ని ప్రశంసిస్తోంది.

దివావైనోఽభూదితి| తద్దేవానాం దేవత్వం య ఏవం దేవానాం దేవత్వం| వేద| దేవవానేవ భవతి|

దేవతలకు దేవత్వనామం ఎలా వచ్చిందో చెప్పబడుతోంది. దేవతలను సృజించిన శరీరం అహస్సుగా మారినందువల్ల దేవతలు హర్షాతిరేకంతో **'దివైవ అభూత్'** అని దివా శబ్దాన్ని ఉచ్చరించారు కనుక దివా యోగంతో దేవతలకు దేవత్వ వ్యవహారం, మనకు **'దివా'** అంటే 'పగలు' అనే వ్యవహారం వచ్చింది.

ఏ తద్వా అహోరాత్రాణాం జన్మ| య ఏవమహోరాత్రాణాం జన్మవేద| నాహోరాత్రేష్వార్తిమార్చతి|

దేవాసురులను సృజించిన శరీరభాగాలే అహోరాత్రులయ్యాయని తెలుసుకున్నవాడు ఎన్నడూ నాశనం పొందడని వేదం ప్రశంసించింది. ఈ సందర్భంలో ఈ జగత్తును సృజించాలనే ప్రజాపతి యొక్క సంకల్పాత్మక మనస్సు ప్రశంసిస్తోంది.

అసతోఽధిమనోఽసృజ్యత| మనః ప్రజాపతి మసృజత| ప్రజాపతిః ప్రజా అసృజత| తద్వా ఇదం మనస్యేవ పరమం ప్రతిష్ఠితం యదిదం కించ తదేవచ్ఛ్వేవస్యసం నామబ్రహ్మ|

ఈ అనువాకం మొదట్లో చెప్పబడిన **"తదసదేవ సన్మనో కురుత స్యామితి"** అనే శ్రుత్యర్థం పై శ్రుతియందు ఉపసంహరింపబడుతోంది.

మనచే చూడబడుతున్న చేతనాఽచేతనాత్మకమైన జగత్తు అంతా లీనమై అనగా అవ్యక్తంగా ఉండి, ప్రాణుల కర్మప్రేరణచే నామరూపాత్మకమైన జగత్తుగా సృజించడానికి ఆ బ్రహ్మ మనస్సునందు సంకల్పం ప్రారంభమైందని, ఈ సంకల్పం కలిగిన బ్రహ్మ **'శ్వేవస్యస'** నామకుడు అయ్యాడు. **"సత్యం జ్ఞానమనన్తమ్ బ్రహ్మ"** శ్రుతిచే బోధించబడిన బ్రహ్మ నిర్వికారుడు, నిరుపాధికుడు (ఏ వికారాలు, ఏ ఉపాధులు లేనివాడు) అవడంవల్ల అతనికి సంకల్ప వికల్పాలు సంభవించవు. సోపాధికుడైన మాయాశబలిత బ్రహ్మకే సంకల్పాదులు సంభవిస్తాయి కనుక సంకల్ప పరంపరచే ఆ తర్వాత మరింత జగత్తు సృష్టించడం జరుగుతుంది కాబట్టి ఈ బ్రహ్మనే **"తదేవచ్ఛ్వేవస్యసం నామ బ్రహ్మ"** అనే శ్రుతి భాగం ప్రతిపాదిస్తోంది.

ఇంతవరకు వివరింపబడింది సృష్టి క్రమాలలో ఒకటి కాగా, మరో సృష్టి క్రమం ఇలా చెప్పబడుతోంది.

బ్రహ్మవిదాప్నోతి పరం, తదేషాభ్యుక్తా| (ఆ.వ)

అని సూత్రరూపంగా ఉపక్రమించి సూత్ర ఘటకమైన బ్రహ్మ పదార్థాన్ని వివరించడానికి **"సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ"** అనే 'అనువ్యాఖ్యానం' బయలుదేరింది. (వ్యాఖ్యానం యొక్క విశేషాన్ని తెలియచేసేది అనువ్యాఖ్యానం).

తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః| ఆకాశాద్వాయుః| వాయోరగ్నిః| అగ్నేరాపః| అద్భ్యః పృథివీ| పృథివ్యా ఓషధయః| ఓషధీభ్యోఽన్నం| అన్నాత్ పురుషః|

బ్రహ్మలక్షణ ఘటకమైన అనంతమయమైన పదంచే చెప్పబడిన బ్రహ్మయొక్క అనంతత్వాన్ని ప్రతిపాదించడానికై సృష్టిక్రమం వర్ణింపబడింది. **"సత్యం జ్ఞానమనన్తమ్ బ్రహ్మ"** అనే స్వరూప లక్షణంచేత చెప్పబడిన బ్రహ్మపదార్థం, ఆ బ్రహ్మోఽభిన్నమైన (బ్రహ్మకంటే భిన్నం కాని) పరమాత్మనుంచి ఆకాశాది పంచభూతాలు, దానివలన భౌతికమైన ఓషధులు, ఓషధులనుంచి అన్నం, అన్నంవలన పురుషుడు సృజించబడ్డారని చెప్తూ, పురుష శబ్దంచే భౌతికసృష్టి క్రమం చెప్పడం ద్వారా గిరి, నదీ, సముద్రాది సమస్త భౌతికసృష్టి సూచించబడుతోంది. పశువులు మున్నగునవి కూడా అన్నవికారమే అయినా మనుష్యదేహం కర్మజ్ఞానాలకు అధికార యోగ్యత ఉన్నదవడంవల్ల దానియొక్క ప్రాధాన్యాన్ని సూచించడానికి **"అన్నాత్పురుషః"** అని పురుష సృష్టి ముందుగా చెప్పబడింది. ఇక్కడ **"ఆత్మనః ఆకాశస్సంభూతః"** అనడంలో తండ్రినుండి విభక్తమైన పుత్రుడిలా బ్రహ్మనుండి భూతభౌతికాదులు ఉత్పన్నమై విభక్తం కాలేదని, పరమాత్మే ఆకాశాది ఆకారంగా ప్రకాశిస్తున్నాడని అర్థం. ఇది రెండవ సృష్టిక్రమ వివరణ.

బ్రహ్మం నుండి జగత్తు సృష్టించబడింది అనే విషయంలో మూడు వాదాలున్నాయి. ఇందులో రెండు వాదాలు ఇంతవరకూ చెప్పబడినా మరిన్ని సూక్ష్మ భేదాలు అనువాదంగా ఇకముందు చెప్పబడుతున్నాయి.

ఇందులో మృద్ఘట న్యాయంచే, మృత్ (మన్ను) ఘటంగా ఆరభింపబడినట్లు పరమాణువుచే పృథివ్యాది జగత్తు ఆరంభింపబడిందని నైయాయికాదులు అంటారు. క్షీరదధి న్యాయంచే క్షీరమే దధిగా పరిణమించినట్లు సత్వరజస్తమో గుణాత్మకమైన ప్రధానమే మహత్తు, అహంకారం మొదలుగా గల జగత్తుగా పరిణమిస్తోందని అంటారు. వేదాంతాలు రజ్జుసర్ప న్యాయంచే అనగా లోకంలో రజ్జువును (తాడును) చూసి సర్పం (పాము) అనే భ్రాంతితో భయపడినా రజ్జువుకంటే సర్పం భిన్నం అయినా, రజ్జువే సర్పంగా భ్రాంతి కలిగిస్తోంది. అదే తీరుగా సర్వ జగత్తు కల్పనకు అధిష్టాన భూతమైన బ్రహ్మయే మాయావశంచే ఆకాశాది జగదాకారంగా భాసిస్తున్నట్లు వేదాంతుల వాదం. ఈ అభిప్రాయంతోనే సృష్టి ప్రతిపాదించబడింది. దీని ప్రకారం సృష్టి క్రమం ముందుగా ఆకాశం, వాయువు మొదలగు వాటి సృష్టి క్రమంగా వర్ణించబడి, ఈ క్రమం మహాకల్పానికి సంబంధించినదిగా చెప్పబడింది. వేదంలో ప్రకరణ భేదాన్ని అనుసరించి సృష్టిక్రమం వివిధ రీతుల్లో బోధించబడింది.

ఆపోవా ఇదమగ్రే సలిలమాసీత్| (తై.సం .7-114)

మొదలుగా గల శ్రుతియందు బ్రహ్మ వరాహరూపం దాల్చి ఉదకాల్లో మునిగి ఉన్న భూమిని ఉద్ధరించి తిరిగి బ్రహ్మగా అయి ముల్లోకాలను సృజించెనని వర్ణింపబడింది. దీనివల్ల సృష్టి సమయంలో ఉదకాలు సిద్ధంగానే ఉన్నాయని తెలుస్తోంది. ఇది అవాంతర కల్పవిషయమని వ్యవస్థ చెయ్యాలి.

బ్రాహ్మమేకమహః|

"బ్రహ్మదేవునికి ఒక పగలు" అని చెప్పబడిన బ్రహ్మదినావసానమందు (బ్రహ్మకాలమానంలో ఒక పగలు అయ్యేక) లీనమైన పృథివ్యాది లోకత్రయాలకు బ్రహ్మ సంబంధమైన రాత్రియొక్క అవసానమందు లీనమైన జగత్తుయొక్క ఉత్పత్తి ప్రకారాన్ని తెలుసుకునే ఇచ్ఛకలవారై మునులు పరమేశ్వరుని అడుగుతున్నట్లుగా సూతసంహిత 9వ అధ్యాయంలో ఉన్న **"భగవాన్ విష్ణునాతోయాత్| కథం భూమిః సమద్ధృతా తదస్మాకం సమాసేన వదసర్వార్థవిత్తమ"** మొదలైన శ్లోకాల్లో అవాంతర సృష్టిలో ఉదకాలనుండి పృథివి ఉద్ధరించబడినట్లు వర్ణింపబడింది. అలాగే-

అపోవా ఇదమగ్రే సలిలమాసీత్| (అ.చ.ప్ర)

ఆపోవా ఇదమాసన్థ్సస్సలిలమేవ| (ఆ.కే.ప్ర)

మొదలైన ఉపాఖ్యానాలన్నీ ఉదకాలనుండి సృష్టి జరిగినట్లు వర్ణిస్తున్నాయి. ఈ సృష్టి భేదాల్ని మహాకల్ప, అవాంతరకల్ప భేదాన్ననుసరించి పరస్పర విరోధాలు లేకుండా అన్వయించుకోవాలి.

యోఽపామాయతనం వేద| ఆయతనవాన్ భవతి| అగ్నిర్వా అపా మాయతనం ..... ఆపోవా అగ్నేరాయతనమ్ ఆయతనవాన్ భవతి| (తై.ఆ.ఉ)

ఆనందవల్లిలోని సృష్టిక్రమంలో **"అగ్నేరాపః"** అని అగ్నికి జలకారణత్వం చెప్పడం వలన అగ్ని ఉదక మూలమై, అనగా అగ్నివలన ఉదకాలు, అగ్నికి ఆశ్రయత్వం, మహాసృష్టిలో ఉదకాలు అగ్నికార్యమైనా బ్రహ్మాండాది అవాంతర సృష్టిలో **'ఆపోవా ఇదమగ్రే సలిలమాసీత్ ఆపోవా ఇదమాసన్ సలిలమేవ'** మొదలైన వాక్యాలచే ఉదకాలకు సర్వకారణత్వం చెప్పడంవల్ల అవాంతర సృష్టిలో ఉదకాలకు అగ్ని ఆధారం అని చెప్తే విరుద్ధం కాదు. ఈ విధంగా పరస్పర విరోధం లేకుండేలా సాయణాచార్యులచే భాష్యంలో వ్యవస్థ చేయబడిన రీతిగా మనం కూడా వ్యవస్థ చేసుకుందాం.

ఇదే తీరుగా **"వాయుర్వా అపామాయతనం"** ఉదకాలకు వాయువు కారణమని, **"ఆపోవై వాయో రాయతనం"** వాయువులకు ఉదకాలు కారణమని, అలాగే చతుర్థ, పంచమ, షష్ట, సప్తమ, అష్టమ మంత్రాల్లో ఆదిత్యుడు ఉదకాలకు ఆధారం, ఉదకాలు ఆదిత్యునికి ఆధారం, చంద్రుడు ఉదకాలకు ఆధారం-ఉదకాలు చంద్రునికి ఆధారం, నక్షత్రాలు ఉదకాల కాధారం-ఉదకాలు నక్షత్రాలకు ఆధారం, ఉదకాలు పర్జన్యుడి కాధారం-పర్జన్యుడు ఉదకాలకు ఆధారం, సంవత్సరం ఉదకాలకు ఆధారం-ఉదకాలు సంవత్సరానికి ఆధారం అని ఈ విధంగా ఈ అనువాకంలో వర్ణింపబడినదంతా మహాసృష్టి, అవాంతర సృష్టి భేదంతో పరస్పర విరోధం లేనిదని మనం గమనించాలని సాయణాచార్యోక్తి.

కథం బ్రహ్మాసృజద్విద్వాన్ జగత్సర్వం చరాచరం సంగ్రహేణ తదస్మాకం బ్రూహి పుణ్యవతాం వర| (సూ.సం.10)

మొదలైన గ్రంథంచే మొదట తామస సర్గం, రెండు మహత్తుయొక్క సర్గం, మూడు అహంకారంయొక్క సృష్టి, నాలుగు భూతతన్మాత్రలు, ఐదు కర్మేంద్రియ జ్ఞానేంద్రియ సర్గం, ఆరు ఇంద్రియాద్యధిష్టాన దేవతా సర్గం ఈ ఆరూ ప్రాకృత సర్గాలని చెప్పబడ్డాయి.

ఇందులో మళ్ళీ తామస సర్గం **"పంచధా అవస్థిత స్సర్గః ప్రవృత్త స్థాదుసోద్విజాః"** మొదలగు గ్రంథంచే ఐదు విధాలుగా విభజించినట్లు ఉంది. అంటే ఒకటి వృక్షాల సృష్టి, రెండు పశ్వాదుల సృష్టి, మూడు దేవతల సృష్టి, నాలుగు మనుష్యుల సృష్టి, అయిదు భూతప్రేత పిశాచాదుల సృష్టిగా విభజించబడినట్లు వర్ణింప బడింది. ఈ విధంగా కల్పభేదాల ననుసరించి బహుప్రకారంగా జగత్తు సృజించబడినట్లు కనబడుతోంది.

మహాసృష్టి, అవాంతర సృష్టి భేదాలు ఇలా చెప్పబడ్డాయి. బ్రహ్మగారి శతాయుష్పరిమిత కాలంలో వారి అహస్సులో (పగలులో) దేవమానంలో 14గురు మనువులు గతిస్తారు. అందులో ఒక్కో మనువుకు దేవమానంచే 71 చతుర్యుగాలని చెప్పబడింది. దాని ప్రకారం బ్రహ్మగారి అహస్సు అంతంలో అవాంతర ప్రళయం సంభవించి ఉదకాలు మాత్రం మిగిలి ఉన్నాయి. బ్రహ్మగారియొక్క మరోరోజు ప్రారంభకాలంలో ఆ ఉదకాల నుండి అవాంతర సృష్టి ఆరంభం అవుతుంది. మహాప్రళయంలో అనగా బ్రహ్మగారి నూరు సంత్సరాల అంతంలో నాసదాసీయ సూక్తస్థమైన-

అంభః కిమాసీత్ గహనం గభీరం|

మొదలైన శ్రుతులు చెప్పినట్లుగా ఉదకాలుగాని, సూర్యాదులుగాని ఎవరూ మిగిలి ఉండరని చెప్పబడింది. మహాసృష్టి ఆరంభంలో

తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః|

మొదలైన శ్రుతులు చెప్పినట్లు పరమాత్మనుండి ఆకాశాది క్రమంగా ఆరంభించబడుతుంది. ఈ విధంగా మహాకల్ప అవాంతర కల్పభేదం వర్ణించబడుతుంది.

ప్రకారాంతర సృష్టి

ప్రజాపతిరకామయత ప్రజాయేయేతి సముఖతః (తై.సం.7)

అనే ఉపాఖ్యానం చాతుర్వర్ణ్య విభాగ ప్రసంగంలో తెలుసుకున్నాం. అయినా ఇక్కడ బ్రాహ్మణాది క్రమంగా సృష్టి జరిగినట్లు జ్ఞాపకం చేయడానికి మళ్ళీ ఈ ఉపాఖ్యానం ఆదిని స్పృశించడం జరిగింది. ఈ సృష్టి క్రమమే సర్వప్రాణి సమష్టి రూపమైన బ్రహ్మాండం దేహంగా కల్గిన విరాట్పురుషుని ప్రతిపాదించే **"సహస్రశీర్షా పురుషః"** మొదలుగా గల పురుషసూక్తంలో కూడా వర్ణించబడిందని తెలపడానికి పురుషసూక్తం యొక్క అర్థం ప్రతిపాదింపబడుతోంది.

పురుషసూక్తం

సహస్రశీర్ షా పురుషః| సహస్రాక్షస్సహస్రపాత్| సభూమిం విశ్వతో వృత్వా| అత్యతిష్ఠద్దశాంగులం|

సర్వ ప్రాణులయొక్క సంఘాతమనబడే బ్రహ్మాండం దేహంగా గల 'విరాట్' శబ్దంచే కొనియాడబడుతున్న విరాట్పురుషుడు బ్రహ్మాండంలో అంతఃపాతులుగా ఉన్న శబ్దం సూచించబడుతోంది కనుక అనంతమైన ప్రాణుల శిరస్సులతో కూడిన అక్షిగ్రహణం (అక్షి శబ్దాన్ని ముందుగా చెప్పడం) జ్ఞానేంద్రియాలకు ఉపలక్షణ మైనందువల్ల అనంతమైన ప్రాణుల జ్ఞానేంద్రియాలలో గూడినవాడిగా (సహస్రాక్షః), పాదగ్రహణం కర్మేంద్రియాలకు ఉపలక్షణ మైనందున అనంతమైన ప్రాణులయొక్క కర్మేంద్రియాలతో కూడినవాడు (సహస్రపాత్)గా చెప్పబడుతున్నాడు. ఇటువంటి అవ్యక్త మహదాదులకంటే విలక్షణుడైన, చేతనుడైనవాడుగా వర్ణిస్తోంది. **"పురుషాన్న పరం కించిత్"** మొదలైన శ్రుతుల్లో పరమాత్మకంటే భిన్నమైనది మరొకటి లేదని ప్రసిద్ధి చెందిన పురుషుడుగా పేర్కొంది.

సభూమిం విశ్వతోవృత్వా| అత్యతిష్ఠద్దశాంగులం|

ఆ పురుషుడు బ్రహ్మాండమనే గోళకరూపమైన భూమిని అంతా చుట్టుకొని (అనగా ఊర్ధ్వంగా, అడ్డంగా, క్రిందకి వ్యాపించి) దశాంగుళ శబ్దంచే పేర్కొనబడుతూ అతిక్రమించి ఉండెను. అంటే పరిమితిని

చెప్పడానికి శక్యంగాని బ్రహ్మాండాన్ని అధికంగా అన్ని లోకాలను, బ్రహ్మాండం వెలుపలకు కూడా వ్యాపించి వుండెనని అర్థం.

పురుష ఏవేదదగ్ం సర్వం| యద్భూతం యచ్చభవ్యం ఉతామృతత్వస్యేశానః| యదన్నేనాతిరోహతి|

ఈ కల్పంలో ఉన్న ప్రాణి దేహాలన్నీ విరాట్పురుషునికి అవయవాలు కనుక, అతీతమైన రాబోయే కల్పాల్లో కూడా విరాట్పురుషునికి అవయవాలుగానే గ్రహించాలని చెప్పడంచే భూతభవిష్యద్వర్తమాన రూపమైన జగత్తంతా ఆ విరాట్పురుష స్వరూపమే అనాలి.

అమృతత్వానికి అధిపతి అయిన పరమాత్మ ప్రాణులచే వారి వారి కర్మఫలాన్ని అనుభవింప చేయడానికి వాస్తవమైన అద్వితీయమైన ఆత్మస్వరూపాన్ని కప్పిపుచ్చి జగద్రూపరమైన అవస్థను పొందెను.

ఏతావానస్య మహిమా| అతోజ్యాయాగ్ శ్చ పూరుషః| పాదోఽస్య విశ్వా భూతాని| త్రిపాదస్యామృతం దివి

భూతభవిష్యద్వర్తమాన రూపమైన జగత్తంతా పురుషశబ్ద వాచ్యుడైన పరమాత్మ యొక్క మహిమ మాత్రమే గాని ఆ పురుషునికి అది వాస్తవమైన స్వరూపం కాదు. వాస్తవమైన పురుషుడు మహిమకంటే అత్యధికుడు. ఈ విషయం ఈ క్రింది శ్రుతిచే ప్రతిపాదింపబడుతోంది. జగదవస్థా స్వరూపమైన మహిమకంటే అత్యధికుడైన పురుషునికి మూడు కాలాల్లోనూ గల ప్రాణిజాలమంతా నాల్గవ అంశమని, మిగిలిన మూడుఅంశల స్వరూపం నాశన రహితమై ఆ పురుషుని స్వప్రకాశయందే ఇమిడి ఉంది. వాస్తవంలో **"సత్యం జ్ఞానం"** అనే శ్రుతిచే అపరిచ్ఛిన్నుడుగా చెప్పబడుతున్న పరమాత్మకు జగత్తు చతుర్థాంశమని మిగిలిన మూడుఅంశలు స్వప్రకాశమందే ఇమిడి ఉన్నాయనే మాట పొసగదు గాన, పరమాత్మను నాలుగు అంశాలుగా విభజించడం తాత్పర్యం కాదు. బ్రహ్మాత్మ స్వరూప దృష్టిలో ఈ కనబడే జగత్తు చాలా అల్పమైనదై ఆయన మహిమ మాత్రం చేత జగద్రూపంగా భాసిస్తూ ఉండేది. ఇది వాస్తవ రూపం కాదు. వాస్తవం అపరిచ్ఛిన్నుడని చెప్పడమే **"త్రిపాదస్యామృతం దివి"** అను వాక్య తాత్పర్యం.

త్రిపాదూర్ధ్వ ఉదైత్పురుషః| పాదోస్యేఽహాభవాత్పునః తతోవిష్వఙ్గ్ వ్యక్రామత్| సాశనాశనే అభి|

పూర్వ మంత్రార్థంలో చెప్పబడిన విషయమే దారుఢ్యం కోసం మళ్ళీ చెప్పబడుతోంది. వెనుక మంత్రంలో చెప్పబడిన త్రిపాత్పురుషుడు సంసార స్పర్శ లేనివాడై అజ్ఞానకార్యమైన సంసారంతో సంబంధం లేనివాడై ఉన్నతుడుగా ఉండెను. అనగా నిర్వికారుడుగా ఉండెను. అటువంటి పురుషుని పాదరూపం, లేశ రూపం మాయతో కూడినదై జగత్తు సృష్టి, సంహారాలను చెప్తోంది. పరమాత్మ పాదరూపంగా మాయలో ప్రవేశించి దేవతిర్యగాది రూపంగా వ్యాపించెను. చేతనాఽచేతనాత్మకమైన అనగా చేతనమైన ప్రాణిజాతం గాను, అచేతనమైన గిరి, నదీ సముద్రాది రూపంగాను తానే అయి సర్వత్ర వ్యాపించి ఉండెను. అంటే, స్వయం ప్రకాశ త్రిపాత్స్వరూపంగాను, చేతనాఽచేతనాత్మకమైన జగద్రూపం లేశరూపం గాను పరమాత్మ వ్యాపించి ఉండెనని తాత్పర్యం.

తస్మాద్విరాడజాయత| విరాజోఅధిపూరుషః| సజాతో అత్యరిచ్యత| పశ్చాద్భూమి మథో పురః|

చేతనాఽచేతనాత్మకమైన ఆ పరమాత్మనుంచి బ్రహ్మాండమనే దేహం ఉత్పన్నం అయ్యింది. అనగా ఆదిపురుషుని నుండి ఆవిర్భవించెను. చేతనమైన దేవతిర్యగాదులు, అచేతనమైన గిరినదీ సముద్రాలు ఈ బ్రహ్మాండమనే దేహంలో ప్రకాశిస్తూ ఉండడంవల్ల బ్రహ్మాండం విరాట్ శబ్దంతో చెప్పబడుతోంది. ఇట్టి విరాట్ దేహానికి, అ దేహాభిమానిగా ఒకానొక పురుషుడు అనగా ఆదిపురుషుడు సర్వవేదాంత వేద్యుడు అయిన ఆ పరమాత్మ ఆ విధంగా వ్యవహరింపబడడమే **'అజాయత'** అనే పదానికి అర్థం. దీని సారాంశం- బ్రహ్మాండమనే దేహాన్ని సృష్టించి అందులో జీవుడనే పేరుతో ప్రవేశించెను అని, ఆ విరాట్పురుషుడు అతిరిక్తుడుగా దేవ

తిర్యగాది స్వరూపుడుగా అయ్యెను అని ఇంతవరకు విరాట్పురుషుని వర్ణన చేయబడింది. ఇటుపై సృష్టిక్రమం వర్ణించబడుతోంది.

దేవాది జీవ రూపమైన పిమ్మట భూమిని సృజించెను. భూమిసృష్టి అయ్యేక ఆ జీవులకు త్వక్, అసృక్ ఇత్యాది సప్త ధాతువులతో శరీరాలను సృజించెను.

యత్పురుషేణ హవిషా| దేవా యజ్ఞమతన్వత| వసంతో అస్యాసీదాజ్యం| గ్రీష్మ ఇధ్మశ్శరద్ధవిః|

పూర్వ మంత్రాలతో దేవాది శరీరాలను, భూమిని సృజించెనని చెప్పెను. పిమ్మట దేవతలు ఉత్తరసృష్టి స్థితులకు యజ్ఞం కారణం కనుక ఆ యజ్ఞాన్ని నిర్వహించడానికి బాహ్య ద్రవ్యాలు లేని కారణంచే యజ్ఞానికి హవిస్సు సంభవించదు కనుక ఇంతకుముందు చెప్పబడిన పురుషుడినే హవిస్సుగా భావన చేసి మానస యజ్ఞాన్ని నిర్వహించారు. అప్పుడు ఈ మానస యజ్ఞానికి వసంత రుతువును ఆజ్యంగాను, గ్రీష్మ రుతువును ఇధ్మసమిధలుగాను, శరదృతువును హవిస్సుగాను భావన చేసారు.

సప్తాస్యాసన్ పరిధయః| త్రిస్సప్త సమిధః కృతాః| దేవా యజ్ఞం తన్వానాః| అబధ్నన్ పురుషం పశుమ్|

ఈ శ్రుతిచే కూడా మానసయజ్ఞ సామగ్రే ప్రతిపాదించబడుతోంది. యజ్ఞంలో ఆవహనీయానికి మూడు పరిధులు, ఉత్తరవేదికి మూడు పరిధులు, ఆదిత్యుడు సప్తమ పరిధి ప్రతినిధిగా ఉంటారని చెప్తోంది. పరిధులనగా, **"పరితః పరిధీయన్తే స్థాప్యన్తే"** అని అగ్నులకు వెలుపల ఉంచబడే పలాస సమిధలు అని వివరించారు.

ఈ ప్రకారం ఆదిత్యునితో కలిపి మొత్తం ఏడు పరిధులు. ఈ మానస యజ్ఞంలో గాయత్ర్యాది సప్త ఛందస్సులను ఏడు పరిధులుగాను, **"ద్వాదశమాసాః పంచర్తవ స్త్రయఇ్చమే లోకా అసావాదిత్య ఏకవిగ్ం శః"** శ్రుతిచే ప్రతిపాదింపబడిన 12మాసాలు, 5ఋతువులు, 3లోకాలు, ఆదిత్యుడు మొత్తం 21 అని, యజ్ఞంలో 21 సమిధలు గల ఇధ్మముగాను (21 లేదా 23 సంఖ్య గల సమిధల సముదాయం ఇధ్మం) భావన చేసారు. విరాట్ దేహాభిమాని అయిన పురుషుని పశురూపంగా భావన చేసినట్లు ప్రతిపాదింప బడుతోంది.

తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్| పురుషం జాతమగ్రతః తేనదేవా అయజంత| సాధ్యాఋషయశ్చయే|

సాధ్యదేవతలు, మంత్రద్రష్టలైన ఋషులు సృష్టికిముందు శ్రుత్యుక్త ప్రకారం విరాడ్దేహాభిమానిగా ఉత్పన్నమైన ఆ పురుషుని పశుభావనతో యూపమందు (పశువును కట్టే కర్ర స్తంభానికి) బంధించబడినట్లు భావించి మానసికంగా ప్రోక్షణ చేసారు. పిమ్మట ఆ పురుషరూపమైన పశువుతో మానస యజ్ఞాన్ని నిర్వహించారు.

తస్మాద్యజ్ఞాత్సర్వహుతః| సంభృతం పృషదాజ్యం| పశూగ్ శ్చక్రే వాయవ్యాన్| ఆరణ్యాన్ గ్రామ్యాశ్చ యే|

అదే తీరుగా వాయు దేవతాక ఆరణ్య పశువులను అనగా హరిణ (లేడి) మొదలైన వాటిని, గ్రామ్య పశువులను, గవాదులను సృష్టించెను.

తస్మాద్య జ్ఞాత్సర్వహుతః| ఋచస్సామాని జజ్ఞిరే| ఛందాగ్ం జజ్ఞిరే తస్మాత్| యజుస్తస్మాదజాయత|

మానసమైన ఆ యజ్ఞం వల్ల ఋగ్వేద, సామవేద, యజుర్వేదాలు, గాయత్ర్యాది ఛందస్సులు అనగా శ్రుతి స్మృతి పురాణ ఇతిహాస శిక్షా కల్పము ఛందస్సు మొదలైన వాఙ్మయమంతా ఉత్పన్నమైంది.

తస్మాదశ్వా అజాయంత| యే కేచో భయాదతః| గావోహ జజ్ఞిరే తస్మాత్| తస్మాజ్జాతా అజావయః

ప్రాకృతమైన ఆ యజ్ఞంవల్ల అశ్వాలు, గర్ధభాలు, అశ్వతరాలు (కంచర గాడిదలు), గోవులు, మేకలు, గొర్రెలు మొదలైనవి ఉత్పన్నమయ్యాయి.

యత్పురుషం వ్యదధుః| కతిధా వ్యకల్పయన్| ముఖం కిమస్య కౌ బాహూ| కా| వూరూపాదా వుచ్యేతే|

ఈ మంత్రంలో బ్రాహ్మణాది సృష్టిని గురించి చెప్పడానికి ముందుగా బ్రహ్మవాదుల ప్రశ్నలు చెప్పబడు తున్నాయి. బ్రహ్మాండమనే దేహం గల విరాట్పురుషుని సంకల్పరూపంలో భావన చేసినపుడు దేవతలు ఆ పురుషుని ఏ విధమైన అవయవాలతో కూడిన వానిగా భావించిరి? అని సామాన్య ప్రశ్న రావచ్చును. తర్వాత విశేషాకారమైన ప్రశ్నలు వస్తాయి.

"ముఖం కిమస్య" మొదలైన శ్రుతిచే ఆ పురుషునికి ముఖం ఏది? బాహువులు ఏవి? ఊరువులు ఏవి? అని ప్రశ్న వేసుకుని తర్వాత మంత్రంలో సమాధానం చెప్పబడుతోంది.

బ్రాహ్మణోస్యముఖమాసీత్| బాహూరాజన్యః కృతః| ఊరూ తదస్య యద్వైశ్యః| పద్భ్యాగ్ం శూద్రో అజాయత|

మనచే భావన చేయబడే విరాట్పురుషుడనే ప్రజాపతికి ముఖం నుండి బ్రాహ్మణుడు, బాహువుల నుండి క్షత్రియుడు, ఊరువులనుండి వైశ్యుడు, పాదాలనుండి శూద్రుడు జన్మించారని వివరించారు. ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. ప్రజాపతికి ముఖస్థానం ఎవరనే ప్రశ్నకు బ్రాహ్మణాదులు ఆ యా స్థానీయులు అని చెప్పాలి గాని, ఆ స్థానాలనుంచి ఉత్పన్నులయ్యారని చెప్పడం ఎంతవరకు సముచితమని, బ్రాహ్మణజాతికి చెందినవాడు అని అనిపించే విశేషణాలతో బ్రాహ్మణాది పదాలకు అర్థం చెప్పడం ఎంతవరకు సమర్థనీయంగా ఉందని శంకిస్తారని దానికి సమాధానం చెప్పబడుతోంది.

"తస్మాద్యజ్ఞా త్సర్వహుతః" అనే శ్రుతి లగాయతు సృష్టిక్రమాన్ని చెప్పడంలో ఋగాది వేదాలు, గవాశ్వాదులు మొదలైనవి ఉత్పన్నమైనట్లుగా చెప్పిన సందర్భంలో వచ్చింది ఈ శ్రుతి. అంతే కాదు **"ప్రజాపతిరకామయత ప్రజాయేయేతి ...అగ్నిర్దేవతాన్యసృజ్యత"** (తై.సం.7-1ప్రశ్న) అనే శ్రుతిలో **'అసృజత'** అని ఉండడం వల్ల సృజించబడెనని అర్థం. **"చాతుర్వర్ణ్యం మయాసృష్టం"** అనే గీతావచనంలో **'సృష్టం'** అని ఉన్నందువల్ల సృజించబడెను అనే అర్థం యుక్తంగానే ఉన్నదనడమే గాక, లోకంలో ఒక మాతృ గర్భానికి జన్మించినవారు సోదరులుగా జ్యేష్ఠ, కనిష్ఠ విభాగంగానే వీరిని కూడా భావించాలి గాని మరో అపార్థం చేసుకోకూడదు.

చంద్రమా మనసోజాతః| చక్షోస్సూర్యో అజాయత| ముఖాదింద్రశ్చాగ్నిశ్చ ప్రాణాద్వాయురజాయత| నాభ్యా ఆసీదంతరిక్షం| శీర్ష్ణోద్యౌస్సమవర్తత| పద్భ్యాం భూమిర్దిశ శ్శ్రోత్రాత్| తథాలోకాగ్ం అకల్పయన్|

దధి, ఆజ్యం మున్నగు ద్రవ్యాలు, గవాది పశువులు, ఋగాది వేదాలు, బ్రాహ్మణాది మనుష్యులు ఆ పురుషుని వల్ల ఉత్పన్నమైనట్లే ఆ ప్రజాపతియొక్క మనస్సు వల్ల చంద్రుడు, చక్షుస్సు వల్ల సూర్యుడు, ముఖం వలన ఇంద్రుడు, అగ్ని అను దేవతలు, ప్రాణం వలన వాయువు, నాభి వలన అంతరిక్షం, శిరస్సు వలన ద్యులోకం, పాదాల వలన భూమి, శ్రోత్రాల వలన దిక్కులు ఈ ప్రకారం ఇతర లోకాలు ఉత్పన్నమయ్యాయని చెప్పబడ్డాయి. సృష్టిక్రమం ఇంతటితో ముగిసింది కాని, తరువాతి శ్రుతి విరాట్ పురుషుని ధ్యానప్రకారాన్ని ప్రతిపాదిస్తోంది.

వేదాహమేతం పురుషం మహాన్తం| ఆదిత్యవర్ణం తమసస్తు పారే| సర్వాణి రూపాణి విచిత్యధీరః నామాని కృత్వాభివదన్ యదాస్తే|

సర్వరూపాలుగా అనగా దేవ, మనుష్య శరీరాలను పుట్టించి వారికి దేవ, మనుష్య పశురూప నామాలను కూడా ఉంచి ఆ నామాలతో వ్యవహరిస్తున్న పురుషుణ్ణి సర్వగుణాలచే అధికునిగా, ఆదిత్యుని వలె ప్రకాశించుచున్నవానిగా నేను తెలుసుకుంటున్నాను.

ధాతాపురస్తాద్యముదా జహార| శక్రః ప్రవిద్వాన్ ప్రదిశశ్చతస్రః| తమేవం విద్వానమృత ఇహ భవతి నాన్యః పంథా అయనాయ విద్యతే|

మూలపురుషుడైన ప్రజాపతి ధ్యానం చేసే వారి ఉపకారం కోసం విరాట్పురుషుని ఆవిర్భవింప చేసెను. ఇంద్రుడు నాలుగు దిక్కులందు గల సర్వ ప్రాణులను తెలియజేసెను. వీరిద్దరి యొక్క ఉపదేశంచే ఈ చెప్పిన విధంగా ఆ విరాట్పురుషుని సాక్షాత్కరించుకున్నవాడు ఈ జన్మలోనే మరణరహితుడు కాగలడు. అమృతత్వ ప్రాప్తికి విరాట్పురుష ద్వారా సాక్షాత్కారం చేసుకోవడంకన్న వేరే మార్గం లేదని సహస్ర మాతాపిత్రు సదృశమైన వేదమాత మనకు ఉపదేశిస్తోంది. పురుష సూక్తం యొక్క అర్థాన్ని ఏకవాక్యంగా అవగాహన చేసుకోవడానికి దీని మొత్తం సారాంశం వ్రాయబడుతోంది.

"ఆదిపురుషునినుండి విరాట్పురుషుడు ఆవిర్భవించెను. ఆ పురుషుడే బ్రహ్మాండాత్మక దేహాన్ని ఆధారంగా చేసుకుని ఈ దేహాభిమానిగా వేదాంతవేద్యుడైన పరమాత్మ స్వకీయమైనమాయలో బ్రహ్మాండంలో ఉండే - దేవ, తిర్యక్, మనుష్యాది ఉపాధుల్లో జీవుడుగా ప్రవేశించెను. ఈ విరాట్పురుషుడే భూమిని సృజించెను. భూసృష్టి అయ్యాక ఇంతకు ముందు సృజించబడ్డ దేవతలు యజ్ఞ నిర్వహణానికి బాహ్యమైన ద్రవ్యాలు ఏమీ లేనందున పురుష స్వరూపాన్నే హవిస్సుగా మనస్సుచే భావన చేసి మానస యజ్ఞాన్ని నిర్వహించారు.

ఈ మానస యజ్ఞానికి వసంతాది రుతువులనే ఆజ్య పురోడాశాది (నెయ్యి, పురోడాశం) రూపంగా భావన చేశారు. మానస యజ్ఞం వల్ల గ్రామ్య పశువులు, ఆరణ్య పశువులు ఉత్పన్నమయ్యాయి. ఈ యజ్ఞంనుంచే గాయత్ర్యాది ఛందస్సులు, రుగ్యజుస్సామాది వేదాలు ఉత్పన్నమయ్యాయి. తర్వాత ఆశ్వాలు, అశ్వతరాలు (కంచర గాడిదలు), గర్దభాలు మొదలగునవి ఉత్పన్నమయ్యాయి. ఆ పిమ్మట ముఖాద్యవయవాలనుండి బ్రాహ్మణాది వర్ణాలు, మనశ్చక్షురాదులనుండి చంద్రుడు, సూర్యుడు జనించెను. పిమ్మట ముల్లోకాలు. ఈ విధంగా జగత్సృష్టి యొక్క వైలక్షణ్య ప్రకారభేదాలు వేదాల్లోనూ అనేక ప్రకరణాల్లోను, భారత, భాగవత, విష్ణుపురాణాల్లోనూ వివిధ రీతుల్లో సృష్టిక్రమం వర్ణింపబడింది. సృష్టిక్రమంలోని పరస్పర విరోధం కల్పభేదాలచే పరిహరించుకోవాలి.

ఉదాహరణలతో ఇంత విస్తారంగా సృష్టిక్రమ వైవిధ్యాన్ని వర్ణించడంలో తాత్పర్యం ఏమంటే, వానరాలు ముందుగా జనించి అవి నరరూపాలుగా మారాయని, ఇలాగే జంతువులనుండి ప్రజాసృష్టి జరిగినట్లు గానూ డార్విన్ మొదలగు ఆధునికులు, తదనుయాయులు చెప్తున్న రీతిగా వైదిక వాఙ్మయంలో ఎక్కడా లేదని తెలియచేయడమే.

సృష్టి నిరూపణలో పరస్పర విరోధాలు - పరిహారం

వైదిక వాఙ్మయంలో కూడా పరస్పర విరోధాలున్నట్లు కనబడడం మనం చూస్తున్నాం. కానీ మహాసృష్టి, అవాంతర సృష్టి భేదంతో వ్యవస్థ చేయబడినందువల్ల అటువంటి భేదాలు అసమంజసమని శంకించ కూడదు.

మీమాంసా శాస్త్ర సిద్ధాంత ప్రకారం సృష్టిని బోధించే పై ఉపాఖ్యానాలన్నీ విధివాక్య శేషాలై అర్థవాదలుగా (విధేయాన్ని ప్రశంసించే వాక్యాలుగా) చెప్పబడుతున్నాయి. ఈ అర్థవాదలకు విధిని

ప్రశంసించడంలోనే తాత్పర్యం గానీ, ప్రమాణాంతర విరోధం లేనప్పుడు స్వార్థమందు (ప్రత్యక్షంగా కనపడే అర్థమందు) కూడా తాత్పర్యం చెప్పవచ్చు.

ఉపాఖ్యానానాం సత్యతాఽసత్యతాన్వేషణమతంత్రం ముఖ్యార్థాఽభావేపి న దోషః (తంత్రవార్తికం)

వాక్యాలచే కొన్ని స్వార్థమందు వివక్ష లేనివిగాను, కొన్ని అర్థవాదాలకు ప్రమాణాంతర విరోధం లేనప్పుడు ప్రధానమైన స్తుతిత్వాన్ని విడనాడకుండా స్వార్థమందు వివక్షను అంగీకరించ వచ్చునని, **"ఏతస్మింస్తు ప్రక్రమే స్తుతిత్వాత్యాగేనైవ స్వార్థ సత్యతాం వర్ణయామః"** అని తంత్రవార్తికంలో నిర్ణయించ బడింది. సూతసంహిత శివమాహాత్మ్యఖండ 10వ అధ్యాయంలో ఇలా చెప్తోంది.

ఏషామవాంతరో భేదః మయా వక్తుం న శక్యతే అల్పత్వాదుపయోగస్య ద్విజాః నాద్యవదామ్యహం|(శి.మా.ఖం)

సృష్టివర్ణన ప్రసంగాల్లో ఉన్న అవాంతర భేదాలు ఉపయోగం లేనివవడం వల్ల వివక్ష చేయదగినవి కాదని చెప్తోంది. ఇంతెందుకు, ఈ ప్రపంచంలో ఉన్న వైలక్షణ్యానికి **'స్వధా'** శబ్దంచే చెప్పబడే పారమేశ్వరీ శక్తి అధమ కారణమని, ఈ శక్తికి ఆధారభూతుడై **"ప్రయతి"** శబ్దంచే చెప్పబడే పరమేశ్వరుడు ఉత్తమ కారణమని **"తిరశ్చీనో వితతోరశ్మిరేషాం"** అనే మంత్రభాష్య ప్రసంగంలో **"తావేతౌ శక్తి పరమాత్మానౌ జగత్కారణ భూతౌ ప్రకృతి పురుషావితి శాస్త్రేషు వ్యపదిశ్యేతే"** అన్నారు.

అంటే సృష్టి ఉత్పత్తికి కానీ, సృష్టి వైచిత్ర్యానికి కానీ ఆ యా ప్రాణుల పరిపక్వమైన కర్మచే ప్రేరేపింపబడిన, మాయోపాధికుడైన పరమేశ్వరుడే కారణమని చెప్పక తీరదు. భిన్నభిన్నమైన సృష్టి క్రమాలను బోధించే వేదభాగాలు అర్థవాదాలు కనుక సహజంగానే విధుల్ని ప్రశంసించడమందే మహాతాత్పర్యం గలవి గాను, అవాంతర తాత్పర్య విధంగా ప్రమాణాంతర విరోధం లేకపోతే సృష్టిక్రమాన్ని బోధించుటకు ప్రవృత్తమైనవి అని గ్రహించాలి. ఈ మీమాంసా శాస్త్ర సిద్ధాంతాన్ని మరువరాదు.

ఇంతకుముందు చెప్పినట్లుగా అవిరోధ స్థలాల్లో (విరోధం లేని సందర్భాల్లో) స్వార్థాన్ని వివక్ష చేసినా సృష్టిక్రమ వైపరీత్యం మహాకల్ప, అవాంతరకల్ప భేదాలచే వ్యవస్థ చేయడం కుదురుతుంది కనుక శంకింపదగిన విరోధం లేనట్లే, ఆ యా శాస్త్ర సిద్ధాంతాలతో విరోధమున్నట్లు భాసించినా ప్రయోజనం శూన్యమవడం వల్ల అవిరుద్ధంగా పరస్పరం సమన్వయ పరచుకోవడం శాస్త్ర సంప్రదాయం.

ఉదాహరణకు నైయాయికులు (న్యాయ, తర్కశాస్త్రజ్ఞులు) చెప్పిన ఆరంభవాదం, సాంఖ్యులు చెప్పిన పరిణామవాదం కూడా మాకు విరుద్ధం కాదని వేదాంతులు సమర్థించారు. దేహంకంటే అతిరిక్తమైన ఆత్మపదార్థం లేదని, దేహమే ఆత్మ అని, ఈ శరీరంతో అనుష్ఠించిన జ్యోతిష్టోమాది కర్మల ఫలాలను అనుభవించడానికి స్వర్గాది లోకాలు, నిషిద్ధ కర్మలను అనుష్ఠించి పాపకర్మల ఫలములను అనుభవించడానికి నరకాదులు లేవని, ఈ శరీరం నాశనమయ్యాక ఫలాలను అనుభవింపచేసే మరో శరీరం లేదని, ఇటువంటి అనేక భ్రమలచే వైదిక కర్మలను అనుష్ఠించక ఈశ్వరుని తెలుసుకోలేకపోవడం చేత బ్రహ్మలోక హేతువైన ఉపాసనయందు ప్రవర్తించనివారు కొందరుంటారు. అలాంటి వారిని గురించి జీవేశ్వరులయొక్క వివేకం కొరకు మూలకారణమైన పరమాత్మనుండి ఆకాశాదులు, పరమాణువులు ఉత్పన్నమైనట్లు, వాటినుండి తదుపరి (ఉత్తర) సృష్ట్యారంభం ఉందని చెప్పడం ద్వారా దేహవ్యతిరిక్తమైన (ఈ దేహం నుంచి వేరుపడిన, వేరుగా కలిగిన) స్వర్గప్రాప్తికి యోగ్యమైన కర్తృరూపమైన ఆత్మ ఉందని మధ్యమ అధికారులు అంగీకరించడానికి నైయాయికులు ఉపయోగపడ్డారు.

ఇక కర్తృత్వరహితమైన సాక్షీభూతమైన చిదాత్మను బోధించడానికి మధ్యమాధికారులకి బ్రహ్మబోధ యోగ్యతను కలిగింపచేయడానికై ప్రకృతి, పురుషులను కల్పించడం ద్వారా సాంఖ్యులు ఉపయోగ పడ్డారు. ఇంకా, ఉపాస్యమైన (ఎవరినైతే ఉపాసించాలో అటువంటి) ఈశ్వరుని తెలుసుకోడానికి మహదహంకారాది పంచవింశతి తత్వాలు మొదలగువాటిని నిరూపించి ఉపయోగపడ్డారని అర్థం.

వేదాంతులు బ్రహ్మయొక్క సత్ అనే తత్వాన్ని నిరూపించడానికై **"తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశ సంభూతః అసద్వా ఇదమగ్ర ఆసీత్, తతో వై సదజాయత"** మొదలైన శ్రుతి సముదాయం ఆకాశాది సృష్టిని ద్వారభూతంగా వర్ణించిందంటారు. గౌడపాదాచార్యులు ఈ వాదాన్ని సమర్థించారని **"ద్వారత్వే నోపయోగః గౌడాచార్యై రుదాహృతః"** అని తై. ఉపనిషత్ భాష్యంలో పేర్కొన్నారు.

"మృల్లోహ విస్ఫులింగాద్యైః సృష్టిర్యాచోదితాన్యథా| ఉపాయః సోవతారాయ నాస్తి భేదః కథం చ న"
"యథా యథా భవేత్పుంసాం వ్యుత్పత్తిః ప్రత్యగాత్మని| సా సైవ ప్రక్రియేహస్యాత్ సాధ్వీశా సా చానవస్థితా|"

మృత్(మన్ను), లోహం, మొదలగువాటిచే ఉపపాదన చేయబడిన సృష్టి వైచిత్ర్యం పరమార్థతత్వాన్ని తెలుసుకోవడానికి ఉపాయం మాత్రమే గాని, సృష్టిభేదం వివక్ష చేయతగినది కాదన్నారు. కారణమేమంటే, సృష్టిని ఉపాసించమని గాని, సృష్టివేత్త శ్రేయస్సును పొందునని గాని వచనం లేనందున సృష్ట్యాదుల్లో పరస్పర విరోధంగా వర్ణించబడిన సృష్టి ప్రక్రియ లోకంలో పురుషులకు ప్రత్యగాత్మయందు యే యే విధంగా వ్యుత్పత్తి కలుగునో తదనుకూలంగా చూపబడింది. దాన్ని లోకంలో అనేకమందిచే అనేక విధాలుగా చూడబడిన స్వప్నాల్లో ఒకటి అంగీకరించదగింది మరొకటి అంగీకరించకూడనిది అనే నియమం లేనట్లు 'అనుదృష్టాంతం'తో సమయ భేదాన్ననుసరించి సృష్టిభేదం ఉండవచ్చని సమర్థించారు. ఈ దృష్టాంతంవల్ల స్వప్నం ఏ విధంగా వాస్తవం కాదో సృష్టి కూడా ఆ విధంగానే వాస్తవం కాదని వేదాంతుల నిశ్చయం.

నహి సృష్టి వాక్యానాం సృష్టౌ తాత్పర్యం| కింతు అద్వితీయే బ్రహ్మణ్యేవ| (శాం.భా)

మీమాంసా శాస్త్ర సిద్ధాంతం ప్రకారం కూడా ప్రమాణాంతర విరోధం లేనప్పుడు అర్థవాదలకు స్వార్థమందు వివక్ష చేయవచ్చని చెప్పడంచేత వేదం ప్రమాణాల్లో మూర్ధన్యమైనందున (ఉత్తమ శిఖరాగ్ర ప్రమాణం కనుక) ఆధునిక విజ్ఞాన సిద్ధాంతం తరచుగా మారుతూ ఉండడంవల్ల ఆధునిక విజ్ఞాన దృష్టితో నిర్ణయింపబడిన జగత్సృష్టి వేదసంస్కృతిలో చెప్పబడిన సృష్టిక్రమానికి భిన్నంగా ఉన్నా బాధకం కానేరదు. ఆధునికుల్లో కొంతమంది సృష్టిక్రమంలో భేదం చెప్పినా, సృష్టికి మూలకారణం ఉందని అంగీకరించేవారు కూడా ఉన్నారు, కనుక మనకు వారు విరోధులు కారు. విత్తు పెడితే మొక్క రావడం, సున్నంలో పసుపు కలిపితే పారాణి రావడం వంటివి జరిగినట్లు ఆ సృష్టి కూడా అలా స్వభావ సిద్ధంగానే జరిగిందనే స్వభావవాదం మాత్రం సుతరాము అంగీకరించదగినది కాదని చెప్పబడుతోంది.

న స్వభావాజ్జగజన్మ స్థితిధ్వం సా మునీశ్వరాః | న మయా కేవలేనాపి న చ కేవల కర్మణా|

ప్రాణినాం కర్మపాకేన మయా చ మునిసత్తమాః ఏషః స్వభావో విపేంద్రా, ఇతి వేదార్థ నిర్ణయః|

ప్రాణుల కర్మపరిపాకాన్ని అనుసరించి పరమేశ్వరుడు సృష్టి స్థితి లయాలను చేయడమే స్వభావ శబ్దార్థమని, ఇదే వేదార్థ నిర్ణయమని తుది పలుకుగా వేదవ్యాస భగవానులు చెప్పారు.

ఈ ప్రకారం వేద సంస్కృతిలో సృష్టి నిరూపణం చేయబడింది కనుక స్థితి, ధ్వంసలను గురించి వేరే నిరూపణ చేయనవసరం లేదని, గ్రంథవిస్తర భీతితో సృష్టి నిరూపణ ప్రసంగం ముగించడమైంది.

ఇంతవరకు విధి వాక్యాలచే శ్రేయస్సాధకమైనది ధర్మమని, లోకాల్లో భూలోకం చాలా ప్రశస్తమైనదని, భూలోకంలో కూడా భారత వర్షం సర్వ ప్రపంచానికి నాభిస్థానీయమైందని, అందులోనూ భరత ఖండం అతి ప్రశస్తమైనదని, చాతుర్వర్ణ్యవ్యవస్థ ఇక్కడే ఉందని, చాతుర్వర్ణ్య పురస్సరంగానే (వ్యవస్థకు అనుగుణంగానే) వేదశాస్త్రాల్లో వారివారి ధర్మాలు అనుష్ఠింపదగినవిగా విధించబడినందున అటువంటి ధర్మానుష్ఠాన యోగ్యత **'వేది'** శబ్ద వాచ్యమైన భారత వర్షంలోని భరత ఖండానికే ఉందని సప్రమాణంగా నిరూపించబడింది.

4 వ ప్రకరణం సమాప్తం

5వ ప్రకరణం

సృష్టి స్థిత్యాదులకు ధర్మమే కారణం

సృష్టిక్రమ భేదాల వివరణ తర్వాత సృష్టి స్థిత్యాదులకు ధర్మం కారణం అని సామాన్యంగా నిరూపించ బడుతోంది, ఈ ప్రకరణంలో.

ప్రజాపతిరకామయత ప్రజాస్సృజేయేతి స తపోఽతప్యత స సర్వానసృజత (తై.సం.3-1-1)

సృష్ట్యాదిలో బ్రహ్మగారు ప్రజలను సృజించాలనే కోరికతో తపస్సు చేసారు. తై.సం.7వ కాండ ప్రథమ ప్రశ్నలో సృష్టి ప్రకరణంలో **"అగ్నిష్టోమేన వై ప్రజాపతిః ప్రజా అసృజత"** అను శ్రుతి ప్రకారం ప్రజాపతి అగ్నిష్టోమాన్ని అనుష్ఠించి తత్సామర్థ్యంచే ప్రజలను సృష్టించినట్లు చెప్పబడినందున ఇక్కడ తపశ్శబ్దానికి **"అగ్నిష్టోమం"** అనే యజ్ఞం అని అర్థం చెప్పాల్సి ఉంది. అయితే బ్రహ్మగారు ప్రజల్ని సృజించాలని అగ్నిష్టోమం చేస్తే అది పూర్తి అయ్యాక కదా ప్రజలు, పశువులు, మిగిలిన ద్రవ్యాలు సృజించబడ్డాయి. మరి వారి యజ్ఞానికి ఋత్విక్కులు ఎవరు? ఆ క్రతువుకి అవసరమైన పశువు, ఆజ్యం మొదలైన పదార్థాలు ఎలా వచ్చాయి? అనే శంక కలుగుతుంది. కాని దాని సమాధానం విరాట్పురుషుని వర్ణించే సందర్భంలో **"పురుష సూక్తం"**లో వివరించబడింది. అది చెప్పడానికి ముందుగా ప్రస్తుత విషయాన్ని అనుసరిద్దాం.

బ్రహ్మగారు ప్రజల్ని సృజించాలనే ఇచ్ఛతో అగ్నిష్టోమాన్ని అనుష్ఠించగా ముందుగా సర్పాలు సృజించ బడ్డాయిట.

సోఽకామయత ప్రజాస్సృజేయేతి సద్వితీయమతప్యత| (తై. సం.3-1-1)

ఇలా సర్పాలు ఎందుకు సృజించబడ్డాయని ఆలోచించి ప్రజలను సృజించే ఇచ్ఛతో రెండో పర్యాయం అగ్నిష్టోమాన్ని అనుష్ఠించగా, **"సవయాగ్ న్యసృజత"** దాని సామర్థ్యం వల్ల పక్షులు సృజించ బడ్డాయిట. మళ్ళీ ప్రజాసృష్టి సిద్ధించలేదని ఆ కోరికతో-

సోఽకామయత ప్రజాస్సృజేయేతి స తృతీయమతప్యత|(తై.సం.3-1-1)

మూడో పర్యాయం యజ్ఞానుష్ఠానం చేస్తూ, పూర్వం రెండు సార్లు ప్రజాసృష్టికామనతో యజ్ఞం చేయగా రెండు సార్లు సర్ప, పక్షి సృష్టి జరగడానికి కారణమేమిటి, అనుష్ఠించిన క్రతువులో ఎక్కడ ఏ దోషాలు ఉన్నాయో అని పర్యాలోచన చేసి, **"స ఏతం దీక్షితవాద మపశ్యత్".** యథావిధిగా సమాప్తి పర్యంతం అనుష్ఠిస్తానన్న దీక్షతో దీక్షితులై, ప్రతిజ్ఞ చేసి యజ్ఞారంభంలో సంకల్పం చేసారు. "**దీక్షితేన వక్తవ్యో మంత్ర సంఘః దీక్షితవాదః**" దీక్షితులు అంటే దీక్షణీయేష్టి అనే యాగం చేసిన యజమాని అని అర్థం. ఈ దీక్షితులుగారికి చాలా నియమాలు, నిష్ఠలు చెప్పబడ్డాయి. ఇతడు రాత్రి పడుకునేటప్పుడు **"ఆగ్నేత్వగ్ం సుజాగృహీతి స్వప్యన్నాహవనీయముపతిష్టతే"** అనే ఆపస్తంబ సూత్ర ప్రకారం **"ఆగ్నేత్వగ్ం సుజాగృహి వయాగ్ం, సుమన్ది ప్రీమహి, గోపాయన స్వస్తయే ప్రబుధేనః పునర్దదః"** అనే మంత్రంతో ఆహవనీయాగ్నిని ప్రార్థించాలి. ఈ మంత్రానికి అర్థం "ఓ అగ్నిదేవా! మేం నిర్భయంగా నిద్రించాలి. నిద్రిస్తున్న దీక్షితుల్ని అనేకమంది రాక్షసులు పీడించగలరు (**స్వపన్తం వైదీక్షితగ్ం రక్షాగ్ంసి జిఘాగ్ం సన్తి**) కనుక, అట్టి బాధను నివారిస్తూ మాకు తిరిగి ఉదయం నిద్ర లేచే సామర్థ్యాన్ని ఈయవలసింది" అని ప్రార్థించడం. ఈ ప్రకారం అగ్నిపై భారాన్నుంచి **"అగ్నిమేవాధిపాం కృత్వా స్వపితి రక్షా సామపహత్యై"** అనే శ్రుత్యుక్త ప్రకారం అగ్నిని అధిపతిగా చేసి నిద్రించాలి. **"ఉషఃకాలే బుధ్వా ఉషోదయే యన్మేత్రత్వ్యాది ప్రాయశ్చిత్తజపః"** అను

సూత్రప్రకారం ఉషఃకాలంలో లేచి నిద్రలో సంభవించిన దోషపరిహారార్థం **"యన్మే త్రాతు యదత్రాపి"** మొదలైన ప్రాయశ్చిత్త మంత్రాల్ని జపించాలి.

ఈ ప్రకారం ఆ మంత్రాలను గతంలో జపించకపోవడంతోనే సర్ప, పక్ష్యాది సృష్టి జరిగిందని నిర్ణయించుకొని మూడవసారి అనుష్ఠించిన యజ్ఞంలో దీక్షితుడై బ్రహ్మగారు పై మంత్రాన్ని జపించారు. అప్పుడు ఈ మంత్ర జపంతో కూడిన యజ్ఞానుష్ఠాన సామర్థ్యంచే- **"తతో వై సప్రజా అసృజత"**(తై.సం)అని, ప్రజల్ని సృజించారు.

క్రత్వనుష్ఠాన సామర్థ్యంచేతనూ, అందులోనూ శాస్త్రోక్త విధిని ఉల్లంఘించడం అనే దోషాలు లేకుండాను అనుష్ఠించడంచే బ్రహ్మగారు ప్రజల్ని సృజించినట్లు, దీనివల్ల తెలుస్తోంది.

యత్తప స్తప్త్వా దీక్షితవాదం వదతి ప్రజాయేవ తద్యజమానస్సృజతే|

అనే శ్రుతి, క్రత్వనుష్ఠాన సామర్థ్యంచే బ్రహ్మగారు ఏ విధంగా ప్రజల్ని సృజించెనో అదే విధంగా నేడు కూడా మనచే శాస్త్రోక్తంగా అనుష్ఠించబడే యజ్ఞాలు ప్రజలు సృజించబడడానికి కారణమని స్పష్టంగా ప్రతిపాదిస్తోంది.

అంటే ఏ ఒక్కరైనా విధివిధానంగా యజ్ఞం చేసేవారుంటే అతనిచే అనుష్ఠించబడిన యజ్ఞమనే ధర్మమే సృష్టికి కారణమని తెలుస్తోంది. అనుష్ఠించబడిన ఆ యజ్ఞం శాస్త్రోక్తవిధిని ఉల్లంఘించి మన అభీష్టానుసారంగా గాని, ప్రమాదంచే గాని మరో విధంగా అనుష్ఠిస్తే విపరీత ఫలాన్ని ఈయగలదని కూడా హెచ్చరికగా తెలుస్తోంది.

ధర్మం - సృష్టి విశేషం

యజ్ఞం సృష్టికి కారణమని సామాన్యంగా చెప్పబడినా, యజ్ఞంలో ఏమేమి క్రియలచే సృష్టి విశేషం జరిగిందని మన బుద్ధికి, భౌతిక శాస్త్రానికి (సైన్స్ కి) కూడా గోచరించని విషయాలను విశేషంగా తెలుసుకోవలసి ఉంది. లోకంలో స్త్రీ, పురుషుల కలయిక వల్ల శుక్ర-శోణిత సంయోగం ఏర్పడుతోంది. పాలలో మజ్జిగ చుక్కను వేసి తోడు పెడితే ఆ పాలు గట్టిపడి పెరుగుగా మారుతోంది కాని, అందులో కఠిన పదార్థమేమీ కొత్తగా ఏర్పడటం లేదు. కానీ సృష్టిలో అనగా గర్భంలో ప్రాణులు ఘనీభావం చెందిన పిండరూపంగా ఏర్పడడమే గాక అందులో కఠినమైన ఎముకలు, కేశాలు మొదలగునవి కూడా ఏర్పడడం మనందరికీ తెలిసినదే. వీటికి కారణమేమిటని ప్రశ్నిస్తే లోక సామాన్యం సృష్టి స్వభావమని మాత్రమే సమాధానం చెప్పగలదు. అలా కాక వేరే ఏ ఇతర ప్రమాణాలకూ గోచరించని యజ్ఞీయమైన (యజ్ఞ భాగమైన) ఇతర విశేష క్రియలచేత ఏర్పడినట్లుగా కేవలం వేదం మాత్రమే వివరిస్తుంది.

బ్రహ్మవాదినో వదన్తి కస్మాత్పత్న్యాదనస్థికేన ప్రజాః ప్రవీయన్తేఽ స్థన్వతీర్జాయన్తే|

అనే శ్రుతి, స్త్రీ పురుషుల కలయిక తర్వాత అస్థిశూన్యమైన (ఎముకలు లేని) కేవలం శుక్ర-శోణితాలనే ద్రవరూప ద్రవ్యాల సంయోగంతో ఏర్పడి, ఉత్పత్తి కాలంలో మాత్రం **"అస్థన్వతీర్జాయన్తే"**- అంటే అస్థులతో (ఎముకలతో) కూడినవారై జన్మిస్తున్నారని చెప్తూ కారణం విచారించారు. దానికి

యద్ధిరణ్యం ఘృతేవధాయ జుహోతి తస్మాదనస్థికేన ప్రజాః ప్రవీయన్తేఽస్థన్వతీర్జాయన్తే|

అని సమాధానం చెప్తోంది. యజ్ఞంలో రెండో రోజున **"ప్రాయణీయేష్టి"** అను ఒక యాగం ఉంది. ఆ యాగమైన తర్వాత యజమాని, అధ్వర్యుడు మొదలగువారు సోమలతను తేవడానికి యాగశాలనుంచి సోమం దొరికే చోటుకి బయల్దేరి వెళ్తారు. ఆ సమయంలో **"ద్రౌవాదష్టౌ జుహ్వాం చతురోవా గృహ్ణాతి తస్మిన్దర్భేణ**

హిరణ్యం నిష్ట్యర్య బద్ధ్వావదధాతి" అనే సూత్ర ప్రకారం **'ధ్రువ'** అనబడే ఆజ్యపాత్ర నుండి **'జుహూ'** అనబడే సాక్షాత్తు హోమసాధన పాత్రలోకి నాలుగు స్రువాల (ఆజ్యాది ద్రవపదార్థాలను గ్రహించే చెంచా వంటి కర్రపాత్రతో నాలుగు కొలతల) ఆజ్యాన్ని గ్రహించి, ఆ పాత్రలో పూర్తిగా, శీఘ్రంగా విడిపించ డానికి వీలుగా దర్భతో సువర్ణాన్ని కట్టి (అంటే వొదులు ముడి వేసి) ఆ బంగారపు ఉంగరాన్ని **"ఇయంతే శుక్రనూరిదం వర్చస్తయా సంభవ భ్రాజం గచ్ఛ, ఘృతేవ దధాతి"** అనే సూత్ర ప్రకారం మంత్రాన్నుచ్చరించి ఆజ్యంలో ఉంచుతారు. ఈ జుహూపాత్ర నీకు శరీరం. ఈ ఘృతం నీ తేజస్సు. ఆ కారణంవల్ల ఆ జుహువుతో కూడ కలువు. ఆజ్యరూపమైన భ్రాజస్సును, దీప్తిని పొందు అని అర్థం. బ్రాహ్మణ పాఠానుసారం-

అపో వరుణస్య పత్నయ ఆసన్, తా అగ్నిరభ్యధ్యాయత్, తాస్సమభవత్| తస్యరేతః పరాపతత్, తద్ధిరణ్యమభవత్| (తై. సం)

అంటే, హిరణ్యానికి (బంగారానికి) అగ్ని పితృస్థానీయం, ఉదకాలు మాతృస్థానీయాలు. అగ్ని ఉదకాలను కలవాలని యోచించి వాటిని కలిసి, అగ్ని యొక్క రేతస్సు ఉదకాల్లో ఉంచగా అది హిరణ్యంగా మారింది. దీని ప్రకారం **"హశుక్ర-అగ్నే"** అని పాత్రలో ఉన్న ఈ ఆజ్యం నీ శరీరం. ఈ హిరణ్యం నీ తేజస్సే అని సంబోధించి, హిరణ్యాన్ని ఆజ్యంలో ఉంచాలి. ఆజ్యం అగ్నికి ప్రియమైన స్థానమని **"ఏతద్వా అగ్నేః ప్రియంధామ"** అనే శ్రుతి బోధిస్తోంది. అగ్నికి ప్రియమైన ఆజ్యంలో ఉంచిన బంగారాన్ని మిగిల్చి, హోమకాలంలో కేవలం ఆజ్యాన్ని మాత్రమే హోమం చేయాలని సూత్రం.

నాడీ స్రుగ్దణ్డే ఉపసంగృహ్య ఆహవనీయే జూహోతి అణ్వారబ్ధే యజమానే జురసి ధృతా మనసా జుష్టా విష్ణవే తస్యాస్తే సత్య సవసః ప్రసవే వాచో యన్తమశీయ స్వాహా|

హిరణ్యాన్ని స్రుక్ దండంలో ఉంచి ఈ మంత్రంతో ఆహవనీయంలో హోమం చెయ్యాలి. అస్థి సదృశమైన (ఎముకల వలె గట్టిగానున్న) హిరణ్యాన్ని ముందుగా ఆజ్యంలో ఉంచినా హోమకాలంలో ఈ ప్రకారం కఠినమైన హిరణ్యం లేకుండా కేవలం ద్రవరూపమైన ఆజ్యాన్ని మాత్రమే హోమం చేయడం వల్ల ప్రాణులు గర్భ నిర్మాణకాలంలో అస్థి శూన్యంగా నిర్మితమై ఉన్నా ఉత్పత్తికాలంలో మాత్రం అస్థులతో కూడి పుడుతున్నారని**"తస్మాదనస్థికేన ప్రజాః ప్రవీయన్తేఽస్థన్వవతీర్జాయన్తే"** అనే శ్రుతి బోధిస్తోంది.

దీనివల్ల తేలిన సారాంశం- కఠినద్రవ్య రహితమైన కేవల ద్రవద్రవ్య శుక్ర-శోణిత సంయోగంతో గర్భంలో ప్రాణులు ముందుగా నిర్మాణమైనా ఉత్పత్తి కాలంలో అస్థులతో పుట్టడానికి కారణం హిరణ్యాన్ని హోమం చేసే ఆజ్యంలో ముందుగా ఉంచినా, హోమకాలంలో హిరణ్యరహితమైన కేవల ఆజ్యాన్ని మాత్రమే హోమం చేయడమే అని **"తత్ర వీర్య సదృశమాజ్యం అస్థి సదృశం హిరణ్యం తదిదం సాదృశ్యం నిర్వోఢుం ఈశ్వరేణ అస్థి నిర్మీయతే"** అనే సూత్ర భాష్యానుసారంగా సృష్టి వైలక్షిణ్యం చెప్పబడింది.

ఏతద్వా అగ్నేః ప్రియమ్ ధామ యద్ఘృతం తేజు హిరణ్యం, తస్య రేతః పరాపతత్, తద్ధిరణ్యమభవత్|

వంటి శ్రుతులచే ఈ ప్రసంగంలో ఘృతం యొక్క ప్రాశస్త్యం చెప్పబడింది. ఘృతం అగ్నికి చాలా ప్రియమైనదని చెప్పబడింది కనుకనే ఇతర హోమద్రవ్యాలు అనగా చరు, పురోడాశాదులు చెప్పబడని ప్రతి హోమక్రియలోను యాజ్ఞికులు ఆజ్యాన్నే వినియోగిస్తారు. ఆజ్యాన్ని ఆ విధంగా వినియోగించాలని ఆపస్తంబ పరిభాషా సూత్రం **"జుహోతీతి చోద్యమానే సర్పిరాజ్యం ప్రతీయాత్"** అని, **"జుహోతి"** అనే వాక్యం వినబడిన అన్ని సందర్భాల్లోనూ సర్పిరాజ్యం-స్రవించే యోగ్యత గల ఆజ్యాన్నే (కరగిన నెయ్యినే) ద్రవ్యంగా గుర్తించాలని చెప్తోంది. ఇంతే కాదు బ్రాహ్మణుడు ఘృత ప్రియుడని కూడా లోకంలో వాడుక ఉండడం మనకందరికీ

తెలిసిందే. **"ఏష వా అగ్నిర్వైశ్వానరో యద్బ్రాహ్మణః"** అనే శ్రుతి, బ్రాహ్మణుడు సాక్షాత్తు వైశ్వానరాగ్ని స్వరూపమని చెప్పడమే దీనికి కారణంగా చెప్పవచ్చు.

సముఖతస్త్రివృతం నిరమమీత తమగ్నిర్దేవతాన్యసృజ్యత గాయత్రీఛన్దో రథన్తరగ్ం సామబ్రాహ్మణో మనుష్యాణాం|

అనే శ్రుతి; బ్రహ్మగారి ముఖంనుండి అగ్ని, బ్రాహ్మణుడు ఉత్పన్నమైనట్లు చెప్తోంది కనుక ఉత్పత్తిస్థాన సామ్యం వల్లను, బ్రాహ్మణుడు అగ్నిస్వరూపుడు కనుక అగ్నిలాగా బ్రాహ్మణుడు కూడా ఘృతప్రియుడు అనడం యుక్తమే అనిపిస్తోంది. ఇంక హిరణ్యం యొక్క గొప్పతనం చెప్పబడుతోంది. అగ్ని, ఉదకాల సంయోగంలో హిరణ్యం ఉత్పన్నమైంది కనుక స్వతస్సిద్ధంగా హిరణ్యం పరిశుద్ధమైంది. కాబట్టి రజస్వలా స్త్రీ ఇత్యాది స్పర్శచే హిరణ్యాన్ని శోధించవలసిన సందర్భాల్లో ఉదకాలచేతనే శోధిస్తున్నారు (శుద్ధి చేస్తున్నారు) అని **"తస్మాదద్భ్యో హిరణ్యం పునన్తి"** (తై. సం) అనే శ్రుతి చెప్తోంది.

ద్రవ్య శుద్ధిః పరిమార్జన ప్రదాహన తక్షణ నిర్ణేజనాని తైజస మార్తిక దారవ తాన్తవానామ్| (గౌ.ధ.సూ 1-1-28)

అనే శ్రుతి కాంస్య పాత్రాదుల శుద్ధి విషయంలో- కాంస్యలోహ పాత్రలకు రజస్వలా చండాలాది స్పర్శ సంభవిస్తే వేరుగాను, ఉచ్ఛిష్టపాత్రల (ఎంగిలి పాత్రల) విషయంలో వేరుగాను, మద్యమూత్ర పూరీషాది సంస్పర్శ అయితే వేరుగాను శుద్ధి చెప్పబడినా, **"స్పర్శ దూషితానాం బహూనాం ప్రోక్షణాచ్ఛుద్ధిః"** అనే శ్రుత్యుక్త ప్రకారం పవిత్రమైన హిరణ్యానికి రజస్వలాది స్పర్శ సంభవించినపుడు **"తస్మాదద్భ్యో"** అనే శ్రుతి చెప్పినట్లుగా జలంచే శుద్ధి అనేది స్పష్టం. ఈ ప్రకారం ఈ సందర్భంలో హిరణ్య (సువర్ణ) మహిమను వర్ణించడం జరిగింది. ఇక సువర్ణధారణ ఆవశ్యకత గురించి వివరిస్తాను.

బంగారం ఎందుకు ధరించాలి?

"తస్మాత్సువర్ణగ్ం హిరణ్యం భార్యం" అనే శ్రుతి సువర్ణ రూపమైన హిరణ్యాన్ని ధరించాలని విధిస్తోంది. ఈ సువర్ణ ధారణ పురుషార్థాల కోసమా? క్రతువు కోసమా? అని మీమాంసా శాస్త్రంలో విచారణ చేసి, క్రత్వర్థం (క్రతువుకోసం) అని ఆశంకించి, కేవలం క్రత్వర్థమే అయితే కేవలం క్రతుఅనుష్ఠాన కాలంలో మాత్రమే ధరించవలసి ఉంటుంది. లేకపోతే ఆ క్రతువుకు వైగుణ్యం ఏర్పడుతుందని చెప్పవలసి ఉంది. కావున ఈ వాక్యం పురుషార్థం కోసం హిరణ్యాన్ని ధరిస్తే దుర్వర్ణం పోయి శరీరానికి మంచి వర్ణం వస్తుందని **"సువర్ణ ఏవ భవతి"** అను ఫలశ్రుతివల్ల నిర్ణయించారు.

అందుకే మన సంస్కార కర్మల్లో **'కర్ణభేది'** అను సంస్కారం ఉంది. బాల్యంలోనే చెవులకు బంగారు పోగులు చుట్టించే ఈ సంస్కారం వల్ల దానిపైనుండి శరీరంపై నీళ్ళు పడితే మంచి వర్చస్సు వస్తుందని, శరీరానికి ఆరోగ్యం కూడా ఉంటుందని మహర్షుల అభిప్రాయమని చెప్పవచ్చును. ఈ ఆధునిక కాలంలో చెవులకి సువర్ణ ధారణ మానేసారు గాని నరాల నిస్సత్తువ తగ్గుతుందని ఆధునిక శాస్త్రవేత్తలు చెప్పారని, చాలామంది రాగి కడియాలను ధరించడం మనం చూస్తూనే ఉన్నాం. సువర్ణంలో రాగి కలిసే ఉంది. కాని దాన్ని (సువర్ణాన్ని) వదిలేసాం, దీన్ని (రాగిని) స్వీకరించాం! ఇది మన ప్రస్తుత పరిస్థితి.

ప్రకృత విషయానికి వస్తే హోమకాలంలో ఆజ్యంలో ఉంచే హిరణ్యం అగ్నితేజస్సవడంవల్ల చాలా ప్రశస్తమైంది. ఇలాంటి హిరణ్యాన్ని దర్భలతో వదులుగా ముడివేసి ఆజ్యంలో ఉంచాలని ఇంతకు ముందే తెలుసుకున్నాం. అలా కాకుండా ముడి వేయకుండా ఉంచితే, **"యదబద్ధమవదధ్యాత్ గర్భాః ప్రజానాం పరాపాతుకాస్యుః"** అను వాక్య ప్రకారం లోకంలో గర్భాలు నవమాసాలు పూర్తిగా కాకుండా పతన స్వభావం కలవౌతాయి. అందుచేత ముడివేసి ఉంచాలని **"బద్ధమవ దధాతి గర్భాణాం ధృత్యై"** అను శ్రుత్యుక్త ప్రకారం

గర్భధారణం అనే ప్రయోజనం ఉందని చెప్పబడింది. ఈ ప్రకారం ముడివేసి ఉంచాలని, దానివల్ల గర్భస్రావాలు లేకుండా ధారణ జరుగుతుందని, కానీ ఆ హిరణ్యాన్ని గట్టిగా ముడివేసి ఉంచితే ప్రాణులకు శీఘ్రప్రసవం సిద్ధించదని **"నిష్టర్క్యమ్"** అని వెంటనే ముడి విప్పడానికి వీలుగా ఉండేట్లు వేయాలని దానివల్ల శీఘ్రప్రసవం జరుగుతుందని **"ప్రజానాం ప్రజననాయ"** అను శ్రుతి చెప్తోంది.

దీనివల్ల గర్భంలో ఉన్న ప్రాణులకు కఠినమైన ఎముకలు ఏర్పడడానికి, గర్భస్రావాలు జరగకుండా సకాలంలో ప్రసవం శీఘ్రంగా కలగడానికి యజ్ఞ సంబంధమైన క్రియయే కారణమని చెప్పినట్లయింది. కాని కరచరణాది అవయవాలు (కాళ్ళు, చేతులు మొదలగు అవయవాలు) ఎలా ఏర్పడతాయని ప్రశ్న వస్తుంది. వాటికీ యజ్ఞమే కారణమని చెప్తోంది వేదం.

అగ్నిహోత్రం జుహోతి యదేవ కించ యజమానస్య స్వం తస్యైవతత్| (తై.సం)

"దధ్నాజుహోతి" "పయసా జుహోతి" ఇత్యాది వాక్యాలచే విధింపబడిన దధ్యాది ద్రవ్యాలతో యజమానుడు అనుష్ఠించే అగ్నిహోత్రమనే కర్మలో హోమం చేయబడిన ఆ ద్రవ్యమే యజమానునికి 'కాలాంతరానికి కూడా నిలబడి ఉండే ధనమని' చెప్పారు. అయితే హోమకాలంలో హోమం చేయగానే భస్మమవుతున్న హోమద్రవ్యాలు కాలాంతరానికి కూడా నిలిచి ఉండే ధనమని చెప్పడం ప్రత్యక్ష విరుద్ధం అని శంకించి, అగ్ని స్త్రీయొక్క యోనివంటిదని, యోనిలో ఉంచిన రేతస్సు నష్టం కాకుండా తిరిగి ప్రజోత్పాదకమైంది కనుకనే సంతానంతో కూడిన వాడయినట్లు అగ్నిలో ఉంచిన ద్రవ్యాలు కూడా నశించడం లేదని సృష్టికి సాధనమని చెప్పారు.

రేతస్సించతి ప్రజననే ప్రజననగ్ం హివా అగ్నిః| (తై. సం)

అగ్ని సమీపానికి చేరిన ఔషధులను అగ్ని దహింపచేస్తోంది. కదా, అని **"ఓషధీరన్తగతా దహతీతి"** (తై.సం) శ్రుతి ప్రకారం శంకించి, **"తాస్తతో భూయసీః ప్రజాయన్తే"** అని, అగ్నికి కేవలం దాహకత్వమే ఉందని అభిప్రాయపడుతున్నారు గాని, అగ్నికి ఉత్పాదకత్వశక్తి కూడా ఉంది కనుకనే, **"గ్రీష్మకాలే దావాగ్నినా దగ్ధ ప్రదేశే అచిరకాలే వర్షర్తౌ వృష్టిపాతనేన భూయస్యః కోమలయుక్తాశ్చ ఓషధయః ప్రజాయన్తే"** అని భాష్యం చెప్పబడింది. అంటే, గ్రీష్మఋతువులో దావాగ్నిచే దగ్ధమైన ప్రదేశంలో వెంటనే వర్షఋతువులో వర్షాలు పడిన పిమ్మట మంచి కోమలంగా పూర్వం కంటే ఔషధులు బయలుదేరడం మనం చూస్తున్నదే. అది ప్రత్యక్ష సిద్ధం.

అదే తీరుగా, **"యత్సాయం జుహోతిరేత ఏవ తత్సించతి"** అని సాయంకాలీనమైన అగ్నిహోత్రం రేతస్సేచన సదృశమైనది కనుకనే శాస్త్రంలో దివాభాగాన (పగటిపూట) స్త్రీ-పురుష సంయోగాన్ని నిషేధించి రాత్రికాలం యోగ్యమైనదిగా చెప్పబడింది.

ప్రైవ ప్రాతస్తనేన జనయతి|

ప్రాతఃకాలీన హోమం ప్రజోత్పాదన సదృశమైనది. అంటే, సాయం, ప్రాతః కాలీనమైన అగ్నిహోత్ర సామర్థ్యంచే లోకంలో యోనియందు రేతస్సేచనం జరగడం-అది గర్భంగా మారడం-గర్భస్థ ప్రాణులు ఉత్పన్న మవడం జరుగుతోంది. కానీ గర్భాశయంలో ఉంచబడిన రేతస్సు గర్భంగా మారినా కరచరణాది వికృతిరహితంగా (కాళ్ళు, చేతులు వంటివి లేకుండా) ఉత్పన్నమవడం లేదు.

యావచ్ఛో వై రేతసస్సిక్తస్య త్వష్టా రూపాణి వికరోతి, తావచ్ఛో వై తత్ప్రజాయతే| (తై. సం)

త్వష్టప్రజాపతి అనే శిల్పి గర్భాశయంలో ఉంచబడిన రేతఃపరిణామమైన గర్భానికి కరచరణాది రూపమైన ఎన్ని వికృతులను కల్పిస్తున్నాడో అన్ని వికృతులతోనూ ఉత్పన్నమవుతోంది. ఇటువంటి వికృతి కల్పన చేసే సామర్థ్యం త్వష్టప్రజాపతికి ఏ కర్మవల్ల ఏర్పడిందనే శంకకు **"ఏషవై దైవ్యస్త్వష్టాయో యజతే బహ్వీభిరుపతిష్ఠతే రేతస ఏవ సిక్తస్య బహుశో రూపాణి వికరోతి సప్రైవ జాయతే"** (తై.సం) అను శ్రుతి సమాధానం చెప్తోంది.

అగ్నిహోత్ర కర్మని అనుష్ఠిస్తున్న యజమానిని దేవరూపమైన త్వష్టను గర్భనిర్మాణ సామర్థ్యాన్నిచ్చే త్వష్ట అని వ్యవహరిస్తున్నారు. ఇతడు ప్రతిరోజు సాయం ప్రాతఃకాలాల్లో **"బహ్వీభిరుపతిష్ఠతే"** అను విధి వాక్యానుసారం అనేక మంత్రాలతో ఉపస్థానం అంటే, ప్రార్థన చేయడం వల్ల త్వష్టప్రజాపతి గర్భమందు **"బహుశో రూపాణి వికరోతీతి"** అనేక రూపాలను కల్పిస్తున్నాడు.

దీనివల్ల తేలిన సారాంశం- ఆహితాగ్ని ప్రతినిత్యం సాయంప్రాతః కాలాల్లో దధ్యాది ద్రవ్యాలను హోమం చేయడం వల్ల లోకంలో గర్భాశయంలో ఉంచబడిన రేతస్సు గర్భంగా మారి ప్రజోత్పాదన జరగడానికి కారణమైందని, సాయంప్రాతః కాలాల్లో ఆహితాగ్ని అనేక మంత్రాలచే ఉపస్థానం (ప్రార్థన) చేయడంవల్ల కరచరణాద్యనేక అవయవాలతో ప్రాణులు జనించడం జరుగుతోందని చెప్పినట్లయింది.

ఆధునిక విజ్ఞానానికి అందనటువంటి (వివరించడానికి సాధ్యం కానటువంటి) మరికొన్ని శంకలకు కూడా వేదం సమాధానం చెప్పింది. పంచ జ్ఞానేంద్రియాలలో చక్షుశ్రోత్ర ఘ్రాణాలు (కళ్ళు, చెవులు, ముక్కు) ఉన్నాయి. ఇవి ఇంద్రియాల లెక్కలో ఒకటిగా చెప్పబడినా గోళకాలు రెండు రెండుగా ఉన్నాయి. కారణ మేమిటి? యజ్ఞంలో ద్విదేవత్య గ్రహాలని కొన్ని సోమరస పాత్రలున్నాయి. ఈ పాత్రల్లోకి సోమరసం గ్రహించేటప్పుడు ఇద్దరిద్దరు దేవతలకు ఒక్కొక పాత్రలో గ్రహించి, ఆ తర్వాత హోమకాలంలో మాత్రం రెండు పాత్రల్లోకి విభజించి హోమాన్ని చేస్తారు. దీనికేమి ప్రయోజనం అని విచారిస్తే-

బ్రహ్మవాదినో వదన్తి కస్మాత్సత్యాదేక పాత్రాద్విదేవత్యా గృహ్యన్తే ద్విపాత్రా హూయన్త| (తై. సం)

అని శంకించి,

యదేకపాత్రా గృహ్యన్తే తస్మాదేకోన్తరతః ప్రాణో ద్విపాత్రా హూయన్తే తస్మా ద్వౌద్వౌ బహిష్టాత్ప్రాణాః ప్రాణావా ఏ తే యద్విదేవత్యాః| (తై. సం)

అన్నారు. ఈ ప్రకారం సోమరస గ్రహణకాలంలో ఇద్దరిద్దరు దేవతలకు ఒక పాత్రలో గ్రహించి, హోమ కాలంలో రెండు పాత్రల్లోకి విభాగం చేసి హోమం చేయడంవల్ల చక్షురాదింద్రియాలు **"తస్మాదేకోంతరతః ప్రాణః"** అని లోపల ఒక ఇంద్రియంగాను, **"ద్వౌద్వౌ బహిష్టాత్ప్రాణాః"** బాహ్యానికి రెండు రెండు గోళకాలుగాను ఉన్నాయన్నారు. అయితే ఈ ప్రకారంగా మూడు ఇంద్రియాలు మాత్రమే ఉండడానికి కారణమేమిటి? ద్విదేవత్యాలనే ఐంద్రవాయవ, మైత్రావరుణ, ఆశ్వినాలనే మూడు పాత్రలను ఈ విధంగా గ్రహించడం దీనికి కారణమని చెప్పారు. మరో ప్రకరణంలో -

బ్రహ్మవాదినో వదన్తి కస్మాత్సత్యాత్త్రయః పశూనాగ్ హస్తాదానాః|

అని చెప్పారు. లోకంలో పశువులన్నింటిలోను మూడు పశువులు మాత్రమే హస్తంతో భుజించడానికి కారణమేమిటా అని బ్రహ్మవాదులు విచారించి, యజ్ఞంలో దేవతలకు హోమం చేయడానికి దారుపాత్రలలో సోమరసాన్ని గ్రహిస్తారు. అందులో ఒక సోమరస పాత్రకు **"ఉపాగ్ంశు"** పాత్ర అనే పేరు ఉంది. **'యత్త్రిరు పాగ్ం శుగ్ం హస్తేన విగృహ్ణాతి, తస్మాత్త్రయః పశూనాగ్ం హస్తాదానాః పురుషో హస్తీ మర్కటః'**(తై.సం) అనే సూత్ర ప్రకారం, ఆ ఉపాగ్ంశు పాత్రలోకి హస్తంతో సోమరసాన్ని మూడుసార్లు

గ్రహించడంచేత పశువులలో మూడు మాత్రం- మనుష్యుడు, ఏనుగు, మర్కటం (కోతి) హస్తంతో ఆహారం స్వీకరించి భుజించడమనే వైలక్షణ్యం ఏర్పడిందని చెప్పబడింది.

"పశుయాగం" అనే మరో ప్రకరణంలో **"పూష్ణోరగ్గ్ హ్యా అపామోష ధానాగ్ం రోహిష్యై తేనైవాఽపిధాయ"** అను సూత్రంచే వపాహోమం చేసేటప్పుడు వపాహోమ పాత్రను స్వధితిచే (రెండు వైపులా పదునున్న కత్తిచే) కప్పిపుచ్చుతారు. ఆ క్రియ సూర్యునియొక్క గతికొరకు ఉదక సంబంధమైన ఔషధుల అభివృద్ధి కొరకును అవుతోంది అని **"ఏతత్కర్మ సామర్థ్యాదేవ జగదీశ్వరః సృష్ట్యాదౌ ఏతాదృశం వైలక్షణ్యం ససర్జ"** అనే భాష్యంచే చెప్పబడింది.

సూర్యగతి వివరణ

అసౌవా ఆదిత్యశ్శుక్రశ్చన్ద్రమా మన్థ్యపి గృహ్యన్త్యప్రాంచౌ నిష్క్రామతః తస్మాత్ప్రాంచౌ యన్తౌ న పశ్యన్తి ప్రత్యఞ్చావావృత్య జుహుతః తస్మాత్ప్రత్యంచౌ యన్తౌ పశ్యన్తి|

యజ్ఞంలో హవిర్ధానమనే పేరున్న ఒక మంటపంలో సోమరస పాత్రల్ని హోమంకోసం గ్రహిస్తారు. ఆ సందర్భంలో శుక్ర, మన్థి అనే సోమరస పాత్రల్ని అధ్వర్యుడు, ప్రతిప్రస్థాత అనే ఇద్దరు ఋత్విక్కులు చెరో పాత్రచే గ్రహించి ఆ సోమరస పాత్రల్ని పైన కప్పిపుచ్చి హవిర్ధాన మంటపం నుంచి తూర్పుగా ఉత్తరవేది వద్దకు వెళ్తారు. ఇందులో శుక్రపాత్ర ఆదిత్యస్థానమని, మన్థిపాత్ర చంద్రుని స్థానమని శ్రుతి చెప్పిన కారణంగా వీటిని కప్పిపుచ్చి తూర్పుకి వెళ్ళడంవల్ల పశ్చిమ దిక్కున అస్తమించిన సూర్యచంద్రులు తూర్పు దిక్కునకు ప్రయాణమైనప్పుడు చూడడానికి ఎవరూ సమర్థులు కాకున్నారు.

పై రెండు సోమరస పాత్రలతో పైన కప్పిన మూతలను తొలగించి ఆ ఇద్దరు ఋత్విక్కులు ప్రత్యగ్దిక్కుగా తిరిగి కప్పును తొలగించి హోమం చేస్తారు. దాని సామర్థ్యం వల్ల లోకంలో సూర్యచంద్రులు ప్రాగ్దిక్కున (తూర్పున) ఉదయించి ప్రత్యగ్దిక్కుకు (పడమరకు) వెళ్ళినపుడు అందరూ చూడగలుగుతున్నారని దానికి కారణం యజ్ఞంలో గల శుక్ర, మన్థ గ్రహాలనే పాత్రలయొక్క ప్రచార విశేషమే అని వేదం చెప్తోంది.

సృష్టి విశేష ప్రసంగం

జగదీశ్వరుడు ప్రతిచోట కూడా ఈ విధమైన జగద్వైలక్షణ్యాన్ని కర్మసామర్థ్యంచేతనే సృజించెనట. జగద్వైలక్షణ్యం మరో విశేషంగా కూడా వర్ణింపబడింది. ప్రతి ప్రాణికి శిరస్సున, అధో భాగంలో మాత్రమే ఇంద్రియాలుండడానికి కారణమేమి అను ప్రశ్నకు సమాధానం కూడా చెప్పబడింది.

దక్షిణస్య హవిర్ధానస్యాధస్తాచ్చతుర ఉపరవాన వాన్తర దేశేషు ప్రాదేశముఖాన్ప్రదేశాంతరాళాన్కరోతి రక్షోహణోవలగహనో వైష్ణవా న్ఖనామీతి ఖనతి| (క.సూ)

హవిర్ధానాలనగా హవిస్సును ధరిస్తున్న రెండు శకటాలను పైన కట్టడం అనే యాజ్ఞికం. అటువంటి హవిర్ధానమనే మంటపంలో దక్షిణం వైపు కట్టిన శకటానికి కింద భూభాగంలో నాలుగు గోతులు (ఉపరవాలనే సంజ్ఞలు కలిగినవి) తవ్వాలి. వాటి విశేషం ఏమంటే, పైన ఒకదాని కొకదానికి ప్రాదేశమాత్రం వ్యవధానం ఉండేటట్లు లోపల భాగంలో అన్ని గోతులు కలియునట్లుగానూ బాహుమాత్ర పరిమితంగా తవ్వాలి. ఆ ఉపరవాలను గురించి శ్రుతి ఈ విధంగా స్తుతిస్తోంది.

శిరోవా ఏతద్యజ్ఞస్య యద్ధవిర్ధానం ప్రాణాః ఉపరవాః| (తై. సం)

యజ్ఞశాలలో నిర్మింపబడిన హవిర్ధాన మంటపం యజ్ఞపురుషునికి శిరస్సు వంటిదనియు, ఆ మంటపంలో నిర్మింపబడిన ఉపరవాలు చక్షుశ్రోత్రాది ఇంద్రియాల వంటివనియు, ఆ కారణంవల్లనే ప్రాణులకు శిరస్సు నందు, అధోభాగమందు చక్షురాదింద్రియాలు సృజించబడ్డాయని **"తస్మా దధస్తా చ్ఛీర్ష్ణః ప్రాణాః"** అను శ్రుతి ప్రతిపాదిస్తోంది. ఇంకా **"సంతృణత్తి"** అనే శ్రుతి ఉపరవాలనే గోతులు లోపలి భాగంలో కలిసి ఉండాలని విధించడంవల్ల- **"తస్మాత్సంతృణ్ణా అన్తరతః ప్రాణాః"** అని లోకంలో ప్రాణులయొక్క చక్షురాదీంద్రియాలు లోపలి భాగాన కలిసి ఉంటాయని ఒకదానికొకటి కలవకూడదని నిషేధించడంవల్ల లోకంలో కూడా **"తస్మాదసంభిన్నాః"** అని ఆ చక్షురాదింద్రియాలు ఒకదానికొకటి కలవకుండా ఉండడం తటస్థించింది అని చెప్తోంది. **"అపోవనయతి"** అని ఉపరవంలో ఉదకాన్ని ఉంచాలని విధించడం వల్ల, **"తస్మాదార్ద్రా అంతరతః ప్రాణాః"** అని చక్షురాదింద్రియాలు లోపల ఆర్ద్రతతో (తడితో) కూడుకొని ఉంటాయి.

"**యవమతీ రవనయతి**"అని ఆ ఉపరవాలలో యవధాన్యాన్ని ఉంచాలని విధించడం వల్ల, **"ఊర్ద్వ్యయవః ప్రాణా ఉపరవాః ప్రాణేష్వేవోర్జం దధాతి"** అని యవధాన్యం అన్నంద్వారా బలప్రదమైంది కనుక, ఉపరవాలు ఇంద్రియ స్థానాలు కనుక యవధాన్యాన్ని ఉపరవాలలో ఉంచడం వల్ల చక్షురాదింద్రియాలందు ఆయా విషయ గ్రహణ సామర్థ్యం ఉంచినట్లయింది.

"బర్హిరవస్తృణాతి" అని ఉపరవాలందు దర్భగడ్డి ఉంచాలని విధించడంచే లోకంలో **"తస్మాల్లోమశా అంతరతః ప్రాణాః"** అని చక్షురాది ఇంద్రియాలు లోపల కేశాలతో కూడుకొని ఉన్నాయి. **"ఆజ్యేన వ్యాఘారయతి"** అని ఉపరవాలందు ఆజ్యధారని ఉంచాలని చెప్పడం వల్ల దాని సామర్థ్యం వల్ల **"తేజోవా ఆజ్యం ప్రాణా ఉపరవాః ప్రాణేష్వేవ తేజో దధాతి"** అను శ్రుత్యనుసారం ఆజ్యం తేజస్స్వరూపం కనుక ఇంద్రియాలందు తేజస్సుని ఉంచినట్లు అవుతోంది.

హనూవా ఏతే యజ్ఞస్య యదధివషణేన సంతృణత్తి| (తై.సం)

సోమాభిషవం చేసేటప్పుడు సోమం గల కృష్ణాజినానికి ఆధారంగా రెండు కాష్ఠములనే అధిషవణ ఫలకాలను ఉంచుతారు. వాటిని ఒకదాని కొకటి తగలకుండా ఉంచాలి. ఈ అధిషవణ ఫలకాలు యజ్ఞ పురుషునకు దవడ స్థానీయులు కనుక వీటి సామ్యంచే లోకంలో ప్రాణులయొక్క దవడలు కూడా వేరుగానే ఉంటున్నాయి.

ఈ విధంగా సృష్టి వైలక్షణ్యానికి యజ్ఞయాగాది కర్మానుష్ఠానమే కారణమని వేదం బోధిస్తోంది. మరియు సోమయాగ ప్రకరణ సమయంలో-

క్షౌమం వానోద్విగుణం త్రిగుణం వా ప్రాగ్దశముత్తరా దశం వా చర్మణ్యాస్తృణాతి ఉదగ్దశం వాతస్మిన్ హిరణ్య పాణిరంగుష్ఠేన కనిష్ఠికయా చాంగుళ్యా అగ్రం శూన్సంగృహ్యాన్యం చ మభిత్యం దేవగ్రం సవితారమిత్యతిచ్ఛంద సర్చామిమీతే| (ఆ.సూ)

క్షౌమ వస్త్రాన్ని (తెల్లటి నారచీరను, పట్టువస్త్రాన్ని) రెండు లేక మూడు పొరలుగా తూర్పుకు లేదా ఉత్తరానికి అంచులు ఉండేటట్లు పరిచి, హస్తానికి హిరణ్యాన్ని ధరించినవాడై దానియందు అంగుష్ఠ కనిష్ఠికాది వేళ్ళతో సోమలతయొక్క ఖండాలను గ్రహించి **"అభిత్యం దేవం"** అను అతిచ్ఛందస్కమైన ఋక్కుతో ఒక్కో వేలుతో ఆ సోమలతను కొలవాలి. దాని ప్రకారం కూడా ఎలా విధింపబడిందంటే-

ఏకయైకయోత్సర్గం మిమీతేఽయా తయామ్నియాఽయా తయామ్నియైవైనం మిమీతే తస్మాన్నానావీర్యా అంగులయః|

ప్రథమ పర్యాయం కనిష్టిక వ్రేలుతో, ద్వితీయ పర్యాయం అనామిక వేలుతో, మూడవ పర్యాయం మధ్యమ వేలుతోను, నాల్గవ పర్యాయం తర్జనీ వేలుతోను కొలవాలి. పూర్వం వినియోగించిన వేలును ఉత్తరోత్తర మానాలలో విడిచిపెట్టాలి. ఈ ప్రకారం చేసినందున, వినియోగించిన వేలుకు మళ్ళీ వినియోగం లేనందున గతసారం లేకపోవడం, అన్ని వేళ్ళు అంగుష్ఠంతో కలియడంలో అంగుష్ఠానికి ప్రత్యేక సామర్థ్యం కలిగి ఉండడం తటస్థిస్తోందని వివరింపబడింది.

సోమమాన కాలంలో అయిదు పర్యాయాలు ప్రతి వేలుతోను అంగుష్ఠం కలుస్తుండడంవల్ల దానికి అన్ని వేళ్ళతో సమానమైన సామర్థ్యం కలిగి ఉండడం, అన్ని వేళ్ళతోను కలిసే స్వభావం లోకంలో మనందరికీ కలిగి ఉండడానికి కారణమని **"సర్వాస్వంగుష్ఠ ముపనిగృహ్ణాతి తస్మాత్సమా వద్వీర్యోఽన్యాభిరంగు లిభిస్తస్మాత్సర్వా అనుసంచరతి"** అను శ్రుతి వివరిస్తోంది.

యత్సహ సర్వాభిర్మిమీత సగ్గ్ శ్లిష్టా అంగులయో జాయేరన్|

యజ్ఞంలో సోమమాన కాలంలో అన్ని వేళ్ళతో కలిసి సోమమానం చేస్తే కలిసిపోయిన వేళ్ళు కలవారై ప్రాణులు జన్మిస్తారు. ఒక్కో వేలును విడిచి మానం చేస్తున్నారు కనుక విభక్తమైన వేళ్ళు కలవారై పుడుతున్నారు. దర్శపూర్ణమాస ప్రకరణ సమయంలో -

"అధ్వ్యః పరిప్రజాతాస్థ|"

"తప్తాభిరను పరిప్లావ్య" (ఆ.శ్రౌ.సూ.)

'ఓ ఓషధులారా! మీరు పూర్వం ఉదకాలవల్ల జనించిన వారయ్యారు. ఇప్పుడు కూడా ఉదకాలతో కూడుకున్నవారై ఉండండి' అని ఉదకాలతో పిష్టాన్ని(పిండిని) తడపాలి. పిమ్మట **"జనయత్యైత్వా సంయౌమి"** అని, ఉదకాలతో తడపబడిన పిష్టమా! నిను హస్తాంగుళీయ మర్దనంచే సమ్యక్- మిశ్రీకరణం చేయడం అనే వ్యాపారం శుక్ర-శోణిత మిశ్రమం ద్వారా ప్రజోత్పత్తికోసం ఉపయోగపడుతోందని ఈ శ్రుతి వివరిస్తోంది.

జనయత్యై త్వా సంయౌమీత్యాహ ప్రజా ఏవైతేన దాధార| (తై. బ్రా)

అలాగే ప్రాణులకు మాంసం త్వక్కుచే (చర్మంచే) ఆవరింపబడి ఉండడానికి కారణమేమని విచారించి **"త్వచం గృహ్ణీష్వ"** అనే మంత్రంతో పురోడాశానికి నిమ్నోన్నతాలు లేకుండా సమానంగా ఉండేట్లు సంస్కరించాలి. ఆ సంస్కార విశేషంచే **"మాగ్ం స ఏవ తత్త్వచం దధాతి, తస్మాత్త్వచా మాగ్ం సం ఛన్నం"** అనే శ్రుతి లోకంలో ప్రాణుల మాంసం త్వక్కుతో ఆవరింపబడి ఉందని చేప్తోంది.

యజ్ఞంలో ధ్రువపాత్ర అను ఒక సోమరసపాత్ర ఉంది. ఆ పాత్రలో ఆద్యంతాలందు వైశ్వానర శబ్దం గల **"మూర్ధానం దివోఽరతిం"** అను మంత్రంచే సోమరసాన్ని గ్రహించాలని **"ఉభయతో వైశ్వానరో గృహ్యతే"** అను శ్రుతి విధిస్తోంది. దాని సామర్థ్యంచే లోకంలో ప్రాణులకు ఉపవర్తి అయిన, వాగాది ఇంద్రియాలకు మూకత్వ, అంధత్వ, బధిరత్వాది కృతమైన అనర్థాలను నివారిస్తున్నదై దేహానికి సగం కృత్యాన్ని నిర్వహిస్తోంది. అధోవర్తి అయిన ఇంద్రియం మలమూత్ర నిరోధమనే గొప్పదైన అనర్థాన్ని నివారిస్తూ దేహానికి సగం కృత్యాన్ని నిర్వహిస్తోందని **"తస్మాదుభయతః ప్రాణా అధస్తాచ్చో పరిష్టాచ్చ"** అనే శ్రుతి వివరిస్తోంది.

అలాగే ఆ ధ్రువపాత్రను లోగడ మృత్తుచే యజ్ఞశాలయందు నిర్మించబడిన ఖారమనే సంజ్ఞ కలిగిన వేదికయందు ఇతర సోమరస పాత్రలను ఆసాదించినా, దీనిని మాత్రం కేవలం భూమియందే ఆసాదించాలని **"ఉపోప్తేన్యే గ్రహాస్సాద్యన్తే అనుప్రోప్తే ధ్రువః"** అను శ్రుతి విధించింది.

తస్మాదస్థ్నా న్యాః ప్రజాః ప్రతితిష్ఠన్తి మాగ్ం సేనాన్యాః|

ఈ ప్రకారంగా గల గ్రహాసాదన రూపమైన వైలక్షణ్యం లోకంలో గల గవాది రూపమైన ప్రాణులు కఠినమైన డెక్కలతో భూమియందు గమనం చేస్తాయని, మనుష్యులు మాత్రం పాదప్రదేశమందు గల మాంసంతో గమనం చేస్తారని వివరిస్తోంది.

లోకంలో గర్భాలు ఎలా వృద్ధి పొందుతున్నాయన్న సంశయానికి సమాధానంగా శ్రుతి ఇలా చెప్తోంది-

పయో బ్రాహ్మణస్య తేజోవై బ్రాహ్మణః తేజః పయః తేజసైవ తేజః పయ ఆత్మన్ధతే - అధో పయసా వై గర్భావర్ధన్తే గర్భ ఇవ ఖలు వా ఏషయద్దీక్షితః| (తై. సం)

యజ్ఞంలో దీక్షితులు పయోవ్రతాన్ని స్వీకరించాలి. బ్రాహ్మణుడు అధ్యయన, అధ్యాపన ప్రయుక్తమైన తేజస్సు కలవాడు కనుక పయస్సు కూడా తేజస్వరూపమే కనుక తేజోరూపమైన పయస్సును తేజోరూపమైన బ్రాహ్మణ శరీరమందు ఉంచినట్లు అవుతుంది. మరియు **"అధోపయసావై గర్భా వర్ధన్తే"** అను శ్రుతిచే దీక్షితులు గర్భరూపమవడంవల్ల ఇతడు స్వీకరించిన పయస్సుచే లోకంలో గర్భాలు వృద్ధి పొందుతున్నాయి. **"ఆత్మానమేవ తద్వర్ధయతి"** తాను కూడా వృద్ధిని పొందించుకుంటున్నాడు. ఇలాగే మరో ఉదాహరణ ఉంది.

గ్రహాస్ వా అనుప్రజాః పశవః ప్రజాయన్తే|

ఇంతవరకు ఆ యా గ్రహాలందు అనగా సోమరస పాత్రలందు గల సోమాన్ని హోమం చేయగా కలిగిన సృష్టి వైలక్షణ్యాన్ని చెప్పి ఈ అనువాకంలో కేవలం గ్రహపాత్రలను ప్రశంసించడానికి పాత్రలను అనుసరించి ఉత్పన్నమైన సృష్టి వైలక్షణ్యం చెప్పబడుతోంది. యజ్ఞంలో సోమరసాన్ని గ్రహించు సోమరసపాత్రలు అనబడు గ్రహాలగురించి పశువులు (ప్రజలు) పుడుతున్నారు అని సామాన్యంగా చెప్పి, విశేషాకారంగా కూడా చెప్తోంది. **"ఉపాగ్ శ్వన్తర్యామావజావ యశ్శుక్రా మన్థినౌ పురుషాబుతు గ్రహానేకశఫా ఆదిత్య గ్రహం గావః"** అని, ఉపాగ్ంశుపాత్ర, అంతర్యామపాత్ర అనే గ్రహాలలోకి సోమరసాన్ని గ్రహించడమనే క్రియచే లోకంలో మేకలు, గొర్రెలు పుడుతున్నాయి.

శుక్రగ్రహ, మన్థిగ్రహ సంజ్ఞ గల పాత్రలను గ్రహించడంవల్ల లోకంలో మనుష్యులు పుడుతున్నారు. ఋతుగ్రహాలను గ్రహించడంవల్ల ఏకశఫాలు, అశ్వాలు పుడుతున్నాయి. ఆదిత్య సంజ్ఞ కలిగిన పాత్రను గ్రహించినందున గోవులు ఉత్పన్నమవుతున్నాయి.

ఆదిత్య గ్రహో భూయిష్ఠాభిర్ ఋగ్భిర్గృహ్యతే తస్మాద్గావః పశూనామ్ భూయిష్ఠాః|

ఆదిత్యగ్రహ సంజ్ఞ కలిగిన పాత్రను అనేక మంత్రాలతో గ్రహించినందున, ఆ పాత్రగ్రహణం ద్వారా ఉత్పన్నమైన **"గావః పశూనాం భూయిష్ఠాః"** అని లోకంలోని పశువులలో గోవులు గొప్పవిగా చెప్పబడు తున్నాయి. గ్రహ గ్రహణంలో వినియోగింపబడు ఋఙ్మంత్రాలలో **భూయిష్ఠ** అంటే చాలా మంత్రాలని అర్థం. గోవుల విషయంలో భూయిష్ఠాలంటే గొప్పవని అర్థం. గ్రహణ సాధనాలైన ఋక్కులకు, గోవులకు 'భూయిష్ఠ' శబ్దాన్ని వాడడం సముచితమైన సామ్యం మాత్రమే అనాలి.

యత్త్రి రుపాగ్ం శుగ్ం హస్తేన విగృహ్ణాతి తస్మాద్ద్వౌత్రీనజా జనయతి|

ఉపాగ్ంశుగ్రహ సంజ్ఞ కలిగిన పాత్రలోకి మూడు పర్యాయాలు సోమరసాన్ని గ్రహించుటచే లోకంలో మేకలు రెండింటిని లేక మూడింటిని మాత్రమే ఒకే పర్యాయం సంతానాన్ని కంటున్నాయి గాని మూడింటిని

మించి మాత్రం పుట్టించవు అన్నారు. "**అధావయో భూయసీః**" అని అన్తర్యామసంజ్ఞ కలిగిన పాత్రను గ్రహించడంలో "**త్రిరుపాగ్ంశుమ్**" అని ఉపాగ్ంశుపాత్ర గ్రహణంలో త్రిత్వసంఖ్య వినబడిన విధంగా శ్రుతియందు సంఖ్యా విశేషం వినబడనందున దాని ననుసరించి ఉత్పన్నమయ్యే గొర్రెల విషయంలో కూడా పరిమిత సంఖ్య లేకుండా ఎక్కువ సంతానాన్ని జనింప చేస్తున్నాయని అన్తర్యామపాత్ర సామ్యం చెప్పాలి.

పితా వా ఏషయదాగ్రయణః పుత్రః కలశో యదాగ్రయణ ఉపదస్యేత్కల శాద్గృహ్ణీయాద్యథా పితా పుత్రం క్షిత ఉపధావతి తాదృగేవ తత్| (తై. సం)

యజ్ఞంలో ఆగ్రయణపాత్రలోకి సోమరసాన్ని ముందు గ్రహించుటచే ఈ పాత్ర పితృస్థానంగాను, తరువాత ద్రోణకలశ అను పాత్రలోకి సోమాన్ని గ్రహించుటచే దీన్ని పుత్రస్థానంగాను వర్ణించారు. ఈ రెండు పాత్రలలో పితృస్థానమైన ఆగ్రయణపాత్రలోని సోమం ఎండిపోతే పుత్రకలశ అను పాత్రలోంచి పితృ స్థానీయమైన ఆగ్రయణ పాత్రలోకి మళ్ళీ గ్రహించాలిట. దీనిని ఎలా చెప్పారు? లోకంలో క్షీణించిన వృత్తిగల తండ్రి తిరిగి పుత్రుని చెంతకు చేరినట్లు పుత్రస్థానీయమైన ద్రోణకలశ అను పాత్రలోంచి పితృ స్థానీయమైన ఆగ్రయణ పాత్రలోకి సోమాన్ని గ్రహించాలని విధించింది.

యత్కలశ ఉపపస్యే దాగ్రయణాదృహ్ణీయాద్యథా పుత్రః పితరం క్షిత ఉపధావతి తాదృగేవతత్|

అదే విధంగా పుత్రకలశ అను పాత్రలో సోమం ఎండిపోతే, లోకంలో క్షీణించిన వృత్తిగల పుత్రుడు తిరిగి తండ్రి చెంతకు చేరినట్లు పితృస్థానమైన ఆగ్రయణ పాత్రలోంచి మళ్ళీ సోమాన్ని గ్రహించాలిట. దీనివల్ల జీవనవృత్తి క్షీణించినపుడు తండ్రి కుమారుని వద్దకు, కుమారుడు క్షీణవృత్తి కలవాడైతే తండ్రి దగ్గరకు చేరాలని చెప్పినట్లు అయింది.

ఆత్మావా ఏష యజ్ఞస్య యదాగ్రయణో యద్గృహోవా కలశోవోపదస్యే దాగ్రయణాద్గృహ్ణీయాదాత్మాన ఏవాధి యజ్ఞం నిష్కరోతి| (తై. సం)

ఆగ్రయణ పాత్ర యజ్ఞంలోని గ్రహాలలో మధ్యవర్తి అవడంవల్ల యజ్ఞానికి ఆత్మవంటిది. ఇతర గ్రహంలో గాని ద్రోణకలశలో గాని సోమం శోషిస్తే ఆగ్రయణస్థాలి నుండి వాటిలోనికి గ్రహిస్తే ఆత్మకు వీటిని సంధానం చేసినట్లవుతుంది. ఇక్కడ మరో విశేషం గ్రహించాలి. మృణ్మయమైన ఆగ్రయణస్థాలి హోమ సాధనం కాకపోవడం వల్ల దాన్ని నిందిస్తూ దారుమయ పాత్రను వేదం ప్రశంసిస్తోంది.

అవిజ్ఞాతో వా ఏషగృహ్యతే యదాగ్రయణ స్థాల్యా ద్గృహ్ణాతి వాయవ్యేన జుహోతి తస్మాద్గర్భేణాఽవిజ్ఞాతేన బ్రహ్మహా|

దారుమయ పాత్రలోకి సోమరసం గ్రహించేటప్పుడు వినియోగించే మంత్రాల్లో దేవతావాచక పదం ఉన్నట్లుగా మృణ్మయమైన ఆగ్రయణస్థాలిలోకి గ్రహించినపుడు "**యే దేవాదివ్యేకా దశస్థ**" అనే మంత్రంలో దేవతా విశేష వాచక పదం లేనందున ఈ స్థాలి ఆగ్రయణం, ఏ దేవతకు చెందినదీ తెలియనందున దీనితో హోమం చేయక దారుమయ పాత్రతో చేస్తారు. ఆ కారణం వల్ల '**గర్భేణాఽ విజ్ఞాతేన బ్రహ్మహా**' ఎవరి వలన గర్భం ఏర్పడిందో తెలియనందున ఆ గర్భంవల్ల జనించిన శిశువు బ్రహ్మహా- బ్రాహ్మణత్వాన్ని కోల్పోతున్నాడు.

దీనినే భాష్యంలో ఇలా వివరించారు- అవిజ్ఞాత గర్భం దేవతా విశేషం తెలియని ఆగ్రయణ పాత్రతో సమానం. కనుక ఎవరివల్ల గర్భం ఏర్పడిందో తెలియనప్పుడు ఆ గర్భజన్య శిశువు ఏ విధంగా బ్రాహ్మణత్వం నుండి పరిత్యజించతగినవాడో ఆ ప్రకారంగానే ఆగ్రయణస్థాలి కూడా అవభృథ దేశానికి తీసుకువెళ్లకుండా యాగశాలలోనే విడిచి పెడతారు. దీనివల్ల భర్త ప్రవాసం వెళ్ళగా జారిణి వల్ల కలిగిన గర్భస్థ శిశువు జాతి

భ్రష్టుడగునని, కనుక స్త్రీలు జాగ్రత్తగా రక్షించదగినవారనే అభిపాయాన్ని పై శ్రుతి తెలియజేస్తోంది. ఇంతవరకు వైదికమైన కర్మ అనే ధర్మం సృష్టికి ఏ విధంగా కారణమైందో ఏ ఏ అవాంతర కర్మలవల్ల ఏ ఏ వైలక్షణ్యం ఏర్పడిందో సంగ్రహంగా నిరూపించబడింది. ఇక అన్నపానాదులద్వారా మన యొక్క స్థితికి కూడా యజ్ఞమనే ధర్మం కారణమని నిరూపించవలసి ఉంది.

ధర్మం స్థితికి కారణం

బ్రహ్మవాదినో వదన్తి కస్మాత్సత్యాదద్భ్య ఓషధయస్సంభవన్తి .....ఓషధయో మనుష్యాణామన్నం ..... ప్రజాపతిం ప్రజా అనుప్రజాయన్తే| (తై.సం.3వ కాండ)

ఏ కారణంచేత ఉదకాల వలన ఓషధులు ఉత్పన్నమవుతున్నాయి, ఆ ఓషధులు మనుష్యులకు అన్నంగా ఎందుకేర్పడ్డాయి, బ్రహ్మను అనుసరించి ప్రజలెలా ఉత్పన్నమవుతున్నారు అని విచారించిన బ్రహ్మవాదులు **"పరానన్వితి బ్రూయాత్"** అని పరసంజ్ఞకమైన అతిగ్రాహ్య గ్రహాలు గ్రహించడమే కారణమని నిరూపించారు.

యద్గృహ్ణాత్యద్భ్య స్త్వౌషధీభ్యో గృహ్ణామీతి....|

అతిగ్రాహ్య గ్రహాలు (సోమరస విశేషాలు) గ్రహించే కాలంలో 'అప్ సంబంధమైన ఓషధులకోసం నిన్ను గ్రహిస్తున్నాను' అనే అర్థం గల మంత్రానుచ్చరించి గ్రహించడం వల్ల **"తస్మాదద్భ్య ఓషధయస్సంభవన్తి"** అనుశ్రుతిచే అప్ సంబంధమైన ఓషధులు సంభవిస్తున్నాయని, **"యద్గృహ్ణాత్యోషదీభ్యస్త్వాప్రజాభ్యో గృహ్ణామీతి"** మంత్రంచే మరో గ్రహాన్ని గ్రహించడంవల్ల ఆ ఓషధులు మనుష్యులకు అన్నమైనవని **"యద్గృహ్ణాతి ప్రజాభ్యస్తా ప్రజాపతయే గృహ్ణాతి"** అనే మంత్రంచే మరో గ్రహాన్ని గ్రహించినందున **"తస్మాత్ప్రజా పతిం ప్రజా అనుప్రజాయన్తే"** అను దానివల్ల సృష్ట్యాదిలో బ్రహ్మ ఏ విధంగా ప్రాణులను సృజించెనో అదే విధంగా నేటికినీ ప్రజలు సృజించబడుతున్నారనియు వివరించబడింది.

"యథా వై పర్జన్యస్సువర్ షత్యేవం యజ్ఞో యజమానాయ వర్ షతి" అనే దర్శపూర్ణమాస ప్రకరణ శ్రుతి, ఏ విధంగా నల్లని మేఘం సువృష్టిని ఇస్తోందో అదే విధంగా యజ్ఞం సర్వాభీష్టాలను ఇస్తోందని చెప్తోంది.

యథా వై పర్జన్యస్సువృష్టిః వృష్ట్యా ప్రజాభ్యస్సర్వాన్ కామాన్ సంపూరయతి, ఏవమేవ సతస్య సర్వాన్ కామాన్ సంపూరయతి| (కా.చ.ప్ర)

ఏ ప్రకారం పర్జన్యుడు వర్షించి ప్రజలయొక్క సర్వ కోరికలను తీరుస్తున్నాడో ఆ ప్రకారంగా కాఠక చయనమనే క్రతువు సర్వకామాలను తీర్చగలదు అని చెప్తోంది. ప్రజల అన్నపానాదుల కొరతకు వైదికమైన యజ్ఞాన్ని అనుష్ఠించక పోవడం కారణం అని **"యజ్ఞపతి మృషయ ఏనసాహుః"** (తై. సం) అనే మంత్రం స్పష్టంగా చెప్తోంది.

యజ్ఞపతిమృషయ ఏన సాహురిత్యాగ్నీధ్రీయే పంచ వైశ్వకర్మణాని జుహోతి| (ఆ.శ్రౌ.సూ)

యజ్ఞంలో అయిదవ రోజున దక్షిణకాలంలో ఆగ్నీధ్రమంటపమందు గల అగ్నీధ్రయమను అగ్నియందు పై మంత్రాలతో అయిదు వైశ్వకర్మణ హోమాలు చేయాలి. అందులో మొదటి మంత్రం హే విశ్వకర్మన్ - ఓ విశ్వకర్మా! అతీంద్రియ ద్రష్టలైన మహర్షులు ఎప్పుడు లోకంలో **"ప్రజానిర్భక్తా అనుతాప్యమానా"** ప్రజలు అన్నపానాదులు లేక సంతాపిస్తూ ఉంటారో అప్పుడు యజ్ఞానికి యోగ్యతగల యజమానిని నిందిస్తారు. కారణమేమి అంటే-

"వసన్తే వసన్తే జ్యోతిషా యజేత" అను వచనానుసారం జ్యోతిష్టోమానికి ముఖ్యకాలం వసంతం అని, అట్టి వసంత ఋతువులోని చైత్ర, వైశాఖ మాసాలు రెంటిలోనూ **"మధవ్యాస్తోకా పపతౌరరాధ"** అని యజ్ఞాన్ని చేయకపోవడం అనే అపరాధం చేసినందున వారు నిందింపబడతారని వర్ణింపబడింది. దీనివలన యజ్ఞానుష్ఠానంచే అన్నపానాది సమృద్ధి కలుగుతుందని తేలింది. మరో ఉదాహరణ ఆరుణ కేతుక కాఠకమనే క్రతువులో -

పవిత్రవన్తః పరివాజమాసతే పితైషాం ప్రత్నో అభిరక్షతి వ్రతం మహస్సముద్రం వరుణస్తి రోదధే| ధీరా ఇచ్ఛేకుర్ధరుణేష్వారభమ్|

అను శ్రుతి వినియోగింపబడుతుంది. అనగా దశాపవిత్రంతో కూడిన ఋత్విక్కు, యజమానులు అన్నాన్ని ఉద్దేశించి సోమయాగం చేస్తున్నారు అని అర్థం.

ఏషాం సోమయాగానాం పితా పాలకః ప్రత్నః - పురాతన బ్రహ్మ వ్రతం ఏతత్కర్మ అభిరక్షతి|

అంటే ధార్మికులయొక్క వైదిక కర్మలకు పాలకుడైన పురాతనుడైన బ్రహ్మ ఈ కర్మను రక్షిస్తున్నాడు. ఈ కర్మానుష్ఠాన సామర్థ్యంచే పర్జన్యుడు సర్వప్రాణులకు సృష్టినివ్వడానికి ఉద్యుక్తుడ వుతున్నాడు.. అందుచేతనే-

ధీరా ఇత్-బుద్ధిమంత ఏవ, ధరుణేషు-యాగగృహేషు, ఆరభం-వైదిక కర్మణ్యారబ్ధుం,శేకుః-శక్తా బభూవుః|

అని భాష్యం. అనగా బుద్ధిమంతులైన విద్వాంసులు మాత్రమే యాగ గృహాలందు ఇటువంటి వైదిక కర్మలను ఆరంభించడానికి సమర్థు లౌతున్నారు. అనగా బుద్ధిమంతులైన విద్వాంసులు లోకంలో సర్వప్రాణులకు అన్నపానాది సమృద్ధికోసం యాగాది వైదిక కర్మానుష్ఠానం చెయ్యాలని చెప్పినట్లయింది. ఈ విషయంలో మరో ఉదాహరణ-

దేవావై సత్రమాసత తేషాం దిశో దస్యస్ త ఏతామార్ద్రాం పంక్తిమపశ్య న్నాశ్రావయేతి పురోవాత మజనయన్నస్తు శ్రౌషదిత్యభ్రగ్ం సమ ప్లావయస్ యజేతి విద్యుత మజనయస్ యే యజామహ ఇతి ప్రావర్ ష యన్నభ్యస్తనయస్ వషట్కారేణ తతోవై ... తేభ్యో దిశః ప్రాప్యాయన్త| (తై. సం)

దేవతలు చేసే సత్రయాగంలో ఒకానొక వైకల్యంచే అనావృష్టి సంభవించింది. దానిచేత అన్ని దిక్కులలో గల సశ్యములు శుష్కించి క్షీణించాయి. ఈ దోషాన్ని పరిహరించడానికి వర్షాలను పొందడానికి మంత్ర పంచకాన్ని, అనగా- (1)ఆశ్రావయ (2)అస్తుశ్రౌషట్ (3)యజ (4)యే యజామహే (5)వషట్ అనే వాటిని శాస్త్రంచే తెలుసుకున్నారు. అందులో **'ఆశ్రావయ'** అనే మంత్రోచ్చారణచే తూర్పుగాలిని పుట్టించారు. **'అస్తుశ్రౌషట్'** అను మంత్రోచ్చారణచే మేఘాన్ని విస్తరింపచేసారు. **'యజ'** అను మంత్రోచ్చారణచే మెరుపును పుట్టించారు. **'యే యజామహే'** అను మంత్రోచ్చారణచే ఉత్కటంగా (ఎక్కువగా) వర్షింప చేసారు. **'వషట్కారం'**చే ఉరుములను ఉరిమించేరు.

పిమ్మట నానాదిగ్గతమైన (అన్నిదిక్కులలో గల) సస్యములు వృద్ధిని పొందాయి. దీనివలన సువృష్టికి సాధనమైన మంత్రాలతో కూడిన వైదికకర్మలే సుభిక్షానికి కారణాలని తేలింది. అంటే వైదికమైన కర్మ అనే ధర్మమే సృష్టికి, సృజించబడిన ప్రాణుల అన్నపానాది రూపమైన స్థితికి కారణం. యాగానుష్ఠానం చేసేవారు రంభ, ఊర్వశి కోసం చేస్తున్నారని లోకప్రవాద ఉంది. కానీ అది నిజం కాదు. ఒకవేళ చేసే ఆయనకి అర్థం తెలియక పోయినా, చేయించే ఋత్విక్కులకు తెలియకపోయినా కూడా ఆ మంత్రాల్లో ఉండే అర్థం చాలా

విశాల భావంతో ఉంది. దేశమంతకూ, సర్వప్రాణులకూ క్షేమం కలగాలి అని అందులో ఉన్న అర్థం. యజ్ఞంలో వినియోగించబడే మంత్రార్థాలను పరిశీలిస్తే ఈ సత్యం తెలియగలదు. ఉదాహరణ -

అశనయా పిపాసేహ వా ఉగ్రం వచః| యాతే అగ్నేఽయాశయా రజాశయా హరాశయా తనూర్వర్షిష్ఠా గహ్వరేష్ఠోగ్రం వచో అపావధీం త్వేషం వచో అపావధీగ్ స్వాహా| (తై. సం)

ఇత్యాది మూడు మంత్రాలు యజ్ఞంలో ఉపసత్తులనే యాగాలందు వినియోగింపబడుతున్నాయి. స్రువంచే ఆజ్యస్థాలినుండి ఆజ్యగ్రహణం చేసి **"అయాశయా"** ఇత్యాది మూడు మంత్రాలతో మూడు రోజులు మూడు ఉపసత్తులనే యాగాలందు హోమం చేయాలి. ఈ మంత్రార్థం ఇలా వుంది. ఓ అగ్నే! లోహంచేత, రజతంచేత, సువర్ణంచేత నిర్మింపబడిన నీ శరీరాలచే ఉగ్రవాక్కులను, త్వేషవాక్కులను నశింపచేయు గాక! ఉగ్రవాక్కులు అనగా అన్నపానాదులు లేక అన్నార్థులైన, పిపాసార్థులైన ప్రజలచే పలుకబడు వాక్కులు. గోవధ, విద్వద్బ్రాహ్మణవధ వంటి పాపాల్ని చేసేనని పాపాత్ములచే పలుకబడు వాక్కులు త్వేషవాక్కులు. ఈ రెండు విధాలైన వాక్కులను నశింపచేసినవాడ వయ్యావు.

పాపాత్ములు అట్టి వాక్యాలను చెప్తారా అనే సంశయం కలగవచ్చును. పాపాలు నశించడానికి పాపకృత్యాలను ప్రకటించుకోవడం ప్రాయశ్చిత్తంగా ఆపస్తంబాది మహర్షులు ఈ విధంగా ప్రతిపాదించారు.

ఖట్వాంగా కపాలపాణిర్వా ద్వాదశ సంవత్సరాన్ బ్రహ్మచారీ గ్రామం ప్రవిశేత్కర్మాచక్షాణః| (గౌ.ధ.సూ.4-4)

ఖట్వాంగమనేది పాశుపతమందు ప్రసిద్ధం. బ్రహ్మహత్య చేసిన వ్యక్తి ఖట్వంగాన్ని దక్షిణహస్తమందు, కపాలాన్ని అనగా తనచే హత్యచేయబడిన బ్రాహ్మణశిరస్సును వామహస్తమందు ధరించి **"కర్మాచక్షాణః"** తను చేసిన పాపకర్మను ప్రకటించుకుంటూ భిక్షాటనార్థం గ్రామంలో ప్రవేశించాలని పరాశరస్మృతిలో చెప్పబడింది. తను చేసిన పాపాన్ని ప్రకటించుకుంటూ భిక్షాచరణార్థం గృహద్వారంలో నిలబడాలని, బ్రహ్మఘాతకుడు గోకులాల్లోను, గోశాలల్లోను, గ్రామనగరాల్లోను, తపోవనాల్లోను, తీర్థాలలోను వగైరాలలో తన పాపాన్ని ప్రకటించుకుని పుణ్యరూపమైన సముద్రంలో స్నానం చేస్తే బ్రహ్మహత్యనుండి విముక్తుడౌతాడు. దీనివలన పాపాలను ప్రకటించడమూ పాపవిముక్తికి కారణమని ఆపస్తంబాది సూత్రకారులు చెప్పినట్లైంది. లోకంలో కూడా **'చేసిన పాపం చెప్తే పోతుంది'** అనడం సార్వజనీనం. కానీ సామాన్యంగా పాపాలను ప్రకటించుకోరు. పుణ్యకార్యాలను మాత్రం స్వయంగా చెప్పుకోవడం, పత్రికల ద్వారా ప్రకటించడం వంటివి చేస్తారు. కానీ పుణ్య కార్యాల గురించి చెప్పుకుంటే పుణ్యం పోతుంది. పుణ్యం పోకూడదు కనుక పుణ్యకార్యాలను చెప్పకూడదు. పాపం పోవాలి కనుక పాపకార్యాలను చెప్పాలి.

"ధర్మః క్షరతి కీర్తనాత్"
ప్రాయశ్చిత్తేన నశ్యన్తి పాపాని సుమహాన్త్యపి (స్మృతి)

అని శాస్త్రం. ప్రకటిస్తే కానీ పాపాలు నశించవు. పాపాలు నశిస్తే కానీ పరంపరగా ఆత్మతత్వాన్ని తెలుసు కోవడానికి అధికారి కాజాలడు. అధికార సంపాదనకోసం ప్రకటిస్తే లోకంలో నిందితుడవుతాడు. పాపమాచరించిన పిమ్మట ఇట్టి విషమ పరిస్థితి ఏర్పడుతుంది. కనుక పాపాచరణానికి ముందే సువిమర్శ చేసుకుని పాపాలకు దూరుడు కావాలని నారాయణోపనిషత్తులో **"యథావృక్షస్య"** మొదలైన మంత్రాలు ఉపదేశిస్తున్నాయి.

యథావృక్షస్య సంపుష్పి తస్య దూరాద్గంధోవాతి ఏవం పుణ్యస్య కర్మణో దూరాద్గంధోవాతి| (తై.ఆ. నా.ఉ.)

లోకంలో ఉద్యానాది వనమందున్న సంపెంగ వంటి వృక్షాల సుగంధం వాయువుచే దూరంగా ఎలా వీస్తుందో జ్యోతిష్టోమాది పుణ్యకర్మల కీర్తి కూడా ఆ ప్రకారంగా మనుష్య లోకాన్నతిక్రమించి దూరంలో ఉన్న స్వర్గలోకాన్ని ఆక్రమించగలదు. కనుక తప్పక పుణ్యం అనుష్ఠించాలి. ఇక పాపవిషయం లోకంలో గర్తమందుంచబడిన అస్థిధారను (పెద్ద గోతిని తీసి అంచుపైకి వచ్చేలా అందులో ఖడ్గాన్ని) ఉంచి దానిమీద ఆనుకొని గోతిని దాటడంలో ఉండే కష్టంతో పోల్చబడింది. పాదాలతో దృఢంగా స్పృశిస్తే పాదచ్ఛేదం అవుతుంది. దృఢంగా స్పృశించకుండా గోతిని దాటాలని ప్రయత్నిస్తే ఆ గోతిలో పడిపోతాం. పడిపోగలం. ఈ ప్రకారం ఉభయ విధాలుగాను దుఃఖమే సంభవిస్తోందని పురుషుడు చింతించినట్లు పాపాన్ని ఆచరించి ప్రకటిస్తే పాపంనుండి విముక్తుడైనా లోకంలో నిందితుడవుతాడు. ప్రకటించకపోతే నరకలోక ప్రాప్తి తప్పదు. కనుక ఉభయ విధాలుగాను దుఃఖమే పర్యవసన్నమవుతోంది. కనుక పాపం ఆచరించరాదని ఉపదేశిస్తోంది ఈ మంత్రం. అంటే మా లోకంలో ఎవ్వరికీ పాపాచరణయందు ప్రవృత్తి కలగకుండా ఉండాలి అని, అలా చేయమని కోరుతున్నాడు. ప్రకృత సందర్భంలో అన్నపానాదుల కొరతచే పీడింపబడుతున్నానని చెప్తున్నత్వేషవాక్కులను నశింపచేయమని చెప్తున్నాడు. అంటే ఆ వాక్యాలు వినబడనంతగా దూరంగా ఇంట్లో కూర్చుంటాను అని కాదు. అలాంటి వాక్యాలు వినవలసిన పరిస్థితి లేకుండా చేయమని కోరే అర్థం గల మంత్రాలు యజ్ఞమందు వినియోగింప బడడం వల్ల యజ్ఞం అనే ధర్మంవలన అన్నపానాదులు లేకపోవడమనే దుర్భిక్షం ఏర్పడదని కూడా చెప్పినట్లయింది. ఇంత విశాల భావంతో ఆచరించే వైదికకర్మ అనే ధర్మం సృష్టిస్థిత్యాదులకు కారణం. దేవలోక వాసులకు కారణం. కేవలం భూలోకవాసులైన ఖండఖండాంతరాలలోని ప్రాణుల స్థితికి కారణ మవడమే కాక దేవలోకంలో గల దేవతలకు కూడా భూలోకంలో అనుష్ఠింపబడు వైదిక కర్మలే కారణమని నిరూపించబడింది.

తేఽముష్మిన్ లోకే వ్యక్షుధ్యన్| తేఽబ్రువన్| అముతః ప్రధానం వా ఉపజజీవిమేతి| తే సప్తహోతారం యజ్ఞం విధాయా యాస్యమ్| ఆంగిరసం ప్రాహిణ్వన్| ఏతేనాముత్ర కల్పయేతి| (తై. బ్రా.)

ఒకానొకప్పుడు దేవతలు ఇంద్రుని సహాయంతో రాక్షసులను జయించారు గాని దేవలోకంలోని వారు ఆకలిచే పీడింపబడుతున్నారట. దానికి నివారణోపాయమేమి అని దేవతలందరు సమావేశమై విచారించారు. **'అదశ్శబ్దం'** ద్యులోకానికి పరోక్షమందున్న భూలోకాన్ని చెప్తోంది. అనగా **"భూలోకాత్ ప్రదీయమానం హవిరాశ్రిత్య వయం జీవేమ"** (విద్యారణ్య భాష్యం) భూలోకంలో యజ్ఞాలలో మంత్రాలతో ఇవ్వబడిన హవిస్సుని ఆశ్రయించుకుని జీవించేవారమని ఆ దేవతలు నిశ్చయించారు.

దేవలోకంలో దేవతలకు కర్మాధికారం లేదని శాస్త్రం. అందుకే దేవతలు అంగిరసుని కుమారుడైన ఆయాస్యుని సప్తహోత్రనామక యజ్ఞం చేసి దేవతలను తృప్తి పరచవలసిందిగా భూలోకానికి పంపించారు. అంటే భూలోకంలో అనుష్ఠింపబడ్డ యజ్ఞాలందు మంత్రాలతో ఇవ్వబడ్డ హవిస్సుని ఆశ్రయించుకుని దేవతలు జీవిస్తారని తాత్పర్యం. ఇలాగే దర్శపూర్ణమాస ప్రకరణంలో **'ఇడాను'**మంత్రణమను క్రియలో వినియోగింపబడే **"సామే సత్యాశీరస్య యజ్ఞస్య భూయాదరేదతా మనసా తచ్ఛకేయం యజ్ఞో దివగ్ం రోహతు యజ్ఞో దివం గచ్ఛతు"** (తై.సం) అనే మంత్రంచే ఈ హవిస్సు దేవలోక భోజనశాలలో నిరీక్షిస్తున్న దేవతలను పొందుగాక! అని అర్థం.

ఈ ప్రకారంగా విధివిధానంగా అనుష్ఠింపబడిన యజ్ఞంచే ఇంద్రుడు సంతుష్టిగలవాడై మనకు ఆ యజ్ఞాలను అనుష్ఠించడానికి యోగ్యమైన చక్షురాది ఇంద్రియపాటవాన్నిచ్చి, దానిచే మరిన్ని యజ్ఞాలను అనుష్ఠించు వాళ్ళముగా మనలను అనుగ్రహించు గాక! మాకు ఆ యజ్ఞఫలాలు సిద్ధించు గాక! అని యజ్ఞకర్త 'ఇడాను మంత్రణ' మంత్రంచే ప్రార్థిస్తాడు.

దీని తాత్పర్యం- దేవతలకు ద్యులోకంలో పాకశాలలు, తత్సామగ్రి మున్నగునవి లేవు గానీ భోజనశాలలు మాత్రమే ఉన్నాయని, భూలోకంలో అనుష్ఠింపబడిన యజ్ఞహవిస్సుల నాశ్రయించుకుని వారు జీవిస్తారని స్పష్టం. అనగా భూలోకంలో మనచే అనుష్ఠింపబడిన యజ్ఞమనే ధర్మం ఇక్కడ మనుష్యాదులకు అన్నపానాది సమృద్ధిని కలుగచేయడమే గాక దేవలోకమందు గల దేవతల సమృద్ధికి కూడా ఈ ధర్మమే కారణమని చెప్పబడింది. కేవలం మనుష్యులకు, దేవతలకే కాక, పితృలోకంలో గల పితృదేవతలకు కూడా దేవయజ్ఞాలలో పితృదేవతలను ఉద్దేశించి ఈయబడిన హవిస్సులు తృప్తి నిస్తాయి. పితృదేవతలు దేవపితరులని, మనుష్యపితరులని రెండు విధాలుగా ఉన్నారని వేదంలో ఈ వాక్యాల వంటి వాటిచే చెప్పబడుతోంది.

యేవై యజ్వానః| తే పితరో బర్హిషదః| తానేవ తఽద్యజతి| యేవా అయజ్వానో గృహమేధినః తేపితరోగ్నిష్వాత్తాః| తానేవ తద్యజతి| (తై.బ్రా)

యాగానుష్ఠానం చేసి పితృత్వాన్ని పొందినవారు **'బర్హిషదః పితరులు'.** దేవయజ్ఞంలో భాగం ఉండి యాగానుష్ఠానం చేయకుండా పితృత్వాన్ని పొందినవారు '**అగ్నిష్వాత్తాది పితరులు'గా** వ్యవహరింప బడతారు. వీరికి హవిస్సు నందించే అగ్నులు **'హవ్యవాహనః'**, **'కవ్యవాహనః'** అను పేర్లతో ఉన్నట్లు, **"అగ్నిం కవ్యవాహనం యజతి| య ఏవ పితృణామగ్నిః"** ఇత్యాది శ్రుతులు చెప్తున్నాయి. కవ్యవాహన అగ్నితో నిర్వహించబడే పితృయజ్ఞం పంచమహాయజ్ఞాలలో ఒకటిగా పితృయజ్ఞ ప్రకరణంలో వివరించ బడింది.

ప్రస్తుతానికి-భూలోకంలో మనచే అనుష్ఠించబడు యజ్ఞాలు మనుష్య, దేవ, పితరులకు ముగ్గురికీ తృప్తి నీయగలవని వివరించడమైంది. అందుచేతనే మనువు పితృదేవతలకు, మనుష్యులకు అందరికీ వేదం సనాతనం అని చెప్పారు.

పితృదేవమనుష్యాణాం వేదశ్చక్షుస్సనాతనమ్| అవశ్యం చాప్రమేయం చ వేదశాస్త్ర మితి స్థితిః| (మ.స్మృ.)

ఇక్కడ **సనాతనం** అనగా **'సదాతనం'**. భూత, భవిష్యత్ వర్తమాన కాలాలన్నిట్లోనూ చక్షుస్థానీయం. వేదశాస్త్ర వాఙ్మయము ప్రమాణాంతరాలకు శక్యం కానిది, ప్రమేయం కానిదని చెప్పబడింది. వేద శాస్త్రాలచే ప్రతిపాదించబడినదే ధర్మం. ఆ ధర్మం కర్మస్వరూపం. అట్టి కర్మస్వరూపమైన ధర్మాన్ని ఆచరిస్తే దాని నుంచి సృష్టి ఏర్పడుతుంది. అటువంటి వేదవిహితమైన, కర్మ స్వరూపమైన ధర్మం జగత్తు యొక్క సృష్టి స్థితులకు కారణమని చెప్పడమైంది. అధర్మంవల్ల దుఃఖం అంటే, లోకాంతరంలో అనుభవించే నరకం ఒక్కటే కాదు ఈ లోకంలో శారీరక వ్యాధుల రూపంలో ఫలం కూడా పాపాలు చేస్తే వచ్చేవే. వ్యక్తిగతంగా చేస్తే వచ్చే ఫలాలివి. సామాజికంగా సంఘం చేస్తే కనుక దేశ, నగర గ్రామాదులన్నింటికీ ఉత్పాతాలు సంభవించి ఒకే కాలంలో ఒకే వ్యాధులు వంటివి వచ్చి అందరినీ ధ్వంసం చేస్తుంది ఈ అధర్మం. అందుచేత ధర్మాన్ని ఆచరించండి. అధర్మాన్ని వదిలి పెట్టండి అని చెప్పడం తాత్పర్యం.

శంకా సమాధానాలు

పై ప్రసంగాన్ని అనుసరించి కొంతమంది విమర్శకులు శంకలు చెప్తారు. వేదం లోకాన్ని ఉదాహరణగా ఇచ్చి యజ్ఞంలో ఉపాగ్ంసు అనే సోమరస పాత్ర మూడు పర్యాయాలు హస్తంతో గ్రహించబడినందున ప్రాణులలో పురుషుడు, ఏనుగు, కోతి ఈ మూడూ తమ హస్తంతో అన్నం తినేవని చెప్పింది గదా! అంటే లోకాన్ననుసరించి వేదం బయల్దేరిందా! అని శంకిస్తారు.

దీనికి సమాధానం-వేదవాఙ్మయం మనం ఉచ్చరిస్తున్న లౌకికవాఙ్మయం వంటిది కాదు. **"వాచమర్థోను ధావతి"** అను సూక్తి ప్రకారం-

స భూరితి వ్యాహరత్| స భూమిమసృజత| సభువ ఇతి వ్యాహరత్| సోఽన్తరిక్ష మసృజత| స సువరితి వ్యాహరత్| సదివ మసృజత| (తై. బ్రా)

అని బ్రహ్మ **భూః భువః సువః** అని ఉచ్చరించి పృథివి, అంతరిక్ష దేవలోకాలను సృజించెనట. దీని ప్రకారం కూడా వేదంలో చెప్పినదానిని అనుసరించి లోకం ఉండవచ్చునని చెప్పవచ్చును. సృష్టి జరిగిన తర్వాత వేదం దానిని చెప్పనక్కర్లేదు. **"వేదశబ్దేభ్య ఏవాదౌ నిర్మమే సమహేశ్వరః"** అని కూడా వచనం ఉంది. కాబట్టి వేదం అనాది, సృష్టి అనాది. ప్రళయం అయిన దానికే సృష్టి. సృజించబడిన దానికే ప్రళయం. కనుక సృష్టి-ప్రళయాలు అవినాభూతాలు. ఈ విషయంలో మీమాంసకులు **"న కదాచిదనీదృశం జగత్"** జగత్తు లేని కాలమే లేదని లోకంలో పగటి వెనుక రాత్రి, రాత్రి వెనుక పగలు ఉన్నట్లుగానే ఈ జగత్తు కూడా ప్రళయం వెనుక సృష్టి, సృష్టికి వెనుక ప్రళయంగా ఉండడంచే జగత్తు కూడా నిత్యమని అంగీకరించారు.

వేదంలో అవతార విశేషాలు

పురాణాలలో రామకృష్ణాది అవతారాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఈ అవతార ఘట్టాలు కూడా వేద మూలకాలే అనడానికి వేదంలో అక్కడక్కడ కర్మ ప్రకరణాలలో ఆ యా అవతార భాగాలు, వరాహావతారము, కూర్మావతారము, వామనావతారాలకు సంబంధించిన భాగాలు కనబడుతున్నాయి. ఆ యా కాలాలలో ఆ యా అవతారాలు ఉద్భవించినట్లు ఉంది.

దీనినిబట్టి ఆ యా అవతారాలు ఆ యా యుగాల్లో అవతరించిన పిమ్మట ఆ వేదభాగాలు ఏర్పడి ఉండాలని, కావున వేదంలోని ఆ భాగానికి నిత్యత్వం తటస్థించదని శంకించగలరు. కానీ రామకృష్ణాది అవతారాలు నిత్యములని మీమాంసా సిద్ధాంతం. కావున ఈ సందర్భంలో అవతారాలను గురించి వివరించ వలసి ఉంది. వేదంలో ఎక్కడెక్కడ ఏ అవతార విషయం చెప్పబడిందో చూద్దాం.

యో రసః సోఽపామ్| అన్తరతః కూర్మం భూతగ్ం సర్వన్తమ్| తమబ్రవీత్| మమవైత్వన్మాగ్ం సా| సమభూత్ నేత్యబ్రవీత్| పూర్వమే వాహమిహా సమితి| (తై. బ్రా)

నీటి మధ్యలో లోపల కూర్మాకారంగా ఉండి అక్కడ సంచరిస్తున్న పురుషుని గూర్చి ప్రజాపతి ఇలా పలికాడు. 'ఓ కూర్మమా! నువ్వు నా తాలూకు త్వక్ యొక్క (మాంసంయొక్క) రసంవల్ల ఉత్పన్న మయ్యావు' అని. పిమ్మట కూర్మావతారం ప్రజాపతిని గురించి ఇలా సమాధానం పలికెను. 'నీ మాంసంవల్ల నేను ఉత్పన్న మయ్యాను అని నీవన్న మాట యుక్తం కాదు. కూర్మాకారం గల శరీరం మాత్రమే నీ మాంసం వల్ల ఉత్పన్నమైంది. నేను అనబడే చైతన్యం నిత్యము, సర్వగతము అయినందున పూర్వమే ఈ స్థానంలో ఉన్నాను' అని. **"యస్మాత్ పూర్వమేవ ఆసమ్"** అనడం ద్వారా, ఏ కారణం వల్ల పూర్వమందే ఉన్నాను అని చెప్పబడిందో ఆ కారణం వల్లనే పరమాత్మకు **'పురుష'** అనే పేరు వచ్చింది. ఈ ప్రకారం కూర్మావతార ప్రసంగం ఆరుణకేతుకమనే ప్రకరణంలో చెప్పబడింది.

వరాహావతారం

ఆపోవా ఇదమగ్రే సలిలమాసీత్| తేనప్రజాపతి రశ్రామ్యత్| కథమిదగ్గ్ స్యాదితి| సోఽపశ్యత్పుష్కర పర్ణం తిష్ఠత్| సోఽమన్య| అస్తివైతత్| యస్మిన్నిదమధితిష్ఠతీతి| సవరాహో రూపం కృత్వోపన్యమజ్జత్ | స పృథివీమధ ఆర్చత్| (తై. బ్రా. 1-1-3)

ఇలాగే **"ఆపోవా ఇదమగ్రే సలిలమాసీత్"** (తై.సం.7-1-3) వంటి గ్రంథప్రకారం సృష్టికి పూర్వమంతా జలమయమై ఉండెను. ఇలా ఉంటే సృష్టి ఎలా కాగలదని ప్రజాపతి పర్యాలోచనాత్మకమైన తపస్సు చేసి,

పిమ్మట ఆ నీటిలో మునిగి ఉన్న తామరాకును చూసి **"అస్తివైతత్ యస్మిన్కిమిదమధితిష్ఠతీతి"** అని ఈ పుష్కరపర్ణానికి (తామరాకుకి) ఆధారమేది ఉందో అది లోపల ఉంది అని నిర్ధారణ చేసుకుని, అతడు వరాహ స్వరూపాన్ని దాల్చి ఆ నీటిలో మునిగి ఆ భూమిని పొందెను. పిమ్మట ఆ భూమిని ఉద్ధరించి పైకి తీసుకువచ్చి ఆ పుష్కరపర్ణంపై విస్తరింపచేసెను. **"పృథు-విస్తారే"** అను ధాతువువల్ల భూమి విస్తరించ బడిన కారణంవల్ల **'పృథివి'** అని పేరు పొందింది. ఈ ప్రకారం తై.బ్రాహ్మణంలో అగ్న్యాధాన ప్రకరణంలోనూ, తై.సంహితలో **'అహీనక్రతు'** ప్రకరణంలో కూడా వరాహావతారం ప్రస్తావించబడింది.

వామనావతారం

విచక్రమే పృథివీమేష ఏతాం| క్షేత్రాయ విష్ణుర్మనుషేద శస్యస్| ధ్రువాసో అస్యకీరయోజనాసః | ఉరుక్షితగ్గం సుజనిమాచకార| (తై. బ్రా.2-4-3)

త్రీణిపదావిచక్రమే|విష్ణుర్గోపా అదాభ్యః| (తై.బ్రా)

ఇదం విష్ణుర్విచక్రమే త్రేధా నిదధేపదమ్ సమూఢమస్య పాగ్ం సురే| (తై.సం)

ఇత్యాది గ్రంథమంతా విష్ణుమూర్తి ప్రాణుల నివాసానికి స్థానమును ఈయదలచినవాడై పృథివ్యన్తరిక్ష ద్యులోకాలను మూడింటినీ మూడు పాదాలతో ఆక్రమించెనని, దానివల్ల జనులు ధ్రువమైన, స్థిరమైన నివాసం కలవారై విష్ణుమూర్తిని కీర్తించారని వర్ణిస్తూ విష్ణుమూర్తి వామనావతారాన్ని గురించి చెప్పింది. ఇలాగే ఇతర ఉపనిషత్తులలో నృసింహావతారం శ్రీరామచరితం మొదలైనవి వర్ణింపబడ్డాయి. ఈ ప్రకారం పరమేశ్వరుడు కాలప్రవాహంలో ఆ యా యుగ సమయాల్లో దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం ఆ యా అవతారాలను దాల్చినట్లు శ్రుతి, స్మృతి, పురాణ, ఇతిహాసాదులందు ప్రతిపాదింప బడినందువల్లనే ఒకానొక విష్ణుదేవతాకయాగంలో యాజ్యాపురోఽనువాక్యాలుగా వినియోగించబడే **"భవామిత్రోనశేవ్యః"** మొదలైన మంత్రాలలోను **"యః పూర్వ్యాయ వేధసే నవీయసే"** మంత్రభాష్యంలో కూడా జగదుత్పత్తికంటే ముందుగానే ఉన్నటువంటి, సృష్టికర్తగా ఉన్నటువంటి, ఎప్పటికప్పుడు రామకృష్ణాద్యవతారాలను దాల్చి అత్యంత నూతనుడైన విష్ణుమూర్తిగా వ్యాఖ్యానించారు.

దీనివల్ల నిత్య,శుద్ధ,బుద్ధ స్వభావమైన పరమాత్మ ఆ యా అవతారాలను దాల్చి నిత్య నూతనుడుగా పేర్కొనబడుచున్నందు వల్ల ఆ యా అవతారాలు నిత్యములే, ఆ అవతార ఘట్టాలను ప్రతిపాదిస్తున్న వేదాలూ నిత్యములే అని గ్రహించవలెను.

అవతార నిరూపణ ద్వారా వేదాలకు అనిత్యత్వ పరిహారం

ఒక్కో సృష్టిలో ఏ ఏ యుగాలలో ఆ యా అవతారాలు బయలు దేరేవో తిరిగి మరో సృష్టిలో కూడా ఆ యా యుగాలందే అవే అవతారాలు బయలుదేరగలవుట. ఈ ప్రకారంగానే మనువు, విశ్వామిత్రుడు, జమదగ్ని మున్నగు మహర్షులు కూడా అధికారికులే అని, లోకంలో ఒక అధికారి స్థానంలో మరో అధికారి వచ్చినపుడు ఆ యా స్థానాలకు చెందిన వ్యక్తులు అనిత్యాలయినా ఆ అధికారిత్వం నిత్యం కనుక ఆ అధికారిత్వ ఉపాధితో పిలవబడుతున్నవారు నిత్యులనే చెప్పాలి, అని అన్నారు.

యథర్తా వృతులింగాని నానారూపాణి పర్యయే| దృశ్యన్తే తాని తాన్యేవ తథా భావా యుగాదిషు|

యజ్ఞేఽధ్వర్యురివహ్యస్తి మనుర్మన్వన్తరే సదా|

మొదలైన గ్రంథంచే ఆ యా ఋతులింగములు, ఆ యా ఋతువులు ప్రాదుర్భావ మైనప్పుడు ఏ విధంగా ఆ ఋతువుల ధర్మాలు వ్యక్తమవుతున్నాయో, యజ్ఞంలో ఒక అధ్వర్యుని వెంబడి మరో

అధ్వర్యుడు ఉన్నట్లుగానే మరో మన్వంతరంలో పూర్వపు మనువుతో సమానమైన మనువు పుట్టగలడు. అందుచే రామకృష్ణాద్యవతారాలు, మను, విశ్వామిత్రాదులు అధికారిక పురుషుడవడంవల్ల వారు నిత్యులని అంగీకరించారు. కనుక వారిని గురించి చెప్పిన వేదభాగాలు అనిత్యాలని శంకించకూడదు అన్నారు. వేదం భూత-భవిష్యత్-వర్తమానాలనే త్రైకాలిక వృత్తాంతాలను చెప్పగలదని, లౌకిక వాఙ్మయం వంటిది కాదని మీమాంసకులు వృత్తాంతాన్ని వర్ణించడంలో ఉపాఖ్యానాలకు తాత్పర్యం కాదు. ధర్మాన్ని ప్రశంసించడం లోను, అధర్మాన్ని నిందించడంలోనే తాత్పర్యం కలవని చెప్పబడింది. **"యద్విధేయమ్ తత్ స్తుత్యమ్"** ఏది వేదంచే విధించబడుతుందో అది స్తుతించదగినదన్న న్యాయంచే ధర్మస్తుతి-అధర్మనింద ప్రధానంగా గలవని మీమాంసా న్యాయప్రకాశ వివరిస్తోంది.

స్వాధ్యాయోఽధ్యేతవ్య| (మీ.న్యా.ప్ర)

ఇత్యధ్యయన విధివశాత్ అర్థవాదానాం ప్రాశస్త్య జ్ఞానే లక్షణా| తాదృశ ప్రాశస్త్య జ్ఞానస్య శబ్ద భావనాయాం ఇతి కర్తవ్యతాత్వేన అన్వయః| (మీ.న్యా.ప్ర)

అనగా వేదాధ్యయనం చేయవలసిందని అధ్యయనవిధి విధించడమంటే- **విధి, మంత్ర, నామధేయ, నిషేధార్థ వాదాత్మకమైన పంచభాగాలతో కూడినదే వేదం కనుక ఈ అయిదు భాగాలను అధ్యయనం చేయవలసిందనే విధియొక్క తాత్పర్యమై ఉంది.** కనుక విధియొక్క బలంచే ఏ భాగానికి కూడా వైయర్థ్యం (వ్యర్థత, ప్రయోజనం లేకపోవుట) చెప్పడానికి అవకాశం లేనందువల్ల అర్థవాద భాగంలో ముఖ్యార్థాన్ని అంగీకరించి ఇతివృత్తాన్ని మాత్రం స్వీకరిస్తే ప్రయోజనం లేదు కనుక, ఒకవేళ వైయర్థ్యం తటస్థిస్తే దాని (వైయర్థ్యపు) పరిహారం కోసం బోధయందు తాత్పర్య అనుపపత్తి లక్షణాన్ని అంగీకరించారు. అంటే, చేయవలసిన కర్మలందు (విధియందు) లగ్నం చేయడానికి దాని ప్రాశస్త్యాన్ని వర్ణించడం, తద్వారా విధియందు శీఘ్ర ప్రవృత్తిని కల్గించి ఉత్సాహపరచడం ప్రధానోద్దేశం.

లోకంలో కూడా ప్రవర్తించదగిన దానియందు శీఘ్ర ప్రవృత్తి కలగడానికి ప్రరోచన (ప్రోత్సాహం) అవసరం, ఉపయోగం అవడం మనం చూస్తున్నదే. ఉదాహరణకు పిల్లలకు గోపయస్సు (గోవుపాలు) కావల్సిన ఒక వ్యక్తి గోవుని కొనడానికి సంతకి వెళ్ళి గోవును చూసేక గోవు మంచి చెడ్డలను గురించి అనేక సంశయాలు మొదలవడంతో గోవు కొనాలనే ప్రయత్నంలో కొంత మందప్రవృత్తి (పునరాలోచన) కలవాడగును. మరుక్షణం ఇంకో మధ్యవర్తి- **"గౌః క్రేతవ్యా| బహుక్షీరా| స్త్యపత్యా అనష్టప్రజా"** అంటే "గోవు కొనదగిందే! చాలా పాలను ఇచ్చేది, చిరకాలం పశుసంపత్తి అవిచ్ఛిన్నంగా ఉండేటట్లు స్త్రీ సంతానాన్ని ప్రసవించే స్వభావం కలది, నష్టసంతానం లేనిది" అని ప్రశంసించడంతో మళ్ళీ గోవుని కొనడంలో శీఘ్రప్రవృత్తి కలగడం మనందరం ఒప్పుకునేదేగా!

అదేవిధంగా తప్పకుండా చేయవలసిన విధేయాలయందు శీఘ్ర ప్రవృత్తిని; చేయకుండా ఉండవలసిన నిషేధ్యాలయందు నివృత్తిని కలిగించడానికై ఉపాఖ్యానాలు బయలుదేరేయని, వాటిని వివరించడానికి చెప్పే వృత్తాల సత్యత్వానికి ప్రాధాన్యమిచ్చి ప్రయత్నించకుండా, ఆ లక్షణచే బోధించబడ్డ స్తుతి నిందలు మాత్రం సత్యమే అని **మీమాంసా తంత్రవార్తికం** పేర్కొంది.

వృత్తాంత పర్యవసాయీ చ వేదః తత్ర ప్రామాణ్య మప్రతిపద్యమానః స్తుతౌ సత్యత్వాన్నాన్యత్రాఽన్వేషణ మర్హతి| (మీ.తం.వా)

అంటే వృత్తాంతాన్ని బోధించడమే ఉపాఖ్యానాలకు పర్యవసానమని అంగీకరిస్తే వేద ప్రామాణ్యం దెబ్బ తింటుంది. కాబట్టి, లక్ష్యార్థమైన, సత్యమైన ఈ స్తుతి రూపార్థాన్ని విడిచి మరో అర్థంకోసం ప్రయత్నించ వద్దని వార్తికకారులు అర్థవాద అధికరణంలో చెప్పారు.

ఏవం యేన కేన చిదాలంబనేన స్తుతి నిందా విజ్ఞానోత్పత్తిః విధినిషేధోపకారిణీ చ ముఖ్యార్థాఽభావేఽప్యదోషః|

విధివాక్యాలచే విధింపబడిన వాటిని స్తుతించడానికి, నిషేధింపబడిన వాటిని నిందించచడానికి ఏదో ఒక ఆలంబన అవసరం కావున ఒక్కొక్క కథాభాగాన్ని తీసుకుని వేదం స్తుతి నిందలను తెలియచేస్తోంది. ఆ కథా రూపమైన ముఖ్యార్థాన్ని గ్రహించక పోయినా దోషం లేదని చెప్తోంది.

ముఖ్యార్థాఽభావేఽప్యదోషః| స్వాత్మవపోత్కర్తనేనాపి హి విశిష్ట ప్రయోజనార్థం కర్మాణి క్రియన్తే | కిముత బాహ్య ధన త్యాగేన| (తం.వా.అ.వా)

ప్రజాపతి రాత్మనో వపా ముదఖ్ఖిదత్తామగ్నౌ ప్రాగృహ్ణోత్ తతోఽజస్తూపరస్సమభవత్|

అనే భాగం సృష్టికి సాధనమైన యజ్ఞానుష్ఠాన కాలంలో యజ్ఞాలకు పూర్వం పశువులు సృష్టింపబడలేదు కనుక యజ్ఞంలో పశువు కావాల్సిన బ్రహ్మ తన వపను (శరీరంలో ఒక పొరగా వుండే పై చర్మాన్ని) తానే చీల్చుకుని అగ్ని యందుంచేరని, పిమ్మట దాని సామర్థ్యంచే **"తతోఽజస్తూపరస్సమభవత్"** అని కొమ్ములు లేని మేక అగ్నినుండి బయల్దేరిందని చెప్తోంది. కానీ, ఆయన వపను ఆయనే చీల్చుకుని హోమం చేయడం లోక విరుద్ధంగా కనబడుతోంది. అసలు అలా తటస్థిస్తుందా? అని శంక కలుగుతుంది. దీనికి కూడా సమాధానం చెప్పారు.

లోకంలో ఇంద్రజాలకులు ఒక వస్తువును మరో వస్తువుగా మార్చి చూపించడం మనకి ప్రత్యక్ష సిద్ధం. క్షుద్రోపాసన ఉన్న, అల్పమైన లౌకిక ఇంద్రజాలకునికే ఇటువంటి సామర్థ్యం ఉన్నట్లు మనం చూస్తుండగా, మహామాయావి అయిన, అచిన్త్యమైన శక్తి కలిగిన సృష్టి,స్థితి,లయ కారకుడైన పరమేశ్వరుడు విచిత్రమైన లీలలను ప్రదర్శించడంలో ఆశ్చర్యం ఏముంది?మన వపను మనచే చీల్చుకుని హోమం చేయలేము కనుక మన దృష్టాంతంలో పరమేశ్వరుడు కూడా అలా చేయలేడని శంకించడం అంత సమంజసం కాదేమో!

ఇంద్రో మాయాభిః పురురూప ఈయతే| (శ్రుతి)

ఇద్ – పరమేశ్వరే అనే ధాతువుచే ఇక్కడ ఇంద్రుడంటే పరమైశ్వర్యయుక్తమైన పరమేశ్వరుడు. ఆయన సంకల్పమాత్రం చేతనే అనేక రూపాలను పొందుతున్నాడని చెప్పడంచే ఆయన వపను ఆయనే చీల్చుకుని హోమం చేసాడని చెప్పడం విరుద్ధమని అనవలసిన అవసరంలేదు. అంతేకాదు, బ్రహ్మ వపోత్కర్తనం చేశారు కనుక యజ్ఞం చేసే మనం కూడా వపోత్కర్తనం (వపను చీల్చుకోవడం) చేసుకుని హోమం చేయాలని ఆ ఉపాఖ్యానం చెప్పడం లేదు. కాని, పరమేశ్వరునిచే తన వపను తానే చీల్చుకుని ఈ లోకంలో ప్రాణుల విశిష్ట ప్రయోజనం కోసం ఇటువంటి కర్మలు చేయబడ్డాయి. మీ వంతుగా మీరు **"కిముత బాహ్య ధన త్యాగేన"** అనే స్తుతి ద్వారా, బాహ్యమైన ధనాన్ని త్యాగం చేసి వైదిక కర్మలను నిర్వహించి లోకానికి శ్రేయస్సును అందచేయండి అని మనకు వేదం ప్రరోచనం (ప్రోత్సాహం) కలిగిస్తోంది.

"నేత్రమప్యుధృత్య అయం దదాతీతి త్యాగినం స్తువన్తి" అని లోకంలో నేత్రదానం చేసే వారిని ఇతను నేత్రాలను కూడా తీసి ఇస్తున్నాడని అతని గొప్పతనాన్ని స్తుతిస్తున్నారు. అంటే నువ్వు కూడా కళ్లను పెకలించుకోవాలని చెప్పడం లేదు. నేత్రదాత పెద్ద త్యాగి అని చెప్పడంలో తాత్పర్యం. కాబట్టి, వేద విహితమైన ధర్మం తప్పక అనుష్ఠించవలసింది కనుక ఆ ధర్మాన్ని ప్రరోచన చేసి మనలను ఆ ధర్మ నిర్వహణయందు ప్రోత్సహించే స్తుతి సత్యం. అందుకే-

స్తుతౌ సత్యత్వాన్నాన్యత్రాఽన్వేషణ మర్హతి| (తం.వా)

"ఉపాఖ్యాన సత్యతయా నార్థః"

అని చెప్పడంలో స్తుతిని వీడి నిష్ప్రయోజనమైన ఉపాఖ్యాన సత్యత్వం కోసం కాలాన్ని వ్యర్థం చేయరాదని చెప్పబడింది.

సాచప్రవృత్తిః విజ్ఞాన మాత్రేణైవ ఉపయుజ్యతే| (తం.వా)

అంటే ప్రాశస్త్యజ్ఞానం (ఒక విషయంయొక్క గొప్పతనం గురించిన జ్ఞానం) కలిగినంత మాత్రమునే ప్రవృత్తికి (ఆచరణకు) ఉపకరించగలదు. దానిచే ముఖ్యార్థంగా ప్రతిపాదింపబడిన అర్థంతో పనిలేదు అని చెప్తోంది.

అథోచ్యేత అసదన్వాఖ్యానేన స్తుతి నిందాత్వం| (తం.వా)

లేని కథలను చెప్పి పరమ ప్రమాణభూతాలైన వేదాలు కూడా అసత్యార్థంతో ప్రవర్తింప చేయవచ్చునా! అంటే **"కామం పరమార్థే వక్తారో భవన్తి కాప్యత్ర స్తుతిః నిందా వా సత్యమేవేహ తత్"** (తం.వా) పరమార్థం తెలిసిన వ్యక్తులు విధి వాక్యాలచే విధించబడ్డదానిని స్తుతించి ప్రవర్తింపచేయడం అవసరం కనుక స్తుతి-నిందలు సత్యమే కనుక అసత్యార్థ ప్రతిపాదనా రూపమైన అప్రామాణ్యం వేదాలకు వాటిల్లదని వార్తిక కారులు సంయుక్తంగా నిరూపించేరు.

కాబట్టి, లోకాన్ని చూసి వేదం చెప్పిందనే శంకకు తావులేదు. అర్థవాదలకు స్తుతి-నిందలయందే మహాతాత్పర్యమైనా అవిరోధ స్థలంలో స్వార్థ సత్యత్వాన్ని కూడా అంగీకరించవచ్చని **"స్తుతిత్వాఽత్యాగైనైవ హి స్వార్థ సత్యతాం వర్ణయామః"**(తం.వా) అని భట్టపాదులు చెప్పారు. కనుకనే అర్థవాదములు మూడు రకాలు.

విరోధే గుణవాదస్స్యాదనువాదోఽవధారితే భూతార్థవాదస్తద్దానాదర్థవాద స్త్రిధా మతః| (తం.వా.అ.వా)

ప్రమాణాంతర విరోధాలుంటే గుణవాద అని, అర్థవాద ప్రమాణాంతరంచే నిశ్చయించబడ్డ దానిని చెప్తే అనువాద అని, అర్థవాద విరోధం లేని ప్రమాణాంతర నిశ్చయం లేని చోట భూతార్థవాద అని చెప్పబడ్డాయి. భూతార్థవాదలకే అవాంతర తాత్పర్య విధంగా స్వార్థ ప్రామాణ్యాన్ని కూడా అంగీకరించడం వల్ల జరిగినదేమంటే, యజ్ఞంవల్లను, తదంగోపాయాలైన కర్మలవల్లను సృష్టి వైలక్షణ్యాన్ని పరమేశ్వరుడు సృజిస్తున్నట్లు వర్ణించిన వేదాల్లోని ఉపాఖ్యానాలని ఆధారంగా చేసుకుని సృష్టి స్థిత్యాదులకు కారణాన్ని సప్రమాణంగా వివరించడమైంది.

ఇంతవరకు అగ్నిష్టోమాది క్రత్వాత్మకమైన ధర్మాన్ని అనుష్టించడానికి యోగ్యమైనది భూలోక భారతవర్ష భారత ఖండమని చెప్పబడింది. ఇక్కడ అనుష్ఠించబడిన కర్మలే సృష్టి, స్థిత్యాదులకు మూలమని చెప్పి, వెనుక చెప్పబడిన అగ్నిష్టోమ క్రతువిశేషాలే గాక అగ్నిచయనాది కర్మలు కూడా కారణాలని ఇటుపై ప్రకరణంలో నిరూపించబడుతోంది.

*** 5వ ప్రకరణం సమాప్తం ***

6వ ప్రకరణం

అగ్నిచయనం

ఇంతవరకూ ప్రాయికంగా (సామాన్యంగా) అగ్నిష్టోమక్రతు విశేషాలే సృష్టి, స్థితులకు వాటి వైలక్షణ్యానికి కారణంగా నిరూపించడమైంది. గాని అగ్న్యాధానమనే ఒక శ్రౌతకర్మచే సంస్కరించబడిన అగ్నులయందు ఈ అగ్నిష్టోమాది సప్త సోమసంస్థలు చేయదగినవని శాస్త్రకారులు నిర్ణయించారు.

సప్తపార్థివా న్సంభారానా హరత్యేవం వానస్పత్యాన్ పంచ పంచవా భూయసోవా పార్థివాః| న సంభారాన్సంభరేదితి వాజసనేయకమ్|

అను ఆపస్తంబ సూత్ర ప్రకారం అరణులచే (అగ్నిని మథించే కర్రలచే) మథించబడిన అగ్ని గార్హపత్యం మొదలైన ఆయతనములందు **"సంభారేష్వగ్ని మాదధాతి"** అను సూత్రప్రకారం ఆ యా మంత్రాలతో ఉంచబడిన సంభారాలయందు సంభరాధికరణమైన **"ఆధానేన అగ్నిం సంస్కుర్యాత్"** అను విధిచే సంభారాలయందు అగ్నిని ఉంచడమే అగ్నిసంస్కార మన్నారు.

ఆ ప్రకారం ఆధానం చేసేక ఆధానంచే సంస్కరించబడిన అగ్నులందు అగ్నిసంస్థలను (ఇతర కర్మలను, చయనమును) నిర్వహించడం మొదటి పద్ధతి. ఈ ప్రకారం ఒకసారి ఆధాన సంస్కృతాగ్నులందు అగ్నిష్టోమ క్రతువును అనుష్ఠానం చేసిన తర్వాత, అగ్నిచయనమనే మరో అగ్నిసంస్కార కర్మ ఉంది. దానిచే సంస్కరించబడిన అగ్నులందు గాని ద్విరాత్రాద్యుత్తర క్రతువులను అనుష్ఠానం చేయరాదు. కానీ ఈ అగ్నిష్టోమాది సంస్థలు కూడా **"అథాతోఽగ్ని మగ్నిష్టోమేనాను యజన్తి తముక్థ్యేన తమతిరాత్రేణ తం ద్విరాత్రేణ"** (ఆ.ధ.సూ) అనే వచనంచే చయన సంస్కృతాగ్నులందు చేయవచ్చును. కానీ ఆధానాగ్ను లందు ప్రకృత్యగ్నిష్టోమం చేయకుండా మాత్రం చేయరాదు.

యజ్ఞాలన్నింటిలోను అగ్నిష్టోమం ప్రథమ యజ్ఞమని **"ఏషవా వ ప్రథమో యజ్ఞో యజ్ఞానాం యజ్జ్యోతి ష్టోమః"** అను వచనం చెప్తోంది. మరియు అగ్నిష్టోమం ఇతర సంస్థలకు, ద్వితీయాగ్నిష్టోమానికి కూడా ప్రకృతి అయి ఉంది. కాబట్టి అగ్నిష్టోమ ఉక్థ్యాదులు, ద్విరాత్రాదులు చయన సంస్కృతాగ్నియందు చేసే చయనమనే కర్మను గురించి కూడా ముచ్చటించుట అవసరమని వివరిస్తున్నాను.

ఇక చయన మనగా? అగ్ని సంస్కారమైన శ్రౌతకర్మ **"చిఞ్- చయనే"** అనే ధాతువునుంచి పుట్టింది. అనగా సంస్కారమైన **"ఇష్టకాభిరగ్నిం చినుతే"** అను శ్రుతిచే బోధించబడిన విధంగా ఆ యా మంత్రాలతో ఇష్టకలను రాశిగా పేర్చడం. ఇష్టకలనగానేమి? శ్రౌతసూత్రం చెప్పిన పరిమాణాలను అనుసరించి నిర్మించబడిన ఇటుకలను, **"నిర్మంథ్యేనేష్టకాః పచన్తి"** అను శ్రుతి ప్రకారం అరణులతో మథించబడిన అగ్నిచే కాల్చబడినవే ఇష్టకలని వ్యవహారం. అలాంటి ఇష్టకలను పేర్చడం అనేదాన్ని 'చితి' అని వ్యవహరిస్తారు. ఇలాంటి చితులు అయిదు ఉంటాయి. ఈ అయిదు చితులచేత సంస్కరించబడిన అగ్నిని చయనాగ్ని అంటారు. ఈ సంస్కార కర్మనే చయనం అంటారు. ఈ ప్రకారం అగ్ని సంస్కారకమైన చయనం **"య ఏవం విద్వానగ్నిం చినుతే"** అను శ్రుతిచే విధించబడుతోంది. ఇదే చయనానికి విధాయక వాక్యమని మీమాంసా శాస్త్రంలో నిర్ణయించారు.

ఇలా విధింపబడిన చయనమందు **"అథాతోగ్ని మగ్నిష్టోమేనానుయజన్తి"** అని వినబడడంవల్ల చయనం కూడా అగ్నిష్టోమాదులవలె అగ్నిసంజ్ఞక యాగామా? లేక చయనమనేది స్వతంత్రమా? అని

మీమాంసా శాస్త్రం ద్వితీయాధ్యాయ తృతీయపాద దశమాధికరణంలో విచారణ చేసి చయనమనేది అగ్ని సంజ్ఞక యాగమూ కాదు, స్వతంత్రంగా అనుష్ఠించబడేదీ కాదు. ఇతర క్రతువులతో అనుష్ఠింపదగినది అని నిర్ణయించారు.

అగ్నిష్టోమాది క్రతువులు ఆధాన సంపాదిత ఆవహనీయాద్యగ్నులందును చేయడానికి శక్యమవుతుంది. కానీ ఆ పక్షంలో **"ఉత్తర వేద్యామగ్నిం నిదధాతి"** అని ఉత్తరవేది మాత్రం ఉండగలదు. చయనాగ్నితో చేసినపుడు ఉత్తరవేదితో చయనాగ్ని కూడా కలిసి ఉంటుంది.

ఫలాతిశయాన్ని ఇవ్వగలదు కనుక చయనం అగ్నిష్టోమాది సోమయాగాలతో చేయదగిందే గాని స్వతంత్రంగా చేయదగింది కాదు. అయినా ప్రకృత్యగ్నిష్టోమాదికం కంటే అదనంగా చయన సంస్కారం ఉండడంవల్ల చయనం చేస్తున్నారని లోకంలో వాడుకలో ఉంది. కానీ ఉక్థ్యాద్యతిరాత్రాలను అనుష్ఠిస్తు న్నారని వాడుక లేదు. ఇలా విధింపబడిన చయనం ముందుగా ఇలా స్తుతింపబడుతోంది.

ప్రజాపతిః ప్రజాస్సృష్ట్వాప్రేణాను ప్రావిశత్| తాభ్యః పునస్సంభవితుం నాశక్నోత్ సోబ్రవీద్ధన్వదిత్సయో మేతః పునస్సంచి నవదితి తందేవాస్సమచిన్వన్తతో వైత ఆర్ధ్నువన్ యత్సమ చిన్వన్తచ్చిత్యస్య చిత్వత్వమ్|

(తై.సం. 5-2-2)

పూర్వకాలంలో ప్రజాపతి ప్రజలను సృజించి ప్రేమాతిశయంచే తనచే సృజించబడిన ప్రజలయందు ప్రవేశించెను. తిరిగి ఆ ప్రజలనుండి విడిచి వచ్చుట శక్యంకాలేదు. "ఎవరు నన్ను ప్రజలనుండి తిరిగి ఉద్భవింప చేయగలరో వారు సమృద్ధిని పొందగలరని" ప్రజాపతి పలికిన వాక్యాన్ని విన్న దేవతలు అగ్నిరూపంగా ప్రజాపతి ఉద్భవించునట్లు ఇష్టకలచే చయనం చేశారు. దీనిచే ప్రజలలో ప్రవేశించిన ప్రజాపతి అగ్నిరూపంలో ఉత్పన్నమాయెను. పిమ్మట ఆ దేవతలు సమృద్ధి గలవారయ్యెను. కావున, ఈ ప్రకారం చయనమనే కర్మ సర్వసమృద్ధి కోసం కాగలదు కనుకనే తై.సం. 5-6-9 అనువాకంలో **"ప్రజాపతిర్వా ఏషయదగ్నిః"** అను శ్రుతి చయనసంస్కార సంస్కృతమైన అగ్నిని ప్రజాపతి స్వరూపంగా ఆ వర్ణించి ఇష్టకల మధ్య ఉపహితమైన (పేర్చబడిన) అగ్నికి ఉలూఖల ముసలములను ఫలసాధనం అవడంవల్ల స్థనరూపంగాను వర్ణించి **"ఏతదనుష్ఠానజన్య ఫలం ప్రజా ఉపజీవన్తి"** అని చయనానుష్ఠానం వల్ల వచ్చిన ఫలాన్నాశ్రయించి ప్రజలు జీవిస్తున్నారని చెప్పెను. మరియు ఆ యా కామనా విశేషాలతో కూడా అగ్ని సంస్కారకమైన చయనాఖ్య కర్మ విధించబడింది.

కస్మై కమగ్నిశ్చీయత ఇత్యాహురగ్నివా న సానీతివా అగ్నిశ్చీయ తేఽగ్నివానేవ భవతి|

ద్విరాత్రాద్యుత్తర క్రతువులకు యోగ్యమైన అగ్నితో కూడుకున్న వానినిగా కావాలి అను కోరికతో చేస్తే అట్టి అగ్ని కలవాడవుతాడు.

కస్మైకమగ్నిశ్చీయ త ఇత్యాహుర్దేవామావేదన్నితివా అగ్నిశ్చీయతే విదురేనం దేవాః|

దేవతలు నన్ను పుణ్యాత్మునిగా గుర్తించాలి అనే కోరికతో అనుష్ఠిస్తే ఆ విధంగా గుర్తిస్తారు.

కస్మైకమగ్నిశ్చీయ త ఇత్యాహుః గృహ్యసానీతివా అగ్నిశ్చీయతే గృహ్యేవ భవతి|

యుక్తమైన గృహస్థాశ్రమ ధర్మాలతో కూడినవాడను కావాలి అనే కోరికతో చేస్తే ఆ విధంగా అవుతాడు.

కస్మైకమగ్నిశ్చీయత..... పసుమానసానీతి వా అగ్నిశీయతే పశుమానేవ భవతి|

పశు సమృద్ధి కలవాడను కావాలి అనే కోరికతో చేస్తే పశు సమృద్ధి కలవాడవుతాడు.

కస్మైకమగ్నిశ్చీయత ఇత్యాహుః సప్తమా పురుషా దుపజీవానీతి వా అగ్నిశ్చీయతే త్రయః ప్రాంచ స్త్రయః ప్రత్యంచ ఆత్మా సప్తమ ఏతావంత ఏవైన మముష్మిన్ లోక ఉపజీవంతి|

తనపైన గల పితృ, పితామహ, ప్రపితామహులు ముగ్గురు; తను, తన తర్వాత గల పుత్ర, పౌత్రులు, ప్రపౌత్రులు ముగ్గురు, తనతో కలిపి మొత్తం ఏడుగురు. ఈ ఆరుగురికి మధ్యగా ఉండి ఏడవ వాడుగా లెక్కించబడే తనను ఆశ్రయించుకుని వారు జీవించాలని **'అహమేవ రక్షకో భవిష్యామి'** నేనే వీరందరకూ రక్షకుడు కావాలనే కోరికతో చయనాన్ని అనుష్ఠిస్తే అట్టి సామర్థ్యం కలవాడవుతాడు అనడంచే ఈ అగ్నిచయనం చేస్తే ఆ కోరికలు సిద్ధించగలవని సర్వకామావ్యాప్తికి సాధనం అగ్నిచయనమని చెప్పినట్లయింది. మరియు తై.సం.లో పంచచితి ప్రశంసలు చేయబడ్డాయి.

ప్రథమచితి ప్రశంస

ఆపోవా ఇదమగ్రే సలిలమాసీత్స ఏ తాం ప్రజాపతిః ప్రథమాం చితిమపశ్యత్ తాముపాధత్త తదియమభవత్|
(తై.సం. 1-5-7, 5వ అ.)

ఈ భూమ్యన్తరిక్షాది రూపమైన జగత్తుయొక్క సృష్టికి పూర్వం ఈ చెప్పబడిన రూపం లేకుండా కేవలం ఉదకమయమై ఉండేది. ఆ సమయాన ప్రజాపతి నిలబడుటకు ఆధారం లేనివాడై విచారించి ప్రథమ చితిని ఉపధానం చేసెను. అదే భూమి రూపమైంది.

ద్వితీయచితి ప్రశంస

తం విశ్వకర్మా బ్రవీదుపత్వాయానీతి నేహలోకోస్తీత్యబ్రవీత్ స ఏతాం ద్వితీయామ్ చితిమపశ్యత్ తాముపాధత్త తదంతరిక్షమభవత్| (తై.సం.5)

భూమియందు ఉపస్థితుడై ఉన్న ప్రజాపతిని తద్భిన్నుడైన విశ్వకర్మ అను పేరు గలవాడు తాను నిలబడడానికి ఆధారం లేనివాడై **"ఉపత్వాయానీతి"** నీ సమీపానికి చేరగలనని కోరెను. పిమ్మట ఆ ప్రజాపతి **"నేహలోకోస్తీత్యబ్రవీత్"** ఈ భూమి యందు నీకు అవకాశం లేదని బదులు చెప్పెను. ఆ మాటను విన్నవాడై విశ్వకర్మ తనకేది ఆధారం కాగలదని విచారించి ద్వితీయ చితిని ఆధానం చేసెను. ఈ ద్వితీయ చితే అంతరిక్షమైంది. ఆ అంతరిక్షమందు విశ్వకర్మ అవస్థితుడాయెను.

దిశ్యాఖ్య ఇష్టకల ప్రశంస

స యజ్ఞం ప్రజాపతి మబ్రవీత్ ఉపత్వాయానీతి నేహలోకోస్తీత్యబ్రవీత్ సవిశ్వకర్మణమబ్రవీదుపత్వాయానీతి కేనమోపైష్యసీతి దిశ్యాభిరిత్యబ్రవీత్తం దిశ్యాభిరుపైత్తా ఉపాధత్త తాదిశోఽభవన్|

యజ్ఞాఖ్యుడనే పురుషుడు ప్రజాపతిని స్థానంకోసం యాచించగా అతడు అవకాశం లేదని చెప్పెను. పిమ్మట విశ్వకర్మను అడిగెను. అతడూ అవకాశం లేదని చెప్పెను. అతడు ఏ సాధనంచే నా చెంతకు రాగలవని ప్రశ్నించగా **"రాజ్ఞ్య సి ప్రాచీదిక్"** ఇత్యాది దిక్పద ఘటితమైన మంత్రాలచే ఉపధానం చేయబడిన ఇష్టకలచే పొందగలనని చెప్పి ఆ ప్రకారం ఉపధానం చేయగా ఆ ఇష్టకలే దిగ్రూపాలుగా అయ్యాయి. ఆ దిక్కుల్లో యజ్ఞపురుషుడు అవస్థితుడయ్యాడు.

తృతీయచితి ప్రశంస

స పరమేష్ఠీ ప్రజాపతిమబ్రవీదుపత్వాయానీతి నేహలోకోస్తీత్యబ్రవీత్| స విశ్వకర్మాణం చ యజ్ఞం చాబ్రవీత్ ఉపవామాయానీతి| నేహలోకోస్తీత్యాబ్రుతాగ్ం స ఏతాం తృతీయాం చితిమపశ్యత్ తాముపాధత్త తదసావభవత్|

మూర్తి భేదం కలిగిన పరమేష్టి ప్రజాపతిని, విశ్వకర్మను, యజ్ఞపురుషుని అవకాశం కొరకు యాచించగా వారు నిరాకరించిన కారణంచే తృతీయ చిత్యుపధానం చేసెను. ఆ తృతీయ చితియే ద్యులోకం (దేవలోకం) అయింది.

లోకంపృణేష్టకల ప్రశంస ('లోకంపృణా' అనే పేరుగల ఇటుకల ప్రశంస)

స ఆదిత్యః ప్రజాపతిమబ్రవీదుపత్త్వాయానీతి నేహలోకోస్తీత్యబ్రవీత్స విశ్వకర్మాణం చ యజ్ఞం చాబ్రవీదుప వామాయానీతి నేహలోకోస్తీత్యభ్యాభ్రుతాగ్ం స పరమేష్ఠిన మబ్రవీదుప త్వయానీతి కేన మోపైష్యసీతి లోకం పృణయేత్యైబ్రవీత్తం లోకం పృణయో పైత్తస్మాద యాతయామ్నీ లోకం పృణాయాఽతయా మాహ్యసావాదిత్యః|

(తై.సం)

ఆదిత్యుడు ప్రజాపతిని, విశ్వకర్మను, యజ్ఞ పురుషుడిని అవకాశంకొరకు ప్రార్థించగా వారు నిరాకరించారు. పిమ్మట నీ సమీపానికి రాగలనని, పరమేష్ఠిని కోరగా ఆ పరమేష్ఠి ఏ ఉపాయంచేత నా దగ్గరికి రాగలవని ప్రశ్నించగా, **"లోకంపృణయేత్యబ్రవీత్"** అని చెప్పెను. లోకం పృణేష్టికలతో పొందగలనని చెప్పి లోకం పృణేష్టకలను తీసుకువచ్చెను. లోకంపృణ అనే పేరు ఉన్న ఇష్టకను ఉపధానం చేసి దాని సామర్థ్యంచే అతడి దగ్గరికి చేరాడు.

యస్మాత్ ఇయం లోకం పృణా ఆదిత్యేనానీతా తస్మాత్|

ఈ లోకపృణేష్టక అనేది ఏ కారణం వల్ల ఆదిత్యునిచే తీసుకు రాబడిందో ఆ కారణంవల్ల లోకం పృణేష్టక గతసారం కలది కాదు అంటే, సారం పోయినటువంటిది అవుతుంది. గతసారం కాని లోకం పృణేష్టకను ఉపధానం చేసిన ఆదిత్యుడు పృథివ్యాకాశాలమధ్య తిరుగుతున్నా అతడి ప్రకాశం ఎన్నడూ క్షీణించదని అర్థం. ఆదిత్యుని లాగానే లోకం పృణకు అనగా ఆ యా ఇష్టకల ఛిద్రాలను కప్పిపుచ్చేటటువంటి ఇష్టకకు గతసారత్వం లేదని అర్థం.

చతుర్థ పంచమ చితుల ప్రశంస

తాన్ఋషయో బ్రువన్నుపవ ఆయామేతికేనన ఉపైష్యథేతి భూమ్నేత్యబ్రువన్ తాన్ ద్వాభ్యాం చితిభ్యాముపాయన్ శపం చ చితీకస్సమపద్యత| (తై. సం.5)

ప్రజాపతిని, విశ్వకర్మను, పరమేష్టిని, ఆదిత్యుని వీరందిరినీ కొంతమంది ఋషులు స్థానానికై ప్రార్థించగా ప్రజాపతి మొదలైనవారు ఉల్కోచమును (పని చేసేందుకు ప్రతిఫలమును) కోరారు. ఆ ఉత్కోచంగా చతుర్థ, పంచమ చితులను తీసుకువచ్చి ఇచ్చారు. పిమ్మట ఆ రుషులకు అవకాశం సంభవించింది. ఈ ప్రకారంగా అవకాశాన్నిప్పించిన వాటిగా ప్రశంసించబడిన చతుర్థ, పంచమ చితులచే పంచచితీకుడు అయ్యేడని **"స పంచ చితీక స్సమ పద్యత"** అను శ్రుతి బోధిస్తోంది.

శాఖాంతర్గతమైన త్రిచితీక పక్షాన్ని అనువాదం చేసి తత్పక్ష నిరాకరణ పూర్వకంగా పంచచితీక పక్షాన్ని అనుష్ఠానాన్ని మరో శ్రుతి ప్రశంసిస్తోంది.

య ఏవం విద్వానగ్నిం చినుతే భూయానేవ భవత్య భీమాన్లోకాన్జయతి విదురేనం దేవా అధో ఏతాసామేవ దేవతానాగ్ం సాయుజ్యం గచ్ఛతి (తై. సం. 5)

ఈ ప్రకారం అయిదు చితులుగా అగ్నిచయనం చేసిన కర్త విద్యాది గుణసమృద్ధి కలవాడవుతాడు. లోకత్రయము స్వాధీనమనే జయము కలవాడూ అవుతాడు. దేవలోకంలో గుర్తింపబడు గొప్ప కీర్తి కలవాడవుతాడు. అట్టి కీర్తి కలవాడు అవడమే గాక, సదా దేవతలతో సహభావాన్ని పొందగలడు. మూడు

చితులలో చేసే పక్షాన్ని వర్ణించి పంచచితీకంగానే అనగా, అయిదు చితులతోనే చయనం చెయ్యాలని మరొక స్థలంలో నిర్ణయించినట్లు శ్రుతి.

య త్రిచితీకమ్ చిన్వీత యజ్ఞం దక్షిణామాత్మానం ప్రజామంతరియాత్తస్మాత్పంచ చితీకశ్చేతవ్యః| (తై. సం.5)

చితిత్రయంలో చేస్తే యజ్ఞాదులకు అంతరాయం కలుగుతుంది. కనుక పంచచితీక పక్షమే శ్రేష్ఠమని చెప్పబడింది. ఆ నిర్ణయం ప్రకారం **"స పంచతీకస్సమపద్యత"** అను శ్రుతి అగ్ని పంచచితులతో కూడిందని కీర్తన చేసింది. ఈ విధంగా విధివిహిత ప్రకారం అయిదు రోజులు అయిదు చితులను, ఆరవరోజు శేషచితిని ఉపధానం చేస్తారు. ఈ విధంగా అనుష్ఠింపబడే చయనమనే సంస్కార కర్మ సర్వ కామావాప్తికి, సర్వ భూతముల సృష్టికి, సర్వ ప్రజల సుఖ జీవనానికి కారణమవడం వల్ల చయనమనేది చాలా ప్రశస్తమైనదని ఉత్తర క్రతువులకు ఆవశ్యకమైనదని తెలుస్తోంది.

చయన భేదాలు

ఇటువంటి మహిమాన్వితమైన చయనాల్లో రకాలున్నాయి. సహస్ర సంఖ్యాకమైన ఇష్టకలతో ఉపధానం చేయబడింది ప్రథమచయనం. ద్విసహస్ర సంఖ్యాకమైన ఇష్టకలతో ఉపధానం చేయబడింది ద్వితీయ చయనం, త్రిసహస్ర సంఖ్యాకమైన ఇష్టకలతో ఉపధానం చేయబడింది తృతీయ చయనం అని చెప్పబడు తున్నాయి.

సాహస్రం చిన్వీత ప్రథమం చిన్వానస్సహస్ర సమ్మితోవా అయంలోక ఇమమేవ లోకమభిజయతి ద్విసాహస్రం చిన్వీత ద్వితీయం చిన్వానో ద్విసాహస్రం వా అన్తరిక్షం అంతరిక్షమేవాభిజయతి| త్రిసాహస్రం చిన్వీత తృతీయం చిన్వానస్త్రి సాహస్రోవా అసౌ లోకోఽముమేవ లోకమభిజయతి| (తై.సం.5-6-8)

ఇంతే కాదు, ఈ మూడు చయనాలతో మూడు లోకాలను జయించిన వాడవుతాడని ఫలశ్రుతి చెప్తోంది. ద్వితీయ చయనాదులచే సంస్కరించబడిన అగ్నులందు ద్విరాత్రాది సోమయాగాలు సమూఢ, వ్యూఢ పౌండరీకాది క్రతువులు చేయవచ్చు.ఈ ప్రకారం చయన భేదాలు, వాటి ఉపయోగం, వాటిలో గల ఇష్టకల సంఖ్యాపరిణామం మొదలైనవి అన్నీ చెప్పబడ్డాయి, పై శ్రుతిలో.

విరాట్పురుష భావన

చయనంచే సంస్కరించబడిన అగ్నిని విరాట్పురుషునిగా భావించాలి. విరాట్పురుష ప్రతిపాదకమైన పురుషసూక్తంచే చిత్యగ్నికి ఉపస్థానం చెప్పాలని మహాగ్నిప్రకరణంలో ఆపస్తంబునిచే ఈ విధంగా చెప్పబడింది-

పురస్తాత్ ప్రతీచీం పురుషాకృతిం చినోతి| పురుషోఽస్య శిరోభవతి| సహస్ర శీర్షా పురుష ఇతి ఉపహితాం పురుషేణ నారాయణేన యజమాన ఉపతిష్ఠతే|

జగత్కారణమైన నారాయణుడని పిలవబడు పురుష ప్రతిపాదకం అవడంవల్ల పురుష సూక్తానికి నారాయణమని పేరు. కాబట్టి, పై విధంగా జగత్కారణభూతుడైన నారాయణునిగా భావన చేసి అగ్నిచయనం చేసిన యజమాని **"య ఏవం విద్వానగ్నిం చినుత ఋతుభిరేవైనం చినుతేఽథో ఏతదేవ సర్వమవరుంధే"** శ్రుత్యుక్త ప్రకారం సంకల్పం చేయాలి. పూర్వం ప్రజాపతి అగ్నిని ఋతుస్వరూపంగాను, బ్రాహ్మణాది రూపంగాను తెలిసిన ఏ యజమాని అయినా అదే విధంగా ఋతు స్వరూపంగాను, బ్రాహ్మణాది రూపంగాను అంటే **"ఋతుమయః అయం యజ్ఞః బ్రాహ్మణాది వర్ణమయః అయం యజ్ఞః"** అని సంకల్పం చేసి భావన చేస్తే ఋతువుల స్వరూపాన్ని, బ్రాహ్మణాది స్వరూపాన్ని స్వాధీనం చేసుకున్న వాడవుతాడని చెప్పబడింది.

శృణ్వంత్యేనమగ్నిం చిత్వానమత్యన్నగ్ం రోచతే (తై. సం.5-6-10) (శ్రుతి)

అగ్నిచిత్ కపిలాసత్రీ రాజా భిక్షుః మహోదధిః|దృష్టమాత్రాః పునంత్యేతే తస్మాత్తే దర్శనీయాహినిత్యశః (స్మృతి)

అగ్నిచయనం చేసిన వానిని, కపిల గోవును, సత్రయాగానుష్ఠాతను, పాలకుడైన రాజును, యతిని, సముద్రుని గొప్ప పుణ్యాత్ములుగా చెప్తున్నాయి శ్రుతి, స్మృతీ కూడా. అందుకే **"శ్రోత్రియం సుభగాం చైవ అగ్నిమగ్నిచితం తథా ప్రాతరుత్థాయ యః పశ్యేదాపద్భ్యస్తత్ర ముచ్యతే"** అని ఉదయం నిద్రనుంచి లేచిన వెంటనే చూడదగిన వారిలో వేదం చదివినవానిని, పుణ్య స్త్రీని, గోవును, అగ్నిచయనం చేసినవానిని ముఖ్యంగా పేర్కొంటూ అగ్నిచయనం చేసినవాని ప్రాముఖ్యాన్ని మరోసారి వివరించింది. ఇట్టి పుణ్యాత్మునిగా "**శృణ్వంత్యేనం**" ప్రజలు వింటున్నారు గాన అంత ప్రసిద్ధి గలవాడయ్యాడు**. "అత్యన్నమ్"** ఒక రకమైన అన్నసమృద్ధి గలవాడు**, 'రోచతే'** సర్వజన ప్రియుడు కూడా అవుతాడని ప్రతిపాదించడం ద్వారా అగ్నిచయనానుష్ఠానం అతి ప్రశస్తమైందని తేలింది.

చందశ్చితం ఛిన్వీత పశుకామః కంకచితం చిన్వీతయః కామయేత శీర్ షణ్వాన ముష్మిన్ లోకేస్యామితి|

మొదలైన శ్రుతులచే ఇష్టకలను పేర్చడం, చితి అనే వాటి స్వరూపభేదం కామనాభేదాన్ని (కోరికలో తేడాను) అనుసరించి వర్ణింపబడింది. ఆ యా మంత్రాలతో ఇష్టకలను ఉపధానం చేయడమనే చితి ఆకారాన్ని ఒకానొక పక్షి ఆకారంగా వర్ణింపబడింది. రెక్కలు లేనిదే పక్షి పైకి ఎగరలేదు కనుక పక్షి స్వరూపమైన చయనం కూడా రెక్కలు లేకపోతే ఊర్ధ్వవర్తి అయిన స్వర్గానికి సాధనం కాకపోతుందని, ఆ రూపకమైన చితికి కూడా పక్షకములను (రెక్కలను) చయన ప్రదేశ కొలతలతో సహా విధిపూర్వకంగా విధించింది.

పురుషమాత్రేణ విమిమీతే యజ్ఞేన వైపురుషస్సమ్మితో యజ్ఞ పరుషైవైనం మిమిమీతే|

కేవలం పురుష ప్రమాణం కాకుండా, లౌకిక పురుషుడు యజ్ఞాభిమాని దేవతతో సమాన ప్రమాణం కలవాడు కనుక తూర్పు-పడమరలకు ఉన్న దూరాన్ని పురుష ప్రమాణం ఉన్న దండంచే కొలవాలి.

యావాస్ పురుష ఊర్ధ్వ బాహుస్తావాస్ భవతి ఏ తావ ద్వై పురుషే వీర్యం వీర్యేణైవైనం మిమీతే| (తై.సం.5)

ఊర్ధ్వ బాహుప్రసార పర్యంతం (చేతుల్ని పైకి ఎత్తగా వాటి చివరి వరకూ, అంటే బారెడు అంటాం కదా అంతటి దూరం) పురుషుని సామర్థ్యం ఉంటుందని అట్టి సామర్థ్యంతో కూడిన పురుషుని ప్రమాణంచే మానం (కొలత) చేసినట్లు అవుతున్న భావనతో ఊర్ధ్వబాహుయుక్త పురుష ప్రమాణం గల దండంచే ఆ కొలత చెయ్యాలని విధించింది. ఇటువంటి విధింపబడిన కొలతలతో కూడిన ప్రదేశంలో ఉపధానం చేయబడిన చిత్యాకారాన్ని పక్షి ఆకారంగా వర్ణించింది.

అరత్నినా పక్షౌద్రాఘీయాగ్ం సౌ భవతః తస్మాత్పక్ష ప్రవయాగ్ంసి వయాగ్ంసి వ్యామమాత్రౌ పక్షౌ చ పుచ్ఛం చ భవతః ఏతావద్వై పురుషే వీర్యం వీర్య సమ్మితః| (తై.సం.5)

ఆ చితికి సంబంధించిన రెక్కల పరిమాణం వ్యామమాత్రం (బారెడు) ఉండాలని చెప్పింది. పురుషుని బాహుప్రస్తానికి (రెండుచేతులూ పక్కకి పెట్టి సాచినప్పుడు ఉండే దూరానికి) వ్యామమని పేరు. లోకంలో పక్షి స్వరూపం కంటే వాటి పక్షాలు దీర్ఘంగా ఉంటాయి. కాబట్టి (పాక్పశ్చిమాలకు గల పక్షి ఆకార ప్రమాణానికంటే ఉత్తర దక్షిణాలకుండే పక్షి రెక్కల పరిమాణం అరత్ని (24 అంగుళాలు) అధికంగా ఉండాలని **"అరత్నినా పక్షౌద్రాఘీయాగ్ం సౌభవతః"** అనే శ్రుతి విధిస్తోంది.

ఈ విధంగా చయన ప్రదేశం పురుష పరిమాణం ఉండాలని, చయనంయొక్క ఆకారం పక్షి ఆకారం వంటిదని, లోకంలో పక్షియొక్క పరిమాణం కంటే పక్షాల పరిమాణం అధికంగా ఉంటుంది కనుక ఇక్కడ కూడా పక్షముల ఆకారం అధికంగా ఉంటుంది కాబట్టి భేదాన్ననుసరించి ఆ యా పక్షుల ఆకారంలో సమంగా చిత్యుపధానం చేయాలని చెప్పినట్లు అయింది.

ఈ చెప్పినదాంట్లో వాడబడిన పారిభాషిక పదాలు కేవలం వైదికమవడం వల్ల చాలా భాగం సామాన్యులకు తెలియడం కష్టమే అవుతుంది. అయినా ఈ కర్మ లోకానికి ఉపయోగపడగలదని అందులో వినియోగించబడే మంత్రాల అర్థం లోకానికి ఉపయోగపడగలదని చెప్పడానికై ఇంతవరకు కర్మయొక్క ఉపయోగాన్ని చెప్పి ఈ ప్రయోగప్రతిపాదం వైజ్ఞానికంగా కూడా ఉపయోగపడగలదని ఆ విశేషాలు ఇకముందు వివరించబడుతున్నాయి.

వైజ్ఞానిక విషయం

చిత్యుపధానం చేయడానికి యోగ్యమైన భూమి అనేక విధాలుగా స్తుతింపబడుతోంది. స్తుతించడానికి ముందు ఈ క్రింది శ్రుతి భూమియొక్క నిష్పత్తి ప్రకారాన్ని చూపిస్తోంది. ఇదే అర్థం గల శీర్షికను చెప్పబోయే మంత్ర భాష్యానికి ముందుగా విద్యారణ్యస్వామి కూడా పేర్కొన్నారు.

అథ బలయోగ్యా భూమిః బహుధా స్తూయతే| తత్రతావదాదౌ భూమి నిష్పత్తి ప్రకారం దర్శయతి|

"ఆపోవా ఇదమగ్రే సలిలమాసీత్స ప్రజాపతిః పుష్కర పర్ణేవాతో భూతఽలేలాయత్సప్రతిష్టాం

నావిందత స ఏతదపాంకులాయ మపశ్యత్తస్మిన్నగ్ని మచినుతదియ మభవత్తతో వై సప్రత్యతిష్ఠత్| (తై.సం.)

స్థావర జంగమాత్మకమైన, మనచే చూడబడే ఈ జగదుత్పత్తికి పూర్వం కేవలం భూతాంతర సమ్మేళనం లేని (పంచభూతాల్లోని ఇతర భూతాలేవీ లేని) ఉదకం మాత్రమే ఉండెను. అప్పుడు ప్రజాపతి తన శరీరాన్ని ఉంచడానికి ఆధారం లభించక తానే వాయువుగా మారి ఉదకమధ్యమున ఉన్న పుష్కర పర్ణము నాధారంగా చేసికొనెను.

అలేలాయత్ ఇతస్తతః డోలాయమానః అభూత్|

కానీ పుష్కరపర్ణం చలించడం వల్ల, వాయురూపమైన తానూ చలనస్వభావం కలవాడవడం వల్ల స్థిరనివాసం లభించలేదని డోలాయమానుడాయెను. పిమ్మట పునరాలోచన చేసి ఆ ఉదకాలమధ్య **'కులాయపపశ్యత్'**- శైవలాన్ని(నీటి పాచిని) చూసెను. ఆ శైవాలమందు చిత్యుప్రధానం చేసెను. ఉపధానం చేయబడిన ఆ ఇష్టికా చయనమనే అగ్ని ఈ చూడబడే భూమిగా మారెను. పిమ్మట ఆ భూమియందు ప్రజాపతి ప్రతిష్ఠితుడాయెను అని **"తదిదియమభవత్| తతోవై సప్రత్యతిష్ఠత్"** (తై.బ్రా.) అను శ్రుతి భాగం చెప్తోంది.

యాం పురాస్తాదుపాదధాత్తచ్ఛిరోభవత్సా ప్రాచీదిక్| (తై. సం.)

దిగ్విభాగాలు ఏర్పడడంతో సహా భూమియొక్క ఉత్పత్తి ప్రకారాన్ని ఈ శ్రుతి వివరిస్తోంది. చయనకర్త అయిన ప్రజాపతిచే తనకు ఎదురుగా ఉపధానం చేయబడిన ప్రౌఢమైన ఇష్టక, ఆయనచే అనుష్ఠింపబడే చిత్యగ్నికి శిరస్థానమై ఒకే భూమికి ఏకదేశ రూపమైన ప్రాగ్దిక్కుగా (తూర్పు దిక్కుగా) వ్యవహరించబడుతోంది. ఇదే తీరుగా తనకు ఇరుపక్కలా చేసిన ఇష్టకోపధానం పశ్చిమ దిక్కుగాను, పైన చేసిన ఇష్టకోపధానం ఊర్ధ్వ దిక్కుగాను అయ్యాయి. ఈ ప్రకారం భూమియందు అయిదు దిక్కులందు

అయిదు ఇష్టకలను ఉపధానం చేయడం వల్ల ఆ భూమికి చిత్యగ్నిరూపం లభించిందని ఈ క్రింది శ్రుతి తెలియచేస్తోంది.

ఇయం వా అగ్నిః పంచేష్ట కస్తస్మాద్యదస్తాం ఖనన్త్యభీష్టకాం తృన్దన్త్యభిశర్కరామ్|

ఉపధానం చేయబడిన ఈ భూమి అగ్నిస్వరూపం కనుకనే అటువంటి భూమిని అగ్నిస్వరూపమని తెలియక ఖననం చేసే (తవ్వే) మూర్ఖులు ప్రజాపతిచే ఉపధానం చేయబడిన ఇష్టకాస్వరూపమైన అగ్నిని హింసించిన వారవుతున్నారు. అదే తీరుగా ఉపధానం చేయబడ్డ శర్కరలను (గువ్వరాళ్లను) కూడా హింసిస్తున్నారు. అనగా, గువ్వరాళ్లను చూర్ణం చేస్తూ అగ్నిని హింసించిన ప్రత్యవాయాన్ని పొందుతున్నారు. ఈ విధంగా శాస్త్రీయమైన దృష్టితో కూడా అది సత్యమని వేదం దృఢపరుస్తోంది.

శంకుస్థాపన: ఈ కారణంతోనే మనం అత్యవసరమై ఇళ్ళు వగైరాలు కట్టుకోవడానికి ప్రారంభంలో చేసే శంకుస్థాపనలో "అవసరార్థం భూమిని తవ్వుతున్నామని, క్షమించి ఆశీర్వదించమని" అర్థం కల మంత్రాలతో అగ్ని రూపమైన ఈ భూమిని ప్రార్థించడం.

సర్వావా ఇయం వయోభ్యోనక్తం దృశేదీప్యతే తస్మాదిమాం వయాగ్ం సి నక్తం నాధ్యా సతే| (తై. బ్రా)

పక్షుల దృష్టిలో భూమి అంతా రాత్రిపూట ప్రజ్వలిస్తున్నట్లు కనబడుతుంది. వాటికి అలా కనబడుతుందని ఎలా గుర్తించాలి అనే శంక రావచ్చును. ఆ కారణం చేతనే రాత్రిభాగంలో పక్షులు భూమిని ఆశ్రయించక వృక్షాలను ఆశ్రయిస్తున్నట్లు లోకవిదితమే కదా! అంతేకాదు, విద్యుత్తుపని చేసేవారు విద్యుత్ తీగలో 'కరెంటు' ప్రసరించే సమయంలో ఏ దారురూపమైన (కర్ర) ఆధారం లేకుండా కేవలం భూమిమీద నిలబడి దాన్ని తాకితే కరెంట్ షాక్ తగులుతున్నట్లు కూడా లోక విదితమే.

ఇదే తీరుగా ఒక రాయిని మరో రాయితో రాపిడి చేస్తే అందులోంచి నిప్పురవ్వ బయలుదేరడం స్పష్టమే. దీనివల్ల భూమి అగ్ని రూపమని, శర్కరలు (రాళ్ళు) కూడా అగ్ని స్వరూపమని ఏ ప్రమాణాంతరం చేతనూ తెలియబడని దాన్ని వేదం చయన ప్రకరణంలో తెలియపరుస్తోంది.

భూమిరూప అగ్నికి జల కారణత్వం

అపాం వా అగ్నిః కులాయం తస్మా దాపోగ్నిగ్ం హారుకాః స్వామేవతద్యోనిం ప్రవిశంతి |(తై. సం.)

లోకంలో నదులు కూపాదులు అన్నీ భూమియందే ఉన్నాయి. వీటన్నింట్లో ఉండే ఉదకాలకు భూమి రూపమైన అగ్నియే నివాస స్థానం. సృష్టిక్రమం వర్ణించే సందర్భంలో తైత్తిరీయ ఉపనిషత్ లో **"ఆగ్నేరాపః"** అని అగ్నివలన ఉదకాలు ఉత్పన్నమైనట్లు చెప్పబడింది. ఉదకాలు అగ్నికార్యాలు కనుకనే లోకంలో గృహదహనాదులు సంభవించినప్పుడు అగ్ని నివారణ కోసం మనం పోస్తున్న ఉదకాలు అగ్నిని ఉపశమింప చేసి అవి కూడా ఆ అగ్నిలోనే ఇంకిపోతున్నాయి. దానివలన కూడా ఈ భూమి జలకారణమైన అగ్ని స్వరూపమని తెలుస్తోంది. కర్మప్రకరణంలో కర్మను ప్రతిపాదించుట అనే వ్యాజంతో (వంకతో) ఇట్టి మహత్తరమై వైజ్ఞానిక విషయాలను కూడా వేదం మనకు తెలియజేసినట్లు గుర్తించాలి.

అగ్నిచయనం - లోకజ్ఞాన విశేషాలు

అగ్నిచయనంలోని మంత్ర వినియోగంచే లోకం గ్రహించదగిన విశేషాలు ఇందులో చెప్పబడ్డాయి. అగ్నిచయనానికి ఆదిలో ఉఖానిర్మాణ కాలంలో-

జుహ్వం యజుష్టమాభిర్ ఋగ్భిః ఏకామాహుతిం జుహోతి| (ఆ.శ్రౌ.సూ)

సూత్రప్రకారం **"యుజానః ప్రథమం"** (తై.సం. 4-1-1) ఇత్యాది ఏడు ఋఙ్మంత్రాలు, **"ఇమం నో దేవ సవితరితి"** అను ఒక యజుర్మంత్రంతో కలిపి మొత్తం ఎనిమిది మంత్రాలతో ఒక హోమం చేయాలని **"సావిత్రాణి జుహోతి ప్రసూత్యై"** అను వాక్యం విధిస్తోంది. కానీ అన్ని మంత్రాలను ఉచ్చరించి ఎనిమిదవ మంత్రం చివర్లో హోమం చెయ్యాలా? లేక ఒక్కో మంత్రం చెప్పి ఆ మంత్రం చివర్లో హోమం చెయ్యాలా? అని విచారణ చేసిన సందర్భంలో రెండు విధాలుగా చెప్పింది.

యం కామయేత పాపీయాన్ స్యాదిత్యేకైకం తస్య జుహుయాత్| (తై. సం.)

అగ్నిచయన నిర్వాహకుడైన అధ్వర్యుడు ఒక్కో మంత్రాన్ని ఉచ్చరించి హోమం చేస్తే **"ఆహుతీభిరేవైన మపగృహ్ణాతి పాపీయాన్ భవతి"** అను శ్రుతి ప్రకారం ఒక మంత్రానికి మరో మంత్రానికి కలయిక లేకపోవడంవల్ల **"అపరక్తాభిః ఆహుతీభిః"** అనే వాక్యం, **"ఏనం యజమానం అపగృహ్ణాతి| ధనాదపేతమ్ కరోతి"**(భాష్యం) ప్రకారం ఆ చయన యజమానిని పరస్పరాను సంబంధం లేని ఆహుతులచే చేయడంవల్ల ధనరహితునిగా, దరిద్రునిగా చేస్తుంది. కాబట్టి **"యం కామయేత వసీయాన్ స్యాదితి సర్వాణి తస్యానుద్రుత్య జుహుయాత్"** (తై.సం.5-1) అను శ్రుతి ప్రకారం ఏ యజమానిని వసుమత్తరుని గాను, ధనవంతుని గాను చేయవలెనని కోరుతూ ఆ చయన నిర్వాహకుడు సర్వ మంత్రాలను (ఎనిమిదింటిని) వరుసగా ఉచ్చరించి హోమం చేయాలని, అలా చేస్తే **"ఆహుత్యైవైన మభిక్రమయతి వసీయాన్ భవతి"** అను శ్రుతిచే మంత్రాలకు పరస్పర కలయిక ఉండడంవల్ల ఆ యజమాని ధనవంతుడు అవుతాడని చెప్తోంది. **"ఏకయైవాహుత్యా యజమాన మభిక్రమయతి– అభివ్యాప్తం కరోతి తతః ధనికో భవతి"** అని భాష్యం.

ఒకే ఆహుతితో చేసిన యజమానిని పూర్తి సంబంధం కలవానిగా, తద్వారా ధనవంతునిగా చేస్తోంది. దీనివల్ల మన కుటుంబ సభ్యులు గాని, వర్గములు కానీ కలిసి ఉండి పరస్పరం ఐకమత్యంతో పని చేస్తే అందరికీ లాభం కలుగుతుందని, లేని యెడల దరిద్రులవుతారని లౌకికంగా తెలుసుకోదగింది.

ఇదే విధంగా మరో ఉదాహరణ-

ఏకవిగ్ంశత్యామాషైః పురుషశీర్ షమచ్ఛైత్యమేధ్యావైమాషా అమేధ్యం పురుషశీర్ ష

మమేధ్యై రేవాస్యామేధ్యం నిరవదా యమేధ్యం కృత్వాహరతి| (తై.సం.5-1)

అగ్నిచయనంలో ఇష్టకోపధాన ప్రసంగంలో పురుష శీర్షోపధానం కూడా చెప్పబడింది. కాని, పురుషశిరస్సు అపవిత్రమై యజ్ఞార్హతను కోల్పోయింది. అటువంటి శిరస్సున గల అపవిత్రతను అపవిత్రములైన మాషములచే (మినుములచే) పోగొట్టి ఆ శిరస్సును యజ్ఞయోగ్యత కలదానినిగా చేసి పిమ్మట దానిని ఉపధానం కోసం తీసుకురావాలని పై శ్రుతి అర్థమని భాష్యం వివరించింది.

మాషాస్తావత్ అపూతత్వాత్ యజ్ఞానర్హాః| పురుషశీర్ షం చ అస్పృశ్యత్వాత్ యజ్ఞానర్హం| తతో యథా రజకాః మలరూపేణ ఊషేణ వస్త్రగతమలం అపనీయ శోధయన్తి ఏవమత్రాపి అమేధ్యైర్మాషైః శిరోనిష్ఠం అమేధ్యభాగం నిస్సార్య తచ్ఛిరః యజ్ఞ యోగ్యం కృత్వా సమానయతి| ఇతి.

అపవిత్రమైన దానిచే మరో వస్తుగత అపవిత్రతను **'ఉష్ణముష్ణేన శీతలం'** అన్నట్లు ఉష్ణ పదార్థాన్ని స్వీకరించడం ద్వారా శరీరగతమైన ఉష్ణతను తగ్గించినట్లు, లోకంలో రజకుడు వస్త్రగతమైన మాలిన్యాన్ని మలరూపమైన ఊషంచే (చవిటి మన్నుచే) పోగొట్టినట్లుగా కొన్నిటిని తగ్గించవచ్చునని వేదం బోధిస్తోందని తెలుసుకోదగింది.

శత్రుబాధ నివారించుకోడానికి చేయదగిన జపం

అగ్నిచయన ప్రకరణంలో వచ్చే మంత్రాల మధ్య **"యదగ్నేయానికాని చాతేదారూణి దధ్మసి"** నుంచి **"అమిత్రానున్నయామి"** (తై.సం.4) వరకు చెప్పబడిన మంత్రసముదాయానికి రాక్షోఘ్న సూక్తమని వ్యవహారం. రాక్షసులుగా, వారితో సమానంగా ఉండి మనల్ని బాధించే శత్రువులనుండి ఆ బాధను నివారించుకోవడానికి వినియోగించుకోవడానికి జపం చేయదగినది ఈ సూక్తం అని **"స ఏతద్రాక్షోఘ్న మపశ్యత్తేనవై సరక్షాగ్ స్యపాహత"** శ్రుతి తెలియచేస్తోంది.

నష్టధన ప్రాప్తి కోసం జపించదగిన మంత్రం

అగ్నిచయన ప్రకరణంలో ఉఖ అనే ఒక మృణ్మయ పాత్ర (మట్టి పాత్ర) ఉంటుంది. అందులో ఉంచబడిన అగ్నిని ఉఖాగ్ని అంటారు. ఈ అగ్నిని **"ఉపరినాభేర్ధారయమాణః విష్ణోః క్రమోఽసీతి చతురోవిష్ణుక్రమాన్ ప్రాచః క్రామతి"** అనే సూత్ర ప్రకారం చయనకర్త అయిన యజమాని సువర్ణరుక్మాన్ని (బంగారు బిళ్ళను) మెడలో తగుల్చుకుని అగ్నితో కూడిన ఉఖను దానిపై ధరించాలి. ఆ ప్రకారం ధరించి **"విష్ణోః క్రమోఽసీతి"** మొదలైన నాలుగు మంత్రాలతో నాలుగు అడుగులు తూర్పుగా వేయడం అనే ఒక ప్రక్రియ ఉంది. దాని తర్వాత **"అగ్నేభ్యావర్తిన్నభిన ఆవర్తస్వ"** అనే నాలుగు మంత్రాలతో ప్రదక్షిణం చెయ్యాలని కూడా చెప్తోంది.

అగ్నేఽభ్యావర్తిన్నితి చాతస్భిః ప్రదక్షిణమావర్తతే|

అని సూత్రం. ఇందులో రెండో మంత్రం చెప్తోంది-

అగ్నే అఙ్గిరశ్శతం తే సన్త్వా వృతస్సహస్రన్త ఉపావృతః తాసాం పోషస్య పోషేణ పునర్నో నష్టమా కృధి పునర్నోరయిమాకృధి|

"అంగ సౌష్ఠవంతో కూడిన ఓ అగ్నీ! నీ ఆవృత్తి శక్తులు, ఉపావృత్తి శక్తులు శత సహస్రాక సంఖ్యాకములగు గాక" అని ప్రార్థించడం ఈ మంత్రార్థం. అయితే, ఆవృత్ అంటే ఏమిటి? ఉపావృత్ అంటే ఏమిటి? అగ్నిదేవత ఈ ప్రార్థించేవానివైపు తిరిగి శతసంఖ్యాకంగా ధనాన్ని సమకూర్చడం ఉపావృత్. ప్రార్థించే వానియందు గల స్నేహాతిశయంతో అగ్ని తననుంచి, సమీపవర్తులైన పురుషులనుంచి కూడా ద్రవ్య విశేషాలను మళ్లించడమే కాక ఆ ధనాన్ని శత, సహస్ర, లక్ష సంఖ్యాకమైన పోషణతో-అంటే వడ్డీతో సహా అభివృద్ధి చేసి దానితో నష్టమైన ధనాన్ని పూరింపచేసి పూర్వం సంపాదించిన ధనాన్ని తిరిగి సంపాదింపబడినదానినిగా చేయుము అని ప్రార్థించడంచే నష్టధనాన్ని ప్రాప్తింపచేయడమే గాక అతిశయంగా ఆ ధనాన్ని వృద్ధి పరచడంలో అగ్నిదేవత అనుగ్రహిస్తుంది, అని తెలుస్తోంది. కనుక నష్టధనులు పై మంత్రాన్ని జపం చేసి పూర్వ వైభవాన్ని పొందడానికి ప్రయత్నించవచ్చు.

ఈ ప్రకరణంలోనే మరో రెండు మంత్రాల ఉపయోగం కూడా వివరించబడుతోంది. అగ్నిచయనంలో వినియోగింపబడు అప్రియ సంజ్ఞక సామిధీనీ మంత్రాలలో రెండు మంత్రాలు **"అతినిహో"** **"అనాదృష్యో జాతవేదా"** అనేవి.

అతినిహో అతి స్రిధోఽత్యచిత్తిమత్యరాతిమగ్నే నిశ్వాహ్యగ్నే దురితా సహస్వాధాస్మభ్యగ్ం సహవీరాగ్ం రయిందాః|

ఇక్కడ **నిహ** అను శబ్దంచే శ్వ, శుకరాది జన్మ అనగా కుక్కజన్మ, పందిజన్మ వంటివి రావడానికి కారణాలయిన పాప విశేషాలు చెప్పబడుతున్నాయి. **'స్రిధ'** అను శబ్దంచే శరీరం శోషించడానికి

కారణభూతమైన రోగవిశేషాలు చెప్పబడుతున్నాయి. కాబట్టి అటువంటి పాపాలను, అటువంటి రోగ విశేషాలను పోగొట్టుకోదలచినవాడు పై మంత్రాన్ని జపించాలి.

అనాధృష్యో జాతవేదా అనిష్కృతో విరాడగ్నే క్షత్ర భృద్దీదిహీహ| విశ్వాఆశాః ప్రముంచన్మానుషీర్భియశ్శివాభిరద్యపరిపాహినో వృధే|

అనే మంత్రాన్ని తృష్ణలను, వ్యాధి భీతిని పోగొట్టుకో తలచినవాడు జపించాలి. "విశేషణ విశిష్టుడవైన ఓ అగ్నీ! నిషిద్ధమైన వాటిని ఆచరించాలనే కోరికలు మనుష్యులకు వచ్చే వ్యాధులవంటి భయాలు మాకు సంక్రమించకుండా నివారింప చేస్తూ కటాక్ష వీక్షణాలతో మా అభివృద్ధి కోసం మమ్మల్ని సర్వదా రక్షించుము" అని ప్రార్థించడం ఈ మంత్రానికి అర్థం. అగ్నిచయన ప్రకరణంలో **"ఉఖా"** అనే మృణ్మయపాత్రలో అగ్నిని స్థాపించి **"విష్ణోః క్రమోఽసీతి చతురో విష్ణుక్రమాన్ ప్రాచః క్రామతి"** అను సూత్ర ప్రకారం ఒక్కో మంత్రంతో తూర్పుగా ఒక్కో అడుగు వేయాలి అని తెలుసుకున్నాం. మరుసటి రోజున ఆ ఉఖ్యాగ్నిని ఉపస్థానం చేయాలని **"పూర్వేద్యుః ప్రకామామత్యుత్తరేద్యురుపతిష్ఠతే"** (తై. సం.5) అను శ్రుతి విధిస్తోంది. **"దివస్పరీత్యేకాదశభిః ద్వాదశభిస్తృయే దశభిర్వావాత్సప్రేణోపతిష్ఠతే"** అని కల్పసూత్రం విధిస్తోంది.

అనగా **"దివస్పరి ప్రథమం జజ్ఞే"** ఇత్యాది మంత్రసంఘానికి వాత్సప్రం అని పేరు. దీనితో ఆ ఉఖ్యాగ్నిని ఉపస్థానం చేయడం అంటే ప్రార్థించడం అని అర్థం. ఈ రెండు క్రియల సామర్థ్యంవలన **"తస్మాద్యోగేఽన్యాసాం ప్రజానాం మనః క్షేమేఽన్యాసామ్"** అని, **"అలబ్ధస్యలాభః యోగః లబ్ధస్య పరిపాలనం క్షేమః"** యోగం, క్షేమం లభిస్తాయన్నారు. ఇదివరకు లేనిదాన్ని పొందడం యోగం అని, ఉన్నదాన్ని జాగ్రత్తగా రక్షించుకోవడం క్షేమమని చెప్పబడింది. కానీ, లోకంలో కొందరికి మనస్సు యోగమందే ప్రవర్తించడంగా, కొందరి మనస్సు క్షేమమందు ప్రవర్తించడంగా ఉండడానికి పై వైదిక క్రియాకలాపమే కారణమని చెప్తోంది. ఇది మనకు లోకంలో అనుభవ సిద్ధమే కానీ, ఈ విధంగా ప్రవర్తించడానికి వైదిక క్రియాకలాపం కారణమని మనకు తెలియని దాన్ని పై శ్రుతి తెలియపరుస్తోందని గమనించాలి.

"యావతీవై పృథివీ తస్యైయమ ఆధిపత్యం పరీయాయ యోవై యమం దేవయజనమస్యా అనిర్యాద్యాగ్నిం చినుతే" (తై.సం.5-2-3)

దీని పూర్వాపర ప్రసంగం ఇలా ఉంది. అగ్నిచయనం చేసే యజమాని చేయబోయే క్రతువుకు కావలసిన దేవయజన ప్రదేశాన్ని నిశ్చయించుకోవాల్సి ఉంది. కాని, ఎంత పృథివి ఉందో అంత పృథివికీ ఆధిపత్యం యమునిది. ఆ యముని యాచించకుండా దేవయజన నిర్మాణం చేసి అగ్నిచయనం చేస్తే ఆ చయనక్రతువు యమార్థం అవుతుంది కానీ ఆత్మార్థం కాదు. అందుకని ఆ యమభృత్యుల్ని ప్రార్థించాలి.

ఆపేతవీతవి చ సర్పతాతః యేత్రస్థపురాణాయే చ నూతనాః|

అనే మంత్రంతో "ఓ యమభృత్యులారా! ఈ దేవయజన స్థలంలో పురాతన కాలంనుంచి, ఇటీవలి కాలం నుంచి ఉంటున్న మీరందరు ఈ దేవయజన స్థానంనుండి తొలగండి. అత్యంత దూరంగా వెళ్ళండి. **"విచసర్పాత"**- ఈ స్థానంయొక్క సాన్నిధ్యాన్ని మా కోసం సర్వభూమ్యాధిపతి అయిన యముడు మాకు ఇచ్చాడు అని ప్రార్థించాలని పై శ్రుతి చెప్తోంది.

దీనివల్ల తెలుసుకోదగిన విషయం- పృథివికంతకూ యముడు అధిపతిగా ఉండెనని, పృథివంతా ఆయన అధీనంలో ఉంది కనుక అతనిని యాచించి దేవయజన నిర్మాణం చెయ్యాలని చెప్తున్న ఈ ఉపాఖ్యానంవల్ల లోకంలో మనం కూడా గృహయజమానితో గాని, భూస్వామితో గాని ప్రభుత్వ స్వాధీనంలో ఉన్నదాని విషయంలో ప్రభుత్వం వారితో చెప్పకుండా ఏదైనా వృక్షపోషణ గాని, గృహనిర్మాణం గాని చేస్తే అవి

ఆ అసలు యజమానికే (ప్రభుత్వానికే) చెల్లుతాయి గాని తనకు మాత్రం చెందవని దీనివల్ల సూచించ బడుతోంది.

ఈ అగ్నిచయన ప్రకరణంలో అనేక ఇష్టకలను (లోక పరిభాషలో ఇటుకలను వేదంలో చెప్పిన పరిమాణం ప్రకారం తీయించి మంథనా జన్యమైన అగ్నిచే కాల్చబడిన ఇష్టకలను) ఉపధానం (పేర్చడం) చేసే సందర్భంలో-

పంచచోడా ఉపదధాత్యప్సరస ఏవైనా మేతాభూతా అముష్మిన్లోక ఉపశేరేఽధో తనూపానీరేవై తా యజమానస్య|

'చుడ్ - సంవరణే' అను ధాతువు వల్ల నిష్పన్నమైనది చోడ శబ్దం. చోడసంజ్ఞ కలిగిన అయిదు ఇష్టకలను ఇదివరకు ఉపధానం చేసిన నాకసన్నామక ఇష్టకల రంధ్రాలను కప్పిపుచ్చేటట్లుగా ఉపధానం చెయ్యాలి. పంచ సంఖ్యకాలై పూర్వపు ఇష్టకా రంధ్రాలను కప్పిపుచ్చేవి అవడం వల్ల **"పంచచోడాః"** అని వ్యవహారం.

ఈ ప్రకారం ఉపధానం చేయబడిన చోడేష్టకలు అప్సరసలుగా మారి ఈ యజమాని స్వర్గలోకానికి ఏగినప్పుడు ఇతనిని సమీపిస్తున్నాయని, అవి అప్సరసలుగా మారి యజమాని శరీరాన్ని పరిపాలిస్తున్నాయని చెప్పబడింది. అయితే, ఈ ఉపాఖ్యానం చోడేష్టకలను స్తుతి చేయడానికి బయలుదేరిందే గాని అప్సరసలు సంభవిస్తారని చెప్పడానికి బయలుదేరింది కాదు. దీన్ని ఆధారంగా చేసుకుని క్రతువులను అనుష్ఠించే వారికి స్వర్గలోకంలో అప్సరసలు రంభ, ఊర్వశి మొదలగు వారి సంయోగ మేర్పడుతుందని లోకప్రథ. కానీ అది సత్యం కాదు. దాన్నే మరో విధంగా కూడా మలచి చెప్తోంది శ్రుతి**. "ఉత్తరా నాకసద్భ్య ఉపదధాతి యథా జాయామానీయ, గృహేషు నిషాదయతి తాదృగేవ తత్"** (తై.సం.5) అను శ్రుతి **'నాకసత్తులనే'** ఇష్టకలకు పై భాగాన ఉండేటట్లుగా చోడేష్టకలను ఉపధానం చేయాలని విధించి నాసకదిష్టకలు గృహస్థానీయాలని చోడేష్టకలు జాయాస్థానీయాలని చెప్తున్నాయి.

దీని వల్ల గృహాల్లో ఉండేవారు భార్యలని, వివాహం చేసుకుని భార్యను తీసుకుని వచ్చి **"గృహేషు నిషాదయతి"** అని చెప్పినట్లు గృహాల్లో ఉంచుతున్నారు. కనుకనే **"గృహిణీ గృహముచ్యతే"** (ఇల్లాలు ఉన్నదే ఇల్లు) అని అభియుక్తి బయలుదేరింది.

వివాహానికి ముందు బ్రహ్మచారి ఒక గృహంలో ఉన్నా గృహస్థుడనే వ్యవహారం లేదు. భార్యను తీసుకువచ్చి గృహంలో ప్రవేశపెట్టిన తర్వాతనే అతడు గృహస్థుడుగా వ్యవహరింపబడుతున్నాడు అంటే గృహంలో ఉండే ఆమెకు గృహస్థానంలో ప్రాధాన్యమని, ఆమె అనుజ్ఞతో ఇంట్లో ఉండే భర్తకు అప్రాధాన్యం చెప్పినట్లయింది. కాబట్టి, ప్రాచీన సంప్రదాయంలో స్త్రీలకు ప్రాధాన్యం లేదని కొందరు అనడం అంత సమంజసం కాదేమో అనిపిస్తుంది.

వివాద సమయంలో అనుసరించ దగ్గ మధ్యేమార్గ సూచన

అగ్నిచయన ప్రకరణంలో **"అగ్నిభ్యః పశుమాలభతే"** అను శ్రుతి చేత అగ్నిదేవతాక పశుద్రవ్యక యాగాలు విధింప బడ్డాయి. పిమ్మట పశువులను ఉత్సర్గాన్ని చెప్పి అటు పిమ్మట యజ్ఞ సంతతి కోసం ప్రజాపతి దేవతాక యాగంతో సమాప్తి చేయవలసిందిగా **"ప్రాజాపత్యేన సగ్గ్ స్థాపయతి"** అను శ్రుతి విధింపబడింది. పిమ్మట ఆ పశుయాగంలో మంత్ర విశేషాన్ని ఈ క్రింది విధంగా విధించింది.

ఐన్ద్రాః పశవో యే ముష్కరాయ దైన్ద్రాస్స న్తోగ్నిభ్య ఆలభ్యన్తే దేవతాభ్యస్సమదం దధాతి| (తై. సం.5)

అండాలతో కూడిన పశువులు పుంస్త్వ లక్షణాలు కలిగి ఉండడంచే అనగా ఇంద్రియవృద్ధి కలిగి ఉండడంవల్ల అవి ఇంద్రదేవతాకమైనవి. ఇలాంటి పశువులను అగ్నిదేవతాకంగా యాగం చేయటంచే అనగా స్వతస్సిద్ధంగా ఇంద్రదేవతాక పశువులను అగ్నిదేవతల నుద్దేశించి యాగం చేస్తే పైన చెప్పబడిన ఉభయ దేవతలకు పరస్పరం కలహాన్ని కలగచేసిన వాడవుతాడు. ఈ కలహానికి పరిష్కారం-**"ఆగ్నేయీస్త్రిష్టుభోయాజ్యానువాక్యాః కుర్యాత్"** అను శ్రుతి చెప్పింది. పైన చెప్పబడిన పశుయాగంలో అగ్నిదేవతాక మంత్రాలను త్రిష్టుప్ ఛందస్సుతో కూడిన వాటిని యాజ్యాలుగా వినియోగించిన మంత్రప్రతిపాద్య దేవతలు అగ్నిదేవతలయినా ఆ మంత్రాల్లో ఉన్న ఛందస్సులు ఇంద్రదేవతలవడం వల్ల దేవతలకు కలహం నివారింపబడునని **"ఆగ్నేయీస్త్రిష్టుభోయాజ్యానువాక్యాః కుర్యాత్| యదాగ్నే ఈసైనాగ్నే యా యాస్త్రిష్టుభస్తేనైంద్రాస్సమృద్ధ్యై| న దేవతాభ్యస్సమదం దధాతి"** అను శ్రుతి దేవతలకు కలహం నివారింపబడినట్లు మధ్యే మార్గాన్ని సూచించింది. పిమ్మట పైన చెప్పబడిన సర్వపశువుల స్థానమందు ఒకే ఒక శ్వేతగుణక ద్రవ్యక వాయుదేవతాక పశుయాగాన్ని చయనక్రతువు ఆరంభంలోనే చేయవలసిందిగా **"అపివా సర్వేషాం తేషాం స్థానే వా యవే నియుత్వతే శ్వేతమజం పశుమాలభేత"** అని ఆపస్తంబ శ్రౌత సూత్రము, **"వాయవే నియుత్వతేతూ పరమాలభతే"** అనే శ్రుతి విధించాయి.

వేదం ఇక్కడ ఒక మీమాంసను ఉత్పన్నం చేసి, విచారణ కూడా చేసి పరిష్కార మార్గాన్ని సూచించింది.

యద్వాయవ్యః కార్యాః ప్రాజాపత్యా ఇత్యాహుః యద్వాయవ్యం కుర్యాత్ ప్రజాపతేరియాత్ యత్ప్రాజాపత్యం కుర్యాద్వాయోరియాత్| (తై. సం.5)

పశుయాగం వాయుదేవతాకంగా చేయడమా లేక ప్రజాపతిదేవతాకంగా చేయడమా అని సంశయ స్వరూపం. వాయుదేవతాకంగా చేస్తే ప్రజాపతి దేవతను ఉపేక్షించినట్లు అవుతుంది. ప్రజాపతి దేవతాకంగా చేస్తే వాయువుకు అవకాశం లేకపోతోంది. ఈ రెండు విధాలైన దోషం పరిహరించడానికి మధ్యేమార్గాన్ని ఈ క్రింది శ్రుతి చెప్తోంది.

యద్వాయవ్యః పశుర్భవతి తేనవాయోర్నైతి యత్ప్రా జాపత్యః పురోడాశో భవతి తేన ప్రజాపతేర్నైతి| (తై.సం.5)

పశుద్రవ్యాక యాగాన్ని వాయుదేవతాకంగా అనగా వాయుదేవత నుద్దేశించి చేసి అందులో పురోడాశ యాగాన్ని ప్రజాపతి దేవతను ఉద్దేశించి చేస్తే ఇద్దరినీ గౌరవించినట్లు అవుతుందని పరిష్కారం చెప్పింది. సందేహ భాగంలో చెప్పకపోయినా వైశ్వానరదేవతను ఉపేక్షించడం కూడా దోషమని ఎంచి, పురోడాశమనాన్ని ద్వాదశకపాలకంగా ద్వాదశకపాలాలతో సంస్కరిస్తే వైశ్వానరునితోబాటు ముగ్గురు దేవతలను తృప్తి పరచినట్లు అవుతుందని చెప్పింది.

దీనివల్ల తెలినదేమంటే మనం లోకంలో ఏదైనా ఒక పనిని ఒక విధంగా చేస్తే ఒక వర్గం వారికి, మరో విధంగా చేస్తే మరో వర్గం వారికి ద్వేషమేర్పడేటప్పుడు ఈ రెండు వర్గాలవారిని తృప్తిపరచేలా మరో మధ్యేమార్గం అవలంబించి పరిష్కరించుకోవడం యుక్తమని వేదం మనకు సలహా ఇస్తున్నట్లు గుర్తించాలి.

సర్వవర్ణాల వారికి శ్రేయస్సును కోరడం

యాస్తే అగ్నే సూర్యే ఋచ ఇతి తిస్రోఋచః ఇతి త్రిరుగాఖ్యా ఆహుతీర్జుహుయాత్|

అగ్నిచిత్, అనగా అగ్నిచయనం చేసే యజమాని **'యాస్తే అగ్నే'** లగాయతు గల మూడు ఋక్కులచే హోమం చేయాలని పై సూత్రము, **'యదేవతా ఆహుతీర్జుహోతి"** అను శ్రుతి విధిస్తున్నాయి.

యాస్తే అగ్నే సూర్యే రుచ ఉద్యతో దివ మాతన్వన్తి రశ్మిభిః| తాభిస్సర్వాభిరుచే జనాయ నస్కృధి| (తై.సం.4)

ఓ అగ్నిదేవతా! సూర్యమండలంలో ఉన్న నీ ఉదయాన్ని పొందుతున్న ఏ కిరణాలు ద్యులోకమంతా వ్యాపిస్తున్నాయో ఆ కిరణాలచే మా యజమానికి చక్కని దీప్తినిమ్ము! అని దీని అర్థం. ఇంక మిగిలిన ఋక్కులు ఏమి చెప్తున్నాయి?

1. యావోదేవాస్సూర్యే రుచోగోష్వశ్వేషు యా రుచః|ఇంద్రాగ్నితాభిస్సర్వాభీరుచం నోధత్త బృహస్పతే (తై.సం.4)

ఓ దేవతలారా! మీకు సంబంధించిన ఏ దీప్తులు సూర్య మండలంలో ఉంటున్నాయో, అదే తీరుగా గోవులందు, అశ్వాలయందు ఏ దీప్తులున్నాయో వాటన్నింటిచేత, ఓ ఇంద్రాగ్నులారా! ఓ బృహస్పతే! మా కోసం కూడా దీప్తిని కలుగ చేయండి! అంటే, మమ్మల్ని దీప్తియుక్తులనుగా చేయండి! అనేక పశువులుండగా గో, అశ్వములందు గల దీప్తులను చెప్పడంలో అభిప్రాయమేమి అని శంక కలుగ వచ్చును. దీనికి సమాధానం మరో స్థలంలో చెప్పబడింది. అన్ని పశువుల్లో గో, అశ్వాలే పశువులని, అనగా శ్రేష్ఠమైనవని, **"అపశవోవా అన్యే గో అశ్వేభ్యః"** అశ్వాలే పశువులని ప్రశంసించింది. అందుచేత గో, అశ్వాలయందు గల రశ్ములచే మమ్మల్ని దీప్తిమంతులుగా చేయమని కోరడంలో తాత్పర్యం.

రుచం నో ధేహి| బ్రాహ్మణేషు రుచగ్ం రాజసు నస్కృధి రుచమ్ విశ్వేషు మయిధేహి రుచారుచం| (తై. సం.4)

ఓ అగ్నిదేవతా! అస్మదీయ బ్రాహ్మణులందు, అస్మదీయ క్షత్రియులందు, అస్మదీయ వైశ్యులందు, అస్మదీయ శూద్రులందును తమ తమ కర్మానుష్ఠాన జన్యమైన దీప్తి ఇమ్ము అని ప్రార్థించుటచేత కేవలం మాకే కాదు చాతుర్వర్ణ్యం వారికి ఉపలక్షితమైన సర్వప్రజలకు అధికమైన ప్రకాశాన్ని ఇప్పించమని కోరడం ద్వారా యాగానుష్ఠాతయొక్క విశాలభావం వ్యక్తమవుతోంది. ఈ అగ్నిచయనంలోనే మరో ఆహుతి మంత్రాలున్నాయి.

యదాకూతాదితి దశాహుతీర్హుత్వా| (ఆ.సూ)

ఈ మంత్రంచే సంపాదించబడిన ఏ ఫలాన్ని పూర్వపు యజమాన సంఘం పొందిందో అదే తీరుగా ఓ యజమానీ! నువ్వు కూడా నీ తాలూకు పుణ్యకర్మ ఫలభూతమైన పుణ్యాన్ని పొందుము! అని చెప్పబడుతోంది. ఇక్కడ **'ఆకూత'** మనగా అక్షయమైన సుఖాన్ని పొందుతున్నాను అనే భావం గల సంకల్పం. హృదయ మనగా చిత్తం, అనగా శ్రుతి స్మృత్యాదులచే చెప్పబడినదాన్ని సమాధాన రూపమైన ఉపాయాలను ఆలోచించడం. మనః అంటే అంతఃకరణం. ఆలోచించబడ్డ ఉపాయాల్లో ఏది ప్రతికూలమైంది? ఏది అనుకూలమైంది? ఏది ప్రవృత్యాత్మకం (ఆచరించదగ్గది)? ఏది నివర్తించదగ్గది (ఆచరించకూడనిది?) అను విశేషాకారంగా ఆలోచించేది అంతఃకరణం.

'చక్షు' శబ్దంతో దశ ఇంద్రియాలు ఉపలక్షణంగా చెప్పబడుతున్నాయి. ఏ యే ఇంద్రియాలు సమ్యగనుష్ఠానంచేత అభిమతమైన ఫలాన్ని సాధిస్తాయో వాటన్నింటి యొక్క ఫలసముదాయాన్ని పొందుము. ఏ పుణ్యలోకంలో స్వయంభూ మొదలుగా గల ఋషులు ఎల్లప్పుడు ఉంటున్నారో, ఇట్టి అగ్నిచయనాది క్రత్వానుష్ఠానాల ద్వారా సంపాదించిన పుణ్యవిశేషాలవల్ల పురాతనమైన యజమానులు ఏ పుణ్యలోకంలో ఉంటున్నారో అటువంటి పుణ్యలోకాన్ని పొందుము!

2. ఏతగ్ం సదస్థపరితే దదామి యమావహావచ్చేవధింజాతవేదాః| అన్వాగంతా యజ్ఞపతిర్వో అత్ర తగ్ స్మ జానీత పరమే వ్యోమన్|

యజ్ఞభూమియందు ఋత్విగ్యజమాన స్వరూపులమైన మాతో కలిసి ఉంటున్న ఓ అగ్నిదేవా! మా యజమానిని రక్షించడంకోసం నీకు సమర్పిస్తున్నాను. మరియు నీవు సర్వప్రాణులకు యోగక్షేమాలను కలిగింపచేయు రీతిని తెలిసిన వాడవైనందున భూమియందు గల సర్వులను రక్షించుకొను విధంగా మా యజమానిని కూడా రక్షించడానికై క్రత్వనుష్ఠాత అయిన పుణ్యాత్ముడైన ఈ యజమానిని నా వాడనే భావంతో స్వీకరింపుము. మరియు ఓ దేవతలారా! మా యజమాని మిమ్మల్ని వెంబడించి రాగలడు. అలా వచ్చిన యజమానిని ఉత్కృష్టమైన, విశిష్టమైన రక్షణ యోగ్యమైన మీ లోకంలో మీరు పుణ్యాత్మునిగా, రక్షించదగిన వానినిగా గుర్తించండి.

3. జానీతాదేనం పరమేవ్యోమన్ దేవాస్సధస్థావిద రూపమస్య| యదా గచ్ఛాత్సథిభిర్దేవయానై రిష్టాపూర్తే కృణు తాదావి రస్మై| (తై. సం.4)

ఓ దేవతలారా! మీ లోకానికి వచ్చిన ఈ క్రత్వనుష్ఠాతను పుణ్యాత్మునిగా స్మరించడంలో ఏమీ ఏమరుపాటును చెందక ఈ యజమానియొక్క స్వరూపాన్ని అగ్నిచయనాది క్రత్వనుష్ఠాత స్వరూపంగా గుర్తించండి. మరియు దేవమార్గాలద్వారా మీ లోకానికేగిన యజమానుని గుర్తించి **"ఇష్టాపూర్తే"** వానినిగా గుర్తించండి. ఇష్టములనగా యాగాలు, పూర్తములు అనగా తటాక, ఆరామ, దేవాయతనాదులు అని శాస్త్ర వ్యవహారం. అనగా యాగాలు చెయ్యడం, చెరువులు తవ్వించడం, దేవాలయాలు వంటి వాటిని నిర్మించడం అటువంటి పుణ్య కార్యాలు చేసినవానిగా గుర్తించండి అని కోరుతున్నారు.

కాబట్టి "ఈ ఫలము శ్రౌతకర్మలకు సంబంధించినది, ఈ ఫలం స్మార్తకర్మలకు సంబంధించినది, ఈ ఫలం తటాకాలు, ఆరామాలు, దేవాయతనాలు నిర్మించడంవల్ల లభించిందని ప్రకటించండి" అని కోరడం అనే అర్థాన్ని పై మంత్రం ప్రతిపాదిస్తోంది.

దీనివలన తేలినదేమిటి? పుణ్యాలు చేసినవారు పుణ్యలోకంలో అక్కడ దేవతలతో సహనివాసాలను ఏర్పరచుకొని వీరు మనుష్య లోకంలో చేసిన పుణ్యకర్మల తారతమ్యాలను అనుసరించి, వాటి ఫలతారతమ్యాలను కూడా దేవతలనుంచి తెలుసుకుని అనుభవిస్తారని పై మంత్రసంఘం ప్రతిపాదిస్తోందని తెలుస్తోంది. కాబట్టి, ఓ మనుష్యులారా! ఎల్లప్పుడు మీ మనస్సులను పుణ్య కార్యాచరణవైపు మళ్లించండి అని మన హితవు కోరి చెప్పినట్లయింది.

4. సంప్రచ్యవధ్వమను సంప్రయాతాగ్నే పథోదేవ యానాన్క్షణుధ్వం అస్మిన్థ్స థస్తే అధ్యుత్తరస్మిన్ విశ్వేదేవా యజమానశ్చసీదత| (తై. సం.4)

"ఓ అగ్నే! నీవు మిగిలిన సర్వదేవతలను యజమానునితో కలుపుకొని అందరూ దేవలోకానికి వెళ్ళండి. అలా వెళ్లడంలో మనుష్యలోక, నరకలోక మార్గాలను విడిచిపెట్టి దేవమార్గాలను అనుసరించండి" అని కోరుతోంది ఈ మంత్రం. ఇక్కడ "యజ్ఞభూమి రూపమైన మనుష్య లోకంలోను, పిమ్మట యజ్ఞఫలరూప భోగస్థానమైన స్వర్గ లోకంలో కూడా యజమానుడు, మీరు కలిసి ఉండండి! అని ప్రార్థన.

5. ప్రస్తరేణ పరిధినా స్రుచావేద్యాచ బర్హిషా| ఋచేమం యజ్ఞంనో వహ సువర్దేవేషు గంతవే (తై. సం.4)

మాచే అనుష్ఠించబడిన యజ్ఞసాధనాలైన స్రుక్, స్రువాది రూపంలోను, ప్రస్తర-పరిధి-బర్హిస్సు-వేది మున్నగు వాటితోనూ కూడిన యజ్ఞాన్ని దేవతల మధ్యలో ప్రవేశపెట్టడం కోసం స్వర్గలోకానికి పొందండి!

6. యదిష్టం యత్పరాదానం యద్దత్తం యాచదక్షిణా| తదగ్నిర్వైశ్వకర్మణస్సువర్దేవేషు నోదధత్ (తై. సం.4)

సమస్త కర్మలకు అధిపతి అయిన ఓ అగ్నీ! మాచే అనుష్ఠించబడిన దర్శపూర్ణమాసాది రూపమైన యజ్ఞాన్ని, దీన, అంధ,కృపణాదులకీయబడిన స్వల్ప దానాన్ని, విద్యావినయ సంపన్నుడైన సత్పాత్రులు దొరికినపుడు ఇవ్వబడ్డ ధనాన్ని, యజ్ఞం మధ్యలో దక్షిణగా ఇవ్వబడ్డ గోవులు మొదలైన ద్రవ్యం మున్నగువాటిని అన్నింటిని, అనగా వాటియొక్క పుణ్యవిశేషాలను దేవలోకంలో గల దేవతల సమక్షంలో ఉంచు గాక!" అని ప్రార్థన. అంటే ఈ రూపంగా మనం చేయదగిన, చేయవలసిన పుణ్యకార్య విశేషాలను చెప్పి మనల్ని ఆ పుణ్యకార్యాల వైపు ఉద్దీప్తులను చేయడానికి చెప్పినట్లయింది.

7. యేనా సహస్రం వహసి యేనాగ్నే సర్వ వేదసమ్| తేనేమం యజ్ఞం నోవహ సువర్దేవేషు గంతవే| (తై.సం.4)

ఓ అగ్నే! ఏ మార్గంగుండా సహస్ర దక్షిణాక, సర్వస్వ దక్షిణాక యజ్ఞాన్ని స్వర్గలోకానికి పొందిస్తున్నావో అదే మార్గాన్ననుసరించి మాచే అనుష్ఠించబడు ఈ యజ్ఞాన్ని కూడా స్వర్గలోకాన్ని పొందించుము! అని ప్రార్థన.

8. యేనాగ్నే దక్షిణాయుక్తా యజ్ఞం వహన్త్వర్త్విజః| తేనేమం యజ్ఞం నోవహ సువర్దేవేషు గంతవే| (తై. సం.4)

ఓ అగ్నే! ఏ శాస్త్రీయమార్గాన్ని అవలంబించి అర్హత గల ఋత్విక్కులతోనూ శాస్త్రోక్తప్రకారం దక్షిణతోను కూడిన యజ్ఞాన్ని నిర్వహిస్తున్నారో ఆ శాస్త్రీయ మార్గంగుండా మా యజ్ఞాన్ని స్వర్గలోకానికి పొందించు గాక!

9. యేనాగ్నే సుకృతః పథామధోర్ధారావ్యానశుః| తేనేమం యజ్ఞం నోవహ సువర్దేవేషు గంతవే|| (తై. సం.4)

ఓ అగ్నే! పురాతనులైన పుణ్యాత్ములందరూ ఏ మార్గంగుండా వెళ్ళి అమృతధారలను అనుభవిస్తున్నారో ఆ మార్గం ద్వారా మా యజ్ఞాన్ని స్వర్గానికి పొందించుము.

10. యాత్రధార అనపేతామధోర్ఘృతస్యచయాః| తదగ్నిర్వైశ్వకర్మణస్సువర్దేవేషు నో దధత్| (తై. సం.4)

ఏ పుణ్యలోకంలో అమృతధారలు అవిచ్ఛిన్నంగా స్రవించునో అట్టి పుణ్యలోకాన్ని మా యజ్ఞాన్ని, యజమానిని కర్మస్వామి అయిన అగ్ని పొందించు గాక!

శాస్త్రోక్త ప్రకారం అర్హత కలిగిన ఋత్విక్కులు, శాస్త్రీయమైన దక్షిణతో గూడిన యజ్ఞానుష్ఠానం చేసిన వారిని, సత్పాత్రదానం చేసినవారిని, వీరందర్నీ అగ్న్యాది దేవతలు దేవలోకానికి తీసుకుని వెళ్ళి సహనివాస స్థానం ఏర్పరచి వీరికి ఆ యా కర్మల తాలూకు ఫలం ఇటువంటిదని విపులంగా వివరించారు అని మనకు తెలుస్తోంది, పై మంత్రాల వల్ల!

ఈ ప్రకారం వీరి తాలూకు పుణ్యకర్మలను పుణ్యలోకానికి పొందించండి అని ప్రార్థించడం ద్వారా తరతమ భేదాలతో పుణ్యాలు అనేకములని దీన, అంధ, కృపణాదులను కూడా ఆదరించాలని చెప్పారు. అటువంటి దాని పుణ్యం వేరు, 'దత్త' శబ్దార్థానుష్ఠాన పుణ్యం (దానం చేసిన దాని పుణ్యం) వేరని, పుణ్యఫల రూపాలైన భోగ స్థానాలు వేరు, వేరుగా ఉంటాయని కూడా గుర్తించి మన నిత్యజీవితంలో తదనుగుణంగా పుణ్యకర్మానుష్ఠానానికి, ఏ వర్ణానికి చెందినవారో విచక్షణ చేయకుండా అందర్నీ ఆదరించడానికి సంసిద్ధులం కావాలని మన హితవును కోరి సహస్ర మాతా, పితృ తుల్యమైన వేద పురుషుడు మనకందరికీ బోధించినట్లు తెలుసుకోవాలి.

ఇంతవరకు అగ్నిసంస్కార కర్మ అయిన అగ్నిచయనాన్ని గురించి, అందులో చయనమనగా ఏమి? కామనా భేదంతో చయన భేదాలేవి? చయనంలో వినియోగింపబడు అనేక మంత్రాలు సమాజానికి ఉపయోగపడే ఏ యే విషయాలను ప్రతిపాదిస్తున్నాయి? అనేవి వివరింపబడ్డాయి. ఇందులో స్త్రీల

విశిష్టతను, రాజనీతిశాస్త్రాన్ని చెప్పే కొన్ని మంత్రాలున్నా, అవి ప్రత్యేకంగా **"వేదాల్లో రాజనీతి", "వేదాల్లో స్త్రీల విశిష్టత"** అను శీర్షికలలో విస్తరింపబడ్డాయి, తదుపరి భాగంలో. లోకం అనుకున్నట్లుగా క్రత్వనుష్ఠాత **"మాకు ఆయుష్యం, మాకు ఆరోగ్యం"** అని తన కొరకే పరిమితం చేసుకోక సర్వప్రాణుల శ్రేయస్సును కోరుతున్నట్లు, పుణ్యంయొక్క తరతమ భేదాల ననుసరించి ఫల తారతమ్యాలు కూడా ఉంటాయని, వీటిని గురించి దేవలోకంలోని దేవతలు పుణ్యకర్మానుష్ఠానం చేసిన యజమానికి- "నీచే ఆచరింపబడిన ఫలానా స్మార్తకర్మ తాలూకు ఫలం ఇది, ఫలానా శ్రౌతకర్మ తాలూకు ఫలం ఇది అని విభాగ పురస్సరంగా స్పష్ట పరచి అనుభవింప చేస్తారని, వివిధ రకాల పుణ్యకర్మలవల్ల వచ్చే పుణ్య ఫలాలను వివరించడం వంటి అనేక విషయాలను తెలియచేసి మనకందరికీ పుణ్యకర్మలందు ప్రవృత్తిని కలిగిస్తున్నారని గుర్తించవలెను.

వేదంలో వ్యవసాయం

వేదాలు నిరతిశయ మహిమోపేతాలని, అనంతాలు, అపౌరుషేయాలు, పరమ కారుణికుడైన భగవంతుని నిశ్వాస రూపాలుగా ఆవిర్భవింపబడ్డాయని లోకంలో సర్వులకు తెలిసిన విషయమే కదా! అందువల్లనే **"యస్య నిశ్వసితం వేదా యో వేదేభ్యోఽఖిలం జగత్"** (విద్యారణ్యుల వచనం) అని "ఏ పరమేశ్వరునికి వేదాలు నిశ్వాసరూపాలో, ఏ పరమేశ్వరుడు వేదాలవల్ల ప్రపంచాన్ని సృష్టించెనో, ఆ పరమేశ్వరునికి నమస్కరిస్తున్నానని" శ్రీ విద్యారణ్యచరణులు మంగళాచరణ మొనరించారు. వేదాలు, పైన చెప్పబడిన విశేషణాలు కలవడం వేదవాఙ్మయం లౌకికవాఙ్మయం కంటే సర్వోత్కృష్టము మరియు లౌకిక, వైదిక సర్వవిజ్ఞానానికి మూలభూతం కూడా!

పితృదేవ మనుష్యాణాం వేదశ్చక్షుస్సనాతనమ్| భూతం భవ్యం భవిష్యంచ సర్వం వేదాత్ప్రసిద్ధ్యతి(మ. స్మృ)

పితృదేవతలకు, దేవతలకు మనుష్యులకు కూడా జ్ఞాననేత్రం వైదిక వాఙ్మయం అని, సర్వవిజ్ఞానము వేదం వల్లనే సిద్ధిస్తుందని అర్థం. అటువంటి వేదం చెప్పినవాటిలో ప్రసిద్ధి చెందినవాటిలో కృషికర్మ తాలూకు విజ్ఞానం ఒకటి. కాబట్టి ప్రస్తుతం కృషికర్మను గురించి ప్రస్తావించబడుతోంది. లోకంలో పెక్కుమంది వైదిక వాఙ్మయాలందు ఆధ్యాత్మిక విషయాలు మాత్రమే ప్రతిపాదింపబడుతున్నాయని అభిప్రాయపడుతున్నారు. కానీ కర్మ-బ్రహ్మ అవబోధ మిషతో చాలా నైతిక, వైజ్ఞానిక విషయాలు కూడా ప్రతిపాదింబడుతున్నాయి. ప్రాచీన, అధునాతన భేదంతో కృషికర్మలందు చాలా అంతరం ఉంది. ఆధునిక కాలంలో కృషికర్మవల్ల అధిక సస్యసంపాదన నిమిత్తం కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులు, లౌకిక విజ్ఞానవేత్తలు పలువిధాలైన కృత్రిమ ఉపాయాలను అనుసరించి కృషికర్మను ప్రోత్సహిస్తున్నారు. ఆ ప్రయత్నాలు అధిక సస్యోత్పత్తి విషయంలో సఫల మవుతున్నాయనడంలో సందేహం లేదు. కాని అలాంటి ఆహారాన్ని తినడం వల్ల అనేక అనర్థాలు- అనగా పూర్వమెన్నడూ కనీ వినీ ఎరుగని రోగ విశేషాలు (విశేష రోగాలు) కూడా ఉత్పన్నం అవుతున్నాయనడం సత్యదూరం కాదు.

కృషికర్మకు ఆరంభంలో జలసమృద్ధి కోసం కూపోద్ధరణాదికం చేయాలి. కృ.య.సం.4వ కాండలో అగ్నిచయనానికి సంబంధించిన భూభాగాన్ని **"వేణునా విమిమీతే"** అను శ్రుతి విధించిన ప్రకారం వేణు (వెదురు) దండంచే కొలవాలి. పిమ్మట ఆ వేదియందు ఇష్టకోపధానం చేయడానికి ముందు లాంగలంచే (నాగలి) కర్షణం (దున్నడం) చేయాలి. అందులో చెప్పబడిన ప్రకారంగా కూపోద్ధరణం చెప్పబడింది. **"సంవరత్రాదధాతనేతి సంప్రేష్యతీతి"** అను కల్పసూత్ర ప్రకారం కర్షకులను పిలవాలి.

సంవరత్రాదధాతన నిరాహావాన్కృణోతన|సించామహాఅవటముద్రిణం వయం విశ్వాహాదస్త మక్షితం(తై.సం.4)

ఓ కర్షకులారా! చర్మమయమైన రజ్జువులను (తోలుతో చేసిన తాళ్ళను) బాగా స్థాపించండి. ఆ ప్రదేశంలో బలీవర్దాలకు (ఎడ్లకు) దాహం కోసం కుండీలను నిర్మించండి. పిమ్మట ఉదకం కోసం సంపాదింపబడిన కూపం బహుళోదక యుక్తమయ్యేటట్లు (ఎక్కువ నీరు కలిగి ఉండేలా) లోపల భూమిలో గల పంకము నుద్ధరించుట (లోతుగా మట్టిని తీయడం) ద్వారా సర్వ అహస్సులందు (అన్నీ రోజుల్లోనూ) కూపపాతంచే హింసింపబడకుండా ఉండేటట్లు అనగా ఆ కూపాలు శోషించకుండా (ఎండిపోకుండా) ఉండేటట్లు, అనగా పై ఒడ్డు విరిగి పడకుండా ఉండేటట్లు, గ్రీష్మకాలంలో కూడా ఎండకుండా ఎల్లపుడు నీటిని స్రవించునట్లుగా విశిష్టమైన అవటమును (గోతిని/నూతిని) నిర్మించండి అని కర్షకుల్ని కోరుతున్నారు.

"నిష్కృతాహావ మవటమిత్యవటాదుదక మాహావేషూత్సించతి"

నిష్కృతాహావమవటగ్ం సువరత్రగ్ం సుపేచనమ్| ఉద్రినగ్ం సించే అక్షితమ్ (తై. సం.4)

అను మంత్రాలచే కూపంనుండి నీటిని తోడి కూపం వద్ద నిర్మించిన నీళ్ళతిత్తిని పూరించాలి. కాష్ఠములచేతను (కర్రలతో) గాని, పాషాణాలచేతను (రాళ్ళతో) గాని నీళ్లకుండీలను నిర్మించండి. ఈ కుండీలు ఎటువంటివి అనగా పార్శ్వభాగాలందు నిల్వనీరును విడిచిపెట్టడానికి ఛిద్రాలతో గూడిన, కూపంనుండి ఉదకాలను ఉద్ధరించడానికి దృఢమైన చర్మమయమైన రజ్జువులు గల, నీళ్ళ కుండీలను పూరించడానికి యోగ్యమైన ఉదకోద్ధరణ పాత్రలు అనగా బాల్చీలు వంటివి గల, ఉదకాలతో గూడినటువంటి, అక్కడినుండి ఉదకములు జారిపోకుండా (కారకుండా) క్షయ రక్షితమైన నీళ్ళ కుండీలను నిర్మించండి. అంటే మురికి నీరు బయటకు పోయేలా కన్నాలతో కూడిన, మంచినీరు నింపే నీళ్లకుండీలను నిర్మించాలని అర్థం. దీనివలన బలీవర్దాలు నీళ్ళు తాగడానికి బావులవద్ద కుండీలను నిర్మాణం చెయ్యాలని ఆ నిర్మాణ విశేషాలను కూడా వేదం బోధించింది.

పిమ్మట లాంగలమును అనగా నాగలిని దానికి అమర్చేటటువంటి బలీవర్దముల మెడమీద మోపి "కాడి" అనబడే దారు(కర్ర) విశేషాలను సన్నద్ధం చెయ్యాలని కర్షకులకు బోధించింది.

"సీరాయుంజంతీతి ద్వాభ్యాం సీరం యునక్తి" అని కల్పసూత్రం (ఆ.శ్రౌ.సూ)

1. సీరాయుంజంతి కవయో యుగావితన్వతే పృథక్ ధీరా దేవేషు సుమ్నయా (తై.సం.4)

2. "యునక్త సీరావియుగాతనోతకృతే యోనౌ వపతే హ బీజమ్"

ఓ కర్షకులారా! నాగలిని, దానికి బంధించే కాడికర్రలను సన్నద్ధం చేయండి. వాటిచే దున్నబడిన భూమియందు ఆశీర్వాదరూప మంగళవాక్యంతో కూడిన బీజాల్ని నాటండి. ఆ బీజాల తాలూకు వెన్ను ఫల సమృద్ధిగా ఉండి అనతికాలంలో ఆ సస్యం (పంట) మా సమీపానికి అనగా మా గృహాలకు వచ్చు గాక! అని లాంగలాన్ని పై మంత్రాలతో సన్నద్ధం చేయమని విధించింది.

"లాంగలం పవీరవమితి ద్వాభ్యాం కృషతి" (క. సూ.)

1."లాంగలం పవీరవగ్ం సుశేవగ్ం సుమతిత్సరు| ఉదిత్కృషతి గామవిం ప్రఫర్వ్యంచ పీవరీమ్"

2. శునం నః ఫాలావితుదన్తు భూమిగ్ం శునా కీనాశా అభియన్తు వాహాస్, శునం పర్జన్యో మధునా పయోభిశ్శునా సీరా శున మస్మాసుధత్తమ్

అనే రెండు మంత్రాలతో కర్షణం చేయవలసిందిగా, అంటే దున్నవలసిందిగా విధించింది. వీటి అర్థం- వజ్రాల వలె అతి తీక్షణమైన, బాగా సేవించుటకు శక్యమయిన భూమియందు నిమ్నోన్నతాలు (ఎత్తు పల్లాలు) లేకుండా సమానంగా చేయగలిగిన నాగళ్లను వినియోగించు గాక! కర్షణంచే కర్షకుడు అధికఫలాన్ని

సంపాదించడం ద్వారా ప్రథమ వయస్కురాలైన కన్యకను, ప్రయాణ సమర్థమైన అశ్వాదికమును పొందగలడు. (బాగా వ్యవసాయం చేసి బాగా సంపాదించిన వానికి మంచి కన్యతో వివాహం, అశ్వాది పశు సంపద వంటివి కలుగుతాయని చెప్తోంది!). దీనివలన కర్షణం కర్షకునికి అత్యంత ఫలదాయకమని చెప్పినట్లయింది. **"కామం కామదుఘేతి తిస్రస్తిస్రస్సీతాః కృషతీతి మధ్యే సంభిన్నాభవన్తి"** (ఆ.శ్రౌ.సూ) ఈ మంత్రంచే మూడు మూడు నాగలిచారలు సంభవించేలా (ఏర్పడేలా) మధ్య మధ్య ఆ చారలు కలిసేలా కర్షణం చేయాలని అర్థం.

కామం కామదుఘే ధుక్ష్వ మిత్రాయ వరుణాయ చ| ఇన్ద్రాయాగ్నయే పూష్ణ ఓషధీభ్యః ప్రజాభ్యః (తై. సం.4)

దక్షిణా పర్యావర్తన్తే స్వమేవ వీర్యమను పర్యావర్తన్తే (తై. సం.5)

నాగలి చారలు ఏర్పడేలా, మధ్య మధ్యలో ఆ చారలు కలిసేలా దున్నాలని చెప్తూ, అలా దున్నేటప్పుడు ప్రదక్షిణగా దున్నాలని కూడా చెప్పింది. అలా ప్రదక్షిణగా దున్నితే స్వకీయమైన బలాన్ననుసరించి దున్నినట్లవుతుందని **"స్వమేవ వీర్యమను పర్యావర్తన్తే"** అను శ్రుతి బోధిస్తోంది. ఈ దున్నడం గో జాతికి చెందిన బలీవర్దాలచే (ఎద్దులచే) దున్నాలని చెప్పి, అవి కూడా ఎన్ని బలీవర్దాలుండాలనే విషయాన్ని కూడా ఈ క్రింది శ్రుతి వివరిస్తోంది.

"షడ్గవేన కృషతి షడ్వా| ఋతవ ఋతుభిరేవైనం కృషతి"

కక్ష్యా త్రయరూపేణ అవస్థితేషు త్రిషు యుగేషు బధ్యమానాః (భాష్యం)

యుగమంటే నాగలి కాడి. మూడు నాగలి కాడులకు కట్టబడిన ఆరు బలీవర్దాలు గల లాంగలము 'షడ్గవం' అని చెప్పబడుతోంది. అటువంటి షడ్గవంతో గాని, ఆరు నాగలికాడులందు బంధించబడిన పన్నెండు బలీవర్దాలతోనైనా దున్నాలని **"యద్వా దశ గవేన సంవత్సరేణైవ"** అను శ్రుతి బోధిస్తోంది. దీనివలన బలీవర్దాలచే (అనడ్వాహములచే) భూమిని దున్నాలని చెప్పినట్లయింది. కృష్ణ యజుర్వేద సంహిత 2వ కాండ, 6వ ప్రశ్నలో యాజ్యాపురోను వాక్యాల లక్షణాన్ని చేప్పే ప్రసంగంలో కూడా **"తస్మాత్పూర్వార్థేనా నడ్వాన్భునక్తి జఘనార్ధేన ధేనుః"** అను శ్రుతిలో **"పురస్తాల్లక్ష్మా పురోనువాక్యాభవతి, ఉపరిష్టాల్లక్ష్మా యాజ్యా"** అను వాక్యాలు, బలీవర్దాలు భూమిని దున్నడానికి సాధనాలని చెప్పాయి. ఈ పురోనువాక్యానికి పూర్వార్థంలో దేవతావాచక పదం ఉంటుందని యాజ్యామంత్రానికి ఉత్తరార్థంలో దేవతావాచక పదం ఉంటుందని, వాటి లక్షణమై ఉన్న కారణంవల్ల లోకంలో అనడ్వాహం తన పూర్వభాగమైన మెడయందు నాగలి కాడిని ధరించి భూమిని దున్నడం ద్వారా మనల్ని పోషిస్తోందని చెప్తోంది. ధేనువు అనగా గోవు. **"అచిర ప్రసూతా గౌర్ధేనుః"** అను లక్షణం ప్రకారం కొలది (కొద్ది) కాలమై ప్రసవించిన గోవు **'ధేనువు'** అని చెప్పబడినందువల్ల అటువంటి ధేను శబ్దంచే చెప్పబడిన గోవు, తన ఉత్తరార్థంలో గల పొదుగు ద్వారా మనకు పాలను ఇచ్చి పోషిస్తోందని చెప్పడంద్వారా అనడ్వాహములు (ఎద్దులు) భూమిని దున్నడానికి సాధనాలని చెప్పినట్లయింది. ఇలాగే మరో ప్రకరణంలో **"అగ్నా వైష్ణవం ఘృతే చరుం నిర్వపేచ్చక్షు ష్కామః"** (తై.సం.2-5ప్రశ్న) అను విధివాక్యంచే విధించబడినట్లు చక్షుష్కాముడు అనుష్ఠించదగిన అగ్నావిష్ణు దేవతాకమైన యాగంలో ఘృతమిశ్రితమైన చరుద్రవ్యాలను ప్రశంసిస్తూ **"ధేన్వైవా ఏతద్రేతో యదాజ్యమనడుహ స్తణ్డులాః"** అను శ్రుతి ఆజ్యం, ధేనువు యొక్క రేతస్కారం అని, అనగా పరంపరగా ఆజ్యానికి ధేనువు కారణమని, తండులాల(బియ్యం) కోసం భూమిని దున్నడానికి బలీవర్దాలు కారణమని వేదపురుషుని అభిప్రాయమని చెప్పినట్లయింది.

ఇవన్నీ ఇలా ఉండగా, బలీవర్దాలు కర్షణ సాధనాలని ఇన్ని శ్రుతులు ప్రశంసిస్తున్నాయి కదా! ఈ కాలంలో యంత్ర సాధనాలు కొద్ది కాలంలోనే పెద్ద పెద్ద భూముల్ని దున్నుతున్నాయి. అలాగే సిద్ధమైన, అనగా పక్వం అయిన ధాన్యాన్ని అతికొద్ది కాలంలోనే మార్చడంలో యంత్రాలు ఉపయోగపడుతుండడం మనకందరికీ ప్రత్యక్షమే కదా! ప్రాచీన కాలంలో ఇలాంటి సాధనాలు లేనందువల్ల పురాతనమైన వేదం అలా చెప్పింది కాని, ఈ కాలంలో అది కుదురుతుందా అని శంకించవచ్చు. కానీ, ఆ శంకను నివారిస్తూ యంత్రాలకు సాధ్యం కాని, మనకు కనపడని ఉత్తమ ప్రయోజనాన్ని చేకూర్చకల్గిన శక్తి బలీవర్దాలకు ఉన్నట్లుగా మరో శ్రుతి వివరిస్తోంది.

ఆహితాగ్నిచే ప్రతి పర్వంలోను అనుష్ఠింపబడే దర్శపూర్ణమాస యాగాల్లో ఇడాహ్వానమనే ఒక వైదిక ప్రక్రియ ఉంది. **"ఉపహూతగ్ం రథన్తరగ్ం సహ పృథివ్యా"** ఇత్యాది మంత్రాలను హోతా అనే రుత్విక్కు పఠిస్తాడు. **'ఇడ'** అంటే "గో శరీర ధారిణి అయిన ఇడా దేవత". **"గో శరీరరూపాయా ఇడా దేవ్యాః జపావేదే స్పష్టం స్పష్టం ప్రోక్తా"** అని సాయణ భాష్యం.

పైన చెప్పబడిన **"ఉపహూతగ్ం"** ఇత్యాది మంత్రాలను వేదమే వ్యాఖ్యానించ దలచి ముందుగా ఇడా జన్మ ప్రకారం ఈ క్రింది శ్రుతిచే చెప్తోంది.

మనుః పృథివ్యా యజ్ఞియ మైచ్ఛత్సఘృతం నిషిక్త మవిన్దత్సోఽబ్రవీత్కోఽస్యేశ్వరో యజ్ఞోఽపి కర్తోరితి తావబ్రూతాం మిత్రావరుణౌ గోరేవావ మీశ్వరౌ కర్తోః స్వ ఇతి (తై.సం.2-6-7)

ఏవమస్యా ఇడాయాః యజ్ఞభూమౌ జన్మ సంపన్నమ్ (సా.భా)

పూర్వకాలంలో ఒకానొక మనువు, యజ్ఞంలో ఉపయోగించే ద్రవ్యంకోసం వెదకసాగాడు. ఆ అన్వేషణలో గోవు అడుగులు చిహ్నాగా కలిగిన భూ ప్రదేశాల్లో ఘృతం లభ్యమైంది. ఇలా దొరికిన ఘృతాన్ని లోకంలో భోజనంలో ఉపయోగించే విధంగా యజ్ఞంలో ఉపయోగించడానికి సమర్ధుడెవరని ఆకాంక్షించగా ఆ సమీపంలో గల మిత్రావరుణులు ఆ వాక్యాన్ని విని మనువుతో ఇలా అన్నారు.

"గోవువల్ల నిష్పన్నమైన ఘృతాన్ని వినియోగించడం అంత దుశ్శకం(శక్యం కానిది) కాదు. ఘృత కారణమైన గోవునే యజ్ఞాంగంగా వినియోగించగలమని" చెప్పి, ఆ మిత్రావరుణులు ఇడారూపమైన గోవును అక్కడకు తీసుకు వచ్చారు. అలా తీసుకువచ్చేటప్పుడు ఆ గోవు భూమిలో ఎక్కడెక్కడ పాదాలుంచిందో అక్కడంతా గోపాదాల నుంచి ఘృతం స్రవించింది. పాదాలనుండి ఘృతాన్ని స్రవించేయడానికి గోవు సమర్థమైంది కనుకనే **"తస్మాద్ఘృతపద్యుచ్యతే"** అని గోవుకు **'ఘృతపది'** అనేది అపర నామధేయమని వేదం పేర్కొంది.

దీనివల్ల తేలిన సారాంశం- బలీవర్దాలనే గోవులచే భూమిని దున్నించినా, ధాన్యాన్ని మాసూలు చేసేటప్పుడు తొక్కించినా మనకు కనబడకుండానే మనం ఉపయోగించే ధాన్య విశేషాల్లో ఆ గోవుల పాదాలనుంచి ఘృతం స్రవింపబడుతోంది కనుక, ఆ విధంగా ఘృతమిశ్రితమైన ఆ ధాన్యం మనకు పుష్టికరం. ఈ ప్రకారం ఆరోగ్యకరంగా ఉండడమే ప్రయోజనంగా గల వేదోక్త ప్రాచీన భారతీయ సంప్రదాయం మరో శ్రుతిలో కూడా ఇటువంటి విశేషణాన్నే చెప్పింది.

ఘృతేన సీతా మధునా సమక్తా విశ్వైర్దేవై రనుమతా మరుద్భిః| ఊర్జస్వతీ పయసా పిన్వమానాస్మాన్సీతే పయసాభ్యా వవృత్స్వ| ఘృతేన సీతేతి || (తై. సం. 4)

సీతాంతరాలాన్యభిమృశతి (ఆ.సూ)

నాగలి చారల అన్తరాలములను (నాగలి చారలతో ఏర్పడిన మధ్యప్రదేశాన్ని) ఈ మంత్రంచే అభిమర్శన చేయాలని ఈ మంత్రం అర్థం. దాని అర్థం - నాగలిచే దున్నబడి భూమియందు ఏర్పడిన నాగలిచార మధురమైన గోఘృతంచే బాగా తడుపబడి, విశ్వేదేవతల చేతను, మరుద్దేవతల చేతను ఈ విధంగా దున్నబడిందని చెప్పబడడం!

అలా భూమిని దున్నిన తర్వాత, ఓ భూ దేవతా! మాకు పునః పునః బలవర్ధకమైన సస్యాలను (పంటలను) ఇచ్చుగాక! అని ప్రార్థించి భూమియందు పండిన పంటతాలూకు విశేషం సంక్రమించడంవల్ల ఆ ఆహారం మనకు పుష్టికరంగా ఆరోగ్యకరంగా ఉంటుందని చెప్పాలి.

ప్రస్తుత కాలంలో ట్రాక్టర్లను, యంత్ర విశేషాలను భూమిని దున్నడానికి, ధాన్యం మాసూలు చేయడానికి వాడుతున్నాం కనుక మన కంటికి కనబడని ఆ గోఘృత సంయోగం మన ఆహార ద్రవ్యానికి సంభవించడం లేదని గుర్తించాలి.

ఇంతవరకు బలీవర్దాలచే బంధింపబడిన నాగలిచే భూమిని దున్నాలని, ఆ బలీవర్దాల సంఖ్య ఆరు లేక పన్నెండు అని, అలా బలీవర్దాలచే దున్నించిన భూమియందు పండిన ధాన్యం మనకు ఆరోగ్యకరమని, ఆధునిక కాలంలో యంత్రాలతో వ్యవసాయం చేస్తుండడం వల్ల మనకు ఆ విధమైన అదృష్టరూపమైన గోఘృత సంయోగంతో కూడిన ఆహారధాన్యాలు, వాటిద్వారా లభించే పుష్టికర, ఆరోగ్యకర ఆహారం లభించడం లేదని వివరించడమైంది.

అంతేకాదు, కర్షణకర్మ పూర్తయ్యాక బలీవర్దాలను ఎక్కడ విడిచి పెట్టాలనేది కూడా వేదంలో విచారణ చేసి దిగ్విశేషాన్ని విధించింది.

"ఏ తావన్తో వై పశవో ద్విపాదశ్చ చతుష్పాదశ్చ తాన్ యత్ప్రాచ ఉత్సృజే ద్రుద్రాయాపి

దద్యాత్ యద్దక్షిణా పితృభ్యో నిధువేద్యత్ప్రతీచో రక్షాగ్ంసి హన్యుః"

"ఉదీచ ఉత్సృజత్యేషావైదేవ మనుష్యాణాగ్ం శాన్తాదిక్" (తై.సం.5)

లోకంలో ద్విపాత్పశువులు (రెండుకాళ్ళ పశువులు) చతుష్పాద పశువులు (నాలుగు కాళ్ళ పశువులు) అని రెండు విధాలు. మనమందరం ద్విపాత్పశువులం. కర్షకులైన ద్విపాత్పశువులు బలీవర్ద ప్రేరకులు. బలీవర్దాలు చతుష్పాద పశువులు. ఈ పశువులను ఉదఙ్మఖంగా (ఉత్తర దిక్కుగా) విడవాలి. ప్రాఙ్మఖంగా (తూర్పు దిక్కుగా) విడిస్తే రుద్రుడు తన దిక్కుకు సమీపంలో గల ప్రాగ్దిక్కుకు వచ్చి అక్కడ విడువబడిన బలీవర్దాలను హింసించడానికి సిద్ధంగా ఉన్నట్లు, దక్షిణ దిక్కులో విడిస్తే ఆ దిక్కు పితృదేవతలకు స్థానమైనందున వారికి సమర్పించినట్లు అవుతుందని ప్రత్యగ్దిక్కునందు (పడమర దిక్కునందు) విడిస్తే ఆ స్థానంలో గల రాక్షసులు వాటిని హత్య చేస్తారని, ఉదగ్దిక్కు (ఉత్తర దిక్కు) బాధా రహితమైందని చెప్పింది.

"ఏషావై దేవమనుష్యాణాగ్ం శాన్తాదిక్" అని దేవతలకు, మనుష్యులకు కూడా శాంతమైన దిక్కు అయినందువల్ల **"తామేవైనాననూత్సృజతి"** అని ఉత్తరదిక్కులో బలీవర్దాలను విడిచిపెట్టాలని నిర్ణయించి విధించింది.

ఈ ప్రకారం కర్షణ విధానంతో బాటు కర్షణానంతరం బలీవర్దాలను ఎక్కడ విడిచిపెట్టాలనే స్థానాన్ని కూడా చెప్పడమే కాక, సస్యం రెండు విధాలని, ఒక సంవత్సరానికి రెండు పంటలని కూడా వేదం బోధించింది. పంటలు రెండు విధాలంటే - కృష్ట పచ్యము, అకృష్టపచ్యము అని. కర్షణం చేసిన (దున్నిన)

భూమియందు పండించింది కృష్టపచ్యం. కర్షణం లేకుండా (దున్నకుండా) పండించింది అకృష్టపచ్యం అని. చయన ప్రకరణంలో చయనం చేసే ప్రదేశమంతా కర్షణం ప్రాప్తిస్తుండగా కొంత ప్రదేశంలో కర్షణాన్ని వారించడానికి ఈ ప్రకారంగా విధిస్తోంది.

ఇయం వా అగ్నే రతి దాహాదబి భేత్సైతద్ద్విగుణ మపశ్యత్కృష్టంచాఽకృష్టంచ తతోవా ఇమాం నాత్యదహద్యత్కృష్టం చాఽకృష్టంచ భవత్యగ్నేరనతి దాహాయ (తై. సం.5)

లాంగలం పవీరవమితి ద్వాభ్యాం కృషతి (ఆ.శ్రౌ.సూ)

అను వచనంచే అగ్నిచయన ప్రదేశమంతా కర్షణం ప్రాప్తిస్తుండగా కొంత భాగంలో మాత్రం కర్షణం వద్దని పై శ్రుతి వారిస్తోంది. దీనికి కారణమేమనగా కర్షణం చేయబడిన స్థానంలో చయన సంస్కార సంస్కృతుడైన అగ్ని ఆ భూమిని అత్యంతం దహింపచేస్తాడు. ఆ అతి దాహాన్ని నివారింపచేయడానికి కొంత ప్రదేశంలో అకర్షణ (కర్షణ చేయకపోవడం) అను ఉపాయాన్ని విచారించి ఆ ప్రకారం చెప్పబడింది.

లోకంలో దెబ్బ తగిలిన శరీరావయానికి అగ్నియొక్క వేడి అత్యన్త బాధను కలిగిస్తుంది. కానీ, మిగిలిన శరీరానికి అంత బాధ కలగదు కదా! అదే ప్రకారం భూమికి అత్యంత దాహమనే ఆర్తిని నివారించడానికై రెండు విధాలుగా కర్షణము, అకర్షణము కూడా అనుసరించాలని ఈ రెండు ప్రదేశాలలో ఒకటి కృష్టపచ్యము, మరొకటి అకృష్టపచ్యము అని సస్యం రెండు విధాలని బోధించింది. అనగా మన వ్యవసాయంచే మనకు లభించే వ్రీహ్యాది ధాన్యాలు కృష్టపచ్యాలు అనబడతాయి. అరణ్యాల్లో కర్షణం లేకుండా లభించే నీవారధాన్యం అకృష్టపచ్యాలు అనబడతాయి. అంటే, దున్నిన భూమిలో పండిన సస్యం, దున్నని భూమిలో పండిన సస్యం అని రెండు విధాలు.

అగ్నిచయన ప్రకరణంలో ఉఖ అనేది అగ్నికి ఆధారభూతమైన మృణ్మయ పాత్ర. ఆ అగ్నిచే తప్తం చేసేటప్పుడు వినియోగమయ్యేవి రెండు మంత్రాలు-

వరూత్రయస్త్వాదే వీర్విశ్వదేవ్యావతీః పృథివ్యాస్సధస్థేంగిర స్వత్పచం తూఖే|

జనయస్త్వాదే వీర్విష్వదే వ్యావతీ ..... పచన్తు| (తై. సం.4)

ఈ రెండు మంత్రాల్లో మాత్రమే **పచన్తు** అని ప్రయోగం ఉంది. రెండు సార్లు పచన్తు అనడంవల్ల **"ద్విః పచ్చన్త్విత్యాహ తస్మాద్ద్వి స్సంవత్సరస్య సస్యం పచ్యతే"** (తై.సం.5) అని సంవత్సరానికి రెండుసార్లు సస్యం పక్వం చేయబడుతోంది అని వేదం పేర్కొంది. దీనివల్ల సంవత్సరానికి రెండు పంటలని చెప్పినట్లయింది. ఇప్పటి కాలంలో బోరింగులు మొదలగు సదుపాయాలు రావడంతో మొదటి పంట అయిన తర్వాత భూమి శోషించకుండానే మళ్ళీ పంటలను ఆరంభించడంవల్ల అల్పకాల పక్వమైన సస్యం లభిస్తోంది. దాని తాలూకు ధాన్యాన్ని మనం వినియోగించడంతో వ్యవధానం ఎక్కువ లేకుండా సంతానం కలుగుతోందని సంతానోత్పత్తికి, పరంపరగా అన్నమే కారణమని **"అన్నాద్భూతాని జాయన్తే"** అను శ్రుతి చెప్తోందని గ్రహించాలి. పుష్టికరమైన పంటలు కావాలంటే పంటలమధ్య వ్యవధానం ఉండాలని, పంటల మార్పిడి విధానం ఉండాలని ఇప్పటి శాస్త్రవేత్తలు చెబుతూ ఉండడం తెలిసిందే!

భూమి ఖననం

భూమిని ఎంత లోతుగా దున్నాలి?ఎంత లోతుగా ఓషధులను పాతాలి లేదా బీజాలను భూమిలో ఉంచాలి అన్నవాటికి వేదం ఇలా సమాధానం చెప్తోంది. దర్శపూర్ణమాస ప్రకరణంలో వేది ఖనన సందర్భంలో-

చతురంగులంఖేయా| చతురంగులం ఖనతి చతురంగులేహ్యోషధయః ప్రతితిష్ఠన్తి| ఆప్రతిష్ఠాయై ఖనతి| యజమానమేవ ప్రతిష్ఠాం గమయతి (తై.బ్రా.3-2-10)

భూమిని దున్నేటప్పుడు 4 అంగుళాల లోతుగా దున్నాలి. 4 అంగుళాల లోతులో నాటిన మొక్క గాని, బీజాలు గాని భూమిలో ప్రతిష్ఠితాలై అభివృద్ధి చెందుతాయి. కాబట్టి, వేదిని కూడా ఆ ప్రకారం ఖననం చేసి వేదిని నిర్మిస్తే యజమాని (యాగకర్త) కూడా బాగా ప్రతిష్ఠితుడు అవుతాడని ప్రశంసించడం ద్వారా వ్యవసాయంలో భూమి ఎంత లోతుగా దున్నాలనేది బోధించినట్లయింది. అంతకుమించి దున్నితే అది పితృదేవతాక మవుతుందని-

పితృదేవత్యాఽతి ఖాతా| (తై.బ్రా)

అని బోధించడం ద్వారా అది (అంతకంటే లోతుగా తవ్వడం) నిషేధించబడింది. పైన చెప్పిన ప్రకారం భూమిని దున్నేక అందులో ఓషధి వాపమ్ (విత్తులు నాటడం) చేయవలసిందిగా చెప్పింది.

యా జాతా ఓషధయ ఇతి చతుర్దశభిరోషధీర్వపతి| (ఆ.సూ)

యా జాతా ఓషధయ| (అ.చ.ప్ర)

ఇత్యాది పధ్నాలుగు మంత్రాలతో పధ్నాలుగు ఓషధుల్ని నాగలి చారలందు ఉంచాలని సూత్రార్థం.

బీజవాప కాలం

ఈ చెప్పిన ప్రకారం భూమిని దున్నిన తర్వాత ఓషధులు (బీజాలు) చల్లడానికి వర్షర్తువు ముఖ్యమైన కాలం అని ప్రశంసించబడింది. వర్ష ఋతువులో నాటబడిన ఓషధుల ఫలం సంవత్సరం దాకా ప్రాణులు అనుభవించడానికి సరిపోతుందని వర్షఋతువు యొక్క అసాధారణ స్వభావాన్ని వేదంలోని ఆరుణకేతుక ప్రకరణంలోని **"సంవత్సరీణం కర్మఫలమ్, వర్షాభిర్దదతాగ్ం సహ"** (తై.ఆ.1) అనే మంత్రం చెప్తోంది. అంతే కాదు, వర్షర్తువులో బీజావాపం చెయ్యకుండా వర్షాకాలాన్ని అతిక్రమించే మనుజులు కేవలం ఆ ఋతువు నుండి మాత్రమే జారినవారు కాక, సంవత్సరం దాకా సంవత్సరఫలం నుండి భ్రష్టులు కాగలరని ఈ క్రింది శ్రుతి బోధిస్తోంది.

యావై ప్రజాభ్యర్గ్ శ్యన్తే| సంవత్సరాత్తాభ్యర్గ్ శ్యన్తే| యాః ప్రతితిష్ఠన్తి| సంవత్సరేతాః ప్రతితిష్ఠన్తి| వర్షాభ్య ఇత్యర్థః| (తై.ఆ.1)

అంటే వర్షాకాలంలో బీజాలు నాటకుండా సమయాన్ని విడిచినవారు (వృధా చేసినవారు) పంట లేక సంవత్సరం వరకు ఆ లేమితో బాధపడతారని భావం. ఇది లోక సహజమే కదా!

రాజసూయాంతర్గతమైన దశపేయ సోమయాగానంతరం **'ప్రయుజ'** అనబడే హవిస్సులు చెప్పబడ్డాయి. ఆ హవిస్సుల నిర్వాపం (యాగం కోసం హవిస్సును రాశినుండి వేరుచేయడం) ఒక్కో మాసంలో ఒక్కొక్కటి చేయదగినదిగా ఆ క్రతుప్రకరణంలో వేదం విధించింది. ఈ ప్రయుజ హవిస్సులు పన్నెండింటిని పూర్వ షట్కం, ఉత్తర షట్కంగా విభజించగా, ఉత్తర షట్కంలో మొదటిగాను, ప్రథమ హవిస్సునుంచి ఏడవ హవిస్సుకి చెందిన సారస్వత యాగం వర్షఋతువులో ద్వితీయ మాసంలో విధింపబడింది.

సారస్వతం చరుం నిర్వపతి తస్మాత్ప్రావృషి సర్వా వాచో వదన్తి| (తై.బ్రా.8 ప్రశ్న)

సారస్వతయాగం వర్షర్తువులో ద్వితీయమాసంలో చేయబడింది కనుక దీని ప్రభావం వల్ల లోకంలో కూడా ఇపుడు కృషికర్మ మనచే కూడా అదే విధంగా చేయబడుతోంది. **"అనడ్వాహాలు"** ఇత్యాది వ్యవసాయానికి సంబంధించిన వాక్కులను పరస్పరం మాట్లాడుకుంటారని చెప్పడంవల్ల కూడా వర్షరుతువు బీజావాపానానికి ముఖ్యమైన కాలమని చెప్పినట్లయింది.

పిమ్మట శరదృతువు లగాయతు చేయవలసిన యాగాలను, వాటి సామర్థ్యంవల్ల జరుగు వ్యవసాయ విశేషాలను కూడా వేదం ఈ క్రింది విధంగా బోధించింది.

పౌష్ణేన వ్యవస్యన్తి| మైత్రేణ కృషన్తే|వారుణేన విధ్యతా ఆసతే|క్షైత్రపత్యేన పాచయన్తే|ఆదిత్యేనాదధతే| (తై.బ్రా.8ప్ర)

ఈ మంత్రానికి సాయణభాష్య ప్రకారం అర్థం ఇలా ఉంది. (సాక్షాత్తు శ్రుత్యర్థాన్ని తెలుగులో రాస్తే అందులో ఇంత ఉందా అని అనిపిస్తుంది కనుక అటువంటి సందర్భాల్లో సాయణ భాష్యం కూడా రాయబడుతోంది). ఇందులో వర్షర్తువు వర్ణన తర్వాత శరదృతువు మున్నగు వాటి విశేషాలు చెప్పబడుతున్నాయి.

శరదృతువు ప్రథమమాసంలో అనగా ఆశ్వయుజమాసంలో పూషదేవతాక యాగం చేయడంవల్ల పూషాదేవత అనుగ్రహంతో కర్షకుడు పుష్టి కలవాడై ఇంత పరిమితమైన భూమిని వ్యవసాయం చేస్తున్నట్లు నిశ్చయించుకుంటారు.

శరదృతువు ద్వితీయమాసంలో (కార్తీకమాసంలో) మిత్రదేవతాక యాగాన్ని అనుష్ఠించడంవల్ల మిత్రదేవతయొక్క అనుగ్రహంతో నిర్విఘ్నంగా వ్యవసాయం చేయగలుగుతున్నారు. హేమంతఋతువు ప్రథమమాసంలో (మార్గశిరంలో) వరుణదేవతాక యాగాన్ని అనుష్ఠించడంవల్ల వరుణదేవత అనుగ్రహంతో గోమయాది రూపమైన ఎరువును ఉంచి నీటితో పరిపూర్ణంగా క్షేత్రాన్ని పుష్టియుక్తంగా చేస్తున్నారు.

హేమంతఋతువు ద్వితీయమాసంలో (పుష్యం) క్షేత్రపతి దేవతాక యాగాన్ని అనుష్ఠించి ఆ దేవత అనుగ్రహంతో సస్యానికి మధ్యలో ఉత్పన్నమైన తృణాదికాన్ని అనగా కలుపు మొక్కలను ఏరివేసి సస్యం అధికంగా పండేలా చేయగలుగుతున్నారు. శిశిరర్తువు ప్రథమమాసం (మాఘం)లో అదితి దేవతాకమైన యాగాన్ని చేసి, ఆ యాగానుష్ఠాన సామర్థ్యంచే అదితిదేవత అనుగ్రహంతో పక్వమైన ధాన్య విశేషాలను సేకరించి కర్షకులు తమ తమ గృహాలందు నింపుకుంటున్నారని ఆ యా యాగానుష్ఠాన సామర్థ్యం వల్ల లోకంలో ఈ విధంగా వ్యవసాయ సాంప్రదాయం ఏర్పడినట్లు శ్రుతులు స్పష్టపరుస్తున్నాయి.

అంతేకాదు, ప్రాచీన సంప్రదాయంలో కూడా అధిక సస్యోత్పాదన కోసం గోమయాది ఎరువులను చల్లడం వంటివి కూడా ఉన్నట్లు వారుణయాగ సందర్భంలో వివరించడమైంది. మరో ప్రకరణం అనగా అగ్నిష్టోమ ప్రకరణంలో-

యథావై లాఙ్గలేనోర్వరాం ప్రభిన్దన్త్యేవమృక్సామే యజ్ఞం ప్రభిన్తో యన్మైత్రా వరుణీం వశామాలభతే యజ్ఞాయైవ ప్రభిన్నాయమత్య మన్వవాశ్యతి శాన్త్యై|

అగ్నిష్టోమ క్రతువులో అగ్నిష్టోమీయ, సవనీయ, అనుబంధ్య అను మూడు యాగాలున్నాయి. అందు మొదటి రెండు యాగాల్లోను ఛాగము (మేక) వినియోగింపబడుతుంది. **'అనుబంధ్య'** అనేది అవభృధమైన పిమ్మట అనుష్ఠింపదగింది. ఇందు **"గౌరనూ బంధ్యా"** అను శ్రుతిచే గోవు పశువుగా విధింపబడింది. ఈ యాగాన్ని గురించి లోక వ్యవసాయ దృష్టాంతంలో ఇలా చెప్తోంది వేదం. లోకంలో కర్షకుడు భూమిని లాంగలంతో దున్ని బాగా భిన్నమైన దాన్ని చేసి **"మత్యమన్వవాశ్యతి-మతం అభిమతం ఫలమర్హతీతి మత్యమ్"** భూమిని అత్యధికంగా ఫలించునట్టి శక్తి కలదాన్నిగా చేయడానికి ఆ భూమియందు

గోమయాది ద్రవ్యం ఉంచినట్లుగా యజ్ఞమనే భూమిని రుక్సామ వేదాలనే నాగలితో దున్నినట్లవుతుందని పిమ్మట మిత్రావరుణ దేవతాకమైన 'పశ్వాలంభనం' అనగా సంతానంలేని గోవు ద్రవ్యంగా గల యాగం చేస్తే లోకంలో గోమయాది ఎరువు అధిక సస్యమిచ్చినట్లుగా యజ్ఞం యోగ్యమైన ఫలాన్నిస్తుందని చెప్పింది.

దీనివల్ల వ్యవసాయదారుడు అధిక సస్యోత్పాదానకోసం భూమియందు గోమయాది ఎరువులు చల్లడం శ్రేష్ఠమని చెప్పినట్లయింది. ఇదే తీరుగా ప్రాచీన సంప్రదాయంలో భూమియందు పాటిమట్టిని అనగా చెరువులు, బావులు వంటి వాటినుంచి తీసిన పాతమట్టిని పోయడమూ ఉంది. ఆ విషయాన్ని రూపాంతరంగా వేదంలో ఆధాన ప్రకరణంలో-

సప్త పార్తివాస్సంభారానా హరత్యేవం వానస్పత్యాస్| (ఆ.శ్రౌ.సూ)

అను సూత్ర ప్రకారం గార్హపత్యాది ఆయతనాలందు మధించబడిన అగ్నిని ఉంచడానికి పూర్వం చెప్పబడిన ఏడు రకాలైన మృత్తికలను ఉంచడంలో ఒక రకం **"సూదము"** అనగా జలప్రదేశంలో గల బురద మట్టిని ఉంచుతారు. దీనివల్ల భూమికి అధిక శక్తిని ఇచ్చే యోగ్యత కలుగుతుందని తెలుస్తోంది.

ప్రజాపతిః ప్రజా అసృజత తాసామన్నముపాక్షీయత తాభ్యస్సూద ముపప్రాభినత్ తతోవై తాసామన్నమ్ నాక్షీయత| యస్య సూదస్సంభారో భవతి నాస్యగృహేఽన్నం క్షీయతే| (తై.బ్రా)

పూర్వం ప్రజాపతి ప్రజలను సృజించెను. సృజింపబడిన ప్రజలకు **"అన్నముపాక్షీయత"**- ఆహారానికి సరిపడునంత అన్న సమృద్ధి లేక క్షీణించిందట! అంటే భూమి ప్రజలకు సరిపడునంత సస్యాన్నీయలేదని అర్థం. ఆ పరిస్థితుల్లో అధిక సస్యోత్పాదనకోసం ప్రజాపతి పైన చెప్పబడిన సూదమనే మృత్తికను భూమి యందుంచెనని, పిమ్మట **"తతోవై తాసామన్నం నాక్షీయత"**- ఆ భూమి ప్రజలకు అధిక సస్యాన్నివ్వడంతో ఆ ప్రజలకు అన్నం క్షీణించలేదని, అనగా సరిపడునంత అన్నం లభించిందని చెప్తోంది. అందుచేతనే-

ప్రజాపతి సృష్టానాం ప్రజానాం| క్షుధోపహత్యై సువితం నో అస్తు| ఉపప్రభిన్న మిషమూర్జం ప్రజాభ్యః సూదమ్ గృహేభ్యో రసమాభరామి| (తై. బ్రా)

అను మంత్రంచే ఆధానమును అగ్ని సంస్కారక కర్మయందు, గార్హపత్యాది ఆయతనాలందు సూదాన్ని ఉంచాలని అర్థం. ప్రజాపతిచే సృజింపబడిన ప్రజలకు క్షున్నివారణ కోసం మాకు యోగ్యంగా తగినంత అన్నం ప్రాప్తించు గాక! ఈ సూదం **"ఇషమూర్జం"** రసవత్తరమైన, బలవత్తరమైన అన్నం ప్రజలకు దొరకడానికి సాధనం అయినందున అగ్నికి నివాస స్థానాలయిన గార్హపత్యాది ఆయతనాలందు ఉంచుతున్నాను అని చెప్పడంవల్ల, సూదమనే మృత్తిక అన్నసమృద్ధి కొరకైన సస్యానికి ఎరువుగా వాడదగిందని తెలుస్తోంది.

ఈ ప్రకారంగా వర్షర్తువులో బీజావాపం **"అనుసీతం వపతి ప్రజాత్యై"** అను శ్రుత్యుక్త ప్రకారం నాగలి చారలననుసరించి **"చతుర్థశభిరోషధీర్వపతి"** అను శ్రుత్యుక్త ప్రకారం ఓషధి బీజావాపం చేసి అధిక సస్యోత్పత్తికి ప్రతిబంధకాలైన కలుపు మొక్కలను తీసివేయాలని చెప్పడమే కాక, గోమయాది ఎరువులను చల్లడం గురించి కూడా వేదం చెప్పి, పంట సిద్ధమైన తర్వాత ఆ ధాన్యాన్ని గృహాలకు తీసుకువచ్చి ఉంచాలని **"ఆదిత్యేనాదధతే"** అను శ్రుతి బోధించింది.

ఇట్లుండగా పక్వమైన ధాన్యాన్ని గృహానికి చేర్చడానికి సాధనాన్ని చెప్తూ **"అనసాచ్ఛయాతి తస్మాదనో వాహ్యగ్ం సమే జీవనమ్"** అను శ్రుతి యాగంలో బండిచేత సోమలతను యాగప్రదేశానికి తీసుకుని వెళ్లాలని సోమయాగ ప్రకరణం 6-1-9లో చెప్పబడినందున దాని సంప్రదాయ సామర్థ్యంచే లోకంలో కూడా సమప్రదేశాల్లో ధాన్యాన్ని బండిచే మోయించదగిందిగా సంప్రదాయం పేర్కొంటుంది. ధాన్యాన్ని

గృహానికి తీసుకువెళ్లడంలో ప్రదేశం అనుకూలంగా లేక విషమంగా ఉంటే శిరస్సుచే మోయదగిందని, **"తస్మాచ్ఛీర్ష హార్యంగిరౌ జీవనమ్"** అను శ్రుతి చెప్పడంచే ఆ ప్రకారమే లోకంలో సంప్రదాయం ఉంది.

ఇంతే కాదు, ధాన్యాన్ని శకటంద్వారా ఇంటికి తెచ్చేకాలంలో శకటానికి బలీవర్దాలను యోజన చేసే (అమర్చే) ప్రకారం కూడా చెప్పబడింది.

వరుణస్య స్కంభనమసీతి శమ్యాం ప్రతిమోచ్య ఉస్రావే తం ధూర్ షాహా విత్యనాడ్వాహావుపాజ్య వారుణమసీతి యోక్త్రపాశం పరిహృత్య ప్రత్యస్తో వరుణస్య పాశ ఇత్యభిధానం ప్రత్యస్యతి| (ఆ.సూ)

ఉస్రావేతం ధూర్ షాహా వనశ్రూ అవీరహణౌ బ్రహ్మచోదనౌ, వరుణస్య స్కంభనమసి వరుణస్య స్కంభసర్జన మసి ప్రత్యస్తో వరుణస్య పాశః| (తై.సం.కాండ 1)

యుగచ్ఛిద్రమంటే బండికాడియొక్క రంధ్రం. అందులో ఉంచబడే శంకు **'శమ్య'** అని చెప్పబడుతుంది. అలాంటి శమ్యను అనడ్వాహాలు బండిని విడిచి వెళ్లడానికి వీలు లేకుండా ఆ రంధ్రంలో ఉంచాలి. అంటే కాడికి కింది భాగంలో అనడ్వాహాల్ని నిలబెట్టి, ఆ అనడ్వాహాలకు గళమందు బంధన సాధనమైన యోక్త్రాన్ని యుగచ్ఛిద్రమందు ఉంచబడిన **'శమ్య'** యందు బంధించాలి. దీర్ఘరజ్జువనే పాశాన్ని శకట పైభాగంలో ప్రసారం చేసి, శకటాన్ని నడిపే రథికుడు పై త్రాడును చేతబట్టుకుని నడపడం సంప్రదాయం. ఇలా చెప్తే ఇదేదో కష్టంగా అనిపిస్తోందేమో కానీ, దీని సారాంశం బండికాడి కింద ఆ ఎద్దుల్ని నిలబెట్టి వాటి మెడచుట్టూ చిన్న తాడులాటిది వేసి ఆ ఎద్దులు బండి విడిచి వెళ్లిపోకుండా ఉండేలా వాటిని తెచ్చి ఆ కాడికి ఉన్న రంధ్రంలో నిలబెట్టి **'శమ్య'** అనే పిడిలాంటి శంకుతో బంధించి వాటిపైభాగాల్లో పెద్దత్రాళ్లను కట్టి, రెండువైపుల నుంచి వచ్చే రెండు తాళ్ళనూ కలిపి ఆ బండి నడిపే వాని చేతిలో ఉంచుకుని వాటి ద్వారా బండిని నడపాలని అర్థం. ఈ రోజు ఇలాంటివన్నీ లోకంలో చూసేక ఇందులో గొప్పేముంది అని అనిపించవచ్చు కానీ, లోకాచారం లేని పూర్వమే వేదం దీన్ని ఇంత విశదంగా పేర్కోవడం ఇందులో విశేషం.

ఇంకా బలీవర్దాలకు పూర్వభాగం స్కంధమనబడే మూపురం, నాగలిని మోయడానికి సమర్థమైనదనే అర్థాన్ని **"తస్మాత్పూర్వార్ధే నానడ్వాన్భునక్తి"** ఇత్యాది శ్రుతులు ప్రతిపాదిస్తున్నాయి.

పైన చెప్పిన విషయాలను బట్టి వేదం కేవలం ధర్మ-బ్రహ్మావబోధక విషయాలనే కాక కర్మావబోధన అనే మిషతో కర్మలందు వినియోగింపబడు మంత్రాలందు లౌకికమైన కృషికర్మకు సంబంధించిన అనేక విషయాలను కూడా తెలియచేసింది.

కూపోద్ధరణం, అనడ్వాహాల ఉపలక్షణంతో సర్వ పశువులకు నీరు అందేలా కూపాలవద్ద నీళ్ల కుండీలు అనే ద్రోణీ విశేషాలను, మురికి పోవడానికి రంధ్రాలను కూడా ఏర్పాటు చేయడం, భూమిని దున్నడానికి అనడ్వాహాలను యోజన (ఏర్పాటు) చేసి వినియోగించడం, భూమిని దున్నడం ప్రదక్షిణంగా చేయాలని చెప్పడం, కర్షణమందు వినియోగింపబడే అనడ్వాహాల సంఖ్యావిశేషము, గోశబ్ద వాచ్యాలైన అనడ్వాహాలతో దున్నడం వంటి విశేషాలను చెప్పింది. ఈ ప్రకారం అనడ్వాహాలతో దున్నించడం, కోతకోసి ధాన్యంగా మార్చుకోవడానికి చేసే నూర్చడంలో కూడా అనడ్వాహాలను వాడడం ద్వారా వాటి కాళ్లనుండి వచ్చే ఘృతం ఆ ఆహార ధాన్యాలమీదకు స్రవించడం ద్వారా మనం భుజించే ఆహారం పుష్టికరం, ఆరోగ్యకరం అవుతుందని చెప్పి అంతటితోనే వదలక, కర్షణం అయ్యేక అనడ్వాహాలను ఎక్కడ వదలాలి అనేదాని దగ్గర్నుంచి వ్యవసాయం చేయడానికి, బీజావాపానికి అనువైన ఋతువులు, అధిక సస్యోత్పత్తి కోసం వాడదగిన గోమయాది ఎరువులను వాడడంతోబాటు, పంట చేతికి వచ్చేక ఇంటికి తీసుకువెళ్లే విధానం దాకా ఎన్నో మెలకువల్ని కూడా తెలియచేసింది, వేదం.

ఈ విషయాలు సాక్షాత్తుగా వేదముఖంగా అందరికీ తెలియక పోయినా తెలిసిన వారివల్ల ఏర్పడిన సంప్రదాయం మన భారతీయ సంస్కృతిలో భాగమై ఇప్పటికీ కొన్ని స్థలాల్లో కనబడుతున్నాయి. దీనివలన కలిగే ప్రయోజనాన్ని ఆధునికులు గుర్తించకపోవడంచే ఆధునిక యంత్రవిశేషాలతోను ఆధునిక ఎరువులను వాడడం ద్వారా అచిర కాలంలోనే అధిక సస్యాన్ని పండిస్తున్నారు. కానీ, ఆ విధమైన ఆహారాన్ని స్వీకరించి అచిర కాలంలో గర్భోత్పత్తి, అధిక సంతానము, చికిత్సకందని వ్యాధులు ఏర్పడడం మున్నగు అనేక అనర్థాలను పొందుతున్నారు.

వీటన్నింటికీ అన్నమే కారణమని **"అన్నాద్భూతాని జాయన్తే జాతాన్యన్నేన వర్ధన్తే"** (తై.ఆ.ఉ.) అను శ్రుతి సర్వభూతాల ఉత్పత్త్యాదులకు అన్నమే కారణమని చెప్తోంది కనుక **"కారణానురూపాణి కార్యాణి"** అను న్యాయంచే కారణరూపమైన అన్నం అచిర కాలంలో పండిన ధాన్యవికారమైతే ఆ ధాన్యం కృత్రిమమైన ఎరువులచే పండింపబడినదై ఆ ఆహారాన్ని స్వీకరించడంచే అనర్థాలు ఏర్పడతాయని చెప్తోంది. అటువంటి ఆహారాన్ని గ్రహించడంతో ప్రాణిజాతం వ్యవధానం లేకుండా అచిరకాలంలో ఉత్పన్నమవుతూ ఉండడం, గర్భోత్పత్తి లగాయతు కృత్రిమమైన ఔషధాలతో పెరుగుతూ ఉండడం సర్వజన విదితం!

కాబట్టి, వేదోక్తమైన ప్రాచీన వ్యవసాయ పద్ధతిని అనుసరిస్తే దానిచే లభ్యమయ్యే విశేషంచే మనకు ఆకలి తీరడమే కాక అనారోగ్య పరిహారార్థం, కుటుంబ నియంత్రణ కోసం కూడా ప్రత్యేక వైద్యశాలలు అవసరం ఉండదనడంలో అతిశయోక్తి లేదు.

కాబట్టి, ప్రాచీన సాంప్రదాయిక వ్యవసాయ పద్ధతి ననుసరించడం ద్వారా ఏర్పడిన అన్నాన్ని ఆహారంగా స్వీకరించి సర్వజనులు ఆరోగ్యవంతులు, ఆయుష్మంతులు అవుదురు గాక! అని వేదం ఘోషిస్తోంది. ఇందులో ప్రసంగాను ప్రసంగంగా ఓషధుల మహిమ కూడా వర్ణింపబడడం ద్వారా వేదం కేవలం కర్మను బోధించి, ఆధ్యాత్మికంగానే కాక మనకు నిత్యజీవితంలో ఉపయోగపడు కర్షక విజ్ఞానాన్ని, ఓషధుల మహిమను తెలియజేసి వైజ్ఞానికంగా కూడా ఉపయోగపడుతున్నట్లు గుర్తించాలి.

ఓషధుల్లో రకాలు

ఓషధులు గ్రామ్య, అరణ్య భేదంతో రెండు విధాలని **"సప్తగ్రామ్యా ఓషధయస్సప్తారణ్యాః"** అను శ్రుతి ఏడు ఓషధులు (తిల, మాష, వ్రీహి, యవలు, ప్రియంగు, అణు, గోధుమలు) గ్రామ్యాలని; వేణు, శ్యామాక, నీవార, జర్తిల (ఆరణ్యక తిలలు) గవీధుక, మర్కటక, గార్ముతములు ఏడూ ఆరణ్యాకాలని బోధించింది. వీటన్నింటినీ **"యాజాతా ఓషధయః"** ఇత్యాది 14 మంత్రాలచేత 14 ఓషధులను అనగా కర్షణం చేయబడిన భూమియందు గ్రామ్య ఓషధుల్ని; కర్షణం చేయబడని భూమియందు ఆరణ్య ఓషధుల్ని నాటాలని **"సప్త గ్రామ్యాః కృష్టే, సప్తారణ్యాః అకృష్టే"** అను ఆ.శ్రౌ. సూత్ర ప్రకారం సూత్రకారులు చెప్పారు. **"కృష్టే వపతి కృష్టే హ్యోషధయః ప్రతితిష్ఠన్తి"** మంత్ర వ్యాఖ్యానంలో **"కృష్టేదేశే వపతి గ్రామ్యా ఇతి శేషః"** (సా.భా) అన్నారు. బీజావాపం చేశాక మూలంయొక్క ప్రసారణంచే ఆ బీజం అంకురించి దృఢమైన అవస్థితి కలిగి ఉండడమే ప్రతిష్ఠిత శబ్దార్థమని భాష్యంలో వివరించారు.

ఓషధుల మహిమ

బీజావాపంలో (ఓషధులను నాటడంలో) వాడబడే 14 మంత్రాలు, వాటి అర్థాలు ఇలా ఉన్నాయి.

1. యాజాతా ఓషధయో దేవేభ్యస్త్రియుగం పురా| మందామిబభ్రూణా మహగ్ం శతం ధామాని సప్తచ||

ఇందులో **'యుగం'** అంటే కాలాన్ని సూచించేది. త్రియుగం అంటే వర్ష, శరత్, వసంతాలనే మూడు కాలాలు. ఈ మూడు కాలాలలో పూర్వం దేవతల సకాశం (సమీపం) నుండి ఉత్పన్నమైన ప్రాణభరణ సమర్థాలైన, పక్వమగుటచే పింగళవర్ణం కల్గిన శతసహస్ర సంఖ్యాకాలైన జాతి భేదాలు కలిగి ఉన్నవాటిలో విశేషాకారంగా ప్రత్యేకంగా ఏడు ఓషధులను చూసి సంతోషిస్తున్నాము.

అనగా పూర్వకాలంలో దేవతలనుండి మూడు ఋతువుల్లో ఓషధులు ఉత్పన్నమయ్యాయని అవి పక్వమైన తర్వాత పింగళ (గోధుమ) వర్ణంగా ఉంటాయని, అందులో శతసహస్ర సంఖ్యాక జాతి భేదాలు ఉన్నాయని, అందులో విశేషంగా గ్రామ్య, అరణ్యాలని చెప్పినట్లయింది.

2. శతం వో అమ్బధామాని సహస్రముతవో రుహః| అధా శతక్రత్వోయూయమిమమ్ మే అగదం కృత|

ఓ మాతృ స్థానీయములైన ఓషధులారా! మీలో అపరిమితాలైన జాతిభేధాలు, అపరిమితాలైన అంకురాలు ఉన్నాయి. మరియు మీ వలన శత సంఖ్యాక క్రతువులు కూడా ఫలవంత మవుతున్నాయి. ఇట్టి సామర్థ్యం గల ఓషద్యభిమాన దేవతలారా! క్రతువుని ఆచరించిన మా యజమానిని క్షుధాది రోగ రహితునిగా చేయండి! అని ప్రార్థించడంచే ఓషధుల మహిమ స్పష్టమవుతోంది.

3. పుష్పావతీః ప్రసూవతీః ఫలినీరఫలా ఉత| అశ్వా ఇవ సజిత్వరీర్వీరుధః పారయిష్ణవః| (తై.సం.4 కాం.)

ఓ ఓషధులారా! అనేక భేదాలుకల మీరు, అనగా- ఫలాలు లేకుండా కేవలం పుష్పాల వరకే ఉండేవి కొన్ని, పుష్పాల తర్వాత ఫలించేవి కొన్ని, పుష్పించకుండానే ఫలించేవి కొన్ని, ఫలాలు, పుష్పాలు లేని **'అఫలా'** కొన్ని, **వీరుదః**- నాగవల్లి మొదలగునవి లతా రూపాలు కొన్ని, ఫలాలు అందించకుండా కొన్ని వేల సంవత్సరాలు అవసానం (అంతాన్ని) పొందించేవి కొన్ని, ఇంకా అనేక విధాలుగా ఉన్న మీరు యుద్ధ సమయంలో భిన్నమైన అశ్వాలన్నీ ఒకే పర్యాయం వేగంగా పరుగెత్తి జయాన్ని సాధించినట్లు అనేక రకాలైన అవాంతర భేదాలున్నా అన్ని ఓషధులు ఫలపర్యవసానం కావాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పబడింది.

4.ఓషధీరితి మాతరస్తద్వోదేవీరుప బ్రువే| రపాగ్ంసి విఘ్నతీరిత రపశ్చాతయ మానాః|

మాతృ సమానులయిన దేవీ స్వరూపులైన ఓ ఓషధులారా! ఫలపరిపాక శక్తి తమయందు స్థాపింపబడుట వలన ఓషధులు అను వ్యుత్పత్త్యర్థాన్ని సార్థకం చేసుకున్నవారు కనుక మా పాపాలను, పాపఫలాలను నశింపచేసి మమ్మల్ని అనుగ్రహించండి! అని ప్రార్థిస్తున్నాను. పరిపాక రూపమైన దాహకమనే శక్తిని ఇముడ్చుకొని ఓషధి శబ్దంచే చెప్పబడుతోంది కనుక ఓషధులు ఇంతటి మహిమోపేతాలని చెప్పబడు తున్నాయి.

5.అశ్వత్థేవో నిషదనం పర్ణేవో వసతిః కృతా| గో భాజ ఇత్కిలా సథయత్సనవథ పూరుషమ్|

ఓ ఓషధి దేవతలారా! మీకు అశ్వత్థవృక్షము, ఫలాశవృక్షము నివాస స్థానం కనుక మీవంటి దేవత లందరూ ఉంటారు కనుకనే అశ్వత్థవృక్షం ప్రదక్షిణ నమస్కారాదులచే పూజింపబడడం, ఫలాశవృక్షం యొక్క సమిధలు యజ్ఞయాగాదులందు ఇధ్మంగా వినియోగింపబడడం వంటి వాటిచే గౌరవింపబడుతూ ఉండడం జరుగుతోంది. భూమిని పొంది మనుష్య జాతిని అన్నదానంచే పోషిస్తున్నారు. ఇంతగా వర్ణించబడిన ఓషధులు ఎంత మహిమోపేతాలో స్పష్టమవుతోంది.

6. యదహం వాజయన్నిమా ఓషధీర్ హస్త ఆదధే| ఆత్మాయక్ష్మస్య నశ్యతి పురాజీవ గృభోయథా||

"పురాజీవ గృభోయథా" కిరాతకుడు చెవులపిల్లిని పట్టుకోవడానికి వచ్చినపుడు, అతని రాకకు ముందు ఆ చెవులపిల్లి చెవులచేత నేత్రాలను కప్పుకొని, భూమిని ఆనుకుని పడుక్కుని, చనిపోయిన

దానివలే పడి ఉన్నట్లుగా, అన్నం తినాలనుకునే వారు అన్నాన్ని తినకుండా మీలో కొన్ని ఓషధుల్ని చేతిలో ధరించి ఉన్నంత మాత్రాన్నే, ఆ ఓషధులు చేతిలో ఉన్నంతవరకు ఆకలి నశిస్తుందని భాష్యంలో వివరించారు. దీనిప్రకారం కొన్ని ఓషధుల్ని హస్తమందు కలిగి ఉన్నంతకాలం ఆకలి అనే రోగ స్వరూపం నశిస్తుందని తేలింది.

7. యదోషధయః సంగచ్ఛన్తే రాజానస్సమితావివ| విప్రస్స ఉచ్యతేభిష గ్రక్షో హామీవ చాతనః|

లోకంలో యుద్ధంలో ప్రతిపక్షుల సేనను జయించడానికి రాజులందరూ ఏకమైనట్లు ఎప్పుడు ఓషధుల్ని మనకు ఫలానివ్వడానికి క్షేత్రంలో చేరుతున్నాయో అప్పుడూ ఆ ఓషధులందు ఉన్న శక్తి ద్వారా మంచి శక్తి చేరుతోందని చెప్తోంది.

విప్రః మేధావీ రసవీర్య భావనాభిజ్ఞః| (సా.భా)

అని చెప్పినట్లు మంచి మేధావి అయిన రసవీర్య భావనను గుర్తెరిగిన వ్యక్తి ఏ ఓషధి వాడితే క్షుధాది రోగం నివారింపబడుతుందో తెలిసినవాడై **'భిషక్'** (వైద్యుడు) శబ్దంచే చెప్పబడుతున్న తీరుగా యాగకర్త కూడా పక్వాలైన ఓషధులచే రాక్షసులను చంపగలిగిన హవిస్సును తయారుచేసి యాగంలో వినియోగించి రాక్షసుల వలన తటస్థించే ఉపద్రవ రూపమైన రోగాన్ని నివారించి 'భిషక్' శబ్ద వాచ్యుడు, అంటే ఒక విధమైన వైద్యుడు అవుతున్నాడు. మరియు

అమీవ చాతనః అమీవాస్ రోగాస్ చాతయతి - వినాశయ తీత్యమీవా చాతనః (సా.భా)

వైద్యుడు ఓషధిజన్య పథ్యాదులచే రోగాన్ని నశింపచేస్తున్నాడు. అనగా రోగనివారకత్వాన్ని కలిగి ఉండడం ఓషధుల మహిమ అని స్పష్టం.

8. నిష్కృతి ర్నామవో మాతాథాయూయగ్ స్థ సంక్రుతీః| సరాః పతత్రిణీ స్స్థనయ దామయతి నిష్కృత||

ఓ ఓషధులారా! క్షుధాది రోగ వినాశం కొరకే మీ ఉత్పత్తి. అందువల్ల రోగ నివారణ చేయడంలో సమర్థులు కండి! రోగం వలె పీడించుచున్న క్షుధాది రోగాన్ని నశింపచేయండి అను అర్థాన్ని ఈ మంత్రం ప్రతిపాదిస్తోంది.

9.**అన్యావో అన్యామవత్వన్యాన్యస్యా ఉపావత|తాస్సర్వా ఓషధయస్సంవిదానా ఇదంనే ప్రావతావచః**(తై.సం.4)

ఒక ఓషధి మరో ఓషధిని రక్షిస్తూ పరస్పరం ఒకదాని కొకటి రక్షక మగుగాక. మీరు కలిసి పనిచేయడం ఉంది కనుక పరస్పర రక్షకత్వమనేది ఉచితమైనదే. కాబట్టి, మీరందరూ ఐక్యమత్యాన్ని పొందినవారై నా ప్రార్థనను ఆలకించి మమ్మల్ని రక్షించండి అని ప్రార్థించడం ఈ మంత్రం యొక్క తాత్పర్యం.

10. **ఉచ్ఛుష్మా ఓషధీనాం గావో గోష్ఠాదివేరతే| ధనగం సనిష్యన్తీ నామాత్మానం తప పూరుష|**

"గావో గోష్ఠాదివ యథా గావః నివాస స్థానాత్ గృహాత్ అరణ్యదేశం గచ్ఛన్తి తద్వత్" అనగా, లోకంలో గోవులు అరణ్యంలో గల పచ్చిక బయళ్ళను ఆహారంగా స్వీకరించడానికై ఉత్సుకతతో తమ నివాస స్థానం నుండి వెళ్ళినట్లుగా, ఓషధులారా! మిమ్మల్ని సేవించడం వల్ల మాకు చాలా విశేషాలు లభించు గాక! చయనకర్త అయిన ఓ యజమానీ! లోకంలో ధనదాతలు ధనాన్ని ఇవ్వడానికి ఇష్టపడినట్లుగా నీకు కూడా శరీరం అనే ధనాన్ని ఇవ్వడానికి ఓషధులు ఇష్టపడు గాక! అంటే ఆ ఓషధుల ప్రభావం వల్లనే శరీరం ఏర్పడుతున్నందువల్ల శరీరాకారంగా రూపొందించిన ఓషధులు నీకు శరీరాన్ని ఇస్తున్నాయని, దీనివల్ల మనలో శరీరాకార నిష్పత్తికి ఓషధులు మూలకారణమని చెప్పినట్లయింది.

11. అతివిశ్వాః పరిష్ఠాస్తేన ఇవవ్రజమక్రముః | ఓషధయః ప్రాచుచ్యవుర్యత్కించ, తనువాగ్ం రపః|(తై.సం.4)

లోకంలో దొంగ రాత్రివేళ గోశాలలో ప్రవేశించి గోవును అపహరించడానికి గోశాలను వ్యాపించినట్లుగా మనచే భక్షించబడిన ఓషధులు మన శరీరంలో ప్రవేశించి అజీర్ణాది దోషాలను నివారించడానికై వ్యాపిస్తున్నాయి. ఇంకా శరీరానికి సంబంధించిన జ్వర, శిరోవ్యాధి, గుల్మ, అతిసార మొదలైన రోగాలన్నీ మనచే చేయబడిన పాపఫలమే అని, దానినంతా నాశనం చెయ్యడానికి సమర్థాలైనవని ఓషధుల మహిమ వర్ణింపబడింది.

12. యాస్త ఆతస్థురాత్మానం యా ఆవివిశుః పరుః| తాస్తే యక్ష్మం విబాధన్తా ముగ్రోమధ్యమశీరివ|

"ఉగ్రోమధ్యమశీరివ" అంటే, స్వకీయ, పరకీయ పక్షపాత రహితంగా శాస్త్రీయ మార్గంగా ప్రవర్తించు మధ్యవర్తిగా ఉండే రాజు దుష్టుల్ని శిక్షించినట్లు ఓషధులు శరీరంలో రసరూపంగా ప్రవేశించి రోగాన్ని విశేషంగా నశింపచేయు గాక! దీనివల్ల తేలిన సారాంశం-ఓషధులు మన రోగాల్ని నశింపచేసే సమర్థ మైనవని చెప్పినట్లయింది.

13. సాకం యక్ష్మ ప్రపతశ్యేనేన కికిదీవినా| సాకం వాతస్యధ్రాజ్యా సాకం నశ్యనిహాకయా (తై.సం.4)

శ్లేష్మంతో కూడుకున్నప్పుడు వచ్చే కంఠధ్వనికి అనుకరణ రూపమైన శబ్దానికి **"కికి"** అని పేరు. దీనితో వ్యవహరింపబడే రోగవిశేషం అనగా శ్లేష్మ రోగానికి కికిదీవి అని పేరు. పిత్తాధిక్యంవల్ల వచ్చే రోగాన్ని **'శ్యేన'** శబ్దంతో చెబుతారు. లోకంలో ఓ యక్ష్మరాజ యక్షాది రోగమా! రోగాధిష్ఠానదేవతా! అని సంబోధించబడే నువ్వు శ్లేష్మజన్య రోగంతో, పిత్తజన్య రోగంతో కూడా బాధింపబడుతూ పీడకల కలిగినప్పుడు అయ్యో! కష్టాన్ననుభవిస్తున్నానని చేసే శబ్దాన్ని అంటే ఆ రోగకారణమైన పీడని నశింపచేయి అని ఈ మంత్రంచే ప్రార్థన చెయ్యడం ద్వారా రాజయక్ష్మ అనే రోగనివారణలో కూడా ఈ ఓషధి ఉపయోగ పడుతోందని, అంటే ఈ ఓషధి శ్లేష్మజన్య రోగ నివారకమని అర్థం.

14. అశ్వావతీగ్ం సోమవతీ మూర్జయన్తీ ముదోజసమ్| ఆవిత్సిస్సర్వా ఓషధీరస్మా అరిష్టతాతయే||

ఏ ఓషధి సమృద్ధివల్ల ధనం ద్వారా అశ్వాలు లబ్ధమవుతాయో ఆ ఓషధి జాతికి అశ్వావతీ అని పేరు. ఏ ఓషధి సమృద్ధివల్ల ధాన్యం ద్వారా సోమయాగం నిర్వర్తింపబడుతుందో ఆ ఓషధి జాతికి సోమవతీ అని పేరు. ఏ ఓషధిని సేవిస్తే శారీరక బలం చేకూరుతుందో ఆ ఓషధిని **'ఊర్జయన్తీ'** అని పిలుస్తారు. ఏ ఓషధిని సేవిస్తే త్వక్, అస్రుక్, మాంస, రుధిర, మేధో, మజ్జా, స్నాయువులనే సప్త ధాతువుల సారభూతమైన అష్టమ ధాతువు అనే ఓజస్సు ఏర్పడుతుందో ఆ ఓషధిజాతి **'ఉదోజాః'** అని వ్యవహరింపబడుతోంది. ఈ ఓషధులన్నీ యజమానికి అరిష్ట నివారణార్థం ఉపయోగపడేలా నేను మిమ్మల్ని, ఓషద్యభిమానదేవతల్ని పొందుతున్నాను అని అధ్వర్యుడు పఠిస్తాడు.

అంటే వివిధ రకాలైన ఓషధులవల్ల వివిధ ప్రయోజనాలు చేకూరుననడంవల్ల, అనగా వివిధ వ్యాధులు నివారింపబడతాయనడంచే ఓషధుల మహిమ ప్రతిపాదింపబడిందని అర్థం.

ఈ విధంగా ఓషధులను బీజాలను భూమియందుంచడానికి వినియోగించే 14 ఋఙ్మంత్రాలు వివరింప బడ్డాయి. మరో ఆరు మంత్రాలు కూడా ఆమ్నాయం చేయబడ్డాయి కనుక వాటి అర్థం కూడా వివరింపబడుతోంది.

1. యాః ఫలినీర్యా అఫలా అపుష్పా యాశ్చ పుష్పిణీః| బృహస్పతి ప్రసూతాస్తానో ముంచన్త్వగ్ం హసః|

ఓషదుల్లో ఫలాలతో కూడిన ఓషధులు కొన్ని, ఫలరహితాలు కొన్ని, పుష్పరహితాలు కొన్ని, పుష్ప యుక్తాలు కొన్ని ఇవన్నీ బృహస్పతిచే ప్రేరేపింపబడినవై యాగంలో హవిస్సు రూపంగా వినియోగింపబడి మమ్మల్ని పాపంనుండి విముక్తులను చేయుగాక! వైద్యునిచే ఔషధరూపంగా ఈయబడినవై పాప జన్యమైన రోగాలనుండి కూడా విముక్తులను చేయుగాక!

2. యా ఓషధయ స్సోమరాజ్ఞీః ప్రవిష్టాః పృథివీమను| తాసాం త్వమస్యుత్తమా ప్రణో జీవాతవే సువ|

సోముడు రాజుగా గల ఓషదులకు సోమరాజ్ఞః అని పేరు. వేరే ప్రకరణంలో **'సోమోవా ఓషధీనాగ్ం రాజా'** అను శ్రుతి ఓషధులకు సోముడు రాజు అని చెప్పింది. ఇటువంటి ఓషధులు భూమిలో నాటబడు తున్నాయి. ఆ ఓషధుల్లో ప్రస్తుతం నాటబడుతున్న ఓ ఓషధీ! నువ్వు ఉత్తమమైనదానివి. ఆ కారణంవల్ల మమ్మల్ని చిరకాలం జీవించడానికి ప్రేరేపించుము.

3. అవపతన్తీ రవదన్దివ ఓషధయః పరి| యంజీవమశ్నవామహై| న సరిష్యాతి పూరుషః|

ద్యులోకం నుండి (ఆకాశం నుండి) పడే వృష్టిబిందువులు ఓషధి రూపంగా ఉత్పన్న మవుతున్నాయని అగ్నిహోత్ర బ్రాహ్మణంలో చెప్పబడింది.

యావన్త స్తోకా అవాపద్యన్త తావతీ రోషధయోఽజాయన్త (తై. బ్రా)

స్వర్గంకంటే పైనుంచి వర్ష బిందువులు భూమిమీద పడి ఓషధులుగా మారి 'ఏ జీవుడు మమ్మల్ని వినియోగించుకొంటాడో అతను ఎన్నడూ నశించడని' పలికాయి. ఓషధులను ఉచిత రీతిలో వినియోగించుకునే వాడు సర్వదా అరిష్ట రహితుడవుతాడని అర్థం. దీనివల్ల ఓషధులు, వనస్పతులు వర్షానికి కారణమని తెలుస్తోంది.

4. యాశ్చేద ముపశృణ్వంతి యాశ్చదూరం పరాగతాః| ఇహ సంగత్యతాస్సర్వా అస్మై సందత్త భేషజమ్|

నా ప్రార్థనను సమీపంనుంచి వింటున్న ఓషధి దేవతలందరూ ఇప్పుడు మాచే అనుష్ఠించబడు కర్మయందు సంగతులై ఈ యజమానికి క్షుధాది రోగ చికిత్సను బాగా చేయుగాక! అని ప్రార్థన.

5. మావోరిషత్ఖనితా యస్మైచాహం ఖనామివః| ద్విపచ్చతుష్పదస్మాకగ్ం సర్వమస్త్వనాతురమ్ (తై.సం.4)

తృణాన్ని చేధించినా వృక్షాన్ని చేధించినా, ధాన్యాన్ని దంపినా హింసాజన్య దోషం సంభవిస్తుందని వేదంలో మరోచోట చెప్పినా చికిత్సకోసం ఓషధుల మూలాలను గ్రహించడానికి ఖననం చేసిన వ్యక్తికి ఆ దోషం సంక్రమింపకుండు గాక! అని ప్రార్థన. ఈ ప్రకారం అనడంవల్ల హింసవల్ల అనర్థం వస్తుంది కావున అహింసను పాటించాలని చెప్పినట్లయింది. చికిత్స కోసం ఏ ఓషధుల మూలాన్ని తవ్వినా హింసాజన్య దోషం రాదని తెలుస్తోంది. అహింసా విషయం ప్రత్యేక శీర్షికలో వివరింపబడుతుంది. ఇంకా మాకు సంబంధించిన మనుష్యులు, పశువులు మొదలుగు ప్రాణి సముదాయం మిమ్మల్ని ఆశ్రయించుకుని జీవిస్తున్నందున ఆ సముదాయమంతా రోగాది ఉపప్రద రహితమగు గాక! అని ప్రార్థన. అనగా ఓషధ్యభిమాన దేవతలను ప్రార్థిస్తే అదృష్టం ద్వారాను, ప్రత్యక్షంగా ఓషధులను సేవించడమనే దృష్టరూప ప్రయోజనం ద్వారాను రోగాలను నశింపచేయుగాక! అని ప్రార్థన.

6. ఓషధయస్సంవదన్తే సోమేన సహరాజ్ఞా| యస్మై కరోతి బ్రాహ్మణస్తగ్ం రాజన్పారయామసి|

'ఓ సోమరాజా! ఏ రోగి చికిత్స కోసం మా మూలాన్ని గ్రహించి బ్రాహ్మణుడు వైద్యం చేస్తున్నాడో ఆ రోగిని మేం వ్యాధినుంచి విముక్తుణ్ణి చేయగలమని' ఓషధీ దేవతలు సోమరాజుతో పలికేరని ఈ మంత్రం ప్రతిపాదిస్తోంది.

దీని సారాంశం- ఓషధీవాప సందర్భంలో వినియోగింపబడే ఈ మంత్రాలన్నీ ఓషధులు క్షుధాది రోగాల్ని, జ్వర, శిరో వ్యాధులను, శ్లేష్మజన్య, పిత్తజన్యాది రోగాలను నివారింపచేయడం ద్వారా కూడా మహా మహిమోపేతాలు అయ్యేయని, ఆ ఓషధుల్ని ఆయుర్వేదాది చికిత్సా శాస్త్రోక్త ప్రకారం మనం వినియోగించుకుని శ్రేయస్సును పొందుదుముగాక అని చెప్తోంది. వివరంగా ఆ ప్రకారాన్ని మాత్రం ఆయుర్వేద శాస్త్రజ్ఞులవల్ల తెలుసుకోనగును.

అహింసా పరమోధర్మః

ఓషధుల మహిమను వివరించే సందర్భంలో వైద్యుడు రోగికి వైద్యం చేయడం కోసం ఓషధిని తవ్వినా 'హింసాజన్య దోషం లేకుండుగాక' అని **"మావోరిషత్ఖనితా"** అనే మంత్రంచే ప్రార్థన చేయాలనడంతో హింసా ప్రసక్తి వచ్చింది. సూర్యోదయాత్పూర్వం లేవాలని సూత్రకారులు, చరకాచార్యులు మున్నగువారు చెప్పిన వచనాలకు మూలభూతమైన వేదంలో ఆ ప్రకారం లేవనివారికి ధాన్యం దంపిన హింసాజన్య దోషం వస్తుందని చెప్పబడింది. దీనివల్ల ధాన్యం దంచినా హింసాజన్య దోషం వస్తుందా అని శంక కలుగుతుందని ప్రసంగానుప్రసంగంగా అహింసను గురించి వేదమెంత వివరించిందో చెప్పడానికి దాన్ని వివరిస్తున్నాను.

"దేవావై హవిర్భృత్వాభ్రువన్| కస్మిన్నిదం మ్రక్ష్యామహ ఇతి" అను ఉపాఖ్యానం దేవతలు హవిస్సును సంపాదించాక ధాన్యం దంపి హవిస్సును నిర్మించారు (తయారు చేశారు) గానీ ధాన్యం దంపిన పాపం ఎవనియందు ఉంచగలమని పరస్పర విచారణ చేసేరట.

"సోఽగ్నిరబ్రవీత్| మయి తనూస్సనిధధ్వం అహం వస్తం జనయిష్యామి యస్మిన్మ్రక్షధ్వ ఇతి| తే అగ్నౌ తనూస్సన్యదధత| తస్మాదాహుః| అగ్నిస్సర్వాదేవతా ఇతి సోంగారేణాపః| అభ్యపాతయత్| తత ఏకతోఽజాయత| సద్వితీయ మభ్యపాతయత్| తతో ద్వితోఽజాయత| సత్తృతీయ మభ్యపాతయత్| తతస్త్రితోఽజాయత| (తై.బ్రా)

అలా విచారించేటప్పుడు అగ్నిదేవత ఇతర దేవతలతో ఇలా అన్నాడు - మీ అందరి శరీరాలను నాలో ఉంచితే ఈ పాపాన్ని భరించగల దేవతలను పుట్టించగలనని అబ్దేవతను మూడుసార్లు కలిసి మొదటిసారి ఏకతుడు, రెండవసారి ద్వితుడు, మూడవసారి త్రితుడునే వారిని పుట్టించాడట!

యదద్భ్యో జాయన్త తదాప్యానామాప్యత్వం| యదాత్మభ్యో జాయన్త| తదాత్మ్యానామాత్మ్యత్వం| (తై.బ్రా.)

వీరు ఉదకాలనుంచి పుట్టారు కనుక ఆప్య దేవతలని, తననుండి పుట్టేరు కనుక ఆత్మీయులని వ్యవహరింపబడ్డారు.

తేదేవా ఆప్యేష్వ మృజత ఆప్యా అమృజత సూర్యాభ్యుదితే|

ఆప్య దేవతలుగా వ్యవహరింపబడిన ఏకతాది దేవతలు, తనయందు సంక్రమింపచేసిన అవహనన జన్యదోషాన్ని **"ఆప్యా అమృజత సూర్యాభ్యుదితే"** సూర్యోదయకాలంలో నిద్రిస్తున్నవారియందు సంక్రమింప చేసేరట. అక్కడినుండి ఎక్కడకు సంక్రమించింది అనగా, **"సూర్యాభ్యుదిత స్సూర్యాభినిమ్రుక్తే"** ఇత్యాది శ్రుతులందు సూర్యోదయకాలంలో నిద్రిస్తున్నవారి నుండి సూర్యాస్తయమకాలంలో నిద్రిస్తున్న వారికి, సూర్యాస్తమయ కాలంలో నిద్రిస్తున్న వారినుండి రజస్వలా సమయంలో మూడు రోజులు పాటించ వలసిన నియమాలను పాటించని స్త్రీలకు కలిగిన సంతానానికి సంక్రమిస్తుందని చెప్పబడింది.

సూర్యాభి నిమ్రుక్తః కునఖిని| కునిఖీస్యా వదతి|

అనగా కునఖుడు (పిప్పిగోళ్ళు కలవాడు) శ్యావదంతుడు (పిప్పిపళ్లు కలవాడు). వీరియందు పైన చెప్పిన దోషం సంక్రమిస్తుంది. ఆ పిమ్మట అక్కగారుండగా చెల్లెలిని వివాహం చేసుకున్నవానికి, వాని నుంచి జ్యేష్ఠుడుండగా వివాహం చేసుకున్న కనిష్ఠుడికి, అక్కడి నుండి వీరహత్య, బ్రహ్మహత్య చేసేవారికి సంక్రమిస్తుంది అని చెప్పడంలో ఎన్నో ధర్మ రహస్యాలను బోధించినట్లయింది.

ఇంతే కాదు, ధాన్యం దంచినా హింసాజన్య దోషం సంక్రమిస్తుందని చెప్పడంచే మనం పాటించవలసిన అహింసా ధర్మాన్ని ఎంతో సున్నితంగా బోధించింది. ఇంకా మన హితమును కోరిన వేదం వేరే ఇతర ప్రకరణాల్లో ఎంతగా అహింసను బోధించిందో ఆ వచనాలను కూడా వివరిస్తాను.

ముందు హింస అనగా ఏమి? ఎన్ని విధాలు? అని విచారణ చేసింది.

మరణానుకూలో వ్యాపారో హింసా| (మీ.శా.భాష్యం)

ఏ పనులు చేయడం వల్ల సాక్షాత్తు మరణం సంభవిస్తుందో, ఆ వ్యవహారం (పని) హింస అని నిర్వచించారు. ఈ హింస పలు విధాలుగా విభజింపబడినట్లుగా మాధవాచార్యులచే వ్రాయబడిన తాత్పర్యదీపికా అనబడే సూతసంహితా వ్యాఖ్యానంలో వివరింపబడింది.

ముందుగా మరణానుకూల వ్యాపారాత్మకమైన హింస క్రోధమూలం, లోభమూలం, మోహమూలం అని మూడు విధాలు. అందులో ఒక్కొక్కటి తిరిగి స్వయం కృతమని, అన్యకృతమని రెండు విధాలు కాగా అన్యకృతమైన దాన్ని అనుమోదించడం (ఆమోదించడం) అని మరలా మూడు విధాలవడంతో మొత్తం తొమ్మిది విధాలయింది. మళ్ళీ అందులో కాయిక, వాచిక,మానసిక భేదాలచే ఇరవయ్యేడు విధాలైంది. అందులో ఒక్కొక్కటి మృదుమాత్ర, మధ్యమాత్ర, అధికమాత్రలు (అంటే స్వల్పంగా, కొంచెం అధికంగా, అత్యధికంగా) అను మూడు విధాలైన పరిమాణ భేదాలచే మొత్తం ఎనభై ఒక్క రకాల హింసలవల్ల రాబోయే దుష్ట ఫలాలను గుర్తెరిగి, వాటిని నిరోధించాలని **"వితర్కబాధనే ప్రతిపక్షభావనమ్"** (పతంజలి యోగ సూత్రం) అను యోగసూత్రం మనకి బోధిస్తోంది. ఏతావతా 81 విధాలైన హింసను విడిచిపెట్టడమే అహింస అని తేలింది. ఇటువంటప్పుడు యజ్ఞాల్లో అగ్నిష్టోమీయ పశుహింస కూడా హింసే అని, వేద శాస్త్రాలు తెలిసినవారు ఇటువంటి పనిచేయడం యుక్తమా? అని శంకిస్తారు కనుక సమాధానం శాస్త్రీయంగా ఇలా చెప్పబడింది.

వేదోక్తేన ప్రకారేణ వినా సత్యం తపోధన| (సూ.సం)

అగ్నిష్టోమీయం పశుమాలభేత|

అని, అగ్నిష్టోమీయం పశువుతో చేయాలని చెప్పడం, **"మా హింస్యాత్సర్వాభూతాని"** (ఉపనిషత్) అని ఏ ప్రాణినీ హింసించకూడదని చెప్పిన సామాన్య వచనానికి అపవాదంగా విశేష శాస్త్రంచే విధింపబడింది. కనుక యాగాంగ హింస అనేది హింస కాదని నిర్ణయించారు శాస్త్రకారులు. ఇంకా అహింసను పాటించాలనే విషయంలో వేదం ఎంత జాగరూకతగా ఉందో గమనిస్తే చాలా విషయాలు ఉన్నాయి.

ధాన్యం విత్తనంగా వాడితే తిరిగి అధిక సస్యోత్పత్తిని చేస్తోంది. కాని, ఇంతకన్న విలువైన బియ్యాన్ని విత్తనాలుగా వాడితే వాటినుంచి సస్యోత్పత్తి కలగటం లేదు. కాబట్టి, ధాన్యాన్ని ప్రాణిగా ఎంచి దాన్ని బియ్యంగా మార్చడానికై దానియందున్న పొట్టును తీసెయ్యడానికి (తుషా విమోకార్థం) అవలంబించిన అవగాహన క్రియను (దంచడాన్ని) హింస అని వేదం బోధిస్తోంది. కాని, యాగంలో హవిస్సును నిర్మాణం చేయక తప్పదు కనుక దానివల్ల వచ్చే దోషానికి పరిహారం చెప్పబడింది.

అది ఎలాగంటే- ఏకత, ద్విత, త్రితులనే పేర్లు గల దేవతలకు భాగంగా శ్రౌతాగ్నులయొక్క వేది మధ్యలో **"ఉల్ముకేనాభితప్య"** అని అగ్నిజ్వాలచే పిష్టపాత్ర ప్రక్షాళనోదకాన్ని తపింపచేసి **'ఏకతాయ స్వాహా'** ఇత్యాది మంత్రాలతో ప్రక్షేపం చెయ్యాలని **"అన్తర్వేది నినయత్యవరుద్ధ్యై"** అను శ్రుతిచే బోధింపబడింది. దీనివల్ల పై దోషం పరిహరింపబడిందని తెలుస్తోంది.

మరో ఉదాహరణ తృణచ్ఛేదనం (గడ్డికోయడం) కూడా హింసయే అని వేదం వర్ణించింది తృణ విశేషాలనే దర్భల్ని వైదిక కర్మల్లో వినియోగించడానికి **'దర్భచ్ఛేదన'**మనే ప్రక్రియ ఉంది. **"అసిద మశ్వపరశుం వాదత్తే"** అను సూత్రం దర్భచ్ఛేదనానికి అసిదను (కత్తిని) కాని, అశ్వపరశువును (అశ్వం ఎముక ముక్కను) గాని తీసుకు వెళ్ళాలి. అశ్వపరశువుతో ఛేదిస్తే దర్భచ్ఛేదనం వల్ల ఏర్పడే హింస, హింస కాకుండునని, తత్రాపి (అందులోను) దర్భల్ని పర్వాలందు అనగా వాటి కణుపులందు ఛేదిస్తే ఛేదించిన హింస కాకుండా ఉంటుందని వేదం చెప్తోంది.

యోవా ఓషధీః పర్వశోవేద| నైనాస్సహినస్తి| ప్రజాపతిర్వా ఓషధీః పర్వశోవేద| స ఏనా న హినస్తి అశ్వపర్వా బర్ హిరచ్ఛైతి ప్రాజాపత్యోవా| అశ్వస్సయోనిత్వాయ ఓషధీనా మహిగ్ం సాయై| (తై. బ్రా)

ఎవడు ఓషధులను గుర్తించి వాటిని ఛేదిస్తాడో అట్టివాడు ఓషధుల ఛేదనాజన్య దోషాన్ని పొందడట! కాని మనం పర్యవసానాన్ని గుర్తించడం కష్టసాధ్యమని వేదమే మరో ఉపాయాన్ని చెప్పింది.

"బర్హిరచ్ఛైతి" అని అర్హిస్సును పొందడానికి వెళ్లాలని, ఆ ప్రకారం దాన్ని తీసుకువెళ్లి ఛేదిస్తే సర్వజగత్స్రష్ట అయిన ప్రజాపతి అపర్వస్థానాలను గుర్తెరిగినవాడు కనుక, సాక్షాత్తు ఆయన ఛేదించినట్లే అయి తాను ఛేదించిన దోషం వాటిల్లదని **"ఓషధీనా మహిగ్ం సాయై"** అను శ్రుతి బోధిస్తోంది.

ఇంతే కాదు, **"పరిషూతమసి"** అను మంత్రాన్నుచ్చరించి దర్భలను కోయడంవల్ల **"ఆత్మనోఽహిగ్ం సాయై"** అని తనకు హింసాజన్య దోషం ఉండదని చెప్పింది. దీనివల్ల తృణచ్ఛేదం కూడా హింస అని మరో మారు వేదం బోధించినట్లయింది.

మరో ఉదాహరణ-**"క్రూరమివవా అస్యా ఏతత్కరోతి యత్ఖనతి"** అని అగ్నిచయనమనే శ్రౌతకర్మ ప్రకరణంలో ఇష్టకలను నిర్మించడానికి మృత్తిక (మట్టి) అవసరమని, మృత్తిక కోసం భూమిని తవ్వాలని, అలా తవ్వితే **'క్రూరమివా'** క్రూరమైన కర్మచేసినవాడు అవుతాడని బోధించి తత్పరిహారంగా **"అప ఉపస్పృజతి| ఆపోవై శాంతాశ్శాంతాభిరేవాస్యై శుచగ్ం శమయతి"** అని తవ్విన చోట భూమి మీద గల వర్షోదకాలు శాంత స్వరూపాలు కనుక ఆ ఉదకాలను ప్రోక్షిస్తే ఖననరూప హింసాజన్య దోషం తప్పుతుందని చెప్పింది. ఇలాగే మానవులందరికీ నాంతరీయకమైన (దైనందిన జీవితంలో తప్పించుకోలేని) కొన్ని హింసలు తటస్థిస్తా యని **"ఖండినీ, పేశినీ, చుల్లీ, జలకుంభోప సంగ్రహః"** అని ధాన్యాన్ని దంపడం, బియ్యాన్ని విసరడం, బియ్యాన్ని కడగడం, కట్టె పుల్లలు కాల్చినప్పుడు వాటినుండి కొన్ని పురుగులు నశించడం, బిందెలతో నీళ్ళను తోడడం, చేట మొదలగు వానితో బియ్యాన్ని చెరగడం లేదా అపసంగ్రహ అను పాఠానుసారం సమ్మార్జన కాలంలో సమ్మార్జన వల్ల (చీపురుతో తుడవడం వల్ల) కొన్ని పురుగులు నశించడం ద్వారా సంక్రమించిన పాపం. వీటన్నింటి నుంచి హింసాజన్య దోషం వాటిల్లుతుందని, దాన్ని నివారించడానికి **"పంచసూనాపనుత్తయే"** అనే సంస్కారం ద్వారా ఆత్మ సంస్కారార్థం అని సంకల్పం చేసి వైశ్వదేవం చెయ్యాలని విధించింది.

వేదం ఇంత సూక్ష్మాతి సూక్ష్మంగా విమర్శించి; ధాన్యాన్ని దంపినా, బియ్యాన్ని పిండిగా విసిరినా, వండినా, నీళ్ళు తెచ్చినా, ఇల్లు తుడిచినా, దర్భల్ని ఛేదించినా, మరో ప్రసంగంలో యూపస్థంభంకోసం కత్తితో

వృక్షాన్ని ఛేదించినా హింసాజన్య దోషం వస్తుందని **"స్వధితే మైనగ్ం హిగ్ంసీరిత్యాహ| వజ్రో వై స్వధితి శ్శాంత్యై"** అను శ్రుతి చెప్తోంది.

'ఓ స్వధితే! ఈ యజమానిని హింసించకు' అని ప్రార్థించడం ద్వారా అది పోతుందని వర్ణించడం ద్వారా ఇంత అహింసా తత్వాన్ని బోధించిన వేదం లోకంలో రాగతః (అనురాగంవల్ల) ప్రాప్తమైన హింసాజన్య దోషం, **"అగ్నీషోమీయం పశుమాలభేత"** అని విధించిన యాగాంగ పశ్వాలంభంలో కూడా వచ్చేటట్లయితే, విధివాక్యం అలా **'పశ్వాలంభం'** చెయ్యాలని ఎలా విధిస్తుంది?

కాబట్టి, యాగాంగ అగ్నీషోమీయ పశ్వాలంభం హింస కాదని వేదవ్యాసుడు సూతసంహితలో చెప్పారు.

వేదోక్తేన ప్రకారేణ వినా సత్యం తపోధన కాయేన మనసావాచా హింసా హింసా న చాన్యథా

అను శ్లోకంలో **'వేదోక్తేన'** అనడంతో విహితమైన అగ్నీష్టోమీయ పశ్వాలంభం హింస కాదని తాత్పర్య దీపిక లోను, గీతాభాష్యంలోను, వాటి వ్యాఖ్యల్లో అనేక చోట్ల నిర్ణయింపబడింది. రాగతః ప్రాప్తమైన హింసనే **'నా హింస్యాత్'** అనే వచనం నిషేధిస్తోంది. అహింస అనేది పరమ ధర్మమని వేదం బోధిస్తోందని సప్రమాణంగా అహింసయొక్క ఆవశ్యకతను చెప్పడానికై ఇంత ప్రత్యేకంగా ఈ విషయం వివరించబడింది.

వేదాల్లో రాజనీతి

యద్యపి వేదానాం ధర్మ బ్రహ్మావబోధే తాత్పర్యం తథాపి అవాన్తర తాత్పర్య విధయా బహవో విషయాః వేదేషు ప్రతిపాదితాః అత ఏవ మనురబ్రవీత్| పిత్రదేవ మనుష్యాణాం వేదశ్చక్షుస్సనాతనమ్| అశక్యం చాప్రమేయం చ వేదశాస్త్రమితిస్థితిః| త్రయోవర్ణాః త్రయో లోకాశ్చత్వార శ్చాశ్రమాః పృథక్| భూతం భవ్యం భవిష్యచ్చ సర్వం వేదాత్ప్రసిద్ధ్యతి| (మ.స్మృ.)

వాస్తవికంగా ధర్మ బ్రహ్మాలను బోధించుటయందే వేదాలకు మహాతాత్పర్యం అయినా అవాంతర తాత్పర్య విధంగా అనేక విషయాలు రాజనీతి, యుద్ధ ప్రకారం, కృషి విజ్ఞానం మొదలైనవి కూడా వేదాల్లో ప్రసంగానుప్రసంగంగా ప్రతిపాదింపబడ్డాయి. అందుచేతనే మనువు పిత్రదేవతలకు, దేవతలకు, మనుష్యులకు కూడా వేదశాస్త్ర వాఙ్మయం త్రికాలాల్లోనూ నశ్వరంకాని చక్షుస్థానీయమని, ఇతర ప్రమాణాలకు శక్యంకాని, ప్రమాణాంతరాలకు ప్రమేయం కానిదాన్ని బోధించేది వేదశాస్త్ర వాఙ్మయమని, దీనివల్ల చాతుర్వర్ణ్యము, మూడు లోకాలు, బ్రహ్మచర్య-గృహస్థ-వానప్రస్థ-సన్యాసాశ్రమాలనే నాలుగు ఆశ్రయాలు, భూత-భవిష్యత్ వర్తమానమనే మూడు కాలాలు అన్నిటి గురించీ వివరించేది వేదం. ఇది, అది అనడం ఎందుకు?సర్వం వేదాలందు బోధింపబడడం విద్వత్తల్లజులకు ప్రసిద్ధమని మనువు పలికెను. వేదం బోధించిన అట్టి విషయాల్లో రాజనీతి ఒక విషయం కనుక, ఆ విషయం వివరించబడుతోంది. ముందుగా 'రాజనీతి' అనే దాంట్లో వినబడే 'రాజా' శబ్దానికి అర్థం వివరించబడుతోంది.

రాజసూయ ప్రకరణే శ్రూయమాణ రాజా రాజసూయేన స్వారాజ్యకామో యజేత ఇత్యత్ర రాజేతి శబ్దః క్షత్రియవాచక ఇతి మీమాంసా శాస్త్రే నిర్ణీతమ్|

రాజా అను శబ్దం క్షత్రియ వాచకం అని మీమాంసా శాస్త్రంలో నిర్ణయించబడింది.

ప్రజాపరిపాలనం నామ ఆదౌ| నివాసాయ గృహ సౌకర్యం భోక్తుం అన్నం| ధారణాయ వస్త్ర సమృద్ధిః| జల సమృద్ధిః మార్గయాన సౌకర్యాదికం కల్పయేత్| కించ తత్తద్వర్ణాశ్రమ ధర్మా అపి పరిపాలనీయా ఇతి తథాపి రాజ్ఞః పరిపాలనం ధర్మ ఇత్యత్ర శ్రూయమాణ రాజేతి శబ్దేన క్షత్రియ ఏవ ఉచ్యతే|

ప్రజాపాలనం- రాజధర్మం అనగా ప్రజలకు ముందు వసతి కోసం గృహసౌకర్యం, అన్న, వస్త్ర సమృద్ధి మున్నగు వాటిని కలిగించాలి. అంతేకాదు, మార్గయానం- రహదారులు, ప్రయాణ సౌకర్యాల వంటివి కూడా కల్పించాలి. ఇంకా ఆ యా వర్ణాశ్రమ ధర్మాలను కూడా పాలించాలని (అమలు చేయాలని), ఇది అతడి పరిపాలనలో స్వధర్మమని చెప్పి, 'రాజుచే పరిపాలింపబడింది' రాజ్యమని వ్యవహారమని చెప్పింది.

ఇటువంటి రాజ్యాన్ని ఒకప్పుడు కారణాంతరాలవల్ల క్షత్రియభిన్నుడు (క్షత్రియుడు కానివాడు) రాజ్యపరిపాలన చేసేటప్పుడు, యౌగికవృత్తిని ఆశ్రయించుకుని రాజయోగ్యంవల్ల రాజ్యం వచ్చినా ఆచరించాలని చెప్పింది. **"రాజయోగాత్ రాజేతి ద్విరేఫ శబ్దవత్ లక్షిత లక్షణయా"** అని ప్రజా పరిపాలకుడు రాజశబ్దంతో వ్యవహరింపబడుతున్నాడు. రాజుకు పరిపాలన ధర్మం అని రాజధర్మాల్లో క్షత్రియునికి చెప్పినా ప్రజారాజ్యమనే కాలంలో ప్రజలచే ఎన్నుకోబడిన వ్యక్తి రాజుగా వ్యవహరింపబడతాడు. పరిపాలనాధికారం రాజన్యునికి అనగా క్షత్రియునికే చెప్పబడినా, ప్రజలచే ఎన్నుకోబడి రాజు అయిన వానికి కూడా రాజ్యపరిపాలనలో చెప్పబడిన ధర్మాలు సంక్రమిస్తాయి అని చెప్పవలసి ఉంటుంది. వేదాలు బ్రాహ్మణ పక్షపాతాలని అంటారు కానీ, బ్రాహ్మణుడు రాజ్య పరిపాలకుడిగా ఉంటే ఆ రాజ్యం సుభిక్షంగా ఉండదని వేదాలే చెప్తున్నాయి. రాజన్యుడు ఆ రాజ్యాన్ని తానే పరిపాలించాలనే కోరిక కలవాడైతే బ్రాహ్మణుని అనాయాసంగా జయించగలడని అశ్వమేధ ప్రకరణంలోని ఈ శ్రుతి బోధిస్తోంది.

న వై బ్రాహ్మణే రాష్ట్రగ్ం రమత ఇతి| యథా ఖలు వై రాజాకామయతే| అథ బ్రాహ్మణం జినాతి|

ఇక్కడ 'రాజా' అనే పదం క్షత్రియ వాచకమని క్షత్రియాధికారమైన అశ్వమేధ ప్రకరణంలో ఉంది కనుక చెప్పవలసి ఉంటుంది. మరియు మనుష్యులు రాజుచేత ధరింపబడువారని (పరిపాలింపబడువారని) **"తస్మాద్రాజ్ఞామనుష్యా విధృతాః"** అని దర్శపూర్ణమాస ప్రకరణంలో ఉన్న శ్రుతి ప్రతిపాదిస్తోంది. ఇంకా, రాజన్యునికి యుద్ధంలో జయించడం ద్వారా ధనార్జన నియమం చెప్పబడింది.

బ్రాహ్మణస్య ప్రతి గ్రహాదినా రాజన్యస్య జయాదినా వైశ్యస్య కృష్యాదినా శూద్రస్య సేవాదినా సర్వేషాం దాయాదినేతి (ధర్మ.సూ.)

ప్రతిగ్రహం (దానాలు స్వీకరించడం) ద్వారా బ్రాహ్మణునికి, యుద్ధంలో జయం ద్వారా రాజుకి, కృషి ద్వారా వైశ్యునికి, సేవద్వారా శూద్రునికి ధనార్జన చెప్పబడింది. ఈ విషయవాక్యంపై మీమాంసాశాస్త్ర చతుర్థాధ్యాయంలో క్రత్వర్థ పురుషార్థ విచారణ ప్రసంగంలో పైన చెప్పబడిన ధనార్జన ఉపాయవిధి అపూర్వ విధా? నియమ విధా? అని విచారించి ఇది అపూర్వవిధి కాదు, ధనార్జన చేయాలనే కోరిక ఉన్నట్లయితే పైన చెప్పబడిన ఉపాయాలతో ఆర్జించాలని దానికోసం నియమాలను విధిస్తోందని, అది పురుషార్థమని నిర్ణయించారు.

క్షత్రియునికి అది స్వధర్మమని స్మృతి చెప్పింది కానీ, మరొకరు రాజ్యపాలన చేయకూడదని చెప్పలేదు.

రాజధర్మాన్ ప్రవక్ష్యామి యథావృత్తో భవేన్నృపః (మ.స్మృ.7-1)

అనగా రాజుగా పట్టాభిషిక్తుడైన గ్రామ, నగరవాసులను పరిపాలించే పురుషవాచకం.

బ్రాహ్మం ప్రాప్తేన సంస్కారం క్షత్రియేణ యథావిధి తదా సర్వాణి భూతాని బిభ్రతః పార్థివం వ్రతమ్ (మ.స్మృ)

ఈ స్మృతి, పాలకుడైన క్షత్రియ జాతికి చెందిన రాజ ధర్మాలను చెప్తోంది. ఏ ప్రకారంగా భూమాత సర్వప్రాణులను నిష్పక్షపాతంగా ధరిస్తోందో అదే ప్రకారం సర్వప్రాణులకు సమానమైన ఆశ్రయమిచ్చి

రక్షించడం రాజుకు ఒక వ్రతం అని చెప్పినా రాజ్యయోగంచే క్షత్రియభిన్నుడు రాజయినపుడు, పైన చెప్పిన పార్థివ వ్రతం ఆ రాజుకి కూడా వర్తిస్తుంది. అందుచేతనే

అరాజకేఽపి లోకేఽస్మిన్ సర్వతో విద్రుతోభయం రక్షార్థమస్య సర్వస్య వాజా నమసృజత్ప్రభుః| (మ.స్మృ)

రాజు లేని లోకంలో అన్ని విధాలుగాను భయమావరిస్తుందని అట్టి భయాన్ని తొలగించి రక్షించడానికై పరమేశ్వరుడు క్షత్రియుని సృష్టించేడని చెప్పినా క్షత్రియభిన్నుడు రాజయినప్పుడు భయాన్ని తొలగించి రక్షించడమనే ధర్మం అతనికి కూడా వర్తిస్తుంది. నిష్పక్షపాతంగా వ్యవహరించేటప్పుడు జరిగిన అనర్థాన్ని కూడా దర్శపూర్ణమాస ప్రకరణంలో శ్రుతి ఇలా చెప్తోంది.

విశ్వరూపోవైత్వాష్ట్రః పురోహితః దేవానామాసీత్ స్వస్రీయోఽసురాణాం తస్యత్రీణి శీర్షాణ్యాసన్ సోమపానగ్ం సురాపానమన్నాదనమ్| (త్రై.సం.2-5)

త్వష్ట ప్రజాపతి కుమారుడైన విశ్వరూపుడు దేవతలకు పురోహితుడు, అసురులకు మేనల్లుడు. అతనికి సోమపానం చేయడానికి, సురాపానం చేయడానికి, అన్నం తినడానికి మూడు శిరస్సులున్నాయి.

సప్రత్యక్షం దేవేభ్యో భాగమవదత్పరోక్షమసురేభ్యః

పై విశేషణాలతో వర్ణించబడిన విశ్వరూపుడు దేవతలకు పురోహితుడైన కారణంచే అక్కడక్కడ అనుష్ఠించే యజ్ఞ శాలలకు వెళ్ళి అక్కడ ఇవ్వబడ్డ హవిస్సుని దేవతలకు ఇవ్వడం యుక్తమని ప్రత్యక్షంగా అనగా బహిరంగంగా చెప్పి, అతడి మేనమామలైన అసురులకు ఇవ్వడం యుక్తమని రహస్యంగా ఋత్విక్కులకు చెప్పాడు. పిమ్మట ఆ ఋత్విక్కులకు పరోక్ష వచనమందే (రహస్య వచనాలందే) విశ్వాసం కలిగింది. లోకంలో కూడా ప్రత్యక్షంగా చెప్పిన వచనాలకంటే పరోక్ష వచనాల్నే ఎక్కువగా విశ్వసించడం, నమ్మడం ఉంది కదా అని ఈ శ్రుతి చెప్తోంది.

సర్వస్మై వై ప్రత్యక్షం భాగం వదన్తి యస్మా ఏవ పరోక్షం వదన్తి తస్య భాగ ఉదితః (త్రై.సం.2-51)

తస్మాదిన్ద్రోబిభేదీదృజ్ వైరాష్ట్రం విపర్యావర్తయతీతి|

జరిగిన వృత్తాంతాన్ని, అనగా స్వామి ద్రోహాన్ని, విశ్వరూపుడు రాష్ట్రాన్ని విపర్యాసం పొందిస్తున్నాడని విని ఇంద్రుడు భీతి చెందాడు. పిమ్మట ఇంద్రుడు వజ్రాయుధాన్ని స్వీకరించి 'అతని శిరస్సులను ఛేదిస్తాను' అనడంతో విశ్వరూపుడు అసుర పక్షపాతాన్ని చూపి అనర్థ ఫలభాక్ (అనర్థాన్ని కొని తెచ్చుకున్నవాడు) అయ్యేడని చెప్పినట్లయింది.

అందుచేత భూమాత సర్వులకు, (అందరికీ) నిష్పక్షపాతంగా ఆశ్రయమిచ్చినట్లు పరిపాలించే రాజు సర్వులకు నిష్పక్షపాతమైన ఆశ్రయమివ్వడమే పార్థివ వ్రతం. రాజు ఏ విధంగా పరిపాలించాలో రాజలక్షణాన్ని చెప్పే సందర్భంలో మహర్షి వేదవ్యాసుడు ఇలా చెప్పారు.

పుత్ర ఇవ పితృగృహే విషయే| యస్య మానవాః నిర్భయా విచరిష్యన్తి స రాజా రాజసత్తమః|

పితృగృహంలో పుత్రుడు స్వేచ్ఛగా సంచరించిన విధంగా ఏ రాజుయొక్క పరిపాలనలో సర్వమానవులు నిర్భయంగా సంచరిస్తారో ఆ రాజు శ్రేష్ఠుడని చెప్పేరు. ఇంకా కౌటిల్యార్థ శాస్త్రంలోను, విష్ణుస్మృతిలోనూ, **"అథ రాజధర్మాన్ప్రవక్ష్యామః"** అని ఉపక్రమించి-

తస్మాత్స్వధర్మం భూతానాం రాజా నా వ్యభిచారయేత్| స్వధర్మం సందధానో హిప్రేత్య చే హ చ నన్దతి|

ఆ యా మానవులకు ఏది స్వధర్మమో ఆ ధర్మాన్ని మనుష్యులచే ఆచరింపచేయడం ఒక వ్రతం అని, పరిపాలించే రాజుకు మనోధర్మం కూడా చెప్పింది. ప్రజలచే స్వధర్మాన్ని అతిక్రమించకుండా చేయడం, అనగా వర్ణాశ్రమ ధర్మాలకు సాంకర్యం లేకుండా జనాన్ని పరిపాలించాలి. వేదోక్త ప్రకారంగా రక్షించబడే లోకం సర్వదా సుఖ శాంతులతో ఉంటుంది, ఎన్నడూ నశించదని చెప్పబడింది. ఇహపర లోకాలలో అట్టి రాజు నశించడు అని గూడా చెప్పి ఇంకా ఇలా అంటోంది.

వ్యవస్థితార్య మర్యాదః కృతవర్ణాశ్రమ స్థితిః| త్రయ్యా హి రక్షితో లోకః ప్రసీదతి నసీదతి| (కౌ.అ.శా)

వర్ణాశ్రమ ధర్మాలను ఆచరింపచేయడం ఒక వ్రతం. వర్ణాశ్రమ ధర్మాలను పరిపాలించకపోతే దోషం ఈ విధంగా ఉంటుందని ఆయుర్వేద శాస్త్రంలో చరకాచార్యులు ఇలా చెప్పారు.

మనుష్యాణాం యే అన్నేఽభావాస్సామాన్యాః తద్వైగుణ్యాత్ సమాన కాలాః సమాన లింగాశ్చ వ్యాధయః అభినిర్వర్తమానాః జనపద ముధ్వంసయన్తి|

మనుష్యులందరికీ వాయువు, ఉదకం, దేశం, కాలం అనే సమాన భావాలున్నాయి. వాటియొక్క వైగుణ్యం వల్ల ఏకకాలీనమైన, ఏకచిహ్న కలిగిన వ్యాధుల వంటి (సామూహిక రోగాలు) ఉద్భవించి గ్రామాదుల్ని నాశనం చేస్తాయి.

కుతః వాయ్వాదీనాం వైగుణ్యోత్పత్తిః ధర్మమధర్మమితి అధర్మం ధర్మమితి మన్యమానాః యే నాస్తిక జనాః తేషాం ప్రజ్ఞాఽపరాధ ఏవ|

ఈ రకమైన సామాజిక ఉపద్రవాలు కలిగించేలా వాయువు వంటి వాటికి ఎందుకు వైగుణ్యం ఏర్పడుతుంది అనగా, ధర్మాన్ని అధర్మంగాను, అధర్మాన్ని ధర్మంగాను నిర్ణయించే నాస్తిక జనులయొక్క ప్రజ్ఞాపరాధమే. వేదవిజ్ఞానం లేకుండా నాస్తికులచే ధర్మ-అధర్మ నిర్ణయం చేయబడడం ఈ అనర్థాలకు కారణమన్నారు. శాస్త్ర విరుద్ధంగా ఆచరించిన అధర్మం కారణమన్నారు.

ప్రజ్ఞాపరాధస్య కిం కారణమితి తం మూలమసత్కృతః అధర్మః (చ.వై.శా)

యథా వై దేశనగర నిగమ ప్రధానాః ధర్మ ముత్క్రమ్య అధర్మేణ ప్రజాం వర్తయన్తి తదాశ్రితా ఉపాశ్రితాః పౌరజానపదాః వ్యవహారోప జీవినశ్చత మధర్మమభివర్ధయన్తి|

ఎప్పుడైతే దేశ, నగర, నిగమ (పల్లెలకు) ప్రధాన నాయకులైన వారు ధర్మాన్ని అతిక్రమించి అధర్మంగా ప్రజలను ప్రవర్తింపచేస్తారో అపుడు వారిని ఆశ్రయించుకుని జీవించే వారందరూ నాయకుల యొక్క బలాత్కారంతో అధర్మాన్ని అభివృద్ధి పరుస్తారు. ఆ అధర్మం ధర్మాన్ని అంతర్ధానం చేస్తుంది.

తతః స అధర్మం ధర్మమన్తర్ధత్తే| (చ.వై.శా.)

ఈ ప్రకారం అంతర్హిత ధర్మం గలిగిన, అధర్మ ప్రధానులు అయిన దేవతానుగ్రహ రహితులైన వారికి ఆ యా ఋతువులు ఋతు ధర్మాలను అతిక్రమిస్తాయి అని చెప్పబడింది.

తేషామన్తర్హిత ధర్మాణాం అధర్మ ప్రధానానాం అపక్రాన్త దేవతానాం ఋతవో వ్యాపాదన్తే| (చరకం)

ఋతువుల వ్యత్యాసం అంటే-

తేన నాపోయథాకాలం దేవో వర్షతి నవా వర్షతి వికృతం వా వర్షతి వాతా నసమ్యగభియాన్తి క్షితిర్వ్యా పద్యతే సలిలాన్యుపశుష్యన్తి| ఓషధయః స్వభావం పరిహాయ ఆపద్యన్తే వికృతమ్| తత ఉధ్వసన్తే జనపదాః|

అని ఋతుధర్మాలు మారిపోవడమంటే యథాకాలంలో పర్జన్యుడు వర్షించకపోవడం, వర్షించినా వికృతంగా వర్షించడం, వాయువులు బాగా వీయకపోవడం, భూకంపాదులు ఏర్పడడం, ఉదకాలు ఎండిపోవడం, ఓషధులు వాటి స్వభావాన్ని విడిచి వికృత స్థితిని పొందడం, ఇలాంటివన్నీ ఏర్పడడం. ఈ అనర్థాలవల్ల జనపదాదుల ధ్వంసం ఏర్పడుతుంది.

దీనివల్ల రాజు ధర్మాన్ని తాను ఆచరించక ప్రజలచే కూడా బలాత్కారంగా అధర్మాన్ని ఆచరింపచేయడం వల్ల వాయ్వాదులకు వైగుణ్యం ఏర్పడడం, ఋతుధర్మాల్లో వ్యత్యాస మేర్పడి భూకంపాదులు, ఉదక శోషణ (నీరు అంతా ఎండి పోవడం) మొదలైనవి రావడం వల్ల దేశ, నగర, నిగమాలయొక్క నాశనం ఏర్పడుతుందని చెప్పినట్లు అయింది. కాబట్టి, రాజు ధర్మ రక్షణ చేయాలని వేదం బోధిస్తోంది.

మూలసూత్రం: క్షత్రియ జాతికి సంబంధించిన రాజుకే పరిపాలనాధికారమని చెప్పబడింది కాని, అలా చెప్పబడినా ఎవరు రాజుగా వున్నా, రాజుయొక్క పరిపాలనా ధర్మాలు వానికి వర్తించగలదని స్పష్టంగా తెలుసుకోనగును. కావున రాజు వర్ణాశ్రమ ధర్మాలు వగైరాలను సాంకర్యం లేకుండా రక్షించాలి. దానివల్ల సర్వదా ప్రీతియుక్తుడుగా ఉంటాడు రాజు. అలా కాకుండా దీనికి వ్యతిరేకంగా అధర్మాన్ని అభివృద్ధి పరిస్తే లోకంలో అనర్థాలు వస్తాయని చరకాచార్యులు చెప్పిన విషయం వివరించడమైంది.

పురోహితుని విషయం

అధర్మ సాంకర్యం లేకుండా ధర్మరక్షణ చేయడానికి విద్వాంసుడైన పురోహితుని సహాయం రాజుకు, రాజ్యానికి అవసరం.

బ్రాహ్మణే నైధితం క్షత్రం మన్త్రిమన్త్రాభిమన్త్రితమ్| జయత్యజితమత్యన్తం శాస్త్రానుగమశస్త్రితమ్| (కౌ.అ.శ 1-9)

పురోహితం ఉదితా కులశీలం షడఙ్గే వేదే దైవే నిమిత్తే దణ్డనీత్యాం అభినివీతం ఆపదాం దైవ మానుషీణాం అధర్వభి రుపాయైశ్చ ప్రతిక్రియం చ కుర్వీత| (కౌ.అ.శా)

ఉన్నత వంశంలో పుట్టినవాడు, సచ్ఛీలం కలిగిన, షడంగాలతో కూడిన వేదంలో, దైవిక, మానుష నిమిత్తము లందు దండనీతియందు నిష్ణాతుడైన, దైవసంబంధమైన మానుష సంబంధమైన ఆపత్తులు సంభవించి నప్పుడు అనగా లోకంలో అనావృష్టి వంటివి సంభవించినప్పుడు, శత్రురాజుచే యుద్ధం వచ్చినప్పుడు, ప్రజలు వ్యాధిపీడితు లైనప్పుడు వాటిని అధర్వ వేదోక్తాలైన ప్రతీకార ఉపాయాలచే ప్రతిఘటించగలిగిన పురోహితుని నియమించుకోవాలి.

తం పురోహితమ్ ఆచార్యం శిష్యః పితరం పుత్రః భృత్యః స్వామినమివ అనువర్తేత| (కౌ.అ.శా)

శిష్యుడు విద్యను నేర్పిన గురువు వలెను, పుత్రుడు తండ్రిని వలెను, భృత్యుడు అధికారిని వలెను రాజు ఆ నియమింపబడిన పురోహితుని అనుసరించాలి. కాని మనచే నియమింపబడిన పురోహితుడే గదా అని వాని మాటను ధిక్కరించకూడదు. ఇక్కడ పురోహితుడనగా దైవ, పిత్ర కర్మలను లోకంలో ఆచరింపచేసే వాడు (బ్రహ్మ) కాదు. భవిష్యత్తులో మనకు రాజ్యంలో హితం కలుగు విధంగా, మొత్తం పురానికి (రాజ్యానికి) హితం కలుగు విధంగా ఉపదేశించేవాడు పురోహితుడు.

హితాఽహితములకు, ప్రియాఽప్రియములకు భేదం ఉంది. తత్కాలంలో (తాత్కాలికంగా) మనకు ప్రీతిని కలిగించేది ప్రియం. అప్రీతిని కలిగించేది అప్రియం. తత్కాలంలో అప్రియంగా ఉన్నా భావి కాలంలో మనకు శ్రేయస్సుని కలుగచేసేది హితం. అశ్రేయస్సును కలుగచేసేది అహితం. పైన చెప్పబడిన విధంగా

మొత్తం పురానికంతకూ అంటే పురజనులకందరికీ హితాన్ని ఉపదేశించేవాడు పురోహితుడు. అందుకే, వేదంలో అగ్నిచయన ప్రకరణంలో పురోహితుని విషయం ఇలా చెప్పబడింది.

సగ్ం శితం మే బ్రహ్మసగ్ం శితం వీర్యం బలం| సగ్ం శితం క్షత్రం జిష్ణు యస్యాహమస్మి పురోహితః ఉదేషాం బాహూ అతిరముద్వర్చ ఉదూబలమ్| క్షీణోమి బ్రహ్మణాఽమిత్రానున్నయామి స్వాగ్ం అహమ్| (తై.సం.4)

ఈ రెండు మంత్రాలను అధ్వర్యుడు యజమానిచే చెప్పించాలి.

సగ్ం శితం మే బ్రహ్మోదేషాం బాహూ అతిరమిత్యుత్తమే యజమానం వాచయన్ తూష్ణీ మౌదమ్బర్యౌ సమిధావాదధాతి| (ఆ. సూ)

ఉత్తమే రాక్షోఘ్న సూక్తస్య అన్తిమే ఋచౌ యజమానం వాచయేత్ ఔదమ్బర్యౌ ద్వే సమిధౌ తూష్ణీ మాదధ్యాదితి శేష| ఇతి సాయణ భాష్యం

"యదగ్నే యానికాని చాతేదారూణి దధ్మసి" నుంచి **"బ్రహ్మణా మిత్రానున్నయామి"** (తై.సం.4) వరకు రక్షోఘ్న సూక్తమని పేరు. ఈ సూక్తంలోని అంతిమ ఋక్కులు, **'సగ్ం శితం మే'** అనే రెండు మంత్రాలూ యజమానిచే చెప్పిస్తూ అధ్వర్యుడు ఔదుమ్బర సమిధలను మంత్రరహితంగా అగ్నిలో ఉంచాలని సూత్రార్థం. ఇందులో అగ్నిచయన కర్త ఈ విధంగా ప్రార్థిస్తున్నాడు.

లోకంలో ఎవనికంటే ఎవడు ఉత్కృష్టుడో అతనిని గురించి చెప్పేటప్పుడు, అతని హస్తం పైన ఉండేటట్లు చేసుకున్నాడయ్యా! (వాడిదే పై చేయి అయిందయ్యా) అంటారు. కేవలం బాహువులనే ఉన్నతమైన వాటినిగా చేసుకోవడం కాక **"ఉద్వర్చ ఉదూబలమ్ శరీరకాన్తిని"** శారీరక బలం కూడా ఉత్కర్షగా (గొప్పగా) చేసుకున్నాను. **'బ్రహ్మణాఽమిత్రానున్నయామి'**- మంత్ర సామర్థ్యంచే శత్రువులను క్షీణశక్తి కలవారలనుగా చేస్తున్నాను. **'స్వాన్ ఉన్నయామి'**- స్వకీయమైన పురుషులకు ఉన్నతమైన వారినిగా చేస్తున్నాను అని అర్థం. ఈ ప్రకారంగా యజమానుని మంత్రవచనంలో తాత్పర్యం.

ప్రథమ మంత్రంలో 'నా తాలూకు బ్రాహ్మణ్యం తీక్ష్ణమగు గాక! నేను పురోహితునిగా ఉన్న రాజుయొక్క సామర్థ్యం జయశీల మగుగాక! అని అనడంచే బ్రహ్మక్షత్రియులకు పరస్పర ఉపకారం. **"బ్రహ్మణైవక్షత్రగ్ం సగ్గ్ శ్యతి క్షత్రేణ బ్రహ్మ'** అనే బ్రాహ్మణ వాక్యం చెప్తోంది.

ఈ ప్రకారం ఒకరివలన ఒకరి శక్తి వృద్ధి పొందుతోంది కనుకనే **"తస్మాద్బ్రాహ్మణో రాజన్యవానత్యన్యం బ్రాహ్మణం తస్మాద్రాజన్యో బ్రాహ్మణవానత్యన్యగ్ం రాజన్యమ్"** అని బ్రాహ్మణ వచనం చెప్తోంది. అంటే వేదం ఇలా చెప్తోంది అని అర్థం.

బ్రాహ్మణునికి, క్షత్రియశబ్దంచే చెప్పబడిన రాజుకు పరస్పర ఉపకార్య-ఉపకారక భావం ఉందని, బ్రాహ్మణుని సలహా ప్రకారం ధార్మికంగా పరిపాలించే రాజు బ్రాహ్మణుని సహభావం లేని రాజుకంటే అతిశయంగా (గొప్పగా) ఉండడం, పరిపాలకుడైన రాజుచే తన ధర్మమందు నియమించబడిన బ్రాహ్మణుడు నియామకరాజు సహకారం లేని బ్రాహ్మణుని కంటే అతిశయంగా ఉండడం అనే ప్రయోజనం కలవని చెప్పబడింది. ఇక్కడ మంత్రగత **'క్షత్రం జిష్ణు'** అనుచోట, అలాగే **'బ్రహ్మణైవ క్షత్రగ్ం సగ్గ్ శ్యతి'** అనే బ్రాహ్మణ వాక్యంలో రాజన్యుడు (క్షత్రియుడు) చెప్పబడుతున్నాడు.

అయినా మనుస్మృత్యాది ప్రమాణాంతర సంవాదంచే అభిషిక్తుడై ప్రజాపాలన ధర్మం కలవాడు రాజు అని గ్రహించవలెను. ఇలాగే మరో సందర్భంలో అగ్నిచయన ప్రకరణంలో-

సమితగ్ం సంకల్పే ధాగ్ం సంప్రియౌ రోచిష్ణూ సుమనస్యమానౌ ఇషమూర్జమభి సంవసానౌ సంవాంమనాగ్ంసి సముచిత్తాన్యాకరమ్| (తై.సం.4-2-4)

ప్రయోగము: **సమితమితి తస్యాం చతసృభిరుఖ్యగ్ం సంనిపతి|** (ఆ.సూ)

'సమితమిత్యాది' మంత్రాలచే చయనమనే కర్మలో పూర్వసిద్ధమైన అగ్నిలో ఉఖయందు ఉంచబడిన అగ్నిని సంయోజనం చెయ్యాలి. ఓ రెండు అగ్నులారా! మీ ఇద్దరూ కలిసి యజ్ఞ నిష్పాదనం (యజ్ఞాన్ని నిర్వర్తించడం) చేయండి. పరస్పరం మంచి ప్రీతియుక్తులు కండి! దీప్తియుక్తులు కండి! పరస్పరమైన సౌమనస్యంతో కూడినవారు కండి! అని ప్రార్థించడం ఈ మంత్రార్థం.

ఈ మంత్రాన్ని బ్రాహ్మణంలో వ్యాఖ్యానం చేస్తూ మంత్రఘటక (మంత్రం ఉన్న) **'సమితమితి'** పదంయొక్క తాత్పర్యాన్ని చెప్తోంది.

సమితమిత్యాహ తస్మాద్బ్రహ్మణా క్షత్రగ్ం సమేతి| (తై. సం. 5)

మీ ఇద్దరు సంగతులు కండి! అని అగ్నులను ప్రార్థిస్తున్నారు. ఈ మంత్రాల్లోని **'సమిత'** పదంచే ప్రార్థించడంవల్ల లోకంలో పురోహిత రూపంలో బ్రాహ్మణునితో క్షత్రియరూప రాజు సంగతుడవున్నాడు.

యత్సన్యుక్త్యవిహరతి తస్మా ద్బ్రాహ్మణా క్షత్రం వ్యేతి| (తై. సం. 5)

ఈ విధమైన రెండు అగ్నుల సంయోగం తర్వాత ఉత్తర కాలీనమైన కర్మానుష్ఠానాన్ని చేస్తున్నాడు. దాని సామర్థ్యంవల్ల బ్రాహ్మణ పురోహితునిచే నియమింపబడిన రాజు వివిధంగా శాస్త్రోక్త విధంగా రాజ్యపాలన చేయగలుగుతున్నాడు అని అనడంచే పై ఉదాహరణల ననుసరించి వేదంలో ఎక్కడ క్షత్రియ, రాజన్య, రాజన్ శబ్దాలు వాడబడినా క్షత్రియజాతికి సంబంధించిన రాజునే ఆ శబ్దాలు సామాన్యంగా చెప్తున్నాయి. బ్రాహ్మణశబ్ద సమభివ్యాహారంచేత రాజసూయ ప్రకరణంలో అభిషిక్తుడైన క్షత్రియునికే రాజసూయాధికారం అని చెప్పడంతో తను అభిషిక్తుడై ప్రజాపరిపాలన చేసేవాడు రాజు, క్షత్రియుడని చెప్పి అతనికి పరిపానాధికారమని మన భారతీయ ధర్మశాస్త్ర ప్రకారం సామాన్యంగా చెప్తోంది.

దీనికి ఉపోద్బలకంగా (బలం చేకూర్చేలా) పై మంత్రాల్లో **"సగ్ంశితం క్షత్రం జిష్ణు తస్మాద్ బ్రహ్మణా క్షత్రగ్ం సమేతి"** ఇత్యాది మంత్రాల్లో, ఆ యా స్థలాల్లో క్షత్రశబ్దానికి క్షత్రియ పరంగానే వేదభాష్యంలో వివరించారు. **'క్షతాత్ త్రాయతే- పాలయతీతి క్షత్రం'** అనే వ్యుత్పత్తిచే అనర్థం నుంచి రక్షించేది క్షత్రం. పరిపాలకత్వం అనే అర్థం చెప్పబడడం వల్ల క్షత్రశబ్దంచే ఆ అర్థం కూడా తెలుస్తోంది కనుక **"రాజధర్మాస్ ప్రవక్ష్యామి యథావృత్తో భవేన్నృపః"** అను మనుస్మృతి వచనం **'రాజా'** శబ్దానికి **న క్షత్రియ వాచకః**- కేవలం క్షత్రియ కులస్తుడుగా కాక అభిషిక్తుడై జానపద పరిపాలనా ధర్మం గల పురుషుడు రాజుగా చెప్పబడుతున్నట్లు, వ్యాఖ్యానంలో చెప్పబడింది. కాబట్టి, క్షత్రియశబ్దం పరిపాలించే రాజుకు ఉపలక్షకమని గ్రహించాలి.

ఎవరు రాజయితే అతనికి పురోహితుని అవసరాన్ని చెప్పినా శ్రుతి విరోధం ఉండదు. ఎవరు ఉంటే అతనికి, అతనిద్వారా రాజ్యానికి హితాన్ని కోరడం పురోహితుని ధర్మమని, కాబట్టి, అటువంటి పురోహితుణ్ణి నియమించుకోవడం మాత్రం రాజధర్మాల్లో ఒకటని తెలుసుకోనగును.

క్షత్రియుడు కాని పాలకుడు (రాజు) పరిపాలన చేసినా జనుల ధర్మ వ్యత్యాసాలను నివారింపచేయడానికి బహుశ్రుతుడైన బ్రాహ్మణుడు, పరిపాలకుడైన రాజు వీరిద్దరూ ఆ ధర్మ వ్యత్యాస నివారకులని, అనగా అధర్మాన్ని నివారించి ధర్మాన్ని రక్షించేవారని చెప్పబడింది.

లోకే ధృతవతౌ రాజా బ్రాహ్మణశ్చ బహుశ్రుతః| (గౌ.ధ.సూ)

దండనంచే రాజు, పుణ్యపాప ఫలానుపదేశించడం ద్వారా బహుశ్రుతుడైన బ్రాహ్మణుడు ప్రజలకు సంభవించిన సమస్త ఆపత్తులను (ఆపదులను) నివారింప సమర్థులని పై సూత్రం చెప్తోంది. బహుశ్రుతుడనగా -

స ఏష బహుశ్రుతితో భవతి లోక, వేద, వేదాంగవిత్|

ఇందులో **'లోక శబ్దేన లోకవ్యవహార సిద్ధ జనపదాది ధర్మాః ఉచ్యంతే, వేద వేదాంగాని ప్రసిద్ధాని"** లోకజ్ఞానం కలవాడు, వేద-వేదాంగ జ్ఞానం కలవాడు బహుశ్రుతుడని చెప్పబడుతున్నాడు. ఇటువంటి లక్షణాలు కల బహుశ్రుతుడగు పురోహితుని ఉపదేశానుసారం రాజు పరిపాలించాలని అర్థం.

అమాత్య నియోగం

రాజపుత్రమ్ అమాత్య సంపన్నం రాజ్యే స్థాపయేత్ విద్యావినీతో రాజా హి ప్రజానాం చ హితేరతః

సహాయసాధ్యం రాజత్వం చ క్రమేకం నవర్తతే కుర్వీత సచివాంస్తస్మాత్తేషాం చ శ్రుణుయాన్మతమ్| (కౌ.అ.శా)

కేవలం పురోహితుడే కాదు, అమాత్యులతో కూడిన రాజపుత్రుని రాజ్యపాలనయందు స్థాపించాలి. ఆ రాజు విద్యా వినయ సంపన్నుడు, సర్వదా ప్రజల హితవును కోరువాడు, కేవలం ప్రజలకే కాదు సర్వభూతాలకు హితాన్ని కలుగచేయడంలో ఆసక్తి కలవాడైతే అన్యులకు (ఇతరులకు) సాధ్యంకాని పృథివిని అనుభవించ గలడు. అంటే పాలించగలడు. లోకంలో సహాయం లేని చక్రం నడువనట్లుగా పురోహిత అమాత్యాది సహాయం లేని రాజత్వం కూడా ఉండదు. కాబట్టి, పురోహితునితోబాటు అమాత్యులను కూడా నియమించి కొన్ని సమయాల్లో వారి మతాన్ని (అభిప్రాయాన్ని, సలహాని) కూడా స్వీకరించాలి. ఎటువంటి అమాత్యులను నియమించాలో **"అభిజ్ఞాన ప్రజ్ఞాశౌచ శౌర్యానురాగ యుక్తానమాత్యాన్కుర్వీత"** అను శ్రుతి చెప్తోంది.

మంచి కులంలో పుట్టి, ప్రజ్ఞ, శౌచము, శౌర్యము, అనురాగాలతో కూడిన అమాత్యులను నియమించాలని విష్ణుస్మృతిలో చెప్పబడింది.

స్వయమేవ వ్యవహారాన్పశ్యేత్, విధ్వధ్భిః బ్రాహ్మణై స్సార్థం వ్యవహార దర్శనే బ్రాహ్మణం వా నియుంజ్యాత్|
(కౌ.అ.శా)

విద్వాంసులైన బ్రాహ్మణుల సహాయంతో స్వయంగానే వ్యవహారాలను చూసుకోవాలి. లేదా విద్వాంసుడైన బ్రాహ్మణుని నియమించాలని చెప్పినా ఇక్కడ బ్రాహ్మణ శబ్దం వ్యవహార దక్షత కలవానికి సూచకమని, కేవలం బ్రాహ్మణ కులంలో పుట్టినవాడు మాత్రమే కాదని చెప్పవలెను. వేదం ఎంత నిష్పక్షపాతంగా చెప్పిందో చూడండి.

రాజ్యంలో ఐకమత్యం - ఆవశ్యకత

పరిపాలించే రాజు పైన చెప్పిన ప్రకారం పురోహిత, అమాత్యాదులను నియమించడంతో బాటు తన రాజ్యం దృఢంగా ఉండడానికి పాలక వర్గాల్లోనూ, పాల్యవర్గాల్లోనూ (పాలింపబడే ప్రజలమధ్య) ఐకమత్య సంపాదన చేయడం చాలా అవసరమని రాజ ధర్మాల్లో చెప్పబడింది.

స కిం సఖా సాధు న సాస్తియోధిపం హితాన్నయః సంశ్రుణుతే స కిం ప్రభుః| సదానుకూలేషు హి కుర్వతే రతిం నృపేష్వమాత్యేషు చ సర్వ సంపదః| (కిరాతార్జునీయం సర్గ-1)

మంచి విషయాలను రాజుకి ఉపదేశించని పురోహిత అమాత్యాదులు, వారు చెప్పిన మాట వినని రాజు ఇద్దరూ కుత్సికులే (చెడ్డవారే) అన్నారు. రాజులు, మంత్రులు అనుకూలురుగా ఉన్నప్పుడే సర్వ సంపదలు వారిని, అంటే వారి రాజ్యాన్ని వరించగలవు.

ఏ వమేవ కుల్లూక భట్టీయేఽపి కౌటిల్యార్థ శాస్త్రేషు చ రాజపుత్రం అమాత్య సంపన్నం రాజ్యే స్థాపయేత్|

(మ.స్మృ.వ్యా)

ఇదే విషయం వేదంలో అగ్నిష్టోమ ప్రకరణంలో ఋత్విక్కులు ఐకమత్యంతో యజమానియొక్క యజ్ఞ నిర్వహణ చేయడం అవసరమని, తానూనప్త్ర చమసని (అగ్నిసాక్షిగా ప్రమాణం చేసే ఒక ఆజ్యపాత్రని) అభిమర్శించాలని విధింపబడిన సందర్భంలో ఆ విధిని స్తుతించడానికి ఒక ఉపాఖ్యానంలో ఐకమత్యం ఇలా చెప్పబడింది.

దేవాసురాస్సంయత్తా ఆసన్తే దేవామిథో విప్రియా ఆసన్తేన్యోన్యస్మై జ్యేష్ఠ్యాయా తిష్ఠమానా పంచధా వ్యక్రామన్|

పూర్వం దేవతలు, రాక్షసులు యుద్ధసన్నద్ధు లయ్యారు. అప్పుడు దేవతలందరూ వేరే వారికి ప్రధాన నాయకత్వం లభించడాన్ని అంగీకరించనివారై అయిదు వర్గాలుగా విడిపోయారట.

అగ్నిర్వసుభిస్సోమోరు ద్రైరిన్ద్రో మరుద్భిర్వరుణ ఆదిత్యై ర్బృహస్పతి ర్విశ్వైర్దేవై స్తేఽమన్యన్త| (తై.సం)

వసుగణానికి నాయకుడుగా అగ్ని, రుద్ర గణానికి సోముడు, మరుద్గణానికి ఇంద్రుడు, ఆదిత్య గణానికి వరుణుడు, విశ్వేదేవ గణానికి బృహస్పతి నాయకులుగా విభజించబడి సభాస్థలి నుంచి నిష్క్రమించారు.

తేఽమన్యన్త అసురేభ్యోవా ఇదం భ్రాతృవ్యేభ్యోరధ్యామో యన్మిథో విప్రియాస్మః (తై.సం)

పిమ్మట, మనమందరం ఇన్ని వర్గాలుగా విడిపోవడంవల్ల మన శత్రువులైన రాక్షసులకు యుద్ధంతో పని లేకుండా మనమే అనాయాసంగా వారికి విజయాన్ని సాధించిపెట్టిన వారమవుతామని తలచారు. దీనికి పరిష్కారం ఏమిటా అని ఆలోచించి ఈ విధంగా శపథం చేసుకున్నారు.

యా వా ఇమాః ప్రియాస్తనువ స్తాస్సమవద్యామహై తాభ్య స్సనిర్ ఋచ్ఛాద్యోనః ప్రథమోఽన్యోన్యస్మై ద్రుహ్యాదితి|

మనవారందర్నీ ఒక సంఘంగా నిర్మించుకుందాం. మనలో ఎవడు ముందుగా ఇతరులకు ద్రోహం తలపెడతాడో అటువంటివాడు సంఘంనుంచి నిష్క్రమింపదగిన వాడుగా నిర్ణయిద్దాం, అని అందరూ ప్రతిజ్ఞ చేసుకున్నారు. అంటే, అందరం ఐకమత్యంగా ఉండి పరిపాలనలో సహకరించుకుందామని ప్రమాణ స్వీకారం చేసేక పరస్పరం ద్రోహం తలపెట్టేవారిని బహిష్కరించాలని చెప్పినట్లయింది. ప్రస్తుత యజ్ఞ ప్రకరణంలో **'తానూనప్త్ర చమస'** అనబడే అగ్ని సాక్షిగా ప్రమాణం చేసే ఆజ్యపాత్రలోని ఆజ్యాన్ని అందరూ స్పృశించడం ద్వారా, ఐకమత్యంగా ఉండగలమని అగ్నిసాక్షిగా ప్రమాణం చేసినట్లవుతుందని, ఆ ప్రకారం చెయ్యాలని నిర్ణయించుకున్నారు.

తస్మాద్యస్స తానూనప్త్రిణాం ప్రథమోద్రుహ్యతి స ఆర్తిమార్ఛతి|

అని యజ్ఞం చేసేటప్పుడు ప్రతిరోజు చేయదగిన అనుష్ఠానారంభంలో ఒక మంత్రంతో ఈ **'తానూనప్త్ర చమస'** అనే పేరుగల పాత్ర అగ్నిసాక్షిగా యజ్ఞంలో ప్రమాణం చేసే ఒక ఆజ్యపాత్ర. **'తనూం న పాతయతి న వినాశయతీతి తనూనపాత్'**- మన శరీరంలో ఉండి శరీరాన్ని దహింపచేయకుండా ఉన్న అగ్ని జఠరాగ్ని. దానికి సంబంధించిన ఆజ్యపాత్ర **'తానూనప్త్రచమస'**.

ఆ విధంగా ఆ ఆజ్యపాత్రలోని ఆజ్యాన్ని అందరూ స్పృశించడం వల్ల ఫలమేమి? అంటే-

యత్తానూనప్త్రగ్ం సమవద్యతి భ్రాతృవ్యాభిభూత్యై|

ఈ ప్రకారం చేయడంవల్ల అందరూ సంఘీభావంగా ఉండి యజ్ఞ నిర్వహణం చేసే వారవుతారు. దాని ప్రయోజనం శత్రు తిరస్కారం. **'భావత్యాత్మనా పరాస్యభ్రాతృవ్యో భవతి'**- తాను జయం సాధించగలడు, శత్రువు పరాభవాన్ని పొందినవాడు అవుతాడు. ప్రస్తుతం అందరూ ఐకమత్యంగా ఉండడంవల్ల అనాయాసంగా శత్రురాజును జయించిన వారవుతారని ఒక రాజనీతి దీనివల్ల బోధింపబడింది. పరస్పరం సంఘీభావం స్థాపన కూడా రాజా ధర్మాల్లో ఒకటి.

శత్రువశీకరణ-రాజనీతి

"శత్రుం వశీకర్తుం నీతిస్వరూప పర్యాలోచనయాఽపి నవిలంబః కార్య|" ఇతి

ఆత్మోదయః పరాజ్యా నిర్ద్వయం నీతిరితీయతే| (శి.వ.మ.వ్యా)

పరరాజ్య సంపాదన కూడా ఒక రాజధర్మం. నీతి పరంగా ఆలోచించినా శత్రువును వశపరచుకోవడం ఆలస్యం చేయకూడదు అన్నారు. తన అభివృద్ధి, పరక్షయము ఈ రెండింటినీ కోరడం నీతి అని చెప్పబడుతోంది. కౌటిల్య అర్థశాస్త్రం 5వ అధికరణం, 6వ అధ్యాయం, 14,15 ప్రకరణాల్లో చెప్పబడింది. కానీ దానికి మూలం వేదాల్లో కూడా ఉంది.

తేషామసురాణాం తిస్రః పురా ఆసన్నయస్మైయ్యవమాఽథరజతాఽథహరిణీ తాదేవా జేతుం నాశక్నువన్తా ఉపసదైవాఽజిగీషన్| (తై.సం)

తైత్తిరీయ సంహితలో ఉపసన్నామక ఇష్టిని ప్రశంసిస్తూ ఇలా చెప్పబడింది.

దేవానాం అసురాణాం చ కదాచిత్ సంగ్రామః ప్రాప్తః| అసురాణాం అయోవికార రజత వికార హిరణ్యవికార రూపాః తిస్రః పురః ఆసన్| తాః పురః దేవాజేతుం నాఽశక్నువన్| తదా తజ్జయోపాయః కః? ఇతి పర్యాలోచ్య తాసాం పురీణాం దుర్గం పరితః అవరుధ్య కంచిత్కాలమవస్థానేన తేషాం అసురాణాం అన్నపానాది క్షయాత్ అన్తర్విరోధాద్వా అనాయాసేనైవ జయో భవిష్యతీతి నిశ్చిత్య తేషాం దుర్గాణాం ఉప సమీపే సీదన్తీత్యుపసత్ తయా జయరూపం కార్యం అసాధయన్| (సా.భా)

దేవతలకు రాక్షసులకు ఒకానొకప్పుడు సంగ్రామం వచ్చింది. అసురలకు అయోమయ, రాజమయ, హిరణ్మయాలైన మూడు కోటలతో కూడిన పట్టణాలున్నాయి. ఆ పట్టణాలను దేవతలు జయించలేక పోయారు. అప్పుడు మరో జయోపాయం ఏమిటా అని పర్యాలోచన చేసి ఆ పురాల కోటగోడను స్వాధీనం చేసుకుని ఆ ప్రాకారం చుట్టూ కొంతకాలం ఉంటే ఆ అసురులకు లోపల కొంతకాలానికి అన్నపానాదులు అయిపోవడంవల్ల గాని వాళ్ళలో వాళ్ళకి అన్తఃకలహాలు ఏర్పడటంద్వారా గాని వారిని మనం అనాయాసంగా జయించగలమని నిశ్చయం చేసుకున్నారు. ఆ నిశ్చయానుసారంగా దేవతలు ఆ అసురుల దుర్గ సమీపంలోనే ఉండి వారిపై జయాన్ని సాధించారు.

యజ్ఞంలో రాక్షసులకు ప్రవేశం లేకుండా చేయబడే ఇష్టి ఉపసత్కార్యకారి అవడంతో దానికి ఉపసత్ అనే పేరు వచ్చింది. ఏతావతా దీనివల్ల శత్రురాజ్యాలను జయించడానికి వారి దుర్గాన్ని చూట్టూ ముట్టడి చేయడం అనేది ఒక రాజనీతి అని తెలియదగింది.

యుద్ధప్రకార వర్ణన

ఇంతవరకు చెప్పబడిన విధానాలవల్ల శత్రువుని జయించడం ఆలస్య మవుతుందని తలచి యుద్ధం చేయాలని అనుకున్నట్లయితే, ఆ యుద్ధప్రకారాన్ని కూడా వేదం వర్ణించింది. రాజన్యునికి యుద్ధం స్వధర్మంగా చెప్పబడింది.

యుద్ధంవై రాజన్యస్య యుద్ధేనైవైనగ్ం స సమర్ధయతి| (తై. సం.)

శ్రేయాస్ స్వధర్మో విగుణః పరధర్మాత్స్వనుష్ఠితాత్| స్వభావ నియతం కర్మకుర్వస్ నాప్నోతి కిల్బిషమ్| (భ.గీ.18-47)

అర్జునుడు క్షత్రియుడైన కారణంగా అతనికి శ్రీకృష్ణుడు చెప్పాడు "నీకు యుద్ధం శ్రేయస్కరం రాజన్యునికి స్వభావ నియతమైన యుద్ధాధికారం ఉంది కనుక యుద్ధం చేస్తున్నవాడు బంధువులను వధించిన ప్రత్యవాయాన్ని పొందడు" అని. ఇదే విషయం మధుసూదన సరస్వతి వ్యాఖ్యలో కూడా చెప్పబడింది.

యతః స్వధర్మ ఏవ మనుష్యాణాం భగవత్ప్రసాద హేతుః అతః పరధర్మాత్ సమ్యగనుష్ఠితాదపి శ్రేయాస్ ప్రశస్తతరః స్వధర్మో విగుణః అసమ్యగనుష్ఠితోఽపి తస్మాత్ క్షత్రియేణ సతాత్వయా స్వధర్మో యుద్ధాదిరేవ అనుష్ఠేయః న పరధర్మః భిక్షాటనాదిరిత్యభిప్రాయః|

స్వధర్మాన్ని అనుష్ఠించడమందే మనుష్యులకు భగవంతుడు ఇచ్చిన విధి. అందువల్ల పరధర్మాలను బాగా అనుష్ఠించడం కంటే కూడా స్వధర్మాలను పూర్తిగా కాకపోయినా వీలైనంతగా అనుష్ఠించిన వాడు ప్రశస్తమైనవాడని, అందువల్ల క్షత్రియునికి స్వధర్మమైన యుద్ధాదులే అనుష్ఠేయాలు అని చెప్పబడింది. పరధర్మాలను ఆచరించడమంటే భిక్షాటనం చేసినట్లే, అంటే హీనమైనదే అని అర్థం. ఈ ప్రకారం రాజన్యునికి యుద్ధం స్వధర్మమని చెప్పినట్లయింది.

మరో ప్రకరణంలో **'నాఽరాజకస్యయుద్ధమస్తి'** (తై.సం.) రాజు కానివానికి యుద్ధ ప్రసక్తి లేదన్నారు. అందుచేత రాజుకి యుద్ధం స్వధర్మంగా విధింపబడిందని చెప్పారు. ఆ యుద్ధప్రకారాన్ని కూడా రాజసూయాంతర్గత చాతుర్మాస్య ప్రకరణంలో (తైత్తిరీయ బ్రాహ్మణంలో) వైశ్వదేవనామక పర్వంలో ఆగ్నేయాది యాగక్రమ విధాన ప్రసంగంలో చెప్పబడింది.

దేవాసురా స్సంయత్తా ఆసన్| సోఽగ్నిరబ్రవీత్|మామగ్రే యజత మయాముఖేనాసురాన్జేష్యథేతి మాం ద్వితీయమితి సోఽమోబ్రవీత్| మయా రాజ్ఞాజేష్యథేతి| మాం తృతీయమితి సవితా మయా ప్రసూతా జేష్యథేతి| మాం చతుర్థీమితి సరస్వతీ| ఇన్ద్రియం వోఽహం ధాస్యామీతి| మాం పంచమమితి పూషా| మయా ప్రతిష్ఠయా జేష్యథేతి తేఽగ్నినాముఖేనాసురానజయన్| సోమేన రాజ్ఞా సవిత్రా ప్రసూతాః| సరస్వతీంద్రియ మదధాత్| పూషా ప్రతిష్ఠాసీత్| తతోవై దేవా వ్యజయన్త| (తై.బ్రా)

దీనికి భాష్యం ఇలా వుంది :

పురా దేవాశ్చ అసురాశ్చ యుద్ధ సన్నద్ధా ఆసన్| లోకే యుద్ధార్థం ఉద్యతాయాం సేనాయాం కేచన శూరాః భటాః ముఖతః యోద్ధుం గచ్ఛన్తి |తేషాం యుద్ధం ద్రష్టుం కశ్చిద్రాజా స్వామిత్వేన సన్నిధత్తే| కేచన దణ్డహస్తాః పృష్ఠతః స్థిత్వా యోధ్యాన్ అపరా వృత్తయే బలాత్ప్రేరయన్తి| అన్యే కేచన దుందుభ్యాది జయ ఘోషేణ యోధ్యానామ్ ఉత్సాహం జనయన్తి| అపరా కియత్యపి సేనా పురోగతాయాః యుధ్యన్త్యాః సేనాయాః పృష్ఠతః

సహాయత్వేన అవతిష్ఠతే తానేతాన్పంచవిధాన్ వ్యాపారాన్ అగ్న్యాదయః క్రమేణ స్వీకృతవన్తః| తతః దేవానాం జయః అభూత్| తతః అత్రాపి పంచహవిషాం నిర్వాపే జయో భవతి| తథాచ అగ్నిః సేనాపత్యం స్వీచకార|సోమః రాజకార్య నిర్వహణే ప్రయుక్తః| సవితా యోధ్యానాం ఉత్సాహజననార్థం న పరావర్తితవ్యమితి ప్రవర్తకః అభవత్| (సా.భా.)

పూర్వకాలంలో ఒకసారి దేవతలు, అసురులు యుద్ధ సన్నద్ధులయ్యారు. లోకంలో యుద్ధానికి సిద్ధమైన సేనలో కొంతమంది శూరులైన భటులు యుద్ధం చేయడానికి శత్రువులపై దండెత్తుతారు. వారి యుద్ధాన్ని చూడడానికి ఒక రాజు స్వామిగా ఆ యుద్ధసన్నిధిలో ఉంటాడు. కొంతమంది భటులు దండధారులై యుద్ధం చేసేవారికి వెనుక భాగంలో ఉండి వాళ్ళకి ఉత్సాహాన్ని కలుగ చేస్తూ, ఇంకా వాళ్ళు వెనక్కి తిరిగి పోకుండా బలాత్కారంగా ప్రేరేపిస్తారు.

మరికొందరు దుందుభ్యాది ఘోషచే యుద్ధ భటులకు ఉత్సాహాన్ని పుట్టిస్తారు. మరికొంతమంది సైనికులు సమరంలో ఎదుర్కొని యుద్ధం చేసే సమయంలో సేనకు వెనకనుంచి సహాయంగా నిలబడతారు. ఈ అయిదు విధాలైన వ్యాపారాలను అగ్న్యాదులు అదే క్రమంలో స్వీకరించారు. అనంతరం దేవతలకు జయం సిద్ధించింది. అందువల్ల ఈ ఇష్టియందు కూడా అయిదు హవిస్సులను నిర్వాపం చేయడంచే (యాగం చేయడంచే) జయం సిద్ధించగలదు. ఇందులో అగ్ని సేనాపత్యాన్ని స్వీకరించెను. సవితృదేవత యుద్ధ భటులకు ఉత్సాహాన్ని కలిగించి వారు పరావర్తులు కాకుండా(వెనుతిరిగి వెళ్లిపోకుండా) ప్రవర్తకుడయ్యెను.

శక్తి దేశకాల బలాఽబలజ్ఞానమ్ యాత్రాకాలశ్చ|

ఇత్యధికరణే కౌటిల్యార్థశాస్త్రే ఉత్సాహ ప్రభావయోః ఉత్సాహః శ్రేయాన్ స్వయం హి రాజా శూరో బలవాన్ అరోగశ్చ కృతాస్త్రః దణ్డద్వితీయోఽపి శక్తః ప్రభావవన్తం రాజానం జేతుం అత్రాపి అస్యప్రచణ్డ తేజసా కృత్యకరో భవతి| నిరుత్సాహస్తు ప్రభావవాన్ రాజా విక్రమాభిపన్నోపి నశ్యత్యాచార్యాః కించ పరావృత్తస్య జయ కార్యాఽభావేపి ద్వేషోపి మనునా ఉక్తః| (కౌ.అ.శా)

యస్తు భీతః పరావృత్తః సంగ్రామే హన్యతే పరైః భర్తుర్యద్దుష్కృతం కించిత్ తత్సర్వం స ప్రతిపద్యతే

యస్తు సుకృతం కించ దముత్రార్థముపార్జితమ్ భర్తా తత్సర్వ మాదత్తే| పరావృత్త హతస్య చ| (మ.స్మృ)

ఎవడు భయపడి యుద్ధంలో వెనక్కి వచ్చునో అటువంటివాడు పరులచే చంపబడతాడు. అతడు ప్రభువు యొక్క పాపాన్ని పంచుకొంటాడు. అట్టివాని పుణ్యం అంతా ప్రభువుకు వస్తుంది/ సంక్రమిస్తుంది. అందువల్లనే **"కామందకీయ నీతిసారం"** ద్వాదశ ప్రకరణంలో యుద్ధభటులకు అత్యంత ఉత్సాహం అవశ్యం అని-

శరణాగత వాత్సల్యం అమర్షిత్వమచాపలమ్| స్వకర్మ దృష్ట శాస్త్రత్వం కృతిత్వం దీర్ఘదర్శితా| జితశత్రుత్వ వాగ్మిత్వమక్రూర పరివారతా| ప్రకృతిస్థితతాచేతి విజిగీషోర్గుణోదయః సర్వైర్గుణైర్విహీనోపి స రాజా యః ప్రతాపవాన్| ప్రతాపయుక్తాత్త్రస్యన్తి పరే సింహాన్మృగా ఇవ| (కా.నీ.సా)

శరణాగతునియందు వాత్సల్యం ఉండడం, మంత్రులతో సమాలోచనలతో తన విధ్యుక్త ధర్మాలను తెలుసుకుని ఉండడం, దీర్ఘదృష్టి కల్గి ఉండడం శత్రువుల్ని జయించడం, మంచి మాటకారితనం, క్రూరత్వం లేకపోవడం, దైవ, బ్రహ్మజ్ఞాన విషయాలను తెలుసుకోవాలని ఆసక్తి ఉండడం ఇవన్నీ యుద్ధం చేసే రాజుకు ఆవశ్యకాలే/ఉండదగినవే! కానీ, ఈ గుణాలన్నీ లేకపోయినా ప్రతాపమనే గుణాన్ని కలవాడైతే అతని

ప్రతాపాన్ని చూసి శత్రురాజు భటులు సింహాన్ని చూసి ఇతర మృగాలు భయపడినట్లు వెనక్కి తిరిగి పారిపోతారు. ఇదే తీరుగా ఉత్సాహప్రశంసా ప్రకరణంలో కూడా ఇలా చెప్పబడింది.

ధీమానుత్సాహ సంపన్నః వ్యవసాయ సమన్వితః భాజనం పరమం శ్రీణామపామివ మహార్ణవః| (కా.నీ.సా)

ఉదకాలకు సముద్రం నెలవైనట్లుగా (ఉత్పత్తి స్థానమైనట్లుగా), మంచి ధైర్యం ఉత్సాహం కలిగి ఉండడం, యుద్ధ సంబంధమైన వ్యవహార సమన్వయం ఉండడం, ఇవన్నీ ఐశ్వర్యాలను పొందడానికి ఈ గుణ సముదాయాలన్నీ కారణమవుతాయి. అందువల్ల ఉత్సాహం మొదలగునవి అత్యంత ఆవశ్యకమని అందులోనూ కార్యాలోచన, ఉత్సాహం, వ్యవసాయాత్మక దృష్టి అనే మూడింటితోనే జయం సిద్ధిస్తుందని చెప్పబడింది. దీనివల్ల దేవాసుర యుద్ధకాలంలో అగ్నివంటి అయిదుగురు దేవతలు, పై కార్యక్రమ బాధ్యతను స్వీకరించేరని తెలుసుకోవచ్చును.

ఈ ఉపాఖ్యానం కర్మప్రకరణంలో **"ఉపసన్నామక"** ఇష్టిని ప్రశంసించడానికి ప్రారంభించబడినా, అవాంతర తాత్పర్య విధంగా వైరి దుర్గాన్ని చుట్టుముట్టడం వంటివి చేయడం ద్వారా యుద్ధసేన చిరకాలీన అవస్థా రూప ఉపాయంతో అజేయమైన వైరి దుర్గాన్ని జయించడానికి శక్యమవుతుందని ఒకానొక రాజనీతి ప్రతిపాదింపబడింది. తైత్తిరీయ సంహితలో మరో రాజనీతి కూడా వేదంలో ప్రతిపాదింపబడింది. తై.సం. అగ్నిష్టోమీయ ప్రకరణంలో సుత్యాహస్సు రోజున ద్విదేవత్య గ్రహప్రచారం **"ఐంద్రవాయవం గృహ్ణాతి, మైత్రావరుణం గృహ్ణాతి, ఆశ్వినం గృహ్ణాతి"** ఇత్యాది వాక్యాలచే విధింపబడింది. అందులో మిత్రావరుణ గ్రహ గ్రహణాన్ని స్తుతించే సందర్భంలో **"మిత్రం దేవా అబ్రువన్"** ఇత్యాది గ్రంథంచే సోముణ్ణి అనగా సోమతలను రసం కోసం అభిషవం చేయడానికి (సోమలతను రసం వచ్చేలా నలగ కొట్టడానికి) ముందు సోముడికి దాయాదుడైనందున మిత్రుని సహాయం కోరేరు. తర్వాత మిత్రుడు **"సోబ్రవీద్వరం వృణై పయసైవ మే సోమగ్ శ్రీణన్నితి"** అని పయస్సుతో సోమరసాన్ని కలపాలని వరాన్ని యాచించగా దాన్ని అంగీకరించారు. తర్వాత దేవతలు సోముడికి, దాయాదియైన వరుణుని కూడా సహాయం చేయవలసిందిగా ప్రార్థించారు.

వరుణం దేవా బ్రువన్ త్వయాగ్ం శుభువా సోమగ్ం రాజానగ్ం హనామేతి| (తై.సం)

తర్వాత వరుణుడు దేవతలతో పలికెను- 'సోమరసం నాకు, మిత్రునికి కలిపి ఒక పాత్రలోకి గ్రహించాలి' అని. ఆ ప్రకారం గ్రహించడానికి దేవతలు అంగీకరించి అదే విధంగా ఒక పాత్రలోకి గ్రహించారు.

తస్మాద్రాజ్ఞా రాజానమగ్ం శుభువాఘ్నంతి వైశ్యగ్ం శూద్రేన శూద్రం| (తై.సం)

జ్ఞాతులైన మిత్రావరుణుల సహాయంతో సోమాభిషవం చేసిన కారణంవల్ల లోకంలో కూడా ఎవరిని హత్య చేయదలచామో వాని దాయాది అయిన రాజు సహాయంతో రాజుని, వైశ్యునితో వైశ్యుని, శూద్రునితో శూద్రుని వినియోగించి ఆ కార్యాన్ని నిర్వర్తించడం కలదు.

సోమస్య దాయాదిం వరుణం సోమాభిషవార్థం దేవాః ప్రార్థయామాసుః తదానీం వరుణః తస్మై మిత్రాయ సహ సోమగ్రహణం కర్తవ్యమితి వరమ్ వృణీత తతః సోమరాజహననే సాహాయ్యమకరోత్| ఇతి (సా.భా)

దీనిని వ్యాఖ్యానిస్తూ సాయణాచార్యులు తన భాష్యంలో **"అత్ర కాచన రాజనీతిః ప్రదర్శితా యథా రామః విభీషణ సహాయేన రావణం జఘాన"** మొదలగునవి ఉదహరించారు. రాముడు విభీషణుని సాహాయ్యంతో రావణుని సంహరించిన విషయాన్ని ఉదాహరణగా పేర్కొన్న సాయణులు తన భాష్యంలో మిత్రావరుణుల విషయం కూడా అటువంటి ఒక రాజనీతి అని వ్యాఖ్యానించారు.

దీనివల్ల పరరాజును స్వాధీనం చేసుకోవడానికి మార్గం సూచించబడింది. ఇంకా, శత్రువుకి దాయాది కాకపోయినా శత్రువర్గంలో ఉన్నవారిని స్వవర్గంలోకి చేర్చుకోవడం ద్వారా శత్రువును జయించవచ్చని మరో రాజనీతి కూడా సూచించబడింది.

దేవా మనుష్యాః పితరస్తేఽన్యత ఆసన్నసురా రక్షాగ్ంసి పిశాచాస్తేన్యత స్తేషాం దేవానాముత యదల్పం లోహితమకుర్వన్త ద్రక్షాగ్ంసి రాత్రీభిరసుభ్నన్స్| (తై.సం)

దేవతలు, మనుష్యులు, పితరులు ఒక వర్గం. అసురులు, రాక్షసులు, పిశాచాలు ఒక వర్గం.

అసురాణాం రక్షసాం చ ఆస్త్యేవ అవాన్తరజాతి భేధః తదీయే యుద్ధే స్వల్ప ప్రహారేణ దేవానాం శరీరే యల్లోహితమ్ ఇతరే అకుర్వన్ క్షుభితం కృతవన్తః|

ఇలా ఉండగా, దేవాసురుల యుద్ధంలో ఇతరులు స్వల్పమైన దెబ్బలతో దేవతల శరీరంలో రక్తం వచ్చేటట్లు చేసేరు. ఇంకా ఆ లోహిత స్థానాన్ని (రక్తం వచ్చిన చోటును) రాక్షసులు ప్రతి దినమూ రాత్రి భాగంలో వచ్చి ఒకానొక విష ప్రయోగంతో క్షోభ కలదానినిగా చేశారు.

తద్రక్షాగ్ంసి రాత్రీభిరసుభ్నన్న్స్| (తై.సం)

తాన్సుబ్ధాన్మృతానభివ్యైచ్ఛత్|

తేదేవా అవిదుర్యో వైనోఽయం మ్రియతే రక్షాగ్ంసి వా ఇమమ్ ఘ్నన్తీతి|

ఆ క్షోభచే దేవతలు మృతి చెందారు. వారు (దేవతలు) మృతి చెందిన సమయానికి ప్రభాతమయ్యింది. మనలో ఎవరు మృతి చెందేనో అతణ్ణి రాక్షసులే హననం చేశారని దేవతలు తెలుసుకున్నారు.

తే రక్షాగ్ స్యుపామన్త్రయన్త తాన్యబ్రువన్ వరం వృణామహై యదాసురాన్జయామ తన్నస్సహాఽసదితి

తతోవై దేవా అసురానజయన్ తేసురాన్జిత్వా రక్షాగ్స్యపానుదన్త| (తై.సం)

పిమ్మట దేవతలు కొంత ఉత్కోచాన్ని (లంచాన్ని) వినిపించి ఆ రాక్షసులను స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో రాక్షసులు ఆ విజయంలో తమకు (రాక్షసులకు) కూడా భాగమియ్యవలసిందని దేవతలను కోరి, తామున్న సైన్యం నుంచి వచ్చి దేవతల సైన్యంలో ప్రవేశించారు. అనంతరం ఆ రాక్షసుల సహాయంతో అసురులను జయించి రాక్షసులు కోరిన విధంగా వారికి విజయఫలంలో భాగమివ్వడానికి ఇంతకు ముందు అంగీకరించినా భాగమివ్వకుండా దేవతలు వాళ్ళను వెళ్లగొట్టారు. పిమ్మట రాక్షసులు ఈ విధంగా ఆలోచించారు-"మనకు విజయఫలంలో భాగమిస్తామని అంగీకరించి, మన సహాయాన్ని పొంది వారికి జయం సిద్ధించాక మనకి ఫలమివ్వకుండా మనల్ని వెళ్లగొట్టారు. ఈ విధంగా వారు అబద్ధం ఆడారు" అని.

తాని రక్షాగ్ స్యనృతమకర్తేతి సమన్తం దేవాన్పర్యవిశన్| (తై.సం)

దీనికి ప్రతిక్రియగా దేవతలను ప్రహరణం చేయడానికి (కొట్టడానికి) ఆ దేవతలను చూట్టూ ముట్టడి చేసేరు. దేవతలు ఆ బాధను తొలగించుకోవడానికై **"తే దేవా అగ్నావనాధన్త"** అను శ్రుత్యుక్త ప్రకారం అగ్నిని స్వకార్య సిద్ధి కోసం యాచించి మూడు హవిస్సులతో కూడిన ఇష్టిని అనుష్ఠించారు. ఈ ఇష్టి సామర్థ్యంచే ప్రతీకవతోఽగ్ని దేవతాక యాగం చేసి పూర్వ దిక్కునందు గల రాక్షసులను తొలగించారు. ప్రవతోఽగ్ని దేవతాక యాగం చేసి దక్షిణ, ఉత్తర దిక్కునందు గల రాక్షసులను తొలగించారు అని శ్రుతి చెప్తోంది. పిమ్మట

దేవతలు జయించారు, రాక్షసులు పరాభూతు లయ్యేరు. అందువలన ఎవడికి శత్రువు వుండి, అతనితో స్పర్ధకలవాడో ఆ శత్రువుబాధ తొలగించుకోవడానికి ఈ పైన చెప్పిన విశేషణ విశిష్టులైన అగ్నులకు పురోడాశ ద్రవ్యకమైన యాగం చెయ్యాలని ఈ క్రింది శ్రుతి చెప్తోంది.

తే దేవా అగ్నావనాధన్త తేఽగ్నయే ప్రవతే పురోడాశమష్టాకపాలం నిరవపన్నగ్నయే విబాధవతేఽగ్నయే ప్రవతే నిరవపన్|యాన్యేవ పురస్తాద్రక్షాగ్ స్యాసన్ తాని తేన ప్రాణుదన్త|యదగ్నయే విబాధవతే యాన్యేవాభితో రక్షాగ్ స్యాసన్ తాని తే నవ్యబాధన్త| యదగ్నయే ప్రతీకవతే యాన్యేవ పశ్చాద్రక్షాగ్ స్యాసన్తాని తేనాపానుదన్త తతో దేవా అభవన్ పరాసురాః| (తై. సం.5)

యో భ్రాతృవ్యవాన్థ్స్యాత్సస్పర్థమాన ఏతయేష్ట్యా యజేత| (తై.సం.5)

మొదలగు వాటిచే ఆ త్రిహవిష్కృష్టి విధింపబడిందని చెప్పేరు.

య ఏ వాస్మా చ్ఛ్రేయాన్ భ్రాతృవ్యః తం తేన ప్రణుదతే య ఏవైనేన సదృఙ | తం తేన విబాధతే యదగ్నయే ప్రతీకవతే య ఏ వాస్మాత్పాపీయాన్తం తేనాపనుదతే| (తై.సం)

ఈ ఇష్టిలో అనుష్ఠింపబడిన మూడు యాగాలవల్ల (1)తనకంటే ఉన్నతమైన శత్రువు, (2)తనతో సమానబలం గల శత్రువు, (3)తనకంటే తక్కువ సామర్థ్యం కల శత్రువు అని మూడు విధాలైన శత్రువులు కూడా తొలగింపబడతారని చెప్పింది. ఇది త్రిహవిష్కృష్టి సామర్థ్యం. దీనివల్ల శత్రువర్గంలోని సైనికుల్లోని వారిని తన వర్గంలో చేర్చుకుని తద్వారా శత్రువుని జయించడమనే రాజనీతి కూడా సూచింపబడింది.

వేదం సూచించిన పన్నుల విధానం

పైన సూచించిన విధంగా రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవాలని, రాజ్యపాలన కోసం అనుకూలమైన అమాత్యులు, విద్వాంసుడైన పురోహితుడు అవసరమని చెప్పాక రాజ్యపాలనలో పన్నులు వేసే విధానాన్ని, వాటిని అమలు చేసే విధానాన్ని చెప్తోంది. మనుస్మృతిలో ఇలా చెప్పబడింది.

రాజ్యాధిపతీ రాజా అష్టమాత్రానిర్మితో భవతి| (మ.స్మృ.)

రాజ్యాధిపతి అయిన రాజు అష్టమాత్రలతో (తేజస్సులతో) నిర్మించబడుతున్నాడుట.

ఇన్ద్రస్యార్కస్య వాయోశ్చ యమస్య వరుణస్యచ చన్ద్రస్యాగ్నేః పృథివ్యాశ్చ తేజోవృత్తం నృపశ్చరేత్| వార్షికాంశ్చతురో మాసాన్ యథేన్ద్రోఽభి ప్రవర్షతి| తథాభి వర్షత్స్వం రాష్ట్రం కామైరిన్ద్రవ్రతం చరేత్ | అష్టౌమాసాన్ యథాదిత్యః తథాహరతి రశ్మిభిః తథా హరేత్కరం రాష్ట్రాన్నిత్యమర్కవ్రతం హి తత్| (మ.స్మృ)

ఇంద్రుడు-సూర్యుడు-వాయువు-యమ-వరుణ-చంద్ర-అగ్ని-పృథివి అను ఎనిమిదిమంది దేవతల తేజు రూప అంశాలతో రాజు రాజ్యాధిపతిగా ఉంటాడు. కనుకనే ఇంద్రుడు సంవత్సరానికి నాలుగు మాసాలు సమృద్ధిగా వర్షించి ప్రజలకు జలసమృద్ధిని కలిగించిన విధంగా రాజు కూడా రాష్ట్రాంతర్గత (రాష్ట్రంలో ఉన్న) ప్రజలకు జలాది సౌకర్యాలను కల్పించి ఇంద్రవ్రతాన్ని, ఆదిత్యుడు ఎనిమిది మాసాలు తన కిరణాలచే భూమిస్తమైన ఉదకాన్ని హరిస్తున్న విధంగా రాజు తన రాజ్యంలో గ్రామపాలకులు వగైరాలను నియమించి వారిద్వారా కరదానం (పన్ను వసూలు) చేయాలని, ఇది అర్కవ్రతం అని వివరించారు.

ఈ కరదాన పద్ధతిని వేదం హోతృమంత్ర సృష్టి ప్రసంగంలో జగత్సృష్టిని చెప్తూ కూడా చెప్పింది.

తతోవా ఇన్ద్రో దేవానా మధిపతిరభవత్| (తై.బ్రా. 2-2-10)

తం దేవాస్సమన్తం పర్యవిశన్ వసవః పురస్తాత్ రుద్రాదక్షిణతః ఆదిత్యాః పశ్చాత్ విశ్వేదేవా ఉత్తరతః ఆంగీరసః ప్రత్యన్చం సాధ్యాః పరాన్చం య ఏవం వేద ఉపైనగ్ం సమానాస్సం విశన్తి| (తై.బ్రా)

దేవతలకు ఇంద్రాధిపత్యాన్ని చెప్పి తర్వాత, వస్వాది దేవతలందరూ దేవాధిపతి అయిన ఇంద్రుని పరివేష్టించి **"ఇంద్రస్య రాజనీత్యా ప్రజాభ్యః సంపాదన ప్రకారం దర్శయతి"** అని, ప్రజలనుంచి సంపాదనా ప్రకారాన్ని చూపించవలసిందిగా ఇంద్రుని రాజనీతి అడిగేరు.

ఆ ఇంద్రుడు స్వయంగా ప్రజాపతి సమాన సామర్థ్యయుక్తుడై ప్రజలను స్వాధీనం చేసుకుని వారి వారికి ఉచితమైన కరము (పన్ను) ఇవ్వాలని ఆజ్ఞాపించెను. కానీ, ఆ ప్రజలు అన్నభాగకరమైన ఆ పన్నును ఇవ్వడానికి నిరాకరించారు. అలా నిరాకరించిన ప్రజలు తూర్పుదిక్కున ఉండగా ఇంద్రుడు పన్ను వసూలుకు సమర్థుడైన భృత్యుని ఆ తూర్పు దిక్కుకి పంపించెను.

తాముఖం పురస్తాత్పశ్యన్తీః ముఖం దక్షిణతః పశ్యాత్పర్యాయస్|స పశ్చాత్పర్యవర్తయత తా ముఖం పురస్తాత్పశ్యన్తీః ముఖందక్షిణతః| ముఖం పశ్చాత్ ఉత్తరతః పర్యాయస్ స ఉత్తరతః పర్యవర్తయత తాముఖం పురస్తాత్పశ్యన్తీః ముఖం దక్షిణతః ముఖం పశ్చాత్ ముఖముత్తరతః ఊర్ధ్వా ఉదాయస్ స ఉపరిష్టా న్యవర్తయత తాస్సర్వతో ముఖోభూత్వాఽనయత్ తతో వై తస్మై ప్రజా అతిష్ఠన్తాన్నాద్యాయ| (తై.బ్రా)

తూర్పు దిక్కున గల ప్రజలు ఆ దిక్కుకు ఇంద్రునిచే పంపబడిన అధికారిని చూసి దక్షిణం వైపు మళ్లారు. ఇంద్రుడు మళ్ళా ఆ దిక్కుకు అధికారిని పంపాడు. అక్కడ ఆ అధికారిని చూసి పశ్చిమ దిక్కుకు మళ్ళారు. అక్కడికీ అధికారి రాగా మళ్ళీ ఉత్తర దిక్కుకి, అధికారి ఉత్తరానికి వెళ్ళగా ప్రజలు పై భాగానికి వెళ్ళారు. అప్పుడు ఇంద్రుడు ఈ ప్రకారం అయిదు దిక్కులందు స్వకార్యక్షమమైన (పన్ను వసూలు చేయడమనే పని నేర్చిన) భృత్యులను ఉంచి వారిద్వారా **"తాస్సర్వతోముఖో భూత్వాఽవయత్"** తాను సర్వతోముఖుడై ఆ ప్రజలను స్వాధీనం చేసుకొన్నాడు.

తతోవై తస్మై ప్రజా అతిష్ఠన్తాన్నయద్యాయ|

అన్ని దిక్కులందు ఇంద్రునిచే ప్రేరేపింపబడిన అధిపతులను చూసి ఇతరత్రా వెళ్లడానికి శక్యం లేనివారై ప్రజలు పన్నుని ఇవ్వడానికి అంగీకరించారు. అందువల్లనే రాజు సర్వత్ర (అన్ని చోట్ల) తానే పన్ను వసూలు వగైరా చెయ్యడం సాధ్యపడదు కనుక గ్రామ్యాధ్యక్షాదుల్ని నియమించాలని, వారి ద్వారా వికేంద్రీకరణ మార్గంలో పన్ను వసూలు చేయడం, పాలించడం కూడా చేయాలని మనుధర్మశాస్త్రం చెప్తోంది.

తేషాం గ్రామ్యాణి కార్యాణి పృథక్కార్యాణి చైవహి రాజ్ఞోన్యస్సచివ స్స్నిగ్ధః తాని పశ్యేదతంద్రితః| నగరే నగరే చైకం కుర్యాత్సర్వార్థ చిన్తకమ్| ఉచ్చైః స్థానం ఘోరరూపం నక్షత్రాణా మివగ్రహః| (మ.స్మృ)

ఆ యా గ్రామాలకు సంబంధించిన పన్నుల కార్యనిర్వహణ, ఇతర రాజకార్యాల నిర్వాహణకు గ్రామాధిపతుల్ని నక్షత్రాధిపతులైన నవగ్రహాల వలె కొన్ని గ్రామాలకు కేంద్రమైన నగరాలకు అధిపతుల్ని నియమించాలి.

గ్రామాధ్యక్షాన్, దశాధ్యక్షాన్, శతాధ్యక్షాన్, దేశాధ్యక్షాంశ్చ కుర్యాత్ (వి.స్మృ)

వివాదః సంజాయేత గ్రామాధ్యక్షాయ నివేదితే| నివేదితే తత్ర అపరిష్కృతే నగరాధ్యక్షాయ రాష్ట్రాధ్యక్షాయ దేశాధ్యక్షాయ చ నివేదయేత్| (వి.స్మృ ,మ. స్మృ)

జనంమధ్య వివాదం మొదలైతే గ్రామాధ్యక్షునికి నివేదించాలి. అక్కడ పరిష్కారం కాకపోతే దశాధ్యక్షునికి (మండలాధ్యక్షునికి), అక్కడ పరిష్కారం కాకపోతే శతాధ్యక్షునికి (జిల్లా అధ్యక్షునికి), అక్కడా పరిష్కరింప బడకపోతే రాష్ట్రాధ్యక్షునికి, ఆ పైన దేశాధ్యక్షునికీ నివేదించాలని చెప్తోంది.

ఈ నియామకమంతా వేదమూలకమని చెప్పడానికై శ్రుత్యుదాహరణలతో రాజ్యపాలనా విధానం వివరించ బడింది. పైన చెప్పిన ప్రకారం రాజధర్మాలతో పరిపాలించగలనని రాజు ప్రమాణస్వీకారం చేసి, ప్రజలనుంచి పన్నులు వసూలు చేసి, ఆ ప్రజలకు సర్వ సౌకర్యాలను కల్పించి లోకంలో తండ్రి పుత్రుని రక్షించినట్లు రక్షిస్తానని ప్రతిజ్ఞ చేసి కూడా అలా రక్షించకపోతే ఆ రాజు నిందించబడుతున్నాడు.

యో హరేద్బలి షడ్భాగం న చ రక్షతి పుత్రవత్ అహంవో రక్షితేత్యుక్త్వా యో న రక్షతి భూమిపః| స సంహత్య నిహన్తవ్యః శ్వేవ సోన్మాద ఇవామదః| (వి.స్మృ)

ఏ రాజు ప్రజలనుంచి పన్ను వసూలు చేసి ప్రజలను రక్షించడో అతడు ఉన్మత్తమైన శునకంవలె వధార్హుడని చెప్పబడింది.

ఇంతవరకు మన హిందూధర్మ శాస్త్రప్రకారం క్షత్రియుడు రాజ్యాన్ని పరిపాలించడం ముఖ్య పక్షమని రాజ్యయోగంవల్ల ఇతరులు కూడా రాజశబ్దంచే వ్యవహరింపబడతారని, క్షత్రియరాజుకి చెప్పబడిన ధర్మాలన్నీ వారికి కూడా వర్తిస్తాయని, బ్రాహ్మణ పురోహిత, అమాత్యాదులను నియమించి వారి సలహాలను తీసుకుని రాజ్యాన్ని పరిపాలించాలని, పాలకవర్గ, పాల్యవర్గాలందు ఐకమత్యాన్ని స్థాపించాలని, స్వరాజ్య స్థాపన ద్వారా పరరాజ్య సంపాదన రాజనీతి కనుక అవసరమైనప్పుడు యుద్ధం చేయడం ధర్మమని కూడా చెప్పబడింది. అలాగే యుద్ధ ప్రకార వర్ణన, పరరాజ్య సంపాదనా ప్రకారం, అందులో శత్రురాజు దుర్గాన్ని స్వసైన్యంతో ముట్టడింప చేయడం ద్వారా జయాన్ని సాధించడం రాజనీతి అని, ఒకప్పుడు శత్రురాజుయొక్క దాయాది లేదా శత్రువర్గంలోని వారిని లంచం ద్వారా లోబర్చుకుని వారి సహాయంతో శత్రువును జయించడం కూడా ఒక రాజనీతి అని, ప్రజలను కన్నతండ్రివలె రక్షిస్తానని ప్రమాణంచేసి రక్షించని రాజు పిచ్చికుక్కవలె వధించ అర్హుడని కూడా చెప్పింది. ఆ విధంగా ప్రతిజ్ఞా ఉల్లంఘనం చేసిన రాజు కూడా శరణాగతుడైతే అతడిని వధనుంచి విముక్తి చేయడానికి కూడా ఈ క్రింది శ్రుత్యుక్త ప్రకారం ధర్మమని చెప్పింది.

తస్మాదపి వధ్యం ప్రపన్నం న ప్రతి ప్రయచ్ఛన్తి|

రాజు ఇంద్రాద్యష్టమాత్రా నిర్మితుడు కనుక ఇంద్రాదులవలె ప్రజలకు జలసౌకర్యం వంటివి కల్పించాలని, ఆదిత్యుడు భూమిస్థ (భూమిమీద ఉన్న) ఉదకాన్ని కిరణాలచే గ్రహించినట్లుగా రాజ్యాధిపతి గ్రామ, నగరాధిపతుల ద్వారా ప్రజలనుండి పన్నును స్వీకరించాలని, అలా స్వీకరించిన రాజు ప్రజలను తండ్రివలె రక్షించాలని అలా రక్షించని రాజు శిక్షార్హుడని శ్రుతుల ఉదాహరణలతో సప్రమాణంగా వివరించడమైంది.

ఇక్కడ తరచుగా బ్రాహ్మణ, క్షత్రియ శబ్దాలు వాడినా వేదంలో చెప్పిన ప్రకారం చెప్పబడిందే గాని, నా కల్పన కాదని, వేదార్థ నిర్ణయానికి ఉపయోగపడు స్మృతుల్లో క్షత్రియుడు రాజని అతని ధర్మాల్లో చెప్పినప్పటికీ, రాజ్యయోగంవల్ల ఆ పదవిని అలంకరించిన ఎవరైనా రాజుగానే వ్యవహరింపబడతారు అనడంచే రాజ్య పరిపాలనలో రాజుకు చెప్పిన ధర్మాలన్నీ వారికి కూడా వర్తిస్తాయనడం శాస్త్రసమ్మతమే అని, చాతుర్వర్ణ్య విభాగంలో ఉన్న క్షత్రియశబ్దం క్షత్రియత్వ జాతి విశిష్టుని చెప్తుందని సూచించడానికి రెండు పర్యాయాలు **'క్షత్రం, క్షత్రం '** అని **"క్షత్రం క్షత్రం వైశ్రవణః"** అనే శ్రుతిలో వాడబడింది.

ఇందులో ఒక **'క్షత్ర'** శబ్దం ముఖ్యార్థమైన పరిపాలకత్వ ధర్మవిశిష్టుడిని చెబితే, రెండో **'క్షత్ర'** శబ్దం మాత్రం పదద్వయ ప్రయోగ సామర్థ్యంచేత (రెండు మార్లు చెప్పడంచే) క్షత్రియ వాచకమని తెలుస్తోంది. రాజ్యపరిపాలనా ప్రసంగంలో గల క్షత్రియశబ్దం క్షత్రియులతోబాటు ఉపలక్షణంగా పరిపాలకుడైన క్షత్రియేతర రాజును కూడా చెప్పడం శాస్త్ర సమ్మతమని తెలుసుకుని బ్రాహ్మణ క్షత్రియాది శబ్దాలకు ఆ యా జాతి విశిష్టమైన వారని అర్థం చెప్పడం అసమంజసమని తలవక రాజ్యపరిపాలనకు మూల సూత్రమైన వైదిక వాఙ్మయంలో అలా ఉందని తెలుసుకోవలెను.

కామ్యయాగాలు

మన సమాజపు యోగక్షేమాలకు ఉపయోగపడు ఐహికమైన ఫలాలనిచ్చే అలౌకికమైన ఉపాయాలు అనగా కొన్ని కామ్యయాగాలు (కోరికతో చేసేవి), కొన్ని కామ్యం కాని యాగాలు చెప్పబడ్డాయి, మన వేదంలో ఇలాగే అన్నకామం, ఐశ్వర్యకామం, ఆయుష్కామం మొదలైన కోరికలు కలవారు ఆ యా కోరికలు సిద్ధించడానికి ఆచరించదగిన అనేక యాగాలు వేదంచే విధింపబడ్డాయి. అందులో కొన్నింటిని సూక్ష్మంగా ఉదహరిస్తున్నాను.

దృష్టమైన ప్రయోజనాలు గల అనేక కామ్యేష్టులు, కామ్య పశుయాగాలు కృ.య.సం.2వ కాండలో 1,2 ప్రశ్నలందు విధింపబడ్డాయి. ఆ యా కోరికలు గలవారు ఆ యా యాగాలు అనుష్ఠించాలని వేదం విధించింది. అందులో ప్రథమ ఇష్టి (యాగం) ప్రజాపతి చేసెను.

ప్రజాపతిః ప్రజా ఆసృజత తాస్సృష్టా ఇంద్రాగ్నీ అపాగూ హ తాగ్ం సోచాయత్ప్రజాపతిః| ఇంద్రాగ్నీవైమే ప్రజా అపాఘుక్షతామితి సతమైంద్రాగ్నమేకాదశకపాల మపశ్యత్తం నిరవపత్తా వస్మై ప్రజాః ప్రాసాధయతామ్| (తై. సం.కాం.2-1)

ప్రజాపతి ప్రజలను సృజించెను. సృజించబడిన ప్రజలను ఇంద్రాగ్నులు **'ఆచ్ఛాదితవంతా'** అను భాష్య ప్రకారం వారికి సంతానోత్పత్తికి ప్రతిబంధకాన్ని కలిగించారు. ఇంద్రాగ్నులు ఇలా చేశారని ప్రజాపతి ఆలోచించి ఇంద్రాగ్ని దేవతాకమైన ఏకాదశ కపాల పురోడాశ ద్రవ్యకమైన యాగం చేస్తే ఈ ప్రతిబంధకం తొలగింపబడుతుందని యోచించి ఆ ప్రకారం యాగాన్ని అనుష్ఠించాడు.

తావస్మై ప్రజాః ప్రాసాధయ తాం|

దాని ప్రభావం వల్ల ఇంద్రాగ్నులు ప్రకృతమైన ఇష్టి విధి సామర్థ్యంవల్ల ఆచ్ఛాదనను తొలగించి ప్రజాపతి కోసం ప్రజలను అనుగ్రహించారు.

ఇంద్రాగ్నీవా ఏతస్య ప్రజామపగూహతో యోలం ప్రజాయై సన్ప్రజాం న విందత ఐంద్రాగ్నమేకాదశ కపాలం నిర్వపేత్ ప్రజాకామః|

ఏ పురుషుడు యౌవనాదులచే ప్రజోత్పాదన సమర్థుడై ఉండి అనగా నపుంసకుడు, దీర్ఘరోగి, వృద్ధుడు కానివాడై ఉండి కూడా సంతానాన్ని పొందలేదో ఆ పురుషునికి సంతానోత్పత్తి ప్రతిబంధకమైన ఇంద్రాగ్నులను గుర్తించి ఆ పురుషుడు ఇంద్రాగ్ని దేవతాకమైన ఏకాదశకపాల పురోడాశద్రవ్యక యాగం చెయ్యాలని చెప్పబడింది. (కపాలమనగా కుండపెంకు ముక్క). అటువంటి 11 ముక్కలను **"ధ్రువమసి పృథివీం దృగ్ంహ"** ఇత్యాది మంత్రాలచే అగ్నియందు తప్తంచేసి (కాల్చి) వాటియందు పిష్టంతో (పిండితో) చేయబడిన రొట్టెను ఉంచాలని చెప్పింది. కూర్మ ఆకారం కలదానిగా, అశ్వ,శఫ పరిమాణంగా నిర్మాణం చేయబడిన ఆ రొట్టెను పురోడాశమని వేదం పేర్కొంది.

కూర్మ స్యైవ ప్రతికృతి మశ్వశఫమాత్రం కరోతి| (ఆ.శ్రౌ.సూ.)

అటువంటి పురోడాశం ఎనిమిది కపాలాలయందు కాల్చబడితే అష్టాకపాలమని, తొమ్మిది కపాలాలందు కాల్చబడితే నవకపాలమని అనబడతాయి.

అష్టసు కపాలేషు సంస్కృతః పురోడాశః అష్టాకపాలః నవసు కపాలేషు సంస్కృతః పురోడాశః నవకపాలః|
(విగ్రహము) (విగ్రహము- సమాసానికి అర్థాన్ని వివరించే వాక్యం)

ఇత్యాది మంత్రాలచే కపాల సంఖ్యను అనుసరించి దశకపాలము, ఏకాదశకపాలము ఇత్యాది వ్యవహారం. ప్రకృతంలో సంతానకాముడు ఏకాదశకపాల పురోడాశద్రవ్యక యాగాన్నిఅనుష్ఠించాలని పై శ్రుతి విధిస్తోంది.

అపశ్యన్పురోడాశం కూర్మం భూతగ్ం సర్పన్తం|

అను శ్రుతి కూడా బోధించింది కాబట్టి ఆ ప్రకారం పురోడాశాన్ని శ్రుత్యుక్త విధానంగా నిర్మించి ఆ యాగాలందు వినియోగించాలి. మరో కోరికతో కూడా ఈ ఐంద్రాగ్నేష్టిని చేయవలసిందిగా చెప్పింది వేదం.

ఐంద్రాగ్నమేకాదశ కపాలం నిర్వపేత్ స్పర్ధమానః క్షేత్రేవాస జాతేషు వేంద్రాగ్నీ ఏవస్వేన భాగయేనోపధాతి|
(తై.సం.కాం.2)

అచేతనమైన క్షేత్ర విషయంలోను, చేతనమైన బంధు భృత్యాదుల విషయంలోను వివాదం ఏర్పడినప్పుడు ప్రతిపక్షి యొక్క సామర్థ్యాన్ని నశింపచేయడానికి ఇంద్రాగ్ని దేవతాక ఏకాదశ పురోడాశ ద్రవ్యకమైన యాగాన్ని అనుష్ఠిస్తే, **'విపాప్మనా భ్రాతృవ్యేణ జయతే'** అని, స్వయంగా తాను పాపిష్టుడైన వారితో విరోధించబడిన వాడైనా జయాన్ని పొందగలడు అనడంతో శత్రువుతో స్పర్ధ కలవాడు ఈ యాగాన్ని అనుష్ఠిస్తే ఆ స్పర్ధ తొలగిపోగలదని చెప్పినట్లయింది.

ఇంద్రాయాగ్ం హోముచే పురోడాశమేకాదశకపాలం నిర్వపేత్ యః పాప్మనాగృహీతః స్యాత్ పాప్మావా అగ్ం హః ఇంద్రమేవాగ్ం హోముచగ్ స్వేన భాగదేయేపధావతి స ఏవైనం పాస్మప్మనోఽగ్ం హసో ముంచతి| (తై.సం.కాం.2)

ఇలాగే పాపనివృత్తి కాముడు చేయదగిన ఇష్ట్యన్తర విధిని చెప్తోంది ఈ మంత్రం. ఇక్కడ **'అగ్ం హ'** శబ్దంచే నిషిద్ధాచరణాదిరూప పాపం చెప్పబడుతోంది. ఏ పురుషుడు చెప్పబడిన పాపంతో కూడినవాడై అగ్ం హోముక్ ఇంద్రునికి ఏకాదశకపాల పురోడాశద్రవ్యక యాగం చేస్తాడో ఆ పురుషుడు ఈ యాగానుష్ఠాన సామర్థ్యం వల్ల అత్యధిక పాపంనుండి విముక్తు డవుతాడు.

పాప నివృత్తి అందరూ కోరుకుంటారు గాని, అటువంటి వారికి హితాన్ని ఉపదేశించింది వేదమని గుర్తించాలి. ఇలాగే మరో ఇష్టి కూడా విధించబడింది.

ఇంద్రాయత్రాత్రే పురోడాశమేకాదశ కపాలం నిర్వపేత్ బద్ధేవాపరియత్తో వేంద్రమేవ త్రాతారగ్ స్వేన భాగధేయేనోపధావతి స ఏవైనం త్రాయతే| (తై.సం.కాం.2)

చేసిన తప్పు పనికి శృంఖలం, అనగా బంధించే గొలుసు. దానితో కట్టబడిన పురుషుడు లేదా గొలుసుతో కట్టుబడకపోయినా రాజభటులతో చుట్టుముట్టబడిన వ్యక్తి **'త్రాతృ'** విశేషణ విశిష్టమైన ఇంద్రునికొరకు ఏకాదశ కపాల పురోడాశద్రవ్యక యాగాన్ని అనుష్ఠించాలని వేదంచే విధించబడింది.

'త్రాతా' అంటే రక్షించేవాడు అని అర్థం కనుక అటువంటి విశేషణ విశిష్టుడైన ఇంద్రుని ఉద్దేశించి యాగం చెయ్యాలి. శృంఖలాలతో బంధింపబడిన వ్యక్తి కూడా దీని సామర్థ్యంవల్ల విముక్తుడవుతాడని గుర్తించ వలెను.

చర్మవ్యాధి కలవాడు చేయదగిన యాగం

యదిబి భీయాద్దుశ్చర్మా భవిష్యామీతి సోమాపౌష్ణం చరుం నిర్వపేత్| (తై.సం.2-2-10)

లోకంలో చర్మవ్యాధి కలగడానికి ముందు దానికి సంబంధించిన కొన్ని లక్షణాలు కనబడతాయి. దానివల్ల చర్మవ్యాధి రాబోతోందనే భయం పుడుతుంది. అటువంటి సమయంలో సోమపూష దేవతాక చారుద్రవ్యక యాగాన్ని చెయ్యాలి. ఈ యాగానుష్ఠాన సామర్థ్యంచే చర్మవ్యాధి రాకుండా ఉంటుంది. ఈ ప్రకారం మన శ్రేయస్సుని కోరి చర్మవ్యాధి నివారణకోసం వేదం పై యాగాన్ని విధించింది.

దీర్ఘరోగి చేయదగిన యాగం

సోమారౌద్రం చరుం నిర్వపేత్ జ్యోగామయావీ సోమంవా ఏతస్య రసోగచ్ఛతి అగ్నిగ్ం శరీరం యస్య జ్యోగా మయతి సోమా దేవాస్య రసం నిష్క్రీణాత్యగ్నే శ్శరీరం ఉతయదీతాసుర్భవతి జీవత్యేవ|(తై.సం.2-2-10)

ఏ పురుషుని చిరకాలంనుంచి వ్యాధి పీడిస్తోందో ఆ పురుషుడు దీర్ఘరోగి అని, **"జ్యోగామయావీ"** అను శబ్దంచే చెప్పబడుతున్నాడు. ప్రాణం శరీరాన్నంటి పెట్టుకుని ఉండడానికి కారణభూతమైనది, అన్నరసం. ఈ అన్నరసం వ్యాధికాలంలో ప్రాణానికి చెందకుండా సోమునికి చెందుతుంది. వాస్తవమైతే మనచే తినబడిన అన్న సంబంధమైన సూక్ష్మరసం మన మనస్సునుంచి భౌతికదేహం వరకూ బలకరం. దానిచేతనే ప్రాణం దేహమందు బంధింపబడుతోంది. మనస్సు అన్నవికారమని **"అన్నమయగ్ం హి సోమ్యమనః"** అను ఛాందోగ్య శ్రుతి చెప్తోంది. అన్నరసంచే ప్రాణం దేహమందు బంధింపబడుతోందని వాజసనేయ శిశుబ్రాహ్మణమందు **"అన్నం దదామి"** అను వాక్యంచే చెప్పబడుతోంది.

ఎప్పుడు మనచే భక్షింపబడిన అన్నంయొక్క రసం ప్రాణానికి అనగా ప్రాణాగ్నికి చెందక సోమునికి చెందిందో అప్పుడు శరీరం అగ్నిని పొందుతోంది. అన్నరసం ప్రాణానికి చెందకపోతే అన్నరసం లేక శరీరం అగ్నిని చెందడమేమి అను శంక కలుగుతుంది. **"ప్రాణే శరీరం ప్రతిష్ఠితం శరీరే ప్రాణః ప్రతిష్ఠితః"** అనే తైత్తరీయోపనిషత్ వాక్యంచే ప్రాణ, శరీరాలకు అవినాభావ సంబంధం చెప్పబడింది. అన్నరసం సోముణ్ణి పొంది అగ్నిని పొందకపోవుట చేతనే శరీరం అగ్నిని పొందడం. ఈ విషయాన్నే **"జఠరాగ్నేః గర్భస్థ అన్నరసస్య అభావాత్ మాంసాది ధాతూన్ భక్షయతి"** అనే భాష్యం వివరించింది. అనగా జఠరాగ్నికి మనచే భక్షింపబడిన అన్నంయొక్క రసం చెందకపోవడం వల్లనే ఆ అగ్ని మన శరీరంలో ఉండే మాంసాది ధాతువుల్ని భక్షిస్తుంది. మాంసాది ధాతువులు అగ్నిచే భక్షింపబడడం వల్లనే ధాతుశూన్యమైన శరీరం కృశిస్తోంది. ఇది మనకు అనుభవ సిద్ధమే. దీన్నే ఆధునికులు **'ఎసిడిటీ'** వ్యాధిగా పేర్కొనడం కలదు. కనుక దీర్ఘరోగి ఈ యాగాన్ని చేయాలి.

యజమాని చరుద్రవ్యక యాగం చేయడంచే చరుశబ్దార్థం **"అనవస్రావిత అంతరూష్మ పక్వోదనః చరుః"** అని మీమాంసా శాస్త్రంలో వివరించారు. అనగా అన్నం ఉడికిన తర్వాత గంజిని వార్చకుండా ఆ లోపల ఏర్పడిన ఆవిరితో పక్వమైన అన్నం **'చరు'** శబ్దంచే చెప్పబడింది. లోకంలో దీన్నే **'అత్తెసరు'** అని అంటారు. ఈ యాగానుష్ఠాత చరుద్రవ్యం అనగా అన్నమనే మూల్యాన్నిచ్చి సోమంనుంచి రసాన్ని అగ్నినుంచి శరీరాన్ని కొనుగోలు చేస్తున్నాడు. ఈ రుద్రశబ్దం- **'రుద్రోవా ఏషయదగ్నిః'** అను శ్రుతివలన అగ్ని చెప్పబడుతోంది కనుక ఆ అగ్ని ధాతువులని భక్షించకుండా ఉండడానికై **'చరు'** శబ్దార్థమైన అన్నాన్ని ఇచ్చి శరీరాన్ని కొనుగోలు చేస్తున్నామని (కాపాడుకుంటున్నామని) అర్థం.

దీనివల్ల ఆ యజమాని రోగరహితుడు అవడమే గాక ముహూర్తకాలంలో ప్రాణాలను విడవడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తి భూశయనం చేయబడిన వాడైనా తిరిగి లేచి జీవించగలడనే ఫలం చెప్పబడింది. దీర్ఘవ్యాధి గల పురుషుడు చేయదగిన మరో ఇష్టి కూడా విధింపబడింది.

అగ్నిం వా ఏతస్య శరీరం గచ్ఛతి సోమగ్ం రసో వరుణ ఏనం వరుణపాశేన గృహ్ణాతి సరస్వతీం వాగగ్నా విష్ణూ ఆత్మా యస్య జ్యోగామయతి యో జ్యోగామయావీస్యాత్ యోవా కామయేత సర్వమాయూరియామితి తస్మా ఏతామిష్టిం నిర్వపేత్| (తై.సం. కాం.2)

ఏ పురుషుని దీర్ఘవ్యాధి పీడిస్తోందో ఆ పురుషుని శరీరం మాంసాది ధాతు భక్షణంచే కృశిస్తోంది కనుక అగ్నిని ప్రవేశిస్తోందని వ్యవహారం. సోముడు రసాన్ని స్వీకరించడంవల్ల బలక్షయం (బలం తగ్గడం) ఏర్పడింది. వరుణుడు వరుణపాశంచే గ్రహించడంవల్ల ఉదరవ్యాధి ఏర్పడింది. అతని వాక్కు సరస్వతిని పొందుతోంది. అంటే అతడు మాట్లాడడానికి సమర్థుడు కాకపోతున్నాడు. జీవాత్మ అగ్నావిష్ణులను ప్రవేశించుటచే మరణోన్ముఖుడు అవుతున్నాడు. మరణంవైపు నడుస్తున్నాడు. ఇన్ని అనర్థాలు ప్రాప్తిస్తున్నందువల్ల పరిపూర్ణ ఆయుస్సుని పొందే కోరికగల దీర్ఘవ్యాధిగ్రస్తుడు (1)అష్టాకపాల పురోడాశ ద్రవ్యక (2)అగ్నిదేవతాక చరుద్రవ్యక (3)సోమదేవతాక దశకపాల పురోడాశ ద్రవ్యక (4)వరుణ దేవతాక చరుద్రవ్యక (5)సరస్వతీ దేవతాక ఏకాదశకపాల పురోడాశకపాల, పురోడాశద్రవ్యక విష్ణుదేవతాకమైన పంచహవిష్కృష్టిని చేయాలని, **"తస్మా ఏతామిష్టిం నిర్వపేత్"** అను శ్రుతి విధించింది.

అనగా అగ్ని దేవతను ఉద్దేశించి అష్టాకపాల పురోడాశద్రవ్యంతో (2) సోమదేవతను ఉద్దేశించి చరుద్రవ్యంతో (3) వరుణ దేవతనుద్దేశించి దశకపాల ద్రవ్యంతో (4) సరస్వతీ దేవతనుద్దేశించి చరుద్రవ్యంతో (5) విష్ణు దేవతనుద్దేశించి పురోడాశకపాల ఇష్టులను చేయాలని చెప్పింది.

ఏతద్యాగానుష్ఠాన సామర్థ్యేన అగ్నేరేవాస్య శరీరం నిష్క్రిణాతి సోమాద్రసమ్ వారుణేనై వైనం వరుణ పాపాన్ముంచతి సారస్వతేన వాచం దధాతి అగ్నిస్సర్వా దేవతా విష్ణుర్యజ్ఞో దేవతాభిశ్చైవైనం యజ్ఞేన చ భిషజ్యతి ఉతయదీతాసుర్భవతి జీవత్యేవ| (తై.సం.కాం.2)

అగ్నినుంచి శరీరాన్ని, సోముని నుంచి రసాన్ని కొనుగోలు చేసుకొని వరుణునియొక్క ప్రసాదంతో జలోదర వ్యాధినుంచి విముక్తుడై సరస్వతి యొక్క అనుగ్రహ భాషణతో సమర్థుడై సర్వదేవతా స్వరూపుడైన అగ్ని, యజ్ఞ స్వరూపుడైన విష్ణువుయొక్క అనుగ్రహంతో వైద్యం చేయించబడినవాడై ముహూర్త కాలంలో ప్రాణత్యాగోన్ముఖుడైన, భూశయనాన్ని పొందిన వ్యక్తి కూడా మరల జీవించి పరిపూర్ణ ఆయుస్సుని పొందగలడని వేదం చెప్తోంది. కాబట్టి, దీర్ఘవ్యాధిగ్రస్తుడు ఈ యాగం చేయనగును.

మాత్సర్య నివారణ కోసం ఇష్టి

మాత్సర్యాన్ని కలిగి ఉండి దాన్ని వదిలిపెట్టాలని అనుకునే వారికోసం వేదం ఒక ఇష్టిని విధించింది. ఆ ఇష్టి విధి కంటె ముందు ఇష్టి తాలూకు ప్రస్తావనను ఈ క్రింది ఉపాఖ్యానం వివరించింది.

దేవాసురాస్సంయత్తా ఆసన్తే దేవామిథో విప్రియా ఆసన్ తేఽన్యోన్యస్మై జ్యైష్ఠ్యాయాతిష్ఠమానాః చతుర్థా వ్యక్రామన్నగ్నిర్వసుభిః సోమైరుద్రైరింద్రో మరుద్భిర్వరుణ ఆదిత్యైస్సఇంద్రః ప్రజాపతి ముపాధావత్ తమేతా యా సంజ్ఞాన్యాయా జయదగ్నయే వసుమతే పురోడాశ మష్టాకపాలం నిరవపత్సోమాయ రుద్రవతే చరుమింద్రాయ మరుత్వతే పురోడాశమేకాదశ కపాలం వరుణాయాదిత్యవతే చరుం తతో వా ఇంద్రమ్ దేవా జ్యైష్ఠ్యాయాభిసమ జానత| (తై. సం.2-2-11)

దేవతలు, అసురులు యుద్ధానికి ఉద్యుక్తులైనప్పుడు దేవతలందరిలో **'నేను ప్రధానునిగా ఉండాలి, మరొకరు కాదు'** అని వారిలో వారు వివాదపడి ఒకరి ప్రధాననాయకత్వం మరొకరు అంగీకరించలేదు. అపుడు దేవతలు ఒకరియందు ఒకరికి విశ్వాసం లేనివారై వారి సేనను నాలుగు వర్గాలుగా విభజించారు. అందులో ఒక్కో వర్గానికి ఒక్కొక్కరు చొప్పున వసువులకు అగ్ని, రుద్రులకు సోముడు, మరుత్తులకు ఇంద్రుడు, ఆదిత్యులకు వరుణుడు అధిపతులుగా ఉన్నారు. వీరందరి కలయిక కోసం ఉపాయాన్ని చెప్పవలసిందిగా ఇంద్రుడు ప్రజాపతిని సేవించగా ప్రజాపతి ఉపదేశ ప్రకారం ఇంద్రుడు సంజ్ఞానీ నామక ఇష్టిని చేసెను.

తర్వాత ఆ యాగసామర్థ్యం వల్ల దేవతలు పరస్పర మాత్సర్యాన్ని విడిచినవారై ఇంద్రుడు ప్రధానుడుగా ఉండడానికి అందరూ అభ్యనుజ్ఞను (అంగీకారాన్ని) ఇచ్చేరు. దాని నిమిత్తంగానే **'సమ్యక్ జ్ఞాయతే అభ్యనుజ్ఞాయతే ఇష్ట్యా'** అని **'సంజ్ఞానీ'** అను వ్యుత్పత్తిని భాష్యంలో వివరించారు.

అంటే, ఏ ఇష్టియొక్క ప్రభావంచే నాయకత్వ ప్రాధాన్యానికి అభ్యనుజ్ఞ (అనుమతి) సంభవించిందో ఆ ఇష్టి సంజ్ఞానీష్టి అని చెప్పబడుతోంది. ఈ ఇష్టి సామర్థ్యంవల్ల ఇంద్రునికి దేవతల్లో ప్రాధాన్యం సంభవించింది. కనుక మాత్సర్యాన్ని విడిచిపెట్టి తనకు ప్రాధాన్యాన్ని ఇవ్వడంతో ఇతరుల అంగీకారాన్ని కోరేవాడు సంజ్ఞానీ నామకేష్టిని చేయవలసిందిగా **"యస్సమానైర్మిథో విప్రియస్స్యాత్ తమేతయా సంజ్ఞాన్యా యజయేత్"** (తై.సం) అను శ్రుతి విధిస్తోంది.

ఈ ప్రకారం సంఘంలో పరస్పర మాత్సర్యాన్ని విడిచిపెట్టి అందరి అనుమతితో స్వీయ ప్రాధాన్యాన్ని సంపాదించుకోవడానికి ఉపాయాన్ని కూడా వేదం బోధించిందని గుర్తించవలెను.

ఆయుష్కాముడు చేయదగిన ఇష్టి

దేవావై మృత్యోరబిభియుస్తే ప్రజాపతిముపాధావన్తేభ్య ఏతాం ప్రాజాపత్యాగ్ం శత కృష్ణలాం నిరవపత్తయై వైష్వమృతమదధాత్| (తై.సం.కాం.2)

దేవతలు మృత్యువుకి భయపడినవారై ప్రజాపతిని సమీపించగా ఆ ప్రజాపతి చెప్పినట్లుగా మృత్యుభీతి నివారణార్థం నూరు కృష్ణలాలతో తుల్యమైన (కృష్ణలమనగా మూడు యవల ఎత్తు బంగారం) సువర్ణ శకలాలు ద్రవ్యంగా కలిగిన ప్రజాపతి దేవతాకమైన ఇష్టిని నిర్వర్తించి, దాని సామర్థ్యం వల్ల దేవతలకు అపమృత్యు రాహిత్యాన్ని సంపాదించాడు.

యో మృత్యోర్బిభీయాత్ తస్మా ఏతాం ప్రాజాపత్యాగ్ం శతకృష్ణలాం నిర్వపేత్ ప్రజాపతి మేవ స్వేన భాగదేయేనోపధావతి స ఏవాస్మిన్నాయుర్దధాతి సర్వమాయురేతి| (తై.సం.కాం.2)

అపమృత్యువు ప్రాప్తిస్తుందని భయపడే పురుషుడు శతకృష్ణల ద్రవ్యక ప్రజాపతి దేవతాకమైన యాగాన్ని చెయ్యాలని వేదం విధించింది.

సర్వమాయుః జన్మకాలే యావదాయుః ఆరబ్ధేన కర్మణా ప్రాపితం తత్సర్వం విఘ్నేన వినా ప్రాప్నోతి|

అని సాయణ భాష్యం. ప్రారబ్ధరూప కర్మచే ఎంత ఆయుస్సును పురుషుడు పొందవలసి ఉన్నాడో అంత ఆయుస్సును అపమృత్యు రహితంగా నిర్విఘ్నంగా పొందగలడు. దీనివల్ల అపమృత్యు నివారణ పూర్వక పూర్ణ ఆయుస్సును పొందే కోరిక గల పురుషుడు ప్రాజాపత్యేష్టిని చేయాలని వేదం మనకి బోధిస్తోంది. దీనినే కుండలేష్టి అని యాజ్ఞికులు అంటారు. ఇంకా పరిపూర్ణ ఆయుస్సును కోరేవారు చేయదగిన మరో యాగం కూడా విధింపబడింది.

అగ్నయ ఆయుష్మతే పురోడాశమష్టాకపాలం నిర్వపేద్యః కామయేత సర్వమాయురియామిత్యగ్ని మేవాయుష్మన్తగ్ గ్ స్వేన భాగధేయేనోపధావతి స ఏవాస్మిన్నాయుర్దదాతి సర్వమాయురేతి| (తై.సం.2-2-3)

ఆయుష్మద్విశేషణ విశిష్టమైన అగ్నికోసం అష్టాకపాల పురోడాశద్రవ్యక యాగాన్ని చేయాలి. అలా చేస్తే ఆ అగ్ని యజమానియందు **"ఆయుర్ధధాతి"** పరిపూర్ణ ఆయుస్సుని ఉంచును. అందుచే యజమాని పూర్ణ ఆయుస్సుని పొందగలడు.

"అగ్నయ ఆయుష్మతే ఆయుష్ప్రదాయ అగ్నయే" అని సాయణభాష్యం. ఆయుస్సుని అందించగల అగ్నిని ప్రార్థిస్తున్నట్లు ఈ యాగంలో వినియోగింపబడే **పురోనువాక్య** అను మంత్రం వివరిస్తోంది.

ఆయుష్టే విశ్వతో దధదయమగ్నిర్వరేణ్యః| పునస్తే ప్రాణ ఆయతి పరాయక్ష్మగ్ం సువామితే| (తై. సం. కాం.2)

ఓ యజమానుడా! దేవతలందరిలో శ్రేష్ఠుడైన అగ్ని నీకోసం సంపూర్ణమైన ఆయుస్సును ఇచ్చు గాక! నీ ప్రాణం అపమృత్యువుచే గ్రహింపబడినా అగ్నిదేవత అనుగ్రహంతో ఆ అపమృత్యువు నశించు గాక అని ఈ మంత్రార్థం. ఇలాగే యాజ్యా మంత్రం-

ఆయుర్దా అగ్నే హవిషో జుషాణో ఘృతప్రతీకో ఘృతయోనిరేధి| ఘృతం పీత్వా మధుచారు గవ్యం పితేవ పుత్రమభిరక్షతాదిమమ్| (తై.సం.కాం.2)

ఓ అగ్నిదేవా! ఈ యాగమందు పురోడాశ హవిస్సును సేవిస్తున్న నిన్ను ఆఘార యాగాలు, ప్రయాజలు మున్నగు యాగాలన్నీ నిన్ను ఉద్దేశించి ఘృతం చేతనే నిర్వహింపబడుతున్నాయి. ఇలాగే అవసానంలో అనగా అనూయాజలనే యాగాలందునూ ఘృతమే వినియోగింపబడుతోంది కనుక ఘృతమే నీ జన్మోత్పత్తికి కారణంగా కలిగిన నీవు మంచి మాధుర్యోపేతమైన దర్భమయ పవిత్రచే శోధనం (శుద్ధి) చేయబడుతున్న నిర్మలమైన గోఘృతం సేవించి, **"ఆయుర్దా ఏధి"** పరిపూర్ణ ఆయుస్సును ఇచ్చి, తండ్రి కుమారుని రక్షించిన విధంగా **'అభిరక్ష'** సర్వవిధాలా రక్షించుము! అని ప్రార్థించడం ఈ మంత్రార్థం.

ఇదివరలో ఉదహరించిన కామ్యయాగాల యాజ్యాపురోనువాక్యాల అర్థం వివరించకపోయినా ఈ మంత్రం లోకంలో ప్రతి శుభకార్యంలోను వినియోగింపబడేది అవడం వల్ల ఈ మంత్రార్థం వివరించబడింది. ఇతర ఇంద్రియ పాటవం కన్న ఆయుస్సు చాలా ప్రధానం కనుక దీనిని అందరూ కోరడం సహజం. ఆ కోరికను తీర్చగలిగిన అగ్నిదేవుని ఈ మంత్రంచే ప్రార్థించడం ఉచితం కనుక యాగంచేసే అధికారం కలవారు యాగానుష్ఠానాలందు ఆ యా మంత్రాలను వినియోగించుకొని కోరికలను తీర్చుకోవాలి. ఈ విధంగా వైయక్తికంగాను (వ్యక్తిగతంగాను) సామాజికంగాను శ్రేయస్సును కలిగించేటటువంటి అనేక యాగాలను మనకు హితకారి అయిన వేదం బోధించింది. పై యాగాలను మనం చేయకపోయినా తత్ఫలాలను పొందగోరువారు ఆ యా యాగాల యాజ్యాపురోను వాక్యాలను జపిస్తే వాటి ఫలాలను పొందగలరు. కనుక వేదంలో విధించిన అనేక యాగాలను వివరించకపోయినా కొన్నిటిని మాత్రమే సంక్షేపంగా వేదం ఈ విధంగా మన శ్రేయస్సుని కోరుతుందని తెలుపడానికై వివరించాను. ఈ వివరింపబడినవి అన్నీ గార్హపత్య, ఆహవనీయ, దక్షిణాగ్నులనే త్రేతాగ్ని సాధ్యములు, శ్రౌత యజ్ఞాలు అయి ఉన్నాయి.

కానీ, ఇటువంటి యజ్ఞాలలో వినియోగింపబడే కొన్ని మంత్రార్థాలను బాగా విమర్శిస్తే వాటివలన మనకు వైజ్ఞానికంగా కూడా ఉపయోగపడే కొన్ని విషయాలు బోధపడగలవు. వైజ్ఞానికమైన విషయాలు, నైతిక విషయాలు ఇంతకు ముందు గ్రంథంలో వివరించాను.

6వ ప్రకరణం సమాప్తం

7వ ప్రకరణము

స్మార్తయజ్ఞాలు - సంస్కారాలు

ఇంతవరకు శ్రౌతయజ్ఞాలకు సంబంధించిన విషయాలు నిరూపించబడ్డాయి. ఇంక స్మార్తయజ్ఞాలకు సంబంధించిన విషయాలు కూడా నిరూపించదగి ఉన్నాయి. స్మార్త యజ్ఞాలు కూడా శ్రుతి మూలక స్మృతి ప్రోక్తాలు కనుక శ్రౌతకర్మల నిరూపణ సందర్భంలో స్మార్త యజ్ఞాల నిరూపణ అసంగతం కాదని గ్రహించాలి.

శ్రుతిచే పంచ మహాయజ్ఞాలు-దేవ, పిత్ర, భూత, మనుష్య, బ్రహ్మయజ్ఞాలు స్మార్తయజ్ఞాల్లో చెప్పబడ్డాయి. స్మృతికర్తలు, సూత్రకర్తలు కూడా సంస్కారాలనే పేరుతో వీటిని స్మార్తకర్మలుగానే పరిగణించారు. "**యస్యైతే చత్వారింశత్సంస్కారాః స బ్రహ్మణస్సాయుజ్యగ్ం సాలోక్యం గచ్ఛతి**" అను గౌతమ సూత్రంచే నలభై సంస్కార కర్మలు పేర్కొనబడ్డాయి. అవి- **"సప్త సోమసంస్థాః, సప్త హవిర్యజ్ఞ సంస్థాః, సప్త పాకయజ్ఞ సంస్థాః, పంచ మహాయజ్ఞాః గర్భాధానాది సంస్కారాః చతుర్దశ ఆహత్య చత్వారింశత్సంస్కారాః"** అంటే ఏడు సోమయజ్ఞాలు, ఏడు హవిర్యజ్ఞాలు, ఏడు పాకయజ్ఞాలు, అయిదు మహాయజ్ఞాలు, ఇవి కాక గర్భాధానాది పధ్నాలుగు సంస్కారాలు మొత్తం నలభై (7+7+7+5+14) సంస్కారాలు. ఈ యజ్ఞాలు, సంస్కారాలు నిర్వహించడానికి అర్హతలు, నియమాలే గాక, వాటిని నిర్వహించడంలో క్రమానికి సంబంధించి కూడా నియమాలు చెప్పబడ్డాయి. అగ్నిష్టోమం, అత్యగ్నిష్టోమం, ఉక్థ్య,షోడశ, వాజపేయం, అతిరాత్రం, అప్తోర్యామం అనేవి ఏడు **'సప్త సోమయజ్ఞాలు'.** ఇందులో అగ్నిష్టోమమనే మొదటి యజ్ఞాన్ని అనుష్ఠించకుండా అత్యగ్నిష్టోమాది ఇతర క్రతువులు ఏమీ అనుష్ఠించరాదని శాఖాంతరీయ శ్రుతి చెప్తోంది.

ఏషవావ ప్రథమో యజ్ఞోయజ్ఞానాం యజ్జ్యోతిష్టోమః తస్మాదేతేన అనిష్ట్వా అథాన్యే న యజేత, గర్తపత్యో భవతి ప్రవామీయతే|

ఇలా కాకుండా ఇతర క్రతువులు ముందుగా అనుష్ఠిస్తే అపమృత్యువు కలవాడవుతాడని లేదా గర్తపతితుడు (అయధానుష్ఠానం చేసినవాడు) అవుతాడని చెప్తోంది.

అగ్నిష్టోమమగ్ర ఆహరతి యజ్ఞముఖం వా అగ్నిష్టోమః యజ్ఞముఖ మేవారభ్య సవమాక్రమతే| (తై.శా.సం.)

మొదటిదైన అగ్నిష్టోమం ఇతర యజ్ఞాలకు ముఖస్థానమని ఇది ముందుగా ఆచరిస్తే యజ్ఞముఖాన్ని ఆరంభించిన తర్వాత ఇతర క్రతువుల నారంభించిన వాడవుతాడని, అది శాస్త్రమని చెప్తోంది. సప్తసోమ సంస్థల పరిగణనలో సూత్రకర్తలకు అభిప్రాయభేదాలు ఏమీ లేవు గానీ, సప్తసోమ సంస్థల (శ్రేణి) మధ్యలో చెప్పబడిన **'వాజపేయం'** వేరే ఇతర సంస్థల మధ్యలో చెప్పబడింది. కనుక **'శాస్తా వాజపేయం'** అని తెలుసుకోవలసి ఉంది. ఆప్త, కురు వాజపేయాలనేవి రెండూ సంస్థా వాజపేయాలకంటే భిన్నమైన కామ్యకర్మలు అని చెప్పబడింది. (కామ్యకర్మల గురించి మరిన్ని వివరాలకు నాచే రచించబడిన **"నిత్యకామ్యకర్మ మీమాంసా"** గ్రంథం చూడనగును)

సప్తహవిర్యజ్ఞాలు

సప్తసోమ సంస్థలను ఆరంభించడానికి అధికారం ఇచ్చేవి కొన్ని హవిర్యజ్ఞాలు. సప్త హవిర్యజ్ఞాల పరిగణలో ఆర్చిక విషయాలని, యాజుషమని మతభేదం ఉంది. వాటి వివరాలు ఇలా వున్నాయి. (1)అగ్న్యాధేయం (2)అగ్నిహోత్రం (3)దర్శపూర్ణమాసాలు (4)ఆగ్రయణం (5)చాతుర్మాస్యలు (6)నిరూఢ పశుబంధం (7)సౌత్రామణ అనే ఏడు హవిర్యజ్ఞాలు ఆర్చిక విషయాలని; (1)అగ్నిహోత్రం

(2)దర్శపూర్ణమాసలు (3)పిండ పితృయజ్ఞం (4)ఆగ్రయణం (5)చాతుర్మాస్యలు (6)నిరూఢ పశుబంధం (7)సౌత్రామణి అనే ఏడు హవిర్యజ్ఞాలు యాజుషమని బ్రహ్మవిద్యాదీపికలో వ్యవస్థగా చూపించారు.

అనగా ఆర్చిక విషయంలో అగ్న్యాధేయం హవిర్యజ్ఞమని, యాజుష విషయంలో పిండ పితృయజ్ఞం హవిర్యజ్ఞమని పరిగణన చేయడం తేడాగా కనిపిస్తోంది. అగ్న్యాధేయం ప్రథమ హవిర్యజ్ఞమని గౌతమసూత్రం మున్నగునవి పేర్కొంటున్నాయి. కాని, అగ్న్యాధేయాన్ని అనుష్ఠించకుండా గార్హపత్య, ఆహవనీయ దక్షిణాగ్నులనే త్రేతాగ్ని సిద్ధించదు. ఈ త్రేతాగ్నులు లేకపోతే సోమయాగం అనుష్ఠించడం కుదరదు కనుక హవిర్యజ్ఞాలని చెప్పబడుతున్నవన్నీ సోమయాగంకంటే ముందుగా అనుష్ఠించి తీరాలి! అగ్నిహోత్ర దర్శపూర్ణ మాసలు సోమయాగంకంటే ముందుగా అనుష్ఠించాలని **"దర్శపూర్ణమాసావిష్ట్వా సోమేన యజేత"** అని శ్రుతి ఉంది కానీ, ఇందులో పక్షాంతరాలున్నాయి.

అగ్న్యాధేయమంటే అగ్నులను సంస్కరించే ఒక కర్మవిశేషం. ఈ కర్మచే సంస్కరించబడిన అగ్నులకే ఆహవనీయ, గార్హపత్య దక్షిణాగ్ని అనే త్రేతాగ్నులు సిద్ధిస్తాయి. ఈ అగ్నులచేతనే అగ్నిష్టోమాది ఇతర క్రతువులు సాధ్యం. ఇటువంటి అగ్ని సంస్కారమైన ఆధానం మూడు విధాలుగా ఉంది. (1)నక్షత్రాధానం (2)పర్వాధానం (3)సోమపూర్వకాధానం అని. నక్షత్రాధానమనగా **"కృత్తికా స్వగ్నిమాదధీత"** ఇత్యాది శ్రుతులచే చెప్పబడిన కృత్తికాది నక్షత్రాలయందు చేయబడేది, ఆధానము పవమానేష్ఠి సహితంగా పూర్తిచేసిన వెంటనే అగ్నులకు సంస్కారం పూర్తి అయినందున ఆ సాయంకాలం అగ్నిహోత్రకర్మను ఆచరించే యోగ్యత వస్తుంది.

ఈ ప్రకారంగా పర్వం వచ్చేవరకూ అగ్నిహోత్రానుష్ఠానం చేస్తూ పౌర్ణమాసీ పర్వం (పున్నమి) రోజున ముందుగా ఇష్టి చేయడానికి అధికారాన్ని సంపాదింపచేసే అన్వారంభణీయేష్టిని ఆచరించి వెంటనే పౌర్ణమాసేష్టి, దర్శ రోజు దర్శేష్టి చేయాలి. పర్వాధానంలో **'దర్శపూర్ణమాసా వారప్స్యమాణః'** అని సంకల్పం చేసి ఆధానాన్ని పూర్తి చేసి అన్వారంభణీయం చేసి పౌర్ణమాసేష్టి చేసి ఆ సాయంకాలం అగ్నిహోత్రాఖ్య కర్మని ఆరంభించాలి. ఈ ప్రకారంగా చేస్తే **"దర్శపూర్ణమాసావిష్ట్వా సోమేన యజతే"** అను శ్రుత్యుక్త ప్రకారం సోమయాగాన్ని చేయదలచినవానికి ఆధానాన్ని ఆచరించడం, వెంటనే సోమయాగానికి సంకల్పం చేయడం విధి.

ఈ ప్రకారం మొదటి రెండు పక్షాలలో అగ్నిహోత్ర దర్శపూర్ణమాసములనే హవిర్యజ్ఞాలు కూడా అనుష్ఠించి నట్లవుతుంది. మూడోపక్షంలో సోమయాగానంతరం అగ్నిహోత్ర దర్శపూర్ణమాసలు ఆరంభమవుతాయి. సోమయజ్ఞాలకంటే న్యూనములయినా (తక్కువైనవైనా) హవిర్యాగ్ని అనుష్ఠించిన పిమ్మటే సోమ యజ్ఞానికి అధికారం లభిస్తుంది. శ్రౌతపరంగా ఈ హవిర్యజ్ఞం ప్రబలమైనా స్మార్తపరంగా స్మార్తకర్మలు దుర్బలములైనా ఔపాసన స్థాలీపాక, వైశ్వదేవాలు చేయనిదే ఏ హవిర్యజ్ఞాలు చేయడానికీ అధికారం లేదు కనుక, ప్రబలమైన హవిర్యజ్ఞం కంటే దుర్బలమైనా కానీ అధికారాన్ని సంపాదించిపెట్టే స్మార్తయజ్ఞమే ముందుగా అనుష్ఠించి తీరాలని తేలింది.

ఈ సందర్భంలో అసలు యజ్ఞమంటే ఏమిటి అని విచారించాలి. లోకంలో ఖద్దరు, నూలు వడకడం వంటి వాటిని కూడా సూత్రయజ్ఞమని వ్యవహరిస్తున్నారు కాని అవి యజ్ఞాలని మాత్రం భ్రమించరాదు.

యజ్ఞలక్షణం

"యజ దేవ పూజా సంగతి కరణ దానేషు" అని **"ధాతోః నిష్పన్నస్య యాజ్ఞికైః పరిభాషితస్య ద్రవ్యదేవతా మయస్య సంస్కృతాగ్న్యధికరణ స్రుక్ స్రువాదిద్ర వ్యాద్యధిష్ఠిత హవిస్సాధనక అధ్వర్యవాద్యర్త్విక్సాధ్య**

స్వర్గాద్యుద్దేశ్యక మంత్రపూర్వక షడష్ట, దశాద్యంగయాగ నిర్వర్తస్య కర్మ విశేషస్యైవ యజ్ఞపద వ్యపదేశత్వాత్ అత ఏవ ద్రవ్యం దేవతోద్దేశేన త్యాగః యాగః" అని కాత్యాయన మహర్షిచే యాగస్వరూపం నిరూపితం.

దేవతోద్దేశేన క్రియమాణ స్వస్వత్వ నివృత్త్యనుకూలో వ్యాపార ఏవ యాగః| (మీ.శా**)**

విధిరత్యన్తమ ప్రాప్తే నియమః పాక్షికేసతి | తత్ర చాన్యత్ర చ ప్రాప్తే పరిసంఖ్యేతి గీయతే| (తం.వా)

ఇతి మీమాంసక ప్రసిద్ధేశ్చ. అత ఏవ **"బ్రహ్మజ్ఞానేఽపి యజ్ఞత్వారోప ఏవేతి వ్యక్తవ్యమ్| బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం| బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా"** ఇతి (భ. గీ)

ఇచ్చిపుచ్చుకోవడం అనే ఆదాన ప్రదాన ప్రక్రియ యజ్ఞం అనబడదు. **'యజ'** ధాతువుచే చెప్పబడి దేవతలనుద్దేశించి మంత్ర పూర్వకంగా ద్రవ్యత్యాగం చేయడమే యజ్ఞమని మీమాంసకులు పరిష్కరించారు. అందులో కూడా యాగత్వేన, హోమత్వేన అనగా దేవతల నుద్దేశించి ద్రవ్యత్యాగం ప్రధానంగాను, ఆ ద్రవ్యాన్ని విహితమైన ప్రదేశంలో ఉంచడం అనే ప్రక్షేపం అంగంగా కలది యాగమని కేవలం ద్రవ్యత్యాగ పూర్వక ప్రక్షేపం ప్రధానంగా ఉన్నది హోమమని భేదం ఉంది. పై ప్రమాణాల ననుసరించి మనకు ఇష్టం వచ్చినట్లు యజ్ఞశబ్దాన్ని వాడరాదు. అయితే యజ్ఞంలో ఒకసారి దీక్ష తీసుకున్నాక నిర్వికల్పంగా. నిర్విఘ్నంగా చేయాలి కనుక ఆ విధంగా దీక్షతో ఒక కార్యక్రమాన్ని చేయడానికి యజ్ఞపదాన్ని జోడిస్తున్నారు అని చెప్పుకోవచ్చునేమో!

యాగానికి-హోమానికి భేదం

వార్తికారస్తు న యాగహోమయో రభేధః యాజ్ఞికానాం దేవతోద్దేశ పూర్వక ద్రవ్యత్యాగే ప్రక్షేపాంగకే 'యజి' పద ప్రయోగాత్ దేవతోద్దేశక ద్రవ్యత్యాగ ప్రక్షేపేషు సమ ప్రధానేషు 'జుహోతి' ప్రయోగాత్ "ప్రక్షేపాంగక క్రియాద్వయ వృత్తిజాతిః యాగత్వం, క్రియాత్రయ వృత్తి జాతీశ్చ హోమత్వమితి తయోర్భేదాత్|

చోదనా చోదితాలైతే వీటినే దర్విహోమాలని కూడా అంటారు. వార్తికకారులు చెప్పిన దాంట్లో యాగ హోమాలకు భేదం ఉంది. దేవతలనుద్దేశించి ద్రవ్య త్యాగం ప్రధానంగా, ద్రవ్యాన్ని అగ్నిలో ఉంచడం అనేది అంగంగా కలిగింది యాగం. దేవతల నుద్దేశించడం-ద్రవ్యత్యాగం-ప్రక్షేపాలు అనే మూడూ ప్రధానంగా కలిగింది హోమం అన్నారు. యాజ్ఞికులు 'యజ' ధాతువును, 'హు' ధాతువును ప్రయోగించి వాడుతున్నందువల్ల ప్రక్షేపం అంగముగా గలిగి, రెండు క్రియలు ప్రధానంగా ఉన్నది, యాగం అనీ, మూడు క్రియలు ప్రధానంగా ఉండేది హోమం, అనీ భేదాలు చెప్పబడ్డాయి. విధి విహితాలైన హోమాలలో కొన్నింటికి దర్వి హోమాలని కూడా భేదం ఉంది.

హోతృకర్తృకాలైన యాజ్యాపురోనువాక్యాల మంత్రోచ్చారణతో యజ్ఞకర్త అయిన యజమానిచే మానసికంగా త్యాగం చేయబడిన హవిస్సును జుహ్వాది పాత్రలందు **"సకృదుపస్తృణాతి| ద్విర్హవిషోఽవద్యతి| సకృదభి ఘారయతి"** అను వచనానుసారం ఉపస్తరణ, అవదానలనే అభిఘారణలతో గ్రహించబడిన హవిస్సును ఆధానముచే సిద్ధంగా ఉన్న అగ్నులందు అధ్వర్యులచే ఉంచబడం (ప్రక్షేపం) అనే దానినే యాగమని నిరూపించారు. స్వాహాకార మంత్రాలతో దర్వ్యాదులయందు ఉంచబడిన **"యదేక యాజుహుయాద్దర్వి హోమం కుర్యాత్"** అను శ్రుత్యుక్త ప్రకారం ఆసీనులై, ఒకే మంత్రంతో విహితమైన అగ్నులందు దేవతోద్దేశ్యక ద్రవ్యత్యాగ, ద్రవ్యప్రక్షేప ప్రధానకాలయినవి హోమశబ్ద వాచ్యాలుగా చెప్పబడుతున్నాయి.

ఏదైనా ఒక కార్యాన్ని లేదా ఫలాన్ని సాధించడానికి రెండు సాధనాలు వినియోగింపబడినప్పుడు అందులో ఒకదానిని నివర్తింపచేసే సాధన నివృత్తిరూప విధి అని, రెండవది పరిసంఖ్యా విధి అని మీమాంస మతం. వీటిలో ఏ లక్షణమూ కూడా లోకంలోని ఆదాన, ప్రదాన ప్రక్రియల్లో తటస్థించదు. కాబట్టి, దాన్ని యజ్ఞమనడం భ్రమ మాత్రమే అవుతుంది. బ్రహ్మజ్ఞానంలో జ్ఞానయజ్ఞం అనేది ఆరోపమనే చెప్పాలి. ఈ ఆరోపణ అంగీకరించియే వ్యాసాచార్యులు ఇలా అన్నారు.

యజ్ఞోహిద్వివిధః ప్రోక్తః స్థూల సూక్ష్మ వ్యవస్థితః కర్మయజ్ఞాభిధస్థూల స్త్రిప్రకారో వ్యవస్థితః నిత్యోనైమిత్తికశ్చైవ కామ్య యజ్ఞః ప్రకీర్తితః జ్ఞాన యజ్ఞోభవేత్ సూక్ష్మః సాక్షాత్ సంసార బాధకః|

స్థూలమని, సూక్ష్మమని యజ్ఞాలు ప్రధానంగా రెండు విధాలు. కర్మ యజ్ఞాలు మళ్ళీ స్థూలంగా మూడు విధాలుగా వ్యవస్థ చేయబడ్డాయి- నిత్యం, నైమిత్తికం, కామ్యం అని. ఈ సంసార బంధనాల్లోంచి విముక్తి కలిగించే జ్ఞానయజ్ఞం సూక్ష్మయజ్ఞంగా చెప్పబడింది. ఈ ప్రకారం పాకయజ్ఞాల్లోను, పంచ మహాయజ్ఞాల్లోను హోత, అధ్వర్యుడు మొదలైన రుత్విక్కులు లేనందున, ఆహవనీయాద్యగ్నులు లేనందున, యాజ్యాపురోను వాక్యాదులు లేనందున ముఖ్యయజ్ఞత్వం సంభవింపక యజ్ఞత్వం గౌణమని (అప్రధానం అని) చెప్పవలెను.

పాకయజ్ఞాలు

లౌకికానాం పాకయజ్ఞ శబ్దః తత్ర బ్రాహ్మణాపేక్షో విధిః| (ఆ.సూ.)

వేదాలచే వేదార్థం గ్రహించేవారు శిష్యులు. వారిచే ఆచరించబడిన కర్మల్లో ఔపాసన, వైశ్వదేవాదులకు పాకయజ్ఞమనే పేరు ప్రసిద్ధం.

పాకేన పక్వేన చరుణాసాధ్యోయజ్ఞః పాక యజ్ఞః| ఇతి.

పక్వం చేయబడిన చరుద్రవ్యంచే ఔపాసనాగ్నియందు నిర్వహించబడేది అవడంవల్ల పాకయజ్ఞమని ప్రసిద్ధి పొందింది అనడంచే ఇక్కడ హోతృకర్తృక, యాజ్యా పురోనువాక్యోచ్చారణ లేనందున యజ్ఞ శబ్దం గౌణమనడం యుక్తం. ముందుగా తెలుసుకున్నట్లు ఇవి నిజానికి యజ్ఞాలు కావు. కాని, ఇటువంటి పాకయజ్ఞాలు మనకు తప్పకుండా అనుష్ఠేయాలని (అనుష్ఠింపబడవలసినవని) గ్రహించనగును. హవిర్యజ్ఞ సోమ యజ్ఞాదులను చేసేవారు కూడా తప్పక వీటిని అనుష్ఠించాలని చెప్పడంతో వీటిని అనుష్ఠించేక పై క్రతువుల నాచరించే శక్తి కలవారు చేయవచ్చు. లేదా అసమర్థులగు వార్కి ఈ పాకయజ్ఞాలే వాటి ఫలాన్ని కూడా ఇస్తాయి. అందుచేతనే ఆశ్వలాయన గృహ్యసూత్ర భాష్యంలో-

ఏతాన్యపి కర్మాణి నిత్యాని శ్రౌతైస్తుల్యాని| (గృ.సూ.భా.)

అని చెప్పారు. ఈ ప్రకారం నిత్యములుగా చెప్పబడిన పాకయజ్ఞాలు ఏవి? అనే విషయంలో కూడా మతభేదాలు ఉన్నాయి. సంస్కారదీపిక, సంస్కార రత్నాకరం, గౌతమ ధర్మసూత్రాలు మున్నగు గ్రంథాలలో- 1.అష్టకా 2.పార్వణ 3.శ్రాద్ధం 4.శ్రావణీ 5.ఆగ్రహాయణీ 6.చైత్రీ 7.ఆశ్వయజీ అని, ఆపస్తంబ గృహ్యసూత్రాల్లో- 1.ఔపాసన 2.స్థాలీపాకం 3.వైశ్వదేవం 4.సర్పబలి 5.ఈశానబలి 6.మాసశ్రాద్ధం 7.అష్టక అని చెప్పబడ్డాయి. కాని, ఆపస్తంబ గృహ్య సూత్రాల్లో వివాహ ప్రకరణంలో ఔపాసనాగ్ని సిద్ధికోసం ఆగ్నేయ స్థాలీపాకం చెప్పబడింది. ఇది అగ్న్యాధాన ప్రకరణంలో అగ్నిహోత్ర ప్రారంభం చేయడానికి యోగ్యతనిచ్చే పవమానేష్టి స్థానంలో చెప్పి, **"అత ఊర్ధ్వం హస్తేనైతే ఆహుతీతండులైర్యవైర్వా జుహుయాత్"** అను సూత్రంచే ఔపాసనారంభము, తర్వాత స్థాలీపాకారంభము చెప్పబడ్డాయి. అనగా వివాహం మధ్యలో పౌర్ణమాస పర్వం తటస్థిస్తే ఆ రోజున పార్వణ స్థాలీపాకం ఆరంభించాలని-

ఏవమత ఊర్ధ్వం దక్షిణా వర్జ ముపోషితాభ్యాం పర్వసు కార్యః| (ఆ.గృ.సూ)

అను సూత్రంచే చెప్పబడింది.

వైశ్వదేవం మాత్రం **"ద్వాదశాహమధశ్శయ్యా బ్రహ్మచర్యం"** అను ధర్మసూత్రంచే 12రోజులు అధశ్శయ్యాది బ్రహ్మచర్యవ్రతం పత్నీ సహితుడగా ఆచరించి ప్రశస్తమైన అహస్సులో ఆరంభించాలని **"సపత్నీక శ్చరిత్వా ప్రశస్తే హవ్యారంభః"** అని, **"ఏవమత ఊర్ధ్వం దక్షిణా వర్జముపోషితాభ్యాం పర్వసు కార్యః"** అని గృహ్యసూత్ర వ్యాఖ్యలో సుదర్శనాచార్యులు తాత్పర్యదర్శనమను వ్యాఖ్యలో వివాహానంతరం మరో మంచి రోజున ఆరంభం చేయాలని చెప్పారు. సర్పబలి, ఈశానబలి నిరూపణ ప్రసంగంలో ఈ వివాహప్రకరణ సూత్రంలో కాని, హరదత్త వ్యాఖ్యలో కాని, సుదర్శనాచార్య వ్యాఖ్య తాత్పర్యదర్శనంలో కాని, పాకయజ్ఞానంతరం ఆరంభింపబడుతుందని లిఖించినట్లు ఔపాసన, స్థాలీపాక నిరూపణ ప్రసంగంలో పాకయజ్ఞ శబ్దం వాడబడ లేదు. కాని, **"లౌకికానాం పాకయజ్ఞ శబ్ద"** అను ఆ.గృ.సూత్ర వ్యాఖ్యలో హరదత్తాచార్యులు, **"అనాకులా"** అను వ్యాఖ్యలో **"లోకశబ్దేన శిష్టా ఉచ్యన్తే, పాకయజ్ఞ ఇతి వివాహాదీనాం సంజ్ఞా విధీయతే| పాక శబ్దః అల్పవచనః యథాక్షిప్రం యజేత పాకోదేవః"** (ఆ.గృ.సూ.20-15) అని వ్యాఖ్యానించారు. శిష్టులచే ఆచరించబడే కర్మలలో ఔపాసన హోమాదులకు పాకయజ్ఞం సంజ్ఞగా ప్రసిద్ధమని సుదర్శన వ్యాఖ్య. "**పాకోబాలః తద్వత్ గమనశీలః అయం దేవః తస్మాత్ శీఘ్రం యజేత**" అని హరదత్త వ్యాఖ్య.

ఈ హరదత్త వ్యాఖ్య ప్రకారం క్షేత్రపతి బాలుడివలె గమనశీలం కలవాడు కనుక శీఘ్రంగా యాగం చేయాలి అని అనుకుని, పాకశబ్దం అల్పార్థకమని వ్యాఖ్యానించారు. సోమయాగాదులతో పోలిస్తే కూడా అల్పమవడంవల్ల వివాహాదులు కూడా పాకయజ్ఞాలని చెప్పబడతాయని చెప్పబడింది. ఇంతే కాదు, దర్శనవ్యాఖ్యలో కూడా **"గంధాది ప్రదానం తు యాగోత్తర కాలమేవ యతః పాకః అల్పోదేవః"** అనే వ్యాఖ్య ప్రకారం కూడా పాకశబ్దం అల్పార్థంలో వాడబడింది. అయితే శ్రౌతయజ్ఞాలకు కాని, వివాహాది సంస్కారాలకు కాని, పాకయజ్ఞ శబ్దప్రయోగం యుక్తం కాదని ఈ క్రింది గ్రంథంచే హరదత్త వ్యాఖ్యను ఖండించారు.

కేచిత్ పాకయజ్ఞ ఇత్యత్ర పాక శబ్దస్య అల్పవాచకత్వాత్ వివాహాదయోపి సోమాద్యపేక్షయా పాకయజ్ఞాః తేషాం మనుష్య సంస్కారార్థత్వేన అప్రాధాన్యాత్|

దీనినిబట్టి ఇతర యజ్ఞాలకంటే పాకయజ్ఞం అల్పయజ్ఞ మవడమే కాక, వివాహాదులు కూడా పాకయజ్ఞాలని చెప్పబడుతున్నాయన్న హరదత్త మతాన్ని మాత్రం అంగీకరించలేదు. కనుకనే లోకంలో ఔపాసన, స్థాలీపాక, వైశ్వదేవాలు మూడింటినీ పాకయజ్ఞాలుగా శిష్టులు, ఆపస్తంబ మతానుయాయులు వాడుతున్నారు. పైన చెప్పబడిన ఔపాసన స్థాలీపాక వైశ్వదేవాదులు యాజుష విషయమని అష్టకాది పాకయజ్ఞ పరిగణన అర్చక విషయమని విద్యాదీపికలో వ్యవస్థ చూపిస్తూ పాకయజ్ఞాల పరిగణనలో పార్వణం, శ్రాద్ధం అని చెప్పబడిన రెండింటినీ ఒకే పాకయజ్ఞంగా చెప్పి **'కార్తికీ'** అనేది ఏడవ పాకయజ్ఞంగా చూపించారు కాని, సంప్రదాయం అలా లేదు.

ఆపస్తంబ గృహ్య సూత్ర (ఆ.గృ.సూ.) వ్యాఖ్యాత, గౌతమ ధర్మ సూత్ర (గౌ.సూ.) వ్యాఖ్యాత కూడా హరదత్తాచార్యులే కనుక గౌ.సూ.వ్యాఖ్యాలోను, ఆ.గృ.సూ.లోను **'అష్టకా పార్వణ'** అని చెప్పబడిన సర్పబలియే ఇక్కడ శ్రావణీ శబ్దంచే చెప్పబడుతోందని, **"శ్రావణ్యాం పౌర్ణమాస్యాం మస్తమితే స్థాలీపాకః"** అనేది ఇద్దరూ సమానంగానే చెప్పారు.

ఇలాగే **'చైత్రీ'** అనగా ఆపస్తంబులు చెప్పిన ఈశానబలే అని, ఇద్దరికీ శబ్దభేదమే కానీ కర్మ ఒకటేనని ఇతర సూత్రకర్తలు అన్నారు. చైత్రీ అనగా **'శూలగవ'**మని అన్నా, దీన్ని చైత్రమాసంలో అనుష్ఠింపదగినదిగా చెప్పడమనే సామ్యంతో ఇద్దరు చెప్పిందీ ఒకే కర్మయని అని గౌతమ సూత్ర వ్యాఖ్య.

ఆశ్వయుజ్యాం పౌర్ణమాస్యాం పశుపతయే స్థాలీపాకం నిరుప్య జుహుయురిత్యాశ్వలాయనః తదిదం ద్వయమాశ్వయుజీ శబ్దేనోచ్యత|

ఆశ్వయుజీ శబ్దంచే అనాహితాగ్నికి ఆగ్రయణమని చెప్పబడినట్లు ఇది ఒక దైవసంస్కారమని మాత్రం బ్రహ్మవిద్యా దీపికలో నిరూపించారు.

మార్గశీర్ష్యాం పౌర్ణమాస్యాం క్రియమాణః సర్పబలేరుత్సర్గహోమః|

ఆగ్రహాయాణీ అని సూత్రాన్తర కర్తలు పాకయజ్ఞాల్లో చెప్పినదే హేమన్తప్రత్యవరోహణం అని గౌతమ ధర్మ సూత్రాల్లో హరదత్తాచార్యులు చెప్పారు. శ్రావణ పౌర్ణమాస్య రోజున ఉత్సర్గమని చెప్తూ హేమన్త-ప్రత్యవరోహణం కూడా చెప్పినా దాన్ని పాకయజ్ఞంగా చెప్పలేదు.

దీనివల్ల తేలిన సారాంశం- పార్వణమనగా స్థాలీపాకం. శ్రావణీ, చైత్రీ అని శబ్దభేదం ఉన్నా ఈ రెండింటి చేతా సర్పబలి, ఈశానబలి చెప్పబడుతుండటంతో వాటి విషయంలోను, మాసిశ్రాద్ధ అష్టకల విషయంలోను మొత్తం అయిదు పాకయజ్ఞాల విషయంలోను పరస్పర భేదం లేదు. ఇతర సూత్రకర్తలు ఆగ్రహాయాణీ, ఆశ్వయుజీ అనే వాటిని సప్తపాక యజ్ఞాల్లో పరిగణించగా ఆపస్తంబులు మాత్రం ఔపాసన వైశ్వదేవాలను చెప్పారు.

ఇక అశ్వలాయన గృహ్యసూత్రంలో ఎలా చెప్పబడిందని నిరూపించవలసి ఉంది. అశ్వలాయన గృహ్య సూత్రం ప్రశ్నఖండంలో సూత్రంయొక్క వ్యాఖ్యలో నారాయణ వృత్తి నామక భాష్యంలో ఇలా చెప్పబడింది.

పాకయజ్ఞాస్త్రయః త్రివిధా ఇత్యర్థః కుతః| 1.**హుతాః** 2. **ప్రహుతాః** 3. **బ్రహ్మణి హుతాః**|

దీనివల్ల పాకయజ్ఞాలు మూడు అని చెప్పడం లేదు. అవి మూడు విధాలని, అవి (1)హోమాలు (2)ప్రహుతములు (3)బ్రహ్మణి హుతములని మాత్రం చెప్పబడింది. పాకయజ్ఞాలంటే పక్వమైన చిరు ద్రవ్యంతో నిర్వహింపబడినవే కాదు, అల్పయజ్ఞాలు, ప్రశస్తయజ్ఞాలు అని అర్థం. ఇక్కడ పాకశబ్దం తై.సం.లోని **"యోఽస్మత్పాకతరః"** అనే శ్రుతికి వినియోగం. అగ్నిష్టోమ ప్రకరణంలో సదస్సు, సదసస్పతి మున్నగువార్కి ఉపస్థానాలు చెప్పే సందర్భంలో ఆ.శ్రౌ.సూ. కల్పం ఇలా వుంది-

అహేదైధిషవ్యేత్యాయతనాత్తృణం నిరస్య అపరేణ బ్రహ్మసదనం యజమానాయతనమితి (ఆ.శ్రౌ.సూ.క)

అని చెప్పింది. అంటే బ్రహ్మ స్థానానికి పశ్చిమంలో యజమానుని స్థానం. ఆ స్థానం అతను (బ్రహ్మ) కూర్చోవడానికి అను సౌకర్యం కోసం పై మంత్రంచే తృణాన్ని వదిలి పెట్టాలి. ధారణ సమర్థమైన స్థానానికి దిదిషు అని పేరు. అక్కడ ఉత్పన్నమవడంవల్ల దైదిషవ్యత్వం. అహి శబ్దం వాస్తవంగా సర్పవాచకం. సర్పం ఉపద్రవాన్ని కలిగిస్తుంది. ఇక్కడ **అహి** శబ్దం తృణ లక్షణం. అనగా పైన చెప్పినట్లు దిదిషునామక స్థానంలో పుట్టి **'దైధిషవ్య'** అని చెప్పబడుతున్న సర్పంవలె ఉపద్రవాన్ని కలిగించే ఓ తృణమా! ఈ యజమాన స్థానం నుండి లేచి ఇతరమైన అప్రబుద్ధుడైన అల్పునియొక్క స్థానంలో ఉండుము అని అర్థం.

ఇక్కడ పాకశబ్దం అల్పార్థంలో వాడబడింది కనుక పాకయజ్ఞాలనగా అల్పయజ్ఞాలని ఒక అర్థం. శాఖాంతరంలో **"తం పాకేన మనసా అపశ్యమ్"** అను శ్రుతిలో పాకయజ్ఞం ప్రశంసార్థంలో వాడబడింది. దీనివల్ల పాకయజ్ఞాలు ప్రశస్త యజ్ఞాలని చెప్పబడుతున్నాయి. ప్రశస్తమైన యజ్ఞాలని చెప్పడంతో ఆజ్యద్రవ్యకమైన

యజ్ఞమని అర్థం చెప్తే ఆజ్యహోమంలో పాకయజ్ఞ తంత్రం లేకపోవడమనే ఆపత్తి సంభవిస్తుంది. కానీ అక్కడ కూడా పాకయజ్ఞతంత్రం చెప్పబడుతోందని **"ఇష్యతే తస్మాన్న తత్ర వర్తతే "** అను నారాయణ వృత్తిచేత వివరింపబడింది.

ఈ ప్రకారం అల్పయజ్ఞాలు ప్రశస్తయజ్ఞాలని చెప్పబడుతున్నటువంటి పాకయజ్ఞాలు మూడు విధాలని చెప్పడం కోసం హుతాది సంజ్ఞా విధానమన్నారు. ఆ సంజ్ఞకు ప్రయోజనం ఇలా వుంది.

తత్సమాన జాతీయనామేవ హుతానాం పాకయజ్ఞానాం తన్త్రం యథాస్యాదిత్యేవమర్థం త్రైవిధ్యోపదేశః|

హూతములకు సమాన జాతీయాలైన అనగా చరుద్రవ్యం గాని ఆజ్యద్రవ్యం గాని వినియోగింపబడు కర్మలకు హుతశబ్ద వాచ్యమైన పాకయజ్ఞ తంత్రం వర్తిస్తుంది.

ఆ ప్రకారం చరుద్రవ్యం గాని ఆజ్యద్రవ్యం గాని అగ్నిలో హుతం చేయబడడం అను ప్రక్రియ లేని సర్పబలి, మాస శ్రాద్ధాదులందు పై పాకయజ్ఞ తంత్రం వర్తించదు అన్నారు.

తేన సర్పబల్యాదౌ అవధాన ధర్మోనివృత్తః బ్రాహ్మణభోజనేన చ నిర్వపాది నివృత్తమ్ అనగ్నౌ క్రియమాణాః అథ బలిహరణం ఇత్యేవమాదయః ప్రహుతాః బ్రాహ్మణభోజనం యత్రాస్తి బ్రాహ్మణాన్భోజయిత్వేతి తే బ్రహ్మణి హుతః|
(శ్రుతి)

అగ్నావితి వచనం అనగ్నౌ హూయమానస్య సర్పబలేః ప్రహూతత్వార్థం సోపి జుహోతి శబ్దచోదితః| (వ్యాఖ్య)

శుచౌ దేశే అపః అవనినీయతస్మిన్ స్థానే సర్వదేవ జనేభ్య స్వాహేతి హుత్వా నమస్కరోతి| (వ్యాఖ్య)

సర్పబల్యాదులందు గృహసమీప దేశానికి వెళ్ళి పరిశుద్ధమైన దేశమందు అనగా భూమియందు ఉదకములు ఉంచి ఆ స్థానంలో **"సర్వదేవ జనేభ్య స్వాహా"** అను మంత్రంతో బలిని ఇచ్చి అనుసరించడమే **హుత్వా** శబ్దార్థం గాని, అగ్నిలో హోమం చేయడం కాదు. అందుచే సర్పబలిలో 'స్వాహా' శబ్దం ఉన్నప్పటికీ భూమియందుంచబడేది అగుటచే ప్రహుత శబ్ద వాచ్యమన్నారు. ఆ కారణంవల్ల హుతశబ్ద వాచ్యమైన పాకయజ్ఞంలో గల అవధాన ధర్మం వర్తించదు. బ్రహ్మణి హుతా, మాసి శ్రాద్ధాదులందు బ్రాహ్మణ భోజనం ప్రధానమవడంవల్ల ఇక్కడ కూడా హుతవాచ్యమైన పాకయజ్ఞంలో కల నిర్వపాది ధర్మం వర్తించదన్నారు. ఈ ప్రకారం హుత, ప్రహూత, బ్రహ్మణిహుత అను సంజ్ఞా భేదానికి అగ్నియందు ఉంచడం, భూమియందు ఉంచడం, బ్రాహ్మణునియందు ఉంచడం అనే ప్రయోజన భేదాన్ని చెప్పారు.

అయితే **"పాకయజ్ఞాః ప్రశస్తయజ్ఞాః"** అని పాకయజ్ఞాలు ప్రశస్త యజ్ఞాలనడం ఎలా పొసగతుంది? అను శంకకు కూడా సమాధానం చెప్పారు.

యస్మాదేతేషు సంస్కారాః ఉచ్యన్తే| తైశ్చ బ్రాహ్మణ్య మవాప్యతే| కే పునః తే సంస్కారాః గర్భాధానాదయః తస్మాత్సర్వేషాం పాకయజ్ఞత్వమితి యదుక్తం తత్సమ్యక్| (నా.భా.**)**

పాకయజ్ఞాలనగా ప్రశస్తయజ్ఞాలనే వాటిలో గర్భాధానాది సంస్కారాలు కూడా చెప్పబడుతున్నాయి. ఆ సంస్కారాలు బ్రాహ్మణ్య ప్రాప్తికి కారణాలయినందున అవి కూడా పాకయజ్ఞాలని, అనగా ప్రశస్తయజ్ఞాలని చెప్పబడుట, **"సమ్యగుక్తమ్"** అను వచనంచే బాగా చెప్పబడినదన్నారు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. సంస్కారాలు బ్రాహ్మణ్య ప్రాప్తికి కారణం అని **"తైర్బ్రాహ్మణ్య మవాప్యతే"** అని చెప్పినందున అబ్రాహ్మణులు కూడా సంస్కారంవల్ల బ్రాహ్మణులవుతారని అర్థం కాదు. జన్మతః బ్రాహ్మణుడైనా ఉపనయన సంస్కారం కానిదే వేదాధ్యయన అధికారం సంభవించదు. ఆ ప్రకారం అసలైన బ్రాహ్మణ్యం సిద్ధించదు అని అన్నారు.

ఉపనయనం విద్యార్థస్య శ్రుతి తస్సర్గ్ స్కారః| (ఆ.ధ.సూ.)

ఇదే విధంగా ఉపనయనం కానివాడు సంధ్యావందన గాయత్రీ జపాదులకు కూడా అధికారి కానేరడు. అందువల్ల సంస్కారాలచేత వేదాధ్యయన సంధ్యావందనాది బ్రాహ్మణ ధర్మముల నాచరించు యోగ్యతను పొందటమే బ్రాహ్మణ్యప్రాప్తి అను అర్థాన్ని గ్రహించాలి.

సంస్కారాలకు ఇంత ప్రాశస్త్యమెందుకు సంభవించిందనే శంకకు సంస్కారదీపిక అనే గ్రంథంలో సమాధానం చెప్పబడింది. గర్భాధానాది సంస్కారాలు బ్రాహ్మ సంస్కారాలని; అందరు సూత్రకర్తలచే వాడబడిన సప్త పాకయజ్ఞ, హవిర్యజ్ఞ, సోమయజ్ఞాదులు దైవసంస్కారాలని చెప్పబడుతున్నాయి.

ఆశ్వలాయన, గృహ్యసూత్ర, నారాయణ వృత్తులలో మాత్రం పాకయజ్ఞాలయొక్క ధర్మాలు అతిదేశ నిరూపణ కోసం ప్రకార భేదాన్ని అర్థ భేదాన్ని అంగీకరించి త్రివిధాః పాకయజ్ఞాః అని చెప్పి **పాకయజ్ఞాః అల్పయజ్ఞాః ప్రశస్తయజ్ఞాః** అని అర్థభేదాన్ని అంగీకరించి సంస్కారాలు కూడా పాకయజ్ఞ శబ్దవాచ్యములని అన్నప్పటికీ ఔపాసన స్థాలీపాకాదులు పాకయజ్ఞాలనడంలో పరస్పర విరోధం లేదు. ఇంకా గర్భాధానాది సంస్కార కర్మలు బ్రాహ్మణ్య ప్రాపకాలై ప్రశస్తములై పాకయజ్ఞ శబ్ద వాచ్యములనే వారి మతం ప్రకారం పాకయజ్ఞాలు, వివాహాదులు చత్వారింశత్ సంస్కారాల్లో ఉన్నందున పాక యజ్ఞ నిరూపణలో వాటి నిరూపణం అసంగతం కాదని తెలుస్తోంది. కనుక ఇవి సంస్కార కర్మలు అనే శీర్షికలో ప్రత్యేకంగా మరో ప్రకరణంలో నిరూపించ బడతాయి.

సంస్కారకర్మ నిరూపణ

గౌతమ మహర్షి చెప్పిన నలభై సంస్కారాలలో సప్త సోమసంస్థలు, సప్త హవిర్యజ్ఞాలు, సప్త పాకయజ్ఞాలు, పంచ మహాయజ్ఞాలు కలిపి 26 సంస్కారాలని తెలుసుకుని వాటి విశేషాలను ఇంతవరకు తెలుసుకున్నాం. మనుష్య జీవితం ప్రారంభంనుంచి వచ్చే జాతకర్మనుంచి చివరి వరకు వచ్చే 14 సంస్కారాలు మిగిలిన సంస్కారాలు. వీటి ప్రాశస్త్యం, విధివిధానాలు ఇందులో వివరించబడుతున్నాయి.

ఈ 14 సంస్కారాలు కూడా పాకయజ్ఞ శబ్దంతోనే చెప్పబడుతున్నాయని ఆ.గృ.సూ.లో హరదత్తాచార్యులు ప్రతిపాదించారు. పాకయజ్ఞాలనగా ప్రశస్తమైన యజ్ఞాలని, అందువల్ల బ్రాహ్మణ్య ప్రాపకాలైన ఈ జాతకర్మాది సంస్కారాలు కూడా ప్రశస్తమైనవని ఆశ్వ.గృ.సూ. నారాయణవృత్తి నామక భాష్యంలో వ్యాఖ్యానించారు.

ఇంతవరకు ధర్మ నిరూపణలో శ్రౌత కర్మలు, స్మార్తకర్మలు నిరూపించబడ్డ ఈ కర్మలన్నీ గర్భాధాన, జాతకర్మాది సంస్కార సంస్కృతులైన వారికి తప్ప ఆచరణ యోగ్యత లేదు. అందువల్ల సంస్కార కర్మల నిరూపణ అత్యంత అవసరం.

సంస్కారం

సంస్కారమనగా '**సమ్యక్కరణమ్**'. అనగా జన్మ-జన్మాంతరాల నుంచి అనుస్యూతంగా (ఎడతెగకుండా) వస్తున్న చిత్తగతమైన పాపాన్ని తొలగించడం. లోకంలో చిరకాలంనుండి కిలం పట్టి (రంగు పోయి) ఉన్న రాగిపాత్ర తింత్రిణితో (చింతపండుతో) చాలా సార్లు తోమడం అనే సంస్కారంతో కానీ శుభ్రపడి జలపాన యోగ్యతను పొందదు కదా! అదే తీరుగా అనేక సంస్కార కర్మలవల్ల గాని మన చిత్తానికి నైర్మల్యం సంభవించదు.

ఆత్మ శరీరాన్యతరనిష్ఠః అతిశయ విశేషస్సంస్కారః| (వీ.మి.)

అని వీరమిత్రోదయంలో ఈ అభిప్రాయాన్నే పరిష్కరించారు. **"యస్త్వేతే చత్వారింశత్సంస్కారాః"** అని గౌతములు మొత్తం నలభై సంస్కార కర్మలను చెప్పినా వాటిలో కొంచెం భేదం ఉంది.

సంస్కారాః బ్రాహ్మాః ద్వివిధాః తథా చ హరీతః ద్వివిధో హి సంస్కారో భవతి బ్రాహ్మో దైవశ్చ పాకయజ్ఞ సోమయాగాదయః దైవ సంస్కారాః గర్భాధానాదయః బ్రాహ్మ సంస్కారాః| (హ.స్మృ.)

ఇంతకు ముందు నిరూపించబడిన దైవ సంస్కారాలు (26) సాక్షాత్తు శ్రుతి విహితములు కనుక చిత్తశుద్ధి సంపాదన ద్వారా వివిదిషా జనకములని, ఇతర సంస్కారాలు (14) ఇతర కర్మలకు అధికారాన్నిస్తూ సంస్కార జనకములు మాత్రమే అని చెప్పబడ్డాయి. ఈ ఇతర సంస్కారాల బలంచే శ్రుతివిహితమైన దైవ సంస్కారాదులందు ప్రవర్తిస్తే వివిదిష (వేదాంతవాక్య శ్రవణ, మననాదులందు రుచి కలగడం) తటస్థిస్తుందని, ఆ వివిదిషను కలిగించే దాకా ఈ కర్మలు విశ్రాంతి పొందవని (అంటే, ఆ వివిదిష కలిగే వరకూ ఈ ఇతర కర్మలను ఆచరించాలని) శాస్త్ర సిద్ధాంతం.

గౌతములచే చెప్పబడిన 40 సంస్కారాల్లో దైవసంస్కారాలు కాని ఇతర సంస్కారాలు గర్భాధానం, పుంసవనం, సీమంతం, జాతకర్మ వంటివి. వీటిలో కొన్ని, అనగా- గర్భాధాన, పుంసవన, సీమంతాలు మూడూ గర్భసంస్కారాల ద్వారా ఉత్పత్స్యమాన శిశు సంస్కారాలు (పుట్టబోయే శిశువు కోసం చేయబడే సంస్కారాలు). జాతకర్మాదులు (జాతకర్మ, నామకర్మ, అన్నప్రాశన, చౌలకర్మ, చూడాకర్మ, ఉపనయనం వంటివి) ఉత్పన్న పురుష సంస్కారాలు (పుట్టిన శిశువుకి తండ్రిచే చెయ్యబడేవి). ఇందులో మొదటి మూడూ ఉత్పత్స్యమాన సంస్కారాలు కనుకనే ఉపనయనం ముందుగా అతిపన్నమై (కాలాన్ని అతిక్రమించి) వచ్చే జాతకర్మాది సంస్కారాలను ఉపనయనంలో మళ్ళీ ప్రాయశ్చిత్త పూర్వకంగా ఆచరించినట్లుగా గర్భాధాన, పుంసవన, సీమంత సంస్కారాలను ఆచరించడం లేదు. వీటిని శిశూత్పత్తికి పూర్వం తండ్రిచే జరుపవలసిన సంస్కారాలని నిర్ణయించారు. కాని గర్భాధానంనుంచి ఉపనయన పర్యంత సంస్కారాలు పితృ కర్తృకములు. అంటే తండ్రిచే జరుపబడవలసినవి. స్నాతక, సహధర్మచారిణీ సంయోగాలు ఇవన్నీ స్వకర్తృకాలని, స్వయంగా తనచే ఆచరింపబడేవని నిర్ణయించారు.

వ్రాత్యస్సంస్కార హీనస్స్యాత్| (ఆ.గృ.సూ)

అత ఊర్ధ్వం త్రయోప్యేతే యథాకాలమసంస్కృతాః అతః పరం ద్విజాతీనాం సంస్కృతిర్నియతోచ్యతే|

సంస్కార రహితా యేతు తేషాం జన్మ నిరర్థకమ్| (మ.స్మృ)

ఇత్యాది మను, ఆశ్వలాయనాది వచనాలచే ఈ సంస్కారాల ఆవశ్యకత స్పష్టం. ఇంకా, ఈ సంస్కారాలకు ఒక్కోదానికి ఒక్కో ప్రయోజనం చెప్పబడింది.

సంస్కారాల పరిగణనలో మత భేదాలు

గర్భాధానం పుంసవనం సీమంతం బలిరేవచ| జాతకృత్యం నామకర్మ నిష్క్రామోఽన్నాశనం తథా| చౌలకర్మోపనయనం తద్వ్రతానాం చతుష్టయమ్| స్నాతోద్వాహే చ ఆగ్రయణ మష్టకాశ్చ యథా యథమ్| శ్రావణ్యమాశ్వయుజ్యంచ మార్గశీర్ష్యం చ పార్వణమ్| ఉత్సర్గశ్చాప్యుపాకర్మ మహాయజ్ఞాశ్చ నిత్యకాః| సంస్కారానియతా ఏతే బ్రాహ్మణస్య విశేషతః | పంచవింశతి సంస్కారైః సంస్కృతాః యే ద్విజాతయః| తే పవిత్రాశ్చ యోగ్యాస్స్యుః శ్రాద్ధాదిషు సుయన్త్రితాః| (సం.ర.మా.)

ఆధాన పుంసవన సీమన్త జాతనామాన్న చౌలకాః| మౌంజీవ్రతాని గోదాన సమావర్తన వివాహకాః| అంత్యం చైతాని కర్మాణి ప్రోచ్యన్తే పోడశైవ తు| (సం.దీ.)

1.గర్భాధానం 2.పుంసవనం 3.సీమంతం 4.జాతకర్మ 5.నామకరణం 6.అన్నప్రాశన 7.చౌలకర్మ 8.మౌంజీ (ఉపనయనం) 9.ఆగ్నేయ సౌమ్య 10.ప్రాజాపత్యం 11.వైశ్వదేవం 12.వేద వ్రతాలు 13.గోదానం 14.సమావర్తనం 15.వివాహం 16.అంత్యకర్మ- అనబడే 16 సంస్కారాలను చెప్పిన ఆంగిరసుడు, 17.ఆగ్రయణం 18.అష్టకాః 19.శ్రావణీకర్మ 20.ఆశ్వయుజ్యం 21.ప్రత్యవరోహణం 22.దర్శశ్రాద్ధం 23.వేదారంభం 24.వేదోత్సర్జనం 25.పంచ మహాయజ్ఞాలు అని చెప్పి, వీటిలో ప్రత్యవరోహణం అనే దాని స్థానంలో బలికర్మను పేర్కొన్నారు. గౌతములు మాత్రం గర్భాధానం నుంచి సహధర్మచారిణీ సంయోగం వరకు పదునాలుగు సంస్కారాలు, పంచ మహాయజ్ఞాలు, పాకయజ్ఞాది సంస్థలు ఇరవై ఒకటి కలిపి మొత్తం నలభై (40) సంస్కారాలని చెప్పారు.

యద్యపి మనూపదిష్టః కుణ్డలధారణేన ఆక్షిప్తః కర్ణవేధాఖ్యః సంస్కారః ఆవశ్యకోపి న షోడశ సంస్కారాన్తర్గతః తన్మధ్యే పాఠాభావాత్| (సం.దీ.)

"ఒకవేళ మనువు చెప్పిన కుండలధారణ అనే కర్ణవేధ సంస్కారం ఆవశ్యకమైనదైనా ఇది షోడశ (16) సంస్కారాల్లో ఒకటి కాదు" అని సంస్కారదీపిక పేర్కొంటోంది. **"ప్రాయశః గోదాన, అన్త్యకర్మణీ విహాయ చతుర్దశ సంస్కారాణి ఉచ్యంతే".** బహుశా గోదాన, అంత్యకర్మలు రెండింటినీ విడిస్తే మిగిలినవి చతుర్దశ (14) సంస్కారాలని చెప్పబడుతున్నాయి. ఏతావతా (మొత్తం మీద) మతభేదంచే సంస్కారాలు 25 అని, 16 అని, 14 అని, 40 అని చెప్పబడ్డాయి. ఇలా చెప్పడం విరుద్ధం కాదా అని శంకించి సమాధానం ఇలా చెప్పారు.

స్వే స్వే గృహ్యే యథా ప్రోక్తాః తథా సంస్కృతయోఖిలాః కర్తవ్యాభూతి కామేన నాన్యథా సిద్ధిమృచ్ఛతి|

తమ గృహ్య సూత్రాలలో చెప్పినవి మాత్రమే తాను గ్రహింపనగును. ఇతర గృహ్య సూత్రకారులు చెప్పినవి తన గృహ్య సూత్రంలో చెప్పకపోయినా దోషం లేదని అర్థం. అటువంటప్పుడు ఆపస్తంబ గృహ్య సూత్రకారులు సంస్కార పరిగణన చేయకపోయినా 14 సంస్కారాలను మాత్రమే వివరించారు కనుక ఆపస్తంబ గృహ్య సూత్రకారునికి గర్భాధానాది పాణిగ్రహణ పర్యంతం 14 సంస్కారాలు మాత్రమే వివరించడం సమ్మతమని తేలింది.

సంస్కారాల ప్రయోజనాలు

ఒక్కొక్క సంస్కారానికి ఒక్కొక్క ప్రయోజనాన్ని వివరించారు. మొదటి మూడు (గర్భాధాన, పుంసవన, సీమంత) సంస్కారాలకు గర్భసంస్కారంద్వారా ఉత్పత్స్యమాన శిశుసంస్కారం ప్రయోజనం అని చెప్పుకున్నాం.

నిషేకాత్ బైజికం చైనోగార్భికం చాపమృజ్యతే| క్షేత్రసంస్కార సిద్ధిశ్చ గర్భాధాన ఫలం తథా| గర్భే భవేచ్చ పుంసూతేః| పుంస్త్వస్య ప్రతిపాదనమ్| నిషేకఫలవత్ జ్ఞేయం ఫలం సీమన్త కర్మణః గర్భాంబుపానజో దోషః జాతాత్సర్వోఽపి నశ్యతి| ఆయుర్వర్చోభివృద్ధిశ్చ సిద్ధిర్వ్యవహృతిస్తథా| నామకర్మ ఫలం త్వేతత్ సముద్దిష్టం| మనీషిభిః| సూర్యావలోకనాదాయుః శ్రీవృద్ధి రప్యుద్దిష్టా మనీషిభిః| అన్నాశనాన్మాతృగర్భ మలాశాదపి శుధ్యతి| బలాయుర్వర్చో వృద్ధిశ్చ చూడాకర్మ ఫలంస్మృతమ్| ఉపనీతేః ఫలం త్వేతత్ సిద్ధి పూర్విక| వేదాధీత్యధికారశ్చ సిద్ధిర్ ఋషిభిరీరితా| దేవాపిత్రర్ణాపగమో వివాహస్య ఫలం స్మృతమ్| (యత్ర యత్ర చాపీ శ్రూయతే తత్ర బైజిక గార్భిక ఇనో వినాశోఽపి ఫలంజ్ఞేయమితి)

1. గర్భాధానం

గర్భాధాన సంస్కారమనగా బైజిక, గార్భిక దోషం పోవడంచే క్షేత్రం కూడా సంస్కరిపబడడం. బీజమనగా స్త్రీ పురుషుల యొక్క శుక్ర, శోణితాలు. నిషిద్ధకాల మైధునాది ప్రయుక్తం బైజికం. అశుచి మాతృగర్భ స్థితి అనేది గార్భిక దోషం. శుక్రశోణిత సంయోగంవల్ల ఏర్పడిన అశుచిత్వం మాత్రమే **'ఏన'** శబ్దానికి అర్థం కానీ పాపం అర్థం కాదని మేధాతిథి మతం. శిశువు వ్యాధి సంక్రమణానికి గల నిమిత్తం **'ఏన'** శబ్దార్థం కనుక, ఈ సంస్కారాల ద్వారా ఆ దోషం ఉపశమిస్తుందని విజ్ఞానేశ్వర మతం.

2. పుంసవనం

పుమాన్ సూయతే అనేనేతి పుంసవనమ్|

ఏ సంస్కారంవల్ల గర్భస్థపిండం పురుష శిశువుగా మారునో, ఆ సంస్కారం పుంసవనం అని చెప్పబడుతుంది. ఇది (సాధారణంగా) ప్రథమ గర్భానికి మాత్రమే జరుపబడే సంస్కారం. సీమంతం కూడా గర్భాధానం వలెనే బైజిక, గార్భిక దోషాలు ఉపశమించడంతోబాటు క్షేత్ర సంస్కారకం కూడా అవుతుంది. ఇది కూడా ప్రథమ గర్భ సంస్కారం మాత్రమే. ఈ మూడు సంస్కార కర్మలకు ఆవృత్తి ఇవ్వబడలేదు (ప్రతి గర్భానికీ తిరిగి చెయ్యాలని చెప్పబడలేదు). ఒకసారి గర్భం సంస్కరింపబడినంతనే ప్రతిగర్భానికీ ఆ సంస్కారం చెందుతుందని అభిప్రాయం.

3. జాతకర్మ

పుట్టిన శిశువుకి జరిగే మొట్టమొదటి సంస్కారం జాతకర్మ. జాతకర్మవల్ల మాతృగర్భంలోని ఉదకాన్ని (ఉమ్మనీరు) మలాదులను స్వీకరించినందున కలిగే దోషం పరిహరింపబడుతుంది. ఇంకా, జన్మించిన శిశువుకు ఆయుస్సు, వర్చస్సు కూడా అభివృద్ధి అవుతుంది.

4. నామకరణం

'బారసాల' అని మనం అంటున్న 'బాలసారె' వల్ల లౌకిక, వైదిక కర్మలకు అవసరమైన పేరు వస్తుంది, దానివలన వ్యవహారం సిద్ధిస్తుంది. గృహ, క్షేత్రాది క్రయ, విక్రయ వ్యవహారాల్లోను, ఉద్యోగప్రాప్తి మున్నగు వాటిలోను నామధేయానికి లౌకిక ఉపయోగం. వైదిక కర్మల్లో సంకల్పం చేసేది ఎవరో దేవతలకి తెల్పడానికి, వివాహాదులందు కూడా ఫలానావారి కుమార్తెను ఫలానావారి కుమారునికి ఇస్తున్నట్లు తెలపడానికి, ఇలాగే, పితృకర్మలందు ఫలానా పేరు గల నేను ఫలానా పేరు గల నా తండ్రి తాతల నుద్దేశించి పితృశ్రాద్ధం జరుపుతున్నాను అని తెలియజేయడం అనే వైదిక ప్రయోజనాలు కలుగచేస్తుంది. మతాంతర ప్రకారం సూర్యావలోకమనే సంస్కారం ఉంది. దానికీ ఆయుర్వృద్ధి, ఐశ్వర్యవృద్ధి ఫలంగా చెప్పబడింది.

5. అన్నప్రాశన

శిశువు గర్భంలో ఉన్నప్పుడు మాతృగర్భస్థిత మలాశనం (తల్లి గర్భంలో వున్నప్పుడు మలాన్ని తినడం) వలన కలిగిన దోషం అన్నప్రాశన సంస్కారం వల్ల పోగొట్టబడుతుంది. గర్భంలో గల శిశువులు భూమిమీద పడేవరకు ఏ విధంగా తలుస్తూ ఉంటారో ఈ క్రింది గర్భోపనిషత్ వాక్యమందు వివరించబడింది.

ఆహారా వివిధా భుక్తాః పీతాశ్చ వివిధాస్తనాః యది యోన్యాః ప్రముచ్యేత తం ప్రపద్యే మహేశ్వరమ్| (గ.ఉ.)

దీని అర్థం ఇలా వుంది. "అనేక జన్మల్లో ఆ యా ఉపాధికి సంబంధించిన అనేక విధాలైన ఆహారాలు స్వీకరించబడ్డాయి. అనేక విధాలయిన స్తన్యములు పానం చేయబడ్డాయి. ఈ గర్భనరకం (నరకంవంటి

గర్భవాసం) భరించ లేకుండా ఉన్నాను. దీన్నుంచి విముక్తి అయి భూమిమీద పడినట్లయితే తిరిగి జనన మరణ ప్రవాహరూప సంసారం లేకుండా తిరిగి పరమాత్మను శరణు పొందుతాను" అని అనుకుంటాడుట, గర్భస్థ శిశువు. కాబట్టి, గర్భంలో గల శిశువు అన్నపానాది వాంఛతో మాతృగర్భంలోని ఉదకం, మలం స్వీకరించడం తటస్థిస్తుందని అభిప్రాయం. మొదటి దాని వలన (ఉమ్మ నీరు తీసుకోవడం వలన) కలిగిన దోషం జాతకర్మవల్ల తొలగించబడుతుందని తెలుసుకున్నాం. రెండవదైన మలం స్వీకరించడం అనే దానివల్ల కలిగిన దోషం ఈ అన్నప్రాశనవల్ల పోగొట్టబడుతుంది.

6. చూడాకర్మ

చూడాకర్మ అనగా శిఖను ఉంచేలా వపన సంస్కారం (పిలక ఉండేలా గుండు చేయించుకోవడం). **"శిఖీ వ్యుపవీతీ చ యత్కరోతి నిరర్థకం"** అని, శిఖ లేనిదే ఏ సంస్కారానికీ అధికారం లేదని; శిఖా, యజ్ఞోపవీతం లేకుండా ఏ కర్మ చేసినా అధికారం లేదని, వ్యర్థమవుతుందని స్మృతి చెప్తోంది కనుక శిఖని(పిలకని) ఉంచేలా వపనం(గుండు) చేయించడమే చూడాసంస్కారం. అటువంటి కర్మాధికారాన్ని కలగచేసే శిఖా స్థాపన అదృష్టరూప ఫలంగా బలవృద్ధి, ఆయుర్వృద్ధి కూడా అందించే సంస్కారంగా చెప్పబడుతోంది. లోకంలో కూడా వపన కర్మని 'ఆయుష్కర్మ' అని శిష్టులంటారు.

7. ఉపనయనం

దీనివలన ద్విజత్వ సిద్ధి పూర్వక వేదాధ్యయనాధికారం సిద్ధిస్తుంది. ద్విజత్వ సిద్ధి అనగా, ఉపనయనంలో ఆచార్యుడు (తండ్రి) గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించిన తర్వాత రెండవ జన్మ సిద్ధిస్తుందని అభిప్రాయం. అన్ని సంస్కారాల్లో ఉపనయనం, వివాహం చాలా ప్రధానమైనవి. ఉపనయన సంస్కారం కానిదే ద్విజత్వ సిద్ధి కానేరదు. ఉపనయన సంస్కారం కానిదే ఏ శ్రౌత స్మార్త కర్మలందు అధికారం లేదు. వివాహం కానిదే శ్రౌత కర్మలందు అధికారం సంభవిస్తుందా అని శంక కలుగుతుంది. కానీ, తాను ఆచరించడానికి ఉపనయనం అధికార సంపాదకం కాదు. అంటే ఉపనయనం అయినంత మాత్రాన శ్రౌత కర్మలందు అధికారి కానేరడని, శ్రౌతకర్మలను ఆచరించడానికి కేవలం ఉపనయనంతో అధికారం సిద్ధించదని అభిప్రాయం. వివాహం కానిదే గృహ్యోక్తకర్మలందు (శ్రౌత కర్మలు ఆచరించడానికి) అధికారి కాడు. కనుక వివాహ సంస్కారం ఆవశ్యకం. ఆ వివాహానికి ఉపనయనం కానిదే అధికారం లేదు. ఈ ఉపనయనానికి జాతకర్మాది సంస్కారాలన్నీ ఆవశ్యకం. కానీ, అవి సకాలంలో జరిపించకపోయినా **'అనుపనీత ప్రాయశ్చిత్తం'** అనే పేరుతో జాతకర్మాది సంస్కారాలన్నీ మళ్ళీ ఉపనయనం రోజున జరిపిస్తారు కనుక ఆ సంస్కారాలన్నీ జరుగుతున్నట్లు భావించవచ్చు. ఆ ప్రకారం జరిపించవచ్చని శాస్త్రం చెప్తోంది. కానీ, ఉపనయనం వివాహంతో సమాన తంత్రంగా జరపవచ్చని ఎక్కడా చెప్పబడలేదు. ఈ వివాహం అనేది స్వతంత్రంగా జరపవలసిన సంస్కారం. ఉపనయనం జన్మ జన్మాంతరాల పుణ్యవశంచే సిద్ధించిన బ్రాహ్మణ జన్మకు శైష్ట్యం (శిష్టత్వం) సంపాదించే సంస్కారం.

సహి విద్యాతస్తంజనయతి తచ్ఛ్రేష్ఠం జన్మ శరీరమేవ మాతాపితరౌ జనయతః| (ఆ.ధ.సూ.)

ఉపనయనంలో ఆచార్యుడిచే ఉపదేశించబడిన గాయత్రి మాతృస్థానం, ఆచార్యుడు పితృస్థానమని, గాయత్రీ ఉపదేశం వల్ల ఏర్పడిన జన్మ శ్రేష్ఠమైన జన్మ అని, అనేక ఫలాలనిచ్చే గాయత్రీ ఉపదేశ ప్రధానమవడం వల్ల ఈ ఉపనయన సంస్కారంతో మాత్రమే జన్మ శ్రేష్ఠమైనదని, అంతకుముందు తల్లితండ్రులు కేవలం శరీరాన్ని మాత్రమే ఇచ్చేరని చెప్పబడుతోంది. బ్రాహ్మణులై జన్మించి కూడా ఇటువంటి

శ్రేష్ఠమైన జన్మనిచ్చే ఉపనయన సంస్కారంయొక్క ఆవశ్యకత, మహిమ తెలియక, అధికారం ఉన్నా బుద్ధి పూర్వకంగా జారవిడుచుకుంటున్నారు.

ఈ కాలంలో చాలామంది వివాహం కోసం ఉపనయనమని, నిత్యం ఎలాగూ సంధ్యావందనం చేయడు కదా అని, అవకాశం ఉంటే వివాహం రోజున ఉదయమో, ఉదయం వివాహ ముహూర్తమైతే ముందురోజు మొక్కుబడిగా ఉపనయనాన్ని జరిపిస్తున్నారు. ఇది చాలా అనుచితం. ఉపనయనం అనేది కేవలం వివాహం కోసం ఏర్పడింది కాదు. అదే నిజమైతే, వివాహం చేసుకోవాలనే కోరిక లేని వారికి ఉపనయనం అవసరమే లేకపోవలసి వస్తుంది.

గర్భాష్టమేషు బ్రాహ్మణముపనయీత| గర్భైకాదశేషు రాజన్యమ్| గర్భ ద్వాదశేషు వైశ్యమ్| (ఆ.ధ.సూ.)

గర్భాన ప్రవేశించినది లగాయతు 8వ సంవత్సరం బ్రాహ్మణునికి, 11వ సంవత్సరం క్షత్రియునికి, 12వ సంవత్సరం వైశ్యునికి ఉపనయన కాలంగా చెప్పబడింది. ఇలాగే -

వసంతే బ్రాహ్మణముపనయీత గ్రీష్మే రాజన్యమ్ శరది వైశ్యమ్| (ఆ.ధ.సూ.)

అను వచనంచే వసంతరుతువు బ్రాహ్మణునికి, గ్రీష్మరుతువు క్షత్రియునికి, శరదృతువు వైశ్యునికి ఉపనయన కాలంగా చెప్పబడింది.

"గర్భాష్టమేషు బ్రాహ్మణముపనయీత" ఇత్యాది వచనంచేతనే ఉపనయనం ప్రాప్తిస్తుండగా ఆపస్తంబగృహ్య సూత్రంలో **"ఉపనయనం వ్యాఖ్యాస్యామ"** అను సూత్రం ఆరంభించడానికి ప్రయోజనమేమి అని విచారించి సుదర్శనాచార్యులు ఆ వ్యాఖ్యలో **"ప్రాధాన్య జ్ఞాపనార్థం"** అని ఈ సంస్కారానికి గల ప్రాధాన్యాన్ని తెలియచేయడమే ఆ సూత్రారంభానికి ప్రయోజనం అన్నారు.

ఉపనయనం విద్యార్థస్య| (ఆ.ధ.సూ.)

ఉపనయనం వేదాధికార సిద్ధికొరకు అని చెప్పారు. అయితే వేదం చదవనివారికి (చదవదలచుకోని వారికి) ఉపనయనం అవసరం లేదు అనరాదు!

పురస్తాప్రత్యఙాసీనః కుమారో దక్షిణేన పాణినా దక్షిణం పాదమన్వారభ్య ఆహ సావిత్రీం భో అనుబ్రూహి|

గాయత్రీ మంత్రోపదేశ ప్రధానమైన ఉపనయనంలో వటుడు అగ్ని సమీపంలో ప్రత్యఙ్ముఖంగా (పడమరగా) తిరిగి ఆచార్యుని (తండ్రి) దక్షిణ భాగాన్ని తన దక్షిణహస్తంతో పట్టుకొని గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించమని కోరాలి. వటువు గాయత్రీ మంత్రమంతా ఒకేసారి ఉచ్చరించలేడని ఆచార్యుడు ముందు ఒక పాదంగా, పిమ్మట రెండు పాదాలుగా కలిపి, ఆ పిమ్మట మూడు పాదాలు ఆనవానంగా, అనగా మంత్రం కలిపినందువల్ల వచ్చే స్వరం లేకుండా మూడు పాదాలూ కలిపి చెప్పాలని **"పచ్ఛోఽర్థర్చశస్తత స్స్వాం"** అను వచనం చెప్తోంది. ఈ ప్రకారం ఉపదేశ ప్రధానమైంది కనుకనే ఉపనయన వటువును **ఉప-**ఆచార్య సమీపానికి, **నయనం-** పొందించడమే (తీసుకురావడమే) **'ఉపనయనం'** అని ఉపనయన శబ్దాన్ని వ్యాఖ్యానించారు.

గాయత్రీ మంత్రం సర్వవేదాల సారమని **"సర్వేభ్యో వై వేదేభ్యస్సావిత్ర్యనూచ్యత ఇతి హి బ్రాహ్మణమ్"** అను ఆ.ధ.సూత్రం చెప్తోంది. అందుచేతనే వేదం చదవకపోయినా గాయత్రీ మంత్రం సర్వవేదాల సారమవడం వల్ల అటువంటి గాయత్రీ మంత్రోపదేశ అధికార సిద్ధికోసమే ఉపనయనం కనుక, **"ఉపనయనం విద్యార్థస్య"** అను స్మృతి వేదాధ్యయనం చేయనివారికి కూడా సార్థకమవుతుంది. కేవలం విద్యార్థిగా మాత్రమే కాక

కుమారుని ఐశ్వర్యవంతుని చేయదలచిన తండ్రి సకాలంలో కుమారుడికి ఉపనయనం చేసి తీరాలి. గాయత్రీ మంత్రోపదేశమైన తర్వాత వటువుచే ఈ క్రింది మంత్రాన్ని చెప్పిస్తారు.

ఆవృధమసౌ సౌమ్య ప్రాణస్వం మే గోపాయ| (ఏ.కాం.-1)

ఈ మంత్రంలో ఉండే గొప్పతనాన్ని ఈ మంత్రభాష్యం చాలా చక్కగా చెప్తోంది.

ఋచస్సామాని యజూగ్ంషి సాహి శ్రీ రమృతాసతామ్| (తై. ఆ)

అనే మంత్రం గాయత్రీ మంత్రం ఐశ్వర్య స్వరూపమని చెప్తోంది. ఇది బ్యాంకు లాకర్లలో వేసుకునేది, నశించే స్వభావం కలదీ అయిన మనం అనుకునే లౌకిక ఐశ్వర్యం కాదు! ఋక్సామయజుస్సులనే మంత్రాలు ఐశ్వర్య స్వరూపమైన మంత్రాలని, ఈ ఐశ్వర్యం **"సతాం- సన్మార్గవర్తినాం, అమృతా- అనష్టా"** అని, వేదోక్త మార్గాన్ని అనుసరించే వారికి ఎన్నడూ నష్టం (నశించడం) వాటిల్లదని, వేదత్రయ సారమైన ఈ గాయత్రీ జపం చేసిన కొద్దీ వృద్ధిని పొందించే ఐశ్వర్య స్వరూపమని చెప్తోంది.

దీనివల్ల తేలినది, కుమారునికి తండ్రి ఉపనయనం చేయడమంటే గాయత్రీ మంత్రోపదేశంద్వారా ఐశ్వర్యవంతుని చేయడమని అర్థం. నష్టబోయే స్వభావం కల్గిన మణిమాణిక్యాది ఐశ్వర్యంలా కాక, ఈ గాయత్రీ మంత్రం నష్టం కాక వృద్ధిని పొందించే ఐశ్వర్యం. కుమారుడు ఎలాగూ సంధ్యావందనం చెయ్యడని సకాలంలో ఉపనయనం చేయడం మానకూడదు తండ్రి! జాతకర్మాది సంస్కారాలనుంచి ఉపనయనం వరకు తండ్రి కర్త. ఈ సంస్కారాలు జరిపించకపోతే ప్రత్యవాయం తండ్రిది. కానీ, చేస్తే దానివల్ల వచ్చే ఫలం కుమారునిది; అని శాస్త్రంలో, అనేక ఉపనిషత్తులలో నిర్ణయించేరు. ఈ ప్రకారం తనకు ప్రత్యవాయం లేకుండా ఉండడానికి, తన కుమారునికి సత్ఫలసిద్ధిని ఇవ్వడానికి ఉపనయన పర్యంతం సంస్కారాలు తప్పకుండా జరిపించవలసిన బాధ్యత తండ్రిది.

అందుకే ఉపనీతుడు (ఉపనయనం చేయవలసిన వయసు కలవాడు) సంధ్యావందనం చేయడం లేదని ధర్మాన్ని పరిపాలించే రాజువద్ద ఎవరైనా మధ్యవర్తి ఫిర్యాదు చేస్తే అతడు విచారించగా "మా తండ్రి ఉపనయనం చేయని కారణంచే సంధ్యావందనం చేయట్లేదని" ఆ కుమారుడు సమాధానం చెప్తే ఆ బాధ్యత తండ్రిది కనుక తండ్రి శిక్షార్హుడని, ఉపనయనం అయ్యేక సంధ్యావందనం చేయకపోతే కుమారుడు శిక్షార్హుడని నిర్ణయిస్తారు. కాబట్టి, తమ కుమారుడు సంధ్యావందనం చేసినా, చేయకపోయినా ఉపనయనం చేయడం తన బాధ్యత. ఉపనయనం చేయడం ఆ పైన సంధ్యావందనం చేసేలా ప్రేరేపించడం వరకే తండ్రి విధి. గాయత్రీ మంత్రాన్ని జపం చేసే అధికారాన్నిచ్చే ఇంకా ఇతర సర్వ కర్మలకు అధికారాన్నిచ్చే ఉపనయన సంస్కారం అత్యంత ఆవశ్యకమని చెప్పారు. ఉపనయనంలో-

త్ర్యహమేత మగ్నిం ధారయన్తి| (ఆ.గృ.సూ)

అను సూత్రానుసారం మూడు రోజులు అగ్నిధారణ చేసి అగ్నికార్యాన్ని సాయం ప్రాతః కాలాల్లో అనుష్ఠించి నాలుగో రోజున మేధాజననం చేయాలని చెప్పబడినా, కనీసం ఒక రోజైనా సాయం, ప్రాతః సంధ్యావందన ఆరంభం చేయించి, సాయం, ప్రాతః అగ్నికార్యం చేయించి మరుసటి (రెండో) రోజున మేధాజననం జరిపిస్తే ఒక రోజయినా దీక్షను స్వీకరించగలడని చెప్పారు. ఇందులోని అనేక మంత్రాలకు అర్థం వ్రాస్తే గ్రంథం మరింతగా విస్తారం అవుతుందనే భీతితో సంక్షేపంగా వ్రాయబడింది.

ఈ ప్రకారం గాయత్ర్యుపదేశం వల్ల ఏర్పడిన జన్మ, సర్వ పురుషార్థ సాధనమైనందున ఇది శ్రేష్ఠమైన జన్మ అని పేర్కొన్నారు. ఇది ఉపనయన సంస్కార ప్రయోజనం.

ఉపనయనం విద్యార్థస్య శ్రుతితస్సర్గ్ స్కారః| (ఆ.ధ.సూ.)

ఇక మిగిలిన సంస్కారాలు వేద వ్రతములు-ఆగ్నేయసౌమ్య, వైశ్వదేవ, ప్రాజాపత్యాలు. ఇవి వేదాధ్యయన కాలంలో ఆ యా భాగాలయొక్క అధ్యయనానికి ముందుగా అనుష్ఠింపబడితే ఆ వేదాధ్యయనానికి అతిశయమైన శక్తిని సంపాదించి పెడతాయి.

తనచేత అధ్యయనం చేయబడిన వేదానికి ఒక విధమైన పటిమ ఏర్పడుతుందని అర్థం. ఇవన్నీ చేయడానికి అధికారాన్ని సిద్ధింప చేసేది ఉపనయనం. ఈ ప్రకారం ఉపనయనం తండ్రిచే జరిపించబడు అత్యావశ్యకమైన ముఖ్యమైన కర్మ అని వివరింపబడింది.

8 స్నాతకం

స్నాతకం మూడు విధాలు- విద్యాస్నాతకము, వ్రతస్నాతకము, ఉభయస్నాతకము అని. వేదవ్రతాలను (ఆగ్నేయసౌమ్య, వైశ్వదేవ, ప్రాజాపత్యాలను) మాత్రం నిర్వర్తించి వాటినుంచి నివృత్తుడవడం వ్రత స్నాతకం. గురుకులంలో ఉండి వేదాధ్యయనం చేసి దానినుండి నివృత్తుడవడం విద్యాస్నాతకం. వేదవ్రతాలను నిర్వర్తించి, అర్థజ్ఞాన పర్యంతమూ వేదాధ్యయనాన్ని కూడా ముగించి గురుకులవాస నివృత్తుడవడం ఉభయస్నాతకం.

గురవే తు వరం దత్వా స్నాయీత తదనుజ్ఞయా వేదవ్రతాని వా పారం నీత్వాహ్యుభయమేవ వా|
(ప.స్మృ.ఆ.కాం)

స్నాతకమనగా గురుకులవాస నివృత్తి అని అర్థం.

స్నానోపలక్షితా చాత్ర నివృత్తిర్గురువేశ్మనః (మీ.శ్లో.వా.)

గురుకులవాస సమయంలో అధ్యయన కాలంలో నిర్వర్తించిన అధశ్శయన (నేలమీద పడుక్కోవడం), భిక్షాచరణ రూప (భిక్షాటన చేయడం వంటి) నియమాలను వదిలిపెట్టే - త్యాగరూపకమైన ఒక సంస్కార కర్మ. దీనికి గురుకులవాస నియమాలకు అవధియే ప్రయోజనం.

9. వివాహము

స్నాత్వా భార్యాముపేయాత్|

వివాహం అనేది స్నాతకమైన తర్వాత భార్యను సంపాదించడానికి ఒక సంస్కారకర్మ. దేవఋణం, పితృఋణం తీర్చడానికి విధించబడిన ఒక నిత్యకర్మ. జీవితంలో ఒక్కసారే చేసుకునే వివాహం నిత్య కర్మేమిటి?ముందుకు చదవండి! గృహస్థాశ్రమంలో దేవఋణం, సంతానంచే పితృఋణం తీర్చడం మన విధి.

వేదం పారం నీత్యేత్యర్థావగతిరపి వివక్షితా| వేదానధీత్య వేదౌ వా వేదం వాపి యథాక్రమమ్| (మ.స్మృ.)

"ఆధీత్య చాధిగమ్యార్థం తతః స్నాయాత్" అనే వచనం గురుకులంలో ఉండి ఒకటి/రెండు/మూడు వేదాలను అధ్యయనం చేయడం గురించి చెబుతోంది.

జాయమానో వై బ్రాహ్మణస్త్రిభిర్ ఋణవాజాయతే బ్రహ్మచర్యేణర్షిభ్యో యజ్ఞేన దేవేభ్యః ప్రజయాపితృభ్యః|(తై.ఆ.)

అంటే ఋషిఋణం, దేవఋణం, పితృఋణం తీర్చకుండా మోక్షం ఆశించేవాడు పతితుడు అవుతాడని ప్రమాణం.

అనధీత్యద్విజో వేదాన్ అనుత్పాద్య తథా సుతాన్| అనిష్ట్వా చైవ యజ్ఞాంశ్చ మోక్షమిచ్ఛన్ వ్రజత్యధః| (మ.స్మృ)

దేవయజ్ఞం ద్వారా దేవఋణం తీర్చడానికి భార్య అవసరం.

అయజ్ఞో వా ఏషః యోఽపత్నీకః న ప్రజాః ప్రజాయేరన్|

భార్య లేనివాడు యజ్ఞానికి అనర్హుడని, వివాహ సంస్కారంచేత సంస్కరించబడిన భార్య లేని వాడికి పితృఋణం తీర్చగల అవకాశమే లేకపోయిన కారణంగా వివాహం ఒక నిత్యకర్మ అని భావించవచ్చును.

అలాగే స్నాతక సమయంలో, అంటే గురుకులవాసం పూర్తిచేసిన సందర్భంలో గురువు శిష్యుని శాసిస్తూ ఇలా అంటాడు-

సత్యం వద ధర్మంచర|

ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః| (తై.ఉ.)

"ఆచార్యునివద్ద వేదశాస్త్రాధ్యయనం చేశావు కనుక దానికి ప్రతిఫలంగా గోవు లేదా సువర్ణం లేదా వస్త్రం వీటిలో గురువుకు ప్రియమైన వాటిని ఆర్జించి, గురుదక్షిణగా సమర్పించి, పిమ్మట వివాహం చేసుకుని వివాహసంస్కారంచే పునీతురాలైన భార్యనుండి సంతానం పొంది, ప్రజా సంతతికి విచ్ఛేదం లేకుండా చేయాలి!" అని ఉపదేశిస్తాడు.

అటువంటి భార్యతో మాత్రమే దేవయజ్ఞాధికారం కలుగుతుంది. అటువంటి భార్యద్వారా కలిగిన సంతానానికి మాత్రమే పితృరుణం తీర్చే అధికారం కలుగుతుంది. ఈ అభిప్రాయంతో వేదం పై విధంగా వివాహ ఆవశ్యకతను వివరించింది.

గౌతమోక్త సంస్కారకర్మల్లో వివాహానికి పర్యాయపదంగా సహధర్మచారిణీ వ్రతం అని ఉంది. దీనికి ధర్మచారిణీ స్త్రీతో సంయోగం అని అర్థం. మనువు కూడా వివాహావశ్యకతను గురించి ఇలా అన్నారు.

దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ| (మ.స్మృ.)

అంటే, నీకు నీ తండ్రితాతలకు పుణ్యలోక ప్రాప్తి నీ భార్య చేతిలో ఉంది. ఆమె సహధర్మచారిణిగా ఉన్నప్పుడే యాగాధికారం కనుక నీకు, నీ తండ్రితాతలకు పుణ్యలోక ప్రాప్తి ఆమె అధీనంలో ఉంది. అలాంటి భార్యద్వారా కలిగిన సంతానానికే పితృకర్మలందు అధికారం. వారు ఆచరించిన పితృకర్మల వల్లనే పితృదేవతలకు ఉత్తమలోక ప్రాప్తి అని శాస్త్రం చెప్తోంది. ఈ ప్రకారం నిత్యం ఆచరించవలసిన పితృకర్మలకు అధికారాన్ని సంపాదింపచేసేది కనుకనే వివాహాన్ని నిత్యకర్మ అని చెప్పేరు.

వివాహమంటే? **"వహ ప్రాపణే"** అనే ధాతువునుంచి **"వాహయతి - ప్రాపయతి ఇతి వివాహః"** అని వ్యుత్పత్తి. ఇక్కడ 'వి' అంటే విశిష్టః. వివాహః అంటే వైశిష్ట్యంగా, యథాశాస్త్రంగా ఆ కన్యకను అష్టవిధ, ఇతర ఉపాయాలచే భార్యగా గ్రహించడం. అంటే, "గృహస్థాశ్రమ ధర్మాలను నిర్వహించడానికి తగిన భార్యను సంపాదింపచేసేది వివాహం".

స్త్రీలో స్త్రీత్వం ముందుగానే ఉన్నప్పటికీ భార్యాత్వం వివాహ సంస్కారంతో గాని ఏర్పడదు. ఇదెలా అంటే, లోకంలో మంత్రిత్వం అనేది అందరికీ గాక, రాజకీయ చట్టం ప్రకారం ఎన్నికైన వానిలోనే ఉంటుంది. అతనికే మంత్రిగా చలాయించే అధికారం లభిస్తుంది. కానీ, ఆ మంత్రిత్వం మన కళ్ళకు కనబడదు. రక్తపరీక్ష వల్లనూ తెలియదు. కానీ, అతను సంతకం చేస్తే పనికొస్తుందన్నది మనకి తెలిసిందే. కనుక అది ఒక అదృష్ట రూపంలో ఉందని అంగీకరించి తీరాలి. అదే విధంగా భార్యాత్వం అనేది ఒక అదృష్టరూపంలో ఉంది కనుక అది శాస్త్రీయమైన వివాహ సంస్కారంవల్ల గానీ ఏర్పడదు కనుక వివాహ సంస్కారం ఆవశ్యకమని చెప్పాలి.

వివాహ ప్రకరణంలోని కొన్ని మంత్రాలకు అర్థం వివరిస్తే వివాహం ఎన్ని నియమాలతో కూడి ఉందో తెలుస్తుంది. ఇప్పటి కాలంలో కన్యాదాతలు అబ్బాయి ఇంటికి వెళ్ళడం పరిపాటిగా నడుస్తోంది. కానీ, వేదాల్లో అలా చెప్పలేదు.

సుహృదస్సమవేతాన్మంత్రవతో వరాన్ప్రహిణుయాత్| (ఆ.గృ.సూ)

అనే సూత్రం, కన్యను వెతకడానికి వరుడి తండ్రి తనవారిని పంపాలని చెబుతోంది.

సుహృదః= మంచి హృదయం కలవారిని, **సమావేతాన్**= మనతో కలిసి మెలిసి ఉండేవాళ్లను, **మంత్రవతః=** మంచి ఆలోచనాశక్తి కలవాళ్లను, **వరాన్-వరయితవ్యాయాః**= వరుడి యొక్క తండ్రి, **కన్యాయాః పిత్రాదీన్ప్రతి**= వరించదగిన కన్య యొక్క తల్లితండ్రులను కలిసి మాట్లాడాలని మధ్యవర్తులుగా పంపమన్నారు.

మరి కన్యను వరుని పక్షం వారే ఎందుకు అన్వేషించి, వెదికి పట్టుకోవాలి? కన్యని ఎందుకు వెదికి సంపాదించుకోవాలి? మనుస్మృతి ఇలా అంటోంది.

దారాధీనస్తథా స్వర్గః పితృణామాత్మనాశ్చవా| (మ.స్మృ.)

మనం తరించాలన్నా, మనపితృదేవతలు తరించాలన్నా ఆ బాధ్యత భార్య మీదనే ఆధారపడి ఉందని ఇంతకు ముందే చెప్పుకున్నాం. మంచి వంశంలో పుట్టి, మంచి అభ్యాసాలు (అలవాట్లు) కలిగి, తన భర్త శ్రౌత, స్మార్త కర్మలు లేదా పౌరాణిక వ్రతాలు చేసే సమయంలో సహధర్మచారిణిగా ఉండే కన్యకోసం అన్వేషించాలి.

పైన చెప్పబడిన కన్యయొక్క స్వభావాన్ని గుర్తించడానికి కొన్ని పరీక్షలు నిర్దేశించారు. దేశమానకాల పరిస్థితులనుబట్టి ఈ పరీక్షలు సాధ్యమా అన్న ప్రశ్నను పక్కన బెడితే, వాటి అంతరార్థాన్ని, ఆవశ్యకతలనైతే మనం గుర్తించాల్సి ఉంది.

"అగ్రే కులం పరీక్షేత" అంటే కన్యను పరీక్ష చేసి, నీ పేరేమిటి అని అడగాలి. పేరు సరిగా చెప్తే నత్తి లేదని, మూగ, చెముడు వంటి లోపాలు లేవని తెలుసుకోవచ్చు. ఇంకా కన్య పేరు ఎలా ఉండకూడదో, ఎలా ఉండాలో శాస్త్రకారులు వివరించారు.

నక్షత్రనామా నదీనామా వృక్షనామాశ్చ గర్హితాస్సర్వాశ్చరేఫ లకారోపాంతా వరణే పరివర్జయేత్| (ఆ.గృ.సూ)

అని సూత్రం. నక్షత్రముల, నదుల, వృక్షముల పేర్లు గల కన్యలను, పేరు చివరి అక్షరంలో రేఫ, 'ల' కారములు గల కన్యలను వరించకూడదు అన్నారు. అందుకే ఇలాంటి నియమాలు తెలిసిన యాజ్ఞికుని పిలిపించి నామకరణం చేయించడం శ్రేయస్కరం. ఇంకా

దత్తాం గుప్తాం ద్యోతాం ఋషభాం వినతాం వికటాం ముండాం మాండూషికాం సాంకారికాం రాతాం పాలీం చ వర్జయేత్| (ఆ.గృ.సూ)

అని సూత్రం. అంటే ఇంతకు ముందే వేరొకరికి భార్యగా నిర్ణయించబడిన కన్యను, శారీరక దోషములు పైకి కనబడకుండా బట్టల మాటున కప్పిపుచ్చే ప్రయత్నం చేసే ఆమెను, పిల్లికళ్ళు ఎర్రని జుట్టుగల కన్యను, మెడమీద ఎద్దు మూపురం వంటి ఆకారం గల కన్యను, కాంతిహీనమైన దానిని, మరుగుజ్జు ఆకారంలో ఉన్నదానిని, జుట్టు తీసివేయబడిన లేదా జుట్టు మొలిచే అవకాశం లేని కన్యను, ఎర్రటి దంతాలు కలిగి, మృదుత్వం లేకుండా కప్పశరీరం వంటి లక్షణాలు గల స్త్రీని, కులాంతర వివాహం చేసుకున్న ఇంట్లో పుట్టినదాన్ని, భోగలాలసని, క్షేత్రాన్ని కాపలా కాసే కన్యను, వరునితో సమానమైన లేదా వాని కంటే ఎక్కువ

వయస్సు గల కన్యను, ఎక్కువగా చెమటపట్టే స్వభావం గల స్త్రీని అవలక్షణాలు గల స్త్రీలుగా గుర్తించి, అలాంటి కన్యలను వరించకూడదని శాస్త్రం చెబుతోంది.

ఈ విషయాలు గ్రహించిన వారే "**సుహృదస్సమావేతాస్ మంత్రవతః**" అనే సూత్రంచే చెప్పబడ్డవారు. అలాంటి వారిని వరుని తరుపున కన్యాదాత ఇంటికి పంపవలసి ఉందని **"ప్రహిణుయాత్"** అనే మాటకి అర్థం! అటువంటి ఉత్తమ లక్షణాలు కలిగిన కన్యను వరించినట్లయితే, గృహస్థాశ్రమంలో సర్వసౌఖ్యాలు పొందగలరని మన హితం కోరి సూత్రకారులు ఇన్ని నిబంధనలు విధించడం జరిగింది.

బంధుశీల లక్షణ సమ్పన్నాం అరోగాముపయచ్ఛేత|

యోగ్యమైన మాతాపిత్ర వంశంలో పుట్టిన, ఆస్తిక భావాలు కలిగి ఉండి, సుగుణాలు కలిగి ఉన్న, ఉత్తమ లక్షణాలు కలిగి ఉండి క్షయ, అపస్మారకం వంటి రోగ లక్షణాలు లేని కన్యను **"ఉపయచ్ఛేత"** వివాహం చేసుకోవచ్చును. రోగం లేనిదంటే రొంప కూడా పట్టని దాన్ని అని అర్థం కాదుట! ప్రజోత్పాదనకు, సంతానం కనడానికి వీలు లేని రోగం కనక ఉన్నట్లయితే ఆమెని స్వీకరించవద్దు అని అన్నారు.

అలాగే వరుడి లక్షణాల గురించి కూడా చెప్పడం జరిగింది.

బంధుశీల లక్షణ సంపన్న శ్శ్రుతవానరోగ ఇతి వరసమ్పత్| (ఆ.గృ.సూ)

ప్రశస్తమైన, యోగ్యమైన తల్లిదండ్రుల వంశంలో పుట్టి, ఆస్తిక భావాలు కలిగి ఉండి, గుణవంతుడు, విద్యావంతుడు, క్షయ, అపస్మారకం వంటి రోగలక్షణాలు లేని వరునికి కన్యను ఇవ్వమని ఉంది.

న చ గుణ హీనాయ కర్హిచిత్|

విద్య వంటి వేరే లక్షణాలు ఎలా ఉన్నా, గుణహీనుడికి మాత్రం ఎప్పటికీ పిల్లను ఇవ్వకూడదన్న విషయం గుర్తుపెట్టుకోవాలి. ఇవన్నీ ఇలా ఉండగా, ఇందులో కొన్ని సవరణలు చెప్పబడ్డాయి. పేర్లు అలాంటి వాటిలో ఏమైనా రెండు మార్కులు తక్కువ వచ్చినా ఇంకా ప్రాధాన్యమైన వాటిని చెప్పింది.

యస్యాం మనశ్చక్షుషోర్నిబంధస్త స్యామృద్ధిః సేగ్నేతరదాద్రి యే తే త్యేకే| (ఆ.గృ.సూ)

అని, ఏ కన్యను చూసినప్పుడు వరుని మనసుకు, కళ్ళకు తృప్తి కలుగుతుందో మనస్సుకి దృష్టికి లగింపవుతుందో ఆ కన్యను వివాహం చేసుకుంటే ఆ దంపతుల జీవితం సర్వసమృద్ధిగా ఉంటుందని చెప్పబడింది. ఇంకా నక్షత్ర నామాదులు ఉన్నప్పటికీ **"సుప్తాం రుదన్తీం"** నిద్రించే (అతిగా నిద్రించే) మరియు రోదించే (అకారణంగా రోదించే) కన్యను వరించకూడదని అవి దోషాలుగా చెప్పిన నియమాన్ని అంత నిర్దిష్టంగా ఆచరించనక్కర్లేదని వ్యాఖ్య.

ఇక్కడ గమనించాల్సిన విషయాలింకా ఉన్నాయి. అన్నీ శుభలక్షణాలు కలిగి ఉన్నప్పటికీ మనస్సుకి, కన్నులకి తృప్తి కలిగించకపోతే ఆ కన్యను/వరుని వివాహ విషయంలో పక్కన పెట్టవచ్చని చెప్పడం జరిగింది. కానీ, మనస్సుకు కన్నులకు రంజింప చేసినప్పటికీ సవర్ణ, సగోత్ర, సపిండ, సమాన ప్రవర మొదలైన సప్రమాణమైన అభ్యంతరాలను మాత్రం లెక్కలోకి తీసుకుని తీరాలి! అని శాస్త్రకారుల అభిప్రాయం.

అరోగిణీం భ్రాతృమతీం కన్యామసమానార్ష గోత్రజామ్| అనన్యపూర్వికాం కాంతామసపిండాం యవీయసీమ్|
(యా.స్మృ.)

అవిప్లుత బ్రహ్మచర్యోలక్షణ్యాం స్త్రియముద్వహేత్ (మ.స్మృ.)

అరోగిణీం- సంపూర్ణారోగ్యం కలిగి, ప్రజోత్పాదన సమర్థురాలైన, **భ్రాతృమాతీం**- సోదరులతో కూడిన, **కన్యాం-** ఇంతవరకు ఎవరిచేతా వివాహం చేసుకోబడని, **అసమానార్ష గోత్రజామ్**- వరుని గోత్రంలో కాకుండా వేరే గోత్రంలో జన్మించిన, **అనన్య పూర్వికాం**- కన్యక, తండ్రిచే ఇతరులకు వాగ్దత్తం కానీ మనోదత్తం కానీ చేయబడనటువంటి, **కాంతాం**- రూపవతి అయిన, **అసంపిండాం**- మాతృపక్షంలో అయిదు తరాలు, పితృపక్షంలో ఏడు తరాలు దాటిన, **యవీయసీం**- తనకంటే చిన్నది అయిన, **లక్షణ్యాం**- ఇంతకు ముందు వివరించిన ప్రకారం నది, నక్షత్రం వంటి పేర్లు లేని, ధనధాన్య గృహక్షేత్రాది వృద్ధిని సూచించే లక్షణాలు గల కన్యను వివాహం చేసుకోమని సూచన.

ఇందులో **భ్రాతృమతీం**-అంటే సోదరులతో కూడిన కన్య అనే విశేషానికి **'పుత్రికా'** శంకా నివారణం ప్రయోజనమని **'కృష్ణభట్టీయం'** చెప్తోంది. అంటే, మగసంతతి లేని వారు కన్యాదానం చేసే సమయంలో వరునితో **"అస్యాం యో జాయతే పుత్రః స మే పుత్రో భవేత్"** అంటారు. అంటే ఈమెయందు కలిగిన పుత్రుడు నాకు కూడా పుత్రుడు అవడానికి అంగీకరించమని కోరడం! దీనినే **'పుత్రికాకరణం'** అంటారు. కనుక పై నిబంధన లేనినాడు అభ్రాతృ కన్యక (సోదరుడు లేని కన్యక) నిషిద్ధం కాదు. ఈ రోజుల్లో సంధ్యావందనంతో సహా మిగిలినవి అన్నీ వదిలేసి, అన్న కానీ తమ్ముడు కానీ లేని కన్యను వివాహం చేసుకోడానికి వెనుకాడుతున్నారు.

అయితే స్త్రీ పురుష సమానంగా నిర్మించబడే వ్యవస్థకు ఈ కన్యా పరీక్ష వంటి కార్యకలాపం ఎందుకని ప్రశ్న వేయవచ్చు! వివాహం ఒక జంటను కూర్చడం కోసమే కాదు. ధర్మ అర్థ కామములనే మూడు పురుషార్థాల కోసం వివాహం. అందుకే వివాహ సంకల్పంలోనే వరుడితో సంకల్పం ఇలా చేయిస్తారు.

ధర్మ ప్రజా సంపత్యర్థగ్గ్ స్త్రియముద్వహే|

ధర్మం కొరకు, సంతానం (ప్రజోత్పత్తి) కోసం, అర్థసంపత్తి కోసం వివాహమనే సంస్కారంచే ఈ స్త్రీని సంస్కరిస్తున్నాను అని సంకల్పం చేయిస్తారు.

కన్యాదాత కన్యను దానం చేసేటప్పుడు **"ధర్మేచ అర్థేచ కామేచ త్వయైషా నాతి చరితవ్యా"** అంటే 'ధర్మ, అర్థ, కామ రూప పురుషార్థములందు నా కుమార్తెను అతిక్రమించరాదు' అని కన్యాదాతచే చెప్పిస్తారు. అప్పుడు వరుడు **"నాతిచరామి"** అంటే **'అతిక్రమించను'** అని మూడుసార్లు ప్రతిజ్ఞ చేసి స్వీకరిస్తాడు. అంటే వివాహమైననాటి నుంచి భర్త ఏ ధర్మకార్యం, యాత్రలు, పూజలు, యాగాలు చేసినా, ఈమెతో "ధర్మపత్నీ సమేతోఽహం" అని సంకల్పం చేసి ఆచరించాలి. ఆమె సహధర్మచారిణిగా లేకుంటే ఏ ధర్మమందూ అధికారం లేదని శ్రుతి. ఈ రోజుల్లో కన్యాదాత చెప్పవలసినవి, వరుడు చెప్పవలసినవీ అన్నీ యాజ్ఞికుడే చెప్పేయడంతో వరుడికి, అతని తరపువారికి ఈ మంత్రాలు, వాటి అర్థం తెలియడం లేదు కానీ ఈ మంత్రాల్లో అంత అర్థం ఉంది.

అయజ్ఞో వా ఏషః యోఽపత్నీకః న ప్రజాః ప్రజాయేరన్|

అంటే భార్య లేనివారికి కర్మాధికారం లేదు. భార్య లేనివారికి ప్రజోత్పాదన లేదు. ఎవరో ఒకర్ని తెచ్చి భార్యగా అనుకున్నంత మాత్రాన ప్రజోత్పాదన, ధర్మాచరణ సిద్ధిస్తాయనడానికి వీలు లేదు. వివాహ నిబంధనల్ని అతిక్రమించి ఎవరో ఒక స్త్రీని తీసుకువచ్చినప్పటికీ ఆమె **'పత్ని'** అవదు.

పత్యుర్నో యజ్ఞ సంయోగే| (పా.సూ)

అంటే యజ్ఞాధికారంగల ఆమెకే పత్నీ శబ్దప్రయోగం అన్వయమవుతుంది. ఆమెవల్ల కలిగిన సంతానానికే పితృఋణ విమోచనానికి అధికారం.

యా ధర్మార్థా సైవ రత్యర్థా, యా రత్యర్థా సా ధర్మార్థా న భవతి|

ధర్మాచారణ కోసం గ్రహించబడిన స్త్రీ శారీరక సుఖం కోసం ఉపయోగపడవచ్చునేమో కానీ, శారీరక సుఖం కోసం గ్రహించబడిన స్త్రీ ధర్మాచారణకోసం ఉపయోగపడదు. ఈ విధంగా ధర్మంకోసం అర్థం (ధనం) కావాలి కనుక ధర్మంచేత లభ్యమైన అర్థమనే పురుషార్థం, తృతీయ పురుషార్థమైన కామం (కోరిక) కోసం కూడా ఉపయోగపడుతుంది.

పత్నీ హి పౌరీణ హ్యస్యేసే|

అంటే భర్త సంపాదించిన ధనానికి భార్య అధికారిణి. భర్త సంపాదించిన దానిని జాగ్రత్త చేయడం, వృద్ధి చేయడం, ఖర్చు చేయడం ఇదంతా భార్యయొక్క బాధ్యత అని మనుస్మృతి చెప్తోంది. అందుచేత ధర్మార్థ కామములనే మూడు పురుషార్థాలకోసం భార్యను సంపాదించుకోవడానికి వివాహసంస్కారం చెప్పబడింది.

ఈ చర్చ సారాంశం ఏమిటి? ఈ విధంగా దేవ,పితృ రుణవిముక్తికి ఉపయోగపడే వివాహసంస్కారం యథా శాస్త్రంగా ఆచరించి తీరాలి. అంతేకాదు, అగ్నిసిద్ధి కూడా వివాహం యొక్క పరమ ప్రయోజనంగా చెప్పుకోవాలి. వివాహంలో ప్రధానమైన 'ప్రవేశహోమాల' ద్వారా వైవాహికాగ్నికి **'నిత్యోధార్యః'** అను ఆపస్తంబసూత్ర ప్రకారం నిత్యం ధరించగలిగిన యోగ్యత కలిగించినట్లవుతుంది.

ప్రవేశహోమం తర్వాత ఆగ్నేయ స్థాలీపాకం నిర్వహిస్తారు. దాని వల్ల "అగ్న్యోపాసన" అనే అగ్నిపరిచర్య చేసే వీలు కలుగుతుంది. ఆ అగ్నిద్వారా వివాహానంతరం కూడా స్మార్తకర్మలు ఆచరించే యోగ్యత పరంపరగా **"అన్వారంభణీ"** వంటి ఇతర పుణ్య కార్యాలు ఆరంభించే అవకాశం ఈ స్థాలీపాకాదుల ద్వారా సంభవిస్తుంది.

సందర్భం వచ్చింది కాబట్టి అగ్ని సంపాదన విధానాలు కూడా చర్చిద్దాం. అగ్ని సంపాదన మూడు విధాలు 1)వివాహ సంస్కారంచే సంపాదించబడిన అగ్ని- స్మార్త కర్తలకు అర్హత చేకూరుస్తుంది. 2)అగ్న్యాధానం అనే శ్రౌతసంస్కార కర్మచే సంపాదించబడిన అగ్ని- అగ్నిష్టోమాది సోమయాగాల యొక్క అనుష్ఠాన యోగ్యత కల్పిస్తుంది. 3)అగ్నిచయనం కూడా ఒక అగ్ని- ఈ సంస్కారకర్మవల్ల 'ఉక్థ్యద్విరాత్రాది' ఉత్తర క్రతువుల అనుష్ఠాన యోగ్యత లభిస్తుంది. దీనిని బట్టి వివాహంయొక్క ప్రయోజనాల్లో అగ్నిసిద్ధి కూడా ప్రధానమని తేలింది.

యథాశాస్త్రంగా ప్రధాన ప్రవేశహోమం, స్థాలీపాకం, అగ్న్యోపాసన, తదనంతరం వివాహానికి తీసుకునే దీక్ష, దీక్ష విసర్జనా కాలంలో శేషహోమం పూర్తి చేస్తే కాని, అగ్నికి నిత్యం అగ్న్యోపాసన చేసే యోగ్యత చేకూరదు. అయితే నిత్యం అగ్న్యోపాసనాగ్నిరూప పరిచర్య చేసే ఉద్దేశ్యం లేకపోతే వివాహంలో ఇన్ని క్రతువుల అవసరం లేదుగా! అని ప్రశ్నించవచ్చు.

నిత్యం అగ్న్యోపాసన చేయకపోయినా ఎప్పటికైనా తండ్రి ఆబ్దీకం రోజున భార్యతో సంపాదించిన అగ్నియందే అగ్న్యౌకరణ హోమాలు చేయాల్సి ఉన్నందున వివాహంలో శాస్త్రోక్త అగ్నిసిద్ధి సంపాదించాలి. ఆ రోజున యాజ్ఞికులు పితృకర్మ చేసేవారు వివాహం నాటి నుంచి మళ్ళీ ఔపాసన చేయలేదని, వారిచే **"విచ్ఛిన్నౌపాసన"** అను ఒక ప్రాయశ్చిత్తం చేయిస్తారు.

చాలా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే వివాహమంతా ఒక గంటలో పూర్తి చేసినప్పుడు ఔపాసనాగ్ని పుట్టించనే లేదు కదా! మరి దానికి విచ్ఛిన్నమేమిటి? విచ్ఛిన్నౌపాసన చేయించడం ఏమిటి? అని!

వివాహం ఐదు రోజులు చేయడం మానేసి ఏకరాత్రంగా ముగించినప్పటికీ సకాలంలో ఆగ్నేయ స్థాలీపాకం ఒక సాయంప్రాతరౌపాసన (కనీసం ఒక సాయంత్రం ఒక ఉదయం అగ్నితో ఉపాసన) అయినా చేయించి వివాహం పూర్తి చేస్తే, వ్యావహారికంగా అయినా అగ్నిసిద్ధి కలుగుతుంది. దానిద్వారా ఇతర స్మార్తకర్మలు ఆచరించకపోతారా అనే భావంతోనైనా వివాహ సంస్కారం అగ్నికార్య సహితంగా నిర్వహించాలి.

వివాహ విధములు

బ్రాహ్మోదైవస్తథైవార్షః ప్రాజాపత్యస్తథాసురః| పైశాచో రాక్షసశ్చైవ గాంధర్వశ్చాష్టమో విధః| (మ.స్మృ.)

వివాహం ఎనిమిది విధాలు. 1) బ్రాహ్మ వివాహం 2) దైవ వివాహం 3) ఆర్ష వివాహం 4) ప్రాజాపత్య వివాహం 5) ఆసుర వివాహం 6) పైశాచ వివాహం 7) రాక్షస వివాహం 8) గాంధర్వ వివాహం. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

వివాహ లక్షణాలు

బ్రాహ్మో వివాహ ఆహూయదీయతే శక్త్యలంకృతా| తజ్జః పునాత్యుభయతః పురుషానేక వింశతిం| (మ.స్మృ.)

శుభలక్షణాలు కలిగిన వరుని ఆహ్వానించి, కన్యను యథాశక్తి అలంకరించి ఉదకపూర్వకంగా కన్యాదానం చేయడం బ్రాహ్మ వివాహం. దీనివలన తన పూర్వులు 10 తరాలవారు, తన తర్వాత 10 తరాలవారు తనతో కలిపి మొత్తం 21 తరాలవారు తరిస్తున్నారు.

యజ్ఞస్థ ఋత్విజేదైవ ఆదాయర్షస్తు గోద్వయమ్| చతుర్దశ ప్రథమజః పునాత్యుత్తరజశ్చ షట్| (మ.స్మృ.)

యజ్ఞానుష్ఠానం జరిపించిన ఋత్విక్కుకు యథాశక్తి సాలంకృత కన్యాదానం చేయడాన్ని దైవవివాహం అంటారు. వరుడినుంచి గోధనం స్వీకరించి కన్యను ఇవ్వడాన్ని ఆర్షవివాహం అంటారు. దైవవివాహం ద్వారా 14 తరాలు, ఆర్షవివాహం ద్వారా 6 తరాలు తరిస్తాయి.

ఆసురో ద్రవిణాదానాత్ గాంధర్వస్సమయాన్మిథః|రాక్షసో యుద్ధ హరణాత్ పైశాచః కన్యకాః బలాత్| (మ.స్మృ.)

వరుని నుంచి ధనం స్వీకరించి కన్యను ఇవ్వడం ఆసుర వివాహం. వధూవరులిద్దరూ పరస్పరం ఇష్టపడి వివాహం చేసుకోవడం గాంధర్వం. ఈ వివాహం చేసుకునే అధికారం క్షత్రియులకు మాత్రమే ఉంది. యుద్ధం చేసి కన్యను అపహరించుకు పోయి చేసుకుంటే అది రాక్షసం. నిద్రిస్తున్న, లేక నిస్సహాయంగా ఉన్న కన్యను అపహరించి చేసుకునే వివాహం పైశాచం.

పైన పేర్కొన్న వాటిలో కేవలం బ్రాహ్మవివాహానికి (మొదట చెప్పినది) మాత్రమే సంకల్పం నుండి శేషహోమం వరకు విధివిధానం మొత్తం పూర్తిగా ఉంటుంది. దైవాది వివాహాల్లో కొంచెం అటు ఇటూగా అదే విధంగా ఉంటుంది. గాంధార్వాది వివాహాలకు కూడా అగ్నిసాక్షిగా పాణిగ్రహణం, సప్తపది సంస్కారం తప్పనిసరి. అవి లేకుంటే కన్యకు భార్యాత్వం ఆపాదించబడదని శ్రుతి.

గాంధర్వాది వివాహేషు పునర్వైవాహికో విధిః| కర్తవ్యశ్చ త్రిభిర్వర్ణైః సమర్థేనాగ్నిసాక్షికః| (మ.స్మృ.)

గాంధార్వాది వివాహాలు త్రైవర్ణికులని చెప్పబడినప్పటికీ, వచనాంతరాలచేత ఆ వివాహాలు బ్రాహ్మణులకు నిషేధింపబడినందువల్ల మిగిలిన వర్ణాలవారికే అధికారమని గుర్తించాలి.

గాంధర్వసుర పైశాచా వివాహో రాక్షసశ్చ యః| పూర్వం పరిగ్రహస్తేషు పశ్చాద్ధోమో విధీయతే| (మ. స్మృ.)

గాంధర్వ, ఆసుర, పైశాచ, రాక్షస వివాహాల్లో హోమాదులు లేకుండానే కన్యా పరిగ్రహణం జరుగుతుందని, ఆ ప్రకారం హోమాదులు చేయనివేళ భార్యాత్వం సంప్రాప్తించదని స్పష్టంగా ప్రకటించబడింది.

దీనిద్వారా ఎనిమిది విధాలైన వివాహాల్లోనూ వివాహ భేదాన్ని, కుల భేదాన్ని బట్టి విధానంలో కొంత వ్యత్యాసం(తేడా) ఉన్నప్పటికీ అగ్నిసాక్షిగా పాణిగ్రహణం, సప్తపదీహోమం వంటి సంస్కారాల చేతనే భార్యాత్వం సంపాదించబడుతుందని, వివాహంలో అవి ముఖ్యమైన ఘట్టాలని స్పష్టమౌతోంది.

విభిన్న వివాహాలు - విభిన్న ప్రయోజనాలు

విభిన్నమైన వివాహ ప్రక్రియలకు విభిన్నమైన ప్రయోజనాలు సూచించబడ్డాయి.

బ్రాహ్మాదిషు వివాహేషు చతుర్ష్వేవాను పూర్వశః| బ్రహ్మవర్చసినః పుత్రా జాయన్తే శిష్ట సమ్మతాః| ఇతరేష్వేవ శిష్టేషు నృశంసాఽనృత వాదినః| జాయన్తే దుర్వివాహేషు బ్రహ్మధర్మద్విషస్సుతాః| (మ.స్మృ.)

మొదటి నాలుగు (బ్రహ్మ, దైవ, ఆర్ష, ప్రాజాపత్య) విధాల వివాహ సంస్కారంతో ఒక్కటైన దంపతులకు బ్రహ్మవర్చస్సు కల పుత్రులు జన్మిస్తారు. మిగిలిన నాలుగు విధాల (ఆసుర, పైశాచ, రాక్షస, గాంధర్వ) వివాహాలు ఎంచుకున్న వారికి హింస పట్ల అభిరుచి కలవారు, అసత్యం ప్రాతిపదికగా జీవించేవారు, వేద శాస్త్రాలను ధర్మసూత్రాలను ద్వేషించేవారు జన్మిస్తారు. ఈ రోజుల్లో ఈ రకాలైన వివాహాలే ఎక్కువగా జరుగుతూ ఉండడం, వారి వారి సంతానం పోకడలు మనం ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాం కదా!

వివాహ సంస్కారం చాలా ప్రధానమైనది కాబట్టి కొన్ని సూత్ర గ్రంథాల్లోను స్మృతుల్లోను అది ముందుగా చెప్పబడింది. వివాహ, ఉపనయన సంస్కారాలు చెడినట్లయితే మన సనాతనధర్మం కూడా నష్టమైనట్లే! నేటి కాలమాన పరిస్థితులు, ఆలోచనా ధోరణిలో వస్తున్న మార్పులతో వీటి అవసరం లేదని అభిప్రాయ పడుతున్న విషయం యథార్థం. సనాతనధర్మంలో అభిరుచి కలవారు వెయ్యికి ఒక్కరున్నారేమో! మరికొంత మందికి ఆ శక్తి ఉన్నా ఈ సంస్కారాల ప్రయోజనాలు తెలియక గుడ్డిగా తంతు మాత్రం చేసుకుంటూ పోతున్నారు. ఈ విషయచర్చ వారందరికీ ఎంతో సహాయకారి అవుతుందనే విశ్వాసంతో సవివరంగా వ్రాయబడింది.

సుహృద్భావం వంటి మంచి లక్షణాలు గల మధ్యవర్తులను కన్యాన్వేషణకై పంపాలి అని ఇంతకు ముందు వివరించడమైంది. ఇదంతా ఎందుకంటే, భార్య అంటే మేలిమి బంగారంతో సమానమని శాస్త్రకారుల అభిప్రాయం. మంచిదానిని జాగ్రత్తగా సంపాదించి, మరింత జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించడం శాస్త్రకారుల ఆశయం. మనం బంగారం కొనుగోలు చేయడానికి వెళ్ళేటప్పుడు గీటు గీసి బంగారం స్వచ్ఛత గుర్తించగలిగిన వారిని తీసుకువెళ్లినట్లే, అన్ని విషయాలు తెలిసినవారిని కన్యను గుర్తించడానికి పంపవలసి ఉంటుంది. వివాహం చాలా పవిత్రమైనది, మంగళ స్వరూపం. ఇంకా ఇహపర ఫల ప్రదానం చేసే అర్హత కలది. యథోక్త లక్షణయుతంగా వివాహసంస్కారం ద్వారా దంపతులైన వారి సంతానం మాత్రమే తల్లితండ్రులపట్ల వినయవిధేయతలు కలవారిగా శోభిల్లే అర్హత పొందుతారు. వేదాన్ని ప్రమాణంగా ఆచరించాలని చెప్పే సందర్భంలో భట్టపాదులు **"మీమాసా తంత్రవార్తికం"**లో ఇలా అన్నారు.

అన్యత్ర అవినయం కుర్వన్పిత్రృభ్యాం వార్యతే సుతః| తయోరేవాఽవినీతస్య కోభవేద్వినివారకః| (మీ.తం.వా)

మన సంతానం వేరే చోట (ఇంటి బయట) అవినీతితో ప్రవర్తిస్తే తల్లితండ్రులైన మనచే నివారించబడతారు. కానీ తల్లితండ్రుల వద్దే అవినీతితో సంచరించే సంతానాన్ని నిలువరించి, నివారించే వారెవరు ఉంటారు కనుక!

కాబట్టి, పరమ పవిత్రమైన వివాహసంస్కారాన్ని జరపడంలో అశ్రద్ధ, నిర్లక్ష్య ధోరణి చూపిస్తే పై శ్లోకంలో చెప్పినట్లుగా తల్లితండ్రులపట్ల ఏ మాత్రం వినయం చూపించని సంతానం ప్రాప్తిస్తారు.

అయితే పైన చెప్పిన లక్షణాలు గల మధ్యవర్తులను పంపినంత మాత్రాన కేవలం మనుష్య ప్రయత్నంతో వివాహం జరుగుతుందా అన్న ప్రశ్నకు సమాధానంగా వివాహంలో వధూవరులు చేసుకునే అనేక ఒప్పందాలను తెలియజేసే మంత్రాల అర్థాలు కూడా ఇక్కడ వివరించడం అవసరం.

వివాహ మంత్రాల అర్థం

సుహృదః సమవేతాన్మంత్రవతో వరాస్ ప్రహిణుయాత్తా నాదితో ద్వాభ్యామభిమంత్రయేత|

కన్యని వెతకడానికి మంచి మధ్యవర్తులను పంపాలని ఇంతకుముందు తెలుసుకున్నాం. ఆ మధ్యవర్తులను పంపేటప్పుడు వరుడు రెండు మంత్రాలచే అభిమంత్రణ చేయాలి

ప్రసుగ్మన్తాధియసానస్య సక్షణి వరేభిర్వరాగ్ం అభిషు ప్రసీదత| (ఏ.కాం.)

"కన్యాన్వేషణకు వెళ్ళే ఓ సుహృత్తులారా! వివాహార్థం మేం సంకల్పించిన వెంటనే వరించదగిన కన్య, ఆమె తల్లితండ్రుల గురించి మీరు శ్రేష్ఠమైన మార్గాల గుండా వెళ్ళుదురు గాక!"

అస్మాకమింద్ర ఉభయం జుజోషతి యత్సౌమ్యస్యాంధసో బుభోధతి| అన్నక్షరా ఋజవస్సన్తు పన్తా **యేభిస్సఖా యోయన్తినో వరేయమ్|**

"అస్మాకమితి అస్మదోద్వయోశ్చ" అనే పాణిని సూత్రంచే **"ద్వివచన స్థానే బహువచనమ్"**

మాకిద్దరికీ సంఘటన కావాలని ఇంద్రుడు కోరుకుంటున్నాడు. ఇంద్రుడి ఈ ప్రయత్నం ఎందుకోసం అంటే, గృహస్థులైతే సోమయాగం చేసి సోమరాశాత్మకమైన అన్నం ఇవ్వగలరన్న ఆశ. దానితో మా ఇద్దరినీ ఒకటి చేసే యత్నానికి ఇంద్రుడు సహకరించగలడు. ఓ సఖులారా! శ్రేష్ఠమైన కన్యయొక్క తండ్రిని గురించి ఏ మార్గాల గుండా వెళుతున్నారో ఆ మార్గాలు కంటక రహితాలు (ముళ్ళు లేనివి), రాళ్లు వగైరాలు లేకుండా మృదువైనవి అవు గాక!

సమర్యమా సంభగో నో నినీయాత్సంజా స్పత్యగ్ం సుయమమస్తు దేవాః| (ఏ.కాం.)

"ఆర్యమ శబ్దవాచ్య దేవత, భగశబ్ద వాచ్యదేవత, మాయొక్క జాయపతి భావాన్ని (దాంపత్యాన్ని) బాగుగా పెంపొందింతురు గాక! మా దాంపత్యభావం బాగా బంధింపబడేది, బలపడేది అవు గాక!అనే అభిమంత్రణతో దేవతలను ప్రార్థించడంవల్ల వారి సహాయంతో మీరు వెళ్ళిన పని నెరవేరగలదని" వరుడు చెప్పిన మంత్రాల అర్థం. కన్యను వరుడికి ఇవ్వడానికి దేవతలు అంగీకారం తెలియజేసినట్లు కొన్ని మంత్రాలు చెప్తున్నాయి.

దదామీత్యగ్నిర్విదతి తథేతి వాయురాహతత్| హన్తేతి సత్యం చంద్రమాః| ఆదిత్యస్సత్యమోమితి ఆపస్తత్సత్య మాభరన్| (తై.బ్రా)

ఈ కన్యను ఈ వరుడికి ఇస్తున్నానని అగ్నిదేవుడు చెబుతున్నాడు. దానికి మరికొందరు దేవతలు తమ సమ్మతిని తెలియచేస్తున్నారు. వాయుదేవత **"తథేతి"** తప్పకుండా ఇవ్వు అని, చంద్రుడు **"హంత"**- ఆశ్చర్యంతో కూడినవాడై **"సత్యం"**- తప్పకుండా ఇవ్వు అని, ఆదిత్యుడు, నాకు అంగీకారమే **"సత్యం"**- తప్పకుండా ఇవ్వు అని అంటున్నారట.

అయితే ఇక్కడ ఒక సందేహం. వరుడికి కన్యను కన్యాదాత ఇవ్వాలి తప్పితే అగ్నిదేవుడు ఇవ్వడం ఏమిటి? అగ్నిదేవుని అంగీకారం దేనికి? అని!

సోమోఽదదద్గంధర్వాయ గంధర్వోఽద దగ్నయే రయించ పుత్రాగ్ శ్చాదాదగ్నిర్మహ్యమథో ఇమామ్|(ఏ.కాం.)

సోముడు గంధర్వుడికి ఇవ్వగా, గంధర్వుడు అగ్నికి ఇవ్వగా, అగ్ని వరుడికొరకు ఈ కన్యను, ఇంకా ఈమెతోపాటు ధనాన్ని పుత్రులను ఇచ్చు గాక! అని పై మంత్రం చెప్తోంది. అది ఎలా అంటే, కన్యక జన్మించిన లగాయతు ప్రథమావస్థలో సోముడు పరిపాలించగా, ద్వితీయావస్థలో గంధర్వుడు పరిపాలించగా, తృతీయ అవస్థలో అగ్ని పరిపాలించునని అర్థం. అగ్ని పరిపాలన అయిన తర్వాత మనుష్య రూపమైన వరుడికి సంతాన సమేతమైన కన్యను ఇచ్చునని మంత్రార్థం.

అయితే ఇక్కడ మరొక శంక వస్తుంది. సంతానంతో కూడిన కన్యను ఇవ్వడంలో సంతానం ఎక్కడ నుంచి వచ్చింది?

అష్టవర్షాభవేత్ కన్యా నవ వర్షాతు రోహిణీ| దశవర్షా భవేద్గౌరీ అత ఊర్ధ్వం రజస్వలా| (మ. స్మృ.**)**

8 సంవత్సరముల వయస్సుగల బాలికను కన్య అని, 9 సంవత్సరముల వయస్సులో రోహిణి అని, 10 సంవత్సరముల వయస్సులో గౌరి అని, అటుపైన రజస్వలా స్త్రీ అని పిలవవచ్చునని శాస్త్రం చెప్తోంది. ఇక్కడ ఎనిమిదో ఏడు అంటే గర్భాష్టమని అర్థం. ఆ కన్యను అగ్ని వరుడికిచ్చే పక్షంలో సంతానం కనే యోగ్యతే లేనప్పుడు సంతానంతో ఇచ్చినట్లుగా ఎలా అన్వయమవుతుంది? పుత్రోత్పాదన సమర్థమైన, కుటుంబ నిర్వహణకు తగిన ధనం కూడా అమర్చగలిగిన భవిష్యదర్థంలో భూతార్థక ప్రత్యయం (అప్పటికే సంతానం ఉన్నట్లుగా) వాడబడింది. వేదంలో భవిష్యదర్థంలో ఆశాసనలో **"ఆశంసాయాం భూతవచ్చ"** అనే పాణిని సూత్రప్రకారం భూతార్థక ప్రత్యయం వస్తుందని అర్థం. అంటే రాబోయే కాలంలో రాబోయేవాటికి భూతకాలం వాదం ఉందని సూత్రం.

సుప్రజాః ప్రజయా భూయాసం సువీరో వీరైస్సువర్చా వర్చసా సుపోషః పోషైః| (ఏ. కాం.)

అని శ్రుతి. ఉపనయనంలో బ్రహ్మచారి అగ్నికార్యం చేసే సమయంలో మంచి సంతానం కలవాడనయ్యాను. వీరులవలన మంచి వీరుడనయ్యాను. వర్చస్సుచేత మంచి వర్చస్సు కలవాడనయ్యాను" అని మంత్రం చెప్తాడు. దానికి అర్థం వివాహానికి ముందే సంతానం కలిగి ఉన్నట్లు కాదు. అగ్నివల్ల వీటన్నింటినీ పొందెదను గాక! అని. ఇదే ప్రకారం సంతానాన్ని కలిగి ఉండేలా అగ్ని అనుగ్రహంతో వరుడికి కన్యను ఇస్తాడనేది తాత్పర్యం. అలాగే **"అష్టవర్షే బ్రాహ్మణముపనయీత"** అని 8వ సంవత్సరములో ఉపనయనం చెయ్యాలనే వచనం ప్రకారం సంతానం కలవాడనయ్యాను అనే పై శ్రుతి కూడా అన్వయం కాదు.

"మీమాంసా తంత్రవార్తికము" స్మృతి పాదంలో-

మనుష్య ప్రతిషే ధాధ్వా తేజోబలవశేన వా| యథా వా శ్రుత్యవిరుద్ధస్తథా తద్గమయిష్యతి| (తం. వా)

వార్తికకారులు చెప్పినట్లుగా శాస్త్రాంతర విరోధం వచ్చినప్పుడు నిషేధాలను అతిక్రమించిన దేవతల విషయంలో కాని, మునుల విషయంలో కాని, ఆ నిషేధాలు వర్తించవు. మనుష్య మాత్రులకే అధికారకాలు తప్ప పైన పేర్కొన్న మునులు, దేవతలు తేజోబలంచే వీటిని సమర్థించుకోగలరు. లేదా ఏ ప్రకారం అయితే శృతి విరోధం ఉండదో ఆ ప్రకారం అక్కడ అన్వయం చేసుకోవచ్చని భావం. ఆ ప్రకారం ఇక్కడ బ్రహ్మచారికి

సంతానం ఉండడం శాస్త్ర విరుద్ధం. రాబోయే కాలంలో పొందగలిగేలా అనుగ్రహించమని ప్రార్థించడం భావమని గ్రహించాలి.

అంటే, **"యథాగృహస్థో భవాని తథా సుప్రజయా భూయాసమ్"** అన్న హరిదత్తోక్త భాష్యం ప్రకారం గృహస్థాశ్రమంలో భవిష్యత్తులో మంచి సంతానం కలవాడయ్యేటట్లు అగ్నిని ప్రార్థిస్తున్నట్లుగా అర్థం చెప్పుకోవాలి. కాబట్టి, పరస్పర శాస్త్రవిరుద్ధం కాకుండా ఉండేలా ఈ విధంగా మంత్రాలకు అర్థం అన్వయించాలి. కాబట్టి, సోమ గంధర్వాదులు భర్తగా కన్యను భుక్తం చేసుకుని వరుడికి ఇచ్చినట్లుగా చెప్పకూడదు. వారు ఆ యా అవస్థల్లో ఆ కన్యను పాలించి కాపాడి వరుడికి ఇచ్చినట్లుగా చెప్పుకోవాలి.

వివాహంలో **"యుగచ్ఛిద్రాభిషేకం"** అనే ఒక క్రియ ఉంది.

ఉత్తరేణ యజుషా తస్యాశ్శిరసి దర్భేణ్వమ్ నిధాయ|

దర్భలతో మండలాకారంగా చుట్టబడిన దానిని **'ఇణ్వం'** అంటారు (గ్రామీణ స్త్రీలు వాడే చుట్టకుదురు వంటిది). దానిని తలపై ఉంచి, దానిపై **"తస్మిన్నుత్తరయా దక్షిణం యుగచ్ఛిద్రమ్ ప్రతిష్ఠాప్య"** అను మంత్రంతో బండికాడికి దక్షిణం వైపు గల చిద్రాన్ని ప్రతిష్ట చేసి, ఈ క్రింది మంత్రంతో ఇంద్రుడిని ప్రార్థిస్తున్నారు.

ఖేనసః ఖేరథః ఖేయుగస్య శచీపతే | అపాలామిన్ద్రః త్రిః పూర్త్వ్యకరత్సూర్య వర్చసమ్| (ఏకాగ్ని కాండ**)**

ఈ కన్యక శరీరంలో దోషాలేమైనా ఉన్నప్పటికీ అవి తొలగి సూర్యవర్చస్సు కలగాలని, ఒక బండికాడి పట్టుకువచ్చి ఆ కాడి రంధ్రంలో బంగారం ఉంచి, ఆ బంగారం మీదుగా కన్యక శిరస్సు మీద నీళ్ళు పడేటట్లుగా పై మంత్రం చెప్పి వరుడి చేత పోయిస్తారు**.** "ఓ శచీపతీ! ఓ దేవేంద్రా! అపాల అనే కన్యను నువ్వు వెళ్ళే రథం మీది నుండి నీళ్ళు చల్లి**,** మూడుసార్లు ప్రవిత్రింపచేసి సూర్యవర్చస్సు కలదానిగా చేశావు**,** అదే విధంగా ఈ కన్యను కూడా శరీరగతమైన దోష నివారణ చేసి, సూర్యవర్చస్సు కలదానిగా చేయి" అని ప్రార్థించడం పై మంత్రం యొక్క తాత్పర్యం.

అపాల అనే కన్య కథ ఏమిటంటే-

అపాల నామ కాచిత్ కన్యా శ్విత్రిణీ బభూవ| తాం కన్యాం శ్వేత రోగిణీం న కశ్చిదుపయేమే| ఏవం స్థితే సతి కదాచిత్ సా కన్యా నద్యాం స్నానార్థం గత్వా తత్ర సోమలతాం దృష్ట్వా తాం లతామాదాయ దంతైః పిష్ట్వా తద్రసం ఇన్ద్రాయ ఉపావహరత్|

శ్వేత రోగంతో (బొల్లి అనబడే తెల్ల మచ్చల రోగంతో) బాధపడుతున్న **'అపాల'** అనే కన్యను ఎవరూ వివాహం చేసుకోలేదు. ఒకరోజు స్నానంకోసం నదికి వెళ్ళి ఆ నదిలో కొట్టుకుని పోతున్న ఒక సోమలతను చూసి, భక్తితో మానసిక యజ్ఞం చేసి, ఆ యజ్ఞంలో సోమలతను అభిషవం (పిప్పిలా చేసి) చేసి ఆ రసాన్ని విధివిధానంగా ఇంద్రాది దేవతలకు ఇవ్వడం కుదరనందున ఆ సోమలతను దంతాలతో పిండి ఆ సోమరసాన్ని **'ఇంద్రునికి చెందుగాక'** అని మానసికంగా త్యాగం చేసింది. దాంతో ఇంద్రునికి అనుగ్రహం కలిగి ఆయన వెళ్లే రథంయొక్క కాడి రంధ్రంలోనుంచి ఆమె శిరస్సు మీదకి నీళ్ళు విడిచి, **"త్రిః పూర్త్వీ త్రిః పూత్వా శోభయిత్వా"**- మూడుసార్లు పవిత్రంపచేసి, **'శ్వేత'** రోగాన్ని పోగొట్టి సూర్యవర్చస్సు గలదానినిగా మార్చినట్లు శ్రుతి. ఈ ఉపాఖ్యానం యొక్క అర్థమే **'ఖేనసః'** అనే మంత్రంలో ఇమడ్చబడింది.

పై మంత్రంతో బండికాడియొక్క దక్షిణ చిద్రాన్ని (రంధ్రాన్ని) వధువు శిరస్సుపై ఉంచి అందులో **"సువర్ణ ముత్తరయాన్తర్థాయ"** సూత్రం, **"శంతే హిరణ్యంగ్ శము సంత్వాపః"** అనే మంత్రంతో సువర్ణాన్ని ఉంచి దానిద్వారా కన్య శిరస్సు మీద నీళ్ళు పడే విధంగా **"హిరణ్య వర్ణా"** మొదలైన అయిదు మంత్రాలతో

అభిషేకించడం జరుగుతుంది. **"తేజో వై హిరణ్యం", "ఆయుర్వై హిరణ్యం"** వంటి మంత్రాల్లో బంగారం తేజోరూపం, ఆయుఃస్వరూపంగా చెప్పబడటం వల్ల కాడి ఛిద్రంలో ఉంచిన సువర్ణం యొక్క సామర్థ్యంచేత వధువు మంచి తేజశ్శాలి, ఆయుర్భాగ్యం కలది అవుతుందని, ఉదకస్పర్శ చేత మంచి పవిత్రమైనది అవుతుందని **"శివేనత్వా చక్షుషా పశ్యన్తు"** అనే ఉపహార మంత్రంతో "దేవతలు మంగళమైన శరీరంతో వధువు శరీరాన్ని స్పృశించుగాక" అనడం వల్ల వధువు మంగళ స్వరూపురాలు అవుతుందని అభిషేక మంత్రాల ద్వారా తెలుస్తోంది. తర్వాత **"అహతేన వాససాచ్ఛాధ్య"** సూత్రం. వధువుచేత నూతన వస్త్రం, మధుపర్కం ధరింపచేసి **"ఉత్తరయా యోక్త్రేణ సన్నహ్యతి"** (సూత్రం) **"ఆశాసానా సౌమనసమ్"** అను మంత్రంతో దర్భలతో పేనబడిన **"యోక్త్రం"** అనే త్రాడుతో వధువు నడుమును బిగించాలి. దీనికి చాలా మంచి అర్థం ఉంది. "ఏ కన్య మంచి మనస్సును, సంతానాన్ని, సౌభాగ్యాన్ని, మంచి శరీరాన్ని కోరుకుంటుందో ఆమెను వివాహమనే కార్యానికి సుముఖమగు విధంగా ఈ యోక్త్రాన్ని బంధిస్తున్నారు" అని మంత్రార్థం.

ఈ మంత్రం దర్శపూర్ణమాసాది శ్రౌతకర్మల్లో యజమానియొక్క భార్యను యోక్తబంధనం చేయడంలో వినియోగించబడింది. ఆ ప్రకరణంలో బ్రాహ్మణం ఇలా చెప్తోంది.

ఆశాసానా సౌమనసమిత్యాహ| మేధ్యమేవైనాం కేవలీం కృత్వా| ఆశిషా సమర్థయతి| అగ్నేరనువ్రతాపనయనం తేనైవైనాం వ్రతముపనయతి| (తై.బ్రా)

ఈ మంత్రంతో యోక్తబంధనం చేయడం ద్వారా ఆమెను యజ్ఞానికి యోగ్యురాలుగాను, పాపరహితురాలు గాను చేసి, ఆమె కోరిన పైన చెప్పబడిన కోరికలన్నీ సిద్ధించాలని వరుడు కోరుకుంటున్నాడు. అంతే కాకుండా, భర్తను అనుసరించి ఆయనచే అనుష్ఠించబడు కర్మల్లో సహధర్మచారిణిగా ఉండడం అనే వ్రతానికి ఈ యోక్తబంధనం ఒక చిహ్నం అనవచ్చు. దీనికే ఉదాహరణగా వేదభాష్యంలో **"యథా వివాహే స్త్రియాః కంఠే మంగళ సూత్రం లింగం తద్వత్"** అని చెప్పబడింది. అంటే, "స్త్రీ కంఠమందు మంగళ సూత్రాన్ని ధరించడం, అది లగాయతు తను తన భర్తను అనుసరించడానికి చేసే ఒక శపథం వంటి చిహ్నం" అని.

అథైనా ముత్తరయా దక్షిణే హస్తే గృహీత్వా అగ్నిమభ్యానీయ|

ఈ యోక్త బంధనం అయిన తర్వాత ఈ సూత్రం ప్రకారం కన్యాదానం చేసిన వివాహ ప్రదేశంనుండి వరుడు వధువును పైన చెప్పిన మంత్ర పూర్వకంగా దక్షిణ హస్తాన్ని గ్రహించి తీసుకుని వెళ్తాడు.

పూషాత్వేతో నయతు హస్తగృహ్యాశ్వినౌ త్వా ప్రవహతాగ్ం రథేన| గృహాన్గచ్ఛ గృహపత్నీ యథాసోవశినీత్వం విదథమావదాసి| (ఏ.కాం.)

అనే మంత్రంతో ప్రధాన హోమాలు నిర్వహించడానికి అగ్నివద్దకు ఆమెను తీసుకువెళ్లడం జరుగుతుంది. వధువును సంబోధించి "ఓ వధువా! ఈ ప్రదేశంలో అగ్ని సమక్షంలో నీ పాణిగ్రహణం చేసిన నన్ను పొందనిచ్చేలా ఆదిత్యుడు అనుగ్రహించు గాక! రథమెక్కి తీసుకువెళ్లబడుతున్న నీకు అశ్వినీ దేవతలు అనుమతి ఇచ్చెదరు గాక! అనంతరం నీవు మా ఇంటికి వచ్చి **మా గృహానికి అధిపతురాలవు కమ్ము!** కేవలం అధిపతురాలవు కావడమే కాదు, మా కర్మలను గుర్తించి ప్రోత్సహించగలవు గాక!" అని వరుడు అనడం జరుగుతుంది. (దీని గురించి మరింత విశ్లేషణ **"స్త్రీల విశిష్టత"** అనే శీర్షికలో వివరించబడుతుంది).

పాణిగ్రహణం

ఇప్పటివరకు అగ్నిసమీపానికి సమంత్రకంగా వధువు హస్తాన్ని స్వీకరించి వివాహ ప్రదేశం నుండి తీసుకురావడం గురించి చర్చ జరిగింది. తదుపరి నాలుగు మంత్రాలు ఉచ్చరించి, పాణిగ్రహణం చేయాలని సూత్రకారుల ఉవాచ.

"అథాస్యై దక్షిణేన నీచా హస్తేన దక్షిణ ముత్తానగ్ం హస్తం గృహ్ణీయాత్"

"అస్యాః వధ్వాః దక్షిణముత్థానమ్"

పైకి లేపి ఉంచిన (అరచేయి పైకి ఉంచిన) ఈ వధువుయొక్క దక్షిణ హస్తాన్ని వరుడి యొక్క **"న్యగ్భూతేన హస్తేన"** క్రిందకి గల (బోర్లించిన) దక్షిణ హస్తంతో గ్రహించాలి. ఇక్కడ దక్షిణ హస్తం (కుడి చెయ్యి) మాత్రమే వినియోగించాలని వేరుగా చెప్పనక్కర లేదు.

"ఆధాస్యా అంజలా ఉపస్తీర్య ద్విర్లాజానోప్య అభిఘారయతి" అను సూత్ర ప్రకారం, **"అంజలినా జుహోతి"**– అంజలితో హోమం చేసేటప్పుడు, చయన ప్రకరణంలోను, వివాహ ప్రకరణంలో లాజహోమ సమయంలోను వధువుయొక్క అంజలితో ఉపస్తరణం (ముందుగా చేసే అభిఘరణం) చెయ్యాలని, **"అంజలౌ పూర్ణ పాత్ర మానయాతి"** అని భార్య యొక్క అంజలిలో పూర్ణ పాత్రను ఉంచాలని ఇలా వివిధ సందర్భాల్లో ప్రత్యేకంగా అంజలిని చెప్పినప్పుడు మాత్రమే సవ్య (ఎడమ) హస్తాన్ని కూడా వాడవచ్చును. **"దక్షిణా చారేణ కర్తవ్యం యజ్ఞోపవీతినా కర్తవ్యం"** అనే పరిభాషా సూత్ర ప్రకారం ఇతర అన్ని సందర్భాల్లో ప్రతికర్మను దక్షిణ హస్తంతోనే చేయాలని, యజ్ఞోపవీతాన్ని దక్షిణహస్తం మీదుగా ప్రతీచోట ఉపవీతిగాను, ప్రత్యేకంగా కొన్నిచోట్ల మాత్రం నివీతి గాను, మరికొన్ని చోట్ల ప్రాచీనావీతి గాను ఉంచుకొని చేయమని నిర్దేశించబడింది.

ఈ పాణిగ్రహణ సమయంలో మరో విశేషం, తమ కామ్యానుసారం పాణిగ్రహణంలో వివిధ విధానాలు నిర్వచింపబడ్డాయి.

ఇలా చేతిలో చెయ్యి వేసి గ్రహించడంలోను, తీసుకుని వెళ్లడంలోను-

"యది కామయేత పుగ్ం స ఏవ జనయేయమిత్యంగుష్ఠమేవ"

"యదికామయేత స్త్రీరేవా జనయేయ మిత్యంగుళీరేవ గృహ్ణీయాత్" (ఆ.గృ.సూ)

పురుష సంతానం కావాలంటే బొటన వేలిని గ్రహించాలి. కేవలం స్త్రీ సంతానమే కావాలని కోరినట్లయితే వేళ్ళను మాత్రమే గ్రహించాలి. అయినా, ఈ రోజుల్లో స్త్రీ సంతానమే కావాలని ఎవరైనా కోరుకుంటున్నారా? కానీ, శాస్త్రం కన్యాదానంలో చాలా ఫలముందని స్త్రీ సంతానాన్ని కూడా కోరమని చెబుతోంది. దాని వివరాలు చూద్దాం.

పుత్రాచ్ఛత గుణం పుత్రీ యదిపాత్రే ప్రదీయతే|

శుభ లక్షణాలు కల వరుడికి కన్యాదానం చేసినట్లయితే పుత్రుడి కంటే పుత్రిక నూరురెట్లు అధికంగా విశిష్టత కలిగి ఉంటుందని శాస్త్రం.

దశ పూర్వేషాం దశాపరేషాం ఆత్మనా సహ ఏకవింశతి|

అటువంటి కన్యాదానం చేయడంవల్ల తన ముందు పది తరాలు, రాబోయే పది తరాలు, ప్రస్తుత తరంలో తనతో కలిపి మొత్తం 21 తరాలు తరిస్తాయని శాస్త్రం చెబుతోంది. అంతేకాదు, ఒక విశ్లేషణ ప్రకారం

పౌత్రుడి కంటే దౌహిత్రుడు (కూతురి కొడుకు) గొప్పవాడు. కనుక అలాంటి దౌహిత్రుడిని ప్రసాదించిన అల్లుడిని ఒక దాతగానే వేదం వర్ణించింది.

అశ్రవగ్ం హి భూరిదావత్తరా వాం విజామాతురుత వాఘాస్యాలాత్| (తై.సం.1-1)

ఇంద్రాగ్ని దేవతాకయాగంలో ఉపయోగించే ఈ మంత్రంలో 'ఓ ఇంద్రాగ్ని దేవతలారా! లోకంలో ఇద్దరు దాతలున్నారు. అందులో ఒకడు జామాత అనగా అల్లుడు, ఇంకొకడు వాడువు సోదరుడు అన్నారు.

దౌహిత్రాది రూపాః ప్రజాః బహ్వీర్దదాతి| (సా.భా)

దక్షః భగినీ స్నేహేన దాసదాసీరూపాః ప్రజాః బహ్వీర్దదాతి| (సా.భా)

అల్లుడు దౌహిత్రులనిచ్చి దాతగా వ్యవహరింపబడుతున్నాడు. నిత్యం పితృతర్పణ కార్యక్రమంలో పౌత్రుడు తన పిత్ర, పితామహ, ప్రపితామహులకు మూడు తరాలకు తర్పణం చేస్తాడు. ఇక్కడ పితామహుడు రెండో స్థానంలోను, ప్రపితామహుడు మూడో స్థానంలోను ఉన్నారు. కానీ దౌహిత్రుడు చేసే తర్పణ క్రమంలో మాతామహ, మాతుః పితామహ, మాతుః ప్రపితామహ క్రమం కూడా మూడు తరాలే (తల్లి తండ్రి, తల్లి తాత, తల్లి ముత్తాత) ఉంటాయి. ఇక్కడ దౌహిత్రుడి మాతామహుడే (తాత) పౌత్రుడి పితామహుడు. అంటే కూతురు కొడుక్కి (దౌహిత్రుడికి) ఆయన తాత (మాతా మహుడు), కొడుకు కొడుక్కి (పౌత్రుడికి) కూడా తాత (పితామహుడు) కదా! పౌత్రుడి పితృతర్పణ క్రమంలో రెండో స్థానంలో (పిత్ర, పితామహ, ప్రపితామహ క్రమంగా) ఉన్న ఆయన (ఆ తాత), ఇక్కడ (దౌహిత్రుడి) తర్పణ క్రమంలో మొదటి స్థానంలో (మాతామహ, మాతుః పితామహ, మాతుఃప్రపితామహ క్రమంలో) మారడంతో దౌహిత్రుడి చేత మాత్ర ప్రపితామహుడు కూడా తర్పణం పొందుతాడు. పౌత్రుడి తర్పణ క్రమంలో నాల్గో స్థానంలో ఉండడంవల్ల అతడికి తర్పణం పొందే అవకాశం లేదు. సారాంశం- పౌత్రుడు తన తండ్రికి, తాతకి, ముత్తాతకి తర్పణాలు ఇవ్వగా; దౌహిత్రుడు మాత్రం తన తల్లి తండ్రికి (తాతకి), ఆమె తాతకి (తన ముత్తాతకి), ఆమె ముత్తాతకి (తన పెద ముత్తాతకి) తర్పణాలు ఇస్తాడు.

దీనితో తేలిందేమంటే దౌహిత్రుడైనా, పౌత్రుడైనా మూడు తరాలకే తర్పణం ఇచ్చేది. కానీ, దౌహిత్రుడు ఒక తరం ముందుకు వెళతాడు. ఈ అభిప్రాయం దృష్టిలో ఉంచుకుని, దౌహిత్ర రూపమైన సంతానం ప్రసాదించే జామాతను గొప్పదాతగా శ్రుతి వర్ణించింది. ఇంకా వధువు సోదరుడు కూడా దాతగా వర్ణింపబడ్డాడు. అతడు సమర్థుడైతే సోదరిపట్ల ఉండే స్నేహభావంచేత ఆమె అత్తవారింట్లో శ్రమ పడకుండా ఉండేలా దాసదాసీ జనాన్ని కూడా కానుకగా పంపిస్తాడుట. ఈ ఆచారం పెద్దకుటుంబాల్లో నేటికీ మనం చూస్తూనే ఉన్నాం. **"దక్షః"** సమర్థత ఉన్నవారు అలా చేయవచ్చు. ఆ స్థోమత లేని సోదరుడైనా సరే, సోదరి ఇంట్లో శుభకార్యాల్లో దంపతులకు తన శక్తి కొద్దీ నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు ఇచ్చే ఆచారం ప్రతి ఇంట్లోను మనం చూస్తాం. అందుకే **'బావమరిది బ్రతకకోరతాడు'** అనే సామెత వచ్చింది.

ఇన్ని విషయాలు దృష్టిలో ఉంచుకుని శ్రుతి ఈ ఇద్దరు దాతలకంటే గొప్పవాళ్ళుగా ఇంద్రుడు, అగ్నిని స్తుతి చేసే సందర్భంలో జామాతను, బావమరిదిని దాతలుగా చెప్పింది. కనుక స్త్రీ సంతానం కోరుకోవడం సర్వదా మంగళకరం, శ్రేయస్కరం అని అనవచ్చును. ఇక ప్రస్తుతానికి వస్తే-

యది కామయేత పుగ్ంస ఏవ జనయేయం

పురుష సంతానమే కావాలని కోరుకున్నట్లైతే వధువుయొక్క బొటనవేలు (అంగుష్ఠం) ను గ్రహించమని చెబుతోంది శ్రుతి.

సోభీవాంగుష్ఠమ భీవలోమాని గృహ్ణాతి గృహ్ణామిత ఇత్యేతాభిశ్చత స్భిః (ఆ.గృ.సూ)

ప్రత్యేకంగా అలాంటి కోరికలు (పురుష, స్త్రీ సంతానం) ఏమీ లేనప్పుడు వధువు యొక్క పైకి లేచిన దక్షిణ (కుడి) హస్తాన్ని, క్రిందకి బోర్లించి ఉన్న తన దక్షిణ హస్తంతో వరుడు గ్రహించడం శ్రేయస్కరం అని చెప్పబడింది. ఈ అభిప్రాయాన్నే **"సాంగుష్ఠముభయకామః"** అని అశ్వలాయనం చెప్పింది. ఇక్కడ వినియోగింపబడే మంత్రాలు:

గృహ్ణామి తే సుప్రజాస్త్వాయ హస్తం మయా పత్యా జరదష్టిర్యథాసః (ఏ.కాం.)

"ఓ వధువా! యోగ్యమైన సంతానం కోసం, వృద్ధాప్యం వరకూ కూడా నా సాంగత్యం నీకు, నీ సాంగత్యం నాకు కలిగి ఉండేటట్లుగా నీ చేతిని నేను గ్రహిస్తున్నాను" అని వధువు చేతిని అందుకుంటూ వరుడు చెప్తాడు. ఈ విధంగా మంత్రపూర్వకంగా పాణిగ్రహణం చేయడం వలన ఉభయులకు చిరజీవనం, యోగ్యమైన సంతాన ప్రాప్తి కలుగుతాయని చెప్పినట్లయింది.

భగో అర్యమా సవితా పురంధిర్మహ్యం త్వాఽదుర్గార్ హపత్యాయ దేవాః|

పురంధిః- పురంధీః బహుప్రజ్ఞా బహుకర్మా- వివిధములైన ప్రజ్ఞ కలిగిన అర్యమాది దేవతలు అని ఒక అర్థం, లేదా భగశబ్దం ఇంద్రవాచకమని ఇంకొక అర్థం. భార్య లేనిదే ఏ ధర్మానికి అధికారం లేనందున అటువంటి గృహస్థ ధర్మం కోసం అర్యమ శబ్దవాచ్యుడు ఇంద్రుడు, సవిత్ శబ్దవాచ్యుడు మొదలగు దేవతలు గృహస్థాశ్రమ ధర్మం నిర్వర్తించడం కోసం నిన్ను నాకు ప్రసాదించారు" అనడం జరుగుతుంది.

హ శబ్దః నిరర్థకః తే భగాదాయః పూర్వే జనాసః – పూర్వజనాః, పూర్వవహః ఆదికాలే వివాహస్య కర్తారః

ఈ ఇచ్చే దేవతలు కూడా గృహస్థాశ్రమంలో ఉంటూనే ఇచ్చారుట. ఆదికాలంలో వివాహరూప కర్తలైన భగాది దేవతలు ఏ గృహస్థాశ్రమంలో ఉన్నారో వారందరూ అదితి కుమారుడైన ఆదిత్యుడు దేవతలకంటే ముందే ఉండి అంతటా ప్రకాశించువాడుగా శ్రుతులచే చెప్పబడుతోంది అగ్ని. **"అగ్నిర్ముఖం ప్రథమో దేవతానామ్"** అని దేవతలందరికీ ముఖంవంటి వాడయిన అగ్ని అని చెప్తూ **"అగ్నౌ జుహోతి" "అగ్నిదూతం వృణీమహే"** వంటి శ్రుతులన్నీ దేవతలకు ఆహుతులు అగ్నిలో ఉంచాలి అనడం చేత, మనం దేవతలను ఉద్దేశించి ఇచ్చిన హవిస్సులను వారికి అందించే దూత అగ్ని అని వర్ణించింది. శిరస్సులా ప్రధానమైన అగ్ని ఏ గృహస్థాశ్రమంలో ఉండి నిన్ను ఇచ్చాడో అలాంటి గృహస్థాశ్రమం పొందించడానికే నిన్ను నాకు ఇచ్చాడు అని ఈ వరుడు కోరుతున్నదాంట్లో అర్థం.

సరస్వతి ప్రేదమవ సుభగే వాజినీవతి - తాం త్వా విశ్వస్యభూతస్య ప్రగాయామస్యగ్రతః

హే సుభగే! వాజినీవతీ! సౌభాగ్యంతో కూడిన అన్నం అనగా హవిస్సుతో కూడిన స్తుతితో కూడిన ఓ సరస్వతీ! ఈ వివాహాఖ్య కర్మ రక్షించబడు గాక! అని విశ్వంలోని సర్వభూతముల ఎదుట నిన్ను అత్యంతం స్తుతి చేస్తున్నాను.

య ఏతి ప్రదిశస్సర్వాదిశోను పవమానః| హిరణ్యహస్త ఐరమ్మస్సత్వా మన్మనసం కృణోతు (ఏ.కాం.)

"ఐరమ్మ:- ఇరా అగ్నిం మిమీతే కరోతీతి ఇరమ్మః అగ్నిః, తస్య అయం సభా ఐరమ్మః"

అగ్నిసఖుడు వాయువు. ఆ వాయువు ఏ దిక్కుకు వీస్తుందో ఆ దిక్కును అనుసరించి అగ్ని దహిస్తుంది. ఓ వధువా! అగ్నికి సఖుడైన ఆ వాయువు సర్వదా నిన్ను నా యందు మనస్సు కలదానినిగా చేయుగాక! అని ప్రార్థన.

సప్తపది

స్వగోత్రాద్భ్రశ్యతే నారీ వివాహాత్సప్తమే పదే|

వివాహానికి సప్తపది చాలా ముఖ్యం. వివాహంలో సప్తపది అనే సంస్కారం పూర్తి అయితే కాని తండ్రి గోత్రం నుండి వధువు విముక్తి పొంది, భర్త గోత్రాన్ని పొందదని శాస్త్రం చెప్తోంది. హిందూ లా ప్రకారం కూడా **'సప్తపది'** సంస్కారం జరిగిందంటేనే వారిని దంపతులుగా కొన్ని లౌకిక వ్యవహారాల్లో గుర్తించడం జరుగుతుంది. సప్తపదిని గురించి ఇలా చెబుతోంది-

అథైనా ముత్తరేణాగ్నిం దక్షిణేన పదా ప్రాచీముదీచీం వా దిశమభిక్రమయతి ఏకమిషే విష్ణుస్త్వాన్వేతు|
(ఆ.గృ.సూ)

ఇత్యాది మంత్రాలతో అగ్నికి ఉత్తరం వైపున ప్రాక్ (తూర్పు) సమాప్తిగా గాని లేదా ఉదక్ (ఉత్తర) సమాప్తిగా గాని వధువుయొక్క దక్షిణ పాదంతో ఏడు అడుగులు వేయించాలి. దీనివల్ల వారిద్దరికీ సఖ్యత ఏర్పడుతుందన్న విషయం అంగీకరించాలి.

ఆవనాంతాదోదకాం తాత్ప్రియం పాంథమను వ్రజేత్|

అనే సూక్తి ప్రకారం మన ఇంటికి వచ్చిన పెద్దమనిషిని కొంతదూరం సాగనంపి రావడం రివాజు. ఎంతవరకండీ అంటే, వెళ్ళే దారిలో ఏవో కొన్ని వృక్షాలు, తటాకాలు ఎదురయ్యే వరకూ వెళ్ళాలి అని శ్రుతి చెప్తోంది. దీని వల్ల వారిరువురికి ఒకరికి ఒకరికి పరస్పరం మైత్రి ఏర్పడుతుందని, ఉన్న మైత్రి పెరుగుతుందని శ్రుతి.

సాప్తపదీనం సఖ్యమిత్యాహుః|

అని వేదభాష్యంలో ఒక సందర్భంలో శ్రీ విద్యారణ్యులవారు దీని గురించి ప్రస్తావించడం జరిగింది.

ప్రజాపతిః ప్రజా అసృజత| తాస్సృష్టా స్సమశ్లిష్యన్| తారూపేణాను ప్రావిశత్| తస్మాదాహుః| రూపం వై ప్రజాపతిరితి| తా నామ్నాను ప్రావిశత్| తస్మాదాహుః| నామవై ప్రజాపతిరితి| తస్మాదప్యాఽమిత్రౌ సంగత్య| నామ్నా చేద్ధ్వయేతే| మిత్రమేవ భవతః|

సృష్టి ఆరంభంలో ప్రజాపతిచే సృష్టించబడిన ప్రజలందరూ దేవ, గంధర్వ, మనుష్య భేదం లేకుండా ఒకేలా ఉన్నారుట. అప్పుడు **"తారూపేణాను ప్రావిశత్"** అని దేవ, మనుష్య భేద రూపంలో తెలిసేటట్లు వివిధ రూపాల్లో ప్రజాపతి వారిలో ప్రవేశించాడు. **"తానామ్నాను ప్రావిశత్"** అదే తీరుగా వివిధ నామాలతో కూడా వారిలో వైవిధ్యం చూపించాడు.

"నామరూపాభ్యాం వ్యాకరవాణి"- ఈ జగమంతా నామరూపాత్మకం అని ఔపనిషత్ వాణి (ఉపనిషత్తులు చెప్పాయి - **"సభూరితి వ్యాహరత్ - సభూమిమసృజత| భూః భువః"** వంటి నామోచ్చారణలతో). తనలో లీనమై ఉన్న పూర్వస్సృష్టినే ప్రజాపతి మళ్ళీ రూపాత్మకంగా భూలోకం, ఇతర లోకాలుగా సృష్టించాడు. అంటే అదృశ్య రూపంగా ఉన్న జగత్తునే నామరూపాత్మకంగా అభివ్యక్తం చేయడం జరుగుతుంది. దీనిని బట్టి నామరూపాలు ప్రజాపతి స్వరూపాలని తెలుస్తోంది.

"తస్మాదప్యామిత్రౌ సంగత్య" అని ప్రజాపతి జగన్మిత్రుడు కాబట్టే లోకంలో ఇదివరకు ఎన్నడూ పరిచయం లేని ఇద్దరు వ్యక్తులు ఒకరి పేరు ఒకరు తెలుసుకుని స్నేహితులవడం, **"మార్గమధ్యే సాంగత్యం సంయుజ్య నామ్నాచేధ్వయేతే"** పరస్పరం శత్రువులైనప్పటికీ దారిలో కలుసుకుని పరస్పరం పేరుతో పిలుచు కున్నట్లయితే అప్పటికప్పుడే వారిద్దరూ మిత్రులవుతారుట.

ఈ చర్చవలన తేలినదేమిటంటే ఒకరి వెంబడి ఒకరు ఏడు అడుగులు వేసినా, ఏడుసార్లు పేరు పెట్టి పిలుచుకున్నా పరస్పర మైత్రి ఏర్పడుతుంది అని. అందుకే వివాహంలో సప్తపది సంస్కారం, గుమ్మాలు దాటేటప్పుడు వధూవరులు ఒకరి పేరు ఒకరు చెప్పే సంప్రదాయం వచ్చాయని గుర్తించుకోవాలి. ఇప్పుడు పెళ్లి మొత్తం ఒక పూటలోనో, ఒక గంటలోనో అయిపోతుంటే కుదరదేమో గానీ, ఇదివరకటి వివాహాల్లో పెళ్ళికొడుకు, పెళ్లికూతురు ఎటువెళ్లినా దారిలో గుమ్మం (ద్వారం) వస్తే అక్కడ అందరూ చేరి ఒకరి పేరు ఒకరు చెప్పాలని చెప్పించుకోవడం అలవాటుగా ఉండేది. ఇంకా వివాహంలో వధూవరులిద్దరూ ఒకే పాత్రలో భోజనం చేయడం వంటి ముచ్చట్ల వలన పరస్పర సఖ్యత మరింత బలపడుతుంది. ఈ సఖ్యత గృహస్థాశ్రమ నిర్వహణకు చాలా ముఖ్యం. పెళ్ళిలో ఒకే పాత్రలో భోజనరూపంగా ఎంగిలి తినడం, ద్వారం దగ్గర పేర్లు చెప్పుకోవడం వంటివి చెప్పిన శాస్త్రం ఆ తర్వాత అంటే పెళ్లి తర్వాత నిత్యగృహస్థ జీవనంలో ఇవి వద్దని చెప్పింది. దురదృష్టవశాత్తు ఈ కాలంలో వధూవరులు ఈ రెండూ కూడా (ఎంగిలి తినడం, పేర్లు చెప్పుకోవడం) పెళ్ళిలో చెయ్యడం లేదు, పెళ్లయ్యాక మానడం లేదు! దానికి కారణం ఈ విశేషాలు వాళ్ళకి తెలియక పోవడం, పెద్దవాళ్ళు చెప్పకపోవడం!

ప్రస్తుతం చర్చిస్తున్న విషయం సప్తపది సంస్కారం. వధువుచేత ఏడడుగులు వేయించిన తర్వాత ఏడో అడుగులో ఇలా చెప్పిస్తారు. **"సఖేతి సప్తమే పదే జపతి" "సఖా సప్తపదా బభూవ సఖ్యం| తే గమేయం సఖ్యాత్తే మాయోషాం", "యయా క్రాంతాని - సా సప్తపదా".**

నాతో కూడి, " **ఏకమిషే**" వంటి మంత్రాలతో నాతో కలిసి ఏడు అడుగులు వేసిన నువ్వు నా సఖురాలవు. ఏడడుగులు వేయడం ద్వారా మనమిద్దరం సఖులమయ్యాం. ఇప్పటినుండి నీ సఖ్యంనుండి నేనెప్పుడూ విడిపోను, నా సఖ్యం నుండి నువ్వెప్పుడూ వీడిపోకు. మనమిద్దరం కలసిమెలసి జీవిద్దాం, అని వరుడి సంకల్పం.

ఇదమిదం కర్తవ్యమితి సంకల్పావహై|

గృహస్థాశ్రమంలో చేయాల్సిన కార్యాల్లో "ఇది చేయతగినది", "ఇది ఇప్పుడు చేయవలసినది" అని మనం ఇద్దరమూ ఒకే విధంగా సంకల్పిద్దాం. **"సంప్రియం రోచిష్ణు"**-పరస్పరం అనురక్తులుగా, పరస్పర సహవాసంచే వచ్చిన వెలుగుతో కూడినవారిగా ఉందాం.

భర్తా నామ పరం నార్యా భూషణమ్ భూషణాదపి|

అంటారు వాల్మీకి, శ్రీ సుందరకాండలో. భర్త లేకపోతే ఎన్ని అలంకారాలున్నా స్త్రీకి దీప్తి లేదు. భర్తతోనే దీప్తి. కనుక స్త్రీకి ఇతరమైన బంగారు ఆభరణాలు, ఇతర అలంకారాలు అన్నింటికంటే భర్త నిజమైన గొప్ప అలంకారం. భార్య గృహలక్ష్మి కనుక భార్యా రహితుడు లక్ష్మీ రహితుడు, అంటే ధనరాహిత్యం కాదు, శోభారాహిత్యం. శోభారహితుడన్నమాట! అందుచేత పరస్పర సాంగత్యంచేత వధూవరులు ఇద్దరూ దీప్తిమంతులు అవుతారు.

సుమనస్యమానౌ – సుమనాయమానౌ - ఇషమూర్జ మభి సంవసానౌ - సహానుభవన్తౌ సమయావ

మంచి మనస్సుతో కూడినవారు గాను, బలప్రదం అయిన ఆహారాన్ని, మనమిద్దరం కలిసి అనుభవించే వారంగా అవుదాం!

సంనౌమనాగ్ం సి సంవ్రతా ధర్మపత్నీ సమేతోహం సంగతామి కరోమి|

మన ఇద్దరి మనో వ్యాపారాలను, నీతో కలిసి ఆచరించదగిన కర్మలన్నిటినీ ధర్మపత్నితో కూడిన నేను అని నిన్ను కలుపుకుని సంకల్పం చేసి ఆ కర్మ ఫలం ఇద్దరికీ చెందేటట్లు చేస్తున్నాను.

అంటే, మంచి మనసుతో బలవర్ధకమైన ఆహారం కలిసి అనుభవించేవారంగా అవుదామని, నేను ఆచరించే కర్మలన్నింటినీ **'ధర్మపత్నీ సమేతోహం'** అని సంకల్పం చేసి ఆ కర్మ ఫలం మనిద్దరికి చెందేటట్లు చేస్తున్నాను అని వరుడు చెప్పే మంత్రాలకి అర్థం.

పాణిగ్రహణాత్సహత్వం కర్మసు తథా పుణ్య ఫలేషుచ|

అనే వచనం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తూ వివాహం లగాయతు అన్ని కర్మల్లో ఇద్దరికీ సహభావాన్ని, అలాగే కర్మఫలాల్లోను సహభావాన్ని చెబుతుంది. అయితే ఇక్కడొక విషయం గమనించాలి. అతని పుణ్యకర్మల తాలూకు ఫలంలోనే ఆమెకు భాగం కానీ, అతను ఆచరించే పాపకర్మల ఫలంలో ఆమెకు భాగం లేదని **"పుణ్యఫలేషుచ"** అనే పదం సూచిస్తోంది. ఎందుకంటే పుణ్యకర్మలు చేసేటప్పుడు ఆమెతో కూడిన సంకల్పం ఉంటుంది గాని దొంగతనం, హత్య, దోపిడీ వంటి పాప కర్మలు చేసేటప్పుడు ఆమెతో సంకల్పం లేదుగా! అందుకే **"పుణ్యఫలేషుచ"** అని శ్రుతి.

యద్ధి మనసాధ్యాయతి తద్వాచా వదతి| (తై.సం.)

మనస్సుచే ఏది ముందు ఆలోచించబడుతుందో అదే వాక్కుతో పలకబడుతుంది. ఆ విధంగా నేనేమి ఆలోచిస్తానో దానినే నువ్వు ఆచరణలో పెట్టే విధంగా మనం జీవించవలసి ఉంది. **'సప్తపది'** అనే ప్రక్రియలో వినియోగించే **'సఖేతి'** మంత్రంలో ఇన్ని మంచి భావనలు, భావాలు ఉన్నాయని తెలియచేయడానికే ఈ మంత్రార్థం విపులీకరించడం జరిగింది. అలాగే ప్రధానహోమంలో వినియోగింపబడే ఒకటి రెండు మంత్రాలకు అర్థాన్ని విశ్లేషిద్దాం.

ప్రేతో ముంచాతి నాముతస్సుబద్ధామము తస్కరత్| యధేయ మింద్ర మీఢ్వస్సుపుత్రా సుభగా సతి| ఇమాం త్వమింద్రమీఢ్వస్సు పుత్రాగ్ం సుభగాం కృణు| దశాస్యాం పుత్రానాధేహి పతిమేకాదశం కృతి| (ఏ.కాం.)

"ఈ వధువును పితృకులం (కుటుంబం) నుంచి విడిపించుము. పతి కుటుంబం నుంచి ఎన్నటికీ విడదీయకుము. ఆమెను నా సహధర్మచారిణిగా చేసి నాతో సంబద్ధురాలుని చేయుము. ఈ వధువును సుపుత్రులతో, సౌభాగ్యంతో కూడినదానిగా చేయుము. ఈమె వలన పదిమంది సంతానం (పుత్రులు) కలగాలి. భర్తను అయిన నన్ను పదకొండో వానినిగా చేయుము" అని వరుడు ఇంద్రుడిని ప్రార్థిస్తాడు. సంతానాన్నే ఐశ్వర్యంగా వేదం చాలా చోట్ల వర్ణించింది.

ఇమామగ్ని స్త్రాయతాం గార్ హపత్యః ప్రజామస్యై నయతు దీర్ఘమాయుః| అశూన్యోపస్థా జీవతామస్తు మాతా పౌత్రమానంద మభిప్రబుధ్య తామియమ్| (ఏ.కాం.)

అంటే-"ఈ వైవాహికాగ్ని ఈ వధువును రక్షించుగాక! ఈమె సంతానం దీర్ఘాయుష్షు కలిగి ఉందురు గాక! ఈమె ఒడి పిల్లలతో అలంకరించబడి ఉండు గాక!" ఈ మంత్రంతో వధువుయొక్క రక్షణ, బహుసంతానం, సంతానానికి దీర్ఘాయుస్సు కోరడం జరిగింది.

బ్రహ్మణ్యం బహుపుత్రతామ్|

బహుసంతానం వేదసమ్మతం అని నారాయణోపనిషత్తు దర్శపూర్ణమాస ప్రకరణంలో ప్రకటించబడింది.

అనతి దృశ్నగ్గ్ స్తృణాతి ప్రజయై వైనం పసుభిరనతిదృశ్నం కరోతి|

యజమాని కోసం వాని ఇంటికి వెళ్తే ప్రజాపస్వాదులతో ఆ ఇల్లు సమృద్ధిగా నిండి ఉండి యజమాని కనబడడం దుస్సాధ్యంగా ఉండాలి. ఇలాంటి అనేక శ్రుతులున్నాయి.

"ఆరోహన్తీముత్తరాభిరభిమన్త్రయతే" సూత్రప్రకారం వధువును రథం ఎక్కించి **"మూర్ధానం పత్యురారోహ ప్రజయా చ విరాడ్భవ"** అనే అభిమంత్రణ మంత్రాలతో, "పతినయిన నా శిరస్సు అధిష్ఠించు అని" రథమెక్కి వస్తున్న వధువుతో అంటాడు వరుడు. అంటే కాలానుగుణంగా రథమెక్కినా, వేరే బండి ఎక్కినా, సారాంశం ఏమంటే- "నాకు చాలా ప్రధానమైన వ్యక్తివి కమ్ము. పది మంది సంతానం కలిగి ఉండుము. నన్ను కూడా పుత్రుడి వలె ప్రేమతో చూసుకో" అని వరుడు కోరడం ఈ మంత్రార్థం. ఇంకా-

సంరాజ్ఞీ శ్వశురే భవ సంరాజ్ఞీశ్వశ్రాం భవ| ననాందరి సంరాజ్ఞీ భవ సంరాజ్ఞీ అధిదేవృషు| స్నుషాణాగ్ శ్వశురాణాం ప్రజాయాశ్చ ధనస్యచ పతీనాంచ దేవూ్యాణాంచ సజాతానాం చ విరాడ్భవ| (ఏ.కాం.)

అని చెప్తాడు వరుడు. అంటే, "మా ఇంటికి వచ్చిన తర్వాత అత్తమామలకు, ఆడపడుచులకు, మరుదులకు, బావగార్లకు, మాయింట ఉన్న మిగతా కోడళ్ళకు, పినమామ, పెదమామగార్లకు ప్రియమైన వ్యక్తివి కమ్ము" అని కోరతాడు వరుడు. అంటే కొత్త వధువును అందరితో ఐక్యమత్యంగా ఉండమని విజ్ఞాపన, సూచన.

ధ్రువక్షితిర్ధ్రువమసి ధ్రువత స్థితమ్| త్వం నక్షత్రాణామేధ్యసి సమాపాహి పృతన్యతః సప్తర్ షయః ప్రథమం కృత్తికానామ రుంధతీం| యద్ధ్రువతాగ్ం| హనిన్యుః| షట్కృత్తికా ముఖ్యయోగం వహన్తీయమస్మాక మేధత్వష్టమీ| (ఏ.కాం.)

ఉదితేషు నక్షత్రేషు ప్రాచీముదీచీం వా దిశముపనిష్క్రమ్య ఉత్తరాభ్యాం యథాలింగం ధ్రువమరుంధతీం చ దర్శయతి| (ఆ.గృ.సూ)

ప్రవేశహోమానంతరం నక్షత్రదర్శనం అయ్యేక తూర్పు లేదా ఉత్తరదిక్కుకు వెళ్ళి పై మంత్రాలతో ధ్రువనక్షత్రం, అరుంధతీ నక్షత్రం చూపించాలి. "ఓ ధ్రువ నక్షత్రమా! నీవు స్థిరనివాసం గల గొప్పదానివి. ధ్రువమైన ఉత్పత్తి గలదానివి. ఇతర నక్షత్రాలు నిలకడగా ఉండడానికి నీవే కారణం. రాటకు కట్టబడిన పశువులను అటూ ఇటూ పోకుండా ఆ రాట ఎలా నియంత్రిస్తుందో అలా నీవు నక్షత్ర మండలంలోని నక్షత్రాలను నియంత్రిస్తావు. అలాంటి నీవు మాతో యుద్ధం చేయనిశ్చయించిన వారినుండి మమ్మల్ని రక్షించెదవు గాక! కశ్యపాది సప్తర్షులు, ఇతర కృత్తికాదులకంటే అరుంధతి మహాపతివ్రతగా ఆమె ప్రాధాన్యతను గుర్తించడం జరిగింది. వారి అంగీకారానికి షట్కృత్తికలు కూడా సమ్మతి తెలియజేశారు. కనుక ఈ వధువు కృత్తికల్లో ఎనిమిదవది గాను, నేను కశ్యపాదుల్లో ఎనిమిదో వాడిగాను భావించుకుంటున్నాం. అంటే అరుంధతీ దర్శన ప్రభావంచేత అరుంధతి లాగే ఈ నా వధువు కూడా మహాపతివ్రతగా పేరొందే విధంగా అనుగ్రహించబడు గాక!" అని ప్రార్థన.

శాస్త్రప్రకారం వివాహంలో వివాహం జరిగిన రోజు కాకుండా మూడు దీక్షా దినాలుంటాయి. నాలుగో రోజు తెల్లవారకట్ల శేషహోమం అనే ప్రక్రియ ఉంటుంది. గంధర్వోత్థాపన అయిన తర్వాత ఈ హోమాలు చెయ్యాలని **"ఆజ్యభాగాన్తే అన్వారబ్ధా యాముత్తరా ఆహుతీర్ హుత్వా"** అను సూత్రం చెప్తోంది.

వధువు **'అన్వారబ్ధంగా'** అంటే ఆమె వరుడిని తాకుతున్నట్లు ఉండగా చేయాల్సిన ఈ హోమాల్లో వినియోగించే మంత్రాలు -

అగ్నే ప్రాయశ్చిత్తే త్వం దేవానాం ప్రాయశ్చిత్తిరసి బ్రాహ్మణస్త్వానాథ కామః ప్రపద్యేయాస్యాం పతి ఘ్నీతనూః ప్రజాఘ్నీ పశుఘ్నీ లక్ష్మీఘ్నీ జారఘ్నీమస్యై తాం కృణోమి స్వాహా|

వంటివి.

ప్రాయః వినాశః, చిత్తిః సంధానమ్| వాయో ప్రాయశ్చిత్తే|

అనేది మరో మంత్రం. "మాచే ఆచరించబడే కర్మల్లో ఏ కర్మ నష్టం అయిందో దాన్ని తిరిగి సంధానం చేసే సామర్థ్యం గల ఓ అగ్నీ! నువ్వు దేవతల్లో అంత గొప్పవాడివి కావున నీకు నమస్కరిస్తునాను. ఈ నా వధువు హస్త రేఖల్లో సాముద్రిక శాస్త్రం ప్రకారం భర్తను, సంతానాన్ని, పశువులను నష్టపరిచే ఏ రేఖ ఉందో ఆ రేఖ మమ్మల్ని కాక ఈమె పట్ల జారత్వదృష్టి కలవానిని నశింపచేయుగాక!" అని అర్థం.

అలాగే **"వాయోప్రాయశ్చిత్తే"** వంటి మంత్రాలతో ప్రార్థిస్తూ హోమాలు చేయడం ద్వారా వధువు హస్తరేఖల్లో ఉండే దోషాలను పోగొట్టే విధంగా ప్రార్థన చేస్తున్నాడని అర్థం.

ఈ విధంగా మంచి అర్థాలు, ఉన్నత ప్రయోజనాలు కూడి యున్న **'మంత్రయుక్త క్రియాకలాపం'** మంత్రాలతో కూడిన కలాపం**,** వివాహం. ఈ సంస్కారం ఇహ, పర ఉద్ధరణ ప్రయోజనం కలిగి ఉండి మానుష, దైవిక, పైతృక ప్రయోజనాలు కలిగినది అవడం చేత చాలా ప్రాధాన్యత సంతరించుకుని ఉంది. వివాహమంటే కేవలం ఒక స్త్రీపురుషుల జంటను కూర్చే వట్టి కూడిక మాత్రమే కాదని తెలియక ప్రస్తుత సమాజంలో యువత ఒక భ్రాంతితో ఉన్నారని, ఆ భ్రాంతిని కొంతవరకైనా దూరం చేయడానికి ఈ విషయం ఉపయోగపడగలదనే సంకల్పంతో ఈ విషయం ఇంత విపులంగా చర్చించడం జరిగింది. ఈ విధంగా వివాహ ప్రక్రియలను వివిధ మంత్రాలను, వేదాల్లోని అనేక ఇతర మంత్రాలను, స్మృతులను విశ్లేషించి చూస్తే వైదిక వాఙ్మయంలో స్త్రీకి ఎంత ఉన్నత పీఠం వేశారో అర్థం అవుతుంది. కనుక ఈ ప్రకరణానికి అనుబంధంగా **"స్త్రీల విశిష్టత"** అనే అంశం కింద ఆ వివరాలను వివరించే ప్రయత్నం చేస్తాను.

స్త్రీల విశిష్టత

స్త్రీలు ఎంతో విశిష్టత కలవారని వైదిక వాఙ్మయం యొక్క అభిప్రాయం. వేదం ఎప్పుడూ, ఏ విధంగానూ స్త్రీలను చిన్న చూపు చూడలేదు. పురుషుడు గృహస్థాశ్రమంలో ఆచరించవలసిన ధర్మాలు చాలా చెప్పబడ్డాయి. స్మార్తాగ్ని మొదలు శ్రౌతాగ్నుల వరకు వాటి పరిచర్య చేయాడానికి పత్ని చాలా అవసరం. ఆమెతో కలిసి సంకల్పం చేయనిదే ఏ కర్మయందూ అతనికి అధికారం లేదని **"అయజ్ఞో వా ఏషః యోఽపత్నీకః"** అను శ్రుతి చెప్తోంది. వివాహ సంస్కార సంస్కృతురాలైన భార్యయందు కలిగిన సంతానమే పితృరుణ విమోచన చేయడానికి యోగ్యత కలవారవుతారని చెప్తోంది. వేదాధ్యయనం ద్వారా రుషిరుణం తీర్చడానికి భార్యతో పనిలేదు. కానీ దేవరుణం తీర్చాలన్నా, సంతానం ద్వారా పితృరుణం తీర్చాలన్నా భార్య అవసరం.

అనధీత్య ద్విజో వేదాననుత్పాద్య తథా సుతాన్|అనిష్ట్వా చైవ యజ్ఞాంశ్చ మోక్షమిచ్ఛన్ వ్రజత్యధః|(మ.స్మృ.)

వేదాధ్యయనం చేసి రుషిరుణం, యజ్ఞానుష్ఠానం చేసి దేవరుణం, సంతానం ద్వారా పితృరుణం తీర్చకుండా మోక్షాన్ని కోరితే పతితుడవుతాడని పై స్మృతి యొక్క అర్థం. అటువంటి భార్యను సంపాదించుకోవడానికి వివాహ సంస్కారం చెప్పబడింది. వివాహ సంస్కారంలో చెప్పబడిన నియమాలతో ఆ యా సంస్కారాలతో సంస్కృతులైన భార్యకే పత్నీశబ్ద ప్రయోగం. అనగా యజ్ఞయోగ్యత కలది అని అర్థం. **"పత్యుర్నో యజ్ఞ సంయోగే"** అని పాణిని సూత్రం.

ఈమెతోనే అగ్నిసిద్ధి కలుగుతుంది. అందుచేతనే భర్త సాయం, ప్రాతః కాలాల్లో స్మార్తాగ్నిలో ఔపాసన, శ్రౌతాగ్నుల్లో అగ్నిహోత్రం చేసే సమయాల్లో లౌకిక రీత్యా తాను విక్రయించడానికి అర్హమైన ఎంత ప్రదేశంలో తన ఇల్లు ఉందో ఆ పరిధిలోనే భార్య ఉండాలి. కానీ ఆ పరిధి దాటితే ఆ అగ్నులు లౌకికాగ్నులు అవుతాయని శాస్త్రం. అంటే మళ్ళీ విచ్ఛిన్నౌపాసన, విచ్ఛిన్నాదానం చేసి నూతన అగ్నులను సంపాదించాలన్నారు. దీనినిబట్టి భార్యకు ఎంత ప్రాధాన్యముందో తెలుస్తోంది. ఈ ప్రకారం మనవాళ్లు వైదిక ప్రక్రియలో స్త్రీలకి ఎక్కువ ప్రాధాన్యత చెప్పారు. లౌకికంగా ఆమెకు భర్త తాలూకు ధనంలో అధికారం లేదని శంకించగలరు. కానీ అలా శంకించకూడదు. వివాహంలో కన్యను కన్యాదాన స్థలంనుండి అగ్ని సమీపానికి తీసుకువెళ్లే సమయంలో **"పూషాత్వే తోనయతు"** అను మంత్రాన్ని చెప్పి తీసుకువెళ్ళడం వివాహప్రకరణంలో నిరూపించడమైంది. ఆ మంత్రం-

గృహాన్గచ్ఛ గృహపత్నీ యథాసో వశినీత్వం విదథమావదాసి|

దాని అర్థం: వరుడు ఆమెతో ఇలా అంటున్నాడు-"మా గృహానికి రమ్ము. కేవలం రావడం కాదు గృహాధిపతురాలుగా రావాలి. ఆ ప్రకారం వచ్చి మా గృహానికి **"వశినీ - స్వామినీ భూత్వా"** అనడంచే అధిపతిరాలుగా ఉండి మంచి పుణ్యకార్యాలను ప్రోత్సహించు". అంతే కాదు, వివాహమైన తర్వాత పురుషుణ్ణి **"గృహస్థు"** అంటారు. **"గృహే తిష్టతీతి గృహస్థః"** గృహమనగా, భార్యే గృహమన్నారు". **"గృహిణీ గృహముచ్యతే"** అనగా గృహిణే గృహస్వరూపం అన్నారు. ఆమె గృహంలో ఉండేవాడు పురుషుడు అన్నందున ఆమె ప్రధానురాలైంది. అయితే ఆమెది ఎటువంటి స్వామిత్వమని విచారించాలి.

భార్యా పుత్రశ్చ దాసశ్చ త్రయ ఏవా ధనాః స్మృతాః| (యా.స్మృ.)

మితాక్షరీ వ్యాఖ్య - **అధనాః అస్వతంత్రధనాః|** ఇత్యర్థః

భార్య, పుత్రుడు (సంతానం), దాసులు ఈ ముగ్గురూ **"అధనాః"** అన్నారు. అంటే అస్వతంత్ర ధనులు అని పేర్కొన్నారు. న్యాయంగా తండ్రి ధనానికి పుత్రుడు హక్కుదారుడే కానీ సమిష్టి కుటుంబంలో తండ్రియొక్క అనుమతి తీసుకుని పుత్రుడు ఖర్చు పెట్టాలి. వివాహంలో విధించిన-

ధర్మే చ అర్థే చ కామే చ త్వయైషా నాతి చరితవ్యా|

అను షరతు ప్రకారం భార్యకు భర్త ధనంలో అధికారం ఉన్నా అతడి యొక్క అనుమతితో ఖర్చు పెట్టాలి. ఇలాగే **'దాసః-సేవకః'** వంశపరంపరగా వచ్చే సేవకులుంటారు. వారు కూడా యజమానిని బట్టి ధనవంతులే అన్నారు. కానీ యజమానియొక్క అనుమతితో ఖర్చుపెట్టాలన్నారు.

లోకంలో ఒక ట్రస్టు ఉంటే, దానికి కొంత ధనం ఉంటుంది. దానికో కమిటీ ఉంటుంది. ఆ ధనం కోశాధికారి స్వాధీనంలో ఉంటుంది. కానీ ట్రస్టు తాలూకు ధనాన్ని ఖర్చు పెట్టడానికి ఆ కోశాధికారికి అధికారం ఉండదు, ధనాన్ని వృద్ధి చేస్తూ స్వాధీనంలో ఉంచుకున్నా సరే. అధ్యక్షుని అనుమతితో కార్యదర్శి సంతకంతో గాని కోశాధికారి ఖర్చు పెట్టడానికి అధికారం లేదు. అదే తీరుగా ఇంట్లో ఉన్న ధనానికి భార్య కోశాధికారిణి. దానివల్ల భార్య ధనవంతురాలన్నారు. కానీ భర్తయొక్క అనుమతితో ఖర్చు పెట్టాలనే అభిప్రాయంతోనే సోమయాగ ప్రకరణంలో **"ఆతిథ్యేష్టి"** అను యాగంలో మరో శ్రుతి ఉంది.

ఆ యాగంలో ఓషధులకు రాజైన సోముడిని అనగా సోమతలను తీసుకుని బండిమీద యాగశాల దగ్గరకు తీసుకువచ్చి ఆ సోమదేవతకు ఆతిథ్యమివ్వాలి. ఆ ఇచ్చే సందర్భంలో సూత్రకారులు ఇలా చెప్పారు.

పత్నీగ్ం శకటమన్వారంభయిత్వాఽతిథ్యం నిర్వపతి| పత్న్యా హస్తేన హస్తాద్వా| (ఆ.శ్రౌ.సూ)

సోమదేవతకు ఆతిథ్యం ఇవ్వదలచిన ధాన్యం బండిమీద ఉన్నట్లు ఆ బండిని భార్యను పట్టుకోమని లేదా భర్త పట్టిన పాత్రలోకి ఆమె హస్తంతో ద్రవ్యాన్ని నింపాలని, లేదా ఆమె హస్తంతో పట్టుకున్న పాత్రనుండి తన హస్తంతో తీసి ఆ దేవతకు ఆతిథ్యద్రవ్యాన్ని కేటాయించమన్నారు. ఈ విషయంలో-

పత్నీహి పారీణ హ్యస్యశేపత్నియైవానుమతం నిర్వపతి| (తై.సం.)

అర్థం: "**పరిణత్-గృహః తత్రభవం–పారీణహ్యం**" అని, గృహంలో ఉన్న ద్రవ్యం పారీణహ్యం అని చెప్పబడుతోంది. **తస్య ఈశే – స్వామినీ - పత్నీ** అనగా ఇంట్లో ఉన్న ద్రవ్యానికి ఆమె అధిపతురాలు కనుక ఆమె అనుమతితో ఆతిథ్యమిచ్చినట్లే అని అభిప్రాయం. లోకంలో కూడా భార్య అనుమతి లేనిదే ఇంటికి వచ్చిన అతిథికి ఆతిథ్యం ఇవ్వలేం కదా! వీధిలోకి వెళ్ళి ధనార్జనోపాయాలతో ధనార్జన చేసి ఇంటికి తీసుకువచ్చే వరకే ఆ ద్రవ్యానికి భర్త అధిపతి. ఇంట్లో పెట్టిన తర్వాత ఆమె అధిపతురాలు. ఈ షరతుతోనే వివాహమైన తర్వాత భార్యను భర్త ఇంటికి తీసుకువస్తున్నాడు. పై శ్రుతి కూడా ఇంట్లోగల ధనానికి ఆమె స్వామిని, యజమానురాలు అంటోంది.

అర్థస్య సంగ్రహేచైనాం వ్యయేచైవ నియోజయేత్|

అని, ధనం జాగ్రత్త పరిచి ఖర్చుచేయడంలో ఆమెను నియోగించాలని ఇంతకుముందు చెప్పబడింది. దీనినిబట్టి వివాహ మంత్రాల్లో సోమయాగ ప్రకరణంలో ఉన్న మంత్రాల్లో, స్మృతుల్లో ఆమెను ధనవంతురాలుగా, ఇంటికి అధికారిణిగా చెప్పి గౌరవాన్ని చూపించారు. దీనివల్ల భార్యను దాసీగా చూడమని లేదు. మరియు ఆమెను లక్ష్మీ స్వరూపంగా భావించి గౌరవించాలన్నారు.

లక్ష్మీ నామ్నీం కన్యాం లక్ష్మీనారాయణ స్వరూపాయ వరాయ దదాతి| (కన్యాదాన సంకల్పం)

లక్ష్మీ స్వరూపురాలైన కన్యకను లక్ష్మీనారాయణ స్వరూపుడైన వరునికి ఇస్తున్నట్లు భావిస్తున్నారు. ఆమె లక్ష్మీ స్వరూపురాలు కనుకనే నడిపించకూడదనే భావనతో బుట్టలో బియ్యం పోసి కన్యకను కూర్చోబెట్టి మేనమామ కన్యాదాన స్థలానికి తీసుకురావడం సంప్రదాయం. వరుడు అగ్ని సమీపానికి తీసుకు వెళ్ళేటప్పుడు, అక్కడ ప్రధాన హోమం అయిన తర్వాత వధువును తన ఇంటికి తీసుకువెళ్లేటప్పుడు రథాన్ని అధిష్ఠింపచేసి తీసుకు వెళ్లాలని చెప్పబడింది.

ఉత్తరారథస్యోత్తంభనీ, వాహ వుత్తరాభ్యాం యునక్తి|

ఇత్యాది సూత్రాల ప్రకారం రథాన్ని సన్నద్ధం చేసి రథాన్ని అధిష్ఠించిన తర్వాత,

ఆరోహన్తీముత్తరా భిరభిమన్త్రయతే| (ఆ.గృ.సూ)

అను సూత్రప్రకారం కొన్ని మంత్రాలతో అభిమంత్రణ చేయాలని చెప్పడం చేతను, రథాది వాహనాలను అధిష్ఠింపచేసి తీసుకువెళ్లాలనే అభిప్రాయం కనబడుతోంది.

శ్రియా వా ఏతద్రూపమ్| యత్పత్నయః|

ఇంతే కాదు, తీసుకు వెళ్లిన తర్వాత కూడా ఆమెను లక్ష్మీ స్వరూపంగా భావించాలనడంలో వేదంలో అశ్వమేధ ప్రకరణంలో కూడా యజమాని యొక్క భార్య సాక్షాత్తు లక్ష్మీ స్వరూపమని వర్ణించింది.

స్త్రియశ్చియశ్చ గేహేషు న విశేషోఽస్తి కశ్చన| (మ.స్మృ.)

స్త్రీలంటే ఇళ్ళలో వారు సాక్షాత్తు లక్ష్మీ రూపులే. ఇంతకంటే భిన్నమైన విశేషం లేదన్నారు. అందుకే వాళ్ళను **'స్త్రీ రత్నాలు'** అని మనువు చెప్పాడు. ఇంకా చూడండి-

1. యాసాం వా దదతే శుల్కం జ్ఞాతయో న సవిక్రయః| అర్హణం తత్కుమారీణాం ఆనృశంస్యం చ కేవలమ్|

2. పితృభిర్భ్రాతృభిశ్చైతాః పతిభిర్దే వరైస్తథా| పూజ్యా భూషయితవ్యాశ్చ బహుకళ్యాణ మీప్సుభిః|

ఎల్లప్పుడూ కళ్యాణాన్ని (మంగళాన్ని) కోరే తండ్రి, సోదరులు, భర్త, తత్సోదరులు మున్నగు వారందరూ స్త్రీలను అలంకారాలతో అలంకరించాలని, పూజించాలని చెప్తోంది.

3. యత్రనార్యస్తు పూజ్యన్తే రమన్తే తత్ర దేవతాః| యత్రై తాస్తు న పూజ్యన్తే సర్వాస్తత్ర అఫలాః క్రియాః|(మ.స్మృ)

ఏ ఇంట స్త్రీలు పూజింపబడుతున్నారో అక్కడ దేవతలు తాండవం చేస్తారట. ఎక్కడ వీరు పూజింప బడలేదో అప్పుడు ఆ ఇంటివారు ఆచరించిన ధర్మాచరణాత్మక క్రియాలన్నీ నిష్ఫలమన్నారు.

4. శోచంతి జామయా యత్ర వినశ్యత్యాశు తత్కులమ్| న శోచంతి తు యత్రైతా వర్ధతే తద్ధి సర్వదా|

సోదరులచే గౌరవింపబడక ఏ ఇంట ఆడపడుచులు దుఃఖిస్తున్నారో ఆ వంశం శీఘ్రంగా క్షీణిస్తుందన్నారు. ఏ ఇంట వారు సంతోషంతో ఉన్నారో ఆ వంశం ఎల్లప్పుడు వృద్ధి చెందుతుంది.

5. జామయో యాని గేహాని శపన్త్య ప్రతిపూజితాః| తాని కృత్యాహనీవ వినశ్యన్తి సమన్తతః| (మ.స్మృ.)

పూజింపబడని వారైన ఆడపడుచులు ఏ గృహాలను శపిస్తున్నారో ఆ గృహాలు కృత్యాభిచారిక క్రియలచే (శత్రువధార్థం చేయబడు కర్మ విశేషాలచే) శత్రువులు నశించిన విధంగా నశిస్తాయని అభిప్రాయం.

6. తస్మాదేతాస్సదాపూజ్యః భూషణాచ్ఛాదనాశనైః|భూతికామైర్నరైర్నిత్యం సత్కారే షూత్సవేషు చ|(మ.స్మృ)

ఎప్పుడూ, విశేషంగా పండుగలు వివాహాది శుభకార్యాలు వచ్చినప్పుడు వారిని (ఆడపడుచులను) యథాశక్తి భూషణ, వస్త్రాదులతో గౌరవించాలి.

7. సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ| యస్మిన్నేవ కులే నిత్యం కళ్యాణం తత్ర వై ధ్రువమ్|

8. యది హి స్త్రీ న రోచేత పుమాంసం న ప్రమోదయేత్| అప్రమోదాత్పునః పుంసః ప్రజనం న ప్రవర్తతే|

9. స్త్రియాంతు రోచమానాయాం సర్వం తత్ రోచతే కులమ్| స్త్రియామరోచమానాయాం సర్వమేవ న రోచతే

ఏ ఇంట భార్యచేత భర్త, భర్తచేత భార్య పరస్పరం గౌరవింపబడి సంతుష్టులవుతారో ఆ గృహం నిత్యకళ్యాణంగా ఉంటుంది. భర్తచే భార్య సంతుష్టి పడనప్పుడు ఆమె భర్తను సంతోషపెట్టకపోవడం జరుగవచ్చును. దానివల్ల వంశవృద్ధికి కారణమైన సంతానం కలగకపోవును. అందుచేత స్త్రీ సంతోషంతో గౌరవింపబడి సంతోషంతో ఉంటే ఆ గృహం నిత్యం సంతోషంతో కళకళలాడుతుంది.

అందుకే వివాహంలో సప్తపది అను క్రియలో వినియోగించబడే మంత్రం ఇలా ఉంది.

సఖా సప్తపదా భవ| సఖాయౌ సప్తపదా బభూవ| సఖ్యం తే గమేయం| సఖ్యాత్తేమాయోషమ్| సఖ్యాన్మే మాయోష్ఠాః| (ఏ.కాం.)

ఈ సప్తపదిచే మనిద్దరం కలిసి ఏడడుగులు నడవడం ద్వారా గృహస్థాశ్రమంలో మనిద్దరం సఖులుగా ఉందాం. నీ సఖ్యాన్ని నేను విడిచి పెట్టను. నా సఖ్యంనుండి నీవెన్నడూ వీడకుము! అని వరుడు కోరుతున్నాడు. ఇదంతా పైన చెప్పిన నిత్యకల్యాణం కొరకే అని తెలుస్తోంది.

ఈ విధంగా వస్త్రాలంకారాదులచే స్త్రీలను చాలా గౌరవించాలని స్మృతికారులు చెప్పడమే కాక, వేదంలో దర్శపూర్ణమాస ప్రకరణంలో దర్భలతో నిర్మించిన పవిత్రంతో ఆజ్యాన్ని పవిత్రింప చేసి, తిరిగి నీటిని పవిత్రింప చేయడానికి ఆ పవిత్రాన్ని యజ్ఞపాత్రలో ఉదకములలో ఉంచిన నీరు నెమలి పింఛములందు గల చిహ్నాల వలే విలక్షణమైన బిందువులతో కలిగి శోభగా ఉంటుందని చెప్పడానికి దృష్టాంతంగా ఇలా చెప్పారు.

అపివా ఉతాహుః|

యథాహ వై యోషా సువర్ణగ్ం హిరణ్యం పేశలం బిభ్రతీ రూపాణ్యాస్తే| (తై.బ్రా)

అంటే, లోకంలో ఏ విధంగా స్త్రీ బంగారపు ఆభరణాలను ధరించి సుందరమైన అవయవాలు కలదిగా భావిస్తోందో ఆ ప్రకారంగా ఈ నీటి బిందువులు ఉన్నాయని అభిజ్ఞులు అంటున్నారని శ్రుతి చెప్తోంది. దీనివల్ల ఆభరణాలు స్త్రీలకు మాత్రమే చెప్పబడ్డాయి. అంటే ఆభరణాదులచేత, విలువైన వస్త్రాలచేత గౌరవించాలని తెలుస్తోంది. ప్రయాణం సమయంలో ఒకవేళ పురుషుడు నడిచి వెళ్ళినా స్త్రీలను వాహనాల ద్వారా ప్రయాణం చేయించడం, ఏ సందర్భం వచ్చినా తాను కొనుక్కోకపోయినా స్త్రీలకు మాత్రం నూతన వస్త్రాలు కొనడం వగైరాలన్నీ వాళ్ళని గౌరవించడమే అనాలి. నేటికీ ఈ ఆచారం లోకంలో ఉంది. మనం చూస్తూనే ఉన్నాం. మరియు స్త్రీ ధనంచే పురుషుడు పోషింపబడకూడదు. పురుషుడు ఆమె ధనాన్ని స్వీకరిస్తే అతడిని అధమాధమునిగా స్మృతికారులు చెప్పారు. అందుకే వివాహంలో ధ్రువనక్షత్ర దర్శన సమయంలో-

ధ్రువైధి పోష్యామయి మహ్యం త్వాదాద్బృహస్పతిః| మయాపత్యా ప్రజావతీ త్వంజీవ శరదశ్శతమ్|

అను మంత్రాన్ని ఉచ్చరిస్తారు. అనగా "నీవు నాచే పోషింపబడుతూ ధ్రువనక్షత్రం వలె భర్త గృహమందు నిశ్చలంగా ఉండుము! నిన్ను బృహస్పతి నాకోసం ఇచ్చారు. పతినైన నాతో కూడా యోగ్యమైన సంతానంతో కూడుకున్నదానవై నూరు సంవత్సరాలు సుఖంగా జీవించు" అనే అర్థంతో కోరుతున్నాడు వరుడు.

దీనివల్ల భర్త పోషకుడు కనుకనే అనేక శ్రమలగూర్చి అయినా ధనాన్ని ఆర్జించడం పురుషుని బాధ్యత. దాన్ని జాగ్రత్తపరచడం భార్య బాధ్యత అని, పురుషుడు పోషకుడు, భార్య పోష్యురాలని తెలుస్తోంది. ఇట్లుండగా కన్యాదాత తన కుమార్తెను అతిక్రమించవద్దని చెప్పే వరుడికిచ్చినా ఆ దంపతులను తన ఇంట్లోనే ఉంచుకుని పురుష సంతానం వలె చూడవచ్చును కదా! అని శంకిస్తారు. దానికి సమాధానం వేదం ఇలా చెప్తోంది.

అవభృధమవయన్తి పరాస్థాలీరస్యన్త్యుత్పుమాగ్ం సగ్ం హరన్తి| (తై. సం.)

యజ్ఞమంతా పూర్తి అయిన తర్వాత యజ్ఞశాలనుంచి యజమాని, రుత్విక్కులు అంతా అవభృథ దేశానికి వెళ్తారు. ఆ వెళ్ళేటప్పుడు యజ్ఞంలో ఉపయోగింపబడిన ఆగ్రయణస్థాలీ మున్నగు నాలుగు మృణ్మయ పాత్రలు అనే స్థాలులను యజ్ఞశాలలోనే విడిచి వెళ్తారు. వాయవ్య పాత్రలు అనగా కర్రతో చేయబడి, వాయవ్య స్థానంలో ఉంచబడిన పాత్రలను మాత్రం అవభృథ దేశానికి (ప్రదేశానికి) తీసుకుని వెళ్తారు.

స్త్రియం జాతాం పరాస్యన్తి|

భాష్యం: స్వస్యకులే ఉత్పన్నాం దుహితరం వివాహ సంస్కారం కృత్వా పరకులే పరిత్యజన్తి|

ఈ క్రియా సామర్థ్యంచేతనే లోకంలో తన కులమందు (ఇంట్లో) జన్మించిన కుమార్తెను వివాహం జరిపించిన పిమ్మట వరుని కులంలో (ఇంట్లో) విడిచి పెడుతున్నారు. యజ్ఞంలో దారుమయ పాత్రలను

మాత్రం అవభృథ దేశానికి తీసుకుని వెళ్ళి, ఆగ్రయణీత్యాది స్థాలులను యజ్ఞశాలలోనే వదిలివెళ్తున్న కారణంగా పురుష సంతానాన్ని ఇంట్లోనే ఉంచుకుని ఉద్ధరిస్తున్నారని చెప్పడంచే అదే సంప్రదాయ బద్ధమైంది. కన్యను వర కులంలో విడిచినా కుమాళ్లతో (కుమారులతో) బాటుగా దాయభాగమిచ్చి పంచవచ్చును కదా! అని శంకిస్తారేమోనని శ్రుతి చెప్తోంది.

ససోమో నాతిష్ఠతి స్త్రీభ్యో గృహ్యమాణస్తం ఘృతం వజ్రం కృత్వాఘ్నన్నన్నిరింద్రియం భూతమగృహ్ణాస్ తస్మాత్ స్త్రియో నిరింద్రియా అదాయాదీరపి పాపాత్పుగ్ంస ఉపస్తితరం వదన్తి| (తై.సం.)

యజ్ఞంలో పాత్నీవ్రత గృహ ప్రచారమనే ఒక ప్రక్రియ కలదు. స్త్రీ దేవతలు సోమరసాన్ని గ్రహించే సమయంలో సోమదేవత స్త్రీలకు గ్రహించబడడం అంగీకరించలేదు. **"తం ఘృత వజ్రం కృత్వాఘ్నాస్"** అప్పుడు దేవతలు సోముని సామర్థ్యాన్ని క్షీణింప చేయడానికి సోమరసంలో ఘృతాన్ని వజ్రాయుధంగా కల్పించి దానితో సోముని సామర్థ్య రహితునిగా చేసారు. ఆ విధంగా క్షీణించిన సోమాన్ని స్త్రీ దేవతలకు గ్రహింపచేసారట. ఈ ప్రకారం సామర్థ్య రహితమైన సోమాన్ని గ్రహించడంవల్ల స్త్రీలు సామర్థ్యం లేని వారై పురుషులకు తండ్రి తాలూకు ఆస్తిలో దాయభాక్కులు (దాయభాగానికి హక్కు కలిగినవారు) కాలేదుట.

ఇక్కడ మరో విషయం. ఎక్కడ పురుష సంతానం లేక స్త్రీ సంతానం మాత్రమే ఉంటుందో అక్కడ ఆమెకు హక్కున్నా, ఉన్న స్త్రీ పురుష సంతానంలో పురుష సంతానం పాపాచరణచే దుష్టుడైనా దాయభాగం అతనికి చెందవలసిందే గాని పతివ్రత అయిన స్త్రీ సంతతికి చెందదని, ఆ అంశంలో పురుష సంతతి కంటే దిగువ స్థానంలోనే ఉండునని **"అపి పాపాత్పుగ్ం స ఉపస్తితరం వదన్తి"** అను శ్రుతి చెప్తోంది. దీనివలన స్త్రీలకు దాయభాగాధికారం లేదు గాని భర్త ఇంటికి చేరి భర్తయొక్క ఆస్తికి హక్కురాలు అవుతోంది.

ఈ విషయంలో ధర్మశాస్త్రంలో ఉన్న దాయభాగ ప్రకరణాన్ని అనుసరించి వివరించవలసింది చాలా ఉన్నందున సామాన్యంగా మాత్రం ఇక్కడ చెప్పడమైంది. దీంట్లో మరో విషయం కూడా గమనించాలి. ఒకప్పుడు తన పుట్టింటి వారి నుంచి తీసుకువెళ్లే ఆస్తికన్నా అత్తవారింట్లో ఎక్కువ ఉండవచ్చును. ఈ సవరణ ప్రకారం తన ఆడపడుచులు తన అత్తవారింటి నుంచి ఎక్కువ ఆస్తిని తీసుకువెళ్లడం అనేది కూడా సంభవిస్తుంది.

కాబట్టి హెచ్చుతగ్గులతో పని లేకుండా తండ్రియొక్క ఆస్తికి కుమాళ్ళు (కుమారులు) హక్కుదారులని, తల్లి యొక్క ఆస్తికి కుమార్తెలు హక్కుదారులని దాయభాగ ప్రకరణంలో నిర్ణయించారు.

దీనివల్ల తేలిన సారాంశం- కన్యక యొక్క తండ్రి తన శక్త్యనుసారం కొంత ధనంతో కుమార్తెను అత్తవారింటికి పంపవలసిందిగా వివాహమంత్రాల్లో స్పష్టంగా ప్రతిపాదించబడుతోంది. వధువును ఇంటికి తీసుకు వెళ్లేక ప్రవేశ హోమాలు చేయవలసిందని విధించింది. ఆ హోమాల్లో వినియోగించు మంత్రాలు ఇలా వున్నాయి.

ఆగంగోష్ఠం మహిషీగోభిరశ్వైరాయుష్మత్పత్నీ ప్రజయా స్వర్విత్| (ఏ.కాం)

ఇక్కడ హరదత్త భాష్యం: **"మమ గృహమ్ ప్రతి పితృకులలబ్ధైః గోభిః అశ్వైశ్చ ఆగతవతీ"**

పితృకులంనుంచి లబ్ధమైన గో, అశ్వ, సంపదతో నా గృహానికి వచ్చు ఈమె నా భార్య అనబడుతోంది. అలాగే వివాహంలో అగ్ని ప్రదక్షిణలో వినియోగించబడు మంత్రాలు ఇలా ఉన్నాయి.

తుభ్యమగ్రే పర్యవహన్ సూర్యాం వహతు నా సహ| (ఏ.కాం)

మొదలైనవి. "ఓ అగ్నీ! నీ కొరకు దేవతలు పితృకులం నుండి లబ్ధమైన పితృధనంతో సూర్యుని కుమార్తె అయిన సూర్యా అనే కన్యను దేవతలు నీ కోసం ఇచ్చారు" అనడం చేత కుమార్తెను అత్తవారింటికి పంపేటప్పుడు తండ్రి కొంత ధనంతో, కానుకలతో పంపడం అవసరమని తోస్తోంది.

ఈ ప్రకారం తండ్రి లేక సోదరులు లేక జ్ఞాతులు వివాహానంతరం ఆమెను అత్తవారింటికి పంపేటప్పుడు ఇచ్చిన సొమ్ము, వివాహకాలంలో అనగా ఆ సమయంలో బంధుమిత్రాదులు బహుమతిగా చదివించి ఇచ్చిన కానుకలు కేవలం ఆమెకే చెందుతాయని దాయభాగ ప్రకరణంలో నిర్ణయించారు. ఈ విధమైన ధనానికి ఆమె హక్కురాలని తేలింది. ప్రసంగానుప్రసంగంగా పై విషయాన్ని వివరించడమైంది.

ఇక ప్రకృతానికి వస్తే- పురుష సంతానాన్ని తండ్రి ఇంట్లో ఉంచుకుని ఉద్ధరించడం, స్త్రీ సంతానాన్ని వివాహం చేసి తన శక్తి కొలది కానుకలిచ్చి అత్తవారింటికి పంపడం అనే సంప్రదాయానికి శ్రుతి ఉదహరించారు. గాని అసవర్ణ, అసగోత్ర, అసపిండురాలైన వారికి పిల్లను ఇవ్వడమనడానికి కూడా శ్రుతి ప్రమాణం ఉందా? అని శంకించగలరు. దానికి సమాధానం.

పౌండరీకమనే క్రతువు సమూఢం, వ్యూహం అని రెండు విధాలు. ఇంతకుముందు సమూఢపౌండరీకం గురించి చెప్పడమైంది. ఇప్పుడు వ్యూఢపౌండరీకం విశేషాలు చెప్పబడుతున్నాయి. ఇందులో సోమ రసాన్ని గ్రహించే ఐంద్రవాయవం మున్నగు పాత్రలకు సమూఢపౌండరీకంలో గ్రహించిన స్థానాలకు పరస్పర వ్యత్యాసం చెప్పబడుతోంది. అది ఎలా అనగా-

ఐంద్రవాయవస్య వా ఏతదాయతనం యచ్చతుర్థమహః తస్మిన్నాగ్రయణో గృహ్యతే తస్మాదాగ్రయణ స్యాయతనేనవ మేహన్నైంద్రవాయవో గృహ్యతే| (తై.సం)

సంక్షేపంగా దీని అర్థం: ఈ పౌండరీక క్రతువులో నాల్గవరోజు సమూఢపౌండరీకం ప్రకారం ఐంద్రవాయమనే సోమరస పాత్రను గ్రహించవలసి ఉంది. దానినే పై శ్రుతుల్లో **"ఐంద్రవాయవస్యేతి"** అని నాల్గవరోజు ఐంద్రవాయవ పాత్రయొక్క స్థానమని చెప్పి ఆ రోజు, తొమ్మిదవ రోజు గ్రహించవలసిన ఆగ్రయణ పాత్రలోకి సోమరసాన్ని గ్రహించాలని చెప్తోంది. కానీ **"తస్మాదాగ్రయణస్యాయతనే"** అను శ్రుతి సమూడంలో ఆగ్రయణ స్థానమని చెప్పి 9వ రోజున ఇక్కడ చతుర్థ దివసమందు గ్రహించవలసి ఉన్న ఐంద్రవాయవ పాత్రను గ్రహించాలని ఈ ప్రకారం స్థాన వ్యత్యాసం చెప్పబడింది.

ఈ స్థాన వ్యత్యాసం వివాహ సామ్యంతో ప్రశంసించబడింది. అక్కడ ప్రతీక ఇలా ఉంది.

తమిమం ఐన్ద్ర వాయవాగ్రత్వాది రూపం వ్యూఢ ప్రకారం వివాహ సామ్యేన ప్రశంసతి| (సా.భా)

ఛన్దాగ్ స్యన్యోన్యస్య లోకమభ్యధ్యాయన్త తేనైవ దేవావ్యవాహయన్| (తై.సం.)

భాష్యప్రకారం వీటి అర్థం ఏమంటే - లోకంలో కాశ్యప గోత్రోత్పన్నులైన వారు భారద్వాజ గోత్రోత్పన్నురాలైన కన్యకను విచారించి వివాహం చేసుకున్న విధంగా ఈ క్రతువులో ఐన్ద్రవాయవ అగ్రత్వాది సోమరస పాత్రలకు సోమరస గ్రహణ విషయంలో ఇంతకుముందు చెప్పిన ప్రకారం స్థాన వ్యత్యాసాన్ని కల్పించి ఛందోభిమాన దేవతలు ఐన్ద్రవాయవగ్రత్వాదులకు వివాహాన్ని చేయించారు అని ప్రతిపాదించడం ద్వారా **"అసమానార్ష గోత్రజాం అసపిండాం యవీయసీం లక్షణ్యాం స్త్రియముద్వహేత"** అను స్మృతికి ఈ శ్రుతియే మూలమని స్పష్టం.

లోక ప్రసిద్ధమైన వివాహ సామ్యాన్ని తీసుకుని దేవతలు గ్రహాగ్రత్వాదులకు వివాహం చేసినట్లుంది కదా! ఈ శ్రుతి లోకప్రసిద్ధికి కారణమెలా అవుతుందని శంకిస్తారు గాని వేదం లోకంలో ముందు జరిగినదాని వలె దృష్టాంతంగా తీసుకుని ఈ పై చేయవలసిన ధర్మాలను ఉపదేశించగలదు. ఎలాగో చూద్దాం.

యథాఽతిథిం జ్యోతిష్కృత్వా పరివేవేష్టి తాదృగేవతత్|

అను శ్రుతి "అగ్నిహోత్రహోమం యొక్క అగ్ని, చిరిచిరి జ్యోతితో ఉన్నప్పుడు దీపారాధన చేసి అతిథికి ఆతిథ్యమివ్వడం వంటిది" అంది. ఇటువంటి ధర్మాలు వందల, వేల సంఖ్యలో దృష్టాంత విధంగా ధర్మోపదేశాలను వేదం ఉపదేశం చేసింది. కావున అలా శంకించక స్మృతిలో ఉన్న అసగోత్ర వివాహ విధికి ఇదే మూలమని గ్రహించాలి. ఈ చెప్పిన దాంట్లో **"ఐన్ద్ర వాయవం"** ఇత్యాది పారిభాషిక పదాలు, వైదికమైన క్రతువులతో పరిచయమున్న వారికి కానీ అర్థం కావు. కానీ వేదంలో గల ఆ పదాలను ఇంతకన్న తెలుగు చేయడం వీలు పొందనందున అవి తెలిసిన వారిద్వారా వాటిని తెలుసుకోవడానికి ప్రయత్నించవచ్చు. లేదా వాటి విషయం మనకు తెలియకున్నా సారాంశం మాట గ్రహించాలి. లోకంలో గల అసగోత్ర వివాహానికి వేదమే మూలమని అందరికీ తెలియడానికి వీలుపడదు. ప్రాసంగికంగా అనేక విషయాలు ఇందులో ప్రతిపాదింపబడినా అసగోత్ర, అసపిండురాలుని వివాహం చేసుకుని నా ఇంటికి అధిపతురాలుగా రావలెననే అర్థం గల మంత్రం చెప్పి గృహానికి రథాదుల నధిష్ఠింపచేసి, వరుడు తీసుకువెళ్లడం వలన సోమయాగంలో ఆమెయొక్క అనుమతితో సోమదేవతకు ఆతిథ్యమిస్తున్నట్లు, ఆమెను లక్ష్మీస్వరూపంగా వేదం పేర్కొన్నందున ఆమెను ఆభరణాదులనిచ్చి గౌరవించాలని వేదం దృష్టాంత విధంగా మనుస్మృతి వాచకంగాను చెప్పడం మొదలైన అనేక విశేషాలతో స్త్రీలయొక్క విశిష్టత స్పష్టం. ఇక్కడ మరో విషయం కూడా గ్రహించవచ్చును.

లోకంలో కొంతమంది ఆధునికులు "గృహాలనే కారాగారాల్లో ఆభరణాలనే గొలుసుతో స్త్రీని బంధిస్తున్నారని, వాళ్ళు వీధికి వస్తే గాని వాళ్ళకు స్వేచ్ఛ ఉండదని, దేశం ప్రగతి సాధించదని" అంటున్నారు. మహర్షుల అభిప్రాయంలో స్త్రీలు చాలా విలువైన వారని, విలువైన వస్తువులను ఇంటిలో పెట్టి మనం తాళం వేసుకుని జాగ్రత్త పరచుకున్న విధంగా పురుషులకన్నా వారు విలువైన వారనే భావనతో వారిని ఇంట్లో ఉంచి పురుషులు అనేక శ్రమలకోర్చి ధనమార్జించి దాన్ని ఆమె చేతిలో పెట్టి జాగ్రత్తపరచడం వగైరాలను ఆమెకు అప్పచెప్పి ఆమెకు అభీష్టమైన భోజన సౌకర్యాలను కల్పించి గౌరవించమని మహర్షులయొక్క అభిప్రాయం అని గ్రహించాలి.

యథా జాయామానీయ గృహేషు నిషాదయతి తాదృగేవత్| (తై.సం.)

ఈ దృష్టాంతంలో భార్యను ఇంట్లో ఉంచాలని వేదం చెప్పిన విధంగా గ్రహించాలి. అంతే కాదు, **"నయోషా మభ్యేతి పశ్చాత్"** అను శ్రుతి లోకంలో స్త్రీని పురుషుడు వెంబడించినట్లు అను దృష్టాంతంలో "ఉషాదేవిని సూర్యుడు అనుకరించినట్లు" అని చెప్పారు. దీనివల్ల స్త్రీలు వీధిలోకి వెళ్తే పురుషులు వారిని వెంబడించి అపమార్గంలో పెట్టే ప్రయత్నం చేస్తారని తెలుస్తోంది. కనుకనే లోకంలో స్త్రీలకు అత్యాచారం, అమర్యాద జరిగిందని పత్రికల్లో వస్తోంది. కాని పురుషులకు అత్యాచారం జరిగిందని ప్రకటించటం లేదు కదా! దానివల్ల **"స్త్రీషు దుష్టా సువార్ష్ణేయ జాయతే వర్ణ సంకరః"** అను గీతావచన ప్రకారం స్త్రీలు బాధింపబడితే సంతానంలో వర్ణసాంకర్యమేర్పడడం మొదలగు అనేక అనర్థాలు వాటిల్లుతాయని, అనేక అభిప్రాయాల్లో వారికి చాలా విలువిచ్చి ఆభరణాలతో గౌరవించి వారిని భద్రపరచుకుంటే దంపతులు సుఖంగా జీవించడమే గాక, సత్సంతానం ద్వారా భారతీయతను నిలబెట్టిన వారవుతారని వారి ఆశయం. ఇటుపై స్త్రీల ప్రసంగంలో రజస్వలా వ్రత విశేషాలు వివరించబడుతున్నాయి.

రజస్వలావ్రతం - విశేషాలు

వేదాల్లో కర్మలను విధించడమే కాకుండా కర్మ ప్రకరణంలో నిత్య జీవితంలో ఉపయోగించే ముఖ్యమైన ధర్మరూప పురుషార్థ విషయాలు ఎన్నో చెప్పబడ్డాయి. అటువంటి ఒక విషయం రజస్వలా విషయం. దీన్ని ఆచరించరించడం మాటెలా ఉన్నా, దీన్ని గురించి మాట్లాడటం కూడా ఈ రోజుల్లో చాలామందికి నచ్చక పోయినా శాస్త్ర ప్రకారం వచ్చిన ఈ విషయం గురించి, పాటించాల్సిన నియమాల గురించి శాస్త్రంలో ఉన్నది తెలుసుకోవడం ద్వారా శాస్త్రోక్త ధర్మాలను అందరూ పాటించి సన్మార్గంలో నడవడానికి గాను ఆ విశేషాలు ఇందులో వివరించబడుతున్నాయి.

విశ్వరూపోవైత్వాష్ట్రఃపురోహితో దేవానామాసీత్స్వస్త్రీయోఽసురాణాం|

త్వష్ట ప్రజాపతి కుమారుడు, అసురులకు మేనల్లుడు అయిన విశ్వరూపుడు దేవతలకు పురోహితుడు.

త్రిభిః శిరోభిరుపే తత్వాత్ విశ్వరూపః| (భాష్యం)

మూడు శిరస్సులు కలవాడు కనుక విశ్వరూపుడని పేరువచ్చింది.

తస్య త్రీణి శీర్షాణ్యాసన్ సోమపానగ్ం సురాపానమన్నాదనాగ్ం స ప్రత్యక్షం దేవేభ్యో భాగమవదత్పరోక్ష మసురేభ్యః సర్వస్మై వై ప్రత్యక్షం భాగం వదన్తి యస్మా ఏవ పరోక్షం వదన్తి తస్య భాగ ఉదితః|

విశ్వరూపుడు సాత్విక శిరస్సుతో సోమపానం చేసేవాడు. రాజస శిరస్సుతో అన్నం భక్షించేవాడు. తామస శిరస్సుతో సురాపానం చేసేవాడు. అలాంటివాడు లోకంలో ఎక్కడెక్కడ యజ్ఞయాగాదులు జరుగుతుండేవో అక్కడికి వెళ్ళి ప్రజలముందు వారు వినేటట్లుగా యజ్ఞహవిస్సు దేవతలకు ఇవ్వడం యుక్తమని చెబుతుండేవాడు. కానీ, దేవతలకు ఈయబడే హవిస్సుని అసురులకు అందచేయమని రుత్విక్కులతో రహస్యంగా చెప్పేవాడు. క్రమేణా రుత్విక్కులకు ఈ రహస్య సంభాషణలోనే ఎక్కువ విశ్వాసం కలిగింది.

యస్మా ఏవ పరోక్షం వదన్తి తస్య భాగ ఉదితః| (తై.సం.)

పరోక్షంలో చెప్పబడుతున్న వారికే ఈ భాగం ఇవ్వడం యుక్తమని రుత్విక్కులు భావించి ఆ ప్రకారమే అసురులకు ఇవ్వడం ఆరంభించారు.

తస్మాదింద్రోఽబిభేదీదృజ వైరాష్ట్రం విపర్యావర్తయతీతి| (తై.సం.)

ఈ విపరీత ధోరణులను గురించి విన్న ఇంద్రుడు స్వామి ద్రోహం చేస్తున్న విశ్వరూపుడి గురించి ఆందోళన పడసాగాడు.

తస్య వజ్ర మాదాయ ..... సకల వింకః యదన్నాదనగ్ం స తిత్తిరిః| (తై.సం.)

భయపడిన ఇంద్రుడు వజ్రాయుధంతో విశ్వరూపుడి తలలు ఛేదించాడు. సోమపానం చేసే శిరస్సు **"కపింజల"** పక్షిగానూ, సురాపానం చేసే శిరస్సు **"కలవింక"** పక్షిగానూ, అన్నం భక్షించే శిరస్సు **"తిత్తిరి"** పక్షిగానూ మారిపోయాయి. ఈ ప్రకారం విశ్వరూపుడి శిరస్సులు ఖండించడం వలన ఇంద్రుడికి బ్రహ్మ హత్యాపాపం, లోకాపవాదులు కలిగాయని శ్రుతి.

తస్యాంజలినా బ్రహ్మహత్యాముపాగృహ్ణాత్ తాగ్ం సంవత్సమభి భస్తం భూతాన్య భ్యక్రోశన్ బ్రహ్మహన్నితి|

విశ్వరూపుడి హత్యవలన ఏ బ్రహ్మహత్యాపాపం చుట్టుకుందో దానిని అంజలి ఘటించి స్వీకరించాడు.

ప్రాయశ్చిత్తమకృత్వా సంవత్సరం నిరంతరం బ్రహ్మహత్యా మంగీకృత్యైవ తస్థౌ| (భాష్యం)

చేసిన బ్రహ్మహత్యకు ప్రాయశ్చిత్తం చేసుకోకుండా ఇంద్రుడు ఏడాదిపాటు అలాగే ఉండిపోయాడు. ఎందుకంటే ఆత్మతత్వ జ్ఞానికి ఏ విధమైన పాపమూ అంటదు అని శాస్త్రం చెబుతోంది. అయినప్పటికీ సర్వప్రాణులూ ఇంద్రుని **'బ్రహ్మవస్'** (బ్రహ్మహత్య చేసినవాడా!) అని సంబోధించి అన్నివైపుల నుండి ఆశ్రోశించసాగారు. ఈ జనాపవాదం యొక్క పరిహారం కోసం ఇంద్రుడు చేపట్టిన ప్రాయశ్చిత్త విశేషాలను శ్రుతి ప్రతిపాదించింది.

స పృథివీముపాసీద దస్యై బ్రహ్మ హత్యాయై తృతీయం ప్రతి గృహాణేతి సాబ్రవీద్వరం వృణైఖాతాత్పరా భవిష్యన్తీ మన్యేతతో మాపరా భూవమితి పురా సంవత్సరాదపి రోహాదిత్యబ్రవీత్|తస్మాత్పురా సంవత్సరా త్పృథి వ్యైఖాతమపి రోహతి వారేవృతగ్గ్ హ్యస్యై తృతీయం బ్రహ్మహత్యాయై ప్రత్యగృహ్ణోత్త త్స్వకృత మిరిణమభవత్ తస్మాదాహితాగ్నిః శ్రద్ధాదేవః స్వకృత ఇరిణే నావస్యే ద్బ్రహ్మ హత్యాయై హ్యేష వర్ణః|

బ్రహ్మ హత్యను అంజలి బద్ధంగా స్వీకరించి పృథివిని బ్రహ్మహత్యలో తృతీయభాగం స్వీకరించ వలసిందిగా ప్రార్థించాడు. అప్పుడు భూదేవత-

ఖాతాత్పరా భవిష్యన్తీ మన్యే|

భాష్యం: **జనాః స్వేచ్ఛయా తత్ర తత్ర భూమిం ఖనంతి తదుపద్రవా త్పరాభూతాపీడితా భవిష్యామీతి మనసా చింతయామి అతః ఖాతప్రదేశః సంవత్సరమాత్రేణ పాంసు ప్రక్షేపాత్ తృణాద్యుత్పత్తేర్వా అపిరోహాత్ పూరితో భూయాదితి వరః|**

జనులు భూమిని స్వేచ్ఛగా తవ్వేస్తున్నారు ఈ ఉపద్రవం వల్ల నేనెంతో భాధపడుతున్నాను. అందువల్ల తవ్వబడిన ప్రదేశం నింపడానికి ప్రత్యేకమైన ఏర్పాటులేనప్పటికీ ఆ ప్రదేశాల్లో విరివిగా ధనధాన్యాదులు పండడంచేత ఆ ప్రదేశాలు పూడ్చబడును గాక! అని వరం కోరడం జరిగింది.

"తోమా పరాభూవమితి పురా సంవత్సరాదపి రోహాదిత్యబ్రవీత్| తస్మాత్పురా సంవత్సరాత్ పృథివ్యైఖాతమపి రోహతి| అని శ్రుతి.

వారే వృతగ్గ్ హ్యస్యై తృతీయం బ్రహ్మహత్యాయై ప్రత్యగృహ్ణోత్|

ఆ భూదేవత ఇంద్రునిచేత వరం పొందిన తరువాత ఇంద్రుని హత్యలో మూడో భాగం స్వీకరించింది.

తత్స్వకృత మిరిణమభవత్|

అలా స్వీకరించిన మేరకు స్వతస్సిద్ధంగా భూమిలో కొంతభాగం ఊషరక్షేత్రం (చవిటినేల) అయ్యింది.

తస్మాదాహితాగ్నిః శ్రద్ధాదేవః స్వకృత ఇరిణేనా వస్యేత్ బ్రహ్మహత్యాయై హ్యేష వర్ణః|

ఈ చవిటి నేల బ్రహ్మహత్య తాలూకు స్వరూపం అవడంవల్ల ఆహితాగ్ని ఆ క్షేత్రంలో నివసించకూడదు. అంటే, అలాంటి ప్రదేశాల్లో దేవయజన నిర్ణయం చేసి అక్కడ యాగం చేయకూడదు.

ఏకస్య బ్రహ్మహత్యా భాగస్య పరిహారోపాయముక్త్వా అపరస్య తం దర్శయతి ఇతి ప్రతీక (భాష్యం)

ఒక బ్రహ్మహత్యాభాగానికి పరిహారం చెప్పి రెండో భాగానికి పరిహారాన్ని శ్రుతి ఇలా చెప్తోంది.

సవనస్పతీనుపాసీదదస్యై బ్రహ్మహత్యాయై తృతీయం ప్రతిగృహ్ణీతేతి, తేఽబ్రువన్ వరం వృణామహై వృక్షాత్పరా భవిష్యన్తోమన్యా మహేతతో మా పరాభూమేత్యా వ్రశ్చనా ద్వో భూయగ్ం స ఉత్తిష్ఠా నిత్యబ్రవీత్

ఇంద్రుడు బ్రహ్మహత్యా పాపాన్ని తీసుకుని వృక్షాలను సమీపించి ఈ బ్రహ్మహత్యలో మూడో భాగాన్ని తీసుకోవలసిందిగా కోరాడు. అప్పుడు వృక్షాలు ఇలా అన్నాయి. అప్పుడప్పుడు మమ్మల్ని జనులు నరకడంవల్ల పరాభవించబడుతున్నాం. ఆ పరాభవం మాకు ఇకపై లేకుండేటట్లుగా నరికిన ప్రదేశంలో అనేక ఆకులు, కొమ్మలు, పలవలు బయల్దేరేటట్లుగా చేయమని వరం కోరుకున్నాయి. ఆ వరం ఇవ్వడానికి ఇంద్రుడు అంగీకరించడంవల్ల వృక్షచేదన ప్రదేశంనుంచి అనేక శాఖలకు మూలమైన పల్లవాలు బయల్దేరుతున్నాయి.

తస్మాదావ్రశ్చనాత్ వృక్షాణాం భూయాగ్ం స ఉత్తిష్ఠన్తి|

ఆ విధంగా వృక్షాలు బ్రహ్మ హత్యలో మూడో భాగం స్వీకరించాయి. ఆ బ్రహ్మహత్యా భాగమే వృక్షాలను ఛేదించిన ప్రదేశంనుండి **"నిర్యాసము"** అంటే **"ఘనీభవించిన రసం"** అంటే ఇంగువగా బయల్పడుతుంది. అందుచేత ఇంగువ బ్రహ్మహత్యా స్వరూపం అవడం చేత **"తస్మాన్నిర్యాసస్య నాశ్యం బ్రహ్మహత్యాయై హ్యేషవర్ణః"** అని ఆ ఇంగువ తినకూడదని నిషేధించబడింది.

ఈ విధంగా సామాన్యంగా నిషేధం చెప్పి, విశేషాకారంగా ఇలా చెప్పారు.

అథోఖలు య ఏవలోహితో యోవావ్రశ్చనాన్నిర్యేషతి తస్య నాశ్యం కామమన్యస్య|

సర్వోపి నిర్యాసః న నిషిద్ధః నిర్యాసః|

అంటే సామాన్యంగా ఇంగువ మొత్తం నిషిద్ధం కాదు అన్నారు. ఏది ముదురు ఎరుపు రంగులో (లోహిత వర్ణంలో) ఉంటుందో, ఏది చెట్టు నరికిన చోటునుంచి స్రవించిందో అది మాత్రమే నిషిద్ధం. ఇతర నిర్యాస స్వరూపం ఇష్టమైతే తినవచ్చునే తప్ప తిని తీరాలనే నియమం లేదు. తిన్నప్పటికీ దోషం లేదు అని మాత్రం శాస్త్రం చెబుతోంది.

ఇక బ్రహ్మహత్యా పాపంలోని మూడవ భాగం విషయానికి వస్తే-

సస్త్రీషగ్ం సాదముపాసీదదస్యై బ్రహ్మ హత్యాయై తృతీయం ప్రతిగృహ్ణోతేతి| (తై.సం.)

స్త్రియః సమ్యక్ సీదన్తి విశ్రమ్భేణ ఉపవిశన్తి యస్యాం సభాయాః (భాష్యం)

అని చెప్పబడింది. స్త్రీలందరూ స్వేచ్ఛగా కూర్చుని మాట్లాడుకునే సభా విశేషానికి **"స్త్రీ సగ్ం సాదం"** అని పేరు. దీన్ని బట్టి వేదకాలం నాటికే స్త్రీలకు ప్రత్యేక సభలు ఉన్నట్లు తెలుస్తోంది, కానీ అవి నేటి సభల్లా రాజకీయ సభలు కాదు. పురాణాల్లోని విశేషాలను ముచ్చటించుకునే సభలు. ఇంద్రుడు అలాంటి సభ దగ్గరకు బ్రహ్మహత్యలోని మూడో భాగాన్ని తీసుకు వెళ్ళి వారిని అనుగ్రహించమని కోరాడు. అప్పుడు వారు ఇలా అన్నారు.

తా అబ్రువన్ వరం వృణామహై ఋత్వియాత్ప్రజాం విన్దామహై కామమావిజనితో స్సంభవామేతి తస్మా ద్ఋత్వియాత్స్త్రియః ప్రజాం విన్దన్తే| (తై.సం.)

ఋత్వియాత్-ఋతుసంబంధాత్ వీర్యాత్ ప్రథమ సంభోగాదేవ గర్భే జాతేఽపి కామముద్దిశ్య ఆవిజనితోః అప్రసవాత్ పురుషేణ సంగచ్ఛేమహి-గర్భోపద్రవః నిషిద్ధ దినకృత ప్రత్యవాయశ్చ అస్మాకం మా భూదితివరః| (భాష్యం)

ఇంద్రుని ప్రార్థించిన తర్వాత సభలోని స్త్రీలు రుతుసంబంధమైన వీర్యంవలన సంతానం కలిగేటట్లుగా వరం కోరుకున్నారు. దాని ప్రకారం-

చతుర్థీ ప్రభృత్యాషోడశీ ముత్తరాముత్తరాం యుగ్మాం ప్రజా నిశ్రేయ సమృతుగమన ఇత్యుపదిశన్తి|

స్త్రీలకు రజస్వలా స్నానం అయిన రోజునుంచి నాలుగోరోజు లగాయతు పదహారో రోజువరకు గర్భోత్పత్తికి మూలకమైన కాలమని, అందులో 2,4,6 వంటి సరి దినాల్లో అంటే 2 కంటే 4, దానికంటే 6, ఇలాంటి ఉత్తరోత్తర యుగ్మంలోని సంభోగం వల్ల శ్రేయోయుక్తమైన ప్రజోత్పత్తి అవుతుందని చెప్పబడింది. దీనివల్ల గర్భోత్పత్తికి స్నానానంతరం నాలుగో రోజునుండి పదహారో రోజువరకు యోగ్యత కలిగిన రోజులుగా చెప్పినట్లయింది.

గర్భోత్పత్తికి ప్రథమ సంభోగమే కారణమైనప్పటికీ, పురుషుడికి సంభోగేచ్ఛ ఉన్నట్లయితే ప్రసవం అయ్యేవరకు సంయోగ యోగ్యత కలిగి ఉండేటట్లు, ఆ సంయోగం వలన గర్భానికి ఎలాంటి ఉపద్రవం లేకుండా ఉండేటట్లు కొన్ని ధర్మశాస్త్రాలు కొన్ని రోజుల్లో సంగమాన్ని నిషేధించినప్పటికీ దాని ఫలితంగా ఎలాంటి పాపామూ సంక్రమించకుండేటట్లుగా వరం కోరేరు.

ఆ విధంగా ఇంద్రుని వల్ల వరం పొందినవారై నేటికీ స్త్రీలు ఋతుసంబంధమైన దినాల్లో సంధానమై ఉన్న సంగమం వల్లనే ప్రజోత్పత్తి చేయగలవారు అవుతున్నారు. అలాగే ప్రసవ పర్యంతం సంగమానికి అర్హత గలవారయ్యారు.

యథా కామీభవేద్వాపి స్త్రీణాం వరమనుస్మరన్|

అని చెప్పబడింది.

వారే వృతగ్గ్ హ్యేసాం తృతీయం బ్రహ్మహత్యాయై ప్రత్యగృహ్ణాన్ సామలవద్వాసా అభవత్|

స్త్రీలు వరం పొందేక బ్రహ్మహత్య తాలూకు మూడోభాగం గ్రహించారు. బ్రహ్మహత్యయొక్క ఆ మూడో భాగమే రజస్వలా స్త్రీయొక్క రజో రూపమైంది. బ్రహ్మహత్యా స్వరూపాన్నే స్త్రీలు రజస్వలానంతరం కంచుకం ధరించినట్లు ధరించడం వల్ల ఆ మూడు రోజులూ వారితో సంభాషణ చేయకూడదని-

తస్మాన్మలవద్వాసనా న సంవదేత| (తై. సం.)

అను శ్రుతి దర్శపూర్ణమాస ప్రకరణంలో ఉన్నప్పటికీ అది క్రత్వర్థం కాదు, పురుషార్థమే అని మీమాంసా శాస్త్రంలో నిర్వచించబడింది. బ్రహ్మహత్యలో భాగం ధరించి ఉండడంచేత వేదాధ్యయనం చేసేవారు ఆమెతో మాట్లాడడంలో సూత్రకారులు క్రింది నిబంధనను విధించారు.

బ్రహ్మధ్యేష్యమాణో మలవద్వాససేచ్ఛన్ సంభాషితుం బ్రాహ్మణేన సంభాష్య తయా సంభాషేత, సంభాష్యతు బ్రాహ్మణేన సంభాష్య అధీయేత| (భాష్యం)

వేదం చాలా పవిత్రమైనది కనుక వేదవాక్యోచ్చారణ వెంటనే బ్రహ్మహత్యాపాపం స్వీకరించిన రజస్వలా స్త్రీ సంభాషణ సాంగత్యం పనికి రాదని, రజస్వలా స్త్రీతో సంభాషించవలసి వస్తే వేద వాక్యోచ్చారణ ఆపు చేసి ఒక బ్రాహ్మణుడితో సంభాషించి, స్త్రీతో మాట్లాడి తరువాత వేదాధ్యయనం కొనసాగించవచ్చని సూచించబడింది.

ఇంకో ప్రశ్న- రజస్వలాస్త్రీతో సంభాషణ నిషేధం క్రత్వర్థమా? లేక పురుషార్థమా? పైన చెప్పిన విధంగా అది పురుషార్థమే అని సిద్ధాంతీకరించబడింది. తేడా ఏమిటంటే, క్రత్వర్థమే అయితే క్రతువు మధ్యలోనే మాట్లాడకూడదు కాని ఇతర సమయాల్లో మాట్లాడవచ్చును.

వేదంలో వేరొక చోట **"తామరుధ్య యజేత"** అని చెప్పబడింది. ఆమెను యాగశాలకు దూరంగా ఉంచి, యాగం చేయాలని ఉండడంచేత క్రతుమధ్యలో ఆమెతో మాట్లాడే ప్రసక్తే లేదు. కనుక **"ప్రాప్తి పూర్వకో హి నిషేధః"** అను న్యాయంచేత క్రతుమధ్య నిషేధం అవసరం లేదు కనుక ఈ నిషేధం పురుషార్థమని అంటే ఇతర సమయాల్లో కూడా ఆమెతో సంభాషించకూడదు అన్నారు.

న సహసీతనాస్యా అన్నమద్యాత్ బ్రహ్మహత్యాయై హ్యేషావర్ణం ప్రతిమచ్యాస్తే| (తై. సం.)

బ్రహ్మహత్యా పాపాన్ని స్వీకరించి ఉంటారు కనుక ఒకే గదిలో కూర్చోకూడదన్నారు. వేరే చోట కూర్చున్నా కూడా రెండు యుగాల వ్యవధానం ఉండాలని స్మృతి.

యుగం యుగ ద్వయం చాపి త్రియుగంచ చతుర్యుగమ్| చండాల సూతకోదక్య పతితా నామధః క్రమాత్|

ఇక్కడ యుగమంటే బండికాడి అంత పొడవు. అంటే రజస్వలా స్త్రీకి రెండు బండి కాడిల దూరం ఉండాలని అర్థం. ఆమె వండిన అన్నం, ఆమె యజమానురాలిగా ఉన్న, ఆమెచే స్పృశించబడిన అన్నం తినకూడదు అన్నారు.

యాం మలవ ద్వాస సగ్ం సంభవన్తియస్తతో జాయతే సోఽభిశస్తః|

రజస్వలా స్త్రీతో సంయోగం ఎట్టి పరిస్థితుల్లోను పనికిరాదు. అలాంటి సంయోగం వల్ల అభిశస్తుడు అంటే మిథ్యాపవాద యుక్తుడు పుట్టగలడు. కనుక అది సదా నిషిద్ధం.

యా మరణ్యే తస్యైస్తేనః|

అరణ్యంలో సంయోగం వల్ల చోరుడు పుట్టగలడు.

యాం పరాచీం తస్యైహ్రీత ముఖీ| (శ్రుతి)

సభాయామ వాఙ్మాయ వాఙ్మఖం వక్తుమశక్తః హ్రీతముఖ్య ప్రగల్భః| (భాష్యం)

ఉచ్చారణ భీతిచే కానీ, సిగ్గుచే గాని, పరాఙ్మఖురాలైన ఆమెతో సంయోగంవల్ల సభలో ముఖం దించుకుని మాట్లాడేవాడు, అసమర్థుడు పుట్టగలడు.

యాస్నాతి తస్యా అప్సుమారుకః|

రజస్వలా దినాల్లో స్నానం చేస్తే నీటమునిగి మరణించే కొడుకు పుట్టగలడు.

యాఙ్కే తస్యై కాణః|

రజస్వలా దినాల్లో ఆమె కాటుక పెట్టుకుంటే ఒక కన్ను లేని గుడ్డివాడు పుట్టగలడు.

యా దంతో ధావతే తస్యై శ్యావదన్|

ఆమె ధంతధావనం చేసుకుంటే వంకర దంతాలు, పుప్పిపళ్లు కలవాడు పుట్టగలడు.

యా నఖాని నికృన్తతే తస్యై కునఖీ|

గోళ్ళను కత్తిరించుకుంటే పుప్పిగోళ్ళు కలవాడు పుట్టగలడు.

యాకృణస్తి తస్యైక్లీబః|

ఆ రోజుల్లో తృణాదులను చేధిస్తే నపుంసకుడు పుట్టగలడు.

యా రజ్జుగ్ం స్పృజతి తస్యా ఉద్బంధుకః|

తాళ్ళు పేనడం వంటి పనులు చేయడం వల్ల తాడుతో ఉరి వేసుకుని మరణించే స్వభావం కలవాడు పుట్టగలడు.

యా పర్ణే పిబతి తస్యై ఉన్మాదుకః|

ఆమె ఆకుతో నీరు తాగితే ఉన్మాది (పిచ్చివాడు) పుట్టగలడు.

యాఖర్వేణ పిబతి తస్యై ఖర్వః|

పొట్టిదైన పానపాత్రలో గాని, అగ్నిలో కాల్చబడిన మూకుడు (శరావం)తో గాని నీరు తాగితే పొట్టివాడు పుట్టగలడు.

తిస్రో రాత్రీర్వ్రతం చరేత్ అంజలినా వా పిబే దఖర్వేణ వా పాత్రేణ ప్రజాయై గోపీథాయ|

నీరు తాగాలంటే దోసిలితోగాని, పెద్దచెంబుతో గాని తాగాలి. అందుచేతనే ఆడపిల్లను అత్తవారింటికి పంపేటప్పుడు పెద్ద చెంబును కూడా ఇచ్చే సంప్రదాయం ఇప్పటికీ ఉంది.

పైన చెప్పిన విధంగా రజస్వలా స్త్రీ మూడు రోజులు అన్ని నియమాలను **"ప్రజాయైగోపీథాయ"** పుట్టబోయే సంతాన రక్షణ కోసం శ్రద్ధగా పాటించాలని మన శ్రేయస్సు కోరి వేదం చెబుతోంది.

ఇంతటితో శ్రౌతకర్మలకు, స్మార్తకర్మలకు సంబంధించిన మంత్రాల వివరణ పూర్తి అయింది.

*** 7వ ప్రకరణం సమాప్తం***

8వ ప్రకరణం

ఆచార ధర్మాలు

స్మార్తకర్మ నిరూపణనుంచి ఇంతవరకు చెప్పబడినవి సంస్కారాలుగా ఆ యా చెప్పబడిన కాలాల్లో ఆచరించ దగినవి. ఇక గర్భాధాన, జాతకర్మాది సంస్కార సంస్కృతులైనవారు ఆచరించదగిన నిత్యములైన స్నాన, సంధ్యావందనాది షట్కర్మలను నిరూపించవలసి ఉంది. వాటికంటే ముందుగా నిద్రలేచినది లగాయతు రాత్రి పరుండే వరకు ఆచరించదగిన ధర్మాలు నిరూపించబడుతున్నాయి.

ఆచారప్రాప్త ధర్మాలంటే పెద్ద యజ్ఞం కాదు, పౌండరీకమో, అశ్వమేధమో కాదు. తెల్లవారు ఝామున మనం లేచినది లగాయతు రాత్రి పరుండేవరకు మన సంసారకృత్యాలకు అడ్డురాకుండా, వ్యయ ప్రయాసలకు లోను కాకుండా ఆచరించదగిన వాటిని శ్రీగౌతమమహర్షి **"గౌతమ ధర్మసూత్రాలు"** అనే పేరుతో మనకి అందించారు. వాటిని ఆచరించడం వల్ల ఆరోగ్యం వంటి దృష్ట ప్రయోజనము, స్మార్త శ్రౌతాది కర్మలను అనుష్ఠించడానికి కావలసిన అదృష్టరూపమైన యోగ్యత మొదలైనవి రెండూ సిద్ధిస్తాయి.

అథాచారాన్ప్రవక్ష్యామి ఆచారాల్లభతే ధర్మం ఆచారాదేవ సుఖం ఆచారాదేవ మోక్షం ప్రాప్నుయాత్| (గౌ.ధ.సూ.)

ఆచారం వల్లనే ధర్మం, ఆచారం వల్లనే సుఖం, ఆచారం వల్లనే మోక్షం ప్రాప్తిస్తాయి. అటువంటి ఆచారాల్లో **"ఉత్థాయపశ్చిమే"** అని రాత్రియందలి నాల్గవ ఝాములో ఆఖరి యామంలో రెండో భాగంలో అనగా, ఇంచుమించు తెల్లవారు ఝామున 4గంటలకు మనం నిద్ర లేవాలి. ఇలా లేవడం కూడా శాస్త్ర విహితమేనా అంటే, సూర్యోదయ కాలానికి నిద్రిస్తున్నవాని యందు ఆప్యాదేవతలు అవగాహనా జన్యమైన (ధాన్యాన్ని దంచడంవల్ల వచ్చే) పాపాన్ని సంక్రమింప చేస్తారని వేదంలో చెప్పబడింది. దర్శపూర్ణమాస ప్రకరణంలో **"ఆప్యా అమృజత సూర్యాభ్యుదితే"** అనే శ్రుతి ఈ విషయాన్ని ప్రతిపాదిస్తోందని ఇంతకు ముందే తెలుసుకున్నాం.

ఈ విధంగా ఉదయమే లేవాలని గౌతములు చెప్పినట్లే చరకాచార్యులు 'చరక'మనే ఆయుర్వేదశాస్త్ర గ్రంథంలో దినచర్య అధ్యాయంలో కూడా సూర్యోదయాత్పూర్వమే లేవాలని, అలా లేస్తే ఆయుస్సుకి రక్షణ జరుగుతుందని చెప్పారు.

బ్రాహ్మే ముహూర్త ఉత్తిష్ఠేత్, రక్షార్తమాయుషః| (చ.సం.)

తథాపి- వ్యాధ్యాద్యభావ ఏవ ఆయుషః|

రక్షాభవతి అనడంలో ఈ ఆచారంవల్ల ఆయుఃపాలన అవుతుందని, ఆయుస్సును రక్షించుకోవడం అత్యంత ప్రాధాన్య మైనదని, ఇలా ఉదయం లేవడమనే అలవాటు మనలని రక్షిస్తుందని చెప్పినట్లు అయింది.

ఏతి జీవన్తమానన్దో నరం వర్ష శతాదపి, జీవన్భద్రాణి పశ్యతి| (రామాయణం)

మొదలైన వచనాలన్నీ 'జీవించి ఉంటే నూరుసంవత్సరాలకైనా ఆనందాన్ని, అనేక మంగళాల్ని చూడగలం అని' చెప్తున్నాయి. అందుకే వేదంలో కూడా తై.సం.లో అగ్నిష్టోమ ప్రకరణంలో గ్రహాలు అనే పేరుతో పిలవబడుతున్న దారుమయ పాత్రల్లోకి సోమరసాన్ని గ్రహించే సందర్భంలో **"ఆయుర్వా ఏతద్యజ్ఞస్య యద్ధ్రువ ఉత్తమో గ్రహాణాం గృహ్యతే తస్మాదాయుః ప్రాణానాముత్తమమ్"** అను శ్రుతి, చక్షురాది ఇంద్రియాల కంటే ఆయుస్సు చాలా శ్రేష్ఠమైనదని చెప్పింది.

ఏతావతా దీని సారాంశం- అన్నింటికంటే ఆయుస్సు చాలా ప్రధానమైనదని, దాని రక్షణకోసం సూర్యోదయానికి ముందుగానే లేవాలని, ఈ సూచనను గమనించి ఆచరించాలని శ్రుతులు, గౌతమ సూత్రం, ఆయుర్వేదశాస్త్రం కూడా ముక్తకంఠంతో చెప్తున్నాయి.

ధ్యానం

శాంతమనసో వినిద్రస్సతి విరోధే తత్త్యక్త్వానో చేత్తత్ర సంస్థితః సమౌ ప్రాణాపానౌ ధారయేత్|

నిద్ర లేచిన వెంటనే ప్రశాంతమైన మనస్సుతో కూడినవాడై, నిద్ర మత్తు లేనివాడై తాను శయనించిన శయ్య అపవిత్రంగా ఉందని భావిస్తే పవిత్ర ప్రదేశంలో కూర్చుని ప్రాణాయామం చెయ్యాలి. అనగా ప్రాణాఽపానాలను సమంగా ధారణ చెయ్యాలి. అంటే ప్రాణవాయువుని నాసికా రంధ్రాలతో పైకి పీల్చి ధారణ చెయ్యాలని అభిప్రాయం.

"సవ్యాహృతిం సప్రణవాం గాయత్రీం శిరసా సహ త్రిర్జపేదాయత ప్రాణః పాణాయామస్స ఉచ్యతే"

"అథ దివాకరేణ సముత్థాప్య దివాకరేణ ప్రోల్లసితే పద్మేమానసం హంసం సమాశ్రయేత్"

పద్మాలను వికసింప చేసేవాడు సూర్యభగవానుడు. ఇక సూర్యోదయం సమీపిస్తోంది కనుక మన హృదయ పద్మాన్ని కూడా ఆ సూర్యుని అనుగ్రహంచే వికసింపజేసి అందులో మానస హంస స్వరూపంలో ఉన్న పరమాత్మను ధ్యానం చెయ్యాలి. హృదయ పుండరీకంలో పరమాత్మ ఉన్నాడని శ్రుతిలో చెప్పబడింది.

పద్మకోశ ప్రతీకాశగ్ం హృదయం చాప్యధోముఖం అథోనిష్ట్యా వితస్త్యాన్తే నాభ్యా ముపరితిష్ఠతి| జ్వాలామాలా కులం భాతీ విశ్వస్యాయ తనంమహత్| సన్తతగ్ం శిలాభిస్తు లమ్బత్యాకోశ సన్నిభమ్| తస్యాన్తే సుషిరగ్ం సూక్ష్మం తస్మిన్సర్వం ప్రతిష్ఠితమ్| (తై.ఆ.)

నారాయణ స్వరూపం అనంతం, దేశ పరిచ్ఛేద శూన్యం, చిద్రూపమని, సంసార సముద్రాన్ని దాటించు వాడని, మనం అనుభవించు సర్వసుఖాలకు ఉత్పాదకుడుగా గల సుఖస్వరూపుడు పరమాత్మ అని ముందుగా వర్ణించింది. అటువంటి పరమాత్మని ఉపాసించడానికి తగిన స్థానం మన హృదయమేనని, మన హృదయంలోనే అధోముఖంగా ఉన్న పద్మంలో సూక్ష్మ స్వరూపుడుగా ఉన్నాడని పై మంత్రం వర్ణిస్తోంది. లోకంలో పద్మాలకు మధ్యభాగంలో ఉండే ఛిద్రమే (రంధ్రమే) పద్మకోశం. దాంతో సమానమైనదే మన హృదయం. లోకంలో పద్మం ఊర్ధ్వాభిముఖం కాగా (పైకి చూస్తూ ఉండగా) మన హృదయపద్మం అధోముఖంగా ఉందని, ఆ పద్మం మన కంఠానికి దిగువ, నాభికి పై భాగంలో 12 అంగుళాల ప్రదేశంలో ఉందని చెప్తోంది. అక్కడ జ్వాలలయొక్క మాలలతో కూడిన సమస్త బ్రహ్మాండానికి ఆధారభూతమైన పరమాత్మ ప్రకాశిస్తూ ఉన్నాడని వర్ణిస్తోంది, పై మంత్రం.

శతం చైకాచ హృదయస్య నాడ్యః|

అను శ్రుత్యంతరంచే బోధింపబడినట్లుగా నూటఒక్క సూక్ష్మమైన నాడులతో వ్యాప్తమైన హృదయ పద్మం శరీర మధ్యంలో వ్రేలాడుతోంది. దాని సమీపంలో సూక్ష్మమైన సుషుమ్నా అనే నాడి ఉంది. ఆ సుషుమ్నా నాడియందే సమస్త జగత్తు ప్రతిష్ఠితమైంది. అనగా ఆ నాడిలోకి మనస్సు ప్రవేశించడమే బ్రహ్మపదార్థాన్ని తెలుసుకోవడం. ఆ సుషుమ్నా నాడి మధ్యలో మహాప్రౌఢమైన అగ్ని ఉంది. **"విశ్వార్చిః విశ్వతో ముఖః"** అని ఆ అగ్నిరూప పరబ్రహ్మ, అతి బహుళమైన జ్వాలలతో కూడియుండి శరీరమంతటా వ్యాపించి ఉన్న నాడులందు ఇమిడి ఉండి, **'అగ్రభుక్'**గా మనం తినే ఆహారాన్ని భుజిస్తూ, అలా భుజించబడిన ఆహారాన్ని (శక్తిని) శరీరంలోని సర్వ అవయవాలందు ప్రసరింపచేస్తూ ఉంటున్నాడని అర్థం.

అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః| ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్| (భ. గీ.)

అను గీతాశ్లోకంలో పై మంత్రాల్లోని అర్థాన్నే పరమాత్మ వైశ్వానరాగ్ని స్వరూపంతో ప్రాణుల దేహాన్ని ఆశ్రయించినవాడై మనం తిన్న అన్నాన్ని నాలుగు విధాలుగా పచనం (జీర్ణమవటానికి యోగ్యంగా తయారు) చేస్తున్నాడని చెప్తోంది. ఇంతే కాదు, మనం భుజించే ఆహారాన్ని జీర్ణింప చేస్తాడు గానీ తాను మాత్రం జీర్ణించడు. కాబట్టి **"అజరః కవిః"** జీర్ణింపచేయటంలో మంచి కౌసల్యం కలవాడని, శరీరంలో అన్ని భాగాలందు వ్యాపించి ఉండడంతో ఆ అగ్నియొక్క కిరణాలు కూడా సర్వశరీరమందు వ్యాపించి ఉన్నాయని చెప్తోంది.

సంతాపయతి స్వం దేహ మాపాద తలమస్తగః|

ఆ ప్రకారంగా శరీరమంతా వ్యాపించి పాదంనుంచి శిరస్సుదాకా సమస్త శరీరాన్ని తపింపచేస్తున్నాడు అనడానికి మన శరీరం ఎల్లప్పుడూ వేడిగా ఉండడమే చిహ్నమని చెప్పబడుతోంది. ఆ ప్రకారం సర్వ శరీరాన్ని తపింపచేస్తున్న ఆ అగ్నిమధ్యలో ఉన్న అత్యంత సూక్ష్మమైన సుషుమ్నానాడి ద్వారా బ్రహ్మరంధ్ర పర్యంతం ప్రసరిస్తున్న ఒక జ్వాల ఉందని **'తస్య మధ్యే వహ్ని శిఖా'** అనే శ్రుతి చెప్తోంది. ఆ అగ్నిశిఖ సూర్యకిరణాలచే స్వీకరింపబడిన ఉదకంతో పరిపూర్ణమైనందున నీలి రంగుతో కూడిన మేఘం మధ్యలో ప్రకాశిస్తున్న విద్యుత్ రేఖలాగా ఉంటుందిట. ఆ రేఖ కూడా నీవారధాన్యం యొక్క అగ్రభాగం వలె (విత్తకుండా పండే లేత ధాన్యపుగింజ ముచిక వలె) అత్యంత సూక్ష్మమైనదని (ధాన్యపు మొనకంటే కూడా చిన్నగా ఉందని), అణుపదార్థం ఉపమానంగా ఉందని, పచ్చగా ప్రకాశిస్తోందని శ్రుతి చెప్తోంది.

సర్వ జగత్కారణ|

సబ్రహ్మ సశివస్సహరిస్సేన్ద్రస్సోఽక్షరః పరమ స్వరాట్|

అని, నీవార పుష్పంవలె అతి సూక్ష్మమైన అగ్నిజ్వాల మధ్యన పరమాత్మ ఉన్నట్లుగా ఉపాసించాలి. ఆ పరమాత్మే చతుర్ముఖ బ్రహ్మగా, గౌరీపతిగా, లక్ష్మీపతిగా చెప్పబడుతున్నాడు. అతడి నిజస్వరూపం నాశన రహితమైన సచ్చిదానంద స్వరూపము, స్వయంగా ప్రకాశించేది అని చెప్తోంది శ్రుతి.

ఇందులో ఉపాసనా స్థానం అల్పమైనా ఉపాసింపదగిన పరమాత్మ సర్వ వ్యాపకుడు, సర్వ దేవాత్మకుడు. ఈ ప్రకారం పరమాత్మను హృదయ పుండరీకం దగ్గరలో గల సుషిరమందున్న ప్రౌఢాగ్ని జ్వాలలమధ్య సచ్చిదానంద స్వరూపునిగా సర్వదేవాత్మకునిగా ధ్యానం చెయ్యాలని శ్రుతి చెప్పిన అర్థమే **"మానసం హంసం సమాశ్రయేత్"** అను సూత్రానికి అర్థమని తేలింది.

"అంగుష్ఠమాత్రః పురుషోంగుష్ఠం చ సమాశ్రితః" అనే శ్రుతి పరమాత్ముని అంగుష్ఠ స్వరూపునిగా బోధిస్తోంది. అనగా అంగుష్ఠ పరిమితమైన హృదయమనే ఆకాశంలో ఉండడం వల్ల జీవరూపంగా ఉన్న పరమాత్మ అంగుష్ఠ పరిమితుడని (బొటన వేలంత అని) చెప్పబడుతున్నాడు. ఇట్టి వేదవేద్యుడైన, దివ్యజ్యోతి స్వరూపుడైన అంగుష్ఠ పరిమిత పరమాత్మను దివ్యచక్షుస్సు అనగా, జ్ఞానచక్షుస్సుచే అంతర్ముఖ దృష్టి కలవారమై నిర్మల మనస్సుతో చూడాలని అర్థం. ఇలా చేయడమే ధ్యానం.

స్తోత్రపారాయణం

యథాలాభ ముషఃకాలే స్థిత్వా స్తోత్రైరనేకధామత్వా|

పైన చెప్పినట్లుగా ఉషఃకాలంలో ఎంతవరకు ధ్యానం చెయ్యగలమో అంతవరకు చేసి అనేక విధాలైన స్తోత్రాలను పఠించాలి. స్తోత్ర పారాయణవల్ల అత్యంత ఫలమున్నట్లు శ్రుతి బోధిస్తోంది.

నూమర్తోదయతే సవిష్యస్ యః| విష్ణవ ఉరుగాయా యదాశత్ (తై. బ్రా.)

యః సత్య గామినా మనసా యజతే|

'యజ్ఞోవై విష్ణుః' అను శ్రుతి, యజ్ఞాన్ని విష్ణు స్వరూపంగా వర్ణించినందున యజ్ఞస్వరూపుడైన విష్ణుమూర్తికి ఎవడైతే హవిస్సుని ఇస్తున్నాడో, ఎవడైతే పరమేశ్వరార్పణ బుద్ధితో యాగం చేస్తున్నాడో, ఇంతవరకు వేదంచే ప్రతిపాదించబడిన సర్వప్రాణులకు హితకారియైన పరమాత్ముని స్తోత్రాదులచే కీర్తించడమనే పరిచర్య చేస్తున్నవాడో అతడు, తనను మాత్రమే కాక జగత్తును కూడా రక్షించిన వాడవుతాడు. ఆ యజ్ఞాన్ని అనుష్ఠించిన వానికి, పారాయణ చేసిన వానితో సమానంగా ఫలమున్నట్లు పై శ్రుతి బోధిస్తోంది.

ప్రతద్విష్ణుస్తవతే వీర్యాయ| మృగోనభీమః కుచరో గిరిష్ఠాః| యస్యో రుషుత్రిషు విక్రమణేషు| అధిక్షియన్తి భువనాని| విశ్వా| (తై.బ్రా.)

వేదంలో విష్ణుదేవతాక యాగంలో వినియోగింపబడే ఇటువంటి వైష్ణవ మంత్రాలు విష్ణుమూర్తియొక్క మహిమను ప్రతిపాదిస్తున్నాయి.

"ఊర్ధ్వముత్పత్య గిరౌ తిష్ఠతి తద్వత్"- భూమియందు సంచరిస్తున్న భయంకరమైన సింహమనే మృగం పైకి ఎగిరి, పర్వతంమీద కూర్చొన్న విధంగా విష్ణుమూర్తి ముందు వామనుడుగా ఉండి తర్వాత త్రివిక్రమ అవతారాన్ని దాల్చి ఏ విధంగా తన మూడడుగులయందు సమస్త భువనాలను చేరుకున్నాడో అటువంటి విష్ణుమూర్తి స్తుతించబడుతున్నాడు అనడంచే విష్ణుమూర్తియొక్క మహిమ వ్యక్తమైంది.

స్తోత్రపారాయణ చేస్తున్నవాడు కూడా యజ్ఞస్వరూపుడైన విష్ణుమూర్తిని ఉద్దేశించి యాగం చేస్తున్న వానితో సమానంగా ఫలాన్ని పొంది, తనను తాను రక్షించుకుంటూ జగత్తును కూడా రక్షిస్తున్నాడు అనడంచే ఇదంతా ఇంతటి మహిమోపేతుడైన విష్ణుమూర్తి ప్రభావమేనని పై మంత్రం చెప్తోంది.

విచక్రమే పృథివీమేష ఏతాం| క్షేత్రాయ విష్ణుర్మనుషే దశస్యన్| (తై.బ్రా.)

మనుష్యుల నివాసంకోసం భూభాగాన్ని ఈయదలచినవాడై విష్ణుమూర్తి త్రివిక్రమవతారంలో శోభనమైన జన్మ కలిగినవాడై పృథివితో సహా ముల్లోకాలను తన పాదంతో ఆక్రమించి, ఆ విష్ణుమూర్తి విస్తారమైన నివాసస్థానాన్ని కల్పించాడు. ఇటువంటి విశేషణ విశిష్టుని కీర్తన చేసేవారు పరమేశ్వరునిచే సుస్థిరు లవుతున్నారు.

త్రిర్దేవః పృథివీమేష ఏతాం విచక్రమే శతార్చసంమహిత్వా ప్రవిష్ణురస్తు తపసః స్తవీయాన్| త్వేషగ్గ్ హ్యస్యస్థ విరస్యనామ| (తై.బ్రా.)

స్వీయమహిమచే శతవిధ గతియుక్తమైన ముల్లోకాలను మూడు పర్యాయాలు ఆక్రమించి, బలవంతుల కంటే బలం కలవాడై అత్యంత ఉత్కృష్టమైన విష్ణువుయొక్క నామం దీప్తితో (కాంతి) కూడా ప్రసిద్ధమైంది కదా! స్తుతించేవానికి బలసిద్ధికొరకు ఈ విధంగా మంత్ర ప్రతిపాద్యుడైన విష్ణుమూర్తి ఇంతటి ఉత్కృష్టుడుగా స్తుతించబడుతున్నాడు.

భవా మిత్రోన శేవ్యోఘృతా సుతిః| విభూతద్యుమ్న ఏవయా ఉసప్రథాః| అధాతే విష్ణోవిదుషా చిదృధ్యః| స్తోమోయజ్ఞస్య రాధ్యోహ విష్మతః| (తై.బ్రా.)

ఓ విష్ణుమూర్తీ! నీవు మిత్రుని వలె సేవించదగిన వాడవు. అత్యంత ధనయుక్తుడవు. నిన్ను సేవించిన వానిని వైకుంఠ లోకానికి పొందించగలవాడవు (చేరవేయగల వాడవు). ఎంతో కీర్తిమంతుడవు.

యాగాధికారం కలవానిచే యాగంచేతను, యాగానుష్ఠాన అసమర్థునిచే విష్ణుసహస్ర నామాది స్తోత్ర పారాయణలచేతను ఆరాధింపదగిన మహిమ గలవాడవు.

యః పూర్వ్యాయ వేధసే నవీయసే సుమజ్జానయే విష్ణవే దదాశతి యో జాతమస్య మహతో మహిబ్రవాత్| సేదుః శ్రవోభిర్యుజ్యం చిదభ్యసత్| (తై.బ్రా.)

జగతః పూర్వ్యాయ – పూర్వమేవభవాయ|

జగత్తుకంటే ముందుగా ఉన్న, అనగా సనాతనుడు-సదాతనుడు అయినవాడు విష్ణువు అని చెప్తోంది. అంటే, ఎప్పుడూ జనన మరణాలు లేని నిత్యుడుగా ఉన్న రామకృష్ణాది అవతారములచే నిత్యనూతనుడుగా ఉండి, నిత్యసంతోషిణి అయిన లక్ష్మీదేవి భార్యగా యుండి లక్ష్మీపతిగా వ్యవహరించ బడుతున్న విష్ణుమూర్తికొరకు యాగానుష్ఠానం చేసి హవిస్సును ఇస్తున్న వారు కొందరు. యాగానుష్ఠానం చేయ్యలేని అసమర్థుడైనా ఏ యే అవతారాలలో జన్మించెనో ఆ విశేషాలను పురాణేతిహాస రూపకంగా విష్ణుమూర్తి మహిమను తెలుసుకుంటున్నవారు కొందరు. ఈ ఇద్దరూ కూడా యాగంలో హవిర్ధాన మంత్రాలచేత ఎల్లప్పుడూ తనను విడవకుండా ఉంటున్న కామక్రోధాదిరూప శత్రువును నిరసించగలరని (జయించగలరని) ఈ స్మృతి వచనం చెప్తోంది.

త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః కామః క్రోధస్తథాలోభః తస్మాదేతత్త్రయం త్యజేత్| (స్మృతి)

తముస్తోతారః పూర్వం యథావిధ ఋతస్య| గర్భగ్ం హవిషాపి వర్తన| అస్య జానన్తో నామ చిద్వి విక్తన| బృహత్తే విష్ణో సుమతిం భజామహే| (తై. బ్రా)

ఓ స్తోత్రకర్తలారా! సనాతనుడైన విష్ణుమూర్తిని వేదప్రతిపాద్యునిగా గుర్తించండి. యాగానుష్ఠాన సమర్థులు యాగాన్ని విష్ణుస్వరూపంగా భావించి విధ్యుక్త (శాస్త్రంలో చెప్పబడిన) ప్రకారం ఆ యా మంత్రాలతో హవిస్సుని ఇచ్చి ఆ విష్ణుమూర్తిని ఆరాధించండి. దానికి అసమర్థులైనవారు విష్ణుమూర్తి యొక్క కేశవ నారాయణాది నామాల వ్యుత్పత్త్యర్థ విశేషాలను ఆచార్యునిద్వారా తెలుసుకున్నవారై ఆ నామాల మహిమను లోకానికి ప్రకటించండి.

ఓ విష్ణుమూర్తీ! నీ అనుగ్రహం మాయందు ప్రసరింపు గాక! అని నిరంతరం నిన్నూ, నీ అనుగ్రహాత్మక బుద్ధిని భజిస్తున్నాము, సేవిస్తున్నాము. మరో సందర్భంలో పశుప్రకరణంలో మంత్రాలు కూడా విష్ణుమూర్తియొక్క మహిమను చాటుతున్నాయి.

తేతే ధామాన్యుశ్మ సీగమధ్యేగావో యత్ర భూరి శృంగా అయాసః|

అత్రాహ తదురుగాయస్య విష్ణోః పరమం పదమవభాతి భూరేః| (తై.సం 1-3-6)

తేతే ధామన్యుశ్మ సీత్యవటే అవదధాతి విష్ణోః కర్మాణి పశ్యతేతి కల్పః| (క. సూ)

ద్వాభ్యామాహవనీయే నాగ్నిష్ఠాగ్ం సంమినోతి-ఇత్యాపస్తమ్భః| (ఆ.శ్రౌ.సూ.)

పశుయాగంలో పై రెండు మంత్రాలతోను యూపమందు గల అగ్నిష్ఠ అను (పలక=ఆశ్రి) చిహ్నం అగ్నికి అభిముఖంగా ఉండేలా యూపస్తంభాన్ని పాతాలి.

మంత్రార్థం:- శ్రుత్యుక్త ప్రకారం పశుయాగంలో వినియోగింపబడే యూపస్తంభం విష్ణుదేవతాకం కనుక యూపాభిమాని అయిన ఓ విష్ణుదేవతా! మహాత్ములచే గొప్పవానిగా కీర్తింపబడుతున్న, ప్రకాశిస్తున్న నీ ఉన్నత స్థానం పొందదలచిన మేము అపాయం లేనివారమై బహుదీప్తితో కూడుకున్నవారమై నిన్ను పొందే

కోరికతో కూడి ఉన్నాము. అనగా ఎవరిని పొందాక ఇంక పొందదగినది మిగిలి ఉండదో అట్టి నిన్ను పొందుటకు ఇచ్ఛతో కూడి ఉన్నాము, అని అర్థం.

విష్ణోః కర్మాణి పశ్యత యతో వ్రతాని పస్పశే| ఇన్ద్రస్య యుజ్యస్సఖా| (తై. సం.)

ఓ జనులారా! ఏ కర్మలచేత విష్ణుమూర్తి మీ లౌకిక వైదిక కర్మలను సృజించెనో ఆ విష్ణుమూర్తి స్థితి, లయాత్మక కర్మలను వేదశాస్త్రాల ద్వారా గుర్తించండి. మరియు ఇంద్రునికి యోగ్యమైన సఖుడు అని కూడా గుర్తించండి.

తద్విష్ణోః పరమం పదగ్ం సదాపశ్యన్తి సూరయః| దివీవ చక్షు రాతతమ్|

ఓ విష్ణూ! నిరావరణ, అనగా ఆకాశం ప్రసరించిన చక్షుస్సువలె సర్వత్రా వ్యాపించి ఉన్న నీ స్వరూపాన్ని వేదాంతశాస్త్ర పారంగతులైనవారు మాత్రమే తెలుసుకోగలరు అని చెప్పడంతో విష్ణుమూర్తియొక్క మహిమ, స్వరూపదర్శనం సామాన్యులకు అంత సులభంగా చిక్కదని చెప్తోంది. ఈ విధమైన విష్ణుమూర్తిని ధ్యానించవలసిందిగా విష్ణు పురాణ, భాగవతాదుల్లో కూడా చెప్పబడింది.

ప్రసన్న వదనం చారుపద్మపత్ర నిభేక్షణమ్| సుఫాలం సువిస్తీర్ణ లలాట ఫలకోజ్జ్వలమ్ వరదభయ హస్తం చ ముద్రికా రత్నభూషితమ్| చిన్తయేత్తన్మయో యోగీ సమాధాయాత్మ మానసమ్ వ్రజతస్తిష్ఠతో యద్వా స్వేచ్ఛయా కర్మ కుర్వతః| తతశ్శంఖ గదా చక్ర శార్ఙ్గాది సహితం బుధః చిన్తయేద్భగవద్రూపం ప్రశాన్తం సాక్షి సూత్రకమ్| (వి.పు.)

ప్రసన్నవదనం గల, సుందరమైన పద్మపత్రాలతో సమానమైన చూపులు గల, చక్కని గండ స్థలములు గల, బాగా విస్తీర్ణమైన లలాటఫలకంతో ప్రకాశిస్తున్న విష్ణుమూర్తిని, ఇతర విషయాల నుండి మన మనస్సును మళ్ళించి ధ్యానం చేయాలి. మహావిష్ణువును ధ్యానించడంలో మరో ప్రమాణం-

తత్సర్వవ్యాపకం చిత్తమాకృష్య ఏకత్ర ధారయేత్| నాన్యాని చిన్తయే ద్భూయస్సుస్మితం భావయేన్ముఖమ్| (భాగవతం)

సర్వవ్యాపకమైన మన చిత్తాన్ని ఇతర విషయాలనుంచి మళ్ళించి చిరునవ్వుతో గూడిన పరమేశ్వరుని యొక్క ముఖాన్ని మాత్రమే భావన చేయాలి.

ధ్యానించకపోతే వచ్చే దోషం

భాగవతంలోనే మరో శ్లోకం ఇలా చెప్తోంది-

జిహ్వాన వక్తి భగవద్గుణ నామ ధేయం చేతశ్చనస్మరతి తచ్చరణారవిందం| కృష్ణాయ నో నమతి యచ్ఛిర ఏకదాపి తానానయ ధ్వమసతోఽకృత విష్ణుకృత్యాన్| (భాగవతం)

భగవంతుని గుణనామాలను జిహ్వాచే ఉచ్చరించని వానిని, పరమేశ్వర చరణారవిందాన్ని మనసా స్మరించని వానిని, ఒకప్పుడైనా కృష్ణుని తలంచని వానిని యమలోకానికి పొందించమని యమధర్మరాజు యమదూతలను ఆజ్ఞాపించాడట. దీనివల్ల భగవంతుని మనసా స్మరించడం, జిహ్వాతో ఆయన నామాలను ఉచ్చరించడం అత్యంత ఆవశ్యకమని తేలింది. ఇట్లే విష్ణు సహస్రనామ ఫలశ్రుతి -

య ఇదం శృణుయాన్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్ నాఽశుభం ప్రాప్నుయాత్ కించిత్ సోముత్రే హ చ మానవః| (వి.స.)

పరమేశ్వరుని నామాలను వినే, కీర్తించే పురుషుడు ఈ లోకమందు, పరలోకమందు ఎన్నడూ అశుభాన్ని పొందడని చెప్పబడింది.

దీనివలన తేలిన సారాంశమేమనగా- తెల్లవారుఝామున లేచి, నిద్ర విడిచిన వాడై, ప్రశాంతమైన మనస్సుతో, పవిత్రమైన ఆసనంమీద కూర్చుని ప్రాణాయామాన్ని చేసి హృదయకమల వాసి అయిన పరమాత్మను ధ్యానించి స్తోత్రం చేయాలని ఆచారసూత్రం చెప్పిన విషయాన్నే పై మంత్రాలు, శ్లోకాలు ధ్రువపరుస్తున్నాయని చెప్పడానికి ఇంతవరకు వైష్ణవ మంత్రాలను, పురాణ వచనాలను ఉదహరించి వివరించడమైంది.

స్తోత్రానంతర కార్యం

సోపానత్కో బహిర్యాయాత్ నజలాశయం విజనమస్థి విణ్మూత్ర కీటకాదికమ్ నాక్రామన్ రథ్యాయా దూరతో గత్వా

అని, స్తోత్రమైన తర్వాత పాదరక్షలు తొడుక్కుని బహిర్దేశానికి వెళ్లమని చెప్పారు. ఈ రోజుల్లో పట్నాల్లో బయ్యాటకు వెళ్ళడమనే ఈ అలవాటు, అవసరం తగ్గుతున్నా అలా వెళ్లమనడంలో సొంతానికి, ఇతరులకి కూడా ఎటువంటి ఇబ్బంది లేని విధంగా, వేదం చెప్పబడిన విధానాన్ని గమనించాలి! గ్రామానికి దూరంగా నడిచి వెళ్లాలని, మార్గమధ్యంలో మూత్రపురీషాదులు ఎముకలు మొదలైన వాటిని తొక్కకుండా వెళ్లాలని బోధించారు.

ఆయజ్ఞాంగైః స్తృణైశ్ఛన్నే భూతలే మలం విసృజేత్|

మూత్రపురీషాలు, యజ్ఞాలకు ఉపయోగించే దర్భలు వంటివి లేని చోట, యజ్ఞాంగాలు కాని సామాన్య తృణాలతో ఆచ్ఛాదితమైన భూమియందు విడవాలని చెప్పారు. అంతే కాదు, **"సరః పర్వతాశ్చ సస్యక్షేత్ర భూగర్తేషు నోత్సృజేన్మలమూత్రే"** అని చెప్పడంచే సరస్సులందు, పర్వతాలందు, రాళ్ళయందు, పంటలతో కూడిన క్షేత్రాలందు, భూమియొక్క గోతులలోకి మూత్ర పూరీషాలను విడవకూడదని చెప్పారు. కారణమేమనగా, **"కేశవస్యార్యా భూదేవీ జగద్ధాత్రీ వసుంధరా విశ్వంభరా యస్మాత్తామాచ్ఛాద్యమలం త్యజేత్"** అని భూదేవి విష్ణుమూర్తికి భార్యయని, సమస్త జగత్తుకు తల్లియని, సమస్త ప్రపంచాన్ని భరిస్తోందని అందుచే అట్టి భూమాతను గౌరవించాలి కనుక యజ్ఞార్హత లేని తృణాదులచే ఆచ్ఛాదన చేయబడిన భూమియందు మాత్రమే విడవాలని స్పష్టంగా చెప్పారు. ఇందులో యజ్ఞాలు, దైవస్వరూప భూమాతవంటి వాటితోబాటు ప్రకృతి-ప్రజల సమన్వయాన్ని పరిరక్షించడానికి, మన కర్మలతో వేరే ఎవ్వరికీ ఏ విధమైన అసౌకర్యమూ, అనారోగ్యమూ కలుగచేయ కూడదని శాస్త్రం ఎంత లోతుగా ఆనాడే ఆలోచించి చెప్పిందో గమనించవలసిన విషయం. ఈ రోజుల్లో మనం వేరే విధమైన సాధనాలను సౌకర్యాలను మూత్రపురీషాలు విడవడానికి ఏర్పాటు చేసుకుని ఉండవచ్చు కానీ వాటి వ్యర్థ పదార్థాల విడుదలకి కూడా ఇవే సూత్రాలు, నియమాలూ వర్తిస్తాయని గ్రహించాలి!

దంత ధావనం

దంతధావనమే గదా అని మన ఇష్టం వచ్చినట్లు చేయకూడదు. దానికి కూడా కొన్ని నియమాలు చెప్పింది వేదం. మూత్రపురీషాలు వదలడం లాగే ఇది కూడా ఈ రోజుల్లో చాలా మారిపోయింది కదా! ఇవన్నీ అవసరమా అనుకుంటే మన ఆరోగ్యం గురించి ఎంత శ్రద్ధతో వేదం మనకి బోధించిందో తెలుసుకోవడమైనా అవసరం.

అవ్యగ్రః ప్రాఙ్ముఖో దన్తధావనం కుర్యాత్ సార్ధం దన్తకాష్ఠం సమఛిన్నం సత్వక్పర్వకం కషాయం తిక్తం కటుకం కంటకాన్వితం సుగంధం వృక్షగుల్మ క్షీరిణోవా భక్షయేత్| దంతధావనం కీటకాద్య దూషితం శుచి వితస్తిమాత్రం కకుభాశోక జంబ్వామ్రకపిత్థవ కుళోధ్భవం గృహేమేధినామతిముక్త మాపామార్గం ప్రశస్తమ్| తాల హింతాల ఖర్జూర కేతకీవట, బర్బుర నారికేలాః సప్తైతే తృణరాజకాః ప్రమాదాదపి కదాచిదపి వికలాదిరపి నాచరేత్|

(స్మృతి)

ఏమీ వ్యగ్రత (ఆందోళన) లేకుండా తూర్పుముఖంగా తిరిగి పచ్చిదిగా ఉన్న బెరడుతో, పర్వాలతో (కణుపులతో) కూడిన, సమంగా ఛేదించబడి, రుచి విషయంలో చేదుగా కటువుగా ఉన్నటువంటి, ముళ్లతో గూడిన వృక్షం తాలూకు (గరుకుగా ఉండే) లేదా పాలు కారుతున్న అనగా నేపాళానికి సంబంధించిన కాష్ఠంతో దంతధావనం చెయ్యాలిట. ఆ దంతపుపుల్ల శుద్ధంగా పరిమాణంచే 12 అంగుళాలు కలదిగా ఉన్నదాన్ని వాడాలి. ఈ ప్రకారం అశోకవృక్షం, మామిడి, నేరేడు వంటి వాటి పుల్లల్ని వాడమని చెప్పింది. **"గృహమేధినామతిముక్త మపామార్గం ప్రశస్తమ్"** అని గృహస్థునికి ఉత్తరేణి శ్రేష్ఠమని చెప్పింది.

ఇప్పటికీ రుషిపంచమీ వ్రతం మొదలైన వాటిలో ప్రాయశ్చిత్తానికి ఉత్తరేణి పుల్లలు వాడుతూ ఉండడం సంప్రదాయంలో ఉంది. ప్రాచీన కాలంలో ఉత్తరేణి దొరకడం సులభమై ఉండవచ్చును అందువల్ల సూత్రకారులు ఆ ప్రకారం వర్ణించేరేమో అనవచ్చును. కానీ వేదంలో కూడా చాలా చోట్ల ఉత్తరేణి ప్రాశస్త్యం వర్ణింపబడింది.

ఇన్ద్రో వృత్రగ్ం హత్వా| అసురాన్ పరాన్పరాభావ్య| నముచిమాసురం నాలభత| (తై. బ్రా.)

ఒకసారి ఇంద్రుడు వృత్రాసురుని సంహరించి రాక్షసులందర్నీ పరాభవించినా అందులో 'నముచి' అనే రాక్షసుణ్ణి హత్య చేయడానికి కానీ పరాభవించడానికి కానీ శక్యం కాలేదుట. అంతట ఆ నముచిని శక్తితో, బలాత్కారంగా పట్టుకొని బంధించారుట. తర్వాత వారిద్దరూ యుద్ధం చేయగా నముచి ఇంద్రుని కంటే బలవత్తరమైన వాడై, దుర్బలమైన, యుద్ధసంకటంతో కూడిన ఇంద్రుని చూసి ఇలా అన్నాడుట–

సోఽబ్రవీత్ సంధాగ్ం సందధావహై|

ఓ ఇంద్రా! మనిద్దరం సంధి చేసుకుందాం! దానికి నువ్వు అంగీకరిస్తే నేను నిన్ను విడిచిపెడతాను, అని! కానీ రాజీమార్గమేమి అంటే **"నామా శుష్కేణ, నార్ద్రేణ హనః న దివా న నక్తమితి"** అని నన్ను ఎండిన సాధనంతో గానీ, తడి సాధనంతో గానీ, పగటి భాగంలో గానీ రాత్రి భాగంలో గానీ హత్య చేయడానికి వీల్లేదు. అలా అయితే నన్ను విడిచిపెడతాను అన్నాట్ట. అంటే లోకంలో ఏ సాధనమైనా పొడీ కాకుండా తడీ కాకుండా ఉండదని, కాలంలో పగలు, రాత్రి కానీ కాలం కూడా ఉండదు కనుక ఇక ఎన్నడూ తనకు ఇంద్రుడి వలన హత్య తటస్థించదని నముచి అభిప్రాయం.

ఇంద్రశ్చతం సమయమంగీకృత్య తేన మోచితః|

ఇంద్రుడు ఆ ప్రతిజ్ఞను అంగీకరించి ఆ నముచిచే విడవబడ్డాడు.

ధైర్యేణ స్వస్థో భూత్వా సమయానుసారేణ తం నముచిం హన్తుం| స ఏతా మపాం ఫేనమసించత్|

ఆ ఇంద్రుడు ఉదకాల నురగను వజ్రాయుధంగా చేసి సూర్యోదయాత్పూర్వం సంధ్యాసమయంలో నముచి మీద ప్రయోగించాడుట. ఇలా చేస్తే ప్రతిజ్ఞాభంగం అవుతుందని శంకించనక్కరలేదు ఎందుకంటే, **"న వా ఏష శుష్కో నార్ద్రో వ్యుష్టాసీత్, అనుదిత సూర్యః నవా ఏతద్దివానక్తమ్"** అని ఆ ఉదకాల నురగ ఎండింది కాదు. దాన్ని స్పృశిస్తే కారిన్యం కానరావడం లేదు. తడిదీ కాదు, దానివల్ల వస్త్రాలు తడవడం లేదు.

సమయం చూస్తే ఉదయానికి పూర్వకాలం కనుక అంధకారం లేనందున రాత్రీ కాదు. సూర్యోదయం కాలేదు కనుక పగలూ కాదు. ఈ ప్రకారం సంధికాలంలో నముచి శిరస్సుని ఉదకాల నురగతో ఛేదించాడు, ఇంద్రుడు.

తస్యై తస్మిన్ లోకే అపాంఫేనేన శిర ఉదవర్తయత్| తదేన మనవర్తత| మిత్రధ్రుగితి| స ఏతానపామార్గా నజనయత్| తానజుహోత్| తైర్వై సరక్షాగ్ స్యపాహత| (తై. బ్రా.)

ఇంతటితో అవలేదు. అలా చేధించబడిన శిరస్సు ఇంద్రునితో 'ఓ మిత్రద్రోహీ!' అని సంబోధించి అతడ్ని వెంబడించగా, దాన్ని నివారింపచేయడానికి లోక ప్రసిద్ధమైన ఉత్తరేణి వృక్షాలను జనింపచేసి వాటి కాష్ఠాలతో హోమం చేసి చివరకు ఆ హోమంతో నముచి శిరస్సుతో బాటు సర్వ రాక్షసులను హతమార్చాడు ఇంద్రుడు.

యదపామార్గ హోమో భవతి రక్షసామ పహత్యై| (తై. బ్రా.)

రక్షసాం నివారణాయ అపామార్గ హోమం కుర్యాదితి విధత్తే| (సా.బ్రా.)

రాక్షసుల నివారణ కోసం ఉత్తరేణి కాష్ఠాలతో హోమం విధించబడింది. ఈ ప్రకారం ఉత్తరేణి కాష్ఠాలు శ్రేష్ఠమైనవి కనుకనే దంత ధావనానికి కూడా అత్యంత ప్రశస్తమైనవనే అభిప్రాయంతో గృహస్థులకి ఉత్తరేణి మంచిదని గౌతములు చెప్పారు. కనుక రాక్షసుల వలనే మనల్ని బాధిస్తున్న దంత మాలిన్యాన్ని ఉత్తరేణి కాష్ఠాలతో తొలగిస్తే ఆ మాలిన్యం తొలగడంతోబాటు ఆరోగ్యం కూడా సిద్ధిస్తుందని శాస్త్రం చెప్పినట్లు గమనించాలి. లౌకికంగా ఆలోచించినా రాత్రిభాగంలో కూడా ఇంద్రియాలనుండి బయల్పడిన మలినం సూర్యోదయం అయ్యాక ఘనీభవం చెందుతుంది (గట్టిపడిపోతుంది). అందుకని అంతకు ముందే ఆ మలినాల్ని విడిచిపెట్టడం మంచిదని దృష్ట ప్రయోజనంగా కూడా కొందరు వర్ణించారు. కనీసం అటువంటి ప్రత్యక్ష ప్రయోజనం కోసం అయినా సూర్యోదయానికి ముందుగా దంతధావనం చేయాలని తాత్పర్యం. ఈ ప్రకారం ఈ క్రియలు దృష్టప్రయోజనాలు కలవైనా శాస్త్ర ప్రకారం చేయడమనే నియమానికి అదృష్టం ప్రయోజనమని చెప్పడం శాస్త్ర మర్యాద.

ఈ ప్రకారం లేచిన వెంటనే దైవస్మరణ, ప్రాణాయామ ధ్యానాదుల తర్వాత కాలకృత్యాలు తీర్చుకుని స్నానానికి సిద్ధం కావాలి. ఆ పైన స్నానం. ఈ స్నానం ఎన్ని రకాలు? దాని ప్రయోజనమేమి? తదితర వివరాలు తెలుసుకుందాం.

ఆయుర్వేదంలో స్నానం

సామాన్యంగా దినచర్య ప్రకరణంలో ఆయుర్వేద శాస్త్రంలో స్నానం గురించి ఇలా చెప్పబడింది-

దీపనం కృష్య మాయుష్యం స్నానమూర్జాబలప్రదమ్ కణ్ణూమల స్వేదతన్ద్రాతృట్ దాహపాప్మజిత్| (చ.సం.)

స్నానం వల్ల శరీరానికి దీప్తి, బలం చేకూరడం, ఆయుష్యాభివృద్ధి, కండూమల స్వేదాదులు (ఒంటిమీది మైల, చెమట వగైరాలు) హరించడం స్నానానికి ప్రయోజనం.

వస్త్రధారణం

స్నానశీలస్య సురభిః సువేషోనుల్బణోజ్జ్వలః ధారయేత్ సతతం రత్నం సిద్ధమన్త్రమనౌషధీః| (చ. సం.)

దర్పం వ్యక్తం కాని విధంగా, ఉజ్వలమైన, తన స్థితిని అనుసరించి వస్త్రాన్ని, రత్నాన్ని, క్రూర జంతువులు మన కపకారం చేయకుండా ఉండడానికి చెప్పబడిన కొన్ని ఓషధుల్ని ధరించాలి అని ఆయుర్వేద శాస్త్రం చెప్తోంది. ధర్మశాస్త్ర ప్రకారం చూస్తే శరీరగత మలినాల్ని పోగొట్టుకోవడం దృష్ట ప్రయోజనం

కాగా, వైదిక కర్మానుష్ఠాన యోగ్యత పొందడం రెండవ, అదృష్ట ప్రయోజనం. ఇలా అదృష్ట ప్రయోజనం ఉండడం వల్లనే శాస్త్రకారులు నిత్యం చేయవలసిన షట్కర్మల్లో స్నానాన్ని కూడా మొదటగా విధించారు.

సంధ్యా స్నానం జపోహోమో దేవతానాం చ పూజనమ్ ఆతిథ్యం వైశ్వదేవం చ షట్కర్మాణి దినే దినే|(స్మృతి)

సుఖార్థస్సర్వ భూతానాం మతాస్సర్వాః ప్రవృత్తయః|సుఖం చ న వినా ధర్మాత్త స్మాద్ధర్మ పరోభలేత్| (స్మృతి)

సర్వభూతాలకు సుఖాకారణాలయిన ధర్మాలను ఆచరించాలి. ధర్మం లేకుండా ఎన్నడూ సుఖం (శాశ్వతమైన సుఖం) లభించదు కనుక ఎల్లప్పుడూ ధర్మపరుడు కావాలి.

ఇత్యాచారస్సమాసేన యం ప్రాప్నోతి సమాచరన్ ఆయురారోగ్యమైశ్వర్యం యశోలోకాంశ్చ శాశ్వతాన్|

ఈ విధంగా పరంపరగా లభించిన శిష్టాచారాన్ని అవలంబించేవారు ఆయురారోగ్య ఐశ్వర్యాదుల్ని, శాశ్వతమైన పుణ్యలోకాల్ని పొందగలరు.

దినచర్యలో అనుసరించదగినవి

వ్యాధి శోకార్తాననువర్తేత యథా సామర్థ్యమనుకూలం గచ్ఛేత్| (చ.సం.)

దరిద్రులను, వ్యాధి పీడుతులను, ధుఃఖార్తులను మన సామర్థ్యానుసారంగా ఆదుకోవాలి. **"ఆత్మవత్సతం పశ్యేత్"**-సర్వభూతాలను తనతో సమానంగా చూసుకోవాలి. **"అర్చయేద్దేవ గో విప్ర వృద్ధ వైద్య నృపాతిథీన్"**- దేవతలను, గోవులను, విప్రులను, వృద్ధులను, వైద్యులను, మన అధిపతులను, అతిథులను ప్రతిదినం అర్చించాలి.

విముఖార్థినః కుర్యాత్| నావమన్యేత నాక్షిపేత్|

యాచకులను విముఖులుగా (ఒట్టి చేతుల్తో) పంపకూడదు. ఆక్షేపించకూడదు. అవమాన పరచకూడదు.

ఉపకార ప్రధాన స్యాదపకారఽపరేష్వరౌ|

అపకారం చేయు శత్రువులకి కూడా ఉపకారం చేయాలి.

న పీడయే దిన్ద్రియాణి నా చైతాన్యతి లాలయేత్|

వాక్, చక్షు, శ్రోత్రాది ఇంద్రియాలను ఎక్కువగా పీడించ కూడదు, అంటే మరీ ఎక్కువగా అసలు విశ్రాంతి లేకుండా వాడడం కూడదని. తగనివి మాట్లాడడం, చూడకూడనివి చూడడం, వినకూడనివి వినడం వంటి వాటికి ఇంద్రియాలని వినియోగించ కూడదని అర్థం. అదే విధంగా ఇంద్రియాలను ఎక్కువగా లాలన కూడా చెయ్యకూడదు.

త్రివర్గ శూన్యం నారంభం భజేత్తం చావిరోధయన్|

ధర్మార్థ కామాలనే మూడు పురుషార్థాలకు చెందని వాటిని ఆరంభించకూడదు. ఆరంభించిన వాటిని కూడా పరస్పర విరోధం లేకుండా ఉండేలా జాగ్రత్తగా సేవించాలి.

దినచర్యలో వర్జింప తగినవి

హింసాస్తేయం అన్యధాకామం పైశున్యం పరుషానృతే సంభిన్నాలాప వ్యాపారం అబధ్యాదృగ్వి పర్యయమ్|

ప్రాణి హింస, దొంగతనం, శాస్త్రవిరుద్ధమైన కామం, పిశునత్వం అనగా పరుషంగా మాట్లాడడం, అసత్యాన్ని మాట్లాడడం, అసంబద్ధ ప్రలాపం, ప్రాణుల్ని వధించే వ్యాపారం, పరగుణాదులను సహించలేకపోవడం, శాస్త్రాలు చెప్పినదానికి విపరీతంగా సంచరించడం, నాస్తికత్వం, **'నాస్తికో వేద నిందకః'** (మనువు) అన్నారు కనుక వేదాల ప్రామాణ్యాన్ని అంగీకరించకపోవడం, హింస మొదలైన దశవిధ పాపాలను మనో వాక్కాయాలచే విడిచి పెట్టాలి.

కామః క్రోధస్తథా లోభస్తస్మా దేతత్త్రయం త్యజేత్|

సర్వదా మనల్ని వెంబడిస్తున్న కామ, క్రోధ, లోభాలను వదిలిపెట్టాలి.

షట్కర్మ నిరూపణ

సంధ్యాస్నానం అని ఉండడంతో సంధ్యావందనం అయ్యాక స్నానం చెయ్యాలా అని శంక కలుగవచ్చు. మీమాంసా న్యాయప్రకారంగా **'పాఠక్రమాదర్థక్రమో బలీయాన్'** అని, పాఠక్రమం కంటే అర్థక్రమం బలవత్తర మైనదని నిర్ణయించడంచే ముందుగా స్నానం చేసాక సంధ్యావందనం చేయమని అభిప్రాయం.

స్నానస్య శుద్ధి హేతుత్వాత్| శుద్ధస్యైవ సంధ్యావందనాది కారిత్వాత్| (ప.మా.)

స్నానం శుద్ధికోసం కనుక శుద్ధునకే సంధ్యావంద నాధికారం ఉండడం వల్ల, స్నానం చేయనిదే ఏ కర్మనూ చేయకూడదు అనేది స్పష్టం.

అస్నాతోనాచరేత్కర్మ జపహోమాది కించన| స్నాత్వాధికారీస్యాత్ దైవే పిత్ర్యేచ కర్మణి| (స్మృతి)

అత్యంత మలినః కాయః నవచ్ఛిద్ర సమన్వితః| స్రవత్యేవ దివానక్తం ప్రాతస్నానం విశోధనమ్|

అత్యంత మలినంతో కూడుకున్నది, నవరంధ్రాలతో కూడినది ఈ శరీరం. **'నవ వై పురుషే ప్రాణాః'** అని శ్రుతి. రెండు చక్షుర్గోళకాలు (కళ్ళు), రెండు చెవులు, రెండు నాసికా రంధ్రాలు (ముక్కు), భుజించడానికి సాధనమైన ముఖభాగం, మూత్రపురీషాలు వదిలే రెండు రంధ్రాలు మొత్తం తొమ్మిది రంధ్రాలు. వీటన్నిటినుంచి మలం స్రవిస్తుంది కనుక ఆ మాలిన్యాన్ని తొలగించుకోవడం కోసం స్నానం ఆవశ్యకం. ఈ స్నానం ముఖ్యం, గౌణం అని రెండు విధాలు.

స్నానంతు ద్వివిధం ప్రోక్తం గౌణముఖ్య ప్రభేదతః తయోస్తు వారుణం ముఖ్యం తత్పునః షడ్విధం భవేత్|
(శం.లి.స్మృ.)

ముఖ్య స్నానమంటే జలనిమజ్జనం చేయడం. నదీ తటాకాదులందు శరీరాన్నంతా ఒకేసారి జల నిమజ్జనం చేయడం ముఖ్య స్నానం. ఇందులో కూడా వారుణ స్నానమనే ముఖ్యస్నానం మళ్ళీ ఆరు విధాలుగా చెప్పబడింది.

నిత్యం నైమిత్తికం కామ్యం క్రియాంగం మలకర్షణం క్రియాస్నానం తథా షష్ఠం షోఢాస్నానం ప్రకీర్తితం| (శం.లి.స్మృ.)

1)నిత్యం 2)నైమిత్తికం 3)కామ్యం 4)క్రియాంగం, (ఏదైనా క్రియలో భాగంగా చేసే స్నానం) 5)మలకర్షణం (మాలిన్యాన్ని వదిలించుకోవడానికి చేసుకునేది) 6)క్రియాస్నానం అని స్నానం ఆరు విధాలు, స్నానం చేయడానికి జప హోమాదులందు అధికారం లేదు కనుక ఆ అధికారాన్ని సంపాదింపచేసేది నిత్యస్నానం. వీటి లక్షణాలు ఇలా చెప్పబడ్డాయి.

"అస్నాతస్తుపుమాన్నార్హః జపాగ్నిహవనాదిషు| ప్రాతఃస్నానం తదర్థంతు నిత్యస్నానం ప్రకీర్తితమ్ చండాల సవయూపాంశ్చ స్పృష్ట్వా స్నాతాం రజస్వలాం| స్నానార్హస్తు యదాస్నాతి స్నానం నైమిత్తికం హి తత్|

పుణ్యస్నానాదికం యత్తు దైవజ్ఞ విధిబోధితం| తద్ధికామ్యం సముద్దిష్టం సకామ స్తత్ప్రయోజయేత్ ..... పవిత్రాణి ఆర్చిష్యన్ దేవతాః పితుంశ్చాస్ స్నానం సమచర్యేతౌ యస్తు క్రియాంగం తత్ప్రకీర్తితమ్ మలాకర్షణం స్నానం స్నానమభ్యంగ పూర్వకమ్ మలాపకర్షణార్థాయ ప్రవృత్తిస్తస్య కీర్తితా| సరస్సు దేవఖాతేషు తదర్ధేషు నదీషు చ| క్రియాస్నానం సముద్దిష్టం స్నానం తత్రమతా క్రియేతి" (ప.మా.)

పై ఆరు స్నాన లక్షణాలు ఈ విధంగా చెప్పబడ్డాయి.

1. చండాల, శవ, రజస్వలాది స్పర్శ నిమిత్తం చేయబడే స్నానం నైమిత్తికం

2. ఆయా పర్వాల్లో స్నానం చేస్తే ఫలం కాగలదని విధించడంచే దాని ప్రకారం చేయబడిన స్నానం కామ్యస్నానం

3. జపకాముడై దేవపిత్రాద్యర్చన చేయదలచినవాడై చేసే స్నానం క్రియాంగ స్నానం

4. శరీరానికి పట్టిన మాలిన్యాన్ని వదిలించుకోవడానికి అభ్యంగన పూర్వకంగా చేసే స్నానం మలాపకర్షణ స్నానం

5. దేవఖాతాలైన సరస్సులందు అనగా తిరుమలలో పుష్కరిణీ సరస్సు, తిరుపతిలో కపిలతీర్థం వంటి వాటియందు, గౌతమీ, కృష్ణవేణి, కావేరి, తుంగభద్ర, గంగ మొదలగు పుణ్య నదులయందు, వాటిల్లో కూడా తీర్థాలని చెప్పబడు ప్రసిద్ధ నదులందు స్నానం చేయడం క్రియాస్నానం

6.తీర్థాల్లో చేసే స్నానం తీర్థస్నానం.

ఈ తీర్థస్నానం గురించి వేదంలో చాలా విశేషంగా చెప్పబడింది.

అంగిరసస్సువర్గం లోకం యంతోప్పుదీక్షాతపసీ ప్రావేశయస్ అప్పుస్నాతి సాక్షాదేవదీక్షా తపసీ అవరుంధే| తీర్థేస్నాతి తీర్థే హి తే తాం ప్రావేశయస్ తీర్థేస్నాతి తీర్థమేవ సమానానాం భవతి| (తై.సం.)

ఒకానొక కాలంలో అంగీరసులు యాగాన్ని అనుష్ఠించి స్వర్గలోకానికి వెళ్ళదలచినవారై యాగానికి సంబంధించిన దీక్షాతపస్సులనే నియమవిశేషాలను, అనగా దీక్షా తపఃఫల విశేషాన్ని తీర్థాలనే ఉదకాలందు ఉంచారు. అందుచే తీర్థాల ఉదకాలందు స్నానం చేసినవాడు సాక్షాత్తు దీక్షా తపస్సులను స్వాధీనం చేసుకున్నవాడు అవుతాడు. ఆ ఉదకాల్లో కూడా అంగిరసులు దీక్షా తపస్సులను ప్రవేశపెట్టిన తీర్థాలని చెప్పబడే నదులందు విశేషంగా స్నానం చేయాలి.

తీర్థంలో స్నానం చేసిన వాడు సమాజంలో ఒక పుణ్యాత్ముడుగా, శ్రేష్ఠమైనవాడుగా పరిగణింప బడతాడని చెప్పబడింది. లోకంలో కూడా తీర్థయాత్రలు చేసిన వారిని పుణ్యాత్ములుగా భావించి వారిని అందరూ పుణ్యాత్ములని దర్శించడం, ప్రశంసించడం, నమస్కరించడం సార్వజనీనమే కదా! ఈ విధంగా వారుణ స్నానమనే ముఖ్యస్నానంలో గల ఆరు రకాలనూ వర్ణించి ఇక రెండవదైన గౌణస్నాన ప్రకార భేదాలు వర్ణింపబడుతున్నాయి.

జలావగాహో వారుణం భస్మనాగ్నేయం గోరజసావాయవ్యం ఆపోహిష్ఠాధిభిర్మంత్రైః బ్రాహ్మం స్నానం, నాభేరధః ప్రక్షాళన మూర్ధ్వం చార్ద్రవాససా శరీర సమ్మార్జనం కాపిలమ్ అద్వయానంద చిత్స్వరూప విష్ణు చింతనం మానసమ్| యత్వాతపవర్షే తద్దివ్యం స్నానమ్ (గౌ.సూ.)

నీటితో పూర్తి శరీరాన్ని తడపడం ముఖ్యస్నానమని, వారుణస్నానమని చెప్పాక గౌణస్నానం కూడా ఆరు విధాలని వివరింపబడింది. 1.భస్మధారణం చేయడం-ఆగ్నేయస్నానం 2.గోధూళిని (గోపరాగాన్ని)

శరీరమందు చల్లుకోవడం-వాయవ్యస్నానం 3.అపోహిష్ఠాది మంత్రాలచే మార్జన చేసుకోవడం-బ్రాహ్మస్నానం 4.నాభికి దిగువన గల శరీరభాగాన్ని ఉదకంతో క్షాళన చేసి ఊర్ధ్వ భాగాన్ని ఆర్ద్రవస్త్రంతో (తడి బట్టతో) తుడుచుకోవడం-కాపిలస్నానం 5.అద్వైత స్వరూపమైన ఆనంద స్వరూపమైన చిద్రూపమైన పరమాత్మను మనసా స్మరించడం- మానస స్నానం 6.ఆతపంతో కూడిన వర్షంతో తడవడం- దివ్యస్నానం అని ఆరు విధాలుగా చెప్పబడింది.

ఈ స్నానాలకి శరీరగత మాలిన్య అపనోదనం (పోగొట్టుకోవడం), కంటికి కనబడే దృష్ట ప్రయోజనం గాను, కర్మానుష్ఠాన యోగ్యతను ఇచ్చేది అదృష్ట ప్రయోజనం గాను చెప్పబడింది. ఈ రెండు విధాలైన శక్తులూ కూడా ఉదకాల్లో ఉన్నట్లు వేదంలో దర్శపూర్ణమాస, అగ్నిష్టోమ ప్రకరణంలో ఉత్పవన బ్రాహ్మణమందు ఇలా పేర్కొనబడింది-

ఇంద్రో వృత్రమహన్| సోపః| అభ్యమ్రియత తాసాం యన్మేధ్యం యజ్ఞియగ్ం స దేవమాసీత్| తదపోదక్రామత్| తే దర్భా అభవన్| (తై.బ్రా.)

ఈ ఉపాఖ్యానంలో దర్భల ఉత్పత్తిని వర్ణిస్తూ దర్భలు చాలా పవిత్రమైనవని చెప్పబడింది. **మంత్రార్థం-** ఇంద్రునిచే హత్య చేయబడిన వృత్రాసురుడు ఉదకాలకు అభిముఖంగా మృతుడవడం వల్ల ఉదక సారం బయటకు వచ్చింది. ఆ సారం దైవ మానుష భేదాలతో రెండు విధాలుగా ఉంది. అందులో మలాపకర్షణ కోసం చేసేది (మాలిన్యాన్ని పోగొట్టుకోవడం కోసం చేసేది) మానుషం. స్నాన మాత్రంచే పాపాపనోదకం (పాపాల్ని పోగొట్టుకోవడం), ప్రోక్షణంచే పదార్థాలను శుద్ధి చేయడం దైవాంశం అని రెండు విధాలు. ఈ రెండు అంశాలు **"తాసాం యన్మేధ్యం యజ్ఞియగ్ం సదేవమాసీత్"** అని మేధ్య, యజ్ఞియ శబ్దాలచే చెప్పబడుతున్నాయి.

'సదేవం' అంటే దేవప్రియమని అర్థం. అటువంటి సారం భూమియందు ఉదకాలనుండి బయల్పడి దర్భల రూపంలో ఆవిర్భవించింది. అందుకే **'పవిత్రం వై దర్భాః'** అని శ్రుతి చెప్తోంది. ఉదకాలందలి పవిత్రాంశమే దర్భలుగా ఉత్పన్న మవడం వల్ల యజ్ఞార్హతను కలిగించడానికి ఆజ్యాదులను ఆ దర్భలచే ఉత్పవనం చేస్తారు అనగా పవిత్రింప చేస్తారు.

దీనివల్ల తేలింది దైవమానుష భేదంచే ఉదకాలందు పావకమైన శక్తి ద్వయం ఉందనే సారాంశం. అందుకే స్నానం చేసిన వానికి అందులో ఉన్న శక్తి సంక్రమించడంతో మాలిన్యాపకరణం జరుగుతుంది. దైవశక్తిచే యాగానుష్ఠాన యోగ్యత కూడా కలుగుతుంది. ఆరుణకేతుక చయనమనే ప్రకరణంలో అభీష్టకలను అనగా ఉదకాలను చిన్నపిడతల్లో పోసి ఇష్టకలుగా ఉపధానం చేయాలనే సందర్భంలో-

చతుష్టయ్య ఆపోగృహ్ణాతి| చత్వారివా అపాగ్ం రూపాణి| మేఘో విద్యుత్ స్తనయిత్ను ర్వృష్టిః| తాన్యేవావరుంధే| (తై.ఆ.)

ఉపధానం కోసం నాలుగు విధాలైన ఉదకాలు గ్రహించతగినవి. ఉదక భేదాలకు నాలుగు కారణాలు- మేఘం, విద్యుత్తు, గర్జనం, వృష్టి అనేవి. వీటివల్ల వచ్చిన ఆ జలవిశేషాలు ఇలా ఉన్నాయి.

ఆతపతి వర్ష్యాగృహ్ణాతి| తాః పురస్తాదుపదధాతి| ఏ తావై బ్రహ్మ వర్చస్యా ఆపః| ముఖత ఏవ బ్రహ్మవర్చసమవరుంధే| తస్మాన్ముఖతో బ్రహ్మవర్చసితరః| (తై.ఆ.)

ఆతపంతో కూడిన దేశంలో వర్షించిన ఉదకాలు బ్రహ్మవర్చస స్వరూపాలు. వాటిని అగ్నికి తూర్పుదిక్కులో ఉపధానం చేయటంలో ముఖంలో బ్రహ్మవర్చస్సు ప్రకాశిస్తూ ఉంటుంది. అందుకే వేదపాఠకుల ముఖం బ్రహ్మవర్చస్సుతో ప్రకాశిస్తూ ఉంటుందిట. రెండో జల విశేషం-

కూప్యాగృహ్ణాతి| తాదక్షిణత ఉపదధాతి| ఏ తావై తేజస్వినీరావః| తేజ ఏ వాస్య దక్షిణతో దధాతి| తస్మాద్దక్షిణోర్ధస్తే జస్వితరః| (తై.ఆ.)

కూపోదకాలకు (నూతుల్లో/బావుల్లో నీటికి) కూప్యాలని పేరు. అవి అనేక కృత్యాలందు ఉపయోగ పడతాయి. కనుక తేజస్వినులని చెప్పబడుతున్నాయి. అగ్నికి దక్షిణ భాగంలో ఉపధానం చేయడంచే లోకంలో శరీరంలోని దక్షిణభాగం శక్తియుక్తంగా ఉంటోంది. పూజా కార్యాదులందు దక్షిణహస్తానికి తేజస్విత్వమనే గుణం వస్తుంది. మూడో జల విశేషం-

స్థావరా గృహ్ణాతి| తాః పశ్చాదుపదధాతి| ప్రతిష్ఠితావై స్థావరాః| పశ్చాదేవ ప్రతిష్ఠతి| (తై.ఆ.)

నదుల్లో కొన్నిచోట్ల అగాధాలుంటాయి. అటువంటి చోట్ల ఉదకాలు ప్రవాహం లేనివై స్థిరంగా ఉంటాయి. అటువంటి ఉదకాలను అగ్నికి పశ్చిమ భాగంలో ఉపధానం చేయడంచే లోకంలో ప్రతిపురుషుడు స్వకీయమైన వాటికి ముందుగా స్థిరత్వాన్ని ఏర్పరుచుకుని తను స్థిర స్వభావం కలవాడవుతాడు. నాలుగో జలవిశేషం-

వహన్తీర్గృహ్ణాతి| తా ఉత్తరత ఉపదధాతి| ఓజసా వా ఏతా వహన్తీ రివోద్గతీరివ ఆకూజతీరివ ధావన్తీః| ఓజ ఏవాస్యోత్తరతో దధాతి| తస్మాదుత్తరోఽర్ధ ఓజస్వితరః| (తై.ఆ.)

నదీ ప్రవాహ ఉదకాలు ఓజోగుణం కలవి కనుకనే తమ సామర్థ్యంచే ప్రవాహం మధ్యలో పడిన కర్రలు, దుంగలు మొదలైన వాటిని ఆకర్షిస్తున్నాయి. మధ్యమధ్యలో పాషాణాదులందు తగులుకొని పైకి వెళ్తున్నట్లు, ఎగుడు దిగుడుల్లో శబ్దం చేస్తున్నట్లు ఉంటున్నాయి. అటువంటి ఓజోగుణం కలిగిన ప్రవాహాన్ని అగ్నికి ఉత్తరం వైపున ఉపధానం చేయడంచే వామహస్తానికి పాదప్రక్షాళనాది కార్యాలను నిర్వహించే సామర్థ్యం కలుగుతుంది. ప్రారంభంలో **"చతుష్టయ్య ఆపో గృహ్ణాతి"** అని ఉదకగతమైన చతుస్సంఖ్య చెప్పబడినా అది ఉపలక్షణం అవడంతో ఆరు ఉదకాలుగా గ్రహించాలి. అయిదో జల విశేషం-

సంభార్యా గృహ్ణాతి| తామధ్య ఉపదధాతి| ఇయంవై సంభార్యాః| అస్యామేవ ప్రతితిష్ఠతి| (తై.ఆ.)

కడవలతో (బిందెలతో) తేబడి మన ఇళ్ళలో నిలవ చేయబడు ఉదకాలు సంభార్యాలు అనబడతాయి. ఈ ఉదకాలు భూమివలె, కడవల్లో నిశ్చలంగా ఉండేవి అవడంతో అటువంటి ఉదకాలను నాలుగు దిక్కులకి ఉపధానం చేయాలని, దాని సామర్థ్యంచే లోకంలో ప్రాణి భూమియందే ప్రతిష్ఠత మవుతోందని చెప్పారు. ఆరవ జల విశేషం-

పల్వల్యా గృహ్ణాతి| తా ఉపరిష్టాదుపాదధాతి| అసౌ వైపల్వల్యాః| అముష్యామేవ ప్రతితిష్ఠతి| (తై.ఆ.)

ఎల్లప్పుడూ జలం శోషించకుండా ద్రవమాత్రంగానైనా అనువర్తించేవి పల్వలాలు. అనగా నదులు ఎండినప్పుడు ఇసుక తెన్నుల్లోను, కాలువలు కట్టేసినప్పుడు ఆ కాలవల్లో ఇదివరకు నీరు ప్రవహించి ఉండడంతో కొంత గోతులుగా తీసినా ఊటనీరుగా కాలవలో లభిస్తుంది. అలా తీసిన గోతుల్ని పల్వములు అంటారు. వాటిగుండా అవసరమైనప్పుడల్లా నీరు పట్టుకుంటారు. కాబట్టి అవి సామాన్యంగా ఎండిపోవు. అటువంటి పల్వలాలను మనవాళ్లు చలములంటారు. ఆ పల్వలాలలో నీటిని అంతకుముందు ఉపధానం చేయబడిన ఇష్టకలకు పైన ఉపధానం చేయడంచే పల్వలోదకాలు కూపాదులవలె ఖననం (తవ్వడం) అపేక్షించకుండా భూమిపైన ఉండేవి. అందువల్ల వాటి ఉపధాన విశేషంచే ద్యులోకం కూడా భూమిపైన ఉంది కనుక ఆ ద్యులోకంలో ప్రతిష్ఠిత మవుతుందని చెప్తోంది.

ఏతావతా ఇంతవరకు చెప్పిన దాని అభిప్రాయమేమిటని విచారిస్తే అరుణకేతక చయన ప్రకరణంలో చేయబడిన వీటి ప్రసంగంద్వారా మనం గ్రహించదగినది ఏమనగా పైన వివరించబడిన వివిధ జలవిశేషాదులందు బ్రహ్మ వర్చస్సు, తేజస్సు, ఓజస్సు మొదలైన గుణ విశేషాలుండడంతో వాటిలో స్నానం చేస్తే ఆ యా గుణాలు మనకు సంక్రమిస్తాయని చెప్పడం వేదానికి తాత్పర్యమని గ్రహించాలి!

అయితే వారుణస్నానం ముఖ్యస్నానమని, ఆగ్నేయాది భస్మస్నానం మొదలైనవి గౌణస్నానాలని, వివిధ జలవిశేషాలు చెప్పబడ్డాయి కదా అన్నీ అన్ని సమయాల్లోనూ సమాన యోగ్యత కలవేనా అను శంక కలుగుతుందని గౌతమ మహర్షి వివరించారు.

శరీరస్య అసామర్థ్యాత్ దేశాకాలయోః వైషమ్యాత్ స్నానాన్యేతాని తుల్యాని|

అనగా శరీరం రోగపీడితమై సామర్థ్యం లేనప్పుడు, ఎక్కడో ప్రయాణాదుల్లో మార్గమధ్యంలో ఉండిపోవడం వంటి అవాంతరాలు ఏర్పడినప్పుడు భస్మ ధారణ, గో పరాగాన్ని శిరస్సునందు ధరించడం వంటి గౌణ స్నానాలు చేయవలసిన సాధారణ స్థితిలో పూర్తి జలంతో తడిసే వారుణ స్నానమే చెయ్యాలని తాత్పర్యం. సామర్థ్యానుసారంగా అన్ని స్నానాలు సమానాలని చెప్పబడుతున్నా అందులో **'శ్రేష్ఠం మానసముచ్యతే'** అని మనసారా పరమాత్మను చింతించడమనే మానసస్నానం చాలా ఉత్తమమైనదని చెప్పబడుతోంది.

వీటిలో అవస్థా విశేషం ఇలా చెప్పబడింది.

భేషజాసక్తే సరుజిరాజ చోరాద్యుపద్రవే|

మందును సేవించే అనారోగ్యం వచ్చినపుడు, రాజచోరాద్యుపద్రవాలు తటస్థించినపుడు తనకు అందుబాటులో ఉన్న భస్మస్నానాదుల్ని ఆశ్రయించాలి. 104 డిగ్రీల జ్వరం వచ్చినవానిని నదికి వెళ్ళి స్నానం చేయమని శాస్త్రం ఎప్పుడూ చెప్పదు. సామర్థ్యం కలవాడు నదికి వెళ్ళి స్నానం చేసిన ఫలాన్నే అసమర్థుడు భస్మధారణ చేసిన మాత్రాన్నే పొందుతాడని అభిప్రాయం. ఇక ఆరు రకాలైన ఉదకాల్లో ఎక్కడ స్నానం చేయడం శ్రేష్ఠమని తాత్పర్యమని శంకిస్తే- ప్రవహించే నదుల్లో స్నానం మొదటి పక్షం. సూర్యోదయానికి ముందు ప్రవాహోదకాల్లో ప్రవాహాభిముఖంగా స్నానం చేస్తే దానిలో బలదాయక శక్తులున్నాయని ఆధునిక విజ్ఞానవాదులు కూడా చెప్తున్న విషయం అనాదికాల ప్రవృత్తమైన వేదంలోనే చెప్పబడింది.

దేవాపై యజ్ఞమాగ్నీధ్రేవ్య భ్యజంత తతో యదత్యశిష్యత తదబ్రువన్| వసతునున ఇదమితి తద్వసతీవరీణాః వశతీ వరిత్వం| (తై.సం.6-4-2)

అగ్నిష్టోమమనే యజ్ఞంలో అయిదో రోజుకు సుత్యాహస్సు అని పేరు. ఆ రోజు సోమాన్ని దంచి ఆ రసంతో సోమయాగం చెయ్యాలి. దానికోసం ముందురోజున అనగా అగ్నిష్టోమీయ హవిస్సు అనే పశుయాగం అయిన తర్వాత ప్రవాహోదకాలదగ్గరికి వెళ్ళి వసతీవరుల్ని తీసుకు రావాలి. వసతీవరులనగా ఏమిటనగా ఒకానొకప్పుడు దేవతలు యజ్ఞాన్ని అనగా యజ్ఞీయ భాగాలను ఆగ్నేధ్రమను పేరుగల శాలలో విభజించుకున్నారు. ఈ భాగం నీది, ఈ భాగం నాదీ అని విభజించగా కొంతభాగం మిగిలిందిట. దానిని గురించి ఇలా పలికారు.

వసతునున ఇదమితి విభాగం కర్తుం అశక్యః యః భాగః సః తథైవ విభాగమకృత్వా సమష్టిరూపేణ వసతు ఇత్యబ్రువన్| (భాష్యం)

విభాగం చేయడానికి శక్యంకాని ఆ భాగం సర్వులకు సమానహక్కుతో ఆ ప్రకారంగానే ఉండుగాక అని పరస్పరం అనుకుని "**తస్మిన్ ప్రాతర్నిసమశక్నువన తడప్పుప్రావేశయన్ తా వశతీవరీ రభవన్**" (తై. సూ. 6-4-2).

ఆ భాగాన్ని ఎవరూ తీసుకోవడానికి అంగీకరించకపోవడంచే ఉదకాలందు 'వసతు' అని ప్రవేశ పెట్టారు. 'వసతు' అనడంచే ఉదకాలకు 'వసతీవరులనే' పేరు వచ్చింది.

వసతీవరీర్గృహ్ణాతి యజ్ఞోవై వసతీర్వరీర్యజ్ఞ మేవారభ్య గృహీత్వో పవసతి|

యజ్ఞంయొక్క అంశమే ఉదకాలందు ఉండడంచే వసతీవరులనే ఉదకాలు యజ్ఞస్వరూపాలని, ఆ ఉదకాలను గ్రహించి యజ్ఞవేదికవద్దకు తీసుకువస్తే యజ్ఞాన్ని ఆరంభించినట్లు అవుతుంది. ఈ ఉదకాలను గ్రహించకుండా సూర్యుడు అస్తమిస్తే యజ్ఞం 'ఆరంభించని' వాడవుతాడు, అది ఆరంభించకపోతే యజ్ఞానికి విచ్ఛేదం కలుగుతుంది.

'యజ్ఞస్య సంతత్యై' అని చాలా చోట్ల యజ్ఞానికి సాంతత్యాన్ని (వరసగా జరగడం అనేది) సంపాదించాలని శ్రుతి చెప్తోంది. సకాలంలో గ్రహించి యజ్ఞసాంతత్యాన్ని కాపాడాలి. ఒకానొకప్పుడు యజ్ఞానుష్ఠానం అనగా వసతీవరీగ్రహణం సూర్యాస్తమయానికి ముందుగా పూర్తి కాకపోతే ఆ దోష నివారణకి ఉపాయం ఏమంటే, వేదం ఈ ప్రకారంగా చెప్పింది.

జ్యోతిష్యావా గృహ్ణీయాత్| హిరణ్యం వావధాయ సశుక్రాణామేవ గృహ్ణాతి| (తై.సం.6-4.)

"ఆగ్నేయగ్ం హిరణ్యం" అనే శ్రుతి చెప్పినట్లు నీళ్ళలో అగ్నిదీప్తిని చూపించి గాని, అగ్ని స్వరూపమైన హిరణ్యాన్ని నీళ్ళలో ఉంచి కానీ వసతీవరులను గ్రహించాలి. లేదా, **"యోవా బ్రాహ్మణో బహుయాజీ తస్య కుంభ్యానాజ్గృహ్ణీయాత్"** అని, అనేక కర్మలను అనుష్ఠించిన వాని ఇంట్లోని నీటిని గ్రహించాలి. ఆ ప్రకారం గ్రహించినా ఆ ఉదకాలకు వసతీ వరులనే పేరు ఉండడానికి కారణమేమనగా **"స హి గృహ్ణీత వసతీ వరీకః"** అనడంచే ఇదివరలో అతను సూర్యుడుండగా వసతీవరులను గ్రహించినవాడే కనుక వాని ఇంట్లోని ఉదకాలు వసతీవరులని వేదం చెప్తోంది.

అగ్నిదీప్తిని చూపించి లేదా అగ్నిస్వరూపమైన హిరణ్యాన్నుంచి గానీ ఉదకాలను గ్రహిస్తే సూర్యుడు ఉండగా గ్రహించినట్లు ఎలా అవుతుందని శంకిస్తే వేదమే మరోచోట సమాధానం చెప్పింది. **"అగ్నిం వా వాదిత్యస్సాయం ప్రవిశతి"** అని చెప్పడంతో సాయంకాలం అస్తమించిన సూర్యుడు అగ్నిలో ప్రవేశిస్తాడని అందుచేత ఆ ప్రకారం చేస్తే సూర్యుడుండగా గ్రహించినట్లే అవుతుందని చెప్తోంది. ఇంకా వసతీవరులను గ్రహిస్తే వసతీవరుల భేదములుగా చెప్పబడిన పశువులను గ్రహించి వాటితో యజ్ఞారంభం చేసినవాడవుతాడని **"పశవో వైవసతీరీః పశూనే వారభ్యగృహీత్వోపవసతి"** అనే శ్రుతి చెప్తోంది.

వసతీవరులను గ్రహించినప్పుడు ప్రవాహానికి ఎదురుగా ఉండి గ్రహించాలి గానీ నీరు ఏ దిక్కుకి ప్రవహిస్తోందో గ్రహీత కూడా ఆ దిక్కుకే తిరిగి గ్రహిస్తే పశువులు నిర్గమన సమార్థాలవుతాయని ఈ శ్రుతి చెప్తోంది.

యదన్వీపం తిష్ఠన్ గృహ్ణీయాత్ నిర్మార్గుకా అస్మాత్పశవస్యుః|

ప్రవాహాభిముఖంగా తిరిగి గ్రహిస్తే పశువులు ఇతడినుంచి నిర్గమించకుండా స్వాధీనం చేసుకున్న వాడవుతాడు అని **"ప్రతీపంతిష్ఠఙ్గృహ్ణాతి ప్రతిరుధ్యైవా స్మై పశూన్ గృహ్ణాతి"** అను శ్రుతి బోధిస్తోంది.

దీనివల్ల తేలినదేమనగా, ఉదకంలో యజ్ఞీయమైన భాగం ఉందని, ప్రవాహాభిముఖంగా తిరిగి యజ్ఞోపయుక్తాలైన ఉదకాలనే వసతీవరులను గ్రహించాలని శ్రుతి చెప్పడంతో స్నానం కూడా ప్రవాహాభిముఖంగా చేయాలని స్మృతికారులు చెప్పడంలో అంతరార్థం ఉందని తెలుస్తోంది. ప్రవాహోదకాల్లో ఒక మహత్తరమైన శక్తి ఉందని మరో శ్రుతి కూడా చెప్తోంది-

ఇంద్రో వృత్రమహన్ సోపోభ్యమ్రియత| తాసాం యన్మేధ్యం యజ్ఞియగ్ం సదే వమాసీత్త దత్యముచ్యత|
తావహన్తీరభవన్ వాహన్తీనాం గృహ్ణాతి యా ఏవ మేధ్యా యజ్ఞి యాస్సదేవా పస్తాసామేవ గృహ్ణాతి| (తై.సం.6-4)

ఒకానొకప్పుడు ఇంద్రుడు వృత్రాసురుని సంహరించగా అతడు ఉదకాభిముఖంగా తిరిగి మరణించగా ఆ ఉదకాల పవిత్రమైన యజ్ఞార్హమైన శక్తి ఉదకాలనుండి వెలువడి ప్రవహించే ఉదకం అయింది. అటువంటి ఉదకాలను గ్రహించమని చెప్పడంచే పాపాలను పరిహరించే, యజ్ఞార్హతను కలిగించే దేవప్రియాలైన ఉదకాలను గ్రహించినట్లు అవుతుంది. అనగా ప్రవాహోదకాల్లో అటువంటి శక్తి కలదని తేలింది. ప్రవహించే ఉదకాలకు మరో విశేషం కూడా చెప్పబడింది.

నాన్తమానహన్తీరతీయాత్|

సమీపంలో ప్రవహించే ఉదకాలను అతిక్రమించరాదు (తక్కువ చేయరాదు). ఒకవేళ అతిక్రమిస్తే యజ్ఞాన్ని అవమానపరచినట్లు అవుతుందని **"యదన్త మావహన్తీ రాతీయాద్యజ్ఞమతి మన్యేత"** అను శ్రుతి చెప్తోంది. అందుకే ప్రాచీన సంప్రదాయంలో నది దాటి వెళ్ళినప్పుడు, నది అవతలకు వెళ్ళేక నదిలో స్నానం చేసి ముందుకు వెళ్ళడం అనే అలవాటుంది. ఇతర నదుల్లో కూడా స్నానం చేయచ్చు కానీ సమీపంలో ఉన్న నదిని అవమానించరాదని అభిప్రాయం.

"న స్థావరాణాం గృహ్ణీయాత్" అని మరో విశేషం కూడా చెప్పబడింది. స్థిరంగా ఉండే తటాకాల్లో ఉదకాలు గ్రహించకూడదుట. ఒకవేళ గ్రహిస్తే ఆ ఉదకాలు వరుణ గృహీతాలు కనుక ఇతడి యజ్ఞం వరుణునిచే గ్రహింపబడినట్లు అవుతుందని ఈ శ్రుతి చెప్తోంది.

వరుణ గృహీతా వై స్థావరాః యత్థ్సావరాణాం గృహ్ణీయాత్|

అందుచేత నదీజలాలు సంభవించినప్పుడు (దొరికినప్పుడు) స్థావరోదకాలు గ్రహించకూడదని అభిప్రాయం.

ఇక వసతీవరులనే పేరుతో ఉదకాలను ఏ సమయంలో గ్రహించాలి అంటే, తత్సమానంగా చెప్పబడిన స్నానం ఎప్పుడు చెయ్యాలని సూచించింది వేదం? అది చూద్దాం! ఇందులో ఎన్నో ఆరోగ్య విషయాలు కూడా ఇమిడి ఉన్నాయి.

యద్వై దివా భవత్యపోరాత్రిః ప్రవిశతి తస్మాత్తామ్రా ఆపోదివా దదృశ్రేయన్నక్తం భవత్యపోహః ప్రవిశతి|
తస్మాచ్చంద్రా ఆపోనక్తం దదృశ్రేఛాయాయై చా తపతశ్చ సంధౌ గృహ్ణాతి అహోరాత్రయో రేవాస్మై వర్ణం గృహ్ణాతి|

మరో స్థలంలో వేదమే **'ఏషవా అహ్నోవర్ణోయచ్ఛుక్లం ఏష రాత్రియా యత్కృష్ణం'** అని పగటి వర్ణం తెలుపు అని, రాత్రివర్ణం నలుపు అని వర్ణించడంచేత, పగటిభాగం సూర్యప్రధానమైనదిగాను రాత్రిభాగం వరుణప్రధానమైనది గాను, **"మైత్రంవా అహః వారుణీ రాత్రిః"** అను శ్రుతిచే వర్ణింప బడుతోంది. కనుక, పగలు గ్రహించినట్లయితే సూర్యప్రధానమైన ఉదకాల్లో వరుణ ప్రధానమైన రాత్రి ప్రవేశిస్తే ఉదకాలు తామ్రవర్ణంగా ప్రకాశిస్తాయి. అందుకే శివుని సూర్యపరంగా వర్ణించడంలో **"నమస్తామ్రాయ చారుణాయచ"** అని చెప్పారు. **'ఉదయకాలే అత్యన్తం రక్తః తామ్రః ఉదయాదూర్ధ్వం ఈషద్రక్తః అరుణః"** అనే భాష్యంలో ఉదయకాలంలో మిక్కిలి

ఎర్రగా కనబడే సూర్యుడు తామ్రశబ్ద వాచ్యుడని, ఉదయం అయ్యాక కనబడే సూర్యుడు అరుణ శబ్దవాచ్యుడని వివరింపబడింది.

కాబట్టి ఉదయకాలంచే ఉపలక్షితాలై పగటికాల ఉదకాలు తామ్రవర్ణంగా ప్రకాశిస్తాయని చెప్పబడుతోంది. తామ్రం అత్యంత ఆరోగ్యకరమనే వైద్యులు తామ్రపాత్రలో ఉన్న ఉదకాలను త్రాగితే మలబద్ధకం ఉండదని, తామ్రాన్ని శరీరంపై ధరిస్తే నరాల నిస్సత్తువ అనే రోగం సోకదని చెప్పారు. ఈ మధ్య ప్రత్యక్ష తామ్రాన్ని చాలా మంది శ్రీమంతులు కూడా ధరిస్తున్నారు. ప్రాచీన కాలంలో కేవలం స్త్రీలు ఆభరణాలుగా సువర్ణాన్ని ధరించడమే కాక పురుషులకు కూడా కర్ణవేధ అనే సంస్కారంచే చెవులకు బంగారపు పోగులు కుట్టించేవారు. అందులో అభిప్రాయం సువర్ణంలో రాగి కలిసి ఉండడమే. కనుక, రాగివల్ల ఆరోగ్యం, సువర్ణంవల్ల శరీర శోభ రెండూ లభిస్తాయనేదే.

తస్మాత్సువర్ణగ్ం హిరణ్యం ధార్యం| సువర్ణ ఏవ భవతి| (తై. బ్రా.)

పురుషుడు కూడా సువర్ణాన్ని ధరించాలని, దానివల్ల మంచి శోభ కలవాడవుతాడని చెప్తోంది. ఈ శ్రుతిని మీమాంసాశాస్త్రం సువర్ణాధికారణంలో(3-4-12) విచారించి సువర్ణధారణం పురుషార్థమని నిర్ణయించారు.

దీనివల్ల తేలిన సారాంశం- తామ్రంలో ఎక్కువ గుణం ఉందని, పగటి కాలపు ఉదకాలు తామ్రం వంటివని, ఆ విధంగా ప్రకాశించే ఆ ఉదకాలు ప్రశస్తములైనవని రాత్రిభాగపు ఉదకాల్లో అహస్సు ప్రవేశిస్తోందని, శుక్ల,కృష్ణపక్ష భేదంచే రాత్రిపూట చంద్రుడు ప్రకాశించునని, కావున చంద్ర ప్రధానమైన రాత్రియందు ఉదకాలు చంద్రునివలె ప్రకాశిస్తూ, చంద్రునివలెనే శీతలంగా ఉంటాయని చెప్పబడింది. పగటి స్నానం కంటే రాత్రి స్నానం శీతలం చేస్తుంది కనుకనే ధర్మశాస్త్రంలోను, ఆయుర్వేదంలోను కూడా రాత్రి స్నానం నిషిద్ధం. తెల్లవారకట్ల సూర్యోదయానికి ముందు నాలుగు గడియల కాలంనుంచి రాత్రి సూర్యాస్తమయమైన నాలుగు ఘడియలవరకు పగలుగా లెక్కవేసి ఆ సమయంలో స్నానం చేయవచ్చని వీరమిత్రోదయం అనే ధర్మశాస్త్రంలో పాత్రస్నాన ప్రకరణంలో చెప్పబడింది.

సర్వమర్హతి పూతాత్మా ప్రాతస్నాయీ జపాదికమ్| ఇతి దక్షవచనాత్ తదహః కృతస్నానస్యైవ అధికార సంపాదకత్వమ్|

అహఃకృత్యాలకు పగటిపూట స్నానమే అధికారమివ్వగలదని చెప్పి,

సూర్యోదయాత్పూర్వం క్రియమాణస్య ప్రాతస్నానస్య కథం తదహః క్రియమాణ క్రియాంగత్వమితిచేన్న|

సూర్యోదయానికి పూర్వం చేసిన స్నానం రాత్రి లెక్కలోకి వస్తుందేమో అన్న శంకకు ఇలా సమాధానం చెప్పారు.

దివసస్య ఆద్య భాగే తు కృత్యం తస్యోపదిశ్యతే" ఇత్యుపక్రమ్య

ఉషఃకాలేతు సంప్రాప్తే శౌచం కృత్వా యదార్థవత్| తతః స్నానం ప్రకుర్వీత దన్తధావన పూర్వకమ్|

ఉషఃకాలమారభ్యైవ తదహః కృత్యాభిధానేన ఉషఃకాలస్యాపి తదహరన్తః పాతిత్వాత్|

మొదలగు దక్షవచనంచేత రాత్రిలో మొదటి నాలుగు ఘడియలు, చివరి నాలుగు ఘడియలు పోగా మిగిలిన మూడు ఝాములే రాత్రిగా పరిగణింపబడునని స్పష్టంగా చెప్పబడినందున, రోజుకి మొదట్లో స్నానం చేయవలసిందిగా ఉపదేశించి శౌచ కృత్యాల తర్వాత ఉషఃకాలంలో స్నానం చెయ్యాలని స్పష్టంగా చెప్పబడింది. మార్కండేయ పురాణంలో కూడా-

సూర్యోదయం వినానైవ స్నానదానాదిక క్రమః| అగ్నేర్విహరణం చైవకృత్య భావశ్చలక్ష్యతే|

అని చెప్పడంచేత ఉషఃకాలం సూర్యోదయకాలం వంటిదని, ఉషఃకాలం కాక మిగిలిన రాత్రిభాగంలో నిమిత్త (ప్రత్యేక కారణం) లేకుండా స్నానం చేయకూడదని తాత్పర్యం. అందువల్ల దివారాత్రి సంధ్యలయందు మాత్రమే స్నానం చేయడం యుక్తమని వసతీవరీగ్రహణం కూడా **"ఛాయాయై చాతపతశ్చ సంధౌ గృహ్ణాతి| అహోరాత్రయోరేవాస్మై వర్ణం గృహ్ణాతి"** అని అహోరాత్ర సంధికాలంలోనే విధించబడింది. ఈ ప్రకారం స్నానంయొక్క ముఖ్యకాలం చెప్పబడింది.

ఒక్క స్నానం చేసే విషయానికి, సమయానికి ఇంత చర్చా? అని ఆధినుకులకు ఆశ్చర్యం వేయవచ్చు గానీ స్నానం కేవలం బాహ్యశుద్ధికే కాదని బాహ్య,అంతర శుద్ధికి, తర్వాత కర్మాచారణకి యోగ్యతని సంపాదించేదని వాటియందు శ్రద్ధని కలిగించేవని, ఇంకా బాహ్యంగా చూసినా ఆరోగ్యానికి కూడా అవసరమని వేదం ఇంతగా బోధించిందని తెలుసుకోనగును!

అన్యాం నదీం న ప్రశంసేత| ధనుస్సహస్రాణ్యష్టాగతిం యస్యాస్సానదీ| నద్యాం విద్యమానాయాం అన్యవారిషు న స్నాయాత్| గయా గంగా కురుక్షేత్రాది తీర్థాన్యేతాని సంస్మృత్య జలాశయే త్రిర్నిమజ్జేత్| (గౌ.సూ)

మరో విశేషం- ఒక నదిలో స్నానం చేస్తూ మరో నదిని ప్రశంసించ కూడదుట. గయా గంగా కురుక్షేత్రాది తీర్థాలను మాత్రం స్మరించి స్నానం చేయాలిట. లౌకికంగా కూడా మనం ఎవర్నో భోజనానికి పిలిచి పెడ్తూ 'మీరు వచ్చారు సంతోషం కానీ ఫలానా వారు వస్తే బాగుండేది' అని అంటే వచ్చిన అతిథిని అమర్యాద చేసినట్లే అవుతుంది కదా! ఇంతేకాదు, శాస్త్రం ఇంకా ఎన్ని జాగ్రత్తలు చెప్పిందో చూడండి-

పద్భ్యాం న జలం తాడయేత్| నాఽశుద్ధోజలం ప్రవిశేత్| నా స్పృక్ఛకృన్మూత్ర నిష్ఠీవన రేతాంస్యప్సు న క్షిపేత్|

పాదాలతో నదీ జలాన్ని తాడన చేయకూడదు (కాళ్లతో కొడుతూ ఈత కొట్టకూడదు). దీనివల్ల నీటిలో ప్రమాదం లేకపోవడం మొదలైన దృష్ట ప్రయోజనం స్పష్టం. నదులు చాలా పవిత్రమైనవి. మనకు పాపాహరణం ద్వారా పుణ్యప్రదాలు కూడా కనుక అందులో మూత్రపురీషాలు విడవ కూడదు. అందులో ఉమ్మి వేయకూడదు. వేరే అశుద్ధాలని నదీ జలాల్లో కలపకూడదు. ఈ రోజుల్లో మనం వింటున్న పర్యావరణ రక్షణ, నదీజలాలు కలుషితమై దుర్గంధ భూయిష్టమై పోవడం వంటి ఎన్నో విషయాలని వేదం ఎంత ముందుగా ఊహించి భౌతికంగా, దైవికంగా ఉపయోగపడేలా ఎన్ని సూచనల్ని చేసిందో చూడండి! అంతే కాదు,

నాప్సుమూత్ర పురీషం కుర్యాత్| న నిష్ఠీవేత్| న వివసన స్స్నాయాత్| (ఆ.ఉ.)

అని ఆరుణ కేతుక ప్రకరణంలో, వస్త్రాచ్ఛాదన లేకుండా స్నానం చెయ్యకూడదని కూడా వేదం స్పష్టంగా చెప్పింది.

ఏతావతా స్నాన, ఆచమనాదుల వల్ల దృష్ట ప్రయోజనం శరీరగత మాలిన్య నివారణ కాగా, అదృష్ట రూపమైన మేధ్యత్వము, అనగా యాగానుష్ఠానం యోగ్యత, పుణ్యకర్మలు చేయడమందు అతిశయ శ్రద్ధ కలగడం వంటి ఇతరప్రయోజనాలు కూడా చెప్పడ్డాయి.

ఉదక మహిమ

తై.సం. ఒకటవ కాండంలో దర్శపూర్ణమాస ప్రకరణంలో యజమాన కాండలో అపః ప్రణయమనే ఒక క్రియ ఉంది. అందులో 'చమస' అను పేరు గల ఒక దారుపాత్రలో ఉదకాలను ఉంచి వాటిని 'ఆహవనీయ'-

సమీపంలో ఉంచాలి. దీనికి **'చమసేనాపః ప్రణయతి'** అని విధి. వాటి వలన ఉపయోగమేమి అనే దాని గురించి ఇలా చెప్తోంది.

యోవై శ్రద్ధామనారభ్య యజ్ఞేన యజతే నాస్యేష్టాయ శ్రద్దధతే అపః ప్రణయతి శ్రద్ధావా ఆపశ్శ్రద్ధా మేవారభ్య యజ్ఞేన యజతే| ఉభయేస్య దేవ మనుష్యా ఇష్టాయ శ్రద్దధతే| (తై.సం.1-6)

శ్రద్ధ లేకుండా యజ్ఞం చేసే యజమాని యజ్ఞాన్ని ఎవరూ విశ్వసించరట. అందుచేత శ్రద్ధను కలిగింప చేయడానికి ఉదకాలను యజ్ఞవేదిక సమీపంలో ఉంచాలని విధించబడింది. తర్వాత ఉదకాలను అనేక విధాలుగా వేదం ప్రశంసించింది. శ్రద్ధ యొక్క ప్రాధాన్యం ఇలా చెప్పబడింది-

అపః ప్రణయతి| శ్రద్ధావా ఆపః| శ్రద్ధమేవారభ్య ప్రణీయ ప్రచరతి| అపః ప్రణయతి| యజ్ఞోవా ఆపః| యజ్ఞమేవారభ్య ప్రణీయ ప్రచరతి| అపః ప్రణయతి| వజ్రో వా ఆపః| అపః ప్రణయతి| ఆపోవై రక్షోఘ్నీః| రక్షసామపహత్యై| అపః ప్రణయతి| ఆపో వై దేవానాం ప్రియం ధామ| దేవానామేవ ప్రియం ధామ ప్రణీయ ప్రచరతి| అపః ప్రణయతి| ఆపో వై సర్వదేవతాః| దేవతా ఏవారభ్య ప్రణీయ ప్రచరతి|

ఉదకాలు శ్రద్ధ కలిగించేవి అవడంవల్ల శ్రద్ధా స్వరూపాలని, యజ్ఞ నిర్వర్తకాలవడంచే యజ్ఞ స్వరూపాలని, అభిమంత్రించబడిన ఉదకాలు వజ్రాయుధాలవలె శత్రు సంహారకాలు అవడంచే వజ్రాయుధ స్వరూపమని, రాక్షసుల నిష్క్రమణకు కారణం కనుక రాక్షసఘ్నములని, దేవతలకు ప్రియమైన స్థానాలని, అగ్నియందు సర్వదేవతలు ప్రవేశించినట్లు ఆ అగ్ని ఉదకాలందు దాగి ఉన్నట్లు వేదంలో మరోచోట వర్ణింపబడడంచే ఉదకాలు సర్వదేవతా స్వరూపాలని కూడా వేదం వర్ణించింది.

ఆపోహాస్మై శ్రద్ధాం సన్నమన్తే పుణ్యాయ కర్మణే|

అను శాఖాంతర శ్రుతి ఉదకాలకు శ్రద్ధా జనకత్వం లోక ప్రసిద్ధమని చెప్తోంది.

స్నానాత్ పూర్వాపేక్షయా స్నానానన్తరం మనోనైర్మల్యం జనిత్వా మనః పుణ్య కర్మసు అభిముఖం భవతీతి| (సా.భా.)

మనకు కూడా సూర్యునికి అర్ఘ్యం ఇవ్వాలని, దేవతా దర్శనం చేయాలని స్నానం ముందు కంటే, స్నానానంతరం శ్రద్ధ కలగడం అనుభవంలో ఉన్నదే కదా! అందుకే తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు ముందుగా తీర్థాలందు స్నానం చేయడంతో నిరతిశయమైన దేవతా దర్శనానికి పుణ్యశ్రద్ధ కలుగుతుంది.

శ్రద్ధ లేకుండా యజ్ఞానికి ఉపక్రమిస్తే ఆ యజ్ఞాన్ని ఎవరూ విశ్వసించరని తెలుసుకున్నాం. శ్రద్ధతో కూడిన యాగం అయితే దేవతలు మనుష్యులు కూడా విశ్వాసం చూపిస్తారని, అందువల్ల శ్రద్ధ అత్యంత ఆవశ్యకం అని చెప్పబడింది. ఈ శ్రద్ధను గురించి కాఠకాల్లో బాగా వర్ణింపబడింది. **'తథాహి'** అని చెప్పడంచే స్నానంవల్ల పుణ్యకర్మలందు శ్రద్ధ కలగడం కూడా ప్రయోజనం. స్నానంవల్ల శరీరానికి పైన పవిత్రత కలగడమే కాక ఆచమనం చేయడంవల్ల లోపల కూడా పవిత్రత కలుగుతుందని **"అపోశ్నాత్యంతరత ఏవ మేధ్యో భవతి"** అను శ్రుతి చెప్తోంది.

హిరణ్య వర్ణాశ్శుచయః పావకాః యాసుజాతః కశ్యపోయాస్విన్ద్రః| అగ్నిం యాగర్భం దధిరే విరూపాస్తాన ఆపః శగ్గ్ స్యోనా భవంతు| (తై.సం.5-6)

ఉదకాభిమాన దేవతలారా! ఐహిక ఆముష్మిక సుఖప్రదము లగుదురు గాక!

యాసాగ్ం రాజా వరుణోయాతి మధ్యే సత్యాన్నృతే అవపశ్యన్ జనానాం మధుశ్శుత శ్శుచయో యాః పావకాః తాన ఆపః శగ్గ్ స్యోనా భవంతు| (తై.సం.5-6)

జనులు యథాశాస్త్రంగా స్నానాదులు ఆచరిస్తున్నారా లేదా అని పరిశీలన చేస్తూ జలాధిపతి అయిన వరుణుడు ఉదకాల మధ్యనుండి గూఢంగా సంచరిస్తుంటాడు. అటువంటి మధుర రసమును స్రవింపచేస్తున్న, స్వతఃసిద్ధంగా పరిశుద్ధులైన, సర్వ వస్తుజాతాన్ని అపవిత్రతనుండి విముక్తి కలిగించడం ద్వారా పవిత్రింప చేస్తున్న ఉదకములారా! మాకు ఐహికాముష్మిక సుఖకరము లగుదురు గాక!

యాసాం దేవా దివికృణ్వన్తి భక్షం యా అంతరిక్షే బహుధా భవన్తి| యాః పృథివీం పయసోన్దన్తి శుక్రాస్తాన ఆపః శగ్గ్ స్యోనా భవంతు|

ద్యులోకంలో ఉన్న దేవతలకు అమృతరూపంలో భక్షస్థానీయాలైన, అంతరిక్షమందు వృష్టిధారాది అనేక రూపాలుగా ఉన్న, పంటలు పండడానికి అనుకూలంగా భూమిని తడుపుతున్న నిర్మలమైన ఓ ఉదకములారా! మాకు ఐహికాష్మిక సుఖకరము లగుదురు గాక!

శివేన మాచక్షుషా పశ్యతాపశ్శివయా తనువోపస్పృశత త్వచం మే| సర్వాగ్ం అగ్నీగ్ం రప్సుషదో హువేవో మయివర్చో బలమోజో నిధత్త| (తై.సం.5-6)

ఓ ఉదకాభిమాన దేవతలారా! మీ మంగళప్రదమైన దృష్టితో మమ్మల్ని చూడండి. మీ మంగళ ప్రదమైన శరీరంతో మమ్మల్ని స్పృశించండి. మీలో గల వర్చస్సు, ఓజస్సు, బలము మున్నగు సర్వగుణాల్ని మాకు అనుగ్రహింతురు గాక!

సారాంశం- ఉదకాలు స్వతఃసిద్ధంగా పరిశుద్ధములై ఇతరులను కూడా పవిత్రింప చేసే సామర్థ్యం కలిగినవని, ఉదకాల్లో అగ్ని ఇమిడి ఉందని, వాటిని సేవించేవారికి ఐహిక ఆముష్మిక సుఖాన్ని, మాధుర్యాన్ని ఇవ్వగలవని, ఈ ఉదకాలు దేవతలకు అమృత స్థానాలని, మనకు ఓజస్సును, వర్చస్సును, తేజస్సును, దేహేంద్రియాలకు ఒక విధమైన పుష్టిని ఇవ్వగల సామర్థ్యం కలిగినవని తెలుసుకోదగినది.

నదీ శబ్ద నిర్వచనం

యదదస్సంప్రయతీ రహావనదతాహతే| తస్మాదానద్యోనామ స్థతావో నామాని సింధవః| (తై.సం.5-6)

ద్యులోకంనుంచి వస్తూ మేఘాల ఆఘాతంతో (దెబ్బతో, రాపిడితో), ప్రవాహ సమయంలో పాషాణాల తాకిడిచే శబ్దం పుట్టినట్లుగా ఒక విధమైన 'నాదాన్ని' చేస్తున్నవై ఉదకాలు నదీశబ్ద వాచ్యములు అయ్యాయి.

యస్మాత్ నాదం కృతవత్యః తస్మాన్నదీతి నామధేయం ప్రాప్తాః ఇతి స్యందన శీలాః| (సా.భా)

అను నిర్వచనంచే నాదం చేస్తూ ఉండడం వల్ల **'నదీ'** శబ్దాన్ని పొందాయి, ప్రవహించే స్వభావంవల్ల **'సింధన ఇత్యుచన్తే'** సింధుశబ్ద వాచ్యాలయ్యాయి.

'అప్' శబ్ద నిర్వచనం

యత్ప్రేషితా వరుణేన తాశ్శిభగ్ం సమవల్గత|తదాప్నోదింద్రో వోయతీ స్తస్మాదాపో అనుస్థ| (తై.సం.5-6)

వాటికి అధిపతి అయిన వరుణునిచే ప్రేరేపింపబడినవై మంచి శోభాయమానంగా నృత్యం చేస్తున్న ఉదకాలను చూడడానికి ఇంద్రుడు వచ్చాడుట.

ఆప్ల్ గతావితి ధాతుః|

ఈ ప్రకారం ఇంద్రునిచే 'పొందబడినవి' కనుక **'ఆప్యన్తే'** అనే వ్యుత్పత్తి విశేషంగా **'ఆప్'** అనే పేరుని పొందాయిట.

'వార్' శబ్ద నిర్వచనం

అపకామగ్గ్ స్యందమానా అవీవరత వోహికమ్| ఇంద్రోవశ్శక్తిభిర్దేవీ స్తస్మా ద్వార్ణా మవోహితమ్| (తై.సం.5-6)

'అవీవరత'- అంటే ప్రయోజన విశేషాన్ని అపేక్షించకుండా ప్రవహిస్తున్న ఉదకాలను ఇంద్రుడు వరించాడుట. ఉదకాలు స్వశక్తిచేతనే ప్రవహించడం లోక ప్రసిద్ధమే. 'నీరు పల్లమెరుగు' అను లోకోక్తి ఉంది కదా! ఇంద్రునిచే వరించబడిన కారణంగా ఉదకాలకు 'వార్' అనే పేరు సంభవించింది.

ఉదక శబ్ద నిర్వచనం

ఏకోదేవో అప్యతిష్ఠ త్స్యన్దమానా యథావశమ్|ఉదానిషుర్మహీరితి తస్మాదుదకముచ్యతే| (తై.సం.5-6)

'ఏకోదేవో అప్యతిష్ఠత్' స్వేచ్ఛగా ప్రవహిస్తున్న ఉదకాలను ఇంద్రుడు స్వాధీనపరచుకొన్నాడు. ఆ ఉదకాలు అధిక చేష్టలతో కూడుకున్నవయ్యాయి. **'ఉదానిషుః'** అని ఆ ప్రకారమైన చేష్టాధిక్యంవల్ల అవి ఉదకాలు అని పిలవబడ్డాయి. ఉదకాలు ఔషధాలను కలిగి ఉంటాయి కనుక స్వస్థత కలవాడు, స్వస్థత లేనివాడు కూడా ప్రకార భేదంతో యథాశాస్త్రంగా స్నాన,పానాది రూపంగా వినియోగిస్తే సర్వవ్యాధి నివారకమవుతుందని -

ఆపశ్చ విశ్వభేషజీః అప్సుమే సోమో అబ్రవీత్| అన్తర్విశ్వాని భేషజా|

ఇత్యాది శ్రుతులు ప్రతిపాదిస్తున్నాయి. ఉదకాలకు వ్యాధి నివారక శక్తి ఉన్నట్లు సార్వజనీనమైన విషయాన్ని కూడా వేదంలో శ్రుతులు ఉదహరిస్తున్నాయి.

అమృతం వా ఆపః| తస్మాదద్భిరవతాన్త మభిషించన్తి| నార్తి మార్ఛతి| సర్వ మాయురేతి| (తై.బ్రా.)

అగ్నిచయన ప్రకరణంలో కుంభ-కుంభీష్టకోపధాన ప్రసంగంలో జలమహిమ ఇలా చెప్పబడింది. అమృతం ఉదకజన్యం కనుక ఉదకాలు అమృత స్వరూపాలని, కనుకనే **'అత్యంతగ్లానిని'** అనగా మూర్ఛపొందిన వానిని **'అద్భిరభిషించన్తి' అని** మూర్ఛబాధా నివారణ కోసం శీతోదకంచే తలమీద తడిపితే పరిపూర్ణ ఆయుస్సుని పొందగలడు. ఇదే విధంగా ఆరుణకేతుక ప్రకరణంలో-

ఆమయావీ చిన్వీత| ఆపో వై భేషజమ్| భేషజమే వాస్మైకరోతి| సర్వమాయురేతి| (తై.ఆ.1)

రోగనివారణ కోరే వ్యక్తి ఉదకాలనే ఇష్టకలను ఉపధానం చేసిన వాడై పరిపూర్ణమైన ఆయుర్దాయాన్ని పొందగలడు. ఇదే తీరుగా శత్రునివారణ కోరే వానిచే ఉపధానం చేయబడిన ఉదకాలు వజ్రాయుధాలై శత్రువుని నివారిస్తాయి. ఇంకా **"తేజస్కామో యశస్కామః బ్రహ్మవర్చసకామ స్స్వర్గ కామశ్చిన్వీత"** అను శ్రుతి తేజస్సుని, యశస్సుని, బ్రహ్మవర్చస్సుని, పుణ్యలోక ప్రాప్తి రూపమైన ఫలాన్ని కూడా ఈయగలవని చెప్తోంది.

ఈ ప్రకారంగా ఉదక సామాన్యం యొక్క మరియు ఉదక విశేషం యొక్క మహిమ వర్ణింపబడింది. ఇంతటి మహిమోపేతమైన ఉదకాలను స్నాన, ఆచమనాది రూపంగా సేవిస్తే పాప పరిహారం ద్వారా మనలను పుణ్యకర్మలందు ప్రోత్సహించేటటువంటి చిత్త నైర్మల్యం సంభవిస్తుందని స్పష్టం. దీనివల్ల స్నానం చేయడం మిక్కిలి శ్రేష్ఠమని తెలుస్తోంది. ప్రసిద్ధ నదులందు, క్షేత్రమందు, తీరమందు, గర్భ సంజ్ఞిక ప్రదేశాలందు ప్రతిగ్రహ నిషేధం (ద్రవ్యం ఏమీ తీసుకోరాదనే నిషేధం) ప్రసిద్ధ నదులకు మాత్రమే పరిమితం.

ప్రసిద్ధ తరగండక్యాది నదీషు ఉభయతః సార్ధశతహస్త మిత్యుక్త తీరే ప్రతిగ్రహ నిషేధః ఇతి శిష్టాః|

గండకి మొదలైన నదులకు తీరమందు కూడా ప్రతిగ్రహం నిషేధం.

క్షేత్ర నిషేధః గంగా విషయః తత్రైవ క్షేత్రమితి కథ్యతే|

గంగ విషయంలో క్షేత్రమందు కూడా ప్రతిగ్రహ నిషేధమని చెప్పబడింది.

యత్ర గంగామహాదేవః స్వయంభూశ్చ తపోవనమ్| సిద్ధిక్షేత్రంతు తం జ్ఞేయం సమన్తాత్తు త్రియోజనమ్| ఏకస్మిన్ పార్శ్వే సార్ధయోజన మిత్యేవ సమంతా త్రియోజనమ్| ఇత్యర్థం| అత్ర మరణే అతిశయః న తు ప్రతిగ్రహ నిషేధార్థం| (బ్రహ్మ.పు.)

బ్రహ్మ పురాణంలో మాత్రం గంగాక్షేత్రంలో ప్రతిగ్రహ నిషేధం లేదు. ఇక్కడ(ఈ క్షేత్రంలో) మరణమందు కూడా అతిశయం ఉంది. పై విషయాలు సత్యాషాడ శ్రౌతసూత్ర గ్రంథంలో అగ్నిష్టోమ ప్రకరణంలో దేవ యజన విశేష ప్రసంగంలో చెప్పబడ్డాయి. అందుకే ధర్మశాస్త్రంలో స్నానభేదాలు చెప్పే సందర్భంలో నిత్య, నైమిత్తిక, కామ్య భేదాలతో మూడు రకాలని చెప్పబడింది.

అస్నాతస్తు పుమాన్నార్హః జపాగ్నిహవనాదిషు| ప్రాతస్నానం తదార్థంతు నిత్యస్నానం ప్రకీర్తతం| తత్సర్వమర్హతి శుద్ధాత్మా ప్రాతస్నాయీ జపాదికమ్| (వీ.మి)

మొదలైన శ్రుతులు ప్రాతఃస్నానం చేసి పరిశుద్ధుడైతే కానీ సంధ్యావందన, ప్రత్యేక గాయత్రీ జప, అగ్నిహోత్రాది కర్మలందు అధికారి కాజాలడని, అందుచే ప్రాతస్నానం చేసి తీరాలని చెప్తున్నాయి.

ఈ స్నానాల్లో, వాపీకూపాదులవద్ద ఘాటాదులచే చేయు స్నానం గౌణస్నానమని జలంలో ఒకేసారి శరీరమంతా తడిసేలా మునిగి స్నానం చేయడం వారుణ స్నానమని **"జలావగాహో వారుణమ్"** (గౌ.సూ)**,** ఇదే ముఖ్యమని **"స్నానం తు ద్వివిధం ప్రోక్తం గౌణముఖ్య ప్రభేదతః తయోస్తు వారుణం ముఖ్యం"** అని స్మృతి గ్రంథాల్లో చెప్పబడింది. ఇంకా ప్రాతస్నానంవల్ల పది రకాలైన గుణాలు సంభవిస్తాయని చెప్పబడింది.

గుణాదశ స్నాన పరస్య సాధోరూపం చ తేజో బలశ్చ శౌచమ్ ఆయుష్య మారోగ్యమలోలుపత్వం దుస్వప్నఘాతశ్చ తపశ్చ మేధా|

(1)మాలిన్యశుద్ధి ద్వారా శరీరానికి పరిశుద్ధమైన రూపం (2)తేజస్సు అనగా శరీరకాంతి 3)శరీరానికి ఒకవిధమైన పుష్టి (4)పుణ్యకర్మానుష్ఠానానికి తగిన పరిశుద్ధత (5)ఆయుష్య ప్రాప్తి (6)ఆరోగ్య ప్రాప్తి (7)అలోలుపత్వం (8)దుస్వప్న జన్యమైన అరిష్ట పరిహారం (9)తపఃఫలం (10)మేధా సంపద అనగా, చదివిన దాన్ని మరవకుండా ధారణ చేసే శక్తి అనే దశగుణాలు సంభవిస్తాయని చెప్పబడింది.

పైన చెప్పబడిన గుణాలు సామాన్యంగా వాపీ, కూప, తటాకాదులందు జలస్నానం చేసినా సంభవిస్తాయి కానీ నదీస్నానం చేస్తే పాపాపనోదన పూర్వకంగా పుణ్య విశేషంతోబాటు పై గుణాలు కూడా అతిశయంగా సంభవిస్తాయి. అందుకే నదీ స్నానానికి ప్రాధాన్యత, ప్రాముఖ్యత.

నద్యాం ప్రత్యేకశః స్నానం భవేద్గోదానజమ్ ఫలం| (స్మృతి)

నద్యాం విద్యమానాయాం అన్యవారిషు న స్నాయాత్| (గౌ.సూ)

నది ఉన్నచోట మరో ఉదకంతో స్నానం చేయకూడదని గౌతమ సూత్రం. అంటే ఆ నదిని అవమానించినట్లు అవుతుందని అభిప్రాయం. వీటన్నింటి కంటే గంగానదీ దర్శనం, స్నానం అత్యున్నత మైనవని మరో స్మృతి వచనం చెప్తోంది.

తీర్థతోయం తతః పుణ్యం తతో గంగామ్ తు సర్వతః| భవన్తి నిర్విషాః సర్పాః యథాతార్క్ష్యస్య దర్శనాత్| గంగాయా దర్శనాత్తద్వత్సర్వ పాపైః ప్రముచ్యతే| స్నాన మాత్రేణ గంగాయాం పాపం బ్రహ్మవధోద్భవం| (స్మృతి)

లోకంలో గరుత్మంతుని దర్శనం వల్ల సర్పాలు విషరహితాలు అయినట్లుగా గంగా దర్శనం మాత్రం వల్లనే సర్వపాప విముక్తు డవుతాడని, గంగా స్నానంవల్ల బ్రహ్మహత్యా దోషంనుండి కూడా విముక్తుడవుతాడని చెప్తోంది, పై స్మృతి. అందుకే మనం ఎక్కడ స్నానం చేసినా గంగానదిని స్మరించాలని-

గయా గంగా కురుక్షేత్రాది తీర్థాన్యేతాని సంస్మృత్య జలాశయే త్రిర్నిమజ్జేత్| (గౌ.సూ)

అని గౌతమ సూత్రం చెప్తోంది. గంగాది నదుల్ని మనం స్నానం చేసే ప్రదేశాలకు రావలసిందిగా ప్రార్థించే మంత్రాలు తై .నా. ఉపనిషత్తులో కూడా వినబడుతున్నాయి.

ఇమం మే గంగే యమునే సరస్వతి శుతుద్రిస్తోమగ్ం సచతా పరుష్ణియా అసిక్నియా మరుద్వృధే వితస్తయార్జీకీయే శృణుహ్యాసుషోమయా| (తై. ఉ.)

విశ్వనాథ రాజధాని నగర సమీపంలో ఉన్న ఓ గంగాదేవీ! ఆదిత్యుని కుమార్తె అయిన యమునా దేవీ! బ్రహ్మగారి భార్యవై నదీరూపాన గల ఓ సరస్వతీదేవీ! మరుద్వృధ నామకమైన నదీ దేవీ! ఆర్జికీయ నామకమైన, వితస్తి నామకమైన, సుషోమా నామకమైన నదులతో కలిసి నాచే మనః పూర్వకంగా పఠింపబడిన ఈ స్తుతి రూపకమైన మంత్ర భాగాన్ని వినవలసిందని, విన్నాక నన్ను పవిత్రింప చేయడానికి మాచే కోరబడిన ఫలాన్ని ఇవ్వడానికి మీ మీ స్థానాలనుండి ఇప్పుడు నేను స్నానం చేస్తున్న జలమధ్య భాగానికి రావలసింది గాను, వచ్చాక మాకు సమీప భాగంలో సన్నిహితంగా ఉండవలసింది గాను మిక్కిలి ప్రార్థిస్తున్నాను, అని ప్రార్థించే వాని అభిప్రాయమని భాష్యకారులు సంగ్రహంగా చెప్పారు.

వస్తుతః, నేను ఈ మంత్రాలచే చెప్పబడిన, చెప్పబడని నదుల సమీపానికి వెళ్ళి చిరకాలం అక్కడే నివసించి స్నాన పానాదులచే కొంత కాలం గడపవలసి ఉన్నా అలా నివసించడానికి అసమర్థుడనై దిగుడు బావులు, కూపములు మున్నగు వాటి ఉదకంచే స్నానం చేస్తూ ఈ మంత్రంచే గంగాది నదులను ప్రార్థనా పూర్వకంగా ఆహ్వానించి అనుగ్రహించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. మా ప్రార్థనను మన్నించి మా సమీపానికి చేరి నా మహాపాపాలను నశింపచేయండి. తర్వాత నేను ఈ విధంగా పునీతుడనైనానని, పరిశుద్ధుడనైనానని, నన్ను ఆశ్రయించిన వర్గంతో కూడా సర్వభోగాలను అనుభవించి స్వేచ్ఛగా పుణ్యలోకాన్ని పొందగలిగేలా నన్ను ఆశీర్వదించండి. అనగా, ఆ యా నదీ అభిమాన దేవతలు **"ఇమం మే గంగే"** ఇత్యాది మంత్రాలు చెప్పి స్నానం చేసిన వానికి ఇందులో చెప్పబడిన ఫలాలన్నీ ప్రాప్తించేటట్లు అనుగ్రహించమని కోరితే ఆ విధంగా అనుగ్రహిస్తాయని ఆశయం. ఈ విధంగా గంగాస్నాన ఫలవిశేషాలు వర్ణించబడ్డాయి.

ఇంతవరకు మన భారతదేశం కర్మభూమిగా ప్రశస్తమైనదని, ఇక్కడ ఆచరించిన పుణ్యకర్మలు పరంపరగా ఉత్తమ పురుషార్థానికి సాధనాలు అవుతాయని అటువంటి పుణ్యకర్మల్లో నదీస్నానం మహిమను వర్ణించడానికి ముందుగా ఉదకాల గుణ విశేషాలు, వివిధ శబ్దాల నిర్వచనం, స్నాన భేదాలు, ప్రాతఃకాల స్నాన ఫలవిశేషము, వాపీకూప తటాకాదుల్లో స్నానం చేయడంవల్ల కలిగే ప్రయోజనాలు, ఉదకంతో చేసిన స్నానం వలన కలిగే భౌతిక, దైవిక ప్రయోజనాలు చెప్పి ఇంకా బ్రహ్మవధ వంటి దోషాలను సైతం నశింపచేసే అదృష్ట రూపమైన పుణ్యఫల ప్రయోజనం కూడా ప్రాతఃస్నానానికి ఉందని చెప్పబడింది.

ఆ పుణ్య ఫలవిశేషం చిత్తశుద్ధి కలిగించి, దాని ద్వారా జ్ఞాన సంపాదనకు సాధనమైన దానిచే మోక్షమనే ఉత్తమ పురుషార్థాన్ని పొందడానికి ఉపయోగ పడగలదని వర్ణింపబడింది. ఈ నదీ స్నాన ఫల విశేషాలను గుర్తించి ఆచరించడం ద్వారా సర్వజనులు తరించాలని వేదప్రమాణ పూర్వకంగా వివరింపబడింది.

"సంధ్యాస్నానం" అనే శ్లోకంలో చెప్పబడిన షట్కర్మల్లో మొదటిదైన స్నానం తర్వాత సంధ్యావందనం చేయాలి. దానికంటే ముందుగా పై శ్లోకంలో చెప్పబడక పోయినా వస్త్రధారణ, యజ్ఞోపవీత ధారణ, ఆసన నియమం కూడా చెప్పవలసి ఉంది. అవి ఇలా వివరించ బడుతున్నాయి.

ధర్మ శాస్త్ర ప్రకారం వస్త్రధారణం

స్నానానంతరం వాసః పరిదధ్యాత్|

ఏవం స్నాత్వా తతః పశ్చాత్ ఆచమ్య చ యథా విధి ఉత్థాయ వాససీ శుక్లే శుద్ధే తు పరిధాయ చ కర్మ కుర్యాత్| (ప.మా.)

సదశమ ఖండం శ్వేతం ధౌతం చ వస్త్రం ధారయేద్రక్తం నీలం మలినం చ వర్జయేత్| (గౌ.సూ.)

అంచుతో కూడిన, మధ్యగా చీల్చబడనటువంటి, తెల్లగా ఉన్నటువంటి, శుభ్రంగా ఉతకబడిన వస్త్రాన్ని ధరించాలి. రక్త, నీలాది వర్ణాలున్న వాటిని ధరించకూడదుట. ఇక్కడ గ్రహించదగినది- మాలిన వస్త్రాన్ని, రక్తనీలాది వర్ణాలున్నవాటిని ధరించకూడదని శాస్త్రకారులు కూడా చెప్పడమే కాదు, రజకులు వాడే నీలి రంగుతో పరిశుద్ధం చేయమని కూడా చెప్పరు. ఎందుకంటే, **"నాస్యపల్పూలనేన వాసః పల్పూలయేయుః"** అని నీలిరంగుతో వస్త్రాన్ని శుద్ధం చేయకూడదు. శుద్ధం చేయడంలో కూడా రాతిమీద ఉప్పళించడం శిష్టాచారం కానీ, **'సర్వదేవత్యం వై వాసః"** అను శ్రుతి వస్త్రాన్ని సర్వదేవతాకమైనదిగా చెప్పడంచే పాదాలతో మాత్రం ఉతక కూడదు. వస్త్రం సర్వదేవతాకం ఎలా అవుతుందని శంక కలుగుతుంది కనుక అది కూడా వివరింపబడుతోంది.

అగ్నేస్తూషాధానం వాయోర్వాతపానం పితృణాం నేవిరోషధీనామ్ ప్రఘూత ఆదిత్యానాం ప్రాచీనతానో విశ్వేషాం దేవానామోతుర్నక్షత్రాణాం అతీకాశాస్తద్వా ఏతత్సర్వ దేవత్యమ్ యద్వాసః| (తై.సం)

యజ్ఞంలో యజమానికి **'వాససా దీక్షయతి'** అను విధి ప్రకారం దీక్షానియమాల్లో వస్త్రధారణ కూడా ఒక దీక్షా విశేషమని, ఆ వస్త్రం నేత కాలంలో ఒక్కో క్రియ ఒక్కో అభిమాన దేవతతో కూడి ఉంది. వస్త్రం నేయడానికి ముందు నూలు చుట్టడానికి వాడే దారుమయ చిడప పేరు తూషం. అందులో నూలును చుట్టడం తూషావిధానం. దానిని వాయువుచే ఎండబెట్టడం వాతపానం. ఆ నూలును నిలబెట్టిన కర్రలకు ముడివెయ్యడం నీవి. ముడి వేసి ఉంచిన దారాలను శలాకంతో (చిక్కులు లేకుండా చేసే సాధనం) మర్దించడం ప్రహరణం. పొడుగ్గా ప్రసారం చేసిన దారం ఓతం. పడుగు పేకలో మధ్యనున్న చిల్లులే అతీకాశాలు. వస్త్రానికి అగ్ని, వాయువు, పితృదేవతలు, ఓషధిదేవతలు, విశ్వేదేవతలు, ఆదిత్యదేవతలు, అభిమాన దేవతలని; ఓతప్రోతాలకు మధ్యనున్న రంధ్రాలు నక్షత్రదేవతాకమైనవని ఈ ప్రకారంగా సర్వదేవతాకమైన **'సదశమఖండం'** ఇత్యాది శాస్త్రానుసారం అంచుతో కూడి, అఖండంగా ఉన్నా వస్త్రాన్ని తడిపి ఆరవేసిన దాన్ని, వేరొకరు తాకనిదాన్ని ధరించి కర్మారంభానికి సంకల్పం చేయాలని శాస్త్రం.

స్నానం కృత్వార్ద్ర వాసాస్తు విణ్మూత్రం కురుతేయది| ప్రాణాయామ త్రయం కృత్వా పునః స్నానేన శుద్ధ్యతి| (స్మృతి)

స్నానం చేసి తడిబట్టతో మూత్రపురీషోత్సర్జనం చేస్తే ప్రాణాయామ త్రయాన్ని చేసి మళ్ళీ స్నానం చేసి శుద్ధుడు కావాలి.

బ్రాహ్మణస్య సితం వస్త్రం|నృపతే రక్తముల్బణం| పీతం వైశ్యస్య శూద్రస్య నీలం మలవదిష్యతే| (భృ.స్మృ)

బ్రాహ్మణుడు తెల్లని వస్త్రాన్ని క్షత్రియుడు ఎర్రని వస్త్రాన్ని, వైశ్యుడు పీత వస్త్రాన్ని ధరించాలి. ఉత్తరీయం ఆవశ్యకతను కూడా నిరూపించారు.

కర్తవ్యముత్తరం వాసః పంచస్వేతే కర్మసు|స్వాధ్యాయ హోమదానేషు భుక్తాచమనయోస్తథా| (భృ.స్మృ)

వేదాధ్యయనం, హోమం, దానం, భోజనం, ఆచమనం ఈ అయిదు క్రియల్లో తప్పకుండా ఉత్తరీయాన్ని ధరించాలి. అలాగే కచ్ఛం (అనగా వెనుక భాగాన్ని గోచీగా పెట్టుకోవడం) లేని వాడు వస్త్రం లేనివాడితో సమానమని చెప్పబడింది.

వికచ్ఛః అనుత్తరీయశ్చ నగ్నశ్చఅవస్త్ర ఏవ చ| శ్రౌతం స్మార్తం తథా కర్మ ననగ్నశ్చింతయే దితి| నగ్నోమలిన వస్త్రస్యాత్ నగ్నశ్చార్ద్ర పటస్మృతః నగ్నస్తు దగ్ధ వస్త్రస్యాత్ నగ్నస్యూతః పటస్తథా|

కచ్ఛం లేనివాడు, ఉత్తరీయం లేనివాడు, వస్త్రాన్ని ధరించని వాడు, మలిన వస్త్రాన్ని ఆర్ద్ర వస్త్రాన్ని ధరించేవాడు, కొంత వస్త్రం కాలిపోగా మిగిలిన వస్త్రం ధరించినవాడు, కుట్టిన బట్టను ధరించినవాడు వీరందరూ నగ్నశబ్దంచే వ్యవహరింపబడతారు. ఇటువంటివారు శ్రౌతకర్మలకు అనర్హులని ధర్మశాస్త్రం చెప్తోంది. కాబట్టి పై విశేషాలను తెలుసుకుని సరియైన వస్త్రాలను ధరించి కర్మారంభం చేయాలని చెప్పినట్లయింది.

భస్మధారణ విధి

జపో హోమో దానం యాగః స్వాధ్యాయః పితృకర్మసు| ఊర్ధ్వపుండ్రమ్ వినా తత్సర్వం భస్మైవ భవతి| అనాచారో అశుచిర్వా పాపం మనసాచరన్| ఊర్ధ్వపుండ్రాంకితః శుచిర్భవేత్|

జపం, దానం, హోమం, యాగం, స్వాధ్యాయం, పితృకర్మలు ఊర్ధ్వపుండ్రం (నుదుటిన విభూతి) లేకుండా చేస్తే సర్వం నిష్ఫలమగునని, ఆచారహీనుడైనా, అసుచి కలవాడైనా ఊర్ధ్వపుండ్రాన్ని ధరిస్తే పవిత్రుడు కాగలడు కావున–

జపహోమదాన వైశ్వదేవ దేవతార్చన శ్రాద్ధేషు నర్యభస్మనా త్రిపుండ్రధారణేన సర్వం అక్షయం భవతి|

అను స్మృతి వచన ప్రకారం త్రిపుండ్ర ధారణ చేసి, జప హోమాదులు చేస్తే ఆ ఫలం అక్షయ మవుతుందని చెప్తోంది. అనగా జపహోమ దాన వైశ్వదేవ దేవతార్చన శ్రాద్ధ కార్యాల్లో **'నర్యభస్మ'** అనగా వైదిక కర్మలందు తయారైన భస్మాన్ని ధరిస్తే జపహోమాదులన్నీ అక్షయమైన ఫలాన్ని ఇవ్వగలవని చెప్తోంది. కావున భస్మధారణ చేసి తీరాలి. భస్మధారణ చేయకూడదనేది ప్రేతశ్రాద్ధ, తీర్థశ్రాద్ధాదులందు అని వ్యవస్థ చేసుకుని, అర్థం చేసుకోవాలి. భస్మధారణ త్రిపుండ్రంగా అడ్డంగా మూడు రేఖలుగా ధరించాలి. అలా ధరించడంచే దేవలక్ష్మమని అగ్నిచయన ప్రకరణంలో ఇష్టకోపధాన సందర్భంలో దూర్వేష్టల లక్షణాల్ని చెప్తూ చెప్పబడింది.

దేవలక్ష్మం వైత్ర్యాలిఖితా తాముత్తర లక్ష్మాణం దేవా ఉపాదధత అధరలక్ష్మాణ మసురాయం కామయేత వసీయాన్థ్యాదిత్యుత్తర లక్ష్మాణం తస్యోపదధ్యాత్ వశీయానేవభవతి యం కామయేత పాసీయాన్థ్యాదిత్య ధర లక్ష్మాణం తస్యోపదధ్యాత్ అసురయోనిమేవైన మనుపరాభావయతి పాపీయాన్భవతి| (తై.సం.5)

మూడు రేఖలతో కూడి ఉండడంచే దేవ చిహ్నమని, ఆ చిహ్నం కూడా పై భాగంలో ఉండాలని, ఇట్టి చిహ్నాలు కలిగిన ఇష్టకలను ఉపధానం చేసి దేవతలు గొప్పవారైనట్లుగా అధో భాగంలో చిహ్న కలిగిన ఇష్టకలను ఉపధానం చేసి అసురులు పరాభవాన్ని పొందారని పై శ్రుతి చెప్తుండడంచే, ఆ దృష్టాన్తంతోనే మనకు ధర్మశాస్త్రకారులు భస్మాన్ని మూడు రేఖలుగా పై భాగాన ధరించి సాక్షాత్తు దేవచిహ్నంతో దేవకార్యాన్నారంభించాలని చెప్పారని గ్రహించాలి. ఇట్టి అర్థవాదలను ఆధారంగా చేసుకుని అనేక ధర్మాలను

స్మృతికారులు విధించినట్లు చాలా ఉదాహరణ లున్నాయి. కావున పై శ్రుతియే త్రిపుండ్ర ధారణకు మూలమని నిరూపించబడింది.

యజ్ఞోపవీతం - మాహాత్మ్యం

"నిత్యోదకీ - నిత్యోపవీతీ" అన్నారు. అంటే నిత్యం స్నానం చేయాలనీ, ఎప్పుడూ చేతిలో ఉదకం ఉండాలని, ఎల్లప్పుడూ యజ్ఞోపవీతాన్ని ధరించే ఉండాలనీ అన్నారు. స్నానం సంధ్యావందనం చేసేటప్పుడు మాత్రం వేసుకుని మళ్ళీ తీసేయవచ్చా అంటే ఏ కర్మ చేసినా యజ్ఞోపవీతం ధరించే ఆచరించాలని శ్రుతిస్మృత్యాదులు చెప్తున్నాయి. దీని ఆవశ్యకతను, మాహాత్మ్యాన్ని ఈ విధంగా నిరూపించారు.

సహవై దేవానాం చాసురాణాంచ యజ్ఞౌప్రతతౌ వాస్తాం వయగ్గ్ స్వర్గం లోకమేష్యామో వయమేష్యామః|
(తై.స్వా.బ్రా)

వయమేవ ఆధిపత్య నిమిత్తం స్వర్గం గమిష్యామః ఇత్యేవం యదా దేవాయజ్ఞే ప్రవృత్తాః| తదానీ మేవ అసురా అపి తథైవ అభిప్రేత్య యజ్ఞే ప్రవృత్తాః తావుభౌ యజ్ఞే ప్రతతౌ విస్తీర్ణా వాస్తాం| (సా.భా)

స్వర్గలోక ఆధిపత్యం కోసం దేవతలు యజ్ఞం ప్రారంభించగా, అసురులు కూడా తామే స్వర్గలోకాన్ని పొందాలనే కోరికతో తామూ యజ్ఞం ప్రారంభించారుట.

తేఽసురా స్సన్నహ్య సహసైవా చరన్ బ్రహ్మచర్యేణ తపసైవ దేవాః తేఽసురా అముహ్యగ్ స్తేన ప్రాజానన్ తేపరాభవన్ తేన స్వర్గం లోకమాయన్ ప్రస్తుతేన వై యజ్ఞేన దేవాః స్వర్గం లోకమాయన్| అప్రస్తుతేనాసురాన్ పరాభావయన్|

అసురులు యజ్ఞసన్నాహంతో కూడినవారై శాస్త్రీయపద్ధతుల్ని అతిక్రమించి భుజబలంతో స్వేచ్ఛగా బ్రహ్మ చర్యాది వ్రతాన్ని అనాదరణ చేసి యజ్ఞాన్ని ఆరంభించారు. దేవతలు బ్రహ్మచర్యంతో నియమ విశేషాలనే తపస్సుచేత యజ్ఞాన్ని చేసారు. అసురులు మూర్ఖత్వంచే మోహాన్ని పొంది ఏది కర్తవ్యమో, ఏది అకర్తవ్యమో తెలియనివారై అశాస్త్రీయంగా యజ్ఞం చేసి స్వర్గాన్ని పొందలేకపోయారు. దేవతలు **'ప్రస్తుతమైన'** యజ్ఞంచే స్వర్గాన్ని పొందారుట. **'అప్రస్తుతమైన'** యజ్ఞంతో కూడినవారై అసురులు పరాభవాన్ని పొందారుట. అయితే **'ప్రస్తుత'**మంటే ఏమిటి? **'అప్రస్తుత'**మంటే ఏమిటి అని ప్రశ్న.

ప్రస్తుతోహవై యజ్ఞోపవీతినో యజ్ఞోఽప్రస్తుతోనుపవీతి నోయత్కించ బ్రాహ్మణో యజ్ఞోపవీత్యధీతే యజత ఏవతత్|

యజ్ఞోపవీత యుక్తస్య యోయజ్ఞః సోయంగుణాధిక్యాత్ ప్రస్తుతః ప్రకర్షేణ వృత్త ఇత్యుచ్యతే| యజ్ఞోపవీత రహితస్య యజ్ఞః గుణ హీనత్వాత్ అప్రస్తుత ఇత్యుచ్యతే| కించ బ్రాహ్మణః యజ్ఞోపవీత యుక్తస్సన్ యత్కిమపి అధీతే తత్సర్వం యాగానుష్ఠాన సమం భవతి| (సా.భా)

యజ్ఞోపవీతంతో అనుష్ఠించిన యజ్ఞం గుణాధిక్యంవల్ల 'ప్రస్తుతమని' అనగా బాగా జరిగిందని, యజ్ఞోపవీతం లేకుండా చేసిన యజ్ఞం 'అప్రస్తుత'మని అనగా యథాశాస్త్రంగా జరగబడలేదని చెప్పబడుతోంది. అందుచే బ్రాహ్మణుడు యజ్ఞోపవీతాన్ని ధరించి అధ్యయనం చేస్తే అది యాగానుష్ఠానంతో సమానమవుతుంది. అందుచేత బ్రాహ్మణులు ఏమి చేసినా- వేదాధ్యయనం చేసినా, చేయించినా, యాగం చేసినా, చేయించినా కూడా **'యజ్ఞోపవీత్యైవ'** యజ్ఞోపవీతం ధరించే చేయవలసింది అని చెప్పింది. అలా చేస్తేనే అవి సగుణమవుతాయని చెప్పబడింది.

అందుకే గౌతములు **'నిత్యోదకీ నిత్యయజ్ఞోపవీతీ'** అని నిత్యమూ యజ్ఞోపవీతాన్ని ధరించాలని, **'విశిఖీవ్యుపవీతీచ యత్కరోతి నిరర్థకమ్'** (గౌ.ధ.సూ) అని శిఖాయజ్ఞోపవీతాలు లేకుండా ఏ కర్మ చేసినా వ్యర్థమవుతుందని చెప్పడంద్వారా యజ్ఞోపవీతం ఆవశ్యకత మరింతగా చెప్పినట్లు అయింది. శాస్త్రదీపిక, భాట్టదీపిక గ్రంథాలందు కూడా ఉపవీత విధి యొక్క ప్రస్తావం ఇలా చేసేరు.

ఉపవీత విషయః విధిర్వా ఇత్యత్ర| స్యాదపూర్వత్వాత్| (పూ.మీ.జై. సూ)

ఉపవీత ధారణ విషయంలో మీమాంసా శాస్త్రంలో 3-4-3 అధికరణంలో **"విధిర్వాస్యాద పూర్వత్వాత్"** అనే సూత్రాన్ని ఆలంబనగా చేసుకుని చాలా విమర్శ చేసి ఉపవీతమనేది విధి అని, **"ఉపవ్యయం తే దేవలక్ష్మమేవ తత్కురుతే"** అని దర్శపూర్ణమాస క్రతువుల్లో నిర్ణయించారు.

ఈ ఉపవీతమనేది దేవ చిహ్నమన్నారు. అందుకనే ఇది వేసుకున్నవాడు కాని వేదాధ్యయనం చేయకూడదన్నారు. యజ్ఞోపవీత శబ్దంచేత ముఖ్య బ్రహ్మసూత్రమే చెప్పబడుతున్నట్లు దానిని ధరించనిదే ఏ కర్మను అనుష్ఠించినా అది వ్యర్థమవుతుందని గౌతములు ఇలా వివరించారు.

విశిఖః అనుపవీతీ చ యత్కరోతి తన్నిరర్థకం స్నానదానాదికం కర్మ ఆసురం భవతి| దినమేకమపి యజ్ఞోపవీతేన వినా స్థితః శూద్రత్వమాప్నోతి మృతః సూకరతాం వ్రజేత్| కాయస్థమేవ ధార్యం న కదాచన ఉద్ధరేత్ తస్య సకృదుద్ధరణేన ప్రాయశ్చిత్తీ భవేత్| (గౌ.ధ. సూ .....)

శిఖాయజ్ఞోపవీతాలు లేకుండా ఏ కర్మను ఆచరించినా అది వ్యర్థమవుతుందని, అసుర ప్రియ మవుతుందని చెప్పబడుతోంది. అందువల్ల ఒక్కరోజు యజ్ఞోపవీతం లేకుండా ఉన్నా జీవించి శూద్రత్వాన్ని, మరణానంతరం శూద్రజన్మను పొందునని నిందద్వారా సూచించి **"కాయస్థమేవ ధార్యం"** అను వచనంచేత యజ్ఞోపవీతాన్ని ప్రతినిత్యమూ శరీరంపై ధరించాలని చెప్తోంది. **'నిత్యోదకీ' "నిత్యయజ్ఞోపవీతీ"** అను వచనంచే యజ్ఞోపవీతాన్ని పురుషార్థంగా ప్రాప్తిస్తున్నట్లు అంగీకరించినా, దాని పూర్వపక్ష ప్రకారం-

కర్మ మధ్యే యజ్ఞోపవీత భ్రేషే తస్య కర్మార్థత్వాభావే కర్మణః న వైగుణ్యం స్మార్తం చ ప్రాయశ్చిత్తమ్| సర్వ కర్మార్థ సిద్ధాన్తే తు కర్మణః వైగుణ్యం శ్రౌత ప్రాయశ్చిత్తం చ| (వ్యాఖ్య)

దీనివల్ల తేలినదేమంటే కర్మమధ్యలో యజ్ఞోపవీతం నష్టమైతే ఆ యజ్ఞోపవీతం పురుషార్థమే కానీ కర్మార్థం కాదు అనే వారి మతం ప్రకారం యజ్ఞోపవీతం భ్రష్టమైన వారిచే అనుసరించబడే కర్మకు వైగుణ్యం లేదని, స్మార్త ప్రాయశ్చిత్తం మాత్రమే అవసరమని చెప్పవలసి వస్తుంది. కానీ సిద్ధాంతమత ప్రకారం భ్రష్ట యజ్ఞోపవీతం కలవాడు చేసిన కర్మ విగుణ మవుతుందని, కర్మ మధ్యలో యజ్ఞోపవీతం భ్రష్టమైతే శ్రౌతప్రాయశ్చిత్తం అవసరమని తెలుస్తోంది. అందుకే గౌతములు **"నా కదాచన ఉద్ధరేత్ తస్య సకృదుద్ధరణేన ప్రాయశ్చిత్తిర్భవేత్"** అని యజ్ఞోపవీతాన్ని ధరించని వాడు ప్రాయశ్చిత్తం చేసుకోవలసిన స్థితి వస్తుందని తెలుస్తోంది. దీనివల్ల తేలినదేమిటి అనగా, బ్రహ్మసూత్ర రూపమైన యజ్ఞోపవీతం సర్వదా ధరించాలని, నియమ విధి అని తెలుస్తోంది.

"ఉపవ్యయతే దేవలక్ష్మమేవ తత్కురుతే" అను మీమాంసాశాస్త్ర విషయ వాక్యంచే విధించబడినది ముఖ్య యజ్ఞోపవీతమా, లేక వానో విన్యాసమా (వస్త్రాన్నే యజ్ఞోపవీతంగా ధరించడమా)? క్రత్వర్థమా లేక పురుషార్థమా అని చాలా విచారణ చేసి దర్శపూర్ణమాస ప్రకరణంలో ఉన్న **'ఉపవ్యయతే'** అను శ్రుతిచే వానోవిన్యాస నియమం విధించబడుతోందని నిర్ణయించారు. కానీ అదంతా శాస్త్రీయ ఫక్కీలో, సామాన్యులకు అర్థం కాని క్లిష్ట భాషలో ఉందని- మనం ఎన్ని యజ్ఞోపవీతాలు ధరించాలి, ఎందుకు ధరించాలి, ఏ విధమైన

నిర్మాణం చేయబడి ఉండాలి అనే విషయాలు స్పష్టంగా తెలియడం లేదని సరళంగా మరింత వివరింపబడుతోంది.

దక్షిణం బాహుముద్ధరతేవ ధత్తే సవ్యమితి – యజ్ఞోపవీతమ్| (తై.శా.స్వా.బ్రా.)

అను శ్రుతి "కుడి భుజానికి కిందకు, ఎడమ భుజానికి పైన ఉండేలా సవ్యంగా ధరించడం యజ్ఞోపవీతమని" నిర్ణయించింది. ఈ శ్రుతిలో చెప్పబడిన యజ్ఞోపవీతం బ్రహ్మసూత్రమా, వానో విన్యాసాత్మకమా అనేది వేరే విచారించవలసి ఉంది. ఏదయినా యజ్ఞోపవీతంగా ధరించడం రెండింటికీ సమానమే. యజ్ఞోపవీత స్వరూపం రెండు విధాలని చెప్పబడింది. 1. నవతంతుక, త్రిసూత్రాత్మక బ్రహ్మగ్రంథి కలిగిన ముఖ్య యజ్ఞోపవీతం 2. **'నిత్యముత్తరం వానోధార్యం'** అనే ఆ. ధ. సూత్రం చెప్పినట్లు, కట్టుకున్న వస్త్రం కాక, పైన ధరించే వస్త్రం రెండో విధమైన యజ్ఞోపవీతం.

ఒక్కో సూత్రానికి మూడేసి పోగులతో మూడు సూత్రాలు, మొత్తం తొమ్మిది పోగులతో ఉండేది ముఖ్య యజ్ఞోపవీతం. **'నిత్యోదకీ నిత్య యజ్ఞోపవీతీ'** అను స్మృతివచనం ప్రకారం ఉపనయనం అయిన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు త్రైవర్ణికులూ నిత్యం ధరించాలని చెప్తోంది.

కార్పా సముపవీతం స్యాత్ విప్రస్యోర్ధ్వ వృతం త్రివృత్|

ఇత్యాది వచనాలచే కార్పంతో (ప్రత్తితో) తయారుచేయబడిన యజ్ఞోపవీతాన్ని బ్రాహ్మణుడు (విప్రుడు) ధరించాలని **"సవ్యాదంసాత్పరి భ్రష్ట కటిదేశ ధృతామ్బరః"** అని, యజ్ఞోపవీతం ఎప్పుడూ ఎడమభుజం నుంచి క్రిందకు జారకూడదని, కటిప్రదేశంలో మొలతాడులా ధరించరాదని, అలా ధరిస్తే, **"ఏకవస్త్రం తు తం విద్యాత్ దైవే పిత్ర్యేచ వర్జయేత్"** (స్మృతి చంద్రిక) అని చెప్పినట్లు ఏకవస్త్రం ధరించినట్లు అవుతుందని కావున దైవ, పిత్ర్యాది కర్మలకు అనర్హుడని తెలుస్తోంది. నిత్యం ధరించే కట్టుకున్న వస్త్రం కాక పైన మరో వస్త్రం ధరించాలని, అది రెండో విధమైన యజ్ఞోపవీతమని, **"సోత్తరాచ్ఛాదనశ్చైవ యజ్ఞోపవీతీ భుంజీత"** (ఆ.ధ.సూ.2-19-2) అను సూత్రంచే ఉపరి వస్త్రాన్నే యజ్ఞోపవీతంగా ధరించి భుజించాలని చెప్తోంది.

ఇంతేకాదు, **"ఉపాసనే గురూణాం వృద్ధానామతిథీనాం హోమే జప్య కర్మణి భోజనే ఆచమనే స్వాధ్యాయే చ యజ్ఞోపవీతః స్యాత్"** (ఆ.ధ.సూ.1-15-1) ప్రకారం గురువుల, వృద్ధుల, అతిథుల సేవా సమయంలో, హోమ సమయంలో, జప, భోజన, ఆచమన సమయాల్లో యజ్ఞోపవీతం తప్పని సరిగా ఉండాలని విధిస్తోంది.

ఈ సూత్రవ్యాఖ్యలో **'వానోవిన్యాస విశేషః యజ్ఞోపవీతం'** అని, **"సహ వై దేవానాం చాసురాణాం చ"** అనే కాఠక శ్రుతి వ్యాఖ్యలోను వానో విన్యాసాత్మకమని చెప్పారు. ఇదే తీరుగా సావిత్ర కాఠకంలో బ్రాహ్మణంలో **"యజ్ఞోపవీతం కృత్వాధో నివిపాత| నమో| నమ"** అనే శ్రుతి వ్యాఖ్యలో కూడా సావిత్రాగ్ని దేవునికి గౌతముడు తన వస్త్రాన్ని యజ్ఞోపవీతంగా ధరించి భూమ్మీద ఒక దండం(కర్ర)వలె పడి నమస్కరించెనని వివరించారు. దీన్ని బట్టి అతిథి పరిచర్యలో వానోవిన్యాసాత్మకమైన ఉపవీతాన్ని ధరించాలని తెలుస్తోంది. ఇటువంటి రెండో విధమైన యజ్ఞోపవీతం కొన్ని క్రియలందు మాత్రమే ఆవశ్యకమని మాత్రమే గమనించవలెను.

ముఖ్య యజ్ఞోపవీతాలు ఏ ఆశ్రమానికి చెందినవారు ఎవరెవరు ఎన్నెన్ని ఉపవీతాలు ధరించాలని చూస్తే-

వటోరేక ముపవీతం, గృహస్థారణ్యవాసినోర్ద్వే, వస్త్రాభావే తృతీయముత్తరార్థే| (గౌ.ధ.సూ.)

ఉపనీతునికి (బ్రహ్మచారికి) ఒక యజ్ఞోపవీతమని, గృహస్థునకు రెండు యజ్ఞోపవీతాలని, పై వస్త్రం (ఉత్తరీయం) లేని సందర్భాల కోసం గృహస్థులు మూడో యజ్ఞోపవీతాన్ని ధరించాలని చెప్తోంది. అయితే పై ఉత్తరీయం ఉంటే మూడో సూత్రాన్ని వదిలేయ వచ్చునా అని, మూడో సూత్రం ఉంటే ఉత్తరీయాన్ని వదిలేయ వచ్చునా అని శంక కలుగుతుంది. **"నిత్యముత్తరం వాసః"** అనడంచే నిత్యమూ ఉత్తరీయాన్ని ధరించాలని ప్రమాదవశాత్తూ ఉత్తరీయం లేని సందర్భాల కోసం ప్రత్యామ్నాయంగా మూడో సూత్రాన్ని ధరించాలని చెప్పబడింది. శ్రౌతపరంగా ఉదాహరణను చూస్తే-పురోడాశమనే హవిస్సు కోసం వ్రీహులను (ధాన్యాన్ని) సంపాదించాలని ఆ ద్రవ్యం దొరక్కపోయినా, దొరికిన ద్రవ్యం నష్టపోయినా వ్రీహులకు ప్రతినిధిగా నీవార ధాన్యాన్ని స్వీకరించాలని అన్నారు. కానీ ఈ పురోడాశానికి ముఖ్యమైన వ్రీహులు దొరికితే నీవార ధాన్యాన్ని వదలిపెట్టి వ్రీహులనే స్వీకరించాలని చెప్పిన విధంగా వస్త్ర ప్రతినిధి రూపంగా సూత్రమున్నా, ఉత్తరీయాన్ని మాత్రం వదిలిపెట్టకూడదు అన్నారు.

అంతే కాదు, ఇక్కడ వస్త్రప్రతినిధి రూపంగా చెప్పబడిన సూత్రం ఏదో ఒక కర్మ కోసమే స్వీకరింపబడ లేదు. సర్వకర్మలకోసం స్వీకరింపబడింది కనుక అన్ని కర్మల్లో పై వస్త్రం లేకపోవడం అనేది కనుక ఉత్తరీయం ప్రతినిధిగా ధరించిన సూత్రాన్ని వదిలిపెట్ట కూడదని, సూత్రం ఉంది కదా! అని ఉత్తరీయాన్ని వదలకూడదని చెప్పారు.

ఇంత చెప్పడానికి కారణం సదా ద్వివస్త్రుడు అయ్యే ఉండాలని శాస్త్ర హృదయం.

ఏక వస్త్రో న భుంజీ యాన్నకుర్యాద్దేవతార్చనమ్| నార్చయేద్ద్విజాన్నాన్యత్ కుర్యాదేవం విధోనరః| హోమే దేవార్చనాద్యాసు క్రియాస్వాచమనే తథా|(స్మృతి)

నైకవస్త్రః ప్రవర్తేత ద్విజోవాచనికే జపే|

ఇత్యాది వచనాలు అధో భాగాన ధరించిన వస్త్రం కాక మరో వస్త్రాన్ని ఉపరి భాగాన ధరించనిదే జప, హోమ, దేవతార్చనలు ఏమీ చేయరాదని చెప్తున్నాయి. అయితే బ్రహ్మచారి కూడా అజినాన్ని గాని (జింక చర్మాన్ని) వస్త్రాన్ని గాని, పైన ధరించకపోతే ప్రతినిధిగా మరో సూత్రాన్ని ధరించాలా అనే శంకకు బ్రహ్మచారి ప్రకరణంలో ఆపస్తంబులే సమాధానం చెప్పారు.

యజ్ఞోపవీతీ ద్వివస్త్రః యదా ద్వివస్త్రః తదా అన్యతరేణ వస్త్రేణ యజ్ఞోపవీతవదేకం ధారయేత్|(ఆ.ధ.సూ)

అను సూత్రంచే బ్రహ్మచారి రెండు వస్త్రాలు కలవాడైతే రెండో వస్త్రాన్ని యజ్ఞోపవీతంలా ధరించాలని, అలా కాకపోతే **"అధోనివీతస్త్వేక వస్త్రః"** ఒక వస్త్రం కలవాడే అవుతాడని కూడా చెప్పారు. బ్రహ్మచారి ఒక యజ్ఞోపవీతం ధరించి పై వస్త్రాన్ని కూడా ధరించాలని చెప్పారు.

తర్హి తస్య ద్వితీయ వస్త్రాభావే కిం కార్యమిత్యపేక్షాయాం సర్వసాధారణ్యేన అపి వా సూత్రముపవీతార్థే|

అనే సూత్రంచే ద్వితీయం వస్త్రం లేకపోతే దాని స్థానంలో ధరించిన సూత్రమే సరిపోతుందన్నారు. కానీ **"ఏకవస్త్రస్య తదేక దేశేన ద్వివస్త్రం న కార్యం"** అని కట్టుకున్న వస్త్రాన్నే కొంతభాగం పైన ధరించి ద్వివస్త్రుడు కాకూడదన్నారు. దీనివల్ల లోకంలో ప్రసిద్ధాలైన బ్రహ్మ సూత్రాత్మక యజ్ఞోపవీతాలను రెండింటిని ధరిస్తూ గృహస్థు పై వస్త్రాన్ని కూడా ధరించాలని, ఒకప్పుడు అది లేకపోతుందేమో అని మూడవ యజ్ఞోపవీతాన్ని కూడా ధరించాలన్నారు. సంప్రదాయం కూడా ఇలాగే ఉంది. బ్రహ్మచారికి మాత్రం మరో యజ్ఞోపవీత ధారణ చెప్పబడలేదు.

యజ్ఞోపవీత ధారణ సంధర్భంలో వస్త్ర విచారణ ఎందుకని శంకించవచ్చు! వస్త్ర ప్రతినిధిగా కూడా ఒక యజ్ఞోపవీతం చెప్పబడడం వల్ల ఈ ప్రసంగంలో అది కూడా చెప్పవలసి వచ్చింది.

యజ్ఞోపవీత ధారణవల్ల ప్రయోజనం?

యజ్ఞోపవీతం లేకుండా అనుష్ఠించిన ఏ కర్మ అయినా వ్యర్థమవుతుందని శాస్త్రం చెప్పడం వల్ల అటువంటి వైయర్థ్యం (వ్యర్థమయ్యే పరిస్థితి) లేకపోవడం ఒక ప్రయోజనమైతే **'ఉపవ్యయతే దేవలక్ష్మమేవ తత్కురుతే'** అని ఉపవీతం ఒక వాసోవిన్యాసమని నిర్ణయించినా అనేక చోట్ల ఉపవీత శబ్దంచే సూత్రాత్మక (ముఖ్య) యజ్ఞోపవీతం కూడా చెప్పబడం వల్ల దీని ధారణచే **'దేవచిహ్నం'** కలవాడు అవడం మరో ప్రయోజనం అన్నారు.

యజ్ఞోపవీతంలోని అన్ని తంతువులకు (పోగులకు) అభిమాన దేవతలున్నారని చెప్పబడుతున్నారు.

ప్రథమస్తు ఓంకారః ద్వితీయోఽగ్నిః తృతీయో నాగదైవత్యః చతుర్థో వాయుదేవతాకః పంచమః పితృదైవత్యః షష్ఠః ప్రాజాపత్యః సప్తమో విష్ణుదైవత్యః అష్టమస్సౌర్యః సర్వదైవత్యో నవమః|

ఓంకారము, అగ్ని, నాగదేవత, వాయుదేవుడు, పితృదేవతలు, ప్రజాపతి, విష్ణువు, సూర్యుడు, సర్వదేవతలు- ఇలా వరుసగా తొమ్మిది తంతువులకూ అభిమాన దేవతలు ఉన్నారని చెప్పడం ద్వారా యజ్ఞోపవీతం సర్వదేవతాకమని తెలుస్తోంది.

యజ్ఞోపవీత ధారణ మంత్రం

యజ్ఞోపవీతం పరమం పవిత్రం ప్రజాపతేర్యత్సహజం పురస్తాత్| ఆయుష్యమగ్రియం ప్రతిముఞ్చ శుభ్రం యజ్ఞోపవీతం బలమస్తు తేజః| (బ్ర.ఉ.)

యజ్ఞార్థమై ధరించబడిన, లేక ప్రజాపతిచే ధరించబడిన, పరమం-ఉపనయన సంస్కారంద్వారా వేదాధ్యయానానికి అర్హత కలిగిస్తున్న, ధరించిన వానిని పవిత్రం చేయునట్టి, బ్రహ్మదేవునికి సృష్ట్యారంభం నుండి అన్నింటికంటే ముందుగానే ఉన్నటువంటి ఏ బ్రహ్మసూత్రం ఉందో, ఆ బ్రహ్మ సూత్రం ఆయుస్సుని ఇచ్చేది, శ్రేష్ఠమైనది, నిర్మలమైనది, ధర్మానుష్ఠాన సామర్థ్యం కలది, తేజస్సును ఇచ్చేది అగు గాక! అని యజ్ఞోపవీత అభిమాన దేవతను ప్రార్థించడంవల్ల ఈ ఫలం మనకు సిద్ధించడం యజ్ఞోపవీతధారణకు పరమ ప్రయోజనం.

ఈ ప్రకారం ఇంత ప్రాధాన్యత గల, ఆవశ్యకమైన యజ్ఞోపవీతాన్ని ధరించినవాడై **"స్థిరమనాః ప్రాఙ్ముఖస్సమే పీఠ ఉపవిశ్య పాదౌహస్తౌ చ ప్రక్షాళ్య ద్విరాచామేత్"** (గౌ.ధ.సూ.) ప్రకారం స్థిరమైన మనస్సు కలవాడై, తూర్పుముఖంగా సమమయిన పీఠంపై కూర్చుని పాదాలను హస్తాలను ప్రక్షాళన చేసుకుని, పురాణాచమనాన్ని స్మృత్యాచమనాన్ని చేసి సంధ్యాకర్మ (సంధ్యావందనం) ఆరంభించాలి.

సంధ్యావందనం - దాని ఆవశ్యకత

శ్రుతి, స్మృతులచే విధింపబడిన కర్మలు **1. నిత్యములు 2. నైమిత్తికములు 3. కామ్యములు** అని మూడు విధాలు**.**

ఏవి చేయకపోతే ప్రత్యవాయం వస్తుందో, ఏవి వీప్సతో కూడిన (ద్విరుక్తి-మళ్ళీ మళ్ళీ చెప్పడం) 'యావజ్జీవ' ఇత్యాది పదాలతో కూడిన విధి వాక్యాలచే విధింపబడ్డాయో అవి నిత్యములు. **"యావజ్జీవ**

మగ్నిహోత్రం జుహోతి", **"యావజ్జీవం దర్శపూర్ణమాసాభ్యాం యజేత", "వసన్తే వసన్తే జ్యోతిషా యజేత"** ఇత్యాది వాక్యాలచే విధింపబడిన అగ్నిహోత్ర, దర్శపూర్ణమాస జ్యోతిష్టోమాది శ్రౌతకర్మలు నిత్యాలు. నిత్యం, అనగా అవి చేయాలని చెప్పబడినప్పుడల్లా (చెప్పబడిన రోజు/పక్షం/మాసం/సంవత్సరం) చేయాల్సినవి నిత్యకర్మలు.

అహరహస్సంధ్యాముపాసీత నిత్యోధార్యః సాయంప్రాతరత ఊర్ధ్వంతండులైర్యవైర్వా జుహుయాత్| (ఆ.గృ.సూ.)

"యావజ్జీవం ఔపాసనమ్ హోష్యామి" ఇత్యాది సంకల్ప విధి వాక్యాలచే విధింపబడిన సంధ్యావందన, ఔపాసనాది స్మార్తకర్మలు నిత్యములని నిర్ణయించారు. అందులోదే సంధ్యావందన కర్మ. ఇది చేయనిదే ఏ స్మార్త శ్రౌత కర్మలకూ అధికారం లేదు కనుక ఇది అత్యంత ప్రధానమైన నిత్యకర్మ. ఇది చేయకపోతే ప్రత్యవాయాది మహాదోషాలు సంభవిస్తాయని స్మృతులు చెప్తున్నాయి.

సంధ్యాయేన న విజ్ఞాతా సంధ్యా యేనానుపాసితా| జీవమానో భవేచ్ఛూద్రః మృతః శ్వానోభిజాయతే| (గో.స్మృ)

ఉపతిష్ఠన్తి యే సంధ్యాం యేన సంధ్యాం యేన పూర్వాం న పశ్చిమామ్ వ్రజన్తి తే దురాత్మనః తామిస్రం నరకం ధ్రువమ్|

ఇత్యాది అనేక వచనాలు సంధ్యని తెలుసుకోని వారు, దివా, సాయంకాలాల్లో సంధ్యని ఉపాసించని వారు జీవించిన కాలంలోనే శూద్రునితో సమానంగా పరిగణింపబడుతూ, జన్మాంతరంలో నీచమైన జన్మను పొందుతారని, చీకటితో కూడిన నరకాలను పొందుతారని చెప్తోంది.

సంధ్యాహీనోఽశుచిర్నిత్య మనర్హస్సర్వ కర్మసు| యదన్యత్కురుతే కర్మ న తస్య ఫల భాగ్భవేత్| యోన్యత్ర కురుతే యత్నం ధర్మకార్యే ద్విజోత్తమః| విహాయ సంధ్యా ప్రణతిం సయాతి నరకాయుతమ్|

ఇత్యాది వచనాలన్నీ సంధ్యావందనం చేయనిదే ఏ కర్మకూ అధికారి కాలేడని, అధికారం లేకుండా చేసిన కర్మ ఫలమివ్వదని మొదలగు విశేషాలను చెప్తున్నాయి. వీటన్నింటివల్ల సంధ్యావందనం తప్పకుండా చేయాలని స్పష్టం.

సంధ్యా శబ్దార్థం

సంధ్యాయాః వందనమ్ సంధ్యావందనమ్|

అహోరాత్రస్య యస్సంధిః సూర్యనక్షత్ర వర్జితః ప్రాతస్సంధ్యా సమాఖ్యాతా మునిభిస్తత్వ దర్శిభిః|

సూర్యుడు, నక్షత్రాలు లేని అహోరాత్రుల సంధికాలం సంధ్యాకాలం. సంధ్యా శబ్దం ప్రత్యేకమైన కాలాన్ని సూచించే కాలవాచకమైనా, ఆ కాలంలో ఉపాసింపదగిన దేవత సంధ్యాశబ్దంచే చెప్పబడుతోంది. సంధ్యాదేవత ఉపాసనతో కూడిన ఆచమనాది క్రియాకలాపం సంధ్యావందనం. పరంపరగా సంధ్యాశబ్దం కర్మపరంగా ప్రయోగింపబడుతోంది.

సంధౌభవా సంధ్యా ఇతి| సంధౌ సంధ్యాముపాసీత|

ఉపాస్తే సంధివేళాయాం నిశాయా దివసస్య చ తామేవ సంధ్యాం తస్మాత్ప్రవదన్తి మనీషిణః|

అహోరాత్రుల సంధికాలంలో సంధ్యాదేవతను ఉపాసిస్తూ చేసే క్రియాకలాపం సంధ్య అని సారాంశం. ఈ ఉపాసించబడే సంధ్యాదేవత ఎవరు? అనే ప్రశ్నకు-

యా సంధ్యా యా జగత్సూతిః మాయతీతా హి నిష్కళా ఈశ్వరీ కేవలా శక్తిః తత్త్వత్రయ సముద్భవా ధ్యాత్వార్క మండల గతాం సావిత్రీం వై జపేద్బుధః|

ఇత్యాది వచనాలచే అర్కబింబంగా కనబడుతున్న, ఆదిత్యుడని పిలవబడుతున్న పరబ్రహ్మ స్వరూప మైన, గాయత్రీ శబ్దంచే చెప్పబడుతున్న చిచ్ఛక్తియే (చిత్ శక్తి) సంధ్యాదేవత. అటువంటి దేవతని ధ్యానిస్తూ **"సంధౌ భవా సంధ్యా"** అనే వ్యుత్పత్తిచే సంధికాలంలో ఆచమనం నుంచి అభివాదన వరకు చేయబడు క్రియాకలాపం సంధ్యా శబ్దార్థం. ఈ సంధ్య మూడు విధాలు-

సంధ్యాత్రయం చ కర్తవ్యం ద్విజేనాత్మవిదా సదా| గాయత్రీ నామ పూర్వాహ్ణే సావిత్రీ మధ్యమే దినే| సరస్వతీచ సాయాహ్నే సైవ సంధ్యా త్రిధాస్మృతా|

ప్రాతఃకాల, మధ్యాహ్నకాల, సాయంకాలాల్లో యథాక్రమంగా గాయత్రిగా, సావిత్రిగా, సరస్వతిగా ఉపాసింపదగినదని చెప్పబడింది. ఇక్కడ ఉపాసన అనగా అభిధ్యానం.

ఉద్యన్త మస్తంయంత మాదిత్య మభిధ్యాయన్ కుర్మన్ బ్రాహ్మణో విద్వాన్ సకలం భద్రమశ్నుతే| అసావాదిత్యో బ్రహ్మేతి బ్రహ్మైవసన్ బ్రహ్మాప్యేతి య ఏవం వేద| (తై.ఆ.2)

ఇందులో చెప్పబడిన ప్రాణాయామాది కర్మ చేస్తూ ఆదిత్యుని బ్రహ్మగా ధ్యానిస్తూ సంధ్యాకలాపాన్ని అనుష్ఠించే పురుషుడు సర్వ శ్రేయస్సులను పొందగలడని, యథోక్తమైన ధ్యానంచే శుద్ధాంతఃకరణుడై బ్రహ్మసాక్షాత్కారాన్ని పొందగలడని సంధ్యాభాష్యంలోను, పరాశర మాధవీయంలోను వివరించారు. బ్రహ్మసాక్షాత్కారం అంటే, అంతకు ముందు కూడా తాను బ్రహ్మే అయి ఉన్నా అజ్ఞానంతో జీవుడనే భ్రమతో ఉండి, సాక్షాత్కారానంతరం జీవుడనే భ్రమ పోయి బ్రహ్మభావాన్ని పొందడమే అని వివరించారు. అది అంతకు ముందు ఉన్నదే కదా, క్రొత్తగా వచ్చిందేమిటి, నీ స్వరూపాన్ని నువ్వు పొందడము అంటే ఏమిటి ? అంటే –

దశమస్త్వమ్ ఇతివత్|

అని ఉదాహరణ చెప్పారు. ఓ పదిమంది నదిని దాటేరుట. అందరూ దాటేక మనమందరమూ జాగ్రత్తగా దాటివచ్చామా లేదా అని ప్రతివాడూ లెక్క వేస్తున్నాడట. లెక్కిస్తే తొమ్మిది మందే వచ్చేరట. ఇలాగే పదిమందీ లెక్క పెట్టినా తొమ్మండుగురే వస్తున్నారుట. అయ్యో! ఒకడు తప్పిపోయాడే అని అందరూ ఏడుస్తూ ఉన్నారట. ఆ దారిలో వెళ్తున్నాయన వచ్చి, ఏమైంది? ఎందుకు ఏడుస్తున్నారు అంటే, ఇలా పది మందిమి నదిని దాటేం. ఇప్పుడు తొమ్మండుగురమే ఉన్నాం అన్నారట. ఆయన లెక్క పెట్టి, పది మంది ఉన్నారయ్యా ఏడవకండి అన్నాడట. ఇదివరకు తమని తాము లెక్కపెట్టుకోవడంలో, ఆ లెక్కపెట్టిన వాడు తనని తాను లెక్క పెట్టుకోవడం మర్చిపోయాడుట. ఆ వచ్చినాయన **"దశమస్త్వం"** నీవేనయ్యా పదోవాడివి అని సత్యం చెప్పాడుట. ఇక్కడ అంతకుముంది లేనివాడు ఎవడూ రాలేదు. ఉన్నవాడినే గుర్తించేరు.

ఇదే ప్రకారంగా బ్రహ్మ సాక్షాత్కారమంటే, అంతకు ముందే ఉన్న బ్రహ్మ స్వరూపాన్ని యథార్థంగా గుర్తించడం అని వివరించారు. ఈ ప్రకారం ఉత్తమమైన ఫలాలున్నాయి కనుక ప్రాతర్మధ్యందిన సాయంకాల సమయాలు మూడింట్లోను సంధ్యోపాసన అనుష్ఠించదగినదని చెప్పడమైనది.

సంధ్యావందనానికి సమయాలేవి?

ఉత్తమా సూర్య సహితా మధ్యా అనుదిత తారకా| అధమా తారకోపేతా సాయం సంధ్యా త్రిధామతా|

సంధ్యాకాలం ముఖ్య, మధ్య, గౌణములనే భేదాలతో కూడి ఉంది. సూర్యబింబం ఉండగా, అనగా అర్ధాస్తమయ సమయంలో సాయం సంధ్య నారంభించి చేయడం ముఖ్య పక్షం. అనగా నక్షత్రోదయం అయ్యే దాకా గాయత్రీ జపం చేసి **"ఇమం మే వరుణ"** అనే మంత్రంతో సూర్యుడి ఉపస్థానం చేసి సంధ్యను పూర్తి చేయడం ముఖ్య పక్షమని అర్థం.

సూర్యుడు అస్తమించిన పిమ్మట ఆరంభించి చేయటం మధ్యమ పక్షం **"త్రిముహూర్తః ప్రదోషః స్యాత్ భానావస్తం గతే సతి"** అను వచనం ప్రకారం సూర్యాస్తమయం నుంచి మూడు ముహూర్తాల (ఆరు ఘడియల) కాలం ప్రదోషకాలమని చెప్పబడడంచే నక్షత్రోదయం అయ్యాక ఆ కాలంలో చెయ్యడం గౌణ పక్షం. ఇది సాయంకాల సంధ్యా విషయం. ఇక ప్రాతః, సంధ్యా కాల విషయం.

ఉత్తమా తారకోపేతా మధ్యమా లుప్తతారకా| అధమా సూర్యసహితా ప్రాతస్సంధ్యా త్రిధామతా|

"ప్రాఙ్ముఖస్తిష్ఠన్ ఆసూర్య దర్శనాత్ సావిత్రీం జపేత్" (గౌ.ధ.సూ) అను గౌతమ వచనానుసారం నక్షత్రాలు ఉండగా ప్రారంభించి అర్ఘ్యప్రదాన మిచ్చాక తూర్పుముఖంగా నిలబడి సూర్యోదయం వరకు గాయత్రీ జపం చేసిన తర్వాత **"మిత్రస్య చర్షణీ ధృతః"** అను మంత్రంచే సూర్యోపస్థానం చేసి సంధ్యావందనం పూర్తిచేయడం ముఖ్య(ఉత్తమ) పక్షం.

నక్షత్రాలు అస్తమించాక ఆరంభించి చేయడం మధ్యమం. **"ముహూర్త త్రయం ప్రాతః"** అను వచనానుసారం సూర్యోదయం అయ్యాక ఆరు ఘడియల వరకు ప్రాతఃకాలంగా చెప్పబడుతోంది కనుక ఆ కాలంలో చేయడం గౌణ(మూడో) పక్షం.

బాగా పర్యాలోచన చేసి చూస్తే **"అశక్తుని విషయంలో"** ప్రాతః కాలం ఆరు ఘడియల వరకు, సాయంకాలం ఆరు ఘడియల వరకు కూడా ముఖ్య పక్షంగా చెప్పబడుతోంది. ఇక్కడ అశక్తుడు అని చెప్పబడదాన్ని గుర్తుంచుకోవాలి.

ముఖ్య కాలే యదావశ్యం కర్మకర్తుం న శక్యతే| గౌణ కాలేపి కర్తవ్యం గౌణోప్యత్ర ఈదృశోమతః|

అనడంచే అశక్తునికి **"మతః ఈదృశః"-** అశక్తునికి గౌణకాలం కూడా ముఖ్య కాలమనే భావం.

దివోదితాని కర్మాణి ప్రమాదాదకృతాని వై| శర్వర్యాః ప్రథమే పాదే తాని కుర్యాధ్యథాక్రమం|

కారణాంతరాలచే గౌణ కాలం కూడా దాటిపోతే ప్రాతస్సంధ్యను సాయంకాలంవరకు ప్రాయశ్చిత్త పూర్వకంగా రాత్రి యొక్క ప్రథమ పాదంలో చేయవచ్చని చెప్పబడుతోంది. రాత్రి ప్రథమపాదం కూడా అతిక్రమిస్తే కర్మలోపం అని కూడా చెప్పింది. అంటే ఆ రోజు కర్మ చేయనట్లే లెక్క. లోకంలో కూడా అంతే కదా! తన కార్యాలయానికి సమయానికి వెళ్ళాలి. కొంచెం ఆలస్యం అయినా వెళ్ళేక సర్ది చెప్పుకునో, ముందుగా చెప్పుకునో హాజరవ వచ్చును. ఇంకా కారణాంతరాలవల్ల ఇంకా ఆలస్యమైనా కార్యాలయం తెరచి ఉంచే లోగా వెళ్తే, సరైన కారణాలుంటే చెప్పుకుని 'లేటుమార్కు'తో సంతకం చేయవచ్చు. మరీ కార్యాలయం మూసేసాక వెళ్ళడం కుదరదు కదా! అదే విధంగా ముఖ్య, మధ్యమ, గౌణ కాలాల్లో అయినా సంధ్యావందనం చెయ్యాలని తాత్పర్యం. గౌణకాలం కూడా దాటిపోతే ఆ రోజు కర్మ లోపించినట్లు లెక్కించి మర్నాడు కర్మలో ప్రాయశ్చిత్తం, ద్వాదశ ప్రాణాయామం మొదలైనవి చేసుకుని తిరిగి నిత్యకర్మను ఆరంభించాలి.

ముఖ్య కాలం అతిక్రమిస్తే శిరోవ్యాహృతులతో కూడిన (ఓం భూః, ఓం భువః...బ్రహ్మ భూర్భువస్సువరోమ్ వరకు), గాయత్రీ మంత్రంతో అర్ఘ్యప్రక్షేపాన్ని, **"ప్రాణాయామ త్రయం పాఠః"** అను వచనాలచే మూడు ప్రాణాయామాలు ఆచరించడం ఈ రెండు ప్రాయశ్చిత్తాలు జంటగా ఆచరించాలని సుదర్శనాచార్యులు చెప్పారు.

'ఆచమనం భోజన లోపః ప్రాణాయామశ్చ' అని ఆ రోజు కర్మ పోతే ఆచమనం చేయడం, నిరాహారం, ప్రాణాయామాలు ఆచరించాలని, మీమాంసా శాస్త్రంలోని **"దోష నిర్ఘాతార్థానాం ప్రాయశ్చిత్తాని సముచ్చయేరన్"** అను జైమిని సూత్ర ప్రకారం నిర్ణయించారు.

మాధ్యాహ్నిక సంధ్యకు మధ్యాహ్నం మూడు ఘడియల కాలం ముఖ్య కాలం. **"అధ్యర్ధయామ మాసాయం సంధ్యా మాధ్యాహ్నికీష్యతే"** అను వచనానుసారం మాధ్యాహ్నిక సంధ్యకు మధ్యాహ్నం ఒక అర్ధయామం తర్వాత సాయంకాలం వరకు గౌణ కాలంగా చెప్పబడింది.

ప్రాతస్సంధ్యకు మాధ్యాహ్నిక సంధ్యకు కూడా గౌణకాలం కూడా దాటిపోతే ఇంతకు ముందు చెప్పినట్లుగా సాయంకాలం మొదటి పాదం వరకూ ప్రాతర్మధ్యందిన సంధ్యలను ప్రాయశ్చిత్త పూర్వకంగా చేయవచ్చు. ఈ ప్రకారం ఉషఃకాలం నుంచి సూర్యోదయం వరకు ముఖ్య కాలంగా చెప్పి **"ఆసంగవం ప్రాతస్సంధ్యాయాః గౌణకాలః ఆప్రదోషాన్తం చ సాయం సంధ్యాయా గౌణః"** అని సంగవ కాలం వరకు ప్రాతస్సంధ్యకు గౌణ పక్షమని చెప్పారు.

న ప్రాతర్నప్రదోషశ్చ సంధ్యాకాలోఽతి పద్యతే| ముఖ్యకల్పేను కల్పశ్చ సర్వశ్చ సర్వస్మిన్కర్మణి స్మృతః| (వృద్ధ మనుః)

ప్రాతశ్శబ్ద వాచ్యమైన, ప్రదోష శబ్ద వాచ్యమైన కాలంలో చేసినా కాలాతిక్రమణం అయినట్లు కాదు. సర్వ కర్మలందు అవకాశాలను బట్టి, శక్తాఽశక్త పక్షాలను బట్టి ముఖ్యకల్పం, అనుకల్పం చెప్పబడు తున్నాయి. ఇక్కడ మరో విశేషం కూడా చెప్పబడింది.

ప్రాతస్సంధ్యాం స నక్షత్రాం మధ్యమం స్నాన కర్మణి| సాదిత్యాం పశ్చిమాం సంధ్యా ముపాసీత యథావిధిః|

నక్షత్రాలతో కూడిన కాలంలో ఆరంభించి ప్రాతస్సంధ్యను చేయడం ముఖ్యమే గాని అలా చేయలేకపోతే మాధ్యాహ్నిక స్నానానంతరం చేయడం మధ్యమ పక్షమని చెప్పారు. ఈ ప్రకారంగా మహర్షులు మన సామర్థ్యాన్ని గుర్తించి ఎలాగైనా నిత్యకర్మ అయిన సంధ్యావందనం మానకుండా ఉండడానికి అనేక పక్షాలను చెప్పారు. అంతే కాదు ఉన్మాద దోషం కలవాడైనా కానీ వరుసగా ఏడు రోజులు సంధ్యావందనాన్ని మానేస్తే మళ్ళీ ఉపనయనం చేసుకోవాలన్నారు.

సంధ్యాతిక్రమణం యస్య సప్త రాత్రమవిచ్యుతమ్| ఉన్మత్త దోష యుక్తోఽపి పునస్సంస్కార మర్హతి|

ఇంతగా చెప్పడంతో సంధ్యావందనానికి ఉన్న ప్రాముఖ్యం స్పష్టమవుతోంది. తదుపరి సంధ్యా వందనానికి **"ఇతి కర్తవ్యతా విచారః"** అనగా సంధ్యా వందనం చేయవలసిన ప్రకార విశేషం కూడా వివరించబడింది.

సంధ్యావందన విధానం - సంకల్పం

సంధౌ సంధ్యాముపాసీత నాస్తగే నోద్గతే రవౌ| (యా.వ.స్మృ.)

"సంధ్యాత్రయం తు కర్తవ్యం ద్విజేనాత్మవిదా సదా"

అనే వాక్యాలచే ద్విజుడు ప్రాతః, సాయం సంధ్యాకాలాల్లోను, మధ్యాహ్నం మొత్తం రోజు మూడు కాలాల్లోను సంధ్యోపాసన చెయ్యాలని ముందే తెలుసుకున్నాం.

తిథి ద్వైధే సందేహః ప్రాతః కాలాద్యవిచ్ఛిన్న జీవనం నిమిత్తం సంధ్యాది కర్మసు, ఏకస్యాం తిథౌ సకృ త్కరణేనైవ శాస్త్రార్థ సిద్ధేః తిథివృద్ధౌ తిథిరూప గుణానురోధేన ప్రధానావృత్తేరన్యాయత్వాదితి సందేహః|

ఒకేరోజు రెండు తిథులు వచ్చినప్పుడు ఏ తిథి చెప్పి సంకల్పం చేయాలనే సందేహం కలుగుతుంది. సంకల్పాన్ని మానడానికి లేదు.

న చ శ్రాద్ధం న తద్దానం న హోమో న జపస్తథా| న ప్రాప్నోతి ఫలం తస్య సంకల్పరహితం యదా|

శ్రాద్ధం, దానం, హోమం, జపం సంకల్ప రహితంగా చేస్తే వాటివల్ల ఫలితం ఉండదని అర్థం. కాబట్టి సంవత్సర, ఆయన, రుతు, మాస, పక్ష, తిథులతో కూడిన సంకల్పంచే కర్మను ఆరంభించాలి. ఒక్కోసారి వెనుకటి రోజు తిథే రెండో రోజున కూడా వృద్ధి పక్షంలో ఉంటే మళ్ళీ అదే తిథి చెప్పి సంకల్పం చేస్తే ఒకే తిథిలో రెండుసార్లు సంధ్యను ఆచరించినట్లు అవుతుందని శంక. కానీ మనం చేసే సంధ్యాది కర్మకు ఆయా ప్రాతఃకాలాల్లో ఉండే తిథి నిమిత్తమా, లేక తిథులతో కూడిన కాలం నిమిత్తమా అని మరో సందేహం.

నిమిత్తం కాలమాదాయ కర్మానుష్ఠాన యోగ్యతా| నిషేధస్తు నివృత్యాత్మా కాలమాత్ర మపేక్షతే|

విధి నిషేధాలకు కాలం ముఖ్యం. కానీ విధివిహితమైన కర్మలకు తిథి ముఖ్యం. అనుష్ఠాన యోగ్యత తిథులకి ఉంది. అదే తిథులకు పూజ్యత అని చెప్పబడుతోంది.

విధి విహితమైన కర్మలనాచరించడానికి సంకల్పం చేయాలి కానీ, **"న సురాం పిబేత్, న కలంజం భక్షయేత్"** ఇత్యాది వచనాలచే నిషేధింపబడినవాటికి అనగా సురాపానం నుండి నివృత్తికి, కలంజ భక్షణం నుండి నివృత్తికి సంకల్పంతో, తిథితో పని లేదు కదా!

కాలమాశ్రిత్య విధిర్వర్తతే| అత్రకాలస్యైవ నిమిత్తత్వమ్| నిమిత్తానురోధేన నైమిత్తికం స్నాన సంధ్యాదికం కర్తవ్యమ్|

తిథి కాలాన్ని ఆశ్రయించుకుని ఉంటుంది కానీ, కాలం తిథిని ఆశ్రయించదు. అందుకే స్నానసంధ్యాది కర్మలకు ప్రాతరాది కాలమే నిమిత్తం.

ఉషః కాలేతు సంప్రాప్తే శౌచం కృత్వాయథార్థవత్| తతః స్నానం ప్రకుర్వీత దంతధావన పూర్వకమ్| (ద.స్మృ)

బ్రహ్మవైవర్త వాక్యమ్| తృతీయం రజనీ ప్రాహుః త్యక్త్వాఆద్యన్త చతుష్టయమ్ నాడీనాం తదుభే సంధ్యే దివసాద్యంత సంజ్ఞితే (కాలమాధవీయం)

రాత్రిలో మొదటి నాలుగు ఘడియలవరకు ఉండే కాలం పగటిలోకి, రాత్రికి చివరి కాలంలో నాలుగు ఘడియలు రాబోయే పగటిలోకి చేరతాయి. ఉషః కాలం కాగానే శౌచాది విధులను నిర్వర్తించుకుని స్నానాది నిత్యకర్మలు ఆచరించాలి. ఆ ఉషః కాలాన్ని కూడా పగటిలో భాగంగా గ్రహించాలి. అందుకే సూర్యోదయానికి ముందుగానే ఆరంభించే స్నానసంధ్యాదులకు

యాం తిథిం సమనుప్రాప్య ఉదయం యాతి భాస్కరః| సాతిథిస్సకలాజ్ఞేయా దానాధ్యయన కర్మసు|

నిత్యేషు మధ్యందిన కృత్యేషు బ్రహ్మ యజ్ఞాదిషు సాయంకాల కృత్యేషు సంధ్యాగ్ని హోత్రాదిష్వపి ఔదయికీ తిథిరేవ గ్రాహ్య|

సూర్యుడు ఉదయిస్తున్న సమయంలో ఉన్న తిథే ఆనాటి మధ్యందిన, సాయందిన నిత్యకర్మలందు కూడా గ్రహించాలి. కానీ ఆ రోజున వచ్చే మరో తిథి సంబంధమైన పితృశ్రాద్ధాదులకి, కొన్ని వ్రతాదులకు, జనన మరణాదులకు తాత్కాలిక (ఆ కర్మచేసే సమయంలో ఉన్న) తిథినే గ్రహించాలి.

"నను పూర్వస్మిన్ దివసే యాతిథి రుక్తా తస్మిన్నపి దివసే సైవతిథిః గృహీతాస్యాత్ ఏకస్యైవ కర్మణః ఆవృత్త్యాపత్తిరితి చేత్ అత్ర న తిథిర్నిమిత్తం కింతు ప్రాతరాది కాలస్య నిమిత్తత్వం నిమిత్తావృత్తేః నైమిత్తికా వృత్తిః న్యాయ్యైవ| యథా వసన్తే వసన్తే జ్యోతిషా యజేత| ఇతి వీప్సయా ప్రతివసంతం జ్యోతిష్టోమస్య ఆవృత్తేః విహితత్వాత్| అతః తత్తద్దివస ప్రయుక్త ప్రాతరాది కాలస్య భిన్నత్వాత్ కాలభేదనేపి తిథ్యేకత్వేసతి కర్మభేదో

నామ ప్రయోగ భేదః యుక్త ఏవ| తిథిక్షయే సతి సూర్యోదయాత్పరం ద్విముహూర్త త్రిముహూర్తాత్మక కాలే యా తిథిర్వర్తతే సా తిథిః ఔదయిక కృత్యేషు గ్రాహ్యా| తతః తత్తత్కాలే యా తిథిర్విర్తతే నా తిథిర్గ్రాహ్యా|

తిథి వృద్ధి ఉన్నప్పుడు ముందురోజు ఏ తిథిని చెప్పి కర్మనాచరించేరో మరుసటి రోజు కూడా మళ్ళీ ఆ తిథినే చెప్పి కర్మను ఆచరిస్తే ఒకే కర్మ రెండుసార్లు చేసినట్లవుతుందని శంకించి, ఇక్కడ తిథి నిమిత్తం కాదు ప్రాతరాది కాలం నిమిత్తం. ముందురోజు ఉదయం ఉన్న కాలం, ఆ రోజు ఉదయం ఉన్న కాలం వేరు వేరు గాన, ఇంకా సంధ్యాది కర్మలకు ప్రాతరాది కాలమే నిమిత్తం కనుక, ప్రతి వసంత కాలంలోను అనుష్ఠించే జ్యోతిష్టోమాదులలాగానే ఆవృత్తి (మళ్ళీ చేయడమనే) శంక లేకుండా సంధ్యావందనాది కర్మలు ఆచరించి తీరవలెను అని, శాస్త్రం చెప్తోంది. తిథి క్షయంలో రెండు, మూడు ముహూర్తాల వరకు ప్రాతఃకాల తిథి, మధ్యాహ్నం లగాయతు తత్తత్కాల విధిని గ్రహించాలి.

తిథి ద్వైవిధ్యం సంభవించినపుడు సంకల్పానికి సంకటం ఏర్పడుతుంది కనుక ఆ సంకట నివృత్తి కోసం ప్రమాణం ఇంత విపులంగా వివరించడమైంది.

ఆచమన ప్రకారం

యః క్రియాం కురుతే మోహాత్ అనాచమ్యైవ నాస్తికః|భవన్తి హి వృధాతస్య క్రియాస్సర్వాన౽సంశయః|

అనే వచనం ఆచమనం చేయకుండా చేసిన క్రియలు నిష్ఫలమవుతాయని చెప్పడంతో ఆ వచనాన్ని గురించి రాయడం అవసరమై వివరించబడుతోంది. ఆచమనాలు మూడు విధాలు-(1) శ్రౌతాచమనం (2) స్మార్తాచమనం (3) పురాణాచమనం, అని.

నా చామే దాసనస్థాంఘ్రిః నా బద్ధాసన ఏవ వా| న ప్రసారితపాదో వా బహిర్జాను కరోపి వా|

ఆచమనం చేసేటప్పుడు ఆసనంపై కూర్చుని పాదాలు నేలపై ఉంచాలి. నడుముకు మోకాళ్ళకు కలిపి వస్త్రంతో కూర్చోకూడదు. కాళ్ళు చాచుకుని మోకాళ్ల వెలుపలకు చేతులను ఉంచి గానీ ఆచమనం చేయరాదని ఆచమన నియమం చెప్పబడింది.

(1) శ్రౌతాచమనం

దేవ్యాః పాదైస్త్రిభిః పీత్వా త్రిలింగైః నవభిః స్పృశేత్|సప్తవ్యాహృతి సంయుక్తా గాయత్రీతి పరాశరః (ప.స్మృ)

తత్సవితుర్వరేణ్యం| భర్గోదేవస్య ధీమహి|ధియోయో నః ప్రచోదయాత్ (కృ.య.4వ కాం)

అను ఈ మూడు పాదాలకీ చివర్లో మూడు మార్లు ఆచమనం చెయ్యాలి. **"ఆపోహిష్ఠాది"** తొమ్మిది మంత్రాల చేతను **'ఓం భూః'** ఇత్యాది సప్తవ్యాహృతుల చేతను గాయత్రీమంత్రం యొక్క మూడు పాదాల చేతను **'ఓమాపో జ్యోతిరితి'** శిరోమంత్ర భాగాలతోనూ హస్తాలు, పాదాలు, ఇంద్రియాలను స్పృశించాలి.

(2) స్మృత్యాచమనం

త్రిరాచామేత్| ద్విః పరిమృజ్య సకృదుపస్పృశ్య| యత్సవ్యం పాణిం పాదౌ ప్రోక్షిత శిరః చక్షుషి నాసికే శ్రోత్రే అధాప ఉపస్పృశేత్|

అని స్మరించి సమంత్రకంగా మూడుసార్లు ఆచమనం చేసి రెండు పెదవుల్ని రెండు సార్లు కుడినుంచి ఎడమ భాగానికి తుడిచి మళ్ళీ ఒకసారి స్పృశించి అదే ప్రకారం ఎడమ చేతిని పాదాలను ప్రోక్షించి శిరస్సును, కళ్లను, ముక్కును, చెవులను స్పృశించి ఉదకంతో హస్త స్పర్శ చేయాలి.

(3) పురాణాచమనం

కేశవాద్యైః త్రిభిః పీత్వా ద్వాభ్యాం ప్రక్షాళయేత్కరౌ|

ఇత్యాది స్మృతి వచనాన్ని అనుసరించి కేశవ, నారాయణ, మాధవ నామాలచే ఆచమనం చేసి మిగిలిన ఇరవైఒక్క నామాలతో శ్రౌతాచమనం లాగానే ఆ యా ఇంద్రియాలను స్పృశించాలి. స్నానమయ్యాక శుద్ధ్యర్థం అనగా, సంధ్యాది నిత్యకర్మానుష్ఠాన యోగ్యతా సిద్ధ్యర్థం పురాణాచమనం చెయ్యాలి.

సంధ్యాయాం కర్మ కాలే చ స్మృతేరాచమనం భవేత్| బ్రహ్మయజ్ఞే తు వైకుర్యాచ్ఛ్రుతే రాచమనం బుధః|

అను స్మృతి వచనంచే సంధ్యాది సర్వకర్మాదులందు స్మృత్యాచమనమే చేయాలి. శ్రౌత కర్మల్లో, బ్రహ్మయజ్ఞంలో, సంధ్యావందనంలో అర్ఘ్యప్రదానం, గాయత్రీ జపానికి ముందుగాను శ్రౌతాచమనం చెయ్యాలి.

ఈ ప్రకారం ఆచమనం అయ్యాక దేశకాల సంకీర్తనలతో సంకల్పం అయ్యాక **'ఆపోహిష్ఠాది'** మంత్రాలతో మార్జన చేసుకోవడం, **'దృపదాదివ ముంచతు'** అను మంత్రంచే పాపపురుషుని నిరసించడం, అర్ఘ్యప్రదానం చేయడం **'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ'** అనే గాయత్రీ హృదయ మంత్రాన్ని పఠించి గాయత్రీ జపం చేయడం, ఆ తర్వాత గాయత్రీ జపం చెయ్యడం అయ్యాక ఆదిత్యోపస్థానం చేయడం మొదలైన క్రియా కలాపంతో కూడిన సంధ్యావందనమనే కర్మ **"స్నానం సంధ్యా జపో హోమో దేవతానాం చ పూజనం| ఆతిథ్యం వైశ్వదేవంచ షట్కర్మాణి దినే దినే"** అని చెప్పబడిన షట్కర్మల్లో ఒకటిగానే పరిగణించబడుతోంది.

కానీ ఈ మొత్తం సంధ్యావందన క్రియాకలాపంలో ప్రధానమేది అని విచారిస్తే మీమాంసా శాస్త్ర సిద్ధాంత ప్రకారం నిత్యకర్మలకు చెప్పిన యథాశక్తి న్యాయం సంధ్యావందనానికి వర్తించడానికి వీలవుతుంది.

అంగ, ప్రధాన కర్మ విచారణ

ప్రతీ కర్మకు అంగ, ప్రధాన భేదం ఉంటుంది. కాబట్టి ఇక్కడ (1)అర్ఘ్యప్రదానం (2)గాయత్రీ జపం (3)ఆదిత్యోపస్థానం ప్రధానములని, మార్జన వగైరాలు అంగ కలాపమని నిర్ణయించారు. ఈ విభాగాన్ని అనుసరించి అశక్య పక్షంలో మార్జనలు, కొన్ని ఆచమనాలు చేయలేకపోయినా ప్రధానమైన అర్ఘ్య ప్రదానాలు చేస్తే పూర్తిగా సంధ్యావందనం చేసిన ఫలం వస్తుంది.

ఈ విషయాన్ని పూర్వమీమాంసా శాస్త్రంలో (అధికారాధ్యాయం అనగా షష్ఠాధ్యాయం యథాశక్త్యధి కరణంలో) నిర్ణయించారు. నిత్యకామ్య కర్మల్లో, కామ్యకర్మలు సాంగప్రధానానుష్ఠానం వల్లనే ఫలప్రదం కాగలవని, నిత్యకర్మలు యావజ్జీవం జీవనాన్ని నిమిత్తంగా చేసుకుని విధించబడినవి కనుక ప్రధానం మానకుండా యథాశక్తిగా అనుష్ఠానం చేసినా పూర్తిగా సాంగ ప్రధానంగా ఆచరించిన ఫలం లభిస్తుందని, ఇక్కడ ఫలమంటే నిత్యకర్మలకు **'అకరణే ప్రత్యవాయం'**- చేయకపోతే దోషం వస్తుంది కనుక, అటువంటి దోషం రాకపోవడమే ఫలమని నిర్ణయించారు.

ఈ న్యాయాన్ని అనుసరించే, అశక్త పక్షంలో కనీసం ప్రధానమైన అర్ఘ్యప్రదానంతో ఆచరించాలని, ఆ మూడింటిలో కూడా అర్ఘ్య ప్రక్షేపానికి (అర్ఘ్య ప్రదానానికి) అత్యంత ప్రాధాన్యమిచ్చారు. అందుకే-

సంధ్యామిష్టిం చ హోమంచ యావజ్జీవం సమాచరేత్| న త్యజేత్సూతకేవాపి త్యజగన్గచ్ఛత్యధోగతిమ్|

జాతాఽశౌచ, మృతాఽశౌచ సూతకాల్లో (పురుడు పుణ్యాలు, స్యూతకం/మైల వంటి వాటిలో) కూడా సంధ్యాది కర్మలు వదిలి పెట్టకూడదని చెప్పారు. సూతకాదుల్లో సంధ్యాది కర్మలు పరిత్యజించాలని మరో స్మృతి చెప్పగా పరస్పర విరోధం సంభవిస్తున్నందున విరోధ పరిహార్థం ఇలా చెప్పారు.

ఆశౌచాదౌ సంధ్యావందన మర్ఘ్యాన్తమ్|

అని సూతకాదుల్లో అర్ఘ్యప్రదానం వరకు చేసి మిగిలినది మానసికంగా చెయ్యాలని చెప్పారు.

సూతకే మృతకే చైవ సంధ్యాకర్మ న సంత్యజేత్| మనసోచ్చార యేన్మన్త్రాన్ ప్రాణాయామ మమృతేద్విజః|

అను స్మృతి వల్లను, "**ప్రాణాయామం వినా మానసికం అన్యత్కార్యం**" అని పరాశర మాధవీయంలో చెప్పబడింది కనుక అర్ఘ్యప్రదానానంతరం ప్రాణాయామాన్ని విడిచి మిగిలిన సంధ్యావందనంలో మంత్రాలను మానసికంగా ఉచ్చరిస్తూ పూర్తి చేయాలని తేలింది. అర్ఘ్యప్రదానం వరకైనా మనం సంధ్యావందనం చేస్తే సంధ్యావందన '**అకరణ దోషం**' రాదన్నారు. ఏమిటా దోషం అంటే- "**సూర్య హత్యామవాప్నోతి ఉలూకత్వ మియాత్తథా**" అని, సంధ్యావందనం చేయకపోతే సూర్యహత్యా దోషం సంభవిస్తుందని, తర్వాత గుడ్లగూబై పుడతాడని అన్నారు.

రక్షాగ్ం హవా పురోనువాకే తపోగ్రమతిష్ఠన్త, తాన్ప్రజాపతి ర్వరేణోపామంత్రయత తాని వరమ వృణీతాదిత్యో నో యోద్ధా| (తై.ఆ, స్వా.బ్రా.)

పూర్వకాలంలో రాక్షసులు ఉగ్రమైన తపస్సు నాచరించగా ఆ సామర్థ్యంవల్ల బ్రహ్మ వారిని సమీపించి వారి కోరికలు ఏమిటని అడిగెను. ఆ రాక్షసులు "**ఆదిత్యః నః యోద్ధా భవతు**" అనగా, ఆదిత్యుడు మాతో యుద్ధం చేయుగాక అని కోరగా "**తాన్ప్రజాపతి రబ్రవీద్యోధయత్వమితి-ఆదిత్యేన సహయోధ యధ్వం**" అని అలాగే ఆదిత్యునితో యుద్ధం చేయండని ప్రజాపతి వరమిచ్చెను. ఆయన వరానుసారం రాక్షసులు ఉదయిస్తున్న ఆదిత్యుని అస్తమించే వరకు యుద్ధంచే పీడిస్తున్నారుట-

తస్మాదుత్తిష్ఠన్తగ్ం హవా తాని రక్షాగ్ స్యాదిత్యం యోధయన్తి యావదస్తమన్వగాత్|

రాక్షసుల తపః ఫలంగా వరం ప్రాప్తించినా సూర్యునికి పీడా పరిహారోపాయం కూడా చెప్పవలసి ఉన్నందున వేదం ఇలా చెప్పింది.

తాని హవా ఏతాని రక్షాగ్ంసి గాయత్రియాభిమంత్రితేనాంభసా శామ్యన్తి|

సూర్యునితో యుద్ధం చేయాలని కోరిన రాక్షసులను గాయత్రీ మంత్రంచే అభిమంత్రణ చేయబడిన ఉదకాలచేత శమింపచేస్తున్నారు అనడంచే, ఆ ప్రకారం శమింపచేయాలని సూచించినట్లు అర్థం.

తదుహవా ఏతే బ్రహ్మవాదినః పూర్వాభిముఖాస్సంధ్యాయాం గాయత్రియాభిమన్త్రితా ఆప ఊర్ధ్వమ్ విక్షిపన్తి|
(తదు - తస్మాత్కారణాత్)

అందుకే బ్రహ్మవేత్తలైనవారు అనగా వేదార్థాభిజ్ఞులు తూర్పుగా తిరిగి సంధ్యాకాలంలో సంధ్యాకర్మలో భాగంగా గాయత్రీ మంత్రంచే అభిమంత్రించబడిన ఉదకాలను పైకి చిమ్మినట్లుగా ఇస్తున్నారుట. పైకి చిమ్మినట్లుగా ఇవ్వాలని అర్థం.

తా ఏతా ఆపో వజ్రీ భూత్వా తాని రక్షాగ్ం సి మందేహారుణే ద్వీపే ప్రక్షిపన్తి|

ఆ ప్రకారంగా ఇచ్చిన నీళ్ళు గాయత్రీ మంత్ర సామర్థ్యంచే వజ్రాయుధాలుగా మారి ఆదిత్యునితో యుద్ధం చేస్తూ ఆయన్ని పీడిస్తున్న 'మందేహులనే' పేరు గల రాక్షసులను వారి స్వస్థానమైన అరుణ ద్వీపానికి పంపించేస్తాయిట. దానివల్ల సూర్యునికి రాక్షసబాధా నివారణ అవుతుంది. కనుక ఈ ప్రకారంగా గాయత్రీ మంత్రంచే అభిమంత్రించిన ఉదకాలను అర్ఘ్యప్రదానం చేసినవారు సూర్యునికి రాక్షస బాధానివారణ

చేసినవారు అవుతున్నారు. ఆ ప్రకారం చేయనివారు సూర్య హత్య చేసినవారు అవుతున్నారని స్మృతి చెప్తోంది.

అయితే పూర్వం రాక్షసుల తపస్సామర్థ్యంచే బ్రహ్మ స్వయంగా వచ్చి వారి కోరికను తెలుసుకుని ఆదిత్యునితో యుద్ధం చేసేలా వారికి వరమిచ్చారు గదా! అది వ్యర్థం కాదా అని శంక కలుగుతుంది. వేదశాస్త్రాల ప్రకారం దానికి సమాధానం ఇలా ఉంటుంది. వారు తపస్సు చేసినందుకు దాని సామర్థ్యంచే బ్రహ్మ సాక్షాత్కరించి వారికి వరమివ్వకా తప్పదు, కానీ ఆ వరం ప్రకారం సూర్యునికి రాక్షస పీడ సంభవిస్తోంది కనుక దాని పరిహారోపాయం చెప్పకా తప్పదు.

వేద శాస్త్ర పండితుల్ని భోక్తలుగా పిలిచి చేయడం చాలా శ్రేష్ఠమని ఒకపక్క పితృకర్మలు చేసేవారికి చెప్పి, భోక్తృత్వం చేస్తే ప్రత్యవాయం సంభవిస్తుందని, ఆ సాయంకాలం సంధ్యావందనాధికారం కూడా ఉండదని మరోపక్క చెప్తోంది. అంటే ఏమన్నమాట?వారి కర్మ నిర్వహణను దృష్టిలో ఉంచుకుని వారింటికి పితృకర్మలకు భోక్తగా వెళ్ళక తప్పదు కానీ వెళ్ళిన తర్వాత ప్రాయశ్చిత్తం చేసుకుని దాని పాపాన్ని పోగొట్టుకోమని చెప్పడంలో తాత్పర్యం ఉందని గ్రహించాలి. ఇలాగే గోదాన ప్రకరణంలో కూడా మరో ఉదాహరణ ఉంది.

వరోదేయస్సాహి వరస్సహస్ర మస్య సాదత్తా భవతి| సహస్రమస్య ప్రతిగృహీతమ్ భవతి|

గోదానం చేసినవానికి సహస్ర గోదాన ఫలం వస్తుందని, ప్రతిగ్రహించిన వానికి సహస్ర గోదాన ప్రతిగ్రహ దోషం వస్తుందని చెప్పి, ఆ దోష పరిహారార్థం "**స్యోనాసి సుషదాసు శేవాస్యోనామా విశసుషదా మావిశ**" అను మంత్రం చెప్పి ప్రతిగ్రహించాలని చెప్పింది. ఆ ప్రకారంగానే ప్రస్తుతంలో రాక్షసులకి వరమివ్వడం, దాని పరిహారంకోసం మనల్ని అర్ఘ్యప్రదానం చేయమని చెప్పడం న్యాయమని, సూర్యునికి రాక్షసబాధా నివారణ చేసేటంత అధికారం మనకుందని, దాన్ని వ్యర్థం చేసుకోకూడదని కూడా గ్రహించాలి.

దీనివల్ల సంధ్యావందనంలో అర్ఘ్యప్రదానం చాలా ముఖ్యమైనదని జాతాఽశౌచాదుల్లో కూడా ఇంతవరకు చేసి తీరాలని, దీనివల్ల సూర్యునికి రాక్షసబాధా నివారణ అవుతుందని తెలిసింది. అయితే సూర్యునితో యుద్ధం చేయడానికి ఉదయం నుంచి అస్తమయం వరకే కదా ప్రజాపతి రాక్షసులకి వరమిచ్చింది. దాని ప్రకారం ఉదయం, మధ్యాహ్నం సంధ్యావందనం చేస్తే సరిపోవాలి, సాయం సంధ్యావందనం చేయనవసరం లేదేమో అని శంక కలుగుతుంది. దానికి సమాధానం కూడా చెప్పారు.

సాయంకాలం కూడా సూర్యుడు అస్తమించకుండా సంధ్యావందనం ఆరంభించి అర్ఘ్యప్రదానం ఇవ్వవలసిందిగా **'శ్రేష్ఠా అర్థార్క మండలా'** అను సూత్రం చెప్తోంది. కనుక దానివల్ల కూడా సూర్యునికి రాక్షసబాధా నివారణ చేసినవార మవుతాం. అయితే ఈ సంధ్యావందనం కొందరు చేస్తే చాలేమో చేయవలసినవారు అందరూ చేయవలసిన అవసరం లేదేమో అని మరో సందేహం రావచ్చు. లోకంలో ఉదాహరణ చూడండి! ప్రజలకు దొంగల బాధ లేకుండా ఉండడానికి ప్రభుత్వం రక్షక భటుల్ని నియమిస్తుంది. కేవలం చోరబాధా నివృత్తే కదా కావలసిందని కొంతమంది మాత్రమే ఆ రక్షణ వ్యవహారంలో ఉండి మరికొంతమంది ప్రజలకంటే ముందుగానే నిద్రిస్తే, ఆ విషయం ప్రభుత్వం దృష్టిలోకి వస్తే విచారించి అలా నిద్రించిన రక్షకభటుల్ని విధులు నిర్వహించనందుకు శిక్షిస్తారు కదా! అదే తీరుగా ఉపనయనమైన ప్రతీ వ్యక్తికీ సంధ్యావందనం చేయాలనే విధి ఉండడం వల్ల దీనిని అతిక్రమిస్తే అతడు వ్యక్తిగతంగా శిక్షార్హుడు అవుతాడని చెప్పబడింది.

సంధ్యావందనంలో ఏ మంత్రం చూసినా సంధ్యావందన కర్తలకు సంచిత పాపక్షయం ఫలంగా కనబడుతోంది. అందుచేతనే సంధ్యావందనాది నిత్యకర్మలకు ఫలముందా? ఉంటే ఏమి ఫలమని విచారించి కొంతమంది శాస్త్రకారులు ప్రత్యవాయ పరిహారమే, అనగా "నిత్యకర్మ చేయకపోతే వచ్చే ప్రత్యవాయం రాకుండా చేసుకోవడమే" ఫలమని చెప్పారు. మరికొంతమంది **'అకరణం'** అనగా చేయకపోవడం కదా! చేయకపోవడం అనేది అభావ కోటిలో చేరుతుంది. అభావం (అసలు లేకపోవడమే అనే స్థితి ఉన్నప్పుడు) పాపమనే భావానికే అవకాశం లేదని, కానీ సంధ్యావందనం చేయడంవల్ల సంచితమైన పాపం నశిస్తుందని చెప్పారు. **'ధర్మేణ పాపమపనుదతి'** అనే శ్రుతిని విచారణ చేస్తూ, ఇందులో ధర్మశబ్దంచే దేనిని ప్రతిగ్రహించాలని సంశయించి ధర్మశబ్దంచే నిత్య, నైమిత్తిక, కామ్య కర్మలు చెప్పబడుతున్నాయి అని అన్నారు. వాటి ఫలములు నిర్దేశింపబడి ఉన్నాయి కనుక అనిర్దిష్ట ఫలకములైన (ప్రత్యేకమైన కోరికలు తీర్చే ఫలములు కలిగినవి కాదు కనుక) నిత్య, నైమిత్తిక, కామ్య కర్మలు మాత్రమే ఇక్కడ **'ధర్మ'** శబ్దంచే చెప్పబడుతున్నాయని, వాటికే **'పాపమపనుదతి'** అను పాపాలను పోగొట్టే ఫలముందని నిర్ణయించారు. ఈ ప్రకారం మీమాంసా శాస్త్రంలో ధర్మశబ్దంచే గ్రహించి చెప్పబడుతున్న వాటికే ఈ పాప పరిహారమనే ఫలమని నిర్ణయించారు.

కాబట్టి సంధ్యావందనం కేవలం సూర్యునికి రాక్షస బాధా నివారణమనే ఫలంగానే కాక పాప క్షయ ఫలం కూడా ఇస్తుందని నిర్ణయించడంచే దీనికి అధికారి అయిన ప్రతివ్యక్తీ సంధ్యావందనం చేసి తీరాలని తెలుస్తోంది.

సంధ్యామంత్రార్థం

సంధ్యావందన సంకల్పంలో **'మమ ఉపాత్త దురితక్షయద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం'** అని చెప్తున్నాం. అంటే నాకు లోగడ సంక్రమించి ఉన్న పాపాలను క్షీణింప చేయడం ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీతి నిమిత్తం చేస్తున్నానని చెప్పడంచే ఈ సంధ్యావందనం పాపక్షయ నిమిత్తమని తెలుస్తోంది. ఇందులో వినియోగింపబడే మంత్రాలు కూడా పాప క్షయాన్ని కోరుతున్నట్లే చెప్తున్నాయి.

సంకల్పమయ్యాక అపోహిష్టాది మంత్రాలచే మార్జన చేసుకోవాలి. సంధ్యావందనంలో(1)అర్ఘ్యప్రదానం (2)గాయత్రీ జపం (3)ఆదిత్య ఉపస్థానం అనే మూడూ ప్రధానమైనవైనా సాంగ ప్రధానానుష్ఠానం వల్ల గానీ ఆ కర్మఫలం జనించదు కనుక ఆ యా ప్రదానాలకు ముందు, వెనుక కొన్ని సంస్కార కర్మలని ఆచరించాలి. అటువంటి అంగ భూతమైన సంస్కారకర్మల్లో మార్జన మంత్రాలతో శిరస్సు నందు మార్జన చేసుకోవడం (చల్లుకోవడం) ఒక అవాంతర సంస్కార కర్మ. ఆ మార్జన మంత్రాలు ఇలా వున్నాయి.

ఆపోహిష్ఠా మయోభువః- సుఖాన్ని పుట్టిస్తున్న వారైన మీరు

తాన ఊర్జే దధాతనా- ఆ ఉదకాలు మాకు అన్న సమృద్ధిని కలిగించేటటువంటివై

మహేరణాయ చక్షసే- ఆ ఉదకాలచే సమృద్ధి పొందిన అన్నం అగు గాక! ఇంద్రియాలకు పుష్టిని కలిగించి తద్వారా గొప్పదైన, రమణీయమైన వేదాంతవేద్యమైన పరమాత్మ స్వరూపాన్ని తెలుసు కోవడానికి అవసరమైన జ్ఞానాన్ని కలిగించు గాక! అంటే అటువంటి జ్ఞానాన్ని ఈ అన్నం కలిగించాలని అర్థం

యోవశ్శివతమో రసః|తస్య భాజయతేహ నః- మీలో ఉన్నటువంటి అత్యంత మంగళప్రదమైన రస రూపమైన సారాంశం , ఈ లోకంలో ఈ కర్మయందు ఆ రసాస్వాదనం మేము చేసేటట్లుగా అట్టి రసాన్ని పొందే యోగ్యతను మాకు ప్రసాదించండి! (అని ఉదకాభిమాన దేవతల్ని ప్రార్థిస్తున్నాడు)

ఉశతీరివ మాతరః- తల్లికి పిల్లలందు గల ప్రేమను వాత్సల్యం అంటారు. ఆ వాత్సల్యంచేత వత్సలకు (పిల్లలకి) స్తన్యాన్నిచ్చి తృప్తి పరుస్తారు తల్లులు. ఇది కృత్రిమమైన ప్రేమ కాదు స్వాభావికమైంది. అన్న పరంపరగా మీరు మాకు ఉత్పాదకమైన వారు కనుక మీరు మాకు మాతృ స్థానీయులు. మేము వత్స స్థానీయులం. ఆ విధంగా మమ్మల్ని భావించి మీలో గల మధుర రసాన్ని మాకు అందించండి. కేవలం మాధుర్యం ఉండడమే కాదు సమస్త వ్యాధి నిరోధకత్వ శక్తి కూడా మీలో (ఉదకాల్లో) ఉందని వేదమే మరో ప్రకరణంలో **"ఆపశ్చ విశ్వభేషజీః"** అని సర్వవ్యాధి నివారణమైన ఔషధ రూపాలు అని చెప్తోంది. మరో ప్రకరణంలో **'తస్మాదద్భ్య ఓషధయస్సంభవంతి"** అని ఓషధులకు ఉదకాలు కారణమని, **"తస్మాదోషధయో మనుష్యాణామన్నం"** అని, ఆ ఓషధులు మనుష్యులకు అన్నమని, **"అన్నాద్భూతాని జాయన్తే"** అన్నంవలన సమస్త ప్రాణులు పుడుతున్నాయని చెప్తోంది. ఈ ప్రకారంగా సర్వవిధాలా మీరు మాకు మాతృ స్థానీయులు.

'ఉశతీరివ' అను విశేషంగా లోకంలో తల్లులు ప్రీతితో కూడినవారై తమ పిల్లలకి స్తన్యాన్నిచ్చి పోషిస్తున్నారంటే ఇందులో గంభీరమైన అర్థం ఉంది. తల్లితండ్రులకు పిల్లలకు మధ్య కేవలం జన్య-జనక సంబంధంచే ప్రేమ పరిపూర్ణం కాదు. స్తన్యదానం ద్వారా పోషించడం కూడా పరస్పర ప్రేమాతిశయానికి కారణమని స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటి కాలంలో పిల్లలకు స్తన్యదానాన్ని మానేసి తల్లులు ఉద్యోగాలకి వెళ్తున్నారు. వేతనమిచ్చి పిల్లల పోషణకు మరొకర్ని నియమిస్తున్నారు. దీంతో ఆ పిల్లలకి తల్లిదండ్రులందు భక్తి తక్కువగా ఉండడం, ఆ తల్లిదండ్రులకు పిల్లలందు ప్రేమ తక్కువగా ఉండడం చూస్తూనే ఉన్నాం. జన్య-జనక భావం కంటే, అజ్ఞాన దశలోనే పిల్లలను తీసుకువచ్చి పోషించిన వారికి పోష్య-పోషక భావంచే ఆ పిల్లలయందు ఎక్కువ ప్రేమ కలిగి ఉండడం, తల్లిదండ్రులతో సాన్నిహిత్యం తగ్గిపోవడం లోకంలో అనుభవ సిద్ధమే కదా! **'ఉశతీరివ మాతరః'** అని చెప్పడంలో ఇంత అభిప్రాయం మనసులో ఉంది, వేదాలకి!

తస్మాఅరంగ మామవః- ఆ మధురమైన రసం కోసం మేము మిమ్మల్ని పొందుచున్నాము

యస్యక్షయాయ జిన్వథ, ఆపో జనయథా చ నః- ఓ అబ్దేవతలారా! ఉదకాభిమాన దేవతలారా! ఏ రసంయొక్క ఉనికిచేత మీరు ప్రీతియుక్తులవుతున్నారో ఆ రసాన్ని మాకు ఇవ్వవలసిందిగా ప్రార్థిస్తున్నాం

'ఆపో జనయథా చ నః' - మంత్రానికి భాష్యం

హే ఆపః - జలాభిమానదేవతాః, నః-అస్మాన్, జనయథ- ప్రజోత్పాదన సమర్థాన్కుకురుతేత్యర్థః, తం రసమస్మభ్యం దత్వా అస్మాకం పుత్రసంపత్తిం సంపాదయత|వయం చ తేనైవ రసేన జాతాః స్మః| తథా విధం రసస్య సకల ప్రాణి జన్మ హేతుత్వాత్ ఆపోవా ఇదగ్ం సర్వమితి సకలభూతానాం తన్మయత్వ శ్రవణాత్|

ఓ జలాభిమాన దేవతలారా! మమ్మల్ని ప్రజోత్పాదన సమర్థుల్ని చేయండి. పూర్వ మంత్రంచే రసాన్ని ఈయాలని ప్రార్థిస్తున్నాం. ఆ రసాన్నిచ్చి, దాంతో మాకు పుత్రోత్పత్తిని అనుగ్రహించండి. మేం కూడా ఆ రసం నుండి పుట్టిన వారమే. ఆ రసం సకల ప్రాణిజన్మలకు కారణమవడం వల్లనే **'ఆపోవా ఇదగ్ం సర్వం'** అను శ్రుతి సకల ప్రాణులు ఉదకమయమని ప్రతిపాదిస్తోంది. ఏతావతా, ఈ మంత్రంచే ఉదకాల్లోని రసంద్వారా పుత్రత్వాన్ని కోరడమైంది. పుత్రత్వానికి ఇంత ప్రాముఖ్య మెందుకు? చూడండి.

" ఏషవా అనృణోయః పుత్రీ", "నా పుత్రస్య లోకేస్తీతి",

"ప్రజననం వై ప్రతిష్ఠా లోకే సాధు ప్రజాయాస్తన్తుం తన్వానః పితృణామనృణో భవతి",

ప్రజాతన్తుం మా వ్యవచ్ఛేత్సీః|

మొదలైన శ్రుతులన్నీ పుత్రపౌత్రాది సంతానంద్వారా పితృరుణ విముక్తుడు కావాలని ప్రతిపాదిస్తు న్నందున మమ్మల్ని పుత్రోత్పాదన సమర్థులను చేయవలసిందని ఉదకాభిమాన దేవతల్ని కూడా కోరడం యుక్తమని, దీనికి అంత ప్రాధాన్యముందని గుర్తించాలి.

'నను' అని సంబోధించి పూర్వం చెప్పిన అపోహిష్టాది మంత్రపూర్వక మార్జన చేయడంచే బాహ్యశుద్ధి అవుతుంది. ఆంతర (లోపలి) శుద్ధి కోసం **"అగ్నిశ్చేత్యాది"** మూడు మంత్రాలతో మూడు వేళల యందు జలపానం ఆవశ్యకమని చెప్పబడింది. ఎందువల్ల అంటే-మానస పాప నివృత్తి కాకపోతే అధికారం నుండి పడిపోతాడు కాబట్టి మానస పాపనివృత్తి కూడా అవసరమని, అపేక్షించ బడుతోంది.

మరియు అభోజ్యభోజనం, అపేయపానం అనగా, మనం భుజించ కూడదని ధర్మశాస్త్రంలో చెప్పిన వాటిని భుజించడం, తాగకూడదని చెప్పిన వాటిని తాగడం వంటి పాపాలు చేసినందు వల్లను, దుష్టవస్తు సంసర్గం చేతనూ, పరాఽనిష్ట (ఇతరులకు చెడు జరగాలనే) దుష్టచింతన చేతనూ సంభవించిన అనేక పాపాలు ఉండడంచే వాటిని నిర్వర్తింప చేసి ఉత్తర కర్మాధికారాన్ని సంపాదించడానికై మంత్రపూతమైన జలపానం ఆవశ్యకమని చెప్పబడింది.

ధర్మశాస్త్రం **'న కలంజం భక్షయేత్', 'న సురాం పిబేత్'** అని చెప్పింది. **కలంజ భక్షణ**-అనగా శూలంచే కాల్చబడిన మాంసమని కొందరు, ఉల్లిపాయలని కొందరు అంటున్నారు, అటువంటి వాటిని తినకూడదని, గుడ-పిష్ట-మధు వికారమైన మూడు రకాల సురలను బ్రహ్మ, క్షత్రియ, వైశ్యులు ముగ్గురూ కూడా స్వీకరించకూడదని నిషేధించింది. అటువంటి భోజ్య, పాన విషయాల్లో నిషేధాలు ఉల్లంఘించడం వల్ల వచ్చిన పాతకాలను కూడా నివారించుకోడానికి ఈ మంత్రాచమనం (మంత్రపూత జలపానం) చెప్పబడింది. ఈ మంత్రాచమనానానికి వినియోగింపబడే మంత్రాలు:

మంత్రాచమనం

ఉదయం సంధ్యావందనంలో-**"సూర్యశ్చ మామన్యుశ్చ మన్యుపతయశ్చ",**

మాధ్యాహ్నిక సంధ్యావందనంలో- **"ఆపః పునన్తు పృథివీం పృథివీ పూతా పునాతు మామ్",**

సాయం సంధ్యావందనంలో- **"అగ్నిశ్చ మామన్యుశ్చ మన్యు పతయశ్చ"**

అనే మంత్రాలు చెప్పబడ్డాయి. వీటి మంత్రార్థం ఇలా వుంది-

అగ్నిశ్చ మామన్యుశ్చ మన్యుపతయశ్చ మన్యు కృతేభ్యః| పాపేభ్యో రక్షన్తాం| యదహ్నా పాపమకార్ షమ్|
మనసా వాచా హస్తాభ్యాం| పద్భ్యాముదరేణ శిశ్నా| అహస్తదవ లుమ్పతు| యత్కించ దురితం మయి|
ఇదమహం మామృతయోనౌ| సత్యే జ్యోతిషి జుహోమి స్వాహా|

అగ్ని శబ్దంచే, మన్యు శబ్దంచే చెప్పబడిన దేవతలు క్రోధానికి స్వామి భూతమైన దేవతలు. "కోపంచే నా వలన చేయబడిన పాపాలేవి ఉన్నాయో వాటినుండి నన్ను రక్షించుము" అని అర్థం. అనగా క్రోధం వచ్చినప్పుడు ఏ పాపాలు చేయడానికైనా వెనుదీయడని; అటువంటి కోపాన్ని, వాటివల్ల వచ్చిన పాపాన్ని ఉపశమింపచేసి రక్షించమని ఈ ప్రార్థన. సుందరకాండలో శ్రీ ఆంజనేయస్వామి లంకా పట్టణాన్ని దగ్ధం చేసాక "అయ్యో! లంకా పట్టణాన్ని దగ్ధం చేయాలనే కానీ, సీతమ్మ ఏమవుతుందో అనే వివేకం తన కోపంవల్ల లోపించిందని" విలపిస్తూ పలికినవి చూడండి-

క్రుద్ధః పాపం న కుర్యాత్కః క్రుద్ధో హన్యాద్గురూనపి| క్రుద్ధః పరుషయా వాచా నర స్సాధూనధిక్షిపేత్||

యత్సముత్పతితం క్రోధం క్షమయైవ నిరస్యతి| యథోరగస్త్వచం జీర్ణాం స వై పురుష ఉచ్యతే||

ధన్యాస్తే పురుష శ్రేష్ఠాః యే బుద్ధ్యా కోపముత్థితం| నిరుంధన్తి మహాత్మానో దీప్తమగ్ని మివాంభసా|| (సుం.కాం.)

క్రోధం వచ్చినప్పుడు మనిషి ఏ పాపం చెయ్యడు? క్రోధావిష్టుడైనప్పుడు కార్యాఽకార్య వివేకం లోపించి గురుహత్య, పరుష వాక్యాలతో సత్పురుష నింద కూడా చేస్తాడు. సర్పం జీర్ణమైన కూసాన్ని విడిచినట్లుగా ఓరిమితో క్రోధాన్ని నిరసించే వాడే లోకంలో పురుషుడు అనిపించు కుంటాడు. అగ్నివలె బయల్దేరిన కోపాన్ని ఉదకంతో చల్లార్చినట్లుగా వివేకంతో ఉపశమింప చేసేవారే ధన్యజీవులు, వారే పురుష శ్రేష్ఠులు.

అందుచేత ఈ కోపంవల్ల అనేక పాపాలు సంభవిస్తాయి కనుక నన్ను ఆ పాపాలనుండి రక్షించు! అని ప్రార్థన. ఇంకా ఈ పగలు నా మనస్సుచే పరాఽనిష్ట చింతన, వాక్కుచే సత్పురుష నింద, హస్తంచే గోవులు మున్నగు వాటిని కొట్టడం, పాదాలచే వెళ్లకూడని ప్రదేశాలకి వెళ్ళడం, ఉదరంచే అభోజ్య భోజనాదికం, శిశ్నంచే అయోని, పరయోనులందు రేతస్సేకము మొదలగు పాపాలు చేసెనో ఆ పాపాన్ని అహరభిమాని దేవత అనగా **'మైత్రం వా అహః'** శ్రుతిచే చెప్పబడిన మిత్రశబ్ద వాచ్యుడు (సూర్యుడు) పోగొట్టు గాక!

'యత్కించదురితం మయి' అనడంచే తెలసీ తెలియని ఏ పాపం నాయందు కలదో దాన్ని నశింపచేసి నన్ను రక్షించు గాక! అని ఆ పాప సముదాయాన్నంతనీ **'అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్'** అను శ్రుత్యుక్త ప్రకారం ముఖాభిమాన దేవత అయిన అగ్నియందు ఉంచుతున్నానని ప్రార్థించడమే ఈ మంత్రం లక్ష్యం.

ఇక మధ్యాహ్న సంధ్యలో ఉపయోగించే మంత్రం అర్థం :-

ఆపః పునన్తు పృథివీం పృథివీ పూతా పునాతు మామ్| పునన్తు బ్రహ్మణ స్పతిర్బ్రహ్మ పూతా పునాతు మామ్|
యదుచ్ఛిష్టమభోజ్యం యద్వా దుశ్చరితం మమ| సర్వం పునన్తు మామాపోఽసతాం చ ప్రతిగ్రహగ్ం స్వాహా|

ఉదకాలు సర్వదేవతా స్వరూపాలై పరమ పవిత్రమవడంవల్ల పవిత్రింప చేయడం యుక్తం కనుక ముందుగా పృథివిని ప్రక్షాళన చేయడం ద్వారా పవిత్రింప చేయుగాక! ఉదకాలచే పవిత్రమైన పృథివి సంధ్యావందనాన్ని ఆచరిస్తున్న నన్ను పవిత్రింపచేయు గాక! అనగా ఆ పైన చేయబోవు కర్మలందు అధికారం కలవానినిగా చేయు గాక! అని అర్థం. ఇదే విషయం ఇంకా వివరించబడుతోంది.

"యావై వర్ష్యాస్తా ఆపః" అని శ్రుతి చెప్పినట్లు వర్ష రూపంలో భూమియందు ప్రవేశించినందువల్ల ఆ భూమి పవిత్రింపబడినదై అనుష్ఠాతగా సంధ్యాకర్మను ఆచరిస్తున్న నన్ను పవిత్రింపచేయు గాక! అయితే భూమియందు ప్రవేశించిన ఉదకాలు నన్ను పవిత్రింపచేయు గాక! అని ఎందుకు ప్రార్థించడమని శంక కలుగుతుంది. **"న వర్షధారాస్వాచమేత్"** అని వర్షధారలందు ఆచమనం చేయకూడదని శాస్త్రం నిషేధించడంతో వర్షధారల్లో ఆచమనం దోషం కనుక భూమియందున్న ఉదకాలతోనే ఆచమనం చేయాలి.

పునన్తు బ్రహ్మణస్పతిః - సకల వేద ప్రతిపాద్యుడైన పరమాత్మ పవిత్రింప చేయు గాక!

బ్రహ్మపూతా పునాతు మాం- బ్రహ్మ వేద స్వరూపం. **పూతా** అంటే స్వయంగా పవిత్రుడు **అపహత పాప్మాస్వాధ్యాయః** అను వేరే శ్రుతి మలిన వస్త్రాన్ని ఉతికితే వస్త్రాలకున్న మాలిన్యాన్ని పోగొట్టే సముద్రం ఆ మాలిన్యాన్ని తాను ఏ విధంగా సంక్రమింప చేసుకోదో, ఆ విధంగా వేదం పాపాన్ని పోగొట్టేదే గానీ తాను ఆ పాపాన్ని సంక్రమింప చేసుకోదు అని చెప్తోంది కనుక, అటువంటి వేదం నన్ను పవిత్రింపచేయు గాక!

యదుచ్ఛిష్టమభోజ్యం- స్త్రీలు తినగా మిగిలిన అన్నం ఉచ్ఛిష్టమని, కేశ కీటకాదులచే దూషితమైంది అభోజ్యమని అటువంటి ఆహారాన్ని తినడం వంటి పాపం

యద్వా దుశ్చరితం మమ- శాస్త్ర నిషిద్ధమైన అపేయపానాదులేవి ఆచరించబడ్డాయో ఆ పాపం

'వైజీవ మన్నతం దుశ్చరితం" అను శ్రుత్యంతరంచే అబద్ధమాడడం దుశ్చరితమని (తప్పని) చెప్పబడింది. అటువంటి దుశ్చరితంవల్ల ఏ పాపం సంక్రమిస్తోందో అట్టి సర్వపాపాలను పోగొట్టి

మాం - నన్ను పవిత్రింప చేయు గాక!

మరియు

అసతాం చ ప్రతిగ్రహం- చేయకూడని పనులు చేసిన వానినుంచి ద్రవ్య ప్రతిగ్రహణం చేయడంచే వచ్చిన పాప విముక్తి కోసం అభిమంత్రించబడిన నా ఈ హస్తమందు గల ఉదకం నా ముఖాగ్ని యందు

స్వాహా- బాగా పతనమగు గాక! (స్వీకరించెదను గాక!)

ఈ ప్రకారం ప్రార్థన చేయడంతో సర్వ పాపాన్ని భస్మం చేస్తున్నాను అని అర్థం. ఆ పైన పునర్మార్జన మంత్రాల అర్థం.

దధిక్రావణ్ణో అకారిషమ్| జిష్ణోరశ్వస్య వాజినః| సురభినో ముఖా కరత్ప్రణ ఆయూగ్ంషి తారిషత్|

దధ్యాది హవిస్సులను స్వీకరిస్తున్న, జయశీలుడైన, వ్యాపకుడైన లేదా ఒకానొక నిమిత్తంతో దేవతలనుండి దాగి అశ్వరూపాన్ని దాల్చిన, అన్న సమృద్ధి కలిగిన, వాయుసఖుడు అవడంచే వేగంగా గమనం కలిగిన అగ్నిపురుషునికి స్తోత్రం చేసి ఆ అగ్నికి సేవకుడనైతిని.

స చ అగ్నిః, నః-అస్మాకం ముఖాని, అస్మత్సుకృత-సమాసాదిత సౌరభ్యాణి, కరత్-కరోతు (భాష్యం)

పై విశేషణ విశిష్టుడైన అగ్ని మా ముఖాలను మా పుణ్య విశేషాలచే సుగంధయుక్తమైన వాటినిగా చేయుగాక! అను అర్థం గల మంత్రంతో శిరస్సునందు ఉదకాలను మార్జన చేసుకోవాలి. మార్జనలో ఇతర (పునర్మార్జన) మంత్రాలు కూడా ఉన్నాయి.

హిరణ్యవర్ణాశ్శుచయః పావకా యాసుజాతః కశ్యపోయాస్విన్ద్రః- హిరణ్య సదృశ్యమైన వర్ణంగల, సకల జగత్తును పవిత్రింప చేయడంలో సమర్థవంతములైన ఏ ఉదకములందు కశ్యపాఖ్య సూర్యుడు ఉదయించెనో, ఏ ఉదకములందు ఇంద్రుడు ఉత్పన్నుడైనట్లు పౌరాణికులు చెప్తున్నారో,

అగ్నిం యా గర్భం దధిరే విరూపాః- బడబాగ్నిని గర్భంలో ధరించిన ఉదకాలేవి ఉన్నాయో ఆ ఉదకాలు, మరో శ్రుతిలో "**దివస్పరి ప్రథమం జజ్ఞే అగ్ని రస్మద్ద్వితీయం పరిజాత వేదాః| తృతీయ మప్సున్నృమణా అజస్త్రమింధాన ఏనం జరతే స్వాధీః**" అని ఆ అగ్ని ద్యులోకంలో సూర్యుడుగాను, భూలోకంలో దాహపాకాదులు (దాహం కల్గించడం, వంటకి పనికి రావడం వంటివి) చేస్తూ అగ్నిగానూ, ఉదకాలందు బడబాగ్నిగాను ఉన్నట్లు వర్ణించబడిన ప్రకారం, ఉదకాలందు బడబాగ్నిగా ఉన్నట్లు చెప్పబడిన ఆ ఉదకాలు,

తాన ఆపశ్శగ్ స్యోనా భవన్తు| యాసాగ్ం రాజా వరుణోయాతి మధ్యే సత్యాన్నృతే అవపశ్యన్జనానామ్|
మధుశ్చుత శ్శుచయో యాః పావకాస్తాన ఆపశ్శగ్ స్యోనా భవన్తు|

ఏ ఉదకాలకు వరుణుడు అధిపతిగా ఉన్నాడో, ఏ ఉదకాలు మధ్యన (భూలోకంలో) ఉండే జనుల పుణ్య,పాప విచారణ చేస్తూ పుణ్యాత్ముని అనుగ్రహించడం, పాపాత్ముని ఆగ్రహించడం అనే వ్యాపార చికీర్షతో ఉన్నాయో, ఏ ఉదకాలు ఇతర వస్తువులందు కూడా తన తాలూకు మాధుర్యాన్ని స్రవింప చేస్తున్నాయో, ఏ ఉదకాలు '**ఆప స్వభావతో మేధ్యాః**" అను వచనానుసారం స్వతస్సిద్ధంగా పవిత్రమై ఇతరాలను కూడా పవిత్రంప చేస్తున్నాయో ఆ ఉదకాలు మాకు దుఃఖాన్ని ఉపశమింప చేసి సుఖ హేతువులగు గాక!

యాసాం దేవా దివి కృణ్వన్తి భక్షం యా అంతరిక్షే బహుధా భవన్తి| యాః పృథివీం పయసోన్దన్తి శుక్రాస్తాన ఆపశ్శగ్ స్యోనా భవన్తు|

ద్యులోకంలో ఉన్న మందాకినీ నదిలో ఉన్న ఏ ఉదకాలు దేవతలకు అమృతరూప భక్షణ అవుతున్నాయో, ఏ ఉదకాలు అంతరిక్షంలో బహు ప్రకారాలుగా ఉన్నాయో ఆ ఉదకాలు మాకు దుఃఖాన్ని తగ్గించడం ద్వారా సుఖం కలుగచేసేవి అగు గాక!

శివేన మాచక్షుషా పశ్యతాపశ్శివయా తనువోపస్పృశత త్వచం మే| సర్వాగ్ం అగ్నీగ్ం రప్సుషధో హువేవో మయి వర్చో బలమోజో నిధత్త|

ఓ ఉదకాభిమాన దేవతలారా! నాయందు కటాక్ష వీక్షణాన్ని ప్రసరింప చేయండి. మంగళప్రదమైన మీ శరీరంతో మా శరీరాన్ని స్పృశించి పరిపూర్ణమైన పవిత్రత గలదానినిగా చేయండి. ఓ ఉదకాభిమాన దేవతలారా! మీలో ఇమిడి ఉన్న బడబాగ్నుల్ని ఆహ్వానిస్తున్నాను. నన్ను వర్చస్సు కలవానినిగా, శక్తి కలవానినిగా, ఉత్సాహం కలవానినిగా చేయండి అని ఈ మంత్రాలతో ప్రార్థించడం అర్థం.

ఈ మంత్రాలతో ఉదకాలను శిరస్సుపై మార్జన చేసుకున్నాక పాప పురుషుని మననుండి నిరసింప చేయడానికి అర్ఘ్యప్రదానానికి ముందుగా దక్షిణ హస్తమందు జలాన్ని ఉంచి ఆ జలాన్ని నాసికాగ్రం వరకు తెచ్చి ఎడమ భాగాన భూమిపై వేసి ఆ నీటిని తిరిగి చూడకూడదని చెప్పబడింది. ఈ ప్రక్రియలో (పాప పురుష విమోచనంలో) వాడే మంత్రం-

దృపదాదివ ముంచతు| దృపదాదివేన్ముము చానః| స్విన్నః స్నాత్వీ మలాదివ| పూతం పవిత్రేణేవాజ్యం| ఆపశ్శున్ధన్తు మైన సః|

అపరాధుల పాదాలను గొలుసుతో కట్టే కాష్ఠాన్ని (దుంగని) 'ద్రుపదం' అంటారు. దాన్ని గ్రామాధిపతులు గ్రామం మధ్యలో స్థాపించడం ప్రసిద్ధం. దృపదానికి కట్టబడ్డ అపరాధిని దయామయుడైన అధిపతి ఆ బంధనం నుండి విముక్తి చేసినట్లు, చెమటతో కూడిన వ్యక్తిని మాలిన్యం నుండి స్నానం విముక్తి చేసినట్లు, ఇంకా దర్భరూపమైన పవిత్రంచే సంస్కరించబడిన ఆజ్యం వలెనే నన్ను సమస్త పాపాలనుండి పవిత్రంచేయు గాక!

అర్ఘ్య ప్రదానం

పైన చెప్పిన క్రియ అయ్యాక అర్ఘ్యప్రదాన సంకల్పం చేసి అర్ఘ్యప్రధానం చెయ్యాలి. ముఖ్యకాలం దాటిపోతే ప్రాయశ్చిత్తార్థం ప్రణవంతో, సప్తవ్యాహృతులతో కూడిన **'ఓమాపోజ్యోతి'** అనే శిరో మంత్రంతో కూడిన గాయత్రీ మంత్రంతో ఇచ్చి ఉదయం, సాయంకాలం గాయత్రీ మంత్రంతో మూడు అర్ఘ్యాలను; మధ్యాహ్నసంధ్యలో **"మధ్యాహ్నే చాంజలిక్షేపం సకృదేవ సమాచరేత్"** అను వచనానుసారం గాయత్రీ మంత్రంతో కాకుండా విశేషంగా **"హగ్ం సశ్శుచిషత్"** అనే మంత్రంతో ఒక అర్ఘ్యాన్ని మాత్రమే ఇవ్వాలి.

ప్రాతః ప్రహ్వః క్షిపేదప్సు మధ్యాహ్నే ఋజుసంస్థితః| అర్ఘ్యప్రక్షేపణం కుర్యాత్సాయంతు ఉపవిశన్భువి|

అను వచనానుసారం ఉదయం కొద్దిగా ఒంగొని, మధ్యాహ్నం ఉదకములందు, కాకపోతే ఉదకాలతో ప్రోక్షించిబడిన స్థలంలో నిలబడి, సాయంకాలం భూమిపై కూర్చుని అర్ఘ్యం ఇవ్వాలని చెప్పబడింది. అర్ఘ్య ప్రదానంలో వాడే గాయత్రీ మంత్రార్థం వేరుగా వివరించబడింది.

మాధ్యాహ్నిక సంధ్యలో వినియోగింపబడే **'హగ్ం సశ్శుచిషత్"** అను మంత్రానికి అర్థ వివరణ-

శుచిషత్-లోకంలో ఎక్కువ కేండిల్సు గల బల్బువల్ల హెచ్చుకాంతి ప్రసారమైనట్లు పుణ్యక్షేత్రాలలో అధికంగా ఆవిర్భవించునటువంటి

వసుః - సమస్త జగత్తును నివసింప చేయునటువంటి

అంతరిక్ష సత్- **"వాయుర్వా అన్తరిక్షస్యాధ్యక్షః"** అను శ్రుతి ప్రకారం అంతరిక్షానికి వాయువు అధ్యక్షుడు కనుక అంతరిక్షంలో వాయుగుండంగా ఉండే **'హోతా వేదిషత్' - అగ్నిర్వై దేవానాగ్ం హోతా"** అనే శ్రుత్యుక్త ప్రకారం యజ్ఞవేదిలో దేవతలకు ఆహ్వాత (ప్రతినిధి) అయిన అగ్నిరూపంగా ఉండేటటువంటి

అతిధిర్దురోణసత్-గృహస్థుల ఇళ్ళలో అతిథి రూపంగా ఉండేటటువంటి

నృషత్-ప్రాణుల్లో వైశ్వానరాగ్ని రూపంగా అనగా **"విశ్వేషామ్ నరాణాం హితకారిత్వాత్ వైశ్వానరః"** అను వ్యుత్పత్తిచే మనం భక్షించిన దానిని జీర్ణింప చేయడమనే హితవును కలిగిస్తూ జఠరాగ్ని రూపంలో ఉన్నటువంటి

వరసత్ - శ్రేష్ఠమైన తీర్థాదులందు తీర్థాధిపతిగా ఉన్నటువంటి

ఋతసత్ - ఋతం అనే యజ్ఞానికి నిష్పాదకుడుగా ఉన్నటువంటి

వ్యోమసత్- ఆకాశంలో సూర్యరూపంలో ఉన్నటువంటి

అబ్జాః- ఉదకాలందు కశ్యపునిగా జనించునటువంటి

గోజాః – గోవులందు అంతర్యామి గాను,

అద్రిజాః- పర్వతాలందు సోమరూపంగాను ఆవిర్భవించిన

హగ్ంసః- "హంసోనామ సదాశివః" అను వచనానుసారం సదాశివ స్వరూపమైన పరమాత్మ

ఋతం బృహత్ - మహత్తరమైన సంధ్యోపాసనాత్మకమైన యజ్ఞాన్ని నిర్వహింపచేయు గాక!

ఇటువంటి అర్థంతో కూడిన మంత్రంతో మాధ్యాహ్నిక సంధ్యయందు అర్ఘ్యప్రదానం చేయడం ఒక విశేషం.

ఈ ప్రకారం అర్ఘ్యప్రదానం అయ్యాక -"**ఉత్థాయ సజలేన పాణినా త్రిః ప్రదక్షిణ మనుప్రదక్షిణం కర్తవ్యం",** అను శ్రుతిని అనుసరించి **"యత్ప్రదక్షిణం"** నుంచి **"అసావాదిత్యో బ్రహ్మ"** అను మంత్రం వరకు చెప్పి, చేతిలో నీటితో ప్రదక్షిణం చేస్తూ ఆదిత్యుని పరబ్రహ్మగా ధ్యానించి ఆ నీటిని విడిచిపెట్టాలి. ఆ తర్వాత సంధ్యాంగ తర్పణం.

సంధ్యాంగ తర్పణం

"**సంధ్యామ్ తర్పయామి, గాయత్రీం తర్పయామి"** మొదలైన మంత్రాలతో ఉదయ, మాధ్యాహ్నిక, సాయం సంధ్యలలో తర్పణం చేయాలి.

జాతాఽశౌచ మృతాఽశౌచాదుల్లో (పురుడు పుణ్యాలు, మైల దినాల్లో)కూడా అర్ఘ్యప్రదానం వరకు చేసి తీరాలని ముందే తెలుసుకున్నాం. **"సంధ్యామిష్టిం చ హోమం చ యావజ్జీవం సమాచరేత్, న త్యజేత్ సూతకే వాపి త్యజన్గచ్ఛత్యధో గతిం"** అని అర్ఘ్య ప్రక్షేపణం వరకు మానసికంగా సంధ్యావందనం చేయాలని చెప్పడం తాత్పర్యమని గ్రహించాలి! కారణమేమనగా- **"సంధ్యాకాల ముపస్థానం సంధ్యాయాః పార్థివేళ్యతే|**

సూతకాఽశౌచ విభ్రమాతుర భీతితః" అని ఒకచోట, **"అన్యత్ర సూతకే కర్మణాం త్యాగః సంధ్యాదీనాం విధీయతే"** అని మరోచోట విరుద్ధ వచనాలు ఉండడంతో-

సూతకే మృతకే చైవ సంధ్యా కర్మ న సంత్యజేత్| మనసోచ్చారయేన్మన్త్రాన్ ప్రాణాయామమృతేద్విజః|

అనే పులస్త్య వచనాన్ని బట్టి మానసికంగానైనా సంధ్యావందనం చేసి తీరాలని చెప్పిన వచనాల్ని, **'తాసాం వాచాం ఆచమనాభివాదాన్త కర్మరూప సంధ్యాకలాపస్య సవిశేషానుష్ఠాన నిషేధే తాత్పర్య కల్పనా'** అని సంధ్యాభాష్యంలో వివరించినందున, **'ప్రాణాయామం వినా మానసిక మన్యత్కార్యం'** అని పరాశర మాధవీయంలో చెప్పినందున, అర్ఘ్యప్రదానం వరకు చేసి మిగిలినది ప్రాణాయామం లేకుండా మానసికంగా చెయ్యాలని తేలింది.

ఇక వ్యాధిగ్రస్థుని విషయంలో తప్తోదక ఆచమనం నిషిద్ధమైనా **"తప్తాభిశ్చ కారణాత్"** అను ఆపస్తంబ సూత్రాన్ని అనుసరించి, ఇందులో **కారణాత్** అనగా **జ్వరకారణాత్** అని అర్థం కనుక జ్వరంచే ఆర్తుడైన వ్యక్తి తప్తోదకంచే (వేడి నీటిచే) చేయాలి. ఇంకా లేవలేనంత రోగార్తుడైతే '**పితరం భ్రాతరం అన్యం వా సమాహూయ కారయితవ్యమ్ నిత్య కర్మత్వాత్'** అని నిత్యకర్మ అయినందున సంధ్యావందనాన్ని మానడానికి వీల్లేదని; తండ్రి, సోదరుడు లేక శిష్యుని పిలిచి వారిచే చేయించుకో వలసిందని శాస్త్రకారులు స్పష్టం చేసారు.

ఇంక ప్రధాన కర్మల్లో రెండోది గాయత్రీ జపం. దాన్ని ఆచరించడానికి ముందుగా గాయత్రీ హృదయమనే మంత్రాన్ని పఠించి గాయత్రీ దేవిని హృదయంలో స్థాపించుకుని గాయత్రీ జపానికి సిద్ధుడు కావాలి.

ఓమిత్యేకాక్షరం బ్రహ్మ| అగ్నిర్దేవతా బ్రహ్మ ఇత్యార్షం| గాయత్రం ఛన్దం పరమాత్మం సరూపం| సాయుజ్యం వినియోగమ్|

'నక్షరతీత్యక్షరమ్-అక్షరం బ్రహ్మ స్వరూపం' అను వాచక శబ్దం, క్షరం కానిది (నాశనం లేనిది) అక్షరం అని, అక్షరానికి బ్రహ్మకి భేదం లేదని చెప్పడంతో **'ఓం'** అనే ప్రణవ స్వరూపమైన అక్షరం కూడా బ్రహ్మ స్వరూపమని చెప్తోంది. ఈ ప్రణవానికి అగ్ని అనగా సకల వేదాంత ప్రతిపాద్యుడైన పరమాత్మ అధిదేవత. ఈ ప్రకారం ప్రణవం బ్రహ్మ స్వరూపం అని, ప్రణవానికి అధిదేవత, రుషి బ్రహ్మ అని, ఛందస్సు గాయత్రీ ఛందస్సు అనీ చెప్పబడింది. ప్రణవం పరమాత్మయొక్క అభివ్యక్తికి యోగ్యమైన స్థాన మవడం వల్ల అది పరమాత్మ స్వరూపమే. అధికారి అయిన వ్యక్తి ప్రణవ జపంచే మోక్షాన్ని పొందగలడు. ఈ ప్రకారంగా ప్రణవాన్ని తెలుసుకోవాలి.

ప్రణవే బ్రహ్మర్షిః (గాయత్రముచ్యతే) పరమాత్మా దేవతా అయం మోక్షాదౌ వినియుజ్యతే|

అని శంకర భగవత్పాదులచేత కూడా ఈ ప్రణవ విషయం చెప్పబడింది.

ఆయాతు వరదా దేవీ అక్షరం బ్రహ్మ సమ్మితమ్|

అక్షరం బ్రహ్మ సమ్మితమ్- అంటే నిత్యమైన సమ్యగ్వేదాంత ప్రమాణంచే నిశ్చయించబడిన బ్రహ్మ స్వరూపం. ఉపాసకులకు అభీష్ట ఫలాలనిచ్చే ఆ గాయత్రీదేవి మమ్మల్ని అనుగ్రహించే నిమిత్తం మా సమీపానికి వచ్చుగాక!

గాయత్రీం ఛన్దసామ్ మాతేదం బ్రహ్మ జుషస్వమే- సర్వ వేదాలకు మాతృ రూపమైన, గాయత్రి అని పిలవబడే పరదేవతా స్వరూపమైన నీవు వేదాంత ప్రతిపాద్యమైన బ్రహ్మతత్వాన్ని నాకు ఉపదేశించు గాక! ఈ ప్రకారం పరతత్వాన్ని నీవు ఉపదేశించడం వల్ల నాకు పాపక్షయం ద్వారా శుభం జరుగు గాక!

యదహ్నాత్కురుతే పాపం తదహ్నాత్ప్రతిముచ్యతే| యద్రాత్రియాత్కురుతే పాపం తద్రాత్రియాత్ ప్రతిముచ్యతే| సర్వ వర్ణే మహాదేవి సంధ్యా విద్యే సరస్వతి|

ఓ సర్వాత్మక స్వరూపిణి గాయత్రీ దేవీ! ఓ మహాదేవీ! ఓ సంధ్యా స్వరూపిణీ! ఓ సరస్వతీ! ఏ పగలు చేసిన పాపం ఆ పగలు, ఏ రాత్రి చేసిన పాపం ఆ రాత్రి నీ అనుగ్రహంతో విముక్తి చేయబడుతోంది. ఓ గాయత్రీ దేవీ! నీవు ఇంద్రియాలకు శక్తి స్వరూపమైతివి.

ఓజోసి సహోసి బలమసి భ్రాజోసి దేవానామ్ ధామనామాసి| విశ్వమసి విశ్వాయుః సర్వమసి సర్వాయురభిభూరోమ్|

ఓజస్సును ఇవ్వగలిగినదానవు నీవే! శక్తి సామర్థ్య స్వరూపానికి సమస్త ధాతువులకు సారభూతమైనదానవు నీవే. దీప్తి స్వభావం కలదానవు నీవే. దేవతలందరికీ కూడా నివాసభూతమైన దానవు నీవే అని ప్రసిద్ధమే కదా! జగద్రూపం నీవే అయితివి. స్థావర జాతానికి అంతకూ సంపూర్ణ ఆయుఃస్వరూపం అయితివి. జంగమ జాతం యొక్క ఆయుః స్వరూపం నీవే! సమస్త పాపాన్ని తిరస్కరించగలిగిన దానవు, ప్రణవ ప్రతిపాద్య పరమాత్మ స్వరూపమూ నీవే. అటువంటి నిన్ను, గాయత్రిని నా మనస్సులో ఉపాసించడానికి ఆవాహన చేస్తున్నాను. ఇదే ప్రకారం వ్యాపార భేదంచే ఉపాసించడానికి ఆవాహన చేస్తున్నాను.

గాయత్రీమావాహయామి| సావిత్రీమావాహయామి| సరస్వతీమావాహయామి| ఛందర్షీనావాహయామి| శ్రియమావాహయామి|

ఇదే తీరుగా గాయత్ర్యాది ఛందస్సులను, సావిత్రిని, సరస్వతిని, విశ్వామిత్రాది రుషులను, లక్ష్మీ స్వరూపంగాను కూడా ఆవాహన చేస్తున్నాను. బ్రహ్మ సాక్షాత్కారానికి కారణమైన జ్ఞానానికి ప్రకాశమైన పరమాత్మకు సంబంధించిన సావిత్రిని ఆవాహన చేస్తున్నానడంతో జ్ఞానంతో పొందగలిగిన పరమాత్మ స్వరూపమే గాయత్రి అని తెలుస్తోంది. ప్రళయకాలంలో బ్రహ్మతో లీనమైన వేదాలు సృష్ట్యారంభంలో జలధారణ క్రియచేత తిరిగి బ్రహ్మగారిచే నిశ్వాస రూపంగా వినబడడం అనే క్రియ చేత ఆ వేదాలే సరస్సులుగా చెప్పబడుతున్నాయి. అటువంటి సరస్సుల రూపంలో గల వేదాలను ధరించి వేదమయమై అనగా వేదప్రతిపాద్యమై సరస్వతి శబ్దంచే వ్యవహరించబడతాయి. గాయత్రిని ఆవాహన చేస్తున్నాను. వేదాలు శబ్దమయం కనుక వాటికి ఛందస్సులు, రుషులు ఉండగలవు. కనుక గాయత్రి సర్వ మంత్రమయం కనుక ఆయా మంత్రాల సర్వ ఛందస్సులను, సర్వ రుషులను, సర్వ దేవతలను, గాయత్రియొక్క ఆవాహనచే వారందరినీ ఆవాహన చేస్తున్నానని అర్థం. **"ఋచ స్సామాని యజూగ్ంషి సాహిశ్రీ రమృతా సతామ్'** అను శ్రుతిచే వేదవాఙ్మయమంతా శ్రీ స్వరూపం అనగా ఐశ్వర్య స్వరూపమని చెప్పబడుతోంది. గాయత్రి సర్వవేదాల సారభూతమైనందున శ్రీ రూపమైన గాయత్రిని ఆవాహన చేస్తున్నాను అని అర్థం. ఇటువంటి విశేషాలతో కూడిన గాయత్రిని ఆవాహన చేసి పిమ్మట ఆమెను ఛంద, రుషి, దేవతా స్వరూపంగా స్మరించి ధ్యానించాలని చెప్పారు.

గాయత్ర్యా గాయత్రీచ్ఛందో విశ్వామిత్ర ఋషిస్సవితా దేవతాగ్నిర్ముఖం| బ్రహ్మశిరో విష్ణుర్ హృదయగ్ం రుద్రశ్శిఖా పృథివీ యోనిః|

గాయత్రీ మంత్రానికి గాయత్రి ఛందస్సు, విశ్వామిత్రుడు రుషి, సవిత దేవత అని, గాయత్రికి అగ్ని ముఖ స్థానమని, చతుర్ముఖబ్రహ్మ శిరః స్థానీయమని, విష్ణువు హృదయ స్థానీయమని అనగా జగత్తు స్థితికారుడు విష్ణుమూర్తి గాయత్రికి హృదయ స్థానీయుడని, జగత్సంహారకుడైన రుద్రుడు శిఖా స్థానీయుడని

చెప్పబడింది. అనగా సృష్టి స్థితి లయ కర్తలైన బ్రహ్మ విష్ణు రుద్ర స్వరూపిణి గాయత్రి అని, సర్వ జగత్ప్రసవానికి కారణమవడం వల్ల పృథివి యోని స్థానాపన్నంగా కలిగినది గాయత్రి అని, గాయత్రీ దేవతను స్మరించడానికి ముందుగా సర్వదేవతా రూపంగా ధ్యానం చెప్పబడింది.

ప్రాణాపాన వ్యానోదాన సమానా సప్రాణా శ్వేత వర్ణా సాంఖ్యాయన సగోత్రా గాయత్రీ చతుర్విగ్ంశత్యక్షరా త్రిపదా షట్కుక్షిః పంచశీర్షోపనయనే వినియోగః|

ఇంకా ప్రాణాపాన వ్యానాది పంచ వాయువులు **"అస్యాం గాయత్ర్యాం సన్తి"** అనే వ్యుత్పత్తిచేత ప్రాణ, అపానాది పంచ వాయువులు కలదిగాను, కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలతో కూడినదిగాను, సత్వగుణ ప్రధానంచే శ్వేతవర్ణం కలదిగాను చెప్పబడింది. అనగా సమయ భేదాన్ననుసరించి రజోగుణ, తమోగుణాలు ప్రధానంగా ఉన్నపుడు రక్త,కృష్ణాది వర్ణాలు కలదిగా కూడా చెప్పబడు తున్నందున మొదట శ్వేతవర్ణం కలదిగా చెప్పబడింది. ఇంకా జ్ఞానులచే పొందబడే పరమాత్మతో సమానమైన గోత్రోద్భవురాలు అని పరమాత్మ స్వరూపిణిగా దేవతా ధ్యాన పద్ధతి చెప్పబడింది.

'చతుర్విగ్ంశత్యక్షరా' ఇత్యాది శ్రుతి భాగంచే ఇటుపై మంత్ర రూపంగా ధ్యాన పద్ధతి చెప్పబడుతోంది. 24 అక్షరాలు, 3 పాదాలు కలిగినది గాయత్రి. కనుకనే **'అష్టాక్షరా గాయత్రీ'** అను మంత్రం పాదాభిప్రాయంలో (ఒక్కో పదానికి అన్న అభిప్రాయంలో) ఎనిమిది అక్షరాలు కలది గాయత్రి అని చెప్తున్నందున పరస్పర విరోధం లేదు. మరియు **'తత్సవితుర్వరేణ్యం'** అనే మంత్రానికి 24 అక్షరాలుగా లెక్కించడంలో **'ణ్యమ్'** అనే దాన్ని 'ణియమ్' అని విభజించి రెండు అక్షరాలుగా పరిగణించాలని శాస్త్ర సిద్ధాంతం.

షట్కుక్షి: వేదాంగాని కుక్షయః యస్యాః సా షట్కుక్షిః| (భాష్యం)

శీక్షా వ్యాకరణం ఛన్దో నిరుక్తం జ్యోతిషం తథా కల్పశ్చేతి షడంగాని వేదస్యాహుర్మనీషిణః|

అని, వేదాంగాలు ఆరు. శీక్షా, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం అనే ఆరింటినీ కక్షులుగా (కన్నులుగా) కల షట్కుక్షి (ఆరు కన్నులు గలది), వేదం.

చతుర్ణాం వేదానాం చత్వారః ఉపనిషద్భాగాః జ్ఞాన ప్రతిపాదినః కర్మ ఉపాసనా కాణ్డయోరుపరిస్థితాః చత్వారి శీర్షాణి శిరాంసి, తథా ఇతిహాస పురాణాని పంచమో వేదః జ్ఞాన ప్రతిపాదకత్వాత్|

నాలుగు వేదాల్లో కర్మ, ఉపాసనా కాండల తర్వాత గల నాలుగు ఉపనిషద్భాగాలు, ఇతిహాస పురాణాలు ఈ అయిదూ శిరస్సులుగా కలది **'పంచశీర్ షా గాయత్రి'** అని మంత్ర రూపంగా ధ్యానం చేయబడింది వటువుకి ఉపనయనంలో గాయత్రీ మంత్రోపదేశంలో ఈ మంత్రానికి వినియోగమని తెలుసుకోవాలి.

సారాంశం- గాయత్రీ జపం చేయడానికి ముందు గాయత్రీ హృదయ మంత్రాన్ని పఠించాలని, గాయత్రీ దేవతను ఆవాహన చేయాలని, ఆవాహన చేయబడు గాయత్రీ దేవతే సావిత్రి, సరస్వతి మొదలైన శబ్దాలచే చెప్పబడుతోందని పిమ్మట గాయత్రిని ఛంద, ఋషి, దేవతా స్వరూపంగా స్మరించి అగ్న్యాది దేవతలు ముఖాది అవయవ స్థానాలు కలదిగాను, ప్రాణాపానాది పంచ వాయువులుగాను, కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలతో కూడుకున్నదిగాను, సత్వగుణ ప్రధాన మవడంతో శ్వేతవర్ణం కలదిగాను, జ్ఞానులచే పొందదగిన పరమాత్మ స్వరూపిణిగా దేవతా రూపంతోను, **'చతుర్వింశ త్యక్షరా'** మొదలు అక్షరాత్మక మంత్ర రూపంగాను ధ్యానం చేసి ఇట్టి విశేషణాలతో కూడిన గాయత్రీ దేవతను ప్రతిపాదించే మంత్రానికి వటువుకి ఉపనయన సమయంలో వినియోగమని తెలుసుకుని గాయత్రీ మంత్రాన్ని ఉపాంశుగా పఠించి గాయత్రీ జపం చేయాలని తెలుసుకోవలెను.

గాయత్రీ ప్రాశస్త్యం

గాయత్రీ మంత్రజప ప్రాశస్త్యం చాలా గ్రంథాల్లో వర్ణించబడింది. గాయత్రీ మంత్ర జపం ఉపనయనంలో ఉపదేశించబడి చాలా ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మంత్రాభిమాన దేవత గాయత్రి. గాయత్రీ ఛందోయుక్త మంత్ర పతిపాద్య మవడంచే గాయత్రీ మంత్రానికి పరమాత్మ పరంగాను, శివపరంగాను, సూర్య తేజస్సుగాను అర్థాన్ని వివరించారు.

ఏ పరంగా వర్ణించినా గాయత్రీ మంత్రానికి **'గాయన్తం–జపన్తం, త్రాయతే ఇతి గాయత్రీ'** అను వ్యుత్పత్త్యర్థాన్ని ఆశ్రయించడంచే జపం చేసేవానిని రక్షించేది గాయత్రి అని చెప్పబడింది. పరమాత్మ, శివుడు లేదా సూర్యతేజో రూపమైన గాయత్రి అయినా గాయత్రీ శబ్దవాచ్యమని చెప్పవచ్చును. ఇక్కడ గాయత్రీ ఛందస్సు వైదిక గాయత్రీ ఛందస్సు. లౌకిక గాయత్రీ ఛందస్సు వేరుగా ఆరు అక్షరాలు కలదిగా ఉన్నట్లు వైదిక ఛందస్సులో పేర్కొనబడింది. వేదంలో మాత్రం చాలా చోట్ల **అష్టాక్షరా గాయత్రీ** అని పేర్కొనబడింది. వేదాలు గాయత్రిని బహువిధాలుగా ప్రశంసిస్తున్నాయి.

గాయత్రియా పరిలిఖతి తేజోవై గాయత్రీ తేజసైవైనమ్ పరిగృహ్ణాతి|

అని చయన ప్రకరణంలో ఇష్టకల నిర్మాణానికి ఉపయోగపడే మృత్తును (మట్టిని) తీసుకురావడానికి ముందు ఆ భూమిని తవ్వాలి. అలా తవ్వడానికి ముందు **'పరివాజ పతిరితి తిస్రభి రభ్రియా పరిలిఖతి'** అను సూత్ర ప్రకారం ఆ భూమిని **'అభ్రి'** అనబడే వెదురు కాష్టంతో(వెదురు కర్రతో) రేఖగా గీయాలి. అందులో వినియోగింపబడే **'పరివాజపతిః'** అను మంత్రం గాయత్రీ ఛందోయుక్త మైనందున **'తేజో వై గాయత్రీ'** అని గాయత్రిని ప్రశంసిస్తోంది.

జగత్యుదపత చ్చతుర్దశాక్షరా సతీ సాఽప్రాప్య న్యవర్తత| తస్యై ద్వే అక్షరే అమీయేతాం త్రిష్టుగుదపతత్ త్రయోదశాక్షరా సతీ సా అప్రాప్య న్యవర్తత తస్యై ద్వే అక్షరే అమీయేతాం|

ఈ శ్రుతిచే జగతీ, త్రిష్టుప్ ఛందస్సులు 14,13 అక్షరాలతో సోమలతను తీసుకురావడానికి వెళ్ళి రెండేసి అక్షరాలు సోమరక్షకులచే అపహరింపబడి తిరిగి వచ్చేటప్పుడు 12,11 అక్షరాలతో వచ్చాయి. నాలుగు అక్షరాలతో వెళ్ళిన గాయత్రి అక్కడ జగతీ, త్రిష్టుప్ ఛందస్సులు విడిచిపెట్టిన నాలుగు అక్షరాలను తీసుకుని తన నాలుగు అక్షరాలతో కలిసి మొత్తం ఎనిమిది అక్షరాలతో తిరిగి వచ్చిందని **'గాయత్ర్యుదపతచ్చతురక్షరా సతీ| సా సోమంచాహరచ్చత్వారి చాక్షరాణి సాష్టాక్షరా సమపద్యత'** అను శ్రుతి చెప్తోంది.

యజ్ఞంలో ప్రాతస్సవనం గాయత్రీ ఛందోయుక్త మంత్రంతో ఆరంభిస్తారు. ఛందస్సుల్లో గాయత్రీ ఛందస్సు చిన్నది. అనగా ఇతర ఛందస్సులతో పోలిస్తే అల్పాక్షరాలు కలదయినా గాయత్రితో ఆరంభించడంలో ఔచిత్యం ఏముందని ప్రశ్నిస్తే, **'బ్రహ్మవాదినో వదన్తి కస్మాత్సత్యాత్ గాయత్రీ కనిష్ఠా ఛందసాగ్ం సతీ యజ్ఞముఖం పరీయాయేతి"** అను శ్రుతిచే బ్రహ్మవాదులు విచారించి ఇలా చెప్పారు.

యా దేవాదన్సోమ మహరత్తస్మాద్యజ్ఞముఖం పర్యైత్| (శ్రుతి)

త్రిష్టుప్, జగతీ ఛందస్సులకు సాధ్యం కాని సోమలతను, జగతీ త్రిష్టుప్ ఛందస్సులు విడిచిన అక్షరాలను కూడా ద్యులోకం నుంచి గాయత్రి తీసుకు వచ్చిన కారణంచే గాయత్రికి యజ్ఞం ఆరంభంలోనే ప్రాతస్సవనంలో స్థానం కల్పించబడిందని సమాధానం చెప్పబడింది.

దీనివల్ల త్రిష్టుప్, జగతీల కంటే గాయత్రి అతిశయమైన శక్తి కలదని నిర్ణయింపబడింది. ఇలాగే మరో శ్రుతిలో కూడా యజ్ఞంలో సోమునికి ఆతిథ్యమిచ్చే ప్రకరణంలో-

బ్రహ్మవాదినో వదంతి కస్మాత్సత్యాద్గాయత్ర్యా ఉభయత ఆతిథ్యస్య క్రియత యదేవాదస్సోమ మహరత్తస్మాద్గాయత్ర్యా ఉభయత ఆతిథ్యస్య క్రియతే|

అను శ్రుతుల్లో గాయత్రి కంటే మిగిలిన అందరు దేవతలకు ఒక్కో పర్యాయం ఆతిథ్యమిచ్చి గాయత్రికి ముందు వెనుక రెండు పర్యాయాలు ఎందుకు ఆతిథ్య మీయవలసి వచ్చిందని బ్రహ్మవాదులు ప్రశ్న వేసుకుని, ఇతరులకు సాధ్యంకాని సోమలతను ద్యులోకంనుంచి తీసుకువచ్చిన కారణంగా అతీతమైన శక్తి కలదని రెండు పర్యాయాలు ఆతిథ్యం ఇవ్వబడుతున్నట్లు సమాధానం చెప్పారు.

దీనివల్ల గాయత్రి మిక్కిలి అతిశయమైన సామర్థ్యం కలదని తెలుస్తుంది **"తస్మాత్తేజస్వినీ తమా"**అని అతిశయమైన తేజస్సు కలదని **"అష్టాక్షరా గాయత్రీ గాయత్రోఽగ్నిః"** అని వేదంలో చాలా చోట్ల గాయత్రి అగ్ని స్వరూపంగా చెప్పబడుతున్నందున గాయత్రీజపంవల్ల అగ్నికి సపరిచర్య చేసినట్లు కూడా అవుతుందని తెలుస్తుంది.

గాయత్రీ బ్రహ్మవర్చసామ్ యది కామయేత బ్రహ్మవర్చసమస్త్వితి గాయత్ర్యా పరిదధ్యాత్|

ఇత్యాది అనేక శ్రుతుల్లో గాయత్రి బ్రహ్మవర్చస స్వరూపమని, బ్రహ్మవర్చస్సుని కోరుకునేవారు దర్శపూర్ణమాస ప్రకరణంలో సామిధేనులను (సమిధలను) ప్రశంసించే పరిధానీయ ఋక్కు అనగా సమాప్తిలో వినియోగించబడేది అయిన, గాయత్రీ ఛందస్సును పఠించాలని చెప్పింది. **'వేదశాస్త్ర బోధిత కర్మానుష్ఠాన ప్రయుక్తః యత్తేజః తదేవ బ్రహ్మవర్చసం'** బ్రహ్మవర్చస్సు అంటే వేదశాస్త్రాలు బోధించిన కర్మానుష్ఠానంవల్ల వచ్చే తేజస్సు అని విద్యారణ్య భాష్యంలో చెప్పి, కామ్యేష్ట ప్రకరణంలో **"ఇంద్రాయ ఘర్మవతే పురోడాశ మేకాదశ కపాలం నిర్వపేత్ బ్రహ్మవర్చస కామః"** అని బ్రహ్మ వర్చస్సుని కోరేవాడు చేయదగిన యాగాన్ని విధిస్తోందని చెప్తూ వివరించారు.

దీనివల్ల గాయత్రీ జపం అక్షర లక్షలు చేసినవారి ముఖంలో అనిర్వచనీయమైన తేజస్సు ప్రస్ఫుట మవుతుందని, అదే బ్రహ్మవర్చస్సని, అది కలవారి వాక్కుకు పటిమ ఏర్పడుతుందని **'వాచమర్థోను ధావతి'** అనగా వారు అన్నది అన్నట్లు అయి తీరుతుందని అర్థం. గాయత్రీ జపంవల్ల ఇటువంటి మహిమ ఏర్పడుతుందని తెలుస్తుంది. ఇలాగే గాయత్రీష్టి అను యాగం చాలా మహిమ కలదని, దాని సామర్థం ఇలా వర్ణింపబడింది.

దేవాసురాస్సంయత్తా ఆసన్ తేషాం గాయత్ర్యోజోబలమిన్ద్రియమ్ వీర్యం ప్రజాం పశూన్ సంగృహ్యోదాయాఽ పక్రమ్యాతిష్ఠత్|

అను వాక్యంలో దేవతలు రాక్షసులు యుద్ధ సన్నద్ధులైన కాలంలో దేవతల, రాక్షసుల ఓజస్సు, బలము మున్నగు వాటిని గాయత్రి అపహరించి వారిద్దర్నీ విడిచి మరో రహస్య ప్రదేశానికి వెళ్ళి అక్కడే ఉండిపోయిందట. **'విశ్వకర్మన్'** అని జగత్కర్త్రి అను అర్థంగల శబ్దంచేత దేవతలు ఆహ్వానించగా, రాక్షసులు 'సర్వ ప్రాణులను హింసించేదానా' అను అర్థం గల **'దాభి'** అను శబ్దంచే ఆహ్వానించారుట. **దాభిః** అంటే- **దభ్నోతి ప్రాణినః హినస్తీతి దాభిః** అని వ్యుత్పత్తి. కానీ గాయత్రి ఆ పిలుపులకు ఎవరి దగ్గరకూ రాలేదుట. అపుడు దేవతలు -

తేదేవా ఏతద్యజురపశ్యన్ ఓజోసి సహోసి బలమసి భ్రాజోసి దేవానాం ధామ నామాసి విశ్వమసి విశ్వాయుస్సర్వమసి సర్వాయురభి భూరితి వావదేవా అసురాణామోజో బలమిన్ద్రియం వీర్యం ప్రజామ్పశూనవృంజత| (తై.సం.2)

అను యజుర్మంత్రంతో ఆ గాయత్రీ దేవతను స్తుతించారుట.

ఈ మంత్ర సామర్థ్యంచే దేవతలు తమ శత్రువులైన రాక్షసుల ఓజస్సును, బలాన్ని, ఇంద్రియాన్ని, వీర్యాన్ని, వారి ప్రజలను, పశువులను కూడా స్వాధీనం చేసుకున్నారుట. ఆ ప్రకారం ఉభయుల్నీ విడిచి వెళ్ళిన గాయత్రి కూడా స్వాధీనమైన ఈ మంత్రం వినియోగింపబడే యాగం గాయత్రీష్టి అని చెప్పబడుతోంది అని **'తస్మాదేతాద్గాయత్రీష్టి మాహుః'** అను శ్రుతి ప్రబోధిస్తోంది. దీనివల్ల ఓజస్సు మున్నగు వాటిని గాయత్రి మనకు ప్రాప్తింపచేస్తుందని తెలుస్తోంది.

ఉపనయన సంస్కార ప్రకరణంలో ఆచార్యుడు వటువుకి గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించాక వటువుచే **'అవృధమసౌ సౌమ్య ప్రాణస్వం మే గోపాయ'** అనే మంత్రాన్ని చెప్పిస్తారు.

సౌమ్య ఇతి అనుకూలాభిధాన అసౌ ఇతి అంతరాత్మన్| (హ.వ్యా.)

అనగా "సౌమ్యమైన ఓ అంతరాత్మా! నేను ఇపుడు గాయత్రీ మంత్ర ఉపదేశానంతరం, **అవృధం– శ్రీమాన్ జాతః**, అనగా శ్రీమంతుణ్ణి అయ్యాను. కాబట్టి ప్రాణసమమైన గాయత్ర్యాఖ్య (గాయత్రి అనబడే) ధనాన్ని, లోపల ప్రవేశించినదాన్ని రక్షించుము అని ప్రార్థిస్తున్నట్లు చెప్పిస్తారు. ఇక్కడ శ్రీమంతుడవడం అంటే మనం అనుకునే మణిమాణిక్యాది ధనం కాదుట. 'శ్రీ' అంటే వేదమే నిర్వచనం చేసింది.

ఋచస్సామాని యజూగ్ంషి| సా హి శ్రీః అమృతాసతాం|

అను శ్రుతి రుగ్, యజుస్సామాత్మకమైన మంత్రాలే **శ్రీ** శబ్ద వాచ్యాలని చెప్తోంది. రుగ్, యజు స్సామాత్మకాలు శ్రీ శబ్ద వాచ్యాలు కావచ్చు కానీ గాయత్రీ మంత్రం **శ్రీ** కాదు కదా అంటారేమోనని **'సర్వేభ్యో వేదేభ్య స్సావిత్ర్యనూచ్యతే'** (ఆ.ధ.సూ) అను సూత్రంచే గాయత్రీ మంత్రం మూడు వేదాల సారమని చెప్తోంది.

త్రిభ్య ఏవ తు వేదేభ్యః పాదం పాదమదూ దుహత్|

అని మనుస్మృతిలో కూడా గాయత్రీ మంత్రం మూడు పాదాలు మూడు వేదాలనే గోవులనుండి పితకబడినట్లు చెప్పబడింది. ఇది 'నశ్వరం' గాని, అనగా నశించనటువంటి ఐశ్వర్యమని **'సాహిశ్రీ రమృతా సతాః'** అను శ్రుతి బోధిస్తోంది .

గాయత్రి మూడు వేదాల సారం కనుకనే యజ్ఞం మూడు వేదాలతో **'సత్రభిర్వేదైర్విధీయతే'** అని ఆపస్తంబ శ్రౌతసూత్రం చెప్తోంది. యజ్ఞాన్ని మూడు తరాల నుంచి అవిచ్ఛిన్నంగా అనుష్ఠించకపోతే అతడు దుర్బ్రాహ్మణుడని **'యస్య వేదశ్చ వేదిశ్చ విచ్ఛేద్యేతే త్రిపూరుషం| స వై దుర్బ్రాహ్మణో జ్ఞేయః|'** అను వచనం చెప్తోంది. అటువంటి దౌర్బ్రాహ్మణ్యాన్ని పోగొట్టే సామర్థ్యం గల యజ్ఞంతో సమానంగా మూడు వేదాల సారమైన గాయత్రి కూడా దౌర్బ్రాహ్మణ్యాన్ని పోగొట్టగలదని **"గాయత్రీ మాత్ర సారోపి న చ దుర్బ్రాహ్మణో భవేత్"** అను ఆపస్తంబ సూత్రం చెప్తోంది. అంటే గాయత్రీ మంత్రం దౌర్బ్రాహ్మణ్యాన్ని కూడా నివారింపచేయ గలదని తెలుస్తోంది. ఇంకా గాయత్రీ మహిమ స్కాంద పురాణంలో, అనేక గ్రంథాల్లో చెప్పబడింది. గ్రంథ విస్తరణ భీతిచే వాటన్నిటినీ ఇక్కడ వివరించడం లేదు.

సారాంశం- జపం చేసేవానిని గాయత్రీ దేవత రక్షిస్తుందని, ఇంకా అతిశయమైన తేజస్సు, వర్చస్సు, ఓజస్సు, మేధస్సు, బలం మున్నగు వాటిని ఈయగలదని కూడా చెప్పబడింది. భ్రాజస్సు అనగా తాను

ప్రకాశిస్తూ ఇతర వస్తువులను కూడా ప్రకాశింపచేసేది అని అర్థం. మేధ అనగా **"శ్రుతయోః వేదశాస్త్రయోః ధారణా శక్తిః మేధా"** అని భాష్యంలో వివరించినందున మనం చదువుకున్న విషయాన్ని విస్మరించకుండా ధారణ చేసే శక్తి మేధస్సు అని, ఇంకా బలం మున్నగు వాటినీ ఈయగలదని కూడా చెప్పబడింది.

నిరతిశయమైన శక్తి కలది కనుకనే ద్యులోకం నుండి సోమలతను తీసుకురావడానికి వెళ్ళిన త్రిష్టుప్ జగతీ ఛందస్సులయొక్క అక్షరాలు ద్యులోకంలో సోమ రక్షకులైన **'ధిష్ణియ'** నామక దేవతలచే అపహరించబడ్డాయి. పిమ్మట గాయత్రి తన సోదరులైన త్రిష్టుప్ జగతీ చంధస్సుల యొక్క నాలుగు అక్షరాలు తీసుకువచ్చి నాలుగు అక్షరాలు గల గాయత్రి ఎనిమిది అక్షరాలు కలదిగా వ్యవహరింప బడడమనే నిరతిశయమైన సామర్థ్యం కలదని ఐశ్వర్య స్వరూపిణియే గాక, జపం చేసే వారికీ ఐశ్వర్య ప్రదాత్రి అని, దౌర్బ్రాహ్మణ్య నివర్తకమని కూడా చెప్పబడింది.

న గాయత్ర్యాః పరోమంత్రః|

అను వచన ప్రకారం అన్ని మంత్రాలకంటే గాయత్రీ మంత్రం ఉత్తమమని, గాయత్రీ జపం చేస్తే మరో జపం చేయవలసిన అవసరం ఉండదని, యజ్ఞానుష్ఠానంతో సమానంగా దౌర్బ్రాహ్మణ్య నివారకమని చెప్పబడినందున ఇన్ని ఫలితాలు గల నిరతిశయ మహిమోపేతమైన గాయత్రీ జపం అత్యంత ఆవశ్యకమని సంధ్యావందనంలో ఇది ప్రధానమైనదని వివరించడమైంది.

ఇటువంటి గాయత్రీ జపం నిత్య సంధ్యావందనంలో నిత్యంగా చేయడమే కాక ఆ యా ఫల కామన గలవారు తత్తత్ఫల నిష్పత్తికోసం కామ్యముగా కూడా అనుష్ఠింపదగినదని శ్రీవేదవ్యాస భగవానులు సూత సంహితలో వివరించారు.

వినియోగానధానేన మంత్రేణైవ ప్రసాదయేత్| స్నాత్వా ప్రాతర్జపేన్నిత్యం సహస్రం శ్రద్ధయా సహ అపేక్షితార్థం సకలం లభతే నాత్ర సంశయః| హుత్వాతుఖాదిరం సమ్యక్ ఘృతాక్తం హవ్యవాహనే రాహుగ్రస్తే రవౌ విప్రో లభతే ధనముత్తమమ్| రాహుసూర్య సమావాప్తౌ తర్పయేద్భాస్కరం జపైః| సర్వకామ సమృద్ధిస్స్యాత్ నాత్రకార్యావిచారణా| కరీష చూర్ణతో హుత్వా సర్పిషా సహ మానవః| గవాంగోష్ఠే సహస్రం తు బహుక్షీరాం లభేత గామ్| శాల్యాస్తండుల హోమేన కన్యాసిద్ధిర్భవిష్యతి| శాలీబీజస్య హోమేన ప్రజామిష్టామవాప్నుయాత్| సావిత్ర్యా జలమాదాయ జప్త్వాచాష్ట సహస్రకమ్| అభిషేకం ద్విజః కుర్యాత్ దుస్వప్నాది నివృత్తయే| క్షీరాహారోజపేల్లక్షం అపమృత్యు వినాశనే| ఘృతాహారో జపేద్విద్యాం లభతే నాత్ర సంశయః| నాభిమాత్రే జలేస్థిత్వా జపేల్లక్షం సమాహితః| అకంటకమసౌ రాజ్యం లభతే నాత్ర సంశయః| ఫలాశ పుష్ప హోమేన మహతీం శ్రియమశ్నుతే| వేతసైర్జుహుయాదగ్నౌ వృష్టిం శీఘ్రమవాప్నుయాత్| పాయసం మధునా హుత్వా స్త్రీ వశ్యం లభతే చిరాత్| కేవలం ఘృత హోమేన సర్వాన్కామానవాప్నుయాత్| (సూ.సం.)

ఇత్యాది గ్రంథ విశేష ప్రకారం ప్రతినిత్యం ప్రాతఃకాల స్నానం చేసి గాయత్రీ జపం చేస్తే కోరిన కోరికలు తీరగలవు. గాయత్రీ మంత్రంచే నేతితో తడిసిన సమిధను రాహుగ్రస్త సూర్యగ్రహణంలో అగ్నిలో హోమం చేస్తే ధన సమృద్ధి కలుగుతుంది. అదే సమయంలో సూర్యునికి గాయత్రీ మంత్రంచే తర్పణం చేస్తే అన్ని కోరికలు సిద్ధిస్తాయని చెప్పారు.

అటువంటి గాయత్రీ మంత్రం యొక్క అర్థం అనేక విధాలుగా అద్వైతాత్మ పరమాత్మపరం గాను చెప్పబడింది. **'భర్గః'** అను పదం అకారాంతం శివ వాచకమని చెప్పి, **'భర్గః'** అను శబ్దం సకారాంతానికి తేజస్సు అర్థమని వర్ణించారు. గాన మనకు అందుబాటులో ఉంటుందని మన అధికార భేదాన్ని అనుసరించి సూర్యతేజః పరంగానే వర్ణింపబడుతోంది .

తత్సవితుర్వరేణ్యం| భర్గోదేవస్య ధీమహి| ధియోయో నః ప్రచోదయాత్|

అని గాయత్రీ మంత్రం. ఏ దేవత మా బుద్ధి వృత్తులను ధర్మజ్ఞానములందు ప్రేరేపిస్తోందో ఆ సవిత్ర దేవతను ఉపాసిస్తున్నాను.

ఈ ప్రకారం ఉదయాస్తమానములచే లోకయాత్రను నిర్వహిస్తున్న సవిత్ర దేవతయొక్క శ్రేష్ఠమైన తేజస్సును కల్గిన దేవతను ధ్యానించాలి.

"ఆయం గౌః పృశ్నిరక్రమీత్| అసనన్మాతరం పునః" అను మంత్రంచే ప్రతిపాదింపబడగా, **"గచ్ఛతీతి గౌః ఆదిత్యః"** అని సాయణ భాష్యం. **"ద్యౌః పితా పృథివీ మాతా"** అని ద్యులోకము పిత్ర స్థానీయమని, పృథివీలోకం మాతృస్థానీయమని. ద్యులోక,పృథివీ లోకాలకు మధ్య తిరుగుతున్నట్లుగా చెప్పబడుతున్న ఆ సవిత్ర దేవతయొక్క శ్రేష్ఠమైన తేజస్సును కల్గిన దేవతను ధ్యానించాలి.

ముక్తావిద్రుమ హేమ నీల ధవళచ్ఛాయైః ముఖైః త్రీక్షణైః యుక్తామిందు నిబద్ధరత్న మకుటాం తత్వార్థ వర్ణాత్మికామ్ గాయత్రీం వరదాభయాంకుశ కశాః శుభ్రం కపాలం గదాం శంఖం చక్రమధారవింద యుగళం హస్తైర్వహన్తీం భజే|

పై శ్లోకోక్త ప్రకారంగా ముత్యపు, పగడ, హేమ, నీల, తెలుపు రంగులతో అయిదు ముఖాలు గల చంద్ర నిబద్ధమైన కిరీటం గల శుద్ధశ్వేత వర్ణాలతో కూడిన శరీరం గల, వరముల నిచ్చే అభయ ప్రదమైన హస్తము, అంకుశము, కశము, తెల్లటి కపాలము, శంఖ చక్ర గదలను, అరవింద ద్వంద్వమును ధరించిన పది హస్తాలతో కూడిన స్త్రీమూర్తిగా ఉన్న **"గాయన్తం త్రాయతే ఇతి గాయత్రీ"** అని పేర్కొనబడిన గాయత్రీ మాతను ధ్యానిస్తూ జపం చేయాలి.

ప్రణవ విషయం

గృహస్థో బ్రహ్మచారీ చ ప్రణవాద్యామి మాం జపేత్| అంతే యః ప్రణవం కుర్యాత్ నాసౌ వృద్ధి మవాప్నుయాత్|

అను చంద్రికావచన ప్రకారం ఆరంభంలో మాత్రమే ప్రణవాన్ని ఉచ్చరించి అంతంలో (చివర్లో) ప్రణవాన్ని ఉచ్చరించరాదు. బ్రహ్మచారులు కూడా గృహస్థుల వలె **"గృహస్థవత్తు జప్తవ్యాసదైవ బ్రహ్మచారిభిః"** అను వశిష్ఠ వచన ప్రకారం ప్రణవాదిగానే ఉచ్చరించాలి. ఎలా చేయాలనే శంకకు

పూర్వాం సంధ్యాం జపేత్తిష్ఠన్ సావిత్రీమర్కదర్శనాత్| పశ్చిమాంతు సమాసీనః సమ్య గర్క్ష విభావనాత్|

అను స్మృతి ప్రకారం ప్రాతఃకాల జపం నిలబడి, సాయంకాల జపం కూర్చుని చేయాలి. ముఖ్య కాలంలో చేసేటప్పుడు ఉదయం సూర్యదర్శన పర్యంతం సాయంకాలం నక్షత్ర దర్శన పర్యంతం అని చెప్పినా, ఈ కాలాన్ని అతిక్రమించి గౌణకాలంలో జపించినా ఉదయకాల జపం నిలబడి, సాయంకాల జపం ఉపవసించి (కూర్చుని) చేయాలి అనేది నిలబడి చేయాలనడానికి సమానమే.

కన్యాదానం చ గోదానం ఉత్తరాఘారమేవ చ| ప్రాతస్సంధ్యా జపం కుర్యాత్ తిష్ఠన్నేవ న సంశయః|

అను స్మృతిని ప్రమాణంగా భాష్యంలో ఇచ్చారు. ఇక గాయత్రీజప సంఖ్యా విషయం.

అసంఖ్యాకం తు యజ్జప్తం తత్సర్వం స్యాన్నిరర్థకం|

అను వచన ప్రకారం సంఖ్యా పరిగణన లేకుండా చేయకూడదు గాన సంఖ్యా పరిగణన ఆవశ్యకమే.

గృహస్థో బ్రహ్మచారీ చ శతమష్టోత్తరం జపేత్| వానప్రస్థో యతిశ్చైవ సహస్రాదధికం జపేత్|

గృహస్థు, బ్రహ్మచారి అష్టోత్తరశతం (108) చేయాలని; వానప్రస్థులు, యతులు సహస్రం కంటే ఎక్కువ చెయ్యాలనీ చెప్తోంది. అయితే అష్టోత్తరశత మనేది గౌణకాల సంధ్యావందన విషయం కనుక ముఖ్యకాల సంధ్యావందనంలో పై వచన ప్రకారం సహస్రం చేయకూడదని అభిప్రాయం కాదు.

అవిచ్ఛిన్నపాద గాయత్రీ బ్రహ్మహత్యాం ప్రయచ్ఛతి విచ్ఛిన్నపాదా తు గాయత్రీ బ్రహ్మహత్యామ్ వినాశయేత్|
(దే.భా.)

విచ్ఛిన్న పాదంగా జపించాలని చెప్పినా ఆ ప్రకారం జపం చేయడం ఆగమశాస్త్రానురోధంగా చేసే తాంత్రికజప విషయంగా వ్యవస్థ చేయబడినందున మనమందరం మాత్రం వేదోక్త ప్రకారం అవిచ్ఛిన్న పాదం కాకుండా మొదటి రెండు పాదాలను కలిపి అర్ధర్చగాను, మూడవ పాదాన్ని పాదంగాను జపించాలని నిర్ణయించారు.

ఉపనయనంలో 3వ పాదాన్ని కూడా కలిపి అనవానంగా ఉపదేశించినా దానికి సార్థక్యం బ్రహ్మయజ్ఞంలో చెప్పబడింది.

పచ్ఛోర్ధర్చ శోఽనవానాగ్ం సవితా|

అను శ్రుత్యుక్త ప్రకారం అక్కడ (ఉపనయనంలోను, బ్రహ్మయజ్ఞంలోనూ మాత్రమే) ఆ ప్రకారం చెయ్యాలని వ్యవస్థ చేసారు.

జప ప్రదేశ విషయం - ఆసన విషయం

జప ప్రదేశ విషయం గౌతమాచార సూత్రంలో ఇలా చెప్పబడింది.

గృహే జప్యమేకగుణం, నద్యామ్ ద్విగుణం, గోష్ఠే దశగుణం, అగ్న్యాగారే దశాధికం సిద్ధక్షేత్రే తీర్థేషు దేవతా సన్నిధౌ శతకోటీనాం సహస్రమనంతం విష్ణు సన్నిధౌ| (గౌ.ధ.సూ.)

ఇంట్లో చేసే జపానికి వచ్చే ఫలంకంటే నదీ సన్నిధిలో చేసిన జపానికి రెట్టింపు ఫలం, గోశాలలో చేస్తే పది రెట్లు అధిక ఫలం, నిత్యం అగ్నిహోత్రాలు చేసే గృహంలో చేస్తే పదిరెట్ల కంటే అధిక ఫలం, సిద్ధ పురుషులుండే క్షేత్రం, గయాగంగా కురుక్షేత్రాది తీర్థాల్లోను, దేవతా సన్నిధిలోను అనంత ఫలమని చెప్పబడింది.

పర్వభిస్తు జపః కార్యః నాంగుళీనాం నిపాతనైః| నిపాతనైస్తు యజ్జప్తం తత్సర్వం రాక్షసం భవతి|

జపాన్ని వేళ్ళ పర్వాలతో లెక్కిస్తూ చేయాలి గానీ, వేళ్ళతో లెక్కించకూడదు.

ప్రాతర్నాభిసమమ్ కుర్యాత్ మధ్యాహ్నే హృదయం తథా| సాయాహ్నే నాసికామూలే జపలక్షణ మీరితం|

ప్రాతఃకాల జపం నాభి సమంగాను, మధ్యాహ్నమందు హృదయ సమంగాను, సాయంకాలం నాసికా మూలమందు హస్తం ఉండేలా లేదా అక్షమాల ఆ ప్రకారంగా ఉండేటట్లుగానూ జపించవలెను. ఇంతకుముందు ప్రాతఃకాలం నిలబడి, సాయంకాలం కూర్చుని జపం చేయాలని చెప్పడమైనది గాని మధ్యాహ్నం విషయంలో ఇలా చెప్పబడింది.

తథా మధ్యాహ్న సంధ్యాయామాసీనః ప్రాఙ్ముఖో జపేత్|తిష్ఠన్నపి జపేద్దేవీమ్ ఆదిత్యాభిముఖో ద్విజః|
కృత్వోత్తానే కరౌ ప్రాతః సాయం చాధోముఖౌకరౌ| మధ్యే ప్రసారితకరౌ జపే ఏవముదాహృతం|

మధ్యాహ్న సంధ్యయందు కూర్చుని గాని, నిలబడి గాని సూర్యాభిముఖుడై జపించాలి. ప్రాతఃకాల జపంలో హస్తాన్ని ఊర్ధ్వముఖంగాను, సాయంకాలం అధోముఖంగాను ఉంచి, మధ్యాహ్న సంధ్యయందు మాత్రం ప్రసారణ చేసి (చాచి) జపించాలి. ఈ ప్రకారం గాయత్రీజప విషయం వివరింపబడింది.

ఉపస్థాన మంత్రార్థం

అర్ఘ్య ప్రదానం, గాయత్రీ జపం తర్వాత సంధ్యావందనంలో ప్రధానమైన మూడో అంగం సూర్య ఉపస్థాన మంత్రం. ఇక మూడు సంధ్యల్లో వినియోగింపబడు ఉపస్థాన మంత్రాల అర్థాలు ఇలా వున్నాయి. ఉపనయనంలో సాయం సంధ్యతో ఆరంభం కనుక ముందుగా సాయం సంధ్యోపస్థాన వివరణ. ఈ మంత్రం-

ఇమం మే వరుణ శ్రుధీహవ మద్యా చ మృడయ| త్వామ వస్యురాచకే| (తై.సం.)

అని సాగుతుంది.

వారుణీభిరాదిత్య ముపతిష్ఠతే|

అని వినియోజక వాక్యం. మీమాంసా శాస్త్ర తృతీయ అధ్యాయంలోని ఐంద్ర్యధికరణ న్యాయంచే **"ఇమం మే వరుణ"** అనే మంత్రంలోని వరుణ శబ్దానికి ఆదిత్యుడు అని అర్థం చెప్పాలి.

పురా కదాచిత్ శునశ్శేపో నామ ఋషిః పశుత్వేన యూపే బద్ధః| తద్బంధ విమోచనార్థం వరుణం ప్రార్థయామాస| తత్ప్రార్థనా ప్రకారం అనేన మంత్రేణ ఉచ్యతే" (సంధ్యా భాష్యం)

ఒకానొకప్పుడు శునశ్శేపుడనే ఋషి యూపమందు బంధింపబడినవాడై ఆ బంధం నుంచి విముక్తి కోసం ఈ ప్రకారంగా ప్రార్థించేడు.

ఇమం మే వరుణ శ్రుధీహవ మద్యా చ మృడయ| త్వామ వస్యురాచకే| (తై.సం.)

ఓ వరుణా! నా ఆహ్వానాన్ని విను. విన్న పిమ్మట ఇపుడే నన్ను సుఖం కలవాణ్ణిగా చేయుము. రక్షణ కోరుతున్నవాడనై నిన్ను ప్రార్థిస్తున్నాను. ఇక నుంచి నిన్ను శరణు పొందుచున్నాను.

తత్త్వాయామి బ్రహ్మణా వందమానః తదాశాస్తే యజమానో హవిర్భిః అహేడమానో వరుణేహ బోధ్యురుశగ్ం స మాన ఆయుః ప్రమోషీః|

ఓ వరుణ! నీవు భక్తజన పాలకుడవు గాన నిన్ను శరణు పొందుచున్నాను. **'తస్మాదపి వధ్యం ప్రపన్నం నా ప్రతి ప్రయచ్ఛన్తి"** అను శ్రుతి, శరణాగతుణ్ణి విడిచిపెట్టడం మహా దోషంగా చెప్తోంది కనుక ఆ రక్షణకోసం బ్రహ్మణా మంత్రంచే నమస్కరిస్తూ నాయందు ప్రసన్నుడవు అవవలసిందని నిన్ను కోరుతున్నాను. అనగా శరణాగతుడను అవుతున్నాను. నేనొక్కడినే కోరడం లేదు. యాగకర్త అయిన యజమానుడు కూడా నీకు సమర్పించబడే హవిస్సులచేత ఆ రక్షణను కోరుతున్నాడు. అందువల్ల తప్పకుండా సుఖపెట్టు. ఓ వరుణా! నీవు నా ప్రార్థనను అనాదరణ చేయక ఈ లోకంలో నా యాచనను తెలుసుకొనుము. గొప్పవైన మంత్రాలచేత ప్రశంసించబడే నువ్వు మా ఆయుస్సును నశింప చేయకు. వేదోక్తమైన పరిపూర్ణ ఆయుస్సును ఇమ్ము.

యచ్ఛిద్ధితే విశోయథా ప్రదేవ వరుణ వ్రతం| మినీమసి ద్యవి ద్యవి|

ఓ అరుణా! అజ్ఞానులైనవారు నీ వ్రతాన్ని అతిక్రమించినట్లు ప్రతిరోజు నీ కర్మని లోపింప చేయడం అనే (కర్మని ఆచరించక పోవడమనే) నా అపరాధాన్ని క్షమించుము.

యత్కిం చేదం వరుణదైవ్యే జనేభిద్రోహం మనుష్యాశ్చరామసి| అచిత్తీయత్తవ ధర్మాయుయోపిమ మానస్తస్మా దేనసో దేవ రీరిషః|

ఓ వరుణా! ద్యులోకంలో నీ విషయంలో మనుష్యులమైన మేము అజ్ఞానంతో నీ కర్మను లోపింప చేయడమనే, స్వల్పంగా గాని అధికంగా గాని చేస్తున్న ద్రోహం వల్ల ఏర్పడిన పాపంవల్ల మమ్మల్ని హింసించకుము. ధర్మలోప నిమిత్తమైన పాపాన్ని పరిహరించడంద్వారా మిమ్మల్ని పరిపాలించుము.

కితవాసో యద్రి రిపుర్నదీవి యద్వాఘా సత్యముత యన్నవిద్మ| సర్వాతావిష్య శిథిరేవ దేవాథా తేస్యామ వరుణ ప్రియాసః|

ధూర్తులతో సమానమైన వారు ఏ కర్మాంగాన్ని నశింపచేసేరో, శాస్త్రీయ పద్ధతి ప్రకారం ప్రవర్తించరో ధర్మ స్వరూపాన్ని అనగా వర్ణాశ్రమ ధర్మాన్ని తెలుసుకోలేదో ఆ బహువిధ పాపాలను నశింప చేయము.

ఓ దేవా! క్షుద్రాలైన పాపాలన్నిటినీ నశింప చేయుము. అనంతరం నీ కటాక్షంచే నీకు ప్రియులం కాగలమని ప్రార్థన .

ప్రాతస్సంధ్యోపాసన మంత్రార్థం

మిత్రస్య చర్ షణీ ధృతశ్శ్రవో దేవస్య సానసిమ్ సత్యం చిత్రశ్ర వస్తమమ్|

మైత్రావరుణ గ్రహప్రచార ప్రసంగంలో చెప్పబడిన రీతిగా, **"మిత్రోఽహరజనయద్వరుణో రాత్రిం"** అని అహస్సుకి (పగటికి) అభిమాన దేవత మిత్రశబ్ద వాచ్యుడైన ఆదిత్యుడు, రాత్రికి అభిమాన దేవత వరుణ శబ్ద వాచ్యుడైన ఆదిత్యుడు. ఆ ప్రకారం మిత్రశబ్ద వాచ్యుడైన, ప్రజలకు ధారయితగా ఉన్న ఆ మిత్రదేవునియొక్క బాగా సేవించదగిన, నశ్వరం కానట్టి, వినే జనుల మనస్సుకి అతిశయంగా సుఖకరంగా ఉండే కీర్తిని స్తుతి చేస్తున్నాను .

మిత్రోజనాన్ యాతయతి ప్రజానన్ మిత్రోదాధార పృథివీముతద్యామ్| మిత్రః కృష్టీ రనిమిషాభి చష్టే సత్యాయ హవ్యం ఘృతవద్విధేమ|

మిత్రుడని చెప్పబడుతున్న ఆదిత్యుడు ప్రజల అధికారాన్ని గుర్తించిన వాడై సర్వ ప్రజలకు వారి వారి కర్మలందు నియోగిస్తున్నాడు. ద్యావాపృథివులను ధరించినవాడు, మిత్రుడు, మనుష్యులను, రెప్పపాటు లేనటువంటి దేవతలను కూడా ప్రకాశింప చేస్తున్నాడు. అటువంటి సత్యస్వరూపుడైన ఆ మిత్రదేవునికి ఘృతయుక్తమైన హవిస్సుని సమర్పిస్తున్నాను. అనగా యాగంలో ఘృతయుక్త హవ్యదానంవల్ల ప్రసన్నుడైన రీతిగా ఈ ప్రార్థన మంత్రంచే ఆయనను ప్రసన్ననిగా చేస్తున్నాము అని అర్థం.

ప్రసమిత్ర మర్తో అస్తు ప్రయస్వాన్ యస్త ఆదిత్య శిక్షతి వ్రతేన| న హన్యతే న జీయతే త్వోతోనైన మగ్ంహో అశ్నోత్యంతితో న దూరాత్|

ఓ మిత్రశబ్ద వాచ్యుడైన ఆదిత్యుడా! నీ కర్మను అనుష్ఠించడానికి సమర్థుడు కావాలని కోరుతున్న మనుజుడు ప్రకర్షగా ధర్మఫల యుక్తుడగు గాక! నీచే రక్షించబడిన ఆ యజమాని రోగాదులచే పీడించబడడు, శత్రువులచే తిరస్కరించబడడు మరియు నీచే రక్షించబడిన యజమానిని పాపం సమీపాన్నుంచి గాని దూరం నుంచి గానీ ఎన్నడూ అతనిని పొందదు. దీనికి దృష్టాంతం-

మహదనుగ్రహ శాలినం పురుషం నక్షుద్రోపద్రవాః స్పృశంతి|

అను వచనం ప్రకారం పెద్దల అనుగ్రహం ఉన్నవానిని క్షుద్రోపద్రవాలు స్పృశించవు గదా! ఈ ప్రకారం ప్రాతఃసంధ్యలో ఉపస్థాన మంత్రంతో స్తుతించాలని చెప్పబడింది.

మాధ్యాహ్నిక సంధ్యోపాసన మంత్రార్థం

ఆసత్యేన రజసా వర్తమానో నివేశయన్నమృతం మర్త్యంచ| హిరణ్యయేన సవితారథేనాఽదేవో యాతి భువనా విపశ్యన్|

దేవలోక మనుష్య లోకాల మధ్య తిరుగుతూ ఈ సూర్యుడు దేవలోక వాసులకు అమృతత్వాన్ని అనగా మరణరహితత్వాన్ని, మనుష్యలోక వాసులకు మరణ ధర్మాన్ని ప్రవేశింపబెడుతున్నవాడై హిరణ్యమయమైన రథంతో వస్తున్నాడు. ఇదే విషయం **"ఆదేవో యాతు సవితా సురత్నః"** అను స్మృత్యంతరంలో కూడా చెప్పబడింది. ఏమి చేస్తూ తిరుగుతున్నాడు ఈ సూర్యుడు అని ప్రశ్నిస్తే, **"భువనా విపశ్యన్"** భువనాలను విశేషంగా చూస్తూ వస్తున్నాడు. ఆ సవిత్ర దేవతను ప్రార్థిస్తున్నాను .

ఉద్వయం తమసస్పరి పశ్యంతో జ్యోతిరుత్తరమ్| దేవం దేవత్రా సూర్యమగన్మ జ్యోతిరుత్తమమ్|

ప్రపంచానికి పైన ఉన్నటువంటి ఉత్కృష్టతరమైన జ్యోతి రూపాన్ని ఉన్నతంగా చూస్తున్న వారమై దేవతల్లో ఉత్కృష్టమైన జ్యోతీ రూపమైన సూర్యదేవుని పొందుతున్నాము. **'ఉదుత్యం జాతవేదసం దేవం వహంతి కేతవః దృశే విశ్వాయ సూర్యమ్"** సర్వ ప్రాణులకు అగ్నిని దర్శనమివ్వడం కోసం సూర్యుని సమీపానికి కిరణాలు పొందిస్తున్నాయి. అనగా కిరణాలు ఉదయించే సూర్యునిలో అగ్నిని ప్రవేశపెడుతున్నాయి అను విషయాన్ని **'ఉద్యన్తం వావాదిత్య మగ్నిరను సమారోహతి'** అను శ్రుత్యంతరం కూడా బలపరుస్తుంది.

"చిత్రం దేవానా ముదగాదనీకం చక్షుర్మిత్రస్య వరుణస్యాగ్నేః| ఆప్రాద్యావా పృథివీ అంతరిక్షగ్ సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చ|

దేవతలు రాక్షసుల్ని వధించే సందర్భంలో మిత్ర, వరుణ, అగ్ని దేవతలు ముగ్గురికీ ప్రకాశాన్నిచ్చే చక్షు స్వరూపమైన, శ్రేష్ఠమైన బలస్వరూపమైన కిరణ సముదాయాన్ని చేసేరు. సూర్యుడు తన కిరణాలతో ద్యావా,పృథివీ,అంతరిక్షం అనే మూడు లోకాలను పూరింపచేసేడు. అనగా భూరాది ముల్లోకాలు కిరణాలతో వ్యాపిస్తూ ఉన్నాయి. మరియు స్థావర జంగమాత్మకమైన జగత్తుకు సూర్యుడే ఆత్మస్వరూపుడు.

తచ్చక్షుర్దేవహితం పురస్తాచ్ఛుక్రముచ్చరత్ |పశ్యేమ శరదశ్శతమ్|

"సర్వస్య జగతః చక్షుర్భూతం దేవానాం హితం పురస్తాత్ పూర్వశ్యామ్ దిశి, శుక్రం శుద్ధ స్వరూపం ఉచ్చరత్ - ఉద్యత్సూర్యాత్మకం బ్రహ్మ" (భాష్యం)

సమస్త జగత్తుకు చక్షుస్సుగా ఉన్న దేవతలకు హిత స్వరూపమైన, ప్రాగ్దిక్కులో ఉదయిస్తున్న సూర్య భగవానుని రూపంలో ఉన్న శుద్ధ స్వరూపమైన బ్రహ్మను నూరు సంవత్సరాలు చూడగలం. అనగా, వాని అనుగ్రహం వల్ల **'జీవేమ శరదశ్శతం'** నూరు సంవత్సరాలు జీవించగలం. **'నందామ శరదశ్శతం'** పుత్రపౌత్రాది ధన సమృద్ధి కలవారం కాగలం. **'మోదామ శరదశ్శతమ్'**- సంతోషించేవారం కాగలం. **'శృణవామ శరదశ్శతం'**- నూరు సంవత్సరాలు ప్రియ వచనాలను వినగలం. **'పబ్రవామ శరదశ్శతం'**- నూరు సంవత్సరాలు మంచి మాటలు పలికేవారం కాగలం. వస్తుతః **'శతమానమ్ భవతి'** అను శ్రుతి చెప్పినట్లు పురుషాయుర్దాయం నూరు సంవత్సరాలు గలవారమై, జీర్ణం కాని వయస్సు కలవారం అవగలం.

అజీతాస్స్యామ శరదశ్శతమ్| జ్యోక్చసూర్యమ్ దృశే|

చిరకాలం సూర్యభగవానుని స్వరూపంలో ఉన్న బ్రహ్మను చూడగోరుచున్నాము.

య ఉదగాన్మహతోర్ణవాత్ విభ్రాజమాన స్సరిరస్య మధ్యాత్ సమావృషభో లోహితాక్ష స్సూర్యో విపశ్చిన్మనసా పునాతు|

యః మహతః సముద్రాత్ ఉపరి ఉదగాత్ – దృశాతే, సరిరస్య మధ్యే- సలిరస్య దే.భా. మధ్యే, విభ్రాజమానః– దీప్యమానః, విపశ్చిత్-విద్వాన్ సూర్యః, వృషభః- కామానాం వర్షయితా లోహితాక్షః సః సూర్యః, మా-మాం, మనసా- ఆదరేణ, పునాతు-అనుగృహ్ణాతు-రక్షతు (భాష్యం)

ఏ సూర్యుడు సముద్రంపై ఉదయిస్తూ చూడబడుతున్నాడో, సర్వ మధ్యందిన కాలంలో ఉదకాల మధ్యలో ప్రకాశిస్తున్నాడో, ఏ సూర్యుడు సర్వజ్ఞుడుగా ఉన్నాడో, ఏ సూర్యుడు మనచే ప్రార్థింపబడి మన కోరికలను వర్షింప చేస్తున్నాడో, ఆ సూర్యుడు, మధ్యందిన కాలంలో ప్రార్థింపబడిన వాడై నన్ను అత్యాదరంతో రక్షించు గాక!

ఈ ప్రకారం ప్రాతర్మధ్యందిన సాయం సంధ్యలో ఆదిత్యుని వివిధ నామాలతో వివిధ విధాలుగా స్తుతిస్తూ ఆయన అనుగ్రహంకోసం ప్రార్థించడం సూర్యోపస్థాన మంత్రాల తాత్పర్యం. ఉపస్థాన మంత్ర పఠనం అయ్యాక, **'ఓం నమః ప్రాచ్యై దిశే'** వంటి మంత్రాలచే ఆ యా దిగ్దేవతలకు, గంగా యమునలకు మధ్యగల నన్ను చిరంజీవిగా వృద్ధిని పొందిస్తున్న దేవతలకు, మునులకు, సంధ్యాది దేవతలు అందరికీ నమస్కరించి, **'కామోకార్షీత్'** ఇత్యాదిచే కామ, క్రోధాద్యభిమాన దేవతలకు కూడా నమస్కరించడం, **'యాగ్ం సదా సర్వ భూతాని సామా సంధ్యాభి రక్షతు'** అని ఏ సంధ్యాభిమాన దేవతకు సాయం ప్రాతః సంధ్యల్లో సర్వభూతాలు నమస్కరిస్తున్నామో ఆ సంధ్యాభిమాన దేవత నన్ను రక్షించు గాక అని ప్రార్థన చెయ్యాలి. తర్వాత-

ఉత్తమే శిఖరే జాతే భూమ్యాం పర్వత మూర్ధని| బ్రాహ్మణేభ్యోఽభ్యనుజ్ఞాతా గచ్ఛదేవి యథా సుఖం|

అని జపానికి ముందు ఆవాహన చేయబడిన గాయత్రీ దేవిని యథాస్థానానికి పంపించడానికి పఠించే గాయత్రీ ప్రస్థాపన మంత్రం చెప్పాలి. భూమియందున్న మేరుపర్వతంపైన ఉత్కృష్టమైన శిఖా ఆకారమందు నివసించడం కోసం నిన్ను ఉపాసించిన ఉపాసకులైన బ్రాహ్మణోత్తముల వల్ల అభ్యనుజ్ఞను పొందిన దానివై ఓ భగవతీ! ఉపాసకులను అనుగ్రహించి యథా సుఖంగా వెళ్ళుము! అని ప్రార్థించడం ఈ ప్రస్థాన మంత్రానికి అర్థం.

దేవప్రస్థాపనాన్తం స్యాత్ సంధ్యాకర్మేత్యుదీరితం' అను శ్రుత్యనుసారం ఈ ప్రస్థాన పఠనం వరకే సంధ్యాకర్మ అని చెప్పబడుతోంది. దీని తర్వాత **'యాగ్ం సదా', 'శివాయ'** ఇత్యాది శ్లోకాలున్నా అవకాశం ఉన్నంత మేరకు పఠించాలి.

సంధ్యా శబ్దార్థం అహోరాత్రుల సంధి అని కీర్తించబడుతోంది కనుక ఈ రెండు సంధ్యల్లోను సంధ్యా కర్మ తప్పకుండా ఆచరించాలని గృహ్యకారులు చెప్తున్నారు. మాధ్యాహ్నిక సంధ్య స్మృతులచే చెప్పబడింది కనుక చేస్తే అభ్యుచ్చయమని (అభ్యున్నతి కలిగిస్తుందని) మాత్రం గ్రహించాలి. దీని అభిప్రాయం మాధ్యాహ్నిక సంధ్యను మానమని గాదు, సాయం,ప్రాతః కాలాలందు తప్పకుండా ఆచరించాలని చెప్పడంలో తాత్పర్యం.

చివరగా సర్వ రక్షణ కోసం **"ఇదం ద్యావా పృథివీ"** అనే మంత్రాన్ని ఉచ్చరించాలి. మాతాపిత్రు స్థానీయములైన ఓ ద్యావా పృథివ్యభిమాన దేవతలారా! **"భూతం దేవానా మవమే అవోభిరితి"** అని మా రక్షణతో బాటు దేవతలకు, రాక్షసులకు, సర్వభూతాలకు రక్షకులు కావాలని మిమ్మల్ని ప్రార్థిస్తున్న ఈ మంత్రరూపమైన మా ప్రార్థన సత్యమగు గాక! కనుక అందరికీ సంరక్షకులై మీ అనుగ్రహం వల్ల భుజించేవానికి తాపోపశమనం కలిగించే, జీవనాన్ని ఇచ్చే అన్నాన్ని మేము పొందగలం. కాబట్టి ఆ విధంగా

అనుగ్రహించండని మాతాపిత్ర స్థానీయులైన ద్యావా పృథివులను ప్రార్థించి సంధ్యా కర్మను సమాప్తి చేయాలి. ఆ తర్వాత ప్రవరాన్విత స్వగోత్రనామాలతో సహా నక్షత్ర సూర్యద్విజాదులకు నమస్కరించాలని చెప్పారు.

ఈ ప్రకారం సంధ్యావందన విధానం సమాప్తం.

నక్షత్రంచ తథా ద్విజానప్యభివాదయేత| నిష్ఠానపి వేదజ్ఞాన్ సంధ్యాకాలే అభివాదయేత్| వినాపుత్రం చ శిష్యంచ దౌహిత్రం దుహితుః పతిమ్|

అని వచనం. దీని ప్రకారం పుత్రునికి, శిష్యునికి, దౌహిత్రునికి, అల్లుడికి మాత్రం నమస్కరించ కూడదు.

ఇంతవరకు **'సంధ్యాస్నానం జపోహోమః'** అను మూలవచనం చెప్పినదాంట్లో **'సంధ్యాస్నానం జపః'** అనే రెండు కర్మల గురించి చెప్పబడింది. అయితే **'సంధ్యాస్నానం జపః'** అను వచనంచే మూడు కర్మలు చెప్పబడుతుండగా, రెండు కర్మలుగా అనడం ఎలా పొసగుతుందని శంకించి **'ఉచ్యత ఇత్యాదినా'** సమాధానం చెప్పబడుతోంది.

సంధ్యాస్నానం జపః ఇత్యత్ర సంధ్యాంగ గాయత్రీ జప ఏవ జపశబ్దేనోచ్యతే| పృథగ్జప శబ్ద ప్రయోగః గాయత్రీ జపస్య ప్రాధాన్య ప్రాశస్త్యయోః ప్రతీత్యర్థ మిత్యుక్తమ్| తథాహి ఏతద్విదిత్వా యస్సంధ్యా ముపాస్తే సంశితవ్రతః దీర్ఘమాయుః సవిన్దేత సర్వపాపైః ప్రముచ్యతే| ఇతి సంధ్యాయాః ఆవశ్యకతాముక్త్వా సంధ్యాంగ జపవిధిః| (ప.మా.)

అను శీర్షికతో పరాశర మాధవీయంలో చెప్పబడింది. జపః అను పదంచే సంధ్య కంటే భిన్నమైన కర్మ చెప్పబడడం లేదు. సంధ్యాంగమైన గాయత్రీ జపమే అత్యంత ప్రధానమైనది, ప్రశస్తమైనది అవడంతో వేరే జపశబ్దంచే చెప్పబడలేదని పరాశరులు చెప్పారు. **'తత్రమనుః'** ఇత్యాది గ్రంథంచే గాయత్రీ జపాన్ని గురించి విస్తరించి అంతకు ముందు గాయత్రీ ప్రాశస్త్యం చెప్పబడింది.

గాయత్ర్యా న పరం జప్యం గాయత్ర్యా న పరాహుతిః|

అను శ్లోకంచే గాయత్రికంటే జపించదగినది మరొకటి లేదు, గాయత్రి కంటే ఉత్తమమైన ధనంమరొకటి లేదు. గాయత్రి కంటే ధ్యానించదగింది లేదు, గాయత్రి కంటే ఉత్తమమైన ఆహుతి లేదని చెప్పబడ్డాయి.

ఇంత ప్రశస్తమైనది అవడం వల్ల సంధ్యాంగమైనా వేరుగా చెప్పబడింది కానీ నిత్యమైన షట్కర్మల పరిగణలో మాత్రం సంధ్యా, గాయత్రీ జపం రెండూ కలిపి ఒక కర్మగా చెప్పబడ్డాయి.

హోమం

ఆధాగత్య గృహం విప్రస్సమాగత్య యథా విధి|ప్రజ్వాల్య వహ్నిం విధివజ్జుహుయాజ్జాతవేదసమ్ (ప.మా.)

తీర్థాదుల దగ్గర స్నాన సంధ్యాద్యనుష్ఠానాలు పూర్తి చేసుకుని గృహానికి వచ్చి అగ్నిని ప్రజ్వలింపచేసి యథాశాస్త్రంగా హోమం చెయ్యాలి. పైన చెప్పబడిన అగ్ని నిత్యమైనదని యావజ్జీవం దంపతులచే నిర్వహించబడు సర్వ స్మార్తకర్మల కోసం ధారణ చెయ్యాలని వివాహ ప్రకరణంలో ప్రధాన హోమం తర్వాత నూతన వధువును, వైవాహికాగ్నిని తీసుకుని తన ఇంటికి వెళ్లాలని చెప్పే సందర్భంలో **"నిత్యోధార్యః"** (ఆ.గృ.సూత్రం) చెప్పబడింది.

ఆయా వైవాహికాగ్నిః నిత్యః శాశ్వతికః ధార్యః పత్నీసంబంధానాం కర్మణామర్థాయ పాణిగ్రహనాదిరగ్నిః తమౌపాసన మాచక్షతే|

వివాహం లగాయతు ఈ వైవాహికాగ్ని ఔపాసనాగ్నిగా చెప్పబడుతోంది. వివాహ స్థాలీపాకానంతరం ఈ అగ్నిలో ఔపాసనారంభం చేయాలని చెప్పడంచే నూతన వధూవరులచే, **"ఔపాసనమారప్స్యే యావజ్జీవం హోష్యామి"** అని సంకల్పం చేయిస్తారు. సాయంప్రాతః కాలాల్లో ఔపాసనాగ్నిలో హోమం చేయాలని, **"సాయం ప్రాతరత ఊర్ధ్వం హస్తేనైతే ఆహుతీ తండులైర్యవైర్వా జుహుయాత్"** (ఆ.గృ. సూ.3-7-19)చే విధింపబడింది. ఇందులో **'హస్తేన'** అని చెప్పడంచే స్రుగాదులకు నివృత్తి చెప్పబడింది. ఇందులో హోమద్రవ్యాలుగా తండులాలు(బియ్యం)గానీ యవలుగానీ అయి ఉండాలని చెప్పబడింది. హోమానికి ఉద్దేశ్య దేవత విషయంలో **"స్థాలీపాకవద్దైవతమ్"** అను సూత్ర వ్యాఖ్యానంలో-

అగ్నయే స్వాహేతి పూర్వాహుతిః|

"అగ్నయే స్వాహా" అని మొదటి ఆహుతి, **"అగ్నయే స్విష్టకృతే స్వాహా"** అని రెండో ఆహుతి చెయ్యాలి.

సౌరీ పూర్వాహుతిః ప్రాతరిత్యేకే

ప్రాతఃకాలం **'సూర్యాయ స్వాహా'** అని మొదటి ఆహుతి చెయ్యాలని కొందరి మతం. ఇదే ఆచారంలో ఉంది. ఇంతవరకు మూలవచనానుసారం 3 నిత్యకర్మలు చెప్పబడ్డాయి. అందులో స్నానం, సంధ్య తర్వాత దేవపూజ అత్యంతం ఆవశ్యకమని చెప్పబడింది.

యో మోహాథవాలస్యాదకృత్వా దేవతార్చనమ్ భుంక్తే యాతి నరకం ఘోరం సూకరేష్విహజాయతే|

ఆకృత్వా దేవ పూజాం చ మహాయజ్ఞాన్ ద్విజోత్తమః| భుంజీత చేత్సమూఢాత్మా తిర్యగ్యోనించ గచ్ఛతి|
వేదాభ్యాసోన్వహం కృత్వా మహాయజ్ఞ క్రియాం తథా| నాశయత్యాశుపాపాని దేవానామర్చనం తథా|

మోహంచే గాని, అలసటచే గాని దేవతార్చన చేయకుండా భోజనం చేస్తే ఆముష్మికంగా ఘోరనరక ప్రాప్తి, ఈ లోకంలో సూకరాది జన్మ ప్రాప్తిస్తాయని, దేవతార్చన చేసి భుజిస్తే సర్వపాపాలు నశిస్తాయని కూర్మపురాణంలో చెప్పబడిందని పరాశర స్మృతిలో చెప్పబడింది. అనంతానంద కృత శంకర విజయంలో ఇలా చెప్పబడింది.

సూర్య శక్తి గణపతి శివనారాయణానాం బ్రాహ్మణోపాసన యోగ్యత్వాత్ తేషాం సమష్ట్యుపాసనయా ముక్తిస్సిద్ధా|
(శం.వి.)

సూర్యుడు, శక్తి, గణపతి, శివనారాయణులు బ్రాహ్మణులచే ఉపాసింపదగిన వారని వారి సముష్ట్యు పాసనచే అనాయాసంగా ముక్తి సిద్ధమని చెప్పారు. అందుకు అధికారం లేనివారు వ్యష్టిగా ఉపాసన చేయాలని చెప్పారు, శ్రీ శంకరభగవత్పాదుల శిష్యులచే **'శైవ వైష్ణవ సౌర గాణాపత్య'** శాక్తాలనే ఐదు మతాలు స్థాపించబడ్డాయి. పరాశర స్మృతిలో అయితే శైవ, వైష్ణవ దర్శనానుసారంగా దేవపూజా క్రమం చెప్పబడింది.

వేదోక్తమేవం కుర్వాణో నిస్సంగోర్పిత మీశ్వరే నైష్కర్మ్యం లభతే సిద్ధిం రోచనార్థాఫల శ్రుతిః (శ్రీ భా.4.)

నిస్సంగుడుగా, ఈశ్వరార్పణ బుద్ధితో దేవతార్చన చేయవలసిన ఆవశ్యకత ఈ ప్రకారం నిరూపింపబడింది.

వైశ్వదేవం

వైశ్వదేవం అనగా జీవహింసా ప్రయుక్త పాపనివృత్త్యర్థం బ్రాహ్మణులు విశ్వదేవతలనుగూర్చి నిత్యము చేయవలసిన హోమాది కర్మ. ఇతర ప్రాణికోటికీ, జీవకోటికీ ఆహారాన్ని అందించడం కూడా ఒక రకమైన

వైశ్వదేవమే! **"ఆతిథ్యం వైశ్వదేవంచ"** అని మూలవచనంలో ఆతిథ్యం తర్వాత వైశ్వదేవమని చెప్పబడినా దేవతార్చనానంతరం వైశ్వదేవమని నిరూపించబడింది. అందుకే మూలవచన క్రమానుసారం ఆతిథ్యం ముందుగా వివరించవలసి ఉన్నా వైశ్వదేవ విషయం చెప్పబడుతోంది.

వైశ్వదేవం ప్రకుర్వీత స్వశాఖావిహితం తతః|

ఇదే విధంగా దేవతార్చనకు కాలమెప్పుడని శంక కలుగుతుంది.

సంధ్యా స్నానం జపోహోమో దేవతానాం చ పూజనమ్| ఆతిథ్యం వైశ్వదేవంచ షట్ కర్మాణి దినే దినే|

అను మూలవచనానుసారం హోమం తర్వాత దేవతార్చనమని కొందరి మతం. బ్రహ్మయజ్ఞ జపానంతరం దేవపూజ అని మరికొందరి మతం.

ఆతిథ్య ప్రాశస్త్యం

ఆతిథ్యం ఆవశ్యకత, ప్రాశస్త్యం వేదశాస్త్రాల్లో బహువిధాలుగా నిరూపించబడింది.

సంప్రాప్తాయ త్వతిథయే ప్రదాద్యాదాసనోదకే| (మ.స్మృ)

"అన్నంచైవ యథాశక్తి సత్కృత్యాతిథి పూర్వకమ్| తృణాని భూమిరుదకం వాక్ చతుర్థీచ సూనృతా| ఏతాన్యపి సతాం గేహే నోచ్ఛిద్యన్తే కదాచన ఆసనావసథౌ శయ్యాం అనువ్రజ్యాముపాసనమ్| ఉత్తమే షుత్తమం కుర్యాత్ హీనే హీనం సమే సమమ్| సువాసినీః కుమారీశ్చ రోగిణీ గర్భిణీ స్త్రియః|"

అతిథిభ్యోగ్ర ఏవైతాన్ భోజయేదవిచారయన్ అదద్వా తు యః ఏతేభ్యః పూర్వం భుంక్తే విచక్షణః స భుంజానో న జానాతి స్వగృద్ధైర్జగ్ధిమానితి| భుక్త వత్స్వథవిప్రేషు స్వేషు భృత్యేషు చైవ హి| భుంజీయాతాం తతః పశ్చాత్ అవశిష్టంతు దంపతీ దేవాన్పితౄన్మనుష్యాంశ్చ పితౄన్ గృహ్యాశ్చ దేవతాః| పూజయిత్వా తతః పశ్చాత్ గృహస్థశ్శేష భుగ్భవేత్| అఘంస కేవలం భుంక్తే యః పచత్యాత్మ కారణాత్| యజ్ఞ శిష్టాశనం హ్యేతత్సతామన్నం విధీయతే|

మన ఇంటికి వచ్చిన అతిథికి ముందుగా ఆసనము, అర్ఘ్య, పాద్యాదులను ఇచ్చి భోజనం పెట్టాలి. ఆసన శయ్యాదులను కల్పించడంలో, వచ్చిన అతిథి అర్హతను అనుసరించి ఉత్తమునికి ఉత్తమమైన ఆసనాదులను, తక్కువ వానికి తక్కువైన ఆసనాలను కల్పించాలి. అతిథికి ఆతిథ్య మివ్వడానికి ముందుగా సువాసినీ స్త్రీలకు, వివాహంకాని కుమార్తెలకు, రోగార్తులకు, గర్భిణీ స్త్రీలకు భోజనం పెట్టడానికి సంశయించరాదు. ఆ ప్రకారం చెప్పబడిన వారికి పెట్టకుండా భోజనం చేసే మనుజుడు చాలా పాప ఫలాన్ని అనుభవిస్తాడు. కనుక వచ్చిన అతిథులు, తన భృత్యులు భుజించిన తర్వాత ఆ శేషాన్ని దంపతులు భుజించాలని స్మృతులు చెప్తున్నాయి.

అతిథికి పెట్టకుండా తనకి మాత్రమే పచనం (వంట) చేయించుకోరాదని, ఆ ప్రకారం చేయించుకున్న వాడు కేవలం పాపాన్నే భుజించిన వాడవుతాడని **"కేవలాఘో భవతి కేవలాదీ"** అను శ్రుతి చెప్తోంది. ఇక్కడ మరో విశేషం-

అప్రణోద్యోఽతిథి స్సాయం సూర్యోఢే గృహమేధినా| కాలేప్రాప్తస్త్వకాలేవా నాస్యానశ్నన్ గృహే వసేత్|

సూర్యుడు అస్తమించాక వచ్చిన అతిథిని సుతారం (ఎంత మాత్రమూ) నిరసించకూడదు. సాయం వైశ్వదేవకాలంలో గానీ ఆ కాలం కూడా అతిక్రమించిన తర్వాత వచ్చినా కానీ ఆ అతిథి భోజనం చేయకుండా ఉండకూడదు. తప్పక భోజనం పెట్టి తీరాలని చెప్తోంది. సాయంకాలీనమైన అతిథిని నిరసించకూడదంటే పగటి

అతిథిని నిరసించవచ్చని తాత్పర్యం కాదు.సాయంకాలీన అతిథిని నిరసిస్తే పాపాధిక్యంచే ఇంకా అధికమైన ప్రాయశ్చిత్తం కలదని చెప్పడంలో తాత్పర్యం. దీనికి ప్రమాణం విష్ణుపురాణ వచనం.

దివాఽతిథౌతు విముఖే గతే యత్పాతకం నృప| తదేవాష్టగుణం ప్రోక్తం సూర్యోఢే విముఖే గతే| (వి.పు.)

పగటిపూట అతిథిని నిరసిస్తే వచ్చే పాపం కంటే సూర్యాస్తమయం తర్వాత సాయంకాలీన అతిథిని నిరసిస్తే ఎనిమిదిరెట్లు పాపమని అర్థం. ఇదే విషయం, దివానక్తాలందు వచ్చే అతిథులను తృప్తి పరచక పోతే ప్రజా, పశ్వాది నాశనం, తృప్తి పరిస్తే ప్రజాపశ్వాది సంపత్తి కలుగుతాయని తై.బ్రా. అగ్నిహోత్ర ప్రకరణంలో ఇలా చెప్పబడింది-

సాయం యా వానశ్చవై దేవాః ప్రాతర్యావాణశ్చాగ్నిహోత్రిణో గృహమాగచ్ఛన్తి| తాస్ యన్నతర్పయేత్ ప్రజయాస్య పసశుభిర్వితిష్ఠేరస్| యత్తర్పయేత్| తృప్తా ఏనం ప్రజయా పశుభిస్తర్పయేయుః| (తై.బ్రా.)

గృహస్థు ఇంటికి వచ్చిన అతిథి భోజనం చేయకుండా ఉపవాసముంటే వచ్చే దోషం తై.బ్రా. నాచికేత కాఠక ప్రకరణంలోను, కఠోపనిషత్తులోను కూడా వివరింపబడింది.

ఉశస్ హవై వాజశ్రవసస్సర్వవేద సందదౌ| తస్య వా నచికేతా నామ పుత్ర ఆస| (శ్రుతి)

వాజం అన్నం తద్దానాది నిమిత్తం|శ్రవః యశః కీర్తిః యస్య శ వాజశ్రవాః| (భాష్యం)

"తస్య అపత్యం వాజశ్రవసః విశ్వజితా సర్వస్వదక్షిణాకేన అయజత" (శ్రుతి)

ఉశస్ తత్ఫలం కామయమానః ఈజే, సః తస్మిన్ క్రతౌ సర్వవేదసం సర్వస్వం ధనం దత్తవాన్| (సా.భా)

అన్నదానం నిమిత్తంగా తీసుకుని కీర్తి నార్జించిన గౌతమ గోత్రోద్భవ ముని 'వాజశ్రవుడు'. అతని కుమారుడు వాజశ్రవసుడు. అతనికి నచికేతుడనే కుమారుడుండెను.వాజశ్రవసుడు ఒకానొకప్పుడు "**విశ్వజితిసర్వస్వం దదాతి**" అను శ్రుతి ప్రకారం సర్వస్వ దక్షిణాకమైన విశ్వజిద్యాగాన్ని తత్ఫలాన్ని కోరినవాడై అనుష్ఠించెను.

తగ్ం హ కుమారగ్ం సంతం, దక్షిణాసు నీయమానాసు శ్రద్ధావిశేశ, ఉపనయన యోగ్యవయస్కః కుమారః, తం కుమారం సన్తం నాచికేతసం ఋత్విజః ప్రతిదక్షిణాసు పిత్రానీయమానాసు, అతిశయేన శ్రద్ధా- ఆస్తిక్య బుద్ధిః, పితుః హితకామాయ ప్రయుక్తా యథాశాస్త్రం దక్షిణాదాతవ్యేతి ఏషా బుద్ధిః ఆవివేశ ప్రవిష్టవతీ|

తండ్రి గారైన వాజశ్రవస్సు విశ్వజిద్యాగంలో రుత్విక్కులకు దక్షిణలు ఇచ్చే కాలంలో ఉపనయన వయస్కుడైన, సంతానాన్ని ఉత్పాదన చేసే యోగ్యత లేని ఈ నచికేతుడనే బాలునికి యథా శాస్త్రంగా దక్షిణలు ఇవ్వాలనే శ్రద్ధ కలిగింది. అనగా విశ్వజిద్యాగంలో యజమానునికి గల సర్వస్వాన్ని దక్షిణగా ఇవ్వాలని ఉండగా తాను కూడా ఆ సర్వస్వంలోకే చేరును కనుక తనను కూడా దక్షిణగా ఇవ్వాలి కానీ తనయందు పుత్రప్రేమచే త్యాగం చేయలేదని ఒక ప్రకారం, ఉచిత దక్షిణలు ఇవ్వడంలేదని మరో ప్రకారం అనుకున్నాడు. అధ్వర్యుడు సోమప్రవాక అనే యాగానికి **''కచ్చిత్కల్యాణ్యోదక్షిణాః"** అని ఎన్ని గోవులు దక్షిణలుగా ఇవ్వబడునని ప్రశ్నించినప్పుడు సోమప్రవాక సమాధానం ఇలా వుంది.

సన్తి కళ్యాణ్యోదక్షిణాః సురూపాః బహుమూల్యాః ద్వాదశ శతం గావః|

కళ్యాణస్వరూపాలైన శృంగ పృచ్ఛాదులచే మంచి రూపం కలిగిన, అధికమైన మూల్యం గల నూట పన్నెండు గోవులు ఇవ్వబడునని అగ్నిష్టోమాది క్రతువుల్లో సమాధానంగా చెప్పబడుతుంది. అదే విధంగా ఈ విశ్వజిద్యాగంలో కూడా అటువంటి గోవులను ఈయవలసి ఉంది.

పీతోదకా జగ్ధతృణాదుగ్ధదోహానిరింద్రియా అనందానామ తే లోకాః తాన్సగచ్ఛతి తాదదత్|(కఠోపనిషత్)

ఇదివరకు ఉదకాలు త్రాగి ఇప్పుడు ఉదకాలు కూడా తాగలేని స్థితిలో ఉన్నవి, తృణాదికాలను ఇదివరలో భక్షించినా ఇప్పుడు తృణాన్ని కూడా భక్షించలేని స్థితిలో ఉన్నవి, ఇదివరకు పాలను ఇచ్చినవి గానీ ఇప్పుడు ఈయలేనివి, ఇదివరకు సంతానాన్ని కనే సామర్థ్యం కలవి కానీ ఇప్పుడు సంతానాన్ని కనే సామర్థ్యం లేనివి అయిన గోవులను తన తండ్రి దక్షిణలుగా ఇవ్వడం చూసి, దానివల్ల దుఃఖ భూయిష్టమైన లోకాలను పొందగలడని ఆ ప్రకారం క్రతు వైగుణ్యంవల్ల ఏర్పడే అనిష్ట రూపమైన ఫలం పుత్రుడనైన నాచేత నివారింపదగినదని యోచించిన నచికేతుడు-

ఆత్మప్రదానేనాపి క్రతుసమ్పత్తిం కృత్వా ఇత్యేవం పితరం ఉపాగమ్య సహోవాచపితరం|

తనను కూడా రుత్విక్కులకు ఇచ్చి క్రతువు సఫలమయ్యేలా చూడాలన్న తలంపుతో తండ్రితో ఇలా అన్నాడు.

తత కస్మై మాం దాస్యసీతి| ద్వితీయం తృతీయం| తగ్ంహపరీత ఉవాచ| మృత్యవే త్వా దదామీతి|

ఓ తండ్రీ! నన్ను ఏ రుత్విక్ దక్షిణగా ఈయగలవు? అని ప్రశ్నించగా ఇతను కుమార స్వభావం కలవాడని తండ్రి ఇతని మాటలను విచక్షణ చేయకుండా ఉపేక్షించెను. అయినా రెండో సారి, మూడో సారి కూడా ప్రశ్నించగా, కుమారుడు ధూర్తుడని నిశ్చయించుకున్న తండ్రి **'నిన్ను మృత్యువు కొరకు అనగా ఇచ్చేనని'** బదులు చెప్పెను. ఇంతవరకూ సమానంగానే వున్నా, ఇటుపై ఉదంతంలో కాఠక, కఠోపనిషత్తుల్లో భేదం ఉంది.

తగ్ం హస్మోత్థితం వాగభివదతి| గౌతమ కుమారమితి| సహోవాచ| పరేహి మృత్యోర్గృహాన్| (శ్రుతి)
మృత్యవేవైత్వాదామితి| కోపయుక్తం పితుస్తద్వచనం శ్రుత్వా పితుస్సకాశాత్ పరతోగంతుం సహోత్థితం కుమారం అభిముఖీకృత్య అనుగ్రహ పరాదైవీవాక్ ఇత్యేవం వదతి స్మ కిమితి హే గౌతమ గోత్రోత్పన్న| నచికేత| స ఖలు తవ పితా ఏవ ముువాచ| తద్వచనస్య అయమభిప్రాయః| హే పుత్ర| మృత్యోః గృహాన్ ప్రతి పరేహి గచ్ఛ| మృత్యవే త్వాం దత్తవానస్మి| ఇతి (భాష్యం)

కోపంతో కూడిన పితృవచనాలు విని దాని ప్రకారం యమగృహానికి వెళ్లడానికి ఉద్యుక్తుడైన నచికేతుని అనుగ్రహింపదలచి అశరీరవాణి ఇలా పలికింది."గౌతమ గోత్రోత్పన్నుడవైన ఓ నచికేతా! నీ తండ్రి నిన్ను మృత్యువుకి ఇచ్చేనని చెప్పడంతో నువ్వు ఆ ప్రకారమే వెళ్ళు. కానీ నువ్వు వెళ్ళాక అనుసరింపదగిన విధానం ఇది" అని ఈ ప్రకారం విశదీకరించెను.

తం వై ప్రవసంతం గంతాసీతి హోవాచ| తస్య స్మ తిస్రో రాత్రీ రనాశ్వాన్ గృహే వసతాత్| స యది త్వా పృచ్ఛేత్| కుమార| కతి రాత్రీరవాత్సీరితి| తిస్ర ఇతి ప్రతిబ్రూయత్| కిం ప్రథమాగ్ం రాత్రిమాశ్నా ఇతి| ప్రజాం త ఇతి| కిం ద్వితీయామితి| పశూగ్ స్త ఇతి| కిం తృతీయా మితి| సాధు కృత్యాంత ఇతి" (తై.బ్రా.)

ఓ నచికేతా! యముడు ప్రవాసం వెళ్ళిన సమయం తెలుసుకుని నువ్వు వెళ్ళి యమదర్శనం కాని సమయంలో అతని భార్యాపుత్రులు ప్రార్థించినా మూడు రోజులు భోజనం లేకుండా అక్కడే ఉండు. తర్వాత యముడు తిరిగి వచ్చి ఓ కుమారా! ఎన్ని రాత్రులు ఇక్కడ గడిపేవనే ప్రశ్నకు మూడు రాత్రులని సమాధానమియ్యి. మొదటి రోజున ఏమి ఆహారాన్ని తీసుకున్నావు? అని అడగ్గా నీ సంతానాన్ని తీసుకున్నానని, రెండవ రోజున ఏమి, మూడవ రోజున ఏమి? అను ప్రశ్నలకు నీ పశువులను, నీ పుణ్యాన్ని భక్షించానని వరుసగా చెప్పు.

అతిథిః గృహే సమాగత్య భోజన రహితః వసతి చేత్ తస్య గృహస్వామినః ఏకదిన భోజన రాహిత్య మాత్రేణ ప్రజాక్షయో భవతీతి, ఏవం శాస్త్ర రహస్యం తేన వాక్యేన సూచితం భవతి| ఏవం ద్వితీయ తృతీయ దివసయోః ఉపవాసేన పశుక్షయం సుకృత క్షయంచ అసూచయత్| (భాష్యమ్)

అనగా గృహస్థు ఇంటికి వచ్చిన అతిథి ఒకరోజు ఉపవాసం చేస్తే ప్రజాక్షయం, రెండోరోజున ఉపవాసం చేస్తే పశుక్షయం, మూడో రోజున ఉపవాసం చేస్తే పుణ్యక్షయం అవుతుందని సూచిస్తోంది.

ఇదే విషయం కఠోపనిషత్తులో కొంచెం భేదంతో చెప్పబడింది.

బహూనామేమి ప్రథమో బహూనామేమి మధ్యమః| కిం స్విత్ యమస్య కర్తవ్యం యన్మయాద్య కరిష్యతి|
(కఠోపనిషత్తు)

తండ్రిగారు నచికేతుని గురించి 'నిన్ను మృత్యువుకి ఇచ్చేనని' చెప్పడంతో నచికేతుడు ఏకాంత ప్రదేశానికి వెళ్ళి పుత్రులలో పుత్రునిగా, శిష్యులలో శిష్యునిగా ముఖ్య వృత్తిని, మధ్య వృత్తిని కూడా ఆశ్రయించేను. కానీ ఎన్నడూ ఈ ప్రకారం అధమ వృత్తిని ఆశ్రయించుకుని లేను. ఇటువంటి విశిష్ట గుణవంతుణ్ణి, పుత్రుణ్ణి అయిన నన్ను ఏమి ప్రయోజనం కోసం తన తండ్రి యమునికి దక్షిణగా ఇచ్చెనో అని వేదన పొందినా, తండ్రిని నేను మూడుసార్లు నన్నెవరికి ఇచ్చేవు అని ప్రశ్నించడంవల్ల కోపావేశంతోనే తండ్రి ఈ ప్రకారంగా చేసాడని చివరికి నిశ్చయించుకున్నాడు, ఆ నచికేతుడు. అయినా తండ్రిగారి వాక్కు వ్యర్థం కాకూడదని తలచి, పరివేదన చెందుతున్న తండ్రితో ఇలా అన్నాడు- నీ పితృపితామహాదు లందరూ అన్నమాటకు మారుమాట లేకుండా సత్యమార్గాన్ని ఆశ్రయించారు. నీవు కూడా అదే మార్గాన్ని ఆశ్రయించు.

అనుపశ్య యథాపూర్వే ప్రతిపశ్య తథాపరే| సస్యమివ మర్త్యః పచ్యతే సస్యమివాజాయతే పునః|

లోకంలో పంట పెరిగి పండాక కోయబడి తిరిగి బయల్దేరిన విధంగా మనుష్యుడు ఉద్భవించి కాలక్రమంలో జీర్ణించి మృతిని చెంది పునః ఉద్భవిస్తున్నాడు. ఇలా అనిత్యమైన జీవలోకంలో వాక్యాన్ని వ్యర్థం చేసుకుని(సత్యాన్ని వీడి) ప్రయోజనం ఏమీ లేదు. కావున సత్యాన్ని పాలించుటకు అన్నమాట ప్రకారం నన్ను యముని దగ్గరికి పంపుము, అన్నాడు.

నచికేతుని ప్రార్థన ప్రకారం వాజశ్రవస్సు అతణ్ణి యమగృహానికి పంపాడు. ఈ వెళ్ళిన అతిథి సాక్షాత్తు అగ్నిస్వరూపంగా యమగృహాలలో ప్రవేశించినట్లు, ఈ ప్రవేశించిన అగ్ని స్వరూపమైన అతిథి అగ్నివలె దహింప చేయునని, అగ్నిని ఉపశమింప చేసినట్లు అతిథికి అర్ఘ్య పాద్యాదులను ఇవ్వడం ద్వారా వాటిని వృద్ధులు సత్పురుషులు ఆచరించినట్లుగా, **"ఓ వైవస్వత! ఉదకం పాద్యార్థం హర-అహర"** అని, ఓ యముడా! అతిథికి పాద్యం నిమిత్తం ఉదకాన్ని తీసుకు వచ్చి శాంతిని ఆచరించవలసిందిగా ఈ శ్రుతి చెప్తోంది.

వైశ్వానరః ప్రవిత్యతిథిః బ్రహ్మణోగృహాన్ త స్వైతాగ్ం శాంతిం కుర్వన్తి హరవైవస్వతోదకమ్|

అతిథిగా వచ్చిన బ్రాహ్మణుడు సాక్షాత్తు అగ్నిస్వరూపమని వేదంలో మరోచోట కూడా **"ఏషవా అగ్నిర్వైశ్వానరః యద్బ్రాహ్మణః"** (తై.బ్రా 1-3-7) చెప్పబడింది. ఈ ప్రకారం అతిథి సపర్య చేయ వలసిందిగా చెప్పడంలో **అకరణే**- చేయకపోతే, ప్రత్యవాయమా? **కరణే**- చేస్తే, అభ్యుదయమా? అని ప్రశ్నించుకుని తై. బ్రా.2-1 ప్రశ్నలో అగ్నిహోత్ర ప్రకరణంలో సమాధానం ఇవ్వబడింది.

యస్యాగ్నిహోత్రమహుతగ్ం సూర్యోభ్యుదేతి|

అనే శ్రుతిచే చెప్పబడిన ప్రకారం సూర్యోదయాత్పూర్వం అగ్నిహోత్రం చేయవలసి ఉండగా, ఆ ప్రకారం చేయకముందే సూర్యోదయమైతే మహాపరాధం అవుతుందని, **'యద్యంతే స్యాదితి'** శ్రుతి భాగంచే కాలాపరాధ

ప్రాయశ్చిత్తం విధింపబడింది కనుక, ఉదయాత్పూర్వం చేయకపోతే ప్రత్యవాయం, చేస్తే అభ్యుదయమని చెప్పబడింది. ఇదే ప్రకారం అతిథి సపర్య చేస్తే అభ్యుదయమని, చేయకపోతే ప్రత్యవాయమని ఉ.భాష్యంలో గోపాలయతీంద్రుల టీకలో చెప్పారు. ఇంతే కాదు, ఏ యజమాని ఇంట్లో అతిథి భోజనం లేకుండా నివసిస్తాడో ఆ యజమాని సర్వఫలాలను అగ్ని రూపమైన అతిథి దహింప చేస్తాడని కఠోపనిషత్ లో చెప్పబడింది.

ఆశాప్రతీక్షే సంగతం సూనృతాం| చేష్టాపూర్తే పుత్రపశూగ్ శ్చ సర్వాన్ ఏత ద్వృఙ్క్షే పురుషస్యాల్పమేధసః|
యాస్యానశ్నన్ వసతి బ్రాహ్మణో గృహే| (క.ఉ.)

ఇంతకుముందు ఎన్నడూ తెలియబడని, పొందడానికి యోగ్యమైన బంగారు పర్వతం నాకు సిద్ధించు గాక! అని ప్రార్థించడం ఆశ అని చెప్పబడుతుంది. ప్రత్యక్షాది ప్రమాణంచే తెలియబడిన యాగం, యోగ్యమైన రాజ్యం మున్నగువాటి గురించి నిరీక్షించడం ప్రతీక్ష.

అంటే సత్సంగంవల్ల లేదా దేవతాధ్యానంవల్ల వచ్చిన ఫలం- సంగతం. **ఇష్టాపూర్తే**- ఇష్టమనగా యాగం, పూర్తమానగా ఆరామం. అనగా ఉద్యానవన నిర్మాణం మున్నగు వాటివల్ల ఏర్పడిన స్వర్గ, పితృ సేవాది ఫలాల్ని, పుత్రపశ్వాది ఫలాల్ని, అల్పప్రజ్ఞ కలిగిన యజమాని గృహంలో అతిథి అభోజనంగా ఉంటే, వీటన్నింటినీ నశింప చేయునని ఆ కారణంచే సర్వావస్థలందు అనగా ఆపత్సమయాల్లో కూడా అతిథిని నిరాకరించ కూడదని, పై శ్రుతి అభిప్రాయం.

దీనివల్ల తేలిన సారాంశం- తై. బ్రా. కారక ప్రకరణ ప్రకారం, కఠోపనిషత్తు ప్రకారం కూడా, అతిథి సాక్షాత్ వైశ్వానరాగ్ని స్వరూపం కనుక అగ్నిస్వరూపమైన అతిథిని భోజన రహితునిగా ఉంచిన యజమాని యొక్క ఇష్టాపూర్త ఫలాలను నశింప చేస్తాడు. కనుక చాలా జాగరూకతతో అతిథి సపర్యలు చేయాలని చెప్పబడింది.

ఇంతవరకు బ్రాహ్మణ రూపమైన అతిథిని సత్కరించాలని చెప్పబడింది. తదన్యులు అనగా బ్రాహ్మణులు కానివారు వస్తే ఆతిథ్యం ఇమివ్వనక్కర లేదా? అను ప్రశ్న బయల్దేరుతుందని శంకించి కొన్ని స్మృతుల్లో ఇలా చెప్పబడింది.

ఇష్టోవా యది వాద్వేష్యః మూర్ఖః పండిత ఏ వవా| సంప్రాప్తో వైశ్వదేవాంతే సోఽతిథి స్వర్గ సంగ్రహః|
దూరాధ్వోపగతం శ్రాంతం వైశ్వదేవ ఉపస్థితం| అతిథిం తం విజానీయాన్నాత్ర పూర్వసమాగతమ్|

నైకగ్రామీణమతిథిం సంగృహ్ణీత కదాచన| అనిత్యమాగతో యస్మాత్ తస్మాత్ అతిథిరుచ్యతే| (ప.స్మృ.)

వైశ్వదేవకాలంలో వచ్చిన వానిని ఇష్టుడైనా, శత్రువైనా, మూర్ఖుడైనా, పండితుడైనా వారిని; ఇంకా దూరం నుంచి ప్రయాణం చేసి అలసి వచ్చిన వానిని, క్షుధార్తుడైన అనగా ఆకలిచే బాధపడుతున్న వానిని అతిథిగా స్వీకరించాలని నిష్పక్షపాతంగా చెప్పబడింది.

నిత్యం కాకుండా ఎప్పుడో వచ్చే వానిని, తిథిని అపేక్షించకుండా వచ్చిన వానిని అతిథిగా స్వీకరించాలని చెప్పబడింది. **"హగ్ం సశ్శుచిషత్"** మంత్రంలోని **"అతిథిర్దురోణసత్"** భాష్యంలో- మన గృహంలో ఉన్న అతిథి సాక్షాత్ పరమాత్మ స్వరూపమని చెప్పారు.

స్వధర్మయుక్తం కుటుంబినం వా అభ్యాగచ్ఛతి ధర్మపురస్కారః నాన్నప్రయోజనకః సః అతిథిర్భవతి|

స్వధర్మంతో కూడిన (స్వధర్మాచరణ చేసే), కుటుంబి అయిన, యాగాద్యనుష్ఠాన సిద్ధి కోసం యాచకుడై వచ్చిన వానిని అతిథిగా స్వీకరించాలని అతడు సాక్షాత్తు పరమాత్మగానే మనల్ని అనుగ్రహించడానికి వచ్చినట్లుగానే భావించాలని ఈ మంత్ర తాత్పర్యంగా వ్యాఖ్యానించారు. దీనివల్ల అందరూ

అతిథిని పరమాత్మగా భావించాలని, **'విప్రఘ్నః పితృఘాతుకః'** అను వచనాలచే బ్రహ్మహత్య, పిత్రుహత్య చేసిన వానిని కూడా జాతి, కుల భేదం లేకుండా క్షుధార్తుడై వైశ్వదేవాంతంలో వచ్చిన వానిని ముందు అతిథిగా స్వీకరించమని చెప్పినట్లయింది.

న పృచ్ఛేద్గోత్ర చరణే న స్వాధ్యాయం శ్రుతం తథా|హృదయే కల్పయేద్దేవం సర్వదేవమయోహి సః| (ప.స్మృ)

గోత్ర వేద శాఖలను- ఏమి అధ్యయనం చేసినావనీ కూడా అడగకుండా దేవునివలె భావించాలి. ఆ సమయంలో వచ్చినవాడు సర్వదేవ స్వరూపుడు.

ఈ విధంగా తరతమ భేదంతో అతిథిని స్వీకరించాలని చెప్పడంలో తాత్పర్యమేమి అను శంకకు లోక దృష్టాంతంతో సమాధానం చెప్పబడుతోంది.

సుక్షేత్రే వాపయేద్బీజం సుపాత్రే నిక్షిపేద్ధనం| సుక్షేత్రే చ సుపాత్రే చ హ్యుప్తం తన్నవినశ్యతి| (పా.స్మృ)

లోకంలో ఊషర క్షేత్రం కాకుండా యోగ్యమైన భూమిని చూసి విత్తనాలు నాటితే బాగా ఫలించినట్లుగా,

ఉభయత్ర ద్యోతపసీద్యేతే తద్ధి పాత్రం ప్రచక్షతే|

అని చెప్పిన విధంగా చెప్పబడిన లక్షణాలు కలిగినది సుపాత్ర అని, అందులో/అతడియందు ఉంచబడిన దానం/ఆతిథ్యం అక్షయమైన ఫలాన్ని ఈయగలదని చెప్పబడుతోందని గుర్తించాలి. ఇంకా,

యస్య గృహాత్ భగ్నాశో నివర్తతే స తస్య దుష్కృతం దత్వా పుణ్యమాదాయ గచ్ఛతి| (గౌ.సూ.)

ఏ యజమాని ఇంటినుంచి అతిథి నిరాశ చెందినవాడై తిరిగి వెళ్తాడో అతడు తన దుష్కృతాన్ని యజమానికిచ్చి యజమాని తాలూకు పుణ్యాన్ని స్వీకరించి వెళ్తాడని చెప్పడంతో అతిథియొక్క మహిమ నిరతిశయంగా వర్ణింపబడింది.

ఇక అతిథికి భోజనం పెట్టినవాని విషయంలోను, పెట్టనివాని విషయంలోను అన్నాభిమాన దేవత ప్రవృత్తి ఎలా ఉంటుందో చెప్పబడింది.

అహమస్మి ప్రథమ జాఋతస్య| పూర్వం దేవేభ్యో అమృతస్యనాభిః| యోమా దదాతి స ఇ దేవ మావాః|
అహమన్నమన్న మదన్తి మద్మి|

అన్నాభిమాన దేవత ఇలా అంటోంది- "నేను యజ్ఞం కంటే ముందుగా పుట్టేను. కారణమేమంటే **"దేవతోద్దేశేన ద్రవ్యత్యాగో యాగః"** అను లక్షణంచేత దేవతల నుద్దేశించి హవీరూప ద్రవ్య త్యాగం యజ్ఞమని, **"హవిషః అన్నరూపత్వాత్"** హవీరూపమైన అన్నం లేనిదే యజ్ఞం సంభవించదని చెప్పబడింది. కనుక, **"అహం ప్రథమజా అస్మి"** నేను ముందుగా పుట్టేను. ఇంకా,

దేవేభ్యో అమృతస్య నాభిః| (శ్రుతి)

నహ్యతి బధ్నాతి అమృతం ఇతినాభిః దేవా హి అమృత ముపజీవన్తి| (భాష్యం)

యాగానుష్ఠానం చేసి దేవతలు దేవత్వాన్ని సంపాదించి అమృతాన్ని ఆశ్రయించుకుని జీవిస్తున్నారు. కావున వారి అమృత సంపాదనకు నేనే కారణం అని కూడా చెప్పింది. అన్నదాన శ్రద్ధతో బ్రాహ్మణాదులకు అన్నరూపమైన నన్ను ఇస్తున్నవాడే తిరిగి నన్ను స్వీకరిస్తున్నాడు. అనగా, అన్నసమృద్ధి కలవాడు అవుతున్నాడు.

లోకే దాతా అదాతా చ ఇతి ద్వౌ పురుషౌ వర్తేతే|

లోకంలో దాత, అదాత అని ఇద్దరు పురుషులున్నారు. అందులో మొదటి పురుషుడు పైన చెప్పిన విధంగా అన్నదానం చేసి అన్నసమృద్ధి కలవాడు.

అన్యేభ్యః అదత్వా అహమేవ అద్మి ఇత్యభిమన్యతే|

అదాత అయిన రెండోవాడు ఇతరులకు పెట్టకుండా, నేనే తింటున్నాను అని అభిమాన పడుతూ తింటున్నాడు. **'అదాతారం తం పురుషం అన్నరూపదేవః అహమద్మి"** అలా అభిమాన పడుతున్న పురుషుని నేను (అన్నాభిమాన దేవత) తింటున్నాను. అనగా, **'కాలాంతరే అన్నాఽభావాత్'** కాలాంతరంలో తినడానికి అన్నం లేదు కనుక దరిద్రంతో ఉండడమే 'నేను తింటున్నాను' అనే దానికి అర్థం. దరిద్రం మృత్యు సదృశమని చెప్పబడింది.

కుటుంబ భరణస్య ఆవశ్యకత్వాత్|

ఎన్ని అకార్యకారణాల చేతనైనా (ఏదో విధంగానైనా) ధనాన్ని సంపాదించి, సాధ్వీమణి అయిన భార్యను ప్రాజ్ఞుడు కాని కుమారుని పోషించి తీరాలని చెప్పింది. గృహస్థునికి కుటుంబ భరణం ఆవశ్యకమని శాస్త్రం.

పై శ్రుతిలో **'సమానమర్థం'** అనే దాన్నే స్మృతులు వివరించాయి. ఈ ప్రసంగంలో భార్యను, కుమార్లను మినహాయించి దానం చేయాలని చెప్పబడింది. దీన్ని దృష్టిలో ఉంచుకునే నాచికేత ఉపాఖ్యానంలో వాజశ్రవస్సు కుమారుడైన నచికేతుని దానం చేయలేదని తెలుసుకోవలసి ఉంది. మీమాంసా శాస్త్రం షష్ఠాధ్యాయంలో కూడా సర్వస్వ దానం అనగానేమి? అని విచారించెను. గానీ గ్రంథవిస్తర భీతిచే ఇక్కడ వివరించడం లేదు.

"నాన్వయే సతీ సర్వస్వం" పుత్రపౌత్రాది సంతతి ఉండగా తనకున్న ధనాన్నంతటినీ దానం చేయకూడదు. **"పుత్రానుత్పాద్య సంస్కృత్య వృత్తిం చైషాం ప్రకల్పయేత్"** అను స్మృతిచే పుత్రులు పితృరుణం తీర్చడానికని, అటువంటి పుత్రులను కని, జాతకర్మ నామ కరణాది సంస్కారా లొనరించి వారికి స్వతంత్రంగా జీవించగల వృత్తిని కల్పించవలెనని చెప్పింది. అదే తీరుగా హిరణ్యాదికము (బంగారము మొదలైనవాటిని) ఒకరికి వాగ్దానం చేసినదాన్ని వేరొకరికి ఇవ్వకూడదని కూడా చెప్పబడింది. యాగానుష్ఠానం చేసి దేవతలు దేవత్వాన్ని సంపాదించి అమృతతాన్ని ఆశ్రయించుకుని జీవిస్తున్నారు. కావున, వారి అమృతత్వ సంపాదనకు 'నేనే కారణం' అని కూడా చెప్పింది అన్నాభిమాన దేవత. అన్నదాన శ్రద్ధతో బ్రాహ్మణాదులకు అన్నరూపమైన నన్ను ఇస్తున్నవాడే నన్ను స్వీకరిస్తున్నాడు, అనగా అన్నసమృద్ధి కలవాడు అవుతున్నాడు.

తేఽకామయంతావర్తిం పాప్మానం మృత్యుమపహత్య దైవీగ్ం సగ్ం సదం గచ్ఛేమేతి| (తై.సం.)

ఒకప్పుడు దేవతలు దరిద్రరూపమైన పాపరూపమైన మృత్యువును విడిచిపెట్టి దైవీ సంపత్తును పొందాలనే కోరిక గలవారై-

ఏతం చతుర్విగ్ంశతి రాత్రమపశ్యస్ తమాహరస్ తేనాయజన్త|

ఇరవైనాలుగు రాత్రులతో కూడిన క్రతువును దరిద్రనాశన పూర్వక ఐశ్వర్య సాధనంగా శాస్త్రదృష్టితో నిశ్చయించుకుని అనుష్ఠానం చేసారు అని అనడంచే, దరిద్రం మృత్యు సదృశమని తెలుస్తోంది. అటువంటి మృత్యు సదృశమైన దరిద్రానికి అన్నదానం చేయకపోవడమే కారణమని చెప్పినట్లయింది.

పూర్వమగ్నేరపి దహత్యన్నం| యత్తౌహాసాతే అహముత్తరేషు|

వ్యాత్తమస్యపశవస్సుజంభం| పశ్యన్తి ధీరాః ప్రచరన్తి పాకాః|

దాత, అదాత అనే ఇద్దరిలో దాత అతిథికి పెట్టే ప్రయత్నంలో ఉండగా, అదాత అతిథికి పెట్టకుండా తాను మాత్రమే తినే ప్రయత్నంలో ఉంటే, ఇందులో అదాతచే తినబడిన అన్నం జీర్ణింపచేసే జఠరాగ్నిని చేరడానికి ముందే **'దహతి-నాశయతి'** అనగా మృత్యుకారణమైన లేదా అనేక వ్యాధులకు మూల స్థానమైన అజీర్ణానికి కారణమవుతుందిట. ఇంకా దానం ఇవ్వకపోవడంవల్ల ప్రత్యవాయం వచ్చి నరకానికి కారణం కూడా అవుతుందిట.

అదాతా విషమశ్నుత| (శ్రుతి)

ఒకరికి పెట్టకుండా భుజించిన అన్నం విష సదృశమని శ్రుతి చెప్తోంది. కావున **"అహముత్తరేషు ఉత్తరాః శ్రేష్ఠాః దాతారః"** నేను శ్రేష్ఠులైన దాతృపక్షంలో ఉంటానని అన్నసమృద్ధిని కలిగిస్తానని చెప్పిన అన్నాభిమానదేవత ఆ దాతల విషయంలో **"సుజంభం తీక్ష్ణదంతోపేతం ముఖం వ్యాప్తం విజృంభితం"** అని అదాతలను భక్షించడానికి తీక్ష్ణమైన దంతాలతో కూడిన ముఖాన్ని తెరచుకుని ఉంటానని చెప్పింది. **"ధీరాః బుద్ధిమంతః పురుషాః దాతారః అన్నదేవస్య మాహాత్మ్యం జానంతి- ప్రచరన్తి పాకాః"** ఆ ప్రకారం బుద్ధిమంతులు అన్నదేవుని అభిప్రాయాన్ని గుర్తించి దానం చేస్తారు. అజ్ఞానులు, మూఢులైన అదాతలు దానం చేయకుండా భుజిస్తారు.

అయితే ఎంతవరకు దానమివ్వాలనే ప్రశ్నకు కూడా సమాధానం చెప్పబడింది.

వృద్ధౌచ మాతాపితరౌ సాధ్వీ భార్యా సుతశ్శిశుః| అప్యకార్య శతం కృత్వా భర్తా వ్యామనరబ్రవీత్| (మ.స్మృ)

ఇంతకు ముందే చెప్పినట్లు, తన తాలూకు ధనాన్ని కుటుంబ భరణానికి ప్రతిబంధకంగా లేకుండా, కుటుంబ పోషణకు అగు ఖర్చుపోగా మిగిలిన ధనాన్నే దానం చేయమని చెప్పింది.

"నాన్వయే సతీ సర్వస్వం" పుత్రపౌత్రాది సంతతి ఉండగా తనకున్న ధనాన్నంతటినీ దానం చేయకూడదు. **"పుత్రానుత్పాద్య సంస్కృత్య వృత్తిం చైషాం ప్రకల్పయేత్"** అను స్మృతిచే పుత్రులు పితృరుణం తీర్చడానికని, అటువంటి పుత్రులను కని జాతకర్మ నామకరణాది సంస్కారా లొనరించి వారికి స్వతంత్రంగా జీవించగల వృత్తిని కల్పించవలెనని చెప్పింది.

దీనివల్ల తేలిన సారాంశమేమనగా-తనకున్న ధనాన్నంతనూ కుటుంబీకుడు త్యాగం చేయకూడదు. అలాగ అని అంతటినీ భోగం కోసమే వినియోగించకూడదు. ఎప్పుడూ అన్నదానం చేసేవారి అన్నం తరిగిపోతుందని శంకిస్తారని సమాధానం కూడా చెప్తోంది.

అన్నాభిమాన దేవతయొక్క మాహాత్మ్యం వర్ణింపబడుతోంది.

ద్వివిధో హ్యన్నస్య వ్యవహారః పారలౌకికః ఐహికశ్చేతి| దాతా హి దేవలోకే పితృలోకే వా మమేదం భూయాత్|

అన్న వ్యవహారం పారలౌకికము, ఐహికము అని రెండు విధాలు. దాతలచే ఇవ్వబడిన అన్నం దేవలోకంలో గానీ, పితృలోకంలో గానీ తనకు సమృద్ధి అగుగాక! అను అభిప్రాయంతో అగ్నిలో గానీ బ్రాహ్మణునియందు గానీ ఉంచుతున్నాడు.

పరాకే అన్నం నిహితం లోక ఏతత్| విశ్వైర్దేవైః పితృభిర్గుప్తమన్నం| యదద్యతే లుప్యతే యత్పరోప్యతే|
శతతమీసా తనూర్మే బభూవ| (తై.బ్రా.)

సదభిప్రాయంతో ఇవ్వబడిన అన్నం దూరంగా ఉన్న సమస్త దేవతలచేతను పితృలోకంలో పితృ దేవతల చేతను రక్షింపబడుతోంది. ఇది ఐహికము. ఈ లోకంలో ప్రాణులచే తినబడుతున్నది, పాత్రలందు దగ్ధమవుతున్నది, తినగా మిగిలినది, దుర్గంధంతో ఉన్నది అంతా నష్టమవుతోంది. పరులకి త్యాగం చేయబడేదంతా శతసంఖ్యాక పూర్వకమైన నా శరీరంగా అవుతోంది. ఇది ఆముష్మికం. అనగా ఈ ఐహికాముష్మిక వ్యాపారం లేశ ప్రాయమని అన్నదేవుని మాహాత్మ్యం వర్ణింపబడింది. అన్నదేవుని మాహాత్మ్యం ఇంకా ఈ క్రింది శ్రుతుల్లోను వివరింపబడుతోంది.

మహాన్తౌ చరూసకృద్దుగ్ధేన పప్రౌ| దివంచ పృశ్ని పృథివీంచ సాకమ్| తత్పంపిబంతో న మినంతి వేధసః| నైతద్భూయో భవతి నోకనీయః|

లోకంలో అధికంగా పాలనిచ్చే గోవు పొదుగును ఒకసారి పితికేక పెద్ద పెద్ద కడవలు నిండుతున్నట్లుగా శాస్త్రోక్త ప్రకారం ఇవ్వబడిన అన్నం కొంచెమైనా లోకద్వయాన్ని నింపుతోంది. దాన పూర్వకంగా సమ్యక్ భక్షణ చేస్తున్న బుద్ధిమంతులు తమని తాము గానీ, అన్నాన్ని గానీ హింసించడం లేదు.

ఎంత అన్నం తినాలి?

ప్రవృద్ధస్య అన్నస్య చిర భోక్తృత్వాత్|

ప్రవృద్ధమైన (వృద్ధి చెందిన) అన్నాన్ని చిరకాలం భుజించడంవల్ల తనకు, అన్నానికి హింసను కలగచేసినవారు కాదని అర్థం. కానీ భోజనం కోసం వినియోగించబడిన అన్నం అధికమూ కాకూడదు, అల్పమూ కాకూడదు. అధికమైతే అజీర్ణ దోషము, అల్పమైతే ధాతుక్షయం ఏర్పడి యోగాభ్యాస యోగ్యత చెడిపోతుంది.

నాత్యశ్నతస్తు యోగోఽస్తి నానశ్నతస్తు కదాచన నచైకాంత మనశ్నతః| (పాఠాంతరం)

ఎక్కువా, తక్కువా కాకుండా ప్రమాణంగా భుజించేవారిని అన్నాభిమాన దేవత రెండు లోకాల్లోను పరిపాలిస్తోందని, ఇంకా సర్వవ్యవహార కారణం అన్నం అని వివరించబడింది.

అన్నం ప్రాణమన్నమపానమాహుః| అన్నం మృత్యుం తముజీవాతుమాహుః| అన్నం బ్రహ్మాణో జరసంవదన్తి| అన్నమాహుః ప్రజననం ప్రజానాం| (తై.బ్రా.)

మన శరీరంలో ప్రాణ, అపాన రూపమైన వాయువుయొక్క ఊర్ధ్వ,అధస్సంచాలాలకు అన్నం కారణం. రస వైషమ్యం ద్వారా వ్యాధిని జనింపచేసి మృత్యువుకు కారణం అన్నం. జీవనాధారానికి కారణం అన్నం.

బ్రహ్మణః ఆయుర్వేదశాస్త్రాభిజ్ఞాః అన్నమేవ జరా కారణమితి వదన్తి| (భాష్యం)

ఒకానొక ఆహారవిశేషంచేత శీఘ్రంగా ముసలితనం సంభవిస్తుంది కనుక అన్నమే జరా (ముసలితనం) కారణం అంటున్నారు, ఆయుర్వేద శాస్త్రజ్ఞులు. ఇంద్రియ వృద్ధిద్వారా ప్రజోత్పాదనానికి కూడా అన్నం కారణం. ఈ విషయాన్ని **"అన్నాద్భూతాని జాయన్తే జాతాన్యన్నేన వర్ధన్తే"** (తై.ఉ.) అనే మంత్రం కూడా చెప్తోంది.

మోఘమన్నం విందతే అప్రచేతాః| సత్యం బ్రవీమివధ ఇత్సతస్య| నార్యమణం పుష్యతి నో సఖాయం| కేవలాఘో భవతి కేవలాదీ| (తై.ఉ.)

ప్రకృష్టజ్ఞానం లేని అదాత అగ్నియందు ఆహుతులను సమర్పించక అర్యమాది దేవతలను పోషించడం లేదు. ఆతిథ్యం ఇవ్వకపోవడంవల్ల మనుష్యులను పోషించక, అన్నాయాన్ని వ్యర్థం చేసుకున్నవాడు అవుతున్నాడు. కేవలం వ్యర్థమవడమే కాదు. ఆ అన్నం అదాతకు ప్రత్యవాయ జనన ద్వారా బాధకి కూడా కారణ మవుతుందని చెప్పబడింది.

మరో విధంగా చూసినా, అన్నసమృద్ధి ఉండి కూడా ఆకలిగొన్న వారికి అన్నం పెట్టకపోతే వారు ఆకలితో కార్యాఽకార్య వివేచన కోల్పోయినవారై అన్నం కలిగిఉన్న అదాతను బాధించడం, వధించడం కూడా లోకంలో చూస్తున్నాం. ఈ ప్రకారం అదాతకు అన్నమే వధాకారణ మవడం స్పష్టంగా లోక ప్రసిద్ధం. **"కేవలాఘోభవతి"** అనగా మరొకరికి పెట్టకుండా కేవలం తన కోసమే వండుకుని తినేవాడు తినేది అన్నం కాదు కేవలం పాపాన్నే తింటున్నట్లు శ్రుతి చెప్తోంది. దీనివల్ల అన్నదాన మాహాత్మ్యం వివరించడమైంది.

అన్నదాన భేదాలు - ప్రయోజన భేదాలు

అరాధ్యస్మా అన్నమిత్యాచక్షతే| ఏతద్వై ముఖతోన్నగ్ం రాద్ధమ్| ముఖతోస్మా అన్నగ్ం రాధ్యతే| ఏతద్వై మధ్యతోన్నగ్ం రాద్ధమ్| మధ్యతోస్మా అన్నగ్ం రాధ్యతే| ఏ తద్వా అంతతోన్నగ్ం రాద్ధమ్| అన్తతోస్మా అన్నగ్ం రాధ్యతే| (తై.ఉ.)

ముఖ్యదేశమైన తీర్థక్షేత్రాదుల్లోను ముఖ్యకాలమైన సంక్రాంతి, అమావాస్యాది కాలాల్లోను, వేద శాస్త్రాధ్యయన పరుడైన, వేదశాస్త్రాల్లో చెప్పబడిన కర్మానుష్ఠాన పరుడైన అతిథికి శ్రద్ధతో అర్ఘ్య పాద్యాదులను ఇచ్చి సత్కార విశేషంతోను, సాత్విక వృత్తితోను దానం చేస్తే ప్రథమ వయస్సులోనే (చిన్నప్పుడే) అన్న సమృద్ధిరూప ఐశ్వర్యవంతు డవుతాడు. ఏదో ఒక దేశంలో ఏదో ఒక కాలంలో ఏదో ఒక విధమైన ప్రతిగ్రహీతకు మధ్యమ పద్ధతిలో ఉపచారం చేసి, రాజస వృత్తితో దానం చేస్తే మధ్యమ వయస్సులో అన్న సమృద్ధిని పొందగలడు. పైన చెప్పిన వాటికంటే అధమమైన దేశాకాలాదుల్లో అపాత్రులకు నీచమైన ఉపచారాలతో పరుషమైన వాక్కులతో తామస వృత్తితో దానం చేస్తే అంతిమ వయస్సులో ఐశ్వర్యాన్ని పొందగలడని ఈ శ్రుతులు బోధిస్తున్నాయి. భాష్య వార్తికాలలో ఇంకా వివరింపబడింది.

ఈ ప్రకారం అన్నదాతల బుద్ధి వృత్తులను, దేశకాల పాత్రలను ఉపచార విశేషాలను అనుసరించి ప్రథమ, మధ్యమ, అంతిమ వయస్సుల్లో అన్నసమృద్ధిని కలిగిస్తున్నది అన్నం. జన్మాంతరంలో అన్న సమృద్ధి కలవాడు అవడమే కాక, సాత్విక వృత్తిలో దానం చేసిన వానికి సత్వగుణం అభివృద్ధి చెంది దానివలన పుణ్యకర్మానుష్ఠానం చేసి పాపాపనోదన ద్వారా చిత్తశుద్ధి సంపాదన ద్వారా జ్ఞానాన్ని సంపాదించుకుని ముక్తిని పొంద గలడని చెప్పడంలో తాత్పర్యం.

అన్నవిజ్ఞానం

అన్నమనగానేమి?

అద్యతేత్తి చ భూతాని| తస్మాదన్నం తదుచ్యతే|

సర్వ ప్రాణులచేత జీవన నిమిత్తం భక్షింపబడుతోంది కనుక అన్నం అని అర్థం. లేదా **"సర్వాన్ ప్రాణాన్ భక్షయతి - సంహరతీతి"** అని, సర్వప్రాణులను సంహరించును గాన అన్నం అని అర్థం. తినబడిన అన్న విశేషాలచే ఏర్పడిన వాత, పిత్త, శ్లేష్మాదుల సమతుల్యం చెడడంతో రోగాలతో మృతి చెందడం లోక ప్రసిద్ధమే కదా! ఈ ప్రకారం రెండు విధాలైన అన్న శబ్ద వ్యుత్పత్తులూ యుక్తంగానే ఉన్నాయి.

ఈ విధంగా నిర్వచించబడ్డ అన్నం సర్వప్రాణుల ఉత్పత్తికి కారణమని **"స వా ఏష పురుషోన్నరసమయః"** అను శ్రుతి భాష్యంలో వివరింపబడింది.

"తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః| ఆకాశాద్వాయుః| వాయోరగ్నిః| అగ్నేరాపః| అద్భ్యః పృథివీ| పృథివ్యా ఓషధయః| ఓషధీభ్యోఽన్నం| అన్నాత్పురుషః| (తై.ఉ.)

ఆకాశాది క్రమంగా - ఆకాశం నుంచి వాయువు, వాయువు నుంచి అగ్ని, అగ్ని నుంచి నీరు, నీటి నుంచి భూమి, భూమి నుంచి ఓషధులు, ఓషధుల నుంచి అన్నం, అన్నాన్నుంచి పురుషుడు సంభవిస్తున్నారు. ఉత్పన్నమైన ఈ దేహంగా అనుభవింపబడుతున్న శిరః పాదాది అంగాలతో కూడిన ఆకృతి విశేషం పురుషుడు. ఈ ఆకృతి విశేషం మనచే తినబడిన అన్నాలయొక్క రసవికారమని **"అన్నరసమయః"** అను శ్రుతి చెప్తోంది. తల్లితండ్రులచే తినబడిన అన్నరసం వారి శరీరాలందు త్వగాది సప్త ధాతువులుగా మారి తిరిగి గర్భాశయమందు ప్రవేశించి దేహరూపమైన వికారాన్ని పొందుతోందని గర్భోపనిషత్తులో వివరించబడింది.

షడ్విధో రసః, రసాచ్ఛోణితం, శోణితాన్మాంసం, మాంసాన్మేదః , మేదసః అస్థీని, అస్థిభ్యః మజ్జా, మజ్జయా శుక్రం, శుక్ర శోణిత సంయోగాత్ ఆవర్తతే గర్భః ఇతి| మధుర, ఆమ్ల, లవణ, తిక్త, కటు, కషాయాత్మకః షడ్విధః అన్నస్య రసః| (గ.ఉ.)

అన్నరసాలు ఆరు అని, ఈ అన్నరసంవల్ల శోణితం, శోణితంవల్ల మాంసం, మాంసంవల్ల మేధస్సు, మేధస్సువల్ల అస్థులు(ఎముకలు), అస్థులవల్ల మజ్జ, మజ్జవలన శుక్రం జనించునని, శుక్ర-శోణిత సంయోగంవల్ల గర్భం ఏర్పడుతుందని చెప్పబడింది. ఈ విధమైన అన్నరసమైన స్థూలదేహంచేత అంతర్వర్తి అయిన సూక్ష్మదేహం కూడా చెప్పబడినట్లే.

దీనివల్ల ప్రజోత్పత్తికి అన్నం కారణమని స్పష్టమవడమే కాక, మనచే భుజించబడే అన్నభేదాన్ని (పుష్టికరం, వ్యాధి జనకం) అనుసరించే పుష్టియుక్త సంతానం, వ్యాధియుక్త సంతానం కలుగునని, అల్పకాలంలోనే పండించబడిన, కృత్రిమ ఉపాయాలచే అధికంగా పండించబడిన ధాన్య విశేషం యొక్క ఆహారాన్ని స్వీకరిస్తే తదనుకూలమైన సంతతే కలుగుతుందని స్పష్టం.

ఇంకా మనచే భుజించబడే అన్నమే మనస్సుగా మారుటవల్ల ఏ విధమైన అన్నాన్ని భుజిస్తే ఆ విధమైన మనోవృత్తులు ఏర్పడడం లోక ప్రసిద్ధం. కానీ అన్నవిజ్ఞానం లేనివారు తమ మనో వృత్తులకు అన్నం కారణమని మాత్రం భావింపరు. **"యజమాన కృతం పాపం అన్నమాశ్రిత్య తిష్ఠతి"** అను యుక్తి ప్రకారం దొంగతనం మొదలైన పాపకృత్యాలచే సంపాదింపబడిన అన్నం భుజిస్తే తదనుగుణమైన మనోవృత్తులు సంభవించడం లోకంలో కోకొల్లలు ఉన్నాయి. అన్నం మనోవికారమని ప్రాణం ఉదక వికారమని, వాక్ అగ్ని వికారమని ఛాందోగ్యోపనిషత్తు చెప్తోంది.

అన్నమయం మనః ఆపోమయః ప్రాణః తేజోమయీ వాక్| (ఛాం.ఉ)

మనస్సు అన్నవికారమని గుర్తించినందువల్లనే మన ప్రాచీనులు అన్నాన్ని(ఆహారాన్ని) స్వీకరించడంలో పరిశుద్ధతను, సత్త్వగుణాభివర్ధకాన్ని, కాల, పరిమాణ విశేషాలను తప్పకుండా పాటించేవారు. బజారున తిరిగి వచ్చిన వస్త్రాలతోనే వంటచేసి, అటువంటి బట్టలు ధరించే భుజించడాన్ని నిషేధించి తడిపి, ఎండవేసిన వస్త్రాలతో వండుకోవడం, భుజించడం వంటి ఆచారాలను పాటించేవారు. అందులో పైన చెప్పిన శుభ్రత పాటించడం అనే అభిప్రాయం లీనమై ఉంది.

కారణమేమంటే, బజారున తిరిగి వచ్చిన బట్టలందు మనకు కనబడని సూక్ష్మాతి సూక్ష్మమైన దుష్ట రేణువులు ప్రవేశించి తద్వారా మనకు సంక్రమించడానికి అవకాశం ఉందని, పరిశుద్ధత కోసం మంచి వస్త్రాలతో, రాజస గుణాలను వృద్ధి చేసే మాంసాహారాది నిషేధంతో కేవలం సాత్వికాలను మాత్రమే సేవిస్తే సత్వగుణాభివృద్ధి, తద్వారా పుణ్యకర్మానుష్ఠాన ప్రవృత్తి సంభవిస్తుందని సత్వగుణాభివర్ధక ఆహారాన్ని స్వీకరించమన్నారు.

భోజనసమయం

సాయం ప్రాతరేవ భోక్తవ్యం నాన్తరా భోజనమ్| (గౌ.ధ.సూ.)

ఇత్యాది వచనాలు సాయం, ప్రాతః కాలాలందు రెండు సార్లే భుజించాలని చెప్పింది. అందులో కూడా కాలవిశేషం వివరించబడింది. ఇక్కడ ప్రాతః అంటే ప్రాతఃకాలమని కాదు, **"మాధ్యాహ్నిక విధిం కృత్వా భుంజీత| ప్రాప్తే ముహూర్త పంచకే"** అని మాధ్యాహ్నిక విధులను నిర్వర్తించాక, ప్రాతః కాలానంతరం అయిదు ముహూర్తాల కాలానికి, అనగా సుమారు గం.10-30 నిమిషాల ప్రాంతమని అర్థం. సాయంత్రమంటే సూర్యాస్తమయం. సాయంసంధ్యాది విధులు అయ్యేక అని అర్థం.

భోజన పరిమాణం

అన్నేన కుక్షేర్ద్వావంశౌ పానేనైకం ప్రపూరయేత్ ప్రాణ సంచరణార్థం తు చతుర్థమవశిష్యతే|

మన కడుపులో రెండు భాగాల్ని అన్నం చేతను, మూడవ భాగాన్ని ఉదకం చేతను పూరించి నాల్గవ భాగాన్ని ప్రాణవాయు సంచారార్థం అవకాశంగా (ఖాళీగా) ఉంచాలని చెప్పిన పరిమాణాన్ని పాటించి తద్వారా చక్కటి మనోవృత్తులను శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పబడింది. దీనికంతకూ కారణం అన్నవిజ్ఞానం.

దీనిని అంగీకరించక ఏదో విధమైన అన్నాన్ని ఏదో ఒక విధంగా కేవలం ఆకలి తీరడమే ప్రయోజనంగా తింటే రాజస, తామస బుద్ధులు అభివృద్ధి పొంది చౌర్యం, హింస మున్నగు అనేక అకార్య కరణాలను అవలంబించి ఇహ లోకంలో సమాజంచే, ప్రభుత్వం వారిచే శిక్షింపబడుటయే కాక, ఆముష్మికంగా పాపాధిక్యాన్ని సంపాదించుకుని నరకాదులను అనుభవించడానికి ఆ విధమైన ఆహార స్వీకారమే కారణమని గుర్తించి పైన వివరించిన విధంగా వేదశాస్త్రోక్త అన్నవిజ్ఞానాన్ని అలవరచుకొని గానీ, లేదా అన్నీ మనంతట మనం తెలుసుకోలేం కనుక అటువంటి విజ్ఞులైన వారి శిష్టాచారాలను అనుసరించి గాని, తదనుగుణంగా మనం ఆచరిస్తే ఐహికాముష్మికములనే రెండు విధాలైన ప్రయోజనాలను పొందగలమని సహస్ర మాత్ర సదృశమైన శ్రుతులు భోధిస్తున్నాయి.

దీనితో **"సంధ్యాస్నానం"** స్మృతిచే చెప్పబడిన నిత్యములైన షట్కర్మలు వివరించడమైంది.

*** 8 వ ప్రకరణం సమాప్తం***

9వ ప్రకరణం

పంచ మహాయజ్ఞ ప్రాశస్త్యం

పంచ వా ఏతే మహాయజ్ఞాస్సతతి **ప్రతాయంతే సతతి సంతిష్ఠన్తే దేవయజ్ఞః పితృయజ్ఞో భూతయజ్ఞో మనుష్యయజ్ఞో బ్రహ్మయజ్ఞః ఇతి|** (స్వా.బ్రా.)

ఇరవై నాలుగు సంస్కారాలలో ఉన్న పంచ మహాయజ్ఞాలు స్నాన,సంధ్యాది అనుష్ఠానానంతరం చేయవలసి ఉన్నాయి. పంచ మహాయజ్ఞాలంటే దేవయజ్ఞం, పితృయజ్ఞం, భూతయజ్ఞం, మనుష్యయజ్ఞం, బ్రహ్మయజ్ఞం. ఇవి కష్టతరమైన జ్యోతిష్టోమాది క్రతువులు, గవామయనాది సత్రయాగాలు వంటివి కాదు. వాటివలె ఎక్కువ ఆంక్షలు, విధివిధానాలు లేనివి. వాటిలాగ ఎక్కువ రోజులు చేయవలసినవీ కావు. నిత్యకర్మలతో పాటుగా ప్రతి నిత్యం సులభంగా చేయదగినవి, చేయవలసినవి ఈ పంచ మహాయజ్ఞాలు. అలాగని ఫలం విషయంలో ఏమీ తక్కువ చెప్పబడలేదు.

యత్ఫలం సోమయాగేన ప్రాప్నోతి ధనవాన్ ద్విజః| సమ్యక్ పంచమహాయజ్ఞైరశక్తస్తానవాప్నుయాత్| (స్మృతి**)**

యాగాధికారం ఉన్నవాడు ధనవినియోగంతో కూడి చేసే సోమయాగంచేత పొందే ఫలమునే అశక్తత వంటి వాటిచే అనధికారియై అనుష్ఠించ లేనివాడు ఈ పంచ మహాయజ్ఞాల చేతనే ఆ ఫలాన్ని పొందగలడు. అయితే శక్తత, అశక్తత అనేది శాస్త్రవిజ్ఞానంచే నిర్ణయించదగింది. మన ఇష్ట ప్రకారం కాదు.

తేషాం మహాయజ్ఞామహాసత్రాణీతి చ సంస్తుతిః| (ఆ.ధ.సూ.**)**

అని ఆపస్తంబులు పంచ మహాయజ్ఞాలే మహాయజ్ఞాలు, మహాసత్రాలని స్తుతించారు. ఇక్కడ దేవ,పితృ యజ్ఞాదులను మహాయజ్ఞాలని, మహాసత్రాలని అనడంలో ఆ పదాలు వీటికి నామధేయాలై వాటి ధర్మాలను వీటికి ఆపాదించగూడదని, కేవలం స్తుతించడం కోసమే ఆ పదాలు వాడబడ్డాయని హరదత్తాచార్యులు అన్నారు.

జ్యేష్ఠ సోదరుడు చేయనిదే తాను చేయడానికి అధికారం లేనివి, సోమయాగాలు. ప్రథమ యజ్ఞం, అనగా అగ్నిష్టోమం చేయనిదే సత్రయాగాలు చేయడానికి అధికారం లేనివి. వాటి ధర్మాలు ఇక్కడ ప్రవర్తించవని చెప్పినందువల్ల జ్యేష్ఠ సోదరుడు చేయకపోయినా ఈ పంచ మహాయజ్ఞాలు చేయదగినవని, అవశ్యానుష్ఠేయాలని, అంటే తప్పకుండా ఆచరించవలసినవని తెలుస్తోంది.

పితృయజ్ఞం

యత్పితృభ్య స్వధాకరోత్యప్యపస్తత్పితృయజ్ఞస్సంతిష్ఠతే| (స్వా.బ్రా.**)**

పితృయజ్ఞ మనగా పితృదేవతలకు **'స్వధా'** శబ్దంతో తర్పణం చేయడం. వైశ్వదేవ కాలంలో

ప్రాచీనావీతి పితృయజ్ఞేన యక్ష్యే| అని సంకల్పించి**,**

భూమౌ కల్పితాదోదనాత్ హస్తేన అంగుష్ఠ ప్రదేశిన్యావంతరేణ పితృభ్యస్వధాస్తు ఇతి బలిహరణ విధినా దద్యాత్|

అని చెప్పిన విధంగా సిద్ధమైన అన్నాన్ని అంగుష్ఠ, అనామిక వేళ్ళ (బొటనవేలు, చూపుడు వేళ్ళ) మధ్యనుంచి **"పితృభ్య స్వధాస్తు"** అని భూమియందు విడిచిపెట్టడం, ఈ పితృయజ్ఞం. **"బలిహరణస్యాపి హోమతుల్యత్వాత్"** అని చెప్పడం వల్ల దీనికి కూడా పితృ'యజ్ఞ' మనే పేరువచ్చింది.

శ్రాద్ధకర్మల ఆవశ్యకత

ఇక్కడ ప్రసంగానుప్రసంగంగా శ్రుత్యుక్త ప్రకారం, స్మృత్యుక్త ప్రకారం పితృయజ్ఞ ఆవశ్యకత నిరూపించ బడుతోంది. ఈ పితృయజ్ఞ వివరణ ప్రసంగంలో పితృశ్రాద్ధం యొక్క ఆవశ్యకత కూడా నిరూపించవలసి ఉంది. కారణమేమనగా ఈ కాలంలో చాలామంది ఆధునికులు పితరులనేవారు పితృలోకంలో లేరని వారిని ఉద్దేశించి శ్రాద్ధకర్మలను ఆచరించడం అవసరంలేదని ఇదంతా ఏదో విధంగా బ్రాహ్మణులు లోభ మూలకంగా కల్పించారని భ్రాంతి పడుతున్నారు, ఇతరుల్ని కూడా భ్రాంతి పెడుతున్నారు! అటువంటి అసత్య భావంతో ఏ నరుడు శ్రాద్ధకర్మని ఆచరించడో వాని రక్తాన్ని పితరులు పానం చేస్తారని (తాగుతారని) సుమన్తు వచనాన్ని నిర్ణయసింధులో ఉదహరించారు.

న సన్తి పితరశ్చేతి కృత్వామనసి యో నరశ్రాద్ధం న కురుతే తత్ర తస్య రక్తం పి బంతి తే| (మ.స్మృ.**)**

శ్రాద్ధా త్పరతరం నాన్యచ్ఛ్రేయ స్కరముదాహృతమ్| (సు.స్మృ.**)**

అని శ్రాద్ధమును ఆచరించడం అత్యంత శ్రేయోదాయకమని చెప్పబడింది. ముందుగా శ్రాద్ధ శబ్దార్థం ప్రతిపాదింపవలసి ఉంది.

ప్రేతం, పితౄంశ్చ నిర్దిశ్య భోజ్యం యత్ప్రియమాత్మనః| శ్రద్ధయా దీయతే యచ్చ తచ్ఛ్రాద్ధం పరికీర్తితమ్|

ప్రేతను, పితృదేవతలను ఉద్దేశించి ప్రియమైన భోజనపదార్థాన్ని శ్రద్ధతో సమర్పించడం శ్రాద్ధం అనబడుతుంది. అనగా పితరులను ఉద్దేశించి శ్రాద్ధకర్తచే మానసికంగా త్యాగం చేయబడినదాన్ని బ్రాహ్మణులు స్వీకరించడం శ్రాద్ధ శబ్దార్థమని వ్యాఖ్యానించారు. హేమాద్రి, శ్రీధరుడు మున్నగువారు హోమం (అనగా అగ్నౌకరణం), పిండదానం, బ్రాహ్మణ భోజనం ఈ మూడూ శ్రాద్ధ శబ్దార్థమని నిరూపించారు. అయినా ఈ వచనానుసారం సంక్రమణ శ్రాద్ధ, గ్రహణ శ్రాద్ధాదులందు వీటిలో ఒకటి లోపించినా శ్రాద్ధ శబ్దార్థానికి వ్యాఘాత (అభ్యంతరం) లేదన్నారు.

నిత్యశ్రాద్ధమదైవంస్యాత్ అర్ఘ్యపిండ వివర్జితః| జాతశ్రాద్ధే న దద్యాత్తు పక్వాన్నం బ్రాహ్మణేష్వపి|

న పక్వం భోజయేత్ విప్రాస్ సచ్ఛూద్రోపి కదాచన|

ఇత్యాది నిషేధ వచనాలచే కొన్ని కొన్ని నైమిత్తికాల్లో ఒక్కో దానికి, అనగా హోమానికి గాని, బ్రాహ్మణ భోజనానికి గాని, పిండాలకు గాని లోపమున్నా వాటియొక్క ప్రాధాన్యానికి లోపం లేదు. అవి లేకున్నా ఆ సోమయాజికి దర్శయాగం సిద్ధించిన విధంగానే శ్రాద్ధ శబ్దార్థం సిద్ధిస్తుందని శాస్త్ర సమ్మతం. కాబట్టి మాతాపితరులయొక్క శ్రాద్ధం హోమ, బ్రాహ్మణ భోజన, పిండాలతో కూడినది అత్యంత ఆవశ్యకమని, అత్యంత శ్రేయోదాయకమని చెప్పినట్లయింది.

ఎవరు సంతానం ద్వారా పితృఋణ విముక్తులు కాగలరు అను శంకపై శ్రుతి సమాధానం ఇలా వుంది. **"తతం తన్తుమితి"** అని, **"సోస్యాయ మాత్మాపుణ్యేభ్యః కర్మభ్యః ప్రతిధీయతే"** అని. అనగా పితరులకు రెండు విధాలైన విగ్రహం ఉంది. ఒకటి భూలోకంలో పుణ్యకర్మలు చేస్తూ పుత్రరూపంగా ఉండేది, మరొకటి పితృరూపంలో లోకాంతరాల్లో ఉండేది. అందుచేత ఆకార భేదంచే ఈ లోకంలోను పరలోకంలోను కూడా ఉండడం సంభవం. కానీ ఎవరు యథా శాస్త్రంగా పితృఋణాన్ని తీరుస్తారో, అనగా శాస్త్రం చెప్పిన విధంగా పితృదేవతలను ఉద్దేశించి హవిస్సును ఇస్తున్నారో, పితృశ్రాద్ధాన్ని ఆచరిస్తున్నారో అటువంటి వారు పుత్రపౌత్రాది సంతాన రూపంలో వంశ విచ్ఛిత్తి కాకుండా ఉండగల రన్నమాట.

యథాశాస్త్రం అనడంలో ఉద్దేశ్యమేమి? పితృకర్మలో **"దర్భానాస్తీర్యతేషు పిండాన్నిదధాతి"** అను వచనానుసారం పిండాలను దర్భలయందే ఉంచాలి.

యో వా పిండం పితుః పాణౌవిజ్ఞాతేఽపి న దత్తవాన్| శాస్త్రార్థాతిక్రమాద్ధీతః యజేతైకాక్యసౌ కథం| (భారతం)

దైవవశం లేక సంతానం లేనివారు శాస్త్ర విరుద్ధం కానివిధంగా మరొకర్ని తన పుత్రునిగా స్వీకరించి అతడు తనకు ఉత్తమర్ణుడని అనగా తనకు ధనాన్ని అప్పుగా ఇచ్చాడని ఎంచి అధమర్ణుడుగా తాను ధనాన్ని ప్రత్యర్పణం చేసే విధంగా ఇస్తే, వాని ద్వారా (ఆ దత్తపుత్రుని ద్వారా ఔరస పుత్రులు, తననుంచి పుట్టిన పుత్రులు) కలవారికి ప్రాప్తించే పుణ్యలోకాలు వీరికి కూడా లభిస్తాయని చెప్తోంది, ఈ శ్రుతి.

పిత్ర్యం ఇత్యేవత్ అన్యయోరపి ద్వయోః ఋణయోః ఉపలక్షణమ్|

దంపతులారా! ఘృతద్రవ్యంతో దైవకర్మలు ఆచరించండి. పరస్పరం సదా అవిముక్తులుగా (విడువబడని వారుగా) ఉండి కర్మానుష్ఠానద్వారా ఉభయ సాధారణమైన పుణ్యలోకాన్ని రక్షించుకోండి. పితృ,దేవ కర్మలను సదా అనుష్ఠించుటకు త్వరపడండి. అలా చేయబడిన కర్మ లోకాంతరాలకు చేరి పితరులకు, ఈ లోకంలో గల పుత్రపౌత్రాదుల యోగక్షేమాలకు కూడా ఉపయోగ పడగలదు. ఈ విధంగా యథా శాస్త్రంగా పితృకర్మ అనుష్ఠిస్తే వంశాభివృద్ధి అవుతుందని తేలింది.

మాతుః పితుః ప్రకుర్వీత సంస్థిత స్యౌరసస్సుతః| పైతృమేధిక సంస్కారం మంత్రపూర్వకమాదృతః| పితుః పుత్రేణ కర్తవ్యా పిండదానోదక క్రియా|

ఇత్యాది వచనాలన్నీ మాతాపితరుల మరణానంతరం మొదట ప్రేతసంస్కార కర్మని ఆచరిస్తే వారు ప్రేతత్వాన్ని, సపిండీకరణాంతరం పితృత్వాన్ని పొందుతారని ఆ తర్వాత ఆ పితృదేవతలకు ప్రత్యహం (ప్రతిరోజు) ఉదకాలతో తర్పణం చేయాలని, ప్రతి దర్శయందు దర్శశ్రాద్ధ మాచరించాలని, మృతతిథి రోజున ప్రత్యాబ్దికాన్ని ఆచరించాలని, పుత్రునకు ఇవన్నీ అవశ్య కర్తవ్యాలని చెప్తున్నాయి.

అయితే పితృదేవతలు ఎప్పుడూ పితృలోకంలోనే ఉంటారా? అని శంకించగలరు. దానికి సమాధానం కూడా చెప్పబడింది. పితృదేవతల్లో కొందరు అధికారిక పితృదేవతలు ఉంటారు. సోముడు, అగ్నిష్వాత్త, బర్హిషదః మొదలైనవారు. వీరివి అధికారిక పదవులు. ఈ పదవులు నిత్యం. ఈ పదవుల్లోని వీరు వారి, వారి అధికారికారాన్నిబట్టి మనమిచ్చిన హవిస్సును పితృరూపంలో ఉన్న పితృదేవతలకు అందజేస్తారు. వీరిలో సోముడనగా పితృదేవతలకు స్వామి అని, **"సోమాయ పితృమతే పురోడాశగ్ం షట్కపాలం నిర్వపతి"** అను శ్రుతి భాష్యంలో వివరించారు. **"సంవత్సరోవై సోమః పితృమాన్"** అను శ్రుతి చెప్పినట్లు సోముడు సంవత్సర రూపంగా వర్ణించబడ్డాడు.

"బర్హిషదః పితరః" అనే పితృదేవతలు **'మాసి పితృభ్యః క్రియతే'** అను శ్రుతిప్రకారం మనచే అనుష్ఠించబడే దర్శశ్రాద్ధాభిమాన దేవతలు కనుకనే **'మాసావై పితరో బర్ హిషదః"** అని మాస రూపంగా వర్ణించబడ్డారు.

"యే వై యజ్వానః తే పితరో బర్ హిదః" అని ఇహ లోకంలో యజ్ఞం చేసి పితృలోకాన్ని పొందినవారు బర్హిషదః పితరులని, **"యేవా అయజ్వానో గృహమేధినః తే పితరోఽగ్నిష్వాత్తాః"** అని యజ్ఞానుష్ఠానం చేయకుండా పితృలోకాన్ని పొందినవారు అగ్నిష్వాత్త పితరులని చెప్పబడుతున్నారు.

బర్హిషదః పితరులు సోమయాగంలో పితృదేవతల నుద్దేశించి ఇవ్వబడిన హవిస్సులను అందజేసే అధికారిక పితరులు అన్న భేదాన్ని గుర్తించాలి. వీరు అందజేయడానికి ప్రమాణం ఈ శ్రుతి చెప్తోంది.

పరేత పితరస్సోమ్యా గంభీరైః పథిభిః పూర్వైః| అధా పిత్రూన్ సువిదత్రాగ్ం అపీతయమేనయే సథమాదం మదన్తి|

ఈ మంత్రం మహా పితృయజ్ఞంలోను, ప్రత్యాబ్దికాల్లోను కూడా వినియోగింపబడుతోంది. దీని అర్థం- 'ఓ సౌమ్య పితృదేవతలారా! సులభసాధ్యమైన అన్నోదకాలతో నిండిన, పూర్వదేవతలచే నెలకొల్పబడిన మార్గాలగుండా మీరు వెళ్ళి ఆ పితృలోకంలో ఏ పితరులు యమునితో సహావస్థాన జన్యమైన సంతోషాన్ని అనుభవిస్తున్నారో, చిరకాలవాసంచే అక్కడ గల వృత్తాంతాలను బాగా తెలుసుకుంటున్నారో ఆ పితృదేవతలకు మేమిచ్చిన హవిస్సుని అందజేయండి అని ప్రార్థిస్తున్నాము' అని.

దీనివలన మన పితరులు పితృలోకంలో పితృరూపంలో ఉంటే వారికి సౌమ్యాది పితృదేవతలు హవిస్సుని అందచేస్తారని, పితృరూప అవస్థను విడిచి మనుష్య లోకంలో అవతరిస్తే బ్రాహ్మణ భోజనంచే వారికి అనుగుణమైన ఆహారంగా మారుతుందని, పిండరూపంలో హవిస్సును జలచరాలకు అందజేయడం వల్ల ఒకవేళ పశుపక్ష్యాది రూపంలో ఉన్నా కూడా వారికి అందుతుందని, ఈ ప్రకారం పితరులు పితృరూపంలో ఉన్నా, వేరే ఏ రూపాన్ని దాల్చినా ఆ ఉపాధికి తగినట్లుగా ఆహారంగా అందుతుంది అన్నారు. ఇది ఎలా అవుతుంది అంటే, మనం ఇతర దేశాలకి పంపే ధనం (రూపాయలు) వారి దేశానికి అనుగుణంగా (కరెన్సీగా) మారినట్లు మారుతుందని, అల్పజ్ఞులమైన మనమే లౌకికంగా ఇన్ని ఏర్పాట్లు చేసుకోగలిగినప్పుడు వేద శాస్త్రాలు చెప్పిన అలౌకిక ఏర్పాటును సంశయించవద్దని శాస్త్రం వివరిస్తోంది.

అందువల్ల వారు ఏ రూపంలో ఉన్నా శ్రాద్ధ కర్మని ఆచరించడం మన విధి అని, **"శ్రాద్ధం కుర్యాదవశ్యం తు ప్రమీత పితృకో ద్విజః"** (సుమంతు వచనం) అని చెప్పినట్లు తెలుసుకుని ప్రత్యాబ్దికం మానకూడదని పితృయజ్ఞ నిరూపణ ప్రసంగంలో వివరించారు.

భూతయజ్ఞం

పంచమహాయజ్ఞంలో రెండవది భూతయజ్ఞం.

యద్భూతేభ్యోబలి అగ్ంహరతి తద్భూత యజ్ఞస్వతిష్ఠతే|

"భూతయజ్ఞేన యక్ష్యే" అని సంకల్పించి **"శుచౌ భూమౌ ఇదం భూతేభ్యః అస్తు ఇతి బలిహరణ విధినా దద్యాత్"** అని శుద్ధమైన భూమియందు **'భూత్యేభః స్వధా అస్తు'** అని బలిహరణాన్ని ఇవ్వాలి.

ఇక్కడ **భూత్యేభ్యః** అంటే, వాయసాది సర్వభూతాలు చెప్పబడుతున్నాయి. **"యే భూతాః ప్రచరన్తి దివా నక్తం బలిమిచ్ఛన్తో ... పుష్టిపతిర్దధాతు స్వాహా"** అను మంత్రంతో వాయసబలి, శ్వానబలి అని, ఇంటి బహిః ప్రాంగణంలోకి (ఇంటి బయటకు) వెళ్ళి ఇస్తూ ఉండాలి. ఈ మంత్రంతో ఆహారాన్ని కోరుతున్నపై ఏ భూతాలు అహోరాత్రులు సంచరిస్తున్నాయో, స్మశానవాసి అయిన కాలాగ్నిరుద్రునకు భృత్యులైన వాయసాదులు (కాకి వంటి పక్షులు) ఏవి ఉన్నాయో, వాటి అన్నింటియొక్క తృప్తికోసం ప్రజా, పశ్వాది పుష్టిని కోరుతున్న వాడనై భూమియందు ఈ హవిస్సుని ఉంచుతున్నాను. సర్వ పుష్టులను ఇవ్వగలిగిన భగవానుడు నాకు సర్వపుష్టులను ఇచ్చుగాక! అని శ్వానబలి ఇవ్వబడుతోంది. అనగా శ్వానవాయసాది అభిమాన దేవతలద్వారా సర్వభూతాలు తృప్తి పడగలవని అభిప్రాయం.

మనుష్య యజ్ఞం

"యద్బ్రాహ్మణేభ్యోఽన్నం దదాతి తన్మనుష్య యజ్ఞస్సంతిష్ఠతే|"

అహరహర్భూతబలిః మనుష్యేభ్యో యథాశక్తి దానం| (ఆ.ధ.సూ.)

ఈ వచనాల ప్రకారం మనుష్యోపలక్షణం చెప్పబడిన బ్రాహ్మణులకు ఇవ్వబడే అన్నదానం మనుష్య యజ్ఞమని చెప్పబడుతోంది. దానం హోమంతో సమానమని చెప్పబడింది కనుక, **"మనుష్య యజ్ఞేన యక్ష్యే"** అని సంకల్పించి, **"మనుష్యేభ్యోహంతా"** అను మంత్రంచే సనకసనందాది రుషులకు ముందుగా ఇచ్చాక మన శక్తి కొలది సర్వ మనుష్యులకు అనార్తులై వచ్చిన వారికి అన్నదానం చేయడమే మనుష్య యజ్ఞం.

బ్రహ్మయజ్ఞం

యత్స్వాధ్యాయ మధీయీతై కామప్యంచ యజుస్సామవాతత్ బ్రహ్మయజ్ఞస్సంతిష్ఠతే| తస్య విధిః|

అను సూత్రానుసారంగా వేదాన్ని ఆరంభం నుంచి ప్రతి రోజున అధ్యయనం చేసే స్వాధ్యాయమే బ్రహ్మయజ్ఞం. వేదాధ్యయనం చేయలేనివాడు ప్రతీ వేదంనుంచి ఋగ్యజుస్సామ వేదాలనుంచి ఒక్కొక్క రుక్కును, ఒక్కొక్క యజుస్సును, ఒక్కొక్క సామాన్ని అధ్యయనం చేసినా బ్రహ్మయజ్ఞం చేసినట్లే అవుతుంది.

ఈ విధంగా బ్రహ్మయజ్ఞం చేస్తే ఏమి ఫలము? అను ఆకాంక్ష కలుగుతుంది. **"ప్రయోజనమనుద్దిశ్య న మందోపి ప్రవర్తతే"** అను న్యాయానుసారం ప్రయోజనం తెలియకుండా మందుడు (మందబుద్ధి కలవాడు, పిచ్చివాడు) కూడా ఏ పనీ చెయ్యడు కనుక దీని (బ్రహ్మయజ్ఞ) ఫలాన్ని వేదం ఈ విధంగా వర్ణిస్తోంది.

యదృచోధీతే పయసః కూల్యా అస్య పిత్రూన్ స్వధా అభివహన్తి" (తై.స్వా.బ్రా.)

ఇత్యాదినా కూలమర్ హంతీతి కూల్యాః మహానద్యః| (సా.భా.**)**

రుగ్వేదాధ్యయనంచే క్షీరపూర్ణమైన మహానదులు గాను, యజుర్వేదాధ్యయనంచే ఘృతపూర్ణమైన నదులు గాను, సామ వేదాధ్యయనంచే సోమధారలతో కూడిన నదులు గాను పితృదేవతలకోసం ప్రవహిస్తాయి. అథర్వ వేదాధ్యయనంచే మాంస సంబంధమైన నదులు ప్రవహించి పితృదేవతలను తృప్తి పరుస్తాయి.

ఇదే తీరుగా **"యదృచోధీతే- పయ ఆహుతిభిః ..... మేధాహుతిభిరేవ తద్దేవాగ్ స్తర్పయతి"** అను వేదభాగంచే దేవతలకు కూడా వరుసగా రుగధ్యయనం క్షీరాహుతితో సమానమైన తృప్తిని, యజురధ్యయనం ఘృతాహుతితో సమానమైన తృప్తిని అధర్వ వేదాధ్యయనం మధ్వాహుతుతో సమానమైన తృప్తిని, బ్రాహ్మణాధ్యయనం మాంసాహుతితో సమానమైన తృప్తిని కలిగిస్తాయని చెప్పాయి. ఆ విధంగా తృప్తిపడిన పితృదేవతలు, దేవతలు బ్రహ్మయజ్ఞానుష్ఠానం చేసిన యజమానిని ఆయుస్సుతో, తేజస్సుతో, యశస్సుతో, బ్రహ్మవర్చస్సుతో అన్నసమృద్ధితో తృప్తి పరుస్తారని **"త ఏనం తృప్తా ఆయుషా తేజసా, వర్చసా శ్రియా యశసా బ్రహ్మవర్చసేనాన్నాద్యేన చ తర్పయంతి"** అనే శ్రుతి, చెప్తోంది.

సామాన్యంగా వేదాధ్యయనం చేయవలసిందని చెప్పి **"బ్రాహ్మణానీతిహాసాన్"** ఇత్యాది భాగంచే వేరే బ్రాహ్మణాలు అని చెప్పడంవల్ల బ్రాహ్మణాలు వేదం కావని ఇతిహాస పురాణాదులవంటివని **"సమభి"** వ్యాహారంచే (అని చెప్పడంచే) తెలుస్తోంది. కానీ **'మంత్ర బ్రాహ్మణయోర్వేద నామధేయం'** అనడంవల్ల మంత్ర, బ్రాహ్మణ సముదాయాత్మకమే వేదమని కల్పసూత్రకారులు నిర్ణయించారు.

వేదంలోనే కొన్ని అవాంతర భాగాలకు ఇతిహాస, పురాణాది రూపాన్ని శాస్త్రకారులు వర్ణించారు. న్యాయంగా వాటిని కూడా బ్రహ్మయజ్ఞంలో పఠించాలి. లేదా ఇతిహాస పురాణాదులకు వేదమూలకత్వంగా ప్రామాణ్యాన్ని అంగీకరించినందున వాటిని కూడా అధ్యయనం చేయాలని తాత్పర్యం.

బ్రహ్మయజ్ఞం చేసే ప్రకారం శ్రుతియందు ఈ విధంగా చెప్పబడింది. **"బ్రహ్మయజ్ఞేన యక్ష్యమాణః" "ప్రాగుదీచ్యాం వా"** మొదలైన శ్రుతుల ప్రకారం బ్రహ్మయజ్ఞం చేయదలచినవాడై గ్రామానికి ప్రాక్ దిక్కుకి కానీ, ఉత్తరదిక్కుకి కానీ, గృహంయొక్క ఆచ్ఛాదన కనబడనంత దూరంలో నదీ తటాకాదుల సమీపానికి వెళ్ళి **"ఉదిత ఆదిత్యే దక్షిణత ఉపనీయ- ఉపవిశ్య హస్తావవనిజ్య త్రిరాచామేత్ ద్విః పరిమృజ్య సకృదుపస్పృశ్య శిరశ్చక్షుషి నాసికే శ్రోత్రే హృదయ మాలభ్య"** అని చెప్పినట్లు సూర్యోదయం అవుతుండగా, అనగా సంధ్యావందన అగ్నిహోత్ర ఔపాసనాది అనుష్ఠానాలు పూర్తి కాగానే యజ్ఞోపవీతిగా ఆసనంమీద కూర్చుని హస్తాలను ప్రక్షాళన చేసుకుని, మూడుసార్లు ఆచమనం చేసి ఓష్ఠాన్ని (పెదవులను) రెండుసార్లు పరిమార్జన చేసి, ఒక పర్యాయం ఓష్ఠాలను స్పృశించాక వరుసగా శిరస్సును, చక్షుస్సులను, నాసికను, శ్రోత్రాలను, హృదయాన్ని స్పృశించాలి.

ఈ క్రియలన్నింటికీ ఫలం కూడా చెప్పబడింది. మూడుసార్లు ఆచమనం చెయ్యడంచే ఋగ్వేదాభిమాన దేవతలు తృప్తి పడతారని, రెండుసార్లు ఓష్ఠ పరిమార్జనచే యజురభిమాన దేవతలు తృప్తి పడతారని, ఓష్ఠలను సకృదుపస్పర్శన చేయడంచే సామాభిమాన దేవతలు తృప్తి పడతారని, సవ్యపాణి పాద శిరాద్యంగాలను ప్రోక్షించి హృదయస్పర్శ చేయడంచే అథర్వ వేదాభిమాన దేవతలు, బ్రాహ్మణ ఇతిహాస అభిమాన దేవతలు కూడా తృప్తి చెందుతారని చెప్పబడింది. ఈ క్రియాకలాపం తర్వాత **"దర్భాణాం మహదుపస్తీర్య", "ఉపస్థం కృత్వా ప్రాఙాసీనః"** అనడంచే సవ్య జానువుమీద దక్షిణ పాదాన్నుంచడమనే (ఎడమ తొడమీద కుడి పాదాన్నుంచడం) ఉపస్థమనే ఆసనంలో తూర్పు ముఖంగా ఆసీనుడై **"స్వాధ్యాయ మధీయీత"** వేదాన్ని, అనగా స్వకీయ శాఖను **'ఆదిత ఆరభ్య'** అనడంచే ప్రారంభించాలి.

ఈ ప్రకారం సులభంగా అనుష్ఠించదగిన కార్యక్రమాలతో దేవతలను, పితృదేవతలను, పశుపక్ష్యాది భూతాలను, సాటి మనుష్యులను, వేదాభిమాన దేవతలను యథాశక్తి సంతృప్తి పరచి వారు అభిమానంతో కలిగించే పశు, సంతాన అభివృద్ధిని సర్వ రకాల పుష్టుల్ని పొందడమే ఈ పంచ మహాయజ్ఞాల తాత్పర్యం. మనకు మనుష్య జన్మనిచ్చిన భగవంతుని, భౌతిక రూపాన్నిచ్చిన తల్లితండ్రులను, వేదరాశిని అందించిన ద్రష్టలను, వేదాభిమాన దేవతలను, పశుపక్ష్యాది జీవ కోటిని, తోటి మానవులను అందరినీ గుర్తుంచుకుని వారందరికీ కృతజ్ఞతతో వేదంలో చెప్పబడినట్లుగా వారిని సంతృప్తి పరచడమనే కర్మల ద్వారా, ఇంత విశాల భావంతో సమస్త ప్రాణులయొక్క సుఖశాంతుల కోసం చేయబడుతున్న ఈ వైదిక కర్మలు స్వార్థంకోసం చేస్తున్నారని కానీ, మూఢాచారంతో చేస్తున్నారని కానీ తలంచ కూడదు. అందరి శ్రేయస్సు, అభివృద్ధి వీటి పరమార్థంగా గుర్తించాలి.

ప్రణవ మహిమ

'ఓం' అనే ప్రణవ స్వరూపం సర్వాత్మకమని సర్వోత్కృష్టమని, అక్షరం- నశ్వరం కాని అనగా నాశనం లేని, సర్వవేదాంత వేద్యమైన పరబ్రహ్మ స్వరూపమని చెప్పబడింది. పిప్పలశాఖలోను, కఠశాఖలోను కూడా దీని మహిమ **"ఏతద్వై సత్యకామ పరంచా పరంచ ఏత దేవాక్షరం బ్రహ్మ ఏత దే వాక్షరం పరమ్"** అని వర్ణింపబడింది.

ఋచో అక్షరే పరమే వ్యోమన్| యస్మిన్ దేవా అధివిశ్వే నిషేఃయర్యస్తన్న వేద కిమృచా కరిష్యతి య ఇత్త

ద్విదుస్త ఇమే సమాసతే| (తై.ఉ.)

నశ్వరం కాని సర్వోత్కృష్టమైన సర్వ వ్యాపకమైన ప్రణవ స్వరూపంలోనే సమస్త వేదాలు, వేద ప్రతిపాద్యములైన దేవతలు ఉన్నారు. కఠోపనిషత్తు కూడా **"సర్వే వేదాయత్పదమామనంతి తపాంసి సర్వాణి**

చ యద్వదంతి యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి తత్తే పదగ్ం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్" అని సర్వ వేదాలకి, సర్వతపస్సులకు, బ్రహ్మజ్ఞానానికి నిలయమైన ప్రణవమేనని నిరూపిస్తోంది.

ఇటువంటి ప్రణవ స్వరూపాన్ని ఉచ్చరించకుండా ఏ వేదాధ్యయనం చేసినా ఫలరహితమైన కృషి చేసినట్లే అవుతుంది. ప్రణవమహిమను గుర్తించిన మహర్షులు ఐహికాముష్మిక క్లేశరహితులై శాశ్వత సుఖం కలవారై ఉన్నారని చెప్తోంది.

బ్రహ్మయజ్ఞ వివరణ

ఇటువంటి మహా మహిమోపేతమైన ప్రణవంతో స్వాధ్యాయాన్ని ఆరంభించాలి. ప్రణవోచ్చారణానంతరమ్ **"త్రీనేవ ప్రాయుత యుఙ్క భూర్భువస్వః"** అను మూడు వ్యాహృతులు లోకత్రయాత్మకమైన బ్రహ్మ స్వరూప మని, **"భూరిత్యగ్ఘ్యః భువ ఇతి యజుర్ఘ్యః స్వరితి సామభ్యః"** అను ఛందోగ శ్రుతిచే వేద త్రయ రూపమైన **"భూః–భువః-స్వః"** అను మూడు వ్యాహృతులను పఠించాలని విధి. **"యదేవ వాచస్సత్యం తత్ప్రాయుఙ్క్త"** అని, **"ఏతద్వై వాచస్సత్యం"** అని అనడం చేతను వాక్సంబంధి సత్యరూపం ఈ వ్యాహృతి త్రయమని దీని ఉచ్చారణచే సత్యాన్నే ప్రయోగించిన వాడు అవుతాడని చెప్పబడింది. అనంతరం సవితృ దేవతాకమైన గాయత్రీ ఛందస్కమైన **"తత్సవితుర్వరేణ్యం"** అను మంత్రాన్ని మొదటిసారి మూడు పాదాలు గాను, రెండోసారి రెండు పాదాలు కలిపి, మూడోసారి మూడు పాదాలను కలిపి మధ్యన విరామం లేకుండా, మూడవ పాదం కలిపినందువల్ల వచ్చే స్వరం లేకుండా రెండో పాదం గానే ఉచ్చరించాలని విధిస్తోంది.

అథసావిత్రీం గాయత్రీం త్రిరన్వాహపచ్ఛోఽర్థర్చశోఽనా వానం| (తై.స్వా.అ.)

ఈ మంత్రాలచే ప్రతిపాదింపబడిన సవితృదేవత ఐశ్వర్య ప్రేరకుడు అవడంచే బ్రహ్మయజ్ఞాన్ని చేసేవాడు ఐశ్వర్యాన్ని పొందగలడని, **"సవితాశ్రియః ప్రసవితా శ్రియమే వాప్నోతి"** అను శ్రుతి బోధిస్తోంది. తర్వాత గాయత్రీ మంత్రోచ్చారణ చేసి, ముందు రోజు చేసిన వేదభాగంయొక్క సమాప్తిని బుద్ధియందు ఉంచుకుని అక్కడినుంచి ప్రారంభించి వేదాధ్యయనాన్ని కొనసాగించాలి. కానీ మధ్యన కొంత భాగం విడిచి మనకు తోచిన చోట ప్రారంభం చేయకూడదని, **"అధో ప్రజ్ఞాతయైవ ప్రతిపద్యతే"** అను శ్రుతి బోధిస్తోంది.

బ్రహ్మయజ్ఞం యజ్ఞమెలా అవుతుంది?

"అజాస్ హవై పృశ్నీగ్ స్తపశ్య మాణాస్ బ్రహ్మస్వయమ్భ్వభ్యానర్ షత్త దృషయో భవన్త దృషీణా మృషిత్వం తాం దేవతాముపతిష్ఠన్త యజ్ఞకామాః|

"త ఏతం బ్రహ్మయజ్ఞమపశ్యస్ తమహరస్ తేనా యజన్త"

అను శ్రుతులు బ్రహ్మయజ్ఞాన్ని సర్వకామప్రదమైన యజ్ఞంగా వర్ణించాయి. స్వయంభువు అయిన వేద స్వరూపమైన పరబ్రహ్మ ఒకానొక విగ్రహ రూపాన్ని ధరించి తపస్సు చేస్తున్న ఋషులకు ప్రత్యక్ష మయ్యాడని వర్ణించి, తర్వాత ఆ రుషులు పరబ్రహ్మ వస్తురూపమైన ఆ దేవతను సర్వకామ ప్రదమైన ఒకానొక యజ్ఞాన్ని కోరుతూ ఉపాసించారని చెప్తున్నాయి. ఒక్కో కోరికను తీర్చుకోవడానికి ఒక్కో యజ్ఞాన్ని అనుష్ఠించవలసిన అవసరం లేకుండా సర్వకామాలను ఈడేర్చేటువంటిది బ్రహ్మయజ్ఞమని ఆయన అనుగ్రహంతో తెలుసుకోగలిగారు. ఆ ప్రకారం బ్రహ్మయజ్ఞాన్ని అనుష్ఠించి దానిచే దేవతలను పూజించారు అని పై శ్రుతులు ప్రతిపాదిస్తున్నాయి. అయితే వేదాధ్యయన మనేదానికి అగ్ని, హోమం వంటి యజ్ఞ లక్షణాలు లేనందున యజ్ఞత్వలక్షణం ఎలా కుదురుతుంది? అను శంకను నివారించడానికి పై గ్రంథం

"**యదృచోధ్యగీషత– తాః పయ ఆహుతయో దేవానామభవన్**" అని, బ్రహ్మయజ్ఞంలో ఋగ్, యజు, స్సామ వేదాధ్యయనాలచే దేవతలకు క్షీర, ఘృత, సోమ ఆహుతులతో సమానమైన, అథర్వాధ్యయనంచే మధ్వాహుతి సమానమైన తృప్తిని ఇస్తుందని చెప్పింది.

తాభిః క్షుధం పాప్మాన మపాఘ్నన్నపహత పాప్మానో దేవాస్స్వర్గం లోకమాయన్ బ్రహ్మణ స్సాయుజ్యం ఋషయో గచ్ఛన్|

ఆ తృప్తిచే దేవతలు క్షుద్రరూపమైన పాపాన్ని పోగొట్టుకున్నవారై నిరతిశయ సుఖానుభవార్థం స్వర్గలోకాన్ని పొందారు. జగత్కారణమైన బ్రహ్మయొక్క సాయుజ్యాన్ని పొందారు. అనగా బ్రహ్మజ్ఞానం కలగడం ద్వారా బ్రహ్మయజ్ఞం ముక్తిదాయకమైంది అన్న మాట. వాజసనేయులు "**తమేతం వేదాను వచనేన బ్రహ్మణా వివిదిషంతి**" మొదలగు వాక్యాలచే వేదానువచనం కూడా పరంపరగా జ్ఞానసాధనతో పరిగణించారు. ఈ ప్రకారం యథావిధిగా వేదాధ్యయనం చేయడం కూడా యజ్ఞస్వరూపమేనని, యజ్ఞం చేసిన ఫలితాన్ని ఇస్తుందని నిరూపించబడింది. అల్ప ప్రయాస సాధ్యమైనది కదా! అని బ్రహ్మయజ్ఞం అల్పదృష్టితో చూడదగింది కాదు. అల్పప్రయాస సాధ్యమైనా కూడా, అశ్వమేధ సత్రయాగాదుల కంటే ఈ బ్రహ్మయజ్ఞమందు ఉత్తమ వైలక్షణ్యం ఉందని, సర్వ క్రతువులు వేదంచే విధింపబడినవై వేదమంత్రాలే అందులో వినియోగింపబడినా ఆ యా క్రతువులకు ఉపయోగపడే వేద భాగాలే అందులో వినియోగింపబడుతూ వేదమందు గల ఆనుపూర్వికి (అనుక్రమానికి, వరసకు) వినియోగం లేనిదై ఉంది. బ్రహ్మయజ్ఞంలో అయితే సర్వ క్రతు సంబంధమైన విధ్యర్థవాదాలే కాక నిషేధ వాక్యాలు కూడా మొదటినుంచి సమాప్తం వరకు అనుపూర్వులతో వినియోగించబడడమే ఇందులో వైలక్షణ్యమని, అదే దీని విశేషమని చెప్పబడింది. ఈ విధంగా వినియోగింపబడేది బ్రహ్మయజ్ఞం కాక మరో యజ్ఞం లేదని స్పష్టంగా చెప్పవచ్చును.

ఈ ప్రకారం బ్రహ్మయజ్ఞం మొదలగు పంచ మహాయజ్ఞాలు శ్రుతి విహితాలయినా స్మార్త కర్మలందు పరిగణింప బడుతున్నాయి. ఇటువంటి స్మార్తకర్మలకే సర్వకామాలను తీర్చగల్గిన దేవ, పితృ, మనుష్య, భూత జాలానికి తృప్తి నివ్వగల్గిన సామర్థ్యం ఉన్నప్పుడు ఇంక శ్రౌతకర్మల మాట చెప్పనేల? అని ధర్మాన్ని ప్రశంసించడానికి శ్రౌతకర్మలను చేయలేనివారికి శ్రౌతకర్మ ఫలాన్ని కూడా ఇవ్వదగినవని ప్రమాణం ఉండడం చేత ఈ పంచ మహాయజ్ఞాల గురించి ఇంత వివరణ యివ్వబడింది.

9వ ప్రకరణం సమాప్తం

10వ ప్రకరణం

అధర్మ నిరూపణ

ఇంతవరకు ధర్మనిరూపణలో ధర్మ స్వరూప లక్షణాలు, ధర్మం విషయంలో వేదమే ప్రమాణమని ప్రామాణ్య నిరూపణ, ఆ ధర్మములు శ్రౌతధర్మములు, స్మార్త ధర్మములు, ఆచారప్రాప్త ధర్మములు అని వివిధములుగా ఉన్నాయని నిరూపించడమైంది.

అయితే ధర్మం గురించి చెప్పడానికి ఉపక్రమించి తద్విరుద్ధమైన అధర్మ ప్రసంగం ఎందుకు చేయవలసి వచ్చిందని శంకించవచ్చు. కానీ అధర్మ పరిహారం కోసం ఆచరించే ప్రాయశ్చిత్తాలు ధర్మం పరిధిలోకే వస్తాయి. ఈ విషయమే మనుస్మృతిలో బలపరచబడింది.

యత్తు బ్రహ్మహత్యాదిరూప అధర్మ కీర్తనమన్యత్ర తత్ప్రాయశ్చిత్త విధి రూపధర్మ విషయత్వేన, నతు స్వతన్త్రతయా| (మ.స్మృ. వ్యాఖ్య 1-2)

మనుస్మృతి శ్లోక వ్యాఖ్యలో అధర్మ విషయక ప్రసంగం యొక్క ఆవశ్యకత ఇలా చెప్పబడింది.

ఏతాదృష్ట్వా అస్యజీవస్య గతీః స్వేనైవ చేతసా| ధర్మతోఽధర్మతశ్చైవ ధర్మే దద్యాత్సదా మనః| (మ.స్మృ. 1-2)

"ధర్మ, అధర్మ అనుష్ఠానాల వలన ప్రాప్తించు స్వర్గ నరకాదులను తెలుసుకుని ఎల్లప్పుడూ నీ మనస్సుని ధర్మంలోనే ప్రవేశపెట్టుము" అని అర్థం. నిరతిశయ ఐశ్వర్య హేతువు ధర్మం. దానికి విరుద్ధమైనది అధర్మం. ఇదే విషయం బ్రహ్మాండ పురాణంలో ఇలా చెప్పబడింది.

ధర్మస్య చ ఫలం స్వర్గః నరకస్తద్విపర్యయః| (బ్రహ్మాండ పు.)

ధర్మానికి ఫలం స్వర్గమని, అధర్మానికి ఫలం నరకమని అర్థం. అయితే, ధర్మం, అధర్మం వీటి స్వరూపం, అలాగే వాటి ఫలితం తెలిస్తే గాని అధర్మం నుండి నివర్తించి ధర్మం దిశగా ప్రవర్తించదు. కనుక అధర్మ నిరూపణ కూడా అవసరమే. రోగి ఆరోగ్యంకోసం వైద్యం చేయడంలో వైద్యుడు ముందుగా రోగి అనారోగ్యానికి కారణా లన్వేషించి, వాటిని తొలగించడానికి ప్రయత్నిస్తాడు. అదే తీరుగా అప్రతిబంధకంగా ధర్మఫలం సిద్ధించడం కోసం ధర్మంలో మనస్సు పెట్టి, ధర్మాచరణ చేయడం అవసరం. కాని దీనికి ప్రతిబంధకమైన అధర్మాన్ని వీడడానికి అసలు అధర్మం ఏమిటి, అందులోని పాప భేదాలు ఏమిటి, వాటి ఫల నిరూపణ ఎలా, వాటి ప్రాయశ్చిత్త విశేషాలు ఏమిటి ఇవన్నీ తెలుసుకోవడం అవసరం అని వాటి నిరూపణ తెలియచేయబడుతోంది. ఇంతకుముందు ధర్మ నిరూపణ క్రమంలో ధర్మానుష్ఠాన యోగ్యమైన ప్రదేశం భరతవర్షం, భరతఖండం అని శ్రుతి,స్మృతి, పురాణేతిహాసాల్లో చెప్పబడిన రీతిలో వివరించడం జరిగింది. కానీ ఇక్కడ ఒక ప్రశ్న మొదలవుతుంది మరి! "ధర్మాచరణకు చెప్పబడిన ప్రదేశంలో ఆచరించిన ధర్మం వల్ల ఫలం సిద్ధిస్తుందన్న రీతిలో అధర్మానికి కూడా అదే ప్రదేశమైతేనే తత్ఫలం కూడా అనుభవించాల్సి రావాలి కానీ హింస వంటి అధర్మం వేరే ప్రదేశాల్లో ఆచరించినా నరకం వంటి ఫలితాలు ఎందుకు వస్తాయి? రావు" అని నిర్ణయించాల్సి ఉంటుంది. కానీ అది సరి కాదు.

లోకంలో పుణ్యకార్యాలు, తీర్థయాత్రాదులు, వివాహాది శుభకార్యాలు ఆచరించడానికి యోగ్యమైన తిథి, వార నక్షత్రాదులు చెప్పబడ్డాయి కానీ అసత్యం పలకడానికి, హింస చేయడానికి తిథి వార నక్షత్రాదులతో పని లేదు కదా!

నిషిద్ధాలు రెండు రకాలు - కొన్ని దేశ,కాల,కర్త్ర విశేషాలను అనుసరించి నిషేధించబడినవి. మరికొన్ని దేశ,కాల,కర్త్ర విశేషాలతో పని లేకుండా నిషేధించబడినవి. ఉదాహరణకు సూర్యగ్రహణ, చంద్రగ్రహణాదులు మన దేశానికి కాకుండా దేశాంతరాలకి సంబంధించినవైతే **"రాహూపరాగే స్నాయాత్"** వంటి విధి వాక్యాలతో విధించబడిన స్నాన దానాదులు మనకు వర్తించవు. త్రైవర్ణికులకు చెప్పబడిన సురాపాన నిషేధం శూద్రులకు వర్తించదు. ఇవి మొదటి రకం నిషేధాలు. రెండోది సర్వవర్ణాలవారికి, సకల దేశాల్లో సకల అవస్థల్లో ఉన్నవారికీ నిషేధించబడినవి. **"న హింస్యాత్సర్వ భూతాని, న పరదారాస్ గచ్ఛేత్, నానృతం వాదేత్"** వంటి వాక్యాలు చెప్పినట్లు భూతహింస, పరదారా గమనం, అసత్య వచనం వంటి నిషేధాలు దేశకాల కర్తలతో పని లేకుండా సామాన్యంగా అందరికీ వర్తిస్తాయి. ఇవి ఏ దేశంలో ఎవరు, ఎప్పుడు ఆచరించినా అనర్థ హేతువులే అవుతాయి.

అధర్మ నిరూపణం

నిషేధేభ్యో నిషేధ్యానాం అధర్మత్వేన చ నిర్ణయః|

"**నిషేధ వాక్యాలచే నిషేధించబడింది అధర్మం**" అని నిర్వచనం. అలాంటి అధర్మంలో ఎన్నడూ మనస్సును ప్రవేశపెట్ట కూడదు.

"నసీదన్నపి ధర్మేణ మనోఽధర్మే నివేశయేత్|"

"అధార్మికాణాం పాపానాం ఆశుపశ్య విపర్యయమ్|"

ధర్మం ఆచరించేవాడు తాను నశించే స్థితి వచ్చినా అధార్మికులైనవారి వ్యత్యస్తమైన ఫలాలు చూసినా (అధార్మికుడు ఎన్ని పాపాలు చేసిన వాడైనప్పటికీ తాత్కాలికంగా సమస్త భోగాలు అనుభవిస్తున్నట్లు కనిపించినా) తాను మాత్రం ధర్మం విడవకూడదని చెప్పబడింది. అధార్మికులు సంపదల్ని సంపాదించినా ఆ సంపదలు శీఘ్రంగా నశించడం అనే వ్యత్యాస ఫలం కనబడుతోంది కనుక అటువంటి వారిని చూసి మోసపోరాదని కుల్లూకభట్టు వ్యాఖ్యలో ఇలా చెప్పబడింది.

తథాపి తేషామధార్మికాణాం అధర్మ చౌర్యాది వ్యవహారిణాం పాపినాం శీఘ్రం ధనాది విపర్యయోఽపి దృశ్యతే|
(కు.భ.వ్యా.-మ.స్మృ.)

అలాగే-

నాఽధర్మశ్చరితో లోకే సద్యః ఫలతి గౌరివ| శనైరావర్తమానస్తు కర్తుర్మూలాని కృంతతి| (మ. స్మృ.)

గోవుకు పెట్టిన దాణా (ఆహార పదార్థం) వెంటనే ఫలితం ఇవ్వనట్లుగా, మనం నాటిన విత్తనాలు వెంటనే భూమిపై ఫలించనట్లుగా, మనం ఆచరించిన అధర్మం కూడా వెంటనే ఫలించదు. కనుక సత్వర ఫలితం కనిపించినా, కనిపించకపోయినా కూడా అధర్మం ఆచరించడానికి వీల్లేదు.

"ఇదివరకు చేసిన పుణ్యం ఈ పాపంకంటే ఉత్కటమైనపుడు (ఎక్కువ బలము కలది, శీఘ్ర ఫలప్రదమైనది అయినప్పుడు) ముందుగా పుణ్యఫలం అనుభవించిన తర్వాత పాపం పరిపక్వమయ్యాక బండి చక్రపు పై ఆకు క్రిందకు, క్రింది ఆకు పైకి తిరిగినట్లు ఆ జీవికి పాపఫలం అనుభవంలోకి వచ్చి, ఆ అధార్మికుని వేళ్ళతో సహా పెళ్లగించి నశింపచేస్తుంది" అని **"శనైరావర్తమానస్తు"** అనే స్మృతి వచనం చెప్తోంది.

ఆ యా జీవులకు వారి వారి పుణ్యపాపాలు జన్మాంతరంలో కూడా తోడు వస్తాయని, కేవలం వారికే కాక వారి పుత్ర పౌత్రాదులకు కూడా సంక్రమిస్తాయని మనుస్మృతి ఇలా చెప్తోంది.

యదినాత్మని పుత్రేషు న చేత్పౌత్రేషు నప్తృషు| నత్వేవతు కృతోఽధర్మః కర్తుర్భవతి నిష్ఫలః| (మ.స్మృ.)

దీనికి కారణం ఏమిటని ఆలోచిస్తే **"ఆత్మా వై పుత్రనామాసి"** అనే వాక్యం ప్రకారం తానే పుత్ర పౌత్రాది రూపంలో జన్మిస్తున్నందున వారు అప్పుడు అనుభవించినా తాను అనుభవించినట్లే అవుతుంది. ఎవరి కర్మ వారు అనుభవించాలి అనే లోకోక్తి అందరికీ తెలిసిందే.

వ్యాకరణంలో కూడా **"స్వరిత ఇతః కర్తృభిప్రాయే క్రియాఫలే"** అనే సూత్రం కర్మఫలం కర్తృగామి అయినప్పుడు ఆత్మనేపది ప్రత్యయం వస్తుందని చెప్తోంది. అయితే ఈ సిద్ధాంతానికి ఒక సవరణ కూడా ఉంది. కుమారులకు నిర్వహించే జాతకర్మాది సంస్కారాలు ఉపనయన పర్యంతం ఆచార్య (పితృ) కర్తృకాలు.

ఈ సంస్కారాలు నిర్వహించకపోతే ఆ ప్రత్యవాయం (పాపం) బాధ్యత తండ్రిది. నిర్వహిస్తే వచ్చే ఫలం మాత్రం కుమారునిది. అదే తీరుగా పితృ శ్రాద్ధాదులకు కర్తలు కుమారులు. భోక్తలు పితృ దేవతలు. చేయకపోతే ఆ పాపం, పాప ఫలితం కుమారులది. చేస్తే వచ్చే ఫలం తల్లి, తండ్రులది. అనగా పితృ దేవతలది. కర్మలకు అధికార విచారణ చేస్తూ మీమాంసా శాస్త్రం షష్ఠాధ్యాయంలో కర్తృత్వ సమానాధికారణ, భోక్తృత్వం, అధికారిత్వం అని అంగీకరించడం జరిగింది.

దీనివల్ల తెలుసుకోదగింది ఏమిటంటే, సామాన్యంగా కర్మకు ఎవడు కర్తయి ఉన్నాడో అతనే ఆ కర్మ తాలూకు ఫలానికి భోక్త. కానీ కొన్ని సందర్భాల్లో జాతేష్టి, జాత కర్మాది సంస్కారాలు కర్త అనగా తండ్రి చేయకపోతే ఆ పాపం తండ్రిది, చేస్తే పుణ్యం పుత్రుడిది. అలాగే పితృ కర్మల్లో కర్త కుమారుడు, ఫలభోక్త తండ్రి.

అయితే ఈ సంస్కారాలు పితృకర్తృకాలు అని మాత్రం చెప్తే సరిపోతుందా? సరిపోదు. పితాపుత్ర సంబంధం అవినాభావం కలది. **"ఆత్మా వై పుత్ర నామాసి"** అని శ్రుతి చెప్తోంది కనుకనే, లోకంలో ఒక్కో పురుషుడు జీవితంలో ఎంత ధర్మం ఆచరించినప్పటికీ పాప ఫలం అనుభవిస్తూనే ఉంటాడు.

అలాగే ఎంత అధర్మం ఆచరిస్తున్నా పుణ్యఫలం అయిన ఆయురారోగ్య ఐశ్వర్యాదులను అనుభవించడం మనం చూస్తూనే ఉన్నాం. ఇదెలా సాధ్యం?

మనుస్మృతి ప్రకారం **"యద్యధర్మస్య ఫలం ఆత్మా న పశ్యేత్, యది న చేత్ పుత్ర పౌత్రాశ్చ నప్తా చ విందతి"** అధర్మం తాలూకు ఫలం తాను చూడకపోయినట్లయితే అది తన పుత్ర పౌత్రాదులకు సంక్రమిస్తుందిట. తండ్రి తాలూకు ఆస్తి, కొన్ని వ్యాధులు పుత్రపౌత్రాదులకు సంక్రమించిన విధంగానే ఈ పుణ్యపాప ఫలాలు కూడా వారికి సంక్రమిస్తాయి. తండ్రి తాతల పుణ్య,పాప ఫలాలు తరువాతి వారికి సంక్రమించడం శాస్త్ర సిద్ధం, లోక సిద్ధం అని అంగీకరించాల్సి వుంది.

"అధర్మం వ్యక్తిగత అధర్మం అయితే వ్యక్తిగతంగానే వ్యాధివంటి రూపాల్లో అనుభవించగలడు. సమాజ కృతమైన అధర్మం అయితే సామాజికంగా అనుభవించగలడు" అని అధర్మ ఫలాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు.

వ్యాధిర్విత్త వినాశః దుర్భగత్వముద్వేగః దారిద్ర్యం స్వజనైశ్చ పరాభవం మౌర్ఖ్యంచ పరప్రేష్యతా| తృష్ణా తౌల్యమ నిర్వృతిః కుశయనం కుస్త్రీ కుభోజ్యం రుజః| సర్వాః పాపమహీరుహస్య మహతో వ్యక్తం ఫలం దృశ్యతే|

పాపం అనే వృక్షం యొక్క ఫలాలను వ్యాధి రూపంగా, ధననష్ట రూపంగా, దౌర్భాగ్య రూపంగా, ఉద్విగ్నత, మానసిక ఆందోళన, దారిద్ర్య రూపంగా, స్వంతమనుషులనుంచి పరాభవం, మూర్ఖత, అత్యాశ, సుఖం ఇవ్వలేని సుఖం, నిందితమైన శయ్య, నీచ స్త్రీ సంగమం, కుత్సితమైన (నిందింపబడే) ఆహార ప్రాప్తి వంటి పలు రూపాల్లో అనుభవించడం జరుగుతుంది.

వైయక్తికమైన (వ్యక్తిగతమైన) అధర్మానికి నరకాదులు ప్రాప్తిస్తాయని **"ధర్మస్య చ ఫలం స్వర్గః నరకస్తు ద్విపర్యయః"** అని పురాణ వచనం చెప్తోంది కదా! ఈ వచనం ప్రకారం నరకాదులు జన్మాంతరంలో ప్రాప్తిస్తాయని చెప్పాలి. కాని **"వ్యాధిర్విత్త వినాశః"** అనే వచనాన్ని అనుసరించి వ్యాధి, ఆస్తినష్టం వంటివి ఇక్కడే వస్తాయని చెప్పవచ్చునా?

పాపాలు పలు విధాలు అని చెప్పబడ్డాయి. మహాపాతక, అతిపాతక, అనుపాతక, ఉపపాతక, జాతి భ్రంశకర, సంకలీకరణ, అపాత్రీకరణ, మలినీకరణ, ప్రకీర్ణ భేదాలతో అనేక రకాలైన పాపాలున్నాయి.

బ్రహ్మహా మద్య పస్తేనస్తథైవ గురుతల్పగః| ఏవం మహాపాతకినో యశ్చతైస్సహ సంవసేత్|

బ్రాహ్మణ వచనం, సువర్ణ చౌర్యం, మద్యపానం, గురుభార్యా గమనం, బ్రహ్మహత్యా పాతకునితో సహభోజనం, వారితో వివాహ సంబంధం, వారిచే యాగం చేయించడం, వారితో అధ్యయన అధ్యాపక సంబంధం మొదలైనవి మహాపాతకాలు. బ్రహ్మహత్యతో సమమైనవి ఉపపాతకాలుగా పరిగణించ బడుతున్నాయి.

గురూణా మప్యధిక్షేపః వేదనిందా సుహృద్వధః| బ్రహ్మహత్యా సమం జ్ఞేయం అధీతస్య చ నాశనం| నిషిద్ధ భక్షణం జైహ్మ్య ముత్కర్షే చ వచోఽనృతం| రజస్వలా ముఖాస్వాదః సురాపాన సమానితు|అశ్వరత్న మనుష్య స్త్రీ భూ ధేను హరణం తథా| నిక్షేపస్య చ సర్వం హి సువర్ణస్తేయ సంమితమ్| సఖి భార్యా కుమారీషు స్వయోనిష్వన్త్యజాసు చ| సగోత్రాసు సుతస్త్రీషు గురుతల్పసమం స్మృతమ్| మాతుస్స్వసారం మాతులశ్చ మాతులానీం స్నుషామపి| మాతుస్సపత్నీం భగినీం ఆచార్య తనయాం తథా| ఆచార్య పత్నీం స్వసుతాం గచ్ఛంస్తు గురుతల్పగః| మహాపాతకి సమానా సంసర్గే మహాపాతకి సమత్వం| ఏవం పంచానాం మహాపాతకానాం సమేషు ఉపపాతకిత్వ వ్యవహారః| తథాహి

గురువును నిందించడం, నాస్తికత్వ భావంతో వేదాన్ని నిందించడం, స్నేహితుని వధించడం, అధ్యయనం చేసిన వేదాన్ని విస్మరించడం బ్రహ్మహత్యతో సమానమైన పాపాలు.

"న కలంజం భక్షయేత్" అని నిషేధించబడినట్లు కలంజ భక్షణం చేయడం, రాజకులాదుల్లో అసత్యాలు చెప్పడం, రజస్వలా స్త్రీ యొక్క ముఖాస్వాదనం ఇవన్నీ సురాపానంతో సమమైన పాతకాలు. బ్రాహ్మణ సంబంధమైన అశ్వాలను, రత్నాలను, స్త్రీలను, గో,భూ సంపదలను, నిధులను అపహరించడం సువర్ణాపహరణతో సమానమైన పాపాలుగా చెప్పబడ్డాయి.

మిత్రుని భార్యను, ఉత్తమ జాతి కన్యలను, సోదరిని, చండాల స్త్రీని, సగోత్రురాలిని, కోడలిని పొందడం గురుభార్యను పొందడంతో సమానమైన పాపం. అలాగే మేనత్త, పినతల్లి, మేనమామ భార్య, శిష్య స్త్రీ, దౌహిత్రి, అత్తగారు, గురుపత్ని, గురుపుత్రి వీరిని పొందడమే కాదు పొందాలని కోరుకోవడం కూడా గురుశయ్యని కోరుకోవడంతో సమమైన పాపం.

పైన చెప్పబడిన పాపాలన్నీ మహాపాతక సమానమై ఉపపాతకాలకన్నా తీవ్రత కలిగి ఉన్నాయి. ఇంకా బ్రహ్మహత్యతో సమానమైన పాపాల గురించి ఇలా చెప్పబడింది.

మహాపాతక తుల్యాని పాపాన్యన్యాని యాని తు| తాని పాతక సంజ్ఞాని తదూనముపపాతకమ్ |

ఉపపాతకాలు ఈ క్రింది విధంగా చెప్పబడ్డాయి.

"గోవధో వ్రాత్య తాస్తేయమృణానాంచాన పక్రియా| అనాహితాగ్నితా ఆపణ్య విక్రయః పరివేదనమ్|

భృతకాధ్యయనాదానం భృతకా ధ్యాపనం తథా| పారదార్యం పారవిత్తం వార్ధుష్యం లవణ క్రియా|

స్త్రీ శూద్ర విట్క్షత్ర వధోనింది తార్థోప జీవనమ్| నాస్తిక్యం వ్రత లోపశ్చ సుతానాంచైవ విక్రయా! ధాన్యకుప్య పశుస్తేయ మయాజ్యానాం చ యాజనమ్| పితృమాతృ సుతత్యాగః తటాకారామ విక్రయః| కన్యా సందూషణం చైవ పరనిందక యాజనమ్| కన్యాప్రదానం తస్యైవ కౌటిల్యం వ్రతలోపనమ్| ఆత్మనోర్థే క్రియారంభో మద్యపస్త్రీ నిషేవణమ్| స్వాధ్యాయాగ్ని సుతత్యాగో బాంధవత్యాగ ఏవచ| ఇంధనార్థం దృమచ్ఛేదః స్త్రీహింసౌషధ జీవనమ్| హింస్ర, యన్త్ర విధానం చ వ్యసనాన్యాత్మ విక్రయః| శూద్రపైష్యరర్ణేన సఖ్యం హీనయోని నిషేవణం| తథైవానాశ్రమవాసః పరాన్న పరిపుష్టతా | అసచ్ఛాస్త్రాది పఠనం ఆకరేష్వధికారితా| భార్యా విక్రయణం చైషాం చైవ ముపపాతకం|

గోవధ చేయడం, సకాలంలో కాకపోయినా గౌణకాలంలో అయినా ఉపనయన సంస్కారం జరగకపోవడం, బ్రాహ్మణుల సువర్ణం లేక తత్సమమైన పరద్రవ్యాపహరణం, పంచ మహాయజ్ఞాల్లో వివరించబడిన మనుష్య ఋణ, దేవఋణ, పితృఋరణాలను తీర్చక పోవడం, అధికారం ఉండి కూడా ఆహితాగ్ని కాకుండా ఉండడం, విక్రయించకూడని లవణాదులను విక్రయించడం, జ్యేష్ఠుడు ఉండగా కనిష్ఠుడు వివాహం చేసుకోవడం, డబ్బు పుచ్చుకుని అధ్యయనం చేయించడం ఇవన్నీ పాపాలు. డబ్బు పుచ్చుకుని పాఠాలు చెప్పడం గురువుకు పాపం. వాని దగ్గర అధ్యయనం చేయడం శిష్యునికి పాపం.

కనిష్ఠుడు వివాహం చేసుకుని అన్నగారు తగిన కారణం లేకుండా వివాహం చేసుకోకుండా ఉండిపోవడం, వడ్డీ వ్యాపారం చేయడం, లవణం తయారు చేయడం/అమ్మడం, పరుల భార్యను సేవించడం, స్త్రీ శూద్ర వైశ్య,క్షత్రియ వధ, తన వంతు కాని కృషి వాణిజ్యాలను కొనసాగించడం, బ్రహ్మచారికి స్త్రీ ప్రసంగం, పుత్ర పుత్రికా విక్రయం, ధాన్యాదుల అపహరణం ఇవన్నీ దొంగతనంతో సమానం.

తల్లితండ్రులను, పిల్లలను విడిచిపెట్టడం, తటాకాలు, ఆరామాలు విక్రయించడం, కన్యాదూషణం, అవివాహిత జ్యేష్ఠుడుండగా కనిష్ఠుడు వివాహం చేసుకున్నట్లయితే ఆ జ్యేష్ఠుడితో యజ్ఞం చేయించడం, అటువంటి వానికి కన్యాదానం చేయడం, బ్రహ్మచారి వ్రతం పాటించక పోవడం, స్వపత్ని అయినా సరే మద్యపానం చేసిన స్త్రీతో చరించడం, స్వాధ్యాయ అధ్యయనం చేయకుండడం, కుమారులకు సకాలంలో సంస్కారాలు చేయకపోవడం, తల్లిదండ్రులను ఆపత్సమయంలో సమర్థతతో ఆదుకోక పోవడం, స్త్రీ ధనంతో గాని పణంగా పెట్టిన ధనంతో గాని జీవించడం, హింసా విధానంతో జీవించడం, వశీకరణాత్మకమైన ఔషధాలు విక్రయించి జీవించడం, పరదాస్యకరణం (ఇతరుల వద్ద దాస్యం చేయడం), శూద్రాదులతో మైత్రి చేసి తద్వారా సంపాదించి జీవించడం, సవర్ణ, హీనవర్ణ స్త్రీలతో చరించడం, పరాన్న భోజనంలో ఆసక్తి కలిగి ఉండడం, నాస్తికులైన చార్వాక బౌద్ధాది మత గ్రంథాలను అధ్యయనం చేయడం, భార్యా విక్రయం, దేవర్షి పితృరుణాలను తీర్చకపోవడం, నాస్తికత్వాన్ని అనుసరించడం, కుత్సితమైన శీలం కలిగి ఉండడం, మద్యపానం చేసిన స్త్రీని అనుసరించడం ఇవన్నీ ఉపపాతకాలు. కేవలం తనకోసమే అన్నం వండుకుని తినడం కూడా ఈ కోవకే వస్తుంది.

"అఘం స కేవలం భుంక్తేయః పచత్యాత్మ కారణాత్" అని మనుస్మృతి చెప్తోంది. ఇంకా, "**కేవలాఘో భవతి కేవలాదీ**" అని శ్రుతి. పరులకు పెట్టకుండా ఆత్మార్థం వంట చేసుకుని భుజించడం పాపం. కేవలం పాపం భుజించడం అని అర్థం. ఇవే విషయాలు మనువుచే నిరూపించబడ్డాయి.

దేవర్షి పితృణాం ఋణస్య అనపక్రియా| అసచ్ఛాస్త్రాధిగమనం నాస్తికతా కుశీలతా| మద్యప స్త్రీ నిషేవణం ఇత్యేతాన్యుపపాతకాని| మహాపంచాతి పాపం తథా పాతకమేవచ| ప్రాసంగికం చోపపాపం ఇత్యేవం పంచమోగణః|

ఇంతవరకు అధర్మ నిరూపణ క్రమంలో స్మృతిలో చెప్పబడినవాటిని చర్చించడం జరిగింది. ఈ పాప విశేషాలను వాటికి ప్రాయశ్చిత్తాలను స్మృతికారులు చెప్పడానికి మూలభూతమైన శ్రుతుల్లో కూడా ఇవి చెప్పబడినట్లుగా కొన్ని శ్రుతులను కూడా ఉదహరించే ప్రయత్నం చేస్తాను.

తైత్తరీయశాఖలోని "**నారాయణోపనిషత్**"లో సామాన్యమైన పాపాలను తొలగించుకోవడానికి, బ్రహ్మజ్ఞాన ప్రతిబంధకాలైన పాపాలను తొలగించుకోవడానికి జపించదగిన మంత్రాలు, హోమార్థమైన మంత్రాలు చెప్పబడ్డాయి.

"అకార్య కార్యవకీర్ణీస్తేనో భ్రూణహా గురుతల్పగః| వరుణోపామఘుమర్షణస్తస్మాత్పాపాత్ప్రముచ్యతే| అకార్యం శాస్త్ర ప్రతిషిద్ధం కలంజ భక్షణాదికం తత్కర్తుం శీలం యస్యాసౌ అకార్యకారీ, ప్రతిషిద్ధ స్త్రీ గమనవాన్ అవకీర్ణీ బ్రాహ్మణ సువర్ణ హరస్తేనః వేదవేదాఙ్గ విద్బ్రాహ్మణః గర్భోవా భ్రూణః తం హన్తీతి భ్రూణహా గురుదారాగమీ తు గురుతల్పగః ఏతాదృశ పాపకారణమపి మాం అఘుమర్ షణః పాప వినాశకః అపాం స్వామీ వరుణః తస్మాత్పాపాత్ ప్రముచ్యతే|మోచయతు| (భాష్యం)

శాస్త్ర నిషిద్ధమైన కలంజ (మాంసం/ఉల్లిపాయ వంటి) ఆహారాల్లో మక్కువ ఏర్పడ్డానికి కారణమైన పాపం నుండి, వేదవేదాంగ వేత్తయైన బ్రాహ్మణుని లేదా బ్రాహ్మణ యువతి గర్భాన్ని హరించడం అనే పాపంనుండి, గురుపత్నీగమన జన్యమైన పాపంనుండి, పైన చెప్పిన అన్ని పాపాల నుండి ఉదకాధిపతి, పాప వినాశకుడు అయిన వరుణుడు మమ్మల్ని విముక్తులను చేయుగాక!" అని స్నానకాలంలో పై మంత్రం జపించదగిందిగా చెప్పబడింది.

ఇదే విధంగా జ్ఞాన ప్రతిబంధకాలైన బ్రహ్మహత్యవంటి పాపాల నివృత్తికోసం జపించదగిన త్రిసువర్ణమంత్రాలు చెప్పబడ్డాయి. అందులో బ్రహ్మహత్యా రూపమైన పాపం తొలగింపబడడానికి జపించదగిన మంత్రం "**బ్రహ్మమే తు మామ్**" అనే మంత్రం. అందులో త్రిసువర్ణ మంత్రం యొక్క మహత్తు బ్రాహ్మణ గ్రంథరూపంగా చూపబడుతోంది.

త్రిసుపర్ణమయాచితం బ్రాహ్మణాయ దద్యాత్|బ్రహ్మహత్యాం వా ఏతేఘ్నన్తి|యే బ్రాహ్మణా స్త్రి సుపర్ణం పఠన్తి ఓమ్|

భాష్యప్రతీక: **ఉక్తస్య త్రిసుపర్ణస్య మన్త్రస్య మాహాత్మ్యం బ్రాహ్మణ రూపేణ వాక్యేన దర్శయతి|**

త్రిసుపర్ణమంత్రం కాక మిగిలిన విద్యలు శిష్యుడు యాచించనిదే గురువు చెప్పకూడదు గాని ఈ త్రిసుపర్ణ మంత్రం మాత్రం శిష్యుడు "కోరనప్పటికీ" ఉపదేశించాలని శాస్త్రం శాసిస్తోంది. అలా ఉపదేశించబడిన త్రిసుపర్ణాఖ్య మంత్రాన్ని పఠించే బ్రాహ్మణులు సోమయాగాన్ని అనుష్ఠించిన ఫలాన్ని పొందుతారు. ఇంకా, వారు భోజన సమయంలో ఏ పంక్తిలో కూర్చుంటారో ఆ పంక్తిలో గల వందల, వేల పురుషులను పరిశుద్ధులుగా చేస్తారు. ఈ త్రిసుపర్ణ మంత్రానికి ప్రణవ ప్రతిపాద్యం అయిన పరమాత్మయే దేవత.

ఇంతటి మహిమ గల ఈ మంత్రాన్ని పఠించి తాను బ్రహ్మహత్యా పాపం పోగొట్టుకోవడమే గాక ఇతరులను కూడా పునీతులను చేస్తున్నారని ఈ మంత్ర మహిమ వర్ణించబడింది.

"**బ్రహ్మ మేధయా**" వంటి మంత్రాలతో కూడిన త్రిసుపర్ణ మంత్ర జపం భ్రూణహత్యారూపం అయిన పాపాన్ని పోగొట్టగలదని-

య ఇదం త్రిసుపర్ణమయాచితం బ్రాహ్మణాయ దద్యాత్| భ్రూణహత్యాం వా ఏతేఘ్నన్తి| యే బ్రాహ్మణాస్త్రిసుపర్ణం పఠన్తి| తే సోమం ప్రాప్నువన్తి| ఆసహస్రాత్పంక్తిం పునన్తి| ఓమ్ (తై.ఉ.)

"బ్రహ్మమేధాయ" వంటి త్రిసుపర్ణమంత్ర జపంవలన భ్రూణహత్యారూప పాపం పోగొట్టబడుతుందని చెప్పబడింది. బ్రాహ్మణగర్భాన్ని గాని, రాజగర్భాన్ని గాని హత్య చేయడం భ్రూణహత్య అని చెప్పబడుతుంది.

"య ఇదం త్రిసుపర్ణమయాచితం బ్రాహ్మణాయ దద్యాత్ వీరహత్యాం వా ఏతేఘ్నన్తి| యే బ్రాహ్మణాః త్రిసుపర్ణం పఠన్తి| తే సోమం ప్రాప్నువన్తి | ఆసహస్రాత్పంక్తిం పునన్తి ఓమ్|"

వేదశాస్త్ర తదునుష్ఠానపరః బ్రాహ్మణః వీరః అభిషిక్తో రాజావా వీరః"|| (సా.భా.)

వేదశాస్త్ర అనుష్ఠాన పరుడైన బ్రాహ్మణుడనే వీరుని, అభిషిక్తుడైన రాజు అనే వీరుని హత్య చేసినందువల్ల సంభవించే పాపం పేరు వీరహత్యాపాపం. ఈ పాపాన్ని **"బ్రహ్మమేధవా, మధుమేధవా"** వంటి మంత్రాలతో కూడిన తృతీయ సుపర్ణమంత్ర జపం పోగొట్టగలదని క్రింది శ్రుతి చెప్తోంది.

పంచ మహాపాతకాల్లో ఒకటైన బ్రహ్మహత్య ప్రబలమైన మహాపాతకం. భ్రూణహత్య దీనికంటే ప్రబలమైన మహాపాతకం. వీరహత్య దీనికంటే ప్రబలమైన మహాపాతకం. ఇలాంటి మహాపాతకాలను కూడా నివర్తింప చేయగలిగింది త్రిసుపర్ణమంత్ర జపం అనడం చేత వీటికంటే తక్కువ పాపాలైన సురాపానాది రూపం అయిన వాటిని నివర్తింపచేయడంలో సంశయం లేదు. ఇలాగే మరికొన్ని పాపాలను పరిహరించడానికి సాధకాలైన హోమమంత్రాలు కూడా నారాయణోపనిషత్తులో చెప్పబడ్డాయి.

"దేవకృత స్యైన సోఽవయజనమసి స్వాహా| మనుష్యకృత స్యైన సోఽవయజనమసి స్వాహా| పితృకృతస్యైన సోఽవయజనమసి స్వాహా|ఆత్మకృతస్యైన సోఽవయజనమసి స్వాహా| అన్యకృతస్యైన సోఽవయజనమసి స్వాహా| అస్మత్కృతస్యైన సోఽవయజనమసి స్వాహా | యద్దివా చనక్తం చైనశ్చకృత మస్యావయజనమసి స్వాహా| యత్స్వ పన్తశ్చ జాగ్రతశ్చైనశ్చకృమ తస్యావయజనమసి స్వాహా| యత్ సుషుప్తశ్చ జాగ్రత శ్చైనశ్చకృమ తస్యావయజనమసి స్వాహా| యద్విద్వాగ్ం సశ్చావిద్వాగ్ం సశ్చైనశ్చకృమ తస్యావయజనమసి స్వాహా| ఏన స ఏననోఽవయజనమసి స్వాహా|

ఈ పదకొండు మంత్రాల్లో హవిస్సును గ్రహించు దేవత ప్రతీయమానం కాకుండా, సర్వదేవతా ప్రధాన మవడంచేత అగ్నినే దేవతగా స్వీకరించి, ఆ అగ్నికి ఈ పదకొండు మంత్రాలతో ఆజ్యహోమం చేయాలని విధించబడింది.

"హే అగ్నే! దేవార్థం కృతం పాపం"- అంటే, దేవతోద్దేశ్యంగా చేయబడే కర్మల్లో సంభవించే అంగవైకల్యం అనే ఏ పాపం ఉందో దానికి నివారకుడవైనావు. లేదా **"దేవైః ద్యోతనశీలైః అస్మదిన్ద్రియైః కృతస్య"** అంటే మా యొక్క ఇంద్రియాలచేత చూడరానిదాన్ని చూడడం, వినరానిదాన్ని వినడం, తినకూడనిదాన్ని తినడం వంటి ఏ యే పాపాలు చేశామో వాటికి నివారకమైన వాడవు అయ్యావు.

అలాగే పితృకృతమైన పాపం - అంటే, పితృకార్యం చేయకపోవడం, చేసినా అందులో సంభవించిన లోపాల వలన వచ్చే పాపం; మనుష్యార్థమైన పాపం – అంటే అతిథులను ధిక్కరించడం, అన్నం పెట్టకపోవడం వంటి వాటివలన ఏ పాపం సంభవిస్తోందో ఆ పాపం; ఆత్మకృతమైన పాపం - అంటే స్వయంకృతమైన అగమ్య గమనాదులవల్ల (వెళ్లకూడని చోట్లకి వెళ్ళడం వంటి వాటివల్ల) ఏ పాపం సంభవిస్తుందో ఆ పాపం, **"అన్యకృతస్య"** తన భార్య వలన ఏ పాపం సంభవిస్తుందో ఆ పాపం; **"అస్మత్ కృతస్య"** - తన జ్ఞాతి వర్గంచే చేయబడిన పాపం; **"యత్ స్వపన్తశ్చ జాగ్రతశ్చ"**- స్వప్నావస్థలో చేయబడిన పాపం; **"యత్ సుషుప్తశ్చ జాగ్రతశ్చైనశ్చకృమ"**-సుషుప్త్యవస్థలో జాగ్రదవస్థలో సంభవించిన పాపం; **"యద్విద్వాగ్ం సశ్చాఽ విద్వాంగ్ం సశ్చ"**- జ్ఞానకృతమైన, అజ్ఞానకృతమైన ఉపపాతకాదులకంటే **"అధికం యదేనః మహాపాతకాది"** ఉపపాతకంకంటే అధికమైన మహాపాతకం, పాపాత్ముడైన పురుషునివలన

సంక్రమించిన పాపం, "**తత్సంసర్గీతు పఞ్చమః**" అను శాస్త్రసిద్ధమైన మహాపాతకం, ఇలా చెప్పబడిన అన్ని పాపాలకు, పాతకాలకు నివారణకు అయ్యావు.

ఇక్కడ పై మంత్రంలో జాగ్రత్ శబ్దం రెండు మంత్రాల్లో ప్రయోగించబడడంలో తాత్పర్యం భాష్యంలో "**జాగ్రదవస్థాయాం పాపబాహుళ్యస్య సమ్భావితత్వాత్ మంత్రద్వయే జాగ్రచ్ఛబ్ద ప్రయోగః ఇత్యుక్తమ్**" అని చెప్పబడడంతో జాగ్రదవస్థలో పాపబాహుళ్యం సంభవిస్తుందని, అందుచేత జాగ్రచ్ఛబ్దం రెండు సార్లు ప్రయోగింపబడిందని తెలుస్తోంది.

"**అచేతయన్నేవ హి సుషుప్త ఇత్యుచ్యతే**" అని శాబర భాష్యం. అచేతనంగా ఉండే అవస్థ సుషుప్త్యవస్థ. కనుక ఇందులో పాపం చేయడానికి అవకాశం లేనప్పటికీ "**కించిత్సూక్ష్మతరం పాపం ద్రష్టవ్యమ్**" అంటే, ఆ అవస్థలో కూడా సూక్ష్మంగా పాపం చేయడానికి అవకాశం ఉందని అర్థం.

యద్వోదేవాశ్చకృమ జిహ్వయా గురుమనసోవా ప్రయుతీ దేవహేడనం| ఆరావాయో నో అభిదుచ్ఛ నాయతే తస్మిన్తదేనో వసవో నిధేతన స్వాహా|

భాష్యం: "**హే వసవః– వాసయితారః|గురుగంభీర మనః యేషాం తే గురు మనసః**"

మా జీవనానికి కారణభూతులైన, గంభీర మనస్సు గల ఓ సమస్త దేవతలారా! మిమ్మల్ని ఉద్దేశించి ఈ దేవుడు గొప్ప, ఆ దేవుడు తక్కువ అనే భావాలతో మేం ఏ దేవహేడనమనే పాపాన్ని మా వాక్కులచేత చేశామో ఆ పాపాన్ని మీరు మీ గంభీరమైన మనస్సులోనే ఉంచండి. వాక్కుచేత పైకి ప్రకటించండి. మేము చేసిన దేవహేడనం కూడా అసంఖ్యాకమైనది. అటువంటి మా అపరాధాన్ని మన్నించి, సహించండి! అని ప్రార్థన.

ఇందులో **గురుమనసః** అనే ప్రయోగాన్ని **అగురుమనసః** అని పదవిచ్ఛేదనం చేసి ప్రార్థించని వారికి విశేషణంగా కూడా చెప్పవచ్చు. "**అగురుమనసః వయం**" జగత్ పూజ్యులైన దేవతలపట్ల భక్తి లేనివారమై దేవహేడన రూపమైన ఏ పాపం చేశామో ఆ పాపాన్ని సహించండి అని ప్రార్థన.

"**హే వాయో!** - సప్తగణాత్మకమైన వాయుదేవతలారా! **నః- అస్మత్ సంబంధి-** మాకు సంబంధించిన "**అభిదుచ్ఛనాయతే దుష్టశునవత్ ఆచరతి**" ఓ అగ్నిదేవా! దుష్టశునకం వలె అపవిత్రమైన, మరణ నిర్వర్తకమైన పాపాన్ని పోగొట్టడానికి నీకు ఈ ఆజ్యాన్ని హోమం చేస్తున్నాను. ఈ అంతరార్థంవల్ల వివిధ పాపాలు ప్రతిపాదించబడ్డాయి. ఆ పాపాలకు పరిహారం ఈ మంత్రాలచే అగ్నిని ఉద్దేశించి ఆజ్యహోమం చేయడం ద్వారా నివారించవచ్చని చెప్పబడింది. ఇటువంటి మంత్రాలు నారాయణోపనిషత్తులో అనేకం ఉన్నాయి. అదే విధంగా మరో మంత్రంతో తిలహోమం చేస్తే కొన్ని పాపాలు హరింపబడతాయని చెప్పబడింది.

తిలాః కృష్ణస్తిలా శ్వేతాః తిలాస్సోమ్యావశానుగాః| తిలాః పునన్తు మే పాపం యత్కించ్చిద్దురితం మయి స్వాహా|

హే పరమాత్మా! ఈ రెండు రకాల నల్ల నువ్వులు, తెల్ల నువ్వులు అచేతనాలు అయినప్పటికీ నీ ఆజ్ఞ వలన వీటికి పాపనాశన సామర్థ్యం లభించి మాకు రోగాది ఉపద్రవ నిర్ముక్తాలు అవుతున్నాయి. కనుక నీ ఆజ్ఞతో నా తాలూకు పాపాన్ని దూరం చేసి నన్ను పునీతునిగా చేయుగాక అని నీ కోసం హోమం చేస్తున్నాను.

"చోరస్యాన్నం నవశ్రాద్ధం బ్రహ్మహా గురుతల్పగః|"

"గోస్తే యగ్ం సురాపానం భ్రూణహత్యా తిలా శ్శాంతిగ్ం శమయన్తు స్వాహా|"

ఓ పరమాత్మా! ఏకోద్దిష్టాది (తనకోసం మాత్రమే వండుకున్న) పాపాల్ని నీ ఆజ్ఞచేత తిలలు వినాశం చేయుగాక! అని హోమం చేయవలసి ఉంది. ఈ ప్రకారం మహాపాతక, ఉపపాతకాది అనేకమైన పాపాలు ఉన్నట్లు, వాటికి పరిహారంగా కొన్నిటికి ఆజ్యహోమాదులు కొన్నిటికి తిలహోమాదులు చేసుకోవలసిందిగా నారాయణోపనిషత్తు చెప్పడంచేత కేవలం స్మృతులందే కాక, వాటికి మూలభూతమైన శ్రుతులందు కూడా ఈ విషయాలు చెప్పబడ్డాయని నిరూపించడానికి సూచనా మాత్రంగా కొన్నిటిని మాత్రం వివరించడం జరిగింది.

పాపభేదముల ఫలభేద నిరూపణ

పాప భేదాలను అనుసరించి ఫల భేదాలు కూడా ఉంటాయి కదా! ఆ వివరాలు చెప్పబడుతున్నాయి.

బ్రహ్మహత్యాది మహాపాతకాలు కలవారు దారుణమైన, కేవలం దుఃఖనిలయాలైన అతి భయంకరములైన నరకాలను అనుభవిస్తారని చెప్పబడింది. అదే విధంగా వేదాల్లో తై.ఆ. మొదటి ప్రశ్నలో-

పృచ్ఛామిత్వా పాపకృతః| యత్ర యాతయతే యమః| త్వం నస్త ద్బ్రహ్మన్ ప్రబ్రూహి యదివేత్థాసతో గృహాన్|

"ఓ బ్రహ్మవేత్తా! పాపాత్ములను యమధర్మరాజు ఎక్కడ యాతన పెడుతున్నాడో, పాపాత్ములయొక్క ఆ స్థానం తెలిస్తే మాకు వివరించుము" అనే పై శ్రుతి ప్రశ్నార్థమును ప్రతిపాదిస్తోంది. దానికి సమాధానం ఇలా ఉంది. **కశ్యపాదుదితాస్సూర్యాః| పాపాన్నిర్ఘ్నన్తి సర్వదా| రోదస్యోరన్తర్దేశేషు| తత్రన్యస్యన్తేవా సవైః|**

ఎల్లప్పుడూ మహామేరువును విడువకుండా నివసించే సూర్యుడు కశ్యపుడు. అతడి నుంచి ఉత్పన్నమైనవారు ఆరోగుడు అనే పేరు గల సూర్యుడు వంటి సూర్యులు, ఇంకా వేల సంఖ్యలో ఉన్న ఇతర సూర్యులూనూ. **"రోదస్యోరన్తర్దేశేషు"**- మిన్నూమన్నూ మధ్య ఉన్న రౌరవాది నరకాల్లో పాపాత్ములైన ప్రాణులను సర్వకాలములందు తాడన చేస్తున్నారు. అలా తాడన చేయబడిన పాపాత్ములు మళ్ళీ మళ్ళీ సూర్యకిరణాలచేత బాధింపబడుతూ, ఆ నరక ప్రదేశాల్లోనే ఉంచబడుతున్నారు. వారి ఉనికిని శ్రుతి ఈ విధంగా వివరిస్తోంది.

తేఽశరీరాః ప్రపద్యన్తే యథాఽపుణ్యస్య కర్మణః| అపాణ్య పాదకేశాసః| తత్ర తేఽయోనిజా జనాః|

ఆ పాపాత్ములు వారి వారి కర్మలను అనుసరించి వికలాంగులుగా జన్మిస్తున్నారు. అంటే ఒక్కొక్క పాపి ఒక్కొక్క విధంగా చేతులు లేనివాడు గాను, పాదాలు లేనివాడు గాను, తలపై కేశాలు లేనివాడు గాను జన్మిస్తున్నారు. ఇంకొంతమంది అయోనిజనికులుగా అంటే, స్వేదజములుగా (చెమటనుంచి పుట్టే నల్లులు మొదలైనవిగా) కొంతమంది చెట్లు, మొక్కలు, పొదలుగా జన్మిస్తున్నారు. ఇదే విషయం వాజసనేయ శాఖలో పంచాగ్ని విద్యలో దక్షిణోత్తర మార్గాల గుండా వెళ్ళే యోగ్యత లేని పాపాత్ముల జన్మ ఈ విధంగా వర్ణించబడింది.

ఆదాయ ఏ తౌ పంథానౌ న విదుస్తే తాః పతంగాః| యదిదం దందశూకమ్|

ఛందోగులు అంటే, సామవేద శాఖలో **"తానీమాని క్షుద్రణ్యసకృదావర్తిని భూతాని భవన్తి"** అని చెప్పబడింది. అంటే, ఏ ప్రాణులు ఏ ఏ కర్మలచేత, ఉపాసనా విశేషాలచేత దక్షిణోత్తర మార్గాల్లో పరలోకం చేరే ఉపాయం తెలియక, పాప కర్మలనే ఆచరిస్తారో వారు క్షుద్రమైన కీటకాది జన్మలను పొందుతారు" అని

బోధిస్తోంది. అధర్మ ఫలమైన నరకాదులు కూడా అనేకం ఉన్నాయిట. అదే విధంగా "**అరుణమ్**" అనే ప్రశ్నలో-

దక్షిణ పూర్వస్యామ్ దిశి విపాశర్పీ నరకః – తస్మాన్నః పరిపాహి| దక్షిణాపరస్యాం దాశ్యవిశర్పీనరకః– తస్మాన్నః పరిపాహి| ఉత్తరపూర్వస్యాం దిశి విషాదీ నరకః – తస్మాన్నః పరిపాహి| ఉత్తరాపరస్యాం దిశ్యవిషాదీ నరకః – తస్మాన్నః పరిపాహి|

వేదనాతిశయంతో ప్రాణులు అటూ ఇటూ పరుగెడుతూ ఉండే నరకం అగ్నేయ దిక్కులోని విసర్పనామ నరకం నుండి, దుఃఖం అధికమవడంచేత అటూ ఇటూ పరుగెత్తడానికి కూడా అవకాశంలేని నైఋతి దిక్కులోని అవిసర్పనామ నరకం నుండి, ఇంత పాపం ఎందుకు చేశామో! అని ఆ కష్టాలు అనుభవించడానికి కూడా శక్యంగాని ఈశాన్యదిక్కులోని విషాదీనామ నరకం నుండి, దుఃఖం అనుభవించడానికి కూడా శక్యం కాని వాయవ్యదిక్కులోని అవిషాదీ నరకం నుండి, ఈ నాలుగు నరకాలనుండి, ఓ ఇష్టకా స్వరూపమైన అగ్నే! రక్షించుము! అని పై మంత్రాల్లో ప్రతిపాదించబడింది. కనుక పాపాల్లో తారతమ్యాన్ని బట్టి అనుభవించదగిన వివిధ నరకాలున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

ఇంతవరకు పాపాలు ఎన్ని రకాలో, వాటి ఫల రూపాలైన నరకాలెన్ని రూపాలో, వాటి తారతమ్యంతో ఏ యే జన్మలు తటస్థిస్తాయో వివరించబడింది. పాపాలు వ్యక్తిగతాలైనవి, కుటుంబానికి సంబంధించినవి, సమాజానికి, దేశారిష్టానికి కారణాలు అయ్యేవి ఉన్నాయని చెప్పబడింది. సమాజకృత పాపాల్లో కూడా సమాజంలోని వ్యక్తులు పైన వివరించిన ప్రకారం ఆ యా పాప ఫలాలను అనుభవించడం జరుగుతుంది. దేశ,నగర,గ్రామ నాయకులుగా ఉన్నవారు తాము అధర్మం ఆచరించి, వారి వారి ప్రజలచేత కూడా అధర్మం ఆచరింప చేసినపుడు ఆ అధర్మం వల్ల దేశారిష్టాలు, ఉత్పాతాలు సంభవిస్తాయని శ్రీమద్రామాయణంలోని **"అధర్మాత్తు మహోత్పాతో భవిష్యతి హి సాంప్రతమ్"** అనే వచనం చెప్తోంది.

ఉదాహరణకు లంకాధిపతి రావణుడు సీతాపహరణం అనే అధర్మం స్వయంగా తాను ఆచరించి, అక్కడి రాక్షసులచేత కూడా ఆచరింప చేశాడు. ఫలితంగా లంకాదహనం వంటి అనేక దుష్ఫలితాలను ఆ నగరం చూడాల్సి వచ్చింది.

ఇంతవరకు వైయక్తికమైన అధర్మానికి జన్మాంతరంలో నరక ప్రాప్తి ఉంటుందని, అది అనుభవించిన తర్వాత భూలోకంలో జన్మించి, మళ్ళీ వ్యాధులు వంటి ఇతర ఫలాలను కూడా అనుభవించాల్సి ఉంటుందని, ఒక్కో ఫలం మాత్రమే కొంతమంది అనుభవిస్తారని వివరించడం జరిగింది. కొన్ని అధర్మాలవల్ల ఉత్పాతాలు సంభవిస్తాయని కూడా సూత్రప్రాయంగా చెప్పి ఉన్నందున ఇప్పుడు ఆ ఉత్పాతాలపై వివరణ ఇవ్వబడుతోంది.

ఉత్పాత వివేకము

ప్రకృతేః భూతవికృత ప్రాదుర్భావాంశ్చ ఉత్పాత ఇత్యాచాక్షతే| తేషామ్ ద్యౌరంతరిక్షం భూః ఏతాశ్చ ఆశ్రయః| పంచ మహాభూతాని యోనిః|

సత్త్వరజస్తమో గుణాత్మకమైన ప్రకృతినుండి పృథివ్యాపస్తేజో వాయ్వాకాశాలనే పంచభూతాల వికృతి రూపాలను ఉత్పాతాలు అని అభిజ్ఞులు చెప్తున్నారు. ఆ వికృతి అనే ఉత్పాతాలకు ఆశ్రయం భూమ్యన్తరిక్ష ఆకాశములని, పంచ మహాభూతాలు ఉత్పత్తి స్థానాలని పై శ్లోకం యొక్క అర్థం. ఈ విషయాన్నే గర్గ మహర్షి కూడా వివరించారు.

ప్రకృతే రణ్యథోత్పాతః సంక్షేపస్తావదీదృశః| త్రివిధస్సతు విజ్ఞేయః దివ్యనాభ సభూమిజః|

ఈ శ్లోకం కూడా పై భావాన్నే తెలియచేస్తోంది. ఉత్పాతకాలు మూడు రకాలు. దివ్యములు, అంతరిక్షజములు, భూమిజములు అని.

గ్రహనక్షత్రాదుల యొక్క వికృతి భావం దివ్యోత్పాతం.

కేతూదయోపరాగే చ ఛిద్రతా శని సూర్యయోః| గహర్క్ష వికృతిర్యత్ర తత్రాపి భయమాదిశేత్|(అ.పు.)

కేతూదయ కేతూపరాగాలు (తోకచుక్క పడడం, కేతుమూలక గ్రహణం), సూర్యచంద్రుల్లో ఛిద్రత (రంధ్రం సంభవించడం) వంటివి దివ్యోత్పాతాలు. అంటే ఈ రోజుల్లో ఓజోన్ పొర దెబ్బతినడం ద్వారా అల్ట్రా వైలెట్ కిరణాలు భూమిమీదకు రావడం అంటున్నారే, అటువంటిది అన్నమాట! తోకచుక్క పడడం, దిక్కుల్లో అకారణంగా అగ్నిజ్వాలలు సంభవించడం, ఆకాశంలో ఇంద్రధనుస్సు, గంధర్వనగరం వంటివి సృష్టించ బడడం, **"అతివృష్టిః దుర్భిక్షాయ భయం మతం"** అని దుర్భిక్షం కోసం అవుననే భయం తటస్థిస్తుంది.

అనృతౌ త్రిదినారబ్ధ వృష్టిర్ జ్ఞేయా భయాయహి| (అగ్ని పు.)

దుర్భిక్షకారణాలైన అతివృష్టి, అనావృష్టి సంభవించడం, అకాలంలో మూడు రోజులు సంతత వృష్టి, ఇవి 'అంతరిక్షోత్పాతాలు'. వర్షఋతువులో వర్షం పడకపోవడం కూడా ప్రజలకు భయకారకం.

అలాగే స్థావర జంగమాల్లో భూమి కంపించడం, ఏక దేశంలో భూమి కంపించడం, జలాశయాల్లో వికృతిభావం 'భౌమోత్పాతాలు'.

దేవార్చాశ్చ ప్రనృత్యన్తి కంపన్తే ప్రజ్వలన్తి చ|అరటన్తి చ రోదన్తి ప్రస్విద్యన్తే హసన్తి చ| అర్చ్యా వికారోపశమః అభ్యర్చ్య హుత్వా ప్రజాపతేః| అనగ్నిర్దీప్యతే యత్ర రాష్ట్రే చ భ్రంశనిస్వనమ్ (అగ్ని పు.)

దేవవిగ్రహాలు నాట్యం చేయడం, కంపించడం, మండడం, శబ్దం చేయడం, ఏడవడం, చెమట పట్టడం, నవ్వడం మొదలైన వికారాలు కనబడినట్లయితే ఆ దేవతను గురించి ప్రాజాపత్య హోమం చేయాలి. ఏ రాష్ట్రంలో ఘోరమైన శబ్దంతో అకారణంగా అగ్ని ప్రజ్వరిల్లుతుందో, ఆ రాష్ట్రం ఆ రాజుచే పీడించబడుతుంది.

న దీప్యతే చేంధనవాన్ తద్రాష్ట్రం పీడ్యతే నృపైః|

ఎక్కడ ఇంధనంతో కూడినప్పటికీ అగ్ని ప్రజ్వలించదో ఆ దేశం రాజుచే పీడించబడుతుంది. ఇది 'అగ్ని వైకృత్యము' అనే ఉత్పాతం.

అగ్నివైకృత్యశమనమ్ అగ్ని మంత్రైశ్చ భార్గవ| అకాలే ఫలితాః వృక్షాః క్షీరం రక్తం స్రవంతి చ| వృక్షోత్పాత ప్రశమనమ్ శివ పూజ్యం చ కారయేత్| (అగ్ని పు. 363)

పైన చెప్పిన అగ్ని తాలూకు వికృతి భారం. అగ్నిదేవతాక మంత్రం చేత హోమం చేయడం ఈ ఉత్పాతానికి శాంతి. వృక్షాలు అకాలంలో ఫలాలను ఇవ్వడం, సకాలంలో ఇవ్వకపోవడం, ఇచ్చినా పాలు, రక్తం కారడం జరిగినట్లయితే దాన్ని 'వృక్షజనిత భౌమోత్పాతం' అంటారు. దీనికి శాంతి శివపూజ.

నద్యోహ్రదః ప్రస్రవణాః నా విరసాశ్చ భవన్తి చ|సలిలాశయ వైకృత్యాజప్తవ్యో వారుణో మన్త్రః|

నదులూ, దిగుడు బావులూ మొదలైనవి ఎండిపోయినట్లయితే 'నద్యుత్పాతం' అంటారు. దీనికి శాంతి వారుణ మంత్ర జపం.

అకాల ప్రసవానార్యః కాలేయుగ్మా ప్రజాస్తథా| వికృత ప్రసవాశ్చైవ యుగ్మప్రసవనాదికమ్| స్త్రీణాం ప్రసవ వైకృత్యే స్త్రీ విప్రాది ప్రపూజయేత్| బడబాహస్తినీ గౌర్వాయది యుగ్మం ప్రపూజయేత్| వైజాత్యం వికృతం వాపి షడ్భిః మాసైః మ్రియేత వై| వికృతం వా ప్రసూయంతే పరచక్ర భయం భవేత్| హోమః ప్రసూతి వైకృత్యే జపో విప్రాది

పూజనమ్|యాని యాన్యప్రయుక్తాని యుక్తాని నవహన్తి చ| ఆకాశే తూర్యనాదాశ్చ మహద్భయముపస్థితమ్| ప్రవిశంతి యదా గ్రామమారణ్యామృగ పక్షిణః| అరణ్యం యాన్తి వా గ్రామ్యౌజలం యాన్తిస్థలోద్భవాః| స్థలం వా జల జాయాన్తి రాజద్వారా వివేశికాః| ప్రదోషే కుక్కుటో వాపీ శివాచార్యోదయో భవేత్| గృహం కపోతో క్రవ్యాద్యామూర్ధ్నీ వీయతే| మధురాం మక్షికాం కుర్యాత్ కాకో మైథునగో దృశి| ప్రాసాద తోరణోద్యాన ద్వార ప్రాకార వేశ్మనాం| అనిమిత్తం తు పతనం దృఢానామ్ రాజభృత్యకౌ| రజసావాధ ధూమేన దిశో యత్ర సమాకులాః| అగ్నిర్యత్ర న దీప్యేత స్రవంతే చోదకుంభకాః| మతిర్భయం శూన్యతాది రుత్పాతానాం ఫలం భవేత్| ద్విజదేవాది పూజాభ్యః శాంతిర్జపైస్తు హోమతః| (అగ్ని.పు.363)

స్త్రీలు అసమయంలో ప్రసవించినా, సమయానికి ప్రసవించకున్నా, లేక వికృతమైన శిశువులను లేదా కవల పిల్లల్ని కన్నట్లయితే అది ఒక ఉత్పాతం. దీనికి శాంతిగా పతివ్రతలైన స్త్రీలను, బ్రాహ్మణులను పూజించాలి. శ్రుతులను అనుసరించి స్త్రీలు గర్భధారణ చేసినది లగాయతు పదో నెలలో ప్రసవించడం ధర్మం అని, అలా ప్రసవించనట్లయితే ఒక ఉత్పాత కారణం. మరికొన్ని శ్రుతుల్లో గర్భం సంవత్సరానికి వృద్ధి పొందుతుందని ప్రతిపాదించబడింది. అగ్న్యాధాన ప్రకరణంలో-

సమిద్ధస్య బ్రాహ్మోదనికాగ్నేః చిరావస్థానం విధత్తే" ఇతి ప్రతీక (తై.బ్రా.1-1)

తగ్ం సంవత్సరం గోపాయేత్, సంవత్సరగ్ం హి రేతో వర్ధతే (తై.బ్రా.)

భాష్యం:-"**యస్మాల్లోకే గర్భాశయే స్థాపితం రేతః సంవత్సరం వర్ధతే తస్మాదరూపస్య గర్భస్య వృద్ధయే సంవత్సరమభిరక్షేత్"**

లోకంలో గర్భాశయంలో ఉంచబడిన రేతస్సు సంవత్సరానికి వృద్ధి పొందుతుంది. ఆ కారణం వల్ల అగ్ని రూపం అయిన గర్భం యొక్క వృద్ధికోసం ఒక సంవత్సరం అగ్ని ఉపశమించకుండా సమిధలు ఉంచడం ద్వారా రక్షించాలి.

యద్యేనగ్ం సంవత్సరేనో పనమేత్| సమిధః పునరాదధ్యాత్| రేతఏవ తద్ధితమ్ వర్ధమానమేతి|

సమిధలుంచి సంవత్సరకాలం బ్రాహ్మోదనికాగ్నిని రక్షిస్తే దాని ప్రభావంవల్ల గర్భాశయంలో ఉంచబడిన రేతస్సు సంవత్సరానికి వృద్ధి పొందగలదు. అంటే, సంవత్సరం పాటు జీవుడు గర్భంలో ఉండి పిమ్మట భూమిపై ప్రజా, పశు రూపంగా ప్రసవించునట్లుగా తెలుస్తోంది. మరి **"దశమే మాసి సూతవే"** అనే శ్రుతి పదవ మాసంలో ప్రసవం జరుగుతుందని చెప్తోంది కదా! సంవత్సరానికి గానీ గర్భాశయంలో ఉంచిన రేతస్సు వృద్ధి పొందదు అని తెలుస్తోంది. కానీ ఈ రెండు శ్రుతులు పరస్పర విరుద్ధాలుగా కనబడుతున్నాయి కదా! ఇదెలా సాధ్యం? దీనికి సమాధానం ఛాందోగ్య శ్రుతి ఇలా చెప్తోంది.

యో యోహ్యన్నమత్తి| (ఛాందోగ్యం 5-10-6)

జీవుడు ధాన్యరూపమైన అన్నంలో చేరి ఉంటాడు. ఆ అన్నం జీవుడి అదృష్టకర్మ వాసనా ప్రభావంవల్ల మనుష్యులచేత గాని, జంతువులచేత గాని తినబడుతుంది. జీవుడి వెంట చంద్రలోకంనుండి, ఆకాశవాయు ధూమ అభ్రమేఘ వర్షజలాలతోను కూడి ఆ యా రూపాలు పొందిన భూత, సూక్ష్మములు భూమిలో గల విత్తనాలతో కూడి, పరిణామం పొంది, జన్మించి, ధాన్య విశేషాలుగా మారి, అన్నరూపం పొందుతాయి. తర్వాత ఆ సూక్ష్మ రూపంలోని అన్నం రేతస్సును ధరించు సమర్థత గల ఏ పురుషుడిచే తినబడుతుందో, ఆ ప్రాణియే పంచాగ్ని విద్యలో నాలుగో అగ్నిగా నిరూపించబడింది. ఈ అన్నం ఏ పురుష శరీరి చేత తినబడుతుందో, ఆ ప్రాణి శరీరం యొక్క జాతికి, సంస్కారానికి తగిన అవయవాలు గల రూపానికి అనుగుణమైన రేతస్సుగా పరిణామం చెందుతుంది. పురుషునిలో కూడా జీవుడు గర్భరూపంలో

సూక్ష్మరూపమైన పాశంచేత బద్ధుడై, పితృశరీరంలోకి అన్నరూపంలో ప్రవేశించి, రేతోరూపంగా మారుతున్నాడు. తల్లివలే తండ్రి కూడా కొన్ని రోజులు జీవరూపాన్ని గర్భంలో ధరిస్తున్నాడు అని తెలుస్తోంది.

అన్నంద్వారా పురుష శరీరంలోకి ప్రవేశించిన జీవరూపమైన గర్భానికి ఆరంభంలో తండ్రియే తల్లిగా ఉంటాడు. కనుక జీవుడు కొన్నాళ్లు తండ్రి శరీరంలో, కొన్నాళ్లు తల్లి శరీరంలో గర్భరూపం పొందుతున్నాడు. పురుషుడు భక్షించిన అన్నం సుమారు మూడు నెలలకు పక్వత పొందిన రేతస్సుగా రూపొందుతుంది. అంటే రెండు నెలల ఇరవై రోజులకు రేతస్సు రూపొందుతుంది. ఇది నిరోధించ బడినప్పుడు ఓజస్సుగా మారుతుంది. పురుష ప్రాణిలో రేతస్సు పరిపక్వత పొందాక ఆ రేతస్సుని ధరించడానికి తగిన ప్రాణి అయిన స్త్రీ గర్భంలోకి ప్రవేశ పెట్టబడుతుంది.

అందుకే పంచాగ్ని విద్యలో ఆమె అయిదవ అగ్నిగా నిరూపించబడింది. నాలుగో అగ్నిగా నిరూపించబడిన పురుషుడిచేత విడువబడిన రేతస్సు స్త్రీ గర్భంలో నవమాసాలు జీవునిగా జీవింపబడి, శ్రుత్యంతరంచే విధించబడిన వైదిక కర్మలను తదధికార సంపత్తు కలవారు అనుష్ఠించగా వాటి సామర్థ్య విశేషంచేత ఆ జీవుడు సర్వావయవ సంపత్తితో ప్రసవించబడుతున్నాడు.

దీనినిబట్టి తల్లి గర్భంలో నవమాసాలు ధారణచేసి పదవ మాసంలో ప్రసవిస్తుంది. కనుక "**దశమే మాసి సూతవే**" అను శ్రుతికి, తండ్రి భక్షించిన అన్నం స్త్రీ యోనిలో ఉంచగల రేతస్సుగా మారడానికి మూడు మాసాలు పడుతుంది కనుక **"సంత్సరగ్ం హి రేతో హితం వర్ధతే"** అను శ్రుతికి విరోధం లేదని తెలుసుకోవచ్చును.

సాధారణంగా మనుష్యులు ఒక్కొక్క గర్భం నుండి ఒక్కొక్క శిశువును కనడం సంప్రదాయం. గుర్రం కాని, ఏనుగు కాని, గోవు కాని యుగ్మమును (జంట శిశువులను) కన్నా, వికృతమైన, విజాతీయ సంతానాన్ని కన్ననూ, గర్భస్థ శిశువు ఆరు మాసాల్లోపు మరణించినా ఆ రాజుకు శత్రురాజుల భయం తటస్థిస్తుంది. దీనికి ప్రతీకారంగా జపం, హోమం, బ్రాహ్మణపూజ చేయాలి. ఈ ప్రపంచంలో గుర్రం మొదలైనవి సంతాన యుగ్మాన్ని కనడం కూడా ఉత్పాత లక్షణమని చెప్పబడినందువల్ల ఎవరెవరు ఎంతమందిని సంత్సరానికి కనవలెనో కూడా చెప్పబడిందా అని శంక కలుగుతుందని ఇక్కడ శ్రుత్యర్థం వివరించబడుతోంది.

గ్రహాస్ వా అనుప్రజాః పశవః ప్రజాయన్తే ఉపాగ్ శ్వన్తర్యామా వజావయ శ్శుక్రామంథినౌ పురుషా ఋతు గ్రహానేక శఫా ఆదిత్యగ్రహం గావ ఆదిత్యగ్రహో భూఇష్ఠా భూయిష్ఠాభిర్ ఋగ్భిర్గృహ్యతే తస్మాద్గావః పశూనాం భూయిష్ఠాః| (తై.సం .6-5-10)

"అగ్నిష్టోమేన వై ప్రజాపతిః ప్రజా అసృజత" అను శ్రుతి యజ్ఞాన్ని ఆధారంగా చేసుకుని ప్రజాపతి ప్రజలను సృష్టించెనని చెప్తోంది. ఇది సామాన్య విషయం. యజ్ఞంలో ఏ యే భాగాలను అనుష్ఠానం చేయడంచే ఏ యే సృష్టి జరుగుతోంది? అనేది విశేషం. అదే, పైన చెప్పబడిన "**గ్రహాస్ వా**" అను అనువాకంలో వివరింపబడింది. ఇందులో గ్రహాలనగా సోమరస పాత్రలు. అవి "**గృహ్ణాతీతి గ్రహః**" అను వ్యుత్పత్తి నాశ్రయించి సోమరసాన్ని గ్రహిస్తున్నాయి కనుక ఇటువంటి దారుమయమైన పాత్రలతో గ్రహిస్తారు. ఆ విధమైన గ్రహగ్రహణ సామర్థ్యంచే **"ప్రజాః పశవః ప్రజాయన్తే"** అను శ్రుతి ప్రజాపశ్వాదులు ఉత్పన్నమవు తున్నాయని సృష్టి వైలక్షణ్యం జరుగుతున్నట్లు చెప్తూ గ్రహాలను ప్రశంసిస్తోంది.

వేద భాష్య అవతారిక: "**గ్రహహోమే పరిసమాప్తే సతి గ్రహాస్ ప్రశంసతి**" అని ఇంతకుముందు గ్రహహోమ విషయం పరిసమాప్తి చేయబడగా ఇప్పుడు **"గ్రహాస్ వై"** అను వాక్యం గ్రహాలను ప్రశంసిస్తోంది. ఉపాగ్ంశు

గ్రహమని, అంతర్యామ గ్రహమని రెండు గ్రహపాత్రల యొక్క పేర్లు. ఉపాగ్‌ంశు పాత్ర, అంతర్యామ పాత్ర అను గ్రహాలచే సోమరసాన్ని గ్రహించడంవల్ల మేకలు, గొర్రెలు ఉత్పన్న మవుతున్నాయి.

"**శుక్రామన్థినౌ పురుషాః**" శుక్రమన్థి గ్రహాల సామర్థ్యంచే పురుషులు అనగా మనుష్యులు సృజింప బడుతున్నారని అర్థం.

"**ఋతుగ్రహానేక శఫాః**" ఋతుగ్రహాల సామర్థ్యంచే గుర్రాలు సృజింప బడుతున్నాయి. ఇందులో గుర్రానికి ఒక కాన్పులో గాని, ఒకే సంత్సరంలో గాని అధిక సంతానం చెప్పబడలేదు.

"**ఆదిత్యగ్రహం గావః**" ఆదిత్యగ్రహ సామర్థ్యంచే గోవులు సృజించబడుతున్నాయి. "**ఆదిత్యాగ్రహో భూయిష్టాభిర్ ఋగ్భిర్గృహ్యతే తస్మాద్గావః పశూనాం భూయిష్ఠాః**" అని, "**కదాచనస్తరీరాసి ఇత్యాది ఋచః భూయిష్ఠాః బహవః వర్తన్తే**" అని చెప్పబడినట్లు బహు మంత్రాలచే ఆదిత్య గ్రహం గ్రహింపబడడం వల్ల పశువుల్లో గోవులు గొప్పవి అని అర్థం. ఇక్కడ మంత్రాలకు, గోవులకు "**భూయిష్ఠ**" శబ్ద సామ్యం మాత్రమే తప్ప తదర్థ సామ్యం కాదు. గోవులు ఏ ప్రకారంగా అన్ని పశువుల్లో గొప్పవో మున్ముందు '**గో మహిమ**' అనే శీర్షికలో వివరింపబడుతుంది. "**యత్రిరుపాగ్‌ం శుగ్‌ం హస్తేన విగృహ్ణాతి తస్మాద్ద్వౌత్రీనాజ జనయతి**" (తై. సం.) ఉపాగ్‌ం గ్రహాన్ననుసరించి ఉత్పన్నమైన మేకలను త్రిత్వసామ్యాన్ని చూపిస్తోంది.

ద్వౌ వా, త్రీస్ వా, న తు త్రిభ్యః అధికం అపత్యం సా హి జనయతి|

అనగా మేక ఒక పర్యాయం ఒక గర్భం నుంచి రెండు మూడు పిల్లల్ని ఒకే కాన్పులో కంటుంది. "**న తు త్రిభ్యః అధికం**" అంటే మూడింటికంటే అధికమును మాత్రం కనదట! (సాధారణంగా). దీనికి కారణం ఉపాగ్‌ంశు పాత్రను అధ్వర్యుడు మూడు సార్లు అంజలితో గ్రహించడమే.

శ్రౌతసూత్రం – **అథ ప్రతి ప్రస్థాతా ఉపాగ్‌ంశు పాత్రం ధారయన్ ఉపాత్తానాముపరి ద్వావగ్‌ంశూ అన్తర్దధాతి|**
తస్మిన్నభిషు తమధ్వర్యు రంజలినా గృహ్ణాతి వాచస్పతయే పవస్వ| (ఆ. శ్రౌ. సూ.)

ఈ ప్రకారం అధ్వర్యుడు మూడు సార్లు అంజలితో ఉపాగ్‌ంశు పాత్రను గ్రహించడం వల్ల, దీని సామర్థ్యంచే మేక సంతాన త్రయాన్ని ఒకే కాన్పులో కంటోందిట.

అజావయో భూయసీః|

ఉపాగ్‌ంశు పాత్రను గ్రహించినప్పుడు "**త్రిరుపాగ్‌ంశుం**" అను శ్రుతి సంఖ్యా సంకోచం చెప్పినట్లుగా, అంతర్యామ పాత్రను గ్రహించినపుడు సంకోచ సంఖ్యా విశేషం చెప్పనందున అంతర్యామ పాత్ర గ్రహణ విశేషంచే (అవి గొర్రెలు) ఒకే పర్యాయం మూడుకంటే మించి అనేక సంతానాన్ని కంటుందిట. ఈ వేదంలో ఈ అనువాకంలో ఇంతే విశేషాలు చెప్పి ఉండవచ్చును కానీ ఇతర వేదాల్లో మరికొన్ని విశేషాలు ఉండవచ్చును. కావున, పురాణములు వేదమూలకాలు కావున వాటిని అననుసరించి అజావయామిలకు బహు సంతానోత్పత్తి చెప్పబడినట్లు గుర్రము, ఏనుగు, గోవులకు చెప్పబడలేదు. కావున ఈ పశువులు బహుసంతానాన్ని కంటే అది ఒక ఉత్పాతంగా, ఉత్పాత సూచకంగా చెప్పబడింది. అయోగ్యమైన పశువులను బండి కట్టడం, యోగ్యమైన పశువులు బండి లాగక పోవడం, ఆకాశంలో తూర్య వాదములు (సన్నాయి మొదలైన వాద్యాల ధ్వనులు) వినబడడం మహా భయజనకములు, మరియు వన్య పశువులు వన్య పక్షులు గ్రామంలో ప్రవేశించడం, గ్రామ్య పశువులు అరణ్యంలోకి వెళ్లిపోవడం ఇవన్నీ ఉత్పాతాలన్నారు. పశుత్వేన పక్షిత్వేన అన్నీ ఒకటే అని చెప్పడానికి వీలుపడదు. వేదంలో "**సప్త గ్రామ్యాః పశవః సప్తారణ్యాః**" అని గ్రామ్య పశువులు వేరు గాను, అరణ్య పశువులు వేరు గాను, అలాగే పక్షులు కూడా భిన్న భిన్నములుగా అశ్వమేధ ప్రకరణంలో చెప్పబడ్డాయి. అందుచేత వాటి వాటి స్థానాన్ని అతిక్రమించడం

కూడా ఒక ఉత్పాతమే అన్నారు. అలాగే భూమిపై సంచరించే పురుగులు జలంలో ప్రవేశించడం, జలంలో సంచరించే పురుగులు భూమిపై సంచరించడం ఒక ఉత్పాతమన్నారు.

రాజద్వార సమీపానికి నక్కలు రావడం, ప్రదోష కాలంలో కోళ్ళు కూయడం, సూర్యోదయ కాలంలో నక్కలు అరవడం, పావురాలు ఇంటిలో ప్రవేశించడం, మాంసభక్షక పక్షులు తలపై తిరగడం, సామాన్యపు ఈగ తేనెటీగ వలె తేనెను సమకూర్చడం, దృఢమైన ప్రాసాదములు, తోరణాలు, ఉద్యానవనాలు, ద్వారాలు, ప్రాకారాలు, భవనాలు **"అకారణంగా"** నేలపై జరగడం ఒక ఉత్పాతం. కాబట్టి రాజమరణ కారణమని చెప్పబడింది. పరాగం గాని, ధూమం కాని పది దిక్కులా నిండిపోయినా ఇదో ఉత్పాతం. జనులకు అరిష్ట సూచకం.

తస్మాద్గర్ధభే పురాయుషః ప్రమీతే బిభ్యతి| (తై.సం.5-1)

అగ్నిచయన ప్రకరణంలో ఇష్టకా నిర్మాణం కోసం మృత్తికను గాడిదచే మోయిస్తారు. ఆ సందర్భంలో గార్దభం అశ్వం కంటే నికృష్టమైనదైనా భారాన్ని మోయడంలో అతిశయమైనదని **"తస్మాద్గర్ధభః పశూనాం భారభారి తమః"** అను శ్రుతి చెప్పింది. ఇంతే కాదు జంతుశాస్త్రం ప్రకారం గార్దభ పరిపూర్ణ ఆయుస్సును పొందునని **"తస్మాద్గర్ధభస్సర్వ మాయురేతి"** అని శ్రుతి చెప్పినందున పూర్ణ ఆయుస్సు కంటే గార్దభం ముందుగా మృతి చెందితే ఏదో ఉత్పాతం రాబోతోందని ప్రజాసముదాయం భయపడగలదని **"తస్మాద్గర్ధభే పురాయషః ప్రమీతే భిభ్యతి"** అను శ్రుతి చెప్తోంది.

ఈ ప్రకారంగా అగ్ని వికృతి, వృక్షోత్పాతము మొదలు పరాగధూమ పర్యంతం చెప్పబడినవన్నీ భౌమోత్పాతములని తెలుస్తోంది. ఈ ప్రకారంగా మూడు విధములైన ఉత్పాతాలు వివరించబడ్డాయి. ఇందులో కొన్ని ఉత్పాతాలకు ఫలములు ప్రతీకారములు కూడా చెప్పబడ్డాయి.

ఉత్పాతాలు ఎందుకు వస్తున్నాయి?

ఈ ఉత్పాతాలన్నీ మనచే ఆచరించబడిన అధర్మం వల్ల సృష్టించబడి లోకంలో ప్రాణులకు హానికరమైన అశుభ ఫలాలను ఇస్తున్నాయని ఆయుర్వేద శాస్త్రంలో 'చరకసంహిత' అనే గ్రంథంలో ఈ విధంగా చెప్పబడ్డాయి.

తమువాచ భగవానాత్రేయః - మనుష్యాణాం యే అన్యే భావాస్సామాన్యాః తద్వైగుణ్యాత్తే కాలాః సమాన లింగాశ్చ వ్యాధయః అభినిర్వర్తమానాః జనపదముద్ధ్వంసయన్తి|

మున్నగు గ్రంథమంతా '**రాజనీతి ప్రకరణం**' శీర్షికలో వివరించబడినందున మరల ఇక్కడ వివరించడం లేదు. ఛాందోగ్యంలో కూడా వాయ్వభ్రాది వికృతులను అనుసరించి వర్షవికృతు లేర్పడతాయని, వాటికి వర్షానికి సంబంధముందని పంచాగ్ని విద్యలో ఇలా చెప్పబడింది.

పర్జన్యోవాత గౌతమాగ్నిః తస్యవాయురేవ సమిత్| అభ్రం ధూమో విద్యుదర్చిః అశని రంగారాః ప్రహాదనయో విస్ఫులింగాః| (ఛాం.ఉ.)

ఇక్కడ పర్జన్యుని అగ్నిగాను, ఆ అగ్నికి వాయువును సమిధగాను, ధూమాన్ని మేఘంగాను, జ్వాలను విద్యుత్ మెరుపుగాను, అంగారములను (నిప్పు రవ్వలను) పిడుగుగాను, విస్ఫులింగాన్ని గర్జితశబ్దం (ఉరుము) ఉపాసించాలని చెప్తోంది. ఆనందగిరి టీకలో ఇలా వివరించబడింది.

యజ్ఞధూమోధ్భవంత్వభ్రం ప్రజానాం చ హితం సదా|దావాగ్నిధూమ సంభూతం అభ్రం వనహితం స్మృతమ్| మృతధూమోధ్భవం త్వభ్రం అశుభాయ భవిష్యతి|అభిచారాగ్నిధూమోత్థం భూతనాశాయ వై ద్విజాః| (ఉ.భా.)

ఇక్కడ ఏ ధూమంవల్ల ఏర్పడిన మేఘాలు ఎటువంటి వర్షాన్ని కురిపిస్తాయో వివరింపబడింది. ఓ ద్విజులారా! యజ్ఞధూమం వల్ల ఏర్పడిన మేఘాలు ప్రజలకు అన్నపానాదులకు కావలసిన వర్షాల నివ్వడం ద్వారా హితవుని కలిగిస్తాయి. దావాగ్నివల్ల ఏర్పడిన మేఘాలు వనాలకు మాత్రమే ఉపయోగిస్తాయి. శ్మశానాగ్ని ధూమంవల్ల ఏర్పడిన మేఘం అశుభ ఫలాలనిస్తుంది. అభిచారాగ్ని అనగా శత్రుమారణోపాయ హోమంవల్ల ఏర్పడిన మేఘాలు సర్వప్రాణి నాశనాన్ని చేస్తాయి. ఈ విధంగా భిన్న భిన్నములైన మేఘాలకు భిన్నభిన్నములైన ధూమాలను కారణంగా నిరూపించారు. అవాంతర భేదంతో కూడిన వాయుగణాలు వివిధములుగా ఉన్నట్లుగా తైత్తరీయారణ్య లోకంలో చెప్పబడింది.

వరాహవస్వతపసః| విద్యున్మహసో ధూపయః| శ్వాపయో గృహమేధాశ్చేత్యేతే|యే చేమేఽశిమి విద్విషః|
(తై.ఆ.)

భాష్యం:- **అత్ర వరాహవ ఇత్యారభ్య గృహామేధా ఇత్యన్తైః షడ్భిః పదైః పర్జన్య ప్రవర్తకాః వాయువిశేషాః ఉచ్యన్తే| తేషాం గణరూపత్వాత్ ఏకైక గణస్థాన్ బహువివక్షిత్వా వరాహవ ఇత్యాది బహువచన నిర్దేశః|**

ఇక్కడ 'వరాహవ' పదము మొదలు గృహామేధా పదం వరకు గల ఆరు పదాలచే పర్జన్య ప్రవర్తకులైన వాయు విశేషాలు చెప్పబడుతున్నాయి. ఆ వాయువులు గణములుగా ఉండడంవల్ల అంతర్గతంగా అనేక వాయువులను వివక్ష చేసి వరాహవ ఇత్యాది బహువచనంతో సూచించారు. ఆ ఆరు ఇలా ఉన్నాయి.

1. **వరాహవః** – శ్రేష్ఠమైన వర్ష విశేషాలను ఆహ్వానించేవి
2. **స్వతపసః**– అగ్న్యాదిత్యుల యొక్క అపేక్ష లేకుండా స్వయంగా తపించేవి
3. **విద్యున్మహసో**- విద్యుత్తుతో సమానమైన తేజస్సు గలవి
4. **ధూపయః** - గుగ్గిలము మొదలుగా గల ద్రవ్యాంతరముల యొక్క అపేక్ష లేకుండా స్వశరీరగతమైన గంధ విశేషం చేతనే సర్వ పదార్థాలను గంధములు కలవానిగా చేస్తున్నవి
5. **శ్వాపయః** - సామాన్య వాయువులకంటే అతి శీఘ్రంగా దేశాన్ని కబళింపచేసేలా వ్యాపించేవి
6. **గృహమేధాశ్చ**- గృహములందు సర్వ వస్తువులను పవిత్రంగా చేసేవి

ఇవి కాకుండా -

అశిమవిద్విషః- కృష్యాదులకు విఘాతాన్ని కలిగించనివి. అనగా కృష్యాద్యనుకూలమైన ప్రవృత్తి కలిగినవి (వ్యవసాయానికి నష్టం చేయకుండా ఉండేవి) అని వాయువులు భిన్నభిన్నములుగా ఉన్నాయి.

ఈ పై విధంగా వాయుభేదాలే కాక పర్జన్య భేదాలు కూడా చెప్పబడ్డాయి.

పర్జన్యాస్సప్తపృథివీమభివర్షన్తి| వృష్టిభిరితి| ఏతయైవ విభక్తి విపరీతాః| (తై. ఆ.)

అను ఆరణ్యక శ్రుతిచే ఏడుగురు పర్జన్యులున్నట్లు వీరందరు భూమియందు అధః ప్రసారాలుగాను, ద్యులోకంలో ఊర్ధ్వ ప్రసారంగాను వర్షిస్తారని ప్రతిపాదించబడింది.

ఇంతవరకు ధూమ,మేఘ,వర్ష,వాయు,పర్జన్య భేధాలు మున్నగునవి ఉన్నాయని **'శ్రుతి'**యందు నిరూపింపబడినవే **'చరక సంహిత'**లో వాయ్వాదులు వికృత రూపాన్ని దాల్చి గ్రామ నగరాదులను ధ్వంసం చేస్తాయని చెప్పబడింది. వీటికన్నిటికీ కారణం అధర్మమని చెప్పబడింది. ఉత్పాతోత్పత్తికి కారణం అధర్మమని **"మత్స్య పురాణం"**, **"విష్ణుధర్మోత్తరం"** లలో కూడా చెప్పబడింది.

"పురుషాపచారాన్నియతమ పరజ్యన్తి దేవతాః| తతోఽపరాగాద్దేవానా ముపసర్గః ప్రవర్తతే|"
అతిలోభాదసత్యాద్యానాస్తి క్యాద్యాహ్య ధర్మతః|నరాపచారాన్నియతమపస్పృజ్యన్తి దేవతాః (గర్గ.సం)

అతిలౌభ్యం (లోభిత్వం) వలన, పురాణ ధర్మశాస్త్రాలు అసత్యాలనే భ్రాంతి వలన, నాస్తిక బుద్ధివలన, ధర్మాఽనాచరణ (ధర్మాన్ని ఆచరించకపోవడం) అధర్మాచారణ (అధర్మాన్ని ఆచరించడం) వంటి అపచారాలను నరులు చేయడం వల్లనే దేవతలు మనయందు అనుగ్రహం లేనివారై ఉత్పాతాలను సృజిస్తున్నారని స్పష్టంగా ప్రతిపాదించడం వలన అధర్మాచరణమే ఉత్పాతాలు రావడానికి కారణమని తెలుస్తోంది.

ఇంతవరకు అధర్మంవల్ల గ్రామ, నగర, జనపద ధ్వంస అను ఉత్పాతాలు వాయువు, జలం, ఓషధులు మున్నగువాటి యొక్క వికృతి భావంచే ఏర్పడతాయని చెప్పబడింది. కాని వీటి ద్వారా సంహారం చేసేవారు రుద్రమూర్తులని రుద్రునికి హింసకత్వం స్వభావమని శ్రుతి ప్రమాణంగా వివరింపబడుతోంది.

10వ ప్రకరణం సమాప్తం

11వ ప్రకరణం

శ్రీరుద్ర మహిమ

"ఏకో దేవో అప్యతిష్ఠత్" అనే శ్రుతిని అనుసరించి, ఒక్కడే దేవుడు. కానీ దుష్టశిక్షణ చేసేవాడు రుద్రుడు, శిష్టరక్షణ చేసేవాడు శివుడు. ఈ వ్యాపార భేదంచేత ఘోరశరీరం ఉపాధిగా కలవాడు రుద్రుడు, శివశరీరం ఉపాధిగా కలవాడు శివుడు అని ఈ శ్రుతి చెప్తోంది.

రుద్రో వా ఏష యదగ్ని స్త స్యైతే తనువౌ ఘోరాన్యాశివా న్యా|

దీని ప్రకారం శరీర భేదంచేత వేర్వేరు పేర్లతో పిలవబడుతున్నాడు శివుడు.

సమేధయతి యన్నిత్యం సర్వార్థాస్ సర్వకర్మసు| శివమిచ్ఛన్మనుష్యాణాం తస్మాద్దేవశ్చి వస్మృతః|

అని **"భారతం"** లో వేదవ్యాసులు అన్నారు. అంటే నిత్యం మనచే అనుష్ఠింపబడే సర్వకర్మలందు దేవుడు మనుష్యులకు మంగళం కలిగించాలని నిర్ణయించినవాడై, సర్వపురుషార్థాలను వృద్ధి పొందించి, శివశబ్ద వాచ్యుడై శివుడు అని మనచే పిలవబడుతున్నాడు అని అర్థం.

"రుద్రో వై క్రూరో దేవానాం- మిత్రో వై శివో దేవానాం" అనే శ్రుతి రుద్రుడు క్రూరస్వభావం కలవాడని, శివుడు మిత్రస్వభావం కలవాడని వారిలోని స్వభావ భేదాన్ని వర్ణిస్తోంది. ఇంకా రుద్రశబ్దానికి "భట్టభాస్కర భాష్యం"లో అనేక అర్థాలు చెప్పబడ్డాయి.

రోదయతి సర్వమన్తకాల ఇతి రుద్రః|

సర్వప్రాణిజాతాన్ని అంతకాలంలో రోదింపచేసేవాడు కనుక రుద్రుడు.

రుత్యా వేదరూపయా ధర్మాదీస్ అవలోకయతి ప్రాపయతీతి వా రుద్రః|

వేదం చేత మనకు ధర్మములు తెలియచేయువాడు రుద్రుడు.

రుత్యా వాగ్రూపయా వాచ్యం ప్రతిపాదయతీతి రుద్రః|

వేదవేద్యుడయిన పరమాత్మను వేదవాఙ్మయంచే ప్రతిపాదింపచేస్తున్నాడు కనుక రుద్రుడు.

రుత్యా ప్రణవ రూపయా స్వాత్మానం ప్రాపయతీతి రుద్రః|

ఓమ్ అని ప్రణవం ఉపాసించేవారికి ప్రణవ ప్రతిపాద్యమైన పరమాత్మను సాక్షాత్కరింప చేసినందున రుద్రుడు.

"రోధికా బంధికా మోహికా వా శక్తిః తద్వాస్ రుద్రః"

"భక్తేభ్యః మోహికాయాః తస్యాః ద్రావయితా, నాశయితా వా రుద్రః"

భక్తుల మోహాన్ని నశింపచేయువాడు కనుక రుద్రుడని, ఇలా వివిధ వ్యుత్పత్తి భేదాలచే రుద్రశబ్దార్థం వివరించబడింది.

రుదం సంసార దుఃఖం ద్రావయతీతి రుద్రః| అశుభద్రావకో రుద్రః| యజ్జహార పునర్భవమ్|

తస్మాత్ శివః తతో రుద్రశబ్దేనాభిధీయతే|

ఈశ్వరుని ఉపాసించేవారికి సమస్త అమంగళాలను నశింపచేసి, జనన మరణప్రవాహ రూపమయిన సంసార దుఃఖమును నశింపచేసి, శివుడే రుద్రశబ్దానికి అధిపతి అవుతున్నాడని అర్థం.

"రుతం శబ్దం వేదాత్మానం బ్రహ్మణే దదాతి కల్పాదౌ ఇతి రుద్రః"

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై"

పరమశివుడు జగత్స్రష్ట అయిన బ్రహ్మను సృజించి, ఆ బ్రహ్మకోసం వేదాలను యథాపూర్వంగా సృజించాలని కోరి ఉండడంచేత రుద్ర శబ్దం కలిగి ఉన్నాడని, ఆ బ్రహ్మ రుద్రుడు ఇచ్చిన వేదాలను ఆధారంగా చేసుకుని యథాపూర్వకంగా సృజించినట్లు **"ధాతా యథా పూర్వమకల్పయత్"** అనే శ్రుతి చెబుతోంది. ఈ ప్రకారం వివిధ వ్యుత్పత్తి విశేషాలచే రుద్ర శబ్దార్థాన్ని వివరించారు.

కాని, పైన చెప్పిన వివిధ వ్యుత్పత్తి విశేషాలచే ప్రతిపాదించబడిన వివిధ అవస్థలలో పరమేశ్వరుడు రుద్రశబ్దంచే సంబోధించబడి, ప్రార్థించబడడానికి అర్హుడు అనడమే తప్ప; ప్రకృతము, ఉత్పాతములకు **"రుద్రోవై క్రూరః"** అని శక్తిపంచక నిరూపణ ప్రసంగంలో **'సూతసంహిత'**లో చెప్పబడింది. హింసకత్వ స్వభావం కలవాడు కనకనే తై.సం. 4-5-1 లోని రుద్ర నామకమ్ ఆయనను ఇలా స్తుతిస్తోంది.

ఓమ్ నమస్తే రుద్ర మన్యవ ఉతోత ఇషవే నమః| నమస్తే అస్తు ధన్వనే బాహుభ్యాముతతే నమః|

అనే మంత్రంతో రుద్రుని సంబోధించి, అతడి హింసావ్యాపారానికి సంబంధించిన క్రోధానికి మూలమైన ధనుర్బాణాదులకు, వాటిని ధరించిన బాహువులకు హస్తములకు నమస్కరించి రుద్రుని ప్రసన్నుని చేసుకున్నట్లు ఈ క్రింది భాష్యం చెబుతోంది.

అనేన మంత్రేణ దేవస్య ఘోరా తనూః జగదుపసంహార ప్రవృత్తౌ ప్రసాధ్యతే|

జగదుపసంహారం కోసం ప్రవృత్తమైన ఘోరరూపం ఈ మంత్రంతో ప్రసన్నం చేయబడుతుందని అర్థం.

యాత ఇషుశ్శివతమా శివం బభూవతే ధనుః| శివా శరవ్యాయాతవ తయా నో రుద్రమృడయ|

"హే రుద్ర తే త్వదీయా, యే యమిషుః శివతమా శాంతతమా బభూవ| తథా తే త్వదీయం యద్ధనుః శివం శాంతం బభూవ. తథా యా చ తవ శరవ్యా తవ ఇషుధిః తయా శాంతయా, ఇష్వా, తేన చ శాంతేన ధనుషా, తయా చ శాంతయా శరవ్యయా నః, అస్మాన్ మృడయ సుఖయ" (భాష్యం)

అదే విధంగా ఈ భాష్యంలో చెప్పబడినట్లు ఈ మంత్రంచేత, "ఓ రుద్రుడా! అని సంబోధించి, "నీకు సంబంధించిన ధనుర్బాణాలను, వాటిని ధరించిన అమ్ములపొది వంటి వాటిని శాంతపరచి, వాటితో మమ్మల్ని హింసించక, ఎల్లప్పుడూ సుఖపెట్టుము" అని రుద్రుని ప్రార్థించాలి.

యా తే రుద్ర శివా తనూ రఘోరా పాపకాశినీ| తయాన స్తనువా శంతమయా గిరిశంతాభిచాకశీహి|

ఓ రుద్రుడా! నీ శరీరం, మాయందు అనుగ్రహం చూపేది. కనుకనే హింసించేది కాదు. పాప రూపమైనది, ఇష్టము కానిదానిని ప్రకాశింపచేసేది కాదు. కైలాసంలో ఉండి ఎల్లప్పుడూ ప్రాణులకు సుఖాన్ని విస్తరింప చేస్తున్న ఓ రుద్రుడా! అత్యంత సుఖాన్ని కలుగచేసే నీ శరీరంచేత, నన్ను లక్ష్యంగా పెట్టుకుని, ప్రకాశయుక్తుని చేయుము. అనగా సుఖవంతునిగా చేయుము.

యామిషుం గిరిశంత హస్తే బిభర్ష్య స్తవే| శివాం గిరిత్రతాం కురు| మాహిగ్ంసీః పురుషం జగత్|

కైలాసవాసి అయిన పరమేశ్వరుడా! కైలాసాఖ్య పర్వతాన్ని పరిపాలించే ఓ రుద్రుడా! శత్రువులను హింసించడం కోసం నీ చేతిలో ధరించిన ఆ బాణాన్ని మా విషయంలో మంగళప్రదమైనదానిగా, శాంతమైనదానిగా చేయుము. మేము ఉండే స్థావర జంగమాత్మకమైన ఈ జగత్తును హింసించకుము.

శివేన వచసా త్వా గిరిశాచ్ఛావదామసి| యథానస్సర్వమిజ్జగద యక్ష్మగ్ం సుమనా అసత్|

కైలాసవాసి అయిన ఓ రుద్రుడా! సమస్త మనుష్య పశ్వాది రూపమైన జగత్తు రోగరహితమైనది గాను, సౌమనస్యోపేతముగాను అవడానికి నీ అనుగ్రహం కొరకు నిన్ను ప్రార్థించడానికి మంగళప్రదమైన ఈ మంత్రరూపమైన వాక్కుతో స్తుతిస్తున్నాను.

అధ్యవోచదధి వక్తా ప్రథమో దైవ్యోభిషక్| అహీగ్ శ్చ సర్వాస్ జమ్భయస్ సర్వాశ్చ యాతు ధాన్యః|

సమస్త దేవతల సన్నిధిలో నన్ను గురించి "ఇతడు నా భక్తుడు" అని నువ్వు చెప్పిన వెంటనే నాకు సర్వాధిపత్యం లభిస్తుంది. అట్టి ఓ రుద్రుడా! నన్ను ఆ ప్రకారం సర్వాధికునిగా చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను. నీవు సర్వదేవతలలో ముఖ్యుడవు. సర్వదేవతలను పాలించుటకు అర్హత కలవాడవు. ధ్యానమాత్రంచేత సర్వరోగాలను హరించగలవాడవు. అంటే, ఈ లోకంలో వైద్యుడు ధాతువైషమ్యంవలన ఏర్పడిన రోగాలను పోగొట్టగలడు. **"ప్రథమో దైవ్యోభిషక్"**-ఆ రోగాలకు కారణమైన పాపాలను నశింపచేసే దేవసంబంధమైన మొదటి వైద్యుడవు నీవు! కనుక మమ్మల్ని బాధించే సర్ప వ్యాఘ్రాదులను, రాక్షస జాతులను నశింప చేస్తూ మమ్మల్ని అనుగ్రహించుము.

అసౌ యస్తామ్రో అరుణ ఉత బభ్రుస్సుమంగలః|యే చేమాగ్ం రుద్రా అభితోదిక్షు శ్రితాస్సహస్ర శోవైషాగ్ం హేడ ఈమహే|

మనచే చూడబడుతూ ఆదిత్యరూపంగా ఉదయిస్తున్న రుద్రుడు, ఉదయ కాలంలో అత్యంత రక్త వర్ణంతోనూ, ఉదయానంతరం కొంచెం రక్త వర్ణంతోనూ, పిమ్మట పింగల వర్ణంతోనూ ఆయా కాలాలను బట్టి అనేక రంగులతో కూడి ఉన్నాడు. మా అంధకారాన్ని పోగొట్టి అత్యంత మంగళ స్వరూపుడిగా ఉన్న ఆ ఆదిత్యరూప రుద్రుడు ఇంకా కిరణరూపంలో భూమిని, దిక్కులను ఆశ్రయించుకుని ఉన్న ఇతర రుద్రులు, వేల సంఖ్యలో ఉన్న ఆదిత్య, తద్రశ్మి రూపంలో ఉన్న సమస్త రుద్రులయొక్క క్రోధ సమానమైన తీక్షణత్వాన్ని భక్తి నమస్కారాది పరిచర్యలతో నివారించుకుంటున్నాము.

అసౌ యో వసర్పతి నీలగ్రీవో విలోహితః ఉతైనం గోపా అదృశన్నదృశన్నుదహార్యః| ఉతైనం విశ్వా భూతాని సదృష్టో మృడయాతినః|

కాలకూట విషం ధరించడంవల్ల కంఠం నీలవర్ణంగాను, మిగిలిన శరీరం విశేషంగా లోహితవర్ణంగాను కలిగినవాడుగా ఉన్న రుద్రుడు, మనచే ఆదిత్యునిగా చూడబడుతున్నాడు. వేదశాస్త్ర జ్ఞానంలేని పామరులైన గోపాలకులు, సూర్యాస్తమయంలో కుండలతో నీరు పట్టి తెచ్చుకోవడం కోసం ఆరాటపడే మహిళలు, ఈ ప్రకారం ఒక్కరేమిటి-సమస్త ప్రాణులు దర్శనం చేసుకోవడం కోసం ఉదయాస్తమయాల మధ్య చలిస్తూ ఉండే ఆ రుద్రుడు మాచే చూడబడినవాడై, మమ్మల్ని సుఖవంతులను చేయగోరతాము.

నమో అస్తు నీలగ్రీవాయ సహస్రాక్షాయ మీఢుషే| అథో యే అస్య సత్వానోఽహం తేభ్యోఽకరం నమః|

కాలకూట ధారణ చేత నీలగ్రీవుడు గాను, ఇంద్రుడిని ధరించడంచేత సహస్రాక్షుడుగాను, పర్జన్యమూర్తి ధారణచేత వర్షసేక్తగాను వ్యవహరించబడుతున్న రుద్రునికి, అతని భృత్యులందరికీ నమస్కారం చేస్తున్నాను.

ప్రముంచ ధన్వనస్త్వముభయో రార్త్నియోర్జ్యామ్| యాశ్చ తే హస్త ఇషవః పరాతా భగవో వప|

ఓ రుద్రుడా!నీ ధనుస్సు రెండు అంచులమధ్య గల నారిని మా మీదకు ఎక్కుపెట్టక, క్రిందకి వంచుము. నీ చేతిలోని బాణములను విడిచిపెట్టుము.

అవతత్య ధనుస్త్వగ్ం సహస్రాక్ష శతేషుధే| నిశీర్య శల్యానాం ముఖాశివోనస్సుమనా భవ|

వేయి కన్నులు కలిగి, నూరు అమ్ముల పొదులు కలిగిన ఓ రుద్రుడా! నీ ధనుస్సుయొక్క నారిని క్రిందికి వంచి, బాణముల అగ్రభాగాలను కూడా అంబులపొదిలోనికి వంచి, మా పట్ల అనుగ్రహం కలిగిన వాడివై, ఉగ్ర స్వరూపాన్ని విడచి, శాంతమూర్తివి కావాలని కోరుతున్నాము.

విజ్యం ధనుః కపర్దినో విశల్యో బాణవాగ్ం ఉత| అనేశన్నస్యేషవ ఆభురస్య నిషంగధిః|

జటాజూటం ధరించిన రుద్రుని ధనుస్సు వంచబడిన నారి కలది అవడంవల్ల నారి లేనిది గాను, బాణాలను అమ్ములపొదిలో ఉంచడంద్వారా పైకి బాణాలతో శూన్యమైనదిగాను అవుగాక! కనుక నీ బాణాలు మమ్మల్ని బాధించడంలో అసమర్థములు కావాలని, నీ ఖడ్గకోశము (కత్తి ఒర) కేవలం ఖడ్గాలను ధరించడానికే ఉపయోగపడాలి కాని, ప్రయోగించడానికి ఉపయోగపడరాదు అని ప్రార్థిస్తున్నాను.

యాతే హేతిర్మీఢుష్టమ హస్తే బభూవ తే ధనుః| తయాస్మాన్ విశ్వతస్త్వమయక్ష్మయా పరిభ్భుజ|

మా కోర్కెలను ఎరిగినట్టి ఓ రుద్రుడా! నీచే ధరించబడిన ఆయుధాలచేత ఉపద్రవాలు కలుగచేయక, మమ్మల్ని సర్వదా పాలించుము.

నమస్తే అస్త్వాయుధా యానాతతాయ ధృష్ణవే| ఉభాభ్యాముతతే నమో బాహుభ్యాం తవ ధన్వనే|

పాపాత్ములను బాధించడానికి సమర్థములైన ధనుర్బాణాలను ధరించిన నీ బాహువులకు నమస్కరిస్తున్నాను.

పరితే ధన్వనో హేతిరస్మాన్ వృణక్తు విశ్వతః| అథో య ఇషుధిస్తవారే అస్మన్నిధే హితమ్|

ఓ రుద్రుడా! నీ ధనుస్సుయొక్క విధ్వంసాత్మక స్వభావం మమ్మల్ని విడచి పెట్టుగాక! నీ అంబుల పొది మాకు చాలా దూరములో ఉండు గాక!

రుద్రుడు మనను బాధించకుండా ఉండాలని ఇలాంటి అనేక ప్రార్థనారూప మంత్రాలతో ప్రార్థించడం జరుగుతుంది. లోకంలో కోపోద్రిక్తుడైనవాడు ఏ పని చేయడానికైనా సిద్ధపడతాడు. రుద్రుడు సాధారణంగా ధనుర్బాణాలతో సిద్ధంగా ఉంటాడు. కానీ అటువంటి రుద్రునిచే మనకు ఏ అపకారమూ జరగకుండా అనేక విధాలుగా వేడుకున్న విధంగా, ఆ ఆయుధాలను మనపై ప్రయోగించకుండా దూరంగా ఉంచి, మనను అనుగ్రహించమని కోరడం అవసరం కనుక అనేక మంత్రాలతో ప్రార్థించాలని గ్రహించాలి.

పిమ్మట **"నమో హిరణ్యబాహవే"** మొదలగు ఎనిమిది అనువాకములచేత చరచరాత్మకమైన జగత్తు అంతా ఈశ్వర స్వరూపమని వర్ణించి, పదో అనువాకంలో ఇలా చెప్పబడుతోంది.

ద్రాపే అంధసస్పతే దరిద్రన్నీల లోహిత| ఏషాం పురుషాణామేషాం పశూనాం మాభేర్మారో మో ఏషాం కించ నామమత్|

కంఠంలో కాలకూట ధారణంచేత నీలవర్ణం గాను, ఇతర శరీరం లోహిత వర్ణంగాను గల ఓ రుద్రుడా! పాపులను నీచమైన నరకం పొందించడం ద్వారా క్లేశ పెట్టేటువంటి ఓ రుద్రుడా! భక్తులకు అన్నం ప్రసాదించి పాలించేటటువంటి, ద్వితీయవస్తు శూన్యంగా (ఒక్కడవుగా) ఉన్న నువ్వు మమ్మల్ని

రక్షించు. లోకంలో ఏమీ లేనివాడిని దరిద్రుడు అంటారు కదా! అదే రీతిలో రెండో వస్తువు లేక ఈశ్వరుడు అద్వితీయుడిగా ఉండడం చేత **'దరిద్రిస్'** అనే శబ్దంతో వేదం సంబోధిస్తుంది.

ఏషాం పురుషాణాం - అస్మదీయానాం పుత్ర పౌత్రాణాం, ఏషాం పశూనాం- అస్మదీయానాం గో మహిష్యాదీనాం చ| (భాష్యం)

మా పుత్ర పౌత్రాదులను, మా తాలూకు గో మహిషాది పశువులను ఎటువంటి అరిష్టాలను కలుగచేసి భయపెట్టవద్దని ప్రార్థన. ఇట్లు చెప్పబడిన పురుష పశ్వాదులకు జ్వరాది వ్యాధులు కలుగకుండా అనుగ్రహించమని ప్రార్థన.

యాతే రుద్ర శివా తనుశ్శివా విశ్వాహ భేషజీ| శివా రుద్రస్య భేషజీ తయానో మృడ జీవసే|

ఓ రుద్రుడా! వ్యాధులకు ఔషధం వలె, నీ శరీరం అన్ని కాలాలలోనూ సకలలోక దరిద్రాదులకు వినాశ హేతువు అయింది. మాకు జనన మరణాలు అనే దుఃఖం లేకుండడానికి, నీతో తాదాత్మ్యం చెందడానికి అవసరమైన ఔషధం వంటి ఆ శరీరం చేత మమ్మల్ని సుఖంగా జీవింపచేయమని ప్రార్థన.

ఇమాగ్ం రుద్రాయ తవసే కపర్దినే క్షయద్వీరాయ ప్రభరామహే మతిమ్| యథానశ్శమసద్ద్విపదే చతుష్పదే విశ్వం పుష్టం గ్రామే అస్మిన్ననాతురమ్|

మాచే కోరబడిన దానిని సమకూర్చుటకు తగిన బలం కలిగిన తాపస వేషధారి, మాకు శత్రువు అయిన పాపాన్ని క్షీణింపచేసే సామర్థ్యం కలిగిన రుద్రుని ఇలా ప్రార్థిస్తున్నాము. మా మనుష్య గణానికి, పశు గణానికి సుఖం కలిగించే విధంగాను, మా గ్రామం (అంటే- సర్వ ప్రపంచము, సర్వ ప్రాణికోటి కూడా) సకల బలములతో కూడుకునే విధంగా, రోగాది ఉపద్రవాలు లేకుండా ఉండేటట్లుగా అనుగ్రహించాల్సిందిగా మా బుద్ధిని ఈశ్వరునియందు లగ్నం అయ్యేటట్లు చేస్తున్నాము.

మృడానో రుద్రోతనో మయస్కృధి క్షయద్వీరాయ నమసా విధేమతే| యచ్ఛం చ యోశ్చ మనురాయజేపితా తదశ్యామ తవ రుద్ర ప్రణీతౌ|

ఓ రుద్రుడా! మాకు ఈ లోకంలోనూ పరలోకంలోనూ కూడా సుఖమును కలుగచేయుము. మా పాపం అనే శత్రువును క్షీణింపచేసే సామర్థ్యం గల నీకు నమస్కారం అనే పరిచర్య చేస్తున్నాము. నమస్కారం కంటే గొప్ప పరిచర్య లేదని మరొక ప్రకరణంలో **"నమస్కృత్యహి వసీయాగ్ం సముపచరన్తి"** అని శ్రుతి చెబుతోంది. పాలకుడయిన ప్రజాపతి ఏ సుఖాన్ని, దుఃఖాఽభావమును (అంటే దుఃఖం లేని స్థితిని) పొందుతాడో ఆ ఫలాన్ని, నీతో అతిశయమైన స్నేహాన్ని కూడా మేము పొందగలం కనుక ఆ విధంగా అనుగ్రహించమని ప్రార్థన.

మానో మహాన్త ముతమానో అర్భకం, మాన ఉక్షన్తముతమాన ఉక్షితమ్| మానోవధీః పితరం మోతమాతరం ప్రియామానస్తనువో రుద్ర రీరిషః|

ఓ రుద్రుడా! మాకు సంబంధించిన ఏ వృద్ధుని కాని, బాలుని కాని, యువకుని కాని, గర్భస్థ శిశువుని కాని హింసించకు. నా తల్లిదండ్రులను కాని, మా బంధుమిత్రాదులను కాని ఇంకెవ్వరినీ హింసించకు.

మానస్తోకేతనయే మాన ఆయుషి మానో గోషు మానో అశ్వేషు రీరిషః| వీరాన్మానో రుద్రభామితో వధీర్ హవిష్మన్తో నమసా విధేమతే|

మా సంతానమునకు సంబంధించి అందులోనూ విశేషంగా మా పుత్రునికి సంబంధించిన, మాకు సంబంధించిన ఆయుస్సును హింసించవద్దు. మా గోవులు, అశ్వాలు, ఇతర పశువులను, మా భృత్యులను క్రోధంతో రౌద్రాకారం దాల్చిన వాడివై హింసించకు. మేము రిక్తహస్తాలతో కాక, నీకు హవిస్సు ఇవ్వదలచిన వారమై నమస్కారములతో పరిచర్యలు చేస్తున్నాము.

ఆరాత్తేగోఘ్న ఉతపూరుషఘ్నే క్షయద్వీరాయ సుమ్నమస్మే తే అస్తు| రక్షాచ నో అధిచ దేవ బ్రూహ్యథాచన శ్శర్మ యచ్ఛ ద్విబర్ హాః|

ఆవులను ఇతర పశువులను పుత్రపౌత్రాదులను హింసించగలిగినటువంటి నీ ఘోర స్వరూపాన్ని మాకు దూరంగా ఉంచుము. అనగా మా విషయంలో ఆ స్వరూపాన్ని చూపించకుము. మా పాపాలను క్షీణింపచేయ సామర్థ్యం గల నమస్కారం నీకు చేస్తున్నాము. నీయొక్క సుఖకర స్వరూపాన్ని మాయందు ఉంచు గాక! మమ్మల్ని సర్వదా రక్షించుము. మమ్మల్ని పుణ్యలోకంలో ఇతరుల కంటే అధికంగా ప్రస్తావించుము.

అథాచనశ్శర్మ యచ్ఛ ద్విబర్ హాః|

ఇహ,పరలోకాలు రెండింటిలో మమ్మల్ని పొందింపచేసే నీవు అతిశయాలైన సుఖాలనిమ్మని ప్రార్థన.

స్తుహి శ్రుతం గర్తసదం యువానం మృగం న భీమముపహత్నుముగ్రమ్| మృడా జరిత్రే రుద్రస్తవానో అన్యంతే అస్మన్నివపన్తు సేనాః|

ప్రసిద్ధమైన హృదయ పుండరీకమందు ఉన్నటువంటి, నిత్య యువకుడవైనటువంటి, ఏనుగువంటి మృగాన్ని చీల్చేందుకు భయంకర రూపం దాల్చిన సింహం వలె జగత్తును సంహరించడానికి ఉగ్రరూపం ధరించిన రుద్రుని నా ఈ మంత్రరూపమైన వాక్కు స్తుతించు గాక!

ఓ రుద్రుడా! ఈ ప్రకారం మాచే స్తుతించబడుతున్న నీవు ప్రతి దినమూ క్షీణించే స్వభావం గల మా శరీరానికి సుఖము కలుగ చేయుము. నీ సేనలు మిమ్మల్ని విడిచి పెట్టి, శత్రువులయందు ప్రవేశించి, నశింపచేయు గాక! అని ప్రార్థన.

పరిణోరుద్రస్య హేతిర్వృణక్తు పరిత్వేషస్య దుర్మతిరఘాయోః| అవస్థిరా మఘవద్భ్యస్తనుష్వ మీఢ్వస్తోకాయ తనయాయ మృడయ|

భక్తుల కోరికలను వర్షింపచేయు సామర్థ్యం గల, భక్తుల విషయంలో అత్యంత శాంత స్వభావం గల ఓ రుద్రుడా! మా పట్ల మంగళప్రదమైన, సౌమనస్యముతో కూడిన, స్నేహాతి శయంతో కూడిన వాడవుగా ఉండుము. రావి, మర్రి వృక్షములందు నీ త్రిశూలాన్ని మాకు కనబడకుండా ఉంచి, పులిచర్మం ధరించిన వాడివై, బాణరహితమైన ధనుస్సును మాత్రం అలంకారం కోసం చేతిలో ధరించి, మమ్మల్ని అనుగ్రహించడం కోసం మా వద్దకు వచ్చు గాక! అని ప్రార్థన.

వికిరిదవిలోహిత నమస్తే అస్తు భగవః| యాస్తే సహస్రగ్ం హేతయోన్య మస్మన్నివపన్తు తాః|

విలోహిత రుద్రుని ఉపాసకులు రక్తవర్ణం లేని వానినిగా పంచాక్షర ధ్యానంలోను, విశేషంగా లోహిత వర్ణం, అనగా రక్తవర్ణం గలవానినిగా అష్టాక్షర ధ్యానంలోను ఉపాసించునట్లుగా రెండు స్మృతి వచనాలు ఉన్నాయి. కనుక అలాంటి వర్ణాలు గల షడ్గుణైశ్వర్య సంపన్నుడయిన ఓ భగవంతుడా! నీవద్ద గల సహస్ర సంఖ్యలోని ఆయుధాలు మా శత్రువును హింసించు గాక! ఇందులో **'కిరి'** శబ్దం

ధనవాచకం కనుక భక్తులకోసం విశేషంగా ధనమును ప్రసాదించేటటువంటి, అనే అర్థంలో వాడి, రుద్రుని సంపన్నుడిగా భావించడం జరిగింది.

సహస్రాణి సహస్రధా బాహువో స్తవ హేతయః| తాసామీశానో భగవః పరాచీనా ముఖాకృధి|

ఓ రుద్రుడా! నీ చేతులలో ధనుస్సు, ఖడ్గం, త్రిశూలం వంటి పేర్లు గల అనంత సంఖ్యాకమైన ఏ ఆయుధాలు ఉన్నాయా వాటి అన్నిటికీ అధిపతిగా భగవత్ శబ్ద వాచ్యుడవుగా ఉన్న నీవు, ఆయుధాలయొక్క అగ్రభాగాలను వెనక్కి తిరుగువాటిగా చేయి! అని అనేక విధాలుగా ప్రార్థించి, అతడు ఘోర(రుద్ర) శరీరాన్ని విడచి, శివశరీరంతో మనని అనుగ్రహించే విధంగా ప్రార్థించడమే ఈ అనువాకములలో చెప్పబడింది.

సహస్రాణి సహస్రశో యే రుద్రా అధిభూమ్యామ్| తేషాగ్ం సహస్ర యోజనేఽవ ధన్వాని తన్మసి|

అత్ర సాయణ భాష్యం:

1.భూమ్యాం- భూమేరుపరి యే రుద్రాః సహస్రశః సహస్ర ప్రకారాః సహస్రాణి, సహస్ర సంఖ్యాకాస్సన్తి, తేషాం సర్వేషాం, ధన్వాని ధనూంషి, సహస్ర యోజనే అస్మత్తః సహస్ర యోజన వ్యవహిత దేశే, అవతన్మసి అవతత జ్యాని స్థాపయామః ఇతి |

2. అస్మిన్ దృశ్యమానే మహత్యర్ణవే మహా సముద్ర సదృశే ప్రౌఢే అన్తరిక్షే అధిశ్రిత్య వర్తమానాః భవాః రుద్రమూర్తి విశేషాః|

3. నీలగ్రీవాః ఏకస్మిన్ దేశే నీలవర్ణాః నీలగ్రీవాః ప్రదేశాంతరే శ్వేతవర్ణాః శితికంఠాః తాదృశాశ్శర్వాః రుద్రమూర్తి విశేషాః, అథః క్షమాచరాః భూమే రథస్తాత్ పాతాళేషు సంచరన్తి తేషాం|

4. నీలగ్రీవాః - శితికంఠాః యే రుద్రాః దివముపశ్రితాః సర్వే వర్తమానాః|

5.యథా లోకేషు అవస్థితాః రుద్రాః తథా వృక్షేష్వపిస్థితాః తేషు కేచిత్ సస్పింజరాః బాల తృణవత్ పింజర వర్ణాః నీలగ్రీవాః నీలవర్ణగ్రీవాః కేచిత్ గ్రీవాదేశే నీలవర్ణో పేతాః అపరే పునః విలోహితాః విశేషణ రక్తవర్ణాః ఈదృశాః యేసన్తి తేషాం|

6. భూతశబ్దేన అన్తర్హిత శరీరాస్సన్తః మనుష్యోపద్రవకారిణః గణ విశేషాః ఉచ్యన్తే| తేషామధిపతయః యే రూద్రాః తేషు కేచిత్ విశిఖాసః, ముండిత మూర్ధానః అపరే కపర్దినః జటా బన్ధోపేతాః తేషాం|

7. యే రుద్రాః అన్నేషు భుజ్యమానేషు గూఢత్వేన అవస్థితాః సన్తః జనాస్ వివిధ్యన్తి విశేషేణ ధాతు వైషమ్యాదినా బాధన్తే తథా పాత్రేషు, పాతవ్యేషు క్షీరోదకాదిషు గూఢత్వేన అవస్థితాస్సన్తః పిబతో జనాస్ వివిధ్యన్తి తేషాం|

8. యే రుద్రాః పథిరక్షయః లౌకికవైదిక మార్గాణాం రక్షకాః నాత్ర కేషాంచి దేవ మార్గాణాం రక్షకాః నాత్ర కేషాంచి దేవమార్గాణాం కిన్తు సర్వేషాం పథాం మార్గాణాం తే చ రక్షకాః ఐలబృధాః ఇరా అన్నం తస్య సమూహః ఐరం, ఐరమేవ ఐలం తత్ బిభ్రతీతి ఐలభృతః ఐలభృత ఏవ ఐలబృధాః అన్నప్రదానేన పోషకా ఇత్యర్థః యేచ యవ్యుధః యౌతి మిశ్రీభవతి విరోధం కరోతీతి, యుః శత్రుః యుభిః శత్రుభిః సహయుధ్యన్తీతి యవ్యుధః తేషాం|

9. యే రుద్రాః ఏతావంతశ్చ సహస్రాణి సహస్రశ్చ ఇత్యాది ఋగ్భిః యావంత ఉక్తాః తావంతోపి భూ యాగ్ంసశ్చ ఇతోఽప్యధికాః అన్యే బహవోఽపి దిశో వితస్థిరే సర్వే దిశః ప్రవిశ్యస్థితాః తేషాం సర్వేషామ్

ధన్వాని ధనూంషి సహస్ర యోజనే అస్మత్తః సహస్ర యోజనే దేశే వ్యవహితే అవతన్మసి అవత తజ్యాని స్థాపయామః ఇతి|

ఈ అనువాకానికి సాయణభాష్యం వ్రాయబడింది. ఇది చాలా విశేషమైనది కనుక, దీని అర్థం వివరించబడుతోంది.

ఘోరశరీరం దాల్చినవాడు, సంహారకత్వ శక్తిని ఉపాధిగా దాల్చినవాడు రుద్రుడు. ఈ రుద్రమూర్తులు భూమి అంతరిక్షముల వ్యత్యాసంతో చాలామంది ఉన్నారు. ఒక్కొక్కరిగా వారందరి అనుగ్రహాన్ని ఈ ప్రకారం కోరుతున్నాడు.

1. భూమిపై ఏ రుద్రులు సహస్రజాతి విశేషములు కల సహస్ర సంఖ్యాక రుద్రులుగా ఉన్నారో వారి ధనుస్సులను,

2. ఈ మహా సముద్ర సమానమైన, ప్రౌఢమైన అన్తరిక్షమును ఆశ్రయించి ఏ రుద్ర మూర్తులున్నారో వారి ధనుస్సులను,

3. ఏకకాలంలో కంఠములో నీలవర్ణం, శ్వేతవర్ణం కలిగి పాతాళాది లోకాలలో ఏ రుద్రమూర్తులు భూమియందు సంచరిస్తున్నారో, వారి ధనుస్సులను,

4. పైన చెప్పిన విశేషములు కల ఏ రుద్రమూర్తులు ద్యులోకమును ఆశ్రయించి ఉన్నారో, వారి ధనుస్సులను,

5. లోకములలో వలే వృక్షాలలో కూడా లేత గడ్డిలా పింగళవర్ణం గల కొందరు ఏ రుద్రమూర్తులున్నారో, వారి ధనుస్సులను,

6. లోకంలో మనకు కనపడని శరీరం కలవారై, ఏ భూతములు మనని బాధిస్తాయో వాటికి అధిపతులై ఉండినవారుగా కొందరు, పూర్తి శిఖలేని ముండిత మూర్తులుగా కొందరు, జటా బంధములతో కూడిన మూర్తులుగా కొందరు ఉంటున్నారో వారి ధనుస్సులను,

7. మనం భుజించే ఆహారంలోనే గూఢంగా ఇమిడి ఉండి, మనకు ధాతువైషమ్యం కలిగించి, మనం త్రాగే నీటిలో నిగూఢంగా ఉండి ఆ నీరు త్రాగిన వారిని బాధిస్తూ ఉంటారో, ఆ రుద్రమూర్తుల ధనుస్సులను,

8. మనయొక్క లౌకిక విదితములైన సర్వమార్గాలకు రక్షకులుగా ఉండి, అన్నప్రదానం ద్వారా మనకు పోషకులుగా ఉండి, మన శత్రువులతో పోరాడి, మనకు అనిష్ట నివారకములుగా ఉంటున్న రుద్ర మూర్తుల ధనుస్సులను,

9. ఏ రుద్రమూర్తులు తీక్షణమైన ఆయుధవిశేషాలు కలవారై, ఖడ్గాలను ధరించిన వారై, కాశీ ప్రయాగాది తీర్థములను రక్షించడం కోసం సర్వదా కృషి చేస్తున్నారో వారి ధనుస్సులను,

10. **సహస్రాణి సహస్రశః** వంటి మంత్రాలచే చెప్పబడిన రుద్రమూర్తులకంటే ఇంకా అధికంగా గల ఏ రుద్రమూర్తులు ఆ యా దిక్కులను ఆశ్రయించి ఉన్నారో వారి ధనుస్సులను,

"సహస్ర యోజనేవ ధన్వాని తన్మసి"- మనకు సహస్రాది యోజనాల దూరంలో ధనుస్సుల నారులను క్రిందికి వంచి ఉంచునట్లుగా పై పది మంత్రాల సామర్థ్యంతో సాధించుకుందాం! అని అర్థం. ఆ రుద్ర మూర్తులే మన అధర్మాన్ని ప్రాతిపదికగా చేసుకుని మనకు అరిష్టాలను కలుగచేస్తారు కనుక ఆ రుద్రమూర్తుల జపపారాయణాదుల వలన ఆ యా రుద్రమూర్తుల రుద్రత్వాన్ని, అంటే **"రుద్రో వై క్రూరో**

దేవానామ్" అను శ్రుతిప్రకారం వారి క్రౌర్యాన్ని తగ్గించగలం అని తెలుస్తోంది. కానీ వారు ఏ యే బాణాలతో నాశనం చేస్తారో క్రింది మంత్రం తెలుపుతుంది.

నమోరుద్రేభ్యో యే పృథివ్యాం యేఽన్తరిక్షే యే దివి యేషామన్నం వాతో వర్షమిషవస్తేభ్యోదశ ప్రాచీర్దశ దక్షిణాదశ ప్రతీచీర్దశోదీచీర్దశోర్ధ్వాస్తేభ్యో నమస్తేనో మృడయన్తు తేయం ద్విష్మో యశ్చనో ద్వేష్టి తంవో జంభే దధామి|

భాష్యం:- **యే రుద్రాః పృథివ్యాం వర్తన్తే తేష్వపి రుద్రేషు యేషాం రుద్ర విశేషాణాం అన్నమేవ ఇషవః బాణాః అపథ్యాన్న భక్షణే ప్రవర్తయిత్వా, అన్నార్థం చౌర్యం కారయిత్వావా యాన్ హింసన్తి థేభ్యః పృథివ్యాం స్తితేభ్యః అన్నబాణకేభ్యశ్చ రుద్రేభ్యః, తథా యే రుద్రాః అన్తరిక్షే వర్తన్తే తేషామపి మధ్యే యేషాంవాత ఇషవః తీక్షేణ వాయునా రోగానుత్పాద్య హింసన్తి తేభ్యః అంతరిక్ష వర్తిభ్యః వాతేషుభ్యశ్చ రుద్రేభ్యః, తథా యే రుద్రాః దివి వర్తన్తే తేష్వపి యేషాం రుద్ర విశేషాణాం వర్షం ఇషవః, అతివృష్టి అనావృష్టిభ్యాం ప్రాణినః హింసన్తి తేభ్యః, దివిస్థితేభ్యః, వర్షేషుభ్యః, రుద్రేభ్యశ్చ, నమో అస్తు|**

తాత్పర్యం:- ఎవరు పృథివిని ఆశ్రయించుకుని అన్నాన్ని బాణంగా కలవారై (పాపం చేసినవారు అపథ్యాన్నం తినేలా చేసి, కొంతమంది అన్నం దొంగిలించేలా చేసి) ప్రజలను హింసిస్తున్నారో ఆ రుద్రమూర్తులకోసం, ఇంకా ఎవరు అంతరిక్షాన్ని ఆశ్రయించి **"వాయుర్వా అంతరిక్ష స్యాధ్యక్షః"** అను శ్రుతి ప్రకారం అంతరిక్షానికి అధ్యక్షుడైన వాయువును బాణంగా కలవారై (తీక్ష్ణ వాయువుచే ప్రాణులకు రోగాలు పుట్టించి) ప్రాణులను హింసిస్తున్నారో అట్టి రుద్రమూర్తులకోసం, ఏ రుద్రులు ద్యులోకాన్ని ఆశ్రయించి వర్ష, మేఘబాణములుగా కలవారై (అతివృష్టి, అనావృష్టి రూపంగా) హింసిస్తున్నారో అట్టి రుద్రమూర్తులకోసం నా అంజలులు! అన్ని దిక్కులా ఘటించబడి ఉండేటట్లుగా, సకలదిక్కులకు, సకల లోకాలకు అధిపతులైన ఆ రుద్రమూర్తులకు సవినయంగా నమస్కరిస్తున్నాను. పెద్దలకు నమస్కారం చేయడం కంటే అధికమైన ఉపచారం లేదని భావం.

"నమస్కృత్య హి వసీయాగ్ సముపచరన్తి" అను శ్రుతి ప్రకారం నా నమస్సులు వారికి చెందు గాక! దానితో వారు తృప్తి చెందిన వారై, ఏ వ్యక్తి మమ్మల్ని ద్వేషించకున్నా అతడిని శత్రువుగా భావించి మేము ద్వేషిస్తున్నామో, అలాగే ఏ వ్యక్తిని మేము ద్వేషించకున్నా అతడు మమ్మల్ని శత్రువుగా భావించి ద్వేషిస్తున్నాడో ఆ ఉభయ శత్రువులనూ, ఓ రుద్రులారా! మీ దంతాలమధ్య ఉంచుతున్నాం. అలాంటి వారిని మాత్రం శిక్షించి, మమ్మల్ని అనుగ్రహబుద్ధితో సుఖపెట్టమని ప్రార్థన. దీనికోసం పైన ఉన్న మంత్రాలను జపపారాయణాదులుగా ఆచరించి, **"రుద్రో వై క్రూరః"** అని చెప్పబడిన రుద్రుని ప్రార్థించి ఆయన క్రౌర్యాన్ని తగ్గించుకుని, సుఖంగా జీవించుదురు గాక!" అని మనని వేదమాత అనుగ్రహిస్తుంది.

"నమోహన్త్రే చ హనీయసేచ" అనే మంత్రం యొక్క భాష్యం:

పురతః దూరే, అదూరేవా విద్యమానం విరోధినం అనాయాసే నైవ హన్తీతి హన్తా, సర్వేషాం సంహారే అతిశయేన హన్తా హనీయాన్| (భాష్యం)

ఎదురుగా కాని, దూరంగా కాని ఉన్న విరోధిని అనాయాసంగా నశింప చేయువాడు రుద్ర స్వరూపుడే అని రుద్రుని విశేషం వర్ణించబడింది. దీనికి ఉదాహరణ- నేనే సర్వోన్నతుడనన్న గర్వంతో రావణుడు పరమేశ్వరుని అనాదరణచేసి కైలాస పర్వతాన్ని భుజాలతో ఎత్తగా, ఆ భుజాలు ఈశ్వరుడి అంగుష్ఠాగ్రంతో నొక్కబడి రావణుడు ఆక్రోశించినపుడు దయామయుడైన భగవంతుడిచేత వధించ బడ్డాడు" అను కథ రామాయణంలో మనకు కనబడుతుంది.

అలాగే భగవద్ద్వేషంతో దక్షుడు యాగం ఆరభించగా, శివుడు వీరభద్రావతారం దాల్చి దక్షుని శిరస్సు ఛేదించి, యజ్ఞశాలాదహనం చేసి, అగ్నికుండాలలో మూత్రవిసర్జనం చేసి, అగ్నులను నాశనం చేసి, ఋత్విక్కులను కశములతో వేధించి, సూర్యునికి దంతభంగం చేసి విపరీతమైన హింసకు పాల్పడ్డాడు. కనుక పరమేశ్వరుని అనాదరణ చేయడం అత్యంత అనర్థదాయకం. భగవంతుని సేవ అత్యంత ఆవశ్యకం అని చెప్పినట్లయింది. కనుకనే ప్రజల అపరాధంవలన అనుగ్రహం తప్పిన దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి, భూమ్యాకాశ అంతరిక్ష సంబంధమైన అరిష్టాలను నివారించు కోవడానికి శాంతి కార్యక్రమం ఉపదేశించబడింది. కానీ కొందరు ఆధునిక విజ్ఞానవేత్తలు వైదికమైన శాంతితో పని లేకుండా లౌకిక యంత్రాల సహాయంతో భౌమ్యాంతరిక్ష ఉత్పాతాలను ఉపశమింప చేయవచ్చునని వాదిస్తారు. కాని అది పని చేయదని చెప్పవచ్చును.

మన దేశంలో సైన్సు,విజ్ఞానం పూర్వంకంటే అభివృద్ధి చెందింది అనడానికి అనేక తార్కాణాలున్నాయి. ఉదాహరణకి రాడారు నిమిషాల వారిగా తుఫాను ప్రయాణపు దిక్కు మరియు వేగం గురించి సూచనలిస్తూ, అనేకమంది జాగ్రత్త పడడంలో ఉపకరిస్తోంది. కాని ఇక్కడ మనం గమనించాల్సిన విషయం ఒకటి ఉంది. విజ్ఞాన సహాయంతో తుఫానుకి సంబంధించిన సూచన చేయగలగవచ్చు గానీ, ప్రభుత్వం వారు తుఫాను రాకుండా శాసన రూపంలో గాని, సైన్సు విజ్ఞానం ద్వారా గాని వాతావరణంలో మార్పును సాధించగలరా? లౌకికమైన యంత్రాల సహాయంతో రాబోవు వాతావరణాన్ని సూచించగలరేమో గాని వాటి ప్రమాదాలను అరికట్టలేము. ఒకవేళ అది సాధ్యమై నప్పటికీ అది వేరొక విధమైన ఉత్పాతాన్ని సృష్టించగలదని చెప్పడంలో అతిశయోక్తి లేదు, ఉండబోదు!

అందువలన ఉత్పాతాలు సంభవించినప్పుడు వాటికి ఏ విధమైన ప్రతిక్రియను మనం ఆచరించాలని ఆర్షవాఙ్మయంలో వివరించబడిందో తెలుసుకోవడానికి ప్రయత్నించి, దానికోసం నిర్దేశించబడిన శాంతి కార్యక్రమం గురించి తెలుసుకుందాం.

యే తు శాంతిం ప్రకుర్వంతి, న తే యాంతి పరాంగతిమ్| యే తు న ప్రతికుర్వంతి భక్త్యా చ శ్రద్ధయాన్వితాః| నాస్తిక్యాద్వా విమోహాద్వా వినశ్యన్త్యే వాచిరాత్| తత్ర భౌమ్యాన్తరిష్టాని వ్యావర్తన్తే ప్రజాగుణైః| సప్తరాత్రాత్ పరాహాద్వాపర్జయంతి ప్రతిక్రియాత్| అన్తరిక్షౌణ్యారిష్టాని వ్యావవర్తన్తే కథం చన|

ప్రయతస్తేషు సర్వేషు దివ్యేష్వద్భుతకేష్వపి| మహాశాంతిం బుధః కుర్యాత్ అమృతాం విశ్వ భేషజీమ్|

ఏ మనుష్యులు శాంతి చేస్తున్నారో వారెప్పటికీ పరాభవం పొందరు. ఎవరు నాస్తిక భావంచేత కాని, మోహంచేత గాని ప్రభావితులై, భక్తి శ్రద్ధలతో శాంతి చేయరో, వారు అనర్థాలకు గురి అవుతున్నారు. వాటిలో భూమికి సంబంధించిన అరిష్టాలను ప్రజల సత్ప్రవర్తనచేత నివారించ వచ్చును. సర్వ పాపక్షయ కారకమైన అమృతాఖ్య శాంతిని, అంటే రుద్రైకాదశినీ పారాయణ, జపహోమార్చనాది రూపమైన శాంతిని నిర్వర్తించడం ద్వారా అంతరిక్ష, ద్యులోకములకు సంబంధించిన అరిష్టాలు దూరమవుతాయి. ఈ శాంతి రుద్రుని శివునిగా మార్చుకోవడానికి దోహదం చేస్తుంది. పై విషయాన్ని, ఈ శ్రుతి స్పష్టం చేస్తోంది.

వ్రత హోమోపవాసైశ్చ దానైః స్వస్త్య యనైస్తథా| సావిత్ర్యాలక్షహోమం తు భౌమారిష్ట వినాశకాః|

ఏతావతా రుద్రుని సంబోధించి మమ్మల్ని హింసించకయ్యా! అని ప్రార్థించడమే లక్ష్యం. హింసించడానికి మూలకారణమైన క్రోధాగ్ని జ్వాలలను తగ్గించడానికే నమకంతో రుద్రునికి జపాభిషేకాదులను నిర్వర్తించవలసిందని బోధాయనాది సూత్రకర్తలు కూడా ఇలా చెప్పారు.

అధాతః పంచాంగ రుద్రాణాం మహాన్యాస పూర్వకం జప హోమార్చనాభిషేక విధిం వ్యాఖ్యాస్యామః|

అగ్నా విష్ణూ సజోషసేత్యేకాదశానువాకానాం ఏకైకమనువాకం జపేత్| ఏతత్ పాపక్షయార్థీ, వ్యాధి విమోచనార్థీ శ్రీకామః శాంతికామః ఆయుష్యకామః ఆరోగ్యకామశ్చ కుర్యాత్|

రుద్రాధ్యాయ జపానంతరం ఒక్కొక్క చమక అనువాకమును కూడా పాప క్షయం, వ్యాధి విమోచనం కోరుకునేవారు ఆయురారోగ్య ఐశ్వర్యాదుల ఆశించేవారు జపించాలని ఈ వినియోగవిధి శాస్త్రం చెబుతోంది.

మహాపాతక నాయకుడైన యముడు దూతలను పిలిచి, **"నరకస్య వివృధ్యర్థం పట్టబంధం చకార హ"** అని, భూలోకంలోని మనుష్యులను పాపకర్మల వైపుగా ప్రేరేపించి, నరకాన్ని నింపమని శాసించాడని బ్రహ్మాండ పురాణంలో రుద్రాధ్యాయ మహిమ వర్ణించే సందర్భంలో చెప్తోంది.

నరకస్య వివృధ్యర్థం సాధికారాస్త్వయా కృతాః| ఆధునా వర్తితుం లోకేనశక్తాస్మః స్వయం ప్రభో| గ్రామే గ్రామే నదీ తీరే పుణ్యే ష్వాయతనేషు చ| రుద్రజాప్యేన పర్యాప్తే కథం పరిచరే మహి| రుద్ర జాప్యం క్షణేనాపి సోఢుం శక్తావయం న చ| రుద్రజాప్యం పరం ఘోరం రుద్రజాప్యం మహద్విషం|

యముడి ఆదేశాన్ని అమలు పరచడంలో విఫలమైన యమదూతలు యమునితో ఇలా అన్నారు. "నరకలోకాన్ని వృద్ధి పొందించమని మాకు ఆదేశం ఇచ్చారు. కాని ప్రతి గ్రామంలోను, ప్రతి నదీ తీరంలోను, ప్రతి పుణ్యక్షేత్రంలోను, రుద్రాధ్యాయజపం మెండుగా జరుగుతోంది అక్కడ. అలా జరుగుతున్న రుద్రజప ప్రభావంచేత, మీరు చెప్పిన ప్రకారం మేము చేయలేకపోతున్నాం. ఒక్కొక్క క్షణ కాలం కూడా రుద్రజప ప్రభావాన్ని తట్టుకోలేక పోతున్నాం" అని!

రుద్రజపం చాలా ఘోరమైనది, మహాపాతక నాయకులకు కూడా విషతుల్యం అయినది అని వర్ణించడం ద్వారా రుద్రాధ్యాయంగా చెప్పబడే నమక, చమకాలను జపాభిషేకములలో వినియోగించడంద్వారా సర్వపాపాలు పటాపంచలై, రుద్రుని హింసారూప విన్యాసానికి లోను కాకుండా ఉంటారని చెప్పబడింది. ఇంకా-

నమకం చమకం చైవ పురుష సూక్తం తథైవ చ| ఏతత్త్రయం ప్రయుంజనో బ్రహ్మలోకే మహీయతే|

అనే స్మృతివలన నమకం, చమకం, పురుషసూక్తం అనే మూడు భాగాలను పారాయణ చేస్తే బ్రహ్మలోక ప్రాప్తి కలుగుతుందని తెలుస్తోంది.

"శతరుద్రీయం జుహోతి" అని శ్రౌత వినియోగం. దానితో అగ్నిచయన ప్రకరణంలో ఇష్టకోపధానం పూర్తి అయిన తరువాత చివరి ఇష్టకలో అభిషేకం విధించబడింది. దానినే పురాణకర్తలు, సూత్రకర్తలు పై విధంగా వినియోగం చెప్పారు.

పైన చెప్పిన ప్రకారం శ్రుతిస్మృత్యాదులలో శ్రౌతకర్మలో, జప, పారాయణాదులలో వినియోగించబడు రుద్రాధ్యాయం చాలా మహిమ కలది. కనుకనే-

రుద్రాధ్యాయీ వసేద్యత్ర గ్రామే వా నగరేపి వా| న తత్ర క్షుత్పిపాసాద్యాః దుర్భిక్ష వ్యాధయోపి చ|

ఏ గ్రామంలో, నగరంలో రుద్రాధ్యయనం చేసేవాడు నివసిస్తాడో, అక్కడ ఆకలి దప్పులు, దుర్భిక్షములు, వ్యాధులు వంటివి సంభవించవని చెప్పబడింది.

వేయి మాటలెందుకు? వేదాంతశాస్త్ర సిద్ధాంత ప్రకారం ఉపనిషదర్థాలను వినడంచేత గాని, అనడంచేత గాని, సంపాదించిన జ్ఞానంచేత గాని దొరకని మోక్షం రుద్రాధ్యాయ జపంచేతనే లభిస్తుందని, వేదాక్షరములన్నీ హరినామాలని ఈ సూక్తిచే చెప్పబడుతోంది.

వేదాక్షరాణి యావన్తి పఠితాని ద్విజోత్తమైః తావన్తి హరినామాని కీర్తితాని న సంశయః|

ప్రత్యేకంగా ప్రశ్న- ప్రతివచన రూపంలో రుద్రాధ్యాయంలో కల పదాలన్నీ అమృత స్వరూపుడైన రుద్రుడి నామధేయాలని, వీటి జపంచేత అమృతత్వం మోక్షం ప్రాప్తిస్తాయని ఈ క్రింది శ్రుతులచే ప్రతిపాదించబడింది.

"కిం జప్యేనామృతత్వ మశ్నుతే| శతరుద్రీయేణేతి"

"ఏతాని హవా అమృతస్య నామధేయాని భవన్తి| ఏతైర్ హవా అమృతో భవతి"

రుద్రాధ్యాయంలో గల ప్రతి మంత్రానికి ఇష్టప్రాప్తి-అనిష్టపరిహార ఉపాయాలు, కర్మలందు వినియోగం, గంభీరమైన అర్థం భట్టభాస్కర భాష్యములో వివరింపబడింది.

ఈ విధంగా శాస్త్రోక్తప్రకారం రుద్ర ప్రతిపాదకములైన మంత్రాలను జప,హోమ అర్చనాదులలో వినియోగించి రుద్రునిలో గల రుద్రత్వాన్ని విడిపింప చేసుకుని, శివునిగా మార్చుకున్న పిమ్మట చమకానువాకములను కూడా జపపారాయణ అర్చన హోమాదులలో వినియోగించి, శివుణ్ణి ప్రసన్నం చేసుకుని, శివుని అనుగ్రహంతో సమస్త మంగళములు పొందవచ్చును.

రుద్ర రుద్రైకాదశిన్యాది భేదములు

నమక, చమకములను సమగ్రంగా జపాభిషేకాదులలో వినియోగించుటకు రుద్రం అని; నమకం పూర్తిగా చెప్పి, చమకంలో ఒక్కో అనువాకం చొప్పున పదకొండు పర్యాయాలు వినియోగించిన విధానాన్ని రుద్రైకాదశినీ అంటారు. ఆ రుద్రైకాదశినులు పదకొండు సార్లు ఆవృత్తి చేసినట్లైతే, లఘురుద్రం అని, ఆ లఘురుద్ర ప్రక్రియ పదకొండు సార్లు ఆవృత్తి చేసినట్లయితే మహారుద్రం అని, ఆ మహారుద్ర ప్రక్రియ పదకొండు సార్లు ఆవృత్తి చేసినట్లయితే అతిరుద్రం అని మేరుతంత్రంలో పేర్కొనబడింది.

నమస్తే రుద్ర అగ్నా విష్ణూ ఇత్యధ్యా య ద్వయేన చ| ఆవర్తనమితి ప్రోక్తం గంగా స్నాన ఫలప్రదమ్|

ఏకః పాఠః నమస్తే స్యహి అగ్నా విష్ణూ తథైకకమ్| ఇయం రుద్ర సమాఖ్యాతా రౌద్రీపాప నికృంతనీ|

ఇయమేవ హి రుద్రైకాదశినీత్యప్యుచ్యతే| రుద్రీభిరేకాదశిభిః లఘు రుద్రః ప్రకీర్తితః ||

రుద్రమహాత్మ్యం ఈ ప్రకారం వర్ణింపబడింది. ఇటుపై ఒకే మూర్తి ఉపాధి భేదం చేత ఒకసారి రుద్రునిగా, ఒకసారి శివునిగా వ్యవహరింపబడినట్లు ఆరంభంలోనే ఉపపాదన చేసి ఉన్నందువలన ఇంతవరకు చెప్పిన జప అభిషేక, అర్చనా హోమములచేత రుద్రుని ఘోరశరీరాన్ని **"యై వాస్య ఘోరా తనూస్తాంతేన శమయతి"** అనే శ్రుతి ప్రకారం ఉపశమింపచేసి, శాంతస్వరూపుడైన శివునిగా మార్చుకోవలసి ఉంది. కనుక శివమాహాత్మ్యం గురించి కూడా ప్రతిపాదించాల్సి ఉంది.

శివమాహాత్మ్యము

సత్వరజస్తమో గుణాలు ఉపాధులుగా కలిగిన బ్రహ్మవిష్ణుమహేశ్వరాదులకు మూలభూతుడు శివుడు. అందువలన సమస్త ప్రపంచమూ శివునికి శేషభూతమైంది. శివుడు మాత్రం ప్రపంచంలో ఏ పదార్థమునకు శేషభూతుడు కాడు. ఈ విషయం సూతసంహితలో ఇలా చెప్పబడింది.

వేదో నాన్యస్య శేషస్తు యథా దేవో మహేశ్వరః| శివస్య శేషం సకలం శ్రుతేర్మానాని సర్వశః|

ఏ ప్రకారంగా మహేశ్వరుడు మరొక దానికి శేషభూతుడు కాడో, ఆ విధంగానే వేదం మరొకదానికి శేషము(భాగం) కాదు. శివునికి సర్వప్రపంచం అంగభూతము. శ్రుతి సర్వప్రమాణం. స్మృతి, పురాణ ఇతిహాసాలు అన్నీ అంగభూతాలే. అంటే సమస్త ప్రపంచానికి శివుడు శిరస్థానీయుడు.

సూతసంహిత యజ్ఞవైభవ ఖండం 28వ అధ్యాయంలో శివలింగ శబ్దం ఈ విధంగా వివరింపబడింది.

ఇక్కడ లింగము అనే శబ్దానికి జ్ఞాపకం అని అర్థం. కనుక ఇక్కడ శివుడే సర్వపదార్థాలకు జ్ఞాపకుడు. అంటే సర్వం తెలియచేయువాడు శివుడే అని చెప్పి, మరో మతంచేత కూడా శివుడు లింగమని ధ్రువపరుస్తోంది."**లయనాల్లింగం"** అను వ్యుత్పత్తిచేత సర్వం శివునిలో లయమవడాన్ని బట్టి **'లింగము'** అని **"యత్ప్రయంత్యభిసం విశన్తి తద్వి జిజ్ఞాసస్వ తద్బ్రహ్మేతి"** అనే శ్రుతిచేత ఏ వస్తువులో సృష్టి లయమవుతోందో, ఆ వస్తువు బ్రహ్మ అని తెలుసుకోవాలి.

శుక్తికను (ముత్యపు చిప్పను) చూసి **"ఇదం రజతం"** ఇది వెండి అని భ్రమ కలుగుతుంది. అసత్యమైన రజతాదులకు శుక్తికలో లయముంది. కానీ సత్యమైన రజతాదులకు అసత్యమైన అంటే వాస్తవానికి అక్కడ లేని రజతములో లయం లేదు. అదే విధంగా అసత్యం అయిన ప్రపంచమందు సత్యం అయిన బ్రహ్మపదార్థం లయం అవబోదు.

ప్రళయకాలంలో బ్రహ్మలోనే సమస్త ప్రపంచం లయమవుతుంది. కనుక బ్రహ్మశబ్దంచే చెప్పబడు పరమ శివుడే లింగము అని, **"శివ ఏవ స్వయం లింగమ్"** అని చెప్పబడింది. లోకంలో మాత్రం శివలింగ పదానికి వ్యుత్పత్తి **"శివస్య లింగం శివలింగం"** శివుడియొక్క లింగం అనే అపోహ ఉంది. ఇది నిజం కాదు. వాస్తవానికి శివుడే స్వయంగా లింగం.

కొందరు ఆలయం లింగమని, **"ఆలయం లింగమిత్యాహు రపరే వేదవిత్తమాః"** అని ప్రతిపాదిస్తున్నారు. అంటే స్వస్వరూపుడైన శివుని ధ్యానపూజాదులతో పూజించాలని; మృత్ రూప, శిలామయ, స్ఫటికమయాది లింగమునకు ఏది ఆధారమో అదే లింగమంటున్నారు. ఈ మతంలో కూడా శివుడే లింగం అనే అర్థం ప్రతిఫలిస్తుంది. ఆలయమంటే ఆధారం. ఆధారం పరమశివునికి ఘటిస్తుంది కాని వేరొకరికి కుదరదు. మాయచే కల్పించబడిన జగదధిష్ఠానత్వం పరమ శివునికి అంగీకరించగా, ఆ శివునికి మాత్రం ఎందుకు అధిష్ఠానం ఉండదు అని సందేహించి **"సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ"** (తై.ఉ.) అని శ్రుతిచే చెప్పబడిన సత్యచైతన్య లక్షణ లక్షితుడు పరమశివుడు. అలాంటి పరమశివుడు సత్వ, రజస్తమో గుణాలకు ఉపాధికులైన బ్రహ్మ, విష్ణువుల వలె ఉపాధిచే పరిచ్ఛిన్నుడు కాకపోవడం చేత **"మహాంశ్చాసౌ దేవశ్చ మహాదేవః"** అని మహాదేవుడని చెప్పబడుతున్నాడు. శివశబ్ద వాచ్యుడయిన మహాదేవుని మహాత్మ్యం వర్ణనాతీతం.

సూతసంహిత: **మహాదేవస్య మాహాత్మ్యం వేదానామపి వైభవమ్| త్రిపుండ్రోద్ధూలన మాహాత్మ్యం న మయా వర్ణితుం శకమ్|**

"శ్రుతౌచాపి మహాదేవే త్రిపుండ్రే భస్మ గుంఠనే| శ్రాద్ధం న కురుతే మర్త్యః పుణ్యలేశ వివర్జితః| పాపిష్ఠానాం మనుష్యాణాం త్రిపుండ్రోద్ధూలనే శ్రుతౌ| మహాదేవేచ విద్వేషః స్వత ఏవ విజాయతే|

వేదోత్కర్షే శివోత్కర్షే విద్యోత్కర్షే తథైవచ| త్రిపుండ్రోద్ధూలనోత్కర్షే శ్రద్ధా పుణ్యవతాం భవేత్|

ఈశ్వరుని మహిమ, వేద మహిమ, విభూతిధారణ మహిమ వర్ణింపశక్యం కానివి. ఈ మూడింటియందు ఏ మనుష్యుడికి శ్రద్ధ లేదో ఆ మనుష్యుడు లేశమంతైనా పుణ్యం లేని వాడు అని అర్థం. పాపాత్ములకు మాత్రమే పై మూడింటి పట్ల సహజమైన ద్వేషం ఉంటుంది. వేదోత్కర్ష, శివోత్కర్ష, జ్ఞానోత్కర్ష ఈ మూడు చాలా గొప్పవని, వాటియందు పుణ్యాత్ములకు మాత్రమే శ్రద్ధ అతిశయంగా ఉంటుందని పై మూడింటి మహిమను వర్ణించడం జరిగింది.

ఆకాశానికి మరో ఆధారం లేనట్లుగానే, ఇంతటి మహా మహిమోపేతుడయిన మహాదేవునికి వేరే ఆధారం లేదు, అవసరమూ లేదు అని అర్థం. దీనికి ప్రమాణం **"స భగవః కస్మిన్ ప్రతిష్ఠితః".** ఆ భగవంతుడు తన మహిమయందే తాను ప్రతిష్ఠించబడ్డాడు అని సమాధానం చెప్పింది.

పైన చెప్పిన శ్రుతి,స్మృతి ప్రమాణాలద్వారా సచ్చిదానంద స్వరూపుడు అయిన పరమశివుడే సర్వాధారమని, అతడు వేరే ఆధారాన్ని ఆశించనివాడని, లింగశబ్ద వాచ్యుడని నిరూపించబడింది. లింగశబ్దము శివునకే వర్తిస్తుంది కనుక శివలింగమనే శబ్దం లోకవ్యవహారానికి నోచుకుంది. కానీ విష్ణులింగం, బ్రహ్మలింగం అనే ప్రయోగాలు వినలేదు కదా! ఇలా ఉండగా ధ్యానపూజాదుల నిమిత్తం శివునికి ఆధారంగా ఆగమోక్తమైన ప్రతిష్ఠాది సంస్కారాలచేత 'సంస్కరించబడని' బాణలింగాదికం (లింగాకార శిల) పూజింపదగింది కాదని శంకతో "సంసారార్ణవ మగ్నానాం" అని ఆరంభించి,**"ఆధారో మంత్ర సంస్కారాత్ కల్పిత స్సత్యవద్బుధాః"** అని ఆ బాణలింగాలు కూడా పూజార్హాలే అని సమాధానం చెప్పారు.

అంటే అజ్ఞానంచే కలుషితమైన మనస్సు గల ప్రాణులకు ఆ యా చిత్త పరిపాకాన్ని అనుసరించి, ప్రతిబంధకమైన పాపనివారణ నిమిత్తం ధ్యాన పూజాదికం చేసి తీరాలి అని అనబడింది. దీని నిమిత్తం వాస్తవానికి నిరాధారమైన పరమశివునికి లోకవ్యవహార ప్రకారం బాణలింగాది లక్షణమైన ఆధారం ఆగమోక్త విధానంగా కల్పించవలసి వచ్చింది. అందుచేత వేదాంత విజ్ఞాన సంపన్నులకు శివ స్వరూపమే లింగము. తదనుసంధానమే పూజ. జ్ఞానరహితులకు శివునికి ఆధారంగా కల్పించబడిన బాణలింగం పూజనీయం.

యతీనాం యోగినాంచైవ బాహ్యోపరతి సక్తిషు| అన్తర్యా గస్తు విహితః బాహ్యపూజాపరేషు చ|

దీనివలన తేలిన సారాంశమేమిటంటే రుద్రశబ్ద వాచ్యుడయిన ఘోరశరీరం ఉపాధిగా కలిగిన రుద్రుని, రుద్రశబ్దంతో సంబోధించి, రుద్రశబ్ద ఘటితములైన మంత్రాలతో **"మమ్మల్ని హింసకు గురి చేయకు స్వామీ!"** అని ప్రార్థించడం శివశబ్ద ఘటితములైన మంత్రాల లక్ష్యం. కనుక రుద్రాధ్యాయాన్ని జప, పారాయణ, అర్చన, హోమ, అభిషేకాదులలో వినియోగించి, రుద్రుని రుద్రత్వాన్ని తగ్గింప చేసుకొని, శివశరీరం ఉపాధిగా గల శివునిగా మార్చుకోవడానికి వినియోగించి, తరించాలి.

పాపభేదములు - వాటి ప్రాయశ్చిత్తములు

ఇంతవరకు సమాజకృతమైన పాపం ఉత్పాతానికి కారణమని, ఆ ఉత్పాతాలను రుద్రాభిషేక జప పారాయణాదులచే నివారింపవచ్చునని, దీనిలో రుద్రమహిమ, శివమహిమ కూడా వివరించడం జరిగింది. ఇక్కడ మరొక విషయం కూడా తెలుసుకోవలసి ఉంది, పాపభేదములు- వాటి ప్రాయశ్చిత్తములు.

పాపాలు జ్ఞానకృతం, అజ్ఞానకృతం అని రెండు రకాలు. అజ్ఞానంతో చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తాలు చాలా లఘుమాత్రంగా ఉంటాయి. పశు పక్షాదులు బహిరంగ ప్రదేశాలలో

జనోపయోగమైన ప్రదేశాలలో మూత్రపురీషోత్సర్జనం చేసినా, వాటిని ఎవరూ శిక్షించరు. చదువు లేని భిక్షగాళ్ళు, ఇళ్ళు, వాకిళ్ళు లేక దారి ప్రక్కనే గుడారాలు వేసుకుని జీవించేవారు బహిరంగ ప్రదేశాలలో అదే పని చేస్తే వారికి తక్కువగానే శిక్ష విధించి విడిచి పెడతారు. అదే తప్పును చదువుకున్న వారు చేస్తే, వారికి మందలింపు, శిక్ష కూడా హెచ్చు స్థాయిలోనే ఉంటాయి.

అదే విధంగా జ్ఞాన,అజ్ఞానకృత పాపాలకు కూడా ప్రాయశ్చిత్తాలు విభిన్నంగా ఉంటాయి. అలాంటి ప్రాయశ్చిత్తం ఆచరించి, పరిశుద్ధులై, విహితకర్మ అనే ధర్మం ఆచరించడానికి ముందుగా వేదప్రకారం కూశ్మాండ హోమాలు, సర్వపాప నివర్తకాలు అయిన వాటిని **"కర్మాదిష్వేతైర్జుహుయాత్ పూతో దేవలోకాన్ సమశ్నుతే"** అని ప్రతి కర్మకూ ముందుగా విధిగా ఆచరించాలి.

ఆ నిమిత్తం మంత్రాలు తై.ఆ.2వ ప్రశ్నలో (దీనినే వైదిక పరిభాషలో స్వాధ్యాయ బ్రాహ్మణం అంటారు) నాలుగవ అనువాకంలో చెప్పబడ్డాయి. అలాగే స్మార్త ప్రాయశ్చిత్తాలు కూడా విధించబడ్డాయి.

తరువాత **"కూశ్మాండైర్జుహుయాత్ యోఽపూత ఇవమన్యేత"** అనే అనువాకంలో కర్మలలోనే కాక, కర్మోతిరిక్త కాలంలో కూడా ఎప్పుడెప్పుడు తనకు అపవిత్రత సోకినట్లు భావిస్తారో, అప్పుడప్పుడు కూశ్మాండహోమాలు చేయాల్సి ఉందని అందులో కూశ్మాండ హోమం విధానమిలా ఉంది.

కూశ్మాండైర్జుహుయా ద్యోఽపూత ఇవమన్యేత|

భాష్యం: **యః పుమాన్ సందిగ్ధేన పాపేన స్వస్యపూతత్వం నాస్తీతి మనసి శంకతే స పుమాన్ కూశ్మాండ హోమేన పూతో భవతి|**

"ఏ పురుషుడు ఏదైనా పాపంవలన తనకు పవిత్రత లేదని మనస్సులో శంకిస్తాడో అతడు కూశ్మాండహోమంతో పవిత్రుడవుతాడు. పిమ్మట మహాపాతక సమమైన పాప నివృత్త్యర్థం హోమం విధించడమైంది.

యథాస్తేనో యథా భ్రూణహైవమేష భవతి యోఽయోనౌ రేతస్సించతి|

భాష్యం: **ప్రతిషిద్ధ యోనౌ యః రేతస్సించతి ఏషః సువర్ణస్తేయకారిణా, భ్రూణహత్యాకారిణా చ సమో భవతి సోఽపి కూశ్మాండైర్జుహుయాత్|**

ఎవడు నిషిద్ధమైన యోనియందు రేతస్సేచన చేస్తాడో అతడు సువర్ణస్తేయునితోను, బంగారం దొంగిలించినవాడు భ్రూణ హత్యాకారుడితోను (శిశుహత్య చేసినవాడితో) సమానుడు. అట్టివాడు ఆ పాపంనుండి విముక్తి పొందడానికి కూశ్మాండ హోమాలు చేయాలని విధి.

యదర్వాచీన మేనో భ్రూణహత్యా యాస్తస్మాన్ముచ్యతే|

పైన పేర్కొన్న పాపం చేసినవాడు భ్రూణహత్యా సముడు, అంటే నిజంగా భ్రూణహత్య చేసిన వాడికంటే తక్కువ పాపం చేసినవాడు కనుక ఆ పాపాన్ని హోమం నివర్తించగలదు. కానీ వాస్తవ భ్రూణహత్యా పాపం మాత్రం హోమం వలన నివర్తించబడేది కాదని అర్థం.

తదేవోక్తం: **భ్రూణహత్యా సమస్యాపి భ్రూణహత్యాయా అర్వాచీనత్వాత్, భ్రూణహత్యాయా అర్వాచీనమపి తారతమ్యతో భవతి| తస్మాన్ కథ ఏతేన హోమేన నివృత్తిర్భవతి, ఇత్యాశంక్య దీక్షా తారతమ్యేన ఇత్యుత్తరం దర్శయతి.**

భ్రూణహత్యకంటే తక్కువయినందువల్ల ఒక హోమంతో నివృత్తి అవడం జరగదు. ఎందుకంటే భ్రూణహత్యకంటే తక్కువ అనడంలో కూడా చాలా తారతమ్యం ఉంది కదా| కనుక పాప తారతమ్యం నివర్తించడానికి దీక్షాతారతమ్యం కూడా నిర్దేశించబడింది.

యావదేనో దీక్షాముపైతి దీక్షిత ఏతైస్సతతి జుహోతి|

భాష్యం: **అల్పం మహద్వాయావదేనో భవతి తదనుసారేణ అల్పం మహాంతం వా దీక్షాం కృత్వా తస్య ఏన స ఉచితే కాలే సతతి ప్రతిదినం జుహోతి| తత్ర తారతమ్యేన షడ్దీక్షాహోమాః భేదాః ఉక్తాః|**

తాను చేసిన పాప తారతమ్యాన్ని అనుసరించి కూశ్మాండ దీక్ష సంవత్సరం కాని, నెల కాని, ఇరవై నాలుగు రోజులు కాని, పన్నెండు రోజులు కాని, ఆరు రోజులు కాని, మూడు రోజులు కాని దీక్షాయామాలు, ఉపవాసాదులు పాటించి, ప్రతిరోజు హోమం చేయడంవలన పాపనివృత్తి అవుతుందని **"సంవత్సం దీక్షతో భవతి"** వంటి శ్రుతులచే విధించబడింది. ఇప్పుడు హోమాలచే నివర్తింపబడే పాపములను తెలియచేయడానికి హోమాంగ మంత్రాలను వివరిస్తాను. కాని, హోమాంగంగా మూడు అనువాకములను, ఉపస్థానాంగంగా ఒక అనువాకమును వినియోగించ వలసిందిగా ఈ శ్రుతి బోధిస్తోంది.

యద్దేవా దేవహేళనం యదదీవ్యన్నృణమహం బభూవా యుష్టే విశ్వతో దధదిత్యే తైరాజ్యం జుహుత వైశ్వానరాయ ప్రతివేదయామ ఇత్యుపతిష్ఠతే|

అయినప్పటికీ గ్రంథవిస్తరణకి ఉన్న పరిమితులను దృష్టిలో ఉంచుకుని, ప్రథమ అనువాకంలోని మంత్రాలను, ద్వితీయానువాకంలో పాపవివరణ గల మంత్రాలను మాత్రమే వివరిస్తాను.

1. యద్దేవాదేవహేళనం దేవాసశ్చకృమావయం| ఆదిత్యాస్తస్మాన్మాముంచ తర్తస్యర్తేన మామిత|

భాష్యం:- **దేవాసః - దేవనశీలాః, ఆదిత్యాః - అదితేః పుత్రాః, హే దేవాః, దేవహేళనం-దేవానాం క్రోధకారణం యత్కర్మవయం చ కృతమ్, తస్మాస్ అపరాధాత్ మాం ముంచత యూయం ఋతస్య యజ్ఞస్య సంబంధినా ఋతేన సత్యేన మాం యూయం ఇతి.**

ఓ ఆదిత్యాది దేవతలారా| మీకు క్రోధం కలిగించేలా, ఆ దేవతలు గొప్పవారు-ఈ దేవతలు తక్కువ వారు అనే హేళనాత్మక కర్మచే ఏ పాపం సంపాదించామో, ఆ పాపంనుండి విముక్తులను చేయుదురు గాక! మరియు యజ్ఞ సంబంధమైన ఈ హోమంలో నన్ను సంబంధింపచేయ కోరుతున్నాము, అనగా నాచే ఈ యజ్ఞసంబంధమైన హోమం చేయబడేలా చూడవలసినదిగా ప్రార్థన.

2. దేవా జీవనకామ్యాయ ద్వాచాఽనృత మూదిమ| తస్మాన్న ఇహ ముంచత విశ్వేదేవాస్స జోసషః|

భాష్యం: **హే దేవాః! వయం జీవన కామ్యాః జీవనం ఆత్మనః ఇచ్ఛంతః యదనృతం వాచా ఊదిమ రాజసేవాదౌ తత్ ప్రీత్యర్థం అనృతం ఉక్తవన్తః సజోషసః పరస్పరం అస్మాభిశ్చ సమాన ప్రీతియుక్తాః హే విశ్వేదేవాః ఇహ అస్మిన్ కర్మణి అనుతిష్ఠితే సతి తస్మాత్ పాపాత్ నః అస్మాన్ ముంచత|**

ఓ దేవతలారా! మేము జీవనం సాగించే తాపత్రయంలో రాజసేవాదుల విషయంలో ఉండి, వారి ప్రీతి కోసం అసత్యాలను పలికి ఉంటాము. మీ సేవ అనే ఆ కర్మానుష్ఠాన సామర్థ్యం వలన మాతో కూడా పరస్పరం సమాన ప్రీతితో కూడిన వారై, మీరు మమ్మల్ని ఆ పాపాలనుండి విడిపించండి.

3. ఋతేన ద్వావా పృథువీ ఋతేన త్వగ్ం సరస్వతి|కృతాన్నః పాహ్యేన సోయత్ కించానృత మూదిమ|

భాష్యం:- **హే ద్యావా పృథివ్యౌ ఋతేన యజ్ఞేన విగుణేన యత్పాతం ప్రాప్తం తథా హే సరస్వతి ఋతేన యత్పాతం ప్రాప్తం తం, ద్యావా పృథివ్యౌ చ ఇత్యేతా యూయం కృతాత్ తస్మాత్ ఏన సః నః అస్మాన్ పాహి పాతేత్యర్థః కించ యత్కించత్ అనృతమూదిమ వయం ఉక్తవంతః తస్మాదపి ఏనసః పాత|**

ఓ ద్యావాపృథివ్యభిమాన దేవతలారా! ఓ సరస్వతీ! విగుణంగా (దోషాలతో) అనుష్ఠించిన యజ్ఞంవలన మాకు ఏ పాపం తటస్థించిందో ఆ పాపం నుండి, అప్పుడప్పుడు అసత్యం పలకడం నుండి జనించిన ఏ పాపం ఉందో, దాని నుండి మమ్మల్ని మీరు రక్షించెదరు గాక!

4. ఇంద్రాగ్ని మిత్రావరుణౌ సోమోధాతా బృహస్పతిః| తేనో ముంచంత్వేన సోయదన్యకృత మారిమ|

భాష్యం:- **యత్పాపం అన్యకృతం అస్యేన యజ్ఞ వ్యతిరిక్తేన నిమిత్తేన కృతమారిమ వయం ప్రాప్తాః తస్మాదేన సః ఇంద్రాదయః బృహస్పత్యంతాః దేవాః నః అస్మాన్ ముంచంతు|**

ఇంద్ర, అగ్ని, బృహస్పత్యాది దేవతలారా! యజ్ఞాన్ని వ్యతిరేకించడమనే ఏ అపరాధం చేత మాకు పాపం జనించిందో, ఆ పాపంనుండి మమ్మల్ని విడిపించుదురు గాక!

5. సజాతశగ్ం సా దుతజామిసగ్ంసా జ్ఞ్యాయసశ్శగ్ం సాదుతవాకనీయసః| అనాధృష్టం దేవకృతం యదేనస్తస్మాత్వమస్మాన్జాతవేదో ముముగ్ధి|

భాష్యం:- **సజాతాః సమానజన్మానః జ్ఞాతయః సమాన వయస్కాః సఖాయోవా, తైర్మయి కృతః శంసః స్తుతిః, ఉత అధవా జామయో జాయాః భార్యాః తాభిర్మయికృతః శంసః, స్తుతిః జ్యాయాన్ జ్యేష్ఠో భ్రాతా తస్య శంసః తేన మయికృతా స్థితిః| ఉతవా అధవా కనీయాన్ కనిష్ఠో భ్రాతా తస్య శంసః తేనమయా అనాధృష్టం కేనాపి ప్రతీకారేణ అపరిహార్యం ప్రబలం దేవకృతం దేవవిషయే సంపాదితం యదేనః పాపం హే జాతవేదః త్వం తస్మాత్ అస్మాత్ ముముగ్ధి మాం ముక్తం కురు|**

ఓ జాతవేదుడా! అనగా ఓ అగ్నీ! జ్ఞాతులచేత గాని, సమాన వయస్కులైన సఖులచేత గాని, భార్య చేతగాని, జ్యేష్ఠ సోదరులచేత గాని, కనిష్ఠ సోదరులచేత గాని ప్రశంసించబడినవాడై ఆ ప్రశంసల తాలూకు మత్తులో ఏ ప్రతీకారక్రియ చేతనూ పరిహరింప శక్యంకాని దేవతా సంబంధమైన, ప్రబలమైన అపరాధములను చేసి ఏ పాపం సంపాదించామో, ఆ పాపంనుండి నన్ను విముక్తుడనుగా చేయుము.

6. యద్వాచా యన్మనసా బాహుభ్యా మూరుభ్యామష్ఠీవద్భ్యాగ్ం శిశ్నైర్యదనృతం చకృమా వయం| అగ్నిర్మాతస్మాదేనసో గార్ హపత్యః ప్రముంచ తు చకృమయాని దుష్కృతా|

భాష్యం:- వాగాధిభిర్యదనృతం ఆయుక్తరూపం వయం చకృమ, కృతవంతః వాచా అసత్యాభిధానం, గుర్వాదిషు త్వంకారాదిచ మనసా పరానిష్టచింతనం, బాహుభ్యాం బ్రాహ్మణ తాడనాది, ఊరుభ్యాం ఆలింగనాది అష్ఠీవద్భ్యాం జానుభ్యాం ఆగంతవ్య దేశగమనాది, శిశ్నైః శిశ్నేన అయోనౌ రేతస్సేచనాది బహువచనాచ్చక్షురాది ఇంద్రియ సంగ్రహః, చక్షుషా ఉద్యదర్క దర్శనాది, శ్రోత్రేణ గురుదేవాది నిందా శ్రవణం, ఆస్యేన అభక్ష్యభక్షణ మిత్యాది తస్మాత్సర్వస్మా దేనసః అగ్నిః మాం ప్రముంచతు| యాని దుష్కృతాని యాని సర్వాణి పాపాని చ కృమ తేభ్యః అపి ప్రముంచతు|

తాత్పర్యం: నోటితో అబద్ధం ఆడడం, గురువులను 'నువ్వు' అని పిలవడం, గురునిందని వినడం, పరాయి స్త్రీలతో సంగమించడం, ఉదయించే సూర్యుని- అస్తమించే సూర్యుని-మధ్యందిన సూర్యుని-గ్రహణ సూర్యుని చూడడం వంటి ఆయుక్తములను (పాపములను) వాక్కుచే గాని, చెవులచే గాని,

మనస్సుచే గాని, బాహువులు, ఊరువులచే గాని, కళ్ళచే గాని చేసేమో ఆ పాపలన్నిటినుంచి నన్ను విముక్తుడనుగా చేయుము.

7. యేనత్రితో ఆర్ణవాన్నిర్బభూవ యేన సూర్యం తమసో నిర్ముమోచ| యేనేంద్రో విశ్వా అజహాదరా తీస్తేనాహం జ్యోతిషా జ్యోతిరానశాన ఆక్షి|

భాష్యం:- **త్రితోనామ కశ్చిత్పురుషః సచ పౌరోడాశిక కాండే అంగారేణ ఉదక పాతనాత్ నిష్పన్నః ఇతి శ్రుతః స తృతీయ మభ్యపాతయత్ తతస్త్రితో జాయతేతి, స చ త్రితః యేన పరమేశ్వర జ్యోతిషా ఆర్ణవాత్ సముద్ర సమానాత్ పాపాత్ నిర్బభూవ నిర్ముక్తో బభూవ| తథా యేన జ్యోతిషా పరమేశ్వరః స్వర్భాను సంజ్ఞకాసురేణ ఆపాదితాత్తమసః సూర్యం నిర్ముమోచ నిర్ముక్తం కృతవాన్| ఇంద్రః స్వర్గాధిపతిః యేన పరమేశ్వర జ్యోతిషా విశ్వా ఆరాతీః సర్వానపి శత్రూన్ అజహాత్ క్షణాత్ నాశితవాన్, తేన జ్యోతిషా అహమానశానః సర్వతో వ్యాప్నువన్ జ్యోతిః ఆక్షి పారమేశ్వర జ్యోతిః ప్రాప్త వానస్మి|**

తాత్పర్యం- అగ్ని అంగార రూపంలో ఉదకపతనం కావించినట్లు, దానివలన ఏకతుడు, ద్వితుడు త్రితుడు అను ముగ్గురు పుట్టినట్లు పురోడాశ కాండంలో **"తత ఏకతో జాయతః, తతో ద్వితో జాయత్, తతస్త్రితో జాయత"** అని వివరించబడింది. దీని పూర్వాపరాలు పరిశీలిద్దాం.

దర్శపూర్ణమాసలలో పురోడాశాత్మక హవిస్సును వినియోగించడానికి ముందుగా ధాన్యాన్ని బియ్యంగా మార్చడానికి దంచాలని **"వ్రీహీనవహన్తి"** అనే శ్రుతిచేత విధించబడింది. కాని దానివలన ప్రాణహింస చేసిన పాపం తటస్థించిందని, ఆ పాపం విముక్తి చేసుకోవడానికి దేవతలు ఆ పాపాన్ని ఏకత, ద్విత, త్రితలయందు ఉంచినారని **"తేదేవా ఆప్యేష్వమృజత"** అను శ్రుతి చెబుతోంది. తరువాత ఆ త్రితుడు ఏ పరమేశ్వర జ్యోతిస్సువలన సముద్ర సదృశమైన పాపంనుండి విముక్తుడు అయ్యాడో, ఏ పరమేశ్వర జ్యోతిస్సువలన సువర్భానురాసురునిచే ఆపాదించబడిన తమస్సునుంచి సూర్యుడు విముక్తుడయ్యాడో, ఆ విషయం తై.సం. 2-1 ప్రశ్నలో **"సువర్భానురాసురస్సూర్యం తమసా విధ్యత్తస్మై దేవాః ప్రాయశ్చిత్తిమైచ్ఛన్"** అని ఉపాఖ్యానంలో వివరించబడింది.

దాని ప్రకారం ఏ పారమేశ్వర జ్యోతిస్సుచేత సమస్త శత్రువులను ఇంద్రుడు ఒక్క క్షణంలో నశింప చేశాడో ఆ జ్యోతిస్సుచే వ్యాపించబడిన వాడినై అట్టి జ్యోతిస్సును పొందినవాడ నయ్యాను, అని అర్థం.

8. యత్కుసీదమ ప్రతీత్తం మయేహయేన యమస్య నిధినా చరామి| ఏతత్త గ్నై అనృణో భవామి జీవన్నేవ ప్రతితత్తే దధామి|

భాష్యం:- **ఇహ అస్మిన్ జన్మని మయా స్వీకృతం యదృణం అప్రతీత్తం కేనప్యాల స్యాదినా ఉత్తమర్ణేభ్యః న ప్రత్యర్పితం యమస్య దుష్ట శిక్షాధికారిణః నిధినా నిధి స్థానీయేన ప్రత్యర్పయితవ్యేన యేన ఋణేన యుక్తోహం చరామి| ఏత దేతేన హోమేన తత్తస్మాత్ తాదృశం ప్రతిదధామి ప్రత్యర్పయామి అనేన హోమేన తుష్టః త్వం అస్మిన్నేవ జన్మని మాం ప్రత్యర్పణ సమర్థం కురు|**

ఈ జన్మలో ఒకరినుంచి ఋణం తీసుకుని, ఏ కారణంచేతనైనా అది ఆ ఋణదాతకు తిరిగి తీర్చలేకపోతే, ఆ ఋణమే దుష్ట శిక్షణాధికారి అయిన యముడికి నిధిస్థానీయం అవుతుంది. అలాంటి ఋణ పాపభారాన్ని వహించి తిరుగుతున్నవాడిని నేను. ఇప్పుడు నాచేత అనుష్ఠించబడిన హోమప్రభావంచేత, నీ అనుగ్రహంవల్ల, జీవించి ఉండగానే ఆ ఋణాన్ని తీర్చివేయగలవాడిని

అవ్వగలను. కనుక ఈ హోమంచే నువ్వు సంతుష్టుడవై, నన్ను ఋణం తీర్చివేయగల సమర్థుడిగా చేయ ప్రార్థన!" అని అగ్నికి ప్రార్థన.

9వ మంత్రం నుండి 20వ మంత్రాంతం వరకు (9-20) ప్రతీకలుగా చెప్పబడ్డాయి.

9. యన్మయి మాతా యదా పిపేష యదంతరిక్షమ్ యదాశసా తిక్రామామి త్రితేదేవా దివిజాతాయదాప ఇమం మే వరుణ తత్త్వాయామి త్వంనో అగ్నేసత్వం నో అగ్నేత్వమగ్నే అయాసి|

యన్మయి మాతా గర్భేసతీ| ఏ నశ్చకారయత్పితా| అగ్నిర్మాతస్మాదేనసః|

భాష్యం : మయి గర్భరూపేణ ఉదరం ప్రవిష్ఠేసతి మాతా యదే నశ్చకార, పరపురుష సేవాదికం కృతవతీ | పితా యదేనః ప్రతి షిద్ధదినే మైథునం చకార | తస్మాత్ పాపాత్ అగ్నిః మాం ముంచతు|

నేను గర్భంలో ప్రవేశించి ఉండగా, నా తల్లి పరపురుష సంపర్కంవలన కాని, నిషేధించబడిన రోజులలో నా తండ్రి మైథునం చేసినందువలన కాని ఏ పాపం సంభవించిందో ఆ పాపం నుండి నన్ను అగ్నిదేవత విముక్తిడిని చేయుగాక!

10. యదా పిపేష మాతరం పితరం| పుత్రః ప్రముదితోధయస్| అహిగ్ం సితౌ పితరౌ మయాతత్| తదగ్నే అనృణో భవామి|

భావం: **యదా బాలః పుత్రః శిశురహం ప్రముదితః ప్రకర్షేణ హృష్టః ధయస్ స్తనం పిబస్ మాతరం పిపేష పీడితవానస్మి తత్ తదానీం పితరౌ మాతాపితరౌ ఉభౌ మయా అహింసితౌ అనుపద్రుతౌ భవతా| తత్ మాతా పిత్రోర్విషయే అగ్నే అహమ్ అనృణో భవామి ప్రత్యుపకార రాహిత్యరూపం యత్పాపం తేన ముక్తో భూయసం|**

నేను శైశవావస్థలో సంతోషంగా స్తన్యం స్వీకరిస్తూ తల్లిని పీడించాను. అదే రీతిగా కాళ్లు చేతులతో తన్నుతూ తండ్రిని కూడా పీడించాను. కాని ఆ సమయంలో నాపై కలప్రేమతో తల్లితండ్రులు ఆ బాధను బాధగా పరిగణింపకపోయినా, ఆ పీడనకు ప్రత్యుపకార రాహిత్యమనే ఏ పాపం నాకు సంక్రమిస్తుందో ఆ పాపంనుండి విముక్తుడను అవుదును గాక!

11. యదన్తరిక్షం పృథివీముతద్యామ్| యన్మాతరం పితరం వా జిహిగ్ం సిమ| అగ్నిర్మాతస్మాదేనసః|

భాష్యం: **అంతరిక్షాదికం లోకత్రయం జిహిగ్ం సిమ వయం హింసిత వంతః ఇతి, తథా మాతరం పితరం చ జిహిగ్ం సి మేతియత్, లోకత్రయ వర్తినాం మాతా పిత్రోశ్చ అనిష్టా చరణమేవ హింసా|**

భూమ్యాకాశ,అంతరిక్షాలనే లోకత్రయ వర్తులైన ప్రాణులకు, మాతాపితరులకు అనిష్టంగా ప్రవర్తించడం ద్వారా ఏ పాపం చేశానో ఆ పాపంనుండి అగ్ని నన్ను విముక్తుడిని చేయుగాక!

12. యదాశ సానిశ సాయత్పరాశసా| యదేనశ్చకృమా నూతనం యత్పురాణం| అగ్నిర్మాతస్మాదేనసః|

భాష్యం: **శసీ హింసాయామితి ధాతుః ఆశసా అభిముఖ్యేన కృతయా హింసయా యత్పాపం నిశసా నితరాం కృతయా హింసయా పరాశసా పరావృత్తేన కృతయా హింసయా, యత్పాపం, అన్యదపి నూతనం ఇదానీంతనం, పురాణం చిరకాల వ్యవహితం, యదేనశ్చకృమ, అగ్నిః తస్మాత్ పాపాత్ మాం ముంచతు|**

ఎదురుగా నిలబడి చేసిన హింసచేతను, ఎల్లప్పుడు చేసిన హింసచేతను, వెనుకనుండి చేసిన హింసచేతను సంపాదించబడిన పాపం నుండి నన్ను విముక్తుని చేయుగాక!

13. అతిక్రామామి దురితం యదేనః| జహామీదిప్రం పరమే సధస్థే| యత్రయంతి సుకృతో నాపిదుష్కృతః| తమారోహామి సుకృతాంను లోకం||

భాష్యం:**- దురితం దుర్గతి కారణం యదేనః తాదృశం అగ్నేః ప్రసాదాత్ అతిక్రామామి కించ పరమ్ ఉత్కృష్టే సధస్థే సహస్థానే విద్వత్సభాదౌకృతామ్, రిప్రం పారమే జహామి, అగ్నేః ప్రసాదాత్ పరిత్యజామి| తతశ్చయత్ర యాస్మిన్ లోకే సుకృతః పుణ్యకృతః యన్తి న కదాచిదపి దుష్కృతోయన్తి| తం సుకృతం పుణ్యకృతాం లోకం, నుక్షిప్రం ఆరోహామి|**

ఓ అగ్నిదేవతా! దుర్గతికారణమైన పాపాన్ని, పండిత సభలలో చేసిన పాపాన్ని, నీ అనుగ్రహంతో పోగొట్టుకుంటున్నాను. పాపవిమోచనానంతరం ఏ లోకంలో పుణ్యాత్ములు తప్ప పాపాత్ములుండరో ఆ పుణ్యలోకాన్ని నేను శీఘ్రంగా చేరుకుంటున్నాను.

14. త్రితేదేవా అమృజతైత దేనః| త్రిత ఏ తన్మనుష్యేషు మామృజే ప్రముంచతు దురితాయాని చ కృమ కరోతు మామనేనసం|

భాష్యం: యోఽయం త్రితః తస్మిన్దేవాః ఏతదేనః పాపం అమృజత| అత ఏవ బ్రాహ్మణే తే దేవా అప్యేష్వమృజత| ఇతి అద్భ్యోజాతాః ఏకత, ద్విత, త్రితాః ఆప్యాః దేవతాః తేపి పాపాపరాధాః, సోఽయంత్రిత్రః ఏతత్పాపం మనుష్యేషు వరామృజే మృష్టవాస్ లేపితవానిత్యర్థః తత్ర సూర్యాభ్యుదితాది మనుష్యేషు అవస్థితాత్ పాపాత్ సకాశాత్ కించత్పాపం యది మామానశే ప్రాప్నుయాత్ ఇతి|

దేవపాపాపరాధ రూపాన్ని త్రితుడు మనుష్యులందు సంక్రమింప చేయడంచేత మనుష్యరూపంలో ఉన్న నాయందు కూడా కొంత పాపం సూర్యోదయ సూర్యాస్తమయ కాలాలలో నిద్రించడం ద్వారా ఏది సంక్రమించి ఉందో, ఆ పాపంనుండి నీవు నన్ను విముక్తుని చేయుదువుగాక!

15. దివి జాతా అప్సుజాతాః|యా జాతా ఔషదీభ్యః| అథోయా అగ్నిజా ఆపః తానశ్శుంధంతు శుంధనీః|

భాష్యం: **యా ఆపః దివిజాతాః ద్యులోకే ప్రాదుర్భూతాః నిత్యాః వర్తన్తే | యాశ్చ అప్సు కర్మసుజాతాః కర్మజన్యా ఆపః కూపాదిష్వా విర్భూతాః యాశ్చ ఔషధీభ్యః రసాత్మకాః ఆవిర్భూతాః ఆపః అధో అపి చ యాశ్చ ఆపః అగ్నిజాః విద్యుతోజాతాః వర్ష్యాః తాస్సర్వా అపి శుంధనీః సర్వస్య లోకస్య శోధయిత్ర్యః నః అస్మాస్ శుంధన్తు శోధయం తు |**

ఏ ఉదకాలు పాతాళ లోకంలో నిత్యమై ఉంటున్నాయో, ఏ ఉదకాలు బావులనుండి వెలుపలికి ఆవిర్భూతమవుతున్నాయో, ఏ ఉదకాలు మెరుపులద్వారా వర్ష రూపంలో వెలువడుతున్నాయో ఆ సమస్త ఉదకాల అభిమాన దేవతలు మమ్మల్ని పాప విముక్తులను చేసి, పవిత్రులను చేసెదరు గాక!

17. యదాపో నక్తం దురితం చరామ| యద్వాదివా నూతనం యత్పురాణం| హిరణ్య వర్ణాస్తత ఉత్పునీతనః|

భాష్యం: **నక్తం రాత్రౌ యద్దురితం చరామ యద్వా దివో యచ్చ దురిత మహని చరామ యత్పాపం నూతనమిదానీంతనం, యత్పురాణం చిరకాల వ్యవహితం హే ఆపః| హిరణ్యవర్ణాః సువర్ణా వత్తేజస్విన్యః యూయం తతః సర్వస్మాత్ పాపాత్ అస్మాస్ ఉత్పునీత ఉత్కర్షేణ శుద్ధాస్ కురుత|**

ఓ సువర్ణ సమయమైన తేజస్సు గల ఉదకాభిమాన దేవతలారా! రాత్రులందు ఏ పాపం ఆచరించామో, పగటి సమయంలో ఏ పాపం ఆచరించామో, ఎప్పుడో చేసిన పాపం, ఇప్పుడే చేసిన పాపం, ఈ సమస్త పాపాల నుండి మిమ్మల్ని మీరు శుద్ధులను చేయుదురు గాక!

ఈ ప్రకారంగా పాప ప్రాయశ్చిత్తరూపమైన కూశ్మాండహోమ అనువాకాలలో ప్రథమానువాకం సమాప్తం. ద్వితీయ,తృతీయ అనువాకాలలో కేవలం పాపప్రతిపాదక మంత్రాలను మాత్రం వివరించే ప్రయత్నం చేస్తాను.

యదదీవ్యన్నృణమహం బభూవాది త్సన్వాసంజగర సౌ జనేభ్యః| అగ్నిర్మాతస్మాదింద్రశ్చ సంవిదానౌ ప్రముంచతాం|

భాష్యం: **అహమదీవ్యస్ పుత్రాది రక్షణరూపం వ్యవహారం కర్తుమసమర్థస్సన్ యదృణం బభూవ| ప్రాప్తవానస్మి యద్వా తదృణం జనేభ్యః ఉత్తమర్ణేభ్యః అదిత్సన్ ప్రత్యర్పయితుమనిచ్ఛన్ సంజగర సమ్యక్ భక్షితవానస్మి| అగ్నిః ఇంద్రశ్చ సంవిదానౌ పరస్పరం ఐకమత్యం గతౌమాం తస్మాదృణాత్ ముంచతాం|**

నేను కుటుంబ రక్షణ చేయడానికి అసమర్థుడనై చేసిన ఋణం తీర్చక, ఆ ధనాన్ని ఖర్చుపెట్టి ఉన్నానో, లేదా చేసిన ఋణాన్ని తిరిగి తీర్చడానికి మనస్కరించక, ఉద్దేశ పూర్వకంగా తప్పించుకున్నారో, ఆ ఋణంనుండి అగ్నీంద్రులిద్దరూ పరస్పర ఐక్యమత్యంతో కూడినవారై, నన్ను ఋణవిముక్తుడిని చేయుదురు గాక!

యద్ధస్తాభ్యాం చకర కిల్బిషాణి అక్షాణాం వగ్నుముపజిఘ మానః ఉగ్రం పశ్యాచ రాష్ట్రభృచ్చతా న్యప్సర సావనుదత్తా మృణాని|

భాష్యం: **యత్ యానికిల్బిషాణి, పాపాని ద్రవ్యాపహరణాదీని అహం హస్యాభ్యాం కృతవానస్మి| అక్షాణాం చక్షురాదీంద్రియాణాం వగ్నుం వంగనీయం గంతవ్యం రూపాది విషయమిత్యర్థః తు విషయం ఉపజిఘ్నమానః ఉపహతం అధర్మహేతుం కుర్వన్ యత్పాపం కృతవానస్మి తాని పాపాత్మకాని ఋణాని ఉగ్రం పశ్యాచ రాష్ట్రభృచ్చ ఇత్యేతన్నామధారిణ్యౌ అప్సరసౌ అనుదత్తాం ఆనురూప్యేణ ప్రత్యర్పయతాం పాపరూపం ఋణం యథా అస్మాకం న భవతి తథా కురుతాం|**

నేను చేతులతో పరద్రవ్యాపహరణం చేయడం, కన్నులతో చూడతగనివి చూడడం, చెవులతో వినకూడనివి వినడం వంటి అధర్మాలు ఆచరించి ఏ పాపాన్ని సంపాదించానో, అట్టి పాపాత్మకమైన ఋణంనుండి **ఉగ్రంపశ్య రాష్ట్రభృత్** అను అప్సరసలు విముక్తుడిని చేయుదురు గాక!

ఉగ్రంపశ్యే రాష్ట్రభృత్కిల్బిషాణి యదక్షవృత్త మనుదత్త మేతత్| నేన్న ఋణాన్నృణవ ఇత్సమానోయమస్యలోకే అధిరజ్జురాయ|

భాష్యం: **హే ఉగ్రం పశ్యే| హే రాష్ట్రభృత్| కిల్బిషాణి ఋణరూపాణి యాని కృతాని యదక్షవృత్తం యత్ ద్యూతే పణాదిరూపం ప్రతిశ్రుతం అప్రణీతం ఏతత్సర్వం అనుదత్తం అనుకూలేయువామేవ దత్తవత్యౌ| ఋణాన్ ఋణయుక్తాన్ అనుదాత్తం అస్మాన్ సమానః సదృశః ఉత్తమర్ణః అధిరజ్జుః బంధనార్థం అధిక రజ్జుయుక్తస్సన్ అయేత్ అస్మానాదాయైవ, నేదృణః నైవర్ణయాత్ ఋణ ప్రయుక్తం బంధనం నకుర్యాత్| కుత్రేతి తదుచ్యతే| యమస్య లోకే మరణాదూర్ధ్వం భావిని గంతవ్యే లోకే|**

ఓ ఉగ్రంపశ్య, రాష్ట్రభృన్నామక అప్సరసలారా! ఋణరూపమైన, జూదంలో పణం వొడ్డి, దానిని తీరుస్తానని తీర్చకపోవడమ్ వంటి పాపాలు చేసిన నన్ను మరణానంతరమందు గంతవ్యమయిన యమలోకంలో ఋణదాత అయిన ఉత్తమర్ణుడు నన్ను రజ్జువులతో బంధించును. కనుక ఆ బంధన విముక్తికోసం మీరే మాకు అనుకూలురై ఋణమును తీర్చేవారు అవుదురు గాక!

సంకుసుకో వికుసుకో నిర్ ఋథో యశ్చనిస్వనః| తేఽస్మద్యక్ష్మ మనాగసో దూరాద్దూర మచీచతమ్|

భాష్యం: **"సంకుసుకః సంక్షేపేణ పరావమానశీలః వికుసుకః పరావమానస్య విస్తారయితా, నిర్ ఋధః క్లేశస్యప్రాపయితా యశ్చ నిస్వనః పిశునః తేతాదృశాః యే వయం స్మః తేభ్యః అస్మత్ అస్మత్తః యక్ష్మం రోగనిమిత్తం పాపం అనాగసః పాపరహితాః దేవాః దూరాద్దూరం అతిశయేన దూరం యథా భవతి అచీచితం చాతయంతు వినాశయంతు|**

పరులను అవమానించే స్వభావం కలిగి ఉండడం, పరావమానాన్ని లోకంలో విస్తరింపచేయడం, ఇతరులకు క్లేశం కలిగించడం, పిశున స్వభావం (పిసినారితనం) కలిగి ఉండడం వంటి లక్షణాలద్వారా మేము ఏ పాపాన్ని పొంది ఉన్నామో, ఆ పాపం మానుంచి దూరం అయ్యేటట్లు, ఎన్నడూ ఏ పాపమూ కూడా మమ్మల్ని స్పృశించని విధంగా దేవతలు మా పాపాలను నశింపచేయుదురు గాక!

ఇంతవరకూ ధర్మాచరణాత్పూర్వం అధర్మాన్ని పరిహరించుకోడానికి ముందుగా పాపవిధాలు చెప్పబడ్డాయి. రౌరవాది నరకప్రాప్త పాపం వేరు, వివిధ నరకములలో ప్రవేశం, జన్మాంతరంలో పశుజన్మ పక్షిజన్మ వంటి వాటికి కారణమైన పాపం వేరు, వ్యాధి దరిద్రం వంటి వాటియొక్క ప్రాప్తిసాధకం అయిన పాపం వేరు, ప్రాయశ్చిత్తాలచే నశించు పాపం వేరు, చేసిన ఋణం తీర్చనందున వచ్చిన పాపం వేరు అని ఇన్ని రకాలైన పాపాలు వాటి లక్షణాల గురించి ప్రాయశ్చిత్త మంత్రాలు, అనగా కూశ్మాండ హోమాంగ మంత్రాలు అర్థంతో స్పష్టంగా వివరించడమైనది. ఇంకా కొన్ని పాపాలు సంఘంచేత చేయబడినవని ధర్మం వివరించే సందర్భంలో చెప్పబడి, వాటి పరిహారమార్గాలుగా చాలా వరకు శ్రౌతకర్మలను వివరించడమైంది.

వాటికి అధికారులైనవారు అందులో నిత్యమైన కర్మలేవో, కామ్యకర్మలేవో బాగా పరిశీలించి, ఆవశ్యకమైన వాటన్నిటినీ నిర్వర్తించాలని, వాటికంటే ముందుగా వాటితో సమానమైన ఫలమిచ్చేవి, వాటికి అధికారం ఇచ్చేవి అయిన స్మార్తకర్మలు ఆచరించాలని ఆచారప్రాప్తమైన ధర్మములు అంటే ఉషఃకాలంలో లేవడం, పరమేశ్వరుని ధ్యానించడం వంటి ధర్మాలు ఆచరించడం గురించి చెప్పి, వాటితో పాటుగా సంధ్యాస్నానాది కర్మల యొక్క ప్రాశస్త్యం చెప్పి, మనకు అందుబాటులో ఉన్నవాటినయినా తప్పక ఆచరించి తరించాల్సిందిగా చెప్పి, వాటితోపాటు పరిహరించాల్సిన అధర్మాలను వివరించి ప్రమాదవశంగా అధర్మం ఆచరించిన సందర్భంలో అనుసరించవలసిన ప్రాయశ్చిత్తాలను వివరించడమైంది. ఇవన్నీ ప్రమాద వశాత్తు ఆచరించిన అధర్మాలకే చెప్పబడ్డాయి గాని, తెలిసుండి/ కావాలని చేసిన పాపాలకు కాదని గమనించాలి.

గో మాహాత్మ్యం

వారి వారి అధికారభేదాన్ని అనుసరించి అనేక కర్మలు ఆచరించాల్సిందిగా వేదంలో బోధించబడింది. అవి - నిత్య, నైమిత్తిక, కామ్య కర్మలని మూడు విధాలు. ఈ కర్మల ఆచరణకు ముఖ్యోద్దేశ్యం తరతమ భేదంతో పాప ప్రక్షాళణద్వారా చిత్తశుద్ధితో ఆ యా కర్మలను అనుష్ఠించినపుడు ఆ యా కోర్కెలు సిద్ధించడానికి అవసరమైన పుణ్యాన్ని ఆర్జించడం అని చెప్పబడింది.

కాని శ్రుతి స్మృతులచే విధించబడిన కర్మను ఆచరించడం అంత సులభ సాధ్యం కాదు. పుణ్యప్రాప్తికి సమర్థులు, అసమర్థులు అయిన ఉభయులనూ ఆ యా కర్మలను అనుష్ఠించైనా అనుగ్రహించడానికి గాను వేదం గో సేవను ఉపాయంగా చెప్పింది.

గోవుయొక్క ఉత్పత్తి విశేషం వర్ణనచేత, గోసేవ వలన శ్రౌతకర్మ అయిన అగ్నిహోత్ర కర్మానుష్ఠాన ఫలం లభిస్తుందని, గోవులు సౌభాగ్య స్థానములని, కళ్యాణ స్వరూపములని, పవిత్రములని, గో ప్రదక్షిణ

వలన విశేషమైన ఫలం ఉంటుందని, గోదానం అన్ని దానాలలోను శ్రేష్ఠమైనదని, వైద్యశాస్త్ర రీత్యా కూడా గోవులు క్షీరాది ప్రదానం ద్వారా రోగాలను నశింపచేస్తూ, ఆరోగ్యం ఇస్తున్నాయని, గోమూత్ర పురీషములు అధిక పంట దిగుబడికి దోహదములై, రైతులకు చాలా ఉపయోగ పడుతున్నాయని వేదంలో వర్ణింపబడుటచేత గోమాహాత్మ్యం సుస్పష్టమవుతోంది.

గోవు-ఉత్పత్తి విశేషము

ఆపోవా ఇదమగ్రే సలిల మాసీత్తస్మిన్ ప్రజాపతి ర్వాయుర్భూత్వా చరత్స ఇమామ పశ్యత్ తాం వరాహో భూత్వా హరత్తాం విశ్వకర్మా భూత్వా వ్యమార్ట్ సా ప్రథత సా పృథివ్య భవత్తత్పృథివ్యై పృథివిత్వం, తస్యామశ్రామత్ ప్రజాపతి స్సదేవాన సృజ తవసూన్రుద్రానాదిత్యాన్తే దేవాః ప్రజాపతి మబ్రువన్|

ఈ సృష్టి క్రమాన్ని వర్ణించేటప్పుడు మహాసృష్టి, అవాంతరసృష్టి అను రెండు రకాల సృష్టులున్నాయి. బ్రహ్మకి నూరు సంవత్సరాలు పూర్తయిన పిమ్మట వచ్చేది మహాప్రళయం, దాని తరువాత జరిగే సృష్టికి మహాసృష్టి అని పేరు. బ్రహ్మకి ఏ రోజుకారోజు సూర్యాస్తమయినపుడు ప్రపంచానికి ప్రళయం సంభవిస్తుంది. కాని ఇది అవాంతర ప్రళయం. మళ్ళీ బ్రహ్మ మరుసటి రోజు ఉదయకాలంలో ఆరంభించే సృష్టిని అవాంతర సృష్టి అంటారు.

మహాప్రళయంలో **"అంభః కిమాసీద్గహనం గభీరం"** వంటి శ్రుతులు సూర్యచంద్రులతో సహా అందరూ లీనమవుతారు అని చెబుతున్నాయి. కనుక మహాసృష్టి ఆరంభంలో వారెవరూ ఉండరు. అవాంతర ప్రళయ కాలంలో ఉదకాదులు లీనం కానందున, అవాంతర సృష్టి ఆరంభంలో ఉదకాలు మిగిలి ఉన్నాయి. ఈ విషయాన్నే **"అపోవా ఇదం"** అనే శ్రుతి బోధిస్తోంది. **"అగ్రే– అవాంతర సృష్ట్యాదౌ ఆప ఏవ ఆసన్"** అంటే అవాంతర సృష్టిలో ఉదకములు మాత్రం మిగిలి ఉన్నాయి. **'సలిలము'** అనే శబ్దానికి ఉదకం అనే అర్థం అయినప్పటికి సలిల శబ్దం **"ఆపోవా ఇదమగ్రే సలిల మాసీత్"** అని వాడబడడంచేత భూతాంతర సంసృష్టం లేకుండా (వేరే ఏ భూతములూ లేకుండా) కేవలం ఉదకములే ఉన్నాయని చెప్పడంలోని తాత్పర్యం.

పంచభూతాలలోని ప్రతి భూతమునకు తనవంతు సగభాగం, మిగిలిన నాలుగింటి వంతు సగభాగంగా ఉంటుంది. పృథివీ తాలూకు సగ భాగం ఆపస్తేజో వాయురాకాశాదుల భాగాలన్నీ కలిపిన సగ భాగంతో కలిసి ఉండడం చేత భూమికి పృథివీ అని వ్యవహారం. అలాగే మిగిలిన నాలుగూ కూడా.

ప్రస్తుతం అవాంతర సృష్టి ఆరంభంలో మిగిలిన ఉదకంలో భూతాంతర సంసృష్టి లేదని చెప్పడానికి మరలా సలిల పదం వాడబడిందన్నారు.

ఇలాంటి ఉదకాలలో నిలబడడానికి తావు లేనివాడై సృష్టికర్త అయిన ప్రజాపతి **"స ప్రజాపతి ర్వాయుర్భూత్వా చరత్"**- వాయు స్వరూపం దాల్చి ఆ ఉదకాలలో సంచరించాడు. **"వాయుర్వా అన్తరిక్ష స్యాధ్యక్షః"** అని శ్రుత్యంతరం కనుక అంతరిక్షానికి వాయువు అధ్యక్షుడవడంవల్ల అక్కడ ఉదకములపై సంచరించాడు. ఆ సంచార కాలంలో ఈ ఉదకాలతో సంసర్గం లేకుండా అందులో గల భూమిని చూశాడని, **"స ఇమామపశ్యత్"** అని శ్రుతి.

పిమ్మట **"తాం వరాహో భూత్వాహరత్"** పిమ్మట ఆ ప్రజాపతి వరాహావతారం ధరించి ఉదకాలకు అడుగుభాగంలో ఉన్న భూమిని దంతాలతో కరచి పట్టుకుని, పైకి తీసుకువచ్చాడు.

తాం విశ్వకర్మాభూత్వావ్యమార్ట్|

భూమిని పైకి తీసుకువచ్చిన తరువాత ఆ ప్రజాపతి సృష్టి చేయదలచిన వాడై, వరాహావతారం విడచి, సృష్టికర్త విశ్వకర్మగా మారాడు. భూమికి సంక్రమించిన ఉదకములను **"వ్యమార్ట్" విశేషేణ మార్జనం కృతవాస్** – విశేష మార్జనం చేసుకున్నాడు- విశేషంగా తుడిచివేశాడు. మార్జనం తరువాత **"సా ప్రథత సా పృథివ్యభవత్ తత్ పృథివ్యై పృథివిత్వం"** అని చెప్పబడింది. **పృథ్-విస్తారే** అని ధాతువు కనుక భూమిని విస్తరింప చేసినందున పై ధాతు సామర్థ్యం వలన భూమికి పృథివి అను పేరు కూడా వచ్చింది.

తస్యామశ్రామ్యత్ప్రజాపతిః– ఆ పృథివియందు ప్రజాపతి స్వశరీరంతో ఉండి **సిసృక్షుః–** సృష్టిని చేయదలచినవాడై తపస్సును చేశాడు. **"సదేవానసృజత వసూన్రుద్రా నాదిత్యాస్"**- పిమ్మట తపస్సామర్థ్యంచేత వసురుద్ర ఆదిత్య దేవతలను సృష్టించాడు.

తే దేవాః ప్రజాపతి మబ్రువన్ ప్రజాయామహా| ఇతి.

పిమ్మట ఆ వస్వాది దేవతాగుణాలు వారికి ప్రజోత్పాదనోపాయం చెప్పాల్సిందిగా ప్రజాపతిని కోరడం జరిగింది.

సోబ్రవీద్యధాహం యుష్మాగ్ స్తపసాఽసృక్షి ఏవంతపసి ప్రజననమిచ్ఛధ్వమితి తేభ్యోగ్ని మాయతనం ప్రాయచ్ఛత్ ఏతేనా యతనేన శ్రామ్యతేతి|

అప్పుడు ప్రజాపతి వస్వాది దేవతలకు నా వలెనే తపస్సు చేసి, తరువాత ప్రజోత్పాదనం కోరండి అని చెప్పి,

తేభ్యోః వస్వాది గణదేవతాభ్యః హోమాఖ్య తపసః ఆధార భూతం అగ్నిం దత్వా తేన అగ్నినా హోమలక్షణం తపః కురుతే త్యుక్తవాస్|

ఆ వస్వాది దేవతలకు హోమరూపమైన తపస్సుకు ఆధారమైన అగ్నిని ఇచ్చి, ఆ అగ్నితో హోమ లక్షణమైన తపస్సును చేయండి అన్నాడు.

తేగ్నినాయతనే నాశ్రామ్యన్తే సంవత్సర ఏకాం గామసృజన్త|

పిమ్మట ప్రజాపతి చెప్పిన విధంగా వస్వాదులు ఒక సంవత్సరం హోమాఖ్య తపస్సు చేసి, దాని సామర్థ్యంతో వారందరూ కలిసి సంవత్సరాంతంలో **"ఏకాం గామసృజన్త"** ఒక గోవును సృష్టించారు. **"తాం వసుభ్యో రుద్రేభ్యః ఆదిత్యేభ్యః ప్రాయచ్ఛన్నేతాగ్ం రక్షధ్వమితి తాం వసవో రుద్రా ఆదిత్యా అరక్షంత"**- సృష్టించబడిన గోవు సమష్టి ద్రవ్యం అవడంచేత, దానికి స్వామి ప్రజాపతి అయినందువల్ల, ఆ గోవును, రక్షణార్థం మొదట వసువులను ఇచ్చారు.

సా రక్షితా సతీ వస్వర్థం గవాం శతత్రయం త్రయస్త్రిగ్ం శతం చ ఉత్పాదయామాస|

వసువులచేత రక్షించబడినదై, ఆ గోవు వారి దగ్గర మూడువందల ముప్పైమూడు దూడలను కన్నది. ఈ ప్రకారంగా రుద్రునిచే రక్షించబడినదై అక్కడ మూడువందల ముప్పై మూడు దూడలను, ఆదిత్యులచే రక్షించబడినదై అక్కడ మూడువందల ముప్పై మూడు దూడలను కన్నది. **"అథసైవ సహస్ర తమ్య భవత్"**. ఈ ప్రకారం ఆ గోవు మొత్తం మూడు చోట్లా కలిసి తొమ్మిది వందల తొంభయి తొమ్మిది దూడలను కని, తనతో కలిపి వెయ్యి సంఖ్యను పూర్తి చేసింది. అందుచేత గోవు సహస్రతమీ శబ్దంచేత సంబోధించబడింది.

గో సేవా ఫలము

గో సేవకు శ్రౌతాగ్ని హోత్రాఖ్య కర్మఫలం చెప్పబడింది.

ప్రజాపతి రహౌషీదాత్మన్వన్మే జాయేతేతి| సోఽజుహోత్| తస్యాత్మన్వదజాయత| అగ్నిర్వాయురాదిత్యః| తేఽబ్రువన్| ప్రజాపతి రహౌషీదాత్మన్వన్మే జాయేతేతి| తస్య వయమజనిష్మహి| జాయతాం న ఆత్మన్వదితి తేఽజుహువుః| ప్రాణానామగ్నిః|తనువై వాయుః| చక్షుష ఆదిత్యః| తేషాగ్ం హు తాదజాయత గౌరేవ|

భాష్యం: **పురా కదాచిత్ చేతనం గిరీ నదీ సముద్రాదికం ఉత్పాద్య ఆత్మన్వత్ – జీవాత్మ యుక్తం చేతనం వస్తుజాతం ఉత్పద్యతామితి కామయిత్వా తత్సాధన హోమం కృతవాన్| తేన హోమేన అగ్ని వాయ్వాదిత్య రూపం చేతనమజాయత| తే అగ్న్యాదయః చేతనం జాయతామితి విచార్య హోమం చక్రుః తత్ర అగ్నిః ప్రాణేభ్యః స్వాహా ఇతి ఏవం ప్రాణానామర్థే హుతవాన్|తథా వాయుః తన్వర్థే ఆదిత్యః చక్షురర్థే తేషాం త్రయాణాం హోమాదూర్ధ్వం ఏకా గౌరేవ అజాయత|**

పూర్వకాలం ఒకప్పుడు ప్రజాపతి గిరి, నది, సముద్రం వంటి చేతన పదార్థాలను సృజించాడు. తరువాత జీవాత్మతో కూడిన చేతన పదార్థం అగ్నియందు పుట్టుగాక, అనే కోరికతో తత్సాధనభూతమైన హోమం చేశాడు. ఆ హోమసారంగా అగ్ని, వాయువు, ఆదిత్యులు ఉత్పన్నులయ్యారు. పిమ్మట వారు ముగ్గురూ "ప్రజాపతి యొక్క హోమసామర్థ్యంచేత మనమెలా జన్మించామో, అలాగే మనకు కూడా చేతన వస్తువు జనించుగాక!" అని ఆలోచన చేసి, తత్సాధనంగా హోమం చేశారు. ఆ చేయడంలో అగ్ని **"ప్రాణేభ్యః స్వాహా"** అనే మంత్రంతో ప్రాణదేవతలకు హోమం చేశాడు. వాయువు శరీరాభిమాన దేవతకు, ఆదిత్యుడు చక్షురభిమాని దేవతకు హోమం చేశారు. ఆ ముగ్గురి హోమానంతరం ఒక గోవు ఉత్పన్నమయింది.

తస్యై పయసి వ్యాయచ్ఛన్త| మమ హుతాదజని మమేతి|

ఉత్పన్నమైన గోవుల పయస్సును అనుభవించడం విషయంలో ఎవరికి వారు తాము చేసిన హోమం వల్లనే గోవు పుట్టిందని, ఆ గో పయస్సు తమకే చెందుతుంది అని కలహించుకున్నారు.

తే ప్రజాపతిం ప్రశ్నమాయన్ | స ఆదిత్యోగ్నిమబ్రవీత్| యతరోనౌజయాత్| తన్నౌ సహాసదితి|

ఈ కలహ పరిష్కారం కోసం ప్రజాపతి దగ్గరకు బయల్దేరారు. మార్గమధ్యంలో ఆదిత్యుడు అగ్నితో ఇలా అన్నాడు.

నౌః ఆవయోః మధ్యే యతరః జయాత్|

ప్రజాపతి విచారణలో మన ఇద్దరిలో ఈ గోవు ఎవరిదని నిర్ధారణ అయినప్పటికీ మనమిద్దరం కలసి దానిని సమష్టిగా అనుభవిద్దాం.

కస్యైకో హౌషీదితి ప్రజాపతిరబ్రవీత్ కస్యైక ఇతి ప్రాణానామహమిత్యగ్నిః| తనువా అహమితి వాయుః| చక్షుషోహమాదిత్యః |

ప్రజాపతి అప్పుడు వారిని "మీలో ఎవరు ఎవరికోసం హోమం చేశారు అని ప్రశ్నించాడు. అప్పుడు వారు-

ప్రాణానామహమిత్యగ్నిః| తనువా అహమితి వాయుః| చక్షుషోహమిత్యాదిత్యః| య ఏవప్రాణానామహౌషీత్| తస్యహుతాదజనీతి| ఆగ్నేర్ హుతాదజనీతి| తదగ్నిహోత్రస్యాగ్నిహోత్రత్వం| గౌర్వా అగ్నిహోత్రం|

వారు తాము ఏ యే దేవతలకు హోమం చేశారో చెప్పడం జరిగింది. అప్పుడు ప్రజాపతి శరీర, చక్షుస్సులు ప్రాణాధీనం కనుక ప్రాణములే ముఖ్యమైనవి. కనుక ప్రాణములకు చేసిన హోమం వల్లనే గోవు జన్మించింది అని నిర్ధారించాడు.

య ఏవప్రాణానామహౌషీత్| తస్యహుతాదజనీతి|

ప్రాణాలే ఆయుః స్వరూపాలైనందువల్ల అగ్నిష్టోమ ప్రకరణంలో ధ్రువ పాత్రలను సోమరసపాత్రను గ్రహించే సమయంలో ఆ పాత్రను ఆయుః స్వరూపంగా వర్ణిస్తూ ఇలా అన్నాడు–

ఆయుర్వా ఏతద్యజ్ఞస్య యద్ధ్రువ ఉత్తమో గ్రహాణాం గృహ్యతే తస్మాదాయుః ప్రాణానాముత్తమమ్"

"సతి కుడ్యే చిత్రలేఖనం"- గోడ ఉంటేనే చిత్రలేఖనం ఉంటుంది అన్నట్లుగా ఆయుస్సు ఉన్న తర్వాతే చక్షురాది ఇంద్రియాలు అవసరం. అందువలన ప్రాణానికి చేసిన హోమమే ముఖ్యము, అత్యుత్తమం అని; ఆ హోమసామర్థ్యం వల్లనే గోవు ఉత్పన్నమైందని ప్రజాపతి నిర్ణయం చేశాడు.

"ఆగ్నేర్ హుతాదజనీతి| తదగ్నిహోత్రస్యాగ్నిహోత్రత్వం"

"అగ్ని సంబంధాత్ హోమాత్ ఉత్పన్నేతి వ్యుత్పత్య అగ్నిహోత్రమితి గౌర్నామ సంపన్నమ్"

అగ్ని సంబంధమైన హోమంవలన ఉత్పన్నమైనందున గోవుకు అగ్నిహోత్ర నామం లభించింది. గోవును సేవించడం శ్రౌతాగ్నిహోత్రాఖ్య కర్మానుష్ఠానంతో సమానమైనది.

గో మాహాత్మ్యము

కొన్ని పూజాస్థానాలను వర్ణిస్తూ, వాటిలో గోవు కూడా ఒక పూజాస్థానం అని **"సూర్యోఽగ్ని ర్బ్రాహ్మణోగావః వైష్ణవః ఖం మరుజ్జలమ్"** అని సూర్యుడు, అగ్ని, బ్రాహ్మణుడు, గోవులు మొదలుగా గల స్థానాలు భాగవతంలో చెప్పబడ్డాయి. ఆగ్నేయ పురాణంలో –

అప్స్వగ్నౌ హృదయే సూర్యే స్థండిలే ప్రతిమాసుచ| ఈప్సితేషు హరేస్సమ్యగర్చనం మునిభిః స్మృతమ్|

ఉదకములు, అగ్ని, సూర్యుడు హృదయారవిందము, స్థండిలము, శిలామయమైన, లేక దారుమయమైన ప్రతిమలు, రసలింగములు లేక హిరణ్మయ లింగములు మొదలగు వాటిలో మీకిష్టమైన వాటిని పూజాస్థానములుగా తీసుకుని, పరమేశ్వరుని అర్చన చేయాల్సిందిగా చెప్పబడింది. వేరొక చోట -

సూర్యే తు విద్యయా త్రయ్యా హవిషాగ్నౌ యజేత మామ్| ఆదిత్యేన తు విప్రస్య్ గోష్వం గయవ సాదినా|

అని చెప్పబడింది. సూర్యుడు వేదత్రయ స్వరూపుడు.

"వేదరశూన్యస్త్రిభిరేతి సూర్యః సైషాత్రయ్యేప విద్యాతపత" అని శ్రుతి బోధిస్తోంది. కనుక వేదత్రయంచే ఉపాసించి సూర్యుని అనుగ్రహానికి పాత్రుడు కావలెనని, **"నా బ్రాహ్మణాస్మేదయితం రూపమే తచ్చతుర్భుజం"**- బ్రాహ్మణ విగ్రహం కంటే చతుర్భుజాకారం ప్రియమైంది కాదని శ్రీకృష్ణభగవానుడు వచించాడు. కనుక బ్రాహ్మణునకు ఆతిథ్యమివ్వడమనే రూపంలో నన్ను అర్చించి, గోవులకు తృణాదికం సమర్పించడం ద్వారా నన్ను అర్చించి, నా అనుగ్రహం పొందాల్సిందని శ్రీ

కృష్ణపరమాత్మ వచించినట్లు భాగవతంలో చెప్పబడింది. కనుక గోవులకు సేవ చేయడం ద్వారా పరమేశ్వరానుగ్రహం పొందవచ్చునని చెప్పినట్లు అయింది.

ఇంకా, **"గవామంగేషు తిష్ఠతి భువనాని చతుర్దశ|"** అనే స్మృతి ప్రకారం 14 లోకాలు, దేవమానవ సకల చరాచర జీవరాశులు గోశరీరమందు ఉన్నాయని అర్థం. బాహ్యదృష్టితో గోవు మనకు గ్రామ్య పశువుగా గోచరించినప్పటికీ, ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే, అనితర సాధారణమైన పవిత్రత కలది, పూజాస్థానం కలదని చెప్పక తప్పదు. అందుచేత సూక్ష్మ క్రిములను నశింపచేయడానికి ఇళ్ళు అలకడానికి, ముంగిళ్ళలో కల్లాపు చేయడానికి మనవాళ్లు ప్రాచీనకాలంనుండి గోమయమును వాడడం సంప్రదాయంగా వస్తోంది. ఇది కేవలం ఒక మూఢనమ్మకంగా కొట్టిపడేయడానికి వీలు లేదు. ఎందుకంటే మహాపాతకములను కూడా నశింపచేయు శక్తి గోమూత్ర పూరీషాదులలో ఉండడం చేతనే ప్రాయశ్చిత్తంగా పంచగవ్య ప్రాశన ధర్మశాస్త్రంలో చెప్పబడింది.

పంచగవ్యం అంటే **1.గోమూత్రం 2.గోపురీషం 3.గోపయస్సు 4. గోదధి 5. గోఘృతము**. లోకంలోని **84 లక్షల** జీవరాసులలో ఏ పశువు యొక్క మూత్రపురీషాలను వాడడం లేదు. వాటి మూత్ర పురీషాలు దుర్గంధంతో నిండి ఉంటాయి. కానీ గోమూత్ర పురీషాలు దుర్గంధం లేకుండా ఉండడమే కాక, ఇతర దుర్గంధాలను పోగొట్టే శక్తిని కలిగి ఉంటాయి.

గోపురీషంతో ఉత్సర్జన చేసిన భూమిలో ఉత్పన్నమైన తృణ విశేషాలను వేదచోదిత కర్మలందు వినియోగించాల్సిందిగా ఒక కామ్యేష్టి సందర్భంలో వేదం విధించింది.

ఇంద్రాణ్యై చరుం నిర్వపేత్ యస్య సేనాఽసగ్ం శితేవస్యాదింద్రాణీవై సేనాయై దేవతేం ద్రాణీ మేవస్వేన భాగే యేనోపధావతి సైవాస్య సేనాగ్ం సర్గ్ శ్యతి|

యుద్ధ సమయంలో శత్రుసేనను జయించడానికి తగినంత **'అసగ్ం శితా'** తీక్షత లేని సమయంలో ఇంద్రాణీ దేవతాకమైన చరుద్రవ్యకమైన యాగం చేయాలని శ్రుతి విధించింది. దాని ప్రకారం యాగంలో సేనాని అయిన ఇంద్రాణీ దేవతకు సేనను తీక్ష్ణత గలదానిగా చేయగలదని **"సైవాస్య సేనాగ్ం సర్గ్ శ్యతి"** అని చెప్పబడింది.

ఇది ఇలా ఉండగా, ఈ యాగంలోనికి ప్రకృతి యాగంనుండి ఇధ్మము, అనగా సమిధలచే అగ్నిలో హోమం చేయదగినది అని చెప్పబడింది. ఇక్కడ ఒక విశేషం ఉంది.

బల్బజాన పీధ్మే సన్నహ్యేత్ గౌర్యత్రాధిష్కన్నాన్యమేహత్ తతో బల్బజా ఉదతిష్ఠన్ గవామేవైనం న్యాయమపినీయగా వేదయతి| ఇతి

అతిదేశంచేత ప్రాప్తమైన ఇధ్మమందు బల్బజములను బంధించాలని విధించబడింది. బల్బజములంటే ఏమిటి?

అధిష్కన్నా అధికం పురీషం ప్రాప్తా గౌః యత్ర దేశే న్యమేహత్ - నితరాం మూత్రం కరోతి, తతో దేశాత్ బల్బజా ఉత్పద్యన్తే. తేషాం బల్బజానాం బంధత్వేన యమమానం గవామేవ న్యాయం, అపినీయ-ప్రాప్య గాం వేదయతి – లంభయతి – గవాం న్యాయః స్వాధీనతయా శిక్షితత్వం| యథా ధేనవః శిక్షితాః ప్రతిదినం అరణ్యేగత్వా యత్ర క్వాపి పలాయన లక్షణం చాపలం పరిత్యజ్య కాలే స్వగృహమేవ ఆయాన్తి అనాయేసేన దుహన్తే| యథా బలీవర్దాః శిక్షితాస్సన్తః రథాదీనాం స్వామిన ఇచ్ఛానుసారేణ వహన్తి| తథా సేనాయాః స్వవశత్వేన కార్యకారిత్వం గో న్యాయః|

ఏ భూమియందు గోవు అధికంగా మూత్ర పురీషోత్సర్జనం చేస్తుందో ఆ భూమియందు ఉత్పన్నమైన తృణ విశేషాలకు బల్బజములు అని పేరు. ఆ బల్బజములను ఇధ్మమందు బంధించాలి. ఏ ప్రకారంగా గోవులు ఏ ప్రకారంగా యజమాని నుండి శిక్షణ పొందినవై, ఆహారం కోసం అడవికి వెళ్ళి, అక్కడి నుండి ఎటూ పారిపోకుండా, సకాలంలో యజమాని ఇంటికి చేరి, అనాయాసంగా పాలు ఇస్తున్నాయో, అదే తీరుగా అలా బంధించడం వలన గోశబ్ద వాచ్యములైన బలీవర్దములు (వృషభము, ఎద్దు) కూడా శిక్షణ పొందినవై, రథ శకటారూఢులైనవారి ఇచ్ఛాప్రకారం రథ శకటాదులను ముందుకు తీసుకుపోగలవు. అలా ఆ సేన యజమానియొక్క ఇచ్ఛాప్రకారం స్వాధీనంలో ఉండడం **'గోన్యాయం'**గా చెప్పబడుతోంది.

గోమూత్ర పురీషోత్సర్జన ప్రదేశంలో ఉద్భవించిన తృణాలను అతిపవిత్రమైన వాటిగా స్వీకరించి, శ్రౌత కర్మలలో వినియోగించడం గో పవిత్రతను తెలియచేస్తుంది. అందుచేత గోవు పూజనీయం. గోవు కాక ఇతర పశువులు, జంతువులు మూత్రపురీషోత్సర్జనం చేసిన ప్రదేశం అపవిత్రం అవుతుందని, **"పథి జాతాస్ కుశాస్ వర్జయేత్"**(గౌ.సూ) అని, ఆ మార్గాలలో ఉత్పన్నములయిన కుశలను, దర్భలను వర్జింప తగినవిగా చెప్పబడింది.

గోవులు కళ్యాణ స్వరూపములు, కళ్యాణ ప్రదములు

ఆగావో అగ్మన్నుతభద్ర మక్రన్| సీదంతు గోష్ఠేరణయం త్వస్మే ప్రజావతీః పురురూపా ఇహస్యుః| ఇంద్రాయ పూర్వీరుష సోదుహానాః|

గోవులు మా ముంగిలిలోకి, వాకిలిలోకి వచ్చుగాక! మాకు మంగళము చేకూర్చుగాక! మా గోశాలలో సమృద్ధిగా నివసించు గాక! మమ్మల్ని రమింపచేయు గాక! మా ఇంటిలో సూర్యోదయానికి ముందే పాడ్యమి రోజున ఇంద్రార్థం దధియోగము చేయడానికి పాలను ఇచ్చుగాక!

భద్రం గృహం శృణుథ భద్రవాచః|

ఓ గోవులారా! అంబా! అంటూ మంగళధ్వనులు చేసే మీరు మా ఇంటిని మంగళప్రదంగా ఉండేలా చేయండి.

అంబారవేత్యాది మంగళవాగ్యుక్తాభిః గోభిః వత్సైశ్చ గృహం రమణీయం భాసతే|

మంగళవాక్కులు గోవులతో దూడలతో గూడిన గృహం రమణీయంగా భావిస్తుంది. ఇంకా,

గావోభగోగావ ఇంద్రోమే అచ్ఛాత్| గావస్సోమస్య ప్రథమస్య భక్షః| ఇమా యాగావస్స జనాస ఇంద్రః ఇచ్ఛామీధృదా మనసా చిదింద్రం| యూయం గావో మేదయథా కృశంచిత్| అశ్లీలం చిత్కృణుధా సుప్రతీకం| భద్రం గృహం కృణుధ భద్రవాచః| బృహద్వోవయ ఉచ్యతే సభాసు| ప్రజావతీ స్సూయవ సగ్ం రిశన్తీః| శుద్ధా అపస్సు ప్రపాణే పిబన్తీః మావస్తేన ఈశత మాఘశగ్ం సః| పరివో హేతీ రుద్రస్య వృంజ్యాత్| ఉపేదముప పర్చనం| ఆసు గోషూపపృచ్యతాం| ఉపర్ష భస్యరేతసి, ఉపేంద్ర తవవీర్యే| (భాష్యం)

గోవులు ఐశ్వర్య స్వరూపాలు. పాలు, పెరుగు, ఘృతం మొదలయినవి ఇంటినిండా సమృద్ధిగా ఉండడం ఐశ్వర్య లక్షణం. గోవులున్న ప్రదేశానికి ఆ సౌభాగ్య లక్షణం ఉంటుంది. నిర్మలమైనవి, కురూపులు కాకుండా, చక్కని కొమ్ములు, పృచ్ఛభాగం కలిగి ఉండి సురూపము కలిగిన గోవులు ఇంటి యజమానికి సౌభాగ్య స్థానములని చెప్పవచ్చును.

అందుచేతనే సోమయాగంలో ఆధ్వర్యవాదులను ఋత్విక్కులుగా ఆహ్వానించడానికి, వారి వద్దకు సోమప్రవాక అనే వ్యక్తి వెళ్ళినపుడు అతడిని అధ్వర్యుడు కాబోయే ఋత్విక్కు **"కచ్చిత్కల్యాణ్యో దక్షిణాః"** అని కళ్యాణస్వరూపాలైన ఎన్ని గోవులు దక్షిణగా ఇవ్వబడతాయి? అని అడుగుతాడు. దీనికి-

సన్తి కళ్యాణ్యో దక్షిణాః సురూపాః బహుమూల్యాః ద్వాదశ శతః గావః|

అని సమాధానం చెప్తాడు. "మంచి సుందరస్వరూపం కలిగి, బహుమూల్యం కలిగిన, కళ్యాణ స్వరూపాలైన 112 గోవులు దక్షిణగా ఇవ్వబడతాయి" అని. కల్యాణ్య అను పదం గోవులకు పర్యాయ పదంగా వాడబడడంచేత నైజంగా గోవులు కల్యాణస్వరూపాలని తెలుస్తోంది.

గావస్సోమస్య ప్రథమస్య భక్షః|

మైత్రావరుణ గ్రహప్రచార సమయంలో **"పయసైవ మే సోమగ్గ్ శ్రీణన్నితి"** పయస్సుతో సోమం కలుపవలెనన్న మిత్రుడి కోరిక ప్రకారం **"తస్మా న్మైత్రా వరుణం పయసా శ్రీణాతి"**- మిత్రావరుణులకు సోమరసం గ్రహించేటప్పుడు గోపయస్సుతో ఆ రసాన్ని శ్రయణం చేయాలని (కలపాలని) విధి. ఆ విధంగా గోపయస్సు సోమునికి ప్రథమ భక్ష్య యోగ్యత పొందింది. అందుచేతనే

బృహద్వోవయ ఉచ్యతే సభాసు|

అనే శ్రుతిలో "ఓ గోవులారా! మీ పయస్సు యజ్ఞశాలలో చాలా గొప్పదని ప్రశంసించబడుతోంది."

ఇమాయాగావస్సజనా స ఇంద్రః| ఇచ్ఛామీ ద్ధృధా మనసా చిదింద్రం|

ఓ జనులారా! ఈ గోవులేవైతే ఉన్నాయో, అవే ఇంద్రస్థానాపన్నములు.

ఇంద్రోహి గాః పాలయతి| తస్మాద భేదోపచారః|

ఇంద్రుడు గోవులను పాలించుచున్నాడు. అందుచేత అభేదోపచారము చేసి, గోవులే యజమానికి ఇంద్రస్థానాపన్నములు, అనగా పాలకులు అని అర్థం.

దీని వలన గోశాలలో ఉన్న గోవులు యజమానికి, విశ్వానికి కూడా మంగళం చేకూరుస్తాయని, గోవులు కళ్యాణశబ్ద వాచ్యములని, యజమానికి సౌభాగ్య స్థానములని, స్వామి స్థానం పొంది ఉన్నాయని, యజ్ఞశాలలో గోక్షీర ఘృతాధికం స్తుతించబడడంద్వారా గోవుల మాహాత్మ్యం వేదంచేత ప్రతిపాదించబడినట్లుగా నిరూపించబడింది.

గోదాన మహిమ

న గోదానాత్పరం దానం కించిదస్తీతి మే మతిః| సా గౌర్న్యాయార్జితా దత్తా కృత్స్నం తారాయితే కులం|
గోప్రదానేన నరో యాతి బ్రహ్మలోకం సనాతనమ్| విమానే నార్కవర్ణేన దివ్యరత్నవిరాజతా| (మ.భా.)

గోదానం కంటే విశిష్టమైన దానం లేదు. ఆ గోవు న్యాయమైన సంపాదనతో పొందినదైనట్లయితే, ఆ గోదానంచేత సమస్త కులమూ తరిస్తుంది. మంచి లక్షణాలు గల గోవును యోగ్యత గల గ్రహీతకు దానం చేస్తే, అర్కవర్ణం కలిగి, దివ్యరత్నాలతో ప్రకాశించే దివ్యవిమానం ఎక్కి శాశ్వతమైన బ్రహ్మలోకం చేరుకుంటారని చెప్పబడింది. వేదంలో కూడా గోదాన మహిమ విశేషంగా చెప్పబడింది.

సహస్రతమ్యావై యజమానస్సువర్గం లోకమేతి సైనగ్ం సువర్గలోకం గమయతి|

గోవు సహస్రతమ స్వరూపమని గోవు పుట్టుక అనే శీర్షికలో వివరించడమైనది. ఆ విధంగా సహస్రతమీ వాచ్యస్వరూపమైన గోవును దానం చేసిన యజమాని స్వర్గలోకమును పొందగలడు. స్వర్గలోకము చేరదలచినవాడు ఈ క్రింది మంత్రంతో గోవును దానం చేస్తే, స్వర్గలోకమే కాక జ్యోతిష్మల్లోకమును కూడా పొందగలడు.

సామా సువర్గం లోకం గమయే త్యాహ సువర్గమే వైనం లోకం గమయతి సామా జ్యోతిష్మన్తం లోకం గమయే త్యాహ జ్యోతిష్మన్తమే వైనం లోకం గమయతి|

ఇంకా,

సామాసర్వాన్పుణ్యాన్లోకాన్ గమయేత్యాహ సర్వానే వైనం పుణ్యాన్లోకాన్ గమయతి| (తై.సం. 7-1-7)

ఈ మంత్రంతో దానం చేస్తే స్వర్గలోక జ్యోతిష్మల్లోకాలను చేరగలరు. అనగా, దాతకు ఆదిత్య, ఇంద్రాది పుణ్యలోక ప్రాప్తి కలుగచేసే శక్తి గోదానం కలిగి ఉందని అర్థమవుతోంది.

సామా ప్రతిష్ఠాం గమయ ప్రజయా పసుభిస్సహ పునర్మ విశతాద్ర యిరితి ప్రజయై వైనం పశుభీరయ్యాం ప్రతిష్ఠాపయతి| (తై.సం.)

ప్రతిష్ఠాం స్థిరావాస స్థానం|ప్రజయా పసుభిస్సహరయింధనం పునః మాం ప్రవిశతు| (భాష్యం)

గోదానం చేసేటప్పుడు ఈ మంత్రం పఠిస్తే స్థిరావాసం, ప్రజా పశ్వాదులతో కూడిన ధనం ప్రాప్తిస్తాయి. ఇంకా అహీన క్రతువులో సహస్రతమీ స్వరూపమైన గోదానము విధించబడింది.

తామగ్నీధ్రేవా బ్రహ్మణే వా హోత్రేవోదేద్గాత్రేవాధ్వర్యవే వాదధ్యాత్|

సహస్రతమీ స్వరూపమైన గోవును క్రతునిర్వాహకులైన ఋత్విక్కులలో ఆగ్నీధ్రునికీ కాని, బ్రహ్మకు కాని, ఉద్గాతకు కాని, అధ్వరుడికి కాని ఇవ్వాలని, ఆ విధంగా ఇవ్వబడిన గోవు ఒక్కటే అయినా,

సహస్రమస్య సా దత్తా భవతి సహస్రమస్య ప్రతిగృహీతమ్ భవతి|

వెయ్యి గోవులను ఇచ్చినట్లవుతుందట. అంటే, దాతకు సహస్ర గోదాన ఫలితం, ప్రతిగ్రహీతకు సహస్ర గో ప్రతిగ్రహ దోషం సంభవిస్తాయని అర్థం. అందుకే ప్రతిగ్రహీతకు ఆ దోషం లేకుండడానికి ప్రతిగ్రహ సమయంలో జపించాల్సిన మంత్రాన్ని వేదం నిర్దేశించింది.

ఏకాసి న సహస్ర మేకాంత్వా భూతాం ప్రతిగృహ్ణామి|

ఓ గోమాతా! నువ్వు ఒక్క గోవువి మాత్రమే. వేయి కాదు. అందువల్ల ఒక్క గోవుగానే నిన్ను నేను ప్రతిగ్రహించుచున్నామను. సహస్ర గో స్వరూపంగా ప్రతిగ్రహించడంలేదు. నీవు కూడా సహస్ర గో స్వరూపంగా కాక ఒక్క గోవుగానే మా ఇంట్లో ప్రవేశించుదువు గాక!

ఏకా మా భూతావిశమా సహస్రమితి|

పై మంత్రం ఉచ్చరించి ప్రతిగ్రహం చేసిన తరువాత జపించదగిన మంత్రం:

స్యోనాఽసి సుషదాసు శేవా స్యోనామా విశసుషదా మావిశసు శేవామావిశ|

ఓ సహస్రతమీ స్వరూపమయినా గోవా! నీవు సుఖప్రదమైన దానవు. దోహనకాలంలో (పాలు పితికేతప్పుడు) సుఖంగా ప్రాప్తించడానికి శక్యమైన దానవు. కండూయనం ద్వారా సుఖంగా

ప్రాప్తించడానికి శక్యమైన దానవు. కనుక ఇన్ని లక్షణాలతో కూడిన దానివై, నన్ను (మా గృహాన్ని) ప్రవేశించుము.

"నైనగ్ం హినస్తి" లోకంలో ప్రతిగ్రహీతకు ప్రతిగ్రహ జన్య దోషం ఉంటుంది. అందులోనూ విశేషంగా గోవును ప్రతిగ్రహం చేసినవారికి సహస్ర గోవుల ప్రతిగ్రహ దోషం సంభవిస్తుంది కనుక పై మంత్ర జప సామర్థ్యంచేత ఆ ప్రతిగ్రహీతను ప్రతిగ్రహదోషంచేత హింసింపకుము అని ప్రార్థన.

సారాంశం ఏమిటంటే ఒక గోవును దానం చేస్తే సహస్ర గోదాన ఫలితం లభిస్తుందని, దాతకు పుణ్యలోక ప్రాప్తి, ప్రజా,పశు ధనంతో కూడిన సుస్థిరమైన ఆవాస ప్రాప్తి కలుగుతాయని, ప్రతిగ్రహీతకు సహస్ర గో ప్రతిగ్రహజన్య దోషం సంభవిస్తుందని, కనుక ప్రతిగ్రహీత

ఏకాసి న సహస్రం, ఏకామా భూతావిశ, స్యోనాసిసుష దాసుశేవా|

వంటి మంత్రాలను జపిస్తే, ఆ దోష పరిహారం కలుగుతుందని శ్రుతి ప్రతిపాదించడం వలన గోదానం కడు శ్రేష్ఠమైనదిగా చెప్పబడింది. కనుకనే వేదవ్యాసులు

ఏకేనైవతు భక్తేన యః క్రీత్వా గాం ప్రయచ్ఛతి| యావన్తి తస్యా రోమాణి సంభవన్తి శతక్రతో| తావత్ప్రదానాత్ స గవాం ఫలమాప్నోతి శాశ్వతమ్|

లోకంలో భక్తితో అర్హుడైనవాడికి ఎవడు గోవును దానం చేస్తాడో, అట్టి వాడికి ఆ గోవుకు ఎన్ని రోమాలున్నాయో, అన్ని సంవత్సరాలు శతక్రతువులు చేసిన ఫలం సంప్రాప్తిస్తుందని పేర్కొన్నారు.

కర్షణోపయోగం

గోవు అనడ్వాహ రూపంలో మెడమీద నాగలి కాడిని మోసి, భూమిని దున్నడంద్వారా ధాన్యం పండించి ప్రజలను పోషిస్తోంది.

తస్మాత్పూర్వార్ధేనానడ్వాన్ భునక్తి జఘనార్ధేన ధేనుః|

ధేను రూపంలో పాలనిచ్చి ప్రజలను పోషిస్తోందని ఈ శ్రుతి ప్రతిపాదిస్తోంది. వ్యవసాయదారులకు ఎరువు సరఫరా చేయడం ద్వారా గోవు మిక్కిలి ఉపయోగపడుతోంది. ఆవుపేడను ఎరువుగా వాడితే అందులో విరివిగా నత్రజని, ఫాస్పేటు ఉన్నట్లుగా ఆధునిక వైజ్ఞానికంగా కూడా తేలింది. కృత్రిమ రసాయనిక ఎరువులకంటే గోపురీషంతో తయారుకాబడిన ఎరువు చాలా ఉపయోగకారి. కనుకనే వేదంలో-

యన్మైత్రా వరుణీం వశామాలభతే మిత్రేణైవ యజ్ఞస్య స్విష్టగ్ం శమయతి వరుణేన దురిష్టం నార్తిమార్ఛతి యజమానః| (తై.సం.6-6-7)

మైత్రావరుణీం గాం వశామనూ బంధ్యామాలభేత| ఇతి సూత్రమ్

అనుష్ఠించిన యజ్ఞానికి స్విష్టప్రాప్తి కోసం, దురిష్ట నాశనం కోసం మిత్రావరణ దేవతాకం అయిన, వంధ్య అయిన గో ద్రవ్యమైన అనూబంధ్య అనే పేరు గల పశుయాగం యజ్ఞం యొక్క అవభృథానంతరం చేయాల్సిందిగా శ్రుతి సూత్రకారులు విధించారు.

భాష్యం: **వశాలంభేన తుష్టః మిత్రః స్విష్టం పాలయతి, వరుణః దురిష్టం నాశయతి తతః యజ్ఞస్య సుస్థితత్వాత్ నిష్ఫల స్వరూపా మార్తిం యజమానః న ప్రాప్నోతి ఇతి|**

సక్రమంగా అనుష్ఠితమైన యజ్ఞాంగానికి మిత్రుడు అధిపతి. ఆ విధంగా కాని యజ్ఞాంగానికి దురిష్టమని పేరు. దీనికి వరుణుడు అధిపతి. ఈ ఇద్దరు దేవతలను ఉద్దేశించి గవాలంబము అనే అనుబంధ యాగం అనుష్ఠించినట్లయితే, దానివలన సంతుష్టి చెందినవారై మిత్రుడు యజ్ఞాన్ని సుభిక్షం చేయగలడు, వరుణుడు యజ్ఞానుష్ఠానకాలంలో తటస్థించిన యజ్ఞవైగుణ్యం అనే దురిష్టాన్ని నశింపచేయగలడు. అందుచేత అనుష్ఠించిన యజ్ఞం సగుణమై యజమానికి ఫలప్రాప్తిని అందించడానికి అనుబంధ్యాయాగము అనే పశుయాగం విధించబడింది. ఈ అనుబంధ్యా పశు యాగాన్ని వేదం ఇలా ప్రశంసిస్తోంది.

యధా వై లాంగలేనోర్వరాం ప్రభిందం త్యేవ మృక్సామే యజ్ఞం ప్రభిన్తోయన్మైత్రావరుణీం వశామాలభతే యజ్ఞాయైవ ప్రభిన్నాయ మత్యమన్వవాస్యతి శాంత్యై|

భాష్యం:- **"సర్వసస్యోపేతా భూమిః" ఉర్వరా, తస్యాం కృష్టాయాం కర్షణమనుమత్యం తత్రక్షిపన్తి. శక్త్యాధాన సాధనం గోమయాది ద్రవ్యం మత్యం| మతం అభిమతం ఫలమర్హతీతి మత్యమ్| తద్వత్ ఋక్సామాభ్యాం కర్షణవత్ యోగ్యతా మాపాదితస్య యజ్ఞస్య వశాలంభేన మత్యం| మత్యప్రక్షేపవత్ ఫలజనన శక్తిర్భవతి| తేన చ అశక్తి లక్షణస్య దోషస్య శాంతిర్భవతి.**

ఉర్వరా అంటే సస్యశ్యామలమైన భూమి. అలాంటి భూమిని లాంగలం(నాగలి)తో దున్నిన పిమ్మట అందులో కర్షకులు మత్యమును, అంటే ఆ భూమికి మనం అడిగినంత ఫలం ఇవ్వగలిగే యోగ్యతను, శక్తిని ఇవ్వడానికి సాధనమైన గోమాయాది ద్రవ్యాన్ని ఉంచుతారు. అదే తీరుగా ఇక్కడ యజ్ఞమనే భూమికి యజ్ఞంలో వినియోగించే ఋక్సామమనే నాగలితో దున్ని, ఆ యజ్ఞము అనే భూమికి ఫలదానశక్తిని ఇవ్వడానికి యోగ్యమైన ఫలజనన శక్తి గోవు పశువుగా గల అనుబంధ్యాయాగం వలన కలుగుతుందని శ్రుతి విధిస్తోంది.

ఈ సంధర్భంగా లోకంలో కర్షకులకు గోమయమనే ఎరువు అధిక ఫలసాధనమని తెలుస్తోంది. అంతే కాదు, గోవుల పాదములలో ఘృతం ఉండడంచేత గోవులచే భూమిని దున్నించినప్పుడు ఆ ఘృతం భూమియందు, సస్యమందు స్రవిస్తుందని, అది చాలా బలవర్ధకమని అందుచేత గోవుకు **"ఘృతపదీ"** అని పేరు వచ్చిందనీ **"కర్షక విజ్ఞానం"** అనే శీర్షికలో వివరించడం జరిగింది.

ఊర్జస్వతీః పయస్వతీః ప్రజావతీరనమీవా అయక్ష్మా మావస్తేన ఈశత|

ఆహితాగ్ని యొక్క ఆ దర్శయాగంలో సాన్నాయ్యం, అంటే దధిపయస్సుల కోసం గోవులను మోదుగు శాఖతో అరణ్యంలో మేతకోసం పంపించే సమయంలో వినియోగింపబడే పై మంత్రానికి అర్థం.

హే అఘ్న్యాయాః ఊర్జస్వతీః పయస్వతీః ప్రజావతీః (తస్మాద్గావః పశూనాం భూయిష్ఠాః) అనమీవాః అయక్ష్మాః మానస్తేన ఈశత|

ఓ గోవులారా! అత్యంత బలప్రదమైన, ఎక్కువ పాలు ఇచ్చేటటువంటి, అధిక సంతానం కలిగినట్టి, కలిగిన సంతానమంతా క్షేమంగా ఉన్నట్టి, బహుసంతానం గల గోవులు పశువులలో పూజనీయములు. క్రిమిదోష రహితములైన, రోగాంతర హీనములు, యక్ష్మాది రోగాలను అంటే శ్వేతాది రోగాలను నశింపచేయునట్టి గోవులను చోరులు అపహరించరు గాక.

ఈ మంత్రం గోవులు బలప్రదమైనవై, బహుక్షీరములను, బహుసంతానమును ఇవ్వగలవని, మూత్ర పురీషములద్వారా క్రిమిరోగములను నశింపచేయగలవని చెప్పినట్లయింది. కనుకనే వేదంలో

మరొక ప్రకరణంలో **"యూయం గావో మేద యథాకృశంచిత్|అశ్లీలం చిత్కృణుధా సుప్రీతకమ్|"** అని చెప్పబడింది.

భాష్యమ్: **హేగావః, యూయం కృశమపి పురుషం వత్సం వా మేదయధ మేదస్వినం పుష్టం కురుత| అశ్లీలంచిత్ కురూపమపి పురుషం సుప్రతీకం కృణుత ఘృతాదినా పోషయిత్వా శోభనావయవం కురుథ**

ఓ గోవులారా! బాగా కృశించిన పురుషుని లేదా దూడను మీ క్షీరంద్వారా మంచి పుష్టియుక్తంగా చేయండి. కురూపిగా ఉన్నవారిని క్షీరం సేవించడం ద్వారా కానీ, గోమూత్ర శిలాజిత్తు వంటి ఔషధాలు సేవించడంద్వారా కానీ, గోఘృతం సేవించడంద్వారా కాని మంచి రూపవంతునిగా చేయండి! అని ప్రార్థించడం చేత గోవులు మనకు ఆరోగ్య ప్రదాతలని తెలుస్తోంది.

ఆవుపాలు ఆరోగ్యం అని ఆయుర్వేద వైద్యులు వేయి నోళ్లతో చెబుతున్నారు. ఆవుపాలు ఆయుర్వర్ధకం, బుద్ధిని పెంచేవి కూడా! ఆవుపాలు మృధుమధురం, స్నిగ్ధం, ప్రసన్నం, పథ్యం, జీవనీయం ఇంకా రుచికరంగా ఉంటాయి. శరీరానికి కాంతిదాయకం, పుష్టిదాయకం, ప్రజ్ఞాకారకం, వీర్యవర్ధకం కూడా. ఇలా అనేకానేక గుణాలుండడం చేత గోమాత పాలు మానవుల పాలిట మంచి ఆరోగ్యకారకం అని వేదంతో పాటుగా ఆయుర్వేదశాస్త్రం కూడా ఆ యా గుణాలను ప్రత్యక్షంగా దర్శించుకుని మరీ చెబుతోంది.

వేదంలో **"మహీమూషు మాతరం"** అనే మంత్రంలో భూమిని మాతృశబ్దంతో ప్రయోగించడం జరిగింది. భూమి యొక్క ఋణం, జన్మనిచ్చిన మాతృదేవత ఋణం జన్మించిన తరువాత బహువిధాలుగా ఉపకరిస్తున్న గోమాత ఋణం తీర్చడం దుస్సాధ్యమని మన శాస్త్రాలు చెబుతున్నాయి. అందుకే, గోవులను కరుణించి రక్షించిన మానవుడు ఉత్తమోత్తముడని, తనకి ఇష్టుడని గీతాచార్యుడు పేర్కొన్నాడు.

కాళిదాసకృత రఘువంశంలో దిలీపుడు దేవేంద్రుడినుంచి వీడ్కోలు తీసుకుని, ఋతస్నాత అయిన ధర్మపత్నిని కలుపుకునే నిమిత్తం వచ్చే తొందరలో మార్గమధ్యంలో ఉన్న గోవును పూజించకుండా వెళ్లినందుకు దిలీపుడి కోరిక నెరవేరకపోవు గాక! అని గోవు శపించింది. తరువాత ఆ దంపతులిద్దరూ గోసేవ చేసుకున్న పిమ్మట దిలీపుడు గోవును అనాదరణ చేసిన పాపంనుండి విముక్తుడైనట్లుగా చెప్పబడుతోంది.

గోప్రదక్షిణం విశేషమైన ఫలితాన్నిస్తుందని, మహాభారతంలో ఆనుశాసనిక పర్వంలో బృహస్పతి దేవేంద్రునికి ఉపదేశించాడు.

మాతరస్సర్వ భూతానాం గావస్సర్వ సుఖప్రదాః| వృద్ధిమాకాంక్షితా నిత్యం గావః కార్యాః ప్రదక్షిణాః|

పైన వివరించిన విషయమంతా కిరాతార్జునీయంలోని క్రింది శ్లోకంలో ఇమడ్చబడింది.

జగత్ప్రసూతిర్జగదేక పావనీ ప్రజోపకంఠం తన యైరుపేయుషీ| ద్యుతిం సమగ్రాం సమితిర్గవామసౌ ఉపైతి మన్త్రైరివ సంహితాహుతిః|

యజ్ఞంలో వినియోగించే ఘృతం, క్షీరం, దధి వంటి గో ప్రసాదాల ద్వారా పావకత్వ సాధనలో నిరతిశయమై, గోకులంలో తమ దూడలతో కూడిన గోవుల మంద, వేద మంత్రాలతో కూడిన హోమంలా పరిపూర్ణమైన దీప్తిని పొంది ఉంది.

ఇలాంటి మహిమోపేతమైన గోవులయొక్క సేవా, ప్రదక్షిణాదులు శ్రౌతకర్మతో సమానమైన ఫలం ఇవ్వగలవని సప్రమాణంగా నిరూపించడం వలన, మనం శ్రుతి స్మృత్యాదులచే చెప్పబడిన కర్మలను మన అశక్తత వలన ఆచరించలేక పోయినప్పటికీ, వాటితో సమానమైన ఫలమునిచ్చే గో సేవను చేయడం శ్రేయస్కరం అని విశదీకరించడమైంది.

11వ ప్రకరణం సమాప్తం

12వ ప్రకరణం

ఉపాసన – జ్ఞానము

మీమాంసా శాస్త్ర **"చోదనా లక్షణోఽర్థో ధర్మః"** సూత్ర ప్రకారం శ్రేయస్సాధనాలైన వేదవిహిత కర్మలు ధర్మం అవడంవల్ల ఇంతవరకు ఆ ధర్మం యొక్క ప్రసంగమే వివిధములుగా వివరింపబడింది. **"ధర్మేణ పాపమపనుదతి"** అను శ్రుతి ధర్మానికి పాపాపనోదనం (పాపాన్ని తొలగించడం) కూడా ఫలమని చెప్తోంది. ధర్మ శబ్దవాచ్యాలైన కర్మలకు సంస్కారాన్ని కలిగించడం, వివిదిషను పుట్టించి పెంపొందించడం కూడా ప్రయోజనాలుగా చెప్పబడుతున్నాయి.

యస్త్వేతే చత్వారింశ త్సంస్కారాః సబ్రహ్మణస్సాయుజ్యగ్ం సలోకతాం జయతి| (గౌ.ధ.సూ)

గౌతమసూక్త ప్రకారం చెప్పబడిన కర్మలు పురుషునియొక్క చిత్తాన్ని సంస్కరించి సంస్కారాన్ని పెంపొందించేవి (సంస్కారకములు) అవుతున్నాయి.

తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి యజ్ఞేన దానేన తపసాఽనాశకేన| (వా.శ్రు.)

అను వాజసనేయ శ్రుతి ప్రకారం అనుష్ఠింపబడిన కర్మలు వివిదిషను పుట్టించి, సంస్కారాన్ని పెంపొందించేవి కూడా అవుతున్నాయి. బ్రహ్మతత్వాన్ని తెలుసుకోవాలి అనే దృఢవాంఛ రుచిగా మారితే దాన్ని వివిదిష అంటారు. సంస్కార, వివిదిషా పక్షాలు రెండింటిలోను గల అవాంతర భేదం ఇలా చెప్పబడుతోంది.

జాతా వివిదిషాఽవశ్యం సంపాద్యాఽఖిల సాధనమ్| స్వఫలం జనయేదాశు బుభుక్షాదిర్యథా తథా|

లోకంలో మనకి కలిగిన బుభుక్ష (ఆకలి) భోజనం వరకు ఫలాన్ని పుట్టించిన రీతిగా (అనగా మొదట కలిగిన ఆకలి భోజనం దొరికేలా చేయవలసిన కర్మలను చేయించి ఫలంగా భోజనాన్ని సంపాదించేలా చేసినట్లు) ఒకసారి వివిదిష కలిగితే జ్ఞానసాధనాలైన శ్రవణ, మననాదులను సంపాదింపచేసి జ్ఞానరూప ఫలాన్ని అందించగలదు.

ముందుగా కర్మలకు సంస్కారకత్వం, వివిదిషా జనకత్వం ఎలా తటస్థిస్తుందో వివరింపబడుతోంది.

వర్ణాశ్రమాది శాస్త్రేణ ప్రేరితః అకరణేభయమ్ పశ్యన్కరోతి యత్కర్మ తత్సంస్కార ముచ్యతే|

వర్ణాశ్రమ ధర్మాలను బోధించిన విధివాక్యాల ప్రేరణతో ఈ కర్మ మనకు అవశ్యానుష్ఠేయంగా విధించ బడిందనే భావంతోను, ఈ కర్మ చేయకపోతే ప్రత్యవాయం జనిస్తుందనే భయంతోను అనుష్ఠింపబడు కర్మే సంస్కారకం.

తమేతమితి వాక్యేన ప్రేరితో బోధవాంఛయా అన్తర్యామిణ్యర్పయేద్యత్ తత్స్యాద్వివిదిషాకరమ్|

పై చెప్పబడిన కర్మలనే **'తమేతమితి'** వాక్యంచే ప్రేరేపించబడినవాడై జ్ఞాన వాంఛతో, ఈశ్వరార్పణ బుద్ధితో అనుష్ఠిస్తే అవి వివిదిషను కలిగించేవి అవుతాయి. ఈ ప్రకారం కర్మలకు వివిదిషా జనకత్వం కూడా తటస్థించునని అవాంతర భేదం ప్రదర్శింపబడింది. **"కర్మణా పితృలోకః"** ఇత్యాది శ్రుతులచే నిత్యకర్మలకు కూడా ఫలం వినబడుతోంది కదా!

"కర్మణా పితృలోకస్యాదిత్యేవం నిత్యకర్మణామ్| ఫలముక్తం తథాప్యేతైః వేదనేచ్ఛాపి తచ్ఛ్రుతేః నిత్యేషు శుద్ధేః ప్రాధాన్యాద్భోగోఽప్య ప్రతిబన్ధకః| భోగ భంగురమీక్షన్తే బుద్ధి శుద్ధ్యనురోధతః|

నిత్యకర్మలచే వేదనేచ్ఛ (విజిగిష) పుడుతుందా? అని సంశయించనక్కర్లేదని నిత్యకర్మలకు చిత్తశుద్ధి ప్రధానం కనుక కర్మలవల్ల వచ్చే ఫలభోగం అడ్డంకి కాబోదు, కాబట్టి వాటివల్ల కూడా వేదనేచ్ఛ జనిస్తుందని పై శ్రుతి చెప్తోంది. నిత్యకర్మల విషయం నిరూపణైంది సరే, మరి కామ్యకర్మల విషయమేమి? అని ప్రశ్నిస్తే

కామ్యేష్వపి ముముక్షుశ్చేత్ఫలం దేవే సమర్పయేత్| ఏతద్భగవతా ప్రోక్తం కర్మబంధ నివృత్తయే|

మోక్షేచ్ఛ గలవాడు కామ్యకర్మల ఫలాన్ని కూడా ఈశ్వరార్పణం చేస్తే వేదనేచ్ఛ జనిస్తుందని తాత్పర్యం. నాతోనే రచింపబడిన "నిత్యకామ్య కర్మమీమాంసా" అను గ్రంథంలో వీటి వివరాలు మరింతగా వివరించబడ్డాయి. అందులో కామ్యకర్మలవల్ల వివిదిష జనించదని, **"తమేత"** వ్యాకంలోని యజ్ఞశబ్దం నిత్యకర్మకు సంబంధించింది అన్నారు కదా! దానికి ఈ పై వచనం విరుద్ధం కాదా అని శంకించవచ్చు! దానికి అది విరుద్ధం కాదు. నిత్యకర్మలు విహితత్వాకారంతో చేసినా ఈశ్వరార్పణ బుద్ధితో చేసినా అవి నిత్యకర్మలుగానే వ్యవహరింపబడతాయి. కామ్యకర్మలు కామ్యబుద్ధితో అనుష్ఠిస్తే కామ్యకర్మలు గాని, ఈశ్వరార్పణ బుద్ధ్యా అనుష్ఠిస్తే అవి కామ్యకర్మలు అనిపించుకోవు కదా!

'నిత్యకామ్యకర్మ మీమాంసా గ్రంథం'లో కామ్యబుద్ధ్యా అనుష్ఠించిన కామ్యకర్మలు వివిదిషా జనకములు కావని, కామ్యకర్మల విషయంలో అకరణే ప్రత్యవాయం (చేయకపోతే ప్రత్యవాయం) రాదని, అందువల్ల వాటియొక్క ఆవశ్యకత లేదని (చేసి తీరాలని లేదని), కానీ సాఙ్గ ప్రధానానుష్ఠాన సమర్థుడైన అధికారి తన ఇచ్ఛానుసారం అనుష్ఠిస్తే ప్రత్యవాయం రాదని నిరూపించినందున ఆ సిద్ధాంతానికి ఇది విరుద్ధం కాదని గ్రహించనగును. ఇక ప్రకృత మనుసరిద్దాం.

ఈ ప్రకారం ఈశ్వరార్పణ బుద్ధితో అనుష్ఠిస్తే నిత్యాలు, కామ్యాలు కూడా బ్రహ్మను తెలుసుకోవడానికి ఇచ్ఛను (విజిగిషను) పుట్టించగలవు. కానీ ఈశ్వరార్పణ బుద్ధితో కర్మానుష్ఠానం చేయకపోయినా వేదాంత వాక్యాలు తరుచుగా వినడంవల్ల కూడా అటువంటి ఇచ్ఛ పుట్టవచ్చును. కానీ ఆ వేదన సాధనాలైన శ్రవణ, మననాదులందు రుచి మాత్రం కలగదు.

దీనివల్ల ఇచ్ఛవేరు, రుచివేరు అని తెలుస్తోంది. **"వేదాన్తేషు రుచ్యుత్పాదనం- వివిదిషా".** వేదాంతములందు రుచిని కలిగించడం వివిదిష అనబడుతుంది. దీనికొక లౌకిక ఉదాహరణ. లోకంలో క్షీరప్రియుడైన పిత్త రోగస్థునికి క్షీరాన్ని స్వీకరించాలనే ఇచ్ఛ ఉంది. కానీ అలా సేవించడానికి నోటియందు రుచి మాత్రం కలగనందున తిరిగి ఔషధసేవ చేసి, రుచికి ప్రతిబంధకమైన పైత్య రోగాన్ని పోగొట్టుకొన్న విధంగా వేదాంత వాక్య శ్రవణ,మననాదులందు రుచి కలగడానికి ప్రతిబంధకమైన ఏ మహా పాపాలున్నాయో అవి ఈశ్వరార్పణ బుద్ధితో అనుష్ఠించిన కర్మలవల్ల నివారింపబడగలవు.

ఆ పాపాలు తొలగిన వెంటనే వేదన సాధనాలైన శ్రవణ మననాదులందు రుచి జనించగలదు. దీనివల్ల **"ధర్మేణ పాపమపనుదతి"** అను శ్రుత్యుక్త ప్రకారం పోదగిన పాపాలు వేరు, ఈశ్వరార్పణ బుద్ధితో అనుష్ఠించిన కర్మలవల్ల పోదగిన పాపాలు వేరు, బ్రహ్మవేదనయందు ఇచ్ఛ వేరు రుచి వేరు అని తెలుసుకోదగి ఉంది.

మహాపాపవతాం నృణాం జ్ఞానయజ్ఞో నరోచతే| ప్రత్యుత జ్ఞానయజ్ఞస్తు ప్రద్వేషో భాస్యతే స్వతః|

ఈశ్వరార్పణ బుద్ధితో అనుష్ఠించబడిన కర్మలు బ్రహ్మతత్వ వేదనయందు ఇచ్ఛను, రుచిని పుట్టించి పరంపరగా జ్ఞానసాధన భావాన్ని పొందిస్తాయని సప్రమాణంగా వివరించడమైంది.

అయితే, కర్మలవల్ల పరంపరగా బ్రహ్మ విద్యయందు అధికారం ప్రాప్తించినా కేవలం కర్మలవల్ల చిత్తానికి ఏకాగ్రత సంభవించదు. అలా సంభవించకపోవడమే కాక, పలురకాల కర్మలనాచరించడంవల్ల చిత్త విక్షేపం (మనస్సు నిలకడగా లేకపోవడం, మనో వైకల్యం) సంభవిస్తుంది. చిత్తానికి ఏకాగ్రత ఉన్నప్పుడు కానీ బ్రహ్మతత్వావభోధ ద్వారా బ్రహ్మ సాక్షాత్కార యోగ్యత కలుగదు.

ఐకాగ్ర్యస్య సాక్షాత్కార హేతుత్వం కఠా ఆమనన్తి|

దృశ్యతే త్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః|

ఇత్యాది శ్రుతులను వివరించిన భాష్య గ్రంథాన్ని అనుసరించి చిత్తైకాగ్రతకు 'ఉపాసన' అవశ్యకమై ఉంది. అందుకే తైత్తరీయ కృష్ణయజుర్వేదంలో కర్మకాండకు జ్ఞానకాండకు మధ్యన ఉన్న ఉపాసనా కాండలో శిక్షావల్లిలో ఉపాసనా విషయం ప్రతిపాదించబడింది. కేవలం శిక్షావల్లిలోనే కాదు, ఛాందోగ్య, బృహదారణ్యక, ముండక, మాండూక్య ఉపనిషత్తులందు, సూత్రభాష్యం వంటి వాటియందు అధికంగా చెప్పబడినా, గ్రంథ విస్తర భీతిచే శిక్షావల్లిలోని ఉపాసనా భాగాన్నే సాయణభాష్యానుసారం వివరిస్తున్నాను.

ఉపాసనా నామ విజాతీయ ప్రత్యయానన్త ర్హిత సజాతీయ ప్రత్యయ ప్రవాహః|

అని ఉపాసనాశబ్దార్థం చెప్పబడింది. ఉపాసన అనగా ఏ మూర్తిని ధ్యానిస్తున్నామో ఆ ధ్యానం మధ్యలో విజాతీయమైన అనగా మరో మూర్తియొక్క ధ్యాన సమ్మేళనం లేకుండగా, ఆరంభించబడిన మూర్తి ధ్యానమే అవిచ్ఛిన్నంగా (నిరంతరంగా, ఎడతెగకుండా) చేయడమని అర్థం. ఇటువంటి చిత్తైకాగ్రతకు కారణభూతమైన ఉపాసనే యోగ శబ్దంచే చెప్పబడుతోంది. ఈ యోగానికి కొన్ని అంతరాయాలు సంభవిస్తాయని పతంజలి మహర్షిచేత యోగశాస్త్రంలో ఇలా వివరింపబడింది.

వ్యాధిస్త్యాన సంశయ ప్రమాద ఆలస్య అవిరతి భ్రాన్తి ధర్మానాలబ్ధ భూమికత్వ అనవస్థి తత్వాని చిత్త విక్షేపాః యోగాన్తరాయాః| (యో.శా.)

అటువంటి ఉపాసన, యోగం అంత సులభమైనవి కావు. వీటికి ఎన్నో అంతరాయాలు- వ్యాధి, స్త్యానం (ఒక్కోసారి తమోగుణ బాహుళ్యంచే చిత్తం వ్యాపారానికి అయోగ్యమై మూఢంగా ఉండడం), సంశయం (ఉపాసించవలసినదేదో నిశ్చయం లేకపోవడం), ప్రమాదం (ఒక్కోసారి మరచి పోవడం) ఆలస్యం (తరువాత ఉపాసిద్దామని ఉపేక్షించడం) అవిరతిః (విషయమందు వైరాగ్యం లేకపోవడం), భ్రాంతి దర్శనం (ఉపాసించదగిన వస్తువుయందు అన్యతా నిశ్చయం), అలబ్ధ భూమికత్వం (చిత్త ఏకాగ్రతకు ఉత్తరోత్తరాభివృద్ధి లేకపోవడం, ఉపాసన చేసిన కొద్దీ ఏకాగ్రతలో రావలసిన అభివృద్ధి రాకపోవడం), అనవస్థితత్వం (ఒకప్పుడు ఉపాసనయందు ప్రవృత్తి, ఒకప్పుడు యాగదానాదులందు ప్రవృత్తి, మరొకప్పుడు కృషి, వాణిజ్యాదులందు ప్రవృత్తి కలగడం), చిత్తవిక్షేపం (మనశ్చాంచల్యం) ఇవన్నీ యోగశబ్దంచే చెప్పబడే ఉపాసనకు అంతరాయాలుగా ఏర్పడి, చిత్తైకాగ్రతకు భంగం కలిగిస్తాయని, కావున వీటి నతిక్రమించి ఉపాసన చేయాలని చెప్పబడింది.

ఆసీనేనైవ ఉపాసితవ్యమ్| (యో.ద.సూ)

కర్మకాండలో బ్రహ్మయజ్ఞానికి దేశ, కాలాది నియమాలు చెప్పబడినట్లుగా ఉపాసనకు అటువంటి నియమాలు చెప్పబడలేదు. కనుక ఏదో ఒక దిక్కుకి తిరిగి, ఏదో ఒక కాలంలో, ఏదో ఒక దేశంలో (ప్రదేశంలో)నియమాలేవీ లేకుండా చెయ్యవచ్చునా? లేక, దేశకాలాది నియమాలను అనుసరించాలా? అని విచారించి, ఏ దేశంలో, ఏ కాలంలో చేయడానికి మనకి అనుకూలత ఉంటుందో ఆ ప్రకారం చేయాలని చెప్పారు.

ఒకే పేరుతో ఉపాసన రెండు వేదశాఖల్లో చెప్పబడినప్పుడు పంచాగ్ని విద్య, ప్రాణ విద్య మున్నగు వాటిలో ఏదో ఒకటి చేయాలా? అని విచారించి, ఉపాసనల పేరు ఒకటే అయినా వాటి ధర్మాలు భిన్నంగా ఉన్నప్పుడు ఉద్గీథన్యాయంచే ఉపాసనలకు భేదాన్నంగీకరించి వేరువేరుగా చెయ్యాలని నిశ్చయించారు. బ్రహ్మసూత్రం 3-3వ పాదంలో ఈ ప్రకారంగా ఉపాసన చేయడానికి ముందుగా తెలుసుకోదగిన వాటిని వివరించి, ఆ తర్వాత ఉపాసనా భేదాన్ని చెప్పారు.

ప్రతీకోపాసనాన్యేవం|

"అథాతస్సర్గం హితాయా ఉపనిషదం వ్యాఖ్యాస్యామః|"

పరమాత్మ వ్యతిరిక్తాలైన (పరమాత్మ నుంచి వేరుపడిన) లౌకిక వస్తువులు ఉత్కృష్టమైన దేవతా దృష్టిచే గాని, బ్రహ్మ దృష్టిచే గాని సంస్కరించబడి ఎక్కడ ఉపాసించబడుతున్నాయో అవి **'ప్రతీకోపాసన'**లని చెప్పపబడుతున్నాయి. అవే శిక్షాధ్యాయ తృతీయానువాకంలో సంహితోపాసన అనే పేరుతో **'అథాతస్సర్గం హితాయా'** ఇత్యాది గ్రంథంచే ప్రతిపాదించబడ్డాయి. **"పరస్సన్నికర్షస్సంహితా"** అని పాణిని చెప్పిన విధంగా వర్ణాలకు పరస్పర సామీప్యం ఉండేలా ఉచ్చరించడం సంహిత అనబడుతుంది. ఇటువంటి సంహితయొక్క ఉపాసన, సంహితోపాసన. **"అధిలోకమధిద్యోతిషమ్", "తామహాసగ్ంహితా ఇత్యాచక్షతే"** మున్నగు శ్రుతుల ప్రకారం 'ప్రతీకోపాసన' అను పేరుతో ఒకటే అయినా అయిదు విధాలైన ఆశ్రయాలతో ఉపాసనా ప్రకారాలను చెప్తోంది. కనుక, **"మహాసగ్ంహితాః"** అని మహా సంహితలుగా బహువచనంచే చెప్పబడు తున్నాయి.

సంహితలో ఉన్న వర్ణాలను ఉపాసించే పద్ధతి చెప్పబడుతోంది.

"ఇషేత్వా" అనే దాంట్లో **'ష'** కారాన్ని ఉత్తరవర్తి అయిన (తరువాత వచ్చే) 'ఏ' కారాన్ని పృథివీ రూపంగాను, దాని తర్వాత గల 'త' కారాన్ని ద్యులోక రూపంగాను ఈ రెండింటి మధ్య గల దాన్ని ఆకాశాత్మకంగాను చెప్పబడింది. ప్రాతిశాఖ్యోక్తప్రకారం 'త' కారానికి ద్విత్వం వస్తుంది. కావున అది సంధానమని చెప్పబడుతుందని, **"అథాధి వ్యౌతిషం"** పైన చెప్పినట్లు **"అగ్నిః పూర్వరూపమ్"** శ్రుత్యుక్త ప్రకారం పూర్వవర్ణాన్ని అగ్నిరూపంగాను, ఉత్తరవర్ణాన్ని ఆదిత్యరూపంగాను ఈ రెండక్షరాల సంధిని అబ్దేవతా స్వరూపంగాను ఈ రెండింటి సంధానాన్ని విద్యుద్రూపంగాను ధ్యానించడం **'అధివ్యౌతిషం'** అనబడుతుంది. ఇలాగే అధివిద్యం, అధిప్రజం అధ్యాత్మమని భావించాలని చెప్పిన ప్రకారం అంతా ప్రతీకోపాసన అనే అనబడుతుంది.

పైన చెప్పిన ప్రకారం సంహితలో లోకాది దృష్టిని ఉంచి ఉపాసించాలని ప్రతిపాదించబడింది. ఇక్కడ **'మహాసగ్ం హితా వ్యాఖ్యాతావేద"** అనే స్థలంలో **'వేద'** అని జ్ఞానవాచకమైన 'విద్' ధాతువు అయినా **"ఇతి ప్రాచీన యోగ్యోపాస్వ"** అను వాక్యంచే **"ప్రాచీనాని పూర్వకాణ్ణోక్తాని నిత్యనైమిత్తిక కర్మాణి తైః పాపే ప్రహీణే సతీ ఉపాసనాయాం యోగ్యో భవతి"** అను భాష్యంచే వేదం పూర్వభాగమైన కర్మకాండలో చెప్పబడిన కర్మానుష్ఠానంచేత పాపం క్షీణించడంచే, ఇది ఉపాసనా ప్రకరణం కనుక "వేద" అను పదంచే ఉపాసనయే చెప్పబడుతోంది.

సంధీయతే ప్రజయా పశుభిః బ్రహ్మవర్చసే నాన్నాద్యేన సువర్ణ్యేన లోకేన|

అను శ్రుతిచే ఈ ఉపాసనకు ఫలం ఆముష్మికం (స్వర్గము), ఐహికం (ఇక్కడ, ఈ లోకంలో పశ్వాదిబల రూపంగా) ఐహికాముష్మిక మైనదని చెప్పబడుతోంది.

ఇట్లే **"మనో బ్రహ్మేత్యుపాసీత" "ఆదిత్యో బ్రహ్మేత్యుపాసీత"** ఇత్యాది వాక్యాలచే మన ఆదులను (మనస్సును, ఆదిత్యుని) ప్రతీకలుగా భావించి ప్రతీకోపాసన చేయవలసిందని విధింపబడింది.

ప్రతీకోపాసనలో అహం గ్రహం లేదన్నారు. అనగా 'అహం' దృష్టి లేదన్నమాట. వీటిలో ఉపాస్య (ఉపాసింపబడేదానికి) ఉపాసకులకు (ఉపాసించే వారికి) భేదాన్ని అంగీకరించారు. అహంగ్రహోపాసనలకు **"దేవోభూత్వా దేవానప్యేతి"** శ్రుతిచే జీవించి ఉండగానే భావనా ప్రకర్షవల్ల దేవసాక్షాత్కారాన్ని పొంది మరణానంతరం దేవత్వాన్ని పొందుతున్నాడు. ఈ ప్రకారం ప్రతీకోపాసనకు, అహంగ్రహోపాసనకు గల భేదాన్ని అంగీకరించారు.

ఇదే విధంగా చతుర్థానువాకంలో **"యశ్ఛన్దసామృషభో విశ్వరూపః"** ఇత్యాది గ్రంథంచే మేధాకాముడు, ఆరోగ్యకాముడు, ఐశ్వర్యకాముడు జపించదగిన హోమానుష్ఠాన సాధనమైన మంత్రాలు ప్రతిపాదించ బడ్డాయి. కానీ వాటి వివరణను ఉపేక్షించి పంచమ, షష్ఠ అనువాకాల్లో ప్రతిపాదింపబడిన అంగదేవత ఉపాసన తర్వాత 'అంగీ' అయిన బ్రహ్మ యొక్క ఉపాసనగా విభజించబడిన ఉపాసనా ప్రక్రియే ఇకపై వివరించబడుతోంది.

భూర్భువస్సువరితివా ఏతాస్తిస్రో వ్యాహృతయః|

ఇత్యాది గ్రంథంచే పంచమానువాకం అంగదేవతా ధ్యానానికి ప్రతీకగా వ్యాహృతిత్రయం చూపబడింది. అదే తీరుగా **"మహ"** అను చతుర్థ వ్యాహృతిని కూడా ప్రతీకగా తీసుకుని ధ్యానించవలసిందిగా శ్రుతి విధిస్తోంది.

"తాసాముహస్మై తాం చతుర్థీమ్ మాహా చమస్యః ప్రవేదయతే"

తథైవ ప్రతీకత్వేన వ్యాహృత్యన్తరం విధత్తే| (వ్యాఖ్యానం)

'మహా చమస్య' అనే పేరు గల రుషి భూరాద్యపేక్షచేత చతుస్సంఖ్యాకమైన "మహ" అనే వ్యాహృతిని ప్రాధాన్యంగా ఉపాసనకోసం ఉపదేశించినట్లు చెప్పబడుతోంది. ఆ ప్రాధాన్యం ఇలా వివరించబడుతోంది.

మహ ఇతి| తద్బ్రహ్మ| స ఆత్మా| అఙ్గాన్యన్యా దేవతాః| (తై. ఉ.)

'మహః' అనే చతుర్థ వ్యాహృతియే బ్రహ్మ పదార్థమని ధ్యానించాలి. ఇతరములైన భూరాది వ్యాహృతి దేవతలను హస్త పాదాది సదృశమైన అంగాలుగా ధ్యానించాలన్నారు.

మహ ఇతి తద్బ్రహ్మ స ఆత్మా అఙ్గాన్యన్యా దేవతాః" (తై. ఉ.)

భూరాది వ్యాహృతి దేవతలను హస్త పాదాది సదృశమైన అంగాలుగా ధ్యానించి, **'మహః'** అనే చతుర్థ వ్యాహృతిని బ్రహ్మవస్తువు అని ధ్యానించాలని, పూజ్యవాచి ధాతు నిష్పన్నమవడం వల్ల ఆ **'మహః'** వ్యాహృతిని పూజ్యబ్రహ్మరూపంగా స్తుతించడం యుక్తమేనని కూడా అన్నారు. ఇకపై లోకాది దృష్టి చూపబడుతోంది.

భూరితివా అయం లోకః| భువ ఇత్యంతరిక్షమ్| సువరిత్యసౌ లోకః| మహ ఇత్యాదిత్యః (తై.ఉ.)

భూః అను ప్రతీకలో పృథివీ దృష్టిని, భువః అను ప్రతీకలో అంతరిక్ష దృష్టిని సువః అను ప్రతీకలో ద్యులోక (దేవలోక,ఆకాశ) దృష్టిని **'మహః'** అనుప్రతీకలో ఆదిత్య రూపంగా వర్ణించడంలో ఔచిత్యం ఈ విధంగా చెప్పబడింది.

ఆదిత్యేనవావ సర్వేలోకా మహీయన్తే|

ఆదిత్యునిచే సర్వలోకాలు ప్రకాశింపబడినవై వ్యవహార సమర్థాలు అవుతున్నాయి.

ఇకపై దేవతా దృష్టితో ఉపాసన చేసే పద్ధతి నిరూపించబడుతోంది. **'భూః'** అనే వ్యాహృతిని అగ్ని స్వరూపంగాను, **'భువః'** అను వ్యాహృతిని వాయు రూపంగాను, **'సువః'** అను వ్యాహృతిని చంద్రమస రూపంగాను భావించి ధ్యానించాలని చంద్రునికి చుట్టూ గల నక్షత్ర మండలాలన్నీ పూజ్యములుగా (పూజించదగినవిగా) భాసిస్తున్నాయని ఈ శ్రుతి ప్రతిపాదిస్తోంది.

చన్ద్రమసావావ సర్వాణి జ్యోతిగ్ంషి మహీయన్తే|

ఇంకా వేద రూపంగా చూస్తే-

భూరితి వా ఋచః| భువ ఇతి సామాని| సువరితి యజూగ్ం షి| మహ ఇతి బ్రహ్మ|

'భూః' అను వ్యాహృతిని ఋగ్వేదంగాను, **'భువః'** అను వ్యాహృతిని సామవేదంగాను, **'సువః'** అను వ్యాహృతిని యజుర్వేదంగాను 'మహః' అను వ్యాహృతిని ప్రణవ రూపంగాను భావించి ధ్యానించాలని,

బ్రహ్మణావావ సర్వే వేదా మహీయన్తే|

భాష్యం: **ఓంకారేణ సర్వే వేదాః మహీయన్తే - పూజ్యన్తే|**

అన్ని వేదాలు ప్రణవంతో పూజింపబడు తున్నాయనగా, ప్రణవంతో ఆరంభించ బడుతున్నాయని ఈ ప్రకారం వ్యాహృతులను వేదదృష్టితో ధ్యానించడం గురించి చెప్పబడింది.

భూరితి వై ప్రాణః భువ ఇత్యపానః సువరితి వ్యానః మహ ఇత్యన్నమ్|

'భూః' అను వ్యాహృతిని ప్రాణరూపంగాను, **'భువః'** అను వ్యాహృతిని అపాన రూపంగాను **'సువః'** అను వ్యాహృతిని వ్యాన రూపంగాను **'మహ'** అను వ్యాహృతిని అన్నరూపంగాను ధ్యానించాలని చెప్పి **"అన్నేన హి భుక్తేన ప్రాణాస్తృప్యన్తి"** అను భాష్యంచే భుక్తమైన అన్నంచే ప్రాణులు తృప్తిపడుతున్నందున **'మహ'** అను వ్యాహృతిని అన్నరూపంలో ధ్యానించడంలో గల ఔచిత్యం చెప్పబడింది. వీటన్నిటి వివరణ వలన ఇతర వ్యాహృత్యపేక్షయా **"మహ"** అనే వ్యాహృతికి ప్రాధాన్యము, వ్యాపకత్వము కూడా చెప్పినట్లయింది.

తావా ఏతాశ్చతస్రశ్చతుర్థా| చతస్రశ్చతస్రోవ్యాహృతయః|

ఈ ప్రకారం పైన చెప్పబడిన నాలుగు వ్యాహృతులు ఒక్కొక్కటి నాలుగు ప్రకారాలుగా లోక,దేవతా,వేద, ప్రాణాది రూపాలుగా ధ్యానించడం వల్ల మొత్తం మీద 4x4 పదహారుగా షోడశ సంఖ్యా సంపత్తి కలిగినవి అయ్యాయి. ఇంతవరకు చెప్పబడినవన్నీ ప్రతీకోపాసనలే.

తాయో వేద సవేద బ్రహ్మ| సర్వేస్మై దేవా బలిమావహన్తి|

ఈ ప్రకారంగా వ్యాహృతిరూప ప్రతీకోపాసన చేసే వానిని సమస్త ఇంద్రాది దేవతలు పూజిస్తారు అని ఫలం చెప్పబడింది. దీనిపై సూత్ర భాష్యం 4-3-15 లో వ్యాహృతి రూప ప్రతీకోపాసకులకు బ్రహ్మలోక ప్రాప్తి లేదని, ప్రతీకయందు బ్రహ్మోపాసన చేసే వారికే బ్రహ్మలోక ప్రాప్తి అని నిర్ణయించారు గాన బ్రహ్మలోక ప్రాప్తి లేని పక్షంలో వ్యాహృత్యుపాసకులకు సర్వదేవతా పూజ్యత్వం సంభవించదు కదా అని శంకించి సమాధానం చెప్పబడుతోంది.

యోవేద- పృథివ్యాది దృష్టులతో కూడిన వాటినిగా వ్యాహృతులను ఉపాసించేవారు **సవేద బ్రహ్మ వక్ష్యమాణ** అనువాకం **'సయ ఏషోన్తర్ హృదయ ఆకాశః"** అను దాంట్లో చెప్పబడిన బ్రహ్మోపాసననే చేసిన వాడవుతాడు.

బ్రహ్మోపాసనయే ప్రధానమని దానికి ఈ వ్యాహృత్యుపాసన అంగభూతమవడం వల్ల అంగభూతోపాసన ద్వారా అంగీభూత బ్రహ్మోపాసనకే ఈ ఫలం చెప్పినట్లని ఈ రెండు ఉపాసనలు భిన్నం గావని వ్యాహృత్యుపాసకునికే బ్రహ్మోపాసనాధికారం లభిస్తుందని **"తాయోవేద సవేద బ్రహ్మ"** శ్రుతి చెప్తోంది. కనుక అంగాంగ భూతంగా ఒకే ఉపాసన అవడంచే చెప్పబడిన ఫలానికి విరోధం లేదని నిర్ణయించారు. **'సయ ఏషోన్తర్ హృదయ ఆకాశః'** అనువాకంలో అంగిరూప బ్రహ్మోపాసన ఇలా ఉంది.

యేషు పరమాత్మా స గుణస్సన్నుపాస్యతే తాన్యహం గ్రహోపాస్యాని|

యథా "సయ ఏషోన్తర్ హృదయ ఆకాశః తస్మిన్నయం పురుషో మనోమయః అమృతో హిరణ్మయః"

పరమాత్మ సగుణుడుగా ఉపాసింపబడే ఉపాసనలు **'అహంగ్రహోపాసనలు'** అని చెప్పబడుతున్నాయి. ఉదాహరణ **"సయ ఏషోన్తరితి"** ఇక్కడ హృదయాకాశ మధ్యవర్తి అయిన పరమాత్మ అనే పురుషుడు మనోమయత్వాది గుణవిశిష్టుడుగా ఉపాసించబడుతున్నాడు. అనగా హృదయ పుండరీకం మధ్యలో అంగుష్ఠ పరిమితమైన ఆకాశం ఉంది. ఇటువంటి ఆకాశంలో సంపూర్ణమైన పరమాత్మ(పురుషుడు) ఉన్నాడు. పరమాత్మ సర్వవ్యాపకుడే అయినా అతణ్ణి పొందడానికి ఉపాసన చేయడం కోసం హృదయ స్థానం యోగ్యమైనదిగా ఉపదేశించబడుతోంది.

"హృదయకమల మధ్యే హి సమాధినా నిరుద్ధమేకాగ్రం మనః సాక్షాత్కర్తుం ప్రభవతి"

"దృశ్యతేత్వగ్ర్యయా బుద్ధ్యా సూక్ష్మయా సూక్ష్మదర్శనాత్"

హృదయమధ్యంలో మనస్సును ఏకాగ్రమయ్యేలా నిరోధించడంద్వారా పరమాత్మను సాక్షాత్కరించు కోవడానికి యోగులు సమర్థులవుతున్నారు. ఇదే **"దృశ్యతేత్వగ్ర్యయా బుద్ధ్యా"** అను శ్రుత్యంతరంయొక్క అర్థం కూడా. **"తస్మిన్నయం"** అంటే **'అయం'** అనే శబ్ద ప్రయోగంచే ఆ స్థానం (హృదయ పుండరీకం) పరమాత్మ సాక్షాత్కార యోగ్యత కలదని చెప్పబడింది. ఆ ప్రకారం హృదయవర్తి అయిన పురుషుడు హృదయమధ్యమందు ఉపాసకులచే ఉపాసింపబడినవాడై ఆ ఉపాసకులను అనుగ్రహిస్తున్నాడు. హృదయం ఇట్టి యోగ్యత కలదని **'దహరవిద్య'** శాండిల్య విద్యలందు కూడా వర్ణింపబడింది.

బ్రహ్మజ్ఞానం కలవారు హృదయ మధ్యమందే, మనస్సుచే పరమాత్మను సాక్షాత్కరించు కుంటున్నారు. ఉపాసకులు కూడా అక్కడ ఉన్నవానిని మనస్సుచే ధ్యానిస్తున్నారు. అందుచేతనే పరమాత్మ మనోమయుడు. అనగా మనః ప్రధానుడుగా, మనోయమత్వాది గుణ విశిష్టుడుగా, **"అమృతో హిరణ్మయః"** అని **"అమృతత్వం-వినాశరాహిత్యం హిరణ్యం, హిరణ్మయః-జ్యోతిర్మయః"** అను భాష్యంచే వినాశ రహితునిగా, జ్యోతిర్మయుడుగా ఉపాసింప బడుచున్నాడు. ఈ ప్రకారం ఉపాస్య స్వరూపాన్ని చెప్పి ఈ ప్రకారం ఉపాసన చేసిన ఉపాసకునికి మార్గ విశేషం చెప్పబడుతోంది.

అన్తరేణ తాలుకే| య ఏషస్తన ఇవావలమ్బతే| సేన్ద్రయోనిః| యత్రాసౌ కేశాన్తో వివర్తతే| వ్యపోహ్య శీర్ష కపాలే|

దీనికి చాలా విశేషమైన వివరణాత్మక భాష్యం చెప్పబడింది. దాని ప్రకారం ముఖబిలానికి (నోటికి) లోపల జిహ్వా మూలానికి (అంగుటికి) పైన గల వామదక్షిణ భాగాన్ని 'తాలుకలు' అంటారు. ఈ తాలుకములకు మధ్యన స్వల్పమైన ఒక మాంస ఖండం వ్రేలాడుతూ ఉంటుంది. యోగాభ్యాసం చేసేవారికి ఇది జిహ్వాగ్ర స్పర్శచే ప్రత్యక్షమగును. ఈ మాంసఖండం అనగా దీని సమీపాన గల సుషుమ్నానాడి పరమేశ్వరునికి స్థానంగా చెప్పబడింది. ఈ నాడియందు చిత్తాన్ని ఏకాగ్రంగా నిలిపితే బ్రహ్మ సాక్షాత్కార మవడానికి యోగ్యమగును. అందుకే ఈ సుషుమ్నానాడి పరమేశ్వరునికి స్థానంగా అమృతత్వ ప్రాప్తికి మార్గభూతమై నదని చెప్పబడుతోంది. ఇదే విషయం కఠోపనిషత్తులోను, ఛాన్దోగ్యోపనిషత్తులోను **"శతం**

చైకాచ హృదయస్య నాడ్యః తాసాం మూర్ధాసమభినిస్సృతైకా| తయా ఊర్ధ్వమాయన్నమృతత్వమేతి" అని చెప్పబడింది.

హృదయానికి నూటఒక్క నాడులున్నాయని అందులో ఒకటి సుషుమ్నా నాడి అనేది శిరస్సు దాకా ప్రసరించి ఉందని, దానిద్వారా ప్రాణోత్క్రమణం చేసే పురుషుడు అమృతత్వాన్ని పొందగలడని ఈ శ్రుతిచేత చెప్పబడుతోంది.

భూరిత్యగ్నౌ ప్రతితిష్ఠతి| భువ ఇతి వాయౌ| సువరిత్యాదిత్యే| మహ ఇతి బ్రహ్మణి|

అనగా **"అగ్న్యాదీనాం యదైశ్వర్యం తత్ప్రాప్నోతి"** అను భాష్యం వివరించిన రీతిగా అగ్న్యాదులయొక్క ఐశ్వర్యాన్ని పొందగలడని ఇదేవిషయం **"ఆప్నోతి స్వారాజ్యమ్"** అను శ్రుతిచే చెప్పబడుతోందని వివరించబడింది. అనగా అగ్న్యాది దేవతలకు రాజుగా వ్యవహరింపబడుతున్నాడని వారికి రాజవడం వల్లనే "సర్వేస్మై దేవా బలి మావహన్తి" అని సమస్త ఇంద్రాది దేవతలు పూజిస్తారని చెప్పబడింది. దీనితో వెనుక గ్రంథమందు సర్వదేవతా పూజ్యత్వం సంభవించదనే విరోధం పరిహరింపబడింది.

ఈ ప్రకారం పూజించబడడమే కాక,**"ఆప్నోతి మనసస్పతిం వాక్పతిశ్చక్షుష్పతిః శ్రోత్రపతిర్విజ్ఞానపతిః"** ఇత్యాది శ్రుతులచే సర్వప్రాణాత్మకుడైన సర్వాత్మ విరాట్ ఉపాధిమత్వాన్ని పొంది సర్వదేహ మనోవర్తి, సర్వవాగధిపతి అయ్యెను. **"ఏతత్తతో భవతి"** ఆ విరాట్ దేహం సిద్ధించాక బ్రహ్మతత్వ జ్ఞానంచే నష్టమైన అవిద్య కలవాడై (అవిద్య నశించినవాడై) వక్ష్యమాన (చెప్పబోయే) స్వరూపం గలవాడాయెను. వక్ష్యమాన మనగా ఆకాశ శరీరం కలవాడాయెను. అనగా బ్రహ్మ ఆకాశం వలె మూర్తి రహితమైన శరీరం స్వరూపం గలిగి, సర్వజగత్తుకు అధిష్ఠానమగుటచే సర్వాత్మకుడు అవడం వల్ల ఆకాశం బ్రహ్మకు స్వరూపమని, అధిష్ఠానమందు ఆరోపించబడిన స్వరూపాత్మక భాగం మిథ్యాభూతమైన అధిష్ఠానం సత్యం కనుక, ఆకాశానికి బ్రహ్మత్వం చెప్పడం యుక్తమే అని బోధించబడుతోంది.

"సత్యాత్మ"ఇత్యాది శ్రుతులచే ప్రాణాది ఇంద్రియాలకు బ్రహ్మ ఉత్పాదకుడని బోధించబడడంచే ప్రాణోత్పత్తికి ఆధారమవడంవల్ల ప్రాణారామం అనేది బ్రహ్మకు విశేషణం అయింది.

మన ఆనన్దమ్|

భాష్యం: **- మనసః ఆనన్దః యస్మిన్ బ్రహ్మణి తత్ మన ఆనన్దమ్ - బ్రహ్మణి అవగతే సతి| యథా విషయాభిముఖం పరిత్యజ్య మనః బ్రహ్మాభిముఖం భవతి తథా మహత్సుఖం మనసః ప్రాప్యతే"** ఇతి.

బ్రహ్మ తెలియబడగా (అనగా బ్రహ్మను తెలుసుకోగా) మనస్సుకు ఆనందం కలుగుతుంది. మనస్సు ప్రాపంచిక విషయాలపట్ల మోహాన్ని పరిత్యజించి బ్రహ్మపట్ల అభిముఖమైనప్పుడు మనస్సుకు గొప్ప సుఖం ప్రాప్తిస్తోందని మైత్రేయోపనిషత్తులో కూడా పేర్కొనబడింది.

సమాధి నిర్ధూతమలస్య చేతసః నివేసితస్యాత్మని యత్సుఖం భవేత్|

న శక్యతే వర్ణయితుంగిరా తదా స్వయం తదా స్వయం తదన్తఃకరణేన గృహ్యతే||

సమాధిచే తొలగింపబడిన మాలిన్యం గలదై పరమాత్మకు అభిముఖంగా ప్రవేశపెట్టబడిన మనస్సుకు ప్రాప్తించే సుఖం ఇలాంటిదని వాక్కుచే వర్ణింప శక్యం గాదు. తనంతట తానుగా అంతఃకరణంచే గ్రహింప వలసిందేయని బ్రహ్మ సాక్షాత్కారమైనప్పుడు కలిగిన మనస్సుయొక్క ఆనందం వర్ణనాతీత మని చెప్పబడింది.

"ఏకవిధత్వ శ్రవణాత్" అనగా ఉపాస్యం ఎలాంటిదో ఫలం కూడా ఆ విధమైన దానిగానే ఉంటుందని చెప్పినందువల్ల అటువంటి సోపాధికమైన మనోమయత్వ గుణవిశిష్టమైన బ్రహ్మను ఉపాసించి బ్రహ్మ భావాన్ని పొందవలసిందని ఈ - **"స య ఏషోన్తర్ హృదయ ఆకాశ"** అను అనువాకంలో చెప్పబడింది.

ఇంతవరకు వివరించిన దానికి తైత్తరీయ ఉపనిషత్తులో శిక్షావల్లియందు తృతీయ అనువాకమైన **"సహనౌ యశః"** లగాయతు షష్ఠానువాకం **"ఇతి ప్రాచీన యోగ్యోపాస్వ"** వరకు సాయణ భాష్యానుసారం గాను, ఈ ఉపాసనలను గురించి బ్రహ్మసూత్ర భాష్యంలో ఆ యా అధికరణాలందు విచారణ చేసి నిర్ణయించిన ప్రకారం గాను ఏకవాక్యత సంపాదించడానికి వివరించబడిన గ్రంథాన్ని పరామర్శిస్తూ సంగ్రహంగా వివరించబడుతోంది.

"సహనౌ యశః" (శిక్షావల్లి3.3) అనువాకంలో ఇంతకుముందు వేదాధ్యయనం ఉండడంతో అనాయాసంగా సాధించదగిన సంహితోపాసన అనేది ప్రతిపాదించబడిందని చెప్పి, చతుర్థానువాకమైన **"యశ్ఛందసా మృషభో విశ్వరూపః"** అనేదాంట్లో మేధాకాముడు, ఆరోగ్యకాముడు, శ్రీకాముడు ఆచరించదగిన జపహోమ మంత్రాలను ప్రతిపాదించినట్లు చెప్పారు. పంచమ, షష్ఠానువాకాలందు బ్రహ్మోపాసన చెప్పబడింది. అందులో మొదటి మూడు వ్యాహృతులను ఆధారంగా చేసుకుని అంగదేవతయొక్క ఉపాసన, **'మహః'** అను నాల్గవ వ్యాహృతిని అంగి స్వరూపమైన బ్రహ్మగాను ఉపాసించాలని కూడా చెప్పబడింది. ఇంకా, **"తద్బ్రహ్మ స ఆత్మా"** అను శ్రుతిలో **"మహః"** వ్యాహృతిని బ్రహ్మరూపమైన సామాన్యంగాను, **ఆత్మా** అను శబ్దంచే సర్వవ్యాపకత్వము చెప్పబడ్డాయి.

ఆదిత్య చన్ద్ర భూతేన వ్యాపితా యతః ఇత్యాదినా తథాచ- లోకదేవ వేద ప్రాణాత్మికా వ్యాహృతయః యతః ఆదిత్య చంద్ర బ్రహ్మాన్నభూతేన మహా వాహృత్యా వ్యాప్యన్తే, అతః మహ ఇతి వ్యాహృతేః ఇతరాపేక్షయా వ్యాపకత్వ మిత్యర్థః|

అను వార్తిక గ్రంథంచే ఆత్మకు వ్యాపకత్వం చెప్పబడింది. **"తాయో వేద సవేద బ్రహ్మ"** అను శ్రుతికి **"ఇత్యనేన కిముచ్యత ఇతి శంకా పురస్సరం విజ్ఞాతం చతుర్థ వ్యాహృత్యా సామాన్యాత్మనా బ్రహ్మేతి నామ విశేషః"** అను భాష్యంవల్ల బ్రహ్మరూపత్వం సామాన్యంగా చెప్పబడినట్లు స్పష్టం. ఇదే విషయం వార్తికంలో ఇలా వివరింపబడింది.

యో నరః ఏకైకశః చాతుర్విద్యేన ఉపాస్యత్వేన ఉక్తా ఏతాః వ్యాహృతీరూపాస్తే స నరః అనంతరానువాకేన విజ్ఞేయత్వ విశేషణైరుపవర్ణ్యమానం బ్రహ్మ ఉపాస్తే ఇత్యర్థః|

దీనిప్రకారం విశేషంగా చెప్పబడింది. అనగా-

భాష్యం: **హృదయాంతరుపలభ్యత్వ మనోమయత్వాది శాన్త సమృద్ధ మిత్యేవమన్తం విశేషణ విశేష్యరూపః ధర్మయోగః విజ్ఞాయతే|**

హృదయాంతరుపలభ్యత్వం, మనోమయత్వం మొదలుగా ప్రారంభించబడి శాంతసమృద్ధం అనే వాక్యాల వరకు విశేషణ విశేష్య రూపమైన వాక్యాలచే ధర్మయోగం చెప్పబడింది.

"బ్రహ్మ మనోమయః హిరణ్మయః" ఇత్యాది విశేషాలతో కూడిన బ్రహ్మ అని హృదయాకాశంలో ఉపాసించాలని చెప్పబడింది.

ఈ ప్రకారం సామాన్య విశేష రూపంగాను అంగాంగి రూపంగాను చెప్పబడడంచే పంచమ, షష్ఠానువాకాల్లో చెప్పబడిన ఉపాసన ఒక్కటే అని నిర్ణయించారు. ఏతావతా తత్తల్లోక దేవాది రూపంగా

చేయబడిన వ్యాహృత్యుపాసనంచే బ్రహ్మోపాసనయందు అధికారం కలుగుతుందని అటువంటి బ్రహ్మోపాసన చేసేవారికి హృదయాకాశం స్థానమని అక్కడ పరమాత్మ సాక్షాత్కార యోగ్యత ఉందని ఆ విధంగా బ్రహ్మోపాసన చేసే వారికే సుషుమ్నానాడిద్వారా అంత్యనిష్క్రమణం తటస్థిస్తుందని ఇతరులకు తటస్థించదని, **'అన్తరేణ తాలుకే'** ఇత్యాది గ్రంథంచే నిష్క్రమణ మార్గం చెప్పబడింది.

తచ్చ బ్రహ్మలోక ప్రాప్తిపర్యన్తస్య మార్గస్య ఉపలక్షణం ద్రష్టవ్యమ్|

అని భాష్యం అనడంతో ఈ మార్గంలో బ్రహ్మతత్వావబోధ బ్రహ్మోపాసకులకు సాధారణమని శంకించి కేవలం బ్రహ్మోపాసకులకు మాత్రమే ఈ మార్గమని నిర్ణయించారు.

తేన మార్గేణ ఉపాసకస్య బ్రహ్మప్రాప్తిర్భవతి| తత్పురుషః అమానవః|స ఏనాన్బ్రహ్మ గమయతి| ఇత్యమానవ విద్యుల్లోక వర్తినా పురుషేణ బ్రహ్మప్రాపణస్య ఉక్తత్వాత్| తత్ర పరబ్రహ్మైవ ప్రాప్య మిత్యాశంక్య పరబ్రహ్మణి గత్యసంభవాత్ లోకవిశేషరూపం కార్యమేవ బ్రహ్మోపాసకేన ప్రాప్యమితో నిర్ణీతమ్| ఏవం కార్య బ్రహ్మలోక ప్రాప్తిః ప్రతీకోపాసకానామప్యస్తీత్యాశంక్య బ్రహ్మోపాసకానామేవ నేతరేషామితి నిర్ణీతమ్"

"తత్పురుషః అమానవః" అను శ్రుతి విద్యుల్లోకవర్తి అయిన పురుషుడు ఉపాసకుని బ్రహ్మను పొందించగలడని అనడంతో పరబ్రహ్మయందు గతి సంభవించదు. అనగా పరబ్రహ్మే తాను అనే రూపంలో తాదాత్మ్యాన్ని పొందడమే గాని గతి సంభవించదు. కనుక కార్యబ్రహ్మలోక ప్రాప్తియే ఫలంగా చెప్పబడింది. కాని ఇక్కడ ఒక శంక కలుగుతుంది. దీని వెనుక అనువాకంలో **"సర్వేస్మై దేవా బలిమావహన్తి"** అని **మహ ఇతి** బ్రహ్మోపాసకునికి ఫలం చెప్పబడింది.

ఈ అనువాకంలో మూర్ధన్యనాడి ద్వారా నిష్క్రమించిన ఉపాసకునికి **"భూరిత్యగ్నౌ ప్రతితిష్ఠతి"** ఇత్యాది గ్రంథంచే అగ్న్యాది దేవతల ఐశ్వర్యప్రాప్తి రూప ఫలం, పిమ్మట **"ఆప్నోతి స్వారాజ్యం"** అని స్వారాజ్య ప్రాప్తి ఫలం చెప్పబడింది. దీనికి సమన్వయం ఎలా? అని శంకించుకుని -

వ్యపోహ్యశీర్ష కపాలే|

ఇటువంటి గ్రంథంచే మూర్ధన్యనాడీ నిష్క్రమణరూప విశేషం విచారించబడింది. మూర్ధన్యనాడిద్వారా నిష్క్రమించిన వానికి **"ఆదిత్యరశ్మి సంబంధమామనన్తి తథాహి–ఛాందోగ్య బృహదారణ్యకయోః తే అర్చిషమభిసన్తన్వన్తి"** ఇత్యాది గ్రంథంచే వారికి అర్చిరాది మార్గం చెప్పబడింది.

అస్మిన్నేవమార్గే ఆదిత్య ప్రాప్తి శ్రవణాత్ ఆదిత్యాదర్వాక్ వాయోస్సన్నివేశ ఉక్తః| తథా కౌషీతకి ప్రోక్తానాం వరుణ, ఇంద్ర, ప్రజాపతి లోకానాం మార్గమధ్యే సన్నివేశాఽసంభవం ఆశంక్య విద్యుద్వరుణయోః వృష్టిద్వారా సంబంధ సంభవాత్ విద్యుల్లోకాదూర్ధ్వం వరుణ లోకస్య వరుణ లోకాదూర్ధ్వం ఇంద్ర ప్రజాపతి లోకయోః సన్నివేశ ఇత్యుక్తమ్|

అనగా బ్రహ్మోపాసకుడు మూర్ధన్య నాడిద్వారా నిష్క్రమించి అర్చిరాది మార్గం గుండా పయనించే వానికి ఆదిత్య ప్రాప్తికంటే ముందుగా అగ్ని వాయ్వాది లోకాలకు సన్నివేశం సంభవిస్తుందని, ఈ లోకాల ద్వారా పయనించే ఉపాసకుణ్ణి **"తత్పురుష అమానవః స ఏనాన్బ్రహ్మగమయతీతి"** శ్రుతిచే అమానవుడైన, విద్యుల్లోకవర్తి అయిన పురుషునిచే బ్రహ్మప్రాప్తి కొరకు పంపింపబడుతున్నట్లు చెప్తున్నందున ఆ ప్రకారం బ్రహ్మలోకానికి చేరిన పిమ్మట వృష్ట్యభిమాని అయిన విరాట్పురుష భావాన్ని పొంది ఆ స్వరూపంతో పూర్వమందు ఉపాసించిన వ్యాహృత్యుపాసన ఫలంగా అగ్న్యాది లోకంలో ప్రవేశించి వారి తాలూకు ఐశ్వర్యాన్ని పొంది అంగదేవాధిపత్యం ఆధిపత్యాన్ని, స్వారాజ్యాన్ని కూడా పొందును.

ఈ ప్రకారం అధిపతి అయినవానికి **"సర్వేస్మై దేవా బలిమావహన్తి"** శ్రుతి ప్రకారం అంగదేవతలందరు పూజించడం సంభవ మవుతుంది. స్వారాజ్య ప్రాప్తియే బ్రహ్మలోక ప్రాప్తి అని చెప్పబడుతోంది. ఈ ప్రకారం స్వారాజ్యం ప్రాప్తించిన పిమ్మట ఈ బ్రహ్మలోకంలో నిర్గుణ బ్రహ్మతత్వ సాక్షాత్కారమైన తర్వాత బ్రహ్మలోక ప్రళయకాలంలో **"ఏతత్తతో భవతి"** ఇత్యాది శ్రుతిచే ప్రతిపాదింపబడిన బ్రహ్మభావాన్ని పొందడమే విదేహ కైవల్యమని, క్రమ ముక్తి అని చెప్పబడుతోంది.

స్వారాజ్యం ప్రాప్తవతో యోగినః తస్మిన్నేవ బ్రహ్మలోకే నిర్గుణ బ్రహ్మ తత్వ సాక్షాత్కారే సతి బ్రహ్మలోకస్య అవసానే విదేహ కైవల్యం భవతి అయమర్థః ఏతత్తతో భవతీత్యాది సమామ్నాతః ఏతదేవ అభిప్రేత్య వ్యాసేన సూత్రతమ్|

కార్యాత్యయే తదధ్యక్షేణ సహాతః పరమభిదానాత్" (4-3-10)

"బ్రహ్మణా సహతే సర్వే సంప్రాప్తే ప్రతి సంచరే| పరస్యాన్తే కృతాత్మానః ప్రవిశన్తి పరమ్ పదమ్"

అను శ్రుతి కూడా పై గ్రంథాన్ని స్పష్టపరుస్తోంది.

ఈ ప్రకారం ఉపాస్య స్వరూపం, శ్రుత్యుక్త ప్రకారం ఉపాసించే వారికి మూర్ధన్యనాడి ద్వారా నిష్క్రమించడం, అటు పిమ్మట అర్చరాది మార్గంగుండా ఆ యా లోకాల ప్రాప్తి ద్వారా బ్రహ్మలోక ప్రాప్తి పర్యంతం చెప్పి, పిమ్మట అగ్న్యాది దేవతలయొక్క ఐశ్వర్యాన్ని పొంది బ్రహ్మతత్వావబోధానంతరం నిర్గుణ బ్రహ్మ సాక్షాత్కారాన్ని పొంది కార్య బ్రహ్మలోకంనుంచి విముక్తి చెంది బ్రహ్మ భావాన్ని పొందడమనే విదేహ కైవల్యం అనగా క్రమముక్తి ప్రాప్తిస్తుందని చెప్పబడింది.

దీనివల్ల తేలిన సారాంశం- ఉపాసనలు, చిత్తైకాగ్రతకు అవసరమని అందులో అహంగ్రహోపాసన అనే పేరుతో బ్రహ్మోపాసన చేసే వానికి క్రమముక్తి లభిస్తుందని చెప్పినట్లయింది. తైత్తిరీయ ఉపనిషత్తుల్లో మాధ్యమాధికారాన్ననుసరించి ఇంకా ఉపాసనలు చెప్పబడినా గ్రంథవిస్తర భీతిచే సంక్షేపించి, సద్యో ముక్తికి సాక్షాస్థానమైన బ్రహ్మజ్ఞానాన్ని గురించి కూడా ముచ్చటించడం అవసరమని ఇకపై అది కూడా సంక్షేపంగా వివరించబడుతోంది.

బ్రహ్మజ్ఞానం

ఇంతవరకు ఉపాసనల ఆవశ్యకత, అనుష్ఠాన ప్రకారం వివరించబడ్డాయి. అందులో బ్రహ్మోపాసనకు బ్రహ్మలోక ప్రాప్తిద్వారా అనగా బ్రహ్మలోకంలో బ్రహ్మ సాక్షాత్కార బోధానంతరం బ్రహ్మసాయుజ్యమనే క్రమముక్తి రూప ఫలం సంభవిస్తుందని వివరించడమైంది. ఇటుపై సాక్షాన్మోక్ష సాధనమైన బ్రహ్మజ్ఞానాన్ని గురించి వివరించబడుతోంది.

మోక్షమనేది ధర్మ,అర్థ,కామ,మోక్షాలనే నాలుగు పురుషార్థాలలో ఉత్తమ పురుషార్థం. మోక్షమనగా జనన, మరణరూప సంసారబంధ విముక్తి అనగా సంసారమనే అవిద్యా నివృత్తియే మోక్షం అనబడుతుంది.

అవిద్యాస్తమయో మోక్షః సాచబంధ ఉదాహృతః|

అని చెప్పబడింది. ఇది బ్రహ్మజ్ఞానైక సాధ్యం. బ్రహ్మజ్ఞానమంటే ఆత్మయొక్క యథార్థ జ్ఞానం. **"తంత్వౌపనిషదం పురుషం పృచ్ఛామి"** అను శ్రుతి ఆత్మ ఉపనిషద్దైక వేద్యమని (ఉపనిషత్తుల ద్వారా మాత్రమే తెలుసుకోదగినది అని) చెప్తోంది.

"ఆత్మై వేదగ్ం సర్వమ్", "ఇదగ్ం సర్వం యదయమాత్మా", "తత్వమసి" ఇత్యాది వాక్యార్థ జ్ఞానమే ఆత్మను గురించి యదార్థాన్ని గ్రహించే జ్ఞానం. ఇదే బ్రహ్మజ్ఞానం. దీనినుంచి గాని మోక్షం సిద్ధించదని శ్రుతులు చెప్తున్నాయి.

"నాన్యః పంథా విద్యతేయనాయ" "జ్ఞానాదేవ హి కైవలమ్"

బ్రహ్మ విద్బ్రహ్మైవ భవతి" "కశ్చిద్ధీరః ప్రత్యగాత్మాన మైక్షత్" ఇత్యాది శ్రుతులు, ఇంకా

"పఠన్తు శాస్త్రాణి యజన్తు దేవాన్ కుర్వన్తు కర్మాణి భజన్తు దేవతాః| ఆత్మైక్య బోధేన వినాపి ముక్తిర్నసిద్ధ్యతి బ్రహ్మ శతాన్తరేష్వపి|" (వి.చూ)

అను వివేక చూడామణి వచనాలు మున్నగునవి బ్రహ్మాత్మైక్య జ్ఞానమే మోక్షహేతువని చెప్తున్నాయి. బ్రహ్మాత్మైక్య జ్ఞానమనగా జీవ,బ్రహ్మలకు ఐక్య సంపాదన. దానికోసం బ్రహ్మవిచారమనగా - **కోనామ జీవః**? జీవుడనగా ఎవరు? ఈశ్వరుడనగా ఎవరు? ఎవరు ఏ యే ఉపాధి కలవారు? ఇటువంటి ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవడానికి ప్రయత్నం, చివరకు తెలుసుకోవడం. ఇంకా స్థూల సూక్ష్మాది శరీరత్రయ విభాగము, భూతపంచక నిరూపణ ఆత్మకు అన్నమయాది కోశ పంచకాతిరిక్తత్వ నిరూపణ మున్నగునవి అని అర్థం. ఇటువంటి బ్రహ్మవిచారానికి సాధన చతుష్టయ సంపత్తి కలవారే అధికారులని నిర్ణయించారు. కాబట్టి సాధన చతుష్టయమనగా ఏమి? అని నిరూపించవలసి ఉంది. దాని అర్థం సాధన విభాగం.

బహిరఙ్గ సాధనము, అన్తరఙ్గ సాధనము అని రెండు విధాలు. అందులో నిత్యనైమిత్తిక కర్మజాతము, ఉపాసనలు కూడా బహిరఙ్గ సాధనం అన్నారు. కనుకనే వేదంలో ఆదియందు కర్మ విచారణ చేసి కర్మానుష్ఠానంవల్ల చిత్తశుద్ధి ఏర్పడుతుందని చెప్పి, చిత్తం పరిశుద్ధమైన జ్ఞానసాధ్యమైన మోక్షాన్ని అధిగమించడానికి ముందు చిత్తవిక్షేపాన్ని పరిహరించడానికై చిత్తానికి ఏకాగ్రత సంపాదించాలని, దానికోసం కర్మకాండానంతరం ఉపాసనను గురించి ఉపనిషత్తుల మొదట్లో శిక్షావల్లియందు ప్రతిపాదించబడినట్లు ఇంతకుముందు వివరించబడింది. ఇటుపైన అంతరఙ్గ సాధనాన్ని గురించి విచారణ చేయబడుతోంది.

అంతరఙ్గ సాధనాలెన్ని? అవి ఏవి?

సాధనా చతుష్టయ వివరాలు ఇలా ఉన్నాయి. (1) నిత్యాఽనిత్యవస్తు వివేకము (2) ఇహాముత్రార్థఫల భోగ విరాగం అనగా ఐహికమైన ఆముష్మికమైన ఫలాలను అనుభవించాలానే కోరిక లేకుండా ఉండడం (3) శమాది షట్క సమ్పత్తి (4) ముముక్షుత్వమ్ అనగా ఉత్కుటమైన మోక్షేచ్ఛ కలిగి ఉండడం. ఈ సముదాయమే సాధన చతుష్టయ సంపత్తిగా చెప్పబడుతోంది.

1. ఈ చెప్పబడిన సాధనాల్లో పూర్వపూర్వం ఉత్తరోత్తర సాధనకు కారణమన్నారు. ఇందులో '**బ్రహ్మసత్యమ్ జగన్మిథ్యా**' అను నిశ్చయ రూపమైనది నిత్యాఽనిత్య వస్తు వివేకం.

2. దేహాది బ్రహ్మ పర్యన్తం అనిత్య భోగవస్తువునందు శ్రవణ దర్శనాదులచే యాజుగుప్స, అనగా వాటియందు ఏహ్యాత కలగడమే విరాగం. ఈ భోగాలనుంచి ఏర్పడే విముఖతే భోగ విరామం.

3. శమాది షట్క సమ్పత్తి అనగా (1)శమం (2)దమం (3)ఉపరతి (4)తితిక్ష (5)శ్రద్ధ (6)సమాధానం అనే ఆరు. వీటి వివరాలు ఇలా ఉన్నాయి.

శమము: "లౌకిక వ్యాపారాన్నివృత్య స్వలక్ష్యే నియతావస్థా శమః" అనగా అంతరింద్రియ నిగ్రహం శమం. అంతరింద్రియ నిగ్రహమనగా బుద్ధి, అహంకార, మనస్సు, చిత్తవృత్తి రూపమైన అంతఃకరణం సర్వకర్మలనుండి నివర్తించుట ద్వారా స్వలక్ష్యమందు నియతమైన స్థితిలో ఉండడమే శమం.

దమము:

విషయేభ్యః పరావృత్యస్థాపనం స్వస్వగోళకే ఉభయేషామింద్రియాణాంవా సదమః ప్రకీర్తితః| (వి.చూ.)

త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణేంద్రియాలు ఐదు జ్ఞానేంద్రియాలు. వాక్, పాణి, పాద, పాయు (గుదము), ఉపస్థలు (జననేంద్రియం) అయిదు కర్మేంద్రియాలు. ఈ పది ఇంద్రియాలను విషయాలనుండి మరలించి తమ తమ గోళకములందు నిలపడమే **'దమం'** అనబడుతుంది.

తస్మాత్సిద్ధం బహిరింద్రియ నిగ్రహోదమ| (సూ.భాష్యం)

ఉపరతి: అంతర్బాహ్యకరణములను నైరంతర్యంగా (అంతరం లేకుండా) బాహ్యమైన జగద్విషయక వ్యాపారంనుండి మరలింపచేసి బ్రహ్మాభిముఖం అయ్యేలా చేయడం ఉపరతి. అంటే, ఇంద్రియములను విషయదృష్టినుండి మరలించడం.

తితిక్ష:

యంహి నా వ్యధయన్త్యేతే పురుషం పురుషర్షభః సమదుఃఖ సుఖంధీరం సోఽమృతత్వాయ కల్పతే|
(భ.గీ.2-15)

ఇంతకు ముందు **"మాత్రా స్పర్శాస్తు కౌన్తేయ"** ఇతి శ్లోకంచే చెప్పబడిన ఇంద్రియాలు తద్విషయాలైన శబ్దాదులు, శీతోష్ణాదులు సుఖ దుఃఖముల నిచ్చేవి, ఉత్పత్తి వినాశాలు గలవి. అందుచే వాటిని సహించడం తితిక్ష.

తేషుహర్ష విషాదం మాకార్షీః| (శం.భా.)

శీతోష్ణాదులయందు హర్షములను, దుఃఖమును పాటించవలదని ఉపదేశించి

"శీతోష్ణాదీన్ సహతః కిం ఫలమ్?" ఇతి చేత్ శృణు ఇతి.

భగవతా అర్జునం ప్రత్యేవ ముక్తమితి "యంహి నవ్యధయ న్తీతి"

అనగా నిత్యాత్మ దర్శనంవల్ల హర్ష విషాద రహితుడుగాను, ధీరుడుగాను ఉన్న పురుషుని శీతోష్ణ జన్యములైన సుఖదుఃఖాదులు ఇబ్బంది పెట్టవని అర్థం. సుఖదుఃఖాదులు అనిత్యములవడంతో ఆ పురుషుడు ద్వంద్వ సహన స్వభావం గలవాడై మోక్షానికి అర్హుడవుతాడు అనడంచే తితిక్ష ఆవశ్యకమని గీతలో చెప్పబడింది.

సహనం సర్వదుఃఖానామప్రతీకార పూర్వకమ్| చింతావికార రహితం సా తితిక్షా నిగద్యతే|

సర్వదుఃఖాలను ప్రతీకారం లేకుండా చింతావికార రహితంగా ఏ విధమైన వికారాన్ని చెందని ఆలోచన గలవాడై సహించడం తితిక్ష అని వివేక చూడామణిలో చెప్పబడింది.

శ్రద్ధా:

"శ్రద్ధానామ గురువేదాంత వాక్యేషు విశ్వాసః" ఇత్యుచ్యతే. గురువుయొక్క వాక్యమందు వేదాంత వాక్యము లందు విశ్వాసం కలిగి ఉండడమే **'శ్రద్ధ'** అనబడుతుంది.

శ్రద్ధావాన్లభతే జ్ఞానం తత్పరస్సంయ తేంద్రియః జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తిమచిరేణాధిగచ్ఛతి|

శ్రద్ధ గలవాడు జ్ఞానాన్ని పొందగలడు. కేవలం శ్రద్ధాపరుడు ఇంద్రియ నియమం కలవాడు జ్ఞానాన్ని పొంది అచిరకాలంలోనే ఉత్కృష్టమైన శాంతిని పొందగలడు.

సమాధానం:

నిద్ర, ఆలస్య ప్రమాదాలను విడిచిపెట్టడంద్వారా మనస్సును నిలకడగా ఉంచడం సమాధానం అనబడుతుంది. ఇదే విషయం -

సర్వదా స్థాపనం బుద్ధేః శుద్ధే బ్రహ్మణి సర్వదా| తత్సమాధానమిత్యుక్తం న తు చిత్తస్య లాలనమ్|

చిత్తాన్ని లాలన చేయకుండా శుద్ధ బ్రహ్మయందు బుద్ధిని నిలపడం సమాధానమని చెప్పబడింది. ఈ ప్రకారం సాధన చతుష్టయ సంపత్తిలో మూడవదైన శమదమాది షట్కమనే సాధనం నిరూపించబడింది. ఇక చివరిదైన ముముక్షుత్వం.

4. ముముక్షుత్వం:

అహంకారాది దేహాన్తాన్ బంధానజ్ఞాన కల్పితాన్| స్వస్వరూపావబోధేన మోక్తుమిచ్ఛా ముముక్షుతా| (వి.చూ.)

స్వ స్వరూపం బ్రహ్మాత్మ స్వరూపమని తెలియుట ద్వారా అహంకార ప్రభృతి దేహాన్తం వరకు గల అజ్ఞాన కల్పితాలైన బంధాలను విడిచిపెట్టడానికి ఇచ్ఛయించడమే ముముక్షుత్వమని చెప్పబడుతోంది. సుప్రసన్న చిత్తానికి ముముక్షుత జనిస్తుంది.

సంసార బంధ నిర్ముక్తిః కథం స్యాన్మేకదా భవేత్| (లక్షణం)

ఇతి యా సుదృఢా బుద్ధిర్వాస్తవ్యా సా ముముక్షుతా| (అనుకరణం)

లోకంలో గృహం తగలబడుతున్నపుడు ఆ గృహంలో గల పురుషుడు అత్యవసరమైతే తన తాపాన్ని ఉపశమింప చేసుకోవడానికి దారాపుత్రులను ఆ గృహంలోనే విడిచిపెట్టి ఆ గృహం వెలుపలి భాగానికి వెళ్ళినట్లు సాంసారికమైన బంధమనే తాపాన్ని ఉపశమింప చేసుకోవడానికి దారేషణ, పుత్రేషణ, ధనేషణ అనే ఈషణ త్రయాన్ని విడిచి మోక్షాన్ని పొందడానికై ఇచ్ఛయించడమే ముముక్షుత అన్నారు. లోకంలో కొంతమందికి నిత్యాఽనిత్య వస్తు వివేకం ఉన్నప్పటికీ వైరాగ్యం ఉండదు. కనుక వైరాగ్యం కూడా చాలా అవసరం. కొంతమందికి వివేకం, వైరాగ్యం రెండూ ఉన్నప్పటికీ కోప తాపాదులు ఉంటాయి. కావున వాటిని తగ్గించుకోవడానికి శమదమాది సంపత్తి కూడా అవసరమే.

అన్నీ ఉన్నా కూడా కొంతమందికి మోక్ష ఇచ్ఛ ఉండదు. కనుక ఇతర మూడు (నిత్యాఽనిత్య వస్తు వివేకం, వైరాగ్యం, శమదమాది సంపత్తి) సాధనాలతో బాటు ముముక్షుత్వమనే నాలుగో సాధనం కూడా అవసరం. కనుకనే, ఇటువంటి సాధన చతుష్టయం కలవారే బ్రహ్మోచరణకు అధికారి కాగలరని **"అథాఽతో బ్రహ్మ జిజ్ఞాసా"** అను సూత్ర భాష్యం **'అథ'** సాధన చతుష్టయ సంపత్యనంతరం,**' అతః'**- వేద శాస్త్రోక్తాలైన కర్మోపాసనా ఫలాలు అనిత్యాలైనందువల్ల బ్రహ్మజ్ఞానంవల్ల జీవబ్రహ్మైక్యరూప బ్రహ్మసాక్షాత్కారమనే శాశ్వత రూపమైన మోక్ష రూప ఫలం సంభవిస్తుంది. కనుక, **'బ్రహ్మ జిజ్ఞాసా'**- బ్రహ్మవిచారం అనేది రెండు విధాలు. బ్రహ్మపదార్థం ఎటువంటిదని స్వరూప లక్షణ, తటస్థ లక్షణాలచే తెలుసుకోవడం ఒక విధం. మహావిచార విషయమైన సంపుటితో జీవ బ్రహ్మైక్యాన్ని తెలుసుకోవడం రెండో విధం. ఇందులో బ్రహ్మవిచార విషయమైన బ్రహ్మ పదార్థానికి లక్షణమేమి అని విచారించాలి. అందులో మొదటిది తటస్థ లక్షణం.

"యతో వా ఇమాని భూతాని జాయన్తే| యేన జాతాని జీవన్తి| యత్ప్రయ న్త్యభిసంవిశన్తి| తద్విజి జ్ఞాసస్వ| తద్బ్రహ్మేతి" (తై.ఉ.)

"అహం బుద్ధి గమ్యేషు అన్న ప్రాణాదిషు మధ్యే| బ్రహ్మ అన్వేషణీయ మిత్యభిప్రాయః"

ఇంతకుముందు అన్న ప్రాణ చక్షురాదులు బ్రహ్మను తెలుసుకొనుటకు ద్వారభూతములని, వాటి మధ్య బ్రహ్మను గుర్తించవలెనని చెప్పి, ఇప్పుడు **'యతోవా'** అను శ్రుతిచే బ్రహ్మలక్షణం మరియు బ్రహ్మవిచారం యొక్క ఉపదేశం చూపబడుతోంది.

తెలుసుకోవడానికి అత్యంత ఉత్సుకతతో కూడిన **'భృగు'**ను గురించి వరుణుడు ఇలా అన్నాడు.

ఇమాని ఆకాశాదీని పంచమహా భూతాని భౌతిక దేహోపేతాః హిరణ్యగర్భాది స్తమ్బాన్తాః సర్వే ప్రాణినశ్చ యతః వస్తునః జాయన్తే| ఉత్పన్నాని చ భూతాని యేన వస్తునా జీవన్తి స్థితిం లభన్తే| ప్రయన్తి- నాశం ప్రతిపద్యమానాని భూతాని యద్వస్తు అభిసంవిశన్తి సాకల్యేన ప్రవిశన్తి యథాఫేనతరంగ బుద్బు దాదీనాం ఉత్పత్తి స్థితి లయాః సముద్రే భవన్తి తద్వత్ జగదుత్పత్తి స్థితి లయకారణం వస్తువిచారయ తదేవ వస్తు త్వయా పృష్టం బ్రహ్మ| (భాష్యం)

"ఆకాశాది పంచభూతాలు హిరణ్యవర్ణుని లగాయతు స్తంభం వరకు గల ప్రాణులు ఏ వస్తువువల్ల ఉత్పన్న మయ్యాయో, ఈ ఉత్పన్నమైన భూతాలన్నీ ఎవని వలన జీవిస్తున్నాయో, లోకంలో జలంనుండి పుట్టిన భూతాలన్నీ తిరిగి ఏ వస్తువులో లీనమవుతున్నాయో ఆ వస్తువు బ్రహ్మ అని, **"తద్విజిజ్ఞాసస్వ"** ఆ బ్రహ్మపదార్థాన్ని తెలుసుకొనుము అని ఉపదేశించెను.

ఈ ప్రకారం జగదుత్పత్తి, స్థితి, లయ కారణమైన వస్తువు బ్రహ్మ అని తటస్థ లక్షణం చెప్పబడింది. ఈ విధమైన లక్షణాలతో చెప్పబడిన బ్రహ్మవిదాచార్యుడు గావచ్చును. అనగా విచారించదగినవాడు కావచ్చును. కానీ ఆ బ్రహ్మయొక్క స్వరూపమేమిటని ప్రశ్న ఉదయిస్తుంది. దానికి సమాధానంగా **"సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ"** అను శ్రుతి బ్రహ్మయొక్క స్వరూప లక్షణాన్ని చెప్తోంది. కాని దీనికి ముందు బ్రహ్మవేత్తకు బ్రహ్మసాక్షాత్కారం ఫలమని, ఇదే ఉపనిషత్సారమని **'బ్రహ్మ విదాప్నోతిపరమ్'** అను శ్రుతి సూత్రస్థానాపన్నమని ఈ క్రింది విధంగా ఈ మూడు పదాల అర్థగాంభీర్యాన్ని సాయణభాష్యంలో వివరించారు. ఈ సూత్రంలో చెప్పబడిన బ్రహ్మశబ్దం **"బృహ- బృహి వృద్ధౌ"** అనే ధాతువువల్ల ఏర్పడి నిరతిశయమైన వృద్ధి అనగా నిత్యశుద్ధ బుద్ధి ముక్తి స్వభావం కలదని, సర్వశక్త్యుపేతమని శ్రీమత్ శారీరక మీమాంసా భాష్యంలో భగవత్పాదులచే చెప్పబడింది.

అస్తితావత్ బ్రహ్మనిత్య శుద్ధబుద్ధి ముక్త స్వభావం సర్వజ్ఞం సర్వశక్తి| (మీ.భా.)

ఈ విధమైన అర్థాన్నే **"సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ"** అనే శ్రుతి స్పష్టపరుస్తోంది. **"యః వేత్తి మనసా సాక్షాత్కరోతి సః బ్రహ్మవిత్"** అని పైన చెప్పబడిన లక్షణాలు గల బ్రహ్మను ఎవరు మనసా సాక్షాత్కారం చేసుకుంటారో వారే **'బ్రహ్మవిత్'** శబ్ద వాచ్యుడు.

న సైవానుద్రష్టవ్యమ్ నేహనానాస్తి కించన|

ఇత్యాది శ్రుతులన్నీ ఇతర ఇంద్రియాల అపేక్ష లేకుండా కేవలం మనస్సు చేతనే గోచరింప చేసుకోదగినది బ్రహ్మపదార్థమని చెప్తున్నాయి.

యే దేవా మనో జాతాః| (తై. సం.)

యథా చ మనసస్సార్థం రూపాదౌ చక్షురాదినా ప్రవృత్తి స్సుఖదుఃఖాదౌ కేవలస్యైవ గమ్యతే| (శ్లో.వా.)

నామ రూప విశిష్ట పదార్థాలు చక్షురాది ఇంద్రియాలతో గ్రహింపబడునని పై శ్రుతి చేతను, భట్టపాదులచే చెప్పబడిన శ్లోకవార్తికం చేతను స్పష్టంగా ప్రతిపాదించబడింది. దీనివల్ల తేలిన విషయం ఇతరమైన నామరూప విశిష్ట పదార్థాలు ఇతర ఇంద్రియాల సహాయంతో మనస్సుచే గ్రహించ బడతాయని, కానీ అసలు పదార్థం మాత్రం కేవలం మనస్సుకే గోచరిస్తుందని చెప్పబడుతోంది.

దీనిపై ఒక శంక- చక్షురాది ఇంద్రియాల అపేక్ష లేకున్నా బ్రహ్మ పదార్థం ఇటువంటిదని వేదవాక్యంచే ప్రతిపాదించబడుతున్నందున శాస్త్రంయొక్క అపేక్ష ఉంది కదా! అన్నట్లయితే **"అనుద్రష్టవ్యమ్"** అను శ్రుతిలో చెప్పబడిన **'అను'** అనే పదం శాస్త్ర ప్రతిపాదనానంతరం మనస్సుచే గోచరింప చేసుకునేది బ్రహ్మ పదార్థం అని సూచింపబడు తున్నందున అది శాస్త్ర సమ్మతమే అన్నారు. అలా అయితే, బ్రహ్మజ్ఞానం శాస్త్ర గమ్యమైతే, ధర్మాఽధర్మములు శాస్త్రైక గమ్యములై పరోక్ష స్వభావంగా ఉన్నట్లుగా బ్రహ్మపదార్థం కూడా పరోక్షమే అనవలసి వస్తుందని శంకించి-

యత్సాక్షాదపరోక్షం బ్రహ్మ|

ఇత్యాది శ్రుతులు బ్రహ్మపదార్థం అపరోక్ష స్వభావం కలదని ప్రతిపాదిస్తున్నందున దృష్టాన్త వైషమ్యంచే పరోక్షవాదాన్ని నిరాకరించారు.

"యతోవా ఇమాని భూతాని జాయన్తే"

"సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ"

మొదలైన ఇతర వాక్యాలచే తటస్థ లక్షణ,స్వరూప లక్షణ లక్షితమైన బ్రహ్మ ఏది బోధింపబడిందో ఆ బ్రహ్మకు **"ప్రజ్ఞానం బ్రహ్మ" "అహం బ్రహ్మాఽస్మి" "తత్వమసి"** ఇత్యాది మహావాక్యాలు ఎలా బోధించాయో దానికి శ్రవణాదులు ఎలా సాయబడతాయి? అను విషయాలను బోధించడానికి ముందుగా బ్రహ్మకు మనో గోచరత్వం గురించి తెలుసుకోవలసి ఉంది.

యన్మనసా నమనుతే యేనాహుర్మనోఽమతమ్| తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే| (త.ఉ)

అను ఉపనిషద్వాక్యం "ఏ సాక్షి చైతన్యం మనస్సుచే గోచరింప చేసుకోవడానికి శక్యం కాదో, ఏ సాక్షి చైతన్యంచే మనస్సు ప్రకాశింపబడుతుందో అదే సాక్షి చైతన్యం బ్రహ్మగా గుర్తించమని, " **నేదం యదిదముపాసతే"** అను శ్రుతి ఉపాసకులు స్వాతిరిక్తమైన శాస్త్ర సిద్ధమైన ఏ బ్రహ్మను ఉపాసిస్తారో అది ముఖ్యబ్రహ్మ కాదని చెప్పడంచేత బ్రహ్మకు మనోగోచరత్వం నిషేధించడం చేత,

యతోవాచో నివర్తన్తే అప్రాప్యమనసా స వా|

ఇత్యాది శ్రుతులు బ్రహ్మకు వాగ్గోచరత్వాన్ని, మనోగోచరత్వాన్ని నిషేధించడంచేత,

"మనసై వానుద్రష్టవ్యం", "తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి"

ఇత్యాది శ్రుతులు మనో విషయత్వాన్ని, ఉపనిషద్వేద్యత్వాన్ని చెప్పడం పరస్పర విరుద్ధంగా ఉన్నట్లు కనబడుతోంది. కనుకనే సూ.భా. జిజ్ఞాసాధికరణంలో బ్రహ్మ ప్రమాణ సిద్ధమైతే ఆ విచారణ అవసరం ప్రాప్తిస్తుంది. కానీ ఏ ప్రమాణాలచేతా సిద్ధం కానప్పుడు బ్రహ్మ జిజ్ఞాస్య మవడం ఎలా పొసగుతుందని విచారించి-

"తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి"

అను శ్రుతి ఉపనిషదతిరిక్త (ఉపనిషత్తులు కాని) వాక్కులకు బ్రహ్మ గోచరించకున్నా ఉపనిషద్వేద్యమని చెప్పడంచే బ్రహ్మకు జిజ్ఞాస్యత్వం సంభావిస్తుందని నిర్ణయించారు.

స్వప్రకాశమైన సాక్షి చైతన్యానికి ఘటాదులవలె మనోజన్య స్ఫురణ విషయత్వం సంభవించినట్లయితే ఫల వ్యాప్యత్వం సంభవిస్తుందని-

సాక్షి చైతన్యం బ్రహ్మ" ఇత్యుల్లిఖన్త్యా మహావాక్య జన్యయా మనోవృత్త్యా వ్యాప్యమానే సతి తద్వృత్తి రూపయా తత్వ విద్యయా ప్రత్యగ్బ్రహ్మణోః భేదహేతురవిద్యా నివర్తతే (సా.భా.)

అను గ్రంథంచే బ్రహ్మకు మనోవిషయత్వం అనగా ఫలవ్యాప్యత్వం సంభవించకపోయినా వృత్తి విషయత్వం సంభవిస్తుందని-

న హి అస్యాః వృత్తేః పరోక్ష జ్ఞానత్వం సంభవతి విషయ సంబంధస్యైవ వృత్యాకార జనకత్వాత్|

ఇత్యాది గ్రంథంచేత ధర్మాఽధర్మ జ్ఞానం వలె బ్రహ్మజ్ఞానం పరోక్షం కాదని సమర్థించారు.

కించ బహిర్ముఖః పురుషః యదా నిదిధ్యాసన శబ్దవాచ్యేన బ్రహ్మధ్యానేన అన్తర్ముఖాం సూక్ష్మవస్తు నిరూపణ కుశలాం ఏకాగ్రాం బుద్ధి వృత్తిం సంపాదయతి తదా అసౌబుద్ధి వృత్తిః ప్రత్యగాత్మనా సంబధ్య తథాకారా సతీ వాక్యానుగ్రహేణ భేద భ్రమం నిరాకుర్వతీ బ్రహ్మ సాక్షాత్కార ఇత్యుచ్యతే| (సా.భా)

ఏ పురుషుడు నిదిధ్యాసన శబ్దాలచే చెప్పబడుతున్న బ్రహ్మజ్ఞానంచేత, అంతర్ముఖమైన సూక్ష్మవాస్తు నిరూపణలో కౌసల్యం కలిగిన బుద్ధి వృత్తిని ఎప్పుడు సంపాదిస్తుందో అప్పుడు బుద్ధి వృత్తి ప్రత్యగాత్మతో సంబంధించి తదాకారాకారితమై మహావాక్యంయొక్క సామర్థ్యంచేత జీవబ్రహ్మలకు గల భేద భ్రమ నిరాకరిస్తుంది. ఇదే బ్రహ్మసాక్షాత్కారమని చెప్పబడుతోంది.

దేహేంద్రియాదుల కంటే వివిక్తమైన సాక్షి చైతన్యం బ్రహ్మ అని, తటస్థ లక్షణ, స్వరూప లక్షణ రూపమైన అవాంతర వాక్యంచే నిశ్చయం చేసుకున్న వానికి **"అహం బ్రహ్మాస్మి" "తత్త్వమసి"** ఇత్యాది మహావాక్యాలచే బ్రహ్మసాక్షాత్కారం కలుగుతుందని, తై.ఉ. ఆనందవల్లి 1వ అనువాకంలో (సా.భా.) బ్రహ్మవిచారానికి ప్రయోజనం జీవబ్రహ్మైక్య తాత్పర్యమని నిర్ణయం. అటువంటి నిర్ణయం కోసం శ్రవణ, మననాదులు అవసరమని **"ఆత్మావారే ద్రష్టవ్యః శ్రోతవ్యో నిది ధ్యాసితవ్యః"** ఇత్యాది శ్రుతులు బోధిస్తున్నాయి.

యథోక్త విధినా సద్గురో రేవ శ్రవణం కర్తవ్యమితి| (ముం.ఉ)

పరీక్ష్య లోకాన్ కర్మ చితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాత్ నాస్త్యకృతః కృత్యేన తద్విజ్ఞానార్థం సద్గురు మేవాభిగచ్ఛేత్ సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మ నిష్ఠం|

కర్మవల్ల జనించిన లోకాలు అనిత్యాలని పరీక్షించి అకృతమైన నిత్యమైన మోక్షం క్రియమాణ కర్మచే సిద్ధించదని గ్రహించి బ్రాహ్మణుడు నిర్వేదాన్ని అస్పృహను చెందుతాడు. పిమ్మట మోక్షసాధనమైన బ్రహ్మజ్ఞానం నిమిత్తం బ్రహ్మజ్ఞాన సంపన్నుడైన సద్గురువులనే సమిధలు హస్తమందు కలవాడై సేవించాలని శ్రుత్యర్థం. అటువంటి సర్వజ్ఞుడైన గురువునుంచి బ్రహ్మను గురించి తెలుసుకోవాలని చెప్పబడింది.

"వేదాన్తైరేవ శ్రవణం కర్తవ్యమ్|"

"శ్రోతవ్యస్య బ్రహ్మణః వేదాన్తైక వేద్యత్వాత్

"తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి నావేద విన్మనుతేతం బృహన్తం" (తై.బ్రా.)

వీటివల్ల పరమాత్మ వేదైక సమధిగమ్యుడని తెలుస్తోంది. కానీ మంత్ర బ్రాహ్మణ సముదాయాత్మకమైనది వేదం. **"మంత్ర బ్రాహ్మణ యోర్వేద నామధేయమ్"** (ఆ.శ్రౌ. పరిభాష సూత్రం). దీని ప్రకారం పరమాత్మ వేదవేద్యుడని, కానీ బ్రహ్మజ్ఞాన బోధవాక్యాలు వేదమంతటిలోను కనిపించడం లేదు కనుక వేదంవల్ల బ్రహ్మని తెలుసుకోవడం అని చెప్పడం ఎలా కుదురుతుందని శంక వస్తుంది. **"తం త్వౌపనిషదం"** అను శ్రుతి సంవాదంచే వేద శబ్దాన్ని ఉపనిషత్పరంగా సంకోచింపచేసి, ఇక్కడ వేదం అంటే ఉపనిషత్తులు అని అర్థం చెప్పుకోవాలి.

తిలేషు తైలవద్వేదే వేదాన్తాశ్చ సునిశ్చితాః| (ముక్తి.ఉ.)

తిలలో తైలం ఇమిడి ఉన్నట్లుగా వేదంలో వేదాంతాలు (ఉపనిషత్తులు) అలాగే ఇమిడి ఉన్నాయిట. కాని ఉపనిషత్తులలో కూడా కర్మ, ఉపాసనలకు సంబంధించిన వాక్యాలు మెండుగా ఉన్నాయి. అయినా ప్రాయికంగా ఉపనిషత్తులు బ్రహ్మప్రతిపాదన ప్రధానమైనవి అయినందున ఉపనిషద్వేద్యుడని, అటువంటి ఉపనిషత్తులు వేదంలో ఉన్నందున వేదవేద్యుడని, చెప్పడంతో **"నావేదవిత్"**, **"తం త్వౌపనిషనిషదమ్"** అను వాక్యాలకు తాత్పర్యమని గ్రహించాలి.

ఇట్లే **"వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః"** ఇత్యాది భగవద్గీతా వచనాలకు కూడా సాక్షాత్ బ్రహ్మావబోధకాలైన వేదాంత వాక్యాలందే తాత్పర్యమని అటువంటి వాక్యాలచే సద్గురు సకాశంనుండి (సద్గురువు ద్వారా) శ్రవణం చేయాలని **"సద్గురుమేవాఽభిగచ్ఛేత్"** ఇత్యాది శ్రుతుల యొక్క తాత్పర్యం.

సద్గురువునుంచి వేదాంతవాక్య విచారణాత్మక శ్రవణం చెయ్యాలని నిర్ణయించారు. కాని ఇక్కడ శ్రవణం చేయడమంటే గురువుగారు చెప్పిన పాఠాన్ని ఆనుపూర్వీగా వినడం మాత్రం కాదు. ఉపక్రమాది షడ్విధ లింగాలతో వేదాంత వాక్యాల తాత్పర్య నిర్ణయం చేయాలి.

షడ్విధ లింగములు

వేదాంత వాక్యాల తాత్పర్య నిర్ణయం చేయడానికి అవసరమైన ఆరు విధాల సాధనాలు షడ్విధ లింగాలుగా పేర్కొనబడ్డాయి. అవి-

1. ఉపక్రమ ఉపసంహార 2. అభ్యాస 3. అపూర్వతా 4. ఫలం 5. అర్థవాద 6. ఉపపత్తి

ఉపక్రమ ఉపసంహారాలకు ఏకవాక్యత కోసం ఈ రెండూ ఒకే అర్థాన్ని బోధించాలి. 'అభ్యాస' మనగా అద్వైత పరబ్రహ్మను బోధించే వేదాంత వాక్యాలను ఆవృత్తి చేసి బోధించడం. 'అపూర్వతా' అనగా ఇతర ప్రమాణాలచే తెలియబడని స్వయంప్రకాశమైన బ్రహ్మస్వరూపాన్ని ప్రతిపాదించడం. అద్వైత బ్రహ్మజ్ఞానానికి జన్మాద్యనర్థ నివృత్తియే ఫలమని భేదజ్ఞాన నిందాపూర్వకంగా అభేద జ్ఞానాన్ని స్తుతించడం- 'అర్థ వాదాలు'. కారణరూపమైన బ్రహ్మకు తత్కార్యభూతమైన జగత్తులకు అనేక ఉపనిషత్తులలో భేదభావాన్ని ప్రతిపాదించడ మనేది 'ఉపపత్తి'. ఈ షడ్విధలింగాలతో జీవబ్రహ్మైక్య అర్థాన్ని నిర్ణయం చేసుకుంటూ శ్రవణం చేయాలి. ఇదే విషయం ఛాందోగ్య ప్రపాఠకంలో –

"సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్"

"ఏకమేవాఽద్వితీయమ్"

అను వాక్యాలచే నిరుపాధికమైన సద్రూపమైన సజాతీయ, విజాతీయ స్వాగత భేదశూన్యమైన బ్రహ్మను ఉపక్రమించి-

"ఐతదాత్మ్య మిదగ్ం సర్వమ్"

"తత్సత్యం"

"స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో"

అని ఉపసంహారం చేయబడింది. దీనివల్ల అద్వితీయ బ్రహ్మ వేద ప్రతిపాద్యమని తెలుస్తోంది. ఈ ప్రకరణంలో **"తత్వమసి"** తొమ్మిది పర్యాయాలు ఆవృత్తి చేయబడింది. కనుక **'అభ్యాస'** అను లింగం ఉపపన్నమైంది.

ఈ బ్రహ్మ అనేది ప్రమాణాన్తర గమ్యం కానందున, (ఇతర ప్రమాణాలచే తెలుసుకోవడం సాధ్యం కాదు కనుక) **"అపూర్వత"** అను లింగం ఉపపన్నం.

తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి, తత్తేజోఽసృజత|

ఇత్యాది వాక్యాలు సృష్ట్యాదులను బోధిస్తున్నా, సృష్టి ప్రతిపాదనయందు తాత్పర్యం కాదు. బ్రహ్మను ప్రశంసించడమందే తాత్పర్యం గల **'అర్థవాదాలు'** అని నిర్ణయించారు.

యథాసోమ్య ఏ తేన మృత్పిణ్డేన విజ్ఞాతేన సర్వం మృన్మయం విజ్ఞాతం స్యాత్|

ఇత్యాది వాక్యాలచే బ్రహ్మ నిరూపణయందు చూపబడిన మృదాది దృష్టాన్తాలు ఉపపత్తులు.

ఈ విధంగా షడ్విధలింగాలతో వేదాంత వాక్యాలకు బ్రహ్మతత్వా వబోధయందే తాత్పర్యమని నిశ్చయించ వచ్చును.

వేదాన్తా నామ శేషాణాం ఆది మధ్యావసానతః బ్రహ్మాత్మన్యేవ తాత్పర్యమితి ధీః శ్రవణం భవేత్| (వే.పం)

మననం

వేదాన్త వాక్యాల శ్రవణం మొదటిది. ముందుగా వాటిని వినాలి. అలా విన్నవాటిని వాక్య విచారణలో చూపబడిన యుక్తులచే శ్రవణ గోచరమగు జీవేశ్వరుల అభేదాన్ని దృఢం చేసుకోవడానికి విన్న వాటిని మననం (చింతన) చేయాలి.

మననం నామ యుక్తిభిరనుచింతనమ్ యుక్తిస్తు న శుష్కతర్కః కింతు శ్రుత్యనుగ్రహీత ఏవ తర్కః అనుభవాంగత్వేన ఆశ్రయతే|

శ్రుత్యనుగ్రహీతాలైన యుక్తులచే అపరోక్ష జ్ఞానానికి ప్రతిబంధకం అయిన ఆవరణాదులను నివర్తింప చేయడానికై చేసే చింతనం మననం అన్నారు.

దాని ప్రకారం లోకంలో ఘటాకాశ మఠాకాశాలు ఘట,మఠ రూపమైన ఉపాధులు నశించగానే లోగడ ఉపాధి భేదంచే భిన్నంగా గోచరించిన తరువాత ఏకరూపంగా మిగిలినట్లు, అవిద్యవల్ల వచ్చిన అంతఃకరణ రూపమైన ఉపాధి సంబంధంవల్ల జీవేశ్వరుల భేదం కనబడినా ఉపాధి రహిత దశలో జీవేశ్వరులు ఇద్దరూ ఒకరుగానే ఉంటారని అనేక ప్రమాణ ఉపపత్తులచే నిర్ణయించారు.

నిది ధ్యాసనం

నిదిధ్యాసానామ ధ్యాతుమిచ్ఛాది ధ్యాసానితరాం దిధ్యాసా – నిదిధ్యాసా|

ధ్యానం చేయాలనే ఇచ్ఛకు కర్తవ్యత్వం ప్రాప్తించదు కనుక లక్షణయా (లక్షణ అను వృత్తిచే) ధ్యానం అర్థం అన్నారు. నితరాం (ఎల్లప్పుడు) బ్రహ్మ పదార్థానికి జీవేశ్వరుల ఐక్యాన్ని గురించి ధ్యానించడం,

జీవేశ్వరులకు అభేదాన్ని సాధించాక నిదిధ్యాసనయందు బ్రహ్మాకారావృత్తి సహజంగా అప్రయత్నంగా కలుగుతుంది. అటువంటి వృత్తిని (పనిని) స్థిరంగా ఉంచుకోవడానికి చేసే అభ్యాసమే "**నిదిధ్యాస**" అన్నారు.

వేదాంత శాస్త్రానికి ప్రయోజనం "**తత్త్వమసి**" అనే శ్రుత్యుక్త ప్రకారం '**త్వం**' పద లక్ష్యమైన జీవునకు (త్వం-అనగా జీవుడు) తత్పదలక్ష్యమైన బ్రహ్మకు (ఆ పదంచే లక్షణ అను వృత్తిచే సూచింపబడే బ్రహ్మకు) గల అభేదాన్ని సంపాదించడమే అని చాలా చోట్ల ప్రతిపాదించబడింది.

ఈ ప్రకారం శ్రవణ, మనన, నిదిధ్యాసనల సహాయంతో జీవేశ్వరులకు అభేదాన్ని నిర్ణయించడంలో తాత్పర్యం ఉన్న మహావాక్యాలు కొన్ని ఉన్నాయి. అవి **(1) ప్రజ్ఞానం బ్రహ్మ (2) అహం బ్రహ్మాఽస్మి (3) తత్త్వమసి (4) అయమాత్మా** అనేవి.

ఈ మహావాక్యాలచే ఉపలక్షితమైన ఉపనిషజ్జాతమంతా వేదాంత శాస్త్రంగా ఉపదేశింపబడుతుందని ఇంతకు ముందు చెప్పడమైంది. ఈ మహావాక్య చతుష్టయం చేతను ఒకే అర్థం ప్రతిపాదించబడుతోంది.

తథాహి- యేన- చక్షురాది ప్రవృత్తి నిమిత్తేన అయం లోకః రూప జాతమీక్షతే| శబ్దజాతం శ్రుణోతి గంధజాత మిదం జిఘ్రతి| శబ్దజాతం వ్యాకరోతి| స్వాదు అస్వాది రసభేదం విజానాతి ఇతి యత్ తత్ప్రజ్ఞాన ముదీరితమ్|

ఏ వస్తువు లోకంలో చక్షురాదీంద్రియాలకు ప్రవృత్తి నిమిత్తంగా ఉండి నీల,పీతాది రూపాన్ని చూస్తోందో, శబ్ద సముదాయాన్ని పదవాక్య రూపంగా విభజిస్తోందో అదే ప్రజ్ఞాన శబ్దంచే చెప్పబడిన ఆత్మ. ఈ ఆత్మ సర్వవ్యాపకమైన దేవ,మనుష్య,పశు,పక్ష్యాది పిపీలికాంతం అనుగతమై ఉన్న ఘట,మఠ, శరావాదుల్లో అనుగతమైన ఆకాశతత్వం వలె తత్తద్యుపాధ్యవిచ్ఛిన్న చైతన్యం ఒక్కటే అని (కుండలోను మఠంలోను అన్నిటిలోను కనపడే ఆకాశం ఒకటే అయినట్లుగా అందరిలోనూ, అన్నిటిలోనూ ఉండే చైతన్యం ఒకటే అని) అదే బ్రహ్మపదార్థమని చెప్పబడుతోంది.

'**అహం బ్రహ్మాస్మి**' ఉచ్చావచమైన ఉత్కృష్టమైన నికృష్టమైన ఉపాధుల్లో ఆకాశంవలె పరిపూర్ణమైన ఆత్మపదార్థమే బ్రహ్మవిద్యాధికారి అయిన స్థూల దేహంలో అక్కడ గల హృదయాకాశ గతమైన బుద్ధికి గోచరించిన లింగదేహంయొక్క భావాఽభావాలకు సాక్షిగా ఉండి ప్రత్యగాత్మగా స్ఫురిస్తున్న "**బ్రహ్మ**" అహం శబ్దంచే చెప్పబడుతోంది. లోక వ్యవహారంలో 'నేను మనస్సుతో ఆలోచించాను' అను వ్యవహారంలో అహం ప్రత్యక్ష గోచరమైన దానిలో జీవునియొక్క వాస్తవస్వరూపం బ్రహ్మభావాన్ని పొందుతుంది. కావున ప్రత్యగాత్మయే 'బ్రహ్మ' అని చెప్పవచ్చును.

"తత్త్వమసి"

"ఏకమేవాఽద్వితీయమ్ సత్ నామరూప వివర్జితమ్" (పంచదశి)

"సృష్టేః పురాధునాప్యస్య తాదృక్త్వం తది తీర్యతే"

"సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్"

ఇత్యాది శ్రుతులవల్ల సిద్ధమైన వస్తువు '**సత్**' శబ్దంచే చెప్పబడుతోంది. సత్ అనగా '**ఏకమే వాద్వితీయమ్**" అంటే "**సజాతీయ విజాతీయ స్వగత భేదశూన్యమ్ స్వాజ్ఞానారోపిత నామరూప వివర్జితమ్**" అని చెప్పబడింది. అనగా- మనుష్యులందరు, మనుష్యులు కాని వారి, తనలో ఉండే అవయవభేదం అనే మూడు భేదాలు లేనిది, జీవులయొక్క అజ్ఞానంతో చెప్పబడిన నామ రూప భేదాలు వంటివి ఏమీ లేని విశేషరూపం బ్రహ్మ అని చెప్పబడింది.

శ్రుతి ఘటక **'సత్'** శబ్దంచే చెప్పబడిన వస్తువు అద్వితీయమైన ఒకే వస్తువుగా ఉన్న సజాతీయ విజాతీయ స్వగత భేదాలు లేని తనయొక్క అజ్ఞానంచే ఆరోపించబడిన నామరూపాలతో శూన్యమైనది **'సత్'** అని నిర్ణయించారు. ఇది సృష్టికి ప్రత్యయానంతరంలో (ప్రళయం తర్వాత) ఒకే వస్తువుగా ఉంటూ ఈ చెప్పబడిన విశేషణ విశిష్టమైన అనగా ఏకత్వ, సజాతీయాది భేదాలు లేకపోవడమనే విశేషంతో కూడిన నిర్విశేష బ్రహ్మతత్వం ఆ 'సత్' పద లక్ష్యమని చేప్తోంది. అనగా తత్పద వాచ్యార్థంలో ఏకదేశమగు సర్వజ్ఞత్వాదికాన్ని త్యజించి అందులోని చైతన్యరూప అర్థాన్ని మాత్రం గ్రహించుట అని అర్థం.

"తత్త్వం పదలక్ష్యయోః అసీతి"

"ఏకతా ఏకత్వం గ్రాహ్యత ఇతి యత్ తదైక్యమనుభూయతామ్"

అనగా **'తత్త్వం'** పదంచే చెప్పబడిన ప్రత్యగభిన్నం 'బ్రహ్మ' అని, అనగా 'తత్' పద లక్ష్యార్థానికి ఏకత్వాన్ని గ్రహించడం అనేది ఏదైతే కలదో అటువంటి ఐక్యం అనుభవింపబడు గాక! **తత్త్వం పదలక్ష్య ప్రత్యగభిన్నం 'బ్రహ్మాస్మీతి'** అనుసంధానం చేయదగింది.

"అయమాత్మా బ్రహ్మ"

"స్వప్రకాశాఽపరోక్షత్వం అయమిత్యుక్తితో మతమ్"

"అహంకారాది దేహాత్మ ప్రత్యగాత్మేతి గీయతే"

సాధనాంతర నిరపేక్ష్యంతో (ఇతర సాధనాల అవసరం లేకుండా) స్వయం ప్రకాశమానం అవడం వల్ల **'ప్రత్యక్ష్యత్వం'** అను శ్రుతిలో **'అయం'** శబ్దంచే చెప్పబడుతోంది. అహంకారాది దేహాన్త ప్రపంచంనుండి ప్రతిలోమంగా (వెనుకకు) వెళ్తోంది. కావున ప్రత్యగాత్మ అని చెప్పబడుతోంది.

పైన చెప్పిన విధంగా శాస్త్రవిచార సిద్ధమైన మనోవృత్తి వ్యాప్యమైన అఖండైక రసస్వరూపమైన అపరోక్ష ప్రత్యగాత్మ రూపమైన బ్రహ్మయందు మహావాక్య చతుష్టయంచే అపరోక్షజ్ఞానం ఉదయించడంవల్ల అటువంటి జ్ఞానోపేతమైన పురుషుడు **'బ్రహ్మవిత్'** శబ్దంచే చెప్పబడుతున్నాడు. అటువంటి పురుషుడు పరప్రాప్తి యోగ్యత కలవాడవడం వల్ల **'పరమాప్నోతి'** ఇతి 'పరాన్ని పొందుతున్నాడని' అర్థం. ఇక్కడ 'పర' శబ్దానికి అన్యమని అర్థం కాదు. పరబ్రహ్మ వస్తువు అద్వితీయమవడం వల్ల **"నేహ నానాస్తి కించన"** శ్రుతిచే అన్యం నిషేధింపబడుటవల్ల ఉత్కృష్టరూప అర్థాన్ని చెప్పాలి.

ఇతర పదార్థజాలం మాయయొక్క వికారమే అవడంతో నికృష్టమైంది. కావున బ్రహ్మపదార్థం ఉత్కృష్టమైనది అనడం యుక్తమే అవుతుంది. ఇటువంటి బ్రహ్మను పొందే పురుషుడు ఇదివరకే బ్రహ్మ అయి ఉన్నా, నేను బ్రహ్మకంటే భిన్నుడైన జీవుడను అనే భ్రమ పోగొట్టుకోవడమే బ్రహ్మను పొందడం అని అర్థం. అది అలా ఉండగా **"బ్రహ్మవిత్ బ్రహ్మైవ ప్రాప్నోతీతి"** భాష్యం. అనగా బ్రహ్మవేత్త, బ్రహ్మను తెలుసుకున్నవాడు బ్రహ్మే అవుతున్నాడు, అని అర్థం.

య ఏవం వేద, అహం బ్రహ్మాస్మీతి స ఇదం సర్వం భవతి| (వా.శ్రు.)

భాష్యం: **"యో వేద నిహితం గుహాయాం పరమేవ్యోమన్" ఇతి వాక్యేన ప్రత్యగాత్మని పరోక్షత్వ భ్రమః శంకితుమపి న శక్యః" "ఆబాల గోపాలం సర్వైరపి ప్రాణిభిః ప్రత్యగాత్మనః అహమిత్యనేన మానస ప్రత్యక్షేణ విస్పష్టం వ్యవహి త మాణత్వాత్|** (సా.భా.)

అనగా ఆ బాలగోపాలం అందరిచేత **'అహం'** శబ్దంచేత ప్రత్యగాత్మ ప్రత్యక్షంగా వ్యవహరింపబడుతోంది. జీవబ్రహ్మైక్యమే మోక్షం. ఈ ఫలాన్ని బ్రహ్మవేత్తలు అయిన వారందరూ పొంది ముక్తులు కాగలరని ఉపనిషత్తులు చెప్తున్నాయి.

వేదాన్త విజ్ఞాన సువిశ్చితార్థాస్సన్యాస యోగాద్యత యః శుద్ధసత్వాః| తే బ్రహ్మలోకే తు పరాన్త కాలే పరామృతాత్పరి ముచ్యన్తి సర్వే" (నా.ఉ.)

"యోగశ్చిత్తవృత్తి నిరోధః" (పా.యో.సూ)

భాష్యం: **తస్మాత్ యోగాత్ శుద్ధసత్వాః విషయభోగ వ్యావృత్త చిత్తాః అత ఏవ య తయః నియమన శీలాః ఏ తేన జ్ఞానం తత్వప్రకాశేన అవిద్యా నివర్తకం త్యాగస్తు విషయ భోగ నివృత్తి ద్వారా చిత్తశుద్ధి హేతురితి పృథగుపయోగ ఉక్తో భవతి బ్రహ్మణః లోకే"**

ఇందులో **'లోక'** శబ్దంచే దర్శనం చెప్పబడుతోంది.

"దర్శనం సాక్షాత్కారః తస్మిన్నుత్పన్నే సతి సంసారి విలక్షణాః తే పురుషాః తాదృశాః పురుషాః సర్వే పరిముచ్యన్తే| జ్ఞానిషు దేవమనుష్యత్వాది కృత ఉత్తమాధమ భావః అప్రయోజక ఇతి వివక్షయా సర్వ ఇత్యుక్తం కదా ముచ్యన్త ఇత్యాశంక్య పరాన్తకాల ఇత్యుక్తం| సత్యజ్ఞానేన యోదేహ పాతావసరః సోఽయం పరాన్త కాలః| పునః దేహగ్రహణ రహితత్వాత్| తస్మిన్ పరాన్తకాలే సంసార బంధనాత్ విముచ్యన్తే| తత్వాఽజ్ఞానినోఽపి ప్రళయకాలే స్థూలసూక్ష్మ శరీరాత్ బంధనాత్ ముచ్యన్తే ఏవ| ఇత్యాశంక్య పరామృతా దిత్యుక్తమ్| జగత్కారణత్వేన ఉత్కృష్టం పరం| తత్వ జ్ఞానమన్తరేణ వినాశ రహితత్వాత్ అమృతం తాదృశాత్పరామృతాత్ అవ్యాకృతా దజ్ఞానినః ప్రళయ కాలేఽపి న ముచ్యన్తే| కిన్తు స్థూలసూక్ష్మ శరీరాదేవ ముచ్యన్తే| జ్ఞానినస్తు దేహపాతావసర ఏవ తాదృశాదవ్యాకృతాదపి ముచ్యన్తే ఇతి శేషః|

ఇంతకు ముందు **'న కర్మణా'** ఇతి మంత్రం కర్మ ప్రజాధన త్యాగం మోక్ష కారణమని చెప్పింది.

"తరతి శోకమాత్మవిత్" "జ్ఞానాదేవహి కైవల్యమ్"

వంటి ఇతర శ్రుతులు జ్ఞానమే మోక్షసాధనమని చెప్పాయి. ఇలా ఉండగా పరస్పరవిరోధం సంభవిస్తుందని దాని పరిహారానికి సమన్వయాన్ని **"వేదాన్త విజ్ఞాన"** అనే మంత్రం బోధిస్తోంది.

వేదాంతాలనగా ఉపనిషద్వాక్యాలు. వాటిచే ఉత్పన్నమైన జ్ఞానం సంసార నివర్తకం అవడంచే విశిష్టమైన విజ్ఞానం అనబడుతున్నాయి. అటువంటి విజ్ఞానంచే జీవ బ్రహ్మైక లక్షణరూపమైన అర్థ నిశ్చయం చేసుకున్నవారై పూర్వమంత్రమందు చెప్పబడినరీతిగా కర్మ ప్రజాధన త్యాగం చేసి చిత్తవృత్తి నిరోధంచే ఇంద్రియ నియమం కలవారై నిర్మల చిత్తం కలవారై **"లోకృదర్శనే"** అనే ధాతువు వల్ల బ్రహ్మ సాక్షాత్కారం చేసుకున్నవారై జ్ఞానం చేత ఈ సంసార బంధం నుండి విముక్తు లవుతున్నారు. జ్ఞానులైన వారికి దేహపాతావసరం (దేహం పడిపోవడమనే తనువు చాలించడం), తిరిగి దేహగ్రహణం (తిరిగి దేహాన్ని ధరించడమనే పునర్జన్మ) పరమైనందువల్ల (లేకపోవడంచే) అటువంటి అంతకాలంలో జగత్కారణమైన తత్త్వజ్ఞానం చేతను గాని, నాశనం లేని అవ్యాకృతావస్థ నుండి సర్వులు (జ్ఞానులైన వారందరూ) వ్యవహార దశలో గల ఉత్తమ, మధ్యమ, అధమ భావ శూన్యులై సంసారబంధం నుండి విముక్తు లవుతున్నారు.

ఇక్కడ ఒక శంక కలుగుతుంది. జ్ఞానులు, అజ్ఞానులు కూడా దేహపాతకాలంలో సంసార బంధంనుంచి విముక్తు లవుతారు కదా! అందులో జ్ఞానుల విశేషమేమి? అని. అజ్ఞానులు దేహావసాన కాలంలో దేహం నుండి విముక్తులైనా జగత్కారణమైన సంసార బంధకమైన అవ్యాకృతం (నామరూప

భిన్నముగా కనపడని అవస్థ, బీజరూపమున జగత్కారణమై యున్న అజ్ఞానము) నుండి ముక్తులు కారు. పేరు గానీ, రూపం గానీ లేని, పరిణామానికి అతీతమైన, అంటే పరిణామం చెందనిది అవ్యాకృతం. ఈ వర్ణన బ్రహ్మ పదార్థానికి మాత్రమే వర్తిస్తుంది. నామరూప రహితుడైన బ్రహ్మ స్వరూపుడు గనుక అవ్యాకృతుడు. అంతర్యామి అనీ, ఈశ్వరుడనీ కూడా అంటారు. జీవులందరి లోనూ, వారి హృదయాలలో ఉండి ప్రేరణ కలిగిస్తాడు కనుక అంతర్యామి అన్నారు. శిక్షించే బాధ్యతను నిర్వర్తిస్తాడు గనుక ఈశ్వరుడని కూడా అంటారు. జ్ఞానులు దేహపాతావసర కాలంలో దేహంనుండే గాక ఈ అవ్యాకృతావస్థ నుండి కూడా విముక్తు లవుతున్నారని గ్రహించాలి. ఇదే అజ్ఞానులకు జ్ఞానులకు భేదం.

దీనివల్ల జీవ బ్రహ్మైక్య రూపలక్షణ జ్ఞానం కలవారు సర్వులు బ్రహ్మ జ్ఞానులే అయినందున బ్రహ్మజ్ఞానంచేత మోక్షరూప పురుషార్థాన్ని అధిగమించాలని ఇదే వేదానికి పరమతాత్పర్యమని చెప్పబడింది. దీన్నే వేదం మనకి బోధిస్తున్నట్లుగా చెప్పి **"సత్యమ్ జ్ఞానమనన్తం బ్రహ్మేతి"** శ్రుతిచే ఉద్దేశించబడిన ఈ ప్రత్యగ్బ్రహ్మ ఎక్కడ ఉన్నట్లు తెలుసుకుని ఏ ఫలాన్ని పొందుతున్నాడనేది **"సోఽశ్నుతే"** శ్రుతియొక్క వ్యాఖ్యానంలో ఇలా చూపబడింది.

గుహాయాం పరమే వ్యోమన్ నిహితమ్|

"అన్నమయాద్యానందమయాంతానాం వక్ష్యమాణానాం పంచకోశానాం సముదాయః గుహా యదేతత్పంచ కోశాపాదాన కారణం అవ్యాకృతం తదేతత్పరమం తద్ధీదం తర్ హి అవ్యాకృతమాసీత్" (శ్రుతిః)

భాష్యం: **జగదుత్పత్తేః ప్రాక్ అవ్యాకృతత్వం దర్శయతి| అవ్యాకృతత్వం అమూర్తత్వ సామ్యేన వాజసనేయినః అక్షర బ్రాహ్మణే .....ఆకాశ శబ్దేన సమామనంతి| తస్య ఆకాశస్య ఆకాశ వాయ్వాది పంచమహాభూత కారణత్వాత్ పరమత్వం తస్మిన్పరమాకాశే నిహితం అవస్థితం బ్రహ్మ ప్రత్యక్ష్యమేవ యః బ్రహ్మతయా విద్యాత్|**

"సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ"

భాష్యం: **సః ప్రత్యగ్బ్రహ్మైక జ్ఞానీ విపశ్చితా బ్రహ్మణా - సర్వజ్ఞ రూపేణ సర్వాన్ కామాన్ సర్వప్రాణి గతాన్ భోగాన్ సహ అశ్నుతే యుగపదాప్నోతి యుగపదనుభవతి|**

లోకంలో పర్వతాల బిలాలకు పర్వతగుహలనే వ్యవహారం ఉన్నట్లుగా పై 'గుహ'లో అనగా జగదుత్పత్తికి ముందు పంచకోశాల సముదాయమనే గుహలో అస్పష్ట ప్రతీతిగా ఉండి అవ్యాకృత శబ్దంచే చెప్పబడుతున్న అమూర్తత్వ సామ్యంచే ఆకాశ వాయ్వాది పంచ మహాభూతాలకు కారణమైన పరమాకాశంలో గల బ్రహ్మను ప్రత్యగ్బ్రహ్మగా ఏ పురుషుడు తెలుసుకుంటాడో అనగా ఏది తెలిస్తే తెలియదగినది మరోటి ఉండదో, ఆ విధంగా తెలుసుకున్న పురుషుడు ఏ కామాన్ని(కోరికను) పొందేక (తీర్చుకున్నాక) పొందదగిన ఇతర కామములు (కోరికలు) ఉండవో, అటువంటి అన్ని కోరికలను సర్వప్రాణుల యొక్క అన్ని భోగాలకు అజ్ఞానివలే క్రమంగా కాకుండా **'యుగపదేవ'** ఒకేసారి పైన చెప్పబడిన జీవ బ్రహ్మైక్య జ్ఞానం కలవాడు పొందగలడన్న భావం ఈ **'సోఽశ్నుతే'** అను వాక్యం ప్రతిపాదిస్తోంది.

"నిహితం గుహాయాం పరమే వ్యోమన్" అను శ్రుతికి సాయణాచార్యుల భాష్యంలో **'పరమే వ్యోమన్'** అనే దానికి అనేక రకాల వ్యాఖ్యానాలు చేసి -

"తత్రహి ప్రత్యగ్బ్రహ్మాస్మి"

"ప్రత్యక్ష్యమేవ బ్రహ్మతయా విద్యాత్"

ఇత్యాది వాక్యాలతో వివరించారు. కానీ ఆ భాష్యాన్ని సంగ్రహించి భాష్యంగా పైన చూపడమైంది.

ఈ జీవబ్రహ్మైక్య జ్ఞాని మోక్షరూప పురుషార్థాన్ని అధిగమించగలడని ఈ క్రింద ఉదహరించబడిన ఉపనిషత్ శ్రుతి బోధిస్తోంది.

"వేదాన్త విజ్ఞానేన"

"బ్రహ్మవేదనేన ముక్తిః ఉపనిషత్తాత్పర్యార్థం" అని

"సత్యం జ్ఞానమనన్తం బ్రహ్మ" ఇతి

శ్రుతి వ్యాఖ్యాన సందర్భంలో సాయణ భాష్యంలో వివరించిన దాన్ని ప్రతిపాదిస్తోంది.

కావున ఔపనిషదమైన బ్రహ్మజ్ఞానం ఉత్తమ పురుషార్థమైన మోక్ష సాధనమని ఇటువంటి బ్రహ్మ జ్ఞానాన్ని పొందడానికే వేదం **'ఇషేత్వా'** ఇత్యాది శ్రుతిలో ఆరంభించబడి, కర్మ-ఉపాసనలను బోధించి అంతమందు గల ఉపనిషత్తులనే వేదాంత వాక్యాలతో బ్రహ్మజ్ఞానాన్ని బోధించిందని తెలుసుకుని, ఇటువంటి బోధయందే వేదానికి తాత్పర్యమని జిజ్ఞాసువులు గ్రహించి కర్మ, ఉపాసనలద్వారా బ్రహ్మజ్ఞానంచే **"పరిముచ్యన్తి సర్వే"** అను శ్రుత్యుక్త ప్రకారం ఈ సంసార బంధంనుండి విముక్తు లవుదురు గాక!

12 వ ప్రకరణం సమాప్తం

"వేదం - జీవన విధానం" అనే "వేదార్థ జ్ఞానదీపిక" సంపూర్ణం